
భాగవత సుధాలహరి

తృతీయ స్కంధము : తృతీయ సంపుటము

వ్యాఖ్యాత

డా॥ వువ్వవర్తి నారాయణాచార్యులు



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

భాగవత సుధాలహరి

తృతీయ స్కంధము : తృతీయ సంపుటము

వ్యాఖ్యాత

సరస్వతీపుత్ర

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు

సంపాదకుడు

విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2007

BHAGAVATA SUDHALAHARI
Tritiya Skandha - Vol. III

Commentary
Saraswatiputra
Dr. Puttaparthi Narayanacharyulu

Edited by
Mudivarthi Kondamacharyulu
Controller of Publications, T.T.D.

© All Rights reserved

T.T.D. Religious Publications Series No. : 755

First Edition : 2007

Copies : 2000

Published by
Sri K.V. Ramanachary, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

ముందుమాట

వేదములు, ఇతిహాసములు, పురాణములు భారతీయ సంస్కృతికి మూలాధారాలు. లోకక్షేమాన్ని కాంక్షించి వ్యాసమహర్షి వేదరాశిని విభజించి, వేదార్థాలను భారతంలో వివరించాడు. అయినా ఆయనకు సంతృప్తి కలుగలేదు. అట్టి స్థితిలో నారదప్రేరితుడై భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే శ్రీమద్భాగవత పురాణాన్ని రచించి సంతుష్టుడై తన కుమారుడైన శుకయోగిచే చదివించాడు.

అష్టాదశ పురాణాల్లో భాగవతానికున్న బహుళవ్యాప్తి మరే పురాణానికీ లేదు. ఈ గ్రంథంలో శాస్త్ర వేదాంతాది విషయాలే కాక మోక్షప్రాప్తికి హేతువులైన కర్మ భక్తి జ్ఞాన మార్గాల్లో మిక్కిలి సులభంగా అనుసరించదగిన భక్తితత్త్వం చక్కగా ప్రబోధించబడింది. జనన మరణశీలమైన సంసారసాగరంలో కూలి దరిగానక పరితపించే మానవాళికి భాగవత పురాణం సంతరణ నౌక అనడంలో సందేహం లేదు.

ఇట్టి శ్రీమద్భాగవత పురాణాన్ని క్రీ.శ. పదిహేనవ శతాబ్దిలో పరమ భాగవతోత్తముడు, సహజపాండిత్యుడు అయిన బమ్మెరపోతనామాత్యులు తెనిగించాడు. లలిత లలిత సంస్కృత సమాసాలతో, తేటతెనుగు నుడికారంతో, శబ్దాలంకార శోభితమై పోతనగారి భాగవతం ఆబాలగోపాలాన్ని ఎంతో అలరిస్తుంది. భాగవతంలోని ఒక పద్యమైనా నోటికిరాని తెలుగువాడుండడు అనటం అతిశయోక్తి కాదు.

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులవారు వ్యాసప్రణీత భాగవత పురాణంలోని శ్లోకాలకు ప్రతిపదార్థ తాత్పర్య విశేషాలతోపాటు పోతనగారి భాగవత పద్యగద్యాలకు కూడా టీకా తాత్పర్యములు జతపరుస్తూ ప్రథమ

ద్వితీయ తృతీయస్కంధాలకు నిరుపమానమైన సురుచిర వ్యాఖ్యాన సంపుటాలను "భాగవత సుధాలహరి" అనే పేరుతో రూపొందించారు. వాటిలో ప్రథమ ద్వితీయ స్కంధాలకు సంబంధించిన ఏడుసంపుటాలు ఇదివరకే విద్వత్కవి ముదివర్తి కొండమాచార్యులవారి సంపాదకత్వాన వెలువడి లెస్సగా పాఠకుల మన్ననలు చూరగొన్నాయి.

పండితప్రకాండులు, బహుభాషావేత్తలు, మహాకవులు, విశేషించి సరస్వతీపుత్రులయిన డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులవారు భాగవత తృతీయ స్కంధానికి సమకూర్చిన మూడు వ్యాఖ్యాన సంపుటాలలో ఇది తృతీయ సంపుటం. దీని సంపాదకుడు కూడ శ్రీముదివర్తి కొండమాచార్యులే.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు ధర్మప్రచారసాధనంగా చేపట్టి ఇప్పటికెన్నో ఉత్తమగ్రంథాలు ప్రచురించారు. ఎప్పటిలాగే పుట్టపర్తివారి భాగవతసుధాలహరిలోని ఈ తొమ్మిదవ తరంగం రసజ్ఞులైన ఆంధ్రపాఠకులకు ఆమోదం చేకూర్చగలదని మావిశ్వాసం.


భూమన కరుణాకర రెడ్డి

(భూమన కరుణాకర రెడ్డి)

లు

ల మండలి

తిరుమల తిరుపతి దేవస్థానములు. తిరుపతి.



భాగవత సుధాలహరి

త్రయో వింశోఽధ్యాయః

శ్రీమైత్రేయ ఉవాచ

పితృభ్యాం ప్రస్థితే సాధ్వీ పతి మింగితకోవిదా,
నిత్యం పర్యచర త్ప్రీత్యా భవానీ వభవం ప్రభుమ్. 1

విస్రంభేణాఽత్మ శౌచేన గౌరవేణ దమేన చ,
శుశ్రూషయా సౌహృదేన వాచా మధురయా ప్రభో! 2

విసృజ్య కామం దంభం చ ద్వేషం లోభ మముం మదమ్,
అప్రమత్తోద్యతా నిత్యం తేజీయాంస మతోషయత్. 3

స వై దేవర్షివర్య స్తాం మానవీం సమనువ్రతామ్,
దైవాద్గరీయసః పత్యు రాశాసానాం మహాశిషః. 4

కాలేన భూయసా క్షామాం కర్శితాం వ్రతచర్యయా,
ప్రేమగద్గదయా వాచా పీడితః కృపయాఽబ్రవీత్. 5

కర్దమ ఉవాచ

తుష్టోఽహ మద్య తవ మానిని! మానదాయా
శుశ్రూషయా పరమయా పరయా చ భక్త్యా,
యో దేహినా మయ మతీవ సుహృత్స్వదేహో
నాపేక్షిత స్సముచితః క్షపితుం మదర్థే. 6

యే మే స్వధర్మ నిరతస్య తపస్సమాధి
విద్యాత్మయోగవిజితా భగవత్ప్రసాదాః,
తా నేవ తే మదను సేవనయాఽ వరుదాన్
దృష్టిం ప్రవిశ్య వితరా మ్యభయా నశోకాన్. 7

అన్యే పున ర్భగవతో భ్రువ ఉద్విజృంభ
విభ్రంశితార్థరచనాः కి మురుక్రమస్య,
సిద్ధాసి భుంక్ష్వ విభవా న్నిజధర్మదోహాన్
దివ్యా న్నరై ర్దురధిగా న్నపవిక్రియాభిः. 8

ఏవం బ్రువాణ మబలాఖిల యోగమా యా
విద్యా విచక్షణ మవేక్ష్య గతాధి రాసీత్,
సంప్రశ్రయ ప్రణయ విహ్వలయా గిరైషా
వ్రీడావలోక విలసద్ధసితాననాఽఽహ. 9

దేవహూతి రువాచ

రాద్ధం బత ద్విజవృతైతదమోఘ యోగ
మాయాధిపే త్వయి విభౌ తదవైమి భర్తః,
యస్తేఽభ్యధాయి సమయ స్సకృదంగసంగో
భూయాద్గరీయసి గుణప్రసవస్సతీనామ్. 10

తత్రేతి కృత్య ముపశిక్ష యథోపదేశం
యేనైష మే కర్శితోఽతిరంసయాత్మా,
సిద్ధ్యేత తే కృతమనోభవధర్షితాయాః
దీన స్తదీశభవనం సదృశం విచక్ష్వ. 11

మైత్రేయ ఉవాచ

ప్రియాయాః ప్రియ మన్విచ్ఛన్ కర్దమో యోగమాస్థితః
విమానం కామగం క్షత్త స్తర్హ్యేవాఽఽ విరచీకగత్. 12

సర్వకామదుఘం దివ్యం సర్వరత్న సమన్వితమ్,
సర్వర్ద్ధ్యుపచయోదర్కం మణిస్తంభై రుపస్కృతమ్. 13

దివ్యోపస్కరణోపేతం సర్వకాలసుఖావహమ్,
పట్టికాభిః పతాకాభి ర్విచిత్రాభి రలంకృతమ్. 14

స్రగ్భి ర్విచిత్రమాల్యాభి ర్మంజు శింజత్ షడంఘ్రిభిః
దుకూల క్షౌమ కౌశేయై ర్నానావస్త్రైర్విరాజితమ్. 15

ఉపర్యుపరి విన్యస్త నిలయేషు పృథక్పృథక్,
క్షిప్తైః కశిపుభిః కాంతం పర్యంక వ్యజనాసనైః. 16

తత్ర తత్ర వినిక్షిప్త నానాశిల్పోపశోభితమ్,
మహామరకతస్థల్యాం జుష్టం విద్రుమ వేదిభిః. 17

ద్వార్సు విద్రుమదేహళ్యా భాంతం వజ్రకవాటకవత్,
శిఖరే ష్వింద్రనీలేషు హేమకుంభై రధిశ్రితమ్. 18

చక్షుష్మత్పద్మరాగాణ్వేర్వజ్ర భిత్తిషు నిర్మితైః,
జుష్టం విచిత్ర వైతానై ర్మహార్హై ర్హేమతోరణైః. 19

హంసపారావవ్రాతై స్తత్ర తత్ర వికూజితమ్,
కృత్రిమా న్మన్యమానై స్స్వానధిరుహ్యావరుహ్యచ. 20

విహారస్థాన విశ్రామ సంవేశ ప్రాంగణాజిరైః,
యథోపజోషం రచితై ర్విస్మాపనమివాఽ తృనః. 21

ఈదృగ్గృహం తత్పశ్యంతీం నాతిప్రీతేన చేతసా,
సర్వభూతాశయాభిజ్ఞః ప్రావోచ త్కర్దమ స్స్వయమ్. 22

నిమజ్జాఽస్మిన్ హ్రదే భీరు విమాన మిద మారుహ,
ఇదం శుక్లకృతం తీర్థ మాశిషాం యాపకం నృణామ్. 23

సా చ భర్తు స్సమాదాయ వచః కువలయేక్షణా,
సరజం బిభ్రతీ వాసో వేణీభూతాన్స్వమూర్ధజాన్. 24

అంగం చ మలపంకేన సంఛన్నం శబలస్తనమ్,
ఆవివేశ సరస్వత్యా స్సర శ్శివజలాశయమ్. 25

సాంత స్సరసి వేశ్మస్థాశ్శతాని దశకన్యకాః,
సర్వాః కిశోర వయసో దదర్శోత్పలగంధయః. 26

తాం దృష్ట్వా సహసోత్థాయ ప్రోచుః ప్రాంజలయ స్త్రియః
వయం కర్మ కరిష్యామ్యో శాధి నః కరవామ కిమ్. 27

స్నానేన తాం మహార్హేణ స్నాపయిత్వా మనస్వినీమ్,
దుకూలే నిర్మలే నూత్నే దదు రస్యై చ మానదాః. 28

భూషణాని పరార్ధ్యాని వరీయాంసి ద్యుమంతి చ,
అన్నం సర్వగుణోపేతం పానం చైవామృతాసవమ్. 29

అథాఽఽదర్శే స్వమాత్మానం ప్రగ్వీణం విరజోఽంబరమ్,
విరజస్కం స్వస్త్యయనం కన్యాభి ర్బహుమానితమ్. 30

స్నాతం కృతశిరస్స్నానం సర్వాభరణ భూషితమ్,
నిష్కగ్రీవం వలయినం కూజత్కాంచననూపురమ్. 31

రథ్యస్తయా కాంచ్యా కాంచన్యా బహురత్నయా,
హారేణ చ మహార్హేణ రుచకేన విభూషితమ్. 32

సుభ్రువా సుదతా శశ్వ న్స్నిగ్ధాపాంగేన చక్షుషా,
పద్మకోశప్రతీకాశై రలకైశ్చ లసన్ముఖమ్. 33

యదా సస్మార బుషభ మృషీణాం దయితం పతిమ్,
తత్ర చాస్తే సహస్త్రీభిర్యత్రాస్తే స ప్రజాపతిః. 34

భర్తుః పురస్తాదాత్మానం స్త్రీసహస్రవృతం తదా,
నిశామ్య తద్యోగగతిం సంశయం ప్రత్యపద్యత. 35

స తాంకృతామలస్నానాం విభ్రాజంతీ మపూర్వవత్,
ఆత్మనో బిభ్రతీం రూపం సంవీత రుచిరస్తనీమ్. 36

విద్యాధరీసహస్రేణ సేవ్యమానాం సువాససమ్,
జాతభావో విమానం తదారోహయ దమిత్రహన్. 37

తస్మి న్నలుప్తమహిమా ప్రియయానుషక్తో
విద్యాధరీభి రుపచీర్ణవపు ర్విమానే,

బభ్రాజ ఉత్కచ కుముదణవా నపీచ్య
స్తారాభి రావృత ఇవోడుపతి ర్నభస్థః. 38

తేనాష్టలోకప విహారకులాచలేంద్ర
ద్రోణీ ష్వనంగసఖ మారుత సౌభగాసు,
సిద్దై ర్నుతోద్యుధునిపాతశివస్వనాసు
రేమే చిరం ధనదవల్లలనావరూధీ. 39

వైస్రంభకే స్వరపనే నందకే పుష్పభద్రకే,
మానసే చైత్ర రథ్యే చ స రేమే రమయా తతః. 40

భ్రాజిష్ణునా విమానేన కామగేన మహీయసా,
వైమానికానత్యశేత చరన్ లోకాన్ యథా ఽనిలః. 41

కిం దురాపాదనం తేషాం పుంసా ముద్దామచేతసామ్,
యై రాశ్రిత స్తీర్థపద శ్చరణోవ్యసనాప్యయః. 42

ప్రేక్షయిత్వా భువో గోళం పత్న్యై యావాన్ స్వసంస్థయా,
బహ్వాశ్చర్యమయో యోగీ స్వాశ్రమాయ న్యవర్తత. 43

విభజ్య నవధాత్మానం మానవీం సురతోత్సకామ్,
రామాం విరమయన్ రేమే వర్షపూగాన్ ముహూర్తవత్. 44

తస్మిన్ విమాన ఉత్స్నుష్టాం శయ్యాం రతికరీం శ్రితా,
నచాన్ బుధ్యత కాలం తం పత్యాకపీచ్యేన సంగతా. 45
ఏవం యోగాను భావేన దంపత్యోరమమాణయోః,
శతం వ్యతీయు శ్శరదః కామలాలసయో ర్మనాక్. 46

తస్యామాధత్తరేతస్తాం భావయన్నాత్మనాత్మవిత్,
నోధా విధాయ రూపం స్వం సర్వసంకల్ప విద్విభుః. 47

తత స్సా సుషువే సద్యో దేవహూతిః స్త్రియః ప్రజాః
సర్వాస్తాశ్చా రుసర్వాంగ్యో లోహితోత్పలగంధయః. 48

పతిం సా ప్రవ్రజిష్యంతం తదాలక్ష్యాశతీ సతీ,
స్మయమానా విక్లబేన హృదయేన విదూయతా. 49

లిఖం త్యధోముఖీ భూమిం పదా నఖమణి శ్రియా,
ఉవాచ లలితాం వాచం నిరుధ్యాఽశ్రకలాం శనైః. 50

దేవహూతి రువాచ

సర్వం తదృగవ న్మహ్యా ముపోవాహ ప్రతిశ్రుతమ్,
అథాపి మే ప్రపన్నాయా అభయం దాతు మర్హసి. 51

బ్రహ్మన్! దుహితృభి స్తుభ్యం విమృగ్యాః పతయ స్సమాః,
కశ్చిత్స్యాన్మే విశోకాయ త్వయి ప్రవ్రజితే వనమ్. 52

ఏతావతాలం కాలేన వ్యతిక్రాంతేన మే విభో,
ఇంద్రియార్థ ప్రసంగేన పరిత్యక్తపరాత్మనః. 53

ఇంద్రియార్థేషు సజ్జంత్యాః ప్రసంగ స్త్వయి మే కృతః,
అజానంత్యాః పరం భావం తథాప్య స్త్వభయా య మే. 54

సంగో హి సంసృతే ర్హేతు రసత్సు విహితోఽధియా,
స ఏవ సాధుషు కృతో నిస్సంగత్వాయ కల్పతే. 55

నేహ య త్కర్మధర్మాయ న విరాగాయ కల్పతే,
న తీర్థపదసేవాయై జీవ న్నపి మృతో హి సః. 56

సాఽహం భగవతో నూనం వంచితా మాయయా దృఢమ్,
యత్త్వాం విముక్తిదం ప్రాప్య న ముముక్షేయ బంధనాత్ 57

ఇతి శ్రీమద్భాగవతే, తృతీయస్కంధే, త్రయోవింశోఽధ్యాయః

1. పితృభ్యాం ప్రస్థితే=తల్లిదండ్రులు ప్రయాణించిన వారుకాగా (వివాహానంతరము తల్లిదండ్రులు ప్రయాణమైపోగా) ఇంగితకోవిదా=ఇతరుల అభిప్రాయమును గ్రహించుటలో సమర్థురాలైన, సాధ్వీ=పతివ్రతయైన దేవహూతి, ప్రభుం భవం=ప్రభువైన శివుని, భవానీ ఇవ=పార్వతీదేవివలె, నిత్యం ప్రీత్యా=సర్వవేళల యందును సంతోషముతో, పర్యచరత్=పరిచరించినది.

తాత్పర్యము : వివాహానంతరము స్వాయంభువ మనువును శతరూపయు సపరివారముగా వెడలిపోయిరి. దేవహూతి చెప్పకయే ఇతరుల యభిప్రాయమును ముఖపు కవళికలతో మాత్రమే గ్రహింపగలిగినది. పరమసాధ్వి. ఆమె కర్దముని సర్వలోకేశ్వరుడైన శివుని భవానీదేవివలె పరిచరించినది.

2.3. విస్రంబేణ=విశ్వాసముతోను, ఆత్మశౌచేన=దేహమనః పరిశుద్ధులతోను, గౌరవేణ=ఆదరముతోను దయేన చ=బాహ్యేంద్రియనిగ్రహముతోను, శుశ్రూషయా=స్నేహముతోను, సౌహృదేన=ప్రేమతోను, మధురయా వాచా=మధురమైన వాక్కుతోను, కామం చ=విషయాభిలాషను, లోభం చ=పదార్థమును సంగ్రహించుట లోని ఆశను, దంభం=కపటమును, ద్వేషం=ద్వేషభావమును, అఘం=అజ్ఞాతి క్రమణవలన నేర్పడెడు పాపమును, మదం=అహంభావమును, విసృజ్య=వదలి, అప్రమత్తా=నిరంతరము జాగరూకురాలై, ఉద్యతా=సతతమును సేవించుట యందు ప్రవృత్తి కలదై, తేజీ యాంసం=అతితేజస్సు కలిగిన, పతిం=భర్తను, అతోషయత్=సంతోషింపఁ జేసెను.

తాత్పర్యము: దేవహూతి భర్తయందలి విశ్వాసము కలది. దేహమనశ్శుద్ధు లామెకు స్వభావములు. పతియం దమితాదరము. బాహేంద్రియములను నియమించుట యం దతిజాగరూకురాలు. శుశ్రూషాపరురాలు. విపరీతప్రేమ. ఆమెమాటలు మధురములై యుండెను. విషయాభిలాష ఎందును కన్పించెడిది కాదు. పదార్థములను సంగ్రహించుట యందాసక్తిలేదు. కపటము సున్న. ఎవరిని ద్వేషించుటలేదు. ఆజ్ఞాతిక్రమణ మను పాపమునకు దూరమం దున్నది. పతిసేవ యందు పతతజాగరూకురాలు. సర్వకాల సర్వావస్థల యందును తన అనుకూల అననుకూలములను వివరింపక పతిసేవయందే ప్రవృత్తి కలది. కర్దముఁడు మహాతేజస్వి. ఆ తేజస్వియైన పతి నామె ఎల్లరీతుల సంతోషింపఁ జేసెను.

4.5. సవైదేవర్షి వర్యుఁ=ప్రసిద్ధులైన దేవ ఋషులలో శ్రేష్ఠుఁడైన కర్దముఁడు, మానవీం=మనుపుత్రియు, సమనువ్రతాం=నిరంతరము సర్వమునందు తన ననుసరించునదియు, గరీయసుఁ పత్యుఁ=గొప్పవాఁడని నిశ్చయించుకొన్న భర్తనుండి, మహాశిషుఁ=గొప్పవైన యనుగ్రహములను - ఉత్తమ సంతానములను, దైవాత్ ఆశాసానాం=ప్రారబ్ధప్రేరణ నిమిత్తముగా ఆశించు చున్నదియు, భూయసా కాలేన=చాలకాలము, వ్రతచర్యయా=వ్రతానుష్ఠానముతో, క్షామాం, కర్శితాం=అనేకక్లేశముల నోర్చుకొన్నదియు, కృశించినదియు నైన దేవహూతిని, దృష్ట్వా=చూచి, కృపయా ఆవీడితుఁ=దయచేత వీడింపఁబడినవాఁడై, ప్రేమగద్గదయా వాచా=ప్రేమతో గద్గదమైన వాక్కుతో, అబ్రవీత్=ఇట్లనెను.

తాత్పర్యము : ఆమె మనుపుత్రి. అతఁడు సప్తార్ణవ మేఖలాయుతమైన సమస్తధరిత్రికిని చక్రవర్తి. కాని ఆమె కాభావ మెన్నఁడో తొలఁగిపోయినది. ఆమె ధ్యేయము నిరంతరము కర్దము ననుసరించుటయే. కర్దమ ప్రజాపతి దేవర్షులలో దేవర్షి. మహా తేజ స్సంపన్నుడైన భర్త నుండి ఆమె సంతాన రూపమైన అనుగ్రహమును వాంఛించుచుండెను. ప్రారబ్ధము పక్వమగు కాలమునకై ఆమె వేచియుండెను. ఆమె నియమనిష్ఠలతో ననేకకాలములు గడచినవి. ఆ నియమములలో అనేకక్లేశముల నామె ఓర్చినది. శరీరము సర్వరీతుల కృశించి యున్నది. ఆమెను జూచిన కర్దమునకు దయారసము వెల్లువలై ఉబికివచ్చినది. దయారసముతో అతఁడెక్కువ పీడింపఁబడెను. ప్రేమగద్గద మైన వాక్కుతో నన్నాఁడు.

6. మానిని!=ఓ మనుపుత్రియైనదానా! మానదాయాఃతవ=నీసాంగత్యముతో నాకు గొప్ప గౌరవ మబ్బినది. నన్ను ఉత్తమ గృహస్థునిగా ఒనర్చితివి. అట్టి శుశ్రూషయా=సర్వోత్కృష్టమైన నీసేవచేతను, పరయా భక్త్యాచ=ఉత్కృష్టమైన

నీభక్తిచేతను, అహం అద్యతుష్టఃనే నిప్పుడు పరితుష్టాంతరంగుడనైతిని. దేహినాం=దేహధారులైన అందరికిని, అతీవసుహృత్=అత్యంత ఇష్టమైనదియు, సముచితఃసర్వపురుషార్థములను సాధించుటకు యోగ్యమునైన, యఃదేహఃఏ శరీరమును, మదర్థే క్షపితుం=నాకొఱకై కార్శ్యమునందించుటకు, న+అపేక్షితఃముందు వెన్కలు చూడలేదు. ఇది మొదలు మూడుశ్లోకములు కర్దముని వాక్యములు.

తాత్పర్యము : ఓసీ! మనుపుత్రీ! నీ సాంగత్యముతో నాకు దేవర్షులలో గౌరవమబ్బినది. నీవు సర్వోత్కృష్టముగా నన్ను పచరించితివి. పరమప్రేమ రూపమైన నీభక్తి నన్ను సంపూర్తిగా వశీకరించుకొన్నది. దేహము సర్వులకును సర్వపురుషార్థసాధనమైనది. అధిక ప్రేమ పాత్రమైనది. అట్టి శరీరమును నీవు నాసేవలకై ఉపేక్షించితివి. అడుగడుగున నీప్రేమభక్తి నాకుఁగానవచ్చుచునే యున్నది. నీ దేహమునకు నీ రక్షణ మావశ్యకమైనను దానిని సర్వదా గ్రహింపకనే పోతివి. నీ శరీరము సర్వథా నాకు సమర్పితమై యుండెను.

7. స్వధర్మ నిరతస్య మే=నా ధర్మమందు అతి శ్రద్ధగల నాయొక్క, తపస్సమాధి విద్యాత్మయోగవిజితాఃతపస్సు, భగవద్ధ్యానము, జ్ఞానము చిత్తము యొక్క ఏకాగ్రత వీనిచేత సంపాదింపఁబడిన, యే భగవత్ప్రసాదాఃభగవదనుగ్రహ రూపములైనవి ఏవి కలవో అవి, మదను సేవనయాఃనిరంతరము నన్ను సేవించుట చేత, తేఃనీ చేతకూడ, అవరుద్ధాఃస్వాధీన మొనర్చుకొనఁబడిన, అభయాఃభయరహితములు, అశోకాఃదుఃఖమును పోఁగొట్టునవియునైన, తావ్ ఏవఃవాని నన్నిటినీ, ప్రపశ్యఃనీవు చూతువుగాక! దృష్టింవితరామిఃనీకు దివ్యదృష్టినొసఁగు చున్నాను.

తాత్పర్యము: దేవహూతి! నీ ధర్మానుష్ఠానము సఫల మైనది. ఎట్లనగా నా వర్ణాశ్రమ ధర్మములకు తోడై వాని కేలోపమును కలుగనీక నిర్వర్తింపఁజేసితివి. నే ననుష్ఠించిన వ్రతాదులు, భగవద్ధ్యానము, ఉపాసన, ఆత్మయోగము మొదలైన వానితో నాకు సంక్రమించిన భగవత్ప్రసాదము లన్నియు నన్ను సర్వాత్మనా శుశ్రూషించుటచేత నీకును కూడ లభించినవి. ఆ సిద్ధులన్నిటినీ ప్రత్యక్షముగా చూడుము. వానిని జూచుటకుఁ గావలసిన దివ్యదృష్టిని నేను నీ కొసఁగు చున్నాను. ఆ ప్రసాదములు ఐహికములైన భోగసాధనముల వంటివి కావు. ఐహికములు కొంతకాలమునకు నశించిపోవును. నరకపాతభయమున్నవియు కావు. ఆ విభూతులు నిత్యసుఖప్రదము లైనవి. నాశరహితము లైనవి.

8. అన్యే=ఇతరములు, పునః కిం=ఏమి లెక్క, ఉరుక్రమస్య=గొప్పదైన పాదన్యాసముతో కూడిన, భగవతః=భగవంతునియొక్క, భ్రువః=కనుబొమయొక్క, ఉద్విజృంభ విభ్రంశితార్థ రచనా=విజృంభణముచేత నశించి పోవు మనోరథము లతో కూడిన, సిద్ధాసి=నీవు సిద్ధురాల వగుదువు. నృపవిక్రియాభిఃరా జనెడు అహంకార భావములతో, నరైఃమనుష్యులచేత, దురధిగాన్=పొందుటకు సాధ్యము కానివియు, దివ్యాన్=అలౌకికములును ఐన, నిజధర్మదోహాన్=నీ ధర్మముతో సిద్ధించినవియైన విభవాన్=భోగములను, భుంక్ష్వ=అనుభవింపుము.

తాత్పర్యము : దేవహూతీ! భగవంతుని ప్రసాదముచే లభించిన ఈ విభవములు అన్యభోగసాధనములవలెఁ దుచ్ఛములుకావు. ఎందుకనఁగా అవి లీలా మాత్రముగా ఈ లోకములను సృష్టించి రక్షించి సంహరించెడు భగవంతుని యొక్క భ్రూవిజృంభణమాత్రముచేత అవియన్నియు నశించి పోవును. వాని స్థిరత అంతమాత్రమే. ఇప్పుడు నీకు సిద్ధించిన సిద్ధులు అట్టివి కావు. వీనికి నాశము లేదు. పరమపురుషార్థమైన మోక్షమును సాధించుకొనువఱకును నీ ఇష్టము వచ్చినట్లే సిద్ధులనుభవింపుము. "నేను రాజానుకదా! నేను సాధింపలేని కార్యము లేముండును" ఇత్యాది నిస్సారములైన వికారములతో మనుష్యులకు సిద్ధించెడు భోగములు నీకు సిద్ధించిన సిద్ధులను బోలవు. మోక్షమునందు పర్యవసించెడు సిద్ధులను నీవు యథేచ్ఛముగా ననుభవించి ఆనందించుము.

9. అఖిల యోగమాయా విద్యా విచక్షణం=సమస్త యోగమాయ లందును, వీని ఉపాసన లందును, సమర్థుడును, ఏవం బ్రువాణం=ఈ రీతిగా చెప్పుచున్న వాఁడునైన కర్దముని, అవేక్ష్య=చూచి, అబలా= స్త్రీయైన దేవహూతి, గతాధిః ఆసీత్=మానసము వ్యథను తొలఁగినదైనది. స(వ్రశ్రయ ప్రణయవిహ్వలయా= వినయము ప్రేమ - వీనితో నిండిన యక్షరములతో కూడిన, గిరా=వాక్కుచేత, ఈషద్వ్రీడావలోక విలసద్ధసితాననా=కొద్దిగా లజ్జాసహితమైన కటాక్షముతో ప్రకాశించుచున్నదియు, మందహాసముతో కూడిన ముఖమండలము గలదియునై, అహ=పలికెను.

తాత్పర్యము : విచిత్రములైన పదార్థములను ఇష్టము వచ్చునట్లు సృష్టింపఁగల శక్తులను జనింపఁజేసెడు ఉపాసనములందు నిపుణుఁడు కర్దముఁడు. అతని ఈ మాటలను విని దేవహూతి మనస్సు పరమ ప్రసన్నమైనది. అంతకు ముందున్న చింత లన్నియు నశించినవి. నా సమస్త మనోరథములును సిద్ధించిన వను సంతృప్తి ఏర్పడినది. వినయము ప్రేమాధిక్యము వీనితో హృదయము తడిసిపోయినది. ఆమె ప్రత్యక్షరమందును ఈ భావములు

తొణకిసలాడుచుండెను. స్త్రీసహజమైన లజ్జ ప్రసన్నమైన భర్తృముఖమును చూచినపుడు కలిగెడు అవదాతకటాక్షము, మందహాసముతో కూడిన ముఖము వీని యన్నిటి శోభ యొక్కసారి నామె స్వరూపము నావరించినది. ఆమె ఇట్లనెను.

10. ద్విజవృష!=బ్రాహ్మణశ్రేష్ఠ! విభో!=సర్వసమర్థుడైనవాఁడా!భర్తః =ఓనాథుడా! అమోఘ యోగమాయాధిపే=అమోఘములైన శక్తులను జన్మింపజేసెడు సమస్త మాయల కధిపుఁడవైన, త్వయి=నీ యందు, ఏతత్=ఇది, రాద్ధం=సర్వదా సిద్ధమే. తత్ అవైమి=ఆ విషయము నాకు తెలిసినదే. సకృత్ అంగసంగః=ఒకసారి శరీర స్పర్శ యేర్పడునని, యః సమయః=ఏ యేర్పాటు, తే అభ్యధాయి=నీ చేత చెప్పఁబడినదో అది, భూయాత్=ఏర్పడుఁగాక! గరీయసి=గొప్పవాఁడైన భర్తనిమిత్తముగా, సతీనాం ప్రసవః=పతివ్రతల కేర్పడు సంతానలాభము, గుణః=ఉత్కృష్టమైన గుణములుగాదా!

తాత్పర్యము : దేవహూతి యన్నది ఓ ద్విజోత్తమా! సర్వసమర్థుఁడవైన ఓయినాథా! సకల పదార్థములను సృష్టింపనేర్పుగలది నీయోగమాయా శక్తి. అది నీకన్ను సన్నల నడచును. ఇట్టినీవు భోగసాధనములను సృష్టించుటలో తక్కువవాఁడ వని నేనెట్లనుకొందును? వానిని వీక్షించుటకుఁదగిన దివ్యదృష్టిని నా కొసఁగుటకు కూడనీవు సమర్థుఁడవే. నీవు మన వివాహ సమయమందు నా గర్భధారణ పర్యంతము నాతో దేహసంగతి మంచుకొనుటకు సమయ మొనర్చితివి. ఆ సమయమును నీవు చెల్లించిన తరువాత ఇష్టభోగములను భవింతముగాక! పతివ్రతలకు శోభగూర్చునది మహత్తరుఁడైన భర్తనుండి ఏర్పడు సంతానమే. ఇదియే అన్ని గుణములకు గుణము.

11. తత్ర=భోగానుభవమునందు, యథోపదేశం=శాస్త్రప్రకారము, ఇతికృత్యం=కావలసిన సాధనమును, ఉపశిక్ష=సంకల్పింపుము. యేన=దేనిచేత, తే కృతమనోభవ ధర్షితాయాః=నీ నిమిత్తముగా నేర్పడిన మన్మథ వికారముతో క్షోభించి యున్న, అతిరిరంసయా=ఎక్కువైన రత్యాశ నిమిత్తముగా, కర్శితః =కృశించినదియు, దీనః=బలము తగ్గినదియు నైన, ఆత్మా=శరీరము, నిర్వృత=సుఖసమర్థముగా నగుఁగాక! ఈశ=ఓ యోగసిద్ధుఁడా! నదృశం= అనురూపమైన, భవనం=గృహమును కూడ, విచక్ష్వ=విచారించుము.

తాత్పర్యము : సంయోగాదుల కావశ్యకమైన కామశాస్త్రోక్తమైన సాధన సామగ్రులను మొట్టమొదట సంపాదించుట కనుగ్రహింపవలెను. నీ మండి సంయోగ సౌఖ్య మనుభవింపవలె ననుచింతతో క్షోభించుట కారణముగా కృశించిన శరీరమే ఇంతవరకును బరువుగా భరించుకొని వచ్చుచున్నాను. నా శరీరము సుఖక్షమ మగుటకు కావలసిన భోజనపానాది పదార్థములును నరసక్రీడల కుచితమైన భవనమును ఏర్పడుట కుచితమైన సంకల్పమే మిరిప్పు డొనరింపవలసినది. ఏ సాధన సామగ్రియును లోపము లేకుండనీ సంకల్ప శక్తిచే నన్నియు నేర్పరుపవలెను. సకల పురుషార్థములను సాధించుటకు

ఆవశ్యకమైన శరీరరక్షణ ఇప్పుడు అనుష్ఠింపవలసిన ప్రథమ కార్యము. వాని నన్నిటిని నీయోగమాయాశక్తితో వెంటనే సృష్టింపవలెను.

12. ప్రియాయాఃప్రియం=భార్య యొక్క కోర్కెను. అన్విచ్ఛన్=తీర్చుట యం దాతురత కలవాఁడై, కర్దమఃకర్దముఁడు, యోగం ఆస్థితఃయోగము నవలంబించినవాఁడై, క్షత్తఃఓయి విదురా! తర్హ్యేవఆ సమయమందే, కామగం విమానం=తన ఇచ్ఛ కనుగుణముగా సంచరింపఁగల దేవయానమును, ఆవిరచీకరత్=ఆవిర్భవింపఁ జేసెను.

తాత్పర్యము : కర్దముఁడు దేవహూతి కోర్కెను తీర్చుట యందు ఆతురత గలవాఁడైనాఁడు. అతఁడు యోగమాయా శక్తిని ధ్యానించెను. తన ఇచ్ఛాను సారము సంచరించుచున్నదైన ఒక్క దేవయాన మప్పుడే ప్రత్యక్షమైనది.

13. సర్వకామదుఘం=సమస్తములైన కోర్కెలను పిండునదియు, సర్వరత్న సమన్వితం=చెక్కఁబడినట్టి సర్వ రత్నములతో కూడినదియు, సర్వర్ధి+ఉపచయోదర్కం=సకలసమృద్ధులను - వాని యొక్క ఉత్తరోత్తరాభివృద్ధి గలదియు, మణిస్తంభైఃరత్నమయములైన స్తంభములచేత, ఉపస్కృతం=అలంకరింపఁబడినదియు.

తాత్పర్యము : ఆ దివ్యవిమానము కోరుకొన్న సమస్తాభీష్టములను దీర్ప దివ్యశక్తిగలదై యున్నది. అది దివ్యము. సర్వరత్నములును దానికి చెక్కఁబడియుండెను. దానిలో సర్వసమృద్ధులు. ఆ సమృద్ధులెప్పుడును తఱుగనివి. ఉత్తరోత్తరాభివృద్ధియే వానికిఁగల లక్షణము ఆ విమానమం దెల్లెడను మణిస్తంభములు.

14. దివ్యోపస్కరణోపేతం=దివ్యములైన ఉపకరణములు కలదది అనఁగా పాత్రలు భాజనములు అన్నియు దివ్యములే, సర్వకాల సుఖావహం=సర్వ కాలములందును సుఖమునే కలిగించునది. ఆయాఋతువులందేర్పడు శీతోష్ణాదుల కనుగుణముగా మారి సుఖము నిచ్చునది. విచిత్రాభిఃఅనేక వర్ణములతో కూడిన, పట్టికాభిఃగోడలకుపైన పఱవఁబడినట్టి పట్టికలు గలది, పతాకాభిఃపొడవైన నిడుపుకలిగిన పతాకలతోను, అలంకృతం=అలంకరింపఁబడినది.

తాత్పర్యము: ఆ విమానమందు దివ్యములైన గృహోపకరణములు సర్వ ఋతువులందును ఆయాశీతోష్ణముల కర్హమైన రూపము ధరించి తనయందు నివసించు వారికి సుఖమునిచ్చు శక్తిగల దది. నానా వర్ణములు కల్గిన పట్టికలతో కూడినదది. దీర్ఘము లైన ధ్వజములు కల్గినది.

15. విచిత్రమాల్యాభిఃనానా వర్ణములతో కూడిన పుష్పములతో నిర్మింపఁబడిన మాలలు, ఆమాలానిర్మాణమందలి అనేక నైపుణ్యములు, మంజుశింజత్+షడంఘ్రిభిఃఆ మాలల యొక్క వాసనలతో నాకృష్టములైన కర్ణపేయములైన ఝంకారములతో బవిరిచుట్టుచున్న తుమ్మెదలు, మఱియు

విశిష్టములైన మాలలు, దుకూలక్షౌమకౌశేయైఃఅనరములైన దుకూలములు చెట్ల యొక్క నారలతో తయారు చేయఁబడిన విచిత్రములైన వస్త్రములు, పట్టునూలుతో తయా రయిన రంగురంగుల వస్త్రములు, నానావస్త్రైఃఇంకను అనేక విధములైన వస్త్రములు - వీనిచే నలంకృతమైనది.

తాత్పర్యము : అనేకములైన మాలలు వాని నిర్మాణములో నైపుణ్యము. ఆమాలా నైపుణ్యము ఆశ్చర్యమును గొలుపుచుండెను. సుగంధికములైన మాలల చుట్టును తుమ్మెదలు బవిరి చుట్టుచుండెను. వాని ఝంకారములు కర్ణపేయములై ఉండెను. ఊదిన పారునట్టి దుకూలములు. నానావిధము లైన పట్టులతో నేయఁబడిన వస్త్రములు. వ్రీక్రముల నారలతో నేయఁబడి అత్యాశ్చర్యమును కలిగించు వస్త్రవిశేషములు. ఇంకను నేఁతలో నైపుణ్యముగల వివిధ వస్త్రములు.

16. ఉపర్యుపరి విన్యస్తనిలయేషుఁపై పైని గదులు గలిగిన ప్రత్యేకములైన సౌధములు, వేరు వేరుగా ఎంతో చాతుర్యముతో నిర్మింపఁబడిన, కశిపుభిఃశయనించుట కేర్పాటు చేయఁబడిన మంచములు, అనర్ఘములైన పర్యంకములు కన్నులు మిరుమిట్లు గొల్పు వ్యజనములు.

తాత్పర్యములు : గదులు ఒక్కదానిపై నొకటి పేర్చబడియున్నవి. అట్టి అత్యున్నతములైన సౌధములు దండిగా ఉండెను. కన్నులు జిగేలు మను మంచములు. వానిపై పరువఁబడిన పర్యంకములు. ఆసనములు ఆలవట్టములు.

17. తత్ర తత్ర విన్యిక్షిప్త నానాశిల్పోపశోభితం=అక్కడక్కడనుంపఁబడిన, నానాశిల్ప=బహువిధములైన శిల్పములచేత, ఉపశోభితం=ప్రకాశించుచున్నట్టిది. మహామరకతస్తంభ=మరకత రత్నముల పొడి మెత్తఁబడిన నేలలు. విద్రుమ వేదిభిఃవిద్రుమ మణులతో నింపఁబడిన అరుగులు. వీనిచేత, జుష్టం=శోభించునది.

తాత్పర్యము : అచ్చ టచ్చట నుంపఁబడిన నానా శిల్పములు. గోడల యందును నేల యందును పొదగఁబడిన వివిధములైన శిల్పములు. దానినేలపైన మరకత రత్నముల ధూళి పొదగఁబడియున్నది. విద్రుమమణులతో నిర్మింపఁబడిన వేదికలు.

18. ద్వార్షు=ద్వారములకు, విద్రుమదేహల్యా=తయారుచేయఁబడిన, విద్రుమరత్న వికారములైన కడపమాను వీనిచేత, భాతం=ప్రకాశించునది. వజ్రికవాటవత్=వజ్రములు పొదుగఁబడిన ద్వారములు. ఇంద్రనీలేషు శిఖరేషు=ఇంద్రనీల మణులతో నిర్మింపఁబడిన గోపురములందు, హేమకుంభైఃనిలుపఁబడిన బంగారుశిఖరములచేత, అధిశ్రితం=కూడుకొన్నది.

తాత్పర్యము : ద్వారములకు విద్రుమములతో నేర్పాటు చేయఁబడిన గడపమానులు. వజ్రములు చెక్కఁబడి తెల్లగా ప్రకాశించు ద్వారములు.

ఇంద్రనీలమణులతో నిర్మింపఁబడిన గోపురములు. వానిపై నిర్మింపఁబడిన బంగారు గోపురములు.

19. వజ్ర భిత్తిషు నిర్మితైఃవజ్రములతో నిర్మితములైన వానియందు నిలుపఁబడిన, చక్షుష్మత్పద్మరాగాద్యైఃగోడలకున్న కన్నులోయని భ్రమలు కల్గించిన బహుశోభతో కూడుకొన్న పద్మరాగములు, విచిత్రవైతానైఃఆశ్చర్యమును కలిగించు పనితనముగల మేలుకట్లు, మహార్హైఃగొప్పవెలగల, హేమతోరణైఃబంగారు తోరణములు వీనిచేత, జుష్టంకూడినది.

తాత్పర్యము : వజ్రములచేత నిర్మింపఁబడిన గోడలు. ఆ గోడలలో చెక్కఁబడిన పద్మరాగములు. అవి గోడల కన్నులోయని భ్రాంతి కల్గించుచున్నవి. మేలు కట్టులు విచిత్రమైన వనితనము కలవి. వ్రేలాడుచున్న బంగారు తోరణములు.

20. కృత్రిమాన్కృత్రిమముగా నిర్మింపఁబడిన, స్వావమన్యమానైఃఆయాజాతులందే ప్రభవించిన వేమో అని భ్రాంతులు గొల్పుచున్న, తత్ర తత్రఅచ్చటచ్చట, అధిరుహ్యఅవరుహ్యచచెట్లయందు ఎక్కిఎక్కి కూర్చున్నట్టి, హంసపారావత వ్రాతైఃహంసములు పారావతములు - వీని నమూహములచేత, కూజితంశబ్దింపచేయఁబడుచున్నది.

తాత్పర్యము : ఆ విమానమందు కృత్రిమముగా పక్షిజాతులు నిర్మింపఁబడినవి. అవి ఆయాజాతులందే జన్మించిన పక్షు లేమో యను భ్రాంతిని గొల్పుచుండెను. చెట్లయందు ఎక్కిఎక్కి కూర్చున్నవి. ఆ హంసలు పారావతములు మొదలైన పక్షులు ఊరక కూర్చుండుటయే కాక అప్పుడప్పుడు శబ్దించు చున్నవి. వాని శబ్దములు చెవులకు పండుగలై యున్నవి.

21. విహారస్థానంక్రీడించెడిచోటును, విశ్రామంవిశ్రమించుచోటును, సందేశంశయనగృహమును, ప్రాంగణంఇంటికి ముందున్న చోటును, అజిరంముందుభాగమును, యథోప జోషంకోరిన విధము నతిక్రమింపక, రచితైఃరచింపఁబడిన విమానమును, ఆత్మనఃకర్తమనకు కూడ, విస్మాపనం ఇవఆశ్చర్యమును కలిగించునదిగా నుండెను.

తాత్పర్యము : ఆ విమానమందు క్రీడించెడు స్థానము, విశ్రమించుట కుడుచోటు, సుఖముగా శయనించుటకు కావలసిన గదులు నడిమిల్లు, చమత్కృతితో కూడిన ముందు గదులు ఎట్లెట్లుండవలెనని కర్తముఁడు కోరెనో అట్లే ఉండెను. దానిని జూచి కర్తమనకు ఆశ్చర్యము కలిగెను. ఇతరులు ఆశ్చర్యపోవుట సహజమే. కాని సర్వయోగమాయా సిద్ధుఁడు కూడ ఆశ్చర్యపడుట ఆశ్చర్యమే.

22. ఈదృగ్గృహం=ఈ ప్రకారముగా నున్న ఆ గృహమును, నాతి ప్రీతేన చేతసా=ఎక్కిన సంతోషమును పొందినట్టి మనస్సుతో, పశ్యంతీం=చూచుచున్నట్టి దేవహూతితో కూడ, సర్వభూతాశయా భిజ్ఞుఃభూతముల యందలి అభిప్రాయము లన్నియు తెలిసికొనెడు, కర్దమఃకర్దముఁడు, స్వయంప్రోవాచత్=ఇట్లన్నాడు.

తాత్పర్యము : ఈ రీతిగా ననర్హమైన ఆ గృహమును జూచి దేవహూతి మనస్సు ఎక్కువగా సంతోషపడినట్లు లేదు. కర్దముఁడు సకల భూతముల యందలి సకలాభిప్రాయములను యోగశక్తితో కనుఁగొనఁగలవాఁడు. ఆ విమానము తనకు కూడ నాశ్చర్యము గొల్పునదిగా ఉన్నది. మరి దేవహూతి కెందుకు సంతోషముగా లేదు? అప్పుడు కర్దముఁడామెతో నన్నాఁడు.

23. భీరుభయశీలురాలా! అస్మిన్ప్రదేబిందు సరస్సును పేరుగల ఈ జలాశయమందు, నిమజ్జమునిఁగినదానవై, ఇదం విమానంఈ విమానమును, ఆరుహఎక్కుము. శుక్లకృతం ఇదం తీర్థంభగవంతునితో నిర్మింపఁబడిన ఈ తీర్థము, నృణాంమనుష్యుల యొక్క, ఆశిషాం అభిలాషములయొక్క, యాపకంతృప్తికరమైనది.

తాత్పర్యము : ఓ భయశీలు రాలా! బిందు సరస్సును పేరుగల జలాశయమందు మునుఁగుము. మునిఁగి ఈ విమానము నెక్కుము. ఇది భగవంతునిచేత నిర్మింపఁబడినది. మనుష్యుల మనోరథములను పూరించునది.

24.25. సా కువల యేక్షణావికసించిన కలువల వంటి దీర్ఘములై నల్లని చూపులతోడి కన్నులుగల ఆ దేవహూతి, భర్తుస్తద్వచఃభర్తయైన కర్దముని యొక్క వాక్యమును, సమాదాయసాదరముగా స్వీకరించి, సరజం వాసఃధూళియుక్తమైన వస్త్రమును, వేణీభూతాన్ స్వమూర్ధజాంశ్చజడలుకట్టు కొన్నట్లున్న తలవెండ్రుకలను, మలపంకేన సంఛన్నం అంగంచధూళితో అంతట నావరించుకొన్న దేహమును, శబలస్తనందాదా పెండిపోయినట్లున్న ఎదను, బిభ్రతీధరించి యున్నదై, సరస్వత్యాఃసరస్వతీనది యొక్క, శివజలాశయంకళ్యాణకరములైన జలములతో కూడియున్న, సరఃబిందుసరస్సులో, ఆవివేశప్రవేశించి మునిఁగినది.

తాత్పర్యము : ఆమె కన్నులు కలువలవంటివి. అవి విస్తృతములైనవి నల్లని చూపులు గలవి. దేహమంతయు వ్రతకర్శితమైనను కన్నుల యందలి సౌందర్యము మాత్రము తగ్గలేదు ఆమె కళ్యాణకరమైన కర్దముని వాక్యములను సగౌరవముగా స్వీకరించెను. ధరించిన వస్త్రము ధూళిధూసరితమై యున్నది.

తలవెండ్రుకలు జడలు గట్టి తఱచైన జడవోలె నున్నది. శరీరమం దంతయు ధూళి. ఆ ధూళీసంచ్ఛన్నమైన దేహము కన్పించుట లేదు. స్తనములు దాదాపెండిపోయినవి. ఆమె యట్లే శివంకరములైన జలములతో గూడిన బిందు సరస్సులోనికి ప్రవేశించెను.

26. సా=ఆమె, అంతస్సరసి=తటాకము లోపల, వేశ్మస్థాః=గృహము నందున్నట్టియు, సర్వాః కిశోరవయసః=అందరును వయస్సులో నున్నట్టియు, ఉత్పలగంధయః=తామరపువ్వు యొక్క గంధము గలట్టియు, దశశతాని కన్యకాః =వేయిమంది కన్యకలను, దదర్శ=చూచినది.

తాత్పర్యము : ఆ బిందు సరస్సుయొక్క మధ్య మందు వేయిమంది కన్యక లున్నారు. వారందరు సుందరమైన ఒక భవనములో ఉండిరి. అందరి మూర్తులును యౌవనముతో మిల మిల లాడుచుండెను. వారి శరీరముల నుండి తామరపూలవంటి వాసన దిక్కులకు ప్రసరించు చుండెను.

27. తాం దృష్ట్వా=దేవహూతిని చూచిన వెంటనే, సహసా ఉత్థాయ=హఠాత్తుగా వా రందరు లేచినారు. ప్రాంజలయః స్త్రియః=అంజలి బంధముతో కూడుకొన్న యా స్త్రీలు, వయం=మేము, తుభ్యం కర్మకరీః =మీకు పరిచారికలము. కింకరవామ=మే మేమి చేయవలెను? నః శాధి= మమ్ముల నాజ్ఞాపింతువు గాక అని, ప్రోచుః=పలికిరి.

తాత్పర్యము : దేవహూతిని చూచిన వెంటనే వా రందరు హఠాత్తుగా లేచినారు. వా రందరు కరసరోరుహములను ఘటించిరి. అమ్మా! మే మందరమును నీ దాస్యముకొఱకై వేచి యున్నాము. మేము చేయవలసిన పనుల నాజ్ఞాపింపుము అని పలికిరి.

28. మానదాః=దేవహూతిని గౌరవించుచున్నవారు, మహార్హణస్నానేన= అమూల్యములైన స్నాన సాధనములతో, మనస్వినీం తాం స్నాపయిత్వా=ఉత్సాహ యుక్తులై ఆమెను స్నానము చేయించిరి. నిర్మలే=శుభ్రములు, నూత్నే=క్రొత్తది యైన, దుకూలే=మృదువస్త్రములను, అస్యై దదుః=ఆమె కొసగిరి.

తాత్పర్యము : అమూల్యములైన సాధన సామగ్రులతో నామెను స్నానము చేయించినారు. దేవహూతి మనస్సు ఉత్సాహ సంరంభితమైయుండెను. ఆమెకు కట్టుకొనుటకు దుకూలము లిచ్చిరి. అవి పరిశుభ్రములైనవి. నూత్నములైనవి.

29. పరార్ధ్యాని=ఇంతని వెల చెప్పుటకు సాధ్యము కానట్టియు, వరీయాంసి=సర్వోత్కృష్టములును ఐనట్టివి, ద్యుమంతి=గొప్పకాంతితో కూడినవియునైన, ఆభరణాని=గొప్పయాభరణములను, సర్వగుణోపేతం అన్నంచ=సమగ్రమైన సద్గుణములతో చేరిన యన్నమును, అమృతాసవం పానం చ=అమృతముతో సమమైన పానీయమును ఒసగిరి.

తాత్పర్యము : ఆమెకు వారు భూషణము లిచ్చినారు. వాని వెల ఇంతని చెప్పుటకు వీలులేదు. అవి సర్వోత్కృష్టము లైనవి. వాని కాంతిలో దిక్కులు కనఁబడుటలేదు. వా రామెకు భోజనము పెట్టిరి. అది సర్వగుణ సంపన్న మైనది. ఆ పానీయములు అమృతోపములు.

30.31.32.33.34. అథ=అనంతరమామె, స్వం ఆత్మానం=తనయొక్క దేహమును, ఆదర్శే=అద్దమందు, దదర్శ=చూచుకొన్నది. స్రగ్విణం=మాల ధరించిన, విరజాంబరం=నిర్మల వస్త్రముతో కూడియు, కృత స్వస్త్యయనం= పరిచారికలతో చేయఁబడిన మంగళ వేషముతోడ కూడినదియు, కన్యాభిః =కన్యలచేత, బహుమానితం=ఎక్కువగా మెచ్చఁబడినది, కృత శిరస్స్నానం= వాసనా ద్రవ్యములుపయోగించి చేయింపఁబడిన శిరస్స్నానముతోను సర్వాభరణ భూషితం=సకల విధములైన ఆభరణములతో అలంకరింపఁబడినదియు, నిష్కగ్రీవం=కంఠభూషతో కూడినదియు, వలయినం=కంకణములు గలదియు, కూజత్కాంచన నూపురం=ధ్వనించుచున్న స్వర్ణ వలయములతోను, శ్రోణ్యోః =కటితట ములందు, అధ్యస్తయా= భరింపఁ బడినట్టియు, బహురత్నయా=అనేక రత్నములు తాపినట్టిదియునైన, కాంచన్యా కాంచ్యా=స్వర్ణమేఖలతోను, మహార్హేణ=గొప్పవెలగల హారేణ=ముత్యపుమాలతోను, రుచకేనచ=కుంకుమాది మంగళాలంకారముతో, భూషితం=అలంకరింపఁబడి నదియు, సుదతా=శోభన దంతములతోను, సుభ్రువా=అందమైన భ్రూలతలతోను, శ్లక్ష్ణ స్నిగ్ధాపాంగేన పద్మకోశ స్పృధా చక్షుషా=శ్లక్ష్ణ ము, స్నిగ్ధతయు కలిగిన అపాంగములు గల పద్మకోశసౌందర్యమును హరించెడు కన్నులతోను, నీలైః అలకైఃనీలము లైన అలకలతో, లసన్ముఖం=శోభించుచున్న ముఖమును, వీక్ష్య=చూచి, ఋషీణాం ఋషభం=ఋషులలో శ్రేష్ఠుడును, దయితం=తనయందు దయగలవాఁడైన, పతిం=భర్తను, యదా సస్మార=ఎప్పుడు స్మరించెనో, తదా=అప్పుడు, స్త్రీభిస్సహ=పరిచారికలైన ఆ స్త్రీలతోకూడ, సః ప్రజాపతిః=ఆ కర్దమ ప్రజాపతి, యత్రాస్తే=ఎక్కడ నుండెనో, తత్ర ఆస్తేచ=అక్కడ తానుండుటయు జరిగెను.

తాత్పర్యము : ఈ రీతిగా నలంకరింపఁబడిన దేవహూతి అద్దమందు తన్ను తాను చూచుకొన్నది. తలనిండ పుష్పాలంకారము. కట్టుకొన్న అనర్ఘమైన దుకూలము. సఖీజనులచే నొనరింపఁబడిన మంగళ వేషరచన. ఆవేయిమంది సఖులును ఆమె నలంకరించుటలో తమనైపుణ్యము నంతయు వెచ్చించిరి. అనేక సుగంధములతో నామెకు తలంటు పోసినారు. దేహమంతయు కాంచనాభరణ భూషితమై యున్నది. కంఠమందా భరణములు. చేతులలో కంకణములు కాళ్లలోని బంగారు వలయములు మృదుమధురముగా

ధ్వనించుచున్నవి. శ్రోణీమండలమం దలంకరింపఁ బడిన మేఖల దానికి పొదుగఁబడిన అనేక రత్నములు. కన్నులు మిరుమిట్లు గొలుపు ముత్యాలహారము కుంకుమాది మంగళాలంకారము మనోహరమైన పలువరుస. కన్నుల నాకర్షించు భ్రూలతలు. ఆపాంగములు నల్లనై నిశితములై యున్నవి. వానితోఁ గూడిన కన్నులు పద్మకోశ కాంతి పాటచ్చరములై యున్నవి. నిటాలముపైఁబడుచున్న నీలాలకములు. తన స్వరూపమును అద్దమందు తానే చూచి దేవహూతి అబ్బుర పడినది. ఆమె భర్తను మనస్సులో స్మరించెను. అతఁడు ఆమె యందు నిత్యసానుభూతి కలవాఁడు. ఋషులలో మహర్షి. అతనిని స్మరించినంతనే యామె అతఁడున్నెడ ప్రత్యక్షమైనది.

35. భర్తుఃపురస్తాత్=భర్తయొక్క ఎదుట, స్త్రీ సహస్రవృతం ఆత్మానం=వేయిమంది స్త్రీలచేత చుట్టుకొనఁబడిన స్వదేహమును, నిశామ్య=చూచి, తదా=అప్పుడు, తద్యోగగతిం=ఆ కర్దముని యొక్క యోగశక్తి పరమాద్భుతముగా భాసించినది. ఇది తనకు జాగ్రదవస్థయా! కాదా? అని సంశయ మేర్పడినది.

36.37. అమిత్రహన్=ఇంద్రియాదులనెడు శత్రువులను సంహరించిన వీరాగ్రగణ్యుఁడైన కర్దముఁడు, అపూర్వవత్ విభ్రాజంతీం=ఇంతకు ముందు కంటె ఎక్కువగా శోభించుచున్నయు, సంవీతరుక్తనీం=పైటచేత కప్పఁబడినను, కన్నుల కందముగా కప్పుచున్నస్తనములు కలదియు, కృతామల స్నానాం=చేయఁబడిన మంగళస్నానము కలదియు, ఆత్మనఃరూపం బిభ్రతీం=ఆమె యొక్క పూర్వ సౌందర్యమును సర్వమును వహించియున్నదియు, విద్యాధరీసహస్రేణ=వేయిమంది విద్యాధరులచేత, సేవ్యమానాం=సేవింపఁ బడుచున్నట్టియు, సువాససం=శోభనములైన, వస్త్రములను ధరించి యున్నదియునైన, తాం వీక్ష్య=ఆమెను చూచి, జాతభావఃమనోవికార మేర్పడిన వాఁడై తద్విమానం=సిద్ధముగానున్న విమానమును, ఆరోహయత్=అధిరోహించెను.

తాత్పర్యము : దేవహూతి మంగళస్నాన మొనర్చినది. అపూర్వమైన శరీర శోభతో కూడినదిగా నున్నది. ఆమె సర్వసౌందర్య మొక్కచోట గుంభితమైనట్లున్నది. పైటచేత కప్పఁబడియు ఆమె యొద అతిమనోహరముగా భాసించుచున్నది. ఆమె చుట్టును ఆమెను కొల్చుచున్న పరిచారికలైన విద్యాధరీ సహస్రము. ఆమె దుకూలము దేవహూతి లావణ్యమునకు మెఱుగువెట్టుచుండెను. కర్దముఁడు ఇంద్రియములను జయించినాఁడు కాని ఆమె చూచినపుడు అతని హృదయమందు మన్మథోదయమైనది. అతఁడు విమానము నారోహించెను.

38. అలుప్త మహిమా=లోపించని ప్రభావముతో కూడినవాఁడును, ప్రియయా=భార్యయందు, అనుషక్తఃఅనురాగమును పొందినవాఁడును,

విద్యాధరీభిః=విద్యాధరీ సుందరులచేత, ఉపచీర్ణవపుః=శుశ్రూషచేయఁబడుచున్న శరీరముతో కూడిన వాఁడను, అపీచ్యైఃపరమ సుందరుఁడైన ఆ కర్దముఁడు, తస్మిన్ విమానే=ఆ విమానము నందు, ఉత్కచ కుముదణవాన్=వికసించిన కలువలయొక్క గుంపుతో కూడిన వాఁడును, తారాభిఃనక్షత్రములచేత, ఆవృతఃచుట్టఁబడినవాఁడు, సభస్థఃఆకాశమందున్న, ఉడుపతిరివచంద్రునివలె, బభ్రాజశోభించెను.

తాత్పర్యము : కర్దముఁడు లోపింపని మహామహిమ కలవాఁడు. అతనికి భార్యయందు విశిష్టమైన అనురాగము జన్మించినది. అతనిని పరివేష్టించి విద్యాధరీ గణములు పరిచర్య నొనర్చుచుండెను. అతఁడా విమానము నెక్కినాఁడు. అతఁడు గగనస్థుఁడైన చంద్రునివలె ప్రకాశించు చున్నాఁడు తన్ను పరివేష్టించిన నక్షత్రముల గుంపు, నయనానందకరముగా వికసించిన కలువలు, ఆ కలువలతో తారాగణములతో కూడుకొన్న ఉడురాజు తాను.

39. తేనఆ విమానముతో, అనంగసఖ మారుతసౌభగాసుమన్మథునికి ఇష్టుఁడైన వాయువుతో నేర్పడిన సౌందర్యము కలినట్టియు, ద్యుధునిపాత శివస్వనాసుగంగానది యొక్క పతననిమిత్తముగా నేర్పడిన శివంకరములైన శబ్దములతో కూడినట్టియు, అష్టలోకప విహార కులాచలేంద్రద్రోణిషుఅష్ట దిక్పాలకులకు క్రీడాస్థానమైన మహామేరువు గుహల యందు, సిద్దెఃనుతఃసిద్ధులచేత నుతింపఁబడుచున్నవాఁడై, లలనావరూధిఃఅనేక స్త్రీలతో కూడిన వాఁడైధనదవత్కుబేరునివలె, చిరం రేమెచాలకాలము క్రీడించెను.

తాత్పర్యము : ఆ విమానమందు దేవహూతితో కూడియాఁడు మేరు పర్వతము యొక్క మహా గుహల యందు క్రీడించినాఁడు. అవి అష్టదిక్పాలకుల యొక్క విహార స్థానములు. అక్కడి చల్లని గాలులు మన్మథునకు పరమేష్ఠము లైనవి. అవి ఆ గుహలయొక్క సౌందర్యమును రెట్టింపు చేయుచుండెను. అక్కడక్కడ ధారలై ప్రవహించుచున్న గంగాప్రవాహములు. వానిధ్వని హృదయమునకు ఉల్లాసము గూర్చునదై యుండెను. కర్దముని చుట్టు వేలకు వేలు విద్యాధరస్త్రీలు. సిద్ధు లెల్ల రాతని మహామహిమను పొగడుచుండిరి. ఈ విభవములతో నాతఁడు చాలకాలము దేవహూతితో క్రీడించినాఁడు.

40. రతఃఆమెయందు ప్రీతిగలవాఁడై, వైస్రంభకేవైస్రంభక మందును, స్వరసనేసురస యందును, నందనేఇంద్రుని ఉద్యానవనము నందును, పుష్పభద్రకేపుష్పభద్రకమందును మానసేమానస సరస్సునందును, చైత్రరథ్యే చచైత్రరథమందును, రామయాసహదేవహూతితోపాటు, సఃఅతఁడు, రేమేక్రీడించెను.

తాత్పర్యము : భార్యయం దధిక ప్రీతిగల ఆ కర్దముఁడు వైస్రంభకము, సురసనము, నందనము, పుష్పభద్రకము, చైత్రరథము అనిపేర్కొనగల దేవోద్యానము లందును, మానస సరస్సునందును విశేషముగా రమించెను.

41. భ్రాజిష్ణునా=ఎక్కువగా ప్రకాశించుచున్నట్టియు, కామగేన=తన ఇష్టమును అనుసరించి సంచరించుచున్నదియు, మహీయసా=మహిమతో గూడినదైన, అనిలఃయథా=వాయుదేవుఁడనునట్లు, లోకాన్=అనేక లోకములను, చరన్=తిరుగుచున్నవాఁడై, వైమానికాన్=విమానవాసులనందరినీ, నత్యగ్నేత=అతిక్రమించెను.

తాత్పర్యము : ఆ విమానము అనంతకాంతి కలది. తమ ఇష్టము వచ్చునట్లు నడచునది. దాని మాహాత్మ్యము చాల గొప్పది. ఆ దంపతులుదాని యందెక్కి వాయువువలె ఎల్లలోకములు సంచరించుచున్నారు. వారివైభవము విమానవాసుల కందరికీ ఆశ్చర్యముగా నున్నది.

42. తీర్థపదఃపాదముల నుండి తీర్థములు ప్రభవించినవను కీర్తిగల భగవంతుని యొక్క, వ్యసనాప్యయఃసమస్తదుఃఖములను నశింపఁజేయునట్టి చరణఃపాదము, యైఃఆశ్రితఃఎవరిచేత ఆశ్రయింపఁబడినదో, ఉదామచేతాసాం=సత్యమైన సంకల్పముతో కూడిన, తేషాం పుంసాం=ఆ పురుషులకు, దురాపాదనం=పొందుటకు అసాధ్యమైనది. కిం=ఏమి యుండును?

తాత్పర్యము : భగవంతుని పాదోదకమే సమస్తతీర్థములు. అట్టి భగవంతుని పాదము సమస్త వ్యసనములను దొలచునట్టి ప్రభావము కలది. అట్టి పాద మెవ్వరిచేత నాశ్రయింపఁ బడెనో వారికి పొందుట కసాధ్యమైన దేమున్నది? వారు సత్యసంకల్పులు. వారు ఏది కోరిన అది అగును.

43. స్వసంస్థయా యావాన్=ప్రకృతి యొక్క పరిధి ఎంత ఉన్నదో అంతవఱకును, బహ్వాశ్చర్యం=అనేకాశ్చర్యములతోకూడిన, భువఃగోళం=భూగోళమును, పత్న్యైప్రేక్షయిత్వా=భార్యయైన దేవహూతికిఁజూపించి, మహాయోగీ=మహాయోగియైన కర్దముఁడు స్వాశ్రమాయ=తన ఆశ్రమమునకు, న్యవర్తత=మరలి వచ్చెను.

తాత్పర్యము : కర్దముని యోగప్రభావ మనంతము. ఆతఁడు తన యోగశక్తితో ఆమి కనేక విధములైన ద్వీపములు, పర్వతములు, నదులు, బహువిధ దర్శనీయ స్థలములు చూపించినాఁడు, అవి అత్యాశ్చర్య నిలయములు. ప్రకృతిపరిధి ఎంతవఱ కున్నదో అంతవఱకు చూపించినాఁడు. ఇఁక చూడఁదగినది లేదు. మహాయోగియైన యాతఁడు ఆమెతో నాశ్రమమునకు తిరిగి వచ్చెను.

44. ఆత్మానం=తన్ను, (తనస్వరూపమును) నవధా విభజ్య=తొమ్మిదిగా విభాగించుకొని, సురతోత్సుకాం=సురతక్రీడలయం దుత్సాహముతో నున్నదియు, రామాం=రమింపచేయునదియునైన, మానవీం=మనుపుత్రిని, విరమయన్=ఎక్కువగా ఆనందింపజేయు చున్నవాఁడై, వర్షపూగాన్=అనేక సంవత్సరములను, ముహూర్తవత్=అల్పకాల మనునట్లుగా, రేమే=రమించెను.

తాత్పర్యము : దేవహూతి సురతోత్సుకురాలై యున్నది. ఆమె రమించుట కును, రమింపజేయుటకును సమర్థురాలై యుండెను. ఆమెను సంతోషపెట్టుటకై తన యోగశక్తితో తన్ను తొమ్మిదిగా విభాగించుకొన్నాఁడు ఆ రీతిగా ఆమెతో అనేక వర్షములు రమించెను. ఆ కాల మంతయు నిమేషములై గడచిపోయెను.

45. తస్మిన్ విమానే=ఆ విమానమందు, ఉత్కృష్టాం=శ్రేష్ఠమైనట్టియు, రతికరీం=రత్యుత్సాహమును వర్ధింపచేయునదైన శయ్యాం శ్రితా=శయ్య నాశ్రయించినదై, అపీచ్యేనపత్యా=సర్వసుందరుడైన భర్తతో, సంగతా=చేరియున్న మనుపుత్రి, తం కాలం=ఆ కాలమును నఅబుధ్యత=తెలియనే లేదు.

తాత్పర్యము : ఆ విమానమందు దేవహూతి రత్యుత్సాహము నెసకొల్పు శయ్య నధివసించెను. ఆ విమానము సర్వోత్కృష్టమైనది. కర్దమమహాముని సర్వసౌందర్యముల కెల్లగా కన్పించుచున్నాఁడు. ఆమె గడచిన యా కాలమును తెలియనే లేదు.

46. ఏవం యోగాను భావేన=ఈ ప్రకారము యోగశక్తితో, రమమాణయోః =రమించుచున్నవారును, కామలాలసయోః=కామోప భోగములం దత్యుత్కటమైన ఆశగలవారైన, దంపత్యోఃఆ దేవహూతి కర్దములకు, శరదశ్శతం=నూరువర్షములు, మనాక్=అత్యల్పమైన కాలమువలె, వ్యతీయుఃగడచి పోయినవి.

తాత్పర్యము : కర్దముని యోగ ప్రభావముతో నా దంపతులు నిత్యనూతనముగా విహరించుచుండిరి. వారి రత్యపేక్ష అత్యుత్కటమై యుండెను. రేపవళ్ళు దెలియుట లేదు. ఈ నిత్యములైన అనుభవములతో నూరు సంవత్సరములు గడచి పోయినవి. ఆ కాలమంతయు వారికి చాల అల్పమైన కాలమువలె కన్పించెను.

47. ఆత్మవిత్=ఆత్మ నెఱిగినవాఁడును, సర్వసంకల్పవిత్=అందరి యొక్క సంకల్పములను దెలిసివాఁడును, విభుఃదేనినైన నొనరించుటకు సమర్థుఁడైన ఆ యోగి, స్వంరూపం=తన రూపమును, నోధా విధాయ=తొమ్మిదిగా నొనర్చుకొని, తాం=ఆమెను, ఆత్మనా భావయన్=తనదేహముయొక్క అర్ధాంశముగా భావించుకొన్నవాఁడై, తస్యాం=ఆమెయందు, రేతఃరేతస్సును ఆధత్త=నిక్షేపించెను.

తాత్పర్యము : ఆ మహాత్మున కాత్మయొక్క ప్రభావము చక్కగా తెలియును. అతఁడు తన వీర్యమును తొమ్మిదిగా విభాగించి ఆమె యందు నిక్షేపించినాఁడు. అతఁడు సర్వసంకల్పములకు అధినాథుఁడు. యోగశక్తితో నేమైన చేయఁగలఁడు. తొమ్మిదిగా నిక్షేపింపఁబడిన రేతస్సు తొమ్మిదిమంది

కన్యకలుగా జన్మించినది. మరీచ్యాది మహర్షులకు ఇచ్చి కళ్యాణ మొనర్చఁదగిన తొమ్మిది మంది కొమార్తెలను కర్దముఁడు కనవలెనని బ్రహ్మయొక్క సంకల్పము. దానిని కర్దముఁడు తెలిసికొన్నాఁడు. అందుకే అతనిని సర్వజీవుల సంకల్పముల నెఱుఁగ సమర్థుఁడన్నది.

48. అతఃⁿ అందుచేత, సా దేవహూతిఃⁿఆ దేవహూతి, సద్యఃⁿఅప్పుడే, స్త్రియఃⁿ ప్రజాఃⁿస్త్రీ సంతానమును, సుషువేⁿకన్నది. తాఃⁿ సర్వాఃⁿవారందరు చారు సర్వాంగ్యఃⁿఅందములైన అంగములు గలవారు, లోహితోత్పల గంధయఃⁿఎఱ్ఱగలువల వంటి శరీర గంధము కలవారు.

తాత్పర్యము : కర్దముని సంగతితో ఆ దేవహూతి తొమ్మిదిమంది స్త్రీల నప్పుడే కన్నది. ఆ కన్యకల దేహములు సర్వసుందరములై యున్నవి. సమవిభక్తాంగములతో నా శరీరములు సర్వ మనోహరములై యుండెను. వారి శరీర గంధములు ఎఱ్ఱకలువల గంధమువంటివి. వారందరు ఒక్కనాఁడే జన్మించిరి. అట్టిదా కర్దముని యొక్క యోగ ప్రభావము.

49. 50. తదాⁿఅప్పుడు, ఉశతీనతీ సాⁿపరిశుద్ధమైన స్వభావముతో కూడినదియు పతివ్రత యైన దేవహూతి, పతీం ప్రవ్రజిష్యంతం ఆలక్ష్యⁿభర్తయైన కర్దముఁడు సంసారమును విడచిపోవనున్నాఁడని ఎఱిఁగినదై, స్మయమానాⁿచిరునగవుతో కూడినదియు, విక్లబేనⁿపారవశ్యముతో, విదూయతా హృదయేన ఉపలక్షితాⁿదుఃఖించుచున్న హృదయముతో కూడినదై, నఖమణిశ్రియ పదాⁿనఖము లనెడు రత్నములతో శోభించుచున్న పాదముచేత, భూమింలిఖంతీⁿనేలను గీరుచున్నదై, అధోముఖీⁿవంచఁబడిన తలగలదై,అశ్రుకలాంⁿదుఃఖ బాష్పములను, శనైఃⁿ నిరుధ్యⁿమెల్ల మెల్లగా నిరోధించుకొని, లలితాం వాచంⁿలలితమైన వాక్కును, ఉవాచⁿపలికినది.

తాత్పర్యము : దేవహూతి స్వభావము మహాపరిశుద్ధ మైనది. పతివ్రతలలో గొప్పది ఆమె. తన పతి ఇఁక సంసారమును వదలి పోఁబోవుచున్నాఁడు. ఆమె మనస్సు నాశ్చర్య మాక్రమించెను. హృదయము కర్తవ్యమూఢమైనది. దుఃఖ భరమాక్రమించినది. కన్నీటి నామె బలవంతముగా నణఁచి కొనెను. నఖము లనెడు మణులతో గొప్పగా ప్రకాశించెడు చరణముతో నామె భూమిని వ్రాయుచు లలిత లలితముగా నిట్లన్నది.

51. భగవాన్!ⁿసర్వసమర్థుఁడైన వాఁడా! ప్రతి శ్రుతం సర్వంⁿప్రతిజ్ఞచేసిన సమస్తమును, మయ్యంⁿనా కొఱకై ఉపోవాహⁿసంపాదించి పెట్టితివి. అథాఽపిⁿఅయినను, ప్రపన్నాయాఃⁿ మేⁿశరణాగతురాలైన నాకు, అభయం దాతుంⁿభయము లేనట్టి స్థితిని కల్పించుటకు, అర్హసిⁿతగుదువు.

తాత్పర్యము : దేవహూతి యన్నది. స్వామీ! నీవు సర్వసమర్థుడవు. మీరు వివాహ సమయమునచేసిన ప్రతిజ్ఞను నెరవేర్చితిరి. నీప్రయత్నమును నే నిపుడు గుర్తించినాను. కాని నాకే భయమును కలుగకుండ సంరక్షించి అనుగ్రహింప వలసినదని నిన్ను వేడుకొనుచున్నాను. మఱియొక జన్మము సిద్ధించుటయు దానితో మఱియొక భర్తను అన్వేషింపవలసిన ఆవశ్యక మేర్పడుటయు నాకు తటస్థింపని విధముగా నన్ను రక్షింపవలెనని సారము.

52. బ్రహ్మన్! ఓ బ్రహ్మజ్ఞానము కలవాఁడా! తుభ్యం=నీచేత, దుహితృభిః =బిడ్డలకు, సమాఃపతయఃసమానమైన రూపశీలములు గల భర్తలు, విమృగ్యాఃఅన్వేషింపఁదగినవారు. త్వయి=నీవు, వనం ప్రవ్రజితే=వనములకు వెళ్ళిన వాఁడవు కాఁగా, మే=నాకు, విశోకాయ=దుఃఖమేర్పడకుండుటకుఁగాను, కశ్చిత్ స్యాత్=ఒకానొకకుమారుఁడుండవలెను కదా!

తాత్పర్యము : ఓయి బ్రహ్మజ్ఞానీ! నీకు నేను విన్నప మొనర్పవలసిన విషయ మేదియును లేదు. నీవు సర్వజ్ఞుఁడవు. నీవు ప్రవ్రజితుఁడ వైనచో ఈ కన్యకల కనురూపుఁడైన వరుల నన్వేషింపవలసిన ఆవశ్యకత నాకుండును కదా! నీవే చేయఁదగిన దాపని. నీవు ఇప్పుడే ప్రవ్రజితుఁడ వైనచో నాకు జన్మాంతర దుఃఖమును పోఁగొట్టువా రెవ్వరు? సన్మార్గమును నాకు బోధించి పరమ పదమును ప్రాపింపఁ జేయుటకు ఉపకరించెడు సదుపదేశముఁజేయ నర్హుఁడు జ్ఞానియైన ఒక్కకుమారుని గూడ జనింపఁ జేయుటకు నీ వనుగ్రహించవలె. దీనితో వరాన్వేషణ దుఃఖము నాకు తొలఁగును. పునర్జన్మ బాధకూడ నశించును గదా!

53. విభో!=ఓ సమర్థుఁడా! ఇంద్రియార్థ ప్రసంగేన=ఇంద్రియములను తృప్తి పఱచుటకై విషయములు యందు తీవ్రేచ్ఛతో, పరత్యక్త పరాత్మనఃపరమాత్మను చింతింపకున్నట్టి, మే=నా యొక్క, వ్యతిక్రాంతేన= గతించి పోయినదైన, ఏతావతా కాలేన=ఇంతకాలముతో, అలం=చాలును.

తాత్పర్యము : ఇఁక భోగముల ననుభవించుట చాలును. నాకు వానియందు కాంక్ష తీరినది. ఇంద్రియముల నానందింపఁజేయునట్టి శబ్దాది విషయములందు మనస్సుంచుట చేత పరమాత్మధ్యానము నింతవఱకు ఉపేక్షించితిని. ఈ రీతిగా దినములు గడుపుట ఇఁక చాలును. ఇంత వఱకు ఆక్రమించిన విషయ లోలుపత జన్మకు హాని కలిగించునదని ఇపు డెఱిఁగి కొన్నాను. ఇఁక వానిపై మోహము లేదు.

54. ఇంద్రియార్థేషు=ఇంద్రియ విషయములయందు, సజ్జంత్యాఃమునిఁగినట్టియు, పరంభావం=నీయొక్క పరమభావమును, అజానంత్యా=తెలియని దాననై యున్న, మే=నాచేత, త్వయి=నీయందు, ప్రసంగఃసంసర్గము, కృతః

=చేయఁబడినది. తథాఅపి=అయినను, మే=నా యొక్క, అభయాయ=భయనివృత్తి కొఱకై, అస్తు=అగుఁగాక!

తాత్పర్యము : ఇంద్రియములను సుఖింపఁజేయు విషయముల యందత్యాసక్తి గలదానవై ఇంతవఱకు నిన్ను సేవించితిని. మోక్షమనెడు పరమపురుషార్థమును నా కనుగ్రహించుటకు సర్వసమర్థుఁడవైన వాఁడవను భావము నింత వరకు ఏర్పరచుకొనలేదు. నా దోషమును క్షమింపవలెను. సర్వోత్కృష్టుఁడైన పుత్రుని ప్రసాదించి నా కుభయవిధములైన దుఃఖమును పోఁగొట్టవలెను.

55. అధియా=విచారశక్తిలేని వానిచేత, అసత్సు=అసత్పురుషుల యందు, సంసృతేః హేతుః=సంసారకారణమైన, యః సంగః=సంపర్కము, విహితః =చేయఁబడునో, సాధుషుకృతః=సత్పురుషులయందొనర్పఁబడిన, స ఏవ, నిస్సంగత్వాయ=సర్వసంగనివృత్తి కొఱకై, కల్పతే=ఏర్పడుచున్నది.

తాత్పర్యము : అవివేకముతో అసజ్జనులతో సహవాస మొనర్చినచో అది మరల మరల సంసార దుఃఖమునే కల్పించును. అదే సాంగత్యము సజ్జనుల యం దొనర్చినచో నిశ్శేష సంసారక్లేశ నివారణ హేతువై యుండును. ఇది సామాన్యమైన విషయము. నీ యొక్కయు ఇతరుల యొక్కయు దుఃఖము నిశ్శేషముగా నశింపఁజేసి పరమానందము ననుభవించుటకును అనుభవింప చేయుటకును సమర్థుఁడైన నీయందు నే నొనర్చిన సంగము పరమానంద ప్రాప్తికి కారణమై తీరవలెను.

56. ఇహ=ఈ జగత్తునందు, యత్కర్మ ఎవని కర్మ, ధర్మాయ= ధర్మముకొఱకును, విరాగాయ=వైరాగ్యము కొఱకును, తీర్థపదసేవాయై= భగవత్పాదసేవ కొఱకును, న కల్పతే=సమర్థము కానేరదో, సః=వాఁడు జీవన్నపి= జీవించి యున్నను, మృతః హి=మరణించిన వాఁడే.

తాత్పర్యము : ఈ సంసారమందు ఎవని యొక్క కర్మ పుణ్యాభివృద్ధికి హేతువైన ధర్మము కొఱకు తద్వారా విషయవిరక్తి కొఱకును తన్మూలమున భగవత్పాద సేవను వర్ధించు కొఱకును ఉపయుక్తము కాదో వాఁడు జీవించియున్నను మరణించినవాఁడే. ఎందుకనఁగా వాని ప్రవృత్తి మరల క్లేశాను భవమునకే కారణమై ఏర్పడును. ఇట్టివాఁడు జీవించుట కంటె మరణించుట మేలు.

57. సా అహం=ఆ నేను, భగవతః మాయయా=నీ యొక్క మాయచేత, దృఢంవంచితా నూనం=ఎక్కువగా వంచింపఁ బడితిని. ఇది నిశ్చయము. యత్=ఎందుకనగా, విముక్తి త్వాం=మోక్షమునొసఁగ శక్తిగలవాఁడవైన నిన్ను,

ప్రాప్య=పొందియు, బంధనాత్=అజ్ఞాన సంబంధమునుండి, న ముముక్షేయ=విడివడకపోతిని.

తాత్పర్యము : నేను భగవన్మాయచేత గొప్పగా వంచింపఁబడితిని. ఇది నిశ్చయము. ఎందుకనఁగా మోక్షము నివ్వ సమర్థుడవైన నిన్ను పొందియు ఇంతకాలము సంసార బంధమునుండి విడిపించు జ్ఞానోపదేశము నీ నుండి పొందనైతిని. ఇది నా యజ్ఞానము. భగవంతుఁడు నాపై ప్రయోగించిన మాయా విలాసము.

విజయధ్వజ వ్యాఖ్య

1. పితృభ్యాం ప్రస్థితే సతి, ఇంగితకోవిదా, సాధ్వీ, ప్రభుం, భవం, భవానీవ వతిం ప్రీత్యా, నిత్యం, పర్యచరత్.

2. ఆత్మ శౌచేన=మనశ్శుద్ధితోను, ప్రభౌ, విస్రంభేన=మగనియందు భర్తతోనే సమస్తము సిద్ధించునను దృఢ విశ్వాసముతో, గౌరవేణ చ, దమేన చ, శుశ్రూషయా సౌహృదేన, మధురయా, వాచా, అతోషయత్.

3. కామం=విషయ సుఖములందు ఇచ్ఛను, దంభం=తనయందు లేనట్టి గుణములను తోపింపఁజేయవలెనను చాపల్యమును, ద్వేషం లోభం, అఘం=పాపమునందలి ఆసక్తిని, మదం=కులము మొదలైన అహంకారమును, విసృజ్య అప్రమత్తా, ఉద్యతా=ఎప్పుడును సేవయం దుద్యుక్తురాలై, తేజీయాంసం=అతీంద్రియ వస్తువులను కల్పించు శక్తిగల కర్దముని, నిత్యం అతోషయత్.

4.5. దేవర్షి వర్యః=దేవ ఋషులలో శ్రేష్ఠుడైన, సః, కృపయా పీడితః సన్, సమనువ్రతాం, దైవాత్=అదృష్టముతో దొరకిన, గరీయసః=శ్రేష్ఠుడైన, పత్యుః=మగఁడైన కర్దముని అనుగ్రహముచేత, మహాశిషః=సంతానము మొదలైన గౌరవములను, ఆశాసానాం, భూయసా వ్రతచర్యయా క్షామాం, కర్శితాం, మానవీం, తాం ప్రేమగద్గదయా వాచా అబ్రవీత్‌వై.

6. మానిని! మానదాయాః=మర్యాదను గల్గించునట్టి, తే, పరమయా, శుశ్రూషయా, పరయా, భక్త్యాచ, అహం, అద్య, తుష్టః బత! దేహినాం అతీవసుహృత్ యః అయం స్వదేహః సముచితం ప్రతి=స్నానము, అలంకారము, భోజనము మొదలైన కార్యములకై, న అపేక్షితః=నానుండి అపేక్షించలేదు.

యదర్థే=నాకు సంతోషమును కల్గించుటకే, క్షపితుం=కృశముగా నొనరించు కొనుటకు, అపేక్షితః=అపేక్షింపఁ బడినది.

7. తన సంతోష ఫలమును ప్రత్యక్షముగా చూపుచున్నాఁడు స్వధర్మ నిరతస్య=నా ధర్మమందు ఆసక్తుఁడును, తపస్సమాధి యోగవిజితాం=తపస్సు, మనస్సుయొక్క ఏకాగ్రత, మనస్సును విషయములనుండి దూర మొనర్చుకొనుట వీనిచేత సంపాదింపఁబడిన, తదను భావనయా=ఆ శ్రీహరి యొక్క నిరంతరోపాసనతో, ఉత్పన్నయా=పుట్టిన, భగవత్ప్రసాదాత్, అవరుద్ధం=నాకు వశముగా చేసికొన్న, యా=ఏ జ్ఞానము కలదో (జ్ఞానదృష్టియున్నదో) తాందృష్టిం ఏవ=ఆనాయందున్న జ్ఞానమునే, అభయం=సంసార భయమునుండి దూర మొనర్చునది, అశోకం=దుఃఖమును నాశ మొర్చునదియు, ప్రపశ్య=తెలిసి, సమీపమందే ఫలము కల్గుటచేత, తేవితరామి, 'మదను భావనయా' అనెడు పాఠాంతరముతో నన్ను ప్రతిదినమును సేవించుటనెడు ఉపాసనతో నీవు నానుండి ఉపదేశమును పొందుటకు అర్హురాలవైతి వనుచున్నాఁడు.

తాత్పర్యము : దేవహూతి! నీయతిశయమైన సేవ అనుపమమైన భక్తి వీనితో నాకు గొప్పసంతృప్తి ఏర్పడినది. ప్రాణులకు తమదేహమున కంటె ప్రియమైన పదార్థము వేరొకటిలేదు. అట్టి నీ దేహమును ఉచితరీతిని కాపాడుకొనక నాకొఱకై కృశముగ నొనర్చుకొంటివి. నాధర్మమును నిర్వహించుచు తపస్సు, సమాధి, శాస్త్రాధ్యయనము-వైరాగ్యము, వీనిచేత శ్రీహరిని మెప్పించి వాని యనుగ్రహముతో జ్ఞానమును సంపాదించినాను. వాని నిరంతరోపాసన ఫలమే, ఆజ్ఞానమునే నీసేవా ఫలముగా నీ కొసఁగుచున్నాను. దానిచే సంసార భయము దూరమగును. దుఃఖనాశ మేర్పడును. అది తొందరగా నీకు ఫలము నిచ్చును.

8. మోక్షము తప్ప తక్కిన పురుషార్థము లన్నియు నశ్వరములు. వానిని సంపాదించు కొనుటకై బహుళ పరిశ్రమలతో వేఱుసాధనము లొనర్పఁబనిలేదు. మోక్షమునకై సాధన లొనర్చునపుడు తక్కినవియు దొరకియే తీరు నను నభిప్రాయముతో చెప్పుచున్నాఁడు. లేక స్వర్గాదులను పొందు ఉపాయమును చెప్పిన మోక్షోపాయమునే ఉపదేశించుటకు కారణమేమి? చెప్పుచున్నాఁడు ఉరుక్రమస్య=సర్వోత్తమమైన పరాక్రమముగల, భగవతః, భ్రువః=కనుబొమల యొక్క ఉద్విజృంభ=వినాశ మొనర్చెడు నిచ్చచే, కదలించుటచేత, విభ్రంసితార్థరచనాః=నాశమొందిన విషయ భోగముల చమత్కారముగల, అన్యేపునః =మోక్షేతరములైన శబ్దాదులు, ఇతియత్=ఈ కారణముచేత, కిం=వానిని

సంపాదించుకొనెడు ఉపదేశముతో ప్రయోజనమేమి? త్వం సిద్ధాఅసి=మోక్షాదులైన సమస్త పురుషార్థములందును సిద్ధురాల వైతివి. విక్రియాభి రపి=అత్యంత వ్యయము, ఆయాసము వీనిచే సాధ్యములైన అశ్వమేధాది విశిష్ట క్రియలచేత గూడ, నరైః=మానవులచే, దురధిగాన్=పొందుటకు సాధ్యముకాని, నిజధర్మ దోహాన్=తమధర్మము నొనర్చుట కనుకూలమైన, దివ్యాన్=దేవలోకమునకు సంబంధించిన, విభవాన్, భుంక్ష్వ=అనుభవింపుము.

తాత్పర్యము : ఆ జ్ఞానమునే నీ సేవకు ఫలముగా నిచ్చుచున్నాను. దానితో సంసార భయము దూర మగును. దుఃఖము నాశ మగును. అది తొందరగా నీకు ఫలము నిచ్చును. స్వర్గాదిలోకములు నశ్వరములు. శ్రీహరి తన ఇచ్ఛతో వానిని నాశ మొర్చును. వానిని నాశ మొనర్పవలెనను ఇచ్ఛతో నాతఁడు కనుబొమ్మలు కదలించుటయే ఆలస్యము. ఇవియన్నియు నాశమగును. అందుచే అట్టిలోకములను సంపాదించు విద్యతో ప్రయోజనములేదు. నీవు మోక్షాది పురుషార్థములను పొందెడు సిద్ధిని పొందితివి. ధనవ్యయము దేహాయాసము మొదలగు వానిచే నొనర్చెడు అశ్వమేధాదులతో పొందశక్యముకాని సంపద లిచ్చుచున్నాను. వానితో స్వధర్మము నొనర్చుటకు దేవలోకమందలి సంపదలు నీ విచ్చట నుండియే యనుభవింపుము.

9. అబలా, అఖిలయోగమాయా విద్యా విచక్షణం=అన్ని విధములైన యోగసిద్ధు లనిపించుకొనెడు అణిమాది సిద్ధులతో సామర్థ్యము గలుగఁజేయు విద్యలందు కలుగజేయు, ఏవం బ్రువాణం, అవేక్ష్య గతాధిః ఆసీత్, ఏషా, వ్రీడావలోక విలసద్ధసితాననా సతీ, సంప్రశ్రయ ప్రణయ విహ్వలయా=వినయముతో కూడిన ప్రేమచేత నిలచి నిలచి బయల్వెడలుచున్న, గిరా ఆహ.

10. ద్విజవృష! ఏతత్=నీవు చెప్పిన ఇదియంతయు, రాద్ధంబత=సిద్ధమై ఉన్నది. విభో! హేభర్తః! అమోఘయోగ మాయాధిపే=నిష్ఫలముకాని యోగసిద్ధుల కధిపతియైన, త్వయి, తత్, ఈ సమస్త యోగసిద్ధులను, అవైమి, సతీనాం=పతి వ్రతలకు, వరీయసి=గుణవంతుఁడైన పతియందు ఏర్పడెడు అంగసంగము, గుణప్రసవః=గుణవంతులైన సంతానమును ఇచ్చుటచేత, యుఃఏ, తే=నీ యొక్క, సకృదంగ సంగః=ఒక్కసారి దేహసంబంధ మనెడు, సమయుఃప్రతిజ్ఞను అభ్యధాయి=చెప్పఁబడినదో, సుఃఅది, భూయాత్=ఏర్పడుఁగాక!

11. తత్ర=సకృదంగ నంగమునకై, యథోపదేశం=శాస్త్రోపదేశమునకు తగినట్లుగా, ఇతికృతం=ఇట్లిట్లు చేయుమని చెప్పెడి, ఉపశిక్ష=విద్యను ఉపయోగించుకొనుడు. తే=నీకొఱకై, కృతమనోభవ ధర్షితాయాఃఏర్పడిన మన్మథచేష్టతో నొచ్చినట్టి, ఏషుఃఅతిరిరంసయా=నీ నుండి ఎక్కువగా రమించవలెనను

ఇచ్ఛచేత, కర్శితః=కృశించిన ఆత్మనః=దేహము; యేన=ఏ విద్యను ఉపయోగించు కొనుటచేత, సిధ్యేత=సఫలమగునో, సకామః=అస్తు=ఆ యిచ్ఛను పరిపూర్తినొందఁ జేసికొందము. ఈశ! యత్ సదృశం=సార్వభౌముల పుత్రియైన నాకు యోగ్యమో, తత్ భవనం=అట్టి మహా సంపత్సమృద్ధిని, విచక్ష్వ=విద్యాసామర్థ్యముచేత నిర్మింపుము. అత్యంతము రమింపవలెనను ఇచ్ఛచేత నిన్నుద్దేశించి మన్మథునితో నొచ్చిన నాయొక్క, కామః=సుందరమైన, ఆత్మా=దేహము, యేన=ఏ విద్యచేత (ఏ సృష్టింపఁబడిన ఇంటిచేత) సిధ్యేత=సుందర మగునో అట్టి గృహమును ఏర్పరచుఁడు.

12. సమస్తేంద్రియములను విషయములనుండి మరలించుకొనివాని నన్నిటిని శ్రీహరియందే ఉంచుకొన్న వాఁడైనను కర్దముఁడు గొప్ప ఆశ్రిత వత్సలుఁడను నభిప్రాయమును వ్యక్త మొనర్చువాఁడై వ్యాసుఁడు భార్యయొక్క మాట నాదరించుచు తన యోగవిద్యాబలముతో ఇంటినొక్క దానిని సృష్టించెనని చెప్పుచున్నాఁడు. క్షత్తః=విదుర! కర్దముఁడు ప్రియాయాః ప్రియం, అన్విచ్ఛన్=పూరించెడు ఇచ్ఛగల వాఁడై, యోగం=ఎట్టి పద్ధతిలో నొనర్పఁబడిన శ్రీహరి ధ్యానముచే ఇష్టము సిద్ధించునో ఆ విధమైన శ్రీహరి ధ్యానమందు నిమగ్నుఁడై, కామగాం=తన ఇచ్ఛాను సారముగా నడచెడు, విమానం=పారాడు ఇంటిని, తర్హ్యేవ=అప్పుడే, ఆవిరచీకరత్=దృశ్యమగునట్లు ఒనర్చెను.

13, 14. వినువారికి భగవన్మహిమయను అతిశయమైన శ్రద్ధను గలిగించుటకై అప్రాకృతమైన విమానమును ప్రాకృతవిమానమువలె వర్ణించుచున్నాఁడు. అప్రాకృతమనఁగా మానవులచేత తయారుచేయఁబడని దని యర్థము. సర్వకామదుఘం, దివ్యం, సర్వచిత్ర సమన్వితం, సర్వర్ద్ధ్య పచయోదర్కం=అన్ని విధములైన సమృద్ధులను ఏకత్ర చేర్చుటచేత ఉత్కృష్టమైన, మణిస్తంభైః ఉపస్కృతం, దివ్యో ప స్కరణోపేతం -- ఉపస్కరణము లనఁగా పాత్రలు మొదలైనవి. దివ్య మనఁగా కుమ్మరి మొదలగు వారిచేత చేయఁబడని వని యర్థము, సర్వకాల సుఖావహం, పట్టికాభిః, విచిత్రాభిః, పతాకాభిః=ధ్వజములచే నలంకృత మైనది.

15. విచిత్ర మాల్యాభిః, మంజు, శింజత్, షడంఘ్రిభిః, ప్రగ్భిః, విరాజితం, దుకూల క్షౌమ కౌశేయైః, నానావస్త్రైః విరాజితం.

16. ఉపర్యుపరి విన్యస్త నిలయేషు, పృథక్, పృథన్, కశిపుభిః కాంతం, పర్యంకవ్యజనాసనైః.

17. తత్ర తత్ర ఁ క్షిప్త నానాశిల్పోప శోభితమ్, మహా మరకతస్థల్యాం, విద్రుమ వేదిభిర్జుష్టం.

18. ద్వార్షు, విద్రుమదేహళ్యా, భాంతం=భాసించుచున్న, వజ్రకవాటవత్, ఇంద్రనీలేషు, శిఖరేషు, హేమకుంభైః, అధిశ్రితం,

19. వజ్రభిత్తిషు, చక్షుష్మ త్పద్మరాగాద్యైః, చక్షుష్మత్=ప్రకాశ మానములైన, పద్మరాగాద్యైఃకెంపులు మొదలైన వానిచేత, నిర్మితైః, విచిత్రవైతానైః, మహార్హైః, హేమతోరణైః జుష్టం.

20. తత్ర తత్ర, కృత్రిమాన్, స్వాన్=నిజములని, మన్యమానైః =తెలిసికొనఁబడు, హంసపారావత వ్రాతైః, అధిరుహ్య, అవరుహ్యవికూ జితమ్.

21. యథోపజోషం=సుఖమున కనుకూలించునట్లు, రచితైః, విహారస్థానశయన సంవేశ ప్రాంగణాజిరైః, ఆత్మనఃమనుపుత్రికి, విస్మాపన మివస్థితం=ఆశ్చర్యము కలిగించునట్లున్నది.

22. ఈదృక్, తత్, గృహం న అతిప్రీతేన చేతసా పశ్యంతీం ప్రియాం=దేవహూతిని గూర్చి, సర్వభూతాశయాభిజ్ఞః, కర్దమః ప్రావోచత్.

23. నృణాం, ఆశిషాం ఆప్తయే, ఇదం తీర్థం, శుక్లకృతం=పరమాత్మచేత నిర్మింపఁబడినది. హేభీరు! అస్మిన్ నిమజ్జ ఇదం విమానం ఆరుహ.

24, 25. కువలయేక్షణా సా, భర్తుఃతత్, వచః, సమాదాయ=గ్రహించి, సరజంవాసః, బిభ్రతీ, వేణీభూతాన్, మూర్ధజాన్ బిభ్రతీ, మలపంకేన సంచన్నం శబలస్తనం అంగంచ బిభ్రతీ శివజలాశయం, సరస్వత్యాఃసరః అవివేశ.

26. సా, సరసి అంతఃవేశ్మస్థాఃసర్వాఃకిశోరవయసఃఉత్పల గంధయఃదశశతాని కన్యకాఃదదర్శ.

27. స్త్రియఃతాం, దృష్ట్వా, సహసా ఉత్థాయ, ప్రాంజలయఃవయం, కర్మకరీఃతుభ్యం కిం కరవామ, నఃశాధి ఇతి ప్రోచుఃః.

28, 29. మానద!=శత్రువుల అభిమానమును పోఁగొట్టుశక్తిగల విదురుఁడా! మనస్వినీం, తాం, మహార్హేణ, స్నానేన, స్నాపయిత్వా, అన్యే, నిర్మలే, నూత్నే, దుకూలే, వరీయాంసి ద్యుమంతి, పరార్ధ్యాని భూషణాని చ, సర్వగుణోపేతం, భక్ష్య భోజ్య చోష్య లేహ్యాము లనెడు అన్ని వంటకముల చేతకూడిన లేక షడ్రసములతో కూడిన, అన్నం, అమృతాసవం, పానం చ, దదుఃః.

30, 31, 32, 33, 34. అథ, స్రగ్వీణం, విరజాంబరం, విరజం, కృత స్వస్త్యయనం, కన్యాభిఃబహుమానితం, కృతశిరస్స్నానం, సర్వాభరణభూషితం, నిష్కగ్రీవం=కాసుల సరముతో కూడిన కంఠముగల, వలయినం, కూజత్కాంచన నూపురం, శ్రోణ్యాఃఅధ్యస్థయా, బహురత్నయా, కాంచన్యా కాంచ్యా, మహార్హేణ, హారేణ రుచకేన చ, అడ్డిగతోను భూషితం, సుభ్రువా, సుదతా శ్లక్ష్ణ స్నిగ్ధా పాంగేన, పద్మకోశస్పృధా, చక్షుషా, నీలైఃఅలకైశ్చ లసంతం, స్వం ఆత్మానం,

ఆదర్శే దృష్ట్వా, యదాఋషీణాం ఋషభం, దయితం, పతిం, సస్మార తదా సః ప్రజాపతిః, యత్ర, ఆస్తే, తత్రచ=అచ్చటనే, స్వయం చ=తానుకూడ, సహస్త్రీభిః, ఆస్తే=ఉన్నదైనది.

కులస్త్రీతు శిరస్స్నానం ఉత్సవే స్నాతు తైలతః,
వారే వా పైతృకే కర్మణ్యన్యధా కంఠ సంప్లవాః.

అను స్మృతి వచనము ననుసరించి ముత్తెదువలు పండుగలయందును లేక వారమున కొకసారి తైలాభ్యంగన మొనర్చవలెను. పితృశ్రాద్ధదినములందు తలనీటి స్నానము చేయవలెను. తక్కిన దినములలో కంఠము వరకే స్నానము.

35, 36, 37. యదా, సా, భర్తుః పురస్తాత్, స్థితం, స్త్రీసహస్ర వృతం, ఆత్మానం అద్రాక్షీత్. తథా తద్యోగ గతిం నిశామ్య, సంశయం=ఆశ్చర్యమును. ప్రత్య పద్యత=పొందినది. ఇచ్చట సంశయ మనగా సందేహ మని అర్థముకాదు. నిశ్చయమును గలిగించెడు ధర్మములు దుష్టములు కానప్పుడే సందేహ మేర్పడును. దేవహూతి మొదలే ఈ ధర్మములను ప్రేమగా చూచినది. అందుకే సందేహమున కాస్పదములేదు. కనుక భగవద్భక్తుడైన కరమని మహిమను జూచి ఆశ్చర్యము కలిగినదని తెలియవలెను. అమిత్రహన్=శత్రువులను సంహరించెడి ఓ విదురా! జాత భావః=భోగింపవలెనను అభిప్రాయమును పొందిన, సః, కృతామల స్నానాం=కశ్మలమును పోగొట్టెడి స్నానముచేసినట్టియు, అపూర్వవత్, విభ్రాజంతీం, సంవీత రుచిరస్తనీం, ఆత్మనః రూపం బిభ్రతీం, విద్యాధరీ సహస్రేణ సేవ్యమానాం, సువాససం, తాం, తద్విమానం, ఆరోహయత్=ఎక్కించెను.

38. జాతభావః అనిచెప్పిన దానిని వివరించుచున్నాడు అలుప్తమహిమా=గ్రామ్య కర్మమం దాసక్తుడైనను, మహిమ తగనట్టి, ప్రియయా అనుషక్తః, విద్యాధరీభిః, ఉపచీరవపుః=సేవింపబడిన శరీరముకల, ఉత్కచ కుముదణవా నపీచ్యః=ఉత్కృష్టమైన అధరామృతముగల, పదునారువర్షముల ప్రాయముగల, సః తస్మిన్ విమానే, తారాభిః, ఆవృతః, నభస్థః ఉడుపతి రివ బభ్రాజే. 'అలుప్త మహిమా' అనుటచేత 'సర్వేంద్రియాణాం జరయంతీ తేజః' అని శ్రుతిలో చెప్పినట్లు స్త్రీభాగము తక్కినవారికి సామర్థ్యము క్రుంగదీసెను కర్మని సామర్థ్యము క్రుంగదీయలేదని తాత్పర్యము. 'ప్రియయా అనుషక్తః' అనుటచేత మాహాత్మ్యము లోపమునకు కారణ మున్నదని చెప్పినట్లైనది. కాని లోపము కలుగలేదు 'విద్యాధ రీభిః' అనుటచేత సురతగృహమందు స్త్రీలే పరిచారికలని సూచించినాడు చంద్రుని విషయమందు అలుప్త మహిమా ఆనందమును కలించునట్టి సామర్థ్యము కలదని 'ప్రియానుషక్తః' ప్రీతిపాత్రమైన రోహిణీ నక్షత్రమంతో కూడిన ఉపచీరవపుః=కళలతో నిండిన శరీరముకల, ఉత్కచకుః=దోషహీనమైన, ఉద్గుణ పానోపీచ్యః=ఉత్తమమైన అమృతముయొక్క అలలచేత కూడిన, అమృతపూర్ణుడని యర్థము.

39. జలక్రీడా వనక్రీడాదులు సురతమున కవయవము లగుటచేత కర్దముఁడు వానినికూడ ననుష్ఠించెనని చెప్పుటతో 'కామగం' అని చెప్పుటచే ఈ రెండు శ్లోకములలో వివరించుచున్నాఁడు. లలనావరూధీ, సః, సిద్ధెర్ను తస్సన్, అనంగ సఖమారుత సౌభగాసు=మన్మథుని స్నేహితుఁడైన మారుతముచేత అత్యంత సుఖమును కల్గించునట్లు, ద్యుధుని పాత శివస్వనాసు, అష్టలోక పవిహార కులా చలేంద్ర ద్రోణీషు, తేన, ధనదవత్, చిరం, రేమే. గుహల కిచ్చిన రెండు విశేషణములచేత అవి మందానిలములచేతను శైత్యముచేతను కూడియుండి క్రీడించుటకు యోగ్యములని తెలిపి నట్లైనది.

40. ఇప్పుడు సువాసనను సూచించుచున్నాఁడు సః=ఆకర్దముఁడు రామయాసహా, వైస్రంభకే=వైస్రంభక వనమందును, స్వరసనే=నందనే, పుష్పభద్రకే=పుష్పభద్రకమను వనమంది, మానసే=మానస సరోవరము చుట్టు ప్రక్కల వనములందును, చైత్రరథేచ=చైత్రరథమను కుబేరుని వనమందును, రేమే=క్రీడించెను.

41. ఇతరుల విమానములు వారి వారి అధికారములకు లోఁబడిన ప్రదేశములందు మాత్రమే సంచరించును. కర్దముని విమానమునకు అట్టి నియమము లేదనుచున్నాఁడు. భ్రాజిష్ణునా, కామగేన, మహీయసా, విమానేన, లోకాన్ యథా అనిలః, చరతి, తథా చరన్, వైమానికాన్=విమాన సంచారులను, అత్యశేతే=మీఱిన వాఁడయ్యెను.

42. ఈ మహిమ కర్దమునకు సహజమైనది కాదు. శ్రీహరి యనుగ్రహముచేత ఏర్పడిన దనుచున్నాఁడు. యైః, వ్యసనాప్యయః, తీర్థపదః చరణాః, ఆశ్రితాః తేషాం, ఉద్దామచేతసాం, పుంసాం, దురాపాదనం, కిం.

43. మహాయోగీ స్వసంస్థయా, యావాన్, తావాన్, బహ్వాశ్చర్యం, భువః గోళం, వత్స్యై, ప్రేక్షయిత్వా=చూపించి, స్వాశ్రమాయ, న్యవర్తత.

44. మహాయోగీ, ఆత్మానం, నవధా విభజ్య=అనఁగా యోగశక్తితో తొమ్మిది దేహములను ధరించి, సురతోత్సుకాం మానవీం రామాంవిరమయన్= ఎక్కువగ రమించుచున్నవాఁడై, వర్షపూగాన్, ముహూర్తవత్ రేమే.

45. తస్మిన్ విమానే, రతికరీం, ఉత్స్రుష్టాంశయ్యాం, శ్రితా, అపీచ్యేన, పత్యా, సంగతా, సా, తం, కాలంచ=అనేక వర్షనమూహమైన ఆకాలమునే, న అబుధ్యత=గుర్తింప లేదు.

46. ఏవం, యోగానుభావేన, రమమాణయోః, కామలాలసయోః, దంపత్యోః శతం, శరదః, మనాక్ పూర్ణముగా, వ్యతీయుఃగడచినవి.

47. సర్వ సంకల్పవిత్=శ్రీహరియే సత్య సంకల్పుఁడని తెలిసి ఉపాసించునట్టియు, అందుచేతనే, ఆత్మవిత్=యథావత్తుగా పరమాత్మను

తెలిసిన, విభుఁ=యోగసిద్ధుఁడైన కర్దముఁడు, స్వం రూపం నవధా విధాయ తాం, ఆత్మనా, నవధా భావయన్=తొమ్మిదిరూపములు కలదని భావించి తస్యాం, రేతఃఅధత్త. శ్రీహరిని ఏ గుణ విశిష్టుఁడని ఎవ్వ రుపాసింతురో వారు వారి యోగ్యతకు తగినట్లుగా ఆ గుణముతో కూడిన వా రగుదురు. ఈ రీతిగా కర్దముఁడు శ్రీహరిని సత్యసంకల్పుఁడని భావించి తాను కూడ సత్యసంకల్పుఁడైనాఁడు. దీనితో ఆత్మజ్ఞానియైనాఁడని నిరూపించినట్లైనది. విభుఁ అనుటతో యోగశక్తితో తొమ్మిది రూపములుగా వ్యాపించి యుండిన శక్తి కర్దమునకు కలదని సూచించినట్లైనది. 'భావయన్నర్దమాత్మనఃఅనికూడ పాఠమున్నది. అప్పుడు తనభార్యను భావించుకొనుచు అని అర్థము చెప్పవలెను. "అర్ధోవాఏష ఆత్మనో యత్పత్నీ" అనెడు శ్రుతికూడ ఆత్మయొక్క అర్ధమనఁగా భార్య యనియే తెలుపుచున్నది.

48. తతఃతాఃభగవంతుఁడు ముందే చెప్పియున్న, స్త్రియఃప్రజాఃతొమ్మిదిమంది ఆడుబిడ్డలను, సద్యఃసుషువే. ఆ దేవహూతి ప్రసవించెను. తాఃసర్వాఃచారుసర్వాంగ్యఃలోహితోత్పల గంధయఃఅభూవన్.

49, 50. దేవహూతి ఈ ఆడుసంతానము యొక్క వివాహము, అంతేకాక ఒక కుమారుని కరుణించవలెనని ప్రార్థించుచున్నది. తదా, ఊతీం=కుమారుని నొక్కని ఆపేక్షించుచున్న, సతీం=పతివ్రతయైన, సాఁదేవహూతి, ప్రవ్రజిష్యంతం, పతిం, అలక్ష్య స్మయమానా=చిరునవ్వుతో విషయాభిలాషను సూచించుచున్నదై, విక్లబేన=ఏర్పడఁబోవు మగని ఎడబాటుతో నేర్పడెడు దుఃఖముతో, విదూయతా, హృదయేన, అధోముఖీ, నఖమణి శ్రియా, లిఖంతీ, అశ్రుకలాం, విమృజ్య, లలితాం, వాచం ఉవాచ, భూలేఖనముతో విషయాభిలాషను వ్యక్తపఱచెను. కామార్తులైన స్త్రీలు కాలిబొటనవ్రేలితో భూమిని లిఖింతురని కామశాస్త్ర ప్రసిద్ధమైన విషయము.

51. భగవాన్! పూజ్యుఁడైన నీవు, మహ్యాం, ప్రతిశ్రుతం, తత్పర్వం=దాని నంతయు, ఉపోవాహ, ఉపకార మొనర్చితివి. అథాపి, మే, అభయం మోక్షకారణమైన కుమారుని, దాతుం=ఇచ్చుటకు, అర్హసి=తగినవాఁడవు.

52. తుభ్యం=నీయొక్క, దుహితృభిఃబిడ్డలకు, సమాఃసదృశులైన, పతయఃవిమృగ్యాఃబ్రహ్మన్!=బ్రహ్మజ్ఞానివైన వాఁడా! త్వయి=నీవు, వనం ప్రవ్రజి తేసతి, మమవిశోకాయ, కుతఃస్యాదపి=అవునుకదా!"సచ్చిత్ స్యాత్" అనెడు పాఠములో సచ్చిదానందాత్మకుఁడైన శ్రీహరి నాగర్భమందు సంభవించునట్లుగా అనుగ్రహింపవలెనని యర్థము. "కశ్చిత్" అనెడు పాఠమందు కూడ ఇదే యర్థము. అపుడు సకారము ఛాందసమని తెలియవలెను.

53. ప్రభో! ఇంద్రియార్థ ప్రసంగేన=ఇంద్రియములకు విషయములైన శబ్దాదులందు బుద్ధినేర్పరచునట్టి, అత్యాసక్తిని, పరిత్యక్త పరాత్మనః =సర్వోత్తముడైన శ్రీహరిని మఱచిన, తే, వ్యతిక్రాంతేన కాలేన=గడచిపోయిన కాలముతో, అలం=ఇక చాలును.

54. గడచిపోయిన కాలము కూడ నాకు సార్థక మగుఁగాక అనెడు అభిప్రాయముతో అనుచున్నాఁడు. యద్యపి ఇంద్రియార్థేషు సజ్జంత్యాః సద్యః , భవతః=నీయొక్క, పరం=ఇతర విలక్షణమైన, భావం=యోగ మహిమను, అజానంత్యాః. మే, త్వయి, ప్రసంగః=విషయ సుఖమునకై సహవాసము, కృతః=చేయఁబడినది. తథాపి, సః=ఆ సహవాసము పరమ భగవద్భక్తుఁడైన నీచేత నగుటచే, మే అభయాయ అస్తు.

55. జ్ఞానపూర్వకముగాని సహవాసము మోక్షకారణ మెట్లగును అనఁగా దానినే విశేషముగా తెల్పుచున్నాఁడు. ధియా, అసత్సు, భగవద్భక్తుడు కాని వానియందు, విహితః, సంయోగః, సంసృతేః, హేతుః, సాధుషు కృతః, సవివ నిస్సంగత్వాయ కల్పతే, దీనితో సత్సంగము వైరాగ్య భక్తి జ్ఞానములను సృష్టించుటచేత మోక్షకారణ మని తెల్పినట్లైనది.

56. కేవల కర్మము క్షణికము జడము అగుటచేత కర్మయొనర్చువారికి అభీష్ట ఫలము నొసఁగనేరదు. అదే కర్మ సంత్సంగతితో నేర్పడిన శ్రీహరికి సమర్పించెడు బుద్ధిచేత కూడినదైనచో ముఖ్య పురుషార్థమైన మోక్షమునకు కారణమైనదని తెల్పినట్లైనది. ఇహ=ఈ కర్మ భూమియందు, యేన క్రియమాణం=ఏ పురుషుఁడొనర్చిన, యత్కర్మ ఏ కర్మ, ధర్మాయ=ధర్మమునకై, న కల్పతే=కారణము కాదో, తీర్థపద సేవాయై=పవిత్రపాదుఁడైన శ్రీహరిసేవకు, న=కారణము కాదో, సః=అట్టి కర్మ నొనర్చిన మనుజుడు, జీవన్నపి మృతః =ఇది శాస్త్రసిద్ధము.

57. అట్లైనచో ఒక్కసారి అంగ సంగమగుఁగాక యని విషయాభిలాషను చూపించినదెందుకు? దానిని వివరించుచున్నాఁడు. యా=ఏనేను, విముక్తిదం= మోక్షకర్తయైనట్టి, త్వాం=నిన్ను, ప్రాప్య=పొంది, బంధనాత్=సంసార బంధమునుండి, న ముముక్షేయ=ముక్తి నపేక్షించలేదో, ఆ కారణముచేత, సా అహం=అట్టి నేను, భగవతః=శ్రీహరి యొక్క, మాయయా=బంధక శక్తిచేత, దృఢం=బలముగా, వంచితా=వంచిత నైనాను, నూనం=అట్లని ఊహింతును. హ=ఇది సిద్ధము.

ఇతి శ్రీభాగవతే తృతీయస్కంధే త్రయోవింశోఽధ్యాయః.

అధ్యాయము - 23

కర్దమ ప్రజాపతి యోగ ప్రభావంబుచే విమానంబు గల్పించి భార్యతోఁ గూడి విహరించుట.

వ. ఇట్లు స్వాయంభువుండు దేవహూతిని గర్దముని వివాహంబుసేసి మరల చనినఁ దదనంతరంబ దేవహూతియుఁబతిభక్తి గలిగి భవునికి భవాని పరిచర్యసేయు తెఱంగునఁబతియ తనకు నేడుగడయుంగా నెఱింగి యమ్మునీంద్రుని చిత్త వృత్తి కొలఁది దినదినంబునకు భక్తి తాత్పర్యస్నేహంబులు రెట్టింపం బ్రియశుశ్రూషణంబులు గావింపుచు ననూన తేజోవిరాజిత యగుచుఁగామ క్రోధ దంభలోభాది గుణ విరహితయై శరీరశుద్ధి వహించి చతుర సౌహార్ద స్నేహంబులు గలిగి పతియ దైవంబుగా భావించి మృదుమధుర వచన రచనయై పతిభక్తి యేమఱక వర్తింప దైవయోగంబు నైననుం దప్పింప సమర్థుండైన కర్దముండు నిజసేవాయాస కృశీభూత దేహయై యున్న దేవహూతిం గరుణాతరంగి తాపాంగుండె కనుంగొని మంజుభాషణంబుల నిట్లనియె.796

ఉ. మానిత ధర్మమార్గ మహిమ స్ఫుట భూరి తపస్సమాధి వి
ద్యానిభృతాత్మ యోగ సముపార్జిత విష్ణు కటాక్షలబ్ధ శో
భానఘ దివ్యభోగబహుభద్ర వితానము లస్మదీయ సే
వానిరతిన్ లభించు ననివారణ నిత్తును దివ్యదృష్టియున్. 797

తే. నెలఁత! తదివ్య దృష్టి నన్నియును నీకుఁ
గానవచ్చు వీలోకింపు కమల పత్ర
నయను బొమముడి మాత్రన నాశమందు
నితరమగు తుచ్ఛభోగంబు లేమిచెప్ప! 798

సీ. అనుపమ రాజ్య దర్పాంధ చేతస్కులై
పాపవర్తనులైన పార్థివులకు
ధృతిఁ బొందరాని యీ దివ్య భోగంబులు
నీతి పాతివ్రత్య నిష్ఠజేసి
సంప్రాప్తములు నయ్యె సమత భోగింపుము
కార్యంబు సిద్ధించుఁగాక నీకు
ననుటయు నతివయు ననుపమ యోగమా
యా విచక్షణ శాలియైన కర్ద

తే. మునిఁ గనుంగొని విగతాధియును నపాంగ
కలిత లజ్జానతాస్య పంకజయు నగుచు
వినయ ప్రణయములంజేసి విహ్వలంబు
లైన పలుకులఁ బతికి నిట్లనియెఁ బ్రీతి 799

వ. అనఘా! అమోఘ యోగమాయా విభుండవు, సమర్థుండవునైన నీయందు నీయనుపమ దివ్యభోగంబులు గలుగుట నిక్కంబని యెఱుంగుదు. భవత్సంగతి నిన్నియును నాకుం గలుగు. ఐనను దేవా! నీవానతిచ్చిన సంతాన పర్యంతంబైన శరీర సంగమ సమయంబు చిత్తంబునం దలంచి భవదంగ సంగమంబు కృపచేసి మన్నింపుము. భవదీయ సంయోగ వాంఛా పరతం గృశీభూతంబైన యీ దేహం బే విధంబున మజ్జన భోజన పానసుఖంబులం బరితుష్టిం బొందు నట్టిమన్మనోరథంబ దీర్పఁ రతితంత్రంబగు కామశాస్త్ర ప్రకారం బుపశిక్షించి, యందులకు నుచితంబులైన వివిధాంబరాభరణ మాల్యానులేపన మందిరా రామ ప్రముఖ నిఖిల వస్తు విస్తారంబు గావించి నన్నుం గరుణింపు మనిన న మ్మహాత్ముండు నిజయోగమాయా బలంబునఁ దత్ క్షణంబు. 800

సీ. దివ్య మణిస్తంభ దీప్తిఁ జెన్నొందుచు
మరకత స్థలముల మహిమ దనర
వరవజ్ర కుడ్య కవాట శోభితములై
విద్రుమ దేహళీ వీథు లమరఁ
గొమరొప్ప నవశాత కుంభకుంభములపై
హరినీల శకల విస్ఫురణ మెఱయఁ
దగఁ బద్మరాగంపు మొగడలంఁ జెన్నొందు
వైదూర్య వలభులు వన్నె చూపఁ

తే. దరళతర ధూతకేతు పతాక లోలయ
మంజు శింజత్సమంచిత మధుప కలిత
సురచి రాలంబమాన ప్రసూనరాజి
మాలికల నొప్పు వివిధ గృహాళిఁ దనరి.

కం. మఱియును దుకూలచీనాం
బర కౌశేయాది వివిధ పటపరివృత మం
దిర సుభగాకారంబై
కర మొప్పు విచిత్ర పట్టికాలంకృతమై. 802

మ. లలితో ద్యాన వనాంత సంచరణ లీలాలోల హంసాళి కో
కిల పారావత చక్రవాక శుక కే కీందిందిరానీక ము
త్కలికం గృత్రిమ పక్షులన్ నిజ విహంగ శ్రేణియంచున్ గుతూ
హలియై పల్కుచు నాడుచుండుఁబ్రతిశాఖారోహణ వ్యాప్తులన్. 803

వ. వెండియు 804

కం. ఘనసౌధాంతరశయ్యా
సన కేళీగేహ కృతక జగతీధర శో
భన చంద్ర కాంత చారు భ
వన ఫలభరితావనీజవంతము లగుచున్. 805

కం. సకలర్తు శోభితంబును
సకల శుభావహము సకల సంపత్కరమున్
సకలోపభోగయోగ్యము
సకలేప్సిత కామదంబు సదలంకృతమున్. 806

వ. అగుచు నొప్పు దివ్య విమానంబు గల్పించి తదీయ సుషమా విశేష విచిత్రంబులు నిర్మించిన తాన తెలియంజాలని యద్భుత కర్మంబైన విమానంబు దేవహూతికిం జూపినం జూచి, య మ్మిద్ధియ సంతసింపకుండుట యెఱింగి, సర్వభూతాంత రాశయాభిజ్ఞుండును, సంతుష్టాంతరంగుండును నైన కర్దముం డిట్లనియె. 807

తే. అతివ! భగవత్కృతంబును నఖిలమంగ
ళాకరంబును నగు నీ జలాశయమునఁ
దవిలి గ్రుంకిన జంతు వితానములకుఁ
గామ్య ఫలసిద్ధి సేకుఱుఁ గాన నీవు. 808

కం. ఇ జ్జలముల నతిభక్తిని
మజ్జన మొనరించి యీ విమానము వేడ్కన్
లజ్జావతి! యెక్కవె! యని
బుజ్జగ మొనరంగఁ గర్దముఁడు వల్కుటయున్. 809

వ. విని యా కువలయాక్షి పతిసేవాయాస మలినాంబరయు, వేణీభూత శిరోజయు, ధూళిధూసరి తాతికృశీ భూతాంగియుఁ శబలస్తనయునై భర్తృనియోగంబున సరస్వతీ సలిల సంభూత జలచరాశ్రయంబగు బిందుసరోవరంబు ప్రవేశించి తజ్జలంబులఁ గ్రుంకు లిడు సమయంబునఁ దద్వాఃపూరమధ్యంబున రుచిర మందిరా వాసినులును, గిశోరవయఃపరిపాకశోభితలును, నుత్పల గంధులును నగు కన్యా సహస్రంబులు దేవహూతిం గనుంగొని యిట్లనిరి. 810

కం. తరుణీ! నీదు నియోగా
చరణల మిదె మేము నీకు సదమల భక్తిన్
బరిచర్య సేయ నేర్తుము
కరుణా కలితేక్షణములఁ గనుఁగొను మమ్మున్. 811

సీ. అని పల్కి డాసి యయ్యతివకు నభ్యంజ
నోద్వర్తనములు పెంపొనరఁ జేసి
మలయజ కర్పూర మహితవాసిత హేమ
కలశోదకంబుల జలకమార్చి
ధవళ వస్త్రంబులఁ దడియొత్తి సర్వాంగ
ధూపంబు లొసఁగి కస్తూరి నలఁది
మంజు శింజ స్మణిమంజీర కింకిణీ
కలరావ కలిత మేఖలలు పూన్చి

తే. కనక తాటంక ముద్రికా కంకణాది
సముచితానర్ఘ్య రత్న భూషణము లొసఁగి
భవ్య మల్యానులేప నాంబరము లిచ్చి
షడ్రసోపేత వివిధాన్న సమితిఁ దనిపి. 812

వ. మఱియుం గనక పాత్ర రచితంబులైన కర్పూర నీరాజనంబుల నివాళించి, రుచిరాసనంబునఁ గూర్చుండఁబెట్టి దర్పణంబు చేతికిచ్చినం దతతిఫలిత నిజదేహంబు గనుంగొని, కర్దముని మనంబునం దలఁచిన నతండునుం గన్యకా సహస్రంబును దత్క్షణంబునఁదన సన్నిధి నుండుటం జూచి, నిజభర్తృయోగమాయా ప్రభావంబున కద్భుతంబు నొందె. అంతఁ గర్దముండు కృతస్నానయైన దేవహూతిం గనుంగొని, వివాహంబునకు ముందటనే చందంబునం దనరుచుండె నా చందంబునం జెన్నొందు చుండుటకు నానంద భరితుండై, భార్యా సహితంబుగఁ దత్కన్యకా సహస్రంబు గొలువ నిజవిమానారూఢుండై తారాగణ పరివృతరోహిణీ యుక్తుండగు సుధాకరుంబోలి యొప్పుచుఁ దదనంతరంబ. 813

చ. చిరశుభమూర్తి య మ్మునిఁ యశేష దిగీశ విహార యోగ్యమున్
సురుచిర మంద గంధవహ శోభితమున్ నికట ప్రధాతు ని
ర్ఝర సరిదంబు శీతల తుషారమునై తనరారు మేరు కం
దరమున కేగి దేవవనితా యుతుఁడైన కుబేరు చాడ్పునన్. 814

మ. అమరోద్యాన వన ప్రదేశములు నవ్యారామ భూముల్ దళ
త్కుముదాంభోజ విభాసి మానససరః కూలంబులున్ మంజు కుం
జములున్ జైత్రరథంబు విస్ఫురిత విప్రంభంబునం జూచె నె
య్యమునన్ గర్దమయోగి కామగ విమానారూఢుఁడై చెచ్చెరన్. 815

వ. ఇవ్విధంబున సమస్త భూభాగంబును వాయువేగంబునం గలయం గ్రుమ్మరి, నిఖిల వైమానిక లోకంబు నతిశయించి (లోకంబులం జరించె) మోక్షదాయకుండు దీర్ఘపాదుండునగు పుండరీకాక్షుని సన్నుతించి సేవించు పుణ్యాత్ములకుం బొందరాని పదార్థంబులు గలవె? ఇట్లు కర్దముండు దేవహూతికి నిఖిల ధరాచక్రం బంతయుం జూపి, మరల నిజనివాసంబు నకుం జనుదెంచి కామకేళీ వినోదాత్మయైయున్న భార్య నుపలక్షించి రతిప్రసంగ వ్యాసంగంబుం గైకొని, బహువిధంబులైన యిష్టోపభోగంబుల బహువత్సరంబు లొక్కముహూర్తంబుగా జరుపుచు, నన్యోన్య సరసావ లోకనంబుల సముచితాలింగన సంభాషణంబులం గాలనిరూపణంబు సేయనేరక, శతవత్సరంబులు గడపితదనంతరంబ. 816

క. ముని వరుఁ డొకనాఁడిమ్ములఁ
దన నిజదేహంబు నవవిధంబులు గావిం
చి నయంబునఁ దద్వీర్యముఁ
దనసతి గర్భమున నవవిధంబుల నిలిపెన్. 817

కం. అదికారణంబుగాఁ బెం
పొదవిన మునివలన దేవహూతికిఁ గూతుం
డ్రుదయించిరి తొమ్మం డ్ర
మ్ముదితయు మది సంతసించె మునివరుఁడంతన్. 818

తే. సన్న్యసింపంగఁ గోరిన సతి యెఱింగి
యాత్మఁ బొడమిన సంతాప మగ్గలింపఁ
జింత వాటిల్లఁ జెక్కిటఁ జెయ్యిఁ జేర్చి
పదములను నేల వ్రాయుచుఁ బలికెఁ బతికి. 819

నీ. అనఘ! సంతాన పర్యంతంబు ననుఁగూడి
వర్తింతు ననుచుఁ బూర్వమునఁబలికి
కూఁ తుల నిచ్చితి కొమారార నిప్పుడీ
తరుణులు పతులను దమకుఁ దార
యరసి వర్తింతురో యని భీతి నొందెదఁ
గావున నీ పుత్రికలకుఁ దగిన
వరుల సంపాదించి పరిణయంబులు సేసి
తత్త్వసంహిత నాకుఁ దవిలి దెలుపు

తే. సుతునిఁ గృపనేసి ననుఁ గావు సుజనవినుత!
యర్థి సంసార దుఃఖంబు నపనయింప
నర్హుఁడవు నీవ కామమోహమున నింత
కాల మూరక పోయి నే గతియులేక. 820

చ. అపరతి పుట్టెనీ యిహసుఖానుభవంబుల యందు మున్ను నే
జపలతఁ గామభోగరతి సంగము గోరి మహాత్మ! నిన్ను న
చ్చపుఁదలఁ బొప్పఁగాఁ దెలియఁ జాలకయున్ వరియించుటన్ భవ
త్కృప ఫలియించె?ముక్తి నినుఁ గేవల భక్తి భజింపఁ గల్గదే? 821

వ. అదియునుంగాక. 822

చ. సమమతి నొప్పు సత్పురుష సఖ్యము సద్గతికారణంబు నీ
చమతి విలోల దుష్పురుష సఖ్యము దుర్గతి హేతు వంచుఁ జి
త్తమునఁ దలంచి యోగిజనతానుత! మిమ్ము భజింతుఁబ్రాణి సం
గమునుఁ బుణ్యపాపములు గైగొని పొందవె? యెట్టి వారలన్. 823

ఇది శ్రీపోతనామాత్య ప్రణీతంబైన ఆంధ్రభాగవతమున
ఇరువది మూఁడవ అధ్యాయము.

796. తదనంతరంబ=అటు తరువాత, భవాని=పార్వతి, తెఱంగున=విధముగా, పతి+అ=ఇచ్చటి అకారము ఏవకారార్థము అనగా పతియే అని యర్థము. ఏడుగడ=సర్వవిధములుగా నైన దిక్కు, రెట్టింపన్=రెండింతలు కాఁగా, అనూన తేజోవిరాజిత=తక్కువకాని తేజస్సుతో ప్రకాశించునది, సౌహార్ద ము=చక్కని హృదయము.

తాత్పర్యము : స్వాయంభువుఁడు దేవహూతిని కర్దమున కిచ్చి వివాహము చేసి మరలి పోయినాఁడు. దేవహూతి కర్దముల కాపుర మారంభమయినది. ఆమె శివునికి పార్వతి పరిచర్య చేయునట్లు భర్తయే తన కన్నివిధముల గతియని తెలిసికొన్నదై కర్దముని చిత్తవృత్తి అడుగడుగున కనుసరించుచుండెను. దినదినమున కామె కాతనియందు భక్తియు స్నేహము ఎక్కువగుచుండెను. ప్రియశుశ్రూషణములు గావించుచుండెను. శుశ్రూషణములతో పాటు ఆమె శరీరమున తేజ స్సభివృద్ధి చెందుచుండెను. కామక్రోధాదుల నామె జయించెను. చాతుర్యము, నౌహార్దము, స్నేహము అడుగడుగున కన్పించుచున్నది. ఆమె మాటాడినపుడంతయును మాధుర్యము తొణకిసలాడుచుండెను. ఒక్క నిమేషము పతిభక్తిని మఱచుట లేదు. కర్దముఁడు మహాతపస్వి. దైవయోగమునైన తప్పింప సామర్థ్యము కలవాఁడు. ఆతఁడు తన సేవతో కృశీభూత శరీరయైన ఆమెను చూచినాఁడు. అతని హృదయమందును కన్నులయందును కరుణ పొంపిరివోవు చుండెను. మధురభాషణములతో నిట్లన్నాఁడు.

797 మానిత=గౌరవింపఁదగిన, ధర్మ మార్గము యొక్క మహిమచేత, స్ఫుట=స్పష్టమైన, భూరి=ఎక్కువైన, తపస్సమాధి=తపస్సు నందు పట్టిన సమాధి. విద్యా=ఉపాసన, నిభృత=గాఢమైన, ఆత్మయోగ=యమనియమాది యోగములచేత, సముపార్జిత=సంపాదింపఁబడిన, విష్ణువుయొక్క దయాపూరిత కటాక్షములచేత లబ=పొందఁబడిన, శోభా+అనఘ=శోభచేత కూడుకొని, దివ్యభోగములచేత కూడిన, బహుభద్ర వితానములు=అనంతములైన శుభపరంపర, అస్మదీయసేవా నిరతిన్=నా యొక్క సేవయందలి శ్రద్ధచేత, లభించున్=నిన్నుపొందును. దివ్యదృష్టియున్ లభించున్=దివ్యదృష్టికూడ నీ కేర్పడును.

తాత్పర్యము : దేవహూతి గొప్పదైన ధర్మమార్గము ననుసరించుచున్నది. ఆ ధర్మమార్గ మహిమచేత నా తపస్సు చాల గొప్పగా భాసించుచున్నది. తపస్సుతో సమాధిని సంపాదించితిని. అంతేకాక ఉపాసనముగూడ నొనర్చినాను. యమ నియమాది యోగమార్గముల ననుష్ఠించితిని. ఈ మూటిని పరిపక్వ మొందించుకొని శ్రీహరి కరుణాకటాక్ష లబ్ధి నందినాను. దీనితో ఆ పరమపురుషుని దయతో ననేక విధములైన శుభసంతానములు నా కధీనము లైనవి. అవి యన్నియు నా సేవాభాగ్యముచే నీకు లభించును. అంతేకాదు. దివ్యదృష్టికూడ నీకు లభించును.

798. నెలత=ఓదేవహూతి, తద్దివ్యదృష్టిన్=నీకు లభించిన దివ్యదృష్టిచే, కమలపత్రనయనుఁడు=తామర రేకులవంటి కన్నులు గలవాఁడు, అట్టి శ్రీహరి యొక్క, బొమముడి మాత్రన=భ్రూచాలన మాత్రము చేతనే, తుచ్ఛభోగంబులు=తక్కువయైన భోగములు.

799. అనుపమ=సాటిలేని, రాజ్యదర్ప=రాజ్యపాలనముచే నేర్పడిన పొగరుచేత, అంధచేతస్కులై=గ్రుడ్డిదైన బుద్ధిగలవారై, పాపవర్తనులు=పాపములందు ప్రవృత్తి గలవారు, పార్థివులు=రాజులు, సమతన్=అన్నిటియందును సమానమైన బుద్ధితో, అతివ=స్త్రీ, అనుపమ యోగమాయా విచక్షణశాలి=సాటిలేని శ్రీమహా విష్ణువు యొక్క యోగమాయా ప్రభావము యొక్క తర తమభావము లెఱిఁగిన వాఁడు, విగత+అధియును=పోయినట్టి మనఃక్లేశము గలదై, కలిత=కూడుకొన్న, లజ్జా=సిగ్గుచేత, అనత=వంచఁబడిన, అస్యపంకజ=ముఖ పద్మము గలది, విహ్వలములు=తొట్రుపడుచున్నవి.

తాత్పర్యము : ఓ దేవహూతీ! నా కరుణచే నీకు ప్రాప్తమైన దివ్యదృష్టితో నాచేత సముపార్జింప బడిన దివ్యభోగము లన్నియు నీకు ప్రత్యక్షముగా కనపడును. వానిని గమనింపుము. లోకములం దెన్నియో భోగములున్నవి. అవి యన్నియు శ్రీహరి యొక్క భ్రూచాలన మాత్రముతో నాశన మగునవి. అవి యన్నియు తుచ్ఛభోగములు. వాని ప్రసక్తి అనవసరము. నేను సంపాదించిన భోగము లట్టివి కావు. రాజులు తమకుఁ దక్కిన రాజ్యాధి కారముచే మిగుల గర్వము నందెదరు. ఆ గర్వముతో వారి మనస్సులు అంధీభూతము లైనవి. అట్టివారికి నేను సముపార్జించిన దివ్యభోగములు సిద్ధించునవి కావు. అవి అనితర సాధ్యములు. అట్టి వన్నియు నీ పాతివ్రత్య మహిమచే నీకు సిద్ధించినవి. వాని నన్నిటిని సమాన బుద్ధితో భోగించుము. కానీ వానియందే లీనమై పోవలదు. ఎంత భగవత్కరుణా కటాక్షముతో సిద్ధించినను అవి యన్నియు మాయావిలాసము లని మరువరాదు సుమా". ఈ వాక్యములు కర్దముఁడన్నపుడు ఆమె నిన్నాళ్ళుగా బాధించుచున్న మానసిక వ్యథ తరిగిపోయినది. లజ్జా భావముతో నామె ముఖము వంచుకొన్నది. వినయము, ప్రణయము ఈ రెండు భావములతో నామె మాటలు తొట్రుపడుచున్నవి. ఆమె ఇట్లన్నది.

800. అనఘ=పాపములేనివాఁడా! అమోఘ=వ్యర్థముగాని, యోగమాయా విభుండు=యోగమాయ కధికారి యైనవాఁడు, అనుపమ దివ్యభోగములు=సాటి లేనివై లౌకికము లైన సామాన్య భోగముల వంటివికాక దేవతలు మాత్రమే అనుభవింపవలసినవి. నిక్కంబు=నిజము, సంగతి=సంబంధము సంతాన పర్యంతంబు=సంతాన మేర్పడుట అవధిగా గలది, కృశీభూతము=శుష్కించినది.

ఉపశిక్షించి=ఉపదేశ మిచ్చి, మాల్యములు=పూమాలలు, అనులేపనము=అంగ రాగము మొదలైనవి. నిఖిలవస్తు విస్తారము=సమస్త వస్తువుల యొక్క సముదాయము.

801, 804... వజ్రకుడ్య కవాటశోభితము=వజ్రములు తాపిన గోడలతోను ద్వారములతోను ప్రకాశించుచున్నది. నవశాతకుంభ కుంభములు=క్రొత్త బంగారు కుంభములు, వలభులు=మేడలు, తరళతర=చలించుచున్న, ధూత=పిల్ల వాయువులచేత చలింపఁజేయఁబడిన, కేతుపతాకలు=కేతువులు, పతాకములు.

తాత్పర్యము : ఓ నిష్పాపుఁడైన కర్దమమునీ! నీవు వ్యర్థముగాని సమస్తయోగ మాయల కధికారి వని యెఱుఁగుదును. నీయందు అనుపమములై కేవలము దివ్యులకు మాత్రమే ప్రాప్తించు అనేక భోగముల కలిమి నే నెఱుంగుదును. నీయొక్క సంబంధముచేత ఇవి యన్నియు నాకు ప్రాప్తించునని తెలియును. కానీ స్వామీ! సంతాన పర్యంతము నీతోడి శరీర సంగమము నాకుండునని వివాహ సమయమం దానతిచ్చితివి. ఆ శరీర సంగమము చిత్తమునఁ దలచుకొనుచు ఇన్ని దినములు ఓర్మిమై సహించియున్నాను. నీతోడి సంగమము నందలి ఇచ్ఛచేత శరీరము కృశీభూతమైనది. ఈ దేహము మజన భోజన సుఖములతో పరిపుష్టమై నీతోడి శరీర సంగమమునకు శక్తము కావలెను. ఆ తరువాత రతిరహస్య ప్రకారమైన కామశాస్త్రము నా కుపదేశించుము. నీ శరీర సౌఖ్యముల కనుగుణమైన వివిధాంబరములు, మాల్యములు, ఆభరణములు, అనులేపనములు, మందిరములు ఆరామములు మొదలైన నిఖిలవస్తు విస్తారము గావింపుము. నన్ను కరుణింపుము" అన్నది. ఆమె ఆమాటలన్నంతనే కర్దముఁడు నిజయోగ మాయా బలముతో నొక విమానమును సృష్టించినాఁడు మరకత స్థలములు జిగజిగ మనుచుండెను. గోడలకు వజ్రములు తాపి యుండెను. ద్వారములు వజ్రమయములై ఉండెను. కడపమాను లన్నియు విద్రుమ రత్నములతో చేసినవి. మేడలపైన బంగారు కుంభములు. వానికి చెక్కఁబడిన ఇంద్రనీల శకలములు. వాని పైభాగములు పద్మరాగమయములు. వైదూర్య మయములైన మేడలు. కేతువులు పతాకములు లలిత సమీర చాలితములై చలించుచున్నవి. ఆ విమానమునకు పూలమాలలు వ్రేలాడదీయఁబడి యుండెను. వాని వాసనలచే నాకర్షింపఁబడి తుమ్మెదలు చుట్టును తిరుగు చున్నవి. వాని ఝంకారములు కర్ణరమ్యములు. ఆ విమానమునందు అనేకములైన గదులు. ఆ గదులలో పట్టుచీరలు, చీనాంబరములు, వివిధములైన చెట్ల నారలతో తయారుచేయఁబడిన వస్త్రములు. లలితములైన ఉద్యానములు. వానిలో పారాడుచున్న హంసలు, కోకిలలు, పావురములు, చక్రవాకములు, చిలుకలు. ఈ పక్షు లన్నియు కృత్రిమము లైనవే. అడుగడుగునను శ్రవణపేయములై ఒప్పుచున్న తుమ్మెదల ఝంకారములు. ఈ కృత్రిమ పక్షులు నిజమైన పక్షులవలెనే కొమ్మకొమ్మకు ఎగురుచు క్రీడించుచున్నవి.

805. సౌధాంతర=మేడల యొక్క లోపల, శయ్యా+ఆసన=పడుకలు, ఆసనములు, కృతక జగతీధర=కృత్రిమముగా కల్పింపఁబడిన కొండలు.

806, 807. సకల+ఋతు=సకలర్తు=సమస్త ఋతువులచేత, శుభ+ఆవహము =శుభములను గలిగించునది, సకల+ఈ ప్సితకామదంబు=పొందవలెనని ఇచ్చించిన ఎల్ల కోరికలను వర్షించునది, సర్వభూతాంతర ఆశయ+అభిజ్ఞుండు =సమస్త భూతములందలి మనోభిప్రాయము లెఱిఁగినవాఁడు.

808. జలాశయమునన్=ఈ సరస్సునందు, కామ్యఫలసిద్ధి=కోరికలు సిద్ధించుట.

809, 810.. లజ్జావతి=సిగ్గుకలదానా! బుజ్జవము=బుజ్జగించుట.

తాత్పర్యము : ఆ విమానమందు గొప్ప సౌధము. దానిలో వివిధములైన శయ్యలు, ఆసనములు, కేళీగృహములు. ఆ విమానమందు అచ్చటచ్చట నిర్మింపఁబడిన కృతకములైన కొండలు, చంద్రకాంత చారుభవనములు, ఫలములచే నిండిన గొప్ప వృక్షములు. ఆ విమానమందు సకల ఋతువులును ఒక్కసారిగా తమ తమ ధర్మములను వెలయించుచుండెను. సకలశుభములను కలిగించునదది. సకల సంపత్కరము. సకలములైన కోరికలు సిద్ధింపచేయునది. ఇట్టి దివ్యవిమానము నాతఁడు తన తపశ్శక్తిచే కల్పించినాఁడు. ఆ విమాన విశేషములు వాని నిర్మించిన తనకే ఆశ్చర్యము గొల్పునవై యున్నవి. దానినాతఁడు దేవహూతికిఁ జూపినాఁడు. ఆమె ముఖముపై ఎక్కువ సంతోషము గన్పింపలేదు. కర్దముఁడు సకల భూతముల మనస్సుల నెఱిఁగినవాఁడు. ఆతఁడన్నాఁడు. అతివా! ఎదుటనున్న బిందుసరస్సును జూడు. అది భగవన్నిర్మితము. సకల మంగళావహము. దీనియందు మజ్జన మొనర్చిన జీవుల సకలార్థములు తీరును. కనుక నీవు దీని యందు స్నాన మొనర్చి ఆ విమానమందెక్కుము! ఆ దేవహూతి లజ్జావశయై వెనుకముందాడు చున్నది. ఆతఁడు ప్రణయ భరశీతలముగా పలుమా రామాట చెప్పెను. ఆమె శరీరము పతిసేవలో నిన్నాళ్ళుగా కృశించినది. కట్టిన గుడ్డయు మలినమై యున్నది. వెండ్రుకలు జడలుగట్టి యున్నవి. ఒడలి నిండ ధూళి. స్తనములు శబలములు. ఆమె భర్తృ వియోగముతో సరస్వతీనది యొక్కనీటిచే నేర్పడిన బిందు సరస్సు నందు ప్రవేశించి ఆ జలమునఁ గ్రుంకులిడెను. ఆ జలములలో నొక్క గొప్పదైన మందిరము. ఆ మందిరములోఁ గొందరు స్త్రీలు, వారు నవ యౌవనాంగులు వారి వేషము లపూర్వములై యున్నవి. సమస్త రుచిరములైన ఆభరణములు వారి శరీరములం దున్నవి. వారి దేహములనుండి ఉత్పల పుష్పముల సుగంధములు వెలికిఁ గొట్టుచున్నవి. సర్వతోరమ్య లైనవారు దేవహూతిని జూచి ఇట్లన్నారు.

811. నియోగాచరణలము=ఆజ్ఞ ననుసరించి వర్తించువారలము, కరుణా+కలిత+ఈక్షణములన్=దయతోకూడిన చూపులతో.

812. డాసి=సమీపించి, అభ్యంజన+ఉద్వర్తనములు=తల అంటుట, శరీరమున కంతయు నూనె రాచుట, మలయజ కర్పూర వాసిత హేమకలశోద కంబులన్=మలయజ=చందనము, కర్పూర=కర్పూరము వీనిచేత, మహిత=గొప్పగా, వాసిత=సుగంధముతో కూడిన, హేమకలశ+ఉదకంబులన్=బంగారు కలశంబుల నుండి స్రవించుచున్ననీటిచేత, తడియొత్తి=తడిపోవునట్లుగా తుడిచి, సర్వాంగ ధూపంబులు=శరీరమంతయు ధూపాది వాసనా ద్రవ్యములు, కస్తూరిన్+అలది=కస్తూరిపూసి, మంజు శింజన్మణి మంజీర కింకిణీ కలరావ కలితమేఖలలు-మంజు=మధురముగా, శింజత్=ధ్వనించుచున్న, మణిమంజీర= మణులుచెక్కిన పాదవలయము లందలి, కింకిణీ=గజ్జెల యొక్క, కలరావకలిత=అవ్యక్త మధురములైన ధ్వనుల చేతకూడిన, మేఖలలు, ఒడ్యాణములు, మంజు ఈరయతీతి మఞ్జీరః అని వ్యుత్పత్తి. కనకతాటంక=బంగారు కమ్మలు, ముద్రికా=ఉంగరములు, కంకణాది=కంకణములు మొదలైన, సముచిత=తగిన, అనర్ఘ్య రత్న భూషణములు=బంగారు సొమ్ములు.

813. కర్పూర నీరాజనంబులన్=కర్పూరముతోకూడిన దీపములతో, నివాళించి=హారతులిచ్చి, దర్పణంబు=అద్దము, కృతస్నాన=స్నానము చేసినది. రోహిణీయుక్తుండు=రోహిణిచేత కూడుకొన్నవాడు, చంద్రునకు రోహిణి చాల ప్రియమైన భార్య. 'శశినం రోహిణీ యథా' అని వాల్మీకి.

814. చిరశుభమూర్తి=ఎక్కువ శుభముతో కూడిన స్వరూపము కలవాడు. అశేష=సర్వులైన, దిగీశ=దిక్పాలకుల యొక్క, విహార యోగ్యమున్=విహరించుటకు తగినదానిని, సురుచిర=ఒప్పుచున్న, మందగంధవహ=మందములైన వాయువుల చేత, శోభితము=కూడినదానిని, నికట=సమీపమందలి ప్రధాతు=ధాతువులతో కూడిన, నిర్ఝర=నదీ -- గిరులనుండి జారెడు, సరిత్=ప్రవాహముల యొక్క, అంబు=నీటి యొక్క, శీతల=చల్లనైన, తుషారమునై=మంచుకలది, మేరుకందరము నకున్=మేరు పర్వతమునకు సంబంధించిన గుహకు.

815. అమరోద్యాన వన ప్రదేశములు=స్వర్గ వనభూములు, నవ్య+ఆరామ భూముల్=క్రొత్తవైన ఉద్యానముల యొక్క స్థలములు, దళత్=వికసించిన, కుముద=కలువలు, అంభోజ=పద్మములు వీనిచేత, విభాసి=ప్రకాశించుచున్న, మానస సరః కూలంబులున్=మానస సరస్సు తీరములను, మంజు కుంజములు= మనోహరములైన లతాగృహములు, చైత్రరథము=కుబేరుని ఉద్యానవనము, నెయ్యమునన్=ప్రేమతో, కామగ=ఇష్టము ననుసరించి పోయెడి, విమాన+ ఆరూఢుడై=విమానము నెక్కినవాడై.

తాత్పర్యము : ఆ పరిచారికలు దేవహూతిని సమీపించినారు. వారామె శిరోజములకు తైలము నంటిరి. కొందఱు సుగంధ తైలముతో దేహము

నంతయు మర్దించినారు. బంగారు కలశములలో నుండి జలములు వోసి స్నానము ఒనరింపఁజేసిరి. ఆ కలశోదకములు మలయజము కర్పూరము మొదలైన సుగంధ ద్రవ్యములతో వాసితము లైనవి. తెల్లని బట్టలతో తడి యొత్తినారు. సుగంధ ధూపములతో శిరోజముల నార్చిరి. శరీర మందంతయు కస్తూరి పట్టించిరి. చీర కట్టించి మేఖల గూర్చినారు. ఆ మేఖలకు చెక్కఁబడిన రత్నములు, వానితోడి చిరుగంటలు. ఆ గంట లవ్యక్తమధురముగా ధ్వనించు చున్నవి. వా రామెకు కమ్మలు తొడగిరి. ఉంగరములు పెట్టిరి. కంకణములు ధరింపఁజేసిరి. ఇంకను తక్కిన భూషలలంకరింపఁజేసిరి. ఆమె శరీరము సువర్ణ రత్నమయమై యున్నది. పూమాలలతో నలంకరించినారు. వెలలేని అంబరములు. షడ్రసోపేతములైన భోజనములు పెట్టిరి. రత్నపాత్రల యందు కర్పూరాదికముల నుంచి ఆ నీరాజనములతో నివాళు లిచ్చినారు. రుచిరాసనమునఁ గూర్చుండఁబెట్టి దర్పణము చేతికిచ్చిరి. దానియం దామె రూపము ప్రతిఫలించుచున్నది. ఆమె సర్వాంగ సౌందర్యము ఆమెయే నమ్మ లేకుండెను. అప్పు డామె కర్దమునిఁ దలంచెను. ఆతఁడు వెంటనే కన్యకా సహస్రముతో తన ఎదుటనే యున్నాఁడు. ఆతని యోగమాయా ప్రభావమునకు దేవహూతి ఆశ్చర్య మందినది. కర్దమ ప్రజాపతి జలకము లార్చిన దేవహూతిని జూచినాఁడు. వివాహమునకు ముందట ఎట్టిదిగా నుండెనో అట్లే యున్నది. భార్యా సహితముగా విమానము నెక్కెను. కన్యకా సహస్రము ఆతని వెంటనుండెను. కన్యకా సహస్ర పరివృతుఁడైన యాతఁడు రోహిణితో కూడిన చంద్రుని వలె దేవహూతితో ప్రకాశించినాఁడు. ఆతఁడు దేవవనితా యుక్తుఁడైన కుబేరునివలె ప్రకాశించుచుండెను. విమానము కదలినది. మేరు కందరములకుఁ బోవలెనని యాతఁడు ఇచ్చగించెను. అది అట్లే పోయెను. మేరుగిరి కందరములు లోకపాలురే విహరించుటకు తగినవి. అచ్చట గాలులు సుగంధ మాంద్యములతో నొప్పుచుండును. ఎక్కడ చూచినను పర్వత శిఖరములనుండి క్రిందికి జలజలపారు ప్రవాహములు. అవి శీతలములై మనస్సునకు శరీరమునకు సుఖమును కలిగించుచుండెను. ఆతఁడా విమానములో స్వర్గోద్యానమును చుట్టెను. క్రొత్త క్రొత్త ఆరామములు తిరిగెను. వికసించిన కుముదములు కమలములు గల మానస సరస్సు గట్టునందు సంచరించినారు. అచ్చట లతాకుంజములందు వారి విహారములు చెల్లెను. కుబేరుని యుద్యానవనమగు చైత్రరథమును ప్రవేశించినాఁడు. ఆతఁడు తలచిన చోటికంతయు ఆ విమాన మేగు చుండెను. సర్వవస్తు సమృద్ధమైయుండెను. వారి కేమి కొదువ? ఆ దంపతుల విహారములకు మితిలేదు.

816. కలయంగ్రుమ్మరి=బాగుగా తిరిగి, వైమానిక లోకంబున్=దేవతలనుగూడ, అతిశయించి=మించి, తీర్థపాదుండు=పుణ్య తీర్థముతో సమానములైన పాదములు కలవాఁడు, ధరాచక్రము=భూమండలము, ఉపలక్షించి=చూచి, రతి ప్రసంగ వ్యాసంగము=రతి సుఖముల ననుభవించుట, ఇష్ట+ఉపభోగంబులన్=ఇష్టము

వచ్చిన విహారములను, కాలనిరూపణంబు సేయన్ నేరక=ఇంతకాలము గడచిన దని చెప్పలేక.

817. ఇమ్ములన్=కోరికతో, నయంబునన్=ప్రియముగా.

818. పెంపు+ఒదవిన మునివలనన్=గొప్పవాడైన కర్దమునినుండి, ముదిత=స్త్రీ.

819.ఎఱింగి=తెలిసి, సంతాపము=దుఃఖము, అగ్గలింపన్= ఎక్కువకాగా, పాటిల్లన్=ఏర్పడగా.

820. సంతాన పర్యంతంబు=సంతాన మేర్పడువరకును, కొమరారన్= అందముగా, తమకుఁదార=తమకు తామే, అరసి వర్తింతురో=నెమకికొని పెండ్లి యాడెదరో, పరిణయంబులు సేసి=వివాహంబులు ముగించి, తత్త్వ సంహితన్=రహస్యమైన ఆత్మజ్ఞానమును, అపనయించు=పోగొట్టు.

తాత్పర్యము : ఈ రీతిగా ఆ దంపతులు సమస్త భూభాగమును వాయువేగముతో తిరిగిరి. వారి విహారములు దేవతలకు కూడఁ బొందనశక్యమై యుండెను. శ్రీహరి మోక్షదాయకుఁడు, ఆతని పాదములు గంగాది పుణ్య తీర్థములకు ప్రధానస్థానములు. అట్టి శ్రీమన్నారాయణుని పొగడి సేవించువారికి దుర్లభములైన పదార్థము లెచ్చట నుండును? ఈ రీతిగా కర్దముఁడుధరాచక్ర మంతయు చుట్టెను. మరల నిజనివాసమునకు వచ్చినాఁడు. అప్పుడు దేవహూతి ముఖమును చూచినాఁడు. ఆ ముఖము నందు కామకేళితో వినోదింపవలెనను ఇచ్ఛ కన్పడుచున్నది. ఆతఁడు వెంటనే రతిప్రసంగమునకు కోరుకొన్నాఁడు. వారికి రతిసుఖముతో దివారాత్రములు తెలియలేదు. అనేక సంవత్సరములు ముహూర్త మాత్రమునఁ గడచిపోయినవి. పరస్పర సరసావలోకనములు, సముచితాలింగనములు, సంభాషణములు. కాలమెంతైనదని వారికి తెలియుట లేదు. నూరు వర్షములు ఒక్క నిమేష మైనది. కర్దముఁడు ఒక్కనాఁడు తన దేహమును నవధా విభాగించు కొన్నాఁడు. ఆమె దేహమునందు తొమ్మిది రీతులుగా తనవీర్యమును నిక్షేపించెను. దానితో దేవహూతికి తొమ్మిది మంది కూతు లుదయించిరి. ఆమెకు సంతోష మైనది. కాని కుమారుఁడు లేఁడను కొఱత ఎక్కడో భాసించుచున్నది. కర్దముఁడు వివాహ సమయమున జేసికొన్న సమయము తీఱినది. ఆతని మనస్సు సన్యసింప కోరినది. ఆ విషయమును దేవహూతితోఁ జెప్పెను. ఆమె మనోదుఃఖమునకు మేరలేదు చెక్కిట చేయిఁ జేర్చుకొని పాదాంగుష్ఠమున నేల రాయుచు ఆమె యన్నది. "మునీ!సంతాన పర్యంతము మన వివాహము అను వర్తించునని అంటివి. మంచిదే. నా కందరినీ కూతులనే ఇచ్చితివి. వీరి వివాహాది కార్యములు నే నెట్లు

నిర్వర్తింపఁగలను? వారికి వారే అనురూపులైన వరులను వెదకికొని వివాహ మొందించుకొనలేరు కదా? ఈ విషయమున నాకు భయమగుచున్నది. దయచేసి నీ వింటనే యుండి వీరి కనుకూలురైన మగలను దెచ్చి వీరికి వివాహ మొనర్పవలెను. అంత మాత్రమే కాదు. నాకు తత్త్వ సంహిత నుపదేశించు ఒక్క సుతునికూడ అనుగ్రహింపవలెను. నీతోఁ గడపిన నూరువత్సరములును కామమునకే అంకితమై పోయినది. నాకు వానియందు రోఁతఁ బుట్టినది. నన్ను సంసారము నుండి కడతేర్చ సమర్థుఁడవు నీవే. నీవు సన్యసించుచున్నావు. కనుక నాకు తత్త్వోపదేశకుఁడైన ఒక కుమారుని ప్రసాదింపుము.

821..... అపరతి=కోర్కెలేక పోవుట, చపలతన్=చాపల్యముతో, కామభోగ రతిసంగము=కామమునకు పరాకాష్ఠయైన రతిని, అచ్ఛపుతలఁపు=స్వచ్ఛమైన జ్ఞానము, వరియించు=వివాహమాడు.

823. సమమతిన్=సమానమైన బుద్ధితో, సత్పురుషసఖ్యము=సత్పురుషుల తోడి చెలిమి, సద్గతికారణంబు=ఉత్తమగతికి కారణము, నీచమతిన్=తక్కువ బుద్ధితో, విలోల=చపలురైన, దుష్పురుషసఖ్యము=దుష్టులతోడిమైత్రి, దుర్గతిహేతువు=దుష్టమార్గమునకు కారణము, యోగిజనతానుత= యోగిజనులచేత నుతింపఁబడినవాఁడా! ఇక్కడ జనతా శబ్దము జనసమూహార్థకము.

తాత్పర్యము : స్వామీ! ఈ యిహ సుఖములందు నాకు విరక్తి జనించినది. ఇంతకు ముందు నేను నిన్ను సరిగా నర్థము చేసికొనలేకపోయితిని. వివాహ సమయమందుకూడ నీతోడి సౌఖ్యేచ్ఛయే నామనస్సును పూర్తిగా లోఁగొన్నది. కాని నీయోగమాయా ప్రభావము అమితాద్భుతము కలిగించినది. నా కన్నులు విచ్చికొన్నవి. హృదయము సత్యము తెలిసికొన్నది. నీపుదయా పరుఁడవై నా కామభోగేచ్ఛను దీర్చి సంతాన మనుగ్రహించితివి. నాకు ముక్తిని మాత్రము ఇవ్వఁజాలవని ఎట్లను కొందును? నీ దయతో నాకు ముక్తి మాత్రము ఎట్లు కలుగకుండును? సత్పురుషులు ద్వంద్వములందు సమానమైన బుద్ధికలవారు. వారితోడి సఖ్యము ఉత్తమ గతికి కారణ మగును. నీచులై చపలబుద్ధిగల దుష్టుల సహవాసము దుర్గతికి హేతువు. ఇది యందరికి తెలిసిన విషయమే. ఓ పరమయోగీ! నీ పాదములు పట్టుకొని వేడుచున్నాను. నన్నుత్తమగతి నందింపుము. దుష్టా దుష్ట సహవాసముతో పాపపుణ్యము లెట్టివారికిని సంక్రమించును కదా!

ఇది పోతనామాత్య విరచితంబైన ఆంధ్రభాగవతమున భాగవత సుధాలహరి వ్యాఖ్యానములో ఇరువది మూఁడవ యధ్యాయము.

చతుర్వింశోఽధ్యాయః

శ్రీమైత్రేయ ఉవాచ

శ్లో. నిర్వేదవాదినీ మేవం మనో ర్దుహితరం మునిః,
దయాళు శ్శాలినీ మాహ శుక్లాభివ్యాహృతం స్మరన్. 1

ఋషిరువాచ

మా ఖిదో రాజపుత్రీత్థ మాత్మానం ప్రత్యనిందితే,
భగవాం స్తేఽక్షరో గర్భ మదూరా త్సంప్రపత్స్యతే. 2

ధృతవ్రతా త్వం భద్రం తే దమేన నియమేన చ,
తపోద్రవిణదానైశ్చ శ్రద్ధయా చేశ్వరం భజ. 3

స త్వయారాధిత శ్శుక్లో వితన్వ న్మామకం యశః,
ఛేత్తా తే హృదయగ్రంథి మౌదర్యో బ్రహ్మభావనః. 4

శ్రీమైత్రేయ ఉవాచ

దేవహూత్యపి సందేశం గౌరవేణ ప్రజాపతేః,
సమ్యక్ శ్రద్ధాయ పురుషం కూటస్థ మభజ ద్గురుమ్. 5

తస్యాం బహుతిథే కాలే భగవాన్మధుసూదనః,
కార్దమం వీర్య మాపన్నో జజ్ఞేఽగ్ని రివ దారుణి. 6

అవాదయం స్తదా వ్యోమ్ని వాదిత్రాణి ఘనాఘనాః,
గాయంతి స్మ సుగంధర్వా నృత్యం త్యప్సరసో ముదా. 7

పేతు స్సుమనసో దివ్యాః ఖేచరై రపవర్జితాః,
ప్రసేదుశ్చ దిశ స్సర్వా అంభాంసి చ మనాంసి చ. 8

తత్కర్దమ్యాశ్రమపదం సరస్వత్యా పరిశ్రితమ్,
స్వయంభూ స్సాక మృషిభి ర్మరీచ్యాదిభి రభ్యగాత్. 9

భగవంతం పరం బ్రహ్మ సత్త్వే నాంశేశ్రతుహన్,
తత్వసంఖ్యాన విజ్ఞప్త్యై జాతం విద్వా నజ స్సరాట్. 10

సభాజయన్ విశుద్ధేన చేతసా తచ్చికీగితమ్,
ప్రహృష్యమాణై రసుభిః కర్దమం చేద మబ్యధాత్. 11

బ్రహ్మోవాచ

త్వయా మేఽపచితి స్తాత! కల్పితా నిర్వ్యళీకతః,
యన్మే సంజగృహే వాక్యం భవాన్ మానద మానయన్. 12

ఏతావత్యేవ శుశ్రూషా కార్యా పితరి పుత్రకైః,
బాఢ మిత్యనుమన్యేత గౌరవేణ గురో ర్వచః. 13

ఇమా దుహితర స్సామ్యా స్తవ వత్స సుమధ్యమాః,
సర్గ మేతం ప్రభావైస్తై ర్బృంహయిష్యం త్యనేకధా. 14

అత స్త్వ మృషిముఖ్యేభ్యో యథా శీలం యథారుచి,
ఆత్మజాః పరిదేహ్యద్య విస్తృణీహి యశో భువి. 15

వేదాహ మాద్యం పురుష మవతీర్ణం స్వమాయయా,
భూతానాం శే వధిం దేహం బిభ్రాణం కపిలం మునే. 16

జ్ఞానవిజ్ఞాన యోగేన కర్మణాం చోద్ధరన్ శిఫాః,
హిరణ్యకేశః పద్మాక్షః పద్మముద్రా పదాంబుజః. 17

ఏష మానవి! తే గర్భం ప్రవిష్టః కైటభార్దనః,
అవిద్యాసంశయగ్రంథిం ఛిత్వా గాం విచరిష్యతి. 18

అయం సిద్ధగణాధీశ స్సాంఖ్యాచార్యై స్సుసంమతః,
లోకే కపిల ఇత్యఖ్యాం గంతా తే కీర్తివర్ధనః. 19

శ్రీమైత్రేయ ఉవాచ

తా వాశ్వాస్య జగత్రస్ష్టా కుమారై స్సహ నారదః,
హంసో హంసేన యానేన త్రిధామ ప్రత్యపద్యత. 20

గతే శతధృతౌ క్షత్తః! కర్దమ స్తేన చోదితః,
యథోచితం స్వదుహితౄః ప్రాదా ద్విశ్వసృజాం తతః. 21

మరీచయే కలాం ప్రాదా దనసూయా మథాఽత్రయే,
శ్రద్ధా మంగిరసేఽయచ్ఛ త్పులస్త్యాయ హవిర్భువమ్. 22

పులహాయ గతిం యుక్తాం క్రతవే చ క్రియాం సతీమ్,
ఖ్యాతిం స భృగవేఽయచ్ఛ ద్వసిష్ఠాయాఽ ప్యరుంధతీమ్. 23

అథర్వణేఽ దదా చ్ఛాంతిం యయా యజ్ఞో వితన్యతే,
విప్రర్షభాన్ కృతోద్వాహాన్ సదారాన్ సమలాలయత్. 24

తత స్తు ఋషయః క్షత్తః! కృతదారా నిమంత్ర్య తమ్,
ప్రాతిష్ఠ న్నంద మాపన్నా స్స్వం స్వమాశ్రమ మండలమ్. 25

స చావతీర్ణం త్రియుగ మాజ్ఞాయ భరతర్షభ,
వివిక్త ఉపసంగమ్య ప్రణమ్య సమభాషత. 26

అహో పాపచ్యమానానాం నిరయే స్వై రమంగళైః,
కాలేన భూయసా నూనం ప్రసీదంతి హి దేవతాః. 27

బహూజన్మవిపక్వేన సమ్యగ్యోగసమాధినా,
ద్రష్టుం యతంతే యతయ శ్శూన్యాగారేషు యత్పదమ్. 28

స ఏష భగవా నద్య హేళనం నగణయ్య నః,
గృహేషు జాతో గ్రామ్యాణాం యస్స్వానాం పక్షపోషకః. 29

స్వీయం వాక్య మృతం కర్తు మవతీర్ణోఽసి మే గృహే,
చికీర్షు ర్భగవాన్ జ్ఞానం భక్తానాం మానవర్ధనః. 30

తాన్యేవ తేఽభిరూపాణి రూపాణి భగవం స్తవ,
యాని యాని చ రోచంతే స్వజనానా మరూపిణః. 31

త్వాం సూరిభి స్తత్త్వబుభుత్స యాఽద్ధా
సదాఽభివాదార్హణ పాదపీఠమ్,
ఐశ్వర్య వైరాగ్య యశోఽవబోధ
వీర్యశ్రియా పూర్ణ మహం ప్రపద్యే. 32

పరం ప్రధానం పురుషం మహాంతం
కాలం కవిం త్రివృతం లోకపాలమ్,
ఆత్మానుభూత్యానుగత ప్రపంచం
స్వచ్ఛందశక్తిం కపిలం ప్రపద్యే. 33

ఆస్మాభి ష్పృచ్ఛేఽద్యపతిం ప్రజానాం
త్వయాఽవతీర్ణ ఉతాప్తకామః,
పరివ్రజాం పదవీ మాస్థితోఽహం
చరిష్యే త్వాం హృది యుంజన్ విశోకః. 34

శ్రీభగవానువాచ

మయా ప్రోక్తం హి లోకస్య ప్రమాణం సత్యలౌకికే,
అథాఽజని మయా తుభ్యం యదవోచ మృతం మునే. 35

ఏత న్మే జన్మ లోకేఽస్మిన్ ముముక్షూణాం దురాశయాత్,
ప్రసంఖ్యానాయ తత్త్వానాం సమ్మతా యాత్మదర్శనే. 36

ఏష ఆత్మపథోఽవ్యక్తో నష్టః కాలేన భూయసా,
తం ప్రవర్తయింతుం దేహ మిమం విద్ధి మయా ధృతమ్. 37

గచ్ఛ కామం మయాఽఽపృష్టో మయి సన్న్యస్తకర్మణా,
జిత్వా సుదర్జయం మృత్యు మమృతత్వాయ మాం భజ. 38

మా మాత్మానం స్వయంజ్యోతి స్సర్వభూతగుహాశయమ్,
ఆత్మన్యే వాత్మనావ్వీక్షన్ విశోకోఽభయ మృచ్ఛసి. 39

మాత్ర ఆధ్యాత్మికీం విద్యాం శమనీం సర్వ కర్మణామ్,
వితరిష్యే యథా చాసౌ భయం చాతితరిష్యతి. 40

శ్రీమైత్రేయ ఉవాచ

ఏవం సముదిత స్తేనకపిలేన ప్రజాపతిః,
ప్రదక్షిణీకృత్య సుతం వనమేవ జగామ హ. 41

వ్రతం స ఆస్థితో మౌనమాత్మైక శరణోమునిః,
నిస్సంగో వ్యచరత్ క్షోణి మనగ్ని రనికేతనః.

మనో బ్రహ్మణి యుంజానో య త్తత్సదసతోః పరమ్,
గుణావభాసే విగుణ ఏకభక్త్యానుభావితే. 43

నిరహంకృన్నిర్మమశ్చ నిర్ద్వంద్వ స్సమదృక్ స్వదృక్,
ప్రత్యక్షశాంత ధీర్ధీరః ప్రశాంతోర్మిరివోదధిః. 44

వాసుదేవే భగవతి సర్వజ్ఞే ప్రత్యగాత్మని,
పరేణ భక్తి యోగేన లబ్ధాత్ముక్తబంధనః. 45

ఆత్మానం సర్వభూతేషు భగవంత మవస్థితమ్,
అపశ్య త్సర్వభూతాని భగవత్యపి చాత్మని. 46

ఇచ్ఛా శ్రీచ్ఛాద్వేషవిహీనేన సర్వత్ర సమచేతసా,
భగవద్భక్తి యోగేన ప్రాప్తా భాగవతీ గతిః. 47

ఇతి శ్రీమద్భాగవతే, తృతీయస్కంధే, చతుర్వింశోఽధ్యాయః.

1. నిర్వేదవాదినీం=విషయ వైరాగ్యమును గూర్చి మాట్లాడు చున్నదియు, శాలినీం=స్వభావముచేత శ్లాఘనీయురాలైన, మనోర్దుహితరం=మనువు యొక్క పుత్రియైన దేవహూతిని గూర్చి, దయాళుఃదయాయుక్తుడైన, మునిఃకర్దమఋషి, శుశ్లాభివ్యాహృతం=భగవంతుడు చెప్పిన మాటను గూర్చి, స్మరన్=స్మరించు చున్నవాడై, ఆహ=పలికెను.

తాత్పర్యము : దేవహూతి కేవల వైరాగ్య భావముతో మాట్లాడు చున్నది. ఆమె స్వభావముచేతనే శ్లాఘనీయమైన గుణములు కలది. ఆమె పై కర్దమునికి ఎంతయో దయ జనించినది. అప్పు డాతని మనస్సులో భగవంతుడు ప్రత్యక్షమై తనతో చెప్పిన "స్వాంశతో నీయందు జన్మింతును" అన్న మాటలు జ్ఞప్తికి వచ్చినవి. అతడన్నాడు - రాజపుత్రి! మనుపుత్రివైన ఓ దేవహూతీ!

2. అనిందితే=నిందింపఁబడని చరిత్రకలదానా! ఆత్మానం ప్రతి=నిన్ను గూర్చినీవు, ఇత్థం=ఈ రీతిగా, మాఖిదః=దుఃఖింపవలసిన పనిలేదు అక్షరః =నాశరహితుఁడైన, భగవాన్=శ్రీనారాయణమూర్తి అమూరాత్=చాల తొందరలోనే, తే గర్భం=నీ గర్భమును, సంప్రపత్స్యతే=చేరఁబోవుచున్నాఁడు.

తాత్పర్యము : కర్దముఁడన్నాఁడు. ఓ రాజపుత్రీ! దోషలేశమైనలేని చరిత్రకలదానా! నీవెంతో భాగ్యవతివి. అభాగ్యురాలివలె నిన్ను గూర్చి నీవు శోకింపకుము. నీ గర్భమందు త్వరలోనే పరమాత్ముఁడావిర్భవింప బోవుచున్నాఁడు. నేను నిన్ను వదలి పోవుటకు ముందే ఈ సంఘటన జరుగుచున్నది.

3. ధృతవ్రతా=ధరింపఁబడిన వ్రతాది నియమము కలదానవై, అసి= కాఁబోయెదవు. తేభద్రం=నీకు మంగళమగుఁగాక! దమేన= బాహ్యేంద్రియ నియమనము చేతను, నియమేన=ఆంతరికమైన నియమము చేతను, తపోద్రవిణ దానైశ్చ=తపస్సు, ధనత్యాగము, దానాదులు మొదలైనవానితో, శ్రద్ధయా చ=శ్రద్ధతోను, ఈశ్వరం భజ=పరమాత్మను భజింపుము.

తాత్పర్యము : ఓసీ! భాగ్యవతీ! భగవంతుఁడు నీయం దవతరించుటకు తగిన వ్రతాదు లనుష్ఠింపుము. బాహ్యేంద్రియ నియమములఁబాటింపుము. ఆంతరంగిక నియమము లవలంబింపుము. వీని నన్నింటినీ పరమ శ్రద్ధతో నిర్వహింపుము. నీయందు పరమాత్మ అవతరింపవలెనని భక్తితో ప్రార్థింపుము.

4. త్వయా=నీచేత, ఆరాధితః=పూజింపఁబడిన, శుక్లస్సః=శుద్ధసత్త్వ స్వరూపుఁడైన ఆ భగవంతుఁడు, మామకం యశః=నా యొక్క కీర్తిని, వితన్వన్=విస్తరింపజేయుచున్నవాఁడై, తే ఔదర్యః=నీ ఉదరమునుండి జనించిన వాఁడై, బ్రహ్మభావనః=బ్రహ్మానుభూతిని గూర్చి నీ కుపదేశించు చున్నవాఁడై, హృదయ గ్రంథిం=నీ హృదయమను గ్రంథి చుట్టుకొన్న అజ్ఞానమును, ఛేత్తా=ఖండింపజేయువాఁడగును.

తాత్పర్యము : ఓ దేవహూతీ! ఈ రీతిగా నీచే నారాధింపఁబడినవాఁడై శుద్ధసత్త్వ స్వరూపుఁడైన భగవంతుఁడు నీయందు జన్మింపఁబోవును. అతఁడు నీ కీర్తిని గూడ విస్తరింపజేయును. నీ యుదరము పవిత్రమైనఁ దగును. ఆ భగవంతుఁడు నీ హృదయమును గ్రంథివలె చుట్టుకొన్న అజ్ఞానమును పోకార్చి నిన్ను తరింపఁ జేయును.

5. దేవహూత్యపి=దేవహూతికూడ, ప్రజాపతేః=ప్రజాపతియైన కర్దముని యొక్క, సందేశం=ఉపదేశమును, గౌరవేణ=గౌరవభావముతో, సమ్యక్

శ్రద్ధాయ=చక్కగా విన్నదై, కూటస్థం=ఏ వికారమును లేని వాడును, గురుం=జ్ఞానప్రదుఁడును అయిన, పురుషం=పరమేశ్వరుని, అభజత్=భజించెను.

తాత్పర్యము : మైత్రేయుఁడన్నాఁడు. ప్రజాపతియైన కర్దముఁడిచ్చిన ఉపదేశమును శ్రద్ధాళువై దేవహూతి విన్నది. ఆమె సర్వవికారశూన్యుఁడును తనకు జ్ఞాన ప్రదుఁడు కాఁబోవు చున్నవాఁడును ఐన పరమేశ్వరుని శ్రద్ధగా భజించినది.

6. బహుతిథేకాలే=చాలదినములు గడచిన తరువాత, కార్దమం వీర్యం=కర్దమ మహర్షి యొక్క వీర్యమును, ఆపన్నఃపొందినవాఁడై, భగవాన్=భగవంతుఁడైన, మధుసూదనఃమధుసంహారకుఁడైన శ్రీమహావిష్ణువు, దారుణి=అరణియందు, అగ్ని రివ=అగ్నివలె, తస్యాం=ఆమెయందు, జజ్ఞే=జన్మించెను.

తాత్పర్యము : కర్దముఁడీ మాటలాడి చాలదినములు గడచినవి. అతని ఆదేశముఁ ననుసరించి ఆమె పరమాత్ముని సర్వకాలములందును నమ్రతతో భజించినది. చాలదినములు గడచిన తరువాత మధుసంహారకుఁడైన భగవంతుఁడు కర్దముని వీర్యమును భజించినవాఁడై అరణియం దగ్నివలె ఆమె గర్భమునుండి జన్మించెను. ఉపమానముతో సిద్ధించెడు నర్థమది. అరణియం దగ్ని ఎప్పుడును ఉన్నది. దాహాదులచేత తనశక్తిని ప్రకటింపఁ జేయకయే దాని యంతర్భూతముగా ఉండును. మథన మొనర్చు సమయమందు ప్రభారూపముగా బయటికి వచ్చి ప్రకాశించును. అపుడు కాష్ఠాదులను గూడ దహించును. అట్లే భగవంతుఁడు కర్దమ వీర్యమందు ప్రవేశించెనని చెప్పుట చేత దానికి పూర్వమందు లేఁడని శంకింపరాదు. భగవానుఁడు సర్వకాలము లందును, సర్వ వస్తువులయందును నిండియుండెను. కానియతఁడు నిర్వికారుఁడై యుండును. భక్తుల ననుగ్రహించుటకై కారుణ్య మాతని మనస్సులో మెదలి నపుడు బాహ్యముగా స్వరూపము ధరించి అవతరించును. ఒక దాని యందును లీనుఁడు గాక సర్వమునందును వ్యాపించి యున్న పరమాత్ముఁడు జన్మాదుల కొఱకు వికారము పొందవలసిన యవసరములేదు. ఈ యర్థమునే వ్యాసుఁడు వాడిన ఉపమానము దెల్పుచున్నది.

7. తదా=అప్పుడు. వ్యోమ్ని=ఆకాశమందు, వాద్యత్రాణి=వాద్యములు, అవాదయన్=శబ్దింపఁజేసెను. ఘనా ఘనాఃఅతిఘనమైన శబ్దములు, గంధర్వాఃగంధర్వులు, తం=ఆ భగవంతుని గూర్చి, గాయంతిస్మస్తుతిగీతములుపాడిరి. అప్సరసఃఅప్సరసలు, ముదా=సంతోషముతో, నృత్యంతి=నాట్యము లొనర్చు చుండిరి.

తాత్పర్యము : అపుడు దేవతలు దుందుభి మొదలైన వాద్యములు మ్రోయించిరి. ఆ వాద్యముల ధ్వని మేఘగర్జనములవలె ఉండెను. గంధర్వులు భగవన్మాహాత్మ్యము గాన మొనర్చిరి. అప్సరసలు సంతోషముతో నర్తన మొనరించిరి.

8. ఖేచరైఃదేవతలచేత, అపవర్షితాఃవర్షింప చేయఁబడిన, దివ్యాఃసుమనసఃదివ్యములైన కుసుమములు, పేతుఃపడినవి. సర్వాఃదిశఃసమస్తము లైన దిక్కులను, అంభాంసి చ= జలములను, మనాంసి చ=మనస్సులును, ప్రసేదుఃప్రసన్నము లైనవి.

తాత్పర్యము : ఖేచరులప్పుడు పుష్పములను వర్షించిరి. అవి దివ్యములు. వాని వాసనలును హృదయంగమములై ఉండెను. దిక్కులు ప్రసన్నములై ఉండెను. జలములు ప్రసన్నములై ఉండెను. అంతేకాదు. సకల జీవుల మనస్సులు కూడ ప్రసన్నములై ఉండెను.

9. సరస్వత్యాఃపవిత్రమైన సరస్వతీ నదిచేత, పరిశ్రితంచుట్టఁబడి యుండిన, తత్కర్దమాశ్రమ పదంఆ కర్దమ మహర్షి యొక్క ఆశ్రమస్థానమును, మరీచ్యాదిభిఃఋషిభిస్సాకంమరీచి మొదలైన ఋషులతో కూడ, స్వయంభూఃబ్రహ్మదేవుఁడు, అభ్యగాత్వచ్చి చేరెను.

తాత్పర్యము : పరిశుద్ధమైన సరస్వతీ నదిచేత పరివేష్టింపఁబడినది. బిందు సరస్సు. దాని సమీపముననే కర్దముని ఆశ్రమము. ఆ యాశ్రమమునకు మరీచ్యాది మహర్షులతోపాటు బ్రహ్మదేవుఁడు వచ్చెను.

10, 11. శత్రుహన్శత్రువులను సంహరించెడి వీరుఁడైన విదురా! సత్త్వేన అంశేనసత్వగుణము యొక్క అంశముతో, పరంబ్రహ్మపరబ్రహ్మ స్వరూపుఁడైన, భగవంతంభగవంతుఁడు, తత్త్వసంఖ్యాన విజ్ఞప్త్యైతత్త్వముల యొక్క నిరూపణమునకు సహాయముగా నున్న శాస్త్రమును విశేషముగా బోధింపఁదలచినవాఁడై, జాతంఅవతారమును స్వీకరించిన వాఁడై, యున్నాఁడని, విద్వాన్తెలిసికొన్నట్టి, స్వరాట్అజఃస్వయముగనే జ్ఞానస్వరూపుఁడైన బ్రహ్మదేవుఁడు, విశుద్ధేనచేతసాపరిశుద్ధమైన మనస్సుతోను, ప్రహ్వ్యమాణైఃసంతోషమునననుభవించుచున్న, అసుభిఃఇంద్రియములతోను కూడినవాఁడై, తచ్చికీర్షితంభగవంతుని యొక్క ఇచ్ఛను సభాజయన్అనుమోదించుచున్నవాఁడై, కర్దమంకర్దముని గూర్చి, ఇదంఇట్లుగా, అభ్యధాత్పలికెను.

తాత్పర్యము : శత్రువులైన ఇంద్రియములను జయించి యున్న ఓ విదురా! స్వయముగా జ్ఞాన స్వరూపుడైన బ్రహ్మదేవుడు అపుడు కర్దమాశ్రమమందు ప్రత్యక్ష మగుటకు ఆవశ్యక మేమో తెలుపుచున్నాను వినుము. సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడును, భగవంతుడును అయిన శ్రీహరి శుద్ధసత్త్వగుణమును అవలంబించి అవతరించి యున్నవాడనియు ప్రకృతి, మహత్తత్త్వము, అహంకార తత్త్వము అని ఈ విధముగా ఉన్న తత్త్వములను నిరూపించుటకును ఈశ్వరుని తత్త్వములనుండి వేరుగా నున్న వాడని నిరూపించుటకును ఉపకరించెడి సాంఖ్యశాస్త్రమును, భక్తులకు ఉపదేశించి అనుగ్రహించుటకై పుట్టిన వానినిగా పరమేష్ఠి ఎఱిగినాడు. అందుచే నాతడు లోకాను గ్రహమునకై ఏర్పడిన భగవంతుని కారుణ్యము నభినందించుటకై అచ్చటికి వచ్చెను. భగవదవతార స్వరూపమును వీక్షించి యానందించు ఆశయు నాతని కున్నది. అందుచే పరిశుద్ధమైన మనస్సుతో నాతడు వచ్చినాడు.. అతని నేత్రములు భగవద్దర్శనమునకై తహతహలాడు చుండెను. ఆ వచ్చిన బ్రహ్మదేవుడు కర్దమునితో నిట్లన్నాడు.

12. మేవాక్యం=నాయొక్క వాక్యమును, మానయన్=గౌరవించిన వాడవై, సంజగృహే ఇతియత్=తగినట్లుగా స్వీకరించితి వను టేదికలదో, మానదతాత! =గౌరవమును నాకిచ్చిన ఓవత్స!త్వయా=నీచేత, మే అపచితిః=నా యొక్క పూజ, నిర్వ్యళీకతః=కపటములేకుండునట్లుగా, కల్పితా=కల్పింపఁబడినది.

తాత్పర్యము : ఓవత్సా! కర్దమమునీ! నీవు నాయుపదేశమును అక్షరశః అనువర్తించితివి. దానిని కాపట్యము లేక యనుసరించితివి. ఇది నీవు నా కొనర్చిన మహత్తరమైన పూజ. నా వాక్యమును నీవు గ్రహించి ఆదరించుటయే నా కొనర్చిన సముచితమైన పూజ.

13. గురోర్వచఃగురువు యొక్క వాక్యమును, గౌరవేణ= ఆదరబహుమానము లతో కూడ, బాఢంఇతి=అట్లేయని సమ్మతిని తెలిపి, అనుమన్యేత=సమ్మతించి అనుష్ఠించుటయే, పుత్రైఃపుత్రులచేత, పితరి=తండ్రియందు, కార్యా=చేయుటకు యోగ్యమైన, శుశ్రూషా=ఉపచారము. ఏతావత్యేవ=ఇంతమాత్రమున్నది.

తాత్పర్యము : నాయనా! పితరులకు పుత్రులు చేయవలసిన గొప్పపూజ ఇది. అది ఏదనగా పితరుల యుపదేశమును ఆదరించుట, సమ్మతించుట, ఆ యుపదేశము ననుష్ఠించుట.

14. వత్స!=ఓ చిరంజీవి! సుమధ్యమాఃశోభనాంగులైన, తవ ఇమాఃదుహితరఃఈ నీయొక్క బిడ్డలు, స్వైఃప్రభావైఃతమ యొక్క ప్రభావముల చేత, ఏతం సర్గం=ఈ లోకమును, అనేకధా=అనేక రీతులుగా, బృంహయిష్యంతి= వర్ధింపఁజేతురు.

తాత్పర్యము : ఓ ఉత్తముఁడవైన కర్దమ మహర్షీ! సుందరాంగులైన ఈ నీపుత్రికలు తమ యొక్క మాహాత్మ్యముతో ఈ లోకసృష్టిని బహు విధములుగా నభివర్ధింపఁజేతురు.

15. అతఃఅందుచేత, త్వం=నీవు, ఆత్మజాఃపుత్రికలను, యథాశీలం యథారుచిశీలము అభిప్రాయము - వీని ననుసరించిన పద్ధతిలో, ఋషిముఖ్యేభ్యఃఉత్తమ ఋషులకు, అద్యపరిదేహిఇప్పుడొసఁగి వివాహముఁ జేయుము. యశఃకీర్తిని, భువిభూమియందు, విస్తృణీహివిస్తరింప జేయుము.

తాత్పర్యము : అందుచేత ఓయి కర్దమా! నీపుత్రికలను యోగ్యులైన మహర్షులకిచ్చి వివాహ మొనరింపుము. అపుడు వీరి శీలములు రూపములు ఇతోధికముగా శోభించును. ఈ మరీచ్యాది మహర్షుల కంటెను వీరికర్తులైన వా రెవ్వరుందురు? వీరికి కన్యాదాన మొనర్పుము. అప్పుడు నీకీర్తి లోకమం దెచ్చట జూచినను వెలుగొందఁ గలదు.

16. మునే!ఓ పరమర్షియైన వాఁడా! స్వమాయయాతన యొక్క మాయాశక్తి చేత, భూతానాంసమస్త భూతములకును, శేవధింకపిలం దేహంనిధితో సమానమైన కపిలవర్ణము కల దేహమును, బిభ్రాణంధరించియున్న, అద్యం పురుషంసర్వకారణుఁడైన ఆదిపురుషుఁడే, అవతీర్ణంఅవతరించినాఁడని, అహం వేదనే నెఱుఁగుదును.

తాత్పర్యము : సర్వలోకముల కాదికారణమైన భగవంతుఁడు తన మాయా శక్తి నంగీకరించినవాఁడై సర్వ ప్రాణులకును, పరమ పురుషార్థమును సాధించు చున్నవాఁడు కనుక వారి కవసరమైన ఒక మహానిధి వంటి కపిల దేహమును గ్రహించి భువికి వచ్చినాఁడు. ఈ విషయమును నే నెఱుఁగుదును.

17,18. జ్ఞానవిజ్ఞాన యోగేనపరోక్షము, అపరోక్షము అని రెండు విధములైన జ్ఞానమును, అష్టాంగయోగమును, ఉపదేశించి, కర్మణాంశిఫాఃఅనేక జన్మలందు అనుష్ఠింపఁబడిన కర్మముల వాసనలను, ఉద్ధరన్ఉత్పాతము నొనర్చుటకై, హిరణ్యకేశఃస్వర్ణచ్ఛాయగల కేశములతో కూడిన, పద్మాక్షఃతామరల వంటి నేత్రములు కల, పద్మముద్రా పదాంబుజఃకమల చిహ్నములతో కూడిన పాదములు గల, ఏషఃకైటభమర్దనఃఈ శ్రీమహావిష్ణువు, మానవిఓ మనుపుత్రీ! తే గర్భంనీ యొక్క గర్భమును, ప్రవిష్టఃప్రవేశించి నాఁడు. అవిద్యాసంశయగ్రంథింఅవిద్యచేతనేర్పడెడు సంశయము లనెడు ముడులును, ఛిత్వాఛేదించి, గాంచివిరిష్యతిభూమియందు సంచరించును.

తాత్పర్యము : ఓ మానవీ! జ్ఞాన విజ్ఞాన యోగములను, అష్టాంగాది యోగములను ఉపదేశించి అనేక జన్మ నిమిత్తములైన వాసనలను బోకార్చి

ప్రాణులను ఉద్ధరింపజేయు మహాత్ముడు నీ గర్భమునందు ప్రవేశించినాడు. అతడు హిరణ్యకేశుడు. పద్మలోచనుడు. అతని పాదములందు పద్మకలశ శంఖాది ముద్రలు. మధుకైటభులను సంహరించిన మహాత్ముడు నీ గర్భమం దవతరించినాడు. అవిద్యచేత నేర్పడెడు గ్రంథులను ఛేదించుచు ఆ పరమాత్ముడు ఈ భూమిపై సంచరించును.

19. అయం=ఈ దేవుడు, లోకే=ప్రపంచమందు, కపిల ఇతిఆఖ్యాం=కపిలుడను నామధేయమును, గంతా=పొందినవాడగును. సిద్ధగణాధీశః=సిద్ధగణములకు నియంతయై, సాంఖ్యాచార్యైఃసాంఖ్యశాస్త్రకర్తలైన ఆచార్యులకు, సుసమ్మతః =అనేకరీతుల గౌరవింపదగినవాడై, తే కీర్తి వర్ధనశ్చ=నీ కీర్తి నభివృద్ధినొందించు చున్నవాడై, (అగును).

తాత్పర్యము : ఓ మానవీ! నీయం దవతరించెడు కపిలాచార్యుడు సమస్త సిద్ధులను నడపించెడు నాయకుడగును. సాంఖ్యశాస్త్ర ప్రణేతలైన ఆచార్యులకు గురు వగును. ఈతనిచే నీకీర్తి పరంపరలై దిక్కులకు వ్యాపించును, లోకమందు కపిలుడని పేరు లభించును.

20. తౌ=ఆ దంపతులను, ఆశ్వాస్య=ఈ రీతిగా సమాధానపఱచి, జగత్రస్రష్టా=లోకస్రష్టయైన, హంసః=జ్ఞాన స్వరూపుడైన బ్రహ్మదేవుడు, కుమారైః =సనత్కుమారాదులతో కూడ, సహనారదః=నారద మహర్షితో కూడినవాడై, హం సేనయానేన=హంసవాహనముతో, పరంత్రిధామ=ఉత్కృష్టమైన స్వర్గమును గూర్చి, యయౌ=వెడలిపోయెను.

తాత్పర్యము : బ్రహ్మదేవుడు జ్ఞానస్వరూపుడు. సమస్తలోకములను సృష్టించినవాడు. అతని వెంట సనకాదు లుండిరి. నారదుడుకూడ ఉండెను. ఇట్లు ఆ దంపతుల నోదార్చి హంసవాహన మెక్కి, ఉత్కృష్టమైన స్వర్గలోకమును గూర్చి ప్రయాణము చేసెను.

21. క్షత్తః! ఓ విదురా! శతధృతౌ గతేసతి=బ్రహ్మదేవుడు వెడలిపోగా, తేనచోదితః కర్దమఃఅతనిచే ప్రేరేపింపబడిన కర్దముడు, తతః=అనంతరము, విశ్వసృజాం=లోకవృద్ధికరులైన మహర్షులకు, స్వదుహిత్రాఃతనయొక్క పుత్రికలను, యథోచితం=వారి వారికి తగినట్లుగా, ప్రాదాత్=ఒసగెను.

తాత్పర్యము : ఓయి విదురా! ఈ మాటలు పలికి బ్రహ్మదేవుడు తన లోకమునకు వెడలిపోయెను. అతనిచే ఆజ్ఞాపింపఁ బడిన కర్దమ మహర్షి లోకవృద్ధికరు లైన మహర్షులకు తన బిడ్డల నిచ్చి వివాహము చేసెను.

22, 23, 24. మరీచయే=మరీచి మహర్షికి, కళాం=కళయను నామెను, ప్రాదాత్=ఇచ్చెను, అథ=అనంతరము, అత్రయే=అత్రిమహర్షికి, అనసూయాం=అనసూయను (ప్రాదాత్), అంగిరసే=అంగిరో మహర్షికి, శ్రద్ధాం=శ్రద్ధ యనెడు కూతును, అయచ్ఛత్=ఒసగెను. పులస్త్యాయ=పులస్త్యునకు, హవిర్భువం='హవిర్భూ' అనెడు బిడ్డను, అయచ్ఛత్=ఇచ్చెను, యుక్తాం సతీం క్రియాం=మనస్సునందిష్ట పడుచున్న క్రియాదేవిని, క్రతవే=క్రతువున కొసగెను. పులహాయ గతిం అయచ్ఛత్=పులహునకు గతి నిచ్చి పెండ్లి చేసెను. భృగవే=భృగుమహర్షికి, ఖ్యాతిం చ అయచ్ఛత్=ఖ్యాతి యను నామె నిచ్చి పెండ్లి చేసెను. శాంతిం=శాంతి యను నామెను, అథర్వణే=అథర్వణుఁ డను మునికి ఒసగెను. యయా=దేనిచే, యజ్ఞః=యాగము, వితన్యతే=చేయఁబడునో, కృతోద్వాహాన్=పరిణయము అయినట్టియు, సదారాన్=భార్యలతో కూడినట్టి, విప్రర్షభాన్=ఆ బ్రాహ్మణ శ్రేష్ఠులను, సమలాలయత్=తగినట్లు గౌరవించినాఁడు.

తాత్పర్యము : కర్దముఁడు ఎవ రెవరికి ఎవ రెవరి నిచ్చెనని వివరించినాఁడు. కలాదేవిని మరీచి కిచ్చెను. అనసూయ నత్రి కిచ్చినాఁడు. శ్రద్ధాదేవికి భర్త అంగిరసుఁడు హవిర్భువును పులస్త్యుఁడు పెండ్లాడినాఁడు. అనురూపలైన గతిని పులహుడు చేపట్టినాఁడు. పతివ్రతయైన క్రియను క్రతువు పెండ్లాడినాఁడు. ఖ్యాతిని భృగుమహర్షి చేపట్టినాఁడు. అరుంధతి వశిష్ఠుని ధర్మపత్ని. యాగము చేయుటకై ప్రేరేపించెడి శ్రద్ధకు అధిష్ఠానదేవతయైన శాంతిని అథర్వణుఁడు వివాహమాడెను. అటు తరువాత బిడ్డలను అల్లుండ్రను కర్దముఁడు మధుర వాక్యములతో సన్మానించినాఁడు.

25. క్షత్తః=విదురా! తతః=అనంతరము, కృతదారాః=భార్యా స్వీకరణ మొనర్చిన, తే ఋషయః=ఆ ఋషులు, తం=ఆకర్ద ముని గూర్చి, నిమంత్ర్య=పోయి వత్తుమని చెప్పినవారై, నందం ఆపన్నాః=సంతోషమును పొందినవారై, స్వంస్వం ఆశ్రమ మండలం=తమతమ ఆశ్రమములను గూర్చి ప్రాతిష్ఠన్=బయలుదేరిరి.

తాత్పర్యము : మహర్షులందరును కర్దముని యుదార బుద్ధితో కృతదారు లైనారు వారందరి మనస్సులందును హర్షాతిరేక మేర్పడినది. పోయివత్తుమని చెప్పి మామతో సెలవు తీసికొని తమ తమ ఆశ్రమములను గూర్చి వారు పోయిరి.

26. సచ=ఆ కర్దమ మహర్షి, త్రియుగం=మూఁడు యుగములందు అవతరించినవాఁడును విబుధర్షభం=దేవ శ్రేష్ఠుఁడును, అవతీర్ణం=ప్రపంచ మందవతరించిన కపిల మహర్షిని నారాయణమూర్తిగా, ఆజ్ఞాయ=గమనించిన వాఁడై, వివిక్తే=ఏకాంతమందు, ఉపసంగమ్య=సమీపించి, ప్రణమ్య=నమస్కరించి, సమభాషత=సంభాషించెను.

తాత్పర్యము : తన గర్భమున జన్మించిన కపిలుఁడు త్రియుగము లందును అవతారమెత్తు నారాయణ మూర్తి. దేవతా శ్రేష్ఠుడైన వాఁడు ఈ సంగతిని కర్దముఁడు గ్రహించెను. ఏకాంతమందు కపిలమహర్షిని కలిసికొని నమస్కరించి ఇట్లు విన్నవించుకొన్నాఁడు.

27. స్వేః=అమంగళైఃతాముతా మొనర్చు కొన్న పాపములచేత, పాపచ్యమానానాం=ఎక్కువగా దహింపఁబడుచున్న వారిని గూర్చి, భూయసా కాలేన=చాలకాలమునకు, దేవతాఃదేవతలు, ప్రసీదంతి=జాలిచూపుచున్నారు. అహో!=ఆశ్చర్యము.

తాత్పర్యము : మానవులు తాము తామొనర్చి కొన్న కర్మల ఫలముగా దుర్గతుల ననుభవించుచుండిరి. అవి వారి దేహముల నాత్మలను గాల్చుచుండును. ఎన్నాళ్ళకో, ఎంతటి ఉపాసనతోనో దేవతలు వారి ననుగ్రహింతురు.

28, 29 బహుజన్మవిపక్వేన=అనేక జన్మలు అనుష్ఠించిన అనుష్ఠానములచేత పక్వము నందిన, సమ్యక్ యోగసమాధినా=చక్కగా సాధింపఁబడిన యోగ సమాధితో, యతయఃయోగులు, శూన్యాగారేషు=ఏకాంత స్థానములందు, యత్పదం=ఎవరియొక్క పాదమును, ద్రష్టుం=చూచుటకు, యతంతే=యత్నింతురో, సఃభగవాన్ ఏవ=ఆ భగవంతుఁడే, గ్రామ్యాణాం నఃప్రాకృతులైన మాయొక్క, హేళనం=నిస్సారతను న గణయ్య=ఏ మాత్రమును గణింపక, అద్యఃఇప్పుడు, గృహేషుమా ఇండ్లయందు, జాతఃపుట్టిన వాఁడైనాఁడు. యఃఎవ్వఁడు, స్వానాం=స్వకీయులైన వారి యొక్క, పక్షపోషకఃపక్షమును రక్షించువాఁడో.

తాత్పర్యము : దేవతా ప్రసాదము సిద్ధించిన దని తెలియు టెట్లు? సౌలభ్యలాభము పొందుటయే అని సూచించుచున్నాఁడు. మహాయోగులు అనేక జన్మలు భగవంతునికై తపింతురు. పలుజన్మలు ధ్యానయోగము ననుష్ఠింతురు. వారి సంస్కారమునకుఁ దగినట్లుగా భక్తియోగము ననుష్ఠింతురు. ఈ రెంటికినీ ఫలము సమాధియే. ఆ సమాధికి ఎన్నో జన్మలు పట్టును. ఇన్ని జన్మల ఫలములలో సమాధి సాధించి ఇతర జన్మముల సాధ్యముకాని భగవంతుని దర్శింతురు. అట్టి ఆ భగవంతుఁడే ప్రాకృతులైన మా గృహములందు నేఁడు సాక్షాత్కరించినాఁడు. అజ్ఞానులైన మా హేళనముల నాతఁడు గమనింపలేదు. భక్తుల యొక్క భక్తి నభివృద్ధి చేయుటకై యాతఁడు కరచరణములు ధరించి తిరుగుచున్నాఁడు.

30. స్వీయం వాక్యం=తా నాడినమాటను, ఋతం కర్తుం=సత్యముగా నొనర్చుటకు, మేగృహే=నా యింటియందు, అవతీర్ణోఽసి=జన్మించిన వాఁడవైతివి, భక్తానాం=భక్తులకు, మానవర్ధనఃగౌరవమును వర్ధింప చేయుచున్న,

భగవాన్=భగవంతుఁడవైన నీవు, జ్ఞానం=జ్ఞాన ప్రధానమైన శాస్త్రమును, చికీర్షుఃr
=వ్యాపింపఁజేయు తలంపుగలవాఁడవై (జన్మించితి వని భావము)

తాత్పర్యము : స్వామీ! నీవు నా కొసఁగిన వాక్యమును సత్యము ఒనరించుటకై యవతరించుటకు ఏ యోగ్యత లేని నా గృహమందు జన్మించి నావు. భక్తులకు గౌరవ మొసఁగుటయే నీ ధ్యేయము. జ్ఞానప్రధానమైన శాస్త్రమును వ్యాపింపఁ జేయుటకై నీ యీ ఆగమనము.

31. స్వజనానాం=స్వజనులైన భక్తులకు, యాని యాని రూపాణి=ఏ యే రూపములు, రోచంతే=రుచించునో, తాన్యేవ రూపాణి=ఆ యా రూపములే, అరూపిణిస్తవ=ఏ రూపమును లేని నీకు, అభిరూపాణి=యోగ్యము లైనవి.

తాత్పర్యము : ఓ భగవన్! నిజమునకు నీకే రూపమును లేదు. కానీ నీ కున్న చాపల్య మొక్కటే. భక్తుల నానందింపఁ జేయవలెను. వారి ననుగ్రహింపవలెను. అందుచేత ఏ యే రూపములను భక్తులు భావింతురో ఆ రూపము లన్నింటిని ధరించి పరమభక్తులను అనుగ్రహింతువు. ఆయా రూపములతో వారికి సాక్షాత్కరింతువు. కేవల జ్ఞానానంద స్వరూపుఁడైన నీకు నీవు గ్రహించెడు ఏ రూపమైన ఒక్కటిగనే యుండును. అందుచేత చతుర్భుజాలంకృతమైన నీ రూపమే శ్రేష్ఠమైనదనియు, ఇతరములు దానికంటె తక్కువైన వని భావించుటకు వీలులేదు.

32. సూరిభిఃr=అనుభవము గలిగిన తత్త్వజ్ఞానులచేత, తత్త్వబుభుత్సయా
=తత్త్వమును తెలిసికొనుట కుపయోగపడెడు, శాస్త్రమును వ్యాపింపచేయుటకు సదాభివాదార్హణపాదపీఠం=నిరంతరమును నమస్కరించుటకు యోగ్యమైన పాదపీఠము కలిగినట్టియు, ఐశ్వర్య వైరాగ్య యశోవబోధ వీర్యశ్రియాపూర్ణం
=ఐశ్వర్యము, వైరాగ్యము యశస్సు, అవబోధము, వీర్యము ఈ ఆరు గుణములచేత పూర్ణస్వరూపుఁడైన, త్వాం=ఆ భగవత్స్వరూపుఁడవైన నిన్ను, అహం=నేను, శరణం ప్రపద్యే=శరణమును పొందెదను.

తాత్పర్యము : తన కుమారుఁడుగా కపిల మహర్షి, సాక్షాత్ శ్రీహరి యొక్క అవతారమని నిశ్చయించుకొన్న కర్దముఁడు ఆతనిని శరణుఁ బొందుచున్నాఁడు. ఇహలోకమందు అనుభవించుట కర్హములైన సుఖములను శరీర నాశానంతరము మోక్షమును భక్తుల కనుగ్రహించెడు భగవంతుని మాహాత్మ్యమును సూచించుచు స్తుతించుచున్నాఁడు. నిత్యా నిత్య వస్తువులను వేర్పరచి అర్థ మొనర్చుట కుపయోగించుచున్న వివేకము కలవారిచేత ప్రకృతి

పురుషుడు, జీవుడు ఈశ్వరుడనెడు తత్త్వములను సరిగా నిర్ధారించుట కుపకరించుచున్న శాస్త్రము నావిష్కరించుటకై నీ యవతారము. సర్వులచేత నిత్యము నమస్కరింపదగిన పాదపద్మములుగల ఓ స్వామీ! ఐశ్వర్యము, విషయ వైరాగ్యము, లోకమును పరిశుద్ధ పఱచుట కుపయోగించుకీర్తి, నిత్యమైన జ్ఞానము, అనశ్వరమైన వీర్యము, అచింత్యమైన సంపత్తు ఇవి నీ స్వభావములు. వీనితో పరిపూర్ణుడవైన నీ పాదపద్మములను శరణుఁ జొచ్చుచున్నాను.

33. పరం=ప్రపంచము నతిక్రమించియు, ప్రధానం=ప్రకృతి స్వరూప మయ్యును, పురుషం=ప్రకృతియొక్క అధిష్ఠానమునగను, మహాంతం=మహత్తత్త్వ రూపమయ్యును, కాలం=ప్రకృతిని క్షోభింపజేసెడు కాలస్వరూపమయ్యును, త్రివృతం=త్రిగుణములతో కూడిన అహంకారమయ్యును. లోకపాలం=లోకపాల స్వరూపమునగను, ఆత్మానుభూత్యా=సంకల్పరూపమైన జ్ఞానముచేత, అనుగత ప్రపంచం=తనయందులీనమైన ప్రపంచముతో నున్న, స్వచ్ఛందశక్తిం=స్వాధీనమైన శక్తులతో కూడియున్న, కపిలం=కపిలస్వరూపుడవైన, నిన్ను ప్రపద్యే=నిన్ను శరణుఁ జొచ్చెదను.

తాత్పర్యము : స్వామీ! నీవు ప్రపంచ ధర్మముల కతీతుడవు. అందుచేత పరుడవు. ప్రకృతియొక్క పరిణామముతో చేరియున్నవాడవు. కనుక నీవు ప్రధానమే. ఈ ప్రకృతి పరిణమించుటకు కావలసిన శక్తిని నీ వొసఁగెదవు. అందుచేత ప్రకృతి నధిష్ఠించియున్న పురుషుడవు నీవే. మహత్తత్త్వము కాలతత్త్వము నీ స్వరూపములే. త్రిగుణములచే కూడియున్న అహంకారతత్త్వము నీవే. ఈ రీతిగా లోక సృష్టి కుపకరించుచున్న తత్త్వ స్వరూపుడుగా నీవుండుటచేత లోకములకు నీవే నిమిత్త కారణమవు. ఉపాదాన కారణము కూడ నీవే. నీవే ఇంద్రాది దేవ స్వరూపములలో కార్యరూపుడవై లోకమును పరిపాలింతువు. ధర్మా ధర్మ ప్రవృత్తుల కనుగుణమైన ఫలమును ప్రాణులకిచ్చు వాడవు నీవు. అందుచే నీవు కవివి. సర్వజ్ఞుడవు. స్వసంకల్ప మాత్రముతో సర్వ ప్రపంచములను నీ యందు లీన మొనర్చుకొనుచున్నావు. సంహారమూర్తివి నీవే. ఈ విధముగా సకల స్వరూపుడవుగా నగుట కుపకరించెడి అచింత్య శక్తులను తనయం దంతర్భూతముగా ఒనర్చికొని యున్న కపిలస్వరూపునకు నీకు నమస్కారము.

34. త్వయా=నీచేత, అవతీర్ణఃణ=తీర్పఁబడిన ఋణత్రయములు కలవాఁడును, ఉత్తాప్తకామఃణ=సర్వవిధములుగా తీర్పఁబడిన కోర్కెలు కలవాఁడునైన, అహం=నేను, పరివ్రజాం పదవీం=సన్యాసులయొక్క మార్గమును, ఆశ్రితఃణ=ఆశ్రయించినవాఁడనై, త్వాం=నిన్ను, హృది=మనస్సునందు, యుంజన్=నిల్పుకొన్నవాఁడనై, విశోకఃణ=శోకరహితుఁడనై, చరిష్యే=సంచరింతును,

ప్రజానాం పతిం త్వాం=ప్రజలయొక్క పతియైన నిన్ను, ఆస్మాభిపృచ్ఛే=నీయొక్క ఆజ్ఞను కోరుచున్నాను.

తాత్పర్యము : ప్రజలకు నాథుఁడవైన నీ పాదములచెంత ఒక సంగతి విన్నవించుకొను చున్నాను. నీవు నాకు పుత్రుఁడవై అవతరించి నాఋణ త్రయమును తీర్చుకొనుటకు సహకరించితివి. నీ కరుణా విశేషముతో నేను ముక్తుఁడ నైనాను. నా సర్వకామములను అనంత కారుణ్యముతో నీవు తీర్చితివి. ఇఁక సన్యాసమును స్వీకరించి నీస్వరూపమును నిరంతరము ధ్యానించి సకల దుఃఖములకు కారణమైన అజ్ఞాన గ్రంథిని నశింపచేసికొందును. శోకహీనుఁడనై సంచరింతును. నీ వట్లాశీర్వదింపవలెను.

35. సత్యలౌకికే=వైదికముగను లౌకికముగను ఉన్నకృత్యమందు, మయాప్రోక్తం=నాచేత చెప్పఁబడినదే, లోకస్య ప్రమాణం=లోకమునకు ప్రమాణము. మయా=నేను, తుభ్యం=నీకొఱకు, యదవోచం=దేనిని చెప్పితినో, మునే=ఓ మునీ! తదృతం=అది సత్యము అథ=దాని కొఱకే, అజని=నేను జన్మించితిని.

తాత్పర్యము : భగవంతుఁడనుచున్నాఁడు. లోకమునకు పరమార్థజ్ఞానము నుపదేశించుటకై నేను నీపుత్రుఁడనై నీ గృహమందు జన్మించితిని. అందుచే నీకు ముక్తి సిద్ధించి తీరును. వైదిక లౌకిక కృత్యము లందు నాచేత చెప్పఁబడినదే లోకమునకు ప్రమాణము. అందుచేత నేను సత్యమునే చెప్పెదనని నీకు తెలిసినదే కదా!

36. అస్మిన్‌లోకే=ఈ లోకమందు, మే ఏతత్ జన్మ=నాయొక్క ఈ జన్మము, దురాశయాత్=మలినమైన అంతఃకరణముచే, ముముక్షూణాం=ముముక్షువులైన వారికి, ఆత్మదర్శనే=ఆత్మదర్శనమందు, సమ్మతాయ=ఉపయుక్తమైయున్న, తత్త్వానాం=తత్త్వముల యొక్క ప్రసంఖ్యానాయ=సంఖ్యా నిర్ణయమునకే.

తాత్పర్యము : నే నిప్పుడు ఈ లోకమం దవతరించినది జన్మ జన్మాంతరములకు కారణమై యున్న దేహాత్మ భావమైన లింగశరీరము యొక్క బంధమునుండి విడివడవలెనని అభిలషించుచున్న ముముక్షువులకు ప్రకృతి, తత్కార్యములు, జీవాత్మ, పరమాత్మ వీరిని వేరువేరుగా నిరూపించి, వారికి సరియైన మార్గమును చూపుట కుపకరించెడి తత్త్వములను నిర్ణయించెడి సాంఖ్యశాస్త్రమును బోధించుటకే యని తెలియుము.

37. భూయసా కాలేన=చాలకాలమునుండి, అవ్యక్తః ఏషః ఆత్మపథః =అస్పష్టముగా నున్న ఈ ఆత్మజ్ఞాన మార్గము, నష్టః=నశించిపోయినది. తం ప్రవర్తయితుం=దానిని మరల పునరుజ్జీవింపఁ జేసి ప్రచారము చేయుటకు,

ఇమం దేహం=ఈ శరీరము, మయాధృతం=నాచేధరింపఁబడినది. విద్ధి=తెలిసి కొనుము.

తాత్పర్యము : ఈ ఆత్మజ్ఞాన మార్గము చాల దినములనుండి నష్ట ప్రాయమైనది. దానిని పునరుజ్జీవింపఁ జేసి వ్యాపింపఁ చేయుటకు నాయవతారమని తెలిసికొనుము.

38. మయా అపృష్టః=నాచేత ఆజ్ఞాపింపఁబడినవాఁడవై, త్వం=నీవు, కామంగచ్ఛ=ఇచ్ఛానుసారముగా పొమ్ము, మయి=నాయందు, సన్యస్తకర్మణా=సమర్పింపఁబడిన కర్మముతో, కదుర్జయం=జయించుటకు చాలకష్టమైన, మృత్యుం=మరణమును, జిత్వా=జయించి, అమృతత్వాయ=అమృతత్వస్థితికొఱకు, మాం భజ=నన్ను సేవింపుము.

తాత్పర్యము : నీకు నన్యసించుటకై యనుజ్ఞ నిచ్చుచున్నాను. యథేచ్ఛముగా పోయిరమ్ము. సర్వకర్మలను నాయం దుపాసించెడు బుద్ధితో సుదుర్జయము పుణ్యపాపసముచ్చయరూపము. జననమరణ కారణమునైన లింగదేహమును, అవిద్యాగ్రంథిని నాశనమొందించికొని జ్ఞానముతో మోక్షప్రాప్తికై నన్ను భజింపుము. సకల కార్యములను భగవంతునకర్పించుటయే పరమోత్కృష్టమైన ఉపాసన దానితో నంతఃకరణ పరిశుద్ధి ఏర్పడును. కట్టకడపట మోక్షమేర్పడును.

39. సర్వభూతగుహాశయం=సమస్త భూతముల యొక్కమనోగుహాలయందు శయనించువాఁడును. స్వయంజ్యోతిః=స్వప్రకాశ స్వరూపుఁడును, ఆత్మానంమాం =పరమాత్ముఁడనైన నన్ను ఆత్మని=ఆత్మయందు, నీయందు, ఆత్మనా=బుద్ధి వృత్తితో, అన్వీక్షన్=చూచికొని, విశోకః=శోకరహితుఁడవై, అభయం=భయరహిత స్థానమును, ఋచ్ఛసి=పొందెదవు.

తాత్పర్యము : సకల భూతముల మనోగుహలయందు శయనించెడి వాఁడను నేనే. నేను స్వయం ప్రకాశకుఁడను. పరమాత్మనైన నన్ను నీయందు వసించుచున్న వానిగా బుద్ధివృత్తితో తెలిసికొనుము. అప్పుడు నీవు శోక మోహాది రహితుఁడ వయ్యెదవు. ఆనంద స్వరూపుఁడవయ్యెదవు. ఇదే పరమ పురుషార్థమైన మోక్షము. ఈ స్థితిని నీవు పొందెదవు.

40. యయా=దేనిచే, అసౌమాతా=ఈనాతల్లి, భయం=భయమును, అతితరిష్యతి=అతిక్రమించునో, సర్వకర్మణాం=సమస్తకర్మముల యొక్క, శమనీం=శమము నేర్పఱచెడు, ఆధ్యాత్మికీం విద్యాం=ఆత్మవిద్యను, మాత్రే=తల్లికి, వితిరిష్యే=ఉపదేశింతును.

తాత్పర్యము : భార్యను గూర్చిన చింత నీ కనవసరము. ఆమె నా తల్లి సర్వకర్మలను నశింపజేయ సమర్థమైన ఆత్మవిద్యను నేను ఆమె కుపదేశింతును. ఆ జ్ఞానముతో నామె సర్వభయముల నతిక్రమించును. నన్ను ఆమె ప్రాపించును. మోక్షస్వరూపభూతుఁడైన నాయం దామె ఐక్య మగును.

41. కపిలేన తేన=కపిల మహర్షిచేత, ఏవం సముదితః=ఈ రీతిగా చెప్పఁబడిన, ప్రజాపతిః=కర్దమమహర్షి, ప్రీతః=సంతుష్టుఁడై, తం ప్రదక్షిణీకృత్య=ఆ భగవంతుని ప్రదక్షిణించి, వనం ఏవ=వనములను గూర్చి, జగామహ =వెడలిపోయెను.

తాత్పర్యము : మైత్రేయుఁ డనుచున్నాఁడు. ఈ రీతిగా కపిల మహర్షి చేత చెప్పఁబడిన కర్దముఁడు సంతుష్టాంతరంగుఁడైనాఁడు. ఆతఁడు కపిలునకు ప్రదక్షిణించి నమస్కార మొనర్చి వనములకు పోయెను.

42. ఆత్తైకశరణః=ఆత్మను మాత్రమే శరణుఁజొచ్చినవాఁడై, నిస్సంగః =సామాన్యజనములతోడి సంగమునుపేక్షించి, అనగ్నిః=అగ్నిహోత్రాది గృహస్థ ధర్మమును త్యజించినవాఁడై, అనికేతనః=నియతమైనవాసస్థానములేనివాఁడై, మౌనంవ్రతం=మౌనవ్రతమును, ఆస్థితాఃపొందినవాఁడై, సః, మునిః =మననశీలుఁడైన కర్దముఁడు, క్షోణీంవ్యచరత్=ప్రపంచమందు తిరిగెను.

తాత్పర్యము : కర్దముఁడు ఆత్తైక శరణుఁడైనాఁడు. జన సంగతి నుపేక్షించి నాఁడు. అగ్నిహోత్రాది గృహస్థధర్మముల వదలినాఁడు. ఒకచోట నివాసస్థానము లేదు. మౌన వ్రతమును బట్టినాఁడు. ఆతఁడు మనన శీలుఁడై ప్రపంచ మందు తిరిగెను.

43, 44, 45, 46, 47. సదసతః పరంయత్=సత్తు, అసత్తు ఈరెంటికినీ అతీతమైనదేదో, గుణావభాసే=గుణములయొక్క అవభాసములకు కారణ మైనదియు, విగుణే=ప్రకృతిగుణముల సంబంధములేనిదియు, ఏకభక్త్యా=ఏ కాశ్రయమైన భక్తిచేత, అనుభావితే=ప్రత్యక్షమొనర్చుకొనఁబడినదియునైన, బ్రహ్మణి=బ్రహ్మపదార్థమందు, మనోయుంజానఃమనస్సును యోచించినవాఁడై, నిరహంకృతిః=శరీరాభిమానమును వదలినవాఁడై, నిర్మమఃనేను నాది లేనివాఁడై, నిర్ద్వంద్వఃద్వంద్వముల నతిక్రమించి, సమదృక్=సమానమైన దృష్టికలవాఁడై, స్వదృక్=తన స్వరూపమైన ఆత్మయందే లయింపజేసిన దృష్టి గలవాఁడై, ప్రత్యక్=ప్రత్యగాత్మగా రూపొందినవాఁడై, ప్రశాంతధీఃఎక్కువగా శాంతించిన

బుద్ధి వృత్తిగలవాడై, ధీరుఃధీరుడు, ప్రశాంతోర్మిః=తరంగముల చలనములేని, ఉదధిరివస్థితఃసముద్రమువలెనున్నవాడై, సర్వజ్ఞేసర్వజ్ఞుడైన, ప్రత్యగాత్మని=ప్రత్యగాత్మస్వరూపుడైన, భగవతి వాసుదేవేఐశ్వర్య పూర్ణుడైన వాసుదేవునియందు, పరేణ భక్తియోగేన=ఉత్కృష్టమైన భక్తివలన, లబ్ధాత్మా=ఆత్మానుభూతిగలవాడై, ముక్తబంధనఃఅవిద్యాకార్యమైన లింగశరీరమునుండి ముక్తుడై, సర్వభూతేషు=సమస్త భూతములందు, అవస్థితం=వసించుచున్న, భగవంతం ఆత్మానం=భగవంతుడైన ఆత్మను, ఆత్మనిభగవతి= ఆత్మస్వరూపుడైన భగవంతుని యందు, సర్వభూతాని=అన్ని భూతములను, అపశ్యత్=చూచెను, ఇచ్ఛా ద్వేషవిహీనేన=రాగద్వేష విహీనుడై సర్వత్ర=సమస్తదిక్కులందును భగవద్భక్తి యోగేన=భగవద్భక్తితో కూడినట్టి, సమచేతసా=సమానమైన మనస్సుతో, భాగవతీగతిఃభగవత్సంబంధమైన స్థితి, ప్రాప్తా=కర్దమునిచే పొందఁబడినది.

తాత్పర్యము : బ్రహ్మపదార్థము సదసత్తుల కతీతమైనది. అది త్రిగుణములయొక్క ప్రకాశమునకు కారణమైనది. కానీ ప్రకృతి గుణముల సంబంధములేనిది. కేవల విశుద్ధమైన భక్తిచేతనే అనుభవిత మగునట్టిది. అట్టి బ్రహ్మయందు కర్దముడు మనస్సును లయింపజేసెను. అతడహంకార గ్రంథిని భేదించినాడు. నేను నావి యనున వాతనికి లేవయ్యెను. ఆతడు నిర్ద్వంద్వుడు. మంచి చెడ్డలయందు లాభాలాభములందు-అన్ని ద్వంద్వములందును సమదృష్టిని సాధించుకొన్నాడు. నిరంతర మాత్మయే ఆతని దృష్టియందు ప్రత్యగాత్మయే నిరంతర భావన. ఆతని బుద్ధి ప్రశాంతమైనది. మహాధీరుడైనాడు. అలలచలనములేని సముద్రమువలె ఉండెను. భగవంతుడైన వాసుదేవుడే ప్రత్యగాత్మ స్వరూపము. ఆతనికి లింగశరీరబంధము తొలఁగిపోయినది. భక్తిభావముతో నాతడు ఆత్మానుభూతి నొందినాడు. సర్వభూతములయం దాతడు ఆత్మస్వరూపమునే దర్శించినాడు. ఆత్మయందే సర్వభూతములను విలోకించినాడు. తనయందే సర్వభూతము లున్నవి. తానే ఆత్మస్వరూపము. రాగద్వేషము లాతనికెన్నడో నశించినవి. సమచేతస్కుడైనాడు. భాగవతియైన గతి కర్దమునకెప్పుడో ప్రాప్తించెను.

విజయధ్వజ వ్యాఖ్య

1. శ్రీహరి అవతారములు కూడ సచ్చిదానందాత్మకమైన దేహములగలవే. అందుచే శుక్ర శోణిత సంపర్కముచే నేర్పడిన దేహము కలవికావు అనెడు అర్థతాత్పర్యమును తెలుపుటకే ఈ అధ్యాయము యొక్క తాత్పర్యము. అందులో గూడ మొదలు దేవహూతి మాటకుత్తరముగా కర్దముఁడు ఏమి యొనర్చెనని

తెలుపుచున్నాఁడు. దయాళుః మునిః, శుక్లాభివ్యాహృతం=శుక్లనామకుఁడైన శ్రీహరి మాటను, స్మరన్=స్మరించుచు, ఏవం, నిర్వేదవాదినీం, శాలినీం, మనోర్దుహితరం ఆహ.

2. అనిందితే!=నిందకు కారణమైన దోషములు లేని ఓ రాజపుత్రీ! ఇత్థం, ఆత్మానం ప్రతి=నీ కొఱకై (2) నావిషయమై మాఖిదః, భగవాన్, అక్షరః=నాశరహితుఁడైన శ్రీహరి, అదూరాత్=స్వల్పకాలమందే, తే గర్భం, సంప్రపత్స్యతే. 'భగవాన్' అనుటచేత 'అక్షరః'అనునర్థమును సమర్థించినాఁడు.

3. ఎప్పుడు నా గర్భమందు జనించునని ఆశంకించి నేను చెప్పిన నియమముల ననుసరించిన తరువాత ఆవిర్భవించునను అభిప్రాయముతో నియమము చెప్పుచున్నాఁడు. తేసుభద్రం=నీకుమేలగుఁగాక! త్వంచ, ధృతవ్రతా, దమేన, నియమేన=శౌచాదినియమము చేతను, తపో ద్రవిణదానే శ్రద్ధయా చ ఈశ్వరం భజ.

4. నా సంసార దుఃఖ పరిహార మొనర్పవలెను గదా అనుటకుత్తరము త్వయా, ఆరాధితః, బ్రహ్మభావనః=చతుర్ముఖ బ్రహ్మను సృష్టించిన (2) పరమాత్మ తత్త్వమును దెల్పెడి, తపస్సు నొనర్పవలెనని బుద్ధిని కలిగించినట్టి, సఃశుక్లః, ఔదార్యః సన్=నీ ఉదరమునుండి అవిర్భూతుఁడై, మామకం, యశః వితన్వన్ తే హృదయ గ్రంథిం=అహంకార బంధమైన సంసారమును ఛేత్స్యతి.

5. దేవహూత్యపి, ప్రజాపతేః, సందేశం, గౌరవేణ, సమ్యక్ శ్రద్ధాయ=నమ్మి, శ్రద్ధతో గూడ, కూటస్థం=ఎప్పుడును ఏక ప్రకారుఁడై నట్టియు, గురుం=బ్రహ్మాదులకు దేశికుఁడైనట్టి, పురుషం=మోక్షాది పురుషార్థ ప్రదుఁడైన శ్రీహరిని, అభజత్=సేవించినది. కూటస్థుఁడనుట చేత సంసారియైన చేతను కాదని, 'గురుం' అనుటతో ఉదాశీనుఁడు కాదని తెల్పుచున్నాఁడు.

6. బహుతిథే=అనేక దినములను లోగొన్న, కాలే, గతేసతి భగవాన్=సమస్త ఐశ్వర్యసంపన్నుడైన, మధుసూదనః, కార్దమంవీర్యం=కర్దముఁడు భుజించిన అన్నవికారమైన రేతస్సును, ఆపన్నః=ప్రవేశించినవాఁడై, తస్యాం దారుణి= చెట్టునుండి చెట్టునకు వ్యాపించెడు, అగ్నిః ఇవజజ్ఞే. అప్రాకృతుఁడైన శ్రీహరి ప్రాకృత వీర్యమునుండి పుట్టిన వాఁడు కాఁడు. ఆతఁడు మొదలే దేవహూతి యందున్నాఁడు. కర్దమునితో వ్యక్తుఁడైనాఁడు. అందుకే 'తస్యాం' అనెడు శబ్దప్రయోగము. అగ్ని దృష్టాంతము కూడ ఈ యర్థమునే సమర్థించును. అంతేకాక "నావతారేష్వపి హరేర్దేహాః శుక్రాది సంభవాః తథాపి శుక్ర సంస్థాః సన్ మాతృదేహం ప్రవిశ్యచ. విలాప్య శుక్రం తత్రైవ కేవలం జ్ఞానరూపతః,

ఉదేతి భగవాన్ విష్ణుః కాలే లోకం విడంబయన్ అనెడు ప్రమాణము కూడ శ్రీహరి గర్భవాసము లోకవిడంబనమునే తెలుపుచున్నది. అతఁడు అవతారములందుకూడ జ్ఞానాత్మకమైన దేహము కలవాఁడే.

7. లోకవిలక్షణమైన ఉత్సవము నడచుటచేత దేహాతి గర్భమునందు సాక్షాన్నారాయణుఁడే రూపాంతరము గ్రహించెనని వ్యక్తుఁడయ్యెనని తెలుపుటకే అపుడు నడచిన విశేషణములు దెలుపుచున్నాఁడు. తదా, వ్యోమ్ని, వాదిత్రాణి, అవాదయన్, ఘనాఘనాఃజగద్యుఃతం=వ్యక్తుఁడైన శ్రీహరిని గూర్చి గంధర్వులు, గాయంతిస్మ. ముదా=సంతోషముతో నప్సరసలు నృత్యంతి స్మ.

8. ఖేచరైఃఅపవర్జితాఃదివ్యాఃసుమనసఃపేతుఃసర్వాఃదిశఃఅంభాంసిచ, మనాంసి చ ప్రసేదు

11. ప్రహ్వాస్యమానైః అసుభిః ఉపలక్షితః=ఇంద్రియములతో సూచితమైన బ్రహ్మదేవుడు, విశుద్ధేనచేతసా, తచ్ఛికీర్షితం=శ్రీహరియొక్క సమీచీన జ్ఞానసాధనమైన శాస్త్రమును నిర్మించవలెనెడు ఇచ్ఛను, సభాజయన్=మంచిపనియని గౌరవించుచు కర్దముని గూర్చి ఇదం పైన చెప్పబోవు మాటలు,అభ్యధాత్=పలికెను.

12. హే మానద!=పెద్దలను గౌరవించు వాఁడా! భవాన్, మే, వాక్యం, మానయన్, యత్=ఏకారణముతో, సంజగృహే=భక్తితో గౌరవించితో, తత్=ఆ కారణముతో, తాత! త్వయా మే అపచితిః, నిర్వ్యళీకతః కల్పితా.

13. పుత్రకైఃపితరి, ఏతావత్యేవ, శుశ్రూషా, కార్యా, గురోః వచః బాఢం=నాకును సమ్మతమే, ఇతి=అని, అనుమన్యేత=అనుమోదించవలెను.

14. వత్స, ఇమాః సుమధ్యమాః తవదుహితరః సత్యాఃపతివ్రతలు. సంతు=అగుదురుగాక. ఏతాఃస్వైః ప్రభావైఃతమ సంతతులచేత సర్గం=ఇంకను పూర్తిగావలసిన సృష్టిని, అనేకధా=అనేక రీతులుగా, బృంహయిష్యంతి = విస్తరింప చేయుదురు. అందుచేత సృష్టిని అభివృద్ధి చేయుమని చెప్పిన నాయాజ్ఞనుకూడ నీవు పరిపాలించినట్లైనదని భావము.

15. మనుష్య సృష్టి మిథునములచేత ఏర్పడునది. అందుచే వీరికి యోగ్యులైన వరులను జూచి పరిణయ మొనర్పుఁ మనుచున్నాఁడు. అంగ!=వత్స! అతఃత్వం, ఋషిముఖ్యేభ్యఃనాతో వచ్చిన మరీచాద్యులకు, యథాశీలం =స్వభావమునకు తగినట్లు, యథారుచి=ఇష్టమునకు తగినట్లు, ఆత్మజాఃపరిదేహి, భువి, యశఃనీకీర్తిని, విస్తృణీఃవిస్తరింపుము. దీనిచేత రెండు లోకములను నీవు పొందుదు వని చెప్పినట్లైనది.

16. నీభార్యయం దవతరించు కపిల మహర్షి సాక్షాన్నారాయణుఁడే. వేరుకాదు. నారాయణుని సర్వలక్షణములు ఇతని యందుకలవు. కనుక నే నర్థము చేసికొన్నట్లే నీవుకూడ నర్థము చేసికొమ్మనుచున్నాఁడు. అహం, స్వమాయయా=తన ఇచ్ఛతో, అవతీర్ణం, ఆద్యం పురుషం, భూతానాంశేవధిం, దేహం=చిదానందాత్మక దేహముగల, కపిలం=తాను సర్వదా సుఖమునుభవించునట్టియు, ఇతరులకు సుఖము నొసగునట్టియు కపిల నామకుఁడైన ఋషిం, వేద=తెలిసికొన్నాను.

17. విభుఃయఃఏ కపిలనామక శ్రీహరి మనుష్య సాధారణమైన జ్ఞానము, దేవతా సాధారణమైన, విజ్ఞానము వీనిచేత, కర్మణాం, స్వరూపం=కర్మల స్వరూపములను, ఉదరన్=ప్రకాశింపచేయుచు, జ్ఞానమునకంటెను, కర్మ మముఖ్యమని తెల్పుచు, కాలోప సృష్టం=కాలముచే తిరోహితమై, యత్=ఏ, సాంఖ్యం=సమీచీన జ్ఞానమును, ఆసురయే=ఆసురీ అనెడు ఋషికి, వక్ష్యతి=చెప్పుబోవునో, చ=ఇంకను, యఃహిరణ్యకేశఃపద్మాక్షఃపద్మముద్రా పదాం

బుజుఁ, 'హిరణ్యశ్మశ్రు హిరణ్యకేశఁ' అను శ్రుతులచేత ఇవి శ్రీహరి లక్షణములు. ఈ లక్షణములు గల ఇతనిని శ్రీహరియనియే తెలిసికొన్నానని యర్థము.

18. బ్రహ్మదేవుఁడు తన జగద్గురుత్వమును సిద్ధపఱచుకొనుటకై దేవహూతికి కూడ తన విజ్ఞానము నుపదేశించుచున్నాఁడు. హేమానవి. తే గర్భం ప్రవిష్ట =విశేష సన్నిధానముతో ప్రవేశించిన, ఏషఃకైటభార్దనఃతే, అవిద్యా సంశయ గ్రంథి=అజ్ఞానము, వికల్పములు వీనిచేత గల్గిన సంసారపాశమును, భిత్వా=తత్త్వజ్ఞానోపదేశముతో పోఁగొట్టి, గాం=తన్నే ఆశ్రయించియున్న జనులకు తత్త్వోపదేశ మొనర్చుటకై భూమండలమును, విచరిష్యతి=తిరుగును.

19. నీ యవిద్యా సంశయ గ్రంథినే కాదు - ఇతరుల సంశయ గ్రంథినికూడ తొలఁగించునను అభిప్రాయముతో చెప్పుచున్నాఁడు. సిద్ధగణాధీశఃముక్తగణములకు ముఖ్యనియామకుఁడైనటియు, సాంఖ్యాచార్యేఃసమాచీన జ్ఞాన శాస్త్రము నొనర్చి దానిని ప్రవర్తింప చేయుట చేత దాని యాచార్య పురుషులకు పరమగురువై, సుసమ్మతఃసందేహములేక సమ్మతుఁడైన, తే కీర్తివర్ధనఃఅయం లోకే కపిల ఇతి=సంసార కంపమును లయ మొనర్చుట చేత కపిలు డనెడు, ఆఖ్యాం=అన్వర్థమైన నామమును, గంతా=పొందును. ఈ విశేషణముతో లోకమందు ఇపుడు ప్రచారములో నున్నట్టియు కుతర్కబహుళమైన సాంఖ్యశాస్త్రమును ప్రచారము చేసినవాఁడు కపిలుఁడు కాదని తెల్పినట్లైనది.

20. హంసఃనిర్మలుఁడును, జగత్ప్రష్టాలోకప్రష్టయైన, తే=ఆ దంపతులను, ఆశ్వాస్య, సహ నారదశ్చ, కుమారై స్సహ హంసేన యానేన, త్రిధామ్నఃపరమం, యయౌ.

21. పుత్రుని ముఖమును చూచినప్పటికినీ కర్దముఁడు బ్రహ్మదేవుని ఉపదేశమును మరువలేదని అతఁడు చెప్పిన మాటవలెననే నడచెనని చెప్పుచున్నాఁడు - క్షత్తఃవిదురుడా! శతధృతౌ గతేసతి తేన చోదితఃతతఃయథోచితం=బ్రహ్మ చెప్పినట్లే, స్వదుహితౄఃవిశ్వసృజాం=మరీచ్యాదులైన ప్రజేశ్వరులకు ప్రాదాత్. 'తతఃఅనుటచేత అలస్య మొనర్చ లేదని సూచితము.

22, 23, 24. మందమతులకు చక్కగా తెలుపుటకై వరులను స్పష్టపఱచుచున్నాఁడు. కలా=అనుపేరుగల యామెను మరీచికి ప్రాదాత్. అనసూయను అత్రిమహర్షి కిచ్చినాఁడు. శ్రద్ధను అంగిరోఋషికి, అయచ్ఛత్, హవిర్భూఃఅనెడు నామెను పులస్త్యున కిచ్చినాఁడు. యుక్తాం=అనుకూలవతియైన, గతియనెడు నామెను పులహునకు, సతీం=సాధ్వియైన క్రియఅనెడు నామెనుక్రతువునకును, ఖ్యాతియను నామెను భృగువునకును, అరుంధతిని వశిష్ఠునకును, సఃఆ కర్దముఁడు. య అయచ్ఛత్. యయా=ఏ పత్నిచేత, యజ్ఞఃశ్రీహరి సేవారూపమైన యజ్ఞము వితన్వతే=విశేషముగా చేయఁబడునో అట్టి, శాంతియను నామెను అధర్వణున కిచ్చెను. అథ కృతోద్వాహాన్, సదారాన్, విప్రర్షభాన్, సమలాలయత్=మర్యాదలతో సంతోషపఱచెను.

25. తతః, కృతదారాః, తే ఋషయఃనందం ఆపన్నాః సంతః, తం=కర్దముని గూర్చి, నిమత్ర్య=పోయివత్తుమనిచెప్పి, స్వం స్వం ఆశ్రమమండలం ప్రాతిష్ఠన్.

26. సచ=ఆ కర్దముఁడు, త్రియుగం=కృత త్రేతా ద్వాపరములందు అవతారము లెత్తెడు, విబుధర్షభం=దేవతోత్తముఁడైన శ్రీహరియే, అవతీర్ణం=కపిలనామకుఁడై తనయింట అవతరించెనని, ఆజ్ఞాయ=తన మనస్సుతోను బ్రహ్మదేవుని మాటతోను నిర్ణయించుకొన్నవాఁడై, వివిక్తే ఉపసంగమ్య, ప్రణమ్య, సమభాషత=మాటలాడెను. "యుగత్రయావతారేణ త్రియుగశ్చేతి గచ్ఛతి" అనుప్రమాణముతో శ్రీహరికి త్రియుగుఁడని పేరు.

27. స్వైఃస్వైఃస్వాము తాము చేసికొన్న, అమంగలైఃనిరయే=నరక సదృశమైన సంసారమందు, పాపచ్య మానానాం=దుఃఖించుచున్న జీవుల విషయమందు, ఇహ=ఈ లోకమందు, భూయసాకాలేన దేవతాఃఇంద్రియ ప్రేరకులైన తత్త్వాభిమాని దేవతలు, నూనం=నిజముగా, ప్రసీదంతి ప్రసన్ను లగుదురు.

28. శ్రీహరి ప్రసాదము లేనిది కేవల ప్రసాదముతో ప్రయోజనమేమి? అని ఆశంకించి దేవతా ప్రసాదము లేకున్నచో శ్రీహరి ప్రసాదము సాధ్యము కాకుండుట చేత శ్రీహరియొక్క ప్రసాదము ఒక జన్మమందు కాక అనేక జన్మలందు ప్రయత్నించి సంపాదింపఁదగినది. అది గూడ ముక్తి యోగ్యులైన ఉపాసకులకు మాత్రమే దొరకునదని చెప్పుచున్నాఁడు. యతయఃఇంద్రియ సమూహమును జయించినవారు, బహుజన్మ విపక్వేన=అనేక జన్మములం దొనర్చిన పుణ్యముల ఫలముగా, శూన్యాగారేషు=ఏకాంత స్థలమందు, సమ్యక్ నవవిధద్వేష రహితమై శ్రేష్ఠమైన, యోగసమాధినా=భక్తియోగముతో, అష్టాంగ యోగముతో కూడిన అసంప్రజ్ఞాత సమాధియనెడు ఏకాగ్రమనస్సుతో, యత్పదం ద్రష్టుం యతంతే.

29. చ=ఇంకను, యఃఏ శ్రీహరి, స్వానాం=తన భక్తుల యొక్క, పక్షపోషకః =పక్షీయు లందరిని పోషించునో, సఃఏవ అద్య గ్రామ్యాణాం=విషయ సుఖములం దాసక్తులైన, నఃహేళనాం గణయ్య=కేవల అనుగ్రహబుద్ధితో, గృహేషు, జాతఃఁ.

30. భగవన్!=స్వామి! భక్తానాం, అభివర్ధనఃసాధన సభివృద్ధిపఱచి మోక్షమున కర్హులగునట్లొనర్చెడు, శర్మ=భక్తులకు సుఖమును, చికీర్షుఃకల్గించుటకు కోరెడు, త్వం, స్వయం వాక్యం=నీమాటను, ఋతం కర్తుం, మేగృహే అవతీర్ణోఽసి=దీనిచేత భక్తులకు సుఖమును కల్గించుట కొఱకును

వారి యభిమానమును వృద్ధి బొందించుట కొఱకును తన వచనమును సత్య మొనర్చు కొనుటకును భగవదవతారమైనదని సూచితము.

31. హేభగవన్, స్వజనానాం=నీ భక్తులైన బ్రహ్మాది దేవతలకు, ఇహ=ఈలోకమందు, యాని యాని రూపాణి=వసుదేవుఁడు దేవకి మొదలైన రూపములు (దేహములు) రోచం తే=నీ అభివ్యక్తికి తగిన స్థానములని ఇష్టము లగునో, తాన్యేవ, అరూపిణఃప్రాకృత రూపములేని, తవ, అభిరూపాణి=అవతార మొనర్చుటకు ఇష్టమైనరూపములు. ఇప్పుడు బ్రహ్మాది దేవతలు కపిలావతారమునకు కర్దమ దేవహూతులు తగిన స్థలములని ఇష్టపడుటచేత శ్రీహరి అచ్చటనే అవతరించెనని అభిప్రాయము. ఏవకారముతో "వ్యక్తోభవేద్ధరిస్తత్ర యత్ స్థానం రుచిరం సఖాం' అనెడు ప్రమాణమును సూచించినట్లైనది. స్వజనానాం అనుచోట చతుర్థీ విభక్తికి బదులు షష్ఠిని వాడుటచేత సజ్జనులు శ్రీహరిని స్వామియనియే ఉపాసింతురని జ్ఞాపించినట్లైనది. బ్రహ్మాది రూపములని భాగవత తాత్పర్యము చెప్పిన శ్రీమదాచార్యుల మాట అయాయి ప్రతిమలందు యోగ్యులైన అధికారులు ఉపాసన యొనర్పవలెననుట గూడ సూచితమైనదని తెలియవలెను. 'సత్వం విశుద్ధం వసుదేవ శబ్దితం' అను మొదలైన వాక్యముల చేత వసుదేవుఁడు మొదలైన వారు స్వజనులని సిద్ధమైనది.

32. కర్దము డపరోక్షజ్ఞాని యగుటచేత కపిలుఁడు తన పుత్రుఁడని జ్ఞానము వదలి శ్రీహరియని తెలిసికొన్నవాఁడై శ్రీహరియందు తప్ప ఇతరుల యందు కనఁబడవియును అతనియందే కనఁబడునవియును ఐన లక్షణములతో స్తోత్ర మొనర్చుచున్నాఁడు. అహం=నేను, అద్ధ=సత్యముగను, ప్రత్యక్షముగను, సూరిభిఃబ్రహ్మజ్ఞానులచేత, తత్త్వబు భుత్సయా=తత్త్వమును తెలిసెడు ఇచ్ఛతో, సదా అభివాదార్హణ పాదపీఠం, ఐశ్వర్య వైరాగ్య యశోవబోధ వీర్యశియాపూర్ణం, త్వాం, ప్రపద్యే. ఇచ్చట 'శియా' అనెడు ఏకవచన ప్రయోగముచేత శ్రీహరి గుణములకు పరస్పరము భేదములేదని తెలిపినట్లైనది.

33. పరం=ప్రకృతి పురుషులకంటె ఉత్తముఁడైనట్టియు (2) సంపత్తుతో జనులను పూర్ణుల నొనర్చునట్టియు, ప్రధానంపురుషం= ముఖ్యపురుషుఁడనిపించుకొన్న (3) జగత్తును ధరించిన, గమనశీలుఁడైన, మహాంతం= అనంతుఁడైన, కాలం=అనంతకాల స్వరూపియైన, కవిం=త్రికాలజ్ఞుఁడైన, త్రివృతం=భూమి, నీరు, తేజస్సు వీనియందు వ్యాపించియున్న అనఁగా స్వరూపముచేత అనంతుఁడైన మూఁడు వేదములచేతను తెలియఁదగినట్టి, లోకపాలం, ఆత్మానుభూత్యా=స్వరూపజ్ఞానముచేత, అనుగత ప్రపంచం=అశేష విశేషముగా ప్రపంచమును తెలిసికొనెడు, స్వేచ్ఛందశక్తిం=తన ఇచ్ఛాను సారముగా

జగత్సృష్టి చేయుటకు శక్తిగల, కపిలం=బ్రహ్మదేవుని, రుద్రుని లాలించెడు, లయము నొందించెడు కపిలనామకుడైన నన్ను, ప్రపద్యే.

"వేదైర్వ్యస్తాత్వాత్ భగవాన్ త్రివృదిత్యుచ్యతే బుధైః" అనెడు ప్రమాణము త్రివృత్ పదముయొక్క అర్థమును దెల్పును.

34. అవతీర్ణేన, త్వయా, ఆప్తకామః ఉత=ఇష్టార్థము నెరవేరిన వాడనైనను, తం=పైనచెప్పిన లక్షణములతో కూడిన, ప్రజానాం పతిం, త్వాం, అద్య అభిపృచ్ఛే. అహం, పరివ్రజాం=సన్యాసులయొక్క, పదవీం, ఆస్థితస్సన్, హృది, త్వాం, యుంజన్=యోగాభ్యాసముతో పొందుచున్న వాడనై, విశోకః చరిష్యే.

35. కర్దముని స్తోత్రముతో ప్రసన్నుడైన శ్రీహరి అతనికి జ్ఞానము నుపదేశించుచున్నాడు. మునే! సత్యలోకికే=యథార్థ జ్ఞానవిషయమందు, యత్, మయాప్రోక్తం, తత్, హి=అదియే, లోకస్య ప్రమాణం=యథార్థజ్ఞాన కారణము. అథతుభ్యం, యత్, అవోచం, తత్, ఋతం కర్తుం మయా అజని. 'హి' అనుటచేత తనమాట ప్రమాణమగుటకు తాను ఆప్తతముడగుటయే కారణమని తెలిపినట్లైనది. 'బ్రహ్మా విష్ణుర్ లోకస్య' అనెడు స్మృత్యను సారముగా బ్రహ్మదేవుడు చెప్పినది కూడ ప్రమాణమని సూచించినాడు 'అవతార మొనర్చితినని' చెప్పుటతో శ్రీహరియందు అజ్ఞానాది దోషములు లేవని సిద్ధమైనది. అందుచేత శ్రీహరి ఆప్తముడనియు, అతడు చెప్పినది ప్రమాణ మనియు సూచితము.

36. తన వారిపక్షమును పోషింతునని చెప్పిన దానిని వివరించుచున్నాడు. దురాశయాత్=దుఃస్థానమైన సంసారమునుండి, ముముక్షూణాం=విడుదలకై యత్నించుచున్న జనులకు, తత్త్వానాం=దేహమందుండెడు పరమాత్ముడు మొదలైన తత్త్వముల, ప్రసంఖ్యానాయ=చక్కని జ్ఞానమునకై, ఉపదేశమునకై, మే=ఆప్తకాముడైనను నాయొక్క, ఏతత్ జన్మ, అస్మిన్ లోకే. అంతేగాక ఆత్మదర్శనే, అపరోక్షజ్ఞానుల యొక్క, సమ్మతాయ=యథార్థజ్ఞానమును స్థిరపఱచుటకై.

37. లోకమందు సాంఖ్యశాస్త్ర ప్రవృత్తి కనపడుచునే యున్నది. మరల దానిని చెప్పుటతో ప్రయోజనమేమి? అనగా వివరించుచున్నాడు. భూయసా కాలేన=సమ్యక్ జ్ఞాన ప్రవర్తకులు లేనికాలమునుండి, అవ్యక్తః=అత్యంత సూక్ష్మమైన, ఏషః=నేను ముందు చెప్పబోయెడి, ఆత్మపథః=పరమాత్మ తత్త్వ విషయక మార్గము, నష్టః, అభూత్. తం=ఆ ఆత్మ మార్గమును, ప్రవర్తయితుం=యథార్థ జ్ఞానమునకు సాధనమైన సాంఖ్యశాస్త్ర నిర్మాణముచే వ్యాపింపచేయుటకై, మయాధృతం ఇమం దేహం విద్ధి.

38. అవతార ప్రయోజనమును చెప్పి, తం త్వామపృచ్ఛే అనుటకుత్తర మిచ్చుచున్నాఁడు. మయా, ఆపృష్టః=అనుజ్ఞను వడసి, కామం=నీకు సుఖకర మగునట్లుగా, గచ్ఛ, మయిసన్న్యస్త కర్మణా, సుదుర్జయం, మృత్యుం= ఇంద్రియ సమూహమును, జిత్వా, అమృతత్వాయ, మాం భజ.

39. సేవించెడు ప్రకారము నుపదేశించుచున్నాఁడు. స్వయంజ్యోతిః =స్వప్రకాశకుఁడు, సర్వభూత గుహాశయం=సర్వప్రాణుల హృదయ గుహలందు వసించెడు వాఁడునై, ఆత్మానం=జీవు లొనర్చెడు కర్మలను గ్రహించి ఫల మొసఁగెడు స్వామియైన, మాం, ఆత్మన్యేవ=జ్ఞానస్వరూపియైన జీవునియందే, ఆత్మనా=లింగస్వరూప భిన్నమైన, నిత్య సేవారూపమైన చిదానంద స్వరూపముచేత, వీక్షన్, విశోకః=సాంసారిక క్లేశములను పోఁగొట్టు కొన్న వాఁడ వై త్వం, అభయం బుచ్చసి.

40. భయములేని యుక్తి ఇట్టిదని చెప్పుచున్నాఁడు. విశ్వం=ఈ ప్రపంచము, ఏతత్=ఇట్లు అనిత్యము, అసారము అని నీకు, హి=తెలిసినది కదా! అందుచేత, శాస్త్రేన=శాస్త్రము నుపదేశించెడు ఆచార్యులనుండి, ఆత్మానం=అంతర్యామియు, ఈశ్వరం=అఖండైశ్వర్యము మొదలైన గుణములకు గనియైన శ్రీహరిని, విజ్ఞాయ=సర్వోత్తముఁడని తెలిసి, మునిః=అపరోక్షజ్ఞానియు, యదా=ఎప్పుడు, శాంతమనో వాక్యుః=లింగశరీర రూపమైన మనస్సు మొదలైన ఇంద్రియములు లేనివాఁడవగుదువో, తదా=అప్పుడు, ఉపప్లవ=దుంఖాజ్ఞాన భయశోకరూపములైన ఉపద్రవము, న ఆఖ్యాతి=ప్రకాశింపదు. ముక్తియనఁగా నిట్టిదేయని భావము.

41. తల్లిగతియేమి? అనెడు ఆశంకకు చోటులేదని చెప్పుచున్నాఁడు. అహం, సర్వకర్మణాం=సమస్త కర్మముల యొక్క, శమనీం=ముఖ్యతను పోఁగొట్టునట్టి, అధ్యాత్మికీం=పరమాత్మ మొదలైన తత్త్వముల విషయములు తెలుపునట్టి సాంఖ్యవిద్యను. మాత్రే, వితరిష్యే. యయా=ఏ ఈ విద్యచేత, అసౌ=దేవహూతియు, భయం అతితరిష్యతి=ఈ సంసారమును దాటి నిత్యాభయదుఁడైన శ్రీహరిని చేరును.

42. తేన, కపిలేన, ఏవం, సముదితః, ప్రజాపతి, తం, ప్రదక్షిక్రృత్య, ప్రీతః వనం జగామ. హ ప్రసిద్ధము. ఏవ భిక్షకు మాత్రమే గ్రామమును ప్రవేశించు చుండెను.

43 . తక్కిన సమయములందు గ్రామ ప్రవేశము లేదని యర్థము. వనమును చేరె ననుట చేత ఒక్క పేచోట యుండెనని యర్థమగుచున్నది. భూసంచారము చేయలేదని తాత్పర్యము. సన్యాసధర్మమునకు భంగము వచ్చెను కదా! దానికి సమాధానము. మునిః, నిస్సంగః, అనగ్నిః=అగ్నిని ఆత్మారోప మొనర్చుకొనుట చేత హోమాది కార్యములేని, అనికేతనః=గృహము మొదలైన ఆశ్రయములేని, ఆత్తైకశరణః=ఆత్ముఁడనిపించుకొన్న శ్రీహరియే రక్షకుఁడై, నివాసస్థానమై యున్న, సః మౌనవ్రతం ఆస్థితః సన్ క్షోణీంవ్యచరత్. వాగింద్రియముచేత ప్రియా ప్రియవ్యవహారము జరుగును. అది ప్రీతి ద్వేషములకు

కారణ మగును. మనస్సు స్వాభావికముగనే కల్మష మైనది. వాగింద్రియ స్వేచ్ఛతో అది మరియు నధికమగును. కనుక ప్రియాప్రియ నివృత్తి ఏర్పడదు. ఇదియే సంసార మగును. అందుచేత మొదలు వాగింద్రియమును నియమింప వలెనని చెప్పినట్లైనది.

44. ఇట్లు సంచరించుచు మనన మేమి యొనర్చుచుండెనను టకు బదులు, యత్తత్=ఏ పరబ్రహ్మ వస్తువు, సదసతోఃమూర్త అమూర్త వస్తురూపమైన ప్రపంచమున కంటెను, పరం=విలక్షణమైనదో, అట్టి గుణావభాసే=జ్ఞానాది గుణస్వరూపమై ప్రకాశించునట్టి (2) సృష్టి కుపకారకములైన మహత్తత్త్వాది ప్రాకృత పదార్థములందంతర్యామియై ప్రకాశించునట్టి, విగుణే=సత్త్వరజస్తమోగుణ శూన్యమైన, ఏకభక్తా=శ్రీహరియే సర్వోత్తముఁడు మరియొక్కఁడు కాఁడను సమీచీన జ్ఞానపూర్వకమైన భక్తిచేత, అవభావితే=అనేకజన్మలందు సంపాదించి కొన్న సంస్కారముచేత దృఢతరమై అవిచలితమై ఈభావమందే స్థిరముగానుండు నట్టి (2) అనీశత్వము మొదలైన దోషలేశముకూడ లేనట్టి అనన్య భక్తిచేత చక్కని ధ్యానమునకు విషయమైన, బ్రహ్మణి=గుణపరిపూర్ణుడైన శ్రీహరియందు, మనఃమనస్సును, యుంజానఃచేర్చినవాఁడై అపశ్యత్ అని ముందున కన్వయము. మనస్సును చేర్చినవాఁడని చెప్పుట చేత భూసంచార సమయ మందును అతని మనస్సు విక్షిప్తము కాలేదని చెప్ప బడినది. అప్పుడు గూడ శ్రీహరి ఉపాసనకు క్షతి రాలేదని అరము. శ్రీహరి ఉపాసన యనఁగా వాని విశిష్ట గుణములచింతన. ఆతని సర్వోత్తమత్వమునకు భంగము తెచ్చెడు దోషరాహిత్యములయొక్క చింతన. దీనినే "గుణావభాసే విగుణే" అనుటతో చెప్పినాఁడు. అధిష్ఠాన విశిష్టము కాననే శ్రీహరి నుపాసింపవలెనని చెప్పినట్లైనది. దోషరహితుఁడని చెప్పుటచేత శ్రీహరియందు రాగద్వేషములు లేవని చెప్పినట్లైనది. 'ఏకభక్తా' అనుటచేత నిగ్రహించుటకు సాధ్యము కాని మనస్సు శ్రీహరియందే లగ్నమైనదని సూచితము.

45,46. నిర్మమఃశ్రీహరియే స్వామి యని తెలిసి తనదేమియు లేదనెడు దృఢజ్ఞానమున్నట్టియు, నిర్ద్వంద్వఃద్వంద్వములను సహించునట్టియు, సమదృక్=వస్తువులను యథావత్తుగా తెలియునట్టియు స్వదృక్=శ్రీహరియే స్వతంత్రుఁడని తెలిసినట్టియు, ప్రత్యక్=తన అంతర్యామియైన శ్రీహరియందే రమించు నట్టియు, అందుచేతనే శాంతధీఃదాని చేతనే ప్రశాంతోర్మిఃఉదధిరివ, ధీరఃసంపద్విపత్తులందు నిశ్చలుఁడైన, సఃసర్వభూతేషు, అవస్థితం, ఆత్మానం, భగవంతం, అపశ్యత్=అపరోక్షజ్ఞానముతో చూచెను. చ=ఇంకను, సర్వభూతాన్యపి=సమస్త పదార్థములను, ఆత్మని=సర్వత్ర వ్యాప్తుఁడైన, భగవతి=శ్రీహరియందు, వానినే ఆశ్రయించుకొనియుండువానిగా, అపశ్యత్. అపరోక్షజ్ఞానమునకు ముందు భగవద్ధ్యానాదులతో నిర్మలత్వాది అధికార సంపత్తు ఏర్పడును. "భూతగర్భ భూతస్థ" అనెడు రెండు రూపములును ఆత్మశబ్దమునకు అర్థములని సిద్ధమైనది. "భూతగర్భశ్చ భూతస్థఃపూర్వేవేద్విరూపవాన్, అత ఆత్మేతి తం ప్రాహుఃసదైవాప్త గుణోయతఃఅని ప్రమాణము.

47. వాసుదేవే, సర్వజ్ఞే అశేష విశేషాకారములతో సర్వము నెఱిఁగిన, ప్రత్యగాత్మని, భగవతి, పరేణ, భక్తి భావేన, లబ్ధాత్మా=మనస్సును బొందిన వాఁడై, ముక్తబంధనః=ఇచ్ఛాద్వేష విహీనేన, సర్వత్ర, సమచేతసా, అనఁగా నిషిద్ధమైన ఇచ్ఛ విష్ణు వైష్ణవ ద్వేషము అవి లేకున్నట్టిదై, సమస్త పదార్థములందున్న రూపములందు నిరోషత్వగుణ పూర్తత్వాది రీతులతో సమత్వ జ్ఞానయుక్తమైన మనస్సుతో భగవంతునందు భక్తి చెల్లించి, భాగవతీ గతిం=భగవత్ప్రాప్తి రూపమైన మోక్షమును, ప్రాప్తః=పొందెను. ఇక్కడ మొదలు వాసుదేవుఁడనఁగా అవతార రూపమునందు మనో లాభము. తరువాత సృష్ట్యాది కర్తయైన మూలరూపమందు మనోలాభము పిదప తత్త్వజ్ఞాన అంతర్యామియైన సూక్ష్మ బింబరూపమందు మనోలాభమును కావలెననెడు క్రమమున తెలియవలెను. ఇట్లు అపరోక్షీకరించు వారికి సంసారమునందెడు కారణములేదు. మరల జననము యొక్క అగత్యము లేని నారాయణ ప్రాప్తియైన ముక్తియే ఏర్పడునని కర్దముని కథతో ఉపదేశించిన క్రొనది.

ఇతి శ్రీమద్భాగవతే భాగవత సుధాలహరి వ్యాఖ్యయందు
చతుర్వింశోధ్యాయము సమాప్తము.

ఇరువది నాలుగవ అధ్యాయము

కం. అని యిట్లు వేదనాభర
మున మునుకుచుఁ బలుకఁ గర్దముఁడు మనుపుత్రిన్
గనుఁగొని సరసిజ నయను వ
చనములు మది సంస్మరించి సతి కిట్లనియెన్. 824

కం. మనుసుత! నీమది దుఃఖం
బును బొందకు మచిరకాలమున భగవంతుం
డనఘుం డక్షరుఁడు జనా
ర్దనుఁడు భవద్గర్భమందుఁ దగ వసియించున్. 825

కం. వరనియమ వ్రతనిష్ఠా
చరణ నియుక్తాంతరంగ సమధికవై సం
భరిత తపోధన దాన
స్ఫురిత శ్రద్ధానుభక్తి పూర్వము గాఁగన్. 826

మ. మఱి నారాయణ పాదపద్మములు సమ్యగ్భక్తిఁ బూజింపు త
త్పురుష శ్రేష్ఠుఁడు మానసంబున భవత్పూజానుసంప్రీతుఁడై
కరి మర్థిం తరుణీశిరోమణి! భవద్గర్భస్థుఁడై యుండి తాఁ
గరుణం జేయు భవన్మనో జనిత శంకా గ్రంథి విచ్ఛేదమున్. 827

దేవహూతి గర్భంబున విష్ణుండు కపిలాచార్యుండుగా నుదయించుట

చ. అనవుడు దేవహూతి హృదయంబున సంతస మంది య మ్మునీం
ద్రుని వచన క్రమంబునఁ బరున్ భగవంతు ననంతుఁ బద్మలో
చను హరి విష్ణు నర్చనము సల్పుచు నుండఁగ గొన్ని యబ్దముల్
చనునెడ దానవాంతకుఁడు సమ్మతిఁ గార్దమమైన తేజమున్. 828

కం. ధరియించి య మ్మునీంద్రుని
తరుణీగర్భంబువలన దనుజారి శమీ
తరు కోటరమున వైశ్వా
నరుఁ డుదయించిన విధంబునన్ జనియించెన్. 829

సీ. అ య్యవసరమున నాకాశమున దేవ
తూర్య ఘోషంబులు దుములమయ్యె
నందిత దేవతా బృందంబు లందంద
కురిసిరి మందార కుసుమవృష్టి
గంధర్వ కిన్నర గానంబు వీతెంచె
నప్సరోగణముల యాట లొప్పె
వావిరి దిక్కులఁ గావిరి విరిసెను
దవిలి వార్ధుల కలంకువలుమానె

తే. సాధుజనముల మనములు సంతసిల్లె
హోమ వహ్నులు ప్రభలఁ జెన్నొందిఁ వెలిఁగెఁ
గుసుమఫల భారముల నొప్పెఁ గుజము లెల్ల
సర్వసస్యాళిచే నొప్పె జగతి యెల్ల. 830

వ. ఇట్టి మహోత్సవంబున దేవహూతికిం దత్త్వబోధంబు గావించు కొఱకుఁ దదీయ గర్భంబున నుదయించిన పరబ్రహ్మస్వరూపుండైన నారాయణుని దర్శించు కొఱకు మరీచి ప్రముఖ మునిగణ సమేతుండై, చతుర్ముఖుండు చనుదెంచి, యమ్మహాత్ముని దర్శించి, కర్దమ దేవహూతులం గనుంగొని యిట్లనియె. 831

కం. నుత చరితులారా! మీరలు
కృతకృత్యులు విష్ణుపూజఁ గేవల భక్తిన్
మతి నిష్కపటులరై చే,
సితిరి తదర్చన ఫలంబు చేకుఱె మీకున్. 832

కం. శ్రితభయ హరణుఁడు మునిజన
నుతచరితుఁడు పరుఁడు మీ మనోరథ సిద్ధిన్
వితతంబుగటఁగావించు
జతురత మీ జన్మమింక సఫలతఁ బొందెన్. 833

కం. వినుఁడు సకామనులై హరి
నినుపమ భక్తిన్ భజించు నదె ముక్తికిఁ జా
లును మీ పుణ్యం బేమని,
కొనియాడఁగ వచ్చు? నీతికోవిదులారా! 834

వ. అని వెండియుం గర్దముని గనుంగొని యిట్లను. భవదీయ తనూభవలం
బ్రకట శీల వ్రతాచార సంపన్నులైన మునివరేణ్యులకుం బెండ్లి సేయుము.
అట్లైన వారివలనం బ్రజాసృష్టి బహు విధంబుల వృద్ధిం బొందు నని
చెప్పి మఱియు నిట్లనియె 835

చ. అనఘ! భవత్సుతుండు సముదంచిత తేజుఁడునైన యి మ్మహా
త్మునిఁ బరమేశు నీశు నజితు న్న వికారు నమేయు నచ్యుతు
న్ననఘుని నక్షరున్ హరి ననంతుని నీశునిఁ గాఁదలంతు నీ
ఘనుఁడు సమస్తచేతన నికాయ హృదీప్సిత దాయిగావున్. 836

సీ. మానిత జ్ఞాన విజ్ఞాన యోగంబులు
ననునుపాయంబులు నొనరఁ జేసి
యోలిమై కర్మజీవుల నుద్ధరించుట
కొఱకు నమ్మహితాత్మకుఁడు సమగ్ర
హాటక రుచి జటాజూటుండు నుత్ఫుల్ల
పంకజనేత్రుండు పద్మ వజ్ర
హల కులిశాంకుశ లలితరేఖాంకిత
చరణ తలుండును సత్‌గుణుఁడు

తే. నగుచు నిప్పుడు సరసీరుహాక్షి! నీదు
గర్భమం దుదయించెను ఘనుఁడు నీకుఁ
దత్త్వబోధంబు గావించుఁ దావకీన
హృదయ మందుల సంశయ మెల్లఁ బాపు. 837

వ. మఱియును. 838

కం. నుతి కెక్కి సిద్ధగణసే వితుఁడై
ఘనసాంఖ్యయోగ విలసిత తత్త్వ
స్థితి నిరతుఁడగుచుఁ గపిలా
ఖ్యతఁ దనరి చరించు నీ జగత్త్రయ మెల్లన్. 839

కం. అని పలికి య మ్మరీచిం
గని యుద్వాహార్థమునిచి కమలజుఁడంతన్

దననందనులగు నారద
సనకాదులఁగూడి యాత్మసదనము కరిగెన్ 840

వ. అంతనా కర్దముండు కమల సంభవ చేదితుం డగుచు యథోచితంబుగా నాత్మీయ దుహితల వివాహంబులు సేయందలంచి, మరీచికి గళయను కన్యకను, అత్రికి ననసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకుం గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠునకు నరుంధతిని, అధర్వునకు శాంతినింగా నిజకులాచార సరణిం బరిణయంబు గావించిన, వారును గృత దార పరిగ్రహులును, కర్దమ కృత సంభావనా సంభావితులును నగుచు నతనిచేత ననుజ్ఞాతులై జాయాసహితు లగుచు నిజాశ్రమ భూములకుం జనిరి. అనంతరంబు కర్దముండు దేవోత్తముండగు విష్ణుండు దనమందిరంబున నవతరించి యుంటం దనచిత్తమున నెఱింగి వివిక్త స్థలంబునకుం జని యచ్చటఁ గపిలునికి వందనం బాచరించి యిటనియె. 841

సీ. చతురాత్మ! వినుఁ మాతృకృతములైనట్టి య
మంగళ భూతకర్మంబు లనెడి
దావాగ్ని శిఖలచే దందహ్యమానులై
నట్టి జీవులు దుదముట్టలేక
పాయక సంసారబద్ధులై యుందురు
బహుళ కాల మ్మిట్లు పరఁగు చుండ
సకలదేవతలు ప్రసన్నత నొందఁగ
బహు జన్మ పరిచయ ప్రాప్తయోగ

తే. చిరసమాధి తపోనిష్ఠచే వివిక్త
దేశముల యోగి జనములు ధృతులు నే మ
హానుభావు విలోకింతు రట్టి దివ్య
పురుషరత్నంబ! నాయింటఁ బుట్టి తీశ! 842

వ. మఱియు సంసార చక్ర పరిభ్రామ్య మాణుల మగుచు గ్రామ్యులమైన మావర్తనంబులు గణింపక మదీయ గృహంబునం బూర్వంబునం బ్రతి శ్రుతంబులైన భవదీయ వాక్యంబులు దప్పకుండ నుగ్రహింప నుదయించి తని వెండియు నిట్లనియె. 843

కం. తలపోయఁగ నప్రాకృత
బలయుక్త చతుర్భు జాది భవ దవతారం
బులు నీ కనురూపములై
పొలుపొందుం గాదె? పరమపురుష! మహాత్మా! 844

వ. అదియునుంగాక. 845

కం. అనయము భవదీయాశ్రిత,
జన సంరక్షణము కొఱకు సమ్మతితోఁ దా
ల్చిన మానవరూపంబులు
ననురూపము లగును గాదె? హరినీ కెపుడున్. 846

కం. సుమహిత తత్త్వజ్ఞానా
ర్థము విద్వజ్జనగణంబు దవిలి నమస్కా
రము లోలిఁ జేయు పద పీ
ఠము గల నినుఁ బొగడ వశమె? తవణింపంగన్ 847

సీ. సమధిక షడ్గుణైశ్వర్య కారణుఁడవు
పరమేశ్వరుండవు ప్రకృతిపురుష!
మహ దహంకార తన్మాత్ర తత్ క్షోభక
హేతు కాలాత్మ విఖ్యాత ధృతివి
జగదాత్మకుఁడవు చిచ్ఛక్తి వి
నాతీయ జఠర నిక్షిప్త విశ్వప్రపంచ
మును గల సర్వజ్ఞమూర్తివి స్వచ్ఛంద
శక్తియుక్తుండవు సర్వసాక్షి

తే. వగుచుఁ గపిలాఖ్యఁ దనరారు నట్టినీకు
ననఘ! మ్రొక్కెదఁ బుత్రుండ వగుచు నీవు
నాకుఁ బుట్టిన కతన ఋణత్రయంబు
వలనఁ బాసితి నిక భక్త వరద! నేను. 848

తే. మానిత వ్రత యోగసమాధి నియతిఁ
జెంది భవదీయ పాదారవిందయుగము
డెందమునఁ జేర్చి శోకంబులందుఁ దొలఁగి
సంచరించెద నంచితస్థలములందు. 849

కం. అని యిట్లు విన్నవించిన
మునిపుంగవుఁడైన కర్దముని వచనంబుల్
విని భగవంతుండగు న
య్యనఘుఁడు కపిలుండు వలికె నర్మిలి దోఁపన్. 850

నీ. నాచేతఁ బూర్వంబునం బ్రతి శ్రుతమైన
వచనముల్ దప్పక వరమునీంద్ర!
నీయింట బుట్టితి నిర్హేతుకస్థితి
భూరిదయాగుణంబున నవాప్త
సకల కాముఁడ నేను సన్ముని వేషంబు
ధరియించు టెల్ల నా కొఱకుఁగాదు
విను మహాత్ములకులైన మునులకుఁ బరమాత్మ
గురు సద్వివేకంబు నరసిచూపు.

తే. తత్త్వబోధంబు కొఱకును దాల్పఁబడిన
యంచిత వ్యక్తమార్గమైనట్టి దేహ
మని తలంపుము మత్పద ధ్యానశక్తి
ధీపరాయణ మహిమంబు తేజరిల్ల. 851

కం. సమధిక నిష్ఠం గృతయో
గమునన్ సన్న్యస్త సకల కర్ముఁడవై మో
హముఁ బాసి భక్తిచే మో
క్షముకై భజియింపు నను వికారరహితుఁడై. 852

కం. ననుఁ బరమేశుఁ బరంజ్యో
తిని నఘు ననంతు దేవదేవు సకలభూ
తనికాయ గుహాశయు నా
ద్యుని నజు నాద్యంతశూన్య దురితవిదూరున్. 853

క. తిరముగ భవదీయాంతఃకరణ సరోజాత కర్ణికా తలమున సు
స్థిరుఁ జేసి యింద్రియంబుల
నిరసించి మనోంబకమున నెఱిఁ గను మనఘా! 854

వ. అట్లేని 855

కం. తనరిన మోక్షము నొందెద
వని పలికినఁ గర్దముండు నమ్ముని కులచం
ద్రుని వలగొని వందనములు
ఘనముగ నతిభక్తిఁ జేసి కౌతుక మలరన్. 856

కం. మునిగణ సేవిత మగు వన
మునకుం జని యందు మౌనమున నిస్సంగుం
డును వహ్ని రహితుఁడనికే
తనుఁడును నాత్మైకశరణ తత్పరుఁడగుచున్. 857

వ. పరబ్రహ్మంబుఁ జిత్తంబున నిల్పి యహంకారంబు విడిచి, మమత్వంబు నిరసించి, దయాగుణంబునంజేసి సకల భూతంబులందు సమత్వంబు భజియించి, శాంతి శేముషీ గరిష్ఠం డగుచు, నిస్తరంగం బగు వార్ధి చందంబున ధీరుండై నిఖిల ప్రపంచంబును వాసుదేవమయంబుగాఁ దలంపుచు భక్తి యోగంబున భాగవత గతిం బొందె. 858

ఇది పోతనామాత్య విరచితంబైన ఆంధ్రమహాభాగవతమున తృతీయస్కంధమున ఇరువది నాలుగవ యధ్యాయము.

824. వేదనాభరమునన్=దుఃఖము యొక్క భారమునందు, మునుఁగుచున్=మునిఁగినదై, సరసిజనయనువచనములు=శ్రీమహావిష్ణువుయొక్క మాటలు.

825. అచిరకాలమునన్=శీఘ్రముగానే, భవద్గర్భమందున్=నీయొక్క కడుపులో,

826. వరనియమ=శ్రేష్ఠములై నియమములు గల, ప్రతనిష్ఠా+ఆచరణ=ఎక్కువ వ్రతములయొక్క చేయుటచేత, నియుక్త=నియమింపఁబడిన, అంతరంగ=మనస్సు కలిగిన దానివలన, సమధికవై=గొప్పదానవై, సంభరిత=ఎక్కువైన, తపఃతపస్సుచేతను, ధనదాన=ధనము యొక్క దానముచేతను, స్ఫురిత=ప్రకాశింపచేయఁబడిన, శ్రద్ధానుభక్తి పూర్వముఁగాఁగన్=శ్రద్ధతో కూడుకొన్న భక్తి పూర్వకముగా.

827.సమ్యక్+భక్తిన్=ఎక్కువ భక్తిచేత, తత్+పురుష శ్రేష్ఠుఁడు= ఆ భగవంతుఁడు, పూజా+అను సంప్రీతుఁడై=పూజతో ప్రీతినందినవాఁడై, భవన్మనో జనిత=నీయొక్క మనస్సు నందేర్పడిన, శంకా గ్రంథి=సందేహ మనెడు ముడియొక్క, విచ్ఛేదమున్=ఛేదించుటను.

828. అమ్మునీంద్రుని వచన క్రమంబునన్=ఆ కర్దమముని చెప్పిన మాటల ననుసరించి, పద్మలోచనున్=తామరలవంటి కన్నుల గలవానిని, అబ్దముల్=సంవత్సరములు, కార్దమమైన తేజమున్=కర్దమమునికి సంబంధించిన తేజస్సును.

829. దనుజ+అరి=శ్రీమహావిష్ణువు, శమీతరుకోటరమునన్=శమీవృక్షము యొక్క తొఱ్ఱయందు, వైశ్వానరుఁడు-అగ్ని,

830. తూర్యఘోషంబులు=తప్పెటల యొక్క ధ్వనులు, తుముల మయ్యెన్=ఎక్కువ యయ్యెను, నందిత దేవతాబృందంబులు=ఆనంద మొందిన

దేవతల గుంపులు, వీతెంచెన్=వచ్చెను. కావిరి విరిసెను=క్రమ్ముకొన్న మేఘముల గుంపు తొలగెను. కలంకువలు=సంక్షోభములు, కుజములు=వృక్షములు.

831. పరబ్రహ్మ స్వరూపుఁడు=సర్వోత్తమ దేవస్వరూపుఁడు.

832. కృతకృత్యుఁడు=సార్థకమైన జన్మము కలవాఁడు, కేవల భక్తిన్=ఇతరమార్గముల సంకలనములేని భక్తిచే, నిష్కపటులరై=మోసము లేనివారై, చేకుఱెన్=ఏర్పడెను.

833. చతురతన్=నైపుణ్యముతో, వితతంబుగన్=విస్తారముగా,

తాత్పర్యము : కర్దముఁడన్న మాటలతో దేవహూతికి గొప్పదుఃఖము కలిగెను ఆమె యా దుఃఖములో మునిఁగి ముందు చెప్పినట్లుగా పలికినది. ఆ మాటలు కర్దముఁడు విని శ్రీమహావిష్ణువు తన కిచ్చిన వరములు దలఁచి ఆమెతో నన్నాఁడు. దేవహూతీ! నీమదియందు దుఃఖమునందకు. శీఘ్రకాలముననే భగవంతుఁడైన జనార్దనుఁడు నీ గర్భమున ప్రవేశించుచున్నాఁడు. నీవు కూడ నా భగవంతుని జన్మకు తగిన యోగ్యతను సంపాదించుటకై నియమ పరిపూరితములైన వ్రతములు వట్టుము. తదాచరణముతో నీ మనస్సు సకల రీతుల నియుక్తమగుగాఁక. దానితో నీవ్యక్తిత్వమున కొకగౌరవ మేర్పడును. తపస్సు దానము పుష్కలముగా నొనరింపుము. ఇవి రెండును శ్రద్ధాపూర్వకముగా నొనర్చుము. వాని వెనుక సమ్యగనుష్ఠితమైన భక్తి బలముండవలెను సుమా! వేరుచింతలు మాని శ్రీమన్నారాయణుని పాదపద్మములను చక్కని భక్తితో పూజింపుము. అతఁడు నీ పూజలచేత సంతుష్టుఁడై నీగర్భమునుండి జన్మించి నీ మనస్సునం దేర్పడిన సంశయ మనెడు ముడిని విచ్ఛేద మొనర్చును" ఈ మాటలతో దేవహూతి మనస్సు ఆనందముతో నిండినది. అతఁడుపదేశించి నట్లామె భగవంతుని పూజింపఁ దొడఁగెను. ఆ పూజతోనే కొన్ని సంవత్సరములు గడచినవి. ఆమె పూజానిష్ఠతో సంతృప్తుఁడైన పరమాత్ముఁడు కార్దమమైన వీర్యమును జెంది యామెలో ప్రవేశించినాఁడు. దేవహూతినుండి భగవంతుఁడు శమీవృక్షము యొక్క తొఱనుండి అగ్నిదేవుఁ డుద్భవించినట్లు జన్మించినాఁడు. ఆ శ్రీమహావిష్ణువు యొక్క జన్మవేళయందు దేవతూర్యములు గగనమందు బిట్టుగా మ్రోసినవి. సంతోష భరిత హృదయములతో దేవతలు కల్పవృక్షముల పూలు గురియించిరి.

గంధర్వులు కిన్నరులు గాన మొనర్చినారు. అప్సరసల యాటపాటలు చెలఁగెను. దిక్కులు మాలిన్యమును దొలఁగి ప్రసన్నము లయ్యెను. సముద్రములందు తరంగ క్షోభములు తగ్గినవి. వార్లులు ప్రశాంతము లైనవి. సత్పురుషుల మనస్సులు సంతోషముతో నిండినవి. హోమవహ్నులు ప్రభాసమన్వితములై వెలిఁగెను. ఏ చెట్టునందు, జూచినను పూలు, సమృద్ధములైన ఫలములు. ఏ పొలములందుఁ జూచినను సస్యాళి విరివిగా పండినది.

ప్రపంచమున కంతయు మహోత్సవ మయ్యెను. దేవహూతికి తత్త్వబోధ గావించుటకు పరమాత్మ యామె గర్భమున జన్మించినాఁడు. పరబ్రహ్మ స్వరూపుఁడైన ఆ శ్రీహరిని దర్శించుట కొఱకు బ్రహ్మదేవుఁడు వచ్చెను. ఆతని వెన్క మరీచ్యాదులైన ఋషులు చతుర్ముఖుఁడు వచ్చి నారాయణుని దర్శించి కర్దమ దేవహూతులను జూచి ఇట్లన్నాఁడు. "పవిత్రము లైన చరితముగల దంపతులారా! మీజన్మలు సార్థకమైనవి. కేవలభక్తి పూర్వకముగా అనేక వర్షములు విష్ణు పూజ లొనర్చితిరి. తదర్చనా ఫలములు నేటికి మీకు సిద్ధించినవి. ఆశ్రితుల భయములు దొలఁగించువాఁడు, మునులచేత పొగడఁబడినవాఁడు నీ కోర్కెను తీర్చినాఁడు. నీ జన్మము మూరుపాళ్ళు సఫలమైనది. సకామభక్తియైనను భగవంతుని యెడ నొనర్చినపుడు అది గంగాజలమువలె సార్థకము. ఆ భక్తియే మోక్షమివ్వఁజాలును ఇఁక మీరు నిష్కామముగా భగవంతుని భజించితిరి. దాని పుణ్యఫలమేమని చెప్పవచ్చును?

835. వెండియున్=ఇంకను, భవదీయ తనూభవలన్=నీయొక్క బిడ్డలను, ప్రకట శీలవ్రతాచార సంపన్నులు=ప్రసిద్ధమైన సత్త్వభావము వ్రతములు బాహ్యాచారములు వీనిచేత కూడినవారు.

836. సముదంచిత తేజుఁడు=ఎక్కువగా ప్రకాశించుచున్న తేజస్సు కలవాఁడు, అజితుఁడు=ఎవ్వరిచేత జయింపఁబడనివాఁడు, అమేయున్=అతని శక్తి ఇంతటిదని కొలత కందనివాఁడు, అచ్యుతున్=తన సహజ జ్ఞానయోగము నుండి ఎన్నఁడును చ్యుతుఁడుగాని వాఁడు, అనఘుఁడు=పాపరహితుఁడు, సమస్త చేతన నికాయ=సమస్త జీవరాసుల యొక్క, హృదీప్సితదాయి=మనస్సు నందుఁగల కోర్కెల దీర్చువాఁడు,

837. మానిత=గౌరవింపఁదగిన, జ్ఞానవిజ్ఞాన యోగంబులు=శాస్త్రదృష్ట జ్ఞానము, అపరోక్ష జ్ఞానము, అను ఉపాయంబులు=మార్గములు, కర్మజీవులన్=కర్మములచేత జన్మమందిన వారిని, సమగ్ర=విస్తారమైన, హాటకరుచి=బంగారువన్నెలుగల, జటాజూటుండు =జడలగుంపు కలవాఁడు, ఉత్ఫుల్ల పంకజనేత్రుండు=వికసించిన పద్మముల వంటికన్నులు కలవాఁడు, హల=నాగలి, కులిశ=వజ్రాయుధము, అంకుశ=అంకుశము, సత్త్వగుణుఁడు= సత్త్వమే గుణముగాఁ గలవాఁడు, తావకీన హృదయము=నీయొక్క మనస్సు.

839. సాంఖ్యయోగ విలసిత=సాంఖ్యయోగమందు ప్రకాశించెడు తత్త్వస్థితియందున్నవాఁడు, కపిలాఖ్యతన్=కపిలుఁడనే పేరుతో

840. ఉద్వాహార్థము ఉనిచి=బిడ్డలకు పెండ్లియగువఱకు ఉండుమని యాజ్ఞాపించినవాఁడై, ఆత్మసదనము=తన నివాసమైన సత్యలోకము.

841. కృతదార పరిగ్రహులు=భార్యలను గ్రహించినవారు, కర్తమకృత=కర్తమమునిచే చేయఁబడిన, సంభావనా=గౌరవములచేత, సంభావితులు=సంతోషపడిన మనస్సు కలవారు, అనుజ్ఞాతులు=అనుజ్ఞ ఇవ్వఁబడినవారు, జాయా సహితులు=భార్యలతో కూడినవారు, వివిక్త స్థలము=ఏకాంతము.

842. ఆత్మకృతములు=తమచే చేసికొనఁబడినవి, అమంగళభూత కర్మంబులు=అమంగళమును తెచ్చి పెట్టెడు పాపముతో కూడిన చేష్టలు, దావాగ్ని శిఖలచేన్=అడవికంటుకొన్న అగ్నిజ్వాలలచేత, దందహ్యమానుఁడు=ఎక్కువగా దహింపఁబడుచున్నవాఁడు, సకల దేవతలు ప్రసన్నతన్ ఒందగన్=ఇంద్రియా ధిష్ఠాన దేవతలు సంతోషమును బొందగా, బహు జన్మ పరిచయప్రాప్త=అనేక జన్మలసంబంధముచే నేర్పడిన, వివిక్త దేశములన్=ఏకాంతములందు, ధృతులు=ధైర్యము కలవారు.

843. సంసార చక్ర పరిభ్రామ్యమాణులు=సంసారచక్రమందు నిలువక తిరుగుచుండెడివారు, గ్రామ్యులు=అసంస్కృతమైన బుద్ధిగలవారు, గణింపక=లెక్కింపక, ప్రతిశ్రుతంబులు=ప్రతిజ్ఞచేయఁబడినవి.

844. తలపోయఁగన్=చింతింపఁగ, అప్రాకృత బలయుక్త=ప్రకృతి సంబంధముకాని బలముతో కూడిన, చతుర్భుజాది భవదవతారంబులు=చతుర్భుజుఁడు మొదలైన అవతారములు, నీకు అనురూపములు=నీకు తగినవి.

తాత్పర్యము : మరల కర్దమునిఁ జూచి బ్రహ్మదేవుఁడిట్లన్నాఁడు. నీ గర్భమందు జనించిన కూతులకు గొప్పదైన శీలముచేతను వ్రతానుష్ఠానముల చేతను ప్రసిద్ధులైన మునిశ్రేష్ఠులకిచ్చి వివాహమొనర్పుము. అప్పుడు వారివలన సృష్టిక్రమము గొప్పగా నభివృద్ధిఁ బొందఁగలదు. నీ గర్భమందు జన్మించిన కుమారుఁడు నిస్సమమైన తేజస్సుగల భగవంతుఁడు. సర్వదేవోత్తముఁడు. ఎన్నఁడును పరాజయములేనివాఁడు. వికారములేనివాఁడు. అతని శక్తి ఇట్టిదని చెప్పుటకు సాధ్యముకాదు. తన సహజస్థితి నుండి చ్యుతుఁడు కానివాఁడు. పాపరహితుఁడు. సమస్త జీవనికాయముల యొక్క మనస్సునందుండు కోర్కెను వారి వారి యోగ్యతలను బట్టి దీర్చువాఁడు. జ్ఞానవిజ్ఞానాది యోగములు ఆతఁడు చూపించిన మార్గములే. ఆతఁడు కర్మజీవుల శుద్ధరించుట కొఱకు ఈ యుపాయముల నేర్పఱచెను. అతఁడు విశదమైన బంగారు కాంతిగల జటాజూటము గలవాఁడై నీయం దవతరించినాఁడు. వికసించిన తామరల వంటి వాతని కన్నులు. ఆతని పాదములన్ పద్మరేఖలు వజ్రచిహ్నములు. హలలక్షణము, కులిశాంకనము, అంకుశరేఖలు, సత్త్వప్రధానమైన మూర్తి ఆస్వామి. ఓ దేవహూతీ! ఆతఁడు నీకు తత్త్వమార్గము నుపదేశించి నీ సంశయ గ్రంథిని వినాశ మొనర్చును. అంతేకాదు. సిద్ధగణసేవితుఁడై తత్త్వ

స్వరూపములను నిరూపించి సాంఖ్యయోగమున కధినేతమై కపిలుఁడను పేరుతో ఈ ప్రపంచమున సంచరించును. మరల బ్రహ్మదేవుఁడు కర్దముని వైపు తిరిగి యన్నాఁడు. -"నాయనా! కుమార్తెలకు వివాహ మొనర్చిన తరువాతనే నీసన్యాస గ్రహణము". ఈ మాటలతో బ్రహ్మ సత్యలోకమున కేగెను. ఆతని వెంటనే నారద సనకాదులు కూడఁ బోయిరి. కర్దముడు బ్రహ్మచేత ప్రేరేపింపబడినవాఁడై యథోచితముగా తన కన్యలను మహర్షుల కిచ్చి వివాహము చేసెను. మరీచికి కళ నొసఁగెను. అత్రి అనసూయను చేపట్టెను. శ్రద్ధను అంగిరసుఁడు చేపట్టెను. పులస్త్యునకు హవిర్భువు నొసఁగెను. గతి పులహుని భార్య. క్రతువునకు క్రియ భార్య. భృగుమహర్షి ఖ్యాతిని చేపట్టినాఁడు. వశిష్ఠుఁడరుంధతికి భర్త. అధర్వుఁడు శాంతిని చేపట్టెను. ఈ వివాహము లన్నియు కులాచార సరణిగనే సాగెను. కర్దముఁడు అల్లుండ్రను గొప్ప గౌరవములతో సన్మానించినాఁడు. వా రెంతయో సంతోషమొందిరి. ఆ మహర్షులు కర్దమునిచే ననుజ్ఞాతులై భార్యలతోఁగూడ నిజాశ్రమములకుఁ బోయిరి. కర్దముఁడు సర్వోత్తముఁడైన శ్రీహరి తనయింట పుట్టినాఁడని బ్రహ్మదేవుని వచనముల చేతను, శ్రీహరి తన కిచ్చిన మాటవల్లను తెలిసికొన్నాఁడు. ఆతఁడే కాంత స్థలమునఁ కేగెను. కపిలునకు నమస్కార మొనర్చి ఇట్లన్నాఁడు.

స్వామీ! ఈ మానవులు తమజన్మములలో అమంగళకరములైన అనేక దుష్కర్మలొనర్తురు. ఆ దుష్కర్మలచేత నిరంతరము పరితపించు చుందురు తత్ఫలము వారికి అనంత సంసారమును అనంతవేదనను గల్గించును. వారి జనన మరణములకు విడుమరయే లేదు. నిత్య సంసారులు. ఇట్లు అనంతకాలము గడచును. అనేక వ్రతనిష్ఠలతో ఇంద్రియముల జయింప యత్నింతురు చాల జన్మలకు ఇంద్రియాధిష్ఠానదేవతలు తృప్తినంది కరుణింతురు. బహుజన్మలు సాంకేతికమైన యోగమార్గముల ననుష్ఠించి సమాధిని సాధించుకొందురు. దుష్కరములైన తపముల నొనర్తురు. ఆ తపఃఫలముగా ఏకాంతమందు నీ పాదపద్మములు పొడగందురు. నిన్ను సాక్షాత్కరించు కొనుట మహోదుర్లభమైనపని. అట్టి పురుషోత్తముఁడవైన నీవు కరుణతో నాకొసఁగిన వరదానమును బట్టి నా యింట బుట్టితివి. స్వామీ! మేము సంసార చక్రమందు తిరుగుచుండువారము. గ్రామ్యులము. నీవు మా ప్రవృత్తులలోని దోషములు గణింపక నాకు నీ విచ్చిన మాటను దప్పక నన్నుగ్రహింప దయచేసినావు. అనాద్యనంత! నీ యవతారము లన్నియు అప్రాకృతమైన తత్త్వముతో కూడినవి. చతుర్భుజుడు లయిన నీ మూర్తి కను రూపములై యుండును. నీవే పరమ పురుషుఁడవు. పరమాత్ముఁడవు. నీకు నమస్కారము.

846. భవదీయ=నీ వారైన, ఆశ్రితజన=ఆశ్రితులయొక్క, సంరక్షణము కొఱకున్=రక్షించుటకొఱకు, మానవ రూపంబులు=తాల్చినట్టిరూపంబులు, అనురూపము లగును గాదె=తగినట్టివి అగునుగదా!

847. సుమహిత=గొప్పదైన, తత్త్వజ్ఞానార్థము=తత్త్వముల నిజస్వరూపమును గూర్చిన జ్ఞానము కొఱకె, విద్వజ్జన గణంబు=అనుభవజ్ఞానులయొక్క, గుంపు, పదపీఠము=పాదములయొక్క ప్రదేశము, తవణించు=వ్యాప్యానించు.

848. సమధిక=గొప్పదైన, షడ్గుణైశ్వర్య=ఆరువిధములైన ఐశ్వర్యములకు, కారణుఁడవు=కారణభూతుఁడైనవాఁడవు. పరమేశ్వరుండవు=అందరికంటె నుత్తముఁడవు. ప్రకృతి పురుష=ప్రకృతిని నడిపించెడి పురుషుఁడైనవాఁడా! మహదహంకార=మహత్తత్త్వము అహంకార తత్త్వము, తన్మాత్ర=పంచభూతముల యొక్క మాత్రలు, తత్ క్షోభక=మహత్తత్త్వము యొక్క సామ్యస్థితిని క్షోభింపఁ జేసెడు అహంకార తత్త్వమును, హేతు=సమస్తమునకును కారణమైన, కాలాత్మ=కాలము యొక్క స్వరూపము, విఖ్యాత ధృతివి=ప్రసిద్ధమైన ధైర్యము కలవాఁడవు. జగత్+ఆత్మకుఁడవు=ప్రపంచము నీస్వరూపమైన వాఁడవు. చిచ్ఛక్తివి=జ్ఞానస్వరూపుఁడవు. జఠర నిక్షిప్త=ఉదరమందున్న, విశ్వ ప్రపంచమును గల=సమస్త ప్రపంచమును కలిగినట్టి, స్వచ్ఛంద శక్తియుక్తుండవు= స్వతంత్రమైన శక్తితో కూడినవాఁడవు. సర్వసాక్షివి=సమస్తము నెఱిఁగెడి వాఁడవు. నాకుపుట్టిన కతనన్=నాకు జన్మించిన కారణముతో, ఋణత్రయంబువలనన్ పాసితిన్=దేవ ఋషిమానవ ఋణములను తీర్చికొన్నాను. భక్తవరద=భక్తుల కొఱతలు తీర్చి రక్షించువాఁడా!

849. వ్రతయోగ సమాధినియతి=వ్రతములు యోగములు వీనిచేత ఏర్పడిన సమాధి స్థితితో, డెందమునన్=మనస్సులో, శోకంబులందున్ తొలఁగి= శోకములనుండి వీడివడిన వాఁడనై, అంచిత స్థలములందున్=ప్రసిద్ధమైన తీర్థములలో,

850. మునిపుంగవుఁడు=మునిశ్రేష్ఠుడు, ఆర్మిలి=ప్రీతి,

తాత్పర్యము : స్వామీ! నీ యవతారము లన్నియు యలౌకికములే. నీ చతుర్భుజాదిరూపములును అలౌకికములే భక్తులకు రోచమానములైనవి. ఏయే రూపములు కలవో భక్తాభీష్ట ప్రదాయకుఁడ వగుట వలన నీవా యా రూపముల ధరింతువు. ప్రాకృతములైన రూపములు నీకులేవు. నీ స్వరూపము లన్నియు స్వేచ్ఛగా నీ వంగీకరించుకొన్నవే. తత్త్వమును తెలిసికొనఁ గోరెడు విద్వజ్జనులు నీపాదపీఠమును నిరంతరమును నమస్కరింతురు. ఐశ్వర్యము, వైరాగ్యము, యశము, పరిపూర్ణజ్ఞానము, వీర్యము, తేజస్సు ఇవన్నియు నీ స్వరూపములు, ఇవన్నియు నీయందు పూర్ణములై యుండును. ప్రధానమని పిలువఁబడెడు ప్రకృతి స్వరూపుఁడవు నీవే. ప్రకృతి పురుష విలక్షణుఁడైన

వాఁడవును నీవే. ప్రధాన మని పిలువఁబడెడు ప్రకృతియే నీశరీరము. పురుషుఁడని పిలువఁబడెడు జీవశరీరకుఁడు నీవే. నీవే ప్రకృతిని నియమించెడి అధిష్ఠాతవు. మహత్తత్త్వరూపమును నీవే. కాలశరీరకుఁడవు కారణావస్థ ప్రకృతి పురుష కాలస్వరూపుఁడవు. కార్యావస్థ తచ్ఛరీర కర్తయుక్తుఁడవు. మహచ్ఛరీరకుఁడవు నీవే అహంకారము ఈశ్వరరూపము. ప్రధానము యొక్క సహజస్థితిని అహంకారము క్షోభింపఁజేయును. చిచ్ఛక్తిచేత నీయందే సమస్త ప్రపంచమును లీనమై యుండును. నీవు ప్రధానావిర్భావలయ సాక్షివి. కార్యావస్థయందు సత్త్వరజస్తమోగుణముల యొక్క వర్తనమును తచ్ఛరీరకుఁడవు నీవు. వాడు నీస్వరూపమే. నీది స్వచ్ఛందమైన శక్తి. కపిలనామకుఁడవై నీవు గ్రామ్యులమైన మాయం దవతరించితివి. సర్వసాక్షివగు నీకు నమస్కారము. ఆత్మీయ జఠరమందు నిక్షిప్తమైన విశ్వప్రపంచుడవైన సర్వజ్ఞమూర్తీ నీ కేటికోలు. నీవు నాయం దవతరించిన కతమున ఋణత్రయముండి విముక్తుఁడనైనాను. శ్రేష్ఠములైన వ్రతములు యాగములు వీనిచేత సాధింపఁబడిన సమాధి నిశితకలవాఁడనై నీపాదపద్మములందు నా ఆత్మను క్రోడీకరించి దివ్యక్షేత్రముల తిరుగుచు కాలము గడపెదను. ఇట్లు విన్నవించిన కర్దముని జూచి భక్తుల యందు గల అవ్యాజ ప్రేమతో కపిలభగవానుఁడిట్లన్నాఁడు.

851. పూర్వంబునన్=ముందు, ప్రతిశ్రుతము=ప్రతిజ్ఞచేయఁబడినది, వరమునీంద్ర=మునిశ్రేష్ఠుఁడా!నిర్హేతుక స్థితిన్=కారణములేకుండఁగనే, భూరిదయాగుణంబునన్=గొప్ప దయాగుణముచేత, అవాప్త సకల కాముఁడు=పొందఁబడిన సమస్తములైన కోర్కెలు గలవాఁడవు, పరమాత్మ గురు సద్వివేకంబు=పరమాత్మునకు సంబంధించిన గొప్పదై చక్కనిదైన వివేకము, మత్పద ధ్యానశక్తి=నాపాదములను నిరంతరము ధ్యానించుట చేత, ధీపరాయణ మహిమంబు=బుద్ధి వికాసముతో కూడిన మహత్తు.

852. సమధిక నిష్ఠన్=చక్కని నిష్ఠచేత, కృతయోగమునన్=సాధింపఁబడినట్టి యోగముతో, సన్యస్త సకలకర్ముఁడవై=వదలి పెట్టఁబడిన సమస్త కర్మములు కలవాఁడవై, వికార రహితుఁడై=ఏ వికారములు లేనివాఁడవై,

853. సకల భూతనికాయ=సమస్త ప్రాణిసమూహముయొక్క, గుహాశయున్=గుహయందు – హృదయమందు నివసించెడి వానిని.

854. తిరముగన్=స్థిరముగా, భవదీయ=నీయొక్క, అంతఃకరణ=మనస్సునెడు, సరోజాత=పద్మము యొక్క, కర్ణికా తలమునన్=దిమ్మైన, సుస్థిరున్ చేసి=స్థిరముగానున్న వానినిగా చేసికొని, ఇంద్రియంబులన్ నిరసించి=ఇంద్రియములను వాని విషయములనుండి మరలించుకొన్న వాఁడవై మనస్+అంబకమునన్=మనస్సునెడు నేత్రముతో.

855, 856, 857. తనరిన మోక్షమునొందెదవు=ప్రసిద్ధమైన మోక్షమును పొందెదవు, వలగొని=ప్రదక్షిణమొనర్చి, వహ్నిరహితుఁడు=అగ్నులను తనయందారోపించి కొనుటచేత బాహ్యములైన హోమాదులు లేనివాఁడు, ఆత్మ+ఏక శరణ తత్పరుఁడు=ఆత్మ స్వరూపుఁడైన భగవంతుని శరణుఁ జొచ్చుటయందే తాత్పర్యము కలవాఁడు.

858. దయాగుణంబునన్ చేసి=దయవలన, శాంతి శేముషీ గరిష్ఠుఁడు=శాంతితో కూడిన బుద్ధిచేత గొప్పవాఁడు.

తాత్పర్యము : "ఓయి కర్దమా! నీకు నేను నీయం దుదయింతునని పూర్వము ప్రతిజ్ఞయొనర్చియున్నాను. ఆ వచనము పాలన మొనర్చుటకై నీయింట జన్మించితిని. నేను నీ గృహమున నవతరించుటలో నాదైన ప్రత్యేక కారణ మేదియును లేదు. ఎందుకనఁగా నేను అవాప్త సకల కాముఁడను. నాకు ప్రత్యేకముగా కోరఁదగిన కోర్కెలేదు. నీ యింటఁ బుట్టుట ప్రాణులందును, నీ యందునుగల కారుణ్య భావమువలననే. కపిలావతారము మునివేషముతో నున్నది. పరమర్షులకు పరమాత్మను గూర్చిన వివేకమును దెలుపుటకే నాయీ యవతారము. పరమాత్మ యొక్క స్వస్వరూపానుభూతికి తత్త్వములు బాధకములు. తత్త్వము లిట్టి విట్టివని వేర్పరించి చెప్పినచో వానికి భిన్నమైనది పరమాత్మయే. హస్తామలకమువలె స్పష్టముగా ప్రత్యక్షమగును. నా యవతారము యొక్క ప్రధాన ప్రయోజన మిదియే. ఆ మార్గము సంశయ రహితముగా అధికారులైన వారికి నిరూపించుట కొఱకే సచ్చిదాత్మకమై స్వచ్ఛందమైన దేహమును ధరించి వచ్చినాను. ప్రకృతి పురుష వివేకవంతులైన మహామునులు నా బోధతో వివేకులై పరమాత్మ తత్త్వమును స్పష్టముగా గుఱుతింపఁగలరు. నీవు నిష్ఠావంతుఁడవై మెలఁగుము. అష్టాంగ యోగములతో శరీరమును స్వాధీనపఱచుకొనుము. బాహ్యముగ నాంతరికముగ సకల కర్మలను వదలుము. ఒకవేళ కర్మల ననుష్ఠించినచో వానిని నాకే సమర్పించుము. మోహమును సమూలముగా ఖండించుము. నిర్మలమైన భక్తి సహాయముగా మోక్షము నందుటకు యత్నించుము. ఏ వికారమునకును లోగకుము. మానసికములైన వికారములును దైహికములైన వికారములును మానవుని లక్ష్యమునుండి కూల ద్రోయునవి. దైహిక వికారములకు మూలము మానసిక వికారమే యని గుర్తించుకొనుము. నేను పరమేశుఁడను. సకల ప్రాణి హృదయములందును జ్యోతి స్వరూపుఁడుగా వెలుఁగుచుండు నంతర్యామిని నేనే. సమస్త ప్రాణులకు గుహతో సమానమైనది హృదయము. ఆ హృదయమున నిరంతరము సాక్షిభూతుఁడనుగా వెలుఁగుచుందును. మానవు

లొనర్చు కృత్యా కృత్యములతో సంబంధము లేక సాక్షిభూతుఁడనై యుందును. అహంకార ప్రేరితులై మానవులు కృత్యాకృత్యము లొనర్తురు. వానిని గూడ నాకు సమర్పించినపుడు అవి పరిశుద్ధములే యగును. నాకాద్యంతములు లేవు. సుఖదుఃఖాదులు పాపపుణ్యములు మొదలైన ద్వంద్వముల కతీతుఁడను. నీయొక్క హృదయ కమల కర్ణికయందు నన్ను స్థిరముగా నిలుపుకొనుము. ఇంద్రియములను విషయములనుండి మరలింపుము. ఇంద్రియములు మహాప్రమాదము కలిగించును. వానిని నిర్జించుట కష్టమే కాని అభ్యాస ఫలముచేతను, యోగబలము చేతను వానిని స్వాధీనమునకు తెచ్చుకొను మనస్సనెడు చక్షువుతో నా స్వరూపమును చూడుము. ఇట్లు వర్తించుటయే మోక్షమునకు మార్గము. "కర్దమున కీర్ధలు మహార్థములుగా కనిపించినవి. ఆతఁడు కపిల మహర్షికి త్రిఃప్రదక్షిణ మొనర్చెను. మనస్పూర్తిగా వందనము లొనర్చినాఁడు. శరీరమంతయుఁ భక్తితో పులకితమైనది. ఆతఁడు మునిగణ సేవితములగు వనములకు బయలుదేరెను. మౌనము వహించినాఁడు. జీవితమున జరిగిన ఏ సన్నివేశమందును సంగములేదు. భార్యాదుల నెన్నడో విస్మరించి నాఁడు. బాహ్యాభ్యంతరములందు దేనియందును సంగము లేదు. వహ్నుల యం దారోపించుకొన్నాఁడు. అందుచే బాహ్యమైన అగ్నియం దొనర్చెడు ఆహుతులచే తలఁగెను. ఆతఁడనికేతనుఁడు. ఒక్క స్థలమని లేదు. సంగమేర్పడు నని ఒక్కచోట నిలుకడగ నిలుచుటలేదు. ఆతని దృష్టియంతయు భగవత్పదముల యందే. నే ననెడు భావ మాతని కెప్పుడో తొలఁగిపోయెను. ఆతని యందు మమత్వమునకు చోటే లేదు. సమస్త భూతములను దయతో పరబ్రహ్మ మనియే ఉపాసించుచున్నాఁడు. సకల భూత సమత్వ మాతని సమత్వమే యైనది ఎట్టి పరిస్థితిలోను వికారమునొందని మనశ్శాంతి యాతని తపస్సునకు ప్రధానాంగ మయ్యెను. వికార రహితమైన మనస్సుతో నాతఁడు తరంగ చలనములేని సముద్రమువలె నున్నాఁడు. ధైర్య మెప్పుడును దలఁగుట లేదు. సమస్త ప్రపంచ మాతనికి వాసుదేవమయమే అయినది. "వాసుదేవ స్సర్వమితి, స మహాత్మా సుదుర్లభః" అనువచనమున కాతఁడు ప్రధాన లక్ష్యమైనాఁడు. భక్తియోగము నాశ్రయించిన కర్దమ మహర్షి కొన్ని దినములకు భాగవత గతి నందినాఁడు.

ఇది పోతనామాత్య విరచితమైన ఆంధ్ర భాగవతమున
భాగవత సుధాలహరి వ్యాఖ్యయందు తృతీయస్కంధమున
ఇరువది నాలుగవ యధ్యాయము.

పంచవింశోఽధ్యాయః

కపిలదేవహూతి సంవాదారంభః

శ్రీశౌనక ఉవాచ

కపిల స్తత్త్వ సంఖ్యాతా భగవా నాత్మమాయయా,
జాత స్స్వాయ మజ స్సాక్షా దాత్మప్రజ్ఞప్తయే నృణామ్. 1

న హ్యస్య వర్త్మణః పుంసాం వరిష్ణో స్సర్వయోగినామ్,
విశ్రుతౌ శ్రుతదేవస్య భూరి తృష్యంతి మేఽసవః. 2

యద్యద్విధత్తే భగవాన్ స్వచ్ఛందాత్మాఽఽ త్మమాయయా,
తాని మే శ్రద్దధానస్య కీర్తనీయాని కీర్తయ. 3

శ్రీ సూత ఉవాచ

ద్వైపాయనసఖ స్త్వేవం మైత్రేయో భగవాం స్తథా,
ప్రాహేదం విదురం ప్రీత ఆన్వీక్షక్యాం ప్రచోదితః. 4

శ్రీమైత్రేయ ఉవాచ

పితరి ప్రస్థితేఽరణ్యాం మాతుః ప్రియచికీర్షయా,
తస్మిన్ బిందుసరేఽ వాత్సీ ద్భగవాన్ కపిలః కిల. 5

తమాసీన మకర్మాణం తత్త్వ మార్గాగదర్శినమ్,
స్వసుతం దేవహూత్యాహ ధాతు స్సంస్మరతీ వచః. 6

దేవహూతి రువాచ

నిర్విణ్ణా నితరాం భూమ న్నసదింద్రియ తర్షణాత్,
యేన సంభావ్యమానేన ప్రవిష్టాంధం తమః ప్రభో! 7

తస్య త్వం తమసోఽంధస్య దుష్పార స్యాద్య పారగః,
సచ్చక్షు ర్జన్మనా మంతే లబ్ధం మే త్వదనుగ్రహాత్. 8

య ఆద్యో భగవాన్ పుంసా మీశ్వరో వైభవాన్ కిల,
లోకస్య తమసాఽంధస్య చక్షు స్సూర్య ఇవోదితః. 9

అథ మే దేవ సంమోహ మపాక్రష్టుం త్వ మర్హసి,
యోఽ గ్రహోఽహం మమే తీత్యేతస్మిన్ యోజిత స్త్వయా. 10

తం త్వాం గతాహం శరణం శరణ్యం
స్వభృత్య సంసారతరోః కుఠారమ్,
జిజ్ఞాసయా ప్రకృతేః పూరుషస్య
నమామి సద్ధర్మవిదాం వరిష్ఠమ్. 11

మైత్రేయ ఉవాచ

ఇతి స్వమాతు ర్నిరవద్య మీప్సితం
నిశమ్య పుంసా మపవర్గ వర్ధనమ్,
ధియాఽభి నంద్యాఽఽత్మవతాం సతాం గతి
ర్బభాష ఈషత్స్మిత శోభితాననః. 12

శ్రీభగవానువాచ

యోగ ఆధ్యాత్మికః పుంసాంమతో నిశ్శ్రేయసాయ మే,
అత్యంతోపరతి ర్యత్ర దుఃఖస్య చ సుఖస్య చ. 13

త మిమం తే ప్రవక్ష్యామి య మవోచం పురాఽనఘే,
ఋషీణాం శ్రోతుకామానాం యోగ మర్వాంగ నైపుణమ్. 14

చేతః ఖల్వస్య బంధాయ ముక్తయే చాత్మనో మతమ్,
గుణేషు సక్తం బంధాయ రక్తం వా పుంసి ముక్తయే. 15

అహం మమాభిమానోత్థైః కామలోభాదిభిర్మలైః,
వీతం యథా మనశ్శుద్ధే మదుఃఖ మసుఖం సమమ్. 16

తదా పురుష ఆత్మానం కేవలం ప్రకృతేః పరమ్,
నిరంతరం స్వయంజ్యోతి రణిమాన మఖండితమ్. 17

జ్ఞానవైరాగ్యయుక్తేన భక్తియుక్తేన చాత్మనా,
పరిపశ్యత్యుదాసీనం ప్రకృతిం చ హతౌజసమ్. 18

న యుజ్య మానయా భక్త్యా భగవత్యఖిలాత్మని,
సదృశోఽస్తి శివః పంథా యోగినాం బ్రహ్మసిద్ధయే. 19

ప్రసంగ మజరం పాశ మాత్మనః కవయో విదుః,
స ఏవ సాధుషు కృతో మోక్షద్వార మపావృతమ్. 20

తితిక్షవః కారుణికా సుహృద స్సర్వదేహినామ్,
అజాతశత్రవ శ్శాంతా స్సాధవ స్సాధుభూషణాః. 21

మయ్యనన్యేన భావేన భక్తిం కుర్వంతి యే దృఢామ్,
మత్కృతే త్యక్తకర్మాణ స్త్యక్తస్వజన బాంధవాః. 22

మదాశ్రయకథా హృష్టా శ్శృణ్వంతి కథయంతి చ
తపంతి వివిధా స్తాపా నైతా న్మద్గతచేతసః. 23

త ఏతే సాధవ స్సాధ్వి! సర్వసంగవివర్జితాః
సంగ స్తేష్వథ తే ప్రార్థ్యః సర్వదోషహరా హి తే. 24

సతాం ప్రసంగా న్మమవీర్య సంవిదో
భవంతి హృత్కర్ణ రసాయనాః కథాః,
తజ్జోషణా దాశ్వపవర్గవర్త్మని
శ్రద్ధా రతి ర్భక్తి రనుక్రమిష్యతి. 25

భక్త్యా పుమాన్ జాతవిరాగ ఐంద్రియా
ద్దృష్టశ్రుతా న్మద్రచనానుచింతయా
చిత్తస్య యత్తో గ్రహణేన యుక్తో
యతిష్యతే ఋజుభి ర్యోగమార్గైః. 26

అనేన యాఽయం ప్రకృతే ర్గుణానాం
జ్ఞానేన వైరాగ్య విజృంభితేన,
యోగేన మయ్యర్పితయా చ భక్త్యా
మాం ప్రత్యగాత్మాన మిహాఽవరుంధే. 27

దేవహూతి రువాచ

కాచి త్త్వయ్యుచితాభక్తిః కీదృశీ మమ గోచరా,
యయా పదం తే నిర్వాణ మంజసాఽన్వశ్నవా అహమ్. 28

యో యోగో భగవద్బాణో నిర్వాణాత్మం స్త్వయోదితః,
కీదృశః కతి వాంగాని యత స్తత్త్వావబోధనమ్. 29

తదేత న్మే విజానీహి యథాఽహం మంధధీ ర్హరే,
సుఖం బుధ్యేయ దుర్బోధం యోషా భవదనుగ్రహాత్. 30

శ్రీమైత్రేయ ఉవాచ

విదిత్వార్థం కపిలో మాతు రిత్థం జాతస్నేహో యత్ర తన్వాభిజాతః,
తత్త్వామ్నాయం యత్ప్రవదంతి సాంఖ్యం ప్రోవాచవ్యోభక్తి వితానయోగమ్. 31

శ్రీభగవా నువాచ

దేవానాం గుణలింగానా మానుశ్రవికకర్మణామ్,
సత్వ ఏవైక మనసో వృత్తి స్సాభావికీ తు యా. 32

అనిమిత్తా భాగవతీ భక్తి స్సిద్ధే ర్గరీయసీ,
జరయ త్యాశు యా కోశం నిగీర్ణ మనలో యథా. 33

నైకాత్మతాకం యే స్పృహయంతి కేచి
న్మత్పాదసేవాభిరతా మదీహాః,

యో ఽన్యోన్యతో భాగవతాః ప్రసజ్య
సభాజయంతో మమ పౌరుషాణి. 34

పశ్యంతి మే రుచిరాణ్యేవ సంతః
ప్రసన్నవక్త్రారుణలోచనాని,
రూపాణి దివ్యాని వరప్రదాని
సాకం వాచం స్పృహణీయాం వదంతి. 35

తై ర్దర్శనీయావయవై రుదార
విలాస హాసేక్షిత వామసూక్తైః,
హృతాత్మనో హృతప్రాణాంశ్చ భక్తి
రనిచ్ఛతో గతి మణ్వీం ప్రయుంక్తే. 36

అథో విభూతిం మమ మాయయా వినా
మైశ్వర్య మష్టాంగ మను ప్రవృత్తమ్,
శ్రియం చ యే న స్పృహయంతి భద్రాం
పరస్య మేతే ఽశ్నువతే నుఽలోకే. 37

న కర్హిచి న్మత్పరా శ్శాంతరూపే
నంక్ష్యంతి నోమేఽనిమిషో లేఢి హేతిః,
యేషా మహం ప్రియ ఆత్మా సుతశ్చ
సఖా గురు స్సుహృదో దైవమిష్టమ్. 38

ఇమం లోకం తథైవాము మాత్మాన ముభయాయినమ్
ఆత్మాన మను యే చేహ మే రాయః పశవో గృహాః. 39

విసృజ్య సరంశ్చ మా మేవం విశ్వతో ముఖమ్,
భజం త్యనన్యయా భక్త్యా తా న్మృత్యో రతిపారయే. 40

నాన్యత్ర మద్భగవతః ప్రధానపురుషేశ్వరాత్,
ఆత్మన స్సర్వభూతానాం భయం తీవ్రం నివర్తతే. 41

మద్భయాద్వాతి వాతోఽయం సూర్యస్తపతి మద్భయాత్,
వర్షతీంద్రో దహత్యగ్ని ర్మృత్యు శ్చరతి మద్భయాత్. 42

జ్ఞానవైరాగ్య యుక్తేన భక్తియోగేన యోగినః,
క్షేమాయ పాదమూలం మే ప్రవిశం త్యకుతోభయమ్. 43

ఏతావా నేవ లోకేఽస్మిన్ పుంసాం నిశ్శేయసోదయః,
తీవ్రేణ భక్తియోగేన మనో మయ్యర్పితం స్థిరమ్. 44

ఇతి శ్రీమద్భాగవతే తృతీయస్కంధే పంచవింశోఽధ్యాయః

1. అజఃజన్మాది రహితుడుఁ ను, భగవాన్=జ్ఞానస్వరూపుఁ డును, ఆత్మమాయయా=స్వేచ్ఛచేత, నృణాం=మనుష్యులకు, ఆత్మప్రజ్ఞప్తయే=ఆత్మ తత్త్వమును తెలిసికొను యోగ్యతను ప్రసాదించుటకై, అయం సాక్షాత్ తత్త్వసంఖ్యాతాఃతనకు తానే ప్రత్యక్షమై తత్త్వ సంఖ్యను నిర్ణయించెడి శాస్త్రమును ప్రచారము చేయుచున్నవాఁడై, కపిలఃజాతఃకపిల మహర్షిగా జన్మించెను.

తాత్పర్యము : మనువు యొక్కయు, ఆతని సంతానము యొక్కయు చరిత్రను విన్న శౌనక మహర్షి కపిల మహర్షి చరిత్ర వినఁగోరువాఁడై సూతుని ప్రశ్నించుచున్నాఁడు. జన్మాదులైన వికారము లేని జ్ఞానస్వరూపుఁడైన భగవంతుఁడు తనకుతానే మహర్షులకు పరమాత్మ బోధను గూర్చి తెలుప వలెనను కామ్యముతో దాని కుపకరించెడు సాంఖ్యశాస్త్రమును లోకమున వ్యాప్తికి తేఁదలఁచినవాఁడై కపిల మహర్షిగా జన్మించెను.

2. పుంసాం వర్ష్మణఃపురుషులలో శ్రేష్ఠుఁడును, సర్వయోగినాం వరిష్ఠోఃసర్వయోగి గణములలో వరిష్ఠుఁడును, శ్రుతదేవస్యతన్ను గూర్చి విన్నప్పుడే జ్ఞానస్వరూపుఁడై మనస్సులందు ప్రకాశించువాఁడైన, అస్యకపిల మహర్షియొక్క, విశ్రుతకీర్తి శ్రవణమందు, మేఅసవఃనా ఇంద్రియములు, భూరినతృప్యంతిఎక్కువగా తృప్తిపడుటలేదు.

తాత్పర్యము : ఆ భగవంతుఁడు పురుషోత్తముఁడు. సర్వయోగులకును వారి వారి యోగానుష్ఠాన ఫలమును ప్రదానమొనర్చెడు సర్వశ్రేష్ఠుడైన యోగి, ఆతని చరిత్ర వినుచున్నప్పుడే హృదయమందు జ్ఞాన స్వరూపుఁడుగా ప్రకాశించెడు భగవంతుఁడు. అట్టి దివ్యమూర్తి మహిమను విని నా శ్రోత్రాదులైన ఇంద్రియములు తృప్తినందుటలేదు.

3. స్వచ్ఛందాత్మాతన ఇచ్ఛతోనే దేహమును ధరించిన, భగవాన్=జ్ఞానస్వరూపుఁడు, ఆత్మమాయయాతన ఇచ్ఛచేతనే, యద్యద్విధత్తేదేని దేని ననుష్ఠించెనో, కీర్తనీయానికీర్తించుటకు యోగ్యములైన, తానివానిని, శ్రద్దధానస్యశ్రద్ధాయుక్తుఁడైన, మేనాకు, కీర్తయక్రమముగా వర్ణింపుము.

తాత్పర్యము : ఆ భగవంతుఁడు ఆత్మేచ్ఛతోనే దేహాదులను గ్రహించి ప్రపంచమం దవతరించెను. ఆ కపిల మూర్తికి జీవానుగ్రహమే ప్రధానమైన చోదకశక్తి. ఆతఁడు తనజీవితమందు స్వయముగా ఏయే ప్రవృత్తుల ననుసరించెనో, ఏయే అనుష్ఠానము లాచరించెనో అవి నాకు విశదముగా వర్ణించి చెప్పుము. కీర్తించెడి వారికి పరమపురుషార్థమునందింపగలిగిన శక్తిగల వాతని చరిత్రలు. వాని వినెడు నాసక్తి యెంతయో గలదు. దయచేసి వివరింపుము.

4. భగవాన్=పరిపూర్ణ జ్ఞానియు, ద్వైపాయన సఖుఁ=వ్యాసుని చెలికాఁడునైన, మైత్రేయుఁ=మైత్రేయుడు, తథా=ఆరీతిగా, అన్వీక్షక్యాం=బ్రహ్మవిద్యయందు, ప్రచోదితుఁ=ప్రేరేపించబడినవాఁడును, ప్రీతుఁ=సంతోషముతో కూడినవాఁడై, విదురం=విదురునిగూర్చి, ఇదం ప్రాహ=ఇట్లు పలికెను.

తాత్పర్యము : సూతుఁడు శౌనకునితో ననుచున్నాఁడు. ఓయీ శౌనకమునీ! ఇప్పుడు నీవు నన్నడిగినట్లే జ్ఞానాదులైన భగవద్గుణముల యందు పరిపూర్ణుఁడైన పరాశర శిష్యుఁడైన మైత్రేయుని విదురుఁడు కపిలభగవంతుఁడు లోకమందు ప్రచారమొనర్చిన బ్రహ్మవిద్యను గూర్చి ఉపదేశింపవలెనని ప్రార్థించినాఁడు. ఆ ప్రశ్నతో సంతోషించిన మైత్రేయుఁడు విదురునకు ఉపదేశించిన మార్గముననే నేను నీకు వివరించుచున్నాను. శ్రద్ధగా వినుము.

5. పితరి=తండ్రియైన కర్దముఁడు, అరణ్యం ప్రస్థితే=అడవులను గూర్చిపోఁగా, భగవాన్ కపిలుఁ=భగవంతుఁడైన కపిలమహర్షి, మాతుఁ ప్రియచికీర్షయా=తల్లికి సంతోష మొనగూర్పవలెనను ప్రయత్నముతో, తస్మిన్ బిందుసరే=ఆ బిందు సరస్సునందే, అవాత్సీత్=వసించెను.

తాత్పర్యము : మైత్రేయుఁ డనుచున్నాఁడు. తండ్రియైన కర్దముఁడు వనమున కేగెను. భగవంతుఁడైన కపిలుడు తల్లికి ప్రియము గూర్ప నెంచినాఁడు. అది అతని కేర్పడిన కారుణ్యమే. ఆ కారుణ్యముతో నాతఁడు బిందు సరస్సు నందే వసించెను.

6. అకర్మాణం=కర్మమునుండి నివృత్తుఁడును, తత్త్వమార్గాగ్రదర్శినం =తత్త్వమార్గ సిద్ధాంతమును సూచించెడు వాఁడును, ఆసీనం=సర్వసుఖిగానున్న, స్వసుతం=తనకుమారుఁడైన కపిలునిగూర్చి, ధాతుర్వచఃబ్రహ్మదేవుని వాక్కును, సంస్మరతీదేవహూతిఃచక్కగా జ్ఞాపకమునకుఁ దెచ్చుకొన్న దేవహూతి, ఆహ=ఇట్లన్నది.

తాత్పర్యము : ఆతఁడు సకల కర్మలనుండి నివృత్తుఁడు. తత్త్వ మార్గమును లోకమునందు ప్రచారము చేయుటకై దయచేసిన భగవంతుఁడు. అతని మనస్సునం దసుఖలేశము లేదు. తన గర్భమందాతఁడు జన్మించుటకు దేవహూతి పొంగిపోవుచున్నది. ఆమెకు బ్రహ్మదేవుఁడు పల్కిన మాటలు మనసులో ఉన్నవి. ఆమె కపిలునితో నన్నది.

7. భూమన్ ప్రభో!=సర్వమునందును నిరంతరా విచ్ఛిన్న స్వరూపముతో వెల్గొందుచున్న ఈశ్వరుఁడవైన కపిల మహర్షి, అసదింద్రియ తర్పణాత్=అసత్తు లైన ఇంద్రియములను విషయములందు వినియోగించి వానికి సుఖముగూర్చుట యను చాపల్యము కారణముగా, నితరాం నిర్వాణం=ఎక్కువగా నిర్వేద

మొందుచున్నాను. సంభావ్యమానేన యేన=నిరంతరము వానియందే దృష్టియుంచి వానిని తృప్తి పఱచెడు వ్యాపారముతో, అంధం తమః=మహామోహమును, ప్రవిష్టాం=పొందినదాననైనాను.

తాత్పర్యము : దేవహూతి యన్నది. స్వామీ! నీవు సకలానందావిచ్ఛిన్న స్వరూపుఁడవై వ్యాపించియున్నవాఁడవు. నీకు నేను వేఱుగా నామనస్సును విప్పిచెప్పవలసిన పనిలేదు. అయినను నాసంతాపమును నివేదించుకొనుట నావిధి కనుక తెల్పుచున్నాను. ఇంద్రియ సుఖము లెంత యనుభవించినను మరల మరల అవి కోరుచునే యుండును. శబ్దాది విషయములతో లభించెడి ఇంద్రియ సుఖములను గూర్చి చింతించుటతోనే ఆయుస్సంతయు గడచి పోయినది. ఈ మహామోహము నుండి విడుమర లభించుటయేలేదు. దీనినుండి మనస్సున క్లేశ మావరించుకొన్నది.

8. దుర్మూరస్య=పారములేనట్టి, అంధస్య=అగాధమైనదియునైన, తస్యతమసః =ఆచీకటినుండి, పారగః=గట్టును పొందించునదైన, సచ్చక్షుః=శ్రేష్ఠమైన నేత్రముగానున్న, త్వం=నీవు, త్వదనుగ్రహాత్=నీయొక్క అనుగ్రహముచేత. జన్మనాం అంతే=అనేకజన్మల అవసానమందు, మేలబ్ధం=నానుండి పొందఁబడితివి.

తాత్పర్యము : స్వామీ! ఈ మహామోహము ఒడ్డులేని పెద్దప్రవాహము. దీనిలోతు తెలియుట కెవ్వరికిని సాధ్యముకాదు. నే ననేక జన్మములుగా అంధురాలనై దానియందే కొట్టుకుపోవుచు మునుఁగుచు లేచుచుంటిని. ఇది యంధం తమస్సని ఇంతవరకు తెలియదు. దీని గట్టెక్కడనున్నదో తెలియదు. నీవు నాకు ఉత్తమమైన నేత్రమై లభించితివి. ఈ లభించుటయు నీకరుణా విశేషమే. అనేక జన్మముల దుఃఖము ఈ జన్మతో తీరిపోవుచున్నది. ఎందుకనగా మూర్తమైన జ్ఞాననేత్రము నీవు లభించితివి.

9. యః=ఎవ్వఁడు, పుంసాం=జీవులయొక్క, ఆద్యః=కారణభూతమై యున్న, భగవాన్=భగవంతుఁడవో, సః ఈశ్వరః వైభవాన్=సర్వ నియంతవును, సర్వాధిష్ఠాతవునైయున్న నీవు, లోకస్య=లోకముయొక్క, చక్షుః=నేత్రమైన, సూర్యఇవ=సూర్యునివలె, ఉదితః=జన్మించితివి.

తాత్పర్యము : స్వామీ! నీవు సమస్త లోకములకును మూల కారణమైన వాడవు. సమస్త పదార్థములంద వసించుచు వానిని నియమించువాఁడవు. అట్టి ఆ భగవంతుఁడవు నీవుద్భవించితివి. ఈ లోకము అజ్ఞానమనెడు అంధకారములో మునిఁగియున్నది. పరమార్థ వస్తువును వారెఱుఁగరు. ఎఱుఁగక మహామోహమందే పరిభ్రమించుచుందురు. ఆ పరిభ్రమణము వినాశన మొనర్చ

నీకు కరుణ యేర్పడినది. అజ్ఞానమును పోగొట్టుటకు సాధనమైన జ్ఞానదృష్టిని సాధనా విశేషములతో ప్రపంచమున కివ్వ వచ్చినావు. నీవు నిజమైన సూర్యుడవు. ప్రకాశ స్వరూపుడవు. జ్ఞానమే నీ ప్రకాశము.

10. ఏతస్మిన్=ఈశరీరమందు, అహం ఇతి=నేననియును, మమఇతి=నాదనియు, యః అవగ్రహః=ఏ అభిమానము, త్వయా=నీచేత, యోజితః =యోజితమైయున్నదో, దేవ=ఓ ఈశ్వరా! మే సమ్మోహం=ఆ నా సమ్మోహమును, అపాక్రష్టుం=నిరాకరించుటకు, త్వం అర్హసి=నీవు యోగ్యుడవు.

తాత్పర్యము : జడమైన ఈ దేహమందు ఆత్మాభిమానమునారోపించుటచేత నేననుభావ మేర్పడినది. దాని ననుసరించి నాదనుభావము. ఈభావముయొక్క సంతానమే దార పుత్రాదులు. ఈ రెండు భావము లెట్లేర్పడినవి? భగవంతుని మాయాశక్తిచే నేర్పడినవి. ఈమోహమున కంతమెప్పుడు? భగవంతుని కరుణా విశేషము జీవునందు ప్రసరించి నపుడు. ఈ అభిమానము తొలగినపుడు ఆత్మస్వరూపుడుగా జీవుడు భాసించును. కనుక నేను నాదను భావము భగవంతుని మాయాశక్తితోనే ఏర్పడును. ఆ అభిమానము నశించి నపుడు పరమార్థజ్ఞానమేర్పడును. ఆ జ్ఞానమును నీవులోకమునకు ప్రసాదించుటకై కరుణతో నేతెంచినావు. అందుచే నీవు నాయభిమానమును సమూలముగా నశింపఁ జేసి న న్నుద్ధరించుట కేకై కాధారమైన వాడవు.

11. స్వభృత్య సంసార తరోః=నీభృత్యుల యొక్క సంసారమనెడు చెట్టునకు, కుఠారః=భేదించెడి గండ్రగొడ్డలియు శరణ్యం=శరణార్హుడుగానున్న, తం త్వాం=అట్టినిన్ను, అహం శరణంగతా=నేను శరణుఁజొచ్చిన దాననైతిని, ప్రకృతేః=ప్రకృతి, పూరుషస్య=పురుషుడు వీనియొక్క స్వరూపములను గూర్చి, జిజ్ఞాసయా=తెలిసికొనవలెనను ఇచ్ఛచేత, సద్ధర్మవిదాం వరిష్ఠం=నాశరహితమైన సద్ధర్మము యొక్క ఉపాయము తెలిసిన వారిలో వరిష్ఠుడైన నిన్ను గూర్చి, నమామి=నమస్కరింతును.

తాత్పర్యము : ఓ భగవన్! ప్రకృతి పురుష తత్త్వమును తెలిసికొనవలెననెడు తీవ్రేచ్ఛగలనేను మోక్షోపాయవిదులలో వరిష్ఠుడు, భక్తులయొక్క జన్మ జరామరణాది స్వరూపమైయున్న, సంసారమనెడు వృక్షమును సమూలముగ భేదించెడు పరమగురు స్వరూపుడవైన నిన్ను శరణుఁ జొచ్చుచున్నాను. నీవే శరణుఁ జొచ్చుట కర్హుడవు. నీకు మనః పూర్వకమైన నమస్కారము.

12. పుంసాం=పురుషులకు, అపవర్గ వర్ధనం=మోక్షమునందలి తాత్పర్యమును వర్ధింపఁజేయునది, నిరవద్యాం=దోషరహితమునైన, స్వమాతుః=తన తల్లియొక్క, ఇతి ఈప్సితం=ఈప్రకారముగా నున్న అభీష్టమును, నిశమ్య=విని, ధియా=బుద్ధితో,

అభినంద్య=మంచిదని యభినందించినవాఁడై, ఆత్మవతాం=తన్నుపాసించెడి, సతాం=సత్పురుషుల యొక్క, గతిః=ప్రాప్యస్థాన భూతమైన భగవంతుఁడు, ఈషత్ స్మిత శోభితాననః=తిన్నని చిరునవ్వుతో కూడినవాఁడై, బభాషే=పలికెను.

తాత్పర్యము : మైత్రేయుఁడనెను. జీవిత క్లేశము లనుభవించువారికి తన్నివృత్తికరమైన మోక్షమార్గమందు తీవ్రేచ్ఛను వర్ధించునదియు, నిర్దోషమునైన తనతల్లియొక్క ఈ ప్రకారముగానున్న హృదయేచ్ఛను విన్నపుడు కపిలుని కెంతయో ఆనందమైనది. దానిని నాతఁడు హృద్యముగా నభినందించెను. తన్ను భజించెడు భక్తులకు ఫలభూతుఁడుగా నున్న భగవంతుఁడు అల్పమైన మందహాసముతో శోభించుచున్న ముఖకమలముతో మాతృవిషయమై తనకున్న ప్రసన్న భావము తోపింపఁజేయుచు ఇట్లనెను.

13. పుంసాం=పురుషులయొక్క నిశ్శ్రేయసాయ=మోక్షము కొఱకు, అధ్యాత్మికః యోగః=ఆత్మసాక్షాత్కారలక్షణమైన యోగము, మే మతః=నాకు సమ్మతమైనది. యత్ర=దేనియందు, దుఃఖస్యచ=దుఃఖము యొక్కయు, సుఖము యొక్కయు, అత్యంతోపరతిః=అత్యంతమైన నివృత్తి ఏర్పడుచున్నదో.

తాత్పర్యము : భగవంతుఁడిట్లను గ్రహించినాఁడు. సంసారమునుండి విడివడవలెనని తీవ్రముగా నిచ్చించువారలకు ప్రకృతికంటె భిన్నముగా ఆత్మను సాక్షాత్కరింపఁ జేసికొనుటకు ఉపకరించెడు ఉపాయభూతమైన యోగమే నాకు సమ్మతమైయున్న యోగసాధనము. ఎందుకనఁగా ఆత్మసాక్షాత్కారము సిద్ధించినపుడు దేహము ఇంద్రియములు అంతఃకరణము వానివిషయమైయున్న ఆత్మత్వబుద్ధి నివృత్త మగును. అప్పుడు సంసార ధర్మములతో నేర్పడెడు సుఖము, దుఃఖము ఇవి రెండుకూడ నివృత్తము లగును. ప్రకృతి కార్యములైన దేహేంద్రియాంతఃకరణములందు ఆత్మయొక్క అధ్యాసము నిమిత్తముగా నేర్పడెడు శోకమోహాదులు పునర్జన్మకు కారణ మగును. వాని ఆత్యంతిక నాశనమునకు కారణము ఆత్మసాక్షాత్కారమే. ఆ ఆత్మసాక్షాత్కారమున కుపకరించెడి యోగము ఉత్తమమైన మోక్షసాధనము.

14. శ్రోతుకామానాం=వినవలెనను ఇచ్ఛగల, ఋషీణాం=ఋషుల కొఱకై, సర్వాంగనైపుణం=సమీచీనముగా అన్ని వైపులను నిపుణముగా నున్న, యం యోగం=ఏయోగమును, పురా=పూర్వకాలమందు, అవోచం=చెప్పితిమో, అనఘే=నిష్పాపురాలైన ఓ తల్లీ! తం ఇమం=ఆ యోగమార్గమునే, తే ప్రవక్ష్యామి=నీకు చెప్పెదను.

తాత్పర్యము : పూర్వకాలమందు మోక్షమార్గమును గుఱించి ప్రశ్నించెడు తీవ్రేచ్ఛగల ఋషులకై యమనియమాదులైన సర్వాంగములతో కూడి మోక్షమును సాధించుటకు సర్వసమర్థమైనట్టి, ఏ యోగము నుపదేశించితినో దానిని పరిశుద్ధాంతఃకరణముతో కూడిన నీ కుపదేశింపఁ బోయెదను.

15. అస్యాత్మనః=ఈజీవియొక్క, బంధాయ=బంధమునకును ముక్తయేచ=ముక్తికినీ, చేతఃఖలు=మనస్సే కారణము అని, మతం=నా సిద్ధాంతము, గుణేషు=గుణముల కార్యములైన విషయములందు, సక్తం=తాత్పర్యము కలదైనచో, బంధాయ=సంసారబంధము కొఱకగును, పుంసి=ఈశ్వరుని యందు, రక్తంవా=తాత్పర్యము కలది యైనచో, ముక్తయే=ముక్తికొఱకును (అగును)

తాత్పర్యము : మోక్షసాధనములలో యోగము ఉత్తమైనదని చెప్పుటకు గల కారణము వివరించుచున్నాఁడు. ఈ జీవుని యొక్క బంధమునకును ముక్తికినీ కారణమైనది మనస్సే. మనస్సే సర్వమునొనర్చెడిదని నాయభిప్రాయము. ఒకే మనస్సు అన్యోన్య విరుద్ధ కార్యములైన బంధమోక్షములకు కారణ మెట్లగును? దానికి గల శక్తి ఎట్టిది? అని యందువా? గుణకార్యములైన శబ్దాది విషయములందు తీవ్రముగా సక్తమైన మనస్సు బంధకారణము. పరమేశ్వరునం దాసక్తమైన మనస్సు మోక్షకారణము. ముముక్షువైన వాఁడీ విషయమును ఎప్పుడును జ్ఞాపక ముంచుకొనవలెను.

16. అహం మమాభి మానోత్థైఃనేను నాది అను అభిమానమున నుండి ఏర్పడునట్టి, కామలోభాదిభిఃకామమో లోభము మొదలైన, మలైఃదోషములచేత, మనఃమనస్సు, యదావీతం=ఎప్పుడు సంబంధములేనిదై యుండునో తదాశుద్ధం=అప్పుడు పరిశుద్ధమైన దగును. అదుఃఖం=దుఃఖరహితమైనదియు, అసుఖం=సుఖముకూడ, లేనిదై యుండును. సమం=తుల్యావస్థితియై ఉండును.

తాత్పర్యము : బంధమోక్షములకు చిత్తమే కారణమంటివి. ఇది నిశ్చితమైన సిద్ధాంతము. చిత్తము యొక్క చాంచల్య రూపమైన దోషము దాని కశుద్ధిని కలిగించును. తదభావము ఆ చిత్తము యొక్క శుద్ధి కారణము. కనుకచిత్తము పరిశుద్ధము కానిచో యోగమును సాధించుటకు సాధ్యముకాదు. ఆ చిత్తము పరిశుద్ధ మగుటకు కావలసిన మార్గములు కపిలమహర్షి సూచించుచున్నాఁడు. శరీర ఇంద్రియాదుల యందు నే ననుభావము, భార్యాపుత్రాదులయందు నాదియను భావమును అభిమానముతో నేర్పడును. ఈ సంకల్ప నిమిత్తముగా కామక్రోధాదులైన గుర్తులు చిత్తమం దేర్పడును. అప్పుడు శబ్దాది విషయములను స్వాధీనపఱచుకొనుటకును, స్వాధీనమైనచో లభించిన వానితో తృప్తిపడక నంతకంటె నెక్కువగా పొందుటకును జీవి నిరంతరము యత్నించును. ఈ విధముగా నేర్పడెడు మనశ్చాంచల్యమే మనస్సు యొక్క మలము అనఁగా దోషము. ఈ దోష సంబంధము మనస్సునకు లేనిచో అది శుద్ధమైనది. అప్పుడు దానికి శబ్దాది విషయములు ప్రాప్తింపలేదని దుఃఖమేర్పడదు లభించిన దానివలన సుఖ మేర్పడదు. లభించినను లభింపక పోయినను సుఖదుఃఖములు లేక సమానమైన స్థితియం దుండును. ఈ స్థితి మనస్సున కేర్పడువఱకును యోగసాధన సాధ్యము కానేరదు.

17,18. తదా=అప్పుడు, పురుషః=జీవాత్మ, జ్ఞానవైరాగ్య యుక్తేన=జ్ఞానము తోను వైరాగ్యముతోను కూడినదియు, భక్తియుక్తేనచ=భక్తి సంసర్గము కలదైన, ఆత్మనా=మనస్సుచేత, నిరంతరం=నాశరహితముగా, అఖండితం=ఖండించుటకు సాధ్యముకానిదియు, అణిమానం=అతి సూక్ష్ములైన, స్వయంజ్యోతిః=స్వయముగా ప్రకాశించునది, కేవలం=అన్యవస్తు సంగము లేనిదియు, ప్రకృతేః పరం=ప్రకృతి కంటె భిన్నమైనదియు, ఉదాసీనం=ఏ వ్యాపారము లేనిదియునైన, ఆత్మానం=పర మాత్మయును, హతౌజసం=నశించిన శక్తితోకూడినదైన, ప్రకృతించ=ప్రకృతిని, పరిపశ్యతి=సమగ్రముగా చూచును.

తాత్పర్యము : కామలోభాది దోషరహితమై పరిశుద్ధమైన మనస్సునందు శాస్త్ర పఠనముచే సిద్ధించిన జ్ఞానమును విషయములందు తాత్పర్యము లేకయుండెడి వైరాగ్యమును, భగవంతుని యందు పరమభక్తియు దృఢముగా నెలకొనును. ఈ ప్రకారము మనస్సున్నపుడే జీవాత్మ పరమాత్మను సాక్షాత్కరించి కొనును. అపుడు ప్రకృతికి ఆజీవుని యందుఁగల శక్తి లోపించును సాంసారికము లైన సుఖదుఃఖాదులను ఆజీవాత్మతో ప్రకృతి అనుభవింపచేయలేదు. జీవాత్మ పరమాత్మల స్వభావము వానికి చూచినట్లు సరిగా ప్రత్యక్షమగును. అప్పుడు ఆజీవాత్మునకు పరమాత్మ యొక్క అనుభూతియేర్పడును. పరమాత్మ స్వరూపము శస్త్రాదులచేత ఖండించుటకు సాధ్యముకానిదిగా పరమసూక్ష్మమైనది. ఇతరములనుండి ప్రకాశమునాశింపక స్వయం ప్రకాశకముగా వెలుగునది. తన ప్రకాశముతో జడపదార్థము ప్రకాశింప జేయునది. వేనితోను సంసర్గము లేక శుద్ధమైనది. కార్యకారణ రూపముగా ప్రకాశించెడి ప్రకృతికంటె విలక్షణమైనది. సర్వమునం దాసీనము. ఈ స్థితియే జీవున కేర్పడునది.

19. యోగినాం=యోగులకు, బ్రహ్మసిద్ధయే=బ్రహ్మప్రాప్తికి, అఖిలాత్మని=సర్వాత్మయై వెలుగుచున్న, భగవతీ=భగవంతునందును, విద్యమానయా భక్త్యా=యోజింపఁ జేసెడు భక్తితో, సదృశః=సమానమైన, శివః పంథా=మంగళ కరమైన మార్గము, న=లేదు.

తాత్పర్యము : పరమాత్మ సాక్షాత్కారమునకు ప్రధాన కారణము జ్ఞానవైరాగ్య భక్తులని చెప్పఁబడినది. ఈ మాటలోను కూడ భక్తికే ప్రాధాన్య మని చెప్పుచున్నాఁడు. సంసారము నుండి విడివడుటకు తీవ్రముగా నిచ్చించు యోగులకు బ్రహ్మసాక్షాత్కార మెట్లేర్పడును? పరమాత్మ సర్వులయందును ఆత్మస్వరూపుఁడుగా ఉన్నాఁడు. అట్టి ఆ ఆత్మస్వరూపుఁడైన భగవంతునియందు తీవ్రమైన భక్తిని ఏర్పఱచుకొనవలెను. ఇదియే దోషరహితమైన మార్గము. సుఖకరమైన మార్గము కూడ. సర్వమునందు ఆత్మగా వెలుఁగు భగవంతుని సర్వోత్కృష్టముగా తీవ్రమైన భక్తితోనుపాసించు చున్నప్పుడు ఆ పురుషుని ఇతరమైన ఏ దేవతగానీ వాని యానందమునుండి మరలింపఁ జేయలేదు.

సర్వ విఘ్నములకు వాఁడతీతుఁడుగా ఉండును. అందుచేత వాఁడితర దేవతలనుపాసించవలసిన పనిలేదు. మనస్సును భగవత్ ప్రేమయుక్తముగా నొనరించు మని ఇతరదేవతలను దేబెరించవలసిన పనిలేదు. మనస్సు భగవంతుని యందు లయించినపుడు తీవ్రమైన సుఖానుభూతి ఏర్పడును. కష్టలేశమైనను ఉండదు. అందుకే ఈ యోగము సుఖకరమైనది మంగళకరమైనది. ఈ విధమైన భక్తి దప్ప తక్కిన వన్నియు ప్రయాసలు.

20. ఆత్మనఃమనస్సుయొక్క, ప్రసంగం=ప్రకృష్టమైన సంబంధము, అజరం పాశం=దృఢబంధ మని, కవయఃఅనుభవజ్ఞులు. విదుఃతెలిసిరి. సాధుషుసత్పురుషులయందు, కృతఃచేయబడిన, స ఏవఆ సంగమే, అపావృతం= తెఱచుకొనియున్న, మోక్షద్వారంమోక్షమునకు ద్వారము.

తాత్పర్యము : బంధమోక్షములకు మనస్సుయొక్క శుద్ధాశుద్ధులు కారణమని నిశ్చితమైనది. ఈ రెంటికినీ కారణము సంసర్గమని చెప్పుచున్నాఁడు. విషయములు, విషయపరాయణులు వీరితోడి సంసర్గము మనస్సునకు బలమైన సంసార బంధకారణము. వారితోడి సంసర్గముతో విషయ సుఖము లనుభవించుటకు ప్రయత్నమేర్పడు తీవ్రేచ్ఛకలుగును. దానితో పాపము సంభవించును. కనుక అసజ్జన సంసర్గము విడువదగినది. అదే సాధువులతో ప్రకృష్టమైన సంసర్గ మేర్పడినచో అది మోక్షద్వారమునకుఁ గల సకల విఘ్నములను నాశన మొందించును. అప్పుడు మోక్షము సుఖప్రాప్యమగును.

21. తితిక్షవఃక్షమాశీలురు, కారుణికాఃకరుణగలవారు, సర్వదేహినాం =సమస్త ప్రాణులకును, సుహృదఃమిత్రులైనవారు, అజాత శత్రవఃశత్రువను వాఁడెవ్వఁడు లేనివాఁడు. శాంతాఃరాగాది వృత్తులు లేనివారు, సాధుభూషణాఃశోభనమైన భూషణముగలవారు, సాధవఃసాధువులు.

తాత్పర్యము : సాధుసంగమే చిత్తశుద్ధికి కారణమని ముందు చెప్పినారు. ఆ సాధుపురుషుల స్వభావమును నాల్గు శ్లోకములతో వివరించుచున్నారు. సత్పురుషు లెల్లరు ఇతరులు తమయం దపరాధ మొనర్చినను వారు సహించి యుందురు. ప్రతీకార దృష్టి వారి కెప్పుడును ఉండదు. స్వప్రయోజనమనుట వారికి ఉండదు. నిరంతరము పరులదుఃఖమును పోఁగొట్టుటందే వ్యాపృతులు. కరుణతో వారి దుఃఖాపనోదనమునకై ఎల్ల విధముల శ్రమింతురు. సకల జీవులకును క్షేమమునే ఆకాంక్షించు నిర్హేతుక మిత్రులు. వారికి శత్రువు లెప్పుడును లేరు. రాగాది వృత్తుల నతిక్రమించినందుచేత వారి చిత్తశాంతి ఎన్నడును చెడదు. శోభనమైన స్వభావము వారికి భూషణము. ఇట్టివారే సాధువులు. విద్య, కులము, ఆఢ్యత ఇవేవియు సాధు లక్షణములుకావు.

22. మయి=నాయందు, అనన్యేనభావేన=ఇతరులయందు లేశముగూడ ప్రసరింపని మనోభావముతో కూడ, దృఢాం భక్తిం=దృఢమైన భక్తిని, యే కుర్వంతి=ఎవరు చెల్గించుచుందురో, మత్కృతే=నాకొఱకై, త్యక్తకర్మాణః =ఉపేక్షింపఁబడిన కర్మలు గలవా రెవ్వరో, త్యక్త స్వజన బాంధవాఃఉపేక్షింపఁబడిన స్వజనములు బంధువులు గలవా రెవ్వరో వారు సత్పురుషులని యందురు.

తాత్పర్యము : ఇతర దేవతలయందు లేశముగూడ తాత్పర్యము లేని చిత్తవృత్తిగలవారు, మాయందే నియత దీప కళికవలె చాంచల్య రహితమైన భక్తితో కూడినవారు, నాభజన కడ్డువచ్చెడి కర్మల యందాస్తిలేనివారు. ఎవరో నాకొఱకై బంధువులను స్వజనులను వదలినవారు ఎవరో వారు సాధువులు.

23. మదాశ్రయాఃనాకు సంబంధించియున్నవి. హృష్టాఃపరిశుద్ధములూఐన, కథాఃయే శృణ్వంతి=ఎవరు సాభిలాషముగ వినుచుందురో, కథయంతి చ=ఇతరులకు సాభిలాషముగ బోధింతురో, తే సాధవఃవారే సాధువులు. మద్గతిచేతసఃనాయందే సర్వాత్మనా నిష్ఠితమైన మనస్సు కల్గిన, ఏతాన్=వీరిని, వివిధాఃతాపాఃబహువిధములైన తాపములు, న తపంతిబాధింపనేరవు.

తాత్పర్యము : నిరంతరము నా కథలు వినుటయందే వారిచూపు. పరమ శుద్ధములైన నాకథలను దృఢవిశ్వాసముతో సర్వదా నమ్ముచుందురు, వారే సాధువులు. వారి మనస్సులెప్పుడును నా స్వరూపమునందే నిహితములై ఉండును. అట్టివారిని తాపత్రయములు లేశముగూడ బాధింపనేరవు.

24. సాధ్వి=ఓ సాధుశీల! సర్వసంగవివర్జితాఃనాతో తప్ప ఇతరములైన సకల సంగముల వర్జించి యున్నట్టి, తేవితే=విశిష్టులైన అట్టివారు, సాధవఃసత్పురుషులు, హి=ఎందుకనఁగా, తేవారు, సంగదోషహరాఃసంగమచే నేర్పడెడు దోషములను నశింపఁజేయువారు, అథఅదికారణముగా, తేషువారియందు, సంగఃసంగతి, తే ప్రార్థ్యఃనీకు ప్రార్థింపఁదగినది.

తాత్పర్యము : ఓ సౌశీల్యవతీ! నాతోడ తప్పమఱిదేనితోడ సంగములేని వారే సాధువులు. దుస్సంగతి కారణముగా నేర్పడెడు దోషములను వారు నశింపఁజేయుదురు. అందుచే వారితోడి సంగతి ఏర్పడవలెనని నీవు సదా ప్రార్థింపవలెను.

25. సతాంసత్పురుషులు, మమ వీర్యసంవిదఃనాయొక్క వీర్యజ్ఞాన యుక్తమైన, ప్రసంగాత్ప్రసంగముచేత, హృత్కర్ణ రసాయనాఃమనస్సునకును

కర్ణములకును ఆనందకరములైన, కథాఃకథలు, భవంతిఉండును, తజ్జోషణాత్వాని సేవనము వలన, ఆశుశీఘ్రముగా, అపవర్గ వర్త్మనిమోక్ష మార్గమందు, శ్రద్ధావిశ్వాసము, రతిఃప్రీతి, భక్తిఃప్రేమయు, అనుక్రమిష్యతిక్రమముగా నేర్పడును.

తాత్పర్యము : సత్సంగతితో దోషనివృత్తి ఏర్పడుటయేకాదు మోక్షసాధన సంపత్తి ఏర్పడును. ఎట్లనఁగా వారు నావీర్యమును గూర్చి సమగ్రముగా నెఱిఁగినవారు. నాపరాక్రమమును ప్రకాశింపఁజేయు కథలనే నిరంతరము గానించుచుందురు. వారిజీవన విధానము కూడ నామహిమనే తెలుపుచుండును. వారు నిరంతరము రసమయములైన నాకథలు పాడుచుందురు. వారి సంబంధముతో చెవులకును రసాయనములైనవి. హరికథలు వినెడు నవకాశము లభించును. వారిని నిరంతరముగనుట చేత మోక్షమార్గమందు విశ్వాసమేర్పడును. ప్రీతి జనించును ప్రేమ విశేషమైన భక్తి అంకురించును.

26. మద్రచనాను చింతయాన్నాప్రవృత్తులను గూర్చియే నిరంతరము ధ్యానించుటతో కూడిన, భక్త్యాభక్తిచేత, దృష్టశ్రుతాత్కనపడుచున్నవియు, విన్నవియునైన, ఇంద్రియాత్ఇంద్రియసుఖముల యందు, జాతవిరాగఃఏర్పడిన విరక్తి భావముతో కూడినవాఁడై, పుమాన్పురుషుఁడు, జాతవిరాగఃఏర్పడిన విరక్తి భావముతో కూడినవాఁడై, పుమాన్పురుషుఁడు వ్యక్తఃఉత్సాహయుక్తుఁడై, యోగయుక్తఃయోగమునాశ్రయించినవాఁడై, ఋజుభిఃప్రయాసము లేనట్టి, యోగమార్గైఃయోగమార్గములతో, చిత్తస్యగ్రహణేచిత్తనియమనమునందు, యతిష్యతేప్రయత్నించును.

తాత్పర్యము : కథాశ్రవణాదులం దాసక్తమైన మనసు నాకృత్యములైన లోకసృష్టి స్థితి సంహార కార్యములను గూర్చియే నిరంతరము చింతింపఁ దొడఁగును. అప్పుడు నాయందవ్యవహితమైన ప్రేమ జనించును. దృష్టములైన ఇంద్రియ సుఖములు శ్రుతములైన స్వర్గాదిలోకము లందుండు సుఖములు నశ్వరములను విషయము అనుభవమునకు వచ్చును. ఆ విషయభోగములందు విరక్తి జనించును. వానిని సాధించెడు యత్నలేశముగూడ నాశమగును. నాయందవ్యవహితమైన ప్రేమ జనించును. భక్తిప్రధానమైన యోగమార్గములను క్రమముగా నభ్యసింపఁదొడఁగును. అట్టి పురుషుఁడు మనస్సు యొక్క చాంచల్యము తీవ్రముగా నరికట్టును. దానితో మోక్షమార్గము వాని కందుబాటులో ఉండును.

27. ప్రకృతేఃప్రకృతికి సంబంధించిన, గుణానాంగుణములయొక్క, అసేవయాసేవింపక పోవుటచేతను, వైరాగ్య విజృంభితేనవైరాగ్యముతో విజృంభమాణమైన, జ్ఞానేనజ్ఞానముచేతను, యోగేనయోగము చేతను,

మయి=నాయందు, అర్పితయా=సమర్పింపఁబడిన, భక్తిచేతను, అయం=అట్టి పురుషుఁడు, ప్రత్యగాత్మానం మాం=ప్రత్యగాత్మ స్వరూపుఁడైన నన్ను, ఇహ=ఈ శరీరమందు, అవరుంధే=ప్రాపించును.

తాత్పర్యము : శబ్దస్వరూప గంధాదులైన విషయసుఖములు క్షణికము లగుటచేత అవి ఉపేక్షింపఁ దగినవనెడు విశ్వాసము క్రమక్రమముగా దృఢమగుట చేతను విషయములను వైరాగ్యభావముచేత శాస్త్రాభ్యాసముచే నేర్పడిన జీవాత్మ పరమాత్మలకు ఐక్యమనెడు భావనతో అష్టాంగ యోగసాధనతో సిద్ధించెడు ఫలాభి సంధిలేని భక్తిచేతను - వీనియన్నిటి సమావేశముచేత పూరుషుఁడు ఈ శరీరమునందే ప్రత్యగాత్మ స్వరూపుఁడైన భగవంతుని ప్రాపించును.

28. త్వయి=నీయందు, ఉచితా=యోగ్యమైన, భక్తిః=భక్తి, కాచిత్=ఏ విధమైనట్టి, మమ=నాకు, గోచరా=విషయమైనట్టిది, కీదృశీ=యద్విధమైనది? యయా=దేనిచేత, నిర్వాణం=మోక్షస్వరూపమైయున్న, తేపదం=నీ పాదమును, అంజసా=ప్రయాసము లేక, అహం=నేను అన్వశ్నువై=అనుభవింపఁగలను.

తాత్పర్యము : దేవహూతి యనుచున్నది - భగవంతుఁడే పరమాత్మయనెడు అనుభవము యోగముతో లభించును. యోగాంగములో ప్రధానమైనది భక్తియే. భక్తి సత్సంగముతో లభించును. ఈ సంక్షేపమైన ఉపదేశమును కపిల మహర్షినుండి దేవహూతి విన్నది. ఆమె కానంద మయ్యెను. కాని భక్తి స్వరూప విశేషములను సమగ్రముగా తెలియవలెనని ఆమె ఆశ. ఆమె మూఁడుశ్లోకములలో ప్రశ్నించుచున్నది. భగవాన్! ముక్తిని సాధించుటకు స్వరూపమైన భక్తి ఎట్టిది? అందులోఁ గూడ స్త్రీయైన నాకు సాధించుట కర్హమైన భక్తి స్వరూపమెవ్విధము? మోక్షరూపమైన నీయొక్క పాదములతో నాకు సంభవించుటకు ఉపకరించెడు విశేషములు తెలిసికొనవలెనని యున్నది.

29. నిర్వాణాత్మన్=మోక్షస్వరూపుఁడవైన కపిలమునీ! భగవద్భాణః =భగవంతుని పొందఁజేసెడు, యఃయోగఃఏ యోగము, త్వయా=నీచేత, ఉదితఃచెప్పఁబడినదో, సఃకీదృశఃఅది ఎట్టిది? అంగాని=దానియంగములు, కతి=ఎన్ని? యతఃదేనినుండి, తత్వావబోధనం=తత్త్వములను గూర్చిన జ్ఞానము (ఏర్పడుచున్నదో)

తాత్పర్యము :మోక్షస్వరూపుఁడవైన కర్దమ మునీ! నిన్ను ప్రాపించుటకు సహాయకమైన ఏ యోగమునీచే ఇంతకుముందు నిర్వచింపబడెను? ఏ యోగముచేత తత్త్వములను గూర్చిన వివేకము సిద్ధించునో ఆ యోగముయొక్క స్వరూప మెట్టిది? దాని యంగము లెన్ని?

30. హరే!=దుఃఖములను నశింపజేసెడు ఓదేవా! మందధీః యోషా అహం=మందమైన బుద్ధిగల స్త్రీ యునైన, దుర్బోధం=ప్రయాసమున కోర్చి ప్రయత్నించినను చక్కగా తెలిసికొనుట కసాధ్యమైన, తత్ ఏతత్=ఆయోగమును, భవదనుగ్రహాత్=నీయొక్క అనుగ్రహముతో, యథానుఖంబుద్ధ్యేయ=ఏ రీతిగానైనచో సుఖముగా తెలియఁగలనో, తథామే=ఆ ప్రకారమును నాకు, విజానీహి= తెలుపుము.

తాత్పర్యము : ఓహరీ! ఈ సాంఖ్యమనెడు యోగము ఎంత ప్రయాస పడినను తెలిసికొనుటకు సాధ్యముకానిది. అందులో నేను స్త్రీని. మందబుద్ధి గలదానను. ఏ రీతిగా బోధించినచో నాకు సులభముగా నర్థమగునో, సాధించుటకు సాధ్యమగునో ఆ పద్ధతిగా నా కుపదేశింపుము.

31. కపిలఃమాతుఃఇత్థం అర్థం=ఈ ప్రకారముగా నున్న తల్లికి కావలసిన ప్రయోజనమును, విదిత్వా=తెలిసికొన్న వాఁడై, యత్ర=ఏస్థానమందు, తన్వా అభిజాతఃతాను దేహముతో జన్మను గైకొనెనో, తత్ర జాతస్నేహఃఆస్థానమందు జనించిన స్నేహముతో కూడినవాఁడై, యత్సాంఖ్యం ప్రవదంతి=దేనిని సాంఖ్యమని అందురో, తత్త్వామ్నాయం=అతత్త్వశాస్త్రమును, భక్తివితాన యోగం=భక్తి దానిని బలపఱచెడి యోగమును, ప్రోవాచ=చెప్పెను, వై=ఈ విషయము ప్రసిద్ధము.

తాత్పర్యము : మైత్రేయుఁడన్నాఁడు. కపిల మహర్షి దేవహూతికిఁ గల ఇచ్ఛా విశేషమును గ్రహించినాఁడు. ఆమె భక్తి యోగమును గూర్చి తెలిసికొనవలె ననుకొన్నది. సాంఖ్యశాస్త్రమును గమనించు ఇచ్ఛయున్నది. దాని తత్త్వ విచార స్వరూపమైన క్రమముగూడ స్పష్టముగా తెలిసికొనవలెను. ఆమెకీ ఇచ్ఛలున్నవని కపిల భగవానుఁ డెఱిఁగినాఁడు. తాను దేవహూతినుండి దేహమును ధరించి అవతరించినాఁడు. అతఁ డామెకు తత్త్వములను నిరూపించవలసిన క్రమమును భక్తి స్వరూపమును దానిని వర్ధించుట కుపకరించెడు యోగమును దేవహూతికి దెల్పెను. ఆ తత్త్వ విచారక్రమమునే పూర్వాచార్యులు సాంఖ్యశాస్త్రమని ప్రచార మొనర్చిరి. కపిల మహర్షి ప్రాణు లన్నిటి యందును సమానమైన దృష్టి గలవాఁడు. కాని దేవహూతి తనకు తల్లి అందువలన ఆమెయందు కరుణా విశేషము నెక్కువగా ఉంచినాఁడు. లోకము నందలిజనులు మాతృభక్తిని తప్పక చూపవలెనని శిక్షించుటకే ఈ ప్రవృత్తి. సాంఖ్యశాస్త్రము, భక్తి స్వరూపము, యోగ క్రమ మనెడు ఈ మూడింటిని గూర్చియే కపిలుఁడు దేవహూతి కుపదేశించినది.

32,33. ఆనుశ్రవిక కర్మణాం=వేదోక్త కర్మమును అనుసరించు చున్నవియు, గుణలింగానాం=శబ్దాది గుణములను తెలిసినవియునైన, దేవానాం= ఇంద్రియముల యొక్క, సత్త్వే ఏవ=సత్త్వగుణము నందలి, యావృత్తిః =ఏవృత్తి, స్వాభావికీ=స్వభావ సిద్ధమును, అనిమిత్తా=ఇతర కారణముతో కూడనిదైయుండునో, సా భాగవతీ భక్తిః=భగవంతుని గూర్చిన ఆ భక్తి, సిద్ధేః=సిద్ధికంటెను, గరీయసీ=గొప్పది, ఏకమనసః=ఏకచిత్తముతో నున్న ఆ పురుషుని యొక్క, కోశం=కోశమును, అనఁగా ఆత్మను కప్పియున్నట్టి ఆవరణమును, అనఁగా అజ్ఞానమును, అనలః అగ్ని, నిగీర్ణం యథా=తనయందు ఉన్న వస్తువునువలె, అశుజరయతి=వేగముగా నశింపజేయును.

తాత్పర్యము : నీయందు నెఱపవలసిన భక్తి యొక్క స్వరూప మెట్టిది? అనెడి తల్లి ప్రశ్నకు భగవంతుఁడు సమాధాన మిచ్చుచున్నాఁడు. శబ్దస్పర్శాదులైన విషయములను తెలిసికొనెడు ఇంద్రియములకు దేవతలని పేరు. సమస్తేంద్రియముల యొక్క వ్యాపారమును సత్త్వగుణ స్వరూపియైన భగవంతుని యొక్క చరిత్ర శ్రవణాదుల యందే ప్రవృత్తమై యుండుట స్వభావమైనచో దానిని భక్తియందురు. ఐహికమో, పారత్రికమో అయిన ఏసుఖమును గాని ఉద్దేశింపక పరిశుద్ధమై ఆ భక్తియున్నచో దానికి శుద్ధ భక్తియనిపేరు. అట్టి భక్తి సిద్ధింపవలెనన్నచో వేదోక్తములైన నిషిద్ధ కర్మలను మానుకొనవలెను. విధింపఁబడిన కర్మలను ఫలాభి సంధిలేక భగవత్ప్రసాదనమునకై మాత్రమే ఒనర్పవలెను. భగవంతుని యందే ప్రవర్తించుట మనస్సునకు స్వభావమై పోవలెను అప్పుడు అగ్నితనయందు వేయఁబడిన సమస్త పదార్థములను కాల్చివేయునట్లుగా నిష్కామత అనెడు అగ్ని తొందరగా భగవదితరములైన వాసన లన్నిటినీ దహింపఁ జేయును ఆత్మయొక్క స్వస్వరూపమును నశింపచేయునది అవిద్య. అది శుద్ధ భక్తితో దహింపఁ జేయఁబడును. స్వరూపబోధ అనుభవరూపముగా ప్రకాశమై ఆనందించును. ఇదియే ముక్తి. కనుక శుద్ధ భక్తి ముక్తి కంటెను గొప్పది.

34.కేచిద్భాగవతాఃకొంతమంది భగవద్భక్తులు, మత్పాద సేవాభిరతాః =నాపాదసేవయందే అతిశయమైన తాత్పర్యము గలవారై, మదీహాఃనాకొఱకై ప్రవర్తించెడు సకల ప్రవృత్తులు గలవారై, అన్యోన్యతఃప్రసజ్య=తమలోతాము గుంపుగా కూడుకొన్నవారై, మమ పౌరుషాణి=నాపరాక్రమములను, సభాజయంతే=సత్కరింతురు.

(అనఁగా గౌరవించుచు పరస్పరము మాటాడుకొందురని భావము. యే ఏకాత్మతాం=నాతో ఏకమైయున్న మానసికస్థితిని, యే=ఎవ్వరు, నస్పృహయంతి=కోరుకొనరు.)

తాత్పర్యము : భక్తి ముక్తి కంటె గొప్ప దన్నారు. దానిని వివరించు చున్నాఁడు. కొందఱు ఏకాంత భక్తు లుందురు. వారు నాతో నైక్యమందిన ఆనంద స్వరూపము నంగీకరింపరు. అనఁగా సాయుజ్యముక్తియందు వారి కాశ లేదని యర్థము. వారు ఈ దేహములతోనే ఉందురు. సమాన చిత్తవృత్తులు గల భక్తులతో చేరుదురు. వారు తమలో తాము పరస్పరము పరాక్రమాదులను కీర్తింతురు. స్థావర జంగమ స్వరూపములైన నామూర్తులను స్తుతింతురు. నా యా సంగ్రహమునకై శరీరేంద్రియ మనోవ్యాపారములను వినియోగింతురు. వీనితోనే వారికి పరమానంద మేర్పడును. దీనితో పోల్చినపుడు సాయుజ్య ముక్తితో నేర్పడెడు నానందము వారి దృష్టిలో తక్కువ. ఇఁక సాలోక్యాదులు వారి దృష్టిలోనే ఉండవు. కానీ ఇట్టి భక్తులు చాల దుర్లభము. అందుకే కేచిత్ అన్నారు. భక్తి ముక్తి కంటెను గొప్ప దనుటలో శుద్ధభక్తి సదాచారముతోడనే సిద్ధించు ననెడి మాట కూడ నున్నది.

35. అంబ!=ఓతల్లీ! సంతః=సత్పురుషులు, ప్రసన్న వక్త్రారుణ లోచనాని=ప్రసన్నమైన ముఖముతోను, అరుణములైన నేత్రములతోను కూడియున్నవి, వరప్రదాని=వరములను దయచేయునట్టివియు, రుచిరాణి=మనోహరములు, దివ్యాని=అప్రాకృతమునునైన, మేరూపాణి=నారూపములను, పశ్యంతి=చూతురు, సాకం=నాతోడకూడ, స్పృహణీ యాం వాచం=అభిలషింపఁ దగిన వాక్కును వదంతి.

తాత్పర్యము : దేవహూతీ! ఆ సత్పురుషులు నాయొక్క మూర్తి భేదములను నిరంతరమును దర్శించుచుందురు. ప్రసన్నమైన వక్త్రము విశాలములై ఆకర్షకములైన కన్నులు మనస్సును ద్రవింపఁజేసెడు మూర్తి, సత్త్వగుణ ప్రధానములైన నామూర్తులిట్లుండును. నేనట్టి సత్పురుషులయందు ప్రసన్నుఁడనై నిరంతరమును ధర్మేతరములు గాని వారి కోర్కెలను తీర్చుటకు జాగరూకుఁడనై యుందును. నామూర్తులు అప్రాకృతములు. సద్భక్తులా మూర్తులతో స్పృహ ణీయములైన సల్లాపము లొనర్చు చుందురు.

36. తైః, దర్శనీయ అవయవైఃదర్శించుటకు యోగ్యములైన ఆ అవయవములతోను, ఉదార విలాసహాసేక్షిత వామసూక్తైఃఉదారమైన విలాసము, హాసము, ఈక్షితము, స్పృహణీయములైన మాటలు వీనిచేత, హృతాత్మనఃహరింపఁబడిన మనస్సుతోను, హృతప్రాణాంశ్చహరింపఁబడిన ప్రాణములతోను, అయినవారికే, అనిచ్ఛతఃఅపివారి కాశ లేకున్నను, మే భక్తిఃనా యందు వారు చూపెడు పరమ ప్రేమము అణ్వీం గతింఅణు స్వరూపమైన స్థితిని, ప్రయుంక్తేకల్గించి తీరును.

తాత్పర్యము : వా రెప్పుడును నాఅవయన సౌందర్యములందే లగించిన దృష్టి కలవారై యుందురు. నా విలాసములను గమనించుటందే వారి చూపు. నా నవ్వులను వెన్నెలలో వారు మునుగుదురు. నాచూపులలో కరగి పోదురు. నాసంభాషణలు వారిజీవనమై యుండును. వారి మనస్సులకు నేను దప్ప వేరు లక్ష్యమే లేదు. వారు ప్రాణములు నాపై నిలిపికొనియుందురు. ఈ స్థితి భక్తియనుట వారెఱుగక పోవచ్చును. వారి స్వభావమే అట్టిదై యుండును. ఇట్టివారికి కొర్కెలేకున్నను దేహపాతానంతరము మోక్షమును లభించితీరును.

37. అథ=అనంతరము, మాయావినః మమ=మాయాధిపుఁడైన నాయొక్క, తాం విభూతిం=ఆ భోగ సంపత్తిని, అను ప్రవృత్తం=అనుసరించియున్న, అష్టాంగం ఐశ్వర్యం=ఎనిమిది రీతులుగా నున్న ఐశ్వర్యమును, భాగవతీం శ్రియం=వైకుంఠ లక్ష్మిని, అప్సుహయంతి=వారుకోరికొనకున్నప్పటికిని, తే=వారు, పరస్యమేలోకే=పరుఁడైన నాలోకమందు, భద్రాం=దుఃఖ సమ్మిశ్రణము లేకున్నట్టి, శ్రియం=ఆనందమును, అశ్నువతే=పొంది తీరెదరు.

తాత్పర్యము : భక్తితో అవిద్యానాశమేర్పడును. దానితో సత్యలోక పర్యంతమున్న పరలోక భాగములను భక్తి మాహాత్మ్య కారణముగా వారికిచ్చు లేకపోయినప్పటికినీ సమీపమునకు వచ్చి నిలుచును. అట్టి సిద్ధులు వారికి కైవసము వైకుంఠ లోకమందున్న ఆనందమును వారు పొందెదరు. వారికి దానియం దభిలాష లేదు. కానీ వారికవి ప్రాప్తము లగును. నాలోకమనెడు వైకుంఠమును చేరి దుఃఖసమ్మిశ్రణములేని ఆ యానందమును పొంది తీరెదరు.

38. శాంతరూపే=శాంతమైన రూపముతో కూడిన ఆరూపమందు, మత్పరాః =నన్నే ఆశ్రయించిన వారును, కర్హిచిత్=ఏకాలమందైనను, నక్ష్యంతి=నశింపరు, యేషాం=ఎవరికి, అహం=నేను, ప్రియుః=ప్రియుఁడనో, ఆత్మా=ఆత్మనో, సుతశ్చ= సుతుఁడును, సఖా=ఇష్టుఁడును, గురుః=ఆచార్యుఁడును, సుహృదః=స్నేహితుఁడును, ఇష్టం దైవం=ఇష్టమైన దేవునిగా నుందునో, తాన్=వారిని, అనిమిషః =కన్నుఱెప్పగొట్టనట్టి, మేహేతిః=నా ఆయుధమైన కాలచక్రము, నోలేఢి=స్పృశింపదు.

తాత్పర్యము : వైకుంఠము స్వర్గాదిలోకముల వంటిదికాదు. అచ్చట ప్రవేశించిన వారికి పునరావృత్తి లేదని తెల్పుచున్నాఁడు. ఆ వైకుంఠము శుద్ధ సత్త్వ స్వరూపమైనది. నిరంతరము నిర్నిరోధమైన శాంతి. నా భక్తులచ్చట చేరెదరు ఎన్నఁడేకాని వారికా స్థానము నుండి భ్రంశము లేదు. వారికి నిరతిశయ ప్రీతిపాత్రుఁడను నేనే. లౌకికులు పుత్రాదులను ప్రేమించినట్టు వారు నన్నే ప్రేమింతురు. వారికి ఆత్మ స్వరూపుఁడను నేనే. పుత్రుఁడను

నేనే. చెలికానివలె వారు నన్నే నమ్మెదరు. గురువునువలె వారు నావాక్యమునే విశ్వసింతురు. మిత్రునివలె వారికి హితకారిని ఇష్టదైవమును నేనే. నా ఆయుధమైన కాలచక్రము నిర్నిమేషమై సర్వులను కబళించుచుండును. నా పరమ భక్తులను కాలచక్రము బాధింప నేరదు. అందుచే వారికి నాశము లేదు. ఆనందచ్యుతి లేదు. వైకుంఠమందు కాలబాధ శూన్యము.

39,40. ఇమం లోకం=ఈ లోకమును, ఉభయాయినం=రెండు లోకములను పొందెడునట్టి, ఆత్మానం=దేహమును, ఇహ=ఈలోక మందుండెడు, ఆత్మానం=దేహమును, అనుమేరాయః=అనుసరించియున్న ఏ ద్రవ్యములు, పశవః=పశువులు, గృహాః=గృహములు కలవో, సర్వాన్=వానిని సర్వమును, అన్యాన్‌చ=ఇతరములను, విసృజ్య=ఉపేక్షించి విశ్వతో ముఖం=సమస్తమునందును వ్యాపించియున్న, మాం=నన్ను, అనన్యయా భక్త్యా=ఇతరుల నెవ్వరిని ఆశ్రయింపని తీవ్రమైన భక్తియోగముతో, యే భజంతి=ఎవ్వరు భజింతురో, మాం=నేను, మృత్యోః=నాశమునుండి, అతిపారయే=దాటింతును.

తాత్పర్యము : ఇహమునందును పరమునందును ఉన్న సుఖభోగములు ఆ రెండు లోకములందు సంచరించెడు స్థూలసూక్ష్మ దేహములు, వానిపై నున్న మమతలు, స్థూలదేహము ననుసరించుకొని యుండెడు ధన ధాన్య పశుభృత్య గృహాదులు - ఇతర సకలము నందును మమతలు వదలి సర్వమునందును వ్యాపించి ప్రకాశించుచున్న నన్ను మాత్రమే ఏకాంత భక్తితో సేవించువారిని నేను జనన మరణ రూప సంసారమునుండి గడ్డ కెక్కింతును.

41. ప్రధాన పురుషేశ్వరాత్=ప్రకృతి పురుషుల కీశ్వరుడును, సర్వభూతానాం=సకల భూతములయొక్క, ఆత్మనః=ఆత్మస్వరూపుడును, భగవతః=భగవంతుడైన, మత్తః=నాకంటె, అన్యత్ర=భిన్నమైనదానియందు, తీవ్రంభయం=అసహ్యమైన భయము, న నివర్తతే=తొలగదు.

తాత్పర్యము : ప్రకృతి పురుషులను నియమించు వాడను నేనే. సర్వభూతములందును అంతర్యామిగా వర్తించువాడను నేనే. భగవంతుడైన నన్నాశ్రయించెడి వారు మాత్రమే జనన మరణాది రూపదుఃఖమునుండి తొలగెదరు. అన్యదేవతల నాశ్రయించుటతో నివృత్తి సిద్ధింపదు. ఎందుకనగా వారు కూడ కాలమున కధీనులైనవారే.

42. వాతః=వాయువు మద్భయాత్=నావలని భయముచేత, వాతి=వీచుచున్నది, అయంసూర్యః=ఈ సూర్యుడు, తపతి=వెలుగుచున్నాడు, ఇంద్రః

వర్షతి=ఇంద్రుఁడు వర్షించును, అగ్నిఃదహతి=అగ్ని దహించును, మృత్యుశ్చరతి=యముఁడు వ్యాపార మొనర్చును.

భీషాఽస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః,
భీషాఽస్మాదగ్ని శ్చేంద్రశ్చ మృత్యు ర్ధావతి పంచమః.

అను శ్రుతియందు చెప్పఁబడిన యర్థమీ శ్లోకమందు వర్ణింపఁబడినది. దేవతలు భూతములు వారి వారి కేర్పఱచిన కార్యములన్నియు కాలము తప్పక యనుసరించుచున్నవి. దీనికి కారణము పరమాత్మ దండనమునుండి వారికున్న భయమే. గాలివీచుట, సూర్యుఁడుదయించుట, ఇంద్రుని వర్షణము, అగ్నిదాహము, అంతకుని ప్రవృత్తి సర్వమును భగవంతుడు దండించునను భయముచేతనే సక్రమముగా జరుగును.

43. జ్ఞానవైరాగ్యయుక్తేన=జ్ఞానము వైరాగ్యము వీనిచే చేరిన, భక్తియోగేన=భక్తియోగముచేత, యోగినఃయోగులు, క్షేమాయ=క్షేమము కొఱకే, అకుతోభయం=దేనినుండి భయములేని, మే పాదమూలం=నా పాదమూలమును, ప్రవిశంతి=ప్రవేశింతురు.

తాత్పర్యము : నా మాహాత్మ్యము నెఱిగిన మహాభక్తులు విషయముల నుండి వైరాగ్యము ననుష్ఠింతురు. తీవ్రమైన భక్తియోగము ననుష్ఠింతురు. అది జ్ఞానపూర్వకమై ఉండును. వారు సమస్త దుఃఖ వినాశనము కొఱకై నాపాదమూలము నాశ్రయింతురు. ఇక వారియానందమే ఆనందము. ఎవ్వరినుండి వారికి భయముండదు. ఎందుకనఁగా నాచరణాశ్రయమట్టిది.

44. తీవ్రేణ=తీవ్రమైన, భక్తియోగేన=భక్తియోగముచేత, మయి=నాయందు, అర్పితం=సమర్పింపఁబడిన, మనఃమనస్సు, స్థిరం=స్థిరముగా నుండుటేదికలదో, అదికారణముగా, అస్మిన్‌లోకే=ఈలోకమందు, పుంసాం=పురుషులకు, నిశ్శ్రేయసోదయఃసమస్త పురుషార్థములను సిద్ధించు, ఏతావాన్ ఏవ=ఉత్తమమైన మార్గమిదే.

తాత్పర్యము : తీవ్రమైన భక్తియోగముతో మనస్సులను నాకు సమర్పించవలెను. అది నివాత దీపమువలె నాయందే స్థిరముగా నిలువవలెను. ఇది ఒక్కటే పురుషులకు సమస్త పురుషార్థములను సాధించుటకు మార్గము. తద్భిన్నములు విడంబనా మాత్రములు.

విజయధ్వజవ్యాఖ్య

1. శ్రీహరి యందు అనుష్ఠింపవలసిన ఉత్కృష్టమైన భక్తియోగము, అతనియందు మనస్సుంచెడి ప్రకారము, భక్తియోగము ననుష్ఠించుటకు ఉపయోగపడు సాధనమును - ఈ విషయమున తెలియ <జేయుటకు ఈ యధ్యాయమును ఆరంభించుచున్నా <డు. ముందు కపిల దేవహూతి సంభాషణమును సాకల్యముగా వినవలెనని ఇచ్చించిన పరీక్షిత్తు ఇదివరకు అడిగిన దానిని అనువదించి, ప్రశంసించి ముందు చెప్పవలసిన దానిని గూర్చి ప్రార్థించుచున్నా <డు. సాక్షాత్=తుల్యనామకు <డైన, అజఃనారాయణు <డు, స్వయం=ఆవేశములేక తానే, ఆత్మమాయయా= తన ఇచ్ఛచేత, నృణాం, ఆత్మప్రజ్ఞప్తయే= స్వస్వరూపజ్ఞానము కొఱకే, పరమాత్మ మొదలైన తత్త్వముల యథార్థ జ్ఞానము కొఱకే, తత్త్వసంఖ్యాతా= అవ్యక్తము మొదలుకొని సమస్త చక్రముల సమీచీన జ్ఞానమును కలిగించెడు, భగవాన్=సర్వ సిద్ధియుక్తు <డైన, కపిలఃకపిల మహర్షిగా, జాతఃఅవతరించెనని , శుకమహర్షీ! నీవుచెప్పితివి. నేనుకూడ దానిని విన్నాను.

తాత్పర్యము: పరీక్షిత్తన్నా <డు సాక్షాత్ శ్రీహరియే సజ్జనుల కాత్మవిద్యోపదేశమునకై తన ఇచ్ఛచేత కపిలావతార మొనర్చితత్త్వ సంఖ్యానమును ప్రవర్తింపజేసెనని మీరుపదేశమిచ్చితిరి గదా!

2. శ్రీహరి చరిత్రను వినుటయందు ప్రవర్తించిన జనులకు భోజనము మొదలైన వానియందు ఆశ లేకున్నను మనస్సు నిరోధించుటచేత "ఇంక చాలునను" భావము పుట్టవచ్చును. కాని నాకు తిండి మొదలైన భోగములు లేకయున్నను రసాయనము సేవించు వారికున్నట్లు శ్రీహరి కథాశ్రవణముతో ఇంద్రియములు సంతృప్తి నందిన వని పరీక్షిన్మహారా జనుచున్నా <డు. ధర్మిణాం= నివృత్తి ధర్మమే స్వరూప భూతమై యున్న, హంసాం=ముక్తియోగ్య జీవులకు, అర్హస్య= సన్మాన్యమైనట్టియు, సర్వయోగినాం=సనకాది యోగులందరికిని, గరిమ్ణఃగొప్పవా <డైన, శ్రుతదేవస్య= శాస్త్రముచేత నారాయణుని యందుండెడు క్రీడాది సమస్తగుణములను పొందిన వా <డని ప్రసిద్ధిగల, తస్య=ఆ కపిలుని యొక్క మహిమను, విస్తృతేవిశేషముగా వినుటయందు, మే= నాయొక్క, అసవఃఇంద్రియములు, భూరిఎక్కువగా, తృప్యంతిసంతోషమును పొందుచున్నవి.

3. స్వచ్ఛందాత్మా= స్వతంత్రమైన మనస్సుగల, భగవాన్= కపిలరూపియైన శ్రీహరి, ఆత్మమాయయా= తన ఇచ్ఛచేత, యదగ్రత్=దేనిదేనిని, విధత్తే=చేసెనో, కీర్తనీయాని=భగవద్భక్తు <డు నిత్యమును కీర్తించెడి, తాని=ఆచరిత్రలను, శ్రద్దధానస్య=శ్రద్ధగా వినుటకు కాచుకొన్న, మే=నాకొఱకై, అనుకీర్తయ=చెప్పుము.

4. పరీక్షిత్తు యొక్కప్రశ్నకై శుక్రాచార్యుఁడు విదుర మైత్రేయ సంవాదమునే ఉత్తరముగా చెప్పుచున్నాఁడు. యథా=ఎట్లు, త్వయా=నీచేత, అహం, ఆన్వీక్షక్యాం= తత్త్వ విద్యయందు, ప్రచోదితఃప్రేరితుఁడనైతినో, తథా=అట్లు, తత్త్వ విద్యయందు విదురునిచేత ప్రచోదితుఁడైన, ద్వైపాయన సఖుఁ=వేద వ్యాసులను స్నేహితుఁడుగా పొందియున్న, భగవాన్=మైత్రేయుఁడు, ప్రీతస్సన్, ఏనం విదురం=ప్రశ్నించిన విదురుని కొఱకై, ఏవం=ముందుచెప్పఁబోవునట్లు, ప్రాహ= పలికెను.

5, 6. పితరి=కర్దముఁడు, అరణ్యం ప్రతిప్రస్థితే, మాతుఃతల్లియైన దేవహూతికి ప్రియచికీర్షయా=ప్రియ మొనరించుటకై, భగవాన్ కపిలఃతస్మిన్=కర్దమాశ్రమమని ప్రసిద్ధమైన ఆబిందు సరోవరమందు, అవాత్సీత్కిల= నివసించెను. అచట దేవహూతియు ప్రశ్నించుటకిదే సమయమని తెలిసి ఈ రీతిగా పలికె ననుచున్నాఁడు. దేవహూతియు ఆసీనం, అకర్మాణం=ఏచేష్టయు చేయకయున్న, తత్త్వమార్గాగ్రదర్శినం=పరమాత్మ మొదలైన తత్త్వ విషయమునందు పూర్ణ జ్ఞానముగల, స్వసుతం=తనకుమారుఁడుగా జన్మించియున్న, తం=కపిలుని గూర్చి, ధాతుఃబ్రహ్మదేవుని యొక్క, వచఃమాటను, సంస్మరతీ=స్మరించు కొనుచున్నదై, ఆహ=పలికెను, ఆసీనం, అకర్మాణం అనెడు రెండు విశేషణముల చేత శ్రీహరికి స్వాభావికముగా నిశ్చయమైన మనస్సున్నది. అయినను లోక దృష్టితోకూడ అట్లు తోపఁజేసెనని భావము. 'ఆసీనం' అనుటచేతను అకర్మత్వము సిద్ధించియున్నను మరల చెప్పుట చేత· శరీరము మఱచిపోవుట మొదలైన చేష్టలుకూడ లేవనియు దానిచేత ఆతని దేహము సచ్చిదానందాత్మక మైనదని తెలిపియున్నాఁడు.'తత్త్వజ్ఞాని' అనుటచేత తెలుపవలసిన విషయమందు పరిపూర్ణజ్ఞానము కలవాఁడని తెలిపినట్లైనది 'స్వసుతం' అనుటతో సిద్ధమైన ఆప్తతను ధాతుఃసంస్మరతీ అనుటచేత మరికొంత పోషించినది.

7. ప్రశ్నింపవలెనని అనుకొన్న విషయమందు దేవహూతికి తాత్పర్యము కలదని ఆ ప్రశ్నకొఱకై ఉపోద్ఘాతము ఆరంభించిన దనియు అనుచున్నాఁడు. భూమన్=స్వయముగా పూర్ణుఁడవైనవాఁడా! అహం, అసదింద్రియ తర్పణాత్=దుష్టములైన ఇంద్రియముల తృప్తియందే ఆసక్తి గల దాననై ఇంతకాలము గడపి ఇప్పుడు, నితరాం=ఎక్కువగా, నిర్విణ్ణా=విషయములయందు నిర్విణ్ణనైనాను. సంభావ్యమానేన=ఎక్కువ ఆసక్తమైన, యేన=ఏ ఇంద్రియ తర్పణము వలన ప్రభో! అంధం తమఃతత్త్వజ్ఞానము లేకయుండుటను, ప్రపన్నా=పొందిన దాననైతిని. దీనిచేత ఇంద్రియముల దౌష్ట్యమును స్పష్టపఱచినట్లైనది.

8. తస్య=ఆ, దుష్పారస్య=ఇతర తీరము దూరమందున్న, తమసః=తత్త్వము యొక్క అజ్ఞానమునుండి, పారగం=తీరమును చేర్చెడు, త్వం=నీవనెడు, సచ్చక్షుః=చక్కని కన్ను, త్వదనుగ్రహాత్=నీయనుగ్రహముచేత, మే=నాకు, జన్మనాం అంతే=అనేక జన్మముల కొనయనిపించెడు, ఈచరమ జన్మమందు, లబ్ధం=దొరకినది. పొందవలసిన తీరము సమీపమునందే యున్నదని తాత్పర్యము. దీనిచేత బోధించెడు విషయమును గ్రహింప<గల దేవహూతి సామర్థ్యము గూడ తెలిపినట్లైనది. అనేక జన్మముల నుండి సంక్రమింప<బడిన పూర్వ పుణ్యముల పరిపక్వత చేతనే నిన్ను కుమారునిగా పొందితి నని తాత్పర్యము.

9. నీ వనెడు సచ్చక్షువు నాకొఱకుగానే భువికి రాలేదు. నన్ను నిమిత్తముగా నొనర్చుకొని లోకమునకు మేలుకల్గించుటకే నీయవతారము. అందుచేత నేనే అత్యంత పుణ్యవతినని దేవహూతి యనుచున్నది. యః=ఎవ<డు, పుంసాం=బ్రహ్మాదులగు పురుషులకు, ఆద్యః=మొదటివా<డో, అంతే గాక వారికి, ఈశ్వరః=ఐశ్వర్య ప్రదు<డో, సః=అట్టి, భగవాన్‌వై=ఐశ్వర్యాది గుణసమూహములకు సముద్రు<డవైన నీవు, తమసా=అజ్ఞానమనెడు చీ<కటిచేత, అంధస్య=గ్రుడ్డిదైన, లోకస్య=లోకమునకు, చక్షుః=దృష్టిని ప్రసాదించెడు, సూర్య ఇవ=సూర్యునివలె, ఉదితః=జన్మించితివి, కిల=సత్యమేకదా!

10. ఈ రీతిగా శ్రీహరిని తన యభీష్టమున కభిముఖునిగా నొనరించుకొన్నదై, తమ యభిప్రాయమును తెల్పుచున్నది. దేవ!=స్వామీ! అథ=విహిత కర్మ నాచరింపక పోవుటచేత పాపము ప్రాప్తించి నరకవాసమగు నప్పుడు, జ్ఞానదాన మొనర్చెడు నీ వంటి సూర్యు<డుండ<గా జ్ఞానమును గ్రహింపక పోయినచో పునరుత్థానము లేదు. తమస్సేఒదవెడు కారణము చేత, త్వయా=నీచేత, యః=ఏ, ఏతస్మిన్=దేహ గేహాదులందు, అహంమమ ఇతి=నేను నాది యనెడు, అవగ్రహః=జ్ఞానప్రతిబంధక మైన మిథ్యాభిమానము, యోజితః=నాపూర్వ కర్మానుగుణముగా ఏర్పడినదో, తంసమ్మోహం=అమిథ్యాజ్ఞాన భ్రాంతిని, మే=నానుండి, అపాకృష్టుం=తత్త్వ జ్ఞానోపదేశముచే, పో గొట్టుటకు, త్వం=నీవు, అర్హసి=సమర్థు<డవు.

11. "ఉపసన్నాయ శిష్యాయ వక్తవ్యం బ్రహ్మశాశ్వతం" నాకుపదేశింపవలెనని అడిగిన శిష్యునకే బ్రహ్మోపదేశ మొనర్పవలెనని చెప్పినట్లుగా నీకు నేనేమి చెప్పవలెనని శంకకు అవకాశమే లేదని కపిలు<డనుచున్నా<డు. శరణ్యం=సజ్జనులకు ముఖ్యరక్షకు<డైనట్టియు, స్వభృత్య సంతానతరోః=తనభృత్యుల జననమరణాది రూపమైన సంసారమనెడు వృక్షమునకు, కుఠారం=గొడ్డలివలె

ఉన్నట్టియు, సద్ధర్మ విదాం=సమీచీనమైన ధర్మమును తెలిసిన వారియందు, వరిష్టం=శ్రేష్ఠ<డైనట్టియు, తం=సిద్ధులకు జ్ఞానోపదేశమునకై అవతరించిన, త్వాం=నిన్ను, అహం=నేను, పూరుషస్య=నారాయణు<డు మొదలైన పురుషులని పిలువ<బడెడు వస్తువుల యొక్కయు, ప్రకృతేః=లక్ష్మి మొదలైన ప్రకృతియని పిలువబడెడు వస్తువుల యొక్కయు, జిజ్ఞాసయా=వివేకమనెడు తారతమ్య జ్ఞానమును పొందెడు ఇచ్ఛచేత, శరణంగతా=శరణుపొందిన దానన్నై, నమామి=నమస్కరించు చున్నాను.

"నారాయణో బ్రహ్మవాయూవీంద్రశేషా హరస్తథా,
కామశ్శక్రో గురుర్దక్షో మన్వాద్యాః భాస్కరాదయః.
సర్వజీవాశ్చ క్రమశః పురుషాఖ్యాభి శబ్దితాః,
ఏత త్పత్న్యో బంధశక్తిః స్త్రియస్సర్వాస్తథా జడే,
క్రమాత్ ప్రకృతి శబ్దోక్తాః తత్జ్ఞానాద్విప్రముచ్యతే.

నారాయణ, బ్రహ్మ, వాయుగరుడులు, శేషరుద్రులు, కాము<డు, ఇంద్రు<డు, గురువు, దక్షు<డు మొదలైనవారు సూర్యు<డును పురుషజీవులు. క్రమముగా పురుష శబ్దవాచ్యులు. వారి భార్యలు బంధశక్తి సర్వస్త్రీలు జడపదార్థములు క్రమముగా ప్రకృతి శబ్దవాచ్యులు. వీరి తారతమ్య జ్ఞానముచేత పురుషు<డు ముక్తు<డగును అను ప్రమాణానుసారముగా పురుష ప్రకృతి శబ్దముల అర్థమును తెలిసికొనవలెను. 'సంసారతరోః కుఠారం'అనుటచేత సంపూర్ణానుగ్రహ మొనర్చుటకు సమర్థు<డని చెప్పినట్లైనది. 'నమామి'అనుట చేత కేవలస్తోత్రము కాదు. సంసార తరువును ఛేదించు కొనుటకు సిద్ధమైయున్నానని భావము. ఉపదేశమునకై శరణు<బొచ్చుటచేత ఉపదేశ మొనర్చి తగిన దని తాత్పర్యము.

12. తల్లిచేత ప్రార్థింప<బడిన కపిల ఋషి ఆమె కుత్తర మిచ్చెనని మైత్రేయు<డు విదురు<డనుచున్నా<డు. ఇతిః=ఈ రీతిగా, నిరవద్యం=ద్వేషరహితమై, పుంసాం=ముముక్షు జీవులకు, అపవర్గవర్ధనం=సంసార వినాశమునకు సూచకమైన, స్వమాతుః, ఈప్సితం=తెలిసికొనవలెనను ఇచ్ఛను, నిశమ్య=విని, ఆత్మవతాం=పరమాత్మజ్ఞానులైన, సతాం=సజ్జనులకు, గతిః=ఆశ్రయు<డైన కపిలు<డు, ధియా=మనస్సుతో, అభినంద్య=ఆప్రశ్నకు మెచ్చినవా<డై, స్మితశోభి తాననః ఈషత్, బవ్యార్థ గర్భితమై స్వల్పశబ్దములతో కూడియుండునట్లుగ, బభాషే=పలికెను. మహనీయులు మితభాషులని సూచించినటైనది.

13. అధ్యాత్మికః=దేహమందుండెడు పరమాత్మ మొదలైన తత్త్వముల స్వరూపమును తెలిపెడు. యోగః=జ్ఞానము, పుంసాం=జీవులయొక్క, నిశ్శ్రేయసాయ=మోక్షముకొఱకు సాధనమని, మేమతః=ఇష్టము. నాచేత నిరూపితమైన విషయము. యత్ర=ఏవిషయమందు, దుఃఖస్య=దుఃఖముయొక్కయు, సుఖస్యవై=అంతఃకరణ పరిణామరూపమైన శరీరముచే అనుభవింప<బడెడు సుఖము యొక్క, ఉపరతిః=సంపూర్ణనాశము ఏర్పడునో, అట్టియోగమును నీకు తెల్పెదనని అన్వయము.

14. అప్తతను తెలుపుటకై అనుచున్నా<డు. అనఘే! పురా=ముందు, శ్రోతుకామానాం=వినినిచ్ఛించిన, ఋషీణాం=బ్రహ్మ మొదలైన జ్ఞానులకు, ఉర్వంగనైపుణం= ఎక్కువైన యమ నియమాద్యంగములతో అత్యంతము పటుత్వమును పొందిన, యం యోగం=ఏ మోక్షోపాయమును, అవోచం= చెప్పితినో, ఇమం=ఈ, తం యోగం, తే=నీ కొఱకై, ప్రవక్ష్యామి. క్రిందటి శ్లోకములో ఆపాతతః చూచినచో మోక్షమందు సుఖదుఃఖములు రెండు కూడ ఉండవని చెప్పినట్లు కానవచ్చుచున్నది. కాని జనులు దుఃఖమును కోరరు. సుఖమే కావలెనని అందురు. దీనికి సమాధాన మేమన<గా 'చ'కారము చేత ఈక్రింది ప్రమాణమును సూచించినా<డు.

సుఖం శరీర భోగ్యం తు దుఃఖం సర్వం తథైవ చ.
ముక్తౌ విలయమాయాతి నిత్యానందస్తు భుజ్యతా".

ప్రాకృత శరీరముచే అనుభవించెడు అంతఃకరణ పరిణామ రూపమైన సుఖము అనుభవమం దుండనే యున్నది. కనుక జనుల అపేక్ష మోక్షమునకు పొందుకొనియే ఉన్నదని తెలియవలెను. అదే శ్లోకమందు వై అనునది నిశ్శ్రేయస మన<గా స్వర్గాదులు కాదు. స్వరూపానంద ప్రాప్తిరూపమైన మోక్షమే యని సూచించుచున్నది.

15. ప్రతిజ్ఞ యొనర్చిన యోగము యొక్క సాఫల్యమునకు మనస్సును వశమందుంచుకొనుట మొదటి సాధనమనుచున్నా<డు. చేతః మనస్సు, అస్య ఆత్మనః=జీవునియొక్క, బంధాయ=సంసారబంధమునకు, ముక్తయేచ= ఆబంధమునుండి విడివడుటకు కారణమని, ఆత్మనః=నాయొక్క, మతంఖలు= అభిప్రాయము, గుణేషు=ప్రాకృత గుణములైన సత్వర జస్తమస్సులందు అన<గా ప్రాకృతములైన శబ్దాది గుణములందు, సక్తంచేతః=సక్తమైన మనస్సు,

బంధాయ=సంసారమునకు కారణము. పుంసివా= ప్రాకృత గుణ రహితు<డైన శ్రీహరియందు, రతం=అనురక్తమైన మనస్సు, ముక్తయే= మోక్షకారణము. ఇట్లు చెప్పుటచేత ఒక్కటే మనస్సు రెండు కార్యములకు సామగ్రి ఎట్లగును? అనుప్రశ్నకుత్తరమిచ్చిన ట్లైనది.

16. శబ్దాది గుణములందు ఆసక్తము కాకున్నచో చాలునుకదా! అని ఆశంకించుకొని విశేషరూపముగా చెప్పుచున్నా<డు యదా=ఎప్పుడు, ఆత్మనః =జీవు<డు, అహంమమాభిమనోత్థైఃనేను నాది యనెడు అభిమానములతో నేర్పడెడు, కామలోభాదిభిఃనిషిద్ధకామన విషయలోభము మొదలైన, మలైఃకల్మషములనుండి, వీతం=విడివడినదై, శుద్ధం=జడమనస్సంపర్కము లేక చిత్స్వరూపమై, అసుఖం=శ్రీహరిని ధ్యానించుట చేత బాహ్యములైన శబ్దాది విషయ సుఖములందు ఆసక్తి లేనిదై- వానియందు ఇచ్ఛయే లేకుండుట చేత విషయ సుఖవిముఖమై, అదుఃఖం=దుఃఖ స్పర్శయే లేక, సమం=నిశ్చలమైన, భక్తిరసాయనముతో నిత్యానందమును పొందిన దగునో,

17, 18.తదా=అప్పుడు, పురుషఃజీవు<డు, జ్ఞానవైరాగ్యములతో కూడిన భక్తియోగముచేత, ఆత్మనా=తనస్వరూపమైన చిన్మనస్సుతో, కేవలం=గుణములు దేహము ఇంద్రియములు వీనియందు భేదము లేనట్టియు, నిరంతరం=అవతారము లందు భేదము లేనట్టి, స్వయంజ్యోతిఃస్వప్రకాశమైన, అణిమానం=అత్యంత సూక్ష్మమై బింబరూపమైన అఖండితం=పరిపూర్ణమైన, ప్రకృతేఃచిత్ప్రకృతికి కూడ, పరం=ఉత్తము<డైన, ఆత్మానం=శ్రీహరిని (తనబింబరూపిని) పరిపశ్యతి=శ్రీహరి పరివారమైన ప్రాణాది దేవతలను వీక్షించి తదను గ్రహముచేత దర్శించును. చ=ఇంకను, హతౌజసం=శక్తి తగ్గినట్టి, ఉదాసీనం=పరిణామకార్యాభిముఖ్యత లేని, ప్రకృతిం=ప్రకృతిని, (తదభిమాని లక్ష్మిని)వీక్షించును. కేవలం'ఇత్యాది విశేషములను చెప్పుటచేత, ఆత్మానం=ఇది వఱకు సాక్షాత్తుగా చూడని తన స్వరూపమునని అర్థ మొనర్ప రాదని చెప్పిన ట్లైనది.

"అభేదాత్స్వావతారేషు నిరంతర ఉదాహృతః,
గుణదేహేంద్రియాభేదాత్ కేవలోఽసదృశత్వతః
అఖండ పూర్ణశక్తిత్వాత్ అహమేకః సదామతః."

అనెడు ప్రమాణము పై చెప్పిన అర్థమును స్పష్టపఱచుచున్నది. చిత్తు మఱియు జడప్రకృతులకంటె ఉత్తము<డను మాట శ్రీహరియొక్క అసాధారణ లక్షణముగా చెప్ప<బడినది. 'అణిమానం' అనిచెప్పుటచేత తనబింబరూపమని చెప్పినా<డు.'ఆత్మని తిష్ఠన్...య ఆత్మనవేద"ఇత్యాది అంతర్వేది

బ్రాహ్మణములో ఈ విషయము చెప్పఁబడినది. దేనిచేత చూతును? అనుట కుత్తరము చిన్మనస్సుతో అని. ఇది నిత్యమైనది.

తాత్పర్యము: జీవు ఁడు సంసార బద్ధు ఁడగుటకును, ముక్తు ఁడగుటకును మనస్సే కారణము. అది అప్రాకృత స్వరూపియైన శ్రీహరియం దనురక్తమైనచో ముక్తికి కారణము. జీవు ఁడు పొందిన నేను నాదియనెడు అభిమానము, నిషిద్ధకామము, విషయలోభము మొదలైన వాని కభిమాన మిచ్చును ఇదియే మనస్సు కల్మషము. ఇదిలేక శుద్ధముగా నుండుట చిదానందాత్మకమైన మనస్సు. ఈ మనస్సుతో శ్రీహరిని ధ్యానించుటచేత ప్రాకృత విషయములందు ఇచ్ఛ జనింపదు. ఇచ్ఛట దుఃఖమునకు కారణములేదు. విక్షేపమునకు కారణము లేని భక్తియే నిండుకొని నిత్యానంద మనుభవమునకు వచ్చును. అప్పుడే చిన్మనస్సుతో చేతను ఁడు బింబరూపియైన శ్రీహరిని వీక్షించును. హరియొక్క గుణములకు, దేహములకు, ఇంద్రియములకు పరస్పరము భేదములేదు. అతని అవతార రూపములందును భేదములేదు. అతడు స్వప్రకాశకు ఁడై, అత్యంత సూక్ష్మ ఁడై, అంతర్యామియై, బింబరూపియై ఉండును.

పరిపూర్ణ ఁడైన శ్రీహరి జడ ప్రకృతి అభిమానమైన చిత్కృతికంటె ఉత్తము ఁడు. ఈ బింబరూపియైన శ్రీహరిని చూడవలెనన్నచో అతని పరివారమైన వాయ్వాది దేవతలు అపరోక్షము కావలెను. వారి అనుగ్రహము కూడ కావలెను. అప్పుడు ప్రకృతి యొక్క, శక్తి తగ్గిపోవును. ఈ కార్యమంతటికినీ జ్ఞానవైరాగ్యములతో కూడిన భక్తియోగము ముఖ్యసాధనము సర్వస్వామియైన శ్రీహరియందు అనుష్ఠించెడి భక్తి నిరతిశయమై ఉండవలెను. ఇదియే మోక్షమునకు మార్గము. దీని చేతనే పరిపూర్ణ ఁడైన శ్రీహరిని పొందుటకు సాధ్య మగును. దీనితో సమానమైన భక్తిమార్గము మఱియొక్కటి లేదు.

19. మోక్షమునకు ముఖ్యసాధనము భక్తిదప్ప వేఱేదియులేదను చున్నా ఁడు. అఖిలాత్మని=అందఱకును స్వామియైన, భగవతి, యుజ్యమానయా=చేర్చి నట్టి, భక్త్యా=నిరతిశయమైన భక్తికి, సదృశః= సమానమైన, శివః=మోక్షకారణమైన, పంథాః=మార్గము వేఱొక్కటి, యోగినాం=ముముక్షువులకు, బ్రహ్మసిద్ధయే=శ్రీహరి ప్రాప్తికొఱకు, న=లేదు. అన ఁగా శ్రీహరియందు అనుష్ఠించెడు భక్త్యొక్కటే మార్గమని తాత్పర్యము.

20. ఇప్పుడు బ్రహ్మజ్ఞాన మేర్పడుటకు ప్రతిబంధక మేదియో చెప్పు చున్నా ఁడు. ముందుశ్లోకములో 'సాధుషు' 'అసాధుషు' అనుపదమును తెచ్చుకొనవలెను. కవయఃజ్ఞానులు, అసాధుషు=హరిభక్తి లేని దారపుత్రులందు,

ప్రసంగం=అత్యంత స్నేహమును, ఆత్మనః=జీవునియొక్క, అజరం=శిథిలము కానట్టి, పాశం=బలిష్ఠమై క్షయము నెఱు <గని పాశమునుగా, విదుః=తెలియుదురు. స ఏవ=ఈ అతి స్నేహమే, సాధుషు=హరిభక్తులందు, కృతశ్చేత్=చేయ <బడిన దైనచో, అపావృతం=జీవుని కొఱకై తెఱచి ఉంచ <బడిన, మోక్షద్వారం=ముక్తికి వాకిలని, విదుః=తెలిసిరి, మోక్షము తప్పక సిద్ధించునని భావము.

21...24 ఎవరి సహవాసము భక్తిజ్ఞానముల మూలముగా భక్తికి సాధన మగునో అట్టి సత్పురుషుల లక్షణమేమో చెప్పుచున్నా <డు. తితిక్షవః =అభిమానమును వదలి విషయ స్పర్శను సుఖదుఃఖములకు కారణముకాని యట్లుగా చేసినవారు, కారుణికాః=దయావంతులు, సర్వదేహినాం=ఎల్ల సత్పురుషులకును, సుహృదః=స్నేహితులును, అజాత శత్రవః=దేహముతోడనే పుట్టిన కామక్రోధాదులకు శత్రువులు, శాంతాః=శ్రీహరి యందే నిష్ఠావంతులు, సాధవః=నిష్ఠయొక్క సాధనమే స్వభావముగా కలవారు, సాధుభూషణాః= శ్రీహరియం దుచితమైన భక్తియే భూషణముగా కలవారైన, యే=ఎవరు, మయి=శ్రీహరియైన నాయందు, అనన్యేన భావేన=లక్ష్మీ బ్రహ్మాదుల యందును అనుష్ఠింపనట్టి అతిశయమైన స్నేహముతో, దృఢాం=మరణమేర్పడినను చంచలము కాకయుండెడు, భక్తిం=మాహాత్మ్య జ్ఞాన పూర్వకమైన భక్తిని, కుర్వంతి= అనుష్ఠింతురో, అట్టివారైన, మత్కృతే=శ్రీహరి కొఱకై లౌకిక బంధుత్వములు వదలినట్టి, (పరలోక బంధువులను వదలరాదని తాత్పర్యము) హృష్టాః=అత్యంత రుచికములైన, మదాశ్రయాః=నాకు సంబంధించిన, కథాః=కథలను, యే=ఎవరు, శృణ్వంతి, కథయంతిచ=వినెదరో చెప్పెదరో అట్టివారైన, ఐకాత్మ్యగత చేతసః =పరిపూర్ణ <డైన శ్రీహరియే సర్వోత్తము <డను జ్ఞానము స్థిరముగా మనస్సునందు గల, యే=ఎవరు, వివిధాన్= అనేక రీతులైన, తాపాన్=తపస్సులను, తపంతి=ఒనర్తురో(ఉపనిషత్తులను పఠింతురో) సర్వసంగ వివర్జితాః=దుష్టములైన సమస్త సంగములను వదలిన, తేఏతే=వారే, హేసాధ్వి=దేవహూతి! సాధవః =భగవద్భక్తులు. అథ=అందుచేత, తేషు=వారియందు, సంగః=సహవాసము, తే=నీకు, ప్రార్థ్యః=ప్రార్థనకు విషయమై ఉండవలెను. తే=ఎవరు. సర్వదోష హరాః హి=దుష్టసంగముచే నేర్పడెడు దోషమును పరిహరించువారుగదా!

యాదృశీమయి భక్తిస్స్యాత్ తాదృశ్యన్యత్ర నైవచేత్,
అనన్యభక్తి రుద్రేకాత్ సా యయైవ తరేత్ శ్రుతిమ్.

అనెడు ప్రమాణము శ్రీహరి యం దొనర్చెడు నిరతిశయ భక్తియే అనన్య భక్తియని తెలుపుచున్నది.

"బ్రాహ్మం వావ తప ఉపనిషదం బ్రూమః"

అనెడు శ్రుతి ప్రకారము తప మన<గా ఉపనిషత్తులని యర్థము. 'ఐకాత్మ్య' మన<గా

"ఏకః పూర్ణోహరిర్నాన్యః తదన్యే తద్వశా మతాః,
ఇతి జ్ఞానం స్థిరం యత్తత్ ఐకాత్మ్య జ్ఞానముచ్యతే."

అను ప్రమాణమును బట్టి హరియే పరిపూర్ణ<డనెడు జ్ఞానము. దీనియందే మనస్సున్నదని చెప్పుట తపస్సొనర్చి ఇంద్రియము దుర్బలమై హరి సర్వోత్తమ జ్ఞానము తిరోహితము కావచ్చు ననెడు సామాన్య జనుల సందేహము పరిహరించినా<డు.

తాత్పర్యము: హరిభక్తులు కాని స్త్రీపుత్రాలందు అత్యంత స్నేహ ముంచరాదు. ఈ యతిస్నేహమే సుదృఢమైన బంధకమై శ్రీహరి యొక్క అపరోక్షమునకు ప్రతిబంధక మగును. ఈ అతి స్నేహమును భగవద్భక్తులం దొనర్పవలెను. అపుడు మోక్ష మనాయాసముగా సిద్ధించును. హరిభక్తు లెపుడును ద్వంద్వ సహిష్ణువులు, నిర్నిమిత్తముగా దయ గలవారు. సమస్త ప్రాణులకును స్నేహితులు. శరీరముతో పాటు ఏర్పడిన కామక్రోధాది శత్రువులను జయించిన శ్రీహరియందే నిష్ఠావంతులు. అట్టి నిష్ఠయే స్వభావముగా కలవారు. హరిభక్తియే భూషణము. లక్ష్మీబ్రహ్మాదులందు కనపఱచెడు భక్తి కంటె నతిశయముగా వారు శ్రీహరియందే భక్తిని నిష్ఠింతురు. ఎంతటి ఆపత్తు వచ్చినను చలింపని భక్తివారిది. తామొనర్చెడు సమస్తకర్మములను శ్రీహరికి సమర్పించెడు నడవడి వారిది. వానికొఱకై దార పుత్రాదులను గూడ వదలెదరు. రుచికరములైన శ్రీహరి కథలను వినుట వినిపించుట-ఇదియే వారి ముఖ్యజీవనము. హరియే సర్వోత్తము<డను దృఢమైన భక్తి వారిది. శాస్త్రాధ్యయన మొనర్తురు. దుష్టసహవాసము నుండి దూరముగ నుందురు. తన సహవాసముతో నితరులకు దుష్టసంగ దోషమును బో<గొట్టెదరు. నీవు వారి సహవాసమును ప్రాపింపుము. ఇట్టి సజ్జనుల సహవాసముతో మనఃకర్ణముల కాసక్తిని కలిగించెడు నాపరాక్రమ పూరిత కథలను వినెడు నవకాశ మేర్పడును. దానితో నాస్తిక్యబుద్ధి యేర్పడును. తత్ఫలముగా మనస్సు నాయందు జాగృతమై భక్తిని సాధించుకొనును. అది క్రమాభివృద్ధి.

25. శ్రీహరియొక్క కథాశ్రవణముతో దుష్ట సహవాస దోషము తొల<గునని చెప్పినట్లైనది. సత్సహవాసముతో ఇది ఏర్పడుటెట్లు అని ఆశంకించి సజ్జనుల

కితరమందు అత్యాసక్తి ఉండకపోవుట వలనవారి సహవాస మందు శ్రీహరి కథాశ్రవణము మొదలైనవి సంభవించుటం జేసి సజ్జన సంగతిద్వారా దుష్ట సంగదోషము నాశ మగునని తెల్పుచున్నా<డు. సతాం=సజ్జనుల యొక్క, ప్రసంగాత్=అతిశయ స్నేహముచేత, మమ, వీర్య సంవిదః=పరాక్రమ సంపత్తితో కూడిన, హృత్కర్ణరసాయనాఃమనస్సునకు చెవులకు ఆనందము కలిగించెడు, కథాఃకథలు, భవంతి=కల్గించును, తజ్జోషణాత్=సజ్జనుల నుండి ఆ కథలను వినుటచేత, అపవర్గ వర్త్మని=ముక్తి మార్గమనెడు శ్రీహరియందు, ఆశు=కాల విలంబములేని, శ్రద్ధారతిఃఆస్తిక్య బుద్ధితో కూడిన, భక్తిఃసుదృఢమైన ప్రేమ, అనుక్రమిష్యతి=పొర్పడును.

26. భక్తితో ఫలమేమని చెప్పుచున్నా<డు. పుమాన్=ప్రయోజనా పేక్షయా, సమర్థు<డును, శాస్త్రజ్ఞానియు ఐన అధికారి, భక్త్యా=నా విషయకమైన శాస్త్ర శ్రవణముచే నేర్పడెడు భక్తితో, ఐంద్రియాత్=ఇంద్రియ విషయములైన శబ్దాదులందు, జాతవిరాగఃబ్రహ్మ పదవి మొదలు తృణ పర్యంతమున్న సమస్త పదార్థములు అసారములు, అనిత్యములు, దుఃఖయుక్తములు అని తెలిసికొన్న వా<డై, శ్రీహరియే సారము, నిత్యు<డు, నిర్దుఃఖి అనెడు జ్ఞాన పూర్వకముగా వాని యందు స్నేహమేర్పడినవా<డై, దృష్టశ్రుతాన్మద్రచనాను చింతయా=ఉత్త మాధికారుల నుండి చూడ<బడిన, వారి నుండి తక్కువైన అధికారుల నుండి విన<బడిన నిరంతర ధ్యానముతో చిత్తస్య=చంచలమైన మనస్సుయొక్క గ్రహణే=నిగ్రహమందు (విషయములనుండి దూరముగా నుండుట యందు), యత్నఃప్రయత్నము కలవా<డై, ఋజుభిఃఎక్కువ కష్టములేని, యోగమార్గైఃయమ నియమాదులైన మోక్షోపాయ ప్రకారములచేత, యోగయుక్తఃసత్సంగమును పొందిన వా<డై, పరమాత్ముని యొక్క అపరోక్షమునకై, యతిష్యతే=ప్రయత్నించును. లేక కొంతమంది కనుభవములోనున్న, కొంతమంది కర్ణములకు సోకిన జీవాది పదార్థముల ఆలోచనచేత, ఇంద్రియ విషయములైన శబ్దాదులందు వైరాగ్య మేర్పరచుకొని యత్నించునని తాత్పర్యము.

తాత్పర్యము: భక్తిచేత జగత్తు అసారమనెడు జ్ఞాన మేర్పడును. తరువాత సర్వసారము, నిర్దుఃఖము, అయిన శ్రీహరి స్వరూపమందు జ్ఞాన పూర్వకమైన స్నేహము మఱికొంత వృద్ధిగొనును. మనస్సును నిగ్రహించుటకై ముముక్షువులు యత్నింతురు. అప్పుడు వారు ఎక్కువ కష్టములేని యోగ మార్గముతో కూడిన మోక్షసాధనములతో కూడిన తమకన్న ఉత్తములైనవారితో స్నేహము నేర్పఱచుకొందురు. శ్రీహరి అపరోక్షమునకై మఱికొంత దృఢతరప్రయత్నమొనర్తురు అప్పుడు వారుసర్వధా ప్రాకృత గుణసేవనము వదలుదురు. దృఢతరవైరాగ్యము

నెలకొని స్వదేహము మొదలుకొని సర్వత్ర వ్యాపించియున్న పరమాత్మ మొదలైన తత్త్వముల తారతమ్య జ్ఞానము సువిశదముగా వారికి తెలియును. దీనిచే నేర్పడెడు సర్వోత్తమ భక్తితో సమస్తమును శ్రీహరి కర్పించి వాని యందే లీనమైన మనస్సు గలవా రగుదురు. అపుడు వారు జీవాంతర్యామియై బింబరూపియై యున్న నన్ను ప్రాకృతకర్మ ప్రతిబంధము లేనిచో ఈ జన్మమందే కనుగొందురు. వారి భక్తికి వశు<డనై వారియందే నిరంతరము నెలకొని యుందును.

27. అధికారు లొనర్చెడు ఇట్టి ప్రయత్నము ఎప్పుడును నిష్ఫలము కాదని చెప్పుచున్నా<డు. ఆయం= ఈ రీతిగా, బింబా పరోక్షమునకై ప్రయత్నించిన యధికారి, ప్రకృతేర్గుణానాం=సత్త్వరజస్తమోగుణాత్మకములైన, విషయముగా, ఆసేవయా=సేవింపకయుండుట చేతను, వైరాగ్య విజృంభితేన=వైరాగ్యముతో నభివృద్ధమైన, జ్ఞానేన=దేహమందుండెడు పరమాత్ము<డు మొదలైన తత్త్వముల తారతమ్య జ్ఞానము చేతను, మయి=నాయందు, అర్పితయా=అర్పింప<బడిన, భక్త్యా=సుదృఢమైన స్నేహముచేతను, యోగేన=నాయందే మనస్సు నుంచుట చేతను, ప్రత్యగాత్మానం=ఆ జీవియొక్క అంతర్యామియై బింబరూపియైన, మాం=పరమాత్మయైన నన్ను, ఇహ=ప్రారబ్ధకర్మమనెడు ప్రతిబంధము లేకయున్నచో, ఈ జన్మమందే అవరుంధే=వశీకరించికొన్న వానివలె వీక్షించును (2)వైరాగ్యము, భక్తి, ఉపాసన-వీనిచేత పుట్టిన జ్ఞానమే మోక్షమునకు సాధనము. అంతేగాని కర్మగాదు. నాయందు సమర్పింప<బడిన జ్ఞానముచేత, యోగ ధ్యానముచే నేర్పడిన జ్ఞానముచేతను బింబభూతు<డైన నన్ను వీక్షించును. ఆభక్తియోగము ప్రకృతి గుణముల సేవింపనిదై యుండవలెను. తీవ్ర వైరాగ్యముతో కూడినదై యుండవలెను. ప్రాకృతగుణములను సేవింప రాదని రెండవసారికూడ చెప్పినందువలన ముముక్షువైనవా<డు వానినుండి సర్వధా దూరముగా నుండవలెనని హెచ్చరించు చైనది.

28. మయ్యర్పితయా అను విశేషణమును వాడుటచేత కుతూహలపడిన దేవహూతి అవకాశము దొరికించికొని ప్రశ్నించుచున్నది. అహం=నేను, యయా=ఏ భక్తిచే, నిర్వాణం=సర్వధాసుఖ స్వరూపియై ఉన్న, తే=నీయొక్క, పదం =స్థానమును, అంజసా=ముఖ్యముగా, అప్నుయాం=పొంద<గలనో, సా=అట్టి, త్వయి=నీయందు, అచ్యుత=తక్కువకాని, భక్తిః=భక్తి, కాచిత్=ఎట్టిది?మమ=నాకు, గోచరా=తెలిసికొనతగినట్టి భక్తియు, కీదృశీ=ఎట్టిది?

29. ఋజుభిర్యోగమాత్రైః=అని చెప్పిన యోగలక్షణము నడుగుచున్నది. నిర్వాణాత్మన్!=నిరతిశయానంద స్వరూపియైన వా<డా, భగవత్ప్రాప్తే=శ్రీహరిని

పొందుటయందు, యః=ఏ, యోగః=యోగము, త్వయోదితః, యతః=ఏయోగము నుండి, తత్త్వావబోధనం=తత్త్వముల సరియైన మార్గ మేర్పడునో, సః=ఆ యోగము, కీదృశః=ఎట్టిది? కతిచ అంగాని=ఆ యోగమున కంగము లెన్ని?

30. శ్రీహరీ!మందధీఃసూక్ష్మబుద్ధిలేని, యోషా=శాస్త్రజ్ఞానములేని స్త్రీయైన, అహం=నేను, భవదనుగ్రహాత్=నీయను గ్రహముచేత, దుర్బోధం=తెలిసికొనుటకు కష్టమైన, తదేతత్=యోగలక్షణ, భక్తి, లక్షణములను, యథా=ఎట్లు, సుఖం=అనాయాసముగా, బుధ్యేయ=తెలిసికొన <గలనో, తథా=అట్లు, మే=నాకొఱకు, విజానీహి=విశదముగా తెలుపుము.

31. ఈ కథను విదురునకు మైత్రేయు <డు తెలిపెనని పరీక్షిత్తునకు శుకాచార్యు <డనుచున్నా <డు. యత్ర=ఏదేవహూతియందు, తన్వాం=సచ్చిదానందాత్మకమైన శరీరముతో, అభిజాతః=శుక్రశోణిత సంబంధము లేక ఆవిర్భవించెనో, తస్య మాతుఃతల్లియైన దేవహూతి యొక్క, ఇత్థం=ఈ రీతియైన, అర్థం=అభిప్రాయమును, విదిత్వా=తెలిసి, జాతస్నేహఃసన్=తనతల్లికి భగవద్భక్తిని గూర్చి ప్రశ్నించుటందే అభిప్రాయమున్నది. తద్భిన్నమైన దానియందు లేదని ఏర్పడు అనుగ్రహబుద్ధి ఎక్కువగా కలవా <డై కపిలముని, తత్త్వామ్నాయం=పరమాత్మ మొదలైన తత్త్వమును తెలిపెడి శాస్త్రమును, సాంఖ్యం ప్రవదంతి=సాంఖ్యశాస్త్రమని చెప్పెదరో, తత్=అట్టి, భక్తివితాన యోగం=భక్తియోగమును విస్తారముగా చెప్పెడు, మాత్రే=తల్లికి, ప్రాహోచత్=విస్తారముగా తెలిపెను.

శుక్లేన జనిరన్యేషాం హరేః స్వతనువైవ తు,
నిత్యోదితజ్ఞానతనోః కుతస్యాత్శుక్లతో జనిః.

ఇతర జీవులకు శుక్రశోణిత సంబంధముతో ఉత్పత్తి. శ్రీహరికి తన సచ్చిదానంద దేహముతోనే ఆవిర్భావము. వాని జ్ఞానాత్మక శరీరము నిత్యమగుటచేత వానికి శుక్రము నుండి పుట్టుట పొస <గదు" అనెడు ప్రమాణముచేత సచ్చిదానంద స్వరూపమైన దేహముతోనే వ్యక్తు <డయ్యెనని తెలియవలెను. ఇతర జీవులు శరీరములేక యుండి తరువాత శరీరమును పొంది పుట్టుట నైజము. శ్రీహరి తన దేహముతోనే పుట్టునని చెప్పుటచేత అతనికి వేఱొక క్రొత్తదేహము ఏర్పడలేదని భావము.

32, 33సత్త్వాది గుణముల భేదములతో భక్తి అనేక విధములేనని సాత్వికమయ్యెడు ఉత్తమాధికారిని యోగ్యమైన భక్తియోగములను చెప్పుచున్నా <డు. "సత్వే ఏక మనన సః" అనెడు పదములను అవర్తించు కొనవలెను.

సత్త్వే=సర్వగుణ పరిపూర్ణ<డైన, ఏవ=శ్రీహరియందే, ఏకమనసఃఏకాగ్రమైన మనస్సు కల, పురుషస్య=మనుష్య<డు మొదలైన వారియందు ఒక్కనియొక్క, గుణలింగానాం=శబ్దాదులను తెల్పుటయే లక్షణముగా<గల, ఇంద్రియాభిమాని దేవతలయొక్క, సత్వే=శ్రీహరియందు, ఏకమనసఃఒకటే విషయమును చింతించుటచేత వేరొక వ్యాపారము లేనట్టి మనస్సుగల, యా=ఏస్వాభావికీ వృత్తిఃగంగాప్రవాహమువలె సంతతమైన వ్యాపారము కలదో, సా=అట్టి, అనిమిత్తా=ఏఫలమును గూడ నపేక్షింపని, నిర్దేఃఅపక్వభక్తిచేత పొందినముక్తి కంటెను, గరియసీ=ఉత్తమమైన, భాగవతీభక్తిఃశ్రీహరియం దొనర్చిన భక్తియు, యథా=ఎట్లు, నిగీర్ణం=భుజించిన దానిని, అనలఃజఠరాగ్ని జీర్ణమొనర్చునో, తథా=అట్లు, కోశం=లింగశరీరమును, జరయతి=సామర్థ్య హీనముగా నొనర్చును.

"సదాసర్వ గుణాత్మత్వాత్ సత్త్వో విష్ణు రుదీర్యతే"

అను ప్రమాణముచేత సత్త్వ మన<గా విష్ణువని యర్థము.

"ఆనుశ్రావిక కర్మా ఽపౌశ్రుత్యుక్తం యో న లంఘయేత్"

అను ప్రమాణముతో వేదానుసారి కర్మలొనర్చెడు వారికి అనుశ్రావికు<డని పేరు".

అపూర్ణభక్తే ర్ముక్తౌతు న సుఖంపూర్తి నేష్యతి!

అతస్తాదృశ అనుప్రమాణముచేత అపూర్ణభక్తితో నయ్యెడు వృత్తియందు పూర్ణ సుఖముండదు. దీనినే సిద్ధి పదముచేత చెప్పెదరు. భక్తి పరిపాకము గలవారు బ్రహ్మదేవునితో పాటు ముక్తులయ్యెడు కాలమందే కొందఱు భక్తి పరిపాకములేకయే ముక్తిని పొందెద రనియు అయినను వారి స్వరూపము సంపూర్ణముగా ఆవిర్భావమునొందక పోవుట చేత పరిపూర్ణ సుఖమండదనియు తెలియవలెను. దేవతలు దైత్యుల ఇంద్రియములకూడ అభిమానులై పాపకర్మమందు ప్రేరేపించుటచేత దానిని చూచి జుగప్స పడుటవలన మనస్సునకు విక్షేప మేర్పడును. అందుచేత అట్టివారి కైకాంతికమగు భక్తి అసంభావితము. సాత్త్విక జీవులకును వారియందు నియామకులై యుండెడు ఇంద్రియాభిమాని దేవతలకును భగవంతుని యందు మనస్సు గంగా ప్రవాహమువలె సంతతముగా నుండుట చేత చిత్త విక్షేప ముండదు. ఈ విషయమును తెలుపుట కొఱకే "సత్వే ఏవై ఏకమనసఃపుంసః "అనియు, 'గుణలింగానాం'అనియు వైశిష్ట్యము చెప్పినా<డని తెలియవలెను. 'సంభవింపవచ్చును' అనెడు అభిప్రాయముచేత ఇట్లు చెప్పుట వలన దేవతాభక్తి యందు అసురులలో తత్త్వాభిమానులైన కాలమందు భక్తి తక్కువయనియు,

సాత్త్వికులందు తత్త్వాభిమానులైనప్పుడు ఎక్కువగా ఉండుననియు కల్పింపరాదు. ఇరువురి యందును తత్త్వాభిమాని దేవతలు శ్రీహరి ఆజ్ఞ ననుసరించియే నడచువా రగుటచేత వా రెప్పుడును శ్రీహరికి ప్రతిపాత్రులు. 'గుణలింగానాం' అనుటచేత మిగిలిన అతాత్త్విక దేవతలను పరిహరించినా<డు. కలిమొదలైన అసురులను పరిహరించుటకు' అనుశ్రవిక కర్మణాం' అని చెప్పినా<డు. అసురులు వేదోక్త కర్మలను కొన్ని వేళల అనుష్ఠించినను వారికి తప్పక ఒనర్తురని వియమములేదు. పైన చెప్పిన విశేషణములతో కూడిన దేవతల భగవద్విషయకమైన చిత్తైకాగ్రతయే భక్తియగునని చెప్పినచో సామాన్యులైన అధమ జీవులచేత నిర్వహింప<బడెడు భక్తి భక్తికాకపోవును. అప్పుడు "నేను చేయుటకు యోగ్యమైన భక్తి ఏది" అనెడు దేవహూతి ప్రశ్నకుత్తరము చెప్పినట్లు కాదు. అందుచే ఈ శ్లోకమందు ఈ రీతిగా విభాగ మొనర్పవలెను. (1)దేవతలు భగవంతునందు నిర్వహించెడు ఏకాగ్రమనస్సు యొక్క వ్యాపారము దేవతల అందరిభక్తియు. (2)తత్త్వాభిమాని దేవతలు భగవంతునం దనుష్ఠించెడు ఏకాగ్ర మనస్సు యొక్క వ్యాపారము తత్త్వాభిమాని దేవతల భక్తి వేదోక్త కర్మలను విడువక నిర్వహించెడు జీవులు భగవంతునందు నిర్వహించెడు ఏకాగ్ర మనస్సుయొక్క వ్యాపారము భక్తి. ఇది సర్వాధికారి చేతనుల భక్తికి లక్షణము. ఈ మూ<డు లక్షణము లందును సంతతమైన ఫలసంకల్పము లేకుండుట ప్రధానమని తెలియవలెను. అప్పుడు అధమాధికారుల భక్తికూడ సిద్ధేఃముక్తికి, గరీయసి=ముఖ్యసాధనమే అని అర్థమొనర్పవలెను.

తాత్పర్యము: సర్వగుణ పరిపూర్ణు<డైన శ్రీహరి యందు ఏకాగ్రము స్వాభావికము, గంగా ప్రవాహమువలె సంతతము ఐన ఏ మనో వ్యాపారము కలదో అదియే భక్తి. ఇంద్రియాభిమానులైన దేవతలు ప్రతిజీవునియందును ఉన్నవారై వానికి శబ్దాదిగుణములను తెలియ<జేసెదరు. వానిచేత వేదోక్తములైన కర్మలు చేయింతురు. ఏకాంత భక్తులైన వీరు ఏ ఫలమును గూడ నపేక్షించుట లేదు. వీరి భక్తి సామాన్యుల ముక్తికంటెను ఉత్తమమైనది. శ్రీహరి యం దనుష్ఠించెడు భక్తి లింగశరీరము సమర్థముగా నొనర్చును. జీవితిన్న ఆహారము జఠరాగ్ని జీర్ణ మొనర్చునట్లు ఈ భక్తి లింగశరీరమును జీర్ణమొనర్చును. తత్త్వాభిమాని దేవతాభక్తి కంటెను దేవతా సామాన్యమైన భక్తి తారతమ్యమందు తక్కువ యైనదని తెలియవలెను. దానికంటెను వేదోక్తకర్మానుష్ఠాన మొనర్చుకొని యుండెడు ముక్తి యోగు లనుష్ఠించెడు భక్తి దానికంటె తక్కువైనది. అయినను ఈ మూ<డు భక్తులును సంతతములై ఫలాపేక్షలేనివై యుండును.

ఈ మూ<డవదియైన అధమాధికారుల భక్తి వారి ముక్తికి ముఖ్యసాధనము. మధ్యమ, ఉత్తమ అధికారుల భక్తి ముక్తికి సాధన మగుటయే కాక అధమాధికారుల భక్తికంటెను ఉత్తమమైనది.

34. ఎవరి భక్తి సామాన్యుల ముక్తికంటె నుత్తమమో అట్టిభక్తి ననుష్ఠించు వారెవ్వరు అన<గా చెప్పుచున్నారు. యే భాగవతాఃఏభగవద్భక్తులు, అన్యోన్యతఃపరస్పరము, ప్రసజ్యకూడుకొని, మమ పౌరుషాణిపరాక్రమములను, సభాజయంతఃభక్తిగౌరవములతో చెప్పెదరో, వినెదరో, మత్పాదసేవాభి రతాఃనాపాదములను సేవించుటందే ఆసక్తులైనట్టియు, మదీహాఃనన్నే ఇచ్ఛించునట్టి, తేకేచిత్ఆకొద్దిమంది, యేనేనను గ్రహించెడు, ఏకాత్మతాంసాయుజ్య మోక్షమును కూడ, న స్పృహయంతికోరరు. భక్తితో సంతుష్ట<డై దానిని అతని ఆజ్ఞయని స్వీకరింతురే కాని తమ భక్తికి ఫలమని స్వీకరింపరు. ఎవరైన నిచ్చినదానిని చిన్నపిల్లలు కూడ గ్రహింతురు. జ్ఞాని మాత్రము తిరస్కరించునా అని సామాన్యులు శంకింపవచ్చును.

నేచ్ఛంతి సాయుజ్యమపి ఫలత్వేన హరిర్యది,
దదాతి భక్తి సంతుష్టఃఆజ్ఞాత్వేనైన గృహ్ణతే.

తాదృశానాం సుఖాధిక్యం పునర్ముక్తే భవిష్యతి" అనెడు ప్రమాణముతో కేవలము నారాయణుని ఆజ్ఞానుసారముగా సాయుజ్యము ననుభవించెడు భక్తులుకూడ ఉందురని తెలియవలెను. అట్టివారికి మోక్షమందు అధికానందము ఉండును. వారు మోక్షమును కూడ నిష్టపడని దానికి కారణము మత్పాదసేవాభి రతాఃఅనుటతో తెలిపినా<డు. శ్రీహరిసేవయే పూర్ణానంద దాయకమని తెలియుటచేత ఇతరము నపేక్షించరని యర్థము. 'మదీహాఃఅనుటచేత శ్రీహరిని సేవించునపుడు ప్రాసంగికముగా అన్యత్ర ప్రవృత్తులైనను కడపట శ్రీహరికే అర్పించుట చేత అది కూడ భగవంతుని ప్రీతికే కారణమని చెప్పినట్లైనది. 'కేచిత్' అనుటచేత వారుకూడ కొద్దిమందియే అని అర్థము.

35. సాయుజ్యము నపేక్షింపని దానికి గల వేరు కారణమును కూడ చెప్పుచున్నా<డు. తేసంతఃఆఏకాంత భక్తులు, రుచిరాణిసుందరములైనట్టి, ప్రసన్న వక్త్రారుణలోచనాని=ప్రసన్నమైన ముఖము, అరుణములైన కన్నులు కల్గిన, మనోహరాణిభక్తుల మనస్సు నాకర్షించెడు, దివ్యాని ఏవసచ్చిదానంద స్వరూపములైన, రూపాణినారూపములను, పశ్యంతిచూతురు. మయాసాకం=నానుండి, స్పృహణీయాంవినవలెనని ఇచ్ఛగల, వాచంమాటను, వదంతిమాటాడెదరు, భగవద్రూప దర్శనము అతనితోడి సల్లాపము- వీనికంటె

పరమసుఖమైనది మఱియొకటి ఉండదు కనుక వారు సాయుజ్య భక్తిని ఉపేక్షింతురని భావము.

36. కాలశక్తిని పోద్రోయు వారెవ్వరును లేరు. స్వల్పకాలము భగవంతునందు భక్తిచెల్లించిన వానికిని తరువాత తత్సంగము వ్యత్యస్తము కావచ్చును. అప్పుడు సంసారము నివృత్తమగుటలేదు. అందుచేత భక్తితో ప్రయోజనమేమి? అనుశంకకు సమాధానము. దర్శనీయావయవైః=బహు సుందరములైన అవయవములు గలట్టియు, ఉదార విలాసహాసేక్షిత వామసూక్తైః =మనోహరమైన విలాసము. మందస్మితము, వీక్షణము ఇంకను అనుకూలమైన ఇతర వచనములుగల, తైః=ఆ నా అప్రాకృత రూపములచేత, హృతాత్మనః =అపహృతమైన మనస్సుగలట్టియు, హృతప్రాణాంశ్చ=సర్వేంద్రియములచేతను ఆ రూపమునే విషయీకరించుకొనెడు, భక్తిం ఏవ=భక్తినే, అనిచ్ఛతః=అపేక్షించని జీవునకు ప్రసన్న్ను<డ నైన నేను, అణ్వీం=సూక్ష్మమైనట్టియు, సాయుజ్యరూపమైన, గతిం= మోక్షమును. ప్రయుంజే=ఇత్తును.

37. సాయుజ్యమును పొందిన వారికి దుఃఖముండదా? దానికుత్తరము. యే=ఎవరు, మమ, మాయయా=ఇచ్ఛచేత, విసృష్టాన్=నిర్మితమైన, ధ్వజము, అతపత్రము, వ్యజనము మొదలైన, విభూతిం=సంపత్తును, అథ=మరియు, అష్టాంగమను=అష్టాంగ యోగము చేత, ప్రవృత్తం=ఉండెడు, ఐశ్వర్యం= అణిమాద్యష్టైశ్వర్య సిద్ధులను, మరియు భద్రాం=సర్వాంగములతో కూడిన, దేవీం=ప్రకాశమానమైన, శ్రియం=గవాశ్వాది ఐహిక సంపత్తును, నస్పృహయంతి= కోరరు, తే=వారు, పరస్య=సర్వోత్తమమైన, మే లోకే=దేహమందు, సచ్చిదానందాత్మకమైన దానిలో, అశ్నువతే=వ్యాపించి యుండిన, సుఖమునే అనుభవింతురు. హి=ముక్తి లోక విలక్షణ మగుటచే ఇది సాధ్యము. లేక ఈ శ్లోకముతో సాలోక్య మోక్షమును వివరించినా<డని తెలియవలెను. భక్తిజ్ఞానముల ఫలముగా నేనున్నగ్రహించిన, విభూతిం=సంపదను, ఐహికమైన దానిని మహర్లోకాదులందు అనువ్యక్తమైన అష్టాంగ యోగసిద్ధి పరిపక్వమైన వైరాగ్యమునంది యుండుటచేత అపేక్షించని భక్తులు, మే=నాయొక్క లోకే= వైకుంఠలోకమందు ఎక్కువ సుఖమును, అశ్నువతే=పొందెదరు కనుక నీవు కూడ స్వర్గాదులందు ఆశయిడక నాకత్యంతోపకారి వగుటచేత "శ్రీహరి సచ్చిదానంద స్వరూపు<డు. ఎల్ల వస్తువులకంటె అత్యంత ప్రియు<డని" సేవింపుము. నీకు కూడ ముల్లోక ప్రాప్తియగును". ఈ మాటలచేత నాకు యోగ్యమైన భక్తి ఏదన్న దేవహూతి ప్రశ్నకు ఉత్తర మిచ్చిన ట్లైనది.

38. కాలము సర్వత్ర యుండుట వలనను స్వతంత్రమైన దానివలెను వైకుంఠమును చెందినను ఏదో కారణముతో తిరిగి రావలెను గదా! దానికి సమాధానము. మత్పరాః=నాయందాసక్తి కల్గినట్టియు, శాంత రూపాః= నాయందే నిష్ఠమైన మనస్సును బొంది యుండు ముక్తులు, కర్హిచిత్= ఎప్పుడును, ననక్ష్యంతి=నాశమగుటలేదు, యేషాం=ఏ ఈ భక్తులకు, అహం, ప్రియః ఆత్మా=స్వామియు, సుతః, చ=తండ్రియు, సఖా=స్నేహితు<డు, గురుః= ఉపదేశకు<డు, సుహృదః=ఎల్లవ్యసన కాలమందు స్నేహితు<డు, ఇష్టందైవం= ఇష్టదైవము అయి ఉందును. అన<గా ఈ ఎల్లరీతులను ఉపాసింతురని భావము. అట్లుపాసించిన తాన్=వారిని. మేహేతిః=ఆయుధమైన, అనిమిషః =కాంచక్రము, నోలేఢి=స్పృశించుట లేదు. అన<గా నాశ మొందించుట లేదని యర్థము. 'సుహృదః' అనెడు విశేషణము ఎల్లవ్యసనము లందు శ్రీహరి ఒక్క<డే అనిమిత్త బంధువని సూచించినట్లైనది. కాలమునుండి నాశముగా కుండుటకు ఇది కారణమని చెప్పినట్లైనది.

39, 40. వైరాగ్యముచేత కూడిన భక్తితో నన్ను సేవించువారిని సంసారము నుండి తరింప<జేయు<వా<డను నేనే అని చెప్పుచున్నా<డు. ఇమంలోకం=ఈ నశ్వరమైన ప్రపంచమును, తథైవ=అట్లే, ఆత్మానం=జీవుని, ఉభయాయినం= ఇహలోక పరలోకములందు సంచరించు వా<డను, విజ్ఞాయ=తెలిసికొని, ఆత్మానం అను=తన్ను అనుసరించుకొని యుండెడు, ఏచ ఇమే=ఏ ఈ ఎల్ల వస్తువులు, (2) ఏ పుత్రాదులున్నారో వారును, యేరాయః=సంపత్తు,పశవః, గృహాః, అన్యాన్=ఇంకను మిగిలిన, సర్వాంశ్చ=అన్నిటినీ, విసృజ్య=నావియనెడు అభిమానముతో చూడక, విశ్వతో ముఖం=అన్నిటి కంటెను ముఖ్యమైన (3) సర్వజ్ఞ<డైన, మాం, అనన్యాభక్త్యా=అత్యుత్తమమైన భక్తిచేత, యే భజంతి= ఎవరు భజింతురో, తాన్=వారిని, మృత్యోః=సంసారము నుండి, అతి పారయే= అవతలి వైపున నున్న నన్ను చేర్పింతును. లేక అతిపారయేను=ముక్తులనుగా చేయుదును.

41. నాకంటెను వేరైన సంసార తారకు<డున్నా<డని శంకింపకుమని చెప్పుచున్నా<డు. భగవతః=సర్వేశ్వర్య యుక్తు<డైన, ప్రధాన పురుషేశ్వరాత్= చిత్ప్రకృతియైన లక్ష్మి, పురుషనామకు<డైన బ్రహ్మ వీరువురికి, ఆత్మనః=వారివారి కర్మఫలదాతయైన, మత్ అన్యత్ర=నన్నువదలి వేరొక్కరి నుండి సమస్త భూతములయొక్క, తీవ్రం=సంసారరూప భయము, ననివర్తతే తొల<గదు.

42. వాయ్వాది సమస్త దేవతలు తమతమ అధికారులందు ప్రవృత్తులగుట నాయాజ్ఞచేతనే కనుక వారికి ముక్తినొస<గు అధికార మెక్కడిది?

అందుచేత ముక్తినిచ్చువాడు హరికంటె వేరుగానున్నా <డని శంక కవకాశమేలేదు. ఆయంవాతః, మద్భయాత్ వాతి. సూర్యః మద్భయాత్ తపతి. ఇంద్రోవర్షతి. అగ్నిర్దహతి, మృత్యుః మద్భయాత్ చలతి.

43. ముక్తిదాయకు <డను నేనే. దానికి ముఖ్య సాధనము నేనే యని చెప్పుచున్నా <డు. యోగినఃజ్ఞానులు, క్షేమాయ=మక్షమునకై, అకుతో భయం= ఎవరి నుండి భయములేని, మే పాదమూలం=నాయొక్క పాదములను, జ్ఞాన వైరాగ్యములతో కూడిన భక్తియోగముచేత, ప్రవిశంతి=ప్రవేశింతురు (ఆశ్రయింతురు) 'ఆకుతోభయం' అనిచెప్పుట చేత వాయ్వాదులవలె శ్రీహరి అన్యనియతు <డు కాదనియు అందుచేత ముక్తినొస <గెడు సామర్థ్యము వానియందెపుడును కుంఠితము కాదని తెలిపిన శ్లోకము.

44. ఒక ఊరికి <బోవుట కనేక మార్గము లున్నట్లు మోక్షప్రాప్తికి కూడ అనేక మార్గములుండ వచ్చును గదా! అనుశంకను పరిహరించుచున్నా <డు. అస్మిన్ లోకే=ఈ లోకమందు, పుంసాం=ముముక్షుజీవులకు, ఏతావాన్ ఏవ= ఇదియొక్కటియే, నిశ్శ్రేయ సోదయః=మోక్షమున కుపాయము. అది ఏదనగా, తీవ్రేణ=దృఢతరమైన, భక్తియోగేన=సర్వోత్తమ భక్తితో, మయి=నాయందు, అర్పితం=ఒప్పింప <బడిన, అచలత్వేన=స్థిరముగా, మయి=నాయందే నిల్ప <బడిన, మనః=మనస్సు.

తాత్పర్యము: సత్పురుషుల తీవ్రమైన భక్తితో సంతుష్ట <డనైన నేను వారికి సాయుజ్య ముక్తినే ప్రసాదింతును. అట్టి భక్తులు నానుండియే నిర్మితమైన లౌకిక రాజ్యాది సంపత్తును గాని యోగాభ్యాసముతో సిద్ధించెడు అణిమాది సిద్ధులనుగాని నా భక్తిలేని వారపేక్షించెడు ఏ విధమైన సంపత్తునే గాని లేశమును గూడ నాశింపరు. ఇట్టి తీవ్రమైన వైరాగ్యముతో కూడిన నిరతిశయ భక్తిగల జీవులకు నాదేహమునే వారు వ్యాపించి కొని యుండునట్లుగా అనుగ్రహింతును. నాసచ్చిదానందాత్మకమైన దేహమందుండియే వారు తమ స్వరూప సుఖముల ననుభవింతురు. లోక విలక్షణమైన ముక్తియందు ఇది ఏమియు అసంభావితము కాదు. ఇదియే సాయుజ్యము. వీరికంటెను కొంచెము తక్కువ అధికారులైన ముక్తియోగ్యులు వారి యోగ్యతాను గుణముగా వైరాగ్యము నంది ఐహిక సంపత్తునపేక్షింపక నశ్వరములైన స్వర్గాదుల నాశింపక నన్నే సమస్త వస్తువుల కంటెను ప్రియమైన వానినిగా సేవింతురు. వీరు నా వైకుంఠ లోకమందు శాశ్వత సుఖ మను భవింతురు. ఇదే సాలోక్యముక్తి. నాయందే ఆసక్తులు. నాయందలి మనోనిష్ఠయు స్వరూపముగా నున్నవారు అయిన ఈ ముక్తుల కెన్నడును నాశములేదు. వీరికి నేను ప్రియు <డను.

స్వామిని, పుత్రు<డను, తండ్రిని, స్నేహితు<డను ఉందును, ఇట్లు ఎల్లరీతుల నన్నుపాసించువారికి కాలచక్రమునుండి భయములేదు. వారు శాశ్వతముగా నాలోకమందు సుఖము ననుభవించుచు లయింతురు. ఈ ప్రపంచము నశ్వరమని తెలిసి, జీవు<డు కర్మాను గుణముగా భూలోక స్వర్గలోకములందు చరించునని ఎఱి<గి ఇహలోకమున కనుబంధులై భార్యాపుత్రులు, గృహము, సంపత్తు మొదలైన ఈ సమస్తముకూడ శ్రీహరి యనుగ్రహము చేత ఈ జన్మమునకు ప్రాప్తించిన వగుటచేత ఇవన్నియు వానికే చెందినవని భావించి సర్వోత్తము<డు ఐన శ్రీహరిని సేవించెడు భక్తులను నేను సంసారమునుండి దాటించి నన్నే పొందించెదను. ముక్తులుగా నొనర్తును. చేతన ప్రకృతి యనిపించికొనెడు లక్ష్మీ, పురుషు< డనిపించుకొనెడు బ్రహ్మ ఈ ఇరువురకు కూడ నియామకు<డైన వా<డను నేనే. సమస్త జీవుల సంసార భయమును పో<గొట్టెడి వా<డను నేనే. ఇతరులచే నీ సంసార నివృత్తి కానేరదు. దేవతలు తమతమ అధికారముల నుండి ప్రవృత్తు లగుట నానుండియే. నాభయముతోనే గాలివీచును. సూర్యు<డు తపించును. ఇంద్రు<డు వర్షించును. అగ్ని దహించును. మృత్యువు ప్రాణులను సంహరించును. అందుచేతనే ఈ విషయము నెఱి<గిన జ్ఞానులు ఎవరి భయముచేత ప్రవృత్తు<డుగాని నన్నే సేవింతురు. వారు జ్ఞాన వైరాగ్య భక్తిని నెఱపి నన్నే పొందెదరు. అధికారియైన జీవికి మోక్షమును పొందెడు ఒక్కటే ఒక్క మార్గమేదనగా దృఢతరము సర్వోత్తమమైన భక్తిచే నాయందు స్థిరముగా నెలకొని యుండుట.

ఇతి శ్రీమద్భాగవతే సుధాలహరి వ్యాఖ్యాయాం తృతీయస్కంధే పంచవింశోఽధ్యాయః

అధ్యాయము - 25

అని చెప్పి వెండియు మైత్రేయుండు విదురుం గనుంగొని కర్దముండు వనంబునకుం జనిన యనంతరంబ మాతృవత్సలుండైన కపిలుండు బిందుసరంబున వసియించి యుండ దేవహూతి తత్త్వమార్గాగ్రదర్శనుండైన సుతునిం గనుంగొని బ్రహ్మవచనంబులు దలంపుచు నిట్లనియె. 858

దేవహూతి పుత్రుండైన కపిలాచార్యుని వలనం దత్త్వజ్ఞానంబు వడయుట.

కం. అసదింద్రియ ఘూర్ణనమున
వసమఱి నిర్విణ్ణ నగుచు వనరెడి నా కీ

యసదృశమోహతమో విని
రసనం బనఘాత్మ! యే వెరపున ఘటించున్. 859

కం. పటు ఘన నీరంధ్రతమః
పటల పరీవృత జగత్పపంచమునకు నె
క్కటి లోచనమై మహితో
త్కటరుచి వెలుఁగుదువు భానుకైవడి ననఘా! 860

ఉ. భూరి మదీయ మోహ తమముం బెడఁబాప సమర్థు లన్యు లె
వ్వారలు? నీవ కాక నిరవద్య! నిరంజన! నిర్వికార! సం
సారలతాలవిత్ర! బుధసత్తమ! సర్వశరణ్య! ధర్మ వి
స్తారక! సర్వలోకశుభదాయక! నిత్యవిభూతినాయకా! 861

చ. నిను శరణంబు సొచ్చెద ననింద్య తపోనిధి! నన్నుఁ గావవే
యని తను దేవహూతి వినయంబున సన్నుతి చేసి వేఁడిన
న్ననుపమ సత్కృపాకలితుఁడై కపిలుం డనురాగ మొప్ప స
జ్ఞాన నిచయాపవర్గ ఫలసాధనమై తగు తల్లి వాక్యముల్. 862

కం. విని మందస్మిత లలితా
నన కమలుం డగుచు నెమ్మనమునఁ బ్రమోదం
బనయంబు గడలుకొన నిజ
జననికి నిట్లనియెఁ బరమశాంతుం డగుచున్. 863

కం. వినుఁ జీవుని చిత్తము దా
ఘన భవబంధాపవర్గ కారణ మది యే
చినఁ ద్రి గుణాసక్తం బై
నను సంస్కృతి బంధకారణం బగు మఱియున్. 864

తే. అదియు నారాయణాసక్త మయ్యె నేని
మోక్షకారణ మగు నని మునికులాబ్ధి
చంద్రుఁడన నొప్పు కపిలుఁడు జననితోడ
నర్థి వినఁ జెప్పి మఱియు నిట్లనియెఁ బ్రీతి. 865

వ. మఱియును చిత్తం బహంకార మమకార రూపాభిమాన జాతంబులగు కామ లోభాది కలుష వ్రాతంబులచేత నెప్పుడు విముక్తంబై పరిశుద్ధంబగు నప్పుడు సుఖదుఃఖవివర్జితంబు నేకరూపంబునై ప్రకృతికంటె బరుండును, బరమపురుషుండును, నిర్ద్వేద్యుండును, స్వయంజ్యోతియు, సూక్ష్మ స్వరూపుండును, నితర వస్త్వంత రాపరిచ్ఛిన్నుండును. ఉదాసీనుండును నైన పరమాత్మునిం, దదీయ మహోహతౌజస్కంబైన ప్రపంచంబును, జ్ఞానవైరాగ్యభక్తి యుక్తంబగు మనంబుచేఁ బొడగాంచి యోగిజనులు

పరతత్త్వసిద్ధికొఱకు నిఖిలాత్మకుండైన నారాయణునందు సంయుజ్యమానంబైన భక్తి భావంబువలన నుదయించిన మార్గంబునకు నితర మార్గంబులు సరిగా వంక్రు. విద్వాంసులు సంగం బింద్రి యార్థాద్యసద్విషయంబుగ నొనరింపంబడిన జీవునకు నశిథిలంబగు బంధంబునకుఁ గారణం బగు ననియు, నదియె సద్విషయంబైన నంతఃకరణసంయమన హేతుభూతం బగుచు సాధుజనులకు ననర్గళమోక్ష ద్వారంబగు ననియుఁ దెలియుదురు. (సహనశీలురును) సమస్త శరీరధారులకు సుహృత్తులును, బరమ శాంతులును, గారుణికులు నై మదర్థంబుగఁ బరిత్యక్త కర్ములు, నిస్పృష్టస్వజన బంధుజనులునై, మత్పదాశ్రయులును, మద్గుణధ్యాన పారీణులును, మత్కథాప్రసంగ సఫలిత శ్రవణులును నగుచు నుండు పరమ భాగవతోత్తముల దాపత్రయంబు తపింపం జేయం జాలఁడు. అట్టి సర్వసంగవినిర్గతులగు పరమ భాగవతజనుల సంగం బపేక్షణీయంబు (అది సకల దోషనివారకం బగు, అట్టి సత్సంగంబున సర్వప్రాణి హృత్కర్ణ రసాయనంబులగు మదీయ కథా ప్రసంగంబులు గలుగు). మద్గుణా కర్ణనంబునంజేసి శీఘ్రంబుగఁ గ్రమంబునం గైవల్యమార్గదంబు లగు శ్రద్ధాభక్తు లుదయించు. అదియనుంగాక యే పురుషుండైన నేమి? మద్విరచిత జగత్కల్పనాది విహారచింతచే నుదయించిన భక్తిఁజేసి యింద్రియ సుఖంబులవలనను, దృష్టశ్రుతంబులైన యైహికాముష్మికంబుల వలనను, విముక్తుండగుచుఁ జిత్తగ్రహణార్థంబు ఋజువులైన యోగ మార్గంబులచే సంయుక్తుండగునట్టి యోగి ప్రకృతి గుణసేవనంబు చేతను, వైరాగ్యగుణ విజృంభితంబైన జ్ఞానంబుచేతను, మదర్పిత భక్తి యోగంబు చేతను, బ్రత్యగాత్మకుండనైన నను నంతఃకరణ నియుక్తునిం గావించు. అని చెప్పిన విని దేవహూతి కపిలున కిట్లనియె. 866

కం. ఏభక్తి భవద్గుణ పర
మై భవపాప ప్రణాశమై ముక్తి శ్రీ
లాభము రయమున జేయునొ
యాభక్తి విధంబుఁ దెలియ నానతి యీవే! 867

వ. అదియునుంగాక భవదుదితంబైన యోగంబును, దదంగంబులును, దద్గత తత్త్వావబోధనంబును సాకల్యంబుగ మందబుద్ధినైన నాకు స్ఫుటం బగునట్లు దెలియ నానతిమ్మనిన గపిలుం డిట్లనియె. 868

సీ. జనయిత్రిఁ వినుమఖి సకల పదార్థప
రిజ్ఞాన తత్త్వ పారీణ మగుచు

నామ్నాయ విహిత కర్మాచారములు కల్గి
తివుటమై వర్తించు దేవగుణము
వూని నైసర్గికం బైన నిర్హేతుక
మగు భగవత్సేవ మహితముక్తి
కంటె గరిష్ఠంబు గావున నదియు భు
క్తాన్నంబు జీర్ణంబు నంద< జేయు
తే. దీప్త జఠరాగ్ని గతి లింగదేహనాశ
కంబు గావించు నదియును గాక విష్ణు
భక్తి వైభవములు దేటపఱుతు వినుము
సద్గుణ వ్రాత! యోగలక్షణసమేత! 869

చ. అమలిన భక్తి< గొందఱు మహాత్ములు మచ్చరణారవింద యు
గ్మము హృదయంబునన్ నిలిపి కౌతుకులై యితరేతర రానులా
పముల మదీయ దివ్యతను పౌరుషముల్ గొనియాడుచుండి మో
క్షము మది< గోరనొల్ల రనిశంబు మదర్పిత సర్వ కర్ములై. 870

సీ. పరికింప< గొందఱు భాగవతోత్తముల్
ఘనత కెక్కిన పురాతనము లైన
చారుప్రసన్న వక్త్రారుణ లోచన
ములు గల్గి వరదాన కలితములు గ<
దనరు మద్దివ్యావతారవైభవములు
మది నొప్ప<దమ యోగమహిరు< జేసి
యనుభవింపుచు< దదీయాలాపముల సన్ను
తింపుచు< దివుట< దద్దివ్య విలస
తే. దవయవోదార సుందర నవ విలాస
మందహాస మనోహర మధురవచన
రచనచే నపహృతమనఃప్రాణు లగుచు
నెలమి నుందురు నిశ్శ్రేయసేచ్ఛ లేక. 871

మ. కణ<కన్ వారలు వెండి మోక్ష నిరపేక్ష స్వాంతులై యుండియు
న్నణిమా దృష్ట విభూతి సేవితము నిత్యానంద సంధాయియున్
గణనాతీతము నప్రమేయము సమగ్ర శ్రీకమున్ సర్వ ల
క్షణ సంయుక్త వికుంఠలోక పదవిన్ గైకొందు రత్యున్నతిన్. 872

వ. ఇట్టు లొంది 873

కం. తనరుదు రప్పుణ్యాత్ములు
జనయిత్రి! మదీయకాలచ క్రగ్రసనం

బును బొందక నిత్యం బగు
ననుపమ సుఖవృత్తి నుందు రది యెట్లనినన్. 874

మ. సమతన్ స్నేహముచే సుతత్వమును, విశ్వాంబుచేతన్ సఖి
త్వము, చాలన్ హితవృత్తి చేతను సుహృత్త్వంబున్, సుమంత్రోప దే
శముచేతన్ నిజదేశికుం డన<గ నిచ్చల్ పూజ్యు<డౌ నిష్ట దై
వమునై వారికి< గాలచక్రభయముల్ వారింపుదుం గావునన్. 875

చ. వినుమదిగాక యీ భువి దివిం బలుమాఱు< జరించు నాత్మ< దా
ధన పశు పుత్రమిత్ర వనితాతతిపై< దగులంబు మాని న
న్ననఘుని విశ్వతోముఖు ననన్యగతిన్ భజియించె నేని వా
నిని ఘన మృత్యు రూప భవనీరధి నే<దరియింప< జేయుదున్. 876

సీ. రూఢి< బ్రధాన పూరుష నాయకుండను
భగవంతు<డనుజగత్ప్రభు< నైన
నాకంటె నన్యుల< గైకొని తీగిలిన
యాత్మలు భవభయం బందు నెపుడు<
గావున నాయాజ్ఞ గడవంగ నోడుట<
జేసి వాయువు వీచు శిఖి వెలుంగు
నిను<డు దపించు< దా నింద్రుండు వర్షించు
భయమంది మృత్యువు పరువు వెట్టు<

తే. గాన విజ్ఞాన వైరాగ్య కలితమైన
భక్తి యోగంబునం జేసి పరమ పదము
కొఱకు న య్యోగివరులు మచ్చరణ భజను
లగుచు< జరియింపుదురు నిర్భయాత్ము లగుచు. 877

క. గురుభక్తిం జిత్తము మ
త్పరమై విలసిల్లునంత పర్యంతము స
త్పురుషుల కిహలోకంబున<
జిరతర మోక్షోదయంబు సేకుఱు చుండున్. 878

క. అనియిట్లు నమ్మునీంద్రుడు
జననికి హరిభక్తి యోగసంగతి నెల్లన్
వినిపించుచు వెండియు ని
ట్లనిన< యెన్ సమ్మోద చిత్తు< డగుచు< గణంకన్. 879

పోతనామాత్య విరచితంబైన ఆంధ్రభాగవతమున తృతీయ స్కంధమున ఇరువది యైదవ అధ్యాయము.

858. వెండియున్= ఇంకను, అనంతరంబ=తరువాత, మాతృవత్సలు<డు= తల్లియందు ఎక్కువ ప్రేమకలవా<డు.

859. అనఘాత్మ=పాపములేని మనస్సు కలవా<డా! అసదింద్రియ ఘర్షణమునన్=దుర్మార్గములందు ప్రవర్తించెడు ఇంద్రియముల యొక్క పోరాటముచేత (2) అశాశ్వతమైన ఇంద్రియఘర్షణముచేత, వసము+అఱి= నాయొక్క ప్రయత్నము వ్యర్థమైన, నిర్విణ్ణనగుచున్=చేతగానిదాన నగుచు, వనరు=దుఃఖపడుదును. అసదృశ=సాటిలేని, ఎక్కువైన, మోహతమో వినిరసనంబు=మోహము అనెడు చీకటి నాశనము, ఏ వెరవున్=ఏ మార్గముతో, ఘటించున్=ఏర్పడును.

860. పటు=ఏ విధముచేత పోనట్టి, ఘన=దట్టమై వ్యాపించియున్న, నీరంధ్ర=నిరవకాశమైయున్న, తమఃపటల=చీ<కటి యొక్క సమూహముచేత పరీవృత=చుట్టుకొన<బడిన, జగత్పంచమునకున్=జగత్తుల సముదాయమునకు, ఎక్కటి లోచనమై=ఒకటియైన ముఖ్యమైన నేత్రమై, మహిత+ఉత్కటరుచిన్= గొప్పకాంతిచేత, భానుకైవడిన్=సూర్యునివలె.

861. భూరి=ఎక్కువైన, మదీయ=నాకు సంబంధించిన, మోహతమమున్= మోహమనెడు చీ<కటిని, పెడబాపన్=పో<గొట్టుటకు, నిరవద్య=దోష లేశములేని వా<డా! సంసారలతాలవిత్ర=సంసారమనెడు తీగకు కొడవలి వంటి వా<డా! నిత్యవిభూతి నాయకా=నిత్యవిభూతియైన వైకుంఠమునకు నాయకు<డైన వా<డా!

862. అనింద్య తపోనిధి=దోషములేని తపస్సునకు నిధివైన వా<డా! సన్నుతిసేసి=ప్రార్థించి, అనుపమ=సాటిలేని, సత్కృపా కలితు<డై=దయతో కూడినవా<డై, సజ్జన నిచయాపవర్గఫలసాధనమై=సజ్జనుల గుంపు యొక్క మోక్షమనెడు ఫలమును సాధించుటకు యోగ్యమైనట్టి.

863. మందస్మిత లలితాననకమలుండు=చిరునవ్వు చేత అందమైన ముఖపద్మము కలవా<డై, కడలుకొనన్=వ్యాపించగా.

864. ఘన భవబంధాపవర్గకారణము=గొప్పదైన సంసారబంధమునకును, మోక్షమునకును కారణమైనది, త్రిగుణాసక్తంబై=మూ<డు గుణములతో సంబంధము కలదై, సంసృతి బంధకారణంబు=సంసారమనెడు బంధమునకు కారణము.

865. నారాయణాసక్తము=నారాయణుని యందు లంకె గలది.

866. అహంకార మమకార రూప అభిమాన జాతంబులగు కామలోభాది కలుష వ్రాతంబుల చేతన్=అభిమానముచేత నేర్పడెడు మమకారము కారణముగా<గల కామాదులతోడి సంబంధములేనిదై, ఏకరూపంబునై=సిరమైనదై, నిర్భేద్యుండు=భేదింపరానివా<డు, స్వయంజ్యోతి= స్వయముగానే వేలి<గెడు

వా<డు, సంగంబు=సంబంధము అశిథిలము=ఎట్టును తొలగనిది. సంయమన హేతుభూతము=సంయమనమునకు కారణమైనది, పరిత్యక్తకర్మలు=విడువ<బడిన కర్మలు గలవారు, మత్పదాశ్రయులు=నాపాదములనే నమ్ము కొన్నవారు, మత్కథా ప్రసంగ సఫలిత శ్రవణులు=నాకథలు వినుటచేత సఫలమైన కర్ణములు గలవారు, సర్వసంగ వివర్జితులు=సమస్త సంగములచేత వదలి పెట్ట<బడినవారు, మదుణాకర్ణనము=నాగుణములను వినుట, ప్రకృతి గుణసేవనంబు=ప్రకృతి గుణములను అనుభవించుట.

867. భవద్గుణపరమై=నీ గుణములయందు ఆసక్తి కలదై.

868. భవదుదితంబు=నీచేత చెప్ప<బడినది. తద్గతత్త్వావ బోధము= దానియందున్న తత్త్వముల యొక్క ఉపదేశము.

తాత్పర్యము : విదురునితో మైత్రేయు<డనుచున్నా<డు. కర్దము<డు కపిలునితో ననుజ్ఞగొని వనములకు పోయెను. మాతృవత్సలు<డైన కపిలు<డు బిందుసరమునకే నివసించెను. దేవహూతికి బ్రహ్మదేవు<డన్న మాటలు తల<పునకు వచ్చెను. ఆమె తత్త్వమార్గమునకు ముఖ్యాచార్యు<డైన కపిల మహర్షిని జూచి ఇట్లన్నది. "ఇంద్రియములను సంపూర్ణముగా స్వాధీనముచేసికొనలేక యున్నాను. అవి నశ్వరములని తెలియును. తోలేసియు వాని నదుపులో పెట్టుకొనలేని శక్తిహీనను దుఃఖముతో బాధపడుచున్నాను. ఈ మోహమనెడు చీ<కటి అన్నివైపుల నన్నాక్రమించు చున్నది. స్వామీ! దీనిని పో<గొట్టుకొను టెట్లు? అజ్ఞానమనెడు చీ<కటితో నాక్రమింప<బడిన ఈ సమక్తలోకమునకును జ్ఞానమనెడు ప్రకాశము నొస<గు ముఖ్య సూర్యు<డవు నీవే. నీ శరీరము నుండి జ్ఞానప్రభలు దిక్కులకు వెదజల్లుచున్నవి. నా మోహమనెడు చీ<కటిని పో<గొట్టుటకు నీవుదప్ప సమర్థు లెవ్వారును లేరు. నీవు దోషలేశమును లేని వా<డవు. సర్వోత్తము<డవు. వికారము లెవ్వియు నిన్ను కలచలేవు. సంసారమనెడు లతను ఛేదించుటకు కొడవలి వంటిది నీమాట. సర్వశరణ్యు<డవు. నిత్యవిభూతి యైన వైకుంఠమునకు నాయకు<డవు. నిన్ను శరణు< జొచ్చుచున్నాను. దోషహీనమైన తపస్సులకు నిధివి. నీవు నన్ను అనుగ్రహింపవలె"నని దేవహూతి ప్రార్థించెను. ఆమె ప్రశ్న సజ్జనుల గుంపునకు మోక్షఫలమునొస<గెడు మహావృక్షమైయున్నది. కపిలుని మనస్సు కారుణ్యముచేత నిండిపోయినది. ఆతని ముఖము మంద హాసముచే నందగింప<బడెను. హృదయ మంతయు సంతోషమయ మైనది. పరమ శాంతు<డైన కపిలు<డు తల్లి కిట్లు బదులిచ్చెను.

దేవహూతి! సర్వమునకు మనస్సే కారణము. ముక్తిని సాధించుటకు హేతువు మనస్సు, సంసృతి యనెడు బంధమును తెచ్చి పెట్టునదిదియే.

త్రిగుణముల యందదాసక్త మైనచో సంసార కారణ మగును. "మునికులమనెడు సముద్రమందు<బుట్టిన చంద్రు<డైన కపిలమహర్షి తల్లితో నిట్లన్నాడు. "చిత్తమును అహంకార మమకారము లాక్రమించును. ఈ రెండును అభిమాన మనెడు వృక్షమునుండి పుట్టిన రెండు కొమ్మలు. వాని నాశ్రయించుకొని కలుష వ్రాతము లేర్పడును. మనస్సు అభిమానము నుండి విముక్తమైనపుడు పరిశుద్ధ మగును. అపుడు దానికి సుఖములేదు. దుఃఖములేదు. నిర్వాయు ప్రదేశమందున్న తరివలె స్థిరమై ఉండును.

భగవంతు<డు పరము. అత<డే పరమపురుషు<డు. దేనిచేతను ఛేదించుటకు సాధ్యముకానివా<డు. స్వయంజ్యోతి. వాని ప్రభావము చేతనే సమస్త పదార్థములును ప్రకాశించును. సూక్ష్మాతి సూక్ష్ముడు. ఇతర వస్తువులచేత కొలుచుటకు సాధ్యము కానివా<డు. అన<గా ఏ వస్తువుతోనైన పోల్చి ఇట్టుండునట్టుండు నని చెప్పుటకు సాధ్యము కానివా<డు. ఉదాసీను<డు. వాని ప్రకాశముచేతనే సమస్త ప్రపంచమును వెలు<గును. విలయకాలమందు వానియందే లీన మగును. వాని సంకల్పములేక ప్రకృతి ఏ పరిణామమును పొందనేరదు. అట్టి వానిని జ్ఞానవైరాగ్య భక్తులచే కూడిన మనస్సుతో యోగులు పొడగాంతురు. వారు పరతత్త్వ సిద్ధికొఱకై నిఖిలాత్మకు<డైన నారాయణుని యందు వానితో నిత్యసంయుక్తమైన భక్తిని నిష్ఠించి సేవింతురు. అట్టి భక్తి మార్గముతో నితరములు సమానములు కావు. విద్వాంసుల సంగ మపవర్గమునకు ముఖ్యకారణ మందురు. కాని ఆసంగము సత్పథమం దుండవలెను. మనస్సు ఇంద్రియాదులైన అసద్విషయములందు తగులుకొన్నచో తీవ్రమైన సంసారబంధమునకు లో<బడినదై నానావ్యథలు చెందును. సత్పురుష నిషితంబైన సంగము మనస్సుయొక్క సంయమనమునకు కారణము. అట్టివారికి మోక్షద్వారములు తెఱచికొనును. పరమభాగవతులే సత్పురుషులు. వారికి సహనమే స్వభావము. సమస్త ప్రాణి కోటికిని వారు మిత్రులు. శాంతియే వారి స్వరూపము. వారిమనస్సు నిరంతరము దయాభిముఖము. నాభక్తి కడ్డువచ్చెడు లౌకికవైదికములైన సమస్త కార్యములను వారు త్యజింతురు. సర్వులచేతను వదల<బడిన దీనులకు వారు పరమ బంధువులు. వారికి నాపాదముల యందు<దప్ప మఱి దేనియందును చూపులేదు. మధుణముల యందలి రహస్యము లెఱి<గి నిరంతరము నన్నుపాసింతురు. నా కథలనే ఎప్పుడును విందురు. వారిని తాపత్రయములు వెన్నంటవు. సర్వసంగముల చేతను సంబంధ ముండదు. అట్టి పరమ భాగవతులతోడి ముక్తిని నిరంతరము గోరుదురు. సజ్జనమైత్రి సమస్త దోషములను నివారించును. వారి యందు సకల ప్రాణుల మనస్సులు కరములకును ఆహ్లాదమును కలిగించును. నాకథలు నిరంతరము వర్తించుచుండును. మత్కథానువర్తియే వారి జీవనము. నా

కథ లెప్పుడును వినుచున్నచో శీఘ్రముగా క్రమముగా కైవల్యమునకు దారితీయును శ్రద్ధాభక్తు లేర్పడును. ఏ పురుషు<డైనను నాజగత్కల్పనాది విహారములను నిరంతరము మనన మొనర్చుచున్న వా<డైనచో నాయందు వానికి భక్తి యుదయించును. దృష్టములైనవి ఐహిక సుఖములు. శ్రుతములైనవి స్వర్గాదిలోక సుఖములు. ఈ రెంటినుండి వా<డు విముక్తు<డగును. సంయమమున్నై వా<డు ఋజువులైన యోగమార్గముల ననుసరించును. వా<డు ప్రకృతిచే నేర్పడెడు గుణములకు లో<బడ<డు. వైరాగ్యముతో వాని జ్ఞానము సర్వదా జాగృతమై యుండును. మదర్పితమైన భక్తి వాని స్వభావమగును. వా<డు ప్రత్యగాత్మకు<డనైన నన్ను వానిమనస్సు నందు నిల్పికొనును. "అప్పుడు మరల దేవహూతి యన్నది కపిలా! నీగుణములను నిరంతరము మనన మొనర్చుకొనెడు భక్తి భవపాశముల తొల<గించునంటివి. ముక్తి సంపదను చేకూర్చునంటివి. ఆ భక్తిస్వరూపమును నాకు వివరముగా< దెలుపుము. అంతేగాక భక్తి కంగములైన యోగములు మొదలైన వానిని వివరింపుము. తదతమైన తత్త్వమును గూడ నాకు స్పష్టముగా అర్థమగునట్లు చెప్పుము. నేను మందబుద్ధిని. నాకు తెలియునట్లానతీయవలెను సుమా!" కపిలు< డారంభించినా<డు.

869... జనయిత్రి=ఓతల్లి! సకలపదార్థ=సమస్త పదార్థముల యొక్క, పరిజ్ఞాన= తెలిసికొనుటచేత, తత్త్వపారీణము=వానితత్త్వము చక్కగా<దెలిసినవి. ఆమ్నాయ విహిత కర్మాచారములు=వేదములచేత చెప్ప<బడిన కర్మలు, నైసర్గికము=స్వభావసిద్ధమైనది. గరిష్ఠము=గొప్పది, దీప్తజఠరాగ్ని=ప్రకాశించు చుండెడి ఉదరమందున్న అగ్ని.

870. ఇతరేతర అనులాపములన్=పరస్పరము సంభాషించుకొనుటచేత, మదర్పితసర్వకర్ములై=నాయందు సమర్పింప<బడిన సకలకర్మములు గలవారై

871. పురాతనములు=ప్రాచీనములు, మద్దివ్యావతారవైభవములు= నా అవతారముల ఘనతలు, విలసత్=ప్రకాశించుచున్న, అవయవ=అవయవముల యొక్క, ఉదారసుందర=గొప్పదైన సౌందర్యము, నవవిలాస=నూత్నములైన విలాసములు, అపహృత మనః ప్రాణులు=అపహరింప<బడిన మనస్సు ఇంద్రియములు గలవారు.

872. మోక్షనిరపేక్షస్వాంతులు=మోక్షమునం దాసక్తిలేని మనస్సులు గలవారు, అణిమాద్యష్టవిభూతి సేవితము=ఎనిమిదైన అణిమాది విభూతులచేత కూడినది. అప్రమేయము=కొలతవెట్టరానిది.

874. మదీయకాలచక్రగ్రసనంబు=నాసుదర్శనాత్మకమైన కాలచక్రముచేత మ్రింగ<బడుటను, అనుపమసుఖవృత్తిన్=సాటిలేని సుఖవృత్తిచేత.

875. వారింపుదున్=పో<గొట్టెదను.

876. తగులంబున్=సక్తిని, ఘన=ఎక్కువైన, మృత్యురూప భావనీరధిన్= మృత్యురూపమైన సంసారమనెడు సముద్రమునుండి.

877. ప్రధానపూరుషనాయకుండను=ప్రధానమనెడు ప్రకృతికి అధినాథు<డైన పురుషు<డను, కడవంగన్ఓడు= దాటుటకు జంకు, విజ్ఞానవైరాగ్య కలితము= విజ్ఞానముచేతను వైరాగ్యముచేతను కూడుకొన్నది.

878. ఇహలోకంబునన్=ఈ లోకమందు, చిరతర=శాశ్వతమైన, మోక్ష+ఉదయంబు= మోక్షప్రాప్తికి ఉపాయము.

879. సమ్మోదచిత్తు<డు=సంతోషముతో కూడినవా<డు.

తాత్పర్యము : సర్వగుణపరిపూర్ణు<డైన శ్రీహరి యందు ఏకాగ్రము, స్వాభావికము, గంగాప్రవాహమువలె సంతతమునైన మనో వ్యాపారమునకే భక్తియని పేరు. ఇంద్రియములు రెండురీతులు కర్మేంద్రియములు జ్ఞానేంద్రియములు అని. ఈ ఇంద్రియములకు ఇంద్రియాభిమాని దేవతలున్నారు. జ్ఞానేంద్రియముల కభిష్ఠాతలు జీవునికి శబ్దాది విషయములను దెలుపుదురు. కర్మేంద్రియాభిముఖములైన దేవతలు ఆమ్నాయవిహితములైన కర్మ లొనరింప<జేతురు. వీరు శ్రీహరి యందు స్వాభావికమైన భక్తి ననుష్ఠించుచు తమతమ కార్యములందు నియుక్తులై యుందురు. ఏకాంత భక్తులైన వీరు ఏ ఫలమునుగూడ నపేక్షించుటలేదు. వీరి కార్యనిర్వాహము భవత్సేవా మాత్రము. ఇది సామాన్యనిముక్తికంటెను గొప్పది. ఈ స్థితి మనము తినెడు నాహారాదులను జఠరాగ్ని జీర్ణమొనరించునట్లు లింగశరీరమును నాశ మొందించును. తత్త్వాభిమానులైన దేవతల భక్తికంటెను దేవతాసామాన్యుల భక్తి తక్కువది. దీనికంటెను వేదోక్తకర్మానుష్ఠానమును చేసికొని యుండెడు ముక్తియోగ్యులు నిష్ఠించు భక్తి తక్కువ. ఈ మువ్విధములైన భక్తియు ఫలాపేక్ష లేనిదే. ఓ దేవహూతీ! ఇంకను భగవద్భక్తుల యొక్క వైభవములను చెప్పుచున్నాను. ఏకాగ్రతతో వినుము. కొందరు భక్తులురన్నారు. వారు నిరంతరమును నా పాదారవిందములనే తమ మనస్సులందునిల్పికొందురు. నాదేహము యొక్క సౌందర్యము నా పౌరుషము వీనిని గూర్చి పరస్పరము సంభాషించు కొందురు. వారు సర్వకర్మములను నాయందే అర్పింతురు. వారు మోక్షమును కోరరు. మరియొక్క రున్నారు. వారు పరమ భాగవతులు. వారు మద్దివ్యావతార వైభములనే నిరంతరము అనుభవింతురు. అన<గా నా అర్చావతారములం దాశగలవారే నాదివ్యక్షేత్రములను నిరంతరము సేవింతురు. నా అర్చావతారములు మహాసుందరములైన కన్నులు గలవి. చారుప్రసన్న

వక్త్రములు గలవి. వారు ఆ అర్చావతారములతో తమ యోగ మహిమతో సంభాషింతురు. ఆ అర్చావతారములు వరదానసమర్థములు కూడ. యోగ వైభవముతో అర్చావతారములతో సంభాషించిన యోగులు ఆ సంభాషణా వైఖరిని నిరంతరము పొగడి కొనుచుందురు. వారి పాలి కర్చావతారములు దివ్యములు. ఆయవయవములు నిత్యసుందరములు. నవనవవిలాసములు గలవి. ఆయవతారముల మందహాసములు మనోహరమధుర వచనములు-- వీనిచే ఆ పరమభాగవతుల మనస్సులు అపహృతములు. వారి సర్వేంద్రియములు అకృష్టములు. వారు మోక్షము నపేక్షింపరు. వారికి కూడ నిత్యవిభూతి నేనొసగెదను. అచ్చట అణిమాదులు నాభక్తుల ఆజ్ఞలు చెల్లించుటకు సిద్ధములై యుండును. వారి మనస్సులందు నిత్యానందము చెలగును. ఆ యానందమిట్టిదని చెప్పుటకు సాధ్యముకాదు. దానికి మితిలేదు. సర్వవిధవైభవములతో కూడిన సుదర్శన రూపమైన ఈ కాలము వారిపై తన యధికారమును నెఱపనేరదు నిరంతరానందమే వారి స్వభావమై యుండును. నేను వారికి సమభావముతో సుతత్త్వము లుపదేశింతును. వారిపై విశ్వాసముంచి సఖుడనై యుందును. హితమును బోధించుచు మిత్రుడనై యుందును. వారికి చక్కని మార్గమును చూపించెడు దేశికుడను నేనే. ఇష్టదైవమును నేనే. కాలముతో నేర్పడెడు సమస్త భయములను నా యనుగ్రహముచే వారి నంటవు. జీవులు అహంమమతాయుక్తులు. నేను నాది యనుభావములతో సతమత మగుదురు. "నాది" యను భావమునకు మితియే లేదు. వారిహపరములందు మాటిమాటికిని చుట్టుచుందురు. జీవుడు నేను నాది యను విశ్వాసమును వదలి నన్నే అనన్యగతితో భజించినచో వానిని మృత్యు రూపమైన సంసార సముద్రమునుండి తరింపజేసెదను. నన్ను దప్ప ఇతరులను సేవించెడు వారికి సంసారభయము దప్పదు. సమస్త దేవతలు నాకు లోబడినవారే. గాలి వీచును. సూర్యుడు తపింపజేయును. అగ్ని వెలుగును. ఇంద్రుడు వర్షించును. మృత్యువు తనకార్యము నిర్వర్తించు కొనుచుసాగిపోవును. అందుకే విద్వాంసులైనవారు వైరాగ్యము, విజ్ఞానము - వీనితో కూడిన భక్తి యోగముతో నన్నుపాసింతురు. అట్టివారి కిచ్చ లేకున్నను పరమపదము ప్రాప్తించి తీరును. వా రెవ్వరికినీ భయపడవలసిన పనిలేదు. ఇహలోకమందుకూడ నాభక్తిపరులకు కష్టముండదు ఈ సుఖ మనుభవించుచు వారు మోక్షమునకై యత్నింతురు". ఈ రీతిగా కపిల మహర్షి తల్లియైన దేవహూతికి భక్తి యోగరహస్యమును వివరించి చెప్పెను. మఱియు నాతడు తల్లితో నిట్లనెను.

పోతనామాత్య విరచితమైన ఆంధ్రభాగవతమున తృతీయస్కంధమున ఇరువదియైదవ అధ్యాయము సమాప్తము.

షడ్వింశోఽధ్యాయః

శో. అథ తే సంప్రవక్ష్యామి తత్త్వానాం లక్షణం పృథక్,
య ద్విదిత్వా విముచ్యేత పురుషః ప్రాకృతైర్గుణైః. 1

జ్ఞానం నిశ్శ్రేయ సార్థాయ పురుషస్యాత్మదర్శనమ్,
యదాహు ర్వర్ణయే తత్తే హృదయగ్రంథి భేదనమ్. 2

అనాది రాత్మా పురుషో నిర్గుణః ప్రకృతేః పరః,
ప్రత్యక్ధామా స్వయం జ్యోతి ర్విశ్వం యేన సమన్వితమ్. 3

న జాయతే న మ్రియతే సహ దేహాద్యుపాధిభిః,
నిమిత్తై రాత్మత ద్ధర్మా యథా స్వప్నే తదీక్షితా. 4

స ఏష ప్రకృతిం సూక్ష్మాం దైవీం గుణమయీం విభుః,
యదృచ్ఛయై వోపగతా మభ్యపద్యత లీలయా. 5

గుణైర్విచిత్రాః సృజతీం సరూపాః ప్రకృతిం ప్రజాః,
విలోక్య మముహే సద్యః స ఇవ జ్ఞానగూహయా. 6

ఏవం పరాభి ధ్యానేన కర్తృత్వం ప్రకృతేః పుమాన్,
కర్మసు క్రియ మాణేషు గుణైరాత్మని మన్యతే. 7

తదస్య సంసృతిర్బంధః పారతంత్ర్యం చ తత్కృతమ్,
భవ త్యకర్తు రీశస్య సాక్షిణో నిర్వృతాత్మనః. 8

కార్యకారణ కర్తృత్వే కారణం ప్రకృతిం విదుః,
భోక్తృత్వే సుఖదుఃఖానాం పురుషం ప్రకృతేః పరమ్ 9

దేవహూతి రువాచ

ప్రకృతేః పురుషస్యాపి లక్షణం పురుషోత్తమ,
బ్రూహి కారణయో రస్య సదసచ్చ యదాత్మకమ్. 10

శ్రీభగవానువాచ

యత్తత్త్రిగుణ మవ్యక్తం నిత్యం సద సదాత్మకమ్,
ప్రధానం ప్రకృతిం ప్రాహు రవిశేషం విశేషవత్. 11

పంచభిః పంచభిర్మాత శ్చతుర్భి ర్దశభి స్తథా,
ఏత చ్చతుర్వింశతికం గణం ప్రాధానికం విదుః. 12

మహాభూతాని పంచైవ భూరాపోఽగ్ని ర్మరున్నభః,
తన్మాత్రాణి చ తావంతి గంధాదీని చ తాని మే. 13

ఇంద్రియాణి దశ శ్రోత్ర త్వగ్దృ గ్రసన నాసికాః,
వాక్కరౌ చరణౌ మేఢ్రం పాయు ర్దశమ ఉచ్యతే. 14

మనో బుద్ధి రహంకార శ్చిత్త మిత్యంత రాత్మకమ్,
చతుర్ధా లక్ష్యతే భేదో వృత్త్యా లక్షణ రూపయా. 15

ఏతావానేవ సంఖ్యాతో బ్రహ్మణ స్సగుణస్య హి,
సన్నివేశో మయా ప్రోక్తో యః కాలః పంచవింశకః. 16

ప్రభావం పౌరుషం ప్రాహుః కాల మేకే యతో భయమ్,
అహంకార విమూఢస్య కర్తుః ప్రకృతి మా యుషః. 17

ప్రకృతే ర్గుణ సామ్యస్య నిర్విశేషస్య మానవి,
చేష్టా యత స్సభగవాన్ కాల ఇత్యుపలక్షితః. 18

అంతః పురుషరూపేణ కాలరూపేణ యో బహిః,
సమన్వేత్యేష తత్త్వానాం భగవా నాత్మమాయయా. 19

దైవా త్క్షుభితధర్మిణ్యా మస్యాం యోనౌ పరః పుమాన్,
ఆధత్త వీర్యం సాసూత మహత్తత్త్వం హిరణ్మయమ్. 20

విశ్వ మాత్మగతం వ్యంజన్ కూటస్థో జగ దంకురః,
స్వతేజసాపి బత్తీవ్ర మాత్మ ప్రస్యాపనం తమః. 21

యత్తత్సత్త్వగుణం స్వచ్ఛం శాంతం భగవతః పదమ్,
యదాహు ర్వాసుదేవాఖ్యం చిత్తం తన్మహదాత్మకమ్. 22

స్వచ్ఛత్వ మవికారిత్వం శాంతిత్వ మితి చేతసః,
వృత్తిభి ర్లక్షణం ప్రోక్తం యథాపాం ప్రకృతిః పరా. 23

మహత్తత్వాద్వికుర్వాణా ద్భగవద్వీర్యచోదితాత్,
క్రియాశక్తి రహంకార స్త్రివిధ స్సమపద్యత. 24

వైకారిక స్తైజసశ్చ తామసశ్చ యతో భవః,
మనసశ్చేంద్రియాణాం చ భూతానాం మహతా మపి. 25

సహస్ర శిరసం సాక్షా ద్యమనంతం ప్రచక్షతే,
సంకర్షణాఖ్యం పురుషం భూతేంద్రియమనోమయమ్. 26

కర్తృత్వం కరణత్వం చ కార్యత్వం చేతి లక్షణమ్,
శాంత ఘోర విమూఢత్వ మితి వా స్యా దహంకృతే. 27

వైకారికా ద్వికుర్వాణా న్మనస్తత్త్వ మజాయత,
యత్సంకల్ప వికల్పాభ్యాం వర్తతే కామసంభవః. 28

యం విదుర్మునిరుద్ధాఖ్యం హృషీకాణా మధీశ్వరమ్,
శారదేందీవర శ్యామం సంసాధ్యం యోగిభి శ్శనైః. 29

తైజసాత్తు వికుర్వాణా ద్బుద్ధితత్త్వ మభూత్సతి,
ద్రవ్యస్ఫురణ విజ్ఞాన మింద్రియాణా మనుగ్రహః 30

సంశయోఽథ విపర్యాసో నిశ్చయ స్స్మృతిరేవ చ,
స్వాప ఇత్యుచ్యతే బుద్ధేర్లక్షణం వృత్తితః పృథక్. 31

తైజసానీంద్రియాణ్యేవ క్రియాజ్ఞాన విభాగశః,
ప్రాణస్య హి క్రియాశక్తిర్బుద్ధే ర్విజ్ఞాన శక్తితా. 32

తామసాత్తు వికుర్వాణా ద్భగవద్వీర్యచోదితాత్,
శబ్దమాత్ర మభూత్తస్మాన్నభ శ్శ్రోత్రంతు శబ్దగమ్. 33

అర్థాశ్రయత్వం శబ్దస్య ద్రష్టృ లింగత్వ మేవ చ,
తన్మాత్రత్వం చ నభసో లక్షణం కవయో విదుః. 34

భూతానాం ఛిద్రదాతృత్వం బహిరంతర మేవ చ,
ప్రాణేంద్రియాత్మధిష్ణ్యత్వం నభసో వృత్తిలక్షణమ్. 35

నభస శ్శబ్దతన్మాత్రా త్కాలగత్యా వికుర్వతః,
స్పర్శోఽభవత్తతో వాయు స్త్వక్స్పర్శస్య చ సంగ్రహః. 36

మృదుత్వం కఠినత్వం చ శైత్య ముష్ణత్వ మేవ చ,
ఏత స్స్పర్శస్య స్పర్శత్వం తన్మాత్రత్వం నభస్వతః. 37

చాలనం వ్యూహనం ప్రాప్తి ర్గతిత్వం ద్రవ్యశబ్దయోః.
సర్వేంద్రియాణా మాత్మత్వం వాయోః కర్మాభిలక్షణమ్. 38

వాయో శ్చ స్పర్శతన్మాత్రా ద్రూపం దైవేరితా దభూత్,
సముతితం తతస్తేజశ్చ క్రూరూపో పలంభనమ్. 39

ద్రవ్యాకృతిత్వం గుణతా వ్యక్తి సంస్థాన మేవ చ,
తేజస్త్వం తేజస స్సాధ్వి! రూపమాత్రస్య వృత్తయః. 40

ద్యోతనం పచనం పాన మదనం హిమమర్దనమ్,
తేజసో వృత్తయ స్త్వేతా శ్శోషణం క్షుత్తృడేవ చ. 41

రూపమా త్రాద్వికుర్వాణా త్తైరోతైజసాద్దైవచోదితాత్,
రసమాత్ర మభూత్తస్మా దంభోజిహ్వా రసగ్రహః. 42

కషాయో మధురస్తిక్తః, కట్వమ్ల ఇతి నైకధా,
భౌతికానాం వికారేణ రస ఏకో విభిద్యతే. 43

క్లేదనం పిండనం తృప్తిః ప్రాణానాప్యాయ నౌదనమ్,
తాపానోదో భూయస్త్వ మంభసో వృత్తయ స్త్విమాః. 44

రసమాత్రా ద్వికుర్వాణా దంభసో దైవచోదితాత్,
గంధమాత్ర మభూత్తస్మా త్పృథ్వీ ఘ్రాణస్తు గంధగః. 45

కరంభపూతి సౌరభ్య శాంతో గ్రామ్యాదిభిః పృథక్,
ద్రవ్యావయవ వైషమ్యా ద్గంధ ఏకో విభిద్యతే. 46

భవనం బ్రహ్మణః స్థానం ధారణం సద్విశేషణమ్,
సర్వసత్త్వ గుణోద్భేదః పృథివీ వృత్తి లక్షణమ్. 47

నభోగుణవిశేషోర్థో యస్య తచ్ఛ్రో త్రముచ్యతే,
వాయోర్గుణ విశేషోర్థో యస్య తత్స్పర్శనం విదుః. 48

తేజో గుణవిశేషోర్థో యస్య తచ్చక్షు రుచ్యతే,
అంభో గుణవిశేషోర్థో యస్య తద్రసనం విదుః,
భూమే ర్గుణ విశేషోర్థో యస్య తద్ఘ్రా ణ ముచ్యతే. 49

పరస్య దృశ్యతే ధర్మో హ్యపరస్మిన్ సమన్వయాత్
అతో విశేష భావానాం భూమావేవో పలక్ష్యతే. 50

ఏతా న్యసంహత్య యదా మహదాదీని సప్తవై,
న శేకుః పురుషం ప్రష్టుం భోగాయతన మంజసా,
కాలకర్మ గుణోపేతో జగదాది రుపావిశత్. 51

తతస్తేనాను విద్ధేభ్యో యుక్తే భ్యోండ మచేతనమ్,
ఉత్థితం పురుషో యస్మా దుదతిష్ఠ దసౌ విరాట్. 52

ఏతదండం విశేషాఖ్యం క్రమవృద్ధై ర్దశోత్తరైః,
తోయాదిభిః పరివృతం ప్రధానే నావృతై ర్బహిః. 53

యత్ర లోకవితానోయం రూపం భగవతో హరేః. 54

హిరణ్మయా దండకోశా దుత్థాయ సలిలేశయాత్,
తయా విశ్వ మహాదేవో బహుధానిర్భిభేద ఖమ్. 55

నిరభిద్యతాస్య ప్రథమం ముఖం వాణీ తతోఽ భవత్,
వాణ్యా వహ్ని రథోనాసే ప్రాణతో ఘ్రాణ ఏతయో. 56

ఘ్రాణాద్వాయు రభిద్యేతా మక్షిణీ చక్షు రేతయోః,
తస్మా త్సూర్యో వ్యభిద్యేతాం కర్ణౌ శ్రోతం తతో దిశః. 57

నిర్బిభేద విరాజస్య గ్రోమశ్మ శ్ర్వాదయ స్తతః,
తత ఓషధయ శ్చాసన్ నిశ్నం నిబిభిదే తతః, 58

రేత స్తస్మా దాప ఆసన్ నిరభిద్యత వై గుదమ్,
గుదా దపానోపానాచ్చ మృత్యు ర్లోకభయంకరః. 59

హస్తౌ చ నిరభిద్యేతాం బలం తాభ్యాం తత స్స్వరాట్
పాదౌచ నిరభిద్యేతాం గతిస్తాభ్యాం తతో హరిః. 60

నాడ్యోస్య నిరభిద్యంత తాభ్యో లోహిత మాభృతమ్,
నద్యస్తత స్సముభవ న్నుదరం నిరభిద్యత. 61

క్షుత్పిపాసే తత స్స్యాతాం సముద్రస్తోయో రభూత్,
ఆథాస్య హృదయం భిన్నం హృదయా న్మన ఉత్థితమ్. 62

మనసశ్చంద్రమా జాతో బుద్ధి ర్బుద్ధే ర్విరాంపతిః,
అహంకార స్తతో రుద్ర శ్చిత్తం చైత్యస్తతోభవత్ 63

ఏతే హ్యభ్యుతితా దేవా నైవాస్యోత్థాపనేశకన్,
పున రావివిశుః ఖాని తముత్థాపయితుం క్రమాత్. 64

వహ్ని ర్వాచా ముఖం భేజే నో దతిష్ఠ త్తదా విరాట్,
ఘ్రాణేన నాసికే వాయు ర్నోదతిష్ఠ త్తతో విరాట్. 65

అక్షిణీ చక్షుషాదిత్యో నోదతిష్ఠత్తదా విరాట్,
శ్రోత్రే చ కర్ణౌ చ దిశో నోదతిష్ఠ త్తదా విరాట్. 66

త్వంచ రోమభి రోషధ్యో నోదతిష్ఠ త్తతో విరాట్,
రేతసా శిశ్న మాపస్తు నోదతిష్ఠ త్తతో విరాట్. 67

గుదం మృత్యు రపానేన నోదతిష్ఠ త్తతో విరాట్,
మిష్ణు ర్గత్యైవ చరణౌ నోదతిష్ఠ త్తతో విరాట్. 68

హస్తౌ వింద్రో బలేనైవ నోదతిష్ఠ స్తతో విరాట్,
నాడీ ర్నద్యో లోహితేన నోదతిష్ఠ త్తతో విరాట్. 69

క్షుత్పిడ్భ్యా ముదరం సింధు ర్నోదతిష్ఠ త్తతో విరాట్,
హృదయం మనసా చంద్రో నోదతిష్ఠ త్తతో విరాట్. 70

బుద్ధ్యా బ్రహ్మాది హృదయం నోదతిష్ఠ త్తతో విరాట్,
హృదయం మనసా చంద్రో నోదతిష్ఠ త్తతో విరాట్. 71

చిత్తేన హృదయం చైత్యః క్షేత్రజ్ఞ: ప్రావిశ ద్యదా
విరాట్తదైవ పురుష స్సలిలా దుదతిష్ఠత. 72

యథా ప్రసుప్తం పురుషం ప్రాణేంద్రియమనోధియః,
ప్రభవంతి వినా యేన నోత్థాపయితు మోజసా. 73
తస్మిం స్తం ప్రత్యగాత్మానం ధియా యోగ ప్రవృత్తయా,
భక్త్యా విరక్త్యా జ్ఞానేన వివిచ్యాత్మని చింతయేత్. 74

ఇతి శ్రీమద్భాగవతే, తృతీయస్కంధే, షడ్వింశోధ్యాయః.

1. అథ=అనంతరము, తే=నీకొఱకై, తత్త్వానాం=తత్త్వముల యొక్క, పృథక్‌లక్షణం=వేర్వేరు లక్షణములను, సంప్రవక్ష్యామి= చెప్పెదను, యద్విదిత్వా= దేనిని తెలిసికొని, పురుషః=పురుషు<డు -(జీవు<డు) ప్రాకృతైః గుణైఃగ=ప్రకృతి జన్యములైన గుణములనుండి విముచ్యతే=విడివడునో.

తాత్పర్యము: ఈ అధ్యాయమందు ప్రకృతి పురుషుల యొక్క లక్షణములను వేరు వేరుగా వివరించుటకు పూనుకొనుచున్నా<డు. సాంఖ్యశాస్త్రమును భగవంతు<డైన కపిలు<డు దేవహూతి కుపదేశించు చున్నా<డు. దానిలో ప్రకృతి పురుషు<డు మొదలుకొని యున్న సకల తత్త్వములు వాని యొక్క ఉత్పత్తి, లక్షణములు వీనిని వర్ణించుట చేత ప్రత్యేకముగా వానియొక్క స్థితి మన కర్థమగును. ఈ సాంఖ్యశాస్త్రమును బ్రహ్మ తన కుమారు<డైన మనువున కుపదేశించినా<డు. మరల మైత్రేయు<డు విదురునకు చెప్పెను. ఇప్పుడు స్వయముగా కపిల మహర్షియే తన తల్లి కుపదేశించుచున్నా<డు. ఆత్మను ప్రకృతి నుండి భిన్నమని తెలిసికొనుటకు, ఆస్థితి ననుభవించుటకు సాంఖ్యము, భక్తి, యోగము మూ<డును మార్గములు. పూర్వాధ్యాయమందు భక్తి వివరింప<బడినది. ఇపుడు సాంఖ్యమును చెప్పుచున్నా<డు. అమ్మా! నీ కిప్పుడు తత్త్వముల భిన్నభిన్నములైన లక్షణములను గూర్చి చెప్పుచున్నాను. ఆకాంక్షించుచున్న జీవు<డు తత్త్వముల స్వరూపమును తెలిసికొనుట చేత ప్రకృతి పరిణామములైన సత్త్వాది గుణముల నుండి దేహము ఇంద్రియములు అంతఃకరణములు మొదలైనవి ఏర్పడును. ఈ విషయమును తెలిసికొన్నప్పుడు దేహాదులు ప్రకృతి కార్యములని, పురుషు<డు వానికంటె భిన్ను<డని నిశ్చితమగును. అపుడు దేహాభిమానము నశించును. దాని నుండి జీతత్త్వము శుద్ధముగా నేర్పడును. తన్నిమిత్తముగా జన్మ జరామరణాది భావముల నుండి జీవు<డు ముక్తు<డగును. కనుక తత్త్వనిశ్చయ జ్ఞానము ముక్తికి సాధనమైన వానిలో ప్రధానమైనది.

2. హృదయగ్రంథి భేదనం=హృదయ గ్రంథిని నశింప<జేయునది, ఆత్మదర్శనం=ఆత్మను దర్శింప< జేయునదియు నైన, జ్ఞానం=జ్ఞానము, పురుషస్య=పురుషుని యొక్క, నిశ్శ్రేయ సార్థాయ=నిశ్శ్రేయస రూపమైన అర్థమును సాధింప<జేయునని, ఆహుః=జ్ఞానులు పలికెదరు, యత్=ఆ విషయము ఏది కలదో, తత్=దానిని, తే వర్ణయేత్=నీ కెఱి<గింతును.

తాత్పర్యము: "ముక్తి ఏర్పడవలెనన్నచో ఆత్మజ్ఞానము కావలయును. తత్త్వలక్షణము తెలిసి నంత మాత్రముతో ఫలము లేదు." ఇదే వృత్యభిప్రాయము. "తమేవ విదిత్వాతి మృత్యుమేతి" ఆత్మ స్వరూప మెఱి<గిననే మరణమునుండి తరించును. ఇట్లున్నపుడు తత్తములను గూర్చి తెలిసికొనుటతో కలుగు ఫలమేమి? ఈ శంకను పరిహరించు చున్నా<డు. ఏ విధమైన జ్ఞానమునుండి ఆత్మస్వరూపావబోధము అనుభవింప<బడుచున్నదో ఏ జ్ఞానము కల్గినచో దేహాదులే నే నను జ్ఞానము - అన<గా అహంకారము నశించునో? ఏవిధమైన జ్ఞానము పరమ పురుషార్థరూపమైన మోక్షమునకు సాక్షాత్కారణమని వేదాంత శాస్త్రము ఉపనిషత్తులు సిద్ధాంతీకరించినవో, ఆ ఆత్మజ్ఞాన మార్గమును నీకు చెప్పెదనని కపిలు<డనుచున్నా<డు తత్త్వముల లక్షణము తెలిసి కొన్నచో వాని కంటె భిన్నముగా నున్న ఆత్మను సాక్షాత్కారించుకొనవచ్చును. అందుచే సాంఖ్యశాస్త్రముతో ఆత్మ విజ్ఞానము, దాని నుండి మోక్షము ఏర్పడునని సారము.

3. ఆత్మా=వ్యాపక<డైన, పురుషః=ప్రకృతి నియంతయైన పురుష<డు, నిర్గుణః=గుణాతీత<డు. ప్రకృతేః పరః=ప్రకృతి కంటె పర<డు, అనాదిః=ఆదిలేని వా<డు. ప్రత్యగ్ధామా=అంతరమైన ప్రకాశముతో కూడినవా<డు, స్వయంజ్యోతిః=స్వయముగనే ప్రకాశించువా<డు, విశ్వం=లోకము, యేన సమన్వితం=ఎవనితో చేరినదై (ప్రకాశతే=ప్రకాశించుచున్నదో.)

తాత్పర్యము:ముందు పురుషుని నిరూపించుచున్నా<డు. సర్వత్ర వ్యాపించి యున్న చైతన్య మేది కలదో అదియే పురుష<డు. ప్రకృతి యొక్క స్వరూపము జడము. ఆత్మ దానికి విపరీతముగా అంతః ప్రకాశమైన స్వరూపముతో కూడినది. అపుడే పుట్టి అప్పుడే నశించుచున్న విజ్ఞానమే ఆత్మస్వరూపమని వాదించెడు నొక పక్షమున్నది. వారే క్షణిక విజ్ఞానవాదులు. వారి మతమును ఖండించుటకే ఆత్మ ఆది రహితమని తోపింప<జేయుటకు అనాదిః అన్న విశేషణము. క్షణిక విజ్ఞాన వాదుల అభిప్రాయములో "అప్పుడపుడేర్పడుచున్న విజ్ఞానము" అనిగదా లక్షణము. అప్పుడు ఆత్మకాదియున్నదని అంగీకరింప

వలెను. అనాదియనెడు విశేషణము దానిని స్పష్టముగా ఖండించును. జన్మ మరణములతో కూడిన స్వరూపమైన సంసారము ఆత్మకాదు. దీనిని చెప్పుటకే ప్రకృతేః పరః అను విశేషణము. ప్రకృతితోడి బంధము లేక యున్నవా<డని యర్థము." అ సంగో హ్యయం పురుషః" అనెడు శ్రుతి ప్రకృతి కార్యములతో ఆత్మకు సంబంధము లేదని తెలుపును. మీమాంసకులు ఆత్మను జ్ఞాన విషయముగా గ్రహింతురు. అది సరిగాదని చెప్పుటకే 'స్వయంజ్యోతిః' అనెడు విశేషణము. ఇతరములైన జడపదార్థములను ప్రకాశింప<జేయుటయు, స్వయముగా ప్రకాశించుటయు ఆత్మ యొక్క ప్రకాశము. ఈ విశేషణముతోనే "జ్ఞానమున కాధారమై ప్రకాశించుచున్న దాత్మ స్వరూపము" అనెడు ప్రాభాకరమతముకూడ ఖండింప<బడినది. ఆత్మ జ్ఞానమున కాధారామని చెప్పినచో జ్ఞానము ఆత్మ స్వరూపము కాదని చెప్పినట్లైనది. ఆయభిప్రాయము సరిగాదు. జ్ఞానమే ఆత్మస్వరూపమని కపిలుని అభిప్రాయము. ఆత్మసాన్నిధ్యము తోనే జడరూపములైన ఆకాశాదిభూతములు తజ్జన్యములైన లోకములు ప్రకాశించును. ఈ కారణముతో పురుష<డు ప్రకృతికంటె విలక్షణ<డని సిద్ధమైనది.

4. సః ఏషః విభుః=ఈ వ్యాపక<డైన ఆత్మ, సూక్ష్మాం=అవ్యక్తము, ుణమాయాం=సత్త్వాది గుణ సమష్టిరూపమైన, దైవీం=దేవతాసంబంధమైన శక్తి, యదృచ్ఛయైన=యదృచ్ఛతోనే, ఉపగతాం=సమీపమును పొందినదైన, ప్రకృతిం=ప్రకృతిని, లీలయా=లీలకొఱకై, అభ్యపద్యతే=స్వీకరించును.

తాత్పర్యము: సాంఖ్యమతమందు జీవు<డు, ఈశ్వరు<డు, జగత్తు ఈ మూటి యొక్క స్వరూపమును ముఖ్యముగా నిర్ణయింతురు. ఇదే ఆ శాస్త్రములో ప్రధానమైన విషయము. ముందటి శ్లోకములో జగమునకు నిమిత్త కారణ భూత<డైన ఈశ్వరుని స్వరూపము వివరింప<బడినది. ఇప్పుడు ప్రకృతి స్వరూపమును వివరించుచున్నా<డు. ప్రకృతిని రెండుగా విభజించి చెప్పుచున్నా<డు. (1) ఆవరణ శక్తి (2) విక్షేప శక్తి. ఆవరణశక్తిని జీవనోపాధియైన అవిద్యయందు, విక్షేపశక్తిని ఈశ్వరోపాధి యైన మాయయందు. దీనికే పరమేశ్వరి యనిపేరు. విద్యాద్యనేక నామములతో దీనిని పిలుతురు. పురుష<డు ఒక రీతిగా జీవు<డని. మరియొకరీతిగా ఈశ్వరు<డని రెండు విధములుగా విభజింతుము. జీవు<డన<గా నెవ్వ<డు? ప్రకృతి స్వరూపములు వేరుగా నరయనివా<డు. ప్రకృతి కార్యములైన శరీరాదులను ఆత్మగా నభిమానించువా<డు. జనన మరణాదులందు తగుల్కొన<జేయు అవిద్యచే ఉపహతమైన వా<డు.

వీ<డే జీవు<డు. ప్రకృతిని స్వాధీనీకరించుకొని ప్రకృతికార్యములను గైకొని లోకము యొక్క సృష్టిస్థితి సంహారాదుల నొనర్చు విద్యోపహితమైన చైతన్యమే ఈశ్వరు<డు. జీవేశ్వరుల కిదియే భేదము. నిర్గుణత్వాది లక్షణసహితు<డై స్వతంత్రు<డైయున్న ఈశ్వరు<డు యదృచ్ఛయా ఉద్బుద్ధమైన శక్తిని సృజ్యాది లీలకొఱకై అంగీకరించును. ఆ ప్రకృతి మహావిష్ణువు యొక్క శక్తి విలాసము యొక్క స్వరూపమే. ఇది సత్త్వాది గుణముల సమష్టి. ఇది అవ్యక్తము. జీవాదృష్టము కారణముగా ప్రకృతి యొక్క వికాస మేర్పడినది. అప్పుడు దాని నీశ్వరు<డు అంగీకరించును. స్వయముగా ప్రకాశించుటకు ఉపాధిగా దానిని స్వీకరించినాడని పిండితార్థము.

5. గుణైఃగుణములద్వారా, సరూపాఃసమానమైన రూపముతో కూడినట్టియు, విచిత్రాఃనానావిధములుగా నున్న వారునైన, ప్రజాఃప్రజలను, జ్ఞానగూహయాజ్ఞానముయొక్క గోప్యమునిమిత్తము, సృజతిసృష్టించుచున్న, ప్రకృతింప్రకృతిని, విలోక్యవీక్షించు, సఃజీవు<డు, సదృశఃవెంటనే, ముముహేమోహించెను.

తాత్పర్యము : ప్రకృతిని స్పష్టముగా అర్థము చేసికొనకపోవుటచేత జీవునకు సంసార మేర్పడె నని చెప్పుచున్నా<డు. సత్త్వాది గుణముల ద్వారా విచిత్రమైన దేవమానుష రూపములను ఉద్భవింప<జేయుసామర్థ్యము ప్రకృతి యొక్క కార్య రూపము. ఈ స్థితిలో జీవునకు స్వరూపవిస్మృతి ఏర్పడినది. ఈ దేవమానుష రూపములనే ఆత్మగా తల<చుచున్నా<డు. ఇట్లర్థము చేసికొనుటకే మోహమని పేరు. ప్రకృత్యోపహితమైన ఈ చైతన్యాంశమును జీవు<డని తెలియవలెను. స్వరూపమైన బోధమును మఱచి పోయిన ఈ ప్రకృతి యొక్క అంశమునకు ఆవరణశక్తి యని పేరు. అవిద్య యని కూడ పేరు. ఈ అంశము నవలంబించి స్వస్వరూపమును మఱచి దేవమనుష్యాది స్వరూపములను ఆత్మగా నభిమానించుట చే ఆ చైతన్యాంశమైన జీవుని జన్మ మరణాదు లాక్రమించును. వాస్తవమున కివి లేవు. ఉన్నట్లుగా భాసించును. ఇట్లు భాసించుటయే సంసారము. ఇట్లుగా సంసార స్వరూపమును, జీవస్వరూపమును, అవిద్యా స్వరూపమును పురుష<డు సూక్ష్మముగా పరిశీలించి తెలియవలెను. పరమార్థముగా నున్న రూపమును వేఱు విధముగా నర్థ మొనర్చుకొనుటయే మోహము యొక్క లక్షణము.

6. సర్వకాలములందుండు చేతన ప్రకృతికి 'అజ'అని పేరు. పురుషునకు 'అజు<డని పేరు. తెలుపు, నలుపు, ఎరుపు (అన<గా సత్త్వరజస్తమో గుణములు). ఈ మూ<డు గుణములయొక్క సమానస్థితియే ప్రకృతి. ఈ గుణములు

పరస్పర మొకదానితో నొకటి కలసికొనుట చేత అవి క్షోభించును. తత్ఫలముగా బహురూపులైన ప్రజలను సృష్టించుచున్న ప్రకృతినిమిత్తముగా మోహితు<డగును. అజన్ము<డైన పురుషు<డు మోహితు<డైన ఈ స్థితియందు జీవు<డని పిలువ<బడును. ఇదే ప్రకృత్యధీను<డైనా<డని చెప్పిన దాని యొక్క స్వరూపము. సృష్ట్యాదికార్యము లొనర్చెడు ప్రకృతినిజూచి మోహింపక తన స్వస్వరూపమును మఱువక ప్రకృతినే దానివలె నేలుటకు సమర్థు<డైన వానినే ఈశ్వరుండందురు. మోహితు<డై యున్న స్వాంశమును అన<గా జీవుని ఆ మోహమునుండి వదలించుటకు శక్తు<డై యుండుట వలననే భిన్నాంశమునకు ఈశ్వరు<డని పేరేర్పడినది. అవశ<డైన జీవు<డు స్వతంత్రు<డైన ఈశ్వరుని ఆశ్రయింపవలెనని ఏర్పడిన సారము.

7. ఏవం=ఈరీతిగా, పరాభిధానేన=అధ్యాసము నిమిత్తముగా, ప్రకృతేః గుణైఃప్రకృతి యొక్క గుణములచేత, క్రియమాణేషు=చేయ<బడెడు, కర్మసు=కర్మలయందు, పుమాన్= పురుషు<డు, ఆత్మని=ఆత్మయందు, మన్యతే=తల<చుచున్నా<డు. తతః=అందుచేత, కర్తృత్వం=కర్తృత్వ మేర్పడును.

తాత్పర్యము: దేహము ఇంద్రియములు అంతఃకరణములు మొదలైన పేరులతో పరిణమించుచున్న ప్రకృతి గుణములందు ఆత్మయను దోషయుక్తమైన ధారణమును అధ్యాసమందురు. పురుషుని యందున్న ఈ ధారణకారణముగా ప్రకృతి గుణములచే చేయ<బడు కార్యములను తాను చేయుచున్నట్లుగా జీవు<డు తల<చును. అపు డాత్మకు కర్తృత్వబుద్ధి ఏర్పడినది. నేనీ కర్మను చేయుచున్నాను. అందుచే దీని ఫలమును నేనే అనుభవింతును. ఈ దృఢవిచారము సామాన్య జనుల కందరి కుండును.

8 తత్=అందుచేత, అకర్తుః=కర్తకాని వా<డును, ఈశస్య=స్వతంత్రు<డును నిర్వ్యాతాత్మనః=ఆనందస్వరూపు<డును, సాక్షిణఃసాక్షిచైతన్యము అయి ఉన్న, అస్య=వీనికి, సంసృతిఃసంసారము, బంధఃబంధము, తత్కృతం=దానిచే నేర్పడెడు, పారతంత్ర్యం=అస్వాతంత్ర్యము, భవతి=ఏర్పడును.

తాత్పర్యము: కర్తగాని తాను - అన<గా ఈశ్వర చైతన్యము తాను కర్తయని తలచుట చేత కర్మ బంధత్వము, భోగమునందు పారతంత్ర్యము, ఆనందస్వరూపు<డైన వానికి సంసారము, జన్మ మరణాదులు, దుఃఖము ఉన్నట్లుగా భాసించుటయు అన్నియు క్రమముగా ఏర్పడును. పారమార్థికముగా వా<డు చైతన్య స్వరూపి. సర్వసాక్షి. అందుచే వానికి కర్తృత్వాదు లేవియును లేవు. ఉపాధి నిమిత్తముగా అంశమని చెప్పినాము. వాస్తవముగా పురుషు<డు సత్య స్వరూపియే. అంశము కాదు.

9. కార్యకారణ కర్తృత్వే=కార్యము, కారణము, కర్త అన్నస్థితి ఏర్పడుటకు, కారణం=హేతువు, ప్రకృతిం=ప్రకృతియని, విదుఃపెద్ద లందురు, సుఖదుఃఖానాం=సుఖదుఃఖముల యొక్క, భోక్తృత్వే=భోక్తయనెడు భావమందు, ప్రకృతేః పరం=ప్రకృతి కంటె భిన్నుఁడైన పురుషం=పురుషుని, కారణముగా తెలియును.

తాత్పర్యము: కర్తృత్వాది భావమునకు కారణము చైతన్యమే గదా. శరీరము నభిమానించినదియు నదియే కదా! అది కారణముగా నేర్పడెడు కర్తృకారణాది భావమునకు కారణము చైతన్యమే కావలెనుకదా! అనెడు శంకను పరిహరించుచున్నాఁడు. గుణకార్యముగానున్న శరీరము ఇంద్రియము, దేవతలు - అనెడు ఈ భావములు పురుషునితో చేరుటకు ప్రకృతియే కారణము భోక్తృత్వమునకు పురుషుఁడు కారణము. ఈ విషదమునందు స్వానుభవమున్న వివేకులే నిర్ధారించి చెప్పిరి. కర్తృత్వాది భావము భోక్తృత్వము అహంకారముతో నేర్పడునదే. సమస్త వికారములును జడము నందే పర్యవసించున వగుటచేత ఉపాధి ప్రాధాన్యనిమిత్తముగా కర్తృత్వమునకు కారణము ప్రకృతియే. భోగము జ్ఞానస్వరూపమైన చిత్తమందు (అనఁగా చిద్భాగమందు) పర్యవసానించును. అందుచే అవహిత ప్రాధాన్యము కారణముగా భోక్తృత్వమునకు ప్రకృతి కంటె భిన్నుఁడైన పురుమఁడే కారణము. ఈ విషయమునకు స్వానుభవమే ప్రధానము.

10. సత్ అసత్ చ= స్థూల సూక్ష్మములు, యదాత్మకం = ఎవరి యొక్క స్వరూపమో, అస్య= ఈ లోకమునకు కారణయోఃకారణములుగానున్న, ప్రకృతేః పురుషస్యచ= ప్రకృతి పురుషుల యొక్క, లక్షణం బ్రూహి= లక్షణము నెఱింగింపుము.

తాత్పర్యము :ఈ రీతిగా జీవుని యొక్క సంసార భావమును, దానికి కారణమైయున్న ప్రకృతి - వీనిని గూర్చి తెలిసికొన్న తరువాత జగత్కారణమైన ఈశ్వరుఁడు, ఈశ్వరున కుపాధియైన ప్రకృతి - వీరిద్దరిని గూర్చి దేవహూతి ప్రశ్నించుచున్నది. ఓ పురుషశ్రేష్ఠా! ఏ ప్రకృతి పురుషుల స్వరూపము స్థూలముగ సూక్ష్మముగా కనిపించుచున్నదో, ఈ జగత్తునకు జననీ జనకు లెవ్వరో, జగత్కారణమైన ప్రకృతి పురుషుల లక్షణములను నాకు స్పష్టముగా చెప్పుము.

11. త్రిగుణం=త్రిగుణములే స్వరూపముగాఁగలదియు. అవ్యక్తం= ఇంద్రియములకు విషయముగాక యుండునదియు, నిత్యం=ఉత్పత్తి నాశములు లేనిదియు, అవిశేషం=ఆకృతి విశేషముతో కూడనిదియు, విశేషవత్=విశేషము లకాశ్రయమై యున్నదియు, సదసదాత్మకం=స్థూల సూక్ష్మభావమును

ప్రాపించినదియు, యత్=ఏది కలదో, ప్రధానం=అన్నిటికినీ ముఖ్యకారణమై యున్న, తత్=దానిని, ప్రకృతిం ప్రాహుఃప్రకృతియని అందురు.

తాత్పర్యము: మహత్తత్త్వాదుల కంటెను ముఖ్యముగా విచారించుటకు యోగ్యమైయున్న తత్త్వమేది కలదో దానిని ప్రధానమనియు ప్రకృతి యనియు అందురు. స్వయముగా దానికి ఆకృతి లేదు. అందుకే అభివ్యక్తి లేదు. సత్త్వరజస్తమోగుణముల యొక్క సామ్యావస్థయే అది. అందుచే దాని యభివ్యక్తికి కారణము లేదు. కాని పైనుండ<బోయెడు సకలముల అభివ్యక్తికినీ ఆశ్రయ మిదియే. సకలమున కాశ్రయ మగుట చేత ఇది బ్రహ్మమే అగునా అని శంకింపవలసినది లేదు. ఎందుకన<గా బ్రహ్మపదార్థము గుణాతీతమైనది. ప్రకృతి త్రిగుణాత్మకమైనది. స్వయముగా ఏ విశేషము లేనిదైనను సకల విశేషముల కిది ఆశ్రయము. మహత్తత్త్వమునకు లక్ష్యమైనది. అందు చేత ప్రధానమన్నది మహత్తత్త్వమగునా అని శంకింప<బనిలేదు. ప్రకృతి అవ్యక్తము. ఇది కార్యముగా నుండుట లేదు. మహత్తత్త్వము కార్యము. పోనీ ప్రధానము కాలమందమా? కాదు. ఎందుకన<గా ప్రధానము స్థూల సూక్ష్మ రూపమైనది. జీవోపాధిగా నున్న అవిద్యయే ప్రధాన మనుటకు వీలులేదు. కారణ మేమన<గా అవిద్యకు నాశ మున్నది. ప్రధానము ముఖ్యమే.

12. పంచభిః పంచభిఃఐదు, ఐదు, చతుర్భిఃనాలుగు, దశభిఃపది, యత్ చతుర్వింశతికం=ఇరువది నాలుగుతో కూడిన, గణం=సమష్టి స్వరూపమే, ప్రాధానికం=ప్రధానకార్యమని, విదుఃచెప్పెదరు.

తాత్పర్యము : ఐదు, ఐదు, నాలుగు, పది అనునీరీతిగా ఇరవై నాలుగు సంఖ్యతో కూడిన సమష్టి స్వరూపమునే ప్రధానము యొక్క కార్యమని వివేకులు నిర్ణయించుచున్నారు. తత్త్వముల ఉత్పత్తి, లక్షణము - వీనిని చెప్ప<బోవు చున్నవా<డై మొదట వాని సంఖ్యను నిర్వచించినా<డు.

13. మహాభూతాని=మహాభూతములు, పంచ ఏవ=అయిదు మాత్రము, భూఃభూమి, అపఃజలము, అగ్నిఃఅగ్ని, మరుత్=వాయువు, నభఃఆకాశము, తన్మాత్రాణిపానియొక్క సూక్ష్మాంశములైన, గంధాదీని=గంధము మొదలైనవియు, తావంతి=అన్నియే - ఐదే అని, మేమతాని=నాచే నిర్ణీతములు.

తాత్పర్యము: పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము ఇవి మహా భూతములు. ఇవి ఐదు. గంధ, రస, రూప, స్పర్శ, శబ్దములు ఇవి మహా భూతముల యొక్క సూక్ష్మాంశలు. వీనికి తన్మాత్రములని పేరు. ఇది నానిశ్చయము.

14. ఇంద్రియాణి=ఇంద్రియములు, దశ=పది, శ్రోత్రం=కర్ణము, త్వక్=చర్మము, దృక్=కన్ను, రసనా=నాలుక, నాశికా=ముక్కు, వాక్=ఉచ్చారణకు పనికివచ్చెడు ఇంద్రియము, కరౌ=రెండుచేతులు, చరణౌ=రెండు పాదములు, మేఢ్రం=జననేంద్రియము, పాయుః=విసర్జనేంద్రియము, దశమః=ఇరువదియవది అని < ఉచ్యతే=చెప్ప <బడుచున్నది.

తాత్పర్యము: శ్రోత్రము, త్వక్కు, నేత్రము, జిహ్వా, నాసిక ఇవి జ్ఞానేంద్రియములు. ఇవి ఐదు. వాక్కు, రెండు చేతులు, రెండు పాదములు, మేఢ్రము, పాయువు ఇవి కర్మేంద్రియములు. ఇవి ఐదు. అన్నియు చేరి పది ఇంద్రియములు.

15 మనః=మనస్సు, బుద్ధిః=బుద్ధి - జ్ఞానాంశమైన మహత్తత్త్వము యొక్క స్వరూపము, అహంకారం=నేననెడు అభిమానము యొక్క స్వరూపము, చిత్తం=చింతాస్వరూపము, ఇతి=అనియున్న, అంతరాత్మకం=లోపల నున్న ఇంద్రియ స్వరూపము, లక్షణరూపయా వృత్త్యా=లక్షణరూపమైన వ్యాపారము నిమిత్తము, చతుర్ధాభేదః=నాలుగు రీతులుగా నున్న భేదముగా, లక్ష్యతే=కన <బడుచున్నది.

తాత్పర్యము:మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము- ఈ నాలుగింటి యొక్క సమష్టి స్వరూపమే అంతఃకరణము. వాస్తవ స్థితిలో ఏకముగా నున్న అంతఃకరణము సంకల్పము, నిశ్చయము, అభిమానము, చింత అనెడు వృత్తి భేదములతో నాల్గుగా విభజింప <బడినది.

16, 17. సగుణస్య=గుణముతో కూడియున్న, బ్రహ్మణః=బ్రహ్మయొక్క, సన్నివేశః=అవస్థావిశేషము, మయాప్రోక్తః=నాచేత చెప్ప <బడి యున్నట్టి, ఏతావానేవ=ఇంత మాత్రముగానే, సంఖ్యాతుః=సంఖ్య నిర్ణయింప <బడినది. కాలః యః=కాలమనునది ఎది కలదో, సః పంచ వింశకః=అది ఇరువది యైదవదిగా అగును అందురు. ఏకే=కొందరు, కాలం=కాలము, పౌరుషం=పురుషునికి సంబంధించిన, ప్రభావం=విక్రమవిశేషమని, ప్రాహుః=వచించిరి. ప్రకృతిం=అవిద్యను, ఈయుషః=ప్రాపించియున్నవా <డు, అహంకార విమూఢస్య =అహంకారనిమిత్తముగా భ్రాంతు <డైయున్నవా <డైన, కర్తుః=కర్తయైనవానికి, యతః=దేనిచేత, భయం=భీతి(ఏర్పడుచున్నదో)

తాత్పర్యము: సత్త్వాది గుణవిశిష్టమై యున్న బ్రహ్మపదార్థము యొక్క అవస్థా విశేషము ఎంత వరకు నేను చెప్పితినో అంతవరకే కలదని నాయభిప్రాయము. దీనిని మరికొందఱు ఆచార్యులుకూడ సమ్మతించిరి. కాల మొక్కటి ఇరువది యైదవది కలదని కొంద ఱందురు. కాలము

ప్రకృతి యొక్క వ్యవస్థా విశేషము మాత్రమే. మరికొందరు ఆచార్యులు కాలమును పురుష వీర్యముగా నిశ్చయింతురు. అవిద్య యనెడు ఉపాధితో కూడినదియు, తన స్వరూపమును మఱచిపోయిన దేహాదుల యందే ఆత్మభావము నారోపించుకొని ఆత్మను దేహాదులందు బంధించు నన్నమాట. దానివలన వా<డు జననమరణాది భయమునకు పాత్రీభూతు<డగును. ఈ భీతి వానికి కాలము వలన నేర్పడును. వాస్తవమునకు ఆత్మ జ్ఞానస్వరూపము. దానికి కర్తృత్వము లేదు. ఉపాధి నిమిత్తముగా కర్తయని తన్నభిమానించుకొనును. ఈ యభిమాన మహంకారముచే నేర్పడుచున్నది. దీనితో స్వరూప విస్మృతి కలుగును. దానివలన జనన మరణాది భీతి ఏర్పడును. ఇక్కడ కాలమును సంహార కారణముగా నిశ్చయించినా<డు.

18. మానవి!=ఓ మనుపుత్రి యైనదానా! గుణసామ్యస్య=గుణములయొక్క సామ్యావస్థావిశేషమై యున్నదియు, నిర్విశేషస్య=విశేషముతో కూడకయున్నదియు నైనట్టి, ప్రకృతేః=ప్రకృతియు, యతః=ఎవనినుండి, చేష్టా=వ్యాపారము - అన<గా వికారము - ఏర్పడుచున్నదో, సః భగవాన్=ఆ భగవంతు<డు, కాలః ఇతి =కాలమని, ఉపలక్షితః=సూచింపబడినా<డు.

తాత్పర్యము : కాల స్వరూపమును రెండుగా విభజించినచో సంహారరూపమైన కాలమునుండి జీవునకు మరణ భీతి ఏర్పడుచున్నది. దాని మొదటి స్వరూపము ప్రకృతిని క్షోభింప<జేయుట. అనగా సామ్యస్థితిని చెఱచుట. దీని నుండియే సృష్టి ఏర్పడుచున్నది. ఆ విషయమునే చెప్పుచున్నా<డు. ఓ మానవీ! సత్త్వాది గుణముల సామ్యావస్థయైన ప్రకృతి సృష్టికి ముందు నామరూప విభేదరహితమైన పురుషుని యందే విభేదించియుండును. ఆస్థితిలో దానికే విభేదమును లేదు. ఈ ప్రకారముగా నున్న ఆ సామ్యవస్థను క్షోభింపచేయునదేదియో దానికే కాలమని పేరు ఇత<డే భగవంతు<డు. ప్రకృతి సామ్యావస్థ శుద్ధమైనప్పుడు ప్రకృతి కవస్థా విశేష మేర్పడును. ఇదే ఆద్యమైన వికారము. దీనికిని కాలమనియే పేరు. దీనిని వేఱు తత్త్వముగా గుర్తించినచో మొదటచెప్పిన ఇరువది నాలుగు తత్త్వములలో ఇది ఇరువది యైదవ దగును. కాని ఇది భగవచ్ఛేష్ట యగుటచే దీనిని వేఱు తత్త్వముగా గణింపవలసిన పనిలేదు. గుణముల అన్యోన్య సంపర్కముతో క్షోభ మారంభ మగును. శాంతముగా నున్న సముద్రము వీచులతో కదలినట్లు ప్రకృతి చలించుటకు జీవాదృష్టము కారణము. జీవులు వారివారి సుఖదుఃఖముల ననుభవింపవలెను. దానికి సరియైన శరీరము

సృష్టించుట కేర్పడిన ఈశ్వరుని కారుణ్యము నిమిత్తముగా మొట్ట మొదలు ఉండిన గుణసామ్యవస్థాత్యాగమును కాలతత్త్వముగా పరిగణింతు రని భావము.

19. సత్త్వానాం=ప్రాణుల యొక్క అంతఃఅంతర్భాగములందు, పురుషరూపేణ=పురుషుడుగను, బహిఃబయట, కాలరూపేణ=కాలరూపుడుగను, ఆత్మమాయయా=ఆత్మశక్తిచేత, యఃఎవ్వడు, సమన్వేతి=చక్కగా నన్వయించబడునో, ఏషఃవాడు, భగవాన్=ఈశ్వరుడు.

తాత్పర్యము: ఆత్మశక్తి ప్రభావము నిమిత్తముగా సకల ప్రాణుల అంతర్భాగములందు అంతర్యామి స్వరూపముగను, బహిర్భాగము కాల స్వరూపుడుగనూ వ్యాపించి యుండునో వాడు సాక్షాత్ పరమేశ్వరుడే. కాల స్వరూపుడును, పురుషుడును - ఒక్కరే అగుటచేత ప్రకృతి పరిణామ స్వరూపములైన తత్త్వములు ఇరువది నాలుగని నిర్ణయింపబడినది. పురుషుడే అంతర్యామియైన ఈశ్వరుడు. అవిద్యోపాధితో కూడిన చైతన్యము పురుషుడే. వాడు నేను సుఖిని నేను దుఃఖిని అనెడు భావమునకు లోనగును. అప్పుడు వాడు జీవుడని నిర్ణయింపబడును. ఈ జీవుడు పురుషుని కంటె భిన్నుడని తలచినచో అప్పుడు జీవుడు ఇరువది యైదవ తత్త్వ మగును. ఈశ్వరుడు ఇరువది ఆరవ తత్త్వమగును. విద్యోపాధికముగా ఈశ్వరుడని, అవిద్యోపాధికముగా జీవుడని ఒక్కటే చైతన్యము వ్యవహరింపబడుచున్నది. కనుక వాస్తవస్థితిలో చైతన్యమొక్కటే యగుటచేత దానినొక్కటిగానే లెక్కించి పురుషుడని వ్యవహరించినచో చాలును. ఈ పక్షమందు ప్రకృతి భావము లిరువది నాలుగే. పురుషుడు ఇరువది యైదవ తత్త్వము.

20. దైవాత్=జీవాదృష్టము నిమిత్తముగా, క్షుభిత ధర్మిణ్యాం=క్షోభింపచేయబడిన ధర్మములతో కూడినట్టి, స్వస్యాం యోనౌ=తన యొక్క ఉత్పత్తిస్థానమందు, పరఃపుమాన్=పరుడైన పురుషుడు, వీర్యం=వీర్యమును. అనగా చిచ్ఛక్తిని, ఆధత్త=ఆధాన మొనర్చెను. సా=అది, హిరణ్మయం=అధిక ప్రకాశముకలదైన, మహత్తత్త్వం=మహత్తత్త్వమును, అసూత=కల్గించిపచేసినది.

తాత్పర్యము: ప్రకృతి ధర్మములైన సత్త్వరజస్తమో గుణములకు- ఆ ప్రకృతియందు లయించియున్న జీవుల అదృష్ట నిమిత్తముగా అన్యోన్య సమ్మేళన మేర్పడినది. దీనికే గుణక్షోభమని పేరు. ఈశ్వరుని అభివ్యక్తికి ఈ ప్రకృతిస్థానమైనది. ఈశ్వరుని వీర్యమైన చిచ్ఛక్తి ప్రకృతి యందు ప్రతిఫలించెను. ఎక్కువ ప్రకాశముతో నేర్పడిన ఆశక్తి మహతత్త్వమైనది. ఈ చిచ్ఛక్తినే పురుషుని వీర్యముగను, ప్రకృతిని ఒక స్త్రీగను భావించినచో భగవద్వీర్యమును

ధరించుట యను క్రియను స్పష్టముగా చెప్పినట్లగును. అనగా స్త్రీ పురుష విధా కల్పనము స్పష్టార్థమే నన్నమాట. ప్రకృతి కంటె భిన్నుఁడైన పరమ పురుషుఁడు ప్రకృతి యందు స్వశక్తియైన వీర్యమును నిక్షేపించినపుడు మహత్తత్త్వమను ప్రథమ పుత్రుఁడు జన్మించును. కనుక ఈ మూఁడును అలంకారికములు. ప్రకృతి సహితుఁడైన పురుషుఁడే మహత్తత్త్వము.

21 కూటస్థుఁ=నాశరహితము, జగదంకురుఁ= లోకమునకు అంకురముగా నున్న, తత్=అది, ఆత్మగతం=తన యందున్నట్టి, విశ్వం=లోకమును, వ్యంజన్=ప్రకాశపఱచునదిగా, ఆత్మప్రస్థాపనం=తన్ను మఱచి ఉండునదియు నైన, తమఃతమస్సును, స్వతే జసా=తన యొక్క తేజస్సు చేత, అపిబత్=నశింపఁజేసెను.

తాత్పర్యము: ప్రకృతి పురుషుల సంయోగముచే ప్రథమోత్పత్తిగా వికసించి యున్న ఈ మహత్తత్త్వము లోకమనెడు మహావృక్షమునకు అంకుర స్థానమైనది. దీనికి లయ విక్షేపాదులైన వికారములు లేని దానివలన కూటస్థమని చెప్పుటయైనది. ఇఁక పైనుండఁబోవునట్టి చరాచరాత్మకమైన లోకము ఈ అంకురమందే అడఁగి యున్నది. వృక్షము యొక్క పైభాగమున కనఁబడు పూలు పండ్లు మొదలైన సకలాంశములు అంకురమం దణఁగి యున్నట్లని అర్థము. తన యందు అంతర్భూతముగా నున్న ఆలోకమును క్రమముగా ప్రకాశింపఁజేయునై ఆ మహత్తత్త్వము తన వికాసము అణఁచిపెట్టి వ్యాపించి యున్న అంధకారమును తనయొక్క కాంతి విశేషముతో నశింపఁజేసినది.

22. స్వచ్ఛం=నిర్మలము, శాంతం=చలనము లేనిది, భగవతఃపదం=భగవదుపలబ్ధ స్థానమైన, సత్త్వగుణం యత్=ఏ సత్త్వగుణము కలదో, వాసుదేవాఖ్యం=వాసుదేవుఁడను పేరుతో కూడిన, చిత్తంయత్=చిత్తమనుఁబేది కలదో, తత్=అది, మహదాత్మకం=మహత్తత్త్వ స్వరూపము (అగును).

తాత్పర్యము: ప్రసంగవశాత్తు చతుర్వ్యూహో పాసనాక్రమమును ఇచ్చట ఉపదేశించు చున్నాఁడు. ఈ ఉపాసనాక్రమము సర్వాగమ ప్రసిద్ధ మగుట చేత అంతఃకరణ పరిశుద్ధికి ముఖ్యోపాయము. ఏ విధమైన మాలిన్యము యొక్క స్పర్శము లేకుండుట చేత అత్యంతము నిర్మలము, రాగాది వృత్తుల యొక్క వ్యాప్తి నిమిత్తముగా నేర్పడెడు చలనమునకు విషయము కాకుండెడు భగవత్స్వరూపము చక్కగా తెలిసికొనుటకు ఉపాధిస్థానము నైయున్న సత్త్వగుణము ఏది కలదో, వాసుదేవుఁడను పేరుతో ప్రసిద్ధమైన చిత్తమేది కలదో దాని యొక్క ఆద్య స్వరూపము ఈ మహత్తత్త్వమేయని తెలిసికొనుము.

ఈ విషయము నింకను స్పష్టపఱచినచో ఇట్లగును. అధి భూతమైనదిగా చెప్పినపుడు గోళాకృతి యందు అధిష్ఠానముగానున్న భూతత్త్వముగా నిరూపింప< బడునపుడు మహత్తత్త్వమని పేరు అధ్యాత్మ స్వరూపమై ఇంద్రియరూపముగా చెప్ప<బడునప్పుడు ఆమహత్తత్త్వమే చిత్తమను పేరుతో పిలువ<బడును. ఉపాస్యమాను<డైయున్న దైవతము యొక్క స్వరూపముగా చెప్ప<బడినప్పుడు వాసుదేవు<డను పేరుతో నుండును.

1. అధిభూతము	2. అధ్యాత్మము	3. అధిదైవము	4. అధిష్ఠానము
మహత్తత్త్వము	చిత్తము	వాసుదేవు<డు	క్షేత్రజ్ఞు<డు
మహత్తత్త్వము	అహంకారము	సంకర్షణు<డు	రుద్రు<డు
మహత్తత్త్వము	మనస్సు	అనిరుద్దు<డు	చంద్రు<డు
మహత్తత్త్వము	బుద్ధి	ప్రద్యుమ్ను<డు	బ్రహ్మ

పైన చెప్పిన నాల్గువిధములైన అంతఃకరణములును అధిదైవము, అధిష్ఠానములు. దాని ముందుగా మహత్తత్త్వము యొక్క భేదము చేతనే ఏకముగా అద్వితీయముగా నున్న పరమాత్మ వస్తువునుండి నానాత్వ మిరీతిగా నేర్పడినది. పైన చెప్పిన పట్టికలో నేర్పడినది. ఈ నానాత్వము వాస్తవము కాదని కేవల వృత్తి భేదమే యని పై పట్టికను పరిశీలించినచో తెలియును.

23. స్వచ్ఛత్వం=స్వచ్ఛమైయుండెడు. అవస్థ, అవికారిత్వం=వికారమును పొందకుండెడిస్థితి, శాంతత్వం=రాగాది వృత్తుల యొక్క బాధలేకుండెడు స్వభావము, ఇతివృత్తిభిః=ఈ ప్రకారమున్న వృత్తులచేత, అపాం=నీటియొక్క, పరాప్రకృతిర్యథా=అద్యమైన స్వభావమును కూడి, చేతసఃచేతస్సు యొక్క, లక్షణం=లక్షణమునుగా, ప్రోక్తం=చెప్ప<బడినది.

తాత్పర్యము: హృదయగుహ యందు ప్రకాశించుచున్న భగవంతుని యొక్క బింబము చక్కగా నర్థము చేసికొని అనుభవించుటకు తగినట్లుగా మనస్సు నిర్మలముగా నుండుట, లయము, విక్షేపము మొదలైన వికారములను పొందక ఒకటే స్థితియందుండుట. రాగద్వేషాదివృత్తులు లేక శాంతముగా నుండుట, ఈ లక్షణములతో చిత్తముండుట - ఉండ<దగిన స్థితి. ఈ రీతిగా నుండు మనస్తత్త్వమునకే చిత్తమని పేరు. అలల యొక్క గుంపు గాలివీచుట మొదలైన వికారముల నొందక మాధుర్యము, నైర్మల్యము, మొదలైన గుణములు జలము యొక్క స్వభావిక లక్షణము లైనట్లు పైన చెప్పిన స్వచ్ఛత్వాది గుణములు చేతస్సు యొక్క లక్షణములు. దీనినుండి గ్రహింప<దగిన విషయము - జలములందు తరంగ చలనము మొదలైన

మార్పులు, ఎఱ్ఱగా నుండుట, నీరు ఉప్పగా ఉండుట మొదలైన వర్ణరస భేదము భూమి, గాలి వీనితోడి సంబంధముతో నేర్పడెడునవే. కాలుష్యము రాగాది వృత్తులు మొదలైన వికారములు అన్య సంబంధముతో చేతస్సున కేర్పడును. దాని స్వభావగుణములు సర్వజ్ఞత ఆనందావస్థ మొదలైన ఈశ్వర గుణములు ప్రతిఫలించుటకు అర్హమైన ఉపాధిగా నుండుటయే. ఆస్థితి నుండి అవి మార్పుచెందినపుడు బంధమేర్పడును. తన స్వస్వభావస్థితిలో ఉండుటయే మోక్షప్రాప్తికర్హమైన చేతస్సును తన సహజ స్థితి యందుండుటకు ఏర్పడునవే యోగాదులైన అభ్యాసములు. సంసార బంధమునందు చిక్కుకొని మోక్షమునందు చిక్కుకొని మనుష్యఁడు ఇంతకన్నను ఉత్తమమైన సదుపదేశమును.

24. భగవద్వీర్య చోదితాత్=భగవంతుని వీర్యము నుండి సంభవించుటను గుణముతో కూడినదియు, వికుర్వాణాత్=వికారమును ప్రాపించినదైన, మహత్తత్త్వాత్=మహత్తత్త్వమునుండి, క్రియాశక్తితో కూడినది, త్రివిధఃమూఁడు విధములుగానున్న, అహంకారఃఅహంకారము, సమపద్యత=ఏర్పడినది.

తాత్పర్యము: అహంకార మనెడు తత్త్వమెట్లేర్పడినది, ఇది మొదలు నాల్గుశ్లోకములతో చెప్పుచున్నాఁడు. ఈశ్వరుని యొక్కచిత్, జ్ఞానము అనెడు శక్తినుండి ఏర్పడిన మహత్తత్త్వమునకు వికారము కలిగినపుడు దానినుండి అహంకార తత్త్వమేర్పడినది. మనస్సు మొదలైన వాని నేర్పఱచెడు శక్తి - అనఁగా క్రియాశక్తి దానియందున్నది. ఈ యహంకారము మూఁడురీతు లైనది.

25. వైకారికఃసత్త్వగుణప్రధానమైనది. తేజసఃరజోగుణ ప్రధానమైనది. తామసఃతమోగుణప్రధానమైనది మనసఃమనస్సు యొక్కయు, ఇంద్రియాణాం=ఇంద్రియముల యొక్కయు, మహతాం భూతానామపిమహాభూతములయొక్క, భవఃసంభవము, యతఃదేనినుండి ఏర్పడినది.

తాత్పర్యము : వైకారికము, తైజసము, తామసము అని అహంకారమునకు మూఁడు విధములుగా పేరు ఏర్పడినది. ప్రకృతి యొక్క ఉత్కృష్టమైన సమత అనెడు స్థితి మారుటకు వికార మని పేరు. ఈ మొదటి వికారమునందు సత్త్వగుణమునకే ప్రధానము. దానిచేత చేరిన మహత్తత్త్వము సత్త్వగుణ ప్రధానమైన అహంకారము లేక వైకారికాహంకారము. రజోగుణమందు ప్రతిఫలించిన మహత్తత్త్వమునకు రాజసాహంకారమని లేక తైజసాహంకారమని పేరు. తమోగుణమందు ప్రతిఫలించిన అహంకారము తామసాహంకారము.

ఈ మూ<డు విధములైన అహంకారములలో సాత్త్వికాహంకారమునుండి మనస్సు ఏర్పడును. రజోగుణపూరితమైన అహంకారము నుండి ఇంద్రియము లేర్పడును. తామసాహంకారమునుండి మహాభూతము లేర్పడును.

26. భూతేంద్రియ మనోమయం= భూతములు, ఇంద్రియములు, మనస్సు అనెడు స్వరూపములతో కూడిన, యం=ఏ అహంకారమును, సంకర్షణాఖ్యం =సంకర్షణు<డను పేరుతోను, సహస్రశిరసం=వేయి శిరస్సులతో కూడికొని యున్న, సాక్షాత్ అనంతం పురుషం=సాక్షాత్తుగా అపరిచ్ఛిన్ను<డైన పురుషు<డని, ప్రచక్షతే=విద్వాంసులందురు.

తాత్పర్యము: అహంకారమందు ఉపాస్యు<డైన మూర్తి విశేషమును చెప్పుచున్నా<డు. మనస్సు, ఇంద్రియములు, మహాభూతములు అనువీని యొక్క స్వరూపముగా నున్న అహంకారమును సహస్ర శీర్షములతోను అపరిచ్ఛిన్నమైన మాహాత్మ్యముతో కూడిన సాక్షాత్ సంకర్షణు<డను పేరుగల మహాపురుషునిగా ఉపాసించవలెనని పెద్దలందురు. అహంకారమునే సంకర్షణు< డని పిలుచుటకు కారణ మేమన<గా ఆ అహంకార తత్త్వమందు ప్రతిఫలించిన దేవు<డైన సంకర్షణు<డు ఆయహంకార తత్త్వము భిన్నులు కాదనెడు భావముతో ఉపాసించవలెనని చెప్పుటకు. ఒకవ్యక్తి యందు నేను అని తోచెడు భావము సర్వవ్యాపకమైనచో సకల వ్యక్తులును ఆ నేననెడు భావముతో ఒదిగిపోయెడునవే. అప్పుడు నేననెడు భావము పరిచ్ఛిన్నమైనది కాదు. వేయితలలు వేయి కాళ్ళు, వేయిశిరస్సులు కలది అన<గా అనంతమన్న మాట. ఈ భావముతో సంకర్షణునుపాసించవలెను. ఆ భావమే సంకర్షణ స్వరూపమని తాత్పర్యము.

27. కర్తృత్వం=కర్తయనెడు భావము, కరణత్వం=కరణములనెడు భావము, కార్యత్వం=కార్యములుగా నుండెడు స్థితి, శాంతఘోర విమూఢత్వం=శాంతము ఘోరము విమూఢమనెడు అవస్థ, అహంకృతేః=అహంకారము యొక్క, లక్షణం స్యాత్=లక్షణమైనది.

తాత్పర్యము: అహంకార స్వరూపమును ఇంకొక రీతిగా చెప్పచున్నా<డు. దేవత లనెడు స్థితిలో కర్తృభావము. ఇంద్రియములనెడు స్థితిలో కారణావస్థ. భూతము లనెడు భావనలో కర్తృత్వము వహించి కన<బడుటకు ప్రధానకారణము అహంకారమే. లేక శాంతము, ఘోరము, మూఢము అనెడు మూడవ స్థలకు కారణము అహంకారము యొక్క మూ<డు విధములైన భేదమే. ఇదియుకూడ అహంకార లక్షణమే అగును. జీవాత్మకు వైకారికాహంకార సంబంధముతో తాను కర్తనెడు భావము కలుగును. తైజసాహంకార సంబంధముతో తానింద్రియములు కలవా<డను అను భావ మేర్పడును. తామసాహంకార

నిమిత్తముగా తాను దేహ వంతు< డను అభిమాన మేర్పడును. అట్లే సాత్త్వికాహంకార సంబంధముతో జీవు నకు శాంతి ఏర్పడును. తైజసాహంకార సంబంధము ప్రవృత్తి యందలి తీక్ష్ణతకు కారణము. తామసాహంకారముతో ప్రవృత్తియందు అలస్యము మొదలైన భావము లేర్పడును. ఈ లక్షణములతో అహంకారమనెడు లక్ష్మును గుర్తించవలెను. జీవాత్మకు బహువిధ భావభేదముల సంబంధమునకు కారణము సత్త్వాది గుణములతోడి సంసర్గమే. జీవు<డు శుద్ధ చైతన్య స్వరూపము. గుణసంబంధము ఆ శుద్ధికి కారణము.

28. వికుర్వాణాత్=వికారమునందినట్టి, వైకారికాత్=వైకారికము నుండి మనస్తత్త్వం=మనస్సనెడు తత్త్వమును, అజాయత్=ఏర్పడినది. యత్సంకల్ప వికల్పాభ్యాం=దేని సంకల్ప వికల్పములచేత, కామసంభవః=కామము యొక్క ఉత్పత్తి, వర్తతే=ఏర్పడుచున్నదో-

తాత్పర్యము:మనస్సు యొక్క ఉత్పత్తి దాని లక్షణము చెప్పుచున్నా<డు. సాత్త్వికాహంకారము యొక్క వికారము మనస్సనెడు తత్త్వ మయ్యెను. విషయమును చింతించెడు సంకల్పము విషయము యొక్క విశేషావస్థను గూర్చి యోచించెడు వికల్పము మనస్సుయొక్క ప్రవృత్తులు వీనినుండి కామ మనెడు ఒకానొక వృత్తి మనస్సునందు ప్రకాశించును.

29. హృషీకాణాం=ఇంద్రియముల యొక్క, అధీశ్వరం=నాథుడును, శారదేందీవరశ్యామం=శరత్కాలమునందలి ఇందీవరము వంటి శ్యామల వర్ణము కలవా<డును, యోగిభిః=యోగులచేత, శనైః సంసాధ్యం=నిదానముగా, క్రమముగా నారాధించుటకు యోగ్యు<డైన, అనిరుదాఖ్యం=అనిరుద్ధు<డను పేరుతో కూడినవా<డని, విదుః=పెద్దలన్నారు.

తాత్పర్యము: మనస్తత్వమం దుపాసింప<దగిన దేవునిగూర్చి ఉపాసించుచున్నా<డు. మనస్సునం దధివసించు దైవము అనిరుద్ధు<డు. శరత్కాలమందలి నల్లతామరల వంటి నల్లనైన శరీరముతో కూడినవా<డా దేవు<డు. ఈ దైవమును మహాయోగులు బహుకాలము బహుప్రయత్నముతో నుపాసింతురు. అనిరుద్ధు<డు= ఎవ్వరిచేతను నిరోధించుటకు సాధ్యము కానట్టి బలముకలవా<డు. మనస్తత్త్వమే అనిరుద్ధు<డని ఉపాసించుట చేత సాధకు<డు కామించిన దంతయు సిద్ధించును. కామములో న శుద్ధి ఏర్పడ కుండుటకే నిరంతరము అనిరుద్ధుని ఉపాసింతురు.

30. సతి=ఓ పతివ్రతయైనదానా! వికుర్వాణాత్=వికారమును పొందిన, తైజసాత్=తైజసాహంకారము నుండి, బుద్ధితత్త్వం=బుద్ధియనెడు తత్త్వమును,

అభూత్=ఏర్పడినది, ఇంద్రియాణాం=ఇంద్రియములకు, ద్రవ్యస్ఫురణ విజ్ఞానం= ద్రవ్యముల యొక్క స్ఫురణరూపమైన జ్ఞానమును, అనుగ్రహః=దాని యొక్క కార్యము.

తాత్పర్యము: ఓ పతివ్రతయైన దేవహూతీ! వికారమును పొందిన తైజసాహంకారమునుండి బుద్ధియను పేరుగల తత్త్వ మేర్పడినది. నేత్రాదికములైన ఇంద్రియములు. "ఇదిఘటము, ఇది పటము" అను ఈ రీతిగానున్న రూపాదుల యొక్క విశేషమును గూర్చి తెలుపుట ఇవియన్నియు బుద్ధియొక్క కార్యములే. ఈ విశేషజ్ఞానమే బుద్ధితత్త్వము యొక్క లక్షణము.

31. సంశయః=అదియా ఇదియా అనెడు భావము, విపర్యాసః=విపరీత భావము. అన<గా ఒకదానిని మఱియొక దానినిగా తల<చుట, నిశ్చయః= నిశ్చయమైన జ్ఞానము, స్మృతిః=అనుభవమును గూర్చి ఏర్పడెడు స్మృతి, స్వాపః=నిద్ర, ఇతి వృత్తితః=అనెడు ఈ వృత్తుల వలన, బుద్ధేర్లక్షణం= బుద్ధియొక్క లక్షణము, పృథక్=వేఱుగా, ఉచ్యతే=చెప్ప<బడుచున్నది.

తాత్పర్యము: ద్రవ్యముల స్ఫురణమే బుద్ధిలక్షణము. ఈ భావము ఇంతకుముందే తెలుప<బడినది. దీనినే ఇచ్చట కొంత విస్తరించుచున్నా<డు. ఒక విధముగా నున్న ఒక వస్తువు నందు తద్విపరీతమైన వస్తువని జ్ఞాన మేర్పఱచుకొనుట సంశయము. అన<గా ఒక వస్తువును గూర్చి అదియా ఇదియా అని ఆశంకించుట. ఇది ఒక విధమైన బుద్ధిలక్షణము. దూరమందున్న ఒక వృక్షమును చూచి ఇదివృక్షనూ మనిషియా అనిశంక. విపరీత జ్ఞానము లేక ఇచ్ఛాజ్ఞానము బుద్ధియొక్క వేఱు విధమైన బుద్ధిలక్షణము. దూరమందున్న ఒక వృక్షమును చూచి ఇదివృక్షనూ మనిషియా అనిశంక. విపరీత జ్ఞానము లేక ఇచ్ఛాజ్ఞానము బుద్ధియొక్క వేఱు విధమైనవృత్తి. తెల్లని శంఖమును పచ్చని దానినిగా తల<చుట. శుక్తియందు రజత భ్రాంతి దీనికే జ్ఞాన విపర్యా సమని పేరు. ఇది కూడ బుద్ధిలక్షణమే రజతమును రజతమనియు, శుక్తిని శుక్తియనియు తెలియుట నిశ్చయ జ్ఞానము. ఇది బుద్ధియొక్క సరియైన లక్షణము. ఒకప్పుడను భవించిన సుఖమునో దుఃఖమునో జ్ఞాపకము తెచ్చుకొనుట స్మృతియందురు. ఇది కూడ బుద్ధిలక్షణమే. ఏప్రవృత్తియు లేక అజ్ఞానవృత్తియం దుండుట నిద్ర. ఇదియును బుద్ధిలక్షణమే. ఈ రీతిగా వృత్తిభేదము నిమిత్తముగా లక్షణభేద మేర్పడినది.

32. క్రియా జ్ఞానవిభాగశః=ప్రవృత్తి జ్ఞానము అనెడు విభాగములతో కూడిన, ఇంద్రియాణి=ఇంద్రియములు. తైజసాన్యేవ=రాజసాహం కారముతో నేర్పడినవే. హి=ఎందుకన<గా, క్రియాశక్తిః=ప్రవృత్తి సామర్థ్యము, ప్రాణస్య= ప్రాణము యొక్క, విజ్ఞానశక్తితా=జ్ఞానశక్తి, బుద్ధేః=బుద్ధికి సంబంధించినదే.

తాత్పర్యము:ఇంద్రియముల ఉత్పత్తిని గూర్చి చెప్పుచున్నా ఁడు. కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు ఈ రీతిగానున్న రెండువిధములైన ఇంద్రియములు రాజసాహంకారము నుండి ఏర్పడినవే. ఎందుకన ఁగా ప్రాణమునుండి క్రియాశక్తియు, బుద్ధినుండి జ్ఞానశక్తియు ఇంద్రియములకు లభించును. ప్రాణము బుద్ధి రాజసాహంకారమునుండి ఏర్పడినవే. అందుచేత ఇంద్రియములు కూడ రాజసాహంకారమునుండి జనించినవే. జ్ఞానేంద్రియములు సాత్త్వికాహంకారము నుండి ఏర్పడుననెడు శంక చేయ ఁగూడనిది.

33. భగవద్వీర్య చోదితాత్= భగవంతుని వీర్యమునుండి ప్రేరేపింప ఁబడి నట్టియు, వికుర్వాణాత్=వికారమును ప్రాపించినదియునైన, తామసాత్= తామసాహంకారమునుండి, శబ్దమాత్రం=శబ్దస్వరూపమైన సూక్ష్మద్రవ్యము. అభూత్=ఏర్పడినది. తస్మాత్=దానినుండి, నభఃఆకాశము, శ్రోత్రంతు=శ్రోత్ర మనెడు ఇంద్రియము, శబ్దగం=శబ్దమును గ్రహించెడి ఇంద్రియము,

తాత్పర్యము: తన్మాత్రలు ఉండెడి రీతి ప్రతిపాదించుచు మహాభూతముల ఉత్పత్తినీ లక్షణమును కూడ చెప్పుచున్నా ఁడు. ఈశ్వరుని శక్తిస్వరూపమైన కాలము యొక్క ప్రేరణతో తామసాహం కారమునకు రూపాంతర మేర్పడును. దానినుండి సూక్ష్మద్రవ్యమైన శబ్ద మేర్పడును. దానితో నాకాశము కల్గినది. శ్రోత్ర మనెడు నింద్రియము శబ్దమును గ్రహించుటకై యున్న కారణము.

34. ఆర్థాశ్రయత్వం=ద్రవ్యమును ప్రకాశింప ఁజేసెడునవస్థ, ద్రష్టుఃచూచెడు వానియొక్క, లింగత్వం=జ్ఞాపకమనెడు భావము, నభసఃఆకాశము యొక్క, తన్మాత్రత్వం=సూక్ష్మస్వరూపత్వము, శబ్దస్యలక్షణం=శబ్దము యొక్క లక్షణమని, కవయఃజ్ఞానులు, విదుఃతెలిసికొన్నవారైరి.

తాత్పర్యము: శబ్దము యొక్క లక్షణమును చెప్పుచున్నా ఁడు "ద్రవ్య మనునది ఒకటున్నది" అని తెల్పునది శబ్దము. ఒకానొక మనుష్యు ఁడు మరుగునం దున్నా ఁడని ఊహింతము. వానిని చూచి ఏను ఁగు పోవుచున్నదను భావ మేర్పడవచ్చును. కానీ శబ్దము విన్నపుడు నేత్రముల కావ్యక్తి కన్పడకున్నను ఆ వైపు ఒక మనుష్యు ఁడున్నా ఁడను భావము కలుగును. దీనికి శబ్దము కారణము. ఆకాశమున్నదా అని తెలిసికొనుటకు మార్గము శబ్దమే. నభస్సుయొక్క సూక్ష్మమైన మార్గమే శబ్దము. ఈ రీతిగా పూర్వులైన జ్ఞానులు నిర్ధారించియున్నారు.

35. భూతానాం=భూతములకు, ఛిద్రదాతృత్వం=ద్వారము నేర్పఱచుటకు అనుకూలించు శక్తి, బహిరంతర మేవచ=బాహ్యాంతరము లనుటయు, ప్రాణేంద్రి యాత్మ ధిష్ణ్యత్వం=ప్రాణము, ఇంద్రియములు మనసు ఇవి ఉండుటకు

స్థానమేర్పఱచునదియు, నభసఃఆకాశము యొక్క, వృత్తిలక్షణం=వ్యాపార రూపమైన లక్షణము.

తాత్పర్యము:కార్యమును బట్టి కారణము నూహింపవలెనను న్యాయము ప్రకారము ఆకాశము యొక్క కార్యరూప లక్షణమును చెప్పుచున్నా<డు. బ్రహ్మాది స్తంబ పర్యంతముగల సకలభూతములకును వసించుట కవకాశ మేర్పఱుచునది ఆకాశమే. లోపలబయటనను అవకాశమునకు కూడ కారణ మాకాశము. శరీరాంతర్భాగమందు ప్రాణములకు ఇంద్రియములకు, మనస్సునకు, వసించుటకు ఏర్పడిన భాగములు నాడుల యొక్క అంతర్భాగములే. దానికికూడ కారణ మాకాశమే. ఈ రీతిగా ఉన్న కార్యములు కనపడుచుండుట చేత ఆకాశము యొక్క ఉనికిని గూర్చి తెలినికొనవలెను. శబ్దమనునది సూక్ష్మాకాశము. ఆకాశము స్థూలాకాశము. ఈ రెంటి యొక్క లక్షణము ముప్పదిమూ<డు, ముప్పది నాల్గు శ్లోకములలో చెప్ప<బడినది. శ్లోకములందును క్రమముగా ముప్పది రెండవ శ్లోకము భూతోత్పత్తిని కూడ తెలుపుచున్నది. ఇట్లే పైనున్న మూ<డు శ్లోకములందును క్రమముగా భూతోత్పత్తి సూక్ష్మభూతలక్షణము స్థూల భూతలక్షణము వివరింప<బడ<బోవుచున్నవి.

36. కాలగత్యా=కాలము యొక్క 'గతి' కారణముగా, వికుర్వతఃవికారమును పొందిన, శబ్దతన్మాత్రాత్ నభసఃశబ్దతన్మాత్రయైన ఆకాశమునుండి, స్పర్శఃస్పర్శము, తతఃదానినుండి, వాయుఃవాయువు, అభవత్ఏర్పడినది, త్వక్త్వక్కునది, స్పర్శస్యస్పర్శము యొక్క, సంగ్రహఃజ్ఞానసాధనము,

తాత్పర్యము: కాలము యొక్క ప్రేరణతో రూపాంతరమును పొందిన శబ్దతన్మాత్రయైన ఆకాశమునుండి స్పర్శ మనెడు సూక్ష్మభూత మేర్పడును. దానినుండి వాయువని చెప్ప<బడు స్థూలభూత మైనది. ఈ రీతిగానున్న స్పర్శమును గ్రహించెడు నింద్రియమే చర్మమనునది.

37. మృదుత్వం=మృదుత్వమనెడు ధర్మము, కఠినత్వం=కాఠిన్యమనెడు ధర్మము, శైత్యం=శీతావస్థ, ఉష్ణత్వం=ఉష్ణత్వావస్థ అనెడు, ఏతత్=ఈ, స్పర్శస్య=స్పర్శేంద్రియము యొక్క, స్పర్శత్వం=స్పర్శన భావము, నభస్వతఃవాయువు యొక్క, తన్మాత్రత్వం=సూక్ష్మస్వరూపము,

తాత్పర్యము: మృదుత్వము, కాఠిన్యము, శైత్యము, ఉష్ణత్వము, ఈ విధమైన స్పర్శనముండునది స్పర్శ తన్మాత్రముగానున్న వాయువుతో నేర్పడుచున్నది.

38. ద్రవ్యశబ్దయోఃద్రవ్యముల యొక్కయు శబ్దము యొక్కయు, చాలనం=చలించుట యనెడు కర్మము, వ్యూహనం=సంగమమును, ప్రాప్తిఃప్రాప్తి

ప్రవేశించుటయు, నేతృత్వం= తీసికొనిపోవుట యనుటయు, సర్వేంద్రియాణాం= సమస్తేంద్రియములకును, ఆతృత్వం=బలముండుటను నదియు, వాయోః =వాయువు యొక్క, అభిలక్షణంకర్మ=లక్షణమైన కర్మము.

తాత్పర్యము: వృక్షశాఖాదులు చలించుట అచ్చటచ్చట వేఱువేఱుగా పడియున్న తృణాది లఘుపదార్థముల నొక్కటిగా కుప్పవేయుట, పుష్పాదులందున్న సుగంధమును నాసికా పుటములకు <గొనిపోవుట, దూరమందున్న శబ్దమును కర్ణసమీపమునకు <గొనివచ్చుట, సమస్తేంద్రియములకును బల మేర్పడుట కావశ్యకమైన భక్షణ ద్రవ్యరసమును ఆయా అవయవములకు <గొనిపోవుట మొదలైన కర్మలు బయటను లోపలను జరుగుచుండుటకు కారణము వాయువని పిలువ <బడుచున్న స్థూలభూతము చేతనే ఏర్పడుచున్నది.

39. దైవేరితాత్=దైవముచేత ప్రేరేపింప <బడినట్టి, స్పర్శతన్మాత్రాత్ వాయోః =స్పర్శతన్మాత్రయై యున్న వాయువునుండి, రూపం అభూత్=రూపమేర్పడినది. తతః=దానినుండి, తేజః=తేజస్సు, సముత్థితం=కలిగినది, చక్షుః=నేత్రము, రూపోప లంభనం=రూపమును గ్రహించుచున్న ఇంద్రియము.

తాత్పర్యము: దైవప్రేరితమైనట్టియు, స్పర్శతన్మాత్రయు నైన వాయువు నుండి రూప మేర్పడినది. దానినుండి తేజస్సు కల్గినది. నేత్రము రూపమును గ్రహించెడు నింద్రియము. రూపమనునది సూక్ష్మభూతము. తేజస్సు స్థూల భూతము. దానిని గ్రహించుట కుపకరించెడు నింద్రియము నేత్రము.

40. ద్రవ్యాకృతిత్వం=ద్రవ్యముల కాకృతిని సమర్పించుట అనుగుణమును, గుణతా=గుణములకు ఆస్పదముగా నుండుటయు, వ్యక్తిసంస్థానం=వ్యక్తిరూప మైన ద్రవ్యమునకు ఏవిధమైన స్వరూపమో అట్టి స్వరూపముతో కూడియుండుట. తేజస్త్వం=తేజస్సు కలిగి యుండుటయు అనుటయు, సాధ్వి=ఓ పతివ్రతా! రూపమాత్రస్య=రూపమాత్రము యొక్క, వృత్తయః=లక్షణములు.

తాత్పర్యము: రూపముగానున్న సూక్ష్మభూతము యొక్క లక్షణము చెప్పుచున్నా <డు. ద్రవ్యములకు ఆకృతిని కల్పించుట ఒక గుణము. గుణములకు ద్రవ్యము నందు యోజించుట మరియొక గుణము. ఒక వస్తువు యొక్క సన్నివేశ మేరీతిగానుండునో- అన <గా స్థూలమో, సూక్ష్మమో, చక్రాకృతియో వేరుగానున్నదో - మరేవిధమో ఆవిధముగనే యున్న ప్రతీతిని ద్రవ్యమునందు ప్రకాశింపచేయుట అనగా ఆద్రవ్యమునున్న స్థితిలోనే కన్పింప < జేయుట అనెడు శక్తివిశేషము రూపమాత్రము యొక్క లక్షణము.

41. ద్యోతనం=ప్రకాశింపచేయుట, పచనం=దహించుట, పానం=జలమును త్రావవలెనని తోపింప <జేయుట, అదనం=తినవలెనని తోపింప < జేయుట, హిమమర్దనం=చలినిపో <గొట్టుట, శోషణం=ఎండించుట, క్షుత్=ఆకలి, తృట్=దప్పి, ఏతాః వృత్తయః= ఈ ప్రవృత్తులు, తేజసః= అగ్నినుండి ఏర్పడును.

తాత్పర్యము:తేజస్సు= అగ్ని అనిపిలువ<బడెడు స్థూలభూతము యొక్క లక్షణము ప్రకాశింప<జేయుట, దహించుట, భక్షణము, దాహము, శైత్యమును నశింప<జేయుట, పదార్థవినాశము, పదార్థముల యందలి జలాంశమును ఎండించుట- ఈ కార్యము లన్నియు ఏర్పడుట తేజస్సు యొక్క ప్రవృత్తితోనే. కనుకపైన చెప్పినవి తేజస్సు యొక్క కార్యరూపములు. పైనిచెప్పిన కార్యములకు కారణమగ్ని యని తెలియవలెను. అగ్ని స్థూలభూతము.

42. దైవచోదితాత్=దైవమునుండి ప్రేరేపింప<బడినదై, వికుర్వాణాత్= వికారమును పొందిన, రూపమాత్రాత్=రూపమాత్రమైన, తేజసః= తేజస్సునుండి, రసమాత్రం=రసమనెడు సూక్ష్మభూతము, అభూత్=ఏర్పడినది, తస్మాత్= దానినుండి, అంభః= నీరు, జిహ్వా=నాలుక, రస(గ్రహః= రసమును గ్రహించునది,

తాత్పర్యము: కాలరూపమైన ఈశ్వరుని ఆవేశము కారణముగా రూపాంతరమును పొందిన తేజస్సు నుండి రసమనెడు సూక్ష్మభూత మేర్పడును. దానినుండి జలము గల్గును. రసమును గ్రహించెడు జిహ్వా యనెడు ఇంద్రియముగూడ నేర్పడును.

43. భౌతికానాం=ద్రవ్యముల యొక్క, వికారేణ= వికారము నిమిత్తముగా, ఏకోరసః=ఒకటే విధమైన రసము, విభిద్యతే= అనేక రీతులుగా నగును.

తాత్పర్యము: ఒకటియైన రసము తక్కిన పదార్థములతోడి సంబంధముతో కషాయ మగును, మధుర మగును. తిక్త, కటు, ఆమ్ల స్వరూపములుగా మాఱును. లవణముగా నగును. ఈ రీతిగా ఆఱువిధములగును. మఱిల వీని పరస్పర సంబంధములతో అనేకరీతులుగా నేర్పడును.

44. క్లేదనం=ఆర్ద్రమగుట, పిండనం=పిండమగుట, తృప్తిః=చాలునని పించుట, ప్రాణనం=జీవించుట, ఆప్యాయనం=దుర్బలత తొల<గించుట ఓదనం=మృదు వగుట, తాపాపనోదః=తాపోపశమనము, భూయస్త్వం= అధిక మగుట, ఇమాః వృత్తయః=ఈ వ్యాపారములు, అంభసః=నీటి నుండి ఏర్పడును.

తాత్పర్యము: జలముల లక్షణమును చెప్పుచున్నా<డు. వస్తువులను తడిచేయుట, అనేక వస్తువులను కలిపి ఒక ముద్దగా చేయుట. చాలుననెడు తృప్తిని కలిగించుట, జీవింప<జేయుట, దాహనిమిత్తముగా నేర్పడెడు దుర్బలత్వమును తొల<గించి శక్తినిచ్చుట, మృదువుగా చేయుట, సూర్యోష్ణము నిమిత్తముగా నేర్పడెడు తాపాదులను నశింపచేయుట, కూపాదులను వర్ధింపచేయుట ఇవన్నియు జలస్వభావములు.

45. దైవచోదితాత్=దైవము చేత ప్రేరేపింప<బడి, వికుర్వాణాత్=వికృతిని పొందిన, రసమాత్రాత్ అంభసః=రసమాత్రమైన జలమునుండి, గంధమాత్రం= గంధమనెడు సూక్ష్మభూతము, అభూత్=ఏర్పడినది. తస్మాత్=దానినుండి, పృథ్వీ=భూమి, ఘ్రాణఃతు=నాసిక, గంధగః=గంధము నాఘ్రాణించునది.

తాత్పర్యము: కాలస్వరూపు<డైన ఈశ్వరుని ఆవేశనిమిత్తముగా రసరూపమైన జలము వికారమును ప్రాప్తించును. అప్పుడు దానినుండి గంధమనెడు సూక్ష్మద్రవ్య మేర్పడెను. దానినుండి భూమి కల్గినది. నాసిక గంధమును గ్రహించును.

46. ద్రవ్యావయవ వైషమ్యాత్=ద్రవ్యముల యొక్క అవయవముల సమ్మేళనముతో నేర్పడెడు విషమభావము కారణముగా, ఏకఃగంధఃఒకటే గంధము, విభిద్యతే=భేదింప<బడుచున్నది, కరంభఃసమ్మిశ్ర గంధము, పూతి=దురంధము, సౌరభ్యం=సుగంధము, శాంతఃసంతోషమును కల్గించు గంధము. ఉగ్రే=జుగుప్సాకర గంధము, ఆమాదిభిఃపుల్లగా నుండెడు గంధము.

తాత్పర్యము: ఒక్కడే ఐన గంధము అనేక ద్రవ్యముల సమ్మిశ్రణముతో వాని ధర్మమునంగీకరించినదై కరంభాది భేదముల నందును.

47. బ్రహ్మణఃస్థానం=బ్రహ్మ నుపాసించుటకు తగిన, ఆకృతి కుపకరించుట, స్థానం=సొంతమైన స్థానమందుండుట, ధారణం=ఇతర సాధనములను ధరించుట, సద్ధిశేషణం=ఆకాశాదుల యొక్క అవచ్ఛేదకమై యుండుట, సర్వసత్త్వ గుణోద్భేదఃసర్వప్రాణుల యొక్క గుణములను - అన<గా స్త్రీ పురుష<డు మొదలైన వానిని ప్రకాశింపచేయుటకు తగిన విధముగా పరిణమించుట, పృథివీవృత్తి లక్షణం=భూమియొక్క వ్యాపార చిహ్నము,

తాత్పర్యము: పృథివీ లక్షణమును చెప్పుచున్నా<డు బ్రహ్మభావన కుపకరించెడు మూర్తి భేదములను ప్రతిమాది రూపముతో నిర్మించుటకు సాధనముగా నుండుట, జలాదుల నపేక్షింపక నిలచియుండుట, జలాదుల కాధారమై యుండుట, ఆకాశాది భూతముల యొక్క అవధిని కాన్పింప చేయుట కుపకరించెడు అవచ్ఛేదకమై యుండుట, సర్వప్రాణుల మూర్తి భేదము-అన<గా స్త్రీ పురుష<డు అనెడు ఈ భిన్నాకృతులను ప్రకాశింప చేయుటకు తగినవిధముగా పరిణమించుట- ఈ గుణము లన్నియు పృథ్వీ లక్షణములు. సైన చెప్పిన కార్యరూపములు కల్పించుట పృథివీయను కారణ ద్రవ్యనిమిత్తముగా నని తెలియవలెను.

48. యస్య=దేనియొక్క, నభోగుణ విశేషఃఆకాశము యొక్క అసాధారణ గుణమైన శబ్దము, అర్థఃవిషయమో, తత్=అది శ్రోతం ఉచ్యతే=కర్ణమని పిలువ<బడుచున్నది. యస్య=దేనినుండి, వాయోఃవాయువు యొక్క, గుణవిశేషఃఅసాధారణ గుణమైన స్పర్శము. అర్థఃవిషయమైనదో, తత్=అది, స్పర్శనం=త్వగింద్రియమని, విదుఃతెలిసిరి.

తాత్పర్యము: శ్రోత్రాదులైన ఇంద్రియముల లక్షణమును చెప్పుచున్నా<డు. ఆకాశము యొక్క అసాధారణ లక్షణమైన శబ్దము గ్రహించెడు ఇంద్రియము శ్రోత్రము. వాయువు యొక్క అసాధారణ లక్షణమైన స్పర్శమును గ్రహించెడు ఇంద్రియమునకు త్వక్కని పేరు.

49. తేజోగుణవిశేషః=అగ్నియొక్క అసాధారణ గుణమునకు, అర్థః= విషయము, యస్య=దేనికి సంబంధించినదో, తత్ చక్షుః=అదినేత్రమని, ఉచ్యతే=చెప్ప<బడుచున్నది, అంభోగుణవిశేషః=జలాసాధారణగుణము, యస్య= దేనికి చెందినదో, తత్=దానిని, రసనం=నాలుకయని, విదుః=తెలిసిరి, భూమేః గుణవిశేషః=భూమియొక్క గుణవిశేషము, అర్థః=విషయము, యస్య=దేనికి సంబంధించినదో, తత్=అది, ఘ్రాణం ఉచ్యతే=నాసికయని చెప్ప<బడును.

తాత్పర్యము: తేజస్సు యొక్క అసాధారణ గుణమైన రూపము గ్రహించునది నేత్రేంద్రియము. జలము యొక్క అసాధారణ గుణమైన రసమును గ్రహించునది జిహ్వేంద్రియము. పృథ్వి యొక్క అసాధారణ గుణ మైన గంధమును గ్రహించునది ఘ్రాణము.

50. పరస్య=పరము యొక్క, ధర్మాః= గుణము, అపరస్మిన్= ఇతరమునందు, సమన్వయాత్=సమన్వయము హేతువుగా, దృశ్యతే=చూడ<బడుచున్నది, తతః =అందుచేత, భావానాం=భూతముల యొక్క, విశేషః=గుణము, భూమౌ ఏవ=భూమియందు మాత్రమే, ఉపలక్ష్యతే=చూడ<బడుచున్నది.

తాత్పర్యము: శబ్దాది గుణములు ఆకాశాదుల యొక్క అసాధారణ గుణములని నిర్ణయించుటెట్లు? వాయ్వాదులందు కూడ శబ్దాది ధర్మములు కనిపించు చున్నవికదా? అనుదానికి సమాధానము. ఒక భూతము యొక్క అసాధారణ ధర్మము మరొక్క దానియందును కనపడుచుండుట చేత తమ తమ ధర్మములతో కూడిన గుణములు పరస్పరము చేరియున్నవని తలపవలెను. ఆకాశమునందు శబ్దము మాత్రమే కలదు. వాయువునం దాకాశము చేరియుండుటచేత ఆకాశగుణమైన శబ్దము వాయువు యొక్క ప్రత్యేక లక్షణమైన స్పర్శము ఈ రెండుగుణములును వాయువునం దగుపించును. తేజస్సునందు శబ్దము వాయువు రెండును కలసియున్నవి. అందుచేత శబ్దస్పర్శములు రెండును తేజస్సు యొక్క ప్రత్యేకగుణమైన రూపమును- మూ<డు గుణములు తేజస్సునందు కనపడును. జలమందు ఆకాశవాయు తేజస్సులున్నవి. అందుచే వాని గుణములన్నియు అన<గా శబ్ద స్పర్శరూపములు జలము యొక్క అసాధారణ గుణము రసము జలములం దున్నవి. అన<గా జలమునందు శబ్ద స్పర్శ రూప రసము లున్నవని భావము. భూమియందు ఆకాశము, వాయువు, తేజస్సు, జలము- ఈ నాలుగు భూతములు కలసియున్నవి. కనుక వాని నాలుగుణములు భూమి యందున్నవి. గంధము దాని యసాధారణ గుణము. అందుచేత శబ్ద స్పర్శరూప రసగంధములు పృథివి యొక్క గుణములు. కనుక మొదట మొదట నేర్పడిన భూతముల యొక్క గుణములు తరువాతి తరువాతి వానిలో కలసి యుండునని భావము. అందుచేత శబ్దాది గుణములు ఆకాశాదుల ప్రత్యేక గుణములు. భూతముల పరస్పర

సమన్వయ నిమిత్తముగా ఒకదాని గుణము మఱియొక దానియందు కన్పించు చుండును.

51. మహదాదీని=మహత్తత్త్వమాదియైన, ఏతానిసప్త=ఈయేడును, అసంహత్యయదా=కలిసియుండక యున్నపుడు, కాలకర్మగుణోపేతః=కాలము, కర్మము, గుణములు వీనితో కూడిన, జగదాదిః=ఈశ్వరు<డు, ఉపావిశత్=వీనియందు ప్రవేశించెను.

తాత్పర్యము : కారణోత్పత్తిని వివరించిన పిదప కార్యోత్పత్తిని తెలుపుచున్నా<డు. మహత్తత్త్వము, అహంకారతత్త్వము, పంచభూతములను నీయేడును పరస్పరము చేరకవేరువేరుగా ఉన్నపుడు కాలము, జీవాదృష్టమని పిలువ<బడెడు కర్మము, సత్త్వాదులైన గుణములు, వానితో కూడిన ఈశ్వరు<డు పై చెప్పిన మహదాదులందు ప్రవేశించిరి. ఒంటియొంటిగా నున్నచో కార్య మేర్పడదు. అన్యోన్యసంహతము లైననే కార్య మేర్పడును. అందుచే జగదుత్పత్తి కారణమైన ప్రకృతియందు అంతర్భూతు<డైయున్న ఈశ్వరు< డే జగదుత్పత్తికి కారణ మని చెప్పిన ట్లైనది.

52. తతః=తరువాత, తేన=తన్నిమిత్తముగా, అనివిద్దేభ్యః=క్షోభించి, యుక్తేభ్యః=పరస్పరము కలసిన, తేభ్యః=వాని నుండి, అచేతనం=చేతనముతో కూడనట్టి, అండం=అండాకారము, ఉత్థితం=ఏర్పడినది, యస్మాత్=దేనినుండి, అసౌవిరాట్=ఈ సమష్టి పురుష<డు, ఉదతిష్ఠత్=ఉద్భవించెను.

తాత్పర్యము: ఈశ్వరుని అనుప్రవేశము నిమిత్తముగా పృథగ్భావమును వదలి సప్తపదార్థములు పరస్పరము కలసి కొన్నవి. వానినుండి అచేతనమైన అండ ముద్భవించెను. దానినుండి విరాట్ పురుష< డుదయించినా<డు.

53, 54. విశేషాఖ్యం=విశేషమనెడు పేరుతోకూడిన, అండం=ఈ అండము, బహిః ప్రధానేన=బయట వ్యాపించియున్నట్టియు, దశోత్తరైః=పది పది రెట్టింపుగా, క్రమవృద్ధైః=క్రమముగా వృద్ధిపొందిన, తోయాదిభిః=జలాదులచేత, పరివృతం=చుట్ట<బడినది. యత్ర=దేనియందు, అయంలోక వితానః=ఈలోక విన్యాసము, భగవతః హరేః=భగవంతు<డైన హరియొక్క, రూపం ఆకృతియై యున్నదో,

తాత్పర్యము: ఈ అండమునకు విశేషమని మఱియొక పేరు. దీని పైభాగమందు జలాదులైన సప్త పదార్థములు ఒకదాని తరువాత నొకటిగా రెండింతలుగా నభివృద్ధి చెందినవై వ్యాపించియున్నవి. అన<గా ఒకటి పదియైనచో తక్కినవి దానికి రెండింతలని యర్థము. ఈ అండమే లోకాధిష్ఠానము. దీని ఒక్కొక్క అంశమందును ఒక్కొక్క లోకము నిలిచియుండెను. ఒక్కొక్క లోకమును ప్రత్యేకమైన అప్పులతో కూడియున్నది. గుణములతో కూడియున్నది. ఈ రీతిగ లోకముల గుణములతో భేదించినను ఇవియన్నియు భగవంతుని యాకృతులే.

55. సలిలేశయాత్=జలముల యందున్నదియు, హిరణ్మయాత్=అతి ప్రకాశముతో కూడినదైన, అండకోశాత్=అండకోశము నుండి, ఉత్థాయ=లేచి, తం ఆవిశ్య=దానిని ప్రవేశించి, మహాదేవః=గొప్పవా<డైన భగవంతు<డు, బహుధా= అనేక రీతులుగా, ఖం=ఇంద్రియ ద్వారమును, నిర్భిద=భేదింప చేసెను, అన<గా ఏర్పఱచెనని భావము.

తాత్పర్యము: జలముల యందున్నది, అతి ప్రభావంతమైనది అయిన ఈ అండకోశమందు అంతర్భూతముగా నున్న భగవంతు<డు దానియంద ధివసించినవా<డై ఔదాసీన్యము వదలి, దానియం దనేక ద్వారముల నేర్పఱచును. ఒక్కొక్క ద్వార మొక్కొక్క ఇంద్రియ మైనది.

56. అస్య=ఈ దేవునకు, ప్రథమం=మొదలు, ముఖం నిరభిద్యత=ముఖ మేర్పడెను. తతః=దానినుండి, వాణీ అభవత్=వాక్కేర్పడును, వాణ్యాః=దానితో పాటు, వహ్నిః=అగ్ని, అథో=తరువాత, నాసే=ఘ్రాణరంధ్రము, ఏతయోః =వాని నుండి, ప్రాణోతః=ప్రాణముతో చేరియున్న, ఘ్రాణః=ఘ్రాణమైనది.

తాత్పర్యము: ఇది మొదలు ఎనిమిది శ్లోకములలో ఇంద్రియము లేర్పడిన విధమును చెప్పుచున్నా<డు. విరాట్పు రుషునకు మొదలు ముఖమేర్పడెను. దానినుండి వాగింద్రియము కలిగెను. దానితో పాటు అధిష్ఠానమైన వహ్నికలిగెను. తరువాత నాసికా లేర్పడినవి. ఆ రెండు ద్వారములనుండి ప్రాణముతో కూడిన ఘ్రాణమనెడు ఇంద్రియము కల్గినది.

57. ఘ్రాణాత్=ఘ్రాణము నుండి, వాయుః=వాయువయ్యెను, అక్షిణీ= కన్నులు, ఏతయోః=ఆరెండు ద్వారముల నుండి, చక్షుః=నేత్రమనెడు నింద్రియము, తస్మాత్=దానినుండి, సూర్యః=సూర్యు<డు, కర్ణౌ=చెవులు, అభిద్యేతాం=చీలెను. తతః=ఆద్వారముల నుండి, శ్రోత్రం=శ్రోత్రమనెడు నింద్రియమును, దిశః=దిక్కులును.

తాత్పర్యము: ఘ్రాణేంద్రియమునుండి వాయు వేర్పడెను. తరువాత నేత్రములు. ఆ రెండు ద్వారములకు నేత్రేంద్రియ మనిపేరు. వానినుండి సూర్యు<డు కలెను. తరువాత కర్ణద్వారము లనెడు వానినుండి శ్రోత్రమనెడు నింద్రియమును, దిక్కులును కల్గెను.

58. తతః=తరువాత, విరాజః=విరాట్పురుషునకు, త్వక్=చర్మమనెడు అధిష్ఠానము, నిర్భిద=భేదింప<బడినది, తతః రోమశ్మ శ్రూదయః=రోమము, శ్మశ్రువులు మొదలైనవి. తతః ఔషధయశ్చ=ఓషధులు, ఆసన్=ఏర్పడినవి. తతః శిశ్నం=ఆతరువాత శిశ్నము.

తాత్పర్యము: విరాట్పురుషునకు త్వక్కనెడు అధిష్ఠాన మేర్పడెను. దానినుండి శరీర రోమములు, ముఖరోమములు మొదలైనవి కల్గెను.

59. తస్మాత్రేతః=దానినుండి వీర్యము, అపః ఆసన్=జల మేర్పడెను. గుదం నిరభిద్యత=గుదద్వారము కల్గినది. గుదాదపానః=గుదమునుండి

అపానవాయువు, అపానాత్ లోకభయంకరః మృత్యుఃఅపానమునుండి లోకమునకు భయము కల్గించు మరణాధి ష్ఠానదేవత ఏర్పడెను.

తాత్పర్యము: శిశ్నము నుండి రేతస్సు, దానినుండి జలము, తరువాత గుదద్వార మేర్పడెను. దానినుండి అపానము. దానినుండి లోకభయంకరమైన మృత్యువు.

60. హస్తౌనిరభిద్యేతాం=హస్తములు గల్గెను, తాభ్యాం=వానినుండి, బలం=బలము. తతః స్వరాట్=దానినుండి స్వరాట్ అనెడు అధికు<డేర్పడినా<డు. పాదౌచ=రెండుకాళ్ళు, నిరభిద్యేతాం=ఏర్పడినవి. తాభ్యాం గతిఃవానినుండి గమనము, తతఃదాని నుండి, హరిఃవిష్ణు వేర్పడెను.

తాత్పర్యము: తరువాత హస్తము లయ్యెను. వానినుండి బలమని పిలువ<బడెడు ఇంద్రియము కల్గెను. దానినుండి ఇంద్రు<డనెడు హస్తాధిష్ఠాన దేవత ఏర్పడినా<డు. తరువాత పాదములు. వానితో గతి ఏర్పడినది. విష్ణువు పాదాధిష్ఠాన దేవత.

61. అస్య=ఈ విరాట్పురుషునకు, నాడ్యఃనిరభిద్యంత=నాడు లేర్పడెను. తాభ్యఃలోహితం=వానినుండి ఇంద్రియస్థానమైన రక్తము, ఆభృతం =పూర్ణముగానైనది తతఃదానినుండి, నద్యఃనదీదేవతలు, సమభవన్=కల్గిరి, ఉదరంనిరభిద్యత=ఉదరము కల్గెను.

తాత్పర్యము : తరువాత ఈ విరాట్పురుషునకు నాడు లేర్పడినవి. వానినుండి రక్తమనెడు ఇంద్రియము. వానినుండి నద్యధిష్ఠాన దేవతలు. తరువాత ఉదర మనెడు అధిష్ఠాన ముద్భవించినది.

62. తతఃదానినుండి, క్షుత్పిపాసేఆకలి దప్పులు, స్యాతాం=ఏర్పడినవి. ఏతయోస్తుఆరెంటినుండి, సముద్రఃసముద్రము, అభూత్=ఏర్పడెను. అథఅస్యతరువాత అతని యొక్క, హృదయంభిన్నం=హృదయమనెడు స్థాన మేర్పడెను. హృదయాత్=హృదయమునుండి, మన ఉత్థితం=మనస్సేర్పడినది.

తాత్పర్యము: ఉదరమునుండి ఆకలి దప్పులు కల్గెను. వానినుండి సముద్ర ముద్భవించినది. పిదప హృదయము కూడ నేర్పడెను. దానినుండి మనస్సు కల్గెను.

63. మనసఃమనస్సునుండి, చంద్రమాఃజాతఃచంద్రుడు పుట్టెను. బుద్ధిఃబుద్ధిఏర్పడినది. బుద్ధేఃబుద్ధినుండి, గిరాంపతిఃబ్రహ్మ ఏర్పడెను, తతఃఆహృదయము నుండి, అహంకారఃనేననెడు భావము, జాతఃకల్గెను. రుద్రఃరుద్రు<డేర్పడెను. చిత్తం=చిత్తము కల్గినది, తతఃదానినుండి, చైత్యఃజీవు<డు, అభవత్=కల్గెను.

తాత్పర్యము: మనస్సునుండి చంద్రుడు పుట్టెను. ఆ పిదప హృదయము నుండి బుద్ధి కలెను. బుద్ధి వలన తదధిష్ఠాతయైన బ్రహ్మ కలెను. అంతేకాదు హృదయము నుండి అహంకారమేర్పడినది. దానినుండి అహంకార మేర్పడినది. మరల హృదయము నుండి చిత్తము పుట్టెను. దానినుండి క్షేత్రజ్ఞుడని పిలువబడిన జీవుడుద్భవించినాడు.

64. అభ్యుత్థితాః ఏతేదేవాఃఉద్భవించిన ఈ దేవతలు, అస్య ఉత్థాపనే=తదుత్థాపనము నందు, న ఏవ అశక్నన్=శక్తులు కాకపోయిరి, పునఃమరల, తముత్థాపయితుం=వానిని లేపుటకు, క్రమాత్=క్రమముగా, ఖాని=స్వస్థానములైన ఇంద్రియములందు, అవివిశుఃప్రవేశించిరి.

తాత్పర్యము: ఈ రీతిగా ఉద్భవించిన దేవత లెవ్వరు విరాట్పురుషుని లేపుటకు సమర్థులు కాలేదు. ఐనను ఆ మహాపురుషుని లేపుటకై క్రమముగా వారివారి అధిష్ఠానము లందు వసించిరి.

65. వహ్నిఃఅగ్ని, వాచా=వాక్కుతో కూడా ముఖంభేజే=ముఖము నాశ్రయించెను. తదాఅప్పుడు, విరాట్=విర్వాట్పురుషుడును ఉదతిష్ఠత్=ఉత్థాన మొనర్పలేదు, వాయుఃవాయువు, ఘ్రాణేన=నాసికతో కూడ, నాసికే=నాసికారంధ్రముల నాశ్రయించెను.

తాత్పర్యము: ఉత్థితులైన దేవతలు వారి వారి అధిష్ఠానములందు వసించుటనే స్పష్టపఱచుచున్నాడు. ముఖమనెడు అధిష్ఠానమునాశ్రయించియున్న వాక్కనెడు ఇంద్రియమందు వహ్నివసించెను. అయినను విరాట్పురుషుని లేపుటకు సమర్థుడు కాలేదు. నాసికయనెడు అధిష్ఠానమును ఘ్రాణమనెడు ఇంద్రియము నాశ్రయించి వాయువు వెలసెను. కాని విరాట్పురుషుడు లేవలేదు.

66. ఆదిత్యఃసూర్యుడు, చక్షుషానేత్రమనెడు ఇంద్రియముతో కూడ, అక్షిణీనేత్రగోళముల నాశ్రయించెను. దిశఃదిక్కులనెడు దేవతలు, శ్రోత్రేచశ్రోత్రమనెడు ఇంద్రియముతో పాటు కర్ణౌచెవుల నాశ్రయించెను.

తాత్పర్యము: సూర్యుడు నేత్రేంద్రియము నాశ్రయించి కన్నులనెడు అధిష్ఠానమందు వసించెను. విరాట్పురుషుడు లేవలేదు. దిక్కులనెడు దేవతలు శ్రోత్రమనెడు ఇంద్రియమందధివసించి కర్ణపుటము చేరెను. కాని లాభము లేదు.

67. ఓషధ్యఃఓషధీలతలకు చెందిన దేవతలు, రోమభిఃరోమములతో, త్వచంచర్మమనెడు ఇంద్రియము నాశ్రయించెను. అపస్తుజలాధి దేవత, రేతసావీర్యముతో, శిశ్నంజననేంద్రియము నాశ్రయించెను.

తాత్పర్యము: ఓషధులు రోమములతో పాటు చర్మమనెడు నధిష్ఠానమందు వసించెను. ప్రయోజనము శూన్యము. జలము రేతస్సుతో కూడ శిశ్నమనెడు అధిష్ఠానమును చేరెను. కానీ విరాట్పురుషుడు లేవలేదు.

68. మృత్యుఃమరణాధిష్ఠాన దేవత, అపానేన=అపానముతో, గుదం=విసర్జనేంద్రియము నాశ్రయించెను, ఇంద్రఃఇంద్రుడు, దేవతాధి నాయకుడు, బలేన=బలముతో, హస్తౌ=చేతుల నాశ్రయించినాడు.

తాత్పర్యము: మృత్యువు అపానముతో కూడ గుదమున వసించెను. అది తదధిష్ఠానము. లాభము లేకపోయెను. ఇంద్రుడు, దేవతాధి నాయకుడు, బలేన=బలముతో, హస్తౌ=చేతుల నాశ్రయించినాడు.

తాత్పర్యము: మృత్యువు అపానముతో కూడి గుదమున వసించెను. అది తదధిష్ఠానము. లాభము లేకపోయెను. ఇంద్రుడు బలము నాశ్రయించి హస్తములందు చేరెను. కాని విరాట్పురుషుడు లేవ లేదు.

69. విష్ణుఃవిష్ణువు, గత్యాఏవ=గమనముతో కూడి, చరణౌ=పాదముల నాశ్రయించినాడు, నద్యఃనదులు, లోహితేన=రక్తముతో కూడ, నాడీఃనాడుల నాశ్రయించినాడు.

తాత్పర్యము: విష్ణువు గతితో పాటు చరణముల నాశ్రయించినాడు. అప్పుడుకూడ పురుషుడు కదలలేదు. నదులు రక్తముతో పాటు నాసికలందు ప్రవేశించెను. కాని దైవము లేవలేదు.

70. సింధుఃసముద్రాధి దేవత, క్షుత్తృడ్భ్యాం=ఆకలి దప్పులతో, ఉదరం=ఉదరము నాశ్రయించినది. చంద్రఃచంద్రుడు, మనసా=మనస్సుతో, హృదయం=హృదయము నాశ్రయించినాడు.

తాత్పర్యము: క్షుత్పిపాసలతో సముద్రము ఉదరమును ప్రవేశించినది. విరాట్పురుషుడు చలింపలేదు. చంద్రుడు మనస్సుతో హృదయమున ప్రవేశించినాడు లాభములేదు.

71. బ్రహ్మా అపి=బ్రహ్మదేవుడు కూడ బుద్ధ్యా=బుద్ధితో, హృదయం=హృదయము నాశ్రయించెను. రుద్రఃరుద్రుడు, అభిమత్యా=అభిమానముతో కూడ, హృదయం=హృదయ మాశ్రయించినాడు.

తాత్పర్యము: బ్రహ్మ బుద్ధితో కూడి హృదయమున నధివసించెను. పురుషుడు కదలలేదు. రుద్రుడు సాభిమానుడై హృదయమున ప్రవేశించినాడు ఫలము శూన్యము.

72. చైత్యఃక్షేత్రజ్ఞఃచేతన స్వరూపుడైన జీవుడు, చిత్తేన=చిత్తముతో పాటు, హృదయం=హృదయమును, యదా ప్రావిశత్=ఎప్పుడు ప్రవేశించెనో, తదాఏవ=అప్పుడే, విరాట్పురుషఃసమష్టి పురుషుడు, సలిలాత్ ఉదతిష్ఠత=జలమునుండి లేచిన వాడయ్యెను.

తాత్పర్యము: క్షేత్రజ్ఞ<డై, చేతన స్వరూపియైన జీవు<డు తనశక్తి చేత ఏర్పడిన చిత్తమనెడు ఇంద్రియముతో కూడ స్వాధిష్ఠానమైన ఇంద్రియము నెపుడు ప్రవేశించెనో, అప్పుడే విరాట్పురుషు<డు జలమునుండి అభ్యుత్థిత<డైనా<డు. తరువాత నొనర్చ<దగిన కార్యములందు జాగరూకు< డైనా<డు.

73. ప్రసుప్తం పురుషం=దృఢనిద్ర అనుభవించుచున్న పురుషుని, ప్రాణేంద్రియమనోధియఃప్రాణము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి అనునవి ఇవి, యేనవినా=ఎవరిచేత, జీవునిచేత చేరక, ఓజసా=తమసామర్థ్యముచేత, ఉత్థాపయితుం=విరాట్పురుషుని లేపుటకు, యథాన ప్రభవంతి=సమర్థములు కానియట్లుగా ఉండెను.

తాత్పర్యము: నిద్రించుచున్న ఒకానొక మనుష్యుని - జీవునితో చేరకయున్న ప్రాణము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఇవి తమ తమ బలముచేత నిద్రనుండి లేపుటకు సాధ్యము కాదో అట్లే విరాట్పురుషుని కూడ వాగాదికములైన ఇంద్రియములతో కూడ చేరియున్న వహ్న్యాదులైన దేవతలును లేపుటకు సమర్థులు కాకపోయిరి. క్షేత్రజ్ఞ<డు. అన<గా సమష్టిజీవు<డు ఎప్పుడు ప్రవేశించెనో అప్పుడే ఉత్థాన మేర్పడెను. కనుక జీవునకే ప్రాధాన్యము. తక్కిన దేవతలకు లేదని గ్రహింపవలెను.

74. భక్త్యా=భక్తితో, విరక్త్యా=విషయ వైరాగ్యముతో, జ్ఞానేన=వివేకముతో, యోగప్రవృత్తయా=అష్టాంగ యోగములనుండి ఏర్పడెడు, ధియా=బుద్ధివృత్తితో, యస్మిన్ ఆత్మని=ఈ శరీర మందు, ప్రత్యగాత్మానం తం=ప్రత్యగాత్మ యనిపించు కొనెడు ఆ చైతన్యమును, వివిచ్య=వేర్పఱచి, చింతయేత్= చింతింపవలెను.

తాత్పర్యము: అన్వయ వ్యతిరేక ముఖముతో విచారించినప్పుడు చైతన్యమే ప్రధాన మగును. ఈ ప్రకరణముతో ఈ విషయము స్పష్టమైనది. కనుక ఆ చైతన్యమే భక్త్యాది సాధన సంపన్ను<డైన పురుషు<డు. ప్రయత్నించి తెలిసి కొనవలెనని కపిలు<డుపదేశించుచున్నా<డు. ప్రకృతి సంబంధము లేకయున్న ఆప్రత్యగాత్మను అష్టాంగయోగాభ్యాస బలముచేత సిద్ధించెడు బుద్ధి వృత్తితో ప్రకృతి కార్యములైన ఇంద్రియాదుల నుండి వేర్పఱచి తెలియవలెను. ప్రకృతి కార్యములైన ఇంద్రియములు, జీవు<డు ఈశ్వరు<డు వీరి స్వరూపము చక్కగా విచారించినపుడు సిద్ధించెడు ప్రత్యగభిన్న జ్ఞానము సంపాదించుకొనవలెను. అజ్ఞానము ఏర్పడుటకు విషయములనుండి విరక్తుడు గావలెను. దానితో భగవద్భక్తి చేరవలెను. ఇట్లుభక్త్యాది సాధన సంపత్తిద్వారా కార్యకారణ సంఘాతాత్మకమైన ఈశ్వరుని యందు ఆత్మసాక్షాత్కార మేర్పడుటకు పరిశ్రమించుటయే పరమపురుషార్థము. ఇది ఈ యధ్యాయమున సమష్టిగా నుపదేశింప<బడిన జాన విధానము.

విజయధ్వజ వ్యాఖ్య

1. ప్రసంఖ్యాయాన తత్త్వానాం=అని చెప్పిన దాని యొక్క విస్తారమును ఈ అధ్యాయమందు తెలుపుచున్నా<డు. అథ=భక్తి లక్షణము తెలిపిన తరువాత, యత్=ఏ తత్త్వముల లక్షణమును, విదిత్వా, పురుషః=అధికారియైన చేతను<డు, ప్రాకృతైఃప్రకృతి సంబంధములైన, గుణైఃసత్త్వాది గుణములచేత, విముచ్యేత, తత్=అట్టి, తత్త్వానాం=అవ్యక్తము మొదలైన తత్త్వముల యొక్క పృథక్-వేఱు వేఱు, లక్షణం, తే సంప్రవక్ష్యామి. దీనిచేత తత్త్వలక్షణ జ్ఞానము పురుషార్థమున కుపయోగించు నని చెప్పినట్లైనది.

2. పరమాత్మ జ్ఞానము మోక్షసాధనము అనుటలో సందేహము లేదని సిద్ధమైనది. ఇట్లున్నప్పుడు తత్త్వలక్షణజ్ఞానము మోక్ష సాధనమగునెట్లని ఆశంకించుకొని తత్త్వలక్షణ జ్ఞానము పరమాత్మ జ్ఞానము కంటె వేఱైనదికాదని కాదు. తత్త్వములకు పరమాత్మయే ముఖ్యకారణము అగుటచేత పరమాత్మ జ్ఞానమునే వర్ణించుచున్నానని ప్రతిజ్ఞచేయుచున్నా<డు. యత్ =ఏ, ఆత్మదర్శనం=పరమాత్మను తోపింప<జేయు జ్ఞానము, పురుషస్య= ముముక్షువైన అధికారికి, నిశ్శ్రేయసాయ= మోక్షమనెడు ప్రయోజనమునకు (భవతి) ఇతి ఆహుఃతత్=అట్టి, హృదయగ్రంథి భేదనం= సంసారబంధమును పో<గొట్టునట్టి జ్ఞానమును, తేవర్ణయే.

3, 4 ఏ జ్ఞానము సంసారబంధమును తొల<గించునో ఆ జ్ఞానమును ఏగుణవిశిష్టముగా తెలిసినచో ఆ కార్యమందు సమర్థమగునో చెప్పుచున్నా<డు. యుఃఎవ<డు, అనాదిఃఆద్యంతములు లేనివా<డో (2) కారణమే లేనివా<డో, ఆత్మా=విజ్ఞానాది గుణరాశియో, పురుషఃపూర్ణమైన ఆనందమును ఇచ్చు<వాడో (2) అంతర్యామియో, నిర్గుణఃసత్త్వాది ప్రాకృత గుణములు లేనివా<డో, ప్రకృతేఃచేతన ప్రకృతి యైన లక్ష్మీదేవి కంటెను, పరఃఉత్తము<డో, ప్రత్యగ్ధామా=అభిముఖమైన కమలమనెడు, (సమస్తలోకముల యొక్క) గృహముకలవా<డో, స్వయంజ్యోతిఃతన ప్రకాశము చేతనే ప్రకాశించువా<డో, యేన=ఎవని చేత, విశ్వం=స్థావర జంగమ మనిపించుకొనెడు సమస్తలోకమును, సమన్వితం=వ్యాప్తమైనిదో, సఃఆత్మా=ఆ పరమాత్మ, నజాయతేఃపుట్టినవా<డుకాదు. నమ్రియతేఃనశించువా<డు కాదు. హిఃఇది శ్రుతిస్మృతి ప్రసిద్ధము. యుక్తియుక్తమైన శ్రుతికూడ ప్రబలమనెడు నభిప్రాయముతో కైముత్యన్యాయముతో యుక్తిని చెప్పుచున్నా<డు. "తదీక్షితా దేహాదులు తన కంటెనుభిన్నమైనవని తెలిసిన వా<డైనను, నిమిత్తైఃభ్రాంతికారణములైన, దేహాద్యుపాధిభిఃదేహాది కారణములచేత (ఉపాధుల చేత) ఆత్తధర్మాన్=దేహధర్మములైన జనన మరణాదులను తనవని భావించిన, అయం అపిఈ జీవు<డు కూడ స్వరూపముతో జనింప<డు, నశింప<డు, అయినను, తదీక్షితాస్వప్నమును చూచువా<డు, యథాఎట్లు, స్వప్నేస్వప్నమందు, వాసనా మయమైన

శరీరమును, పుట్టిచచ్చుటను జూచి (జాగ్రదవస్థయందు< జూచిన, విన్న జన్మ మరణముల సంస్కారము చేత) తన యొక్క స్థూల శరీరమందు దానిని భ్రాంతితో చూచునో, అట్టి దేహమే ఆత్మయను భ్రాంతితో (అభిమానముతో) తనయందు జన్మ మరణములను చూచును. నిజమున కవి జీవుని యందు లేవు. జీవుని స్థితియే ఇట్లున్నపుడు (సర్వజ్ఞ<డు,) స్వతంత్ర<డు, ప్రాకృతదేహరహిత<డు, అజ్ఞానాది దోషహీన<డు, జీవ విలక్షణ<డును అయిన శ్రీహరి జన్మమరణములు లేనివా<డనుట స్థిరమగు చుండ<గా మరల "నజాయతే నమ్రియతే" అని చెప్పుట" అజ ఆత్మామహాన్ శ్రుతః" నజాయంతేంద్రియతేవా తథాహి" మొదలైన శ్రుతిస్మృతులు ఈ విషయ మందు ప్రమాణ మని తెలుపుటకు

"పరస్య జన్మ మృత్యాద్యాః స్యుః స్వతంత్రస్య కింపునః,
జీవస్యాపి యతో భ్రాంతిః జన్మ మృత్యాది సంగతిః.

అను ప్రమాణము వలన జీవన జనన మరణములే భ్రాంతి వంతము లైనపుడు సర్వోత్తముడైన శ్రీహరికి జనన మరణములు భ్రాంతి సిద్ధము లని వేఱుగా చెప్పుటెందుకు? ఎప్పుడును శ్రీహరికి జనన మరణము లుండ వని తాత్పర్యము.

తాత్పర్యము: మనుపుత్రీ! భక్తి లక్షణము తెలిసెనుగదా! ఇప్పుడు తత్త్వముల ప్రత్యేక లక్షణములను చెప్పుచున్నాను వినుము. వానిని తెలిసినచో అధికారియైన చేతను<డు ప్రాకృతగుణములనుండి ముక్తు<డగును. ఆత్మయనిపించుకొన్న శ్రీహరిని గూర్చిన సాధనము ముక్తి సాధనముకదా! సంసార బంధమును పో<గొట్టెడు ఆ పరమాత్మ జ్ఞానమునే ఈ తత్త్వముల మూలముగా స్పష్టముగా వివరించుచున్నాము. తత్త్వములకు వా<డు కారణ మగుటచేత వానిని తెలియనిచో తత్త్వలక్షణములు కూడ చక్కగా తెలియవు. శ్రీహరి ఆద్యంతములు లేనివా<డు. కారణ రహిత<డు. విజ్ఞాన స్వరూప<డు. పూర్ణమైన ఆనందము నొస<గువా<డు అంతర్యామి. ప్రాకృతగుణ రహిత<డు. చేతన ప్రకృతి యనిపించుకొన్న లక్ష్మికంటె నుత్తము<డు. సర్వలోకాశ్రయమైన కమలము అభిముఖముగా కలవా<డు. స్వప్రకాశ<డు. ఈ సమస్త ప్రపంచమందు వ్యాపించినవా<డు. జనన మరణములు లేనివా<డు. ఇట్టని శ్రుతి స్మృతులు చెప్పును. జీవునకే స్వరూపతః జన్మ మరణములు లేనపుడు శ్రీహరి కెట్లుండును. జీవు<డు దేహము తన కన్న భిన్నమని తెలిసిన వా<డైనను ఆ దేహనిమిత్తముగా దేహధర్మములైన జన్మ మరణములు తన వనెడు భ్రాంతికి లో<బడు స్వప్నమందు వాసనామయమైన శరీరమున కేర్పడిన జన్మ మరణములను తన స్థూల శరీరము యొక్క పుట్టుచావులని స్వప్నమును చూచువా<డు భ్రాంతితో తెలియునట్లు జీవు<డు దేహధర్మములను తన స్వరూప ధర్మములని భావించును. దేహమే ఆత్మయను భ్రాంతితో

ఇవి ఏర్పడును. జీవుని నితియే ఇట్టి దైనపుడు సర్వజ్ఞు<డు, స్వతంత్రు<డును. అప్రాకృతు<డు, అజ్ఞానాది దోషరహితు<డునైన శ్రీహరి జీవునికంటె అత్యంతము విలక్షణమైన వా<డని చావుపుట్టువులు లేనివా<ని వేఱుగా చెప్పవలెనా?

5. జీవుడు పరతంత్రు<డు. శ్రీహరి స్వతంత్రు<డు. ఇది వారిరువురకు<గల వైలక్షణ్యము. దీనిని నిరూపించుటకు జగత్సృష్టి మొదలైన శ్రీహరి మహిమను తెలుపుట మూలముగా జీవు<డు శ్రీహరి కధీనుఁ<డని, ప్రకృతి బద్ధ<డనియు చెప్ప<దొడ<గుచున్నా<డు. ఎవ<డు అనాదిత్వాది గుణసంయుక్త<డో, జన్మాది రహితు<డో, కర్మానుగుణముగా పుట్టిచచ్చెడి దేహముతో కూడిన జీవునికంటె అత్యంతభిన్న<డో, సః ఏవ=అశ్రీహరియే, విభుస్సన్=సర్వగత<డై, సూక్ష్మాం=అణువైన, దైవీం=క్రీడాది గుణములు గల, దేవ<డనిపించుకొన్న విష్ణు సంబంధినియైన గుణమయీం=సత్త్వాదుల కభిమానినియైన, యదృచ్ఛయా=శ్రీహరి యొక్క ఇచ్ఛచేత, ఉపగతాం=ఎప్పుడును సమీప మందుండెడి, ప్రకృతిం=చేతన ప్రకృతి యనిపించుకొన్న లక్ష్మిని (జడ ప్రకృతిని కూడ) లీలయా=తన ప్రయోజనమేమియు లేక కేవల క్రీడార్థముగా, అభ్యపద్యత=చేరెను. (సృష్టి నారంభించినట్లు ప్రేరేపించును) ప్రకృతి యనుటతో జడ ప్రకృతి, చేతనప్రకృతి ఈరెంటిని కూడ గ్రహింపవలెను. లక్ష్మిని సృష్టికై ప్రేరేపించును. జడ ప్రకృతిని తనలోని పరిణామ శక్తిని వ్యక్తమొనర్చునట్లు చేయును. ఇదియే విష్ణువు ప్రకృతితో చేరుటతో కలిగెడు కార్యము. అందుచేతనే విభుః-- అనెడు పద ముపయోగించెను. ఈ రెండు పనులతో శ్రీహరి కే ప్రయోజనము లేదని 'లీలయా' అనుటతో నెఱి<గించుచున్నా<డు.

తాత్పర్యము: పైన చెప్పిన లక్షణములచేత కూడిన శ్రీహరియే తన సమీపమందే నిరంతరము ఉన్నటియు, అణు వనిపించుకొని క్రీడాది గుణములతో చేరిన చేతన ప్రకృతియైన లక్ష్మితో లీలార్థమై సృష్టింప<దొడ<గునట్లు ప్రేరేచును. అట్టి సూక్ష్మమైన జడ ప్రకృతిని దాని యందున్న పరిణామశక్తిని వ్యక్త పఱచుటతో దానితో చేరు ఈ చేతన ప్రకృతి యనిపించుకొన్న లక్ష్మీదేవియు శ్రీహరి ప్రేరణననుసరించియు, సత్త్వరజస్తమస్సు లతో కూడిన యాలక్ష్మి అనేక జీవులను, ఇంద్రియాదులను పొంది సమాన రూపులను సృష్టించుచు వచ్చెను. అన<గా దేహ సంబంధముండున ట్లొనర్చెను. సంసారావస్థయందు జీవుల జ్ఞానమును గుప్తముగా నుంపవలెనని ఇచ్చచే శ్రీహరి వెంటనే వారి జ్ఞానమునే మూసిపెట్టు ప్రకృతి మూలకముగా జీవులను మోహింపచేసినా<డు.

6. ప్రకృతితో చేరిన తరువాత నేమయ్యెనో తెల్పుచున్నా<డు. గుణైః=శ్రీహరి ప్రేరణతో సత్త్వాది గుణముల చేత, విచిత్రాః=సాత్త్వికాది భేదములతో ననేక రీతులుగా, సరూపాః=కాళ్ళుచేతులు మొదలగు వానిని పొంది సమాన రూపములు గలిగిన, ప్రజాః=జీవులను, సృజతీం=సృష్టించెడు, ప్రకృతిం=చేతన ప్రకృతిని, విలోక్య, సః=శ్రీహరి, ఇహ=సంసారమందు, జ్ఞానగూహయా=

జీవన జ్ఞానమును ఆవరించి కొనవలెనను ఇచ్ఛచేత లేక జీవనమును మూసి వేయుడు ప్రకృతితో, సద్యఃవెంటనే, తంముముహే=ఆ జీవులను మోహింపచేసేను. "తజ్ఞేతన్మే విజానీహీ=దానిని నాకు తెలుపుము. కృత్వా వివాహం కురుప్రవీర=కురువరులు వివాహ మొనర్చినవారై" ఇత్యాది ప్రయోగము లందున్నట్లే ఇచ్ఛటకూడ నిజారమందు ముముహే అని ప్రయోగించినాఁడని తెలియవలెను. అట్లుకానిచో శ్రీహరియే మోహమందెనను అర్థమేర్పడి" సదానిరస్తకుహకం" అనుమాట దోషజుష్ట మగును. యోజయామాస" అని చెప్పక ముముహే అని చెప్పుట శ్రీహరి యొక్క స్వాతంత్ర్యమును ప్రకటీక రించుటకేయని భావము.

"యత్ర కారయితా జీవః స్వతంత్ర స్తత్ర కర్తృతా,
ప్రోచ్యతే తు యథా బ్రహ్మత్వజ్ఞ సంసార భాగితి.

చేయించెడు వాఁడెక్కువ స్వతంత్రుఁడైనపుడు ఆ అర్థమును తెలుపుటకు కర్తరి ప్రయోగమునే తెలుపుదురు. "బ్రహ్మము అజ్ఞానియై సంసారమును పొందెను. అజ్ఞానులనొనర్చి సంసారమును పొందించెనను నర్థమందీ ప్రయోగమున్నది. క్రిందీ శ్లోకమందు ప్రకృతి ఎప్పుడును సమీపమందే యుండునని చెప్పినాము. దానికి ప్రమాణము.

లయే వాప్యథవాసృష్టౌ అంతరాళేఽపి న క్వచిత్,
ప్రకృత్యా రహితం బ్రహ్మ కదాచి దవతిష్ఠతే.

లయ మందు, సృష్టియందు, మధ్యకాలమందు, ఎప్పుడుకూడ ప్రకృతి లేక శ్రీహరి యుండఁడు. వీనిచేత 'సదోపగతాం' అను దానిని వివరించినట్లైనది.

7. జీవుని జ్ఞానము నావరించిన దానికి ప్రయోజనమును చెప్పుచున్నాఁడు. - ఏవం=ఇట్లు, పరాభిధ్యానేన=సర్వోత్తముఁడైన శ్రీహరి ఇచ్ఛతో, పుమాన్=జీవుఁడు, ప్రకృతేః=ప్రకృతి నుండి, గుణైఃసత్త్వాది గుణములనుండి, కర్మసు=సాత్త్వికాది కర్మలు, క్రియమాణేషుసత్సు=చేయఁబడిన వగుచుండఁగా, ప్రకృతేః కర్తృత్వం=ప్రకృతి యొక్క కర్తృత్వమును, ఆత్మని=తనయందు, మన్యతే=ఆరోపించుకొనుచున్నాఁడు. నేనే చేయుటయను స్వతంత్రుఁడైన కర్తయను కొనుచున్నాఁడు. తాన స్వతంత్రుఁడైన కర్తయనుట మఱచిపోవు చున్నాఁడు.

8. స్వతంత్ర కర్తృత్వాభిమానము యొక్క ఫలమును చెప్పుచున్నాఁడు. తత్=తన యందు లేనట్టి, స్వతంత్ర కర్తృత్వము నారోపించుకొని భ్రాంతుఁడగుటచే, అస్య=ఈ జీవునకు, అకర్తుఃకేశము లేక కార్యముల నొనర్చెడినట్టి (2) తన ప్రయోజనమునకై కార్యముల నొనర్చనట్టి, సాక్షిణఃపుణ్యపాపములను సాక్షాత్తుగా విలోకించెడు, నిర్వ్యాకృతాత్మనఃపరమానంద స్వరూపుఁడైన ఈశ్వరుని యొక్క (సకాశాత్=నియామకుఁడైన శ్రీహరి వలన) సంసృతిఃసంసారరూపమైన, బంధఃబంధము, తత్కృతం=ఆ బంధనఫలముగా, పారతంత్ర్యంచ=తనకంటె నీచులైన వారి యధీనమందుండుటయు, భవఏర్పడును. ఇచ్ఛట పారతంత్ర్య

మనఁగా అస్వతంత్రత అని అర్థమును చేయరాదు. శ్రీహరి యొక్కఁడు తప్ప తక్కినవారందరును స్వరూపతః అస్వతంత్రులే. ఇది భ్రాంతి జ్ఞానము యొక్క ఫలముకాదు. అందువలన భ్రాంతి జ్ఞానము యొక్క ఫలముగా వచ్చిన పారతంత్ర్యమునకు తనకంటె నీచులైన వారి యధీన మందుండుట అని యర్థ మొనర్పవలెను. దీనికి ప్రమాణము.

విష్ణోః సురాణాంగురూణాం నిత్యాజీవస్య తంత్రతా,
యత్తు తస్యాన్య తంత్రత్వం తత్ జ్ఞానా ద్వినివర్తతే.

జీవులకు విష్ణువు - దేవతలు - మరియు స్రోక్తములు వీరి కధీనమై యుండుట నిత్యము వీరి కంటె భిన్నులైన జీవులయధీనత ఏది కలదో అది మాత్రము విష్ణ్వాదులు జ్ఞానముతో పోవును. అనఁగా అది మాత్రమే అనిత్యమని యర్థము. శ్రీహరి "అకృష్టత్వాత్ అకర్తా స్యాత్ అకార్యత్వాదధాపి వా" అనెడు ప్రమాణము వలె పైన చెప్పిన యర్థములో అకర్త యనిపించుకొనును. "ఏష కర్తాన ద్రయతే కారణం చ జగత్రభు" అనుట చేత వాఁడు క్రియా శూన్యుఁడని అర్థమొనర్ప రాదు.

తాత్పర్యము : ఇట్లు శ్రీహరి ఇచ్ఛచేత మోహమందిన జీవుఁడు సత్త్వాది గుణములతో ప్రకృతియే కర్మమొనర్చుచున్నను ప్రకృతి యొక్క కర్తృత్వమును తెనియని వాఁడై తానే స్వతంత్ర కర్తయనెడు భ్రాంతికి లోఁబడును. ఇట్లు తన యందులేని స్వాతంత్ర్యమును ఆరోపించుకొన్న జీవుని శ్రీహరి సంసార బద్ధునిగా నొనర్చును. పరమాత్ముఁడు కార్య మొనర్చుట యందు క్లేశ మొనర్పఁడు తన ప్రయోజనమునకై దేనిని ఒనర్పఁడు. జీవుల పుణ్యపాపములను సాక్షాత్తుగా చూచుట చేత సాక్షి యనిపించుకొను నియామకుఁడైన పరమేశ్వరుఁడు జీవులను సంసార బద్ధుల నొనర్చి వారికంటె నీచులైన వారి యధీన మందుండు నట్లొనర్చును. దీనికే పారతంత్ర్యమని పేరు. ఇదే దుఃఖమునకు కారణము. స్రోక్తములయధీనత జీవుని స్వరూప భూతమైనది. నిత్యమైనది. కనుక అది దుఃఖజనకము కాదు. కార్యమనిపించుకొనెడు దేహము, కారణమైన ఇంద్రియము కర్తయని తలచెడు మనసు వీనికి జడ ప్రకృతికి అభిమానురాలైన లక్ష్మీ దేవియే కారణము. అందుచేత వీని కభిమానులై బ్రహ్మాది చేతనులు లక్ష్మి యొక్క అనుగ్రహము చేతనే జగత్సృష్టికి కారణభూతులైనారు. ఆ లక్ష్మీదేవి కూడ శ్రీహరి యనుగ్రహము చేతనే ఇట్టి సామర్థ్యమును పొందినది. శ్రీహరి ఆజ్ఞతో లక్ష్మ్యాది చేతనులు సుఖాదుల నొసఁగెదరు. అయినను వారి యనుభవమును జీవులకు ఒసఁగెడువాఁడు శ్రీహరియే. ఇట్లు ప్రకృతి పురుషులిరువురును జగత్తునకు కారణ భూతులు.

9. ఇక్కడ కర్తృత్వ విశేషత్వమును విడమరచి చెప్పుచున్నాఁడు. కార్యకారణ కర్తృత్వే=శరీరము ఇంద్రియములు మరియు మనస్సు వీనికి, కారణం=కారణముగా, ప్రకృతిం=జడ ప్రకృతి కభిమానియై లక్ష్మిని, విదుః=తెలిసిరి,

జీవానాం=జీవుల యొక్క, సుఖదుఃఖనాం=సుఖదుఃఖముల యొక్క, భోక్తృత్వే=అనుభవించుట యందు, కారణం=కారణము, ప్రకృతేః=లక్ష్మికంటెను, పరః=ఉత్తముఁడైన, పురుషః=శ్రీహరి.

" బ్రహ్మాదిభి స్సురకరీ శ్శ్రిష్ణు వల సంశ్రయాత్,
సుఖ దుఃఖ ప్రదో విష్ణుః స్వయమేవ సనాతనః.
కర్తృత్వం సుఖదుఃఖానాం అన్యేషాం చ తదాజ్ఞయా,
భోక్తృత్వం సుఖదుఃఖానాం కరోత్యేకో హరిస్స్వయమ్,
భోక్తృత్వ మాత్ర హేతుత్వం జీవే నాన్యత్ర కుత్రచిత్.

అనెడు ప్రమాణముతో కార్యకారణముల కభిమానులైన బ్రహ్మాది చేతనుల జగత్తును గూర్చి కర్తలు అనుకొనుచున్నది. లక్ష్మీదేవి అనుగ్రహము చేతనే. ఆమెకు కూడ నీ సామర్థ్యము హరియనుగ్రహముచేత నేర్పడినదే. సుఖదుఃఖములను ఇచ్చుట యందును వానిని అనుభవించునట్లు చేయుట యందును ఈ విశేషములను తెలియవలెను. శ్రీహరి యొక్క ఆజ్ఞచేత ఇతరులు సుఖాదుల నిచ్చుటకు సమర్థులు. ఐనను అనుభవము మాత్రమే శ్రీహరియే సర్వజీవులకు తెచ్చిఇచ్చువాడు. సుఖదుఃఖాది భోక్తృత్వము జీవుల విషయమందే; జడ విషయమందు కాదని తెలియవలెను. కనుక పై శోకమందు బ్రహ్మదేవుని యొక్క శక్తిని చెప్పునటు ఆపాతతః తోపింపచేయుచున్న విషయమును వదలి అప్రసిద్ధార్థమును చెప్పుచున్నామని శంకింపకూడదు. ప్రకృతి పురుషలిర్వురును కారణభూతులనుటకు" ప్రకృతిం పురుషంచైవ విద్ధ్యనాదీ వుభావపి" అనెడు స్మృతియే ప్రమాణము.

10. ప్రకృతి పురుషులు వేని వేనికి కారణభూతు లనుట తెలిసిన దేవహూతి వారిరువురి యందు కలవ్యత్యాసమును గూర్చి తెలిసికొనుటకు సమయము చిక్కినదని వారిరువుర విషయములను గూర్చి ప్రశ్నించుచున్నది. పురుషోత్తమ! అస్య=ఈ జగత్తునకు, కారణయోఃకారణభూతులైనటియు చ=ఇంకను సదసత్=స్థూల సూక్ష్మరూపయైన ఈ జగత్తు, యదాత్మకం=ఎవరిచేత వ్యాప్తమైనదో అట్టి, ప్రకృతి పురుషుల యొక్క, లక్షణం=అసాధారణ ధర్మమును, బ్రూహి=తెలుపుము.

11. శ్రీహరి అనంతుఁడు. ఆతని స్వరూపము బుద్ధి కరముకావలెనన్నచో ప్రకృతి లక్షణమును తెలియవలెను. అది తెలిసినచో తద్ధిన్నుఁడైన వాఁడు శ్రీహరి యని సులభముగా నర్థమగును. అందుచేత మొదలు కపిల మహర్షి ప్రకృతి లక్షణమును చెప్పుచున్నాఁడు. యత్=ఏతత్త్వము, త్రిగుణం=త్రిగుణాత్మకమైనదో, అవ్యక్తం=సూక్ష్మమైనదో, నిత్యం=నాశములేనిదో, సదసదాత్మకం=వ్యక్తావ్యక్తమైన స్థూరూపము గలదో, అవిశేషం=తానుదేని యొక్క కార్యమును కాదో, విశేషవత్=మహత్తత్త్వాది కార్యములతో కూడు కొనియున్నదియో, తత్ ప్రధానం తత్త్వం=ప్రధానమని పిలువఁబడెడు ఆ తత్త్వమునే

జ్ఞానులు, ప్రకృతిం ప్రాహుఃప్రకృతి యని పిలుతురు. ఈ శ్లోకమందు 'త్రిగుణం' అను నదే ప్రకృతి నిజమైన లక్షణము. తక్కిన విశేషణములు దాని స్వరూపమును స్పష్టపఱచును. ఇచ్చట ప్రకృతి యనెడు శబ్దముచేత జడతత్త్వమును తదభిమానినియైన లక్ష్మీదేవిని గ్రహింపవలెను. సత్త్వరజస్తమో గుణముల కభిమానిని శ్రీభూదురా రూపిణియైన లక్ష్మీదేవియు, అగుణములను ప్రవర్తించునట్లు చేయుచున్నది. కనుక శబ్దాది గుణములుగల జగత్తునకు ఆమె ఉపాదాన కారణ మనిపించుకొనుచున్నది. కనుక ఎక్కువగా మహత్తత్త్వమే శరీరముగాగల బ్రహ్మదేవుని సృష్టికి కారణ మగుటవలన లక్ష్మీదేవి ప్రకృతి యనిపించుకొనుచున్నది. ఈమెయు అవ్యక్త, వ్యక్తావ్యక్త, వ్యక్తులనెడు మూడు రూపములతో కూడియున్నది. సృష్టి కర్మమం దామె ఉదాసీనురాలైయుండును. అప్పుడామె అవ్యక్త, సృష్టింపవలెనను ఇచ్ఛా విశేషము నంది నపుడు వ్యక్తావ్యక్త. మహత్తత్త్వాది కార్యములందు వ్యాపించినపుడు వ్యక్తమైన స్వరూపము కలది. ఇట్లే జడరూపమైన ప్రకృతికి కూడ మూడు రూపము లున్నవి. ప్రధానమైన సూక్ష్మావస్థ యం దున్నపుడు ఆమె అవ్యక్త అనిపించుకొనును. తర్వాత తత్త్వములకారణమయ్యెడు అవస్థయందు (ఉపాదానమైయున్నపుడు) వ్యక్తావ్యక్త స్వరూపయని పించుకొనును. మహదాది తత్త్వములుగా పరిణామమందిన అవస్థయందు 'వ్యక్త'అనిపించుకొనును. ప్రధాన మనఁగా శ్రీహరి కన్న ప్రధాన మైనదని అర్థముకాదు. సమస్తకార్యములందు ప్రధాన మగుటచే ప్రధాన మని పేరు. దీనికి ప్రమాణము.

"వ్యక్తావ్యక్తాత్మకం యత్తత్ విద్యాత్సద సదాత్మకమ్,
అసరా కేవలావ్యక్తా సిస్పక్షు రుభయాత్మికా
వ్యక్తైవే కావ్యరూపాత్తు ప్రకృతి స్త్రివిధా మతా,
కార్యత స్సాప్రధానత్వాత్ ప్రధానమితి కీర్త్యతే
అవిశేషాహ్యకార్యత్వాత్ సాచ శ్రీ విష్ణు సంశ్రయా."
ఇచ్చట విశేష మనఁగా కార్యమని అర్థము.

"విశేషం కార్యముద్దిష్టం విశేషాదృశ్యతేయతః" అన్నదే దీనికి ప్రమాణము. దీనిచేత "అవిశేషం విశేషవత్" అనుచోట విరోధమును కూడ పరిహరించిన వైనది.

పురుషోత్తమ! ఈ జగత్తునకు కారణభూతుఁడును స్థూలసూక్ష్మ భూతమైన ఈ జగత్తునందు వ్యాపించిన ప్రకృతి పురుషుల యొక్క అసాధారణ ధర్మ లక్షణములను తెలుపుము.

కపిలుఁడనుచున్నాఁడు. సత్త్వర జస్తమోగుణాత్మకమైనదే జడప్రకృతి. దీనికభిమానియే చేతన ప్రకృతి. చేతన ప్రకృతి సూక్ష్మమైనది. దీనికి నాశము లేదు. వ్యక్తావ్యక్త మనెడు అవస్థనుకూడ పొంది యుండును. ఈ చేతన ప్రకృతినెవ్వరును సృష్టింపలేదు. దీని నుండి యే మహత్తత్త్వాదులు పుట్టుచున్నవి.

కార్యములకు ప్రధాన మగుటచే దీనికి ప్రధానమని పేరు. ఈ సత్త్వరజస్తమో గుణములకు క్రమముగా శ్రీ భూదుర్గా రూపములతో లక్ష్మీదేవి అభిమానిని, ఆమెయే గుణ ప్రవర్తకురాలు. అందుచేత త్రిగుణాత్మకమైన జగత్తున కామె ఔపచారికముగా ఉపాదానకారణ మనిపించుకొనుచున్నది బ్రహ్మదేవుని సృష్టికి కారణ మగుటచేత ఈమెకు ప్రకృతి యని పేరు సృష్టికార్యమం దుదాసీనురాలుగా ఉన్నపుడు అవ్యక్తురాలు. సృష్టింపవలెనని కోర్కె కలినపుడు వ్యక్తావ్యక్త మహదాది తత్త్వములందు వ్యాపించినపుడు వ్యక్త స్వరూపిణి. జడ ప్రకృతికూడ సూక్ష్మావస్థయం దున్నపుడు అవ్యక్తమనిపించు కొనును. దాని యందలి పరిణామశక్తి బయటికి కన్పించి నపుడు వ్యక్తావ్యక్త స్వరూపము కలది. మహత్తత్త్వాదులుగా పరిణామమంది నపుడు వ్యక్తమనిపించుకొనును.

12. మహదాది తత్త్వములు ప్రధానము యొక్క కార్యములన్నారు. ఐదు, ఐదు, నాలుగు, అంటే పది వీనిచేత బ్రహ్మ పరిపూర్ణమైన - అనఁగా వీని కంటెను పెచ్చు తత్త్వములు లేని ఏతత్=ఈచతుర్వింశతికమైన, గణం=సమూహమును, ప్రాధానికం=ప్రధానము యొక్క కారణమని విదుఃః

13.14. అవి ఏవి అనఁగా చెప్పుచున్నాఁడు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము. ఇవి ఐదు పంచభూతములు. గంధరసరూప శబ్ద స్పర్శలుఅనెడు తన్మాత్రలు. తావంతి=ఐదే, అవి, మే=నాకు, మతాని=ఇష్టములు. త్వక్‌చక్షుశ్శ్రోత్ర జిహ్వా ఘ్రాణ, వాక్, పాద, కర శిశ్న, గుదం=ఇవి పది ఇంద్రియములు.

15. అంతరాత్మనఃః=లోపలి ఇంద్రియమైన మనస్సునకు, లక్షణరూపయా= బుద్ధి నిశ్చయమునకు, మనస్సు సంశయమునకు, అహం=కారణము అభిమానమే అహంకారము. స్మరణకుకారమైనది చిత్తము. ఈ లక్షణములతో కూడిన వృత్యా=వ్యాపారము చేత బుద్ధి మనస్సు, అహంకారము చిత్తమని, చతుర్ధ= నాలుగు రీతులుగా భేదం, లక్ష్యతే=కానవచ్చుచున్నది.

బుద్ధి రధ్యవసానాయ సంశయం కురుతే మనఃు,
అభిమానోఽహ్యహంకారశ్చిత్తం స్మరణకారణమ్.

16. తత్త్వముల సంఖ్యానమును ముగించుచున్నాఁడు. బ్రహ్మణఃు= ప్రధానతత్త్వము- దానికభిమానియైన లక్ష్మీదేవి యొక్క, యఃు=ఏ, సన్నివేశఃు =సంస్థానవిశేషము కలదో అది. ఏతావాన్ ఏవ=ఇరువది నాలుగనియే, సంఖ్యాతఃు =లెక్కింపఁబడినది, మయా=నాచేత, తవ=నీకు, ప్రోక్తఃు యఃకాలఃు=కాలమని దేనిని పిలుతురో, సఃు=అది, పంచవింశకఃు=ఇరువది యైదవతత్త్వమని తెలియవలెను. కాలాత్మకుఁడైన శ్రీహరిని పై గుంపునందు చేర్చక వేఱుగా చెప్పుట చేత అతఁడు ఇతరుల కధీనుఁడు కాఁడని తెలిపినట్లైనది. లక్ష్మీదేవి కూడ శ్రీహరిని విడిచి ఉండదు కదా! ఆమెయు సతని వేలెనే ఇతరుల కధీనురాలుకాదు. కనుక పై గుంపునందామెనుకూడ చేర్చుట న్యాయము కాదుకదా? అని పూర్వపక్షము. కాని హరిస్తు నిర్గుణం బ్రహ్మ శ్రీ బ్రహ్మ

సగుణం స్మృతమ్, తదంగ జాని తత్త్వాని తస్మాత్త ద్రూపముచ్యతే. "అనెడు ప్రమాణముచేత తత్త్వము లక్ష్మీదేవి అంశమునుండి పుట్టుటచేత అది ఆమె స్వరూపమే అనిపించు కొనుచున్నది. కనుక ఆమె యందు అపి లెక్కింపవలెనను అభిప్రాయముతో ఆ గుంపులో చేర్పనైనది. కార్యకారణముల కభేద మగుటచేత లక్ష్మిని సగుణరూలుగా చెప్పవలెనని యర్థము.

17. జన్మింపనట్టి శిశువునకు పేరు పెట్టినట్టు కాలమునకు పరమాత్ముడను పేరు ఎట్టు చెల్లును? పరమాత్మ లక్షణమే ఇంతవరకు చెప్పలేదు కదా! అనగా చెప్పుచున్నాడు. ఏకే=ప్రాకృత జనులు కానివారు, అహంకార విమూఢస్య =నేనే కర్తనెడు అహంకారముతో, నాదే ఇది యను మమకారముతో, మిథ్యా జ్ఞానియై యున్నట్టియు, ప్రకృతిం ఈయుషఃత్రిగుణాత్మక ప్రకృతి చేత బద్ధుడైనట్టి, కర్తుః=పరాధీనమైన కర్తకు, యతః=ఏ పరమాత్మనుండి, భయం=జననమరణరూపమైన సంసారము, (భవతి=అగుచున్నదో) తత్=అట్టి, పౌరుషం=హృదయసితుడైన శ్రీహరి యొక్క ప్రభావం=అతిశయముగా వ్యాప్తమైన రూపమును ఇంకను పురుషాకారుడైన రుద్రదేహస్థుడైన రూపమును, కాలం= కాలమని ప్రాహుఃప్రమాణ పురస్సరముగా తెలిపెదరు. పైన చెప్పిన అర్థముచేత పురుష లక్షణమును చెప్పుమనగా కాలమును వివేచించినదెందులకో? అను ప్రశ్నకు కూడ నుత్తరమిచ్చినటైనది. హృదంతుడైన పరమాత్మకు పురుషుడని పేరు. వానికే కాలమనిపించు కొనెడు రెండు రూపములున్నవి. ఒకటి సర్వత్ర వ్యాప్తమైనది. మఱియొకటి రుద్రదేహస్థమైన సంహారకరూపము. ఈ విషయమును సూచించుటకే భాగవతమందు రెండుసారులు కాల పదమును ప్రయోగించి నాడు. రుద్రదేహస్థమైన రూపముచేత బద్ధులైన జీవులు సంసారరూప భయమును పొందెదరు.

పురుషో హృదిస్థః పరమః కాలస్సర్వగతో హరిః,
అథవా రుద్రదేహస్థో హరిః కాల ఇతీరితః.

తాత్పర్యము: భూమ్యాదులు పంచభూతములు. గంధాదులు వీనితన్మాత్రలు కర్తృత్వక్ నేత్ర జిహ్వా ఘ్రాణ వాక్పాణి పాదశిశ్నపాయువులు జ్ఞాన కర్మేంద్రియములు. వెరసిపది. నిశ్చయాత్మకమైన వ్యాపారము గలది మనస్సు. అభిమాన వ్యాపారకము అహంకారము. స్మరణ వ్యాపారముగలది చిత్తము. ఇవి యన్నియు అంతఃకరణ భేదములు. ఇవి నాలుగు. వెరసి ఇరువది నాలుగు తత్త్వములు. ఇవి యన్నియు ప్రధానము యొక్క కార్యములే యని విజ్ఞులందురు. సగుణ బ్రహ్మమని పిలువఁబడెడు లక్ష్మీదేవిచేత అభిమన్యమానమైన ప్రకృతి విశేషములు ఇరువది నాలుగే. దానికంటె హెచ్చుగా లేదు. ఇక ఇతరుల అధీనమున లేని స్వతంత్రుడైన కాలమనెడు శ్రీహరియే ఇరువది యైదవ తత్త్వము. ఇట్లు శ్రీహరి తత్త్వము సమగ్రముగా జ్ఞానులు తెలియుదురు. అహంకారబద్ధుడై ప్రకృతి బద్ధుడైన జీవుని జనన మరణరూప సంసారమందు దొరలు నట్లొర్చిన శ్రీహరికి రెండు కాలరూపములను విజ్ఞులు

వర్ణింతురు. (1) శ్రీహరి హృదయస్థితుఁడైన కాలరూపము. మరియొక్కటి రుద్రదేహస్థుఁడైన పురుషాకార రూపము. ఇదియే సంహారరూపము. సంసారమునకు కారణభూతమైన రూపము.

18. ఈ కారణముచేత కూడ కాలమనెడు పేరు శ్రీహరికి చెల్లఁదగినది. త్రుటి, లవము మొదలైన కాలభాగములకు కాదని చెప్పుచున్నాఁడు. మానవి!= మనుపుత్రి! నిర్విశేషస్య=కార్యమందు ఉదాసీనముగా నున్న, గుణసామ్యస్య= బ్రహ్మప్రళయరూపమైన వ్యవస్థతో కూడిన, ప్రకృతేః=ప్రధాన తత్త్వాభిమానియైన మూల లక్ష్మీదేవికి, చేష్టా=శ్రీ భూదుర్గా రూపముతో సృష్టియందు, ఇచ్ఛ కలియుండుట అను చేష్టయు(స్మార్తి)యతఃఏ శ్రీహరి చేత, భవతి=అగుచున్నది సః భగవాన్ కాలః ఇతి ఉపలక్షితః= తెలియఁబడును. ప్రకృతిచేష్టా ప్రదుఁడను ఈ లక్షణము లక్ష్యభూతుఁడైన శ్రీహరియం దుండుట చేత అతి వ్యాప్తికూడ లేదు. ఇదియే శ్రీహరి యొక్క లక్షణమని తెలియవలెను.

తాత్పర్యము: కార్యమునం దుదాసీనురాలు ప్రళయావస్థను పొందునదైన ప్రధానతత్త్వాభిమాని మూల లక్ష్మీదేవికి శ్రీభూదుర్గా రూపములచేత సృష్టియందు కోర్కెకల్గునట్లు శ్రీహరియే ప్రేరేపించును. అందుచేత నతఁడే కాలమని పించుకొనువాఁడు. తన ఇచ్ఛచేత శ్రీహరి సమస్తప్రాణుల హృదయము లందు అంతర్యామియై ఉండి పురుషుఁడని పించుకొనును. ఈ రెండు రూపముల కే భేదమును లేదు.

19. ఈ శ్లోకమందు కాలరూపమునకు పురుషరూపమునకు భేదము లేదని చెప్పుచున్నాఁడు. యః భగవాన్, ఆత్మమాయయా=తన స్వరూప భూతమైన ఇచ్ఛచేత, సత్త్వానాం=సమస్త ప్రాణుల యొక్క, అంతః=లోపల (హృదయమందు) పురుషరూపేణ=అంతర్యామి స్వరూపముతో, బహిఃశ్చ=బయట, కాలరూపేణ=వ్యాపక రూపముతోను, సమన్వేతి=వ్యాపించి యున్నాఁడో, సః ఏషః=అతఁడే ఇతఁడు కనుక ఈ రూపములందు భేదము ఉన్నదను దోషశంకలేదు.

20 ప్రకృతికి చేష్ట నొసంగె ననిపైన చెప్పినాఁడు కదా! ఆ ప్రకారమును వివరించుచున్నాఁడు. దైవాత్=ప్రకృతి యందు క్షోభను కలిగించిన నారాయణ రూపమునుండి, క్షుభితధర్మిణ్యాం=సృష్టించు కోర్కెయను విశేష ధర్మము నొందిన ప్రధాన తత్త్వాభిమానియైన లక్ష్మీదేవి వలన వ్యక్తమైన, అస్యాం యోనౌ=తనభార్యయైన శ్రీ నామకు రాలియందు, పరఃపుమాన్=ప్రకృతి క్షోభకుఁడైన నారాయణ రూపమునుండి వ్యక్తుఁడైన పురుషోత్తముఁడైన శ్రీహరి, వీర్యం=రేతోరూపమైన తన వీర్యమును, ఆధత్త=ఉంచెను. సాఁ=అట్లు పురుష నామకుఁడైన శ్రీహరి యందు రేతోధారణము పొందిన శ్రీదేవి, హిరణ్మయం= కనకమయమైన, మహత్తత్త్వం=మహత్తత్త్వమును, అసూత=ప్రసవించెను.

ప్రకృతేః క్షోభకం రూపం దైవం నారాయణాభిధమ్,
ప్రకృతౌ మహతః స్రష్టా పరమః పురుషోత్తమః.

ఇట్లు చెప్పుట చేత శ్రీహరి కూడ అమోఘమైన వీర్యము కలవాడని చెప్పిన ట్లైనది.

21. తమసా గూఢమగ్రే=ప్రళయకాలమందు సమస్తమును తమస్సుతో నావృతమై గూఢమై యుండునను శ్రుతి ప్రకారము, ప్రకృతి చేత గూఢమైన జగత్తు దైవనాయకుడైన శ్రీహరి ఎట్లు వ్యక్తపఱచెను? దానిని వివరించు చున్నాడు. కూటస్థః=బ్రహ్మాది సర్వజీవ సముదాయము యొక్క ఆధారభూతుడైనట్టియు, ఆత్మగతం=అందుచేతనే తన యుదర మందున్న, విశ్వం=జగత్తును, వ్యంజన్=వ్యక్తమొనర్పవలెనను ఇచ్ఛగల, జగదంకురః=తన ఆశ్రయముతో, జగత్తునానందపఱచెడు పరమపురుషుడు, ఆత్మప్రస్వాపనం=తనయోగనిద్రకు కారణమైన, తీవ్రం తమః=నిబిడమైన అంధకారము, స్వతేజసా=తన స్వరూప ప్రభచేత, అపిబత్=నాశమొనర్చెను. పోగొట్టెనని యర్థము. 'జగదంకురః' అనెడు పదమునకు జగత్తు యొక్క అంకురము అనగా వికాసమని అర్థమొనర్ప రాదు. 'నిర్వికారః అక్షరః శుద్ధః'అనెడు శ్రుతి ప్రకారము ఈ అర్థ మయుక్తము. అందుచేత–

"అంకే రమయతే యస్మాత్ కేశవో జగదంకురః,
మహాంతం యోఽసృజత్ జీవమోహకం చ తమోఽగ్రసత్".

అనెడు ప్రమాణముతో పైనచెప్పిన అర్థమే సరియైనది.

22. దైవనామకుడైన శ్రీహరినుండి అభివ్యక్తుడైన పరమ పురుషుడైన శ్రీహరి నుండి మహత్తత్త్వ సృష్టిని చెప్పి ఇప్పుడు మహత్తత్త్వము నుండి అభిమన్యమానమైన చిత్తము యొక్క సృష్టిని చెప్పుచున్నాడు- యత్తత్=ఏ మహత్తత్త్వము (తదతమైన భగవద్రూపము) సత్త్వగుణం=పూర్ణానందాది గుణములు కల్గినదో, స్వచ్ఛం=శుద్ధమైనదో, శాంతం=కల్మషము లేనిదో స్తిమితమైనదో, భగవతః=శ్రీహరి యొక్క, పదం=స్వరూపము, యచ్ఛ=దేనిని (జ్ఞానినఃజ్ఞానులు) వాసుదేవాఖ్యం=వాసుదేవుడని, ఆహుఃపలికిరో, తత్=(తస్మాత్) ఆవాసుదేవ రూపమునుండి, మహదాత్మకం=మహత్తత్త్వము నుండి అభిమన్యమైన, చిత్తం=సమస్త ప్రాణులచిత్తములును, జాయతే= జన్మించును. ఇక్కడ మహత్తత్త్వ నియామకుడైన వాసుదేవుని రూపము నుండి చిత్తము యొక్క సృష్టియైనదని తెలియవలెను.

"తదేవ వాసుదేవాఖ్యం మహత్తత్త్వ నియామకమ్",
సత్త్వ శబ్దేన చోచ్యంతే పూర్ణానందాదయో గుణాః".

అను ప్రమాణము ననుసరించి పై యర్థము చెప్పఁబడినది. చిత్తమునకు వాసుదేవుఁడే జనకుఁడనుటకు-

" మహత్తత్త్వ గతో యోఽసౌ వాసుదేవాభిధో హరిః,
సచిత్త జనకః ప్రోక్తః ప్రాణినాం హి పృథక్ పృథక్".

అనెడు వాక్యమే ప్రమాణము.

23. కారణమందున్న గుణములు కార్యమందును అనువర్తించును అనెడు నభిప్రాయముతో చిత్తము యొక్క లక్షణమును చెప్పుచున్నాఁడు. స్వచ్ఛత్వం=నిర్మలముగా నుండుట, అవి కారిత్వం=కొద్దిగా వికారము నొందుట, శాంతత్వం=ప్రసన్నముగా ఉండుట, ఇతి=అని, యథా=ఎట్లు, అపాం=నాటికి, పరా=విశిష్టమైన, ప్రకృతిః=ఏ నిమిత్తము లేక తెల్లగా నుండుట స్వభావమో (తథా=అట్లు) వృత్తిభిః=స్వభావములనుండి, చేతసః=చిత్తము యొక్క, లక్షణం= అసాధారణ లక్షణము, ప్రోక్తం=చెప్పఁబడినది. అనఁగా ఈ గుణములు చిత్తము యొక్క స్వభావములని అరము. "అవికారత్వము" అనగా వికారమే లేక యుండుట అని అరము చెప్పరాదు. "స్తిమితోదక చిత్తాదే రవికారోక్లప్త విక్రియా" స్తిమితమైన నీటివలె ఉండెడు చిత్తము యొక్క అవికారత్వ మనఁగా చిత్త వికారమే పై చెప్పిన ప్రమాణము ననుసరించి అల్పవికారమునే అవికార మని అందురు.

24. మహత్తత్త్వము నుండి ఏర్పడిన అహంకార తత్త్వము యొక్క సృష్టిని చెప్పుచున్నాఁడు. భగవద్వీర్యసంభవాత్=శ్రీహరి యొక్క వికారము నుండి పుటిన, వికుర్వాణాత్=శ్రీహరి యొక్క ప్రేరణ చేతనే వికారమును పొందిన, మహత్తత్త్వాత్=మహత్తత్త్వము నుండి, క్రియాశక్తిః=మనస్తత్త్వాదుల కంటెను జ్ఞానాధికమైనను మహత్తత్త్వము కంటె జ్ఞాన శక్తి తక్కువకాదని క్రియాశక్తియే హెచ్చుగా నున్న, అహంకారః=అహంకారతత్త్వము, త్రివిధః= మువ్విధములుగా, సమపద్యత=ఏర్పడినది. ఇచ్చట అహంకారతత్త్వము కేవల క్రియాశక్తి యనియే చెప్పరాదు. ఇది జ్ఞానశక్తిగా కూడ నగును. కాని మహత్తత్త్వ మున్నంత జ్ఞానశక్తి లేకపోవుటచేత దీనిని క్రియాశక్తి యనియే అందురు.

జ్ఞాన ప్రధానస్తు మహాన్ అహంకార క్రియాధికః,
ఇతరాపేక్షయాసోపి జ్ఞానాధిక ఉదాహృతః.

అను ప్రమాణము ననుసరించి మనస్తత్త్వాదుల కంటె దీని యందు జ్ఞాన శక్తి అధిక మనియు మహత్తత్త్వము కంటె జ్ఞానశక్తి అధికమని తేలియవలెను. అహంకార తత్త్వమందు జ్ఞానశక్తి లేదని చెప్పరాదు. అటెనచో అహంకార తత్త్వమందు రెండు శక్తులున్నవని చెప్పుట దోషయుక్తమగును.

25. వేరువేరు పేరులతో మూఁడు విధములని చెప్పుచున్నాఁడు. యతః =ఏ మూఁడు విధములైన అహంకారములనుండి, మనసఃమనస్సునకు,

ఇంద్రియాణాం=ఇంద్రియములకు, మహతాంభూతానాం=పృథివ్యాది భూతములకు భవః=ఉత్పత్తి ఏర్పడెనో, సః=ఆ తత్త్వము వైకారిక, తైజస, తామస మని పిలువఁబడును.

26. మఱియొక్క ప్రకారముగా అహంకారము యొక్క మూఁడు విధములను చెప్పుచున్నాఁడు. ఈ శ్లోక మందు ప్రథమావిభక్తి పంచమ్యర్థములో ఉపయోగించఁబడినదని తెలియవలెను. అధిదైవం (అధిదైవాత్)=దిగభిమాని మొదలైన దేవతాసృష్టికై ఉన్నట్టి, వైకారికం (వైకారికాత్)=వైకారిక మనెడు అహంకారము నుండి, దిగభిమానులు మొదలైన దేవతలు, జాతాఃజన్మించిరి. తైజసఃతైజసాత్) =తైజసాహంకారము నుండి, బుద్ధి=బుద్ధికి అనఁగా వాక్కునకు అభిమానియైన ఉమాదేవియు, ప్రాణశ్చ=ఆహంకారిక ప్రాణమనెడు దేవతయు, జాతౌజన్మించిరి. అర్థమాత్రం=శబ్దాదితన్మాత్రలు, తామసఃతామసాత్) =తామసాహంకారమునుండి ఏర్పడినవి లేక అర్థమాత్రం=తామసాహంకారము శబ్దాది తన్మాత్రలకు నిర్మాత. అందుచేత గుణవ్యతికరఃశాంత ఘోర మూఢభావములకు వ్యంజకములైన, సత్త్వ రజస్తమో గుణసమూహముకల అహంకారము, త్రివృత్=ఈ రీతిగా మూఁడు భాగములైనది.

తాత్పర్యము: నారాయణ రూపమునుండి ప్రకృతి యందు క్షోభ ఏర్పడినది. అప్పుడు ప్రధాన తత్త్వాభిమాని యైన లక్ష్మీదేవి యందు సృష్టింపవలెనని ఇచ్ఛ శ్రీహరి ఏర్పఱచెను. ఆమె నుండి సృష్టికి కారణమైన 'శ్రీ' రూపము వ్యక్తమైనది. నారాయణ రూపమునుండి వ్యక్తుఁడైన పురుషోత్తమ నామకుఁడైన శ్రీహరి శ్రీదేవి యందు వీర్యమునుంచెను. అపుడు హిరణ్మయమైన మహత్తత్త్వము ఆమె నుండి ఏర్పడినది ఆ పరమ పురుషరూపము బ్రహ్మాది సమస్త జీవ సముదాయమునకు ఆధారము. ఆ రూపము యొక్క ఉదరమందే సమస్త జగత్తును అడఁగి యుండెను. దానిని వ్యక్త మొనర్పవలెనని ఆతఁడు ఇచ్ఛించినాఁడు. తాను ఆశ్రయభూతుఁడై జగత్తునానందపఱచెడు శ్రీహరి తన యోగనిద్రకు కారణమైన నిబిడాంధకారమును తన ప్రకాశము చేత నాశ మొనర్చెను. హిరణ్మయమైన ఆ మహత్తత్త్వమునకు వాసుదేవుఁడే నియామకుఁడు. వాఁడు పూర్ణానందుఁడు. కాలుష్యము లేని వాఁడు. కనుకనే ఆ మహత్తత్త్వము సాత్త్వికము, శుక్లము స్తిమిత మైనది. ఈ మహత్తత్త్వ నియామకుఁడైన వాసుదేవుని రూపమునుండి ప్రాణులచిత్త మేర్పడును. నిర్మలముగా నుండుట స్వల్పవికారము నందుట, ప్రసన్నముగా నుండుట చిత్తముయొక్క స్వాభావిక లక్షణములు. నీ రెట్లు స్వాభావికముగా స్వచ్ఛమైనదో అట్లె చిత్తము కూడ స్వాభావికముగా పై గుణములతో కూడి యున్నదని యర్థము. శ్రీహరి ఇచ్ఛ ననుసరించి మహత్తత్త్వము వికారము నంది మూఁడు విధములైన అహంకార తత్త్వమునకు కారణ మయ్యెను. ఈ అహంకార మందు మహత్తత్త్వము కంటెను జ్ఞానశక్తి తక్కువ. అందుచేతనే దీనికి క్రియాశక్తియని ప్రసిద్ధి. దీనిలో మొదటిదైన వైకారికాహంకారము మనస్తత్త్వమునకు కారణము. రెండవది

తామసాహంకారము. దీని నుండి ఇంద్రియతత్త్వము లేర్పడినవి. మూఁడవది తామసాహంకారము. దీని నుండి పంచమహాభూతము లేర్పడినవి. వైకారికాహంకారము నుండి దిగభిమానులైన దేవతలు. తైజసాహంకారము నుండి బుద్ధి కభిమాని యైన ఉమాదేవి, అహంకారిక ప్రాణులు జన్మించెను. తామసాహంకారమునుండి బబ్బాది తన్మాత్రలు జన్మించెను. ఈ త్రిగుణాత్మకమైన అహంకారము శాంత ఘోర మూఢ భావములకు వ్యంజకము.

27. అహంకార తత్త్వము సూక్ష్మమైనది. స్థూలమైనదని రెండు విధములు. అనఁగా వైకారిక, తైజస, తామసికములనెడు విభాగము లేనపుడు అది సూక్ష్మమనిపించు కొనును. ఆ విభాగములను పొందినపుడు స్థూలము. ఈ రెండు విధముల అవస్థయందును అభిమాని ఎవరని చెప్పుచున్నాఁడు. యం=ఏ, భూతేంద్రియ మనోమయం=పంచమహాభూతములు, జ్ఞాన కర్మేంద్రియములు మనస్సునకు కారణమైన (ముఖ్య ప్రవర్తకుఁడైన) సహస్రశిరసం=అనంతశిరస్సులుగల, అనంతం=గుణదేశ కాలములతో అంతము లేని, పురుషం=శ్రీహరిని, సంకర్షణాఖ్యం, ప్రచక్షతే=చెప్పుదురో, అతఁడు సూక్ష్మాహంకారతత్త్వమునకు నీయామకుఁడు. ప్రద్యుమ్న నామకుఁడైన శ్రీహరిస్థూలాహంకారమునకు నియామకుఁడు. వీరిద్దరును అవస్థాభేదము చేత ఒకరే. తత్త్వమునకు అభిమానులైన ప్రద్యుమ్నుని వేరుగా చెప్పలేదు. 'సాక్షాత్' అను విశేషణము నిచ్చి నందువలన సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధరూపములతో ప్రేరితుఁడైన వేయిపడగలు గల, అనంత=ఆదిశేషుఁడా మూఁడు విధములైన అహంకార తత్త్వములకు అభిమాని యని తెలియవలెను.

సంకర్షణాఖ్యస్తు హరిః సూక్ష్మాహంకారయామతః,
స్థూలాహంకార నియమో విష్ణుః ప్రద్యుమ్న నామకః.
మహత్తత్త్వాది జీవాస్తు బ్రహ్మశేషోఽంగజ స్తథా.

28. అహంకార లక్షణమును చెప్పుచున్నాఁడు. అహంకృతేః=మువ్విధములైన అహంకార తత్త్వములకు క్రమముగా కర్తృత్వ, కరణత్వ, కార్యత్వములు లక్షణములు. మొదటిదైన వైకారికాహంకారము మనస్సుగా పరిణామ మందుట చేత, మనస్సు నందు వ్యాప్తి యుండుట చేత దేహమునందు "ఈ దేహము నాది" యనెడు మమతను సృష్టించుచున్నది. అందుచే దానిని కర్త యనెదరు. తైజసాహంకారము ఇంద్రియములకు కారణము. ఇంద్రియాభిమానులైన వారిచేత నియమింపఁబడిన ఇంద్రియముల ద్వారా జ్ఞానమును పుట్టించుటచేత కరణ మనిపించుకొనును. తామసాహంకారము పంచభూతములకును తన్మూలకముగా పాంచభౌతికమైన దేహమునకు కారణముగా నుండుటచేత ఈ దేహము కార్యమనిపించుకొనుటచేత కార్యత్వ యుక్తమని చెప్పఁబడును. అహంకారముచే నేర్పడిన పదార్థములందు ఆయాస్వభావములు తోఁచుచుండుటచేత అది

అదే అహంకార లక్షణమనెడు అభిప్రాయములో మఱియొక్క లక్షణమును చెప్పుచున్నాఁడు. వా=అథవా, శాంతత్వ ఘోరత్వ, మూఢత్వములు అహంకార తత్త్వము యొక్క లక్షణములు. దేవతల యొక్కయు, పితరుల యొక్కయు దేహజనకమైన వైకారికాహంకారము సత్త్వగుణ ప్రచురముగా పుట్టుటచే శుక్లాత్మకుఁడైన శ్రీహరి యందు నిష్ఠను పొందించున దగుటచేత శాంతమని పిలువఁబడును. కరణము లనిపించుకొనెడు ఇంద్రియములకు కారణమైన తైజసాహంకారము సత్త్వరజోగుణములు ప్రాచుర్యము చేత జన్మించినది. ఆ కారణము చేత జ్ఞానేంద్రియముల నుండి అనేక విధములైన ఘోర పదార్థముల జ్ఞానమును కలిగించుటచేతను, కర్మేంద్రియములచేత అతిశయ ఘోరములైన అనేక కర్మములు చేయించుట చేతను ఘోరమని పిలువఁబడును. తామసాహంకారము పైఁజెప్పిన రెండవహంకారములంతటి జ్ఞానము పుట్టించకపోయినను తామస గుణప్రచురములైన పంచభూతములకు కారణ మగుటచేత విమూఢమనిపించుకొనును. పై విషయములకు ప్రమాణము.

"మనో రూపేణ కర్తృత్వం దేహరూపేణ కార్యతా,
ఇంద్రియాత్మతయాచైవ కరణత్వ మహంకృతేః.

యతో మనస్యహంభావః తస్మాత్కర్తా మనస్స్మృతమ్,
స్వభావ కర్తృజీవస్యత్వా సన్నోపాధి తద్యతః.

కర్మజ్ఞానే కరణతా యతః కరణ మింద్రియమ్,
కార్యం దేహ స్సముద్దిష్టం ఉత్పాద్యత్వాత్పునః పునః.

శాంత రూపోదేవపితా ఘోరః కరణసృజ్మతః,
తావత్ జ్ఞానస్యాప్రకాశాన్మూఢో భూతపితాస్మృతః.

త్రిరూపోఽయ మహంకారః శేష ఇత్యేవ తం విదుః.

28. వైకారికాది అహంకార భాగములనుండి ముందుచెప్పిన మనస్సు మొదలైన వాని యొక్క వ్యుత్పత్తిని స్పష్టపఱచుచున్నాఁడు. వికుర్వాణాత్=వికారమును పొందిన వైకారికాహంకారము నుండి మనస్తత్త్వమును, అజాయత=ఏర్పడినది. దాని లక్షణమును చెప్పుచున్నాఁడు. యత్=ఏ ఈమనస్సు సంకల్ప వికల్పము లనెడు వ్యవహార విశేషములతో, దేహే, వర్తతే. మఱి యొక్క లక్షణమును చెప్పుచున్నాఁడు. యత్=ఏమనస్సు నుండి, కామసంభవః=నానా విధములైన ఇచ్ఛల యొక్క జనన మేర్పడునో అట్టి మనస్తత్త్వము పుట్టెనని భావము.

29. దాని యభిమానిని చెప్పుచున్నాఁడు. హృషీకాణాం=సమస్తేంద్రియములకును, అధీశ్వర్='నేత' యనిపించుకొన్న, శాందేందీవరశ్యామం=శరత్కాల

మందలి ఇందీవరము వలె నీల వర్ణవిశిష్టమైనటియు, శనైః=వ్యగ్రముగాని మనస్సు చేత, యోగిభిః=సనకాది యోగులచేత, సంసాధ్యం=ధ్యాన మొనర్పఁబడెడు, యత్=ఏ. స్థూలాహంకారనియమకుడైన ప్రద్యుమ్ను నుండి అభివ్యక్తుఁడైన, అనిరుద్ధాఖ్యం=కామపుత్రుఁడైన అనిరుద్ధునియందు అంతర్యామిగా యున్న అనిరుద్ధుఁడని, జానినఃజానులు, విదుఃతెలియుదురో, అతఁడే ఈ తత్త్వమునకు నియామకుఁడైన అనిరుద్ధుఁడు సర్వేంద్రియములకును నియామకుఁడని తెలిసికొందురు. ఈ శ్లోకమునకు మఱియొక అర్థము కూడ చెప్పవచ్చును. యత్=ఏ మనస్సు, అనిరుద్ధాఖ్యం=స్వాభావికమై నిరోధరహితమైన అనిరుద్ధమని చెప్పఁబడునో - ఆ కారణముచేతనే సమస్తేంద్రియములను నియమించుట యందు సమర్థము, శరదిందీవరమువలె శ్యామవర్ణము కలిగినదియో, తత్=అది, యోగిభిః=ప్రాణాయామాదుల నభ్యసించువారిచేత సంసాధ్యం=చక్కగా వశమున ఉంచుకొన శక్యమని, విదుఃజ్ఞానులు తెలియుదురు. దీనిచేత యోగాభ్యాసులకు మనస్సు నిరోధించుటకు సాధ్యమని తెలిపినట్లైనది.

30. హేసతి! వికారమొందిన తైజసాహంకారమునుండి బుద్ధి తత్త్వమేర్పడినది. దీనినుండి, ఇంద్రియాణాం= ఇంద్రియములందు, అనుగ్రహాత్=దోషము లేకుండుట అనెడు అనుగ్రహముచేత, ద్రవ్య స్ఫురణ విజ్ఞానం=ద్రవ్యము గ్రహింపఁబడుట - దాని విశేషజ్ఞానము ఏర్పడు చుండును. ఇట్లు బుద్ధితత్త్వము పుట్టినదని యర్థము. జ్ఞానము సామాన్యజ్ఞాన మనియు. విశేషజ్ఞాన మనియు రెండురీతులు. మనస్సునుండి పుట్టు జ్ఞానమునకు సామాన్య జ్ఞానమని పేరు. బుద్ధినుండి ఏర్పడునది విశేషజ్ఞానము.

"సామాన్య మనసా జ్ఞానం విశేషాత్ బుద్ధిజం భవేత్"

అనెడు వాక్యము ప్రమాణము.

31. ఈ బుద్ధితత్త్వము లక్షణమును చెప్పుచున్నాఁడు బుద్ధేఃబుద్ధితత్త్వమునకు, వృత్తిభిఃదాని స్వాభావిక వృత్తుల నుండి, పృథక్=వేఱు వేఱుగా, సంశయఃసంశయమని, అథ=ఇంకను, విపర్యాసఃభ్రాంతి జ్ఞాన మనియు, నిశ్చయఃనిశ్చయజ్ఞాన మనియు, చ=ఇంకను, స్మృతిఃఏవ=స్మరణ మనియు, స్వాపఃఅజ్ఞాన మనియు, లక్షణముచ్యతే=లక్షణమును చెప్పెదరు. అథ=అని చెప్పుటచేత ఒకటే లక్షణము కాదు. లక్షణములు కలవని చెప్పినట్లైనది. విపర్యాసమనఁగా పదార్థము యొక్క సహజస్థితిని వదలి వేఱురీతిగా తెలియుట. ఆ తత్త్వమును చూచి "ఇదే దీని తత్త్వము మఱి యొక్కటి కాదు" అని గ్రహించుటయే విపరీత జ్ఞానము. దీనికి మిథ్యాజ్ఞాన మని పేరు. మనస్సు నుండి కూడ సంశయమేర్పడుచున్నది కదా! అప్పుడు బుద్ధికే సంశయ జ్ఞాన మేర్పడునని లక్షణ మెట్లు చెప్పితిరి? దీనికి సమాధానము. సంశయము రెండురీతులు (1) మానసికము (2) బుద్ధినుండి ఏర్పడినది. నిశ్చయ జనక ధర్మములను చూచిన తరువాత మానసిక సంశయము

నివృత్త మగును. కాని బుద్ధిజమైన సంశయము - ఎప్పటికినీ పోదు. "అచలః సంశయో బుద్ధేః చలో మానస ఉచ్యతే". దీని చేత స్వరూపభూతమైన సంశయము పోదనియు చెప్పిన వైనది. లక్షణము రెండు రీతులు. స్వరూపము; రెండవది భిన్నము. ఏ ధర్మము చేత స్వరూపము తెలిసికొనుటకు సాధనమో అది లక్షణము.

"యేన యద్జ్ఞాయతే వస్తుతత్త ల్లక్షణ ముచ్యతే,
తత్స్వరూపం పృథక్‌చేతి ద్వివిధం కవయో విదుః".

అన్యథా జ్ఞానము, స్మరణము - వీని విషయమందు కూడ ఇట్లే యూహించుకొనవలెను.

32. క్రియాజ్ఞాన విభాగశ్చ=కర్మేంద్రియ జ్ఞానేంద్రియములనెడు విభాగముచేత, ఇంద్రియాణి=పదీ ఇంద్రియములు, తైజసాన్యేవ=తైజసాహంకారము నుండి పుట్టినవే. వాని అభిమాన విశేషములను చెప్పుచున్నాడు. ప్రాణస్య=ఆహంకారిక ప్రాణమునకు, క్రియాశక్తిః=కర్మేంద్రియముల చేత పని చేయించెడు సామర్థ్యము, బుద్ధేః=బుద్ధియనెడి ఉమాదేవికి, విజ్ఞానశక్తి తా=శ్రోత్రాది జ్ఞానేంద్రియముల నుండి విజ్ఞానమును పుట్టించు సామర్థ్యము (కలదు)

33. భగవద్వీర్యచోదితాత్=శ్రీహరి యొక్క సామర్థ్యభూతమైన ఇచ్ఛనుండి ప్రేరితమై, వికుర్వాణాత్=వికారమును పొందిన, తామసాచ్చ=తామసాహంకారము నుండి, శబ్దమాత్రం=శబ్దమనెడుగుణము (తన్మాత్ర యన్నమాట) అభూత్=ఏర్పడినది. తస్మాత్=ఆ గుణమునుండి, నభః=ఆకాశము ఏర్పడినది. శబ్దగం=శబ్దములను తెలిపెడు, శ్రోత్రం=కర్ణమనెడు ఇంద్రియము ఉత్పన్నమైనది.

34. శబ్దతన్మాత్ర యొక్క లక్షణమును చెప్పుచున్నాడు. అర్థాశయత్వం =ఏదైన అర్థమును విషయీకరించుట (పదార్థములను తెలుపుట) ద్రష్టుః= సర్వజ్ఞుడైన శ్రీహరిని, లింగత్వం=తెలియపఱచు, నభసః=ఆకాశము యొక్క తన్మాత్రత్వం=ఒక్కటే గుణముగా నుండుటయు, శబ్దస్య=శబ్దము యొక్క, లక్షణం=లక్షణము, విదుః=తెలియుదురు. దీనికి ప్రమాణము.

శబ్దేనైవయతో జ్ఞేయో హరిర్లింగంతు తస్యతత్,
స్పర్శాద్యభావాత్తన్మాత్రా నభసశ్చేతి కీర్త్యతే.

స్పర్శాదయశ్చ తన్మాత్రాః ఇతరే పూర్వ సంస్థితే,
తిష్ఠత్యేకోగుణోభూతే ప్రత్యేకం పంచసు స్థితః.

శబ్దో వర్ణాత్మకో నిత్యః ధ్వనిరాకాశ సంభవః,
ఆకాశ ఏవ సూక్ష్మస్తు ధ్వని రిత్యేవ శబ్యతే.
స ఏవ వ్యజ్య మానస్తు భవే త్కర్ణైకగోచరః.

శ్రీహరి శబ్దము చేతనే తెలిసికొనఁబడు వాఁడగుట చేత శబ్దము శ్రీహరికి లింగ మనిపించుకొనుచున్నది. ఆకాశమందు స్పర్శాదులు లేకుండుటచేత శబ్దము ఆకాశతన్మాత్ర యనిపించుకొన్నది. స్పర్శాదులు దానికి ముందటి గుణములతో చేరి యున్నను స్వభావగుణములుగా లెక్కింపఁబడి భూతముల తన్మాత్ర లనిపించుకొనుచున్నవి. శబ్దము వర్ణమని ధ్వనియని రెండు రీతులు. వర్ణాత్మక శబ్దము రెండురీతులు. ధ్వని ఆకాశమందు జన్మించును. సూక్ష్మాకాశమునకు ధ్వని యనిపేరు. వ్యక్తమైన ఆ శబ్దము కర్ణమునకు మాత్రమే విషయమై యుండును.

తాత్పర్యము: మూఁడు భాగములుగా కాక ఒక్కటిగానే యున్న అహంకారమునకు సూక్ష్మాహంకార మనిపేరు. దీనికి సంకర్షణ రూపుఁడైన శ్రీహరి నియామకుఁడు. ఇతఁడే పంచ మహాభూతములకును, జ్ఞానకర్మేంద్రి యములకును ప్రధాన ప్రవక్త. ఇతని కనంత శిరస్సులు, గుణదేశ కాలములతో కొనలేని వాఁడితఁడు. మూఁడు భాగములను పొందిన అహంకారమునకు స్థూలాహంకారమని పేరు. దీనికి నియామకుఁడు ప్రద్యుమ్నుఁడు. సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపములచేత ప్రేరితుఁడైన వేయి పడగలుగల శేషుఁడు ఈ యహంకారతత్త్వమున కభిమాని. మనస్తత్త్వమునకు కారణమైన వైకారికాహం కారము కర్తయనిపించుకొనును. ఇంద్రియములకు కారణమైన తైజసాహంకారము కరణము. పంచభూతములకు భౌతిక పదార్థములకు కారణమైన తామసాహంకారము కార్యము. వైకారికాహంకారము శ్రీహరి యందు నిషను కలిగించుటచేత శాంత మనిపించుకొనును. తైజసాహంకారము ఇంద్రియముల చేత ఘోర పదార్థజ్ఞానము, ఘోర కర్మములకు కారణ మగుట చేత ఘోర మనిపించు కొనును. తామసాహంకారము పంచ భూతములకు కారణము. దీనికి మూఢ మనిపేరు. ఏ మాత్రమైన జ్ఞానమునకు ఇది అవకాశమివ్వదు. శ్రీహరి ఇచ్ఛచేత వైకారికాహంకారము వికారమును పొంది మనస్తత్త్వముగా పరిణమించినది. సంకల్పవికల్పములు దీని వ్యవహారములే. దీని నుండియే అనేకములైన కోర్కెలు ఉత్పన్న మగును. ఇంతకు ముందు చెప్పిన ప్రద్యుమ్న రూపమునుండి అభివృద్ధి నందిన అనిరుద్ధుఁడు మనస్తత్త్వమునకు నియామకుఁడు. ఇతఁడే సమస్త ఇంద్రియములకును నేత. ఇతని వర్ణము శరదిందీవరశ్యామము. సనకాదు లితనిని అవ్యగ్రమైన మనస్సులో ధ్యానింతురు. ఇతఁడే కామపుత్రుఁడైన అనిరుద్ధునియందు అంతర్యామిగా ఉండును. మనస్సు స్వాభావికముగా నడ్డగింపరాక ప్రసరించుటచేత అనిరుద్ధమని పిలువఁబడును. ఇది ఎప్పుడును దుష్కార్యములనే ఆలోచించుచుండుటచేత దీని వర్ణము నీలమన్నాము. సమస్తేంద్రియములను నియమించున దిదియే. ఇట్టి మనస్సును యోగులు ప్రాణాయామాదులచేత క్రమముగా వశపఱుచుకొందురు. శ్రీహరి ఇచ్ఛకు తైజసాహంకారము వికారమంది బుద్ధితత్త్వమని పించుకొను చున్నది. నిర్దోషములైన ఇంద్రియములనుండి పదార్థము ప్రత్యక్షమైనపుడు వాని విశేష

జ్ఞానము ఈ తత్త్వము నుండి ఏర్పడును. సంశయము, భ్రాంతి, నిశ్చయము, స్మరణ, అజ్ఞానము ఇవియన్నియు ఈ తత్త్వము యొక్క స్వాభావిక లక్షణములు. జ్ఞానేంద్రియములు తైజసాహంకారపరిణామములే. వీనిలో కర్మేంద్రియములకు ఆహంకారిక ప్రాణము అభిమాని దేవత. జ్ఞానేంద్రియములకు ఉమాదేవి దేవత. శ్రీహరి ప్రేరణతో వికారమందిన తామసాహంకారము నుండి శబ్ద తన్మాత్రము జన్మించినది. దానినుండి ఆకాశ ముత్పన్న మయ్యెను. శబ్దజ్ఞానము పుట్టించెడు శ్రోత్రేంద్రియ గోళకము కూడ ఉత్పన్న మైనది. పదార్థములను తెలుపుట - శ్రీహరిని గూర్చి తెలుపుట ఆకాశము యొక్క గుణము. ఇవి శబ్దము యొక్క లక్షణములు.

35. ఆకాశలక్షణమును చెప్పుచున్నాఁడు - భూతానాం=ప్రాణులకు, ఛిద్రదాతృత్వం=గమనాదుల కవకాశ మిచ్చుట, చ=మఱియు, బహిః అంతరం=లోపలను బయటను దిక్కుల రూపముగా నుండుటయు, ప్రాణేంద్రియాత్మధిష్ణ్యత్వం=ప్రాణాపానాదులకును, ఇంద్రియములకును, జీవములకును వాసముల కర్మమైన స్థానముగా నుండుట, నభసః=ఆకాశము యొక్క, వృత్తి లక్షణం=స్వాభావిక లక్షణ మని జ్ఞాను లందురు.

36. ఆకాశమునుండి స్పర్శము యొక్క ఉత్పత్తిని చెప్పుచున్నాఁడు. శబ్దతన్మాత్రాత్=శబ్దమనెడు తన్మాత్రను పొందియున్న, నభసః=ఆకాశమునుండి, కాలగత్యా=శ్రీహరి ప్రేరణతో, వికుర్వతః=వికారమును పొందుట చేత, స్పర్శతన్మాత్ర ఏర్పడినది, తతః=ఆ స్పర్శతన్మాత్రనుండి, వాయుః=వీచెడుగాలి ఏర్పడినది. స్పర్శస్య=ఆ స్పర్శతన్మాత్రనుండి, సంగ్రహః=స్పర్శ జ్ఞానమునకు కారణమైన, త్వక్చ=త్వగింద్రియమేర్పడినది, సూత్రనామకుఁడైన ప్రధాన వాయుదేవుఁడు మహత్తత్త్వాభిమానులతో పాటు జన్మించెను. ఆహంకారిక ప్రాణము భూతవాయువునకు అభిమాని, ఇంకను స్పర్శాభిమానులైన దేవతలు ఆ ప్రధానవాయుదేవుని యొక్క సంతానము. అతనిచేత ఆవిష్టులు. అతనినే ఆశ్రయించి ఉండువారు. అతని బలముచేత వ్యవహరించెడు వారు. కాని వారు ఇతనికంటె భిన్నజీవులు. దీనికి ప్రమాణము.

ప్రధానవాయు స్సూత్రాత్మా మహతా సహజాయతే,
తైజసశ్చ భుజః స్పర్శ ఇత్యాద్యాః తత్సుతాః స్మృతాః.
తదావిష్టా అన్యజీవాః తదాధారాశ్చ తద్బలాః.

స్పర్శాదులు కూడ వాయ్వాది భూతముల సూక్ష్మావస్థలని చెప్పుటచేత ఇచ్చట కార్యకారణభావము ఉపచయభావనతోనని తెలియవలెను.

సూక్ష్మేంద్రియాణి సంత్యేవ స్యుః స్థూలాన్యప్యహంకృతేః,
భూతేభ్యశ్చోపచీయంతే పునర్బ్రహ్మశరీరతః.

అనెడు ప్రమాణముతో సూక్ష్మేంద్రియము లుండనే యున్నవి. అహంకారముతో స్థూలము లగును. భూతములనుండి. ఉపచయమును పొందును.

37. స్పర్శతన్మాత్ర లక్షణమును చెప్పుచున్నాడు. మృదుత్వము, కఠినముగా నుండుట, శైత్యము, ఉష్ణత్వము - ఇవి స్పర్శలక్షణములు. నభస్వతః తన్మాత్రత్వం =తన్మాత్రగానుండుట స్పర్శమనిపించుకొనును. ఇవి స్వభావ లక్షణములు.

38. వాయువు యొక్క స్వరూప లక్షణమును చెప్పుచున్నాడు. చాలనం =ఆడించుట, వ్యూహనం=వేఱుగా నున్నదానిని చేర్చుట, ప్రాప్తిః=ఎల్లవస్తువు లందును వ్యాపించి యుండుట, ద్రవ్యశబ్దయోః=ఆకులు మొదలైన ద్రవ్యముల యొక్క, వర్ణాత్మక ధ్వన్యాత్మక శబ్దములను ఒక్కచోటి నుండి మఱియొక్క చోటికి తీసికొని పోవుట, సర్వేంద్రియాణాం=సమస్త ఇంద్రియములకు. ఆత్మత్వం=స్వామియై ఉండుట, (2) వాయువు లేక ఏ ఇంద్రియము వ్యాపారము నడుపలేదు. ఇవి వాయ్వోః=వాయువుయొక్క, కర్మాభి లక్షణం=కర్మనిమిత్తకమైన స్వరూప లక్షణము. ఇచ్చట కర్మ మనఁగా స్వరూప మని పేరు. "స్వరూపమపి కర్మేతి విషయత్వాత్ విధీయతే" సర్వ పదార్థ వ్యాప్తియు ప్రధాన వాయువునకు చెల్లదగినది. కాని ప్రధాన వాయువు యొక్క గుణగణములను అప్రధానమందు చెప్పుచున్నాడు. దీనితో ప్రధాన వాయువునకు ఏ విధమైన నీచత్వము ఏర్పడుట లేదని తెలియవలెను. దీనికి ప్రమాణము.

"ప్రాప్నోతివాయుః సర్వం తు స్వత ఏవ హరేస్తథా,
అతః ప్రాప్తి రితి ప్రాహుః వాయుం భూతపతిం ప్రభుమ్.
ప్రధానవాయు రన్యేషు నిత్యావిష్టోయతస్స్వతః,
తద్గుణా స్తేషు చేష్యంతే నీచతా నాస్య తత్కృతా.

ప్రధాన వాయువు అప్రధాన వాయువులందు నిరంతరము అవిష్టమై ఉండుటచేత దాని గుణములను ప్రధానమందు కూడ చెప్పెదరు. దీనినుండి ప్రధాన వాయువున కే నీచత్వమును లేదు.

39. దైవేరితా=శ్రీహరి నుండి ప్రేరితమైన, స్పర్శమే తన్మాత్రగా ఉన్న వాయువు నుండి, రూపం=రూపతన్మాత్ర, అభూత్=ఏర్పడినది. తతః=ఆ రూప తన్మాత్రనుండి, తేజః=తేజస్తత్త్వము, సముత్థితంరూపోపలంభనం= రూప జ్ఞానమును కలిగించెడు, చక్షుః=చక్షురింద్రియము, సముత్థితం.

40. రూపతన్మాత్రా లక్షణమును చెప్పుచున్నాడు. ద్రవ్యాక్పతిత్వం= పదార్థముండునంతవఱకుండుట, గుణతా=ప్రకాశము కల్గియుండుట, వ్యక్తి సంస్థానం=వ్యక్తిగా నుండుట, తేజస్త్వం=తేజస్సంపన్నమై యుండుట, తేజసః =తేజ స్సంబంధియైన, రూపమా త్రస్య=రూపతన్మాత్ర యొక్క, వృత్తయః =స్వాభావిక లక్షణములు.

41. తేజో లక్షణమును చెప్పుచున్నాఁడు. ద్యోతనం=ప్రకాశపఱచుట, పచనం=పక్వము చేయుట, పాసం=రసమును త్రాగుట, అదనం=భక్షించుట, హిమమర్దనం=శైత్యమును పోఁగొట్టుట, శోషణం=ఎండించుట, క్షుత్తృడేవ=ప్రాణులకు క్షుత్పిపాసలు కలిగించుట. ఏతాః చేతసః వృత్తయః=ఇవి తేజస్సు స్వభావ లక్షణములు.

42. క్రమప్రాప్తియైన నీటి సృష్టిని తేజోమూలకముగా చెప్పుచున్నాఁడు. శ్రీహరి చేత ప్రేరితమై వికారమందు రూపతన్మాత్రగల తేజస్సునుండి రసతన్మాత్రయు, దానినుండి, అంభఃనీరు, రసగ్రహఃరసజ్ఞానము నేర్పఱచెడు, జిహ్వా=జిహ్వేంద్రియము, అభూత్.

43. రసగుణ లక్షణమును చెప్పుచున్నాఁడు. భౌతికానాం= భూతకార్యము లైన పదార్థముల యొక్క, వికారేణ=వికారమునుండి, ఏకఃరసఃఒకటే రసము, కషాయఃవగరు, మధురఃతీపి, తిక్తఃకారము, కటుఃకటువు, అమ్లఃపులుపు, లవణ ఇతి=లవణమని, నైకధా=అనేకవిధములై (ప్రధానముగా ఆరురీతులై) విభిద్యతే=వేఱుగుచున్నవి.

44. నీటి లక్షణమును చెప్పుచున్నాఁడు. క్లేదనం=పాఱుటయు, పిండనం=ముద్దయగుట, తృప్తిఃచాలనెడు భావమును పుట్టించుట, ప్రాణనం=చేష్టకు కారణ మగుట, ఆప్యాయనం=సంతోషమును కలిగించుట, ఔదనం=బిందువు లగుట, తాపాపనోదనం=తాపమును పోఁగొట్టుట, భూయస్త్వం=తక్కినభూతముల కంటె పెచ్చుగా కార్యములందుట, ఇమాఃఇవి, అంభసఃనీటియొక్క, వృత్తయఃస్వాభావిక లక్షణములు.

45. నీటినుండి పృథివీ లక్షణమును చెప్పుచున్నాఁడు. పరమాత్మచే ప్రేరితమై వికారమును పొందిన రసమే తన్మాత్రగా గలిగిన, అంభసాంనీటినుండి, గంధ తన్మాత్ర అభూత్. తస్మాత్=ఆగంధమునుండి పృథ్వీ=భూమి (సృష్టమైనది) గంధగఃగంధమును తెలిపెడు, ఘ్రాణస్తు=ఘ్రాణేంద్రియము, అభూత్=అయినది.

46. గంధ లక్షణమును చెప్పుచున్నాఁడు. ఏకఃగంధఃఒకటే గంధము, ద్రవ్యావయవ వైషమ్యాత్=ద్రవ్యములు, వాని అంశములు వీని విశేష రూపమైన వ్యత్యాసము నుండి, కరంభఃఉగ్రగంధము, పూతి=దుర్గంధము, సౌరభ్యం=సువాసన, శాంత=మిశ్రవాసన, ఉగ్ర=ఘాటువాసన, అమ్ల=పులి వాసన, ఆదిభిఃవగరు వాసన మొదలుగా, అనేకరీతులైన, పృథక్=వేఱు వేఱుగా, విభిద్యతే=భిన్నమగుచున్నవి, ఒకటే వాసన అనేక రీతులుగా అగుటకు ద్రవ్యావయవముల వైషమ్యమే కారణ మని చెప్పినట్లైనది.

47. భూమి లక్షణమును చెప్పుచున్నాఁడు, భావనం=పదార్థముల ఉత్పత్తికి కారణమై యుండుట, బ్రహ్మణఃస్థానం=పార్థివ శరీరములను శ్రీహరి యొక్క సన్నిధాన ముండుట చేత వాని యందే పరమేశ్వరుని చూడవలెను. అందుచేత భూమియే బ్రహ్మ స్థానమని చెప్పఁబడినది. ధారణం=మూర్తద్రవ్యములను ధరించి యుండుట, సేద్యశేషణం=వాయువు, అగ్ని నీరు వీనికంటెను పెచ్చుగా వ్యక్తముగా నుండు, సర్వసత్త్వ గుణోద్భేదఃసర్వప్రాణుల శరీరములందు గుణమును వ్యక్త పఱచుట, పృథివీ వృత్తి లక్షణం=భూమి సాధారణ లక్షణము. భూతములందు భూమియే ఎక్కువగా వ్యక్తమై యుండు నని చెప్పుటకు ప్రమాణము చెప్పుచున్నాఁడు.

శరీరం పార్థివం జ్ఞేయం ఇంద్రియాణ్యోదకాని తు,
తైజసః కోష్ఠగోవహ్నిఃఛిద్రమాకాశ సంభవమ్,
ప్రాణావాయుమయా స్సర్వే ప్రత్యేకం పంచధా పునః.

ఈ ప్రమాణముతో ఈక్రింది విషయము రూఢ మగుచున్నది. శరీరము పృథ్వీ వికారము. ఇంద్రియములు జలవికారము. ఉదరగతమైన వహ్ని తేజోభూతమైన వికారము. శరీరము లోపలి ఛిద్రము ఆకాశముతో నేర్పడినది. సమస్త ప్రాణులును వాయు వికారములు. అందుచేత సమస్తము లందును భూమియే ప్రధానమైనదని, ఇదే పెచ్చుగా వ్యక్తమైనదని చెప్పుటలో వింత లేదు. "యఃపృథివ్యాం తిష్ఠన్" అనెడు శ్రుతి వచనము ననుసరించి పృథివియం దుండునని తెలియవలెను. "బ్రహ్మస్థానం తు పృథివీ శరీరే బ్రహ్మ దర్శనాత్." అనెడు ప్రమాణము శరీరముతో బ్రహ్మ స్థానము శ్రీహరి స్థానమును తెలుపును. సంసారావస్థయందు ఆయాగుణముల అభివ్యక్తి పార్థివ శరీరమందే అగుటను చూచుచున్నాము.

48,49. శ్రోత్రాదుల లక్షణమును చెప్పుచున్నాఁడు. యస్య=దేనికి, నభోగుణ విశేషఃఆకాశము యొక్క విశేషగుణమైన శబ్దము, అర్థఃవిషయమో, (గోచరమగునో) తత్=అది, శ్రోత్రేంద్రియమని, ఉచ్యతే=చెప్పఁబడును. దేనికి వాయువు యొక్క విశేషగుణమైన స్పర్శము విషయమో అది స్పర్శనేంద్రియమని తెలియునది. దేనికి తేజస్సు విశేషగుణమో దానిని చక్షుస్సందురు. దేనికి నీటి గుణవిశేషమైన రసము విశేషమో దానిని రసనేంద్రియ మందురు. భూమి విశేషణమైన గంధము దేనికి విషయమో దానిని ఘ్రాణ మందురు.

50. పరస్య=ఇంతకుముందు ముందు చెప్పిన కారణములకు భూతమైన, జన్మ=జన్మము, సమన్వయాత్=సంబంధము వలన, అపరస్మిన్=ముందు ముందు వచ్చినకార్యములైన భూతములందు, దృశ్యతే=కన్పించుచున్నది. అతఃఇట్లు సమస్త గుణముల సంబంధముండుట చేత, భావానాం=ఎల్లభూతముల విశేషగుణమని పించుకొన్న శబ్దాదులు ఐదు, భూమౌ ఏవ=భూమి యందే, ఉపలక్ష్యతే=చూడఁబడుచున్నవి. దీని నుండి వైశేషిక దర్శనము యొక్క

సిద్ధాంతమును ఖండించినట్లైనది. దాని యందు శబ్దాదులు ఆకాశాదులు విశేషగుణము లనియు వ్యాపక ధర్మములనియు చెప్పుదురు. కాని వస్తు స్థితి అట్టిది కాదు. ఆకాశమందు శబ్దము , వాయువునందు శబ్ద స్పర్శములు, తేజస్సునందు శబ్దస్పర్శరూపములు, పృథివి యందు శబ్దస్పర్శరూపరస గంధములు - ఐదునూ ఉండును. దీనినే "సర్వ సత్త్వ గుణోద్భేదః" అని ముందు చెప్పినట్లు 'దృశ్యతే' అనుటచేత ప్రత్యక్షము. ప్రబల ప్రమాణమైనందువల్ల ఆ ప్రమాణమునకు విరుద్ధమైనది వైశేషిక సిద్ధాంతమని చెప్పనట్లైనది

51. రెండు పరమాణువులు చేరి ద్వ్యణుకము. ఈ క్రమముతోనే భాగములు వానినుండి ఒక్కటియనిపించుకొను పదార్థము సృష్టియగును అనెడు వైశేషిక సిద్ధాంతము సరికాదు. ఎందుకనఁగా మహత్తత్త్వాదితత్త్వముల అభిమాని దేవతల స్తోత్రముచేత ప్రసన్నుఁడైన శ్రీహరి వారియందు ప్రవిష్టుఁడై వాని తత్త్వమును వ్యక్తపఱుచుటచేత బ్రహ్మాండాది పదార్థముల సృష్టి ఏర్పడిన దని చెప్పుచున్నాఁడు. యదా=ఎప్పుడు, ఏ తాని=పైన చెప్పిన, మహాదాదీని=మహత్తత్త్వాదులైన, సప్త=ఏడుతత్త్వములు, అసంహత్య స్థితానీ=జడము లగుట చేత, స్వతఃఁ=ఒకదానితో నొకటి చేరెడు శక్తి లేక వేఱుగా ఉండునవై, అంజసా=సరిగా, భోగాయతనం=బ్రహ్మాండమును, పురుషం=విరాట్పురుషుని శరీరమును, సృష్టుం=సృష్టించుటకు, నశేకుఃఁ=సమర్థములు కాలేదో, తదా=అప్పుడు, కాలకర్మగుణోపేతఃఁ=కాలకర్మ గుణములనే కారణములుగా నెంచికొన్న, జగదాదిఃఁ=ముఖ్య సృష్టికర్తయైన శ్రీమన్నారాయణమూర్తి, ఉపావిశత్=ఆయాతత్త్వములు కార్యోత్పత్తి సమర్థములైన శక్తిని గలవిగా చేయుటకు వాని యందు సన్నిహితుఁడైనాఁడు.

52. ఈ రీతిగా శ్రీహరి సన్నిహితుఁడైన దాని వలన ఏర్పడిన ఫలమును చెప్పుచున్నాఁడు. తతఃఁ=తరువాత, తేన=ఆహరిచేత అనువిద్దేభ్యఃఁ=ప్రవేశించి ప్రేరేపించఁబడిన, తత్త్వేభ్యఃఁ=తత్త్వముల వలన, అచేతనం=జడమైన, అండం=బ్రహ్మాండము, ఉత్థితం=లేచినది. యస్మాత్=ఆ అండమునుండి, అసౌ=ఈ, విరాట్=విశేషముగా ప్రకాశమైన, పురుషఃఁ=బ్రహ్మ దేవుఁడు, ఉదతిష్ఠత్= లేచెను. దీనికి ప్రమాణము.

"అచేతనాద్యత్స్థండాత్ బ్రహ్మా సమజని స్ఫుటమ్,
అతో బ్రహ్మాండమిత్యాహుఃఁ విరాట్ బ్రహ్మా ప్రకాశనాత్."

53, 54. ఈ బ్రహ్మాండము పృథివ్యాధిక్యము గలది. వేఱొక్క పేరు గలదిగా నైనదను నభిప్రాయముతో చెప్పుచున్నాఁడు. ఏతత్=ఈ, విశేషాఖ్యం=విశేషమను పేరు గల, అండం=బ్రహ్మాండము, బహిఃఁ=బయట, క్రమవృద్దైఃఁ=ఒక దాని కంటె మరి యొకటి పైచ్చైన, దశోత్తరైఃఁ=పదిపాళ్లెక్కువగల, తోయాదిభిఃఁ=జలాగ్ని వాయ్వాకాశ అహంకార మహత్తత్త్వములచేత, పరివృతం=చుట్టుకొనఁబడినది. దానికి తరువాత, ప్రధానేనచఁ=తమోగుణము, రజస్సు, సత్త్వగుణాధికమైన మూల ప్రకృతిచేత, ఆవృతం=ఆవరింపఁబడినది. యత్ర

ఏ ఈ బ్రహ్మాండమందు, అంతఃలోపల, ఆయం లో కవితానఃపాతాళాది పదునాలులోకముల విస్తారము, విశేషతఃవిశేషతఃవిశేషముగా విభక్తమై ఉన్నది. ఇంకను ఇది భగవతఃసర్వోత్తముఁడైన, హరేఃశ్రీహరి యొక్క సన్నిధానయుక్త మగుటచేత, రూపం ప్రతిమ. దీనికి విశేషమని పేరు. ఈ మూడు కారములతో యుక్తమని చెప్పఁబడినట్లైనది.

55. ఇపుడు బ్రహ్మదేవుఁడు పుట్టినను విషయము వివరించుచున్నాఁడు. మహదేవఃసర్వోత్తముఁడైన శ్రీహరి, సలిలేశయాత్నీటి యందున్న, హిరణ్మ యాత్స్వర్ణమయమైనటి అండకోశాత్బ్రహ్మాండమును, ఉతాయవైకెత్తి, తం=ఆ బ్రహ్మాండమును ప్రవేశించి దాని యందున్న అండాత్మకమైన బ్రహ్మ దేవుని దేహమును కూడ సన్నిధానసహితమగు నట్లుగా ప్రవేశించి, లోపలనుండిన వాఁడై, బహుధాముఖాద్యనేక రీతులుగా, ఖం=ఆకాశమును, నిర్భిద=వ్యక్తపఱచెను.

56.57. బ్రహ్మదేవుని శరీరమందు, ముఖాదులు వ్యక్తమైన ప్రకారమును చెప్పుచున్నాఁడు. అస్య=ఈ బ్రహ్మదేవునకు, ప్రథమం=అన్నిటికంటె మొదలు, ముఖం, నిరభిద్యత=ముఖము వ్యక్తమయ్యెను తతఃఆముఖము నుండి, వాణీ=వాగింద్రియము, అభవత్=అయ్యెను, వాణ్యాఃవాగింద్రియమునుండి, వహ్నిఃవాగింద్రియాభిమానియైన అగ్నివ్యక్తుఁడయ్యెను. ఇట్లె ఇఁకమీఁదను గోళకము, ఇంద్రియము, ఇంద్రియాభిమాని దేవతలు వీరివ్యుత్పత్తిని తెలియ వలెను. తతఃఅనంతరము, నాసేఁరెండు నాసాద్వారములు వ్యక్తమయ్యెను. తతఃవానినుండి ఘ్రాణేంద్రియము వ్యక్తమయ్యెను, ఏతయోఃవీనినుండి ప్రాణములు వ్యక్తమైనవి. దీని నుండి ప్రాణాధిదైవమైన వాయుదేవుని ఉత్పత్తి ఏర్పడినది ఒక్కదేవతకే ఆధ్యాత్మికముగా ప్రాణమనియు, అధిదైవికముగా వాయువనియు పేరు. తరువాత అక్షిణీకన్నులు వ్యక్తము లైనవి. ఏతయోఃవీనినుండి, చక్షురింద్రియము వ్యక్తమైనది. దానినుండి సూర్యదేవుని అభివ్యక్తి ఏర్పడెను. ఆ తరువాత కర్ణౌచెవులు వ్యక్తము లైనవి. వానినుండి శ్రోత్రేంద్రియము, దాని నుండి దిగ్దేవతలు వ్యక్తము లైరి.

58, 59. విరాజఃబ్రహ్మదేవునకు, త్వక్చర్మము వ్యక్తమయ్యెను. దాని నుండి రోమరోమములు, శ్మశ్ర్వాదయఃగడము మొదలైనవి ఏర్పడినవి, తరువాత, ఓషధయఃఓషధులు, తదభిమాని దేవతలు, పశ్చాత్అనంతరము, శిశ్నంపురుష సూచకమైన గోళక మేర్పడెను. దానినుండి ఉపస్థేంద్రియము వ్యక్తమైనది. తదభిమానులు వ్యక్తమైరి. దానినుండి రేతస్సు, ఆ రేతస్సు నుండి, ఆపఃజలాభిమాని దేవతలు ఏర్పడిరి. అనంతరము, గుదంపాయువును, దానినుండి, వాయురింద్రియమును ఏర్పడెను. అపానవాయువు, లోకభయంకరఃలోకమునకు భయము కలిగించెడు, మృత్యుఃమృతదేవతయు వ్యక్తులైనారు.

60. చేతులు వ్యక్తములైనవి. వాని నుండి బలము, దాని నుండి స్వరాట్ఇంద్రుఁడు, పిదప కాళ్ళు వ్యక్తము లైనవి. దానినుండి గతిఃఁ

=నడపు అనగా పాదేంద్రియము, దాని నుండి హరిః=తదభిమానియైన యజ్ఞుడనెడు దేవత, తదంతర్యామిగా శ్రీహరియు వ్యక్తుడైనాడు. బ్రహ్మణులు అంగుష్ఠమును తొలచి నీరు త్రాగువారికి (ఇది శైవసంప్రదాయము) ఫలము నొసగుటకై పాదాభిమానియైన దేవత యందు నిరంతరమును శ్రీహరి యావిష్కుడై యుండును. దీనిని తెలుపుటకై అభిమాని దేవతను చెప్పక హరినే చెప్పినాడు.

యజ్ఞనామాతు దేవోऽన్యో విజ్ఞేయః పాదదేవతా,
తమావిష్టో హరిర్నిత్యం తమాహుః పాదదైవతమ్.

పై శ్లోకము ప్రమాణము.

61. ఆ బ్రహ్మకు నాడులు వ్యక్తమైనవి. నాడులనుండి రక్తముత్పన్న మయ్యెను. దానినుండి నదులు, తదభిమాని దేవతలు పిదప ఉదర మేర్పడినది.

62. ఆ ఉదరమునుండి, క్షుత్పిపాసే=ఆకలిదప్పులు కలినవి. వానినుండి సముద్ర ముత్పన్నమైనది. అథ=ఉదరము వ్యక్తమైన తరువాత, హృదయము వ్యక్త మయ్యెను. దానినుండి మన స్సేర్పడెను. ఇచ్చట హృదయము గోళక మనియు మన స్సింద్రియ మనియు తెలియవలెను.

63. మనస్సునుండి చంద్రుడేర్పడినాడు. ఆ హృదయమునుండి బుద్ధి (ఇది మనస్సు యొక్క ఒక భేదము) దాని నుండి గిరాంపతిః=బృహస్పతియు జన్మించెను. తతః=ఆ హృదయమునుండి, అహంకారః= నేననెడు అహంకారము (ఇది గూడ మనస్సు యొక్క ఒక ప్రభేదము) దాని నుండి తదభిమాని యైన రుద్రుడు జన్మించినాడు. తతః=ఆ హృదయమునుండియే, చిత్తం= పదార్థములను గ్రహించెడు చిత్తమును, దానినుండి, చిత్తాభిమానియైన బ్రహ్మ దేవుడును (రూపాంతరముతో పుట్టెను.) బ్రహ్మదేవుని అంతర్యామిగా విష్ణువు మఱి యొక్క రూపముతో వ్యక్తుడయ్యెను.

చైత్యోऽపి భగవాన్ విష్ణుః అంతర్యామీ చతుర్ముఖాత్,
స్వేచ్ఛయా వ్యక్తి మగమత్ తతోऽసౌ బ్రహ్మజ స్మృతః.

అను ప్రమాణము ననుసరించి శ్రీహరి చిత్తాభిమానియైన బ్రహ్మదేవుని నుండి వ్యక్తుడైనాడు. బ్రహ్మజుడైనాడు. పై చెప్పిన విషయము లన్నియు ఐతరేయోపనిషత్తులో ఉన్నవే.

64. వాయువే రాబోవు కల్పమందు బ్రహ్మకాబోవుటచేత వీరిరువురొక్కరే. వీరిలో నొక్కరికి ఉత్తమత్వము చెప్పినచో మఱియొక్కరికి కూడ చెప్పినట్లే. ఇట్టు నిశ్చయించి వాయువు జీవోత్తముడని తెలుపుటకై అగ్న్యాదిదేవతల వివాదముచేత ఆ విషయము నిరయమైన పద్ధతిని తెల్పుచున్నాడు. దీనినుండి "అహముక్తమస్మి" అనెడు ఐతరేయోపనిషత్తు నందలి వాక్యముల అర్థమును కూడ వివరించినానని చెప్పవలెను. అభ్యుత్తితాః=వ్యక్తులైన, ఏతే దేహాః=ఈ ఇంద్రియాభిమాని దేవతలు, అస్య=ఆ బ్రహ్మదేవుని యొక్క, శరీరమును, ఉత్థాపనే=లేపుటందు, నైవ అశకన్=సమర్థులు కాలేదు. తం=ఆ శరీరమును,

ఉత్థాపయితుం=లేపుటకు, (అనఁగా చైతన్య యుక్తముగా నొనర్చుటకు) క్రమాత్=క్రమముగా ఒక్కొక్కరే, ఖాని=ఇంద్రియగోళకములను, పునః ఆవివిశుః=ప్రవేశించిరి.

65, 66, 67, 68, 69, 70, 71. అగ్ని వాగింద్రియముతో ముఖమును ప్రవేశించెను. కాని బ్రహ్మదేవుని శరీరము పైకి లేవలేదు. నాసిక వాయువు ఘ్రాణేంద్రియముతో నాసాపుటమును ప్రవేశించెను. కాని ఫలముశూన్యము. పిదప సూర్యుఁడు చక్షురింద్రియముతో కన్నులను ప్రవేశించినాఁడు. ఫలము శూన్యము. దిగేవతలు శ్రోత్రేంద్రియముతో కర్ణమును ప్రవేశించిరి. పనికి రాలేదు. ఓషద్యభిమానులు రోమములతో చర్మమును ప్రవేశించినారు. ఫలము లేదు. జలాభిమాని రేతస్సుతో శిశ్నమును చేరెను. లాభము లేదు. మృత్యుదేవత అపానముతో గుదమును ప్రవేశించెను. ఫలముశూన్యము. ఇంద్రుఁడు బలముతో హస్తములను చేరినాఁడు లాభములేదు. విష్ణువు పాదాభిమానియైన యజ్ఞమునందుండి గమనముతో పాదములను ప్రవేశించి నాఁడు. ఫలరహితము. నద్యభిమానులు నాడులతో రక్తమును ప్రవేశించిరి. ఫలముశూన్యము. సముద్రాభిమాని ఆకలిదప్పులతో ఉదరము చేరినాఁడు లాభము లేదు. చంద్రుఁడు మనస్సుతో, బృహస్పతిబుద్ధితో, రుద్రుఁ డహంకారముతో హృదయమును ప్రవేశించిరి. కానీ విరాట్పురుషుఁడు లేవలేదు. "విష్ణురత్యేవ" అని ఏవకారమును చెప్పుటచేత గమనముకే ప్రవేశించెను గాని దేహమును లేపుటకు కాదని అర్థము. అందుచేత శ్రీహరికి కూడ దేహమును లేపెడుశక్తి ఉండలేదని తెలియరాదు. శక్తుఁడైనను శ్రీహరి బ్రహ్మవాయువుల బలము తెలుపుటకై అపుడు దేహమును లేపలేదు. ఆ తరువాత బ్రహ్మవాయువుల అంతర్యామియై వారితో పాటు ప్రవేశించి ఆ దేహమును ఉత్థాపన మొనర్చెనని తెలియవలెను. దీనికి ప్రమాణము.

"యజ్ఞాంతస్తా స్వయం పాదౌ విశన్నోత్థాపయ ద్ధరిః,
శక్తోఽపి బ్రహ్మవాయ్వోఽస్తు బలజ్ఞాప్త్యై జనార్దనిః".

"అహంసువే పితరమస్యమూరన్" అనెడు శ్రుతియు బ్రహ్మదేవుని కంటె లక్ష్మి ఉత్తమురాలని, ఆమె కంటె అనంత గుణగుణములతో శ్రీహరి యుత్తముఁడని తెలిపినటు లైనది.

72. ఇట్టు నీటియందున్న బ్రహ్మదేవుని శరీరము ఎవరు పైకెత్తుటకు శక్తులు కాకపోవుటచే నీటియందే ఉండెనని ఆశంకించి వాయువు లోపల ప్రవేశించుటచేత లేచినది. ఇదియే క్షేత్రజ్ఞుఁడైన శ్రీహరి స్వరూపము బ్రహ్మాంతర్యామి యైనవాఁడు. వాయువు బ్రహ్మయందు ప్రవేశించి ఆ శరీరమును పైకెత్తెనని చెప్పుచున్నాఁడు. యదా=ఎప్పుడు, క్షేత్రజ్ఞుఁడైన చైతన్యః=బ్రహ్మాంతర్యామియైన శ్రీహరి, బ్రహ్మవాయువులతో పాటు, చిత్తముతో హృదయమందు ప్రవేశించెనో, తదైవ=అప్పుడే పురుషుఁడని పిలువఁబడెడు బ్రహ్మదేవుని శరీరము, సలిలాత్=నీటినుండి, ఉదతిష్ఠత=పైకి లేచినది. బ్రహ్మ దేవుఁడు

ఒక అంశముతో తనదేహమందు సుప్తుఁడై యుండి మఱి యొక్క అంశముతో వాయు విష్ణువులతో పాటు బయటికేగెను. అపుడు దేహము పడి పోయినది. మరల నా దేహము నెత్తుటకు ఒక్కొక్కరుగా దేవతలు లోపల ప్రవేశించినను సాధ్యము కాలేదు. తరువాత అది లేవవలె నన్నచో మహాబలిఁ లైన ముగ్గురు దేవతలు (వాయువు, బ్రహ్మ, విష్ణువు) ప్రవేశింపవలసి వచ్చెను. వారిలో కూడ శ్రీహరి ప్రభావము చేతనే అది పైకి లేచెనని చెప్పవలెను. చిత్తమున కభిమాని బ్రహ్మదేవుఁడు. తదంతర్యామి యైన క్షేత్రజ్ఞుఁడైన శ్రీహరియు నియామకుఁడు. ప్రాణమే వాయుదేవుఁడు. ఆ బ్రహ్మవాయువులకు స్వతంత్రుఁడైన శ్రీహరి యే నియామకుఁడని తెలిసి శ్రీహరియే సర్వోత్తముఁడని తెలియవలెను. దీనికి ప్రమాణము.

అంశేన సుతో బ్రహ్మాతు అంశేన నిరగా త్తథా
స్వదేహా ద్వాయుసహితో విష్ణునాచ జగత్పభుః.
తముత్థాపయితుం దేవాః తస్థేతే త్రీన్ మహాబలాన్
నాశక్నువన్నేక సంస్థాః తతస్తే త్వవిశం స్సయః
ఉదతిష్ఠద్బ్రహ్మదేహః తదా తేషాం ప్రభావతః,
విశేషేణ హరే రేవ ప్రభావేన శ్రియః పతేః
చిత్తాభిమానీ బ్రహైవ క్షేత్రజ స్తద్గతో హరిః,
ప్రాణో వాయు రితిప్రోక్తః తయో రీశో హరి స్స్వయమ్.

73,74. శ్రీహరి సర్వోత్తముఁడగుటచేత సర్వశక్తుఁడని ఇచ్చట స్పష్టముగా తెలియుటలేదు. నీవు బలాత్కారముగా నీయరమును పీకుచున్నావని ఆశంకించి ఇచ్చట ప్రతీత మగుచున్న "ప్రాణదేవు డున్ననే దేహమందు చైతన్యము. అతఁడు లేకున్నచో బ్రదుకు లేదనియే అరము శ్రీహరినే తెలుపునని విశదపఱుచు చున్నవాఁడై ఆహరినే ఉపాసింపవలెనని తెలుపుచున్నాఁడు. ప్రాణేంద్రియమనో ధియఃప్రాణము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి వీనికభిమానులైన దేవతలు, ఓజసా=ఆయాఇంద్రియార క్రియలతో కూడి, యేన వినా=ఏ క్షేత్రజ్ఞుఁడైన శ్రీహరి యొక్క సహాయమీలేక ప్రసుప్తం పురుషం=సుప్తుఁడైన బ్రహ్మదేవుని, ఉత్థాపయితుంన ప్రభవంతి=ఇది. యధారము. సత్యమైన జ్ఞానమని భావము. ఇట్టిండుట చేత, తం=సర్వోత్తముఁడైన, ప్రత్యగాత్మానం=క్షేత్రజ్ఞుఁడైన శ్రీహరిని, తస్మిన్ తం=ఈ శరీరమందు అంతర్యామి గానున్న వానిని, విరక్త్యా=వైరాగ్యము చేతను, యోగ ప్రవృత్తయా=అష్టాంగ యోగముల పక్వతతో, క్రమముగా నభివృద్ధియైన భక్త్యా=భక్తిచేత పుట్టిన, ధియా=నిశ్చయాత్మకబుద్ధితో నుండెడు, జ్ఞానేన=జ్ఞానముతో, వివిచ్య=వివేకముతో తెలిపి, ఆత్మని=హృదయమందు, చింతయేత్=ధ్యానింప వలెను.

ఇతి శ్రీమద్భాగవత మహాపురాణే, తృతీయస్కంధే, షడ్వింశోధ్యాయః.
సుధాలహరి వ్యాఖ్యా సమాప్తా.

అధ్యాయము - 26

వ. అవ్వా! యి విధంబున భక్తియోగప్రకారంబు సెప్పితి. ఇఁక దత్త్వలక్షణంబు వేఱు వేఱ యెఱిఁగింతు. ఏ తత్త్వగుణంబుల నెఱింగి నరులు ప్రకృతి గుణంబుల వలన విముక్తు లగుదురు, హృదయగ్రంథి విచ్ఛేదకంబు నాత్మదర్శన రూపంబునగు, నా జ్ఞానం బాత్మనిశ్రేయస కారణంబు గావున దాని నెఱింగింతు. అందు నాత్మ స్వరూపం బెట్టిదనిన ననాదియుఁ, బురుషుండును, సత్త్వాది గుణశూన్యుండును, బ్రకృతిగుణ విలక్షణుండును, ప్రత్యక్ స్వరూపుండును, స్వయం ప్రకాశుండును నెవ్వండు, ఎవ్వనితోడ నీవిశ్వంబు సమన్వితంబగు, నతండు గుణత్రయాత్మకంబు, నవ్యక్తంబు భగవత్సంబంధియు నగు ప్రకృతియందు (యదృచ్ఛచే) లీలావశంబునం బ్రవేశించిన, నా ప్రకృతి గుణత్రయమయంబై, సరూపంబైన ప్రజాసర్గంబుఁజేయం గనుంగొని, యప్పుడు మోహితుండై, విజ్ఞాన తిరోధానంబునం జేసి గుణత్రయాత్మకం బైన ప్రకృత్య ధ్యాసంబునఁ నన్యోన్య మేళనం బగుటయు, నంతం బ్రకృతిగుణంబు దనయందు నారోపించికొని, క్రియమాణంబులగు కార్యంబుల వలనం గర్తృత్వంబు గలిగి, సంసారబద్ధుఁడై, పారతంత్ర్యంబు కలిగి యుండు, కర్తృత్వ శూన్యుండగు నీశ్వరుండు సాక్షియగుటం జేసి యాత్మకుం గార్యకారణ కర్తృత్వంబులు ప్రకృత్యధీనంబు లనియు, సుఖదుఃఖభోక్తృత్వంబులు ప్రకృతి విలక్షణుండైన పురుషుని వనియు నెఱుంగుదురు. అని చెప్పిన విని దేవహూతి కపిలున కిట్లనియె. పురుషోత్తమా! ప్రకృతి పురుషులు సదసదాత్మక ప్రపంచంబునకుఁ గారణభూతులు గావున వాని లక్షణంబు సదసద్వివేకపూర్వకంబుగా నానతి మ్మనిన భగవంతుండైన కపిలుం డిట్లనియె. 880

క. క్రమమునఁ ద్రిగుణము నవ్య
క్తము నిత్యము సదసదాత్మకము మఱియుఁ బ్రధా
నము ననఁగా బ్రకృతి విశే
షము లదియు విశిష్ట మనిరి సద్విదు లెలమిన్. 881

వ. అందుం బ్రకృతి చతుర్వింశతి తత్త్వాత్మకంబై యుండు. అదియెట్లనినం బంచమహాభూతంబులును, బంచతన్మాత్రలును, జ్ఞానకర్మాత్మకంబులైన త్వక్చక్షుఃశ్రోత్ర జిహ్వాఘ్రాణంబులును, వాక్పాణి పాదపాయూపస్థలు నను దశేంద్రియంబులును, మనోబుద్ధి చిత్తాహంకారంబులను నంతఃకరణ చతుష్టయంబునను చతుర్వింశతి తత్త్వాత్మకంబును నైన సగుణ బ్రహ్మసంస్థానంబు సెప్పితి. ఇటమీఁద కాలంబను పంచవింశక తత్త్వంబు సెప్పెద. అది గొందఱు పురుషశబ్ద వాచ్యుండైన యీశ్వరుని పౌరుషంబు కాలశబ్దంబునఁ జెప్పంబడునందురు. అందు నహంకార మోహితుండై (ప్రకృతి నొందు జీవుండు భయంబుజెందు.) భగవంతుని

చేష్టా విశేషంబు (దేని వలన నుత్పన్నంబగునదియె) కాలంబని చెప్పంబడు. (అదియు జీవరా శ్యంతర్గతం బగుటం జేసి) పురుషుం డనియు, వాని బహిర్భాగ వ్యాప్తింజేసి కాలం బనియు (జెప్పంబడు.) ఆత్మమాయం జేసి తత్త్వాంతర్గతుండైన జీవుని వలన క్షుభితంబై (జగత్కారణంబగు) ప్రకృతియందుఁ బరమపురుషుండు దనవీర్యంబు వెట్టిన నా ప్రకృతి హిరణ్మయంబైన మహత్తత్త్వంబు పుట్టించె. అంత సకల ప్రపంచ బీజభూతుండు (లయ విక్షేప శూన్యుండనగు) నీశ్వరుండు సూక్ష్మ రూపంబున (నాత్మగతంబైన)మహదాది ప్రపంచంబులఁ జూపుచు స్వతేజోవిపత్తిం జేసి యాత్మ ప్రస్తావనంబు సేయునట్టి తమంబును గ్రసించె. అని చెప్పి వెండియు నిట్లనియె. 882

క. దివ్యమగు వాసుదేవా
ది వ్యూహచతుష్టయంబు త్రిజగములందున్
సేవ్యం బని చెప్పంబడు
భవ్యగుణా! దాని నెఱుఁగఁ బలికెద నీకున్. 883

సీ. సత్త్వప్రధానమై స్వచ్ఛమై శాంతమై
యూర్మిషట్కంబుల నోసరించి
సురుచిర షాడుణ్య పరిపూర్ణమై నిత్య
మై భక్తిజన సేవ్యమై తనర్చి
వలనొప్పుచుండు న వ్వాసుదేవ వ్యూహ
మంత మహత్తత్త్వమందు నిలి
రూఢిఁగ్రియాశక్తి రూపంబు గల్గు న
హంకార ముత్పన్న మయ్యే నదియుఁ

తే. సరవి వైకారికంబుఁ దైజ సముఁ దామ
సంబు నామూఁడు తెఱఁగుల జరగు నందుఁ
దనరు వైకారికము మనస్సునకు నింద్రి
యములకును గగనముఖ భూతముల కరయ. 884

వ. ఉత్పత్తి స్థానంబై యుండు. అదియు దేవతారూపంబున నుండు. తైజసాహంకారంబు బుద్ధిప్రాణంబులం గలిగియుండు. తామసాహం కారంబు త్రిగుణ మేళనంబున నర్థమాత్రంబైయుండు. మఱియు.885

సీ. అట్టి యహంకారమం దుదయించి సా
హస్ర ఫణామండలాభిరాముఁ
డై తనరారు ననంతుండు సంకర్ష
ణుం డనఁ దగు పురుషుండు ఘనుఁడు
మహిత భూతేంద్రియ మానసమయుఁడునై
కర్తృత్వ కార్యత్వ కారణత్వ

ప్రకట శాంతత్వ ఘోరత్వ మూఢత్వాది
లక్షణ లక్షితోల్లాసి యగుచు
తే. నుండు న మ్మేటి రెండవవ్యూహ మనఁగ
ఘనవికారంబుఁ బొందు వైకారికంబు
వలన వినుము మనస్తత్త్వ మెలమిఁ బుట్టె
మఱియు వైకారికంబును మాత! వినుము. 886.

వ. సామాన్య చింతయు విశేషచింతయు ననందగు సంకల్ప వికల్పంబులం జేసి కామసంభవ మనంబడు. ఏది యనిరుద్ధాఖ్యంబైన వ్యూహం బదియ హృషీకంబులకు నధీశ్వరంబై సకల యోగీంద్ర సేవ్యంబగుచు శరదిందీవర శ్యామంబై యుండు. వెండియుం దైజసంబువలన బుద్ధితత్త్వంబు పుట్టె. దాని లక్షణంబులు ద్రవ్య ప్రకాశంబైన జ్ఞానంబును, నింద్రియాను గ్రహంబును, సంశయంబును, మిథ్యా జ్ఞానంబును, నిద్రయు, నిశ్చయంబును, స్పృహయు ననందగియండు. తైజసాహంకారంబు వలన జ్ఞానేంద్రియ కర్మేంద్రియంబులును, గ్రియా జ్ఞాన సాధనంబులును గలిగియుండు. ప్రాణంబునకుం గ్రియాశక్తియు, బుద్ధికి జ్ఞానశక్తియు నగుటం జేసి యింద్రియంబులకుఁ దైజసత్వంబు గలిగియుండు. భగవదుక్తి ప్రేరితంబైన తామసాహంకారము వలన శబ్దతన్మాత్రంబు పుట్టె. దానివలన నాకాశంబును, నాకాశంబు వలన శ్రోత్రేంద్రియంబును బుట్టె. శ్రోత్రంబు శబ్ద గ్రాహియయ్యె. శబ్దం బర్థంబునకు నాశ్రయంబై శ్రోతకు జ్ఞానజనకం బయ్యె. మఱియు నభస్తన్మాత్రంబు సూక్ష్మాకాశంబు. ఆయాకాశంబు భూతంబులకు బాహ్యాభ్యంతరముల నవకాశం బిచ్చుటయు, నాత్మ ప్రాణేంద్రియాదులకు నాశ్రయం బగుటయు నను లక్షణంబులు గలిగియుండు. (కాలగతిచే వికారంబు నొందు) శబ్దతన్మాత్రలక్షణంబగు నభంబువలన స్పర్శంబును, స్పర్శంబు వలన వాయువును, (వాయువుచే స్పర్శగ్రాహియై)త్వగింద్రియంబును బుట్టె. మృదుత్వంబుఁ (గఠినత్వంబు) శైత్యంబు నుష్ణత్వంబను నవి (స్పర్శంబునకు స్పర్శత్వంబని)చెప్పంబడు. మఱియు వాయువునకుఁ జాలనంబును, మేళనంబును, ద్రవ్యశబ్ద నేతృత్వంబును, సర్వేంద్రియాత్మంబు ననునవి లక్షణంబులై యుండు. దైవప్రేరితంబై స్పర్శతన్మాత్ర గుణకంబగు వాయువు వలన రూపంబును, దానివలనఁ దేజంబును బుట్టె. రూపంబు నేత్రేంద్రియ గ్రాహకంబయ్యె. ద్రవ్యాకార సమత్వంబును ద్రవ్యంబునకు నుపసర్జనంబగుటయు, ద్రవ్య పరిమాణ ప్రతీతియు, నివిరూపవృత్తులనంబడు. తైజసంబునకు సాధారణంబులగు ధర్మంబులు ద్యోతనంబనఁ బ్రకాశంబు, పచనంబనఁ దండులాదుల పాకంబు, పిపాసా నిమిత్తంబైన పానంబు, క్షున్నిమిత్తకం బైన యదనంబు, హిమమర్దనంబగు శోషణంబునను నివి వృత్తులై యుండు. రూపతన్మాత్రంబు వలన దైవచోదితంబై వికారంబు నొందు. తేజస్సు వలన రసతన్మాత్రంబు పుట్టె. రసతన్మాత్రంబు వలన జలంబు

పుట్టె. జిహ్వాయను రసనేంద్రియము రసగ్రాహకంబయ్యె. ఆ రసం బేకరంబై యుండియు భూతవికారంబునం జేసి కషాయ తిక్త కట్వామ్ల మధురాది భేదంబుల ననేకవిధం బయ్యె. వెండియు సాంసరిక ద్రవ్యవికారంబునంజేసి యార్ద్రంబగుటయు, ముద్దగట్టుటయుఁ, దృప్తి దాతృత్వంబును, జీవనంబును, దద్వైకల్య నివర్తనంబును, మృదూకరణంబును, దాపనివారణంబును, గూపగతంబైన జలంబు దివియ మఱియు నుదమించుటయు ననునివి జలవృత్తు లనంబడు. రసతన్మాత్రంబు వలన దైవచోదితంబై వికారంబునుం బొందిన జలంబువలన గంధతన్మాత్రంబు పుట్టె. దానివలనం బృథ్వియుఁ గలిగె. ఘ్రాణంబు గంధగ్రాహ కంబయ్యె. (అందు నేకంబగు గంధంబు వ్యంజనాదిగతంబయి) హింగ్వాది నిమిత్తంబైన (మిశ్రగంధంబను) కరంభంబును (గృంజనాది గతంబైన) పూతిగంధంబును, ఘనసారాది నిమిత్తంబైన సుగంధంబునుఁ(శతపత్రాది గతంబగు) శాంతగంధమును (లశునాది గతంబైన) యుగ్రగంధంబును (పర్యుషిత చిత్రాన్నాది గతంబైన) యామ్లగంధంబును ద్రవ్యావయవ వైషమ్యంబునం జేసి యనేక విధంబై యుండు. అదియునుంగాక ప్రతిమాది రూపంబులంజేసి సాకార తాపాదనం బగు భావనంబును, జలాది విలక్షణ త్రయాంతర నిరపేక్షంబైన స్థితియు, జలాద్యాధారతయను ధారణంబును, నాకాశాద్యవచ్ఛేదకత్వంబును, సకల ప్రాణి పుంస్త్రాభివ్యక్తీకరణంబు ననునివి పృథ్వీవృత్తు లనంబడు. అనిచెప్పి వెండియు నిట్లనియె. నభోగుణ విశేషంబు శ్రోత్రంబును, వాయుగుణ విశేషంబు స్పర్శంబును, తేజోగుణ విశేషంబు చక్షురింద్రియం బును, అంభోగుణ విశేషంబు రసనేంద్రి యంబును, భూమిగుణ విశేషంబు ఘ్రాణేంద్రియంబునునగు. ఆకాశాది గుణంబులగు శబ్దాదులు కార్యంబు లగు వాయ్వాదులందుఁ గారణాస్వయంబునఁ జొప్పట్ట నన్నిటికిఁ బృథ్వీసంబంధంబు గలుగుటం జేసి భూమియందు స్పర్శరూప రస గంధంబులు గలుగు.(మహదాది పృథి వ్యంతంబులగు నీ యేడు తత్త్వంబులు పరస్పరామిళితంబులై భోగాయ తనంబగు పురుషనిం గల్పింప) నసమర్థంబులై యున్నం జూచి (కాలాదృష్ట సత్త్వాదులంగూడి) జగత్కారణుండును, దైగుణ్య విశిష్టుండును, సశేష నియామకుండును, నిరంజనాకారుండును నగు సర్వేశ్వరుండందుఁ బ్రవేశింప నంత నన్యోన్యక్షు భితంబులై మిళితంబులై మహదాదుల వలన నధిష్ఠాతృ చేతన రహితంబగు నొక్కయండంబు పుట్టె అందు. 887

సీ. గురుశక్తితో విరాట్పురుషుండు ప్రభవించె
నట్టి విశేషాండమర్థిఁ బొదివి
యంబుముఖా వరణంబు లొక్కొకటికి
దశగుణితంబులై తగిలి యావ

రణములై యుండును గ్రమమున లోకంబు
లకు మేలుకట్ట పోలిక దనర్చి
పంకజోదరుని రూపము నిలసించును
లోలత జలములోఁ దేలుచున్న

తే. హేమమయమైన యండంబులో మహాను
భావుఁడభవుండు హరి దేవదేవుఁడఖిల
జేత నారాయణుఁడు ప్రవేశించి యపుడు
విష్ణుపద భేదనంబు గావించి యందు. 888

సీ. కర మొప్పఁగా విరాట్పురుషుండు వెలుఁగొందు
నా విరాట్పురుషుని యాననంబు
వలనను వాణియు, వాణితో వహ్నియు,
నాసంబు వలనఁ బ్రాణములఁ గూడి
ఘ్రాణేంద్రియం బయ్యె ఘ్రాణంబు వలనను
వాయువులును, బ్రాణవాయువులును
నందు నక్షులు, చక్షువందు సూర్యుండును
నం దభిధ్యానంబు నర్థిఁ జేయఁ

తే. గర్ణములు జాత మయ్యెఁ దత్కర్ణ సమితి
వలన శ్రోత్రేంద్రియంబు దిక్కులును గలిగెఁ
ద్వక్కుచే శ్మశ్రు రోమ వితానకములు
నోషధీవ్రాతమును భవ మొందె మఖియు. 889

తే. దాని వలనను మేఢ్రంబు గానఁ బడియెఁ
బరఁ గగ రేతంబు వలన నాపంబు పుట్టె
గుదమువలన నపానంబు నుదయ మయ్యె
దానివలనను మృత్యువు దగ జనించె. 890

క. కరముల వలనను బలమును,
నిరువుగ నారెంటివలన నింద్రుఁడు పాదాం
బురుహంబుల వలన గతియు,
నరుదుగ నారెంటి వలన హరియునుఁ గలిగెన్. 891

క. ఘననాడీ పుంజము వల
నను రక్తము దానివలన నదులును జఠరం
బున నాఁకలియును దప్పియు,
ననయము నారెంటివలన నబ్ధులు పుట్టెన్. 892

క. వినుహృదయము వలనను మన
మును మనముఁ దుహిన కరుఁడు బుద్ధియుఁ జిత్తం
బున బ్రహ్మయు క్షేత్రజ్ఞుం
డును గలిగిరి య వ్విరాజుఁడున్ బూరుషతన్. 893

వ. మఱియు విరాట్పురుషునం దుదయించిన వృష్టిరూపంబులగు నాకాశాది భూతంబులును, శబ్దంబు మొదలగు భూత తన్మాత్రంబులును, వాగాదీంద్రియ జాతంబును, తదధి దేవతలును, దమంతన సమష్టి రూపుండగు క్షేత్రజ్ఞుం బ్రవృత్తి ప్రవర్తకుం జేయ నసమర్థంబులయ్యె. ఎట్టనిన దేవాధిష్ఠితంబులగు నింద్రియంబులు తాము వేర్వేఱ యయ్యీశ్వరుం బ్రవృత్త్యున్ముఖుం జేయనోపక క్రమంబునం దత్త దధిష్ఠానాదుల నొందె. అందు నగ్ని వాగింద్రియంబుతోడ ముఖంబు నొంది ప్రవర్తించిన విరాట్కార్యంబగు వృష్టిశరీర జాతంబను త్పన్నంబయ్యె. అంత నాసయు ఘ్రాణేంద్రియంబుతోడ వాయువుం గూడిన నటిదయ్యె. ఆదిత్యుండు చక్షురింద్రియంబుతోడ నేత్రంబుల నొందిన వృథాభూతం బయ్యె. దిగ్దేవతాకంబగు కర్ణంబులు శ్రోత్రేంద్రియంబుతో గూడిన విరాట్కార్య ప్రేరణా యోగ్యంబయ్యె. ఓషధులు రోమంబులం ద్వగింద్రియంబుఁ, జెంద విఫలం బయ్యె. అబ్బె వంబగు మేఢ్రంబు రేతంబు నొందినఁ దత్కార్యకరణా దక్షంబయ్యెఁ పదంపడి గుదంబు మృత్యువుతోడ నపానేంద్రియంబుఁ జేరిన నది హైన్యంబునొందె. విష్ణుదేవతాకంబు లగు చరణంబులు గతితో గూడిన నీశ్వరంబు లయ్యె. పాణీంద్రియంబు లింద్రదైవంబు లగుచు జలంబునొందిన శక్తి హీనంబులయ్యె. మఱియు నాడులు సనదీకంబులై లోహితంబు నొందిన నిరరకంబు లయ్యె. ఉదరంబు సింధువులతోడం జేసి క్షుత్పిపాసలంబొందిన వ్యర్థంబయ్యె. హృదయంబు మనంబుతోడం జంద్రునొందిన నూరక యుండె. బుద్ధి బ్రహ్మాధిదైవంబయి హృదయంబు నొందిన నిష్ఫలంబయ్యె. చిత్తంబభిమానంబుతో రుద్రునిం జెందిన విరాట్కార్య జాతం బనుర్భూతంబయ్యె. అంతం జైత్యుండగు క్షేత్రజ్ఞుండు హృదయాధిష్ఠానంబు నొంది చిత్తంబుతోడం బ్రవేశించిన విరాట్పురుషుండు సలిల కార్యభూత బ్రహ్మాండంబునొంది ప్రవృత్త్యున్ముఖుండయ్యె. సుప్తుండగు పురుషునిం బ్రాణాదులు దమబలంబుచే భగవద ప్రేరితంబు లగుచు నుతావనా సమర్థంబులగు చందంబున నగ్న్యాదులు స్వాధిష్ఠాన భూతంబులగు నింద్రియంబులతోడ దేవాది శరీరంబుల నొందియు నశక్తంబు లయ్యెనని, మఱియు నవ్విరాట్పురుషుని ననవరత భక్తింజేసి విరక్తులై యాత్మలయందు వివేకంబుగల మహాత్ములు చింతింపుదు రనియుఁ బ్రకృతిపురుష వివేకంబున మోక్షంబును, ప్రకృతి సంబంధంబున సంసారంబును గలుగుననియుఁజెప్పి మఱల నిట్లనియె. 894

ఇది పోతనామాత్య విరచితంబైన ఆంధ్రమహాభాగవతమున తృతీయస్కంధమున ఇరువది ఆరవ అధ్యాయము.

880. అవ్వా! =అమ్మా! వేఱు వేఱన్=భిన్న భిన్నముగా, హృదయగ్రంథి విచ్ఛేదకంబు=మనస్సునకున్న ముడిని నాశనము చేయునది, ఆత్మదర్శన

రూపంబు=హృదయమందున్న ఆత్మను దర్శింప చేయునది, ఆత్మని శ్రేయస కారణంబు=మోక్షకారణము, అనాది=ఆద్యంతములు లేనిది, సత్త్వాది గుణశూన్యుఁడు=సత్త్వము మొదలైన గుణములు లేనివాఁడు, ప్రకృతిగుణ విలక్షణుఁడు=ప్రకృతి యొక్క గుణములకంటె వేరైనవాఁడు, ప్రత్యక్ స్వరూపుఁడు=సర్వదా జాగృతమైన స్వరూపము కలవాఁడు, సమన్వితము= కూడుకొన్నది, గుణత్రయమయంబై=త్రిగుణములతో కూడుకొన్నదై, సరూపంబైన ప్రజాసర్గంబు - సరూపంబు=కాళ్ళుచేతులు మొదలైనవి కలిగి సమానమైన రూపము కలిగిన, ప్రజాసర్గము=ప్రజాసృష్టి, విజ్ఞాన తిరోధానము=విజ్ఞానము మరుగుపడుట, ప్రకృత్యధ్యాసము=ప్రకృతిని తనయందు ఆరోపించుకొనుట, క్రియమాణంబులు=చేయఁబడునవి, కర్తృత్వశూన్యుండు=కర్తృత్వము లేనివాఁడు, సుఖదుఃఖ భోక్తృత్వంబులు=సుఖమును, దుఃఖమును అనుభవించుటలు, ప్రకృతి విలక్షణుఁడైన పురుషునివి ప్రకృతికంటె విలక్షణుఁడైన శ్రీహరిచే పొంద తగినవి, సదసదాత్మక ప్రపంచము=స్థూల సూక్ష్మరూపమైన ప్రపంచము, సదసద్వివేక పూర్వకంబుగాన్=సదసత్తులను విడమఱచి స్పష్టముగా తెలిసి కొనుట లేక వ్యక్తావ్యక్త స్వరూపములను స్పష్టముగా తెలిసికొనుట.

తాత్పర్యము: దేవహూతీ! ఈ రీతిగా భక్తియోగ ప్రకారమును వివరించి నాను. ఇక తత్త్వలక్షణములను వేఱు వేఱుగా చెప్పెదను వినుము. తత్త్వములను వానిగుణముల నెఱిఁగిన మనుష్యులు ప్రకృతి గుణములనుండి విడివడిన వారగుదురు. వారి జ్ఞానము హృదయగ్రంథిని నాశ మొనర్చును. ఆత్మను దర్శింప జేయును. ఆత్మజ్ఞాన పూర్వకముగా మోక్షమును కల్గించును. ఆత్మ స్వరూప మెట్టిదో వివరించెదన్నాను. వినుము. అది అనాది, అనఁగా ఆద్యంతములు లేనిది. పురుష స్వరూపమైనది (అనఁగా పూర్ణమైన ఆనందము నొసఁగు వాఁడని అర్థము) సత్త్వాది గుణములతో నేమాత్రము సంబంధములేని ప్రకృతి గుణములకంటె వేరై విలక్షణమైన వాఁడు. ప్రత్యక్ష రూపుఁడు. సర్వకాల జాగృతమైన స్వరూపము కలవాఁడు. ఇతరులతో నపేక్షలేక తన ప్రకారము చేతనే నిరంతరము వెలుఁగువాఁడు. స్వప్రకాశము చేత నితరములను వెలింప చేయువాఁడు. ఈ విశ్వమాతనితో కూడుకొన్నది. ప్రకృతి గుణత్రయాత్మక మైనదని చెప్పితిని. అది అవ్యక్తము. అనఁగా స్పష్టముగా తెలియనిది. సూక్ష్మస్వరూప మైనది. భగవంతునకే సంబంధించినది. ఆ ప్రకృతి యం దాతఁడు లీలారూపై ప్రవేశించును. అప్పుడా ప్రకృతి గుణత్రయముతో కూడినదియు, కరచరణాదులతో సమానమైనదని ప్రజాసర్గమును చేయును. అపుడు పురుషుఁడు మోహితుఁడగును. అతని విజ్ఞానము తాత్కాలికముగా ముసుగు వడియుండును. త్రిగుణములతో కూడుకొన్న ప్రకృతి వికారములను తనయం దారోపించుకొని సంపూర్ణముగా దానిలో లీన మగును. దానివలన నేమగుచున్నది? తనచేత చేయఁబడుచున్న కార్యములకు కర్తనానే యని పురుషుఁడు భావించును. ప్రకృతికి లోఁబడినవాఁడై పరతంత్రుఁడగును. అంతర్యామిగా నున్న పురుషుఁడు కర్తృత్వ శూన్యుఁడు. ఆత్మకు కార్యకారణ

కర్తృత్వములు ప్రకృతి వలననే లభించును. అనఁగా ప్రకృతి గుణములను తన యందారోపించుకొనుచున్నాఁడు. ఈ గుణములచే నేర్పడెడు సుఖము, దుఃఖము వానిభోక్తృత్వము ప్రకృతి విలక్షణుఁడైన పురుషునిచే నేర్పడుచున్నవి." అపుడు దేవహూతి కపిలునితో అన్నది." పురుషోత్తమా! ప్రకృతి పురుషులు సూల సూక్ష్మమైయున్న ఈ ప్రపంచమునకు కారణభూతులు. కనుక వాని స్వరూపమును సదసత్పూర్వకముగా నిత్యానిత్య జ్ఞానపూర్వకముగా తెల్ప వలెనన్ని. భగవంతుఁడైన కపిలుఁడారంభించినాఁడు".

881. త్రిగుణము=మూఁడు గుణములు కలది. అవ్యక్తము=అస్పష్టమైనది. (అనఁగా సూక్ష్మమైనది, సదసదాత్మకంబు=వ్యక్తావ్యక్తమైన స్వరూపము కలది, ప్రధానము=ప్రధాన మనుపేరు కలది,

తాత్పర్యము: ప్రకృతి త్రిగుణములతో కూడినది. కనుక దానికి త్రిగుణమనియే పేరు. అవ్యక్తము; స్పష్టముగాని స్వరూపము కలది నిత్యము; శాశ్వతమైనది. సదసదాత్మకము. వ్యక్తావ్యక్త స్వరూపము కలది. ప్రధానము. మహత్తత్త్వాదులను నిర్మించుటలో ప్రధానమైన కారణము కలది. ఈ గుణములన్నిటితో కూడుకొన్నది.

882. చతుర్వింశతి తత్త్వాత్మకంబు=ఇరువది నాలుగు గుణములతో చేరినది. పంచమహాభూతములు=ఆకాశాదులు, తన్మాత్రలు=పంచభూత తన్మాత్రలైన శబ్దస్పర్శాదులు, జ్ఞానకర్మేంద్రియములు వెరసి పది, సగుణ బ్రహ్మ సంస్థానము=సగుణ బ్రహ్మ యొక్క స్వరూపము, ప్రకృతి గుణ సామ్యము=ప్రకృతి గుణముల యొక్క సామ్యావస్థ, తత్త్వాంతర్గతుండు=తత్త్వములలోన మున్నవాఁడు, క్షుభితము=చలింప చేయఁబడినది, హిరణ్మయము=గొప్ప ప్రకాశముతో కూడినది. ఆత్మప్రసవంబు=ఆత్మ యొక్క గుణములను నిద్ర పొందించునది.

తాత్పర్యము: ప్రకృతి ఇరువది నాలుగు తత్త్వములతో కూడినది. పంచ మహాభూతములు, వాని తన్మాత్రలు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు పది, మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము అనెడు నాలుగు విధములైన అంతఃకరణ విశేషములు ఇవన్నియు చేరి ఇరువది నాలుగు. ఇది సగుణ బ్రహ్మ యొక్క స్వరూపము. కాలమనెడు తత్త్వము ఇరువది యొదవ తత్త్వమని కొంద ఱందురు. కొందఱు శ్రీహరియొక్క ప్రభావమును సూచించునటిది కాలము కనుక పురుషుని పౌరుష స్వభావమే కాలము. అందుచే ఆదే వేఱు తత్త్వము కా దందురు. మాయామోహితుఁడై ప్రకృతి గుణములను తనయం దారోపించుకొన్న జీవుఁడు కాలముతో భయమునందును. వాఁడు అహంకారముతో విమూఢుఁడై భీతినందును. ప్రకృతి గుణసామ్యముతో ఉండును. నిర్విశేషము అనఁగా సరమం దుదాసీనుఁడై యుండును. భగవంతుని చేష్టా విశేషముచేత ప్రకృతి యొక్క గుణసామ్యము క్షోభింపఁ జేయబడెను. ఆ క్షోభింపఁజేయుటయే కాలమని యందురు. ఆ కాలము జీవరాసులలో నంతర్గతమై యుండును. అతఁడే పురుషరూపుఁడు. అనఁగా అంతర్యామి

స్వరూపమన్న మాట. బయట అన్నిటి యందు వ్యాపించి యుండును. ఆవ్యాపక రూపమునకే కాలమని పేరు. ఆత్మమాయతో తత్త్వాంతర్గతుడైన జీవునిచేత (అనఁగా పరమ పురుషునిచేత) క్షుభితమై జగత్కారణమైన ప్రకృతియందు పరమపురుషుఁడు తన వీర్యమును నిక్షేపించును. ఆ ప్రకృతి మహత్తత్త్వమును ప్రసవించును. అపుడు కూటస్థుఁడును, జగదంకుర స్వరూపుఁడునైన పరమాత్ముఁడు - లయవిక్షేప శూన్యుడైనవాఁడు ఆత్మగతములైన మహదాది ప్రపంచములను వ్యక్త మొనర్చును. అప్పుడు ఆత్మప్రస్థాపనము అనఁగా తనయోగ నిద్రకు కారణమైనట్టిది. అట్టి తీవ్రమైన అంధకారమును త్యాగివేయును అని మఱియు నిట్లన్నాఁడు.

884. సత్త్వప్రధానమై= సత్త్వగుణమే ముఖ్యముగా నున్నదై, స్వచ్ఛమై= శుద్ధమైనదై, శాంతమై=కలుషము లేనిదై, సురుచిరషాడుణ్య పరిపూర్ణమై=శోభాయ మానములైన షడుణములతో కూడినదై, వాసుదేవ వ్యూహము=వాసుదేవుఁడను పేరుగల వ్యూహావతారము, మహత్తత్త్వ మందున్=మహత్తత్త్వమందును, క్రియాశక్తి రూపంబు కల్గు అహంకారము=క్రియాశక్తి ప్రధానముగాఁ గల్గిన అహంకారము, ఉత్పన్నమయ్యెన్=పుట్టినది. సరవిన్=వరుసగా,

885. ఉత్పత్తి స్థానము=జన్మించిన చోటు, దేవతా రూపంబున నుండున్= అభిమాని దేవతగా ఉండును. తామసాహంకారంబు, త్రిగుణ మేళనంబునన్= త్రిగుణముల చేరికతో, అరమాత్రంబై యుండున్=శబ్దాది తన్మాత్రలకు నియామకమై ఉండును. వాసుదేవతత్త్వము, పూర్ణానందమయమై- ఆవాసుదేవుఁడే మహతత్త్వమునకు నియామకుఁడు, అతఁడు శాంతస్వరూపుఁడు. కాలుష్యము లేనివాఁడు. అందుచేతనే అమహత్తత్త్వము సాత్త్వికము, శుక్లము, స్మితమునై యుండును. ఆ మహత్తత్త్వము నుండి క్రియా శక్తి పెచ్చుగా ఉన్న అహంకార ముత్పన్నమైనది. ఆ యహంకారము నుండి మూఁడు విధములైన వైకారిక, తైజస, తామసాహంకారములు పుట్టినవి. ఆ వైకారికాహంకారము మనస్సు ఇంద్రియములు, పంచభూతములు వీనికి జన్మభూమి. వైకారికాహంకారము నుండి దిగభిమాని దేవతలు పుట్టిరి. తామసాహంకారము నుండి శబ్దాదులైన తన్మాత్రలు జన్మించినవి. క్రియాశక్తి రూపమై ఉండునని చెప్పుటవలన తక్కినవి లేవని అర్థముకాదు. జ్ఞానశక్తికూడ నా యహంకారమై ఉన్నది. కానీ అది తక్కువగా ఉండును. క్రియాశక్తియే పెచ్చుగా ఉండుటచేత క్రియాశక్తి యనిపేరు. దీనిలో మొదటిదైన వైకారికాహంకారము మనస్తత్త్వమునకు మూలము. రెండవదియైన తైజసాహంకారము ఇంద్రియములకు మూలము. మూఁడవది తామ సాహంకారము పంచమహా భూతములకు కారణము. వైకారికాహం కారము నుండి దిగభిమానులు మొదలైన దేవతలు, తైజసాహం కారమునుండి బుద్ధికభిమానియైన ఉమాదేవి, ఇంకను ఆహంకారిక ప్రాణులును జన్మించిరి. తామసాహంకారము నుండి శబ్దాదులైన తన్మాత్రలు పుట్టినవని మాధ్వవ్యాఖ్య.

886. సహస్రఫణా మండలాభిరాముఁడు=వేయిపడగల చేత అందమైన వాఁడు, భూతేంద్రియ మానసమయుఁడు=భూతములు ఇంద్రియములు, వీనికధికారి యైనవాఁడు, లక్షణ లక్షిత ఉల్లాసి=లక్షణములతో కూడినవాఁడు.

తాత్పర్యము: ఈ త్రిగుణాత్మకమైన అహంకారము శాంత, ఘోర, మూఢభావములకు వ్యంజకము. మూఁడుగా మారని యవస్థయందు అహంకార తత్త్వమును సూక్ష్మాహంకార మందురు. దీనికి సంకర్షణ రూపియైన శ్రీహరి నియామకుఁడు. ఇతఁడే పంచమహాభూతములకు, జ్ఞాన కర్మేంద్రియములకు ప్రధానమైన ప్రవర్తకుఁడు. ఇతనికి అనంతములైన శిరస్సులు. గుణదేశాలములతో కొనలేని వానికవి మూఁడు భాగములను పొందిన అహంకారమునకు పూర్వాహంకార మని పేరు. దీనికి ప్రద్యుమ్నుఁడు నియామకుఁడు. సంకర్షణ అనిరుద్ధ ప్రద్యుమ్న రూపములతో ప్రేరితుఁడైన సహస్ర శిరస్కుఁడైన శేషుఁడు ఆ యహంకార తత్త్వమున కభిమాని. మనస్తత్త్వమునకు కారణమైయున్న వైకారికాహంకారము కర్త యనిపించుకొనును. ఇంద్రియ కారణమైన తైజసాహంకారము కరణము. పంచభూతములకు భౌతిక పదార్థములకు కారణమైన తామసాహంకారము కార్యమనిపించుకొనును. వైకారికాహంకారము శ్రీహరియందు నిష్ఠను కలిగించుటచేత శాంతమనిపించుకొనుచున్నది. తైజసాహంకారము ఇంద్రియములతో ఘోర పదార్థ జ్ఞానము, ఘోరకర్మలు వీనికి కారణ మగుట చేత ఘోరమని పించుకొనును. తామసాహంకారము పంచభూతములకు కారణమై మూఢ మనిపించుకొనుచున్నది.

887. వైకారికాహంకారము మొదలైన అహంకార భాగములనుండి మనస్సు మొదలైనవాని ఉత్పత్తి ఏర్పడుచున్నది. వికారమును పొందిన వైకారికాహంకారము నుండి మనస్తత్త్వ మేర్పడినది. ఈ మనస్సు సంకల్ప వికల్ప వ్యవహార విశేషములతో దేహమందు వర్తించును. ఈ మనస్సు నుండియే నానా విధములైన ఇచ్ఛలు జన్మించుచున్నవి. దీని కభిమాని యనిరుద్ధుఁడు. ఇతఁడు శారదేందీవరశ్యాముఁడు సనకాది మహాయోగులచేత తిన్నగా, తొందర పడని యట్లుగా ఉపాసింపఁబడుచున్నాఁడు. సూలాలంకార నియామకుఁడైన ప్రద్యుమ్నుని నుండియే అనిరుద్ధ తత్త్వ మేర్పడుచున్నది. మనస్సు సర్వేంద్రియములను ప్రవర్తింపఁ జేయుట చేత దానికి నియామకుఁడైన అనిరుద్ధుఁడు సర్వేంద్రియములకు నియామకుఁడని తెల్పినట్లైనది. వికారమొందిన తైజసాహంకారము నుండి బుద్ధితత్త్వ మేర్పడినది. దీని నుండి ద్రవ్య ప్రకాశరూపమైన జ్ఞాన మేర్పడును. జ్ఞానము రెండు రీతులు. సామాన్య జ్ఞానము, విశేషజ్ఞానము. మనస్సునుండి పుట్టుజ్ఞానము సామాన్యము. బుద్ధినుండి పుట్టినది విశేషజ్ఞానము. ఈ బుద్ధితత్త్వమునుండి మఱికొన్ని విశేషము లేర్పడుచున్నవి సంశయము విపర్యాసము, నిశ్చయము, స్మృతి. దీనినుండి కలుగనిదే సంశయము. అనఁగా ఒక ద్రవ్యమును చూచినపుడు ఇదియా అదియో అని ఏర్పడు జ్ఞానము. విపర్యాస మనఁగా పదార్థ సహజరీతిని వదలి వేరొక్క రీతిగా తెలియుట. ఆ తత్త్వమును చూచి ఇదే దీనితత్త్వము. వేఱొక్కటి కాదని తెలియుట

విపరీతజ్ఞానము. దీనిని ఇచ్ఛా జ్ఞానమని కూడ అందురు. సంశయము మానసికమే కూడ నగును. అందుచేత మానసిక మనియు, బుద్ధిజ మనియు సంశయము రెండురీతులు. నిశ్చయ జనకములైన ధర్మములు తెల్పినపుడు మానసిక సంశయము నివృత్తమగుచున్నది. బుద్ధిజమైన సంశయము ఎన్నటికిని పోదు. అనఁగా స్వరూప భూతమైన సంశయము పోదని చెప్పిన దైనది. లక్షణము రెండురీతులు స్వరూప లక్షణము, తద్భిన్నమైన లక్షణము. ఏ ధర్మముచేత వస్తువు తెలిసికొనఁబడుచున్నదో అది లక్షణము. జ్ఞానేంద్రియ కర్మేంద్రియములని ఇంద్రియములు రెండురీతులు. ఈ రెండును తైజసాహం కారముతో నేర్పడినవే. కర్మేంద్రియములకు అహంకారిక ప్రాణము అభిమాని దేవత. ప్రాణమునకు క్రియాశక్తి యుండును. బుద్ధికే జ్ఞానశక్తి. ఇంద్రియములు తైజసాహంకార జనితము లగుటవలన వానికి తైజసత్త్వముండును. భగవద్వీర్య చోదితమై వికారమందిన తామసాహంకారము నుండి శబ్దమనెడు గుణతన్మాత్ర మేర్పడినది. దానినుండి ఆకాశ ముత్పన్న మయ్యెను. ఆకాశము వలన శ్రోత్రేంద్రియము పుట్టెను. శ్రోత్రము శబ్దమును గ్రహించునదిగా నయ్యెను. ఈ శబ్దమునకు లక్షణము తెలియఁజేయుట. శబ్దము అర్థమున కాశ్రయమై శ్రోతకు జ్ఞాన జనకముగా నగుచున్నది. ఆకాశ లక్షణము ప్రాణులకు గమనాదుల కవకాశ మిచ్చుట. లోపలను బయటను దిక్కుల రూపముగా నుండుట ప్రాణా పానాదులకును ఇంద్రియములకును జీవులకును వాసమున కర్హమైన స్థానముగా నుండుట. ఇవి అన్నియు ఆకాశ లక్షణములు.

శబ్దమను తన్మాత్రను పొందియున్న ఆకాశము నుండి కాలగతిచేత వికారము నందు దానినుండి స్పర్శ తన్మాత్ర పుట్టినది. దానినుండి వీచెడు గాలి జన్మించెను. ఆ స్పర్శతన్మాత్ర నుండి తత్కారణమైన త్వగింద్రియ మేర్పడెను. ఆ వాయువుచే స్పర్శ గ్రాహియైన త్వగింద్రియము జన్మించినది. మృదుత్వము, కఠినముగా నుండుట, శైత్యము, వేడిగానుండుట ఇవి స్పర్శము యొక్క లక్షణము. గాలియొక్క తన్మాత్రయే స్పర్శము. వాయువునకు చాలన, మేళన నేతృత్వములు లక్షణములు. నేతృత్వము ద్రవ్యశబ్దములకు, సర్వేంద్రియములకు స్వామియై యుండుట కూడ వాయులక్షణమే. అనఁగా వాయువు లేనిదే ఏ ఇంద్రియముకూడ పనిచేయలేదు. దైవచోదితమైన స్పర్శమే తన్మాత్రగా ఉన్న వాయువునుండి రూపతన్మాత్ర ఏర్పడినది. దానినుండి తేజస్తత్త్వము రూపజ్ఞానము నేర్పఱచెడు చక్షురింద్రియము కూడ జన్మించినది. ద్రవ్యాకృతిత్వము అనగా పదార్థముండు పఱకును ఉండుట, ప్రకాశము కల్గియుండుట, వ్యక్తిగా నుండుట, తేజస్సు కల్గియుండుట ఇవియన్నియు తేజస్సంబంధియైన రూపతన్మాత్ర యొక్క లక్షణములు. ప్రకాశ పఱచుట పచన మొనర్చుట, రసమును మ్రింగుట భక్షణము, శైత్యమును పోఁగొట్టుట, శోషణము ఇవన్నియు తేజస్సు యొక్క లక్షణములు. అట్టి వికారమందిన రూపతన్మాత్రగల తేజస్సు నుండి రసతన్మాత్ర ఏర్పడినది. దానినుండి నీరు రసగ్రాహము, రసగ్రాహమున కాధారమైన నాలుక జన్మించినది.

భూతకార్యములందు పదార్థ కార్యములచేత ఒకటేరసము ఆరురీతులుగా నున్నది. అంతమాత్రమేకాదు. పరస్పర మేళన ప్రభావముచేత అనేకరీతులుగా గూడనగును. కేవలం మొర్రుట నీటి యొక్క లక్షణము. ముద్దగా నొనర్చుట, చాలు నను భావమును కలించుట కూడ నీటియొక్క లక్షణమే. నీరే చేపకు కారణ మగుచున్నది. సంతోషమును కలించుటకు కారణము కూడ జలమే. సంతాపనోదనము దానివలన నేర్పడు నదియే. మిగిలిన భూతముల కంటె పెచ్చుగా కార్యములం దుండుటయు నీటి యొక్క లక్షణము శ్రీహరి ప్రేరితమై వికారమును పొందిన రసతన్మాత్రయైన నీటినుండి గంధతన్మాత్ర యేర్పడినదని. దానినుండి భూమి సృష్టమయ్యెను. గంధము నాఘ్రాణించెడు జ్ఞానేంద్రియము కూడ నేర్పడెను. ఒకటే గంధము ద్రవ్యావయవ వైషమ్యముతో (ద్రవ్యముల వాని అంశములు వీనియొక్క విశేషరూపమైన వ్యత్యాసముతో) కరంభంబునుపూతి సౌరభ్యాదులుగా ఆరు విధములుగా నగును. పదార్థముల ఉత్పత్తికి కారణమై యుండుట పృథ్వీ లక్షణము. పారివ శరీరమందే శ్రీహరియొక్క సాన్నిధ్యముండుటచేత వానియందే శ్రీహరిని చూడ వలసి యుండుటచేత పృథ్వికి బ్రహ్మ స్థానమని పేరు.

మూర్తద్రవ్యములను ధరించుటయు దాని లక్షణము. వాయువు, అగ్ని మొదలగు ద్రవ్యములకంటె స్పష్టముగా నుండుటయు పృథివీ లక్షణమే. సమస్త ప్రాణుల శరీరమందును గుణములను వ్యక్త పఱచుట దానిపనియే. ప్రతిమాది రూపములతో సాకారతాపాదకమైన భావన పథ్వి యొక్క గుణము. జల తేజో వాయువుల సంసర్గము లేకగూడ నిదియుండవచ్చును. జలాదుల నిదిధరించు ఆకాశాద్యవచ్ఛేదకము. అనఁగా ఆకాశాదులతో కూడియుండుట. ఇవియన్నియు పృథివీ లక్షణముల క్రిందికే వచ్చును. దేనికి ఆకాశ విశేష గుణమైన శబ్దము విషయమో అది శ్రోత్రేంద్రియము. వాయువు విశేష గుణము దేనికి విషయమో అది స్పర్శేంద్రియము. తేజో విశేషగుణమైన రూపము విశేషముగా గలది చక్షుస్సు. నీటి విశేష గుణము దేనికి విశేషమో అది జిహ్వ. భూవిశేష గుణమైన యద్విషయమో అది ఘ్రాణేంద్రియము. ముందు ముందు చెప్పిన కారణభూతములైన భూతముల యొక్క గుణసంబంధము చెత వాని తరువాతి తరువాతి కార్యములందు కన్పడుచుండును. అందుచే గుణముల సంబంధముండుట చేత సమస్త భూతములైన గుణవిశేషములును, శబ్దాదులన్నియు భూమియందే కన్పించును. మహత్తు మొదలుకొని పృథివి అంతముగాఁ గలిగిన ఏడుతత్త్వములును పరస్పరము చేరకయుండి భోగమున కాశ్రయమైన పురుషుని కల్పించుట కసమరము లయ్యెను. అప్పుడు కాలము మొదలైన అదృష్ట సత్త్వాదులతో కూడినవాడై జగదాదియైన పురుషుడు అందు ప్రవేశించెనాఁడు. ఆతఁడు త్రిగుణ్య విశిష్టుడు. సమస్తమును విసరించువాఁడు. నిరంజనాకారుడు. అతఁడు ప్రవేశించిన వెంటనే భూతము లన్యోన్య క్షుభితము లైనవి. మిళితము లైనవి. అప్పుడు మహదాదులనుండి అధిష్టాతృచేతన రహితమైన అచేతనమైన అండము పుట్టినది.

888 వైశేషికులు రెండు పరమాణువులు చేతి ద్వ్యణుక మయ్యెనందురు. అట్లే ఆ క్రమముగనే భాగములు, వానిచేరిక వానినుండి "ఒక్కటి" అనిపించుకొనెడు సమగ్ర పదార్థములు సృష్టమగునని వైశేషిక సిద్ధాంతము. ఎందుకనఁగా మహత్తత్త్వము మొదలైన తత్త్వముల అభిమాని దేవతల స్తోత్రమునకు అభిమానియై నారాయణుఁడు ఆ తత్త్వముల శక్తిని వ్యక్తమొనర్చుట చేత బ్రహ్మాండాది పదార్థముల సృష్టి ఏర్పడినదని భాగవతమందు నిరూపించఁబడినది. ఆ హరి సన్నిహితుఁడైన దానివలన అతనిచే ప్రేరేపింపఁబడిన తత్త్వముల నుండి జడమైన బ్రహ్మాండ ముత్థితమైనది ఆ యండము నుండి విరాట్పురుషుఁడు జన్మించెను.

ఈ బ్రహ్మాండము పృథ్వ్యంశాధిక్యము గలది. దీనికి విశేష మనియు పేరు. దీనిచుట్టును ఒకదానికంటె నొకటి పెచ్చైన - అనఁగా ఒకదానికంటె మరొక్కటి పదింతలు పెద్దదియని యర్థము. తొట్టి జలతత్త్వ వాయుతత్త్వ ఆకాశ తత్త్వములు చుట్టును ఆవరించియున్నవి. దానికి తరువాత త్రిగుణాత్మకమైన మూలప్రకృతి ఆవరించి యుండును. ఈ బ్రహ్మాండము లోపలనే పదునాల్లులోకముల విస్తారము లున్నవి. ఈ అండమందు శ్రీహరి సన్నిధానముండుట వలన ఇది ఆతని రూపప్రతిమ. ఈ మూఁడు కారణములచేత వీనికి విశేషమనెడు పేరు యుక్తము. సర్వోత్తముఁడైన శ్రీహరి నీటి యందున్న హిరణ్మయమైన అండకోశమును సైకెత్తి దానియందు ప్రవేశించినాఁడు. ప్రవేశించి ముఖాదులరీతితో ఆకాశమును భేదించినాఁడు. ఆ విరాట్పురుషుని ముఖము మొట్టమొదట వ్యక్తమైనది దానినుండి వాగింద్రియమేర్పడినది. వాగింద్రియమునుండి తదభిమానియైన అగ్నివ్యక్తమైనాఁడు. ఇట్లే ఇఱుపై గూడ నేత్రగోళకములు, ఇంద్రియములు, ఇంద్రియాభిమాని దేవతలు వీరి ఉత్పత్తి తెలియవలెను. ముఖము తరువాత నాసారంధ్రములు వ్యక్తమయ్యెను. వానినుండి ఘ్రాణేంద్రియము. ఘ్రాణేంద్రియము నుండి వాయువు యొక్క వ్యక్తిత్వము. ప్రాణమునకధి దేవత వాయువు. ఒకటే దేవతకు అధ్యాత్మికముగా ప్రాణమని, అధిదైవికముగా వాయు వనియు పేరు. తరువాత వ్యక్తమైనవి కన్నులు. కన్నుల నుండి చక్షురింద్రియము పుట్టినది. ఆ ఇంద్రియమునుండి సూర్యదేవుని అభివ్యక్తి. పిదప కర్ణములు వ్యక్తము లైనవి. వానినుండి శ్రోత్రేంద్రియము, దిగ్దేవతలు వ్యక్తులైరి. తదనంతరము త్వక్కేర్పడెను. దానినుండి రోమములు గడ్డము మొదలైనవి. పిదప ఓషధులు తదభిమాని దేవతలు. ఆపైని స్త్రీ పురుష సూచకమైన గోళకము. దానినుండి ఉపస్థేంద్రియము, తదభిమాని దేవతలు. దానితో రేతస్సు. రేతస్సునుండి జలాభిమాని దేవతలు వ్యక్తులైనారు. అనంతరము గుదము వ్యక్తమైనది. ఈ గోళకము నుండి పాయురింద్రియము. దానినుండి అపానవాయువు. దానినుండి లోకభయంకరమైన మృత్యువు

వ్యక్తులైనారు. చేతులు, చేతులనుండి బలము, తదభిమాని ఇంద్రుడు. ఆపైన పాదములు, పాదేంద్రియము, తదభిమానియైన యజ్ఞుడనెడు దేవత. అతనికే జయంతుడనిపేరు. వారి అంతర్యామియై శ్రీహరి వ్యక్తుడైనాడు. నాడు లేర్పడినవి. నాడులనుండి రక్త ముత్పన్నమైనది. దానినుండి తదభిమాని దేవతలైన నాడులు ఏర్పడెను. ఆ పిదప పొట్ట. దాని నుండి క్షుత్పిపాసలు. వాని నుండి సముద్ర ముత్పన్నమైనది. ఉదరము వ్యక్తమైన పిదప హృదయము వ్యక్తమైనది. దానినుండి మనస్సేర్పడినది. ఇచట హృదయము గోళక మనియు, మనస్సు ఇంద్రియ మనియు అర్థము మనస్సునుండి చంద్రోత్పత్తి ఐనది.

హృదయమునుండి బుద్ధి. దానినుండి బృహస్పతి ఏర్పడినాడు. ఆ హృదయము నుండియే అహంకారము పుట్టినది. ఇదికూడ మనస్సు యొక్క ప్రభేదము. దానినుండి తదభిమాని యైన రుద్రుడేర్పడినాడు. ఆ హృదయమునుండియే చిత్తము. అనగా పదార్థములను గ్రహించు శక్తి ఏర్పడినది. ఇది కూడ మనస్సు యొక్క ఒక్కభేదము. దీనినుండి చిత్తాభిమానియైన బ్రహ్మ ఏర్పడినాడు. ఈ దేవతలందరును వ్యక్తులైనను ఆ దేవత లెవ్వరును అండము యొక్క ఉత్థాపనమునందు శక్తులు కాలేదు. అదిచైతన్య యుక్తము కాలేదు. వారందరు ఒక్కొక్కరే క్రమముగా నాయా ఇంద్రియములలో ప్రవేశించిరి. అగ్ని వాగింద్రియముతో ముఖమును ప్రవేశించినాడు. కానీ అండము లేవలేదు. వాయువు ఘ్రాణేంద్రియముతో నాసా పుటమును చేరెను. సూర్యుడు చక్షురింద్రియముతో కన్నులలో ప్రవేశించినాడు. దేవతలు శ్రోత్రేంద్రియముతో కర్ణములందు చేరిరి. ఓషధ్యభిమాని దేవతలు రోమములతో చర్మమును ప్రవేశించిరి. జలాభిమాని రేతస్సుతో శిశ్నమును చేరెను. మృత్యుదేవత అపానముతో గుదమును ప్రవేశించెను. ఇంద్రదేవుడు బలముతో హస్తములను చేరినాడు. విష్ణువు పాదాభిమానియైన యజ్ఞునందున్నవాడై గమనముతో పాదమును చేరెను. నద్యభిమానులు రక్తముతో నాడులలో జొచ్చినారు. సముద్రాభిమాని క్షుత్పిపాసలతో ఉదరమును చేరెను. చంద్రుడు మనస్సుతో, బృహస్పతి బుద్ధితో, రుద్రుడహంకారముతో ప్రవేశించెను. ఎందరు ప్రవేశించినను లాభము లేకపోయెను. క్షేత్రజ్ఞుడైన శ్రీహరి చిత్తముతో హృదయము నెప్పుడు ప్రవేశించెనో (అనగా హృదయాంతర్గతుడైనాడో) అప్పుడే విరాట్పురుషుడు సలిలమునుండి ఉత్థితుడయ్యెను. శ్రీహరి సర్వోత్తముడు. అందుకే యాతడు సర్వశక్తుడు. కనుక సర్వోపాస్యుడాతడే. ఆ క్షేత్రజ్ఞ పురుషుడు ప్రవేశించినంతనే సలిలమందున్న అండము లేచినది. ప్రాణము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి వీని కభిమానులైన దేవతలు ఆయా ఇంద్రియార్థ క్రియలతో ప్రవేశించినను

లాభము లేకపోయెను. శ్రీహరి సహాయముతోనే వారు సుప్తుడైన పురుషుని లేపగలిగిరి. ఇది సత్యము. అందుచేత సర్వోత్తముడై క్షేత్రజ్ఞుడైన శ్రీహరిని అంతర్యామిగా నున్న వానిని వైరాగ్యము, అష్టాంగ యోగములతో క్రమముగా నభివృద్ధినందిన భక్తి, భక్తితో నేర్పడిన నిశ్చయ జ్ఞానము, వీనితో వివేకము ప్రధానముగా గలిగి ఆత్మయందు చింతింప వలెను.

అంబుముఖావరణంబులు=జలతత్త్వము మొదలైన ఆవరణములు. మేలుకట్లు=ఎక్కెడు సోపానముల, పంకజోదరుఁడు=శ్రీహరి, హేమమయమైన అండంబులోన్=స్వర్ణమయమైనట్టి అండములో, అఖిలచేత=సర్వశక్తియైనవాఁడు, విష్ణుపద భేదనము=ఆకాశమును భేదించుట,

889....893. ఆననంబు వలనను=ముఖము నుండి, వాఙ్మితో వహ్నియున్=విరాట్పురుషుని ముఖమునుండి వహ్నియును ఏర్పడినవని భావము. నాసంబు వలనన్=నాసాద్వారముల నుండి, ఘ్రాణేంద్రియము=ముక్కునెడు ఇంద్రియము, ఆ ఘ్రాణమునుండి వాయువులు ప్రాణ వాయువులు కూడ నేర్పడినవి. వాయువు తదధి దేవత యన్నమాట. అక్షులు=కన్నులు, చక్షులు=నేత్రములు, నేత్రగోళకములు=నేత్రమనెడు ఇంద్రియములు, తదభిమానియైన సూర్యుఁడు జన్మించినాఁడు. అందు అభిధ్యానంబున్=తీవ్రముగా ధ్యానించుటయు, కర్ణములు ఏర్పడినవి. కర్ణములతో శ్రోత్రేంద్రియము కలిగినది. శ్రోత్రేంద్రియముల కధిష్ఠాన దేవతలు దిక్కులు. త్వక్కుచేన్=చర్మముతో, శ్మశ్రురోమవితానకముల= గడ్డము, శరీరమందున్న రోమములు వీని గుంపు, ఓషధుల సమూహము తదధి దేవతలు. తరువాత మేఢ్రము వ్యక్తమైనది. దానినుండి రేతస్సు, రేతస్సు నుండి నీరేర్పడినది. గుదేంద్రియము కల్గినది. ఇది మలవిసర్జనమునకు హేతువు. దీనినుండి అపాన వాయువు కల్గెను. దానితో లోకభయంకరమైన మృత్యువు జన్మించెను. చేతు లేర్పడినవి. చేతుల నుండి బలము. ఆ బలముతో తదభిమానియైన ఇంద్రుడు కల్గెను. పాదముల నుండి గతి, తదభిమానియైన, విష్ణువు. నాడీ పుంజము=నరముల సమూహము, జఠరము=కడుపు, హృదయమునుండి మనస్సేర్పడినది. దానినుండి తుహిన కరుఁడు=చంద్రుఁడు. చిత్తమున బ్రహ్మదేవుఁడేర్పడెను. క్షేత్రజ్ఞుడు కూడ ఉద్భవించినాఁడు. విరాట్పురుషుఁడు పురుష స్వరూపుఁడు.

894. వృష్టిరూపంబులు=వానలు మొదలైనవి. భూత తన్మాత్రలు=భూతముల సూక్ష్మ స్వరూపములు. వాగాదీంద్రియ జాతంబు=వాక్కు మొదలైన ఇంద్రియముల గుంపు, దేవాధిష్ఠితంబులు=దేవతలచే కూడుకొన్నవి. వెవ్వేఱ=

వేరువేరుగా, ప్రవృత్తి+ఉన్ముఖుఁడు=వ్యాపారమందు సిద్ధమైనవాఁడు. తత్తదధిష్ఠానాదులు=ఆయాదేవతల కధిష్ఠానమైన ఇంద్రియములు. ఆకాశాది భూతము లేర్పడినవి. శబ్దాదులైన తన్మాత్రలున్నవి. వాగాదులైన ఇంద్రియములు కూడ ఉన్నవి తదధిదేవతలున్నారు. వీరందరును వేర్వేరుగా విరాట్పురుషుని లేపుటకు ప్రయత్నించిరి. వారికి సాధ్యము కాలేదు. వారు చేయునది లేక వారి వారి ఇంద్రియములతో ప్రవేశించినారు. అగ్ని వాగింద్రియముతో ముఖమును జెందెను. విరాట్కార్యమైన వ్యష్టి శరీర మనుత్పన్న మయ్యెను. నాస ఘ్రాణేంద్రియముతో వాయువును చేరినట్టి దయ్యెను. ఆదిత్యుఁడు చక్షువులతో నేత్రములగూడెను. దిగ్దేవతాకము=దిక్కులే దేవతలు గాగలిగినది. దిక్కులు దేవతలుగా కర్ములు శ్రోత్రములతో చేరగా ఫలముకలుగ లేదు. ఓషధులు రోమములతో త్వగింద్రియముల నందెను. కార్యము కాలేదు. నీరుదైవముగా గల మేఢ్రము రేతస్సు నందలి కార్యము చేయుటకు సమర్థము కాలేదు. గుదము మృత్యువుతో అపానమును జెందెను. లాభము లేకపోయెను. విష్ణుదేవతాకములైన పాదములు గతితో కూడెను. ప్రయోజనము లేదు. పాణీంద్రియములింద్ర దైవతములై బలముతో చేరెను. కార్య ముత్పన్నము కాలేదు. నాడులు నదులతో రక్తమును చేరెను. నిరర్థకము. ఉదకము సముద్రముతో క్షుత్పిపాసల నాక్రమించెను వ్యర్థము. హృదయము మనస్సుతో చంద్రుని చేరెను. రిక్తయయ్యెను. బుద్ధి బ్రహ్మాది దైవతమై మనస్సు చేరెను. శూన్యము. విరాట్కార్య జాతమేర్పడలేదు. అప్పుడు చైత్యుఁడైన క్షేత్రజ్ఞుఁడు హృదయము నాశ్రయించి చిత్తము నాశ్రయించినాఁడు. విరాట్పురుషుఁడు సలిల కార్యభూతమైన బ్రహ్మాండమును చెంది ప్రవృత్తికి శక్తిగల వాఁడైనాఁడు. నిదురఁబోవుచున్న పురుషుని ప్రాణాదులు తమ బలముతో భగవంతుని చేత ప్రేరితములై వానిని లేపుటకు సమర్థములైనట్లు అగ్ని మొదలైన అధిష్ఠానములతో దేవాది కార్యజాతముల సృష్టింప నశక్తమైనవి. ప్రత్యగాత్మ ప్రత్యగ్రూపుఁడైన ఆ మహాపురుషుని విరక్తులు వివేకవంతులైన మహాత్ములు నిరంతరమును చింతింపుదురు. ప్రకృతి సంబంధముతో సంసార మగును-- ఇట్లు వచించి కపిల మహర్షి మఱియు నన్నాఁడు.

శ్రీ పోతనామాత్య విరచితమైన ఆంధ్రభాగవతమున
తృతీయస్కంధమున ఇరువది ఆరవ అధ్యాయము
సుధాలహరి వ్యాఖ్య సమాప్తము.

సప్తవింశోఽధ్యాయః

ప్రకృతిస్థోఽపి పురుషో నాజ్యతే ప్రాకృతై ర్గుణైః,
అవికారా దకర్తృత్వా న్నిర్గుణత్వాజ్జలార్కవత్. 1

స ఏష యర్హి ప్రకృతే ర్గుణే ష్వభి విషజ్జతే,
అహంక్రియ విమూఢాత్మా కర్తా స్మీత్యభిమన్యతే. 2

తేన సంసార పదవీం మనసాభ్యే త్యనిర్వృతః,
ప్రాసంగికైః కర్మదోషై స్సదసన్మిశ్రయోనిషు. 3

అర్థే హ్యవిద్య మానేఽపి సంసృతిర్న నివర్తతే,
ధ్యాయతో విషయానస్య స్వప్నేఽనర్థాగమో యథా. 4

అత ఏవ శనైశ్చిత్తం ప్రసక్త మసతాం పథి,
భక్తియోగేన తీవ్రేణ విరక్త్యా చ నయే ద్వశమ్. 5

యమాదిభి ర్యోగమార్గై రభ్యసన్ శ్రద్ధయాన్వితః,
మయి భావేన సత్యేన సత్కథా శ్రవణేన చ. 6

సర్వ భూత సమత్వేన నిర్వైరేణాఽ ప్రసంగతః,
బ్రహ్మచర్యేణ మౌనేన స్వధర్మేణ బలీయసా. 7

యదృచ్ఛయో పపన్నేన సంతుష్టో మితభు ర్మునిః,
వివిక్తశరణ శ్శాంతో మైత్రః కరుణ ఆత్మవాన్. 8

సానుబంధే చ దేహేఽస్మిన్న కుర్వన్న సదాగ్రహమ్,
జ్ఞానేన దృష్టతత్త్వేన ప్రకృతేః పురుషస్య చ. 9

నివృత్తబుద్ధ్యవస్థానో దూరీభూతాన్య దర్శనః,
ఉపలభ్యాత్మనాఽఽత్మానం చక్షుషే వార్క మాత్మదృక్. 10

ముక్తలింగం సదాభాస మసతి ప్రతిపద్యతే,
సతో బంధు మసచ్చక్షు స్సర్యానుస్యూత మద్వయమ్. 11

యథా జలస్థ అభాసః స్థలస్థే నావదృశ్యతే,
స్వాభాసేన యథా సూర్యో జలస్థేన దివి స్థితః. 12

ఏవం త్రివృదహంకారో భూతేంద్రియ మనోమయైః,
స్వాభావైర్లక్షితోఽనేన సదాభాసేన సత్యదృక్. 13

భూతసూక్ష్మేంద్రియమనో బుద్ధ్యాది ష్వీహ నిద్రయా,
లీనే ష్వసత్సు యస్తత్ర వినిద్రో నిరహం క్రియః. 14

మన్యమాన స్తదాఽఽత్మాన మనష్టో నష్టవ స్స్మృషా,
నష్టోఽహంకరణే ద్రష్టా నష్టవిత్త ఇవాతురః. 15

ఏవం ప్రత్యవ మృశ్యాసా వాత్మానం ప్రతిపద్యతే,
సాహంకారస్య ద్రవ్యస్య యోఽవస్థాన మనుగ్రహః. 16

దేవహూతి రువాచ

పురుషం ప్రకృతి ర్బ్రహ్మన్న విముంచతి కర్హిచిత్,
అన్యోన్యా పాశ్రయత్వాచ్చ నిత్యత్వ మనయోః ప్రభో. 17

యథా గంధస్య భూమేశ్చ న భావో వ్యతిరేకతః,
అపాం రసస్య చ యథా తథా బుద్ధేః పరస్య చ. 18

ఆకర్తుః కర్మ బంధోఽయం పురుషస్య యదాశ్రయః,
గుణేషు సత్సు ప్రకృతేః కైవల్యం తేష్వతః కథమ్. 19

క్వచిత్తత్త్వావమర్శేన నివృత్తం భయ ముల్బణమ్,
అనివృత్త నిమిత్తత్వా త్పునః ప్రత్యవతిష్ఠతే. 20

శ్రీభగవానువాచ

అనిమిత్తనిమిత్తేన స్వధర్మేణాఽ మలాత్మనా,
తీవ్రయా మయి భక్త్యాచ ఁశ్రుత సంభృతయా చిరమ్. 21

జ్ఞానేన దృష్ట తత్త్వేన వైరాగ్యేణ బలీయసా,
తపోయుక్తేన యోగేన తీవ్రేణాత్మ సమాధినా. 22

ప్రకృతిః పురుష స్యేహ దహ్యమానా త్వహర్నిశమ్,
తిరోభవిత్రీ శనకై రగ్నే ర్యోని రివాఽ రణిః. 23

భుక్తభోగా పరిత్యక్తా దుష్టదోషా చ నిత్యశః,
నేశ్వర స్యాఽశుభం ధత్తే స్వే మహిమ్ని స్థితస్య చ. 24

యథాహ్య ప్రతిబుద్ధస్య ప్రస్వాపోబహ్వానర్థకృత్,
స ఏవ ప్రతిబుద్ధస్య న వై మోహాయ కల్పతే. 25

ఏవం విదిత తత్త్వస్య ప్రకృతి ర్మయి మానసమ్,
యుంజతో నాపకురుత ఆత్మారామస్య కర్హిచిత్. 26

యత్రైవ మధ్యాత్మరతః కాలేన బహుజన్మనా,
సర్వత్ర జాతవైరాగ్య ఆబ్రహ్మభువనా న్మునిః. 27
మద్భక్తిః ప్రతిబుద్ధార్థో మత్ప్రసాదేన భూయసా,
నిశ్శ్రేయసం స్వసంస్థానం కైవల్యాఖ్యం మదాశ్రయమ్. 28
ప్రాప్నోతీహ తతో ధీర స్త్వద్దుశ్ఛిన్న సంశయమ్,
యద్గత్వా న నివర్తేత యోగీ లింగవినిర్గమే. 29
యదా న యోగోపచితాసు చేతో
మాయాసు సిద్ధస్య విషజ్జతేఽమ్ష్ఠ,
అనన్యహేతు ష్వథమే గతిస్స్యా
దాత్యంతికీ యత్ర న మృత్యుహాసః. 30

ఇతి శ్రీమద్భాగవతే తృతీయస్కంధే సప్తవింశోఽధ్యాయః.

అధ్యాయము - 27

1. పురుషః=జీవుఁడు, ప్రకృతిస్థుఁ అపి=ప్రకృతి యొక్క కార్యమందు స్థితుఁడైనప్పటికినీ, అకర్తృత్వాత్=కర్తకానందువలనను, అవికారాత్=వికార రహితుఁడైనందునను, నిర్గుణత్వాత్=గుణాతీతుఁడైన దానివలనను, ప్రాకృతైః గుణైః=ప్రకృతికి సంబంధించిన గుణములచేత, నాజ్యతే=స్పృశింపఁబడఁడు. జలార్కవత్=జలమందు కనిపించెడు సూర్యునివలె.

తాత్పర్యము : ఈ అధ్యాయమందు భక్తియోగాదుల సహాయముతో అంతఃకరణ పరిశుద్ధియు, దానివలన ప్రకృతి పురుషుల వివేకజ్ఞానమును, తత్కారణముగా సంసారమునుండి మోక్షము సిద్ధించునని కపిలమహర్షి ఈ అధ్యాయమందు వివరింపఁబోవుచున్నాఁడు. గడచిన యధ్యాయమందు భక్తి పరిశుద్ధమైన అంతఃకరణముతో ప్రకృతి కంటె పరుఁడుగా నున్న పురుషుని, ఈశ్వరుని- పరమాత్మను ధ్యానింపవలెనని నిర్ణయింపఁబడినది. వివేక స్వరూపము స్పష్టముగా విశదీకరించుటకై ప్రకృతిని పరమాత్మకంటెను వేఱుగా తెలియకుండుటచేతనే జీవునకు సంసారక్లేశ మేర్పడినదని మూఁడుశ్లోకములతో చెప్పుచున్నాఁడు. జీవుఁడు ప్రకృతి కార్యములైన దేవ మనుష్యాది శరీరములతో సంబంధము కలవాఁడైనను ప్రకృతి గుణములైన సత్త్వాదులతో నేర్పడెడు పుణ్యపాపములతోను, తన్నిమిత్తముగా నుండెడి సుఖదుఃఖములతోను స్పృశింపఁబడఁడు. ఎందుకనఁగా పరమార్థముగా శుద్ధమైన చైతన్యమునకు కర్తృత్వము లేదు. తత్కారణముగా నేర్పడెడి రాగద్వేషాది వికారములు కూడలేవు.

సత్త్వాదిగుణ సంబంధము శూన్యము. కనుక దుఃఖి, సుఖియనెడు భావము ఏర్పడుటకు కారణమే మనఁగా అవివేక మొక్కటే. జలమందు ప్రతిబింబించిన సూర్యబింబము చలించునట్లు కనపడును. అస్పష్టముగా నున్నట్లు కనపడును. దీనికి కారణము జలములందలి చలనము, దాని మాలిన్యము. అంతేకాని సూర్యునిది కాదు. ఆకాశమందలి యథార్థసూర్య బింబమునకు జలముల చలనాదులతో బాధలేదు. అట్లనే రాగాది వికారము లంతఃకరణ ధర్మములు. శుద్ధమైన చైతన్యమునకు ఆ విధమైన భావమొక్కటియు లేదు. భ్రాంతి జ్ఞానముతో ఉన్నట్లుగా తోచు నంతే.

2. స ఏషఃఆ యీజీవుడు, ప్రకృతేఃప్రకృతి యొక్క, గుణేషుగుణము లందు, యర్హి అభివిషజ్జతేఎప్పుడు అత్యాసక్తుఁడగునో, తదాఅప్పుడు, అహం క్రియావిమూఢాత్మాఅహంకారము చేత మఱవఁబడిన స్వరూపము కలవాఁడై, కర్తా అస్మి ఇతినేనేకర్తనని, అభిమన్యతేఅభిమానించి కొనుచున్నాఁడు.

తాత్పర్యము: జీవునకు జననమరణ స్వరూపమైన సంసారము ఎట్లేర్పడునో చెప్పుచున్నాఁడు. పైనచెప్పిన రీతిగా పరిశుద్ధుఁడైన పురుషుడు ప్రకృతి విలక్షణుఁడు. అన్నిరీతుల దోషరహితుఁడు. కానీ దేహము, ఇంద్రియములు, అంతకరణము వీనియందు నేను అనెడి భావమును ఎప్పుడు వహించునో అప్పుడు ప్రకృతి గుణములైన శబ్దాది విషయములందు అత్యాంతా సక్తుఁడు గా ఉండును. వానిచే ననుష్ఠింపఁబడుచున్న కర్మములందు కర్తృభావమును వహించును.

3. తేనదానిచేత, ప్రాసంగికైఃప్రాసంగికముగా వచ్చి ఏర్పడిన, కర్మదోషైఃపుణ్యపాపములతో, అవశఃఅస్వతంత్రుఁడై, అనిర్వృతఃసుఖము లేనివాఁడై, సద సన్మిశ్ర యోనిషుఉత్తమాధమ మిశ్రమ యోనులందు, సంసార పదవీంసంసార మార్గమును, అభ్యేతిప్రాప్తించును.

తాత్పర్యము : దేహేంద్రియాంతఃకరణములం దభిమానము, తత్కృత కర్మములందు కర్తృత్వబుద్ధి ఏర్పడుటచేత పుణ్యపాపకర్మములకు ఫలములైన సుఖదుఃఖాది భావముల కధీనుఁడయ్యెను. పురుషుఁడు దేవతిర్యఙ్మనుష్యాది యోనులందు జనించుటయు , మరణించుటయు కల్గించుచున్న సంసార మారమునకు లోబడిన వాఁడగును.

4. అర్థే=కార్యము, అవిద్యమానే అపి=లేకున్నప్పటికినీ, అస్య=వీని, సంసృతిః =సంసారము, న నివర్తతే=లేకపోవుట లేదు, విషయాన్=విషయములను, ధ్యాయతః =ధ్యానించుచున్నవాడై, స్వప్నే=స్వప్నమందు, అనర్థాగమః యథా= అనర్థము యొక్క దర్శనమువలె (అనుభవించును)

తాత్పర్యము : ఇట్లయినచో ఈ సంసారము. ఈ జన్మమరణాద్యను భవము సత్యమైనదా? లేక మిథ్యాభూతమా? సత్యమైనచో దానికి నాశములేదు. అప్పుడు మోక్షము కూడలేదు. మిథ్యాభూతమైనచో దానిని నివవర్తింప చేసికొనుటకు కావలసిన సాధన సంపాదనము కేవలము క్లేశమాత్రమే. దానికి ప్రయోజనమేమి లేదుకదా? అప్పుడు భక్తి జ్ఞానాదుల అవశ్యకతయే లేదు. ఇదే ఇచ్చట ప్రశ్నయొక్క స్వరూపము. దానికి సమాధానము చెప్పుచున్నాడు. జన్మమరణాది భావము వాస్తవము కాదు. కానీ దేహేంద్రియాదులందున్న ఆత్మభావము నిమిత్తముగా శబ్దాది విషయసుఖములను నిరంతరము ధ్యానించెడు స్వభావము కలజీవునకు జన్మమరణాది భ్రాంతి జన్యమైన సంసార దుఃఖము సత్యమైన దానివలెనే తోచును. నిద్రాదోషము చేత నేర్పడెడు స్వప్నములందు స్వశిరచ్ఛేద నాదులైన అనర్థములు నిజముగా ఏర్పడినవని భ్రాంతిచెంది జీవుడు స్వప్నములోనే దుఃఖించును. ఆ దుఃఖము మిథ్యాభూతమేకదా! నిద్రనుండి లేచిన తరువాత వాని కాస్మృతి ఏర్పడదు. అట్లే స్వరూప విస్మృతితో నేర్పడెడు సంసారము కూడ స్వరూపబోధమైనంతనే నివృత్తమగును. అందుచేత స్వరూప అవబోధమున కుపకరించెడు వ్యాపారము అవశ్యాచరణీయము.

5. అత ఏవ=అందుచేతనే, అసతాం=అనుసరింపఁదగనివానియొక్క, పథి=మార్గమందు, ప్రసక్తం=ఎక్కువగా నిమగ్నమైయున్న, చిత్తం=మనస్సును, శనైః=మెల్లమెల్లఁగా, తీవ్రేణ=శక్తిమంతమైన, భక్తియోగేన=భక్తియోగముచేతను, విరక్త్యా చ=వైరాగ్య భావముచేతను, వశం నయేత్=స్వాధీనమునకు తెచ్చుకొన వలెను.

తాత్పర్యము : ఇంద్రియ సుఖములతో తృప్తి ఎన్నటికీనీ జనించదు. అందుచేత ఇంద్రియములకు లోఁబడి పోవుట అసన్మార్గము. వానివెంట నడచు చిత్తమును తీవ్రమైన భక్తియోగముతో మెల్లమెల్లఁగా స్వాధీనపఱచు కొనవలెను. విషయ దోషదర్శనమైన వైరాగ్యము నవలంబింప వలెను. ఈ రెంటి సాయముతో మనస్సు నిగ్రహింపఁబడును.

6.....11. యమాదిభిః=యమనియమములు మొదలైన, యోగమార్గైః= యోగమార్గములచేత ను, మయి=నాయందు, సత్యేన=కపటలేక ప్రవర్తించెడు, భావేన=భావముచేతను, మత్కథాశ్రవణేన చ=నాకు సంబంధించిన కథలు వినుటచేతను, సర్వభూత సమత్వేన=సమస్త ప్రాణులందును సమదృష్టిచేతను, నిర్వైరేణ=భూతములందు వైరము లేకుండుట చేతను, అప్రసంగతః=విషయ

సుఖములం దసంగతి చేతను, బ్రహ్మచర్యేణ=బ్రహ్మచర్యము చేతను, మౌనేన=వృథాలాపముల వర్జించుట చేతను, బలీయసా=దృఢమైయున్నట్టి, స్వధర్మేణ=స్వధర్మానుష్ఠానము చేతను, శ్రద్ధయా అన్వితః=శ్రద్ధాయుక్తుడైన వాడై, అభ్యసన్=నిరంతరా భ్యాసియైనవాడై, యదృచ్ఛయా=ప్రారబ్ధవశాత్తుగా, ఉపలబ్ధేన=ప్రాప్తించి నట్టిదానిచేత, సంతుష్టః=తుష్టినందిన వాడై, మితభుక్=అల్పభోజియైన, మునిః=మననశీలుడై, వివిక్త శరణః=ఏకాంత ప్రదేశమున వసించుచున్న వాడై, శాంతః=చిత్తవృత్తులను నిరోధించుకొన్నవాడై, మైత్రః=సమస్త భూతములకును హితమునే కోరుచున్నవాడై, కరుణః=కారుణ్యముతో కూడినవాడై, ఆత్మవాన్=ధైర్యయుక్తుడై, సానుబంధే=అనుబంధములతో కూడిన, అస్మిన్‌దేహే=ఈ శరీరమందు, అసదాగ్రహం=పరమార్థము కానట్టి నాదియనెడు భావమును, అకుర్వన్=అనుసరింపనివాడై, ప్రకృతేః=ప్రకృతి, పురుషస్యచ=పురుషుడు వీనియొక్క, దృష్టతత్త్వేన=సహజస్వరూప జ్ఞానముతో కూడిన, జ్ఞానేన=జ్ఞానముచేత, నివృత్త బుద్ధ్యవస్థానః=నివారించి కొనబడిన బుద్ధియొక్క వ్యాపారము కలవాడై, దూరీభూతాన్య దర్శనః=దూరీకరింపబడిన అన్య దర్శనము కలవాడై, ఆత్మనా=ఆత్మచేత, చక్షుషా=నేత్రముచేత, అర్కం=సూర్యుని వలె, ముక్తలింగం=లింగదేహము నుండి విభిన్నమైనదియు, అసతి= తుచ్ఛమైన అంతః కరణమందు, సదాభాసం=సద్రూపముగా భాసించుచున్నదియునైన, సతః=సత్పదార్థమును, బంధుం=బంధువుగాను, అసచ్చక్షుః=అనత్పదార్థముల ప్రకాశముగాను, సర్వానుస్యూతం=అన్నిటి యందు వ్యాపించి యున్నది గాను, అద్వయం=సర్వాత్మకమైనదిగాను అయిన, ఆత్మానం=ఆత్మను, ఉపలభ్య=అనుభవించుచున్నవాడై, స్వస్థుడుగా నుండవలెను.

తాత్పర్యము : భక్తియు, విరక్తియు దృఢముగా నేర్పడుటకున్న కారణములను వానిమూలమును మోక్షప్రాప్తి ఏర్పడు పద్ధతియు. ఆరు శ్లోకములతో వివరించుచున్నాడు. సంసారము సంకటస్థానమనియు, దానినుండి విముక్తి నందవలెననియు వాంఛించుచున్న వివేకియైన పురుషుడు అహింసాదులను శ్రద్ధతో ననుసరింపవలెను. యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి ఇవియే యమాదులు. వీనిని నిష్ఠాపూర్వకముగా అనుసంధింపవలెను, ఈశ్వరునందు ప్రతిఫలా పేక్షారహితమైన పర ప్రేమను అనువర్తింపవలెను. తత్కథాశ్రవణాదులందు మనస్సును స్థిరముగా నిల్పుట కర్తవ్యము. శ్రవణము, కీర్తనము, స్మరణము, సేవనము, అర్చన, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదన ఇవి నవవిధ భక్తులు. వీనిని సమయోచితముగా ననుసరింపవలెను. సర్వభూతములందును భేదములేక వసించెడు పరమార్థ చైతన్యమునే ప్రతిపాణియందును దర్శింపవలెను. స్థూలోపాధి భేదములతో, ఉచ్చనీచ భావములతో నున్న సమస్త భూతములందును సమదృష్టినే నిలుపు కొనవలెను. ఎవ్వరియందును వైరముండరాదు. ఏ విషయ

మందును ఆసక్తికూడదు. స్త్రీదర్శనం, స్పర్శనం, సంభాషణం మొదలైన ఎనిమిది దోషములనుండి విడివడిన వాడు బ్రహ్మచర్యమును జాగరూకుడై కాపాడుకొనవలెను. అతిభాషణము వర్జించుట మంచిది. వారి వారి వర్ణాశ్రమాదుల ననుసరించియున్న ధర్మములను, ప్రవృత్తులను తప్పక అనుసరింపవలెను. ఆ యనుసరించుట పరమేశ్వరుని పూజా విశేషమని తలపవలెను. ప్రారబ్ధాను సారముగా లభించెడు పదార్థములతో తృప్తి చెందవలెను. అట్లు సిద్ధించిన పదార్థములను కూడ మితముగా ననుభవించుట మంచిది. ప్రాణధారణ కుపయోగించు నంతమాత్రమే అనుభవించవలెను. అధిక మైనచో రోగాదుల కవకాశ మేర్పడును. సర్వదా విచార శీలుడై ఉండవలెను. ఏకాంత వాసిగా నుండవలెను. నిరంతరమును ఆత్మస్వరూపమును విమర్శించు కొనవలెను. రాగాదివృత్తు లేర్పడినపుడు అవి దోషహేతువులని వానిని వర్జింపవలెను. పరమశాంతికి మార్గమిదియే. సర్వప్రాణులకును హితమునే చింతించవలెను. ప్రతిఫలాపేక్ష లేక పరుదుఃఖ నివారణమునకై పరిశ్రమింపవలెను. దీనికే కరుణయనిపేరు. ఇది పెరుగు కొలదియు జ్ఞానము దగ్గరగును. ఎట్టి పరి స్థితులలోనైనను ధైర్యము తొలగరాదు. పుత్ర మిత్రాదులందు స్వప్రభావమును, శరీరమందు స్వప్రభావమును వర్జింపవలెను. ప్రకృతి కార్యములైన దేహేంద్రి యాదుల యొక్కయు, వానియందు వసించుజీవాత్మ యొక్కయు స్వరూప భేదమును నిరంతరము విచారింపవలెను. జాగ్రత్స్వప్నసుషుప్తులు బుద్ధియొక్క వ్యాపారభేదముతో నేర్పడునవే. ఈ వ్యాపారములకు సాక్షిగా ఉన్నదే జీవ చైతన్యము, వికాసము సంకోచము- ఈగుణములుగల అసత్తైన అంతఃకరణమందు వికాస సంకోచములకు సాక్షిగానుండియు సత్యస్వరూపుడుగను వసించుచున్న చైతన్యమే ఆత్మస్వరూపమని వృత్తిజ్ఞానముతో తెలియవలెను. సర్వప్రకాశము యొక్క సహాయముతోడ కూడిన నేత్రముచే ఆకాశస్థితుడైన సూర్యుని తెలియునట్లు బుద్ధివృత్తియందు వ్యాపించిన అహం ప్రత్యయమునకు ఆశ్రయభూతుడైన వాడు అసత్తులైన దేహాదులను ప్రకాశింప చేయువాడు, సర్వచరాచరములందు వ్యాపించియున్న వాడు, సర్వాత్మ స్వరూపుడు ఆత్మయే. అట్టి ఆత్మసాక్షాత్కారము అందిన వాడు ధన్యజీవి.

12,13. స్థలస్థేన=స్థలమందు ప్రకాశించెడు, స్వాభాసేన=స్వప్రతి బింబము చేత, జలస్థ ఆభాసః=జలములందున్న ప్రతిబింబము, యథా అవదృశ్యతే=ఏ ప్రకారము కనిపించుచున్నదో, జలస్థేన స్వభాసేన=జలముల యందున్న తనప్రతిబింబముచేత, దివిస్థితః సూర్యః=ఆకాశమందున్న సూర్యుడు, యథా అవదృశ్యతే=ఏప్రకారము కనిపించునో, ఏవం=అట్లే, భూతేంద్రియ మనోమయైః =భూతేంద్రియ మనోరూపములైన, స్వాభాసైః=స్వప్రతిబింబముల చేత, త్రివృత్ ఆహంకారః=త్రిగుణ రూపమైన అహంకారము, సదాభాసేన అనేన=సత్తుయొక్క ప్రతిబింబమైన దీనిచేత, సత్యదృక్=సత్యమైన జ్ఞానస్వరూపుడును, లక్షితః =కన్పడెడు వాడగును.

తాత్పర్యము : అహంకారముతోచేరియున్న ఆత్మ ప్రతిబింబముచేత బ్రహ్మజ్ఞానము అనుభూత మయ్యెడు రీతిని దృష్టాంత పూర్వకముగా బోధించుచున్నాడు. ఆకాశమందు ప్రకాశించుచున్న సత్యస్వరూపుడైన సూర్యుడు జలములందు ప్రతి ఫలించును. దానినుండి ఏర్పడెడు ప్రకాశము గృహాంతర్భాగమందున్న భిత్తియందు కన్పించును. ఆ భిత్తియందు ప్రతి ఫలించిన ప్రకాశమును చూచెడు గృహస్థితుడైన పురుషుడు ఈ ప్రకాశ మెచ్చటిదని పరిశోధించినపుడు జలములందు ప్రతిఫలించిన సూర్యబింబమును చూచును. ఈ ప్రతిబింబము ఎచటినుండి ఏర్పడినదని మఱల ఆలోచించును. అపుడు ఆకాశమందున్న యథార్థ సూర్యుని చూచును. ఇట్లేదేహము, ఇంద్రియములు, మనస్సు, ఈ జడములు తమ తమ వ్యాపారములందు ప్రవర్తించుటకును శబ్దాది విషయములను తెలియుటకును కారణము ఏది యని ఆలోచించినపుడు అహంకారావచ్ఛిన్నమైన జ్ఞానప్రకాశము దేహేంద్రియ మనస్సులందు ప్రతిఫలించుటయే కారణమని తెలియును. అహంకారమందు కన్పించెడు బ్రహ్మ యొక్క ఆ ప్రతిబింబము సహాయముతో సత్యమును, శుద్ధమును, సర్వాశ్రయమును అయిఉన్న పరమార్థమైన ఆత్మస్వరూపమును కూడ తెలియును. ఇట్లు ఆత్మ సాక్షాత్కారమును పొందుటకు సన్నద్ధుడగును. యథార్థ సూర్యుడు- దానినుండి ఏర్పడిన జలములందలి ప్రతిబింబము, దానియొక్క ప్రకాశము, గోడపైన ఆ ప్రకాశమూలముగా గృహమందు వసించెడి పురుషుడు జలగత ప్రతి బింబమును, దానితోపాటు ఆకాశమందుండెడి యథార్థసూర్యుని గమనించును. అట్లేదేహేంద్రియాదుల యొక్క విషయ వ్యాపా రములచేత అహంకారమందు ప్రతిఫలించిన ఆత్మయొక్క ప్రతిబింబమును, దానితోపాటు యథార్థమై ఒక్కదానితో కూడ చేరని బ్రహ్మ పదార్థమును గమనింపవలెనని సారము.

సూర్యుడు	బ్రహ్మ
జలప్రతిబింబము	అహంకార ప్రతిబింబము
గోడపైనున్న ప్రకాశము	శరీరేంద్రియ మనో వ్యాపారము
గృహమునందున్న పురుషుడు,	జీవుడు తన స్వస్వరూపమును
పురుషునియొక్క, సూర్యగ్రహణం	సాక్షాత్కరించికొనుట.
యథార్థం	

పైన చెప్పిన రీతి ననుసరించి నిరూపణము చేయువారికి అసంగసచ్చిదానంద స్వరూపమైన బ్రహ్మము సాక్షాత్కరించును. ఇదే శ్రీకపిలాచార్యుని ఉపదేశసారము.

14. ఇహ=ఈశరీరమందున్న, భూతసూక్ష్మేంద్రియ మనోబుద్ధ్యాదిమ= భూతములు, సూక్ష్మములు, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, అహంకారము అనెడునివి, నిద్రయా=నిద్రకారణముగా, అసతి అసత్తుగానున్న అవ్యాప్తములు,

లీనేఁ లయించి యున్నపుడు, తత్ర=అచ్చట అనఁగా ఆశూన్యా వస్థయందు, యఃఎవ్వఁడు, వినిద్రఃనిద్రలేని వాఁడును, నిరహంక్రియఃఅహంకారాది క్రాంతుఁడు ను=అయి ఉండునో, సఃఆత్మా=వాఁడే ఆత్మ యనిపించు కొనెడువాఁడు.

తాత్పర్యము : ఇంతకు ముందు రెండు శ్లోకములతో యుక్తి పూర్వకముగా ఆత్మ సాక్షాత్కార పట్టి ప్రతిపాదించినాఁడు. అటు తరువాత ఈ శ్లోకముతో స్వప్నావస్థయందు ఆత్మ సాక్షిగా నుండెనని తెల్పుచు అతని అవస్థాత్రయ విలక్షణతను శుద్ధ పరమాత్మత్వమును ప్రతిపాదించుచు తత్సాక్షాత్కారమును వివరించు చున్నాఁడు. ఆకాశాది పంచమహా భూతములు, శబ్దాదులైన పంచ సూక్ష్మభూతములు లేక తన్మాత్రలు- కాక విషయములు, కర్మేంద్రియము లైదు, జ్ఞానేంద్రియము లైదు, చేరి పది, మనస్సు, బుద్ధి, తా ననెడు భావరూపమైన అహంకారము, ఇవి యన్నియుకూడ నిద్రా కారణముగా అవ్యాకృతమై అజ్ఞానమునందు లయించిపోవును. ఇట్లున్నదానికే సుషుప్తి యని పేరు. ఈ స్థితియందు ఎవ్వఁడు ఏ విధమైన శుద్ధజ్ఞానమును నిద్రతో పో గొట్టుకొనుటయీ సుఖరూపమైన సుషుప్తిగా సాక్షిగా నుండునో, ఎవనిలో నేననెడు భావము లేశమాత్ర ముండదో వాఁడే ఆత్మ. వాఁడు స్వయంప్రకాశుఁడు. స్వప్రకాశానంద స్వరూపుడు. అవస్థాత్రయ విలక్షణుఁడు. సుషుప్తికి సాక్షిగాను ఉన్నవానికి ఏ విధమైన వికారమును లేదు. వాఁడే దానిని గ్రహించుటయు సంసారమోక్షమునకు కారణుఁడు.

15. అహంకరణేఁ=అహంకారము, నష్టేఁ=నశించి యున్నపుడు, అనష్టఃనశింపక యున్నట్టి, ద్రష్టాఁ=ద్రష్టయైనవాఁడు, నష్టవిత్తఃనష్టమైనటి విత్తముగల, ఆతురఃఇవ=దుఃఖియైన వానివలె, మృషాఁ=వ్యర్థముగా, నష్టవత్=నష్టమైన వానివలె, తదాఁఅప్పుడు, ఆత్మానం=ఆత్మను, మన్యమానఃతలఁచుచున్న వాఁడై (దుఃఖించును,)

తాత్పర్యము : సుషుప్తియందు ఆత్మస్వరూపుఁడు నిద్రాతీతుఁడు, సుషుప్తికి సాక్షిగా ఉండువాఁడు నైనచో ఆ సమయమును జాగ్రత్స్వప్నావస్థల యందువలె అనుభవ విషయముగా కాకుండుటకు కారణమేమి? అనెడు ప్రశ్నకు సమాధానము. జాగ్రదవస్థయందు శబ్దాదులైన విషయములను ఇంద్రియములతో జీవాత్మ నిరీక్షించుటయీ, వినుటయీ, చేయుచుండును. అందుచే వాఁడు ద్రష్టయను స్థితిలో స్పష్టముగా ప్రకాశించుచుండును. స్వప్నావస్థయందు కూడ సూక్ష్మభోక్తుఁడు ఉండుటచేత వాని ననుభవించెడు వాఁడుగా ప్రత్యక్ష మగును. సుషుప్తియందు విషయము లన్నియు లయించి యుండుటవలన చూచుట వినుట మొదలైనవి బొత్తిగా నుండవు. అపుడు అహంకారముకూడ లుప్తప్రాయమై లోపల నడఁగి యుండును. అందుచేత ద్రష్టయనెడు భావముకూడ లేదు. అయినను తన స్వరూపమైన జ్ఞానానందములతో ప్రకాశించు వాఁడుగా నుండుటచేత తనకు నాశ మనునదీ లేదు. అయినను దేహ అజ్ఞానావృతుఁడై యుండుటచేత తాను నష్టమైనట్లుగా భావించును. సుషుప్తిలో అహం అనెడు జ్ఞానము అచ్ఛాదితమై యుండును. అది కారణముగనే

సుషుప్తి యం దహంభావము లేనిదానివలె తోఁచును. అహంకారాదుల యొక్క తాత్కాలికమైన లయము నిమిత్తముగా ద్రష్టయైన ఆత్మకు దృశ్యము లేకుండునట్లు ఏర్పడుటవలన ఆత్మ లేదనట్లుగా భాసించును. ఇది కేవలము అభాసము మాత్రమే. వాస్తవముగా ఆత్మ లేదనుట లేదు. ఒక దానియొక్క వినాశము మరొకదాని యొక్క వినాశనమునకు కారణమైయుండును. ఇది లౌకికమైన దృష్టాంతము మాత్రమే. ఆ లౌకికమైన దృష్టాంతమునే చెప్పుచున్నాఁడు. దండిగ ధనము కలవాఁడు ఒకఁడు నేను ధనికుఁడనను భావము కలిగి యుండును. వాని ధన మంతమయు పోయిననదనుకొందము. అప్పటికిని వాఁడు జీవాత్మతో కూడిన వాఁడైనను దుఃఖాధిక్యము కారణముగా ధనవినాశము తనయొక్క నాశనముగానే భావించును. పరమవ్యాకులుఁడై దుఃఖించును. ఇట్లే జీవుఁడుకూడ సుషుప్తియందు విషయ వినాశ నిమిత్తముగా తానే వినాశమైనట్లు భావించును. ఆ అవస్థయందు లేనట్లుగా భాసించుట తప్ప వాస్తవముగా ఆత్మలేనివాఁడు కాదు.

16. ఏవం=ఈ ప్రకారము, ప్రత్యవమృశ్య=ఆలోచించినవాఁడై, అసౌ=జీవాత్మ, ఆత్మానం=ఆత్మను. పరమాత్మ భావమును, ప్రతిపద్యతే=ప్రాప్తించును. యః=ఎవ్వఁడు, అహంకారస్య=అహంకారముతో కూడిన, ద్రవ్యస్య=ద్రవ్యమును, అనఁగా శరీరము యొక్క, అవస్థానం=ఆశ్రయ భూతుడును, అనుగ్రహః=ప్రకాశకుఁడుగను అయి ఉన్నాఁడో

తాత్పర్యము : వివేకియైన పురుషుఁడు ఈ ప్రకారము గాగల ఆలోచనలతో కూడినవాఁడై జీవభావమునుండి ముక్తుఁడై పరమాత్మ స్వరూపుఁడుగా నగును. కార్యకారణ సంఘాతరూపమై యున్న ఈ శరీరము ఏ పరమార్థ చైతన్యము నాశ్రయించి నిలచినదో, ఏ చైతన్యము ఈ శరీరమును విషయముల యందు ప్రవర్తింపచేయునో ఆ సుఖముల యందుకూడ తాను ద్రష్టగానున్నదో ఆ చైతన్యమే నే ననెడు పరమార్థ జ్ఞానమును పొందినదయ్యెను.

17,18,19,20. ప్రభో!=తత్త్వధారణ సమర్థుఁడైన ఓ కపిలమునీ! బ్రహ్మన్=బ్రహ్మ స్వరూపుఁడా, పురుషం=జీవుని, ప్రకృతిః=మాయ, కర్హిచిత్=ఏ కాల మందుఁగానీ, న విముంచతి=ఆక్రమింపక వదలుటలేదు, అన్యోన్యాపాశ్రయత్వాత్=పరస్పర సంబంధముగా, అనయోః=వీరిద్దరికినీ, నిత్యత్వాచ్చ=నిత్యత్వ హేతువుగా, భ్రమేః=భ్రమించెను. గంధస్యచ=గంధమును, అపాం=జలము, రసస్యచ=రసమును. యత్‌యత్=వేరువేరైన, భావః=స్థితి, యథా న=ఏప్రకార ముండదో, తథా=ఆరీతిగా, బుద్ధేః=ప్రకృతికినీ, పరస్యచ=పురుషునకును, వ్యతిరేకతః=వేఱువేరుగా, భావః=స్థితి, న=లేదు, అకర్తుః=కర్తకాకుండ ఉండునట్టి, పురుషస్య=పురుషునకు, అయం కర్మబంధః=కర్మతోకూడిన ఈ సంబంధము, యదాశ్రయః=దేనినాశ్రయించి యుండును, ప్రకృతేః=ప్రకృతియొక్క, గుణేషు=గుణములు, సత్సు=విద్యమానములై యున్నప్పుడు, కైవల్యం=మోక్షము, కథం=ఏర్పడురీతి చున్నది. తత్త్వావమర్శేన=తత్త్వచింతనతో, క్వచిత్=దుర్లభము అయినను కొందరియందు, ఉల్బణంభయం=ఉగ్రమైన భయము, నివృత్తం=నివర్తిత మగును,

అయినను అనివృత్తనివృత్తత్వాత్=కారణము యొక్క నశించుట లేనందువలన, పునఃమరల, ప్రత్యవతిష్ఠతే=వచ్చిచెరును కదా!

తాత్పర్యము : ఆత్మజ్ఞాన నిమిత్తముగా సంసార సంకటము నుండి జీవునకు మోక్షము సిద్ధించునని ఉపదేశించిన విషయమును శ్రద్ధగా నాలకించిన దేవహూతి దానియం దసంభావనను శంకించి కపిల భగవానుని ప్రశ్నించు చున్నది. ఓ కపిలమునీ! నీవు బ్రహ్మ స్వరూపుడవు. శిష్యులకు విషయమును బోధించుటకు సర్వ సమర్థుడవు. నీవు సంసారమునుండి జీవుడు విడివడెడు మార్గమును గూర్చి ఇంతవర కుపదేశించినావు. కానీ నాసంశయము వదల లేదు. అందుచేత అసంభావనయనెడు నాబుద్ధిదోషము పోగొట్టి నాసంశయము స్పష్టముగా తీర్చెడు కరుణా విశేషమునీవు ధరింపవలెను. నీ వుపదేశమును శ్రద్ధగా విన్నాను. కాని దానియం దొక అసంభావన నాకు కనిపించు చున్నది. దీనిని నీకు వివరించుచున్నాను. శ్రద్ధగా నాలకించవలెను. ప్రకృతి జడమైనది కదా? అది చేష్టింపవలెనన్నచో పురుషునే ఆశ్రయింపవలెను. స్వయముగా చేష్ట యొనర్చెడు శక్తి దానికి లేదు. పురుషుని ప్రకాశింప చేయుటకు ప్రకృతి తన కార్యమైన బుద్ధి తత్త్వముతో నాతని చెరున టొనర్చవలెను. ఆ ప్రకృతి నిత్య మగుట చేత దాని కార్యములైన సత్త్వాదులును నిత్యములేకదా! ఆ సత్త్వాదుల సంపర్కముతో నేర్పడెడు పుణ్యపాపకర్మములు కూడ నిత్యములుగనే యుండవలెను. అపుడు అంతఃకరణము నాశ్రయించి ప్రకాశించెడు జీవాత్మ పుణ్యపాపకర్మ ఫలములైన సుఖ దుఃఖముల ననుభవించియే తీరవలెను. ఈ యనుభవమున కుపకరించెడు దేవ మనుష్యాది యోనులందు జన్మించుటయే తీరవలెను. అట్టున్నప్పుడు వీరు సుఖ దుఃఖాద్యనుభవములకు కారణములైన శరీరములను ధరింపకుండుటకు మార్గమెట్లు? మఱి జీవాత్మనకు సంసారము నుండి విమోచన మే విధముగా సిద్ధించును? జలమునందు ప్రతిఫలించిన సూర్యదృష్టాంతము ననుసరించియున్న తత్త్వచింత మహాదుర్లభ మైనది. కొంతమంది పురుషులు కొన్నివేళలందు ఆ దృష్టాంతమును జీర్ణించు కొన్నట్లు కన్పడవచ్చును. ఆ సమయమున అప్పుడు వారు కొంతకాలము మాత్రమే జన్మమరణాది రూపమైన మహాభయము బారినుండి తప్పించుకొన్నట్లు కన్పడ వచ్చును. కానీ జన్మమరణాదులకు మూలకారణమైన పుణ్యపాప కర్మములతో సంబంధమున కర్మము, దానికి కారణములైన సత్త్వాది గుణములును శాశ్వతముగా జీవునివిడిచి పోవుగదా! అందుచేత ఆత్యంతికమైన దుఃఖ నివృత్తి ఏర్పడదు. ఆనంద ప్రాప్తి రూపమైన మోక్షమును అసంభావ్యమే యగును. ఈ సంశయమును నీవు దయచేసి తొలగింపవలెను.

21,22,23. అనిమిత్త నిమిత్తేన=కారణముచేత ప్రేరేపింపఁబడని దైయున్న, స్వధర్మేణ=స్వధర్మముచేతను, అమలాత్మనా=నిర్మలమైయున్న అంతఃకరణము చేతను, చిరం=బహుకాలము, శ్రుత సంభృతయా=శ్రవణ మొనర్చుటచేత వర్ధించినదైన, తీవ్రయా=శక్తితో కూడిన, మయిభక్త్యా=నాయందు ప్రదర్శింపఁబడుచున్న భక్తిచేతను, దృష్ట తత్త్వేన=కనపడినట్టి పరమార్థావస్థతో కూడిన,

జ్ఞానేన=జ్ఞానము చేతను, బలీయసా=సబలమైయున్న, వైరాగ్యేణ=విషయ విరక్తి చేతను, తపోయుక్తేన=తపస్సుచే కూడుకొనియున్న,. యోగేన=యోగము చేతను, తీవ్రేణ=విఘ్నములు బాధింపకుండెడు పద్ధతిలో బలముగానున్న, ఆత్మ సమాధినా=పరమార్థ చింతతోను, అహర్నిశం=రాత్రియు పగలును, పురుషస్య దహ్యమాన=పురుషుని దహించుచున్నట్టి, ప్రకృతిః=అవిద్యా రూపమైన ప్రకృతి, శనకైః=మెల్లమెల్లగా, ఇహ=ఈజన్మమందే, అగ్నేః=అగ్నియొక్క, యోనిః =ఉత్పత్తి స్థానమైన, అరణిః ఇవ=కాష్ఠమట్లుగా, తిరోభవతి= తిరోధానమందును. అనగా నశించు నని తాత్పర్యము.

తాత్పర్యము : జీవునకు బంధకారణము ప్రకృతి గుణములైన సత్త్వాదుల యొక్క సంబంధము మాత్రమేకాదు. వాని కార్యములైన దేహేంద్రియాదులు కారణము. తత్ఫలములైన పుణ్యపాప కర్మములయందు అభిమానము కారణము. అదియే బంధహేతువు. ఆ అభిమాన మేర్పడుట భగవంతుని శక్తియైన అవిద్యామూలముగా. అవిద్య నశించినచో అభిమానము నశించును. అభిమాన వినాశ మైనచో మోక్షము కరసమైనట్లే. అభిమానము యొక్క నివృత్తి ఎట్లు? దాని కొక్కటే మార్గము. త్రికరణములతో భగవంతుని శరణజొచ్చుట. అందుచేత పరమాత్మను భజించుటయే జీవునకు సంసారనివృత్తి సిద్ధించుటకు ప్రధానకారణము. ఇది కపిలుని ఉపదేశసారము. ఆ భక్తిని స్పష్టముగా నిరూపించుటకు తత్సాధనములను ఉపదేశించు చున్నాడు. మనుష్యునకు మనుష్య శరీరము సిద్ధించుట సర్వోత్కృష్టమైన సిద్ధి. ఆ యదృష్టము సిద్ధించిన జీవుడు వర్ణాశ్రమోచితములైన స్వధర్మములను ఫలాకాంక్ష లేక ఈశ్వర ప్రసాదమునకే అనుసరింపవలెను. ఆ రీతిగా ననుష్ఠించినపుడు కామాది వృత్తులు భగవదర్పణ మొనర్చిన విశేషముగ మచేత క్రమక్రమముగా నశింపగ దొడగును. అప్పుడు బుద్ధిదోషము నశించును. బుద్ధిదోష మేమి? దాని యొక్క చాంచల్యమే. ఆ చాంచల్యము నశించుటయే బుద్ధియొక్క నైర్మల్యము. నిర్మలమైన చిత్తవృత్తితో భగవంతునకు సంబంధించిన అవతారచరిత్రములను శ్రద్ధగా శ్రవణ మొనర్పవలెను. బహు కాలశ్రవణము చేత పరమాత్మయందు ప్రేమోత్పత్తి ఏర్పడును. క్రమక్రమముగా నది బలపడుచు వచ్చును. అప్పుడు ప్రకృతి కార్యములైన విషయములు అనిత్యములనియు జ్ఞానస్వరూపుడైన ఆత్మయే నిత్యుడనియు జ్ఞాన ముదయించును. అది కారణముగా అనిత్యము లైన సంసార సుఖములందు ఆసక్తి క్రమముగా తగ్గిపోవును. ఇదియే వైరాగ్య మనిపిలువబడెడు సాధనము. అది ఎక్కువగు కొలదియు ఆనందస్వరూపుడైన ఆత్మయొక్క స్ఫురణము, దానితో నేర్పడిన జ్ఞానము క్రమముగా నభివృద్ధి చెందును. ఆనందానుభవము కూడ అట్టి సాధకుని సమాపించుచుండును. ఆహారాదుల యందు దృఢముగానున్న అభిమానము తగ్గుచు శిథిలప్రాయ మగును. అప్పుడు చిత్తముయొక్క ధ్యానమంతయు ఆత్మ స్వరూపము పైననే యుండును. అనగా తీవ్రముగా దానిని గూర్చియే తలపోయుచుండు నన్నమాట. ఇది యతి తీవ్రముగా భాసించినపుడే ధ్యానము అందుము. అదియును తీవ్ర మైనపుడు సమాధి. ఈ సమాధి తీవ్రతతో ఆత్మానంద

మనెడు అమృత ద్రవము అంతఃకరణముద్వారా ఇంద్రియములలో ప్రవేశించును. దానిమూలమున శరీరమందును తొనతొచుండును. ఆనకట్టను ఆవరించి దానిదాటకయున్న జలము ఏర్పఱచిన కాలువలనుండి కేదారము లందు ప్రవేశించి వానిని సస్యశ్యామలముగా నొనర్చునట్లు, నిత్యమును అవిద్యానిమిత్తముగా తపించి దుఃఖించుచున్న మనస్సు ఇంద్రియములు శరీరము తమయందు ప్రవేశించిన ఆనందామృతద్రవముతో మహాశాంతి ననుభవించును. అంతఃకరణాదులను తపింపజేయుచున్నట్టి విషయాశ యనెడు అగ్ని శమించును. ఈ రీతిగా అవిద్యావస్థయందు దుఃఖప్రదమైయున్న ప్రకృతి ఏ రూపముగా తననుండి జారిపోయినదో సాధకునకు తెలియనే తెలియదు. అనఁగా చెప్పకయే జారిపోవునని భావము. అగ్నియొక్క ఉద్భావమునకు కారణమైయున్న అరణియని పిలువఁబడు కాష్ఠము అగ్నియొక్క ఉద్భావముచేత క్రమముగా నశించిపోవునట్లు విద్యయనెడు ప్రకాశము నిమిత్తముగా అవిద్యా కార్యములైన విషయ వాసనలు తత్కారణమైన అంతఃకరణము నశించుచు. ఈ రీతిగా జీవునకు ప్రకృతితో నున్న సంబంధము తజ్జన్యమైన యభిమానము క్రమక్రమముగా నశించును. అట్టిస్థితియందు వానికి ప్రాపంచిక సుఖదుఃఖ ముల స్ఫురణము కూడ ఉండదు. స్వరూప భూతమైన జ్ఞానము యొక్క ప్రకాశము అనుభవములోనికి వచ్చును.

24. భుక్తభోగా=అనుభవింపఁబడిన సుఖదుఃఖములతో కూడినదియు, నిత్యశః=ఎల్లపుడును, దృష్టిదోషా=కన్పించుచుండెడి దోషముతో కూడినదియు, పరిత్యక్తా=విడిచి పెట్టఁబడినదియు నైన, సా ప్రకృతిః=ఆ అవిద్యారూపమైన మాయ, స్వేమహిమ్ని=తనదైన మహిమయందు, స్థితస్య=ఉన్నట్టి, ఈశ్వరస్య= స్వతంత్రుఁడైన పురుషునికి, అశుభం=అమంగళమును, న ధత్తే=కల్పింపలేదు.

తాత్పర్యము : ప్రకృతి కార్యములైన సత్త్వాదులు గుణవృత్తులు. ప్రకృతి సుషుప్తి యందు తిరోహితములై యుండునని అన్నను జాగ్రదవస్థయందు పునరుక్తి కలుగదు. అవి పుణ్య పాపరూపములైన కర్మములను మరల జీవుని నిరికించునట్లుగా సమాధిస్థితి నుండి గడ్డకు వచ్చిన తరువాత మరల ప్రకృతి పురుషుని బాధింపలేదా? అని శంకించుట కవకాశములేదు. సుషుప్తిదశయందు గుణములు విషయములు నిద్ర నిమిత్తముగా లయించి ఉన్నట్లు కన్పడును. నిద్రానాశమందు మరల యథా ప్రకారము వాని ప్రభుత్వము సాగును. సమాధి స్థితియం దట్లుకాదు. అవిద్య యనెడు అంధకారము, విద్య అనెడు ప్రకాశనిమిత్తముగా సంపూర్ణముగా లేనిదై పోవును. ఆ స్థితియందు రెండవ పదార్థ మనుటయే ఉండదు. సుషుప్తినుండి జాగ్రదవస్థను పొందినను పురుషుఁడు వివేకిగా ప్రవర్తించుటలేదు. కానీ సమాధిస్థితి వేఱు. ఆ స్థితి నుండి మానవుఁడు వివేకిగనే ప్రవర్తించును. జన్మ జన్మాంతర సంస్కార నిమిత్తముగా ప్రకృతి కార్యములైన విషయముల నాశయించుటచేత వాఁడు దుఃఖి యగును. వానితో స్వర్గనరకాది లోకములను సంపాదించికొనును.

వానితో సుఖదుఃఖాద్యనుభవము. సమాధిస్థితిని పొంది ఆయానందము ననుభవించిన వారికి ఈ సుఖములందు తీవ్రమైన వైరాగ్య మేర్పడును. పుణ్యపాపములు తన్నిమిత్తముగా నేర్పడెడు స్వర్గనరకములు- ఇవియన్నియు పైపైని ఏర్పడు లాభములు వేరూని యుండును. ఇవి సర్వానర్థకరములని వాడెఱుగును. అందుచేత ఆయనర్థములకు కారణములైన ప్రకృతితో గల బంధమును వాఁడు సమూలముగా ఛేదించును. ఆ బంధనాశముతో వానికి ఆత్మానంద మనెడు నైశ్వర్యము అనుభవములోనికి వచ్చును. దానిలో లీనమైన పురుషుఁడు అవిద్యాధీనుఁడు కాఁడు. వాఁడు స్వతంత్రుఁడు ప్రకృతి దానులుగా నున్న కాలమందు వాని నుపద్రవములలో నిరికించిన ప్రకృతి- ఈశ్వరుఁడుగా మారిన పురుష సన్నిధానమందు నిలఁబడుటకు కూడ సామర్థ్యము కలది కానేరదు. అందుచేత జన్మమరణరూపములైన అసుభవములు వానిపైన రుద్దుటకు వానికి శక్తిలేదు. కనుక వైరాగ్య భక్తిజ్ఞాన యుక్తములైన సాధనము లనెడు సంపత్తి ఏర్పడుటచేత నశించిపోయెడి ప్రకృతిగుణములు పునరుత్థాన ము చెందెడి అపాయము నే మాత్ర మాస్థితిలో నుండదు.

25. అప్రతిబుద్ధస్య=మేల్కొనుట లేక నిద్రించియున్న వారియొక్క, ప్రస్వాపః=స్వప్నదర్శనము, యథాబహు అనర్థకృత్=ఏ రీతిగా బహు విధ అనర్థములను జనింపఁజేయునో, స ఏవ=ఆ స్వప్నమే, ప్రతిబుద్ధస్య=నిద్రనుండి జాగ్రదవస్థలోనికి వచ్చినవాని యొక్క, మోహాయ=పరిభ్రమమునకు, స వై కల్పతే హి=సమర్థము కానేర దనుట ప్రసిద్ధము కదా!

తాత్పర్యము : అవివేకిగా నున్న సమయమందు అనర్థ హేతువుగా నున్న ప్రకృతి వివేకికే అనర్థావహము కానేర దనెడు విషయమున లౌకికమైన దృష్టాంతముతో స్పష్టముగా బోధించు చున్నాఁడు. నిద్రావస్థయందు ఏర్పడెడు స్వప్నము, ఆ సమయమందు వానికి భయసంతోషాదులను కలిగింప సమర్థమై ఉండును. నిద్రలేచిన తరువాత సంస్కారవశాత్తు స్మృతిలో జొచ్చెడు నదే స్వప్నము భయ సంతోషాదులను కలిగింప నేరదు. ఇది నిత్యానుభవమైన విషయము. అట్లే అజ్ఞానావస్థయందు జనన మరణాది క్లేశములకు మూలకారణమైన ప్రకృతి జ్ఞానోదయానంతరము ఆ రీతిగా అనర్థములను కల్గింప నేర దని సారము.

26. ఏవం=ఈ రీతిగా, విదిత తత్త్వస్య=తెలిసికొనఁబడిన తత్త్వముతో కూడిన వాఁడును, మాయ=నాయందు, మానసం=మనస్సును, యుంజతః=యోజింపఁజేసిన వాఁడును, ఆత్మారామస్య=ఆత్మయందే రమించిన వాఁడును ఐన పురుషుని యందు, ప్రకృతిః=మాయ, కర్హిచిత్=ఏ కాలమందును, న అపకురుతే=అపకారము చేయ నేరదు.

తాత్పర్యము : స్వప్నావస్థయందు నిరూపింపఁబడిన దృష్టాంత ప్రకారముగా ఏ పురుషుఁడు ప్రకృతి. ఈశ్వరుఁడు వీరియొక్క పరమార్థమైన అవస్థను చక్కగా తెలిసిన వాఁడగునో వాఁడు ప్రకృతికార్యములందు ఆసక్తిని పూననేరఁడు. ఈశ్వరుఁడైన నాయందే వాఁడు మనస్సును యోజించును. స్వరూపానందాను

భవముతో సంతృప్తిని ప్రాప్తించును. ఆత్మారాముఁడై యుండును. అట్టివానికి ప్రకృతి మరల జనన మరణాది క్లేశములను కల్గింప నేరదు.

27,28,29. బహుజన్మనా=అనేకములైన జన్మములతో కూడిన, కాలేన=కాలములచేత, యధా=ఎప్పుడు, ఏవం=ఈ ప్రకారముగా, అధ్యాత్మరతః=ఆత్మదర్శనముతో సంతుష్టుఁడైన వాఁడును, మునిః=విచారశీలుఁడును, ఆబ్రహ్మభువనాత్ సర్వత్ర=బ్రహ్మలోకము మొదలుకొనియున్న సమస్తమునందును, జాతవైరాగ్యః=వైరాగ్య మేర్పడిన వాఁడును, మద్భక్తిః=నాయందే పరమ ప్రీతి యుక్తుఁడును, ప్రతిబుద్ధార్థః=స్పష్టముగా తెలిసికొనను బడిన పురుషార్థముతో కూడిన వాఁడును, స్వోదృశా=స్వ స్వరూపమును చక్కగా ననుభవించుటచేత, ఛిన్నసంశయః=సంశయములు తొలఁగిన వాఁడును, ధీరః=ఇంద్రియముల జయించినవాఁడును, భూయసాం=ఎక్కువయైన, మతసాదేన=నాయనుగ్రహ విశేషముచేత, స్వసంస్థానం=తన పరమార్థ స్వరూపమైనదియు, మదాశయం=నన్నాశయించి యున్నదియు నైన, కైవల్యాఖ్యం=కైవల్య మనెడు పేరుతో పిలువఁబడుచున్న, నిశ్శ్రేయసం=మోక్షమును, ఇహ=ఈ జన్మమందే, అంజసా=సాక్షాత్తుగా, ప్రాప్నోతి=పొందినవాఁడగును. లింగవి నిరమే=లింగ శరీరమునుండి ముక్తుఁడైన తరువాత, యదత్వాం=ఏ స్థానమునీ పొంది, యోగీ=నాతోచేరిన వాఁడైన యోగి, ననివర్తేత=మరల తిరిగిరాఁడు.

తాత్పర్యము : ఉపదేశము నుపసంహరించుచున్నాఁడు. ఈ రీతిగా ఆత్మయందు రమించెడు స్థితి ఏర్పడు వఱకును భక్త్యాది సాధనము లనుష్ఠించుచునే రావలెను. ఈ సాధనతోనే బహుజన్మములు గతించును. ఆ సంస్కారముల సంబంధముతో సాధకుఁడైన పురుషుఁడు ఆత్మరతుఁడుగా నగును. అప్పుడు వాని పాలికి బ్రహ్మలోకము మొదలుకొనియున్న సర్వ లోకములు, వానియందున్న సుఖభోగములు తుచ్ఛప్రాయములుగా కనిపించును. తీవ్రవైరాగ్యమే వాని జీవిత మగును. అప్పుడు వాఁడు సర్వేశ్వరుఁడైన నాయందు నిరతిశయప్రేమయుక్తుఁడై యుండును. పరమపురుషార్థ మనెడు పేరుగల ఏ స్థితి కలదో దానిని గూర్చిన జ్ఞానము వానికి సర్వము సుబోధముగా నుండును. వాఁడు దేనికిని లోఁబడఁడు తొన్నిమిత్తముగా వానిపై నాయొక్క అనుగ్రహము సమృద్ధిగా వర్షిత మగును. అప్పుడు వానికి వాఁడు నాస్వరూపమే యనెడు యనుభవ మేర్పడును. స్వస్వరూపమునుండి తాను భిన్నుఁడు కానను భావము వానినరనరమునుండి గతించిపోవును. తత్ఫలముగా వానికి కైవల్యము- అనఁగా కేవల భావము రెండవ పదార్థము లేనిది, ఈ విధమైన పరమ పురుషార్థము వానికి ఈ జన్మమందే ప్రయాసము లేక సిద్ధించును. వాఁడు జ్ఞానానంద స్వరూపుఁడేయగును. ప్రారబ్ధావసానములందు అజ్ఞాన రూపమైన కారణ శరీరము అట్టివానికి నశించిపోవును. జన్మమరణాది రూపసంసారము వానికి పునఃప్రాప్తించదు"న స పునరావర్తతే చ నపునరావర్తతే" అనెడు శ్రుతి వాక్య మంతరర్థితమైన సారమే" వాఁడు మరల జన్మ మరణములకు పాత్రుఁడుగా కానేరఁడు" అనువాక్యములచే వివరింపఁబడినది.

30. అంబ!=ఓ తల్లి! యోగోపచితాసు=యోగముతో నభివృద్ధి పొందినవియు, అనన్యహేతుమ=ఇతరకారణముతో కూడినవియు, నైయున్న, మాయాసు=మాయల

యందు, సిద్ధస్య=సిద్ధపురుషుని యొక్క, చేతః=మనస్సు, యదా నవిషజతే=ఎపుడ నాసక్తమై యుండునో, తదా=వెంటనే, ఆత్యంతికీ=అపాయరహితమైన, మే గతిః=మత్ప్రాప్తి అనఁగా నాతో చేరియుండెడు నభిన్నస్థితి, స్యాత్=ఏర్పడును. యత్ర=ఏ స్థితియందు, మృత్యుహాసః=మృత్యుదేవి నవ్వు, న స్యాత్=ఏర్పడదో.

తాత్పర్యము : పైన చెప్పిన విధముగా మోక్షప్రాప్తికర్హుడైన యోగికి అణిమాది సిద్ధులు విఘ్నకరులుగా ప్రాప్తించును. వివేకముతో నా విఘ్నముల నతిక్రమింపవలెను. తలియందు తనకున్న అతిశయ ప్రేమతో కపిలుఁ డీసిద్ధిని కూడ వివరించుచున్నాఁడు. అమ్మా! ముక్తి ప్రాప్తికి విఘ్నమొనర్చునవి అణిమాది సిద్ధులు. ఇవి ప్రధానముగా నెనిమిది. అవి యన్నియు యోగాభ్యాస బలముచేత సిద్ధించును. ఇవి ప్రాప్తించుటకు యోగ మొక్కటే కారణము. ఇవి మాయాదేవి యొక్క అంతరంగ విలాసము. వీని ప్రలోభములకు యోగి మనస్సు లోఁబడరాదు. లోఁబడినచో వానికి తాత్కాలికములైన సుఖ సాధనము లన్నియు ప్రాప్తించును. సమస్త భోగములును వానికి ద్వారపాలకులు మాత్రముగా నుండును. తమ యందు వానికి తీవ్రకౌతుకము జన్మించునట్లుగా చేయును. వానికి లోఁబడిన వాఁడు పరమానంద ప్రాప్తిరూపమైన మోక్షమును తొందరగా పొందలేఁడు. కాలవిలంబ మేర్పడును వానినుండి దాటినపుడే పునరావృత్తి రహితమైన కైవల్యసిద్ధి యగును. ఆసితియందున్న వాని యెదుట మృత్యుదేవి నిలువలేదు. వానివైపు తేరిచూడను కూడలేదు. వానిపాలికి మరణము అసంభవమైన విషయము. అణిమాది సిద్ధులకు లోఁబడిన వాని ఎదుట నిలచి మృత్యుదేవి పరిహసించును. వానికి మరణమును దాని ననుసరించిన పునర్జన్మయు నేర్పడును. కనుక అష్టసిద్ధులు యోగికి ప్రమాదకరము లైనవి.

విజయధ్వజ వ్యాఖ్య

1. వక్త యందును శ్రోత యందును తారతమ్యమును వక్తగొప్పవాఁడైనను శ్రోత అత్యంత కిష్టవిషయమును ప్రథమ పర్యాయమే సమగ్రముగా నర్థము చేసికొనునని చెప్పలేలులేదు. అందుచేత తాత్పర్యాతిశయమునకై ఇంతకుముందు చెప్పిన గుణత్రయ తత్త్వ విచారమునే మరల నీ యధ్యాయమందు విశద పఱచున్నాఁడు. జీవుఁడు పరమాత్ముఁడు వీ రిరువురును శరీర సంబంధము కలవారే. అప్పుడు జీవునకు వలెనే శ్రీహరికి కూడ దేహగత దుఃఖాది భోగము లెందు కేర్పడుట లేదని ఆశంకించుకొని యుత్తరమిచ్చుచున్నాఁడు- పురుషః=పరిపూర్ణుఁడైన శ్రీహరి కూడ, ప్రకృతిస్థః అపి=జడ ప్రకృతి కార్యమైన దేహమందున్ననూ, అవికారాత్=షడ్వికారములు లేనివాఁడగుట చేతను, అకర్తృత్వాత్=ఇతరుల కధీనమైన కర్తృత్వము లేని వాఁడగుటచేతను, నిర్గుణత్వాత్=ప్రకృతి గుణములైన సత్త్వరజస్తమస్సులు లేనివాఁడగుటచేతను, జలార్కవత్=నీటియం దగుపించెడు సూర్యుఁడు జలదోషములచేత, నేర్పడెడు చాంచల్యము మొదలగు వానితో సంబంధుఁడెట్లుకాఁడో అట్లే ప్రాకృతైః గుణైః ప్రకృతి నిర్మితములైన శరీరముం దుండెడు సుఖదుఃఖములు

జన్మమరణముల మొదలగువాని చేత, న ఆజ్యతే=లేశమును సంబంధము కలవాఁడు కానేరఁడు.

"తం వా ఏతం పూరమాచక్షతే పురుషః" అనెడు శ్రుతి కూడ పురుషుఁడన గా శ్రీహరి యనియే తెలుపు చున్నది.

2. శ్రీహరికి సుఖదుఃఖముల తోడి సంబంధము లేనిచో"సుఖి దుఃఖి, జన్మించెను, మరణించెను, దరిద్రుఁడు మొదలైన వ్యవహారములకు విషయమైన వాఁడెవ్వఁడు? దానికి సమాధానము. యర్హి=ఎప్పుడు, సః=గడచిన అధ్యాయ మందు,"ప్రత్యగాత్మానం ఆత్మని చింతయేత్" అనుచోట ప్రాప్త విషయుఁడైన, ఏషః='అహం' అనెడు ప్రత్యక్షమునకు విషయమైన జీవుఁడు, ప్రకృతేః గుణేషు=ప్రకృతి యొక్క గుణవికార మనిపించుకొన్న దేహమందు, అభివిషజ్జతే= దేహాభిమాన యుక్తుఁడై జన్మించునో, తదా=అప్పుడు, అహంకార విమూఢాత్మా= ప్రాకృత గుణములనుండి పుట్టిన అహంకార మమకారములతో శ్రీహరి స్వరూపమును మఱచినవాఁడై, కర్మాస్మి=తనయందు శ్రీహరి కధీనమైన కర్తృత్వ మున్నదని తెలియక స్వతంత్ర కర్తృత్వము లేకున్నను ఆరోపించుకొని తానే సర్వస్వతంత్రుఁడనని, అభిమన్యతే=భ్రాంతితో అనుకొనును.

3. అట్లనుకొన్న దాని ఫలమును చెప్పుచున్నాఁడు. తేన=తన యందు లేనట్టిస్వతంత్ర కర్తృత్వము నారోపించుకొనుటచేత, అవశః=పరాధీనుఁడైన వాఁడు, అనిర్వృతః అపి=శబ్దము మొదలైన విషయములు నశ్వరములగుటచేత, తృప్తిరూపమైన ఆనందమును మనస్సుతో పొందకున్నను, ప్రాసంగికైః= విషయాసక్తితో నేర్పడిన, కర్మదోషైః=దేవతలు అసురులు మనుష్యులు- ఈ యోనులందు, జాతస్సన్=జన్మించినవాఁడై, సంసారపదవీం=సుఖదుఃఖరూపమైన సంసారమును, అభ్యేతి=పొందును.

తాత్పర్యము : ఈ భ్రాంతి ఫలముగా సుఖదుఃఖ రూపమైన సంసారమును పొందును. జీవుఁడు శ్రీహరి కధీనుఁడు. శబ్దము మొదలైన విషయములు నశ్వరము లగుటచేత జీవుని మనస్సునకు తృప్తి కల్గింపనేరవు. అయినను ఆ విషయములం దాసక్తుఁడై కర్మదోషముల కాశ్రయభూతుఁడైతత్ఫలముగా దేవాసుర మనుష్య యోనులందు జన్మ మరణములకు లోఁబడినవాఁ డగుచున్నాఁడు.

4. అభిమాన ప్రయుక్తముగా ప్రాప్తించిన ఈ సంసారము పోకుండుటకు కారణమే మని ఆశంకించి విషయాసక్తియే కారణమని చెప్పుచున్నాఁడు. విషయాన్=శబ్దాదివిషయములను, ధ్యాయతః=ఆలోచించుచున్నట్టి, అస్య= సుఖజ్ఞానస్వరూపియైన ఈ జీవునకు, అర్థే=సుఖి దుఃఖి యనెడు వ్యవహారము (2) అబాధితమైన ప్రయోజనము అవిద్యమానే అపి=లేకున్నను, యథా=జాగ్రదవస్థ యందెట్లు వివిధములైన పదార్థములను ఆలోచించువానికి, స్వప్నే=స్వప్న మందు నానావిధములైన దృశ్యములచేత, అనర్థాగమః=మరణ మనెడు అనర్థ

మేర్పడు చున్నది. ఏర్పడుట, న నివర్తతే=ఎట్లు తప్పదో, తథా=అట్లే, సంసృతిః=సంసారము, న నివర్తే=పోవుటలేదు, హి=ఇది," ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే" అనెడు రీతిగా శాస్త్రప్రసిద్ధము. విషయధ్యానము, ఆసంస్కారపరంపర- ఇవి ఒక దాని కొకటి బీజము, అంకురమునై యున్నవి. అనాది కాలము నుండి ఇవి కారణములై యుండుటచేత శ్రీహరి యనుగ్రహము లేనిదే అవి పోవుట లేదు. స్వప్నమందు"పురుషం కృష్ణం కృష్ణదంతం పశ్యతి. న ఏనం హంతి," నల్లనైన పండ్లుకల నల్లని మనుష్యుని చూచినచో మృత్యువు సిద్ధమని చెప్పఁబడినది. కనుక స్వప్నము రాఁబోయెడి అనర్థమును సూచించునని తెలియవలెను. ఇచ్చట స్వప్న పదార్థములు ప్రయోజనకరములని తోపింపఁ జేయుటచే స్వప్నమందలి పదార్థములు అబద్ధము అనువాదము ఖండింపఁబడినది.

తాత్పర్యము : జీవుఁడెప్పుడును శబ్దాది విషయములనే ఆలోచించు చుండును, ముక్తి యోగ్యుఁడైన ఈ జీవుని స్వరూపము సుఖజ్ఞానాత్మకమైనది. కాని విషయానుభవ కాలమందు వీనికి నిత్యసుఖి అనెడు వ్యవహారముండదు. వీని కేర్పడు ప్రయోజనము నశ్వర మైనదే. కాని దాని పరిణామ రూపమైన సంసార మనెడు అనర్థము వీనికి తప్పుట లేదు. మేలుకొని యున్నప్పుడు వివిధ పదార్థములను గూర్చి ఆలోచించిన దానిఫలితముగా స్వప్నమునందు గాడిద నెక్కినట్లు కలగన్నవాఁడు, అబాధితముగా అట్టి విషయమునకు కారణముకానివాఁడైనను, ఆ స్వప్నము నుండి సూచితమునైన మరణ రూప అనర్థమునకు పాత్ర మగుచున్నాఁడు కదా! ఈ సంసారము జీవున కాగంతుక మగుటచేత దానిని పోఁగొట్టికొన వచ్చును కాని వాఁడు అన్యథా జ్ఞానము అజ్ఞానము మొదలైన వానిని పోఁగొట్టుకొని శాస్త్రజ్ఞానము నంది విషయసేవనమే ఆత్మ నాశమునకు కారణమని గమనించి విషయము లనిత్యము లనియు అందుచే శాశ్వత ఫలము వాని నుండి చేకూర దని తెలిసికొని ఈ సంసారమునకు కారణమైన విషయముల ఆలోచననేపూర్తిగా వదల వలెను. విషయములందు మనస్సు ఆసక్తియే సంసారమునకు కారణము. విషయాసక్తిగల మార్గమెప్పటికిని మోక్షమార్గము కానేరదు. కనుక మనస్సును మోక్షవిరోధియైన యా మార్గము నుండి క్రమముగా మరలించుకొనవలెను.

5. ఈ సంసారము పోవుట కుపాయమును చెప్పుచున్నాఁడు. స్వప్న సుప్తిభ్యాం=అన్యథా జ్ఞానము, అజ్ఞానము వీనినుండి, ప్రబుధ్య=" విషయాణాం సేవయా స్యాత్ సా స్వతో న నివర్తతే" విషయసేవనము చేత సంసారము ప్రాప్తించును. అది తానే వదలి పోవదు అనెడు శాస్త్రోపదేశముచేత మెచ్చరిక గలవాఁడై ఉత్తమమైన జ్ఞానమును పొంది, ఆత్మవైశసం=దుర్విషయములను సేవించుట చేత ఆత్మనాశ మేర్పడునని, సంస్మరన్=స్మరించుచు, అసౌ=ఈ జీవుఁడు విషయముల యొక్క, వైతథ్యం=నిష్ఫలత్వమును, వ్యభిచారంచ=అనిత్యతను (జ్ఞాత్వా=తెలిసి) యతః=ఏ విషయముల నుండి, భయం స్యాత్=

సంసారరూపమైన భయ మేర్పడునో, తత్="అట్టి విషయములను గూర్చి, న ధ్యాయే=ఆలోచించరాదు." అత్మ సంసృతేః="అనెడు పాఠాంతరమందు సంసారముయొక్క నిష్పలత్వమును అనిత్యత్వమును గూర్చి తెలిసికొన్నవాడై అని అర్థ మొనర్పవలెను." "అజ్ఞానుషప్తిశబ్దోక్తం స్వప్నస్యైవ విపర్యయః" అనెడు ప్రమాణముతో పై చెప్పిన అర్థము సంగత మగును.

మనోజయ మేర్పడినచో సమస్తమును జయింపఁబడినట్లే అని భావించి మనస్సును జయించు ప్రకారమును చెప్పుచున్నాఁడు. అత ఏవ=విషయములందు మనస్సు యొక్క సంగమే సంసారమునకు కారణ మగుటచేత, అ సతాంపథి=విషయాసక్తుల దుష్టమార్గములందు, ప్రసక్తం=అత్యంత మాసక్తి కలిగినట్టి, చిత్తం=మనస్సును లేక అసతాం=అమంగళములైన విషయముల యొక్క, పథి=మార్గమందు ఆసక్తమైన మనస్సును, శనైఃక్రమముగా, తీవ్రేణ=అతి శయమైనట్టి, భక్తియోగేన=శ్రీహరియం దొనర్చెడు భక్తిచేతను, విరక్త్యా చ=విషయ వైరాగ్యముచేతను, ఆత్మవశం=తనయధీనముగా, నయేత్=చేసికొనవలెను.

6. మనస్సు తన వశమం దుంచుకొన్న మాత్రాన చాలదు. యమము, నియమము మొదలైన విషయములచేత పుట్టిన అపరోక్షజ్ఞానమే కావలెను. దీనిచేత మరల సంసారమునకు వెనుదిరిగి వచ్చెడి ప్రక్రియే లేనట్టి పరమేశ్వర ప్రాప్తిరూపమైన మోక్షము కూడ ఏర్పడునని చెప్పుచున్నాఁడు. ఆపైవచ్చెడు పండ్రెండవ శ్లోక మందలి 'ప్రతిపద్యతే' అనెడు క్రియతో నీశ్లోకము నన్వయించి అర్థ మొనర్చి కొనవలెను. యమాదిభిఃయమనియమములు ప్రాణాయామ మనెడు, యోగపథైఃయోగమార్గములచేత, ప్రణవం=ఓంకారమును, అభ్యసన్=అభ్యసించుచు, శ్రద్ధయాశ్రద్ధచేత, అన్వీక్షస్యన్=కూడికొన్న వాఁడై, మయి=శ్రీహరి యైన నాయందు, భావేన=భక్తిచేతను, సత్యేన=సమస్త భూతములకును హితకరమైన మాటచేతను, మత్కథాశ్రవణేన చ=నా కథలను గూర్చి వినుటచేతను, ప్రతి పద్యతే=పొందుచున్నాఁడు.

7. సర్వభూత సమత్వేన=సర్వుల యందు అంతర్యామిగానున్న శ్రీహరి పరిపూర్ణుఁడని తెలియుట చేతను, నిర్వైరేణ=విష్ణు భక్తుల యందు ద్వేషము లేకుండుట చేతను, అప్రసంగతఃవిషయీముల యందాసక్తులైనవారితో సంభాష ణాదు లొనరింపకుండుటచేతను, బ్రహ్మచర్యేణ=విషయానుభవమున కవకాశ మివ్వకుండుటచేతను, మౌనేన=లౌకికములైన మాటల నాడకుండుట చేతను, మహీయసా=ఉత్తమమైన, స్వధర్మేణ=తమ తమ వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి మెలఁగుటచేతను.

8. యదృచ్ఛయా=శ్రీహరి ఇచ్ఛచేత, ఉపపన్నేన=తనకుతానైతనదిగా ప్రాప్తించిన, ధనేన=ధనముతో, సంతుష్టఃసంతోషమునందినఁవాఁడై ఉండుటచేతను, మితభుక్=దేహమునకు హితమును మితమునైన ఆహారమును గ్రహించుచున్న వాఁడై ఉండుటచేతను, మునిఃమననశీలుఁడగుటచేతను, వివిక్తశరణఃఏకాంత ప్రదేశమందు ఆసక్తి గలవాఁడగుటచేతను, మైత్రః

=సజ్జనుల కేర్పడిన అపత్యను తెలిసి చేతనైన యుపకార మొనర్చి రక్షణ సేయుబుద్ధిగలవాడై యుండుట చేతను, (2) మిత్రదేవతాకమైన గాయత్రి మొదలైన మంత్రములచేత ఆయా దేవతాంతర్యామియైన శ్రీహరి యందు నిష్ఠగలవాడై యుండుటచేతను, కరుణఃమిత్రులు ఉదాశీనులైన సజ్జనులందు కృపగలవాడై వర్తించుటచేతను, ఆత్మవాన్=మనస్సును తన వశమందుంచుకొన్నవాడై మెలగుట చేతను.

9. సానుబంధేభార్యాపుత్రులు మొదలైన అనుబంధములచే కూడియును, అస్మిన్=కర్మాను గుణముగా శ్రీహరి యొసగినట్టి, దేహే=శరీరమందు, అసదాగ్రహం చ=ఇది నాది, అది వానిది యనెడు దురాగ్రహమును, అకుర్వన్=చూపకుండుటచేతను, ప్రకృతి పురుషుల యొక్క, దృష్టతత్త్వేన=యథావత్తైన జ్ఞానాత్మకమైన, జ్ఞానేన=జ్ఞానముతోకూడి యుండుటచేతను.

10. నివృత బుద్ధ్యవస్థానఃబుద్ధియొక్క పుర్వావస్థయనిపించుకొన్న నిద్ర మొదలైనవానిని పోగొట్టుకొని (అనగా జయించి అన్నమాట) దూరీభూతాన్య దర్శనఃశబ్దాది విషయములకు సంబంధించిన జ్ఞానమును దూర మొనర్చి, చక్షుషాకంటిచేత, అర్కం ఇవసూర్యుని చూచునట్లు ఆత్మనాబాహ్యాంతఃకరణముతో మిశ్రముకాని స్వరూపాంతఃకరణముచేత, ఆత్మానం ఉపలభ్యతన స్వరూపమును గమనించి వాని యనుగ్రహముచేత (3) తన యంతర్యామియు బింబరూపియైన శ్రీహరిని వీక్షించి, ఏకదృక్ముఖ్యమైన వాడు శ్రీహరియే యనెడు జ్ఞానము కలవాడై, ఆత్మదృక్సర్వమునకును శ్రీహరియే స్వామియను జ్ఞానము కలవాడై," నిద్రను జయించి అనుటచేత" శ్రవణాది జానేనైన క్షణం తిష్ఠేత్క్వచి దపి అత్యశక్తే తు నిద్రారే పునరేవ సమభ్యాసేత్"

అనెడు ప్రమాణముచేత నిద్ర బలవంతముగా వచ్చు వరకు శ్రీహరి కథా శ్రవణ మొనర్చు చుండవలెను. తట్టుకొనలేక నిద్రవచ్చినపుడు మాత్రమే నిద్రించి మరల నభ్యాసమునకుఁ దొడరవలెను.

11. ప్రారబ్ధకర్మము క్షయమైన తరువాత ముక్తలింగఃలింగశరీరమును వదలి, దేవయానముతో బ్రహ్మలోకమును చేరి, అసతిప్రళయకాలమందు అనిరుద్ధనిమూలకముగా బ్రహ్మ దేవుని యందు ప్రవేశించి, సతఃతండ్రి మొదలైన రూపములతో నున్న ప్రాణదేవునకు, బంధుంబంధువుగానున్న, సమంఅన్ని రూపములందు పూర్ణగుణుడై సముడనిపించుకొన్న, చక్షుఃసర్వజ్ఞుడైన, సర్వాను స్యూతంముక్తులు, అముక్తులు, ప్రపంచ వస్తువులు వీని యందు మణులందు దారమున్నదై, వానిని పట్టుకొన్నట్లుగా వ్యాపించి ధారకుడై యున్నట్టియు, అద్వయంసములు అధికులులేని, సదాభాసంప్రాణదేవుడే ప్రతిబింబముగా ఉన్నశ్రీహరిని, ప్రతిపద్యతేపొందుచున్నాడు. "సతో బంధు మసతి నిరవిందన్" అనెడు శ్రుత్యర్థమును ఈ శ్లోకముతో వివరించినాడు. స్థూలముగా సమస్తదేవతలును శేషునకు ప్రతిబింబములు. శేషుడు బ్రహ్మదేవునకు, బ్రహ్మ పరమాత్మకును ప్రతిబింబములు. ఆ ప్రతి

బింబములు ప్రసన్నులై తమ తమ బింబదర్శనమున కనుగ్రహ మొనర్తురు. కనుక దేవతాను గ్రహముచేత శేషుని, తదను గ్రహముచేత బ్రహ్మాను (అనఁగా వాయువును) అతని అనుగ్రహముచేత పరమాత్మను దర్శింపవలెను. ఈ అర్థము నంతయు 'ఆత్మానం' అను పదముచేత ఇచ్చట సూచించినాఁడని తెలియవలెను." శేషస్యప్రతిబింబాస్తు దేవాఃశేషశ్చమ్ బ్రహ్మాణఃన పరబ్రహ్మశ్చైవ తే స్వబింబప్రదర్శకాఃతతఃస్వబింబద్వారేణ పరమాత్మ ప్రదర్శన" అను ప్రమాణము పై యర్థము నంతయు స్పష్ట పఱచుచున్నది.

12. ముఖ్యప్రాణదేవుఁడు మొదలైన ప్రతిబింబములు బింబమైన శ్రీహరిని చూపింతురని పైశ్లోకమందు చెప్పఁబడినది. ఇచ్చట ప్రతిబింబములు బింబ ప్రకాశముఁ లయ్యేఁడు విధమును చెప్పుచున్నాఁడు. (1) ఆకాశమందున్న సూర్యుని ప్రతిబింబము నీటి యందు కన్పించును. ఆ నీటి యొక్క ప్రతిబింబము కొన్ని సమయములందు స్వచ్ఛమైన గోడపైన పడును. ఇట్లున్నపుడు యథా=ఎట్లు, స్థలసేన=గోడపైనపడియున్న, ఆభాసేన=ప్రతిబింబముచేత, జలసఃనీటి యందున్న, ఆభాసఃప్రతిబింబము, దృశ్యతే=చూడబడునో, అట్లే యథా=ఎట్లు, స్వాభాసేన=తన ప్రతిబింబముచేత, జలస్థేన=నీటి యందున్న, స్వాభాసేన=తన ప్రతిబింబముచేత, దివి=ఆకాశ మందు, స్థితఃఉన్న, సూర్యఃదృశ్యతే=బింబరూపియైన సూర్యుఁడు కానవచ్చునో లేక (2) జలమందున్న ప్రతిబింబము, స్థలసేన=తీరమందున్న పురుషుని ముఖము (నీటిపైని బడిన నీడచేత) ప్రతిబింబమున్నదని తెల్పుచున్నదో, జలమందున్న సూర్యుని ప్రతిబింబముచేత ఆకాశమందున్న బింబ భూతమైన సూర్యమండల మెట్లు తెలియఁబడుచున్నదో.

తాత్పర్యము : ప్రారబ్ధక్షయమైనప్పుడు ప్రళయకాలమందు బ్రహ్మదేవుఁడు ప్రవేశించి శ్రీహరి యుదరమందున్న వాఁడై సృష్టికాలమందు లింగదేహమును త్యజించి వాయుదేవుని బాంధవుఁడు, సర్వరూపము లందు సముఁడు, నిరోషియు, సర్వజ్ఞుఁడు ముక్తాముక్తజగత్తున కాశ్రయుఁడు, సమాధిక రహితుఁడునైన శ్రీహరిని పొందును. బ్రహ్మదేవుఁడు ప్రతిబింబముగానున్న ఇతనిని బ్రహ్మదేవుని యను గ్రహముచేత మాత్రమే చూడనగును. స్వచ్ఛమైన గోడయందు ప్రతిబింబించిన నీటి ప్రతిబింబము చేత జల(ప్రతిబింబిత)కర్తుఁడైన సూర్యుని చూతురు. నీటియందున్న సూర్యుని ప్రతిబింబముచేత ఆకాశగతుఁడైన సూర్యుని గమనింతురు. తీరముపైన పురుషుఁడు నిలిచియున్నపుడు నీటి యందు ప్రతిబింబితమైన నీడచేత పురుషుని గుర్తింతుము. అట్లే ఇంద్రియాభిమానులు ఇంద్రాది దేవతలు. వీరు శేషుని ప్రతిబింబములు. వీరి యనుగ్రహము చేతనే అహంకారాభిమాని యైన శేషుని గమనించుటకు సాధ్యమగును. ఆ శేషుఁడు బ్రహ్మదేవుని ప్రతిబింబభూతుఁడు. తదను గ్రహము. చేత మాత్రమే బ్రహ్మ దేవునిఁ గాంచ గలెదము. వాయు స్వరూపుఁడైన ఆ బ్రహ్మ యనుగ్రహముచేత శ్రీహరి ఉపాసకుఁడు గుర్తించును. బ్రహ్మదేవుఁడు శ్రీహరికి ప్రతిబింబము. శ్రీహరిని సాకల్యముగా నెవ్వరును తెలియలేరు. అందుచేతఁ నాతఁడొక్కఁడే ముఖ్యముగా యథార్థజ్ఞాని.

13. ఏవం=ఈ రీతిగా, త్రివృత్ అహంకారః, వైకారిక, తైజస, తామసాహంకారముల కభిమానియైన శేషుఁడు, స్వాభాసైఃతనప్రతిబింబభూతులైన, భూతేంద్రియమనోమయైఃభూతములు, ఇంద్రియములు శబ్దాది గుణములు మనస్సు వీనికభిమానులైన ఇంద్రాదిదేవతలచేత, లక్షితః భవతి=తోపింప చేయఁ బడును. అనేన=ఈ శేషునిచేత, సత్=బ్రహ్మదేవుఁడు, (లక్షితః) తన్ను గూర్చి సాకల్యముగా హరి ఒక్కఁడే తెలియుటచేత అతనినే యథార్థజ్ఞాని యని చెప్పుదురు.

14. శ్రీహరికూడ స్వతహాగా సత్యదృక్కనిపించుకొన్నను ఆభాసము యొక్క సంబంధముచేత యథార్థ జ్ఞానికాఁడని చెప్పుటకు వీలున్నది. అట్లు కాకపోయినచో అసంగుఁడైన శ్రీహరితో సంబంధము లేక పోయి నందువలన బ్రహ్మాదులు తదాభాసులనెడు లక్షణమే సరిపోదు. అది సరిపోనిచో పైనిచెప్పిన అరములన్నియు అయుక్తములే యగును. అనఁగా సమాధాన మిచ్చుచున్నాఁడు. ఇహ=సంసారమందు, నిద్రయా=నిద్రచేత, భూతసూక్ష్మేంద్రియ మనోబుద్ధ్యాదిమ= భూతాభిమానులు, తన్మాత్రాభిమానులు, ఇంద్రియాభిమానులు మరియు బుద్ధి మొదలైన తత్త్వముల కభిమానులైనవారు, లీనేషు సత్సు=వ్యాపార రహితులై యుండఁగా, తత్ర=అచ్చట ఎవ్వఁడు, వినిద్రఃనిద్రారహితుఁడో, నిరహంక్రియఃఅభిమానరహితుఁడో, సఃఅతఁడే, సత్యదృక్=శ్రీహరి, దీనిని ముందటి శ్లోకముతో అన్వయించు కొనవలెను. దీనిచేత శ్రీహరి కెప్పుడును అజ్ఞానము లేదనియు ముందు అనుపపత్తి కవకాశమే లేదని ఏర్పడుచున్నది.

15. పరమాత్ముని స్థితిని గూర్చి చెప్పి జీవునిస్థితిని వివరించుచున్నాఁడు యఃఎవఁడు, అనష్టఃఅపిఃనష్టమైనవాఁడు కాక పోయినను , అహంకరణేమనోధర్మమైన అహంకారము, నష్టేసతినిద్రాఫలముగా నష్టము కాఁగా, ఆత్మానంతన్ను, నష్టవత్నష్టమైన దానివలె, తదాఆనిద్రావస్థయందు, మృషావ్యర్థముగా, మన్యమానఃతలఁచుచున్న వాఁడై, నష్టవిత్త ఇవధనము పోఁగొట్టుకొన్నవాని వలె, ఆతురఃదీనుఁడై, నష్టవిత్త ఇవధనము పోఁగొట్టు కొన్నవాని వలె, ఆతురఃదీనుఁడై యుండును. సఃవాఁడు, ద్రష్టాజీవుఁడు, అనఁగా ఎప్పుడును నష్టముకాని ద్రష్ట శ్రీహరి. దానికి విరుద్ధమైన వాఁడు జీవుఁడనియు తెలియవలెను. ఇదే జీవాత్మ పరమాత్మలకున్న వైలక్షణ్యము.

16. ఈ వైలక్షణ్యమును తెలిసిన ఫలమును చెప్పుచున్నాఁడు. ఏవం=ఇట్టు, బ్రహ్మాదులైన జీవులకును, సర్వోత్తముఁడైన శ్రీహరికిని కల భేదమును ప్రత్యవమృశ్యయుక్తితో మనన మొనర్చి నిశ్చయించికొని, అసౌఈ యుపాసకుఁడైన జీవుఁడు, యఃఎవఁడు, సాహంకారస్యఅహంకారయుక్తమైన, ద్రవ్యస్యజీవాది ద్రవ్యములకు, అవస్థానంఅవస్థితిని ఇచ్చునో, అనుగ్రహశ్చసత్తా, జ్ఞానము వీని నిచ్చుటద్వారా అనుగ్రహొ మొనర్చునో, తంఆ ఆత్మను, (శ్రీహరిని,) ప్రతిపద్యతేపొందును. ఒకపే పరబ్రహ్మకు బ్రహ్మావస్థ, జీవావస్థ ఉన్నట్లు చెప్పు వాదము సరియైనది కాదు.

"నిత్యదృక్ పరమాత్మాఽసౌ మృతవద్యో న కించన,
జానాతిః జీవః స జ్ఞేయః పరమాత్మా తదాశ్రయః."

అనెడు ప్రమాణము జీవ పరబ్రహ్మలు భిన్నులని పరమాత్మ జీవున కాశ్రయుఁడని తెల్పుచున్నది.

17. జీవ పరమాత్మల భేదజ్ఞానము జీవునకు ప్రకృతి బంధము నుండి ముక్తిని బొందుటలో కారణమగు చున్నది అని విన్న దేవహూతి అది ఎట్లని ఆక్షేపించుచున్నది. బ్రహ్మన్! పూర్ణగుణవంతుఁడా!ప్రకృతిః=త్రిగుణ స్వరూపమైన ప్రకృతి, పురుషం=పుణ్యపాపఫలములను పొందుజీవుని, కహిచిత్ న విముంచతి=ఎప్పుడును విడుచుట లేదు. ఎందు కనఁగా, అనయోఃఈ ప్రకృతి జీవుఁడూ ఇద్దరును, నిత్యత్వాత్=నాశము లేనివా రగుటచేత, అన్యోన్యా పాశ్రయత్వాత్=ప్రకృతికార్యమైన శరీరము లేనిదే జీవుఁడు చేష్టింపలేఁడు. జీవుఁడు లేనిది అచేతన ప్రకృతి కార్యమొనర్చు లేదు. కనుకఁ పరస్పర ఉపకారు లగుట చేత విమోచన సాధ్యము కాదని వ్యక్తము.

18. దృష్టాంతమును చెప్పుచున్నాఁడు, యథా, భూమేః, గంధస్యచ= దాని గుణమైన గంధమునకును, యథా అపాం రసస్యచ=నీటికిని, దాని గుణమైన రసమునకును, వ్యతిరేకతఃఒకదానిని విడిచి మరియొక్కదాని యొక్క, భావఃఅస్తిత్వము, న=సాధ్యము కాదో, తథా=అట్లు, బుద్ధేః=ప్రకృతికి, పరసస్యచ= దానికంటె భిన్నమైన జీవునకు ఒకదానిని విడిచి మరియొక్కటి ఉండుటకు సాధ్యము కాదు.

19. ఈ కారణము చేత ప్రకృతిబంధమునుండి జీవునకు మోక్ష మేర్పడదని చెప్పుచున్నది. అకర్తుఃస్వతంత్రముగా దేనిని చేయలేని, పురుషస్య=జీవునకు, అయం=ఈ, కర్మబంధఃసంసారము, యదాశ్రయఃఏ ప్రకృతి యొక్క గుణముల సముదాయమే ఆశ్రయమై ఉన్నదో, తేమఃఅటి, ప్రకృతేఃప్రకృతి యొక్క, గుణేషు సత్సు=గుణములున్నపుడు (పురుషస్య) జీవునకు, అతఃఆ ప్రాప్తగుణములనుండి, కైవల్యం=ముక్తి, కథం=ఎట్లేర్పడును. ప్రకృతి గుణములు నివృత్తములు కాకయే ఉన్నపుడు వాని కార్యమైన సంసార బంధము యొక్క నివృత్తి ఏర్పడదని అభిప్రాయము.

20. జీవపరమాత్మల భేద జ్ఞానముతో ఈ ప్రకృతి బంధము పోవునని నేను మొదటనే చెప్పినానుగదా! అనఁగా దానికి సమాధాన మిచ్చుచున్నది. తత్త్వావమర్శేన=నీవు చెప్పిన మాటవిని తత్త్వవిమర్శచేత, ఉల్బణం= అతిశయమైన, భయం=ప్రకృతి బంధమునుండి జీవునకు విడుమర లేదను భయము, సకృత్నివృత్తం=కొద్దిగా పోయినది. అయినను నిమిత్తస్య=భయ కారణమైన బాహ్యాంతఃకరణము, అనివృత్తత్వాత్=పోనిదానివలన, పునఃమరల, భయం=సంశయాత్మకమైన భయము, ప్రత్యవతిష్ఠతే= ఉండనేయున్నది.

21,22.23.24. ప్రకృతి పోయినచో దాని గుణములు తమకు తాముగనే నివృత్తము లగును. ఆ ప్రకృతి యొక్క నివృత్తి ఫలాపేక్ష లేక యొనర్చి స్వ స్వవర్ణాశ్రమధర్మనిర్వహణము చేతనే ఏర్పడుచున్నది. అని ముందుచెప్పిన

సమాధానమే మరల చెప్పుచున్నాఁడు. అనిమిత్తనిమిత్తేన=ఫలాపేక్షలేక నిరంతర మనుష్ఠింపఁబడిన, అమలాత్మనా=దాని చేతనే అత్యంతశుద్ధమైన, స్వధర్మేణ=తమ వర్ణాశ్రమ ధర్మముల చేతనే అత్యంతశుద్ధమైన, స్వధర్మేణ=తమ తమ వర్ణాశ్రమ ధర్మముల చేతను, చిరం=బహుకాలము, శ్రుత సంభృతయా=వేదాంత శాస్త్రశ్రవణ పఠనముల చేత నేర్పడిన, తీవ్రయా=అన్నిటి కంటె నతిశయమైన, మయి భక్త్యా=నాయం దొనర్చెడు భక్తిచేతను, దృష్టతత్త్వేన=విష్ణ్వాదిదేవతలను సాక్షాత్తుగా చూచిన, జ్ఞానేన=అపరోక్షజ్ఞానముచేతను, బలీయసా=దృఢమైన, వైరాగ్యేణ=విషయవైరాగ్యముచేతను, తపోయుక్తేన=ఉపవాసాది వ్రతరూపమైన తపస్సుతో కూడిన, యోగేన=అష్టాంగ యోగముచేతను, తీవ్రేణాత్మ సమాధినా=నిశ్చలమైన మనస్సు యొక్క ఏకాగ్రత చేత నేర్పడిన జ్ఞానాగ్నితో, అహర్నిశం=నిరంతరము, దహ్యమానా=కాల్చఁబడెడు, పురుషస్య=జీవుని యొక్క, ప్రకృతిః=సత్త్వర జస్తమోగుణాత్మకమైన ప్రకృతి సంబంధము, శనైకైఃక్రమముగా, అగ్నేః=అగ్ని యొక్క, యోనిఃఉత్పత్తి స్థానమైన, అరణిఃఅరణియనెడు కాష్ఠము, తిరోభవిష్యతిఇవనాశమగునట్లు, తిరోభవత్=నాశమగును. దేవహూతి చెప్పిన "గంధమును భూమివదల కుండునట్లు, రసమును నీరు వదల కుండునట్లు" అనెడు ఉదాహరణములు సరియైనవే కావని తెలుపుటకే అగ్ని జ్వాలతో అరణి నాశమగునట్లు అనెడు వేరు ఉదాహరణము చెప్పినాఁడు. గంధాదులు ద్రవ్యము లుండువఱకును ఉండెడి గుణములు. వానికి ద్రవ్యముతో సంబంధము తొలఁగక పోవచ్చును. కాని అగ్నికి అరణికిఁ గల సంబంధము నాశ మగునట్లుగా ప్రకృతి పురుషుల సంబంధము నష్టమై విభక్త మగుటకు సాధ్యము కాదని తాత్పర్యము.

సంపూరముగ వదలి పోయిన ప్రకృతి-మరల అది వెనుతిరిగి అక్రమించు నను భయమ్మునకు కారణము లేదను చున్నాఁడు. భుక్తభోగా=సంపూరముగా అనుభవింపఁబడినదై, నిత్యశఃఎప్పుడును, దృష్టదోషా పరిత్యక్తా=సంపూర్ణముగా విసర్జింపఁబడిన, ప్రకృతిస్వే మహిమ్ని స్థితస్య=తన స్వరూపభూతమైన జ్ఞానందాదులయందును, అచ్ఛేద్యే, అభేద్యే అకేద్యే అదులైన మహిమల యందును ఉన్నట్టి, ఈశ్వరస్య=తన బింబరూపియైన శ్రీహరి నపరోక్షీకరించుకొని తదను గ్రహముతో సామర్థ్యవంతుఁడైన జీవునకు, అశుభం=సంసారరూప భయమును, నచధత్తే=కలిగింప లేదు.

25. దీనినే ఉదాహరణతో వివరించు చున్నాఁడు. యథాఎట్లు, అప్రతి బుద్ధస్య=నిదురించుచున్న వానికి, ప్రస్వాపఃనిద్ర, బహ్వనర్థకృత్=పులి మొదలైన క్రూరప్రాణుల నిమిత్తముగా భయము నేర్పఱచు చున్నదో, స ఏవఅదేనిద్ర, ప్రతిబుద్ధస్య=మెచ్చరికతో నుండువానికి (అనఁగా నిద్ర నుండి లేచిన వాని కని అర్థము) మోహాయభయజనకమైన మోహమునకు, న కల్పతే వైకారణ మగుట లేదు కదా!

26. ఉదాహరణమందు చెప్పిన విషయమును ప్రకృత విషయమునకు జోడించు చున్నాఁడు. ఏవంఈ రీతిగనే, విదిత తత్త్వస్యఉషోదేవి మొదలుకొని విష్ణువు వరకును సమస్త దేవతల నిజస్వరూపమును అపరోక్షీకరించు

కొన్నట్టియు, మయి=శ్రీహరియైన నాయందే. మానసం=మనస్సును, యంజుతః = నిల్పికొన్నట్టియు దానిచేత, ఆత్మారామస్య= శ్రీహరి యందే ఆనందపడునట్టి జీవునకు, ప్రకృతి, కర్హిచిత్=ఎప్పటికైనను, న అపకురుతే=మరల సంసారమునకు వచ్చున ట్లొనర్పలేదు.

14.....24. శ్రీహరికి ప్రతిబింబ భూతులైన బ్రహ్మాది చేతనులు వారివారి యోగ్యతాను సారము యథార్థజ్ఞానులు. వీరితో పాటు శ్రీహరి యున్నను అతఁడెప్పుడును అపూర్ణ జ్ఞానికాఁడు. భూతతన్మాత్ర, ఇంద్రియ బుద్ధుల కభిమానియైన దేవతలు సంసారియైన జీవుని సూలదేహమందుండి నిద్రాకాలమం దుపరతులై యున్నను శ్రీహరి నిద్రారహితుఁడు, అభిమాన రహితుఁడై హెచ్చరికగా నుండును. అందుచేతనే అతనికి అజ్ఞానాదులు లేవని తెలియవలెను. అయినను జీవుఁడు నిద్రావస్థ యందు మనోధర్మమైన అహంకారము నష్ట మగుటచేత తన్ను కూడ నష్టమైన దానినిగనే భావించి ధనమును కోల్పడిన ధనికునివలె ఆతురుఁడై యుండును. వీనికి శ్రీహరివలె అవినశ్వరమైన ద్రష్టృత్వములేదు. అందుచేతనే శ్రీహరి కంటె భిన్నుఁడు. ఇట్లు జీవపరబ్రహ్మ లకు భేదమును తెలిసి, శ్రీహరియే జీవులకు సత్త్వమును జ్ఞానమును ఇచ్చి అనుగ్రహించు వాఁడని తెలిసి ఉపాసించి జీవుఁడు శ్రీహరి నందును.

దేవహూతి యనుచున్నది. ప్రకృతినిత్యము. జీవుఁడును నిత్యుఁడు ప్రాకృతదేహములేని జీవుఁడు చేష్టింపలేఁడు. జీవుని సంబంధములేని అచేతన ప్రకృతియు చేష్టింపలేదు. కనుక వీరు పరస్పరోపకారకులు. అందుచేత వీరు విడి వడుటకు సాధ్యమే కాదు. అందుచే త్రిగుణాత్మకమైన ప్రకృతి సంబంధము జ్ఞానపుణ్యపాప ఫలభాగియైన జీవుని వదలుటయే లేదు. భూగంధములకు జలరసములకును వినియోగము లేనట్లు ప్రకృతి పురుషులకు వియోగమేలేదు. జీవుఁడు స్వతంత్ర కర్త కాఁడు. వీనికి సంసార ప్రాప్తి ప్రాకృత గుణములనే ఆశ్రయించి యున్నది. కనుక వీనికి ప్రకృతి నుండి ముక్తియే లేదు. ప్రాకృత గుణములు పోయిననే కదా సంసారములు తొలఁగుట. జీవ పరమాత్మల భేద జ్ఞానముతో ప్రకృతి బంధము పోవునంటివి దీనితో సంసారము పోదను భయము కొదిగా నివారితమైనను బాహ్యాంతఃకరణము పోకుండుటచేత పోవునో పోదో అను సంశయము ఉండనే ఉన్నది.

మనుపుత్రీ! ఫలాపేక్షా రహిత కార్యములు శుద్ధము లనిపించుకొనును వీని నొనర్చుచు బహుకాల వేదాంత శ్రవణ మొనర్పవలెను. దానితో శ్రీహరి యందు తీవ్రమై భక్తి ఏర్పడును. దీని ఫలముగా హరితప్ప సమస్త దేవతల అపరోక్షమును ఏర్పడును. ఇది కావలెనన్నచో దృఢమైన విషయ వైరాగ్యముండవలెను. కాయ శుద్ధికరములైన ఉపవాసాదులు అష్టాంగ యోగము వీనిచేత మనస్సు ఏకాగ్ర మగును. ఏకాగ్ర ధ్యాన ప్రాప్తమైన జ్ఞానాగ్నితో పురుషునకు అంటుకొని యున్న ప్రకృతి అగ్నిజ్వాలతో అగ్నికి కారణమైన అశ్వత్థకాష్ఠము క్రమముగా నాశ మగునట్లు క్రమముగా నశించును. తన బింబరూపియైన శ్రీహరి నపరోక్షీకరించుకొని తదను గ్రహము సంపాదించి

స్వరూపభూతమైన జ్ఞానానందము పొందిన జీవుని దోషము దర్శనముతో మరల ప్రకృతి ఆక్రమింపజాలదు. నిద్రలో నున్నపుడు క్రూర జంతువుల భయమునకు స్వప్నమూలకముగా మానవుఁడు పశుఁడగును. వాడు నిద్రలేచి స్వప్నమును నెమరువేసి కొన్నపుడు భయపడఁడు కదా! అట్లే నామాభిమానియైన ఉషోదేవి మొదలుకొని పరమాత్మ పర్యంతమైన సమస్తతత్త్వముల యపరోక్షమును బడసి పరమాత్మ యందు మనస్సునుంచికొన్న భక్తునకు ప్రకృతి సంసార కారణము కానేరదు.

27,28,29,30. అనుష్ఠాన మొనర్చు శ్రేయస్సాధనమునకు ఫలమును చెపుచున్నాఁడు. యథా, ఏవం, బహు జన్మనా కాలేన=బహుజన్మముల కాలమందు, అధ్యాత్మరతః=తన కంటె ఉత్తములను ప్రారంభించి శ్రీహరి పర్యంతము సమస్త ఆధ్యాత్మతత్త్వము లందును యథాయోగ్యముగా భక్తిని నెఱపుచున్నవాఁడై, ఆబ్రహ్మ భువనాత్=సత్యలోకము, వరకును, సర్వత్ర=అధ్యాత్మ భిన్నమైన సమస్తమందును, జాతవైరాగ్యః=అనిత్యము అసారమనెడు వైరాగ్యమునుండి, మునిః=నిరంతర మనన శీలుఁడై, మద్భక్త భూయసా మత్ప్రసాదేన=గొప్పదైన నా యనుగ్రహముచేత, ప్రతిబుద్ధార్థః=సమస్తదేవతల నపరోక్షీకరించు కొన్నవాఁడై, స్వదృశాఃస్వరూప జ్ఞానముచేత, ఛిన్న సంశయః =సంశయములను పోఁగొట్టి తత్త్వ నిశ్చయములను పొంది, ధీరఃశ్రీహరియందే బుద్ధినుంచి రమించెడి యోగ=యోగసిద్ధినందిన జీవుఁడప, లింగవినిర్ముక్తే=లింగ శరీరమును పోఁగొట్టిన తరువాత, యదత్వా=ఏ స్థానమును పొంది, న నివర్తేత=వెనుకకు రాఁడో, తత్=అట్టి, స్వస్థం స్థానం=తన స్వరూపావస్థానమని పించుకొన్న, మదాశ్రయం=శ్రీహరియే ఆశ్రయముగానున్న, కైవల్యం=కేవల శ్రీహరినే పొందియుండుట అనెడు, నిశ్శ్రేయసం=ఆనందానుభవ రూపమోక్షమును, ప్రాప్నోతి.

మధ్యలో ప్రాప్తించెడు విఘ్నములతో ఆకర్షింప బడనిచో శీఘ్రముగా మోక్షమందును లేకున్నచో ఆలస్య మగుననుచున్నాఁడు. యదా చ=ఎప్పుడు, సిద్ధస్య=పైన చెప్పినట్లు సాధన మొనర్చి సిద్ధి నందిన జీవుని యొక్క, చేతః =మనస్సు, యోగోపచితాసు=ఉపాసనతో నభివృద్ధి నందిన, అనన్య హేతుషు= శ్రీహరియే కారణముగాఁ గల, మాయాసు=అణిమాది సిద్ధులందు, నవిషజ్జతే= తగులుకొనఁడో, అట్టి వాఁడు, తదా=అప్పుడు, యత్ర=ఎచ్చట, న మృత్యుహాసః =పునరావృత్తి రూపమైన మృత్యువు పరిహాసము లేదో అట్టి అత్యంతికీ= సార్వకాలికమైన, మే గతిఃనన్నుపొందుట యనెడు మోక్షము, స్యాత్=పొందిన వాఁడగుచున్నాఁడు.

ఇతి శ్రీమద్భగవతే తృతీయ స్కంధే సప్తవింశోఽధ్యాయః
సుధాలహరి వ్యాఖ్యా సమాప్తా.

అధ్యాయము - 27

నీ. జనమత! సత్త్వ రజస్తమోగుణ మయ
మైన ప్రకృతి కార్యమగు శరీర
గతుఁ డయ్యుఁబురుషుండు గణఁగి ప్రాకృతములు
నగు సుఖదుఃఖమోహముల వలనఁ
గర మను రక్తుండు గాఁడు వికార వి
హీనుఁడుఁ ద్రిగుణ రహితుఁడు నగుచు
బలసి నిర్మల జల ప్రతిబింబితుం డైన
దినకరుభంగి వర్తించునట్టి

తే. యాత్మ ప్రకృతిగుణంబుల యందుఁ దగులు
వడి యహంకారమూఢులై తొడరి యేనుఁ
గణఁగి నిఖిలంబునకు నేల కర్తనని ప్ర
సంగవశ తను బ్రకృతి దోషములఁ బొంది. 895

కం. సుర తిర్య గ్మనుజ స్థా
వరరూపము లగుచుఁ గర్మవాసన చేతన్
బరపైన మిశ్రయోనులఁ
దిరముగ జనియించి సంసృతి గైకొని తాన్. 896

కం. పూని చరింపుచు విషయఁ
ధ్యానంబునఁ జేసి స్వాప్నికార్థాగమ సం
ధానము రీతి న సత్పథ
మానసుఁ డగుచున్ భ్రమించు మతిలోలుండై. 897

వ. అట్లుగావున. 898

తే. పూని మోక్షార్థి యగువాఁడు దీని తీవ్ర
భక్తియోగంబుచేత విరక్తిఁ బొంది
మనము వశముగఁ జేసి యమ నియమాది,
యోగమార్గ క్రియాభ్యాసయుక్తిఁ జేసి. 899

సీ. శ్రద్ధా గరిష్ఠుఁడై సత్యమైనట్టి మ
ద్భావంబు మత్పాదసేవనంబు
వర్ణిత మత్కథా కరనంబున సర్వ
భూత సమత్వ్ మజాతవైర
మును బ్రహ్మచర్యంబు ఘనమౌన మాదిగాఁ
గల నిజధర్మ సంగతులఁ జేసి
సంతుష్టుఁడును మితాశనుఁడు నేకాంతియు
మాననశీలుఁడు వీత మత్సరుండు

తే. నగుచు మిత్రత్వమునఁ గృపఁ దగిలి యాత్మ
కలిత విజ్ఞాని యై బంధకంబు లైన

ఘన శరీర పరిగ్రహోత్కంఠ యందు
నా గ్రహముచేసి వర్తింప నగును మఱియు. 900

వ. జీవేశ్వర తత్త్వజ్ఞానంబునం జేసి నివృత్తంబైన బుద్ధి తదవస్థానంబునుం గలిగి, దూరీభూతేతర దర్శనుండై జీవాత్మ జ్ఞానంబునంజేసి చక్షురింద్రి యంబున సూర్యుని దర్శించు చందంబున నాత్మ నాయకుండైన శ్రీమన్నారాయణుని దర్శించి, నిరుపాధికంబై మిథ్యా భూతంబగు నహంకారంబున సద్రూపంబుచేఁ బ్రకాశమానం బగుచుఁ, బ్రధాన కారణంబునకు నధిష్ఠానంబును, గార్యంబునకుఁ జక్షువునుం బోలి ప్రకాశకంబును, సమస్త కార్యకరణాను స్యూతంబునకుఁ బరిపూరంబును, సర్వవ్యాపకంబును నగు బ్రహ్మంబుఁ బొందునని చెప్పి వేండియు నిట్లనియె. 901

సీ. వినుమాత్మ వేత్తకు విష్ణు స్వరూపంబు
నెఱుఁగంగఁ బఱు నది యెట్లటన్న
గగనస్థుఁడగు దినకరు కిరణచ్ఛాయ
జలముల గృహ కుడ్య జాలకముల
వలనఁ దోఁచిన ప్రతి ఫలితంబుచేత నూ
హింపంగఁబడిన య య్యినుని పగిది
నర్థి మనో బుద్ధ్యహంకార త్రితయ నా
డీ ప్రకాశముచేత లీల నెఱుఁగ

తే. వచ్చు నాత్మ స్వరూపంబువలతిగాఁగఁ,
జిత్తమునఁ దోఁచు నంచిత శ్రీ దనర్చి
య మ్మహామూర్తి సర్వభూతాంతరాత్మ
డగుట నాత్మజ్ఞులకుఁగాన నగును మఱియు. 902

వ. జీవుండు సుషుప్త్యాద్యవస్థల యందుఁ బరమాత్మానుషక్తుండైన భూతాది తత్త్వంబులు లీనంబులైప్రకృతి యందు వాసనామాత్రంబు గలిగి యకార్య కరణంబులు గాకున్న సుషుప్తిసమయంబునందా ని స్తంద్రు డగుచు నితరంబు చేతఁ గప్పంబడనివాఁడై పరమాత్మాను భవంబు సేయుచుండు అని చెప్పిన విని దేవహూతి యిట్లనియె. 903

సీ. విమలాత్మ! యీపృథివికిని గంధమునకు
సలిలంబునకును రసంబునకును
నన్యోన్య మగు నవినాభావ సంబంధ
మైన సంగతిఁ బ్రకృత్యాత్మలకును
సతతంబు నన్యోన్య సంబంధమై యుండుఁ
బ్రకృతి దాన య్యాత్మఁ బాయుటెట్లు
తలపోయ నొకమాటు తత్త్వబోధముచేత
భవభయంబులనెలఁ బాయుటెట్లు?

తే. చచ్చి క్రమ్మఱఁ బుట్టని జాడ యేది?
యిన్నియుఁ దెలియ నానతి యిచ్చి నన్నుఁ
గరుణ రక్షింపవే! దేవగుణ సుసేవ్య!
భక్తలోకాను గంతవ్య! పరమపురుష! 904

వ. అనిన భగవంతుం డిట్లనియె. అనిమిత్తంబైన స్వధర్మంబునను, నిర్మలాంతఃకరణంబుననును, సునిశితంబైన మద్భక్తి యోగంబుననును, సత్కథా శ్రవణ సంపాదితంబైన వైరాగ్యంబుననును (దృష్ట ప్రకృతి పురుష యాథాత్మ్యంబగు జ్ఞానంబున బలిష్ఠంబయి కామానభిష్వంగంబగు విరక్తి వలనఁ దపోయుక్తంబైన యోగంబునను) సుతీవ్రంబైన చిత్తైకాగ్రత నుంజేసి పురుషునిదగు ప్రకృతి దందహ్యమానంబై తిరోధానంబును బొందు. అది యెట్టనిన (నరణిగతంబైన వహ్నిచే) నరణి దహింపంబడు చందంబున, జ్ఞానంబునం దత్త్వదర్శనంబునం జేసి నిరంతరంబు దృష్టదోషయగు ప్రకృతి జీవుని చేత భుక్తభోగయై విడువం బడుననిచెప్పి. 905

కం. విను ప్రకృతి నైజమహిమం
బునఁ దనలోనున్న యట్టి పురుషునకు మహే
శునకు నశుభవిస్ఫురణం
బనయము గావింపఁ జాల దది యె ట్లనినన్. 906

చ. పురుషుఁడు నిద్రవోఁ గలలఁబొందు ననర్థకముల్ ప్రబోధమం
దరయఁగ మిథ్యలై పురుషునందు ఘటింపని కైవడిన్ బరే
శ్వరునకు నాత్మనాథునకు సర్వశరీరికిఁ గర్మసాక్షికిన్
బరువడిఁ బొంద వెన్నటికిఁ బ్రాకృతదోషము లంగనామణీ! 907

వ. అని వెండియు నిట్లనియె 908

సీ. అధ్యాత్మతత్పరుం డగు వాఁడు పెక్కు జ
న్మంబులఁ బెక్కు కాలంబులందు
బ్రహ్మపదప్రాప్తి పర్యంతమును బుట్టు
సర్వార్థ వైరాగ్యశాలి యగుచుఁ
బూని నా భక్తులచే నుపదేశింపఁ
బడిన విజ్ఞాన సంపత్తిచేఁ త
బరఁగఁ బ్రబుద్ధుఁడై బహు వారములు భూరి
మత్ప్రసాద ప్రాప్తిమతిఁ దనర్చు

తే. నిజపరిజ్ఞాన విచ్ఛిన్న నిఖిలసంశ
యుండు నిర్ముక్త లింగ దేహుండు నగుచు
ననఘ! యోగీంద్రహృద్గీయ మగు మదీయ
దివ్యధామంబు నొందు సందీప్తుఁడగుచు 909

వ. మఱియు నణిమాద్యష్ట శ్వర్యంబులు మోక్షంబున కంతరాయంబులు గావున వాని యందు విగత సంగుండును, మదీయ చరణ సరోజస్థిత

లలితాంతరంగుండును నగువాఁడు మృత్యు దేవత నపహసించి మోక్షంబు నొందు. అని చెప్పి వెండియు యోగలక్షణ ప్రకారంబు వినిపింతు వినుమని భగవంతుండైన కపిలుండు నృపాత్మజ కిట్లనియె.

910

ఇది పోతనామాత్య విరచితంబైన ఆంధ్ర భాగవతమున ఇరువది ఏడవ యధ్యాయము.

895. ప్రకృతి సత్త్వ రజస్తమనస్సు లనెడు గుణములతో కూడినది. శరీరము ప్రకృతి కార్యము. సుఖదుఃఖములు మొదలైన ద్వంద్వములను ప్రకృతియే సృష్టించును. శరీర గతుఁడైన పురుషుఁడు ప్రకృతి యొక్క గుణములకు వశుఁడు కారాదు. వాఁడు సకల వికారములకును బహిర్భూతుఁడు సత్త్వరజస్తమస్సు లనెడు గుణసంబంధము లేనివాఁడు. జలము లందు సూర్యబింబము ప్రతి ఫలించును. జలములను బట్టి ప్రతిబింబితమైన సూర్య బింబము చలించును. కాని ఆ వికారము లేవియు ఆకాశగతుఁడైన సూర్యున కంటవు. జీవుఁడాత్మ స్వరూపుఁడు. అట్టివానికి అహంకారమనెడు వికారము తగులు కొనుచున్నది. దానివెంట మమకారము. నేను నాది యనుటే అహంకారము యొక్క బాహ్యస్వరూపము. వీనితో వాఁడు ప్రకృతి ఏర్పరచెడు సమస్త గుణము లందును తగుల్కొనును. జీవుఁడు నిజముగా నస్వతంత్రుఁడు. వాఁడు సర్వమునకు తానే కర్త నని భ్రమించును. ఆ భ్రమయే సమస్త దోషములకు మూలము.

896....898 ఈ ప్రకృతి దోషములతో ఒక్కొక్కసారి దేవతగను, మఱి యొక్క సారి మానవుఁడుగను, వేఱొక్కసారి తిర్యగ్యోని యందును జీవుఁడు జన్మించును. ఈ జన్మలకు కర్మవాసనయే కారణము. కర్మవాసన యహంకారముతో నేర్పడుచున్నది. మిశ్రయోని లందుకూడ మానవుఁడు జన్మించును. అనఁగా నొక్కసారి స్త్రీగను, ఒక్కసారి పురుషుఁడు గను జన్మ నెత్తును. జన్మయున్నచో మరణము తప్పదు. జన్మమరణములే సంసారము. నిరంతరమును మానవుఁడు విషయధ్యాన మొనర్చుచుండును. విషయప్రాప్తి లేకున్నను దానిని గూర్చిన ధ్యానముండనే యుండును. స్వప్నమునందు అనేకకర్మములను జూచుచు వానిచేత మానవుఁడు సుఖదుఃఖములం దున్నట్లు జాగృతుఁడైన పురుషుఁడు తనకు కలిగిన స్వప్నమును స్మృతికిఁ దెచ్చుకొనును. అట్లు తెచ్చుకొన్నపుడు కలలో కలిగిన సుఖదుఃఖములు వాని కేర్పడును. ఆ విధముగనే వివేకి యైన పురుషుఁడు అర్థములున్న ను వానికి వశుఁడు కాఁడు. ఈ సమస్త వికారములకును అహంకార మమకారములే కారణము. వానికి వశుడైన మర్త్యుఁడు అసన్మార్గములందు ప్రవర్తించును. అప్పుడు వాని మనస్సున కేకనిష్ఠ కుదురదు. మనస్సు చాల చంచలమై పరిపరి రీతుల భ్రమించుచుండును.

899. 900. మోక్షమును గోరెడు వాఁడు అర్థములను ధ్యానించుటను పూర్తిగా వర్జింపవలెను. వర్జించు టెట్లు? దానికి పరమేశ్వర ప్రణిహితమైన

భక్తియే మార్గము. అది వైరాగ్య సమన్వితమై యుండవలెను. యమనియమాది యోగ మార్గముల ననుసరింపవలెను. యోగ మార్గముచేత మనస్సు నిశ్చలతను పొందును. శ్రద్ధలేని ఏదియును ఫలింపదు. అనేక జన్మసంకలితమైన శ్రద్ధ సాధకునకు కావలెను. ఈశ్వరుని యందు ఉంచబడిన భావము సత్యమై నటిది, ఏ ఆకాంక్షయు లేనిదిగా నుండవలెను. భవంతుని యందేకాక భగవద్భక్తుల యందును సర్వాకారమైన మైత్రికలిగి యుండవలెను. భగవత్కథా కరనము భవజాడ్యములకు మహాశక్తిమంతమైన మందు. నిరంతర భగవత్కథా కర్ణన మున్నగు వానికి భగవత్సన్నిధానము త్వరలో ప్రాప్తించును. సర్వభూతముల యందును సాధకునకు సమ భావ ముండవలెను. సర్వప్రాణి హృదయములందు పరమేశ్వరుడంతర్యామియై ఉన్నాడు. జీవరూపియైనవాడు లేనిది జడమైన దేహము కార్యకరణ సమర్థముకాదు. ఏ భూతమును కూడ సాధకుడు ద్వేషింపరాదు. సర్వభూతమైత్రియే భగవత్సన్నిధాన మార్గము. బ్రహ్మచర్యము యోగపరిపక్వతకు దారితీయును. సాధకుడు మననశీలుడు కావలెను. ఇంకను తన వర్ణాశ్రమములకు తగిన ధర్మములను వాడు పాటింపవలెను. నిత్యసంశోధిగా నుండవలెను. నిత్యసంతుష్టుడు కావలెను. ఆహార నియమము చాలా గొప్పది. తాను తీసికొను ఆహారము హితమితమై యుండవలెను. ఏకాంతి కావలెను. మౌనమును పాటింపవలెను. వీతమత్సరుడైనవాడు గొప్ప భగవత్కింకరుడు. మిత్రత్వముతో కృపావంతుడై మెలగ వలెను. నిరంతర మాత్మదర్శన ప్రయత్నము జరుగవలెను. శరీరమమకారము వానికి తీవ్రమైన బంధము. దాని యందు సంగతి జ్ఞానమార్గమున కపాయ కరము.

901. దూరీభూతేతర దర్శనుండై=దూరముగా నొనర్చబడిన ఇతర మార్గములు కలవాడై, నిరుపాధికము=దేనితోను సంబంధము లేనిది.

తాత్పర్యము : జీవుడెటివాడు? ఈశ్వరుడెటివాడు? ఈతత్త్వములను సాధకుడు నిరంతరము పరిశోధించుచుండవలెను. వీనితో బుద్ధితదన్య విషయములం దనా సక్త మగును. అపుడు నివాత దీపమువలె ఏకాకారముగా నిశ్చలమై యుండును. సాధకుడైనవాడు పలుమార్గములను గూర్చి పరువెత్త రాదు. అన్ని మార్గము లొక్కటె యని తెలియవలెను. తన మార్గమునకు విరుద్ధమైన త్రోవల ననుసరించినచో కంపలబడినకాకివలె వానీ బుద్ధి తిప్పలు పడును. జీవాత్మజ్ఞానము దోషరహితముగా వాని కేర్పడినపుడు నేత్రముచేత సూర్యుని మానవుడు దర్శించునట్లు అంతశ్చక్షువుచే సాధకుడు తన హృదయమందున్న భగవానుని స్పష్టముగా దర్శింప నగును. నిరుపాధికమైన అహంకారమును సద్రూపమే. అనగా దర్శింప నగును. నిరుపాధికమైన అహంకారమును సద్రూపమే. అనగా జీవు నాశ్రయించుకొని యుండును. ఆ మిథ్యాభూత అహంకారమును వెలిగించునది పరమాత్మయే. ప్రధానమని చెప్పబడెడు ప్రకృతి గూడ పరమాత్మ నాశ్రయించుకొనియున్నదియే. ఒక పని చేయవలయునన్నపుడు కన్నులు సమర్థముగా లేనిచో చేయలేము. పరమాత్ముడు సమస్తమునకు చక్షువువంటివాడు. జగద్వ్యాపార మంతయు వానినుండియే జరుగుచున్నది. కార్యమునకు కారణమునకు కారణమువాడు.

వాని స్వరూపము పరిపూర్ణము. సమస్తమునందును వ్యాపించిన దదియే. వాని స్వరూపమును నిత్యమే.

902. ఓ దేవహూతీ! ఎవ్వఁడాత్మవేత్తయో వానికి విష్ణు స్వరూపము తెలియును. విష్ణు వనఁగా స్వరూపమందును వ్యాపించినవాఁడు. సమస్త పదార్థములందున్నది ఆత్మయే. ఆకాశమున సూర్యుఁడున్నాఁడు. వాని రూపము జలములలో ప్రతిబింబించినది. ఆ ప్రతిబింబితమైన సూర్యబింబము ఒకానొక స్వచ్ఛమైన గోడపైన ప్రతిబింబించినది. మనము గోడపైన కానవచ్చు ప్రతిబింబమును చూతుము. దాని నుండి జలములలో నున్న సూర్యుని నీడను గమనింతుము. దానిసాయముతో ఆకాశస్థుడైన సూర్యుని గుర్తింతుము. కుడ్య మనఁగా మనస్సే. అది స్వచ్ఛముగా నున్నపుడు దానియందు పరమేశ్వరుఁడు ప్రతిబింబించును. మనస్సు బుద్ధి అంహకారము అనెడు ఈ మూటిచేత పరమాత్ముని గుర్తింతుము. ఈ మూఁడును పరస్పర సాహాయ్యకములై నిలుచును. ఈ మూటి సాయముచేత ఆత్మయందు గుర్తింపఁబడిన పర మాత్ముఁడు సర్వగతుఁడైనవాఁడే. జ్ఞానియైనవాఁడే యనుభవమును పొందును.

903. ఒకఁడు సుషుప్తియం దున్నా డనుకొందము. అపుడు పంచ భూతాదుల తత్త్వములు లీనములైయుండును. ఎందులో లీనములు ప్రకృతి యందు. అట్టిస్థితిలో భూతముల వాసనా మాత్రముగ మాత్రమే జీవునంటి యుండును. జీవుఁడు పరమాత్మానుషక్తుఁడై యుండును. అనఁగా సహంకారమును వదలి సాక్షిభూతుఁడుగా నుండు నన్నమాట. సమస్తేంద్రి యములు కూడ నప్పుడు ఏ కార్యము నొనర్చుటకు శక్తములు గాక యుండును. ఆ సుషుప్తిలో జీవుఁడు నిస్తంద్రుఁడై యుండును. ఇతరముచేత కప్పఁబడని వాఁడై పరమాత్మానుభవముచేయుచుండును. అప్పుడు దేవహూతి యన్నది.

904. కపిలమహర్షీ! పృథివి పదార్థము. గంధము దాని గుణము. సలిలము పదార్థము. రసము దానిగుణము. పృథివి యుండు వరకును గంధ ముండును. గంధము లేనిది పృథివి లేదు. రసజల విషయములందు గూడ ముందే పృథివికిని గంధమునకును అన్యోన్యవిరహ మెప్పుడు కూడ నేర్పడదు. జలమునకు రసమునకుఁగూడ నటిసితియే నిబదము. ఇటి సంబంధమే ప్రకృతిని జీవునకును కలదు. జీవుఁడు లేనిది ప్రకృతి లేదు. అనఁగా నది నిశ్చేతనము. ప్రకృతి లేనిది జీవుఁడును లేనట్టే. కారణ మేమనఁగా వాని కాశ్రయములేదు. ప్రకృతి యుండువరకు శరీరమున్నది. శరీరావసానమే ప్రకృతికి మూలము. మరి ఈ రెంటికి గల అన్యోన్యసంబంధము దూరమగుటెట్లు? ఒకానొకమాటు తత్త్వబోధము కలిగినను మరల ప్రకృతి గుణము లాక్రమించు కొనుచున్నదికదా? మృత్యుభయము శాశ్వతముగా తొలఁగుటకు ప్రకృతి సంబంధమే పరమబాధకమై యున్నది. ప్రకృతి సంబంధము పురుషున కింత గాఢమైనదని వివరించి చెప్పితిని. ఇట్టున్నపుడు జీవుఁడు జన్మమరణముల నుండి తప్పించు కొను మార్గమేది? ఈ విషయము లన్నియు స్పష్టముగా నాకు వివరించి చెప్పుము. సమస్తదేవగణములకును సేవింపతగిన వాఁడవునీవే. భక్తలోకములు పొందఁదగిన స్థానము కూడ నీవే. పరమ పురుషుఁడవు నీవే.

905. దేవహూతీ! ప్రకృతి తిరోధానమగుట కొక్కటే మార్గము. అనిమిత్తమైన స్వధర్మానుష్ఠానము కావలె. అనగా ఫలాకాంక్షలేక వర్ణాశ్రమ ధర్మముల ననుష్ఠించుట. అంతఃకరణమును శుద్ధ మొనర్చు కొనవలెను. సత్సంకల్పములచేత దుస్సంకల్పములను జయించి కడకు సత్సంకల్పములను కూడవదలి వేయవలెను. ఒకముల్లుతో నింకొక దానిని తీసి ఆ వెనుక చేతిలో నున్న ముల్లును కూడ బాఱవేసినట్లు. సునిశితమైన భక్తియోగము పరమాత్మ సన్నిధానమును కల్పించును దీనికి మత్కథాశ్రవణాదులు మార్గములు. వైరాగ్యము భక్తికి మూలస్తంభము వంటిది. సమస్తమైన లౌకిక విషయములందు అనాసక్తియే వైరాగ్య మనిపించుకొనును. ద్రవ్యముల అప్రత్యక్షమున విరక్తికాదు. వాని సన్నిధానమందుకూడ నాసంగతి ఏర్పడవలెను. అర్థములు లేనప్పుడు వానిని గురించి ధ్యానించుట వైరాగ్యముకాదు. అది పీడంబనామార్గము. చిత్తె కాగ్రత నలవఱచుకొనవలెను. విషయ ధ్యానము తలగినపుడు చిత్తైకాగ్రత ఏర్పడును. ఈ సాధనములతో ప్రకృతి దందహ్యమానమై తిరోభూత మగును. అరణి యున్నదను కొందము. అరణి యనగా యశ్వత్థకాష్ఠము. రెండరణులను మథించినపుడు అగ్ని జనించును. అగ్ని వెలుఁగును. అరణియొక్క కొంతకొంత భాగము దహింపబడును. ఇట్టు క్రమముగా చాలసారి నర్చినపుడు అగ్న్యుత్పాదకమైన అరణి సంపూర్తిగా దహింపఁబడిన దగును. సమాధి స్థితియే అగ్ని. ఆ సమాధిస్థితిని పలుమా ర భ్యసించినపుడు ఆ యగ్నిచేత విషయ జ్ఞానము దహింప బడుచున్నది. సమాధి స్థితిని వదలి క్రిందికి వచ్చినను సాధకుఁడు సమాధితో నేర్పడిన వివేకముచేత మరల నరములకు లోఁబడని వాఁడగును, జ్ఞానముచేతను తత్త్వదర్శనములచేతను ప్రకృతి దోషయుక్తమని గ్రహింపఁ బడును. అట్టి ప్రకృతి భుక్తభోగయై విడువఁబడును.

906. దేవహూతీ! ప్రకృతి యొక్క స్వభావము త్రిగుణములతో బంధించుట. అది ఎప్పుడు ఆ ప్రయత్నములకు కాచుకొనియే ఉండును. ఆత్మజ్ఞానియైన పురుషునకు- వాఁడుతనలో నున్నను వాని కవి యశుభమును కావింప లేవు. ఆత్మజ్ఞాని యైన పురుషుఁడు మహేశ్వరుఁడు. వానిని బంధించు సామర్థ్యము ప్రకృతికే లేదు.

907. కలలన్=స్వప్నములందు, పొందుననర్థకముల్=సంప్రాప్తించెడు ననర్థములు, ప్రబోధమందున్=మేల్కొన్న యపుడు, మిథ్యలై=యసత్యములై, పురుషునందు ఘటింపనికైవడిన్=మేల్కొన్నవాని యందు తమ ప్రభావమును ప్రసరింపలేనట్లు, ప్రాకృతదోషములు=ప్రకృతికి సంబంధించిన దోషములు.

తాత్పర్యము : పురుషుఁడు నిద్రించును. నిద్రించినపుడు తద్దోషము చేత స్వప్నము లేర్పడును. స్వప్నమం దొక పులి కనిపించె ననుకొందము వాఁడు వడఁకును; భయపడును; కేకవేయును. అట్లె సుఖము నొందె ననుకొందము. వాఁడా సుఖములకు చెందిన మానసికే వికారము నొందును ఇంతలో నిద్రాభంగమై నిద్రలేచును. తాను గన్న స్వప్నములు తలపోయును. ఆ స్వప్నముతో కలుగవలసిన సుఖదుఃఖము లేవియు వానికి ప్రాప్తింపవు. నిర్లిప్తుఁడై చూచును. తత్త్వజ్ఞాని యైన పురుషుని విషయము కూడ ఇంతే. తత్త్వానుభవము పొందిన మనుష్యుఁడు పరేశ్వరుఁడు. వాని మనస్సు

నిష్కళంకమై యుండును. వాఁడు పరమ వివేకి యగుటచేత మనస్సు వాఁడు చెప్పినట్లు వినును. సమస్త శరీరములందు విహరించుచున్నది తానే అను విషయము వాని యాత్మ కనుభవమునకు వచ్చును. సుషుప్త్యవస్థ యందు సాక్షిభూతుఁడుగా నున్నవాఁడెవ్వఁడు? తానే. ఈ విషయము వాఁడు బుద్ధితో గ్రహించుట లేదు. అనుభావముతో ననుభవించునది, వీని అన్నిటికినీ బాధకమైనది ప్రకృతి. దానికి లోఁబడినచో కలుగు నానర్థములు వాఁడెఱుఁగును. అందుచే వాఁడు దాని నెప్పుడును దూరముగా నుంచును.

908, 909. అధ్యాత్మతత్పరుండు=మనస్సునందున్నట్టి యాత్మను కనుఁగొనవలెనను, తీవ్రమైన ఆకాంక్ష గలవాఁడు. బ్రహ్మపద ప్రాప్తి పర్యంతమును=బ్రహ్మపదవి వఱకున్న సమస్త సుఖములను, సర్వార్థ వైరాగ్యశాలి=సమస్తములైన అర్థములందు వైరాగ్యముకలవాఁడు, విజ్ఞాన సంపత్తి చేతన్=జ్ఞానశక్తి యనెడు సంపదచేత, బహువారములు=చాల సారులు, మత్ప్రసాద ప్రాప్తిమతిన్=నా ప్రసాదమును పొందవలెనను తీవ్రమైన ఇచ్ఛచేత, నిజ పరిజ్ఞాన విచ్ఛిన్న నిఖిలసంశయుండు=తన జ్ఞానముచేత దూరముగ తొలఁగింపఁబడిన సమస్త సంశయములు కలవాఁడు, నిర్ముక్త లింగ దేహుండు=వదలఁబడిన లింగదేహము కలవాఁడు, యోగీంద్ర వృద్ధీయము=యోగుల యొక్క మస్సుతో కీర్తింపఁబడినది.

910. అంతరాయములు=విఘ్నములు, వీతసంగుఁడు=సంబంధము లేనివాఁడు, మదీయ=నా యొక్క, చరణసరోజ=పాదపద్మములందు, స్థిత=ఉన్నట్టి, లలితాంతరంగుండు=శుద్ధమైన మనస్సు కలవాఁడు.

తాత్పర్యము: ఆత్మను వీక్షింపవలెనను ఇచ్ఛకలవాఁడు బహు జన్మంబులు ప్రయత్నింపవలెను. అనంతకాలమే వానిప్రయాణము. అల్ప ప్రయత్నములతో అల్పజన్మములతో భగవత్ప్రాప్తి సాధ్య మయ్యెడు విషయము కాదు. విషయ సుఖము లనఁగా బ్రహ్మపదము వఱకున్నవి. కేవల తక్కువ సుఖములను విసర్జించుటే వైరాగ్యమనిపించుకొనదు. బ్రహ్మపదవి ప్రాప్తమైనను నాకు వల దనవలెను. అట్టివాఁడు నా భక్తులచేత ఉపదేశింపఁబడిన విజ్ఞాన సంపత్తితో ప్రకాశించువాఁడగును. సత్సంగము మానవునకు గొప్ప తపస్సని ముందే చెప్పినాను. భగవత్ప్రసాదము ఎప్పు డెప్పుడు పొందవలెనను తీవ్రేచ్ఛకలవాఁడై యుండవలెను. సమస్త సంశయములు తన జ్ఞానము చేత దూర మొనర్చు కొన్న వాఁడు కావలెను. లింగదేహమునకే సూక్ష్మ శరీరమని పేరు. అది వాసనామయము. సమస్త సంస్కారములు తొలఁగినపుడే లింగదేహము నాశన మగును. లింగదేహవినాశమైనప్పుడే పరమపదప్రాప్తి. అణిమాద్యష్ట సిద్ధులు మోక్షమునకు బాధకములు వానితోడి పొత్తును సాధకుఁడు సంపూర్తిగా తొలఁగించు కొనవలెను. వానిమనస్సెప్పుడును నా పాదములందే లగ్నము కావలెను. అట్టివాఁడు మృత్యువు నపహసించి మోక్షమును పొందును. ఓ మాతా! నీకిఁక పైని యోగలక్షణ ప్రకారమును వివరింతును. శ్రద్ధగలిగిన దానవై వినుము.

ఇది పోతనామాత్యవిరచిత ఆంధ్రభాగవతమున తృతీయస్కంధమున ఇరువది ఏడవ అధ్యాయము. సుధాలహరి వ్యాఖ్య సమాప్తము.

అష్టావింశోఽధ్యాయః

శ్రీ భగవానువాచ

యోగస్య లక్షణం వక్ష్యే సబీజస్య నృపాత్మజే,
మనో యేనైవ విధినా ప్రసన్నం యాతి సత్పథమ్. 1

స్వధర్మాచరణం శక్త్యా విధర్మాచ్చ నివర్తనమ్,
దైవా ల్లబ్ధేన సంతోష ఆత్మవిచ్చరణార్చనమ్. 2

గ్రామ్యధర్మనివృత్తి శ్చ మోక్షధర్మరతి స్తథా,
మిత మేధ్యాదనం శశ్వ ద్వివిక్తక్షేమసేవనమ్. 3

అహింసా సత్య మస్తేయం యావదర్థపరిగ్రహః,
బ్రహ్మచర్యం తప శ్శౌచం స్వాధ్యాయః పురుషార్చనమ్. 4

మౌనం సదాసన జయ స్థైర్యం ప్రాణజయ శ్శనైః,
ప్రత్యాహార శ్చేంద్రియాణాం విషయా న్మనసా హృది. 5

స్వధిష్ణ్యానా మేకదేశే మనసా ప్రాణధారణమ్,
వైకుంఠ లీలాభిధ్యానం సమాధానం తథాఽఽత్మనః. 6

ఏతైరన్యైశ్చ పథిభి ర్మనో దుష్ట మసత్పథమ్,
బుద్ధ్యా యుంజీత శనకై ర్జితప్రాణో హ్యతంద్రితః. 7

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య విజితాసన ఆసనమ్,
తస్మిన్ స్వస్తిక ఆసీనో ఋజుకాయ స్సమభ్యసేత్. 8

ప్రాణస్య శోధయే న్మార్గం పూర కుంభక రేచకైః,
ప్రతికూలేన వా చిత్తం యథాస్థిర మచంచలమ్. 9

మనోఽచిరా త్స్యాద్విరజం జితశ్వాసస్య యోగినః,
వాయ్వగ్నిభ్యాం యథా లోహం ధ్మాతం త్యజతి వై మలమ్. 10

ప్రాణాయామై ర్దహే ద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషాన్,
ప్రత్యాహారేణ సంసర్గాన్ ధ్యానేనాఽనీశ్వరాన్ గుణాన్. 11

యదా మన స్స్వం విరజం యోగేన సుసమాహితమ్,
కాష్ఠం భగవతో ధ్యాయే త్స్వనాసాగ్రావలోకనః. 12

ప్రసన్న వదనాంభోజం పద్మపత్రారుణేక్షణమ్,
నీలోత్పలదళశ్యామం శంఖచక్రగదాధరమ్. 13

లసత్పంకజ కింజల్క పీత కౌశేయవాససమ్,
శ్రీవత్సవక్షసం భ్రాజత్కౌస్తుభాముక్త కంధరమ్. 14

మత్తద్విరేఫ కలయా పరీతం వనమాలయా,
పరార్థ్య హారవలయకిరీటాంగదనూపురమ్. 15

కాంచీగుణోల్లసచ్ఛ్రోణిం హృదయాంభోజన విష్టరమ్,
దర్శనీయతమమం శాంతం మనోనయన వర్ధనమ్. 16

అపీచ్య దర్శనం శశ్వ త్సర్వలోక నమస్కృతమ్,
సంతం వయసి కైశోరే భృత్యాను గ్రహకాతరమ్. 17

కీర్తన్య తీర్థయశసం పుణ్యశ్లోక యశస్కరమ్,
ధ్యాయే ద్దేవం సమగ్రాంగం యావ న్న చ్యవతే మనః. 18

సితం వ్రజంత మాసీనం శయానం వా గుహాశయమ్,
ప్రేక్షణీయే హితం ధ్యాయే చ్ఛుద్ధ భావేన చేతసా. 19

తస్మిన్ లబ్ధపదం చిత్తం సర్వావయవ సంస్థితమ్,
విలక్ష్యైకత్ర సంయుజ్యా దంగే భగవతో మునిః. 20

సంచింతయే ద్భగవతశ్చరణారవిందం
వజ్రాంకుశధ్వజ సరోరుహ లాంఛనాఢ్యమ్,
ఉత్తుంగర క్తవిలసన్నఖచక్రవాళ
జ్యోత్స్నాభిరాహత మహద్ధృదయాన్ధకారమ్. 21

యచ్ఛౌచ నిస్సృత సరత్తవరోదకేన
తీర్థేన మూర్ధ్ని విధృతేన శివ శ్శివోఽభూత్,
ధ్యాతు ర్మన శ్శమలశైల నిసృష్టవజ్రం
ధ్యాయే చ్చిరం భగవత శ్చరణారవిందమ్. 22

జానుద్వయం జలజలోచనయా జనన్యా
లక్ష్మ్యా ఽఖిలస్య సురవన్దితయా విధాతుః,
ఊర్వోర్నిధాయ కరపల్లవరోచిషా య
త్సంలాలితం హృది విభో రభవస్య కుర్యాత్. 23

ఊరూ సువర్ణ భుజయో రధిశోభమానా
యోజో నిధీ అతసికా కుసుమావభాసే,
వ్యాలంబి పీత వర వాససి వర్తమాన
కాంచీ కలాప పరిరంభ నితంబబింబమ్. 24

నాభి హ్రదం భువనకోశ గుహోదరస్థం
యత్రాత్మయోని ధిషణాఖిలలోక పద్మమ్,
వ్యూఢం హరి న్మణివృషస్తనయో రముష్య
ధ్యాయే ద్వ్యయం విశదహార మరీచి గౌరమ్. 25

వక్షోఽధివాస మృషభస్య మహావిభూతేః
పుంసాం మనోనయన నిర్వృతి మాదధానమ్,
కంఠం చ కౌస్తుభమణే రధి భూషణార్థం
కుర్యాన్మన స్యఖిల లోక నమస్కృతస్య. 26

బాహూం శ్చ మందర గిరేః పరివర్తనేన
నిర్ణిక్త బాహువలయా నధిలోకపాలాన్,
సంచింతయే ద్దశశతార మసహ్యతేజ
శ్శంఖం చ తత్కర సరోరుహ రాజహంసమ్. 27

కౌమోదకీం భగవతో దయితాం స్మరేత
దిగ్ధా మరాతి భటశోణిత కర్దమేన,
మాలాం మధువ్రతవరూధ గిరోప ఘుష్టాం
చైత్యస్య తత్త్వ మమలం మణి మస్య కంఠే. 28

భృత్యాను కంపితధియేహ గృహీతమూర్తే
స్సంచింతయే ద్భగవతో వదనారవిందమ్,
యద్విస్ఫురన్మకర కుండల వల్గితేన
విద్యోతితామల కపోల ముదారనాసమ్. 29

యచ్ఛ్రీనికేత మళిభిః పరిసేవ్యమాణం
భూత్యా స్వయా కుటిల కుంతల బృందజుష్టమ్,
మీనద్వయాశ్రయ మధిక్షిప దబ్జనేత్రం
ధ్యాయే న్మనోమయ మతంద్రిత ఉల్లసద్భ్రు. 30

తసాఽవలోక మధికం కృపయాతిఘోర
తాపత్రయోపశమనాయ నిసృష్టమర్క్షోః,
స్నిగ్ధస్మితాను గుణితం విపుల ప్రసాదం
ధ్యాయే చ్చిరం వితత భావనయా గుహాయామ్. 31

హాసం హరే రవన తాఖిల లోక తీవ్ర
శోకాశ్రుసాగర విశోషణ మత్యుదారమ్,
సమ్మోహనాయ రచితం నిజమాయయాఽస్య
భ్రూమండలం మునికృతే మకరధ్వజస్య. 32

ధ్యానాయనం ప్రహసితం బహులాధరోష్ఠ
భాసాఽరుణాయిత తనుద్విజ కుందపఙ్క్తి,
ధ్యాయే త్తృన్వ దేహ కుహరే వసితస్య విష్ణో
ర్భక్త్యార్ద్ర యార్పితమనా న పృథ గ్దిదృక్షేత్. 33

ఏవం హరౌ భగవతి ప్రతిలబ్ధభావో
భక్త్యా ద్రవ ద్ధృదయ ఉత్పులకః ప్రమోదాత్,
ఔత్కంఠ్య బాష్పకలయా ముహు రర్ద్యమాన
స్తచ్చాపి చిత్తబడిశం శనకై ర్వియుఙ్క్తే. 34

ముక్తాశయం యర్హి నిర్విషయం విరక్తం
నిర్వాణ మృచ్ఛతి మన స్సహసా యథార్చిః

ఆత్మాన మత్ర పురుషేఽవ్యవధాన మేక
మన్వీక్షతే ప్రతినివృత్త గుణ ప్రవాహః. 35

సోఽప్యేతయా చరమయా మనసోఽనివృత్త్యా
స్వస్మిన్ మహిమ్న్యవసిత స్సుఖదుఃఖబాహ్యే,
హేతుత్వ మప్యసతి కర్తరి దుఃఖయో ర్య
త్స్వాత్మ న్యిధత్త ఉపలబ్ధ పరాత్మ కాష్ఠః. 36

దేహం చ నశ్వర మవస్థిత ముత్థితం వా
సిద్ధో న పశ్యతి యతోఽధ్యగమ త్స్వరూపమ్,
దైవా దుపేత మథ దైవవశా దపేతం
వాసో యథా పరికృతం మదిరామదాంధః. 37

దేహోఽపి దైవవశగః ఖలు కర్మయావ
త్స్వారంభకం ప్రతిసమీక్షత ఏవ సాసుః,
తం సప్రపంచ మధిరూఢ సమాధియోగ
స్సాప్పం పున ర్న భజతే ప్రతిబుధవస్తుః. 38

యథా పుత్రా చ్చ మిత్రా చ్చ పృథజ్మర్త్యుః ప్రతీయతే,
అప్యాత్మ త్వేనాభిమతా ద్దేహాదేః పురుష స్తథా. 39

యథోల్ముకా ద్విస్ఫులింగా ద్ధూమా ద్వాపి స్వసంభవాత్,
అప్యాత్మత్వే నాఽభిమతా ద్యథాగ్నిః పృథ గుచ్యతే. 40

భూతేంద్రియాంతఃకరణా త్ప్రధానా జ్జీవసంజ్ఞితాత్,
ఆత్మా తథా పృథ గ్ద్రష్టా భగవాన్ బ్రహ్మసంజ్ఞితః. 41

సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షేతాఽనన్య భావేన భూతేష్వపి తదాత్మతామ్. 42

స్వయోనిషు యథా జ్యోతి రేకం నానాప్రతీయతే,
యోనీనాం గుణవైషమ్యా త్తథాత్మా ప్రకృతౌ స్థితః. 43

తస్మాదిమాం స్వప్రకృతిం దైవీం సదసదాత్మికామ్,
దుర్విభావ్యాం పరాభావ్య స్వరూపేణావ తిష్ఠతే. 44

ఇతి శ్రీమద్భాగవతే తృతీయస్కంధే అష్టావింశోఽధ్యాయః.

1. నృపాత్మజే=ఓరాజపుత్రీ! సబీజస్య=ఆలంబనముతో కూడిన, యోగస్య=యోగము యొక్క, లక్షణం=లక్షణమును, వక్ష్యే=చెప్పుచున్నాను. యేనవిధినా ఏవ=ఏ యనుష్ఠానముతో మాత్రమే, ప్రస్నం మనః=పరిశుద్ధమైన మనస్సు, సత్పథం=ఈశ్వర మార్గమున కభిముఖముగా, యాతి=పయనించు చున్నదో,

తాత్పర్యము : అణిమాది సిద్ధులు స్వయముగనే ఉద్భవించుటకు తగిన మాహాత్మ్యముతో కూడినవి. యోగానుష్ఠానక్రమము ఈ అధ్యాయమందు భగవంతుడైన కపిలముని వివరించుచున్నాడు. ఓ రాజపుత్రీ! యోగములు రెండు విధములు. (1) సబీజయోగము (2) నిర్బీజయోగము. మనస్సున కొక్క ఆలంబనములేక సర్వవ్యాపకమైన చైతన్యమందు మనస్సును నిలుపుటకు తగిన అభ్యాసక్రమమును నిర్బీజయోగ మందురు. మనస్సున కాలంబము కల్పించుటకును దానియందు స్థిరముగా మనస్సు కల్పించుయోగము సబీజ యోగము. ఈ రెంటిలో నిరాలంబము అనగా నిర్బీజమైన యోగాభ్యాసము చాల ప్రయాసముతో కూడినది. దాని నిప్పుడు వివరించుటలేదు. సబీజము అనగా ఆలంబనముతో కూడినది. ఈ యోగమును మాత్రమే ఇప్పుడుపదేశింతును. దాని అభ్యాసమందు కొంత ప్రయాసము తక్కువ. ఆ యోగము యొక్క అనుష్ఠానముతో మనస్సు కామక్రోధాదులైన దోషములనుండి క్రమముగా విడివడి పరిశుద్ధ మగును. అప్పుడు ఆనంద స్వరూపమైన ఈశ్వరుని సాక్షాత్కరించి కొనుట కుపయోగపడెడు మార్గమందు ప్రవేశ మేర్పడును.

2,3,4,5,6,7. విధర్మా=ధర్మ విరుద్ధమైన ప్రవృత్తినుండి, నివర్తనం=విడివడుటయు, స్వధర్మాచరణం=స్వ స్వ వర్ణాశ్రమోచితమైన ధర్మము ననుసరించుటయు, దైవాత్=ప్రారబ్ధము ననుసరించి, లభేన=ప్రాప్తమైన దానితో, సంతోషః=సంతోషము, ఆత్మవిత్=జ్ఞానులైన వారియొక్క, చరణార్చనం=పాద సేవనమును గ్రామ్య ధర్మనివృత్తిః=ధర్మార్థ కామములను సంపాదించు కొనుటయందున్న శ్రద్ధను ఉపేక్షించుటయు, తథా=అట్లే, మోక్షధర్మరతిః=మోక్షమార్గమందు తాత్పర్యమును, మితమేధ్యాదనం=శుద్ధమైయున్న ఆహారమును అల్పముగా స్వీకరించుటయు, వివిక్త క్షేమసేవనం=జనబాధ లేనట్టియు, యోగ విఘ్న కరములైన ఇతర పదార్థములు లేనట్టియు స్థలమందు వసించుటయు, అస్తేయం=వంచింప కుండుట, యావదర్థ పరిగ్రహః=అవసరమున్న పదార్థములను మాత్రమే స్వీకరించుట, బ్రహ్మచర్యం=బ్రహ్మచర్యము, తపః=తపస్సానర్పుట, ఏకాదశ్యాది వ్రతములను శ్రద్ధ గలిగియు, శౌచం=ఆంతరిక బాహ్యశుద్ధి, స్వాధ్యాయః=సాధ్యమైనంత వఱకు వేదము నధ్యయన మొనర్పుట, పురుషార్చనం=పరమేశ్వరుని యొక్క పూజ, మౌనం=ఆవశ్యకమున్న విషయములందు మాత్రమే భాషించుట, సదాసనజయస్థైర్యం=తన శరీరమునకు తగిన ఆసనమును స్వాధీన పఱచుకొనుటకు గాను శరీరమును తదనుగుణమైన స్థితిలో నుంచుకొనుట, స్వధిష్ణ్యానాం=ప్రాణమునకు నివాస స్థానముల యందు, ఏకదేశే=ఒక స్థానమందు, మనసా=మనసుతోకూడ, ప్రాణధారణం= వాయువును నిలుపుటయు, వైకుంఠ లీలాభిధ్యానం=పరమాత్మని లీలలను నిరంతరము ధ్యానించు చుండుటయు, ఆత్మనః=మనస్సు యొక్క, సమాధానం=నిత్యశాంతియు అనెడు, ఏతైః=ఇవియైనట్టియు, అన్యైః పథిభిశ్చ=ఇతరములైన మార్గముల సాహాయ్యము చేతను, అసత్పథం=అ నేన్మార్గములందు ప్రవర్తించు చున్నట్టియు, దుష్టం=దుర్మార్గములైన, మనః=మనస్సును, జితప్రాణః=ప్రాణమును జయించిన

వాఁడును, అతంద్రితః=అశ్రద్ధ లేని వాఁడునై, శనకైఃమెల్ల మెల్లఁగా, బుద్ధ్యా=విచార శక్తితో, యంజీత=జత గూర్చికొనవలెను.

తాత్పర్యము : యోగమును వివరింతునని చేసిన ప్రతిజ్ఞ ననుసరించి యోగముల కంగములైన యమ నియమాదులను వివరించుచున్నాఁడు. యోగమును సాధించువాఁడు స్వశక్త్యను సారము వర్ణాశ్రమోచిత ధర్మములను నెరవేర్చవలెను. ఆ యనుష్ఠానమందు ఫలకాంక్ష యుండరాదు. ఫలకాంక్ష లేదని కాలదేశ నియమము లేక యాచరింప రాదు. ధర్మమునకు విరుద్ధములైన మార్గములందు లేశమేనియు ప్రవర్తింప కూడదు. ప్రారబ్ధానుసారము ప్రాప్తమయ్యేడు పదార్థములతో మాత్రమే తృప్తినందియుండవలెను. హరిభక్తులైన వారిచరణ సేవ గొప్పది. అది మనో మాలిన్యములను పోఁద్రోచుట యందుపయోగపడును. మూఁడు పురుషార్థములను సాధించు కొనెడి ప్రయత్నమందు అత్యాసక్తి ఉండరాదు. మోక్షమున కుపయోగించెడు భగవత్కథా శ్రవణాదులను వాని యందు నిరంతరము తీవ్రమైన తాత్పర్య ముండవలెను. స్వీకరించు నన్నము చాలమితమై యుండవలెను. అదిమేధ్యము కావలెను. అశుద్ధాన్నముతో చిత్తము కలుషిత మగును. ఆహార మెక్కువ సేవించినచో నిద్ర అశ్రద్ధ మొదలైనవి దాపురించును. అవి రెండును దగ్గరకు రాకుండు నట్లుగా ఆహార నియమమును పాటింపవలెను. జనుల సమూహము చేరనిచోట వసింపవలెను. యోగ బాధకములైనట్టియు చిత్తైకాగ్రతను చెఱచునట్టియు సర్పాదుల బాధయుండరాదు. త్రికరణ శుద్ధిగా ఏ ప్రాణికిని హింస కలిగింపరాదు. యథార్థమే మాటాడవలెను. ఇతరుల ధనముపై దురాశ కూడదు. దేహము నిలుచుటకు మాత్రమే కావలసినంత ఆహార సంపాదన మొనర్చికొనవలెను. స్త్రీప్రసంగము యోగమునకు మహాబాధకము. కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతముల మూలమున శరీరము నదుపులో ఉంచకొనవలెను. స్నానాదులతో దేహము శుద్ధ మగును. ఈశ్వరారాధన రూపమైన సంకీర్తనాదులతో శమము సిద్ధించును. ఈశ్వరుని మహిమను కొనియాడెడు పురాణ ఇతిహాసాదుల నభ్యసింపవలెను. భక్తిలేని ఈశ్వర పూజ పత్రిచేటు. అనావశ్యక వాగ్వ్యాపారము యోగ భంగకరము. ఈశ్వర ధ్యానాదుల యందు చాల సేపు లీనుడై యున్నపుడు శరీరమునకు శ్రమ ఏర్పడును. అందుచే స్వస్తికాదులైన సులభతరములైన ఆసనములనే అభ్యసించవలెను. అట్టి యాసనముల ద్వారా మనో నిశ్చలత ఏర్పడును. దేహమునకు కలెడు ఆయాసము మనస్సును నిలుకడగా నుండనీయక మరల బాధించుచుండును. తరువాత ప్రాణాయామము ద్వారా ప్రాణవాయువు వశీకరించుకొనెడు అభ్యాస మొనర్పవలెను. తొందరగా ప్రాణజయము సిద్ధింపలేదు కదా! అను విచారము పనికిరాదు. క్రమముగా దాని నభ్యసింపవలెను. చిరకాలాభ్యాసము మాత్రమే ప్రాణజయములను సాధనము. శబ్దాది విషయములందు ప్రవర్తించెడు శ్రోత్రాది ఇంద్రియములను విచార శక్తితో విషయముల నుండి మరలించుకొని మనస్సునందు లీన మొనర్చెడి ప్రయత్న మాచరింప వలెను. మూలాధారాది షట్చక్రములందు ఏదో ఒకదానియందు ప్రాణమును ప్రతిష్ఠించి దాని నచ్చటనే స్థిరముగా నుంపవలెను. అపుడు మనస్సు యొక్క

వ్యాపారము తగిపోవును. పరమేశ్వరుని సృష్ట్యాది లీలలను నిరంతరము భావించుకొనుచు మనస్సును పరమాత్మయందే లీన మొనర్పవలెను. మనస్సును భగవంతుని యందు నిలిపెడు ఇతర మార్గములను కూడ అనుసరించుట మంచిది. ఇంద్రియములను సంతోష పెట్టుటకు కామాది వృత్తుల యందు ప్రవర్తించి కశ్మల మంది నట్టి మనస్సును ప్రాణజయముతోను అశ్రద్ధలేని పరిశ్రమతోను పరమార్థమందు యోజింప చేయవలెను.

8. శుచౌ దేశే=శుద్ధమైన ప్రదేశమందు, ఆసనం=పీఠమును, ప్రతిష్ఠాప్య= నెలకొల్పి, విజితాసనః=ఆసన శుద్ధిని సాధించిన మనుష్యుడు, తస్మిన్=ఆ ఆసనమందు, ఋజుకాయః=శరీరమును వంచక దండాకారముగ నిల్పినవాడై, స్వస్తిక ఆసీనః=స్వస్తికాసనమం దున్న వాడు, సమభ్యసేత్=చక్కగ నభ్యాస మొనర్పవలెను.

తాత్పర్యము: యమ నియమాదులను ముందు చెప్పిన పిదప ఆసనమును గూర్చి వివరించుచున్నాడు. సాధకుడు గంగా తీరాది పుణ్య తీరములలో వసింపవలెను. లేక ఏదైన పవిత్ర స్థలములో నివసింపవలెను. తనకొక ఆసనముండుట మంచిది. ఆ పీఠముపైనే కూర్చొనవలెను. ప్రారంభ దశయందే చాలకాలము ఆసనమం దుండరాదు. ఆసన జయము క్రమముగా సాధించు కొనవలెనంటిని. సులభ తరమైన పద్మాసనాదుల ననుష్ఠింపవలెను. తొందరగా ఆసన జయమేర్పడ లేదని వికలుడు కారాదు. స్వస్తి కాసనము చాలమంది యోగులు ఆశ్రయించునది. ఆసనము స్వాధీనమైన తరువాత క్రమ క్రమముగా ప్రాణజయమునకు సాధకుడు ప్రయత్నించవలెను.

9. పూరకుంభక రేచకైః=పూరకము, కుంభకము, రేచకము అనువాని మూలమున, ప్రాణస్య=ప్రాణము యొక్క, మార్గం=మార్గమును, శోధయేత్=పరిశుద్ధ మొనర్చు కొనవలెను. ప్రతికూలేనవా=దానికి ప్రతి కూలముగా ఉన్నట్టి మార్గముతో నైనను, యథా=ఏ మార్గముతో కాని, చిత్తం=మనస్సును, స్థిరం= ఏకాగ్రముగను, అచంచలం=చలింపనిది గను చేసికొనవలెను.

తాత్పర్యము : ఆసన స్థితిని వర్ణించిన తరువాత ప్రాణాయామమును వివరించు చున్నాడు. ప్రాణాయామము మూడు రీతులు. పూరకము, కుంభకము, రేచకమని పేరు. బాహ్యవాయువును లోపలికి పీల్చుకొనెడి పద్ధతిని పూరక మందురు. లోపలికి పీల్చుకొనెడి పద్ధతిని కుంభక మందురు. లోన ప్రవేశించిన వాయువును కొంత సేపు అట్టి నిలిపికొనుట కుంభకము. ఆ వాయువును క్రమముగా బైటికి వదలుట రేచకము. ఇదియే ప్రాణాయామ సాధనా మార్గము. కొందరు రేచకము కుంభక పూరకము లనుసరింతురు. ఇది కూడ బాధాకరము కాదు. వాయువును లోపల కొంత సేపు నిలిపి బయటకు వదలుటలో శ్వాస మార్గము లందున్న కఫాది దోషములు తొలగిపోవును. ఆ మార్గములు పరిశుద్ధము లగును. అపుడు ప్రాణము నాశ్రయించి యున్న మనస్సు చలనాది దోషములను వదలి స్థిరముగా

నొకచోట నిలుచును. మనస్సును స్థిరముగా నుంచుటయే ప్రాణాయామమునకు ప్రధానమైన ఫలము.

10. జితశ్వాసస్య=జయింపఁబడిన శ్వాసముతో కూడిన, యోగినః =యోగియొక్క, మనః=మనస్సు, అచిరాత్=శీఘ్రముగనే, విరజం=రజోగుణ సంబంధము లేనిదిగా, స్యాత్=అగును. వాయ్వగ్నిభ్యాం=వాయువు చేతను, అగ్నిచేతను , ధ్మాతం=తపింప చేయఁబడిన, లోహం=బంగారు మొదలైన లోహములను, మలం=కళంకమును, యథావై త్యజతి=ఏ రీతిగా త్యజించు చున్నదో,

తాత్పర్యము: ప్రాణాయామముతో స్వాధీన పఱచిన యోగి మనస్సు రజోగుణ సంబంధముతో నేర్పడెడు చలన మనెడు దోషమునుండి నివృత్త మగును. బంగారు మొదలైన లోహముల నగ్నియందుంచి ఊదుగొట్టముతో నూదినపుడు వాయువు దానిలో ప్రవేశించును. అగ్నితాపముతోను, వాయు సంబంధముతోను ఆ లోహము తనయందున్న కళంకమును పోఁగొట్టుకొనును. అట్లే మనస్సు కూడ ప్రాణవాయువుతో శుద్ధ మగును.

11.దోషాన్=దోషములను, ప్రాణాయామైః=ప్రాణాయామముచేతను, కిల్బిషాన్=పాపములను, ధారణాభిః=ధారణల చేతను, సంసరాన్=సంసరములను, ప్రత్యాహారేణ=ప్రత్యాహారము చేతను, అనీశ్వరాన్=ఈశ్వరో పాసనకు విరుద్ధము లైన, గుణాన్=గుణములను, ధ్యానేన=ధ్యానముచేతను, దహేత్=దహింపవలెను.

తాత్పర్యము : ప్రాణాయామాదుల ఫలమును వివరించు చున్నాఁడు. వాత పిత్తకఫజన్యదోషములను ప్రాణాయామముతో వారించుకొనవలెను. అపుడు దేహము రోగబాధనుండి విముక్త మగును. ధారణతో పాపములను దహింపవలెను. శబ్దాది విషయ సంబంధములను ప్రత్యాహారము ద్వారా నశింపచేసికొనవలెను. ఈశ్వరోపాసనకు విరుద్ధములైన రాగాది వృత్తి దోషములను ధ్యానముతో దహింపవలెను. మనస్సును భగవంతుని యందు స్థిరముగా నిల్పుటకే ధారణ మని పేరు. భగవంతుని యందు నిల్పిన మనస్సు చలింపక భగవంతుని యందే నిలువఁబడుటకు ఒనర్చెడు ప్రయత్నమే ధ్యానము. ఈశ్వర స్వరూపమును ధ్యానించునపుడు దానికంటెభిన్నమైన విచారము జ్ఞాపకమునకు రాదు. అట్లు వచ్చినఁ ధ్యానమునకు భంగమేర్పడినట్లే. అభ్యాసము ద్వారా క్రమముగా ధ్యానమందు నిలుకడ సంపాదించుకొనవలెను. ధ్యాన మధ్యమందు ఏ భిన్నమైన ఆలోచన కూడ మనస్సును బాధింపరాదు. చాల సేపు భగవంతుని యందే మనస్సు నిలుపవలెను. ఇట్లు భగవంతునం దేకాగ్రమైన మనఃస్థితికే సమాధి యని పేరు.

12.స్వం మనఃసాధకుని మనస్సు, యోగేన=ప్రాణాయామము చేత, విరజం=నిర్మల మగును. సుసమాహితం=తీవ్రమైన సావధానత కలిగినదిగాను, యదా స్యాత్=ఎప్పు డేర్పడు చున్నదో, తదా=అప్పుడు, భగవతః=భగవంతుని యొక్క, కాష్ఠాం=రూపమును, స్వనాసాగ్రవలోకనః=తన యొక్క నాసికాగ్రమందు దృష్టిని నిక్షేపించు కొన్నవాఁడై, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

తాత్పర్యము : మనస్సు యొక్క చాంచల్య మనెడు దోషము తీరి స్వాధీనముగా నగువఱకును ప్రాణాయామము నభ్యసించియే కావలెను. మనస్సు యొక్క పరిశుద్ధి, సావధానత ఈ రెండును ఏర్పడిన తరువాత సాధకుఁడు ధ్యానము నభ్యసించుట కారంభించవలెను. రుచిభేదము ననుసరించి ధ్యాన విషయములు అనేకము లున్నను మోక్షాభిలాషి యైన పురుషుఁడు భగవద్రూపమును మాత్రమే ధ్యానించవలెను. ధ్యాన సమయమందు నేత్రమార్గము ద్వారా మనస్సు చలించుటకు వీలుండును. అట్లు చలింపకుండుటకు దృష్టిని నాసికాగ్రమందు చేర్పవలెను. కన్నులు మూసికొన్నచో లయ మనెడు దోషము సిద్ధించును. నేత్రమును నిరాలంబముగా వదలినచో నాలుదిక్కులందును చూచు నప్పుడు మనస్సు యొక్క విక్షేపము సంభవించును. అందుకే నేత్రముల రెంటిని నాసాగ్రమందు చేర్చవలెనని చెప్పినాఁడు.

13,14,15,16,17,18. ఆరు శ్లోకముల ధ్యేయమైన భగవద్రూపమును వాగ్రూపమైన చిత్రముతో ప్రదర్శించుచున్నాఁడు. ప్రసన్న వదనాంభోజం=నిత్య ప్రసన్నమై ప్రాతర్వికసిత పద్మమువలె పరమ సుందరమైన ముఖమును, పద్మపత్రారుణేక్షణం=పద్మము యొక్క గర్భమువలె కించిదరుణమైన చూపులు, నీలోత్పల దళశ్యామం=నల్లకలువల రేకులవలె నీలమైన శరీరము, శంఖచక్రగదా ధరం=శంఖము, చక్రము, గద వీని నన్నిటిని ధరించిన వాఁడు, లసత్=ప్రకాశించుచున్న, పంకజ=పద్మముయొక్క, కింజల్క=కేసరములవలె, పీత=పసపు పచ్చని, కౌశేయ=పట్టు పీతాంబరము, వాససం=పరిధానవస్త్రముగాఁ గల్గినట్టి, శ్రీవత్స వక్షసం=శ్రీవత్సమనెడు మనోహరమైన మచ్చచేత కూడిన వక్షఃస్థలము కలవాఁడు, భ్రాజత్ కౌస్తు భాముక్త కంధరం=ప్రకాశించుచున్న కౌస్తుభమనెడు రత్నము చేతకూడిన కంధరము కలవాఁడును (అనఁగా కంఠము క్రిందనన్న మాట) మత్త ద్విరేఫ కలయా-మత్త=మదించిన, ద్విరేఫ=తుమ్మెదల యొక్క, కలయా=సౌందర్యము కలిగిన వనమాలయా=వనమాలచేత, పరీతం=కూడుకొన్నట్టియు, పరార్థ్య హారవలయ కిరీటాంగద నూపురం-పరార్థ్య=గొప్పవెలగల, హార వలయ=గుండ్రమైన హారముల చేతను, కిరీట=కిరీటము చేతను, అంగద=బాహుపురులచేతను, నూపురం=పాదవలయముల చేతనుకూడిన వాఁడును, కాంచీగుణోల్లసత్ శ్రోణిం-కాంచీగుణ=మేఖలా బంధముచేత, ఉల్లసత్=ప్రకాశించుచున్న, శ్రోణిం=నితంబ దేశము కలవాఁడును, హృదయాంభోజే విష్టరం=సాధకుల మనః పద్మమనెడు సింహాసనము కలవాఁడు, దర్శనీయ తమం=చూడఁదగిన పదార్థములన్నింటికంటెను ముఖ్యమైన, శాంతం=శాంతమైన వాఁడును, మనో నయన వర్ధనం=మనస్సునకును కన్నులకును ఆనందోద్రేకము కల్గించువాఁడు, అపీచ్య దర్శనం=పరమ సుందరమైన దర్శనము కలవాఁడు, శశ్వత్=నిరంతరము, సర్వలోక=సమస్త లోకములచేత, నమస్కృతం=నమస్కరింపఁబడినట్టియు, కైశోరేవయసి=బాల్యము తరువాతి వయస్సునందు, సంతం=ఉన్నట్టి, భృత్యాను గ్రహకాతరం=భక్తులను రక్షించుట యందు తీవ్రమైన ఉద్యోగము కలవాఁడును, కీర్తన్య తీర్థయశసం=పొగడుట కర్హమైనట్టియు పవిత్రమైన

కీర్తితో కూడినవాఁడునైన, పుణ్యశ్లోకయశస్కరం=పవిత్రమైన కీర్తిగల భక్తుల యొక్క కీర్తిని తనసేవతో నిరంతరమును పరివర్ధించువాఁడును, సమగ్రాంగం=పరిపూర్ణమైన అంగములతో కూడిన మూర్తిగా, మనః యావత్ చ్యవతే=మనశ్చాంచల్యము లేకుండు వఱకును, దేవం ధ్యాయేత్=భగవంతుని స్మరింపవలెను.

తాత్పర్యము : వికసించిన తామర పుష్పమువలె సాధకుల మనస్సు నాకర్షించు కాంతిగల ముఖము, ఎఱ్ఱతామర అంతర్భాగమువలె కించిదరుణములైన కన్నులు, నల్లదామర రేకులవలె మనోహరమైన శరీరచ్ఛాయ, శంఖము, చక్రము, గద, పంకజము-- వీనిని ధరించియున్న నాల్గుచేతులు, పంకజము యొక్క కింజల్కములు కించిదరుణములై యుండును. పసుపుయొక్క భాగము పువ్వు. ఆ రీతిగా గౌరవర్ణముతో నున్న పీతాంబరము. విశాలమైన వక్షస్సునందు శ్రీవత్సమను జగత్ప్రసిద్ధమైన పేరుగల పుట్టుమచ్చ. కంధరమందు శోభాయమానమైన కౌస్తుభమను పేరుగల రత్నాభరణము. మదించిన తుమ్మెదల మధురశబ్దముతో, నిత్య సుగంధముతో కూడియున్న వనమాలతో శోభించుచున్న శరీరము. అనర్ఘమైన ముక్తామాల. కరములయందు కంకణము, దిక్కులకు కాంతి వెదజల్లెడు కిరీటము. రత్నమయమైన బాహుపురులు. పాద నూపురములు. ఇంక ననేకములైన ఆభరణములు. రత్నఘటితమైన మేఖలతో కూడిన ఆకర్షకమైన మధ్యప్రదేశము, భక్తులకు నిత్యానంద కరమైనది ఆ స్వరూపము. వారా స్వరూపమును మనః పద్మములపై ప్రతిష్ఠించుకొనుచుందురు. వైకుంఠ వాసుని కన్నులు భక్తహృదయ పద్మములందు కాంతి నింపును. ఆ స్వరూపము మనస్సు నానందములో నోలలాడించును. దర్శనముతో నేత్రసాఫల్య మొన గూర్చును. సమస్త లోకములు నిరంతరము పూజించుచున్న పాదపద్మము లాయనవి. నిత్యయౌవనము ప్రదర్శించుచున్న శరీరము. పది యేండ్లనుండి పదునారు వఱకున్న స్వరూపమును కైశోర మందురు. నిరంతరమును కైశోర వయస్సునందే ప్రకాశించుచున్న శరీరభంగి. సంతత భక్తానుగ్రహ కాతరమైన మనస్సు. భక్తుల నెట్టెట్టు ఎప్పు డెప్పుడుద్ధరించవలెనో నిరంతర మాభగవంతు నకు చింత, కీర్తింపతగినదియు, కీర్తించువారిని పవిత్రులుగా నొనర్చ పరమ పుణ్యతీర్థముతో సమానమైన కీర్తి. శ్రీహరిని కీర్తించు భక్తుల యశమే పరమ పవిత్రమైనది కీర్తింప తగినది. దానినింకను వర్ణింపవలెననెడు తీవ్రమైన ఆకాంక్ష భగవంతునిది. అతని కారుణ్యము, భక్తవాత్సల్యము అట్టివి. ఈ ప్రకారమైన భగవత్స్వరూపము మనశ్చాంచల్యము లేకయే సాధింపవలెను. మనశ్చాంచల్య రూపమైన వాత్సల్యము సమగ్రముగా నశించువరకును భక్తుఁడు ధ్యానింపవలసిన దీరూపమే. ఈ స్వరూపమును ధ్యానించుట కారణముగా తన చాంచల్యము వీడును.

19.స్థితం=ఒకచోట నిలుకడగా నిలుచున్న వానిగానో, ప్రజంతం=నడచుచున్న వానిగనో, ఆసీనం=కూర్చున్న వానిగనో, శయానం=పండుకొన్న వానిగనో,

ప్రేక్షణీ హితం యే=చూడ సుందరమైనట్టి లీలతో కూడిన వానిగనో, గుహాశయం=మనస్సనెడు గుహయందున్న పరమాత్మని, శుద్ధభావేన చేతసా=ఫలకాంక్షలేక పరిశుద్ధమైన మనస్సుతో, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

తాత్పర్యము : హృదయ మధ్యమందు పైన వివరించిన పద్ధతిలో నున్న రూపముతో ధ్యానింపవలెనని ఉపదేశించిన తరువాత సాధకుని యభిరుచి యనుసరించి రామకృష్ణాది మూర్తుల యొక్క ఏ ప్రవృత్తినైనను వేగస్థితి మూలమైనను ధ్యానించినచో ధ్యానస్థితికి విరోధము లేదని చెప్పుచున్నాడు. కొందరు భగవంతుని కేవలము నిలుచున్న వానినిగా భావింప వచ్చును. లేక నడచుచున్న వానినిగా తలపోయ వచ్చును. బృందావనాది దివ్య స్థలమందు కౌతుకము కలిగించు పద్ధతులలో క్రీడించు చున్నవానిగా తలపోయ వచ్చును. గోవర్ధనాది స్థల సంచారిగా భావింప వచ్చును. ఆదిశేష స్వరూపమైన శయ్యపైన యోగనిద్రలో నున్నవానిగా తలపోయ వచ్చును. హృదయ గుహ యందు శయనించిన వానిగనే భావింపవలెనని ఏదో ఒక పవిత్ర దేశమందు పవ్వళించి నిరీక్షించు వానిగ౮ గూడ తలపోయ వచ్చును. లేక దర్శనీయమైన లీలతో కూడిన వానిగనో తలపోయ వచ్చును. ఈ సాధనలో మనస్సు భగవత్కృపా విశేషమును తప్ప మఱియొక్క ఫలము కోరనదిగా ఉండవలెను. ఈ విషయమందు సాధకుఁడు తీవ్రమైన శ్రద్ధ వహింప వలెను.

20. తస్మిన్=ఈ రూపమందు, లబ్ధ పదం=లభించియున్నట్టి నిలుకడతో కూడినట్టియు, సర్వావయవ సంస్థితం=సకలావ యవములందును విశ్రాంత మైనట్టి, చిత్తం=మనస్సును , విలక్ష్య=చూచి, మునిః=మౌనముతో సాధించెడు సాధకుఁడు, భగవతః=భగవంతుని యొక్క, అంగే=శరీరమందు, ఏకత్ర=ఒక భాగమందు, సంయుజ్యాతం=మనస్సును చక్కగా నిలుపవలెను.

తాత్పర్యము : సమగ్రాంగ ధ్యానము నుపదేశించిన తరువాత భగవంతుని శరీరమందున్న ఒక్కొక్క అంగమును వేఱు వేఱుగా ధ్యానింప వలెనని ఉపదేశించు చున్నాఁడు. మనస్సును నిశితముగా నొనర్చికొను నుపాయమును నీపద్ధతితో చెప్పుచున్నాఁడు. భగవంతుని సమగ్ర స్వరూపమందు సర్వావయవములందు మనస్సు స్థితి నిశ్చలముగానుండి భగవద్రూప సమగ్రమైన తరువాత సాధకుఁడు సర్వాంగ స్వరూపము నుండి మనస్సును వెనుకకు తీసికొని ఒక్కొక్క అంగమునందే ప్రత్యేక ప్రత్యేకముగా నిక్షేపింపవలెను. ఒక్కొక్క అంగమునే ధ్యానించు సమయమందు మనస్సు వేఱొక అంగముపై ప్రాకకుండునట్లు జాగ్రత్త వహింపవలెను. ధ్యేయమైన ఒక యంగమందు మాత్రమే ఉండునట్లు నిలిపికొనవలెను.

21. వజ్రాంకుశధ్వజ సరోరుహ లాంఛనాఢ్యం=వజ్రాయుధము, అంకుశము, ధ్వజము, పద్మము మొదలైన చిహ్నములచేత కూడినదియు, ఉత్తుంగరక్త విలసన్నఖ చక్రవాళ జ్యోత్స్నాదిభిః=ఉన్నత మైనవియు, రక్తవర్ణము కలిగినవియునైన గోళ్ల నుండి బయటికి వచ్చుచున్న కాంతులనెడు వెన్నెలచేత,

ఆహత మహత్ హృదయాంధకారం=నశింప చేయఁబడిన మహాత్ముల యొక్క(సాధకుని హృదయమందు) అజ్ఞాన మనెడు చీఁకటితో కూడినదైన, భగవతశ్చరణార విందం=భగవంతుని పాదాబ్జము, సంచింతయేత్=చక్కగా ధ్యానింప వలెను.

తాత్పర్యము : ఒక్కొక్క అవయవమును ధ్యానింపవలసిన పద్ధతిని ఈ శ్లోకము మొదలుకొని 13 శ్లోకముల వఱకును వివరించు చున్నాఁడు. పరమాత్ముని పాద పద్మములను ధ్యానింపవలెను. ఆ పాదములందు రేఖా రూపముగా వజ్రము, అంకుశము, ధ్వజము, తామర పుష్పము మొదలైన వుండును. వానిని వేఱు వేఱుగా ధ్యానింపవలెను. సాధకుని యొక్క జన్మ జన్మాంతర సంచితములైన పాపము లనెడు పర్వతములను వజ్రాకృతియైన స్వామి పాదమందలి రేఖ నశింపచేయును. మనస్సనెడు మదించిన గజమును స్వామి పాదరేఖయైన అంకుశము శిక్షించి భగవంతుని పాద పద్మస్థానమునకు తీసికొనిపోవును. ఏనుఁగును పట్టికొని దానిని యమించు ఆయుధమునకే అంకుశ మని పేరు. మానవునకున్న తాపములు మూఁడు. ఆధ్యాత్మికము, అధి దైవికము, ఆదిభౌతికము. ఈ మూటిని స్వామి పాదాబ్జమందున్న గజాకారమైన రేఖ పారద్రోలును. తామర సర్వ దర్శనీయమైనది. నిత్యసుందరమైనది. అట్లే స్వామి పాదమందలి రేఖ నిత్యసుందరమై దర్శనీయ మైనది. స్వామినఖములు రక్తవర్ణముతో కూడి ఎఱ్ఱనివి. వాని నుండి ప్రకాశ మనెడు చంద్రికా ప్రవాహము బయటికి వచ్చును. అది సాధకుని హృదయ మందలి అజ్ఞాన మనెడు చీఁకటిని పోకార్చును. ఈ రీతిగా భగవంతుని పాద పద్మమందున్న రేఖలను విశిష్టముగా కాక వేరు వేరుగా ధ్యానించినపుడు సాధకుని మనస్సునకు తత్తత్ఫలము లేర్పడు నవకాశ మున్నది.

22. యచ్చోచ నిస్స్రుతసరిత్తవరోదకేన=స్వామి త్రివిక్రమావతారముగా విజృంభించినపుడు, బ్రహ్మదేవుఁడు తన కమండలు జలమును స్వామి పాదములపైఁజల్లించి అభిషేక మొనర్చినాఁడు. అదియే గంగా జలముగా నైనది. ఆ పాదతీర్థమును బ్రహ్మాది దేవత లందఱు తమ తలలపై ప్రోక్షించి కొన్నారు. " విష్ణు పాదోద్భవా గంగా" యనెడు ప్రసిద్ధి ఆనాటి నుండి ఏర్పడినదే. ఆ గంగా జలమే నదిగా మారినపుడు భగీరథుని ప్రయత్నము వలన ప్రపంచమునకు వచ్చినది. అప్పుడు శివుఁడు మూర్ధ్ని అధికృతేన=శిరస్సు నందు ధరించినాఁడు. తలపై ఆ జలములు ధరించుట చేతనే, తీర్థేన=పవిత్ర మైన ఆ జలము చేత, శివః=మహాదేవుఁడు, శివఃఅభూత్=సకలలోక కళ్యాణ కరుఁడైనాఁడు. ప్రేతావాస వానియైనను, సమస్త జగములకు మంగళములు కలిగించెడు శక్తికల వాఁడయ్యెను. ధ్యాతుః=ధ్యానించెడు వానియొక్క, మన శ్శమల శైల నిసృష్ట వజ్రం=మనస్సునందున్న కల్మష మనెడు పర్వతముపై ప్రయోగింపఁబడిన వజ్రాయుధముతో సమానమైన, భగవతః+చరణారవిందం= భగవంతుని పాదపద్మమును, చిరం ధ్యాయేత్=చాలా సేపు భావింప వలెను.

తాత్పర్యము : బ్రహ్మదేవుడు భగవంతుని పాద ప్రక్షాళన మొనర్చినాడు. ఆ పాద ప్రక్షాళన జలము నుండియే గంగ యుద్భవించినది. సర్వనదుల కంటెను సర్వోత్తమ మైనది. ఆ తీర్థమును పరమశివుడు తలపై ధరించినాడు. ఆ ధరించుటచేత కృతకృత్యుడైనాడు. అమంగళ ప్రదేశములందు సంచరించు వాడైనను సర్వలోకములకు మంగళకరుడైనాడు. ఆ పాద పద్మములు ధ్యానించుచున్న సాధకుని యొక్క మనశ్చాంచల్య మనెడు పర్వతములను నిశ్శేషముగా కూల్చివేయు వజ్రాయుధముతో సమానమైనది స్వామి పాదపద్మము. ఆ పాదపద్మకాంతి వజ్రాయుధము కంటె వేయింతలు. మానసికమైన సర్వదోషములను నశింపచేయుటకు సాధకుడు చాలకాల మా పాదపద్మమునే మనస్సున నిల్పికొని సాధన చేయవలెను.

23. అఖిలస్య=సమస్త ప్రపంచముల యొక్క, విధాతుః=సృష్టికర్తయైన బ్రహ్మదేవుని, జనన్యా=మాతృ శ్రీగను, సురవంది తయా=సమస్త దేవతలచేత నమస్కరింపబడి నదియునైన, జలజలోచనయా=తామర పుష్పముల వలె నిత్యార్ద్రములై, కరుణయనెడు మధుధారలచే కూడిన నేత్రములు గల, లక్ష్మ్యా=శ్రీదేవిచేత, ఊర్వోః=తొడలపైన, నిధాయ=ఉంచికొని, కరపల్లవరోచిషా =పల్లవముల వలె మృదువులు అరుణములైన హస్తపద్మముల కాంతిచేత, సంలాలితం=ఆదర పూర్వకముగా లాలింపబడినదైన, యత్=ఏదికలదో, అభావస్య=జన్మరహితుడైన వాడును, విభోః=సర్వేశ్వరుడైన స్వామి యొక్క, జానుద్వయం=రెండు జానువులను, హృది=మనస్సునందు, కుర్యాత్=నిశ్చలముగా నుంచు కొనవలెను.

తాత్పర్యము : లక్ష్మీదేవి సమస్త సృష్టికర్తయైన బ్రహ్మదేవునకు తల్లి. సమస్త దేవతలు అమె పాదపద్మములకు శిరస్సువంచి నమస్కరింతురు. అమె కన్నులు కరుణ యనెడు మధు ధారతో నిత్యము కూడినవై సర్వలోక వాత్సల్యమనెడు కాంతితో ప్రకాశించెడు పద్మములు. ఆమె స్వామి యొక్క జానుద్వయమును తన తొడలపై నుంచికొని లాలించును. ఆమె కర పల్లవములు శిరీష పుష్పముల వలె అత్యంత మృదువు లైనవి. అరుణశోభ కలవి. ఆమె స్వామి పాదముల నొత్తుచున్నపుడు ఆ అరుణ రేఖలు నీలవర్ణములతో నున్న స్వామి జానువులపై పడి స్వామి పాదములు వర్ణాంతరముల ప్రాప్తించుచున్నవి. ఆమె తన కరపల్లవ స్పర్శతో స్వామి జానువులు కందినవేమో అను భయముతో జాగ్రత్తగా పాదముల నొత్తుచుండును. ఆ పాదములు సాధకుని సమస్త కల్మషములు తొలగించునవి. వాని అనుగ్రహమునకై సాధకుడు మనస్సున ఉంచుకొని ధ్యానింపవలెను.

24. సుపర్ణ భుజయోః=గరుత్మంతుని స్కంధ దేశములందు, అధిశోభమానౌ =శోభించు చున్నవియు, ఓజోనిధీ=కాంతి విశేషమునకు నిధులైనట్టియు, అతసీ కాకుసుమావ భాసౌ=అవిసెపూలవలె శోభించు చున్నవియు నైన, ఊరూ=తొడ లను, హృది కుర్యాత్=హృదయమందు ప్రతిష్ఠించు కొనవలెను. వ్యాలంబి=వ్రేలాడు

చున్న, పీతవర వాససి=శ్రేష్ఠమైన వచ్చని పుట్టము పైన, వర్తమాన=ఉన్నట్టి, కాంచీ కలాప=మేఖల యనెడు భూషణము చేత, పరిరంభి=వ్యాపింప బడిన, నితంబబింబం=నితంబ బింబమును, హృది కుర్వాత్=హృద్గతముగా నొనర్చు కొనవలెను.

తాత్పర్యము : భక్తుడైన తన్ను అనుగ్రహించుటకై గరుత్మంతునెక్కివచ్చిన భగవంతుని తొడలను ధ్యానింపవలెనని ఉపదేశించు చున్నాడు. గరుడ స్కంధమునకు స్వామి పాదార్పణము చేత వన్నె వచ్చినది. సర్వసౌందర్యములకు నిధులవంటి వాతొడలు. అవిసెపూల వంటి కాంతి కలిగిన అవి తమకాంతుల చేత దిక్కులకు ఇంద్ర నీలమణులను వెదజల్లు చున్నవి. పచ్చని వన్నె గలిగిన పుట్టము దివ్యమనోహరముగా వ్రేలాడుచున్నది. దానిపైన రత్నఘటితమైన మేఖల. ఆ మేఖలతోడి నితంబ బింబము సర్వలోక మనోహర మైనది.

25.భువన కోశ గుహోదరస్థం=సర్వ ప్రపంచములకును ఆధార భూతమైన ఉదరమందు ప్రకాశించుచుండెడి, నాభిహ్రదం=సరస్సు వలె లోతైన బొడ్డును, ధ్యాయేత్=ధ్యానింపవలెను. యత్ర=దేనియందు, ఆత్మయోని ధిషణాఖిలలోక పద్మం=బ్రహ్మ యొక్క వాసస్థానముగను, సమస్తలోక మయముగను ఉన్నట్టి తామరపుష్పము, వ్యూఢం=ఉద్భవించి, అముష్య=ఇతని యొక్క విశదహార మరీచి గౌరం=నిర్మలమైన ముత్యాల మాల యొక్క శోభచేత శ్వేత వర్ణము కలదియై యున్న, హరినీలమణి వృషస్తనయోః ద్వయం=మరకత మణి శ్రేష్ఠము లందువలె ప్రకాశించు చున్నట్టి స్తనద్వయమును, ధ్యాయేత్=ధ్యానింప వలెను.

తాత్పర్యము : కారణ జలమందు ఆదిశేషుడను శయ్యపైన శయనించి యుండెడి భగవంతుని నాభి ప్రదేశమును ధ్యానింపవలెనని చెప్పుచున్నాడు. స్వామి ఉదరము సకల లోకముల కావాసభూతమైన గుహవంటిది. ఆ యుదరమందు నాభీ మండలము ప్రకాశించు చుండును. అది ఇంద్రనీలమణులు చెక్కిన సరస్సువలె మహాగంభీరమై యున్నది. అటి స్వామి నాభిచక్రమును ధ్యానింపవలెను. దానియందు సర్వశోభాకరమైన పద్మమున్నది. అది సర్వలోక స్వరూపి బ్రహ్మ కుత్పత్తి స్థానము. దానిని హృదయమం దిడుకొని ధ్యానింప వలెను. ఆ స్తనద్వయము అత్యుత్కృష్టమైన రెండు మరకత మణులవలె ప్రకాశించుచున్నది. వక్షస్సునందు వ్రేలాడు ముక్తామాల. సర్వదిక్కులకు వ్యాపించు చున్నదాని స్వచ్ఛకాంతి. ఆ కాంతులచేత స్తనమండలము తెల్లగా నున్నట్లు కన్పడుచున్నది. శ్వేతవర్ణము యొక్క పరభాగమట్లున్న దన్నమాట. అట్టి దా స్తనమండలము. మనస్సు నందు భావింపవలెను.

26. మహావిభూతేః=మహా లక్ష్మీదేవికి, అధివాసం=వాసస్థాన మైనదియు, పుంసాం=ధ్యానించుచున్న భక్తుల యొక్క, మనోనయన నిర్వృతిం=మనస్సు నకును, నేత్రములకును హర్షాతి శయమును, ఆదధానం=కల్పించు చున్నదియు నైన, ఋషభస్యవక్షః=భగవంతుని వక్షః స్థలమును, కౌస్తుభమణేః=కౌస్తుభమనెడు

రత్నము యొక్క, అధిభూషణార్థం=అలంకార స్థానముగా నున్నట్టియు, అఖిలలోక నమస్కృతస్య=సమస్త బ్రహ్మాండముల చేత నమస్కరింపబడిన భగవంతుని యొక్క, కంఠం చ=కంఠదేశమును, మనసి కుర్యాత్=మనస్సు నందు భావించు కొనవలెను.

తాత్పర్యము : శ్రీ మహావిష్ణువు దేవతలలో సర్వశ్రేష్ఠుడు. సమస్త సంపదలును ఎవరికృపాకటాక్షముచేత పుష్కలముగా వరిల్లునో అట్టిలక్ష్మీదేవికి అతని వక్షఃస్థలము నివాస భూమి. నిత్య విరక్తుడు అతడు. అందుకే ఆమె అతని సేవను కోరుకొన్నది. ఆ స్వామి కంఠము సమస్తలోకముల నేత్రములను వశీకరించు కొన్నది. మనస్సున కెనలేని హర్షమును సంపాదించి పెట్టును. కౌస్తుభరత్నము ఆయన కంఠదేశము నలంకరించుట చేతనే దాని కాంతిని పెంచుకొన్నది. రత్నము బంగారుతో చేరిన పైనది. సమస్త లోకముల నమస్కారముల కర్హుడాతడు. అట్టి అతని కంఠదేశమును మనస్సునందు ధ్యానించుకొని సాధకుడు తన్ను మీఱిపోవలెను.

27.అధిలోకపాలాన్=తన్ననుసరించి యున్న లోకపాలురతో కూడి యున్నట్టి. మందరగిరేః=మందర పర్వతము యొక్క, పరివర్తనేన=పరిభ్రమణము చేత, నిర్ణిక్త బాహువలయాన్=ఎక్కువగా శోభించుచున్న అంగదములతో కూడిన, బాహూం చ=బాహువుల యొక్క, అసహ్యతేజఃతేజస్సుతో కూడిన, దశశతారం=పదివేల అంచులతో కూడిన చక్రమును, తత్కర సరోరుహ రాజహంసం=ఆ పరమాత్ముని హస్తమనెడు తామర నాశ్రయించియున్న రాజహంసతో సమానమైన, శంఖం చ=శంఖమును, సంచింత యేత్=భావింప వలెను.

తాత్పర్యము : క్షీరసాగర మథనము నాటికథ. దేవత లందఱు స్వామి నరించినారు. ఆయనయు వారితో పయనమయి మందరగిరి ఉద్ధరణమునకు పూనుకొనెను. ఆ సర్పము యొక్క పలుమారు ఒరయుటలచేత ఆతని అంగదములకు పదను పెట్టిన పైనది. అది ఇంకను ప్రకాశింపడొడగెను. అతని యొక్క ఒక చేతియందు శంఖము. అది జ్ఞానమయమైనది. జ్ఞానమువలెనే స్వచ్ఛముగా ప్రకాశించుచున్నది. ఆతని కరము ఎఱ్ఱదామరవలె నున్నది. కరమునందు వెలుఁగు చక్రము దశావతారములు గలది. శంఖము స్వామి కరపంకజము పైన రాజహంసవలె ప్రకాశించు చున్నది.

28. అరాతి భటశోణిత కరమేన=శత్రువులై యుద్ధమునందు తన్నెదిరించిన రాక్షసాదుల యొక్క రక్త మాలిన్యము చేత, దిగాం=కూడికొన్నట్టియు, దయితాం= భగవంతునికి ప్రీతి పాత్రమైనట్టి భగవతః కౌమోదకీం=భగవంతుని కౌమోదకిని, మధువ్రత వరూధ గిరా=తుమ్మెదల గుంపుల ఝంకారము చేత, ఉపఘుష్టాం= శబించుచున్నట్టి, మాలాం=మాలను, చైత్యస్య=జీవునియొక్క, తత్త్వం=సూక్ష్మ స్వరూపమైన, అస్యకంఠేమణిం=భగవంతుని యొక్క కంఠమందున మణిని, స్మరేత=ధ్యానింప వలెను.

తాత్పర్యము : శత్రువులను సంహరించుట చేత వారి రక్తములు దగులుకొని కించిన్మలినమైనది కౌమోదకీ గద. అది భగవంతున కత్యంత

ప్రియ మైనది. దానిని ధ్యానింపవలెను. సుగంధ విశేషముచేత నాకృష్టములై తుమ్మెదలు చుట్టును గుంపులు గట్టి తిరుగుచున్నవి. నలుదిశల వ్యాపించిన వాని ఝంకారములు. ఆ ఝంకారములతో కూడిన వనమాల. జీవతత్త్వమునకు సంకేతమైనది కౌస్తుభ రత్నము. ఆ కౌస్తుభరత్నమును, ఆ కౌమోదకిని, వనమాలను భక్తుఁడాదరముతో ధ్యానింప వలెను.

29. భృత్యానుకంపిత ధియా=స్వభక్తుల యం దనుగ్రహ బుద్ధిచేత, ఇహ=భూలోకమందు, గృహీతమూర్తేః=గ్రహింపఁబడిన మూర్తితో కూడిన, భగవతః=భగవంతుని యొక్క, వదనారవిందం=అరవిందముతో సదృశమైన ముఖమును, సంచింతయేత్=గొప్పగా ధ్యానింపవలెను. యత్=ఏది, విస్ఫురన్మకర కుండల వల్గితేన=ఎక్కువగా ప్రకాశించుచున్న మకరాకార కుండలముల చలనముచేత, విద్యోతి తామలకపోలం=ఎక్కువగా శోభించుచున్న నిర్మలములైన కపోలములను, ఉదారనాసం=ఎత్తై పొడవుగా నున్న నాసికతో కూడి యున్నవానిని,

తాత్పర్యము : స్వామి అవతరించుట భక్తానుగ్రహముకొఱకే. అతని కేఇచ్ఛయును లేదు. పూరించుకొనవలసిన ఏ కొఱతయు శూన్యము. అతఁడు భక్తానుగ్రహమునకై పలుమారు ప్రపంచమునకు వచ్చిపోవుచుండును. అతని వదనారవిందము నిత్యవాత్సల్యయుతము. కర్ణములందు మకరాకార కుండలములు. అవి మాటి మాటికిని చలించు చుండును. వానికాంతి కపోలములందు ప్రతిబింబించును. అతని నాసిక ఉన్నతమై, పొడవైనది. ముఖమునకుఁదగినంత యవస్థానము కల్గినది.

30. స్వయా భూత్యా=స్వతస్సిద్ధమైన శోభచేత, శ్రీనికేతం=సకల సౌందర్య నికేతమైనట్టియు, కుటిల కుంతల బృందజుష్టం=వక్రములైన కేశములచేత వ్యాపింపఁబడినదియు, అబ్జనేత్రం=వికసించినతామరలవంటి కన్నులతో కూడినదియు, ఉల్లసద్భ్రు=సౌందర్యము నంతయు చెరగిపోయుచున్న భ్రూయుగ్మముతో కూడినదియు, మనోమయం=మనస్సుచేత మాత్రమే సౌందర్యమును గ్రహింప నర్హ మగుచున్న, మీనద్వయాశ్రయం=రెండు మత్స్యములచేత నాశ్రయింపఁబడిన, అబ్జం=పద్మమును, అధిక్షిపత్=అధిక్షేపించు చున్నట్లున్న, యత్=ఏ ముఖము కలదో దానిని, ధ్యాయేత్=ధ్యానించ వలెను.

తాత్పర్యము : అతని కనుబొమ్మలు స్వకీయములైన సౌందర్యములతో లక్ష్మీదేవిని వశపఱచు కొనుచున్నవి. పద్మభ్రాంతిచేత మాటికినీ తుమ్మెదలు ముఖమునందు వ్రాలుచున్నవి. ఆ ముఖమండలము తన సౌందర్యముల చేత సకలదేవతల మనస్సు నాకర్షించుచున్నది. చాలనందుకు ముఖముపై వ్రాలుచున్న వక్రములైన ముంగురులు. అతని కన్నులు రెండుచేపలచే నాశ్రయింపఁబడిన తామరలవలె నున్నవి. ఆ ముఖసౌందర్యము ఘనస్సుచేత మాత్రమే యనుభవింప తగినది. ఆ భ్రూమండలము నిత్య జాగృతికమై మాటికిని చలించు చున్నది. చలించినపుడు ఒక్క యందము. స్తిమితమైనపు డొక్క యందము. అట్టి ఆ ముఖమండలమును భావింపవలెను.

31. అతి ఘోర తాపత్రయోపశమనాయ=అతి ఘోరములైన మూఁడు విధములైన తాపముల శాంతికొఱకు , అధికం కృపయా=ఎక్కువ దయతోకూడ, అక్షోః=నేత్రముల నుండి, నిసృష్టం=ప్రయోగింపఁబడినది, స్నిగ్ధస్మితానుగుణితం =మనోహరమైన మందహాసముతో కూడినది, విపుల ప్రసాదం=అధికమైన అనుగ్రహమును సూచించు చున్నదిగా ఉన్నట్టి, తస్య=భగవంతుని యొక్క, అవలోకం=కటాక్షమును, గుహాయాం=హృదయాంతర్భాగమందు, విత భావనయా =అధికమైన ప్రేమతోకూడ, చిరం ధ్యాయేత్=చాలకాలము ధ్యానింపవలెను.

తాత్పర్యము : భక్తుల కున్నవి మూఁడు తాపములు. ఆధ్యాత్మిక, ఆధి భౌతిక, ఆధి దైవికములు. ఈ మూఁడును ఒకటి విడిచిన ఒకటి వానిని బాధించుచునే యుండును. భక్తులయొక్క త్రితాపములను వారింపవలెనని భగవంతుని తహతహ. ఆ కరుణా విశేషము చేత నేత్రముల నుండి కరుణతో చల్లనైన చూపులు జారుచుండును. అతని చిరునవ్వే మనోహరమైనది. ఆ చిరునవ్వు కంటిచూపులకు ఇంకను శోభాతిశయమును కలిగించు చున్నది. ఆ మందహాసమందును కన్నుల యందును నిండి నిబడీకృతమైన ప్రసాద గుణము మందహాసముతో కూడిన యా విలోకనము సాధకుని మనస్సులో ఒక్కసారిగా నెలకొనవు. అందుకై వాఁడు చాలకాల మా విలోకనములను భావింపవలెను.

32.అవనతాఖిలలోక తీవ్ర శోకాగ్నిసాగర విశోషణం=నమస్కరించెడు సకల ప్రాణుల యొక్క ఉగ్రమైన సంతాపముతో నేర్పడెడు కన్నీటితో నేర్పడిన సముద్రమును ఒట్టి పోవునట్లు చేయుటకు సమర్థమును, అత్యుదారం= భక్తులు కోరెడు సమస్తాభీలాషలను పూరించుటయే వ్రతముగా గలిగిన, హరేః హాసం=భగవంతుని మందహాసము, మునికృతే=మునులనను గ్రహించుట కొఱకు, మకరధ్వజస్య=మన్మథుని యొక్క, సమ్మోహనాయ=సమ్మోహనము కొఱకును, నిజమాయయా=తనయొక్కమాయా శక్తిచేత, రచితం=ఏర్పరుపఁబడిన, అస్య భ్రూమండలం=భగవంతుని యొక్క భ్రూమండలమును, ధ్యాయేత్=ధ్యానింప వలెను.

తాత్పర్యము : లోకమే దుఃఖభూయిష్ఠ మైనది. ప్రతియొక్కఁడును కన్నీటితో భూమిని తడుప వలసినదే. వాని శోకాగ్నులతో ఒక సముద్రమే ఏర్పడి నట్లుండును. మానవుఁడు శాంతి కొఱకు భగవంతుని ఆశ్రయింపవలెను. తనవంటి మానవుఁడేమి రక్షించును. వాఁడు తనవలెనే నిరంతర దుఃఖి. స్వామి యొక్క భ్రూమండలము దాసుల సమస్తేచ్ఛలను పూరించుటలో వ్యగ్రమై యుండును. మును లాయనకు ప్రాణభూతులు. వారి క్షేమమును నిరంతరము ఆకాంక్షించునదై ఆ భ్రూమండలము ప్రకాశించును. స్వామియొక్క వైష్ణవశక్తి అమోఘ మైనది. దానిని దాఁటుట కెవ్వరును సమర్థులుగారు. ఆయన మాయాశక్తిచేత కూడుకొన్న భ్రూమండల సౌందర్యము మన్మథునే మోహింపచేయును. వాఁడే తన సర్వ సౌందర్యమును స్వామి యొక్క భ్రూమండల సౌందర్యమున కెన గాదని చిత్తమున తత్తర పడును.

33. బహుళాధరోష్ఠభాసా=ఓష్ఠముల నుండి బయలుదేరుచున్న అధిక కాంతితో, అరుణాయిత తనుద్విజ కుందపంక్తి=ఎఱ్ఱగా కన్పడుచున్నట్టి చిన్న చిన్నని పలువరుసతో కూడినట్టియు, ధ్యానాయనం=ధ్యానమున కాస్పద మైనట్టి, విష్ణోః=శ్రీమహావిష్ణువు యొక్క, ప్రహసితం=ప్రకాశమానమైన నవ్వును, ఆర్ద్రయా భక్త్యా=ప్రేమాతిశయమైన భక్తియందు, అర్పితమనాఃపూర్తిగా స్వాధీనము చేయఁబడిన మనస్సు కలవాఁడై, ధ్యాయేత్=ధ్యానింపవలెను. పృథక్=వేఱుగా, న దిదృక్షేత్=వేనిని చూడఁగూడదు.

తాత్పర్యము : స్వామి పెదవు లెఱ్ఱగా ఉన్నవి. ఆ కాంతులు పండ్లపై ప్రసరించు చున్నవి. అవి ఓష్ఠకాంతితో అరుణాయితములై తెలుపు, ఎఱుపు కలిసిన గౌరవర్ణముతో కూడినవి. అట్టి బాల్యావస్థలో నున్న ఆ శ్రీహరిని మహార్షులందరు ధ్యానములో నిలిపికొని సేవించిరి. ఆ స్వరూపమును మనోగుహ యందు నిలిపికొని అర్ద్రమైన భక్తికి అంకితమైన మనస్సుతో సాధకుఁడు ధ్యానింప వలెను. ఆ మూర్తి తప్ప తక్కిన దంతయు లుప్తమై పోవును.

34. భగవతి హరౌ=భగవంతుఁడైన శ్రీహరియందు , ప్రతి లబ్ధ భావః =స్థిరముగా లభించిన ప్రేమాతిశయముతో కూడినవాఁడు, భక్త్యా=భక్తిచేత, ద్రవద్దృదయఃశిథిలీకృతమైన అహంకారముతో కూడినవాఁడై, ప్రమోదాత్=ప్రబల మైన సంతోషము కారణముగా, ఉత్పులకఃరోమాంచముతో కూడినవాఁడు, ఔత్కంఠ్య బాష్పకలయాసంతోషాధిక్యముతో నుద్భవించిన బాష్పములతో కూడినవాఁడు, ముహుర్యమానఃమాటిమాటికి ఆనందములో మునుఁగు చున్నవాఁడై, తచ్చిత్త బడిశం అపిఆ చిత్తరూపమైన చేపలఁబట్టు కొట్టెనుండి, శనకైఃమెల్లమెల్లఁగా, వియుంక్తే=విడివడును.

తాత్పర్యము : భగవంతుఁడు సర్వసంతాపములను సంహరించువాఁడు జ్ఞానానంద స్వరూపి. ఆ శ్రీహరియందలి భక్తి, ప్రేమాతిశయముచేత మాటమాటికి పులకలు లేచి ఆనంద స్ఫురణ నిమిత్తముగా హృదయము రసార్ద్రమై ద్రవించును. ఆనంద బాష్పములు వెల్లివిరియును. మాటి మాటికట్టి సాధకుఁడు ఆనంద సముద్రములో మునిఁగి మునిఁగి లేచును. ఆ స్థితియందు ప్రతీకమైన భగవత్స్వరూపమందు మనస్సు లయించి పోవును. అప్పుడు భగవంతుని కంటె సాధకుని మనస్సు వేఱుగా ఉండదు. భగవన్మయముగానై పోవును. ఆ స్థితియందు ధ్యానము, ధ్యేయము, ధ్యాత అనెడు మూఁడు విభాగములతో కూడిన ధారణ ఈ భేదములనుండి విముక్త మగును. ఇది సాధకునకు బహుకాలాభ్యాసముతో నేర్పడు సిద్ధి. ఈ భేదరహితమైన ధారణయే నిర్వికల్ప సమాధిగా పరిణమించును. సబీజమైన యోగము అభ్యసింపఁగా దానిపరిపాకా వస్థయే నిర్వికల్పసమాధి. ఈ ప్రాప్తి బహుజన్మ సాధనా ఫలము.

35. ముక్తాశయం=ఆశ్రయమునుండి వేఱుగా నున్నది, నిర్విషయం =విషయముతో కూడనిదియు నైన, మనఃమనస్సు, సహసా=అనాయాసముగా,

నిర్వాణం=లయమును యర్హి=ఎప్పుడు, ఋచ్ఛతి=పొందుచున్నదో, తర్హి=అప్పుడు, పురుషః=జీవుఁడు, ప్రతినివృత్త గుణప్రవాహః=గుణప్రవాహము నుండి వదలింపఁబడినవాఁడై, ఏకం ఆత్మానం=పృథగ్భావములేక జగత్తంతయు నిండియున్న ఒకటే ఆత్మ స్వరూపమును, అవ్యవధానం=మఱపనునది లేశమును లేక, అన్వీక్షతే=విలోకించును.

తాత్పర్యము : అపుడు భగవత్కారుణ్యముతో స్వరూప సాక్షాత్కార మేర్పడును. భగవదానందానుభవ మేర్పడును. తత్ఫలముగా శబ్దాది విషయముల నుండి విరక్తి స్వభావ సిద్ధమై పోవును. తా ననెడు స్థితి కాధారభూతమైన స్థితి నిశ్శేషముగా నశించును. అపుడు సాధకుఁడు ధ్యానమున కాస్పదమైన రూపము, ధ్యానము అని చెప్పఁబడునట్టి మాట స్ఫురణము లేక బహిర్భూతుఁడై యుండు మనస్సు సంపూర్తిగా ఆనంద సముద్రములో లయించును. అప్పుడు జీవుఁడు స్వరూప భూతమైయున్న ఏకమైన ఆత్మభూతుఁడుగా నగును. శరీరము, ఇంద్రియములు, అహంకారములు వీనియందు పరిస్ఫురించుచున్న మనస్సు నశించిపోవుట చేత వీని యునికి లేక పోవును. ఆత్మభిన్నమైన వస్తువే లేకపోవును. శరీర భావన మందునకు కూడ ఉండదు. అసంగుఁడైన పరమాత్మ మాత్రమే ఆనందస్వరూపుఁడై భాసించు చుండును. తైలము, వత్తి, రెండును కలసి అంతఱుకు జ్వాలారూపముగా ప్రకాశించు అగ్ని ప్రత్యేక స్ఫురణము విడివడి భూతాత్మమై అగ్ని ప్రకాశించు చున్నట్లు నే ననెడు పరిచ్ఛిన్న భావము సంపూర్తిగా నశించి నప్పుడు తానే సర్వముగా సాధకుఁడు అనుభవించును. దీనికే ఆత్మసాక్షాత్కార మని పేరు.

36.సః అపి=వాఁడును, చరమయా=అవసాన స్థాయిలో నున్నట్టి, ఏతయా మనసః నివృత్యా=ఈ మనోనివృత్తిచేత, సుఖదుఃఖ బాహ్యే=సుఖదుఃఖముల నుండి విడివడియున్న, స్వస్మిన్ మహిమ్ని=ఆ మహిమయందు, అవసిత=అవసానమును ప్రాపించిన వాఁడుగానగును స్వాత్మన్=తన సాక్షాత్కారము యొక్క తత్త్వముతో కూడినవాఁడై, సుఖదుఃఖయోః=సుఖదుఃఖముల యొక్క, హేతుత్వం=భోక్తృత్వమును, అసతికరం=అసద్రూపుఁడైన కర్తయందు, విధత్తే=నిశ్చయించు కొనుచున్నాఁడు.

తాత్పర్యము: 35వ శ్లోకమునందు చెప్పిన వివరణము ననుసరించి ఆత్మసాక్షాత్కారమును ప్రాపించిన యోగియొక్క మనస్సు అవిద్యారూపమైన అజ్ఞానమునుండి ఆత్మజ్ఞాన నిమిత్తముగా అత్యంతికముగా లయించుట చేత రెండవ పదార్థ మను నదియే ఉండదు. సుషుప్తి యందుకూడ మనస్సు లయించి యుండును. కాని ఆలయము సాధనసంపత్తితో కూడినది కాదు. అందుచేత నిద్రలేచిన వెంటనే సాంసారికములైన సుఖదుఃఖముల బాధ విడువక అంటికొనును. ఇప్పు డేర్పడిన మనోలయ మట్టిదికాదు. భక్తి జ్ఞానాదుల సంపర్కముతో నేర్పడిన ఆత్మానందము నిమిత్తముగా కలిగిన

లయము. అందుచేత సమాధినుండి మరల నుత్థితుఁడైనను, దేహాది భావములందు ముందటివలె మరల నాసక్తుఁడు కానేరఁడు సాంసారికములైన సుఖదుఃఖముల అనుభవమునకు ఈ స్థితిని సాధించిన మహాయోగి పాత్రుఁడెప్పటికిని కాఁడు. కర్తయైనవాఁడు తాను కాఁడని ప్రకృతి కార్యమైన అహంకారమే కర్తృభావమును వహించిన దని, అందుచేత సుఖదుఃఖాను భవము అహంకారమునందు ఉన్నదిగాని తనయందు లేదని, తాను కేవల పరమాత్మ స్వరూపుఁడని, కరతలామలకమును వలె సాక్షాత్కరింప చేసికొన్న కారణముగా అట్టి మహాయోగి సంపూర్ణముగా కృతకృత్యుఁడగును.

37.చరమః సిద్ధఃకట్టకడపటి జన్మను ప్రాపించిన మహాయోగి, దైవాత్=ప్రారబ్ధ కర్మము హేతువుగా, ఉపేతం=తనతో చేరియున్నదియు, దైవవశాత్=ప్రారబ్ధము కారణము గానే, అపేతం=నశించినదియునైన, తం దేహం చ=ఆ దేహమును, స్థితం వా=ఉన్నదిగనో, ఉత్థితం వా=వీడి పోయినదిగనో, న పశ్యతి=చూచుటయే లేదు. యతఃఎందుకనఁగా, స్వరూపం=తనయొక్క స్వస్వ రూపమును, అధ్యగమత్=పొందిన వాఁడయ్యెను. మదిరామదాంధఃకల్లు యొక్క మత్తులో మనస్సును మఱచినవాఁడు, పరికృతం=వీడిపోయినట్టి, వాసఃయథా=గుడ్డనువలె,

తాత్పర్యము : ఆత్మసాక్షాత్కారము సిద్ధించిన యోగియొక్క జీవన్ముక్తస్థతను వివరించు చున్నాఁడు. ఇట్టిమహా యోగికిఁక మీఁద జన్మ ముండదు. ఇది కట్ట కడపటి సారిగా శరీరమును ధరించుట. ఆత్మ సాక్షాత్కారమైన తరువాత కూడ ప్రారబ్ధ కారణముగా శరీరముండనే యుండును. అంతవఱకు నాతఁడు ఆ శరీరమందు నివసించును. కాని వానికి దేహమును గూర్చిన అనుసంధాన ముండదు. అందుచేత దేహమునకు సంబంధించిన సుఖదుఃఖాల ఊసే లేదు. అది వాఁడు గమనింపనే గమనింపఁడు. దేహమున్నదో పోయినదో వాని భావనలోనే స్ఫురింపదు. ఎందు కనఁగా వాఁడాత్మస్వరూపి యైనవాఁడు. అజ్ఞానావస్థయందాత్మ స్వరూపానుభూతి లేదు. జ్ఞానావస్థయందు దేహజ్ఞానము లేదు. దేహ మేర్పడుట ప్రారబ్ధము ననుసరించి. ప్రారబ్ధావసానమందు అది తప్పకయే లభించును. మహాయోగియైన వాఁడు దేహమునకంటె భిన్నమైన ఆత్మ స్వరూపుఁడై యుండుట చేత శరీరము తనతో నున్నదో లేక వేఱుచోట నున్నదో లేశముకూడ భావింపఁడు. మద్యపానముతో నొడలు మఱచినవాఁడు చుట్టు పట్టులను, తన్నును మఱచిపోవును. తన వస్త్రము తనతో నున్నను, లేక మఱెక్కడనో జారి పోయినను వాఁడెఱుగఁడు. అట్లే జ్ఞానమున మునిఁగిన మహాయోగి శరీరమును గూర్చి ఏమియు నెఱుగఁడు. ఈ స్థితినే శాస్త్రములు జీవన్ముక్తి యని వివరించును.

38. దేహఃఅపి=దేహముకూడ, దైవ వశగఃదైవాధీనమైనదై, స్వారంభకం =దాని యుత్పత్తికి కారణమైన, కర్మయావత్=కర్మ ఎంతవఱకుండునో, సాసుఃప్రాణ సహితమై, సమీక్షతే ఏవ=నిలచి యుండుటయే యొనర్చును. అధిరూఢ

సమాధి యోగః=సమాధి యనెడు యోగస్థితిని పొందిన వాఁడును, ప్రతిలబ్ధవస్తుః=చక్కఁగా తెలిసికొనఁబడిన పరమార్థ తత్త్వముతో కూడిన వాఁడును, అయి, స(ప్రపంచం=ప్రపంచముతో కూడియున్న, తం=ఆ దేహమును, స్వాప్నం=స్వప్న పదార్థమును వలె, పునః న భజతే=మరల చేరఁడు.

తాత్పర్యము : అట్టిస్థితిలో శరీర మెట్లు నిలుచును? అహంకారాదుల నెవ్వరు ధరింతురు? శరీర సంస్కారములను ఎవ్వరు నడపుదురు? ఎట్లు జీవించి యుండును? ఈ ప్రశ్నలను పరిహరించు చున్నాఁడు. దేహము ప్రారబ్ధకర్మానుసారముగనే యుండుచున్నది. ఆ కర్మము ఎంతవఱకుండునో అంతవఱకు శరీరావస్థితి తప్పదు. ఎందుకనఁగా అది పూర్తిగా కర్మాధీనమైనది. కర్మయొక్క సంస్కార నిమిత్తముగా శరీరము నిలిచి యుండుటకు తగిన కార్యములను ప్రకృతియే ఒనర్చుచుండును. అపుడు దేహమునందు నే ననెడు భావము యోగి కుండవలసిన అవసరము లేదా యని అడుగ వచ్చును. పుత్రాదులందు మమత వానికి లేదు. శరీరమునకు సంబంధించి అహంతయు వానికి సున్న. ఎందుకనఁగా వానికి సమాధి ప్రాప్తి ఏర్పడినది. వాని కాత్మానుభూతి ఏర్పడినది. అటు తరువాత వాని కనాత్మయైన శరీరమం దభిమాన ముండదు. నిద్రనుండి లేచినవాఁడు స్వప్నమందు కన్పించిన పదార్థము సత్య మని ఎంచఁడు కదా!

39.పుత్రాత్=పుత్రుని నుండియు విత్తాత్=ధనము నుండియు, పృథక్=భిన్నుఁడుగా, మర్త్యః=మనుష్యుఁడు, యథా ప్రతీయతే=ఎట్లు తెలిసికొనఁబడుచున్నాఁడో, తథా=ఆప్రకారము, పురుషః=పురుషుఁడు-అనఁగా ఆత్మ, ఆత్మత్వేన=ఆత్మయను కొన్న, అభిమతాత్=అభిమానించి కొనియున్న, దేహాదేః =దేహాదుల నుండి, పృథక్=వేఱుగా, ప్రతీయతే=ప్రతి భాసించు చున్నాఁడు.

తాత్పర్యము : జీవన్ముక్త స్థితిని పొందిన తరువాత కూడ ప్రకృతి పురుషుఁడు, ఈశ్వరుఁడు-వీరు పరస్పరము భిన్న భిన్న లక్షణములతో కూడియున్న వారని ఇంతకు ముందు చెప్పిన విషయమునే మరల ఐదు శ్లోకములలో చెప్పుచున్నాఁడు. లోకమందు మానవుఁడు వీఁడు నా పుత్రుఁడు, ఇది సాధనము అని అభిమానించుచున్నను ఆ పురుషుఁడు నిజమునకు పుత్రశరీరము నుండియు, ధనధాన్యాది వస్తువుల నుండియు భిన్నుఁడేకదా! ఇది అందఱికను ప్రత్యక్షమైన విషయము. అట్లే ఆత్మకూడ దేహేంద్రియాహంకారములను నేననియు, నావనియు మనస్సులో తీవ్రముగా నభిమానించు చున్నాఁడు. కాని వీనియన్నిటికిని వాఁడు వేరే. జ్ఞానావస్థితి యందుకూడ ఈ యుదాహరణమునే అన్వయించి కొనవలెను.

40.ఉల్ముకాత్=అగ్నితో నున్న కొల్లినుండి, స్వసంభవాత్=తన యందు నుండి ఏర్పడిన, ధూమాత్=పొగనుండి, విస్ఫులింగాత్=అగ్ని జ్వాలనుండి, పృథక్ ఉల్ముకాత్=వేఱు కాష్ఠమునుండి, అగ్నిః=నిప్పు, యథాపృథక్=ఏ రీతిగా వేఱుగా నున్నదో, తథా=ఆ ప్రకారము, ఆత్మత్వేన అభిమతాత్=ఆత్మయని అభిమానింపఁబడిన దానినుండి, ఆత్మా పృథక్=ఆత్మ భిన్నమైనదే.

తాత్పర్యము : దేహాదులు తనకంటె భిన్నము కావను అభిప్రాయము లోకమందున్నను వాస్తవమున కున్నది భేదమే యని దృష్టాంత పూర్వకముగా చెప్పుచున్నాఁడు. అగ్ని యొక్క ప్రకాశ మున కాస్పదమై యున్న కొఱవినే అగ్నియని అనుమానించు వారున్నారు. అగ్నినుండి బయలుదేరిన ధూమమునే మఱికొంద రగ్నియని తలంతురు. కాని వాస్తవమున కగ్ని తన ప్రకాశమున కుపాధిగా నున్న కాష్ఠము నుండియు తన నుండి ఉద్భవించెడు పొగనుండియు భిన్నమైనదే యను విషయము స్పష్టమే కదా!

41.భూతేంద్రియాంతఃకరణాత్=భూతములు, ఇంద్రియములు, అంతఃకరణములు- వీనిగా నేర్పడినటి, ప్రధానాత్=ప్రధానమని పించుకొనెడు ప్రకృతి యొక్కయు, జీవ సంజ్ఞితాత్=జీవుని యొక్కయు, ద్రష్టా=ద్రష్టయైనట్టి, ఆత్మా=ఆత్మ స్వరూపము, పృథక్=వేఱైనట్టియు, భగవాన్=జ్ఞాన స్వరూపుఁడును, బ్రహ్మసంజ్ఞితః =బ్రహ్మయను పేరుగల వాఁడును, ఆ పదార్థము,

తాత్పర్యము : అట్టి భూతములు, ఇంద్రియములు, అంతకరణము- ఈ రీతిగా పరిణమించెన ప్రకృతి కంటెను జడభూతమైన దానిని చేష్టింపఁజేసెడు బుద్ధి ప్రతిబింబ భూతుఁడైన జీవుని కంటెను భిన్నముగా నుండునది ఆత్మస్వరూపము. వాఁడే పరమాత్మ. జ్ఞానస్వరూపుఁడు. బ్రహ్మయని పిలువబడు చున్న వాఁడు. సత్యానంద స్వరూపి.

42. సర్వభూతేషు=సమస్త భూతములందును, ఆత్మానంచ=ఆత్మ స్వరూపమును, ఆత్మని=ఆత్మయందు, సర్వభూతాని చ=సర్వభూతములను, భూతేషు=భూతముల యందు, తదాత్మతాం ఇవ=తత్స్వరూప మను నట్లుగా, అనన్య భావేన=అభేదముగా, ఈక్షేత=వీక్షించును.

తాత్పర్యము : సకలచరాచర భూతములందును. ఆత్మ వసించును. సమస్త భూతములును ఆత్మ యం దుండును. నిమిత్త కారణమై యున్నపుడు భిన్నముగా ప్రకాశించినను సర్వ ఉపాదాన కారణ మనెడు స్థితియందు అభేదముగనే యుండుటచేత కనిపించుచున్న సర్వమును ఆత్మ స్వరూపమున కంటె భిన్నము కాదని తెలియవలెను. ఘటము, శరావము అనెడు మూర్తి భేదములందు నామరూపములు భిన్న భిన్నములుగా నుండును. మృత్తికయనెడు నవస్థలో అన్నియు నొకటే. ఇట్టే పక్షి, మృగ, దేవాది భావములందు భిన్నములుగా కనపడు సకలమును ఒకటియైన ఆత్మ స్వరూపమే.

43.స్వయోనిషు=తన ఉత్పత్తి స్థానముల యందు, ఏకం జ్యోతిః=ఒక్క టై యున్న అగ్ని, యోనీనాం=తనయుత్పత్తి స్థానముల యొక్క గుణవైషమ్యాత్=గుణ భేదము హేతువుగా, నానాత్=అనేక రూపమై, యథా=ఏ రీతిగా, ప్రతీయతే= విలోకింపఁబడు చున్నదో, తథా=ఆ ప్రకారము, పక్వతౌ=ప్రకృతియందు, స్థితః ఆత్మా=ఉన్నట్టి ఆత్మ, నానా=అనేకముగా, పతీయతే=కనపడుచున్నది.

తాత్పర్యము : సర్వత్ర వసించు చుండెడిది ఒకటే యాత్మ యైనచో నానాత్వ ప్రతీతికి కారణ మేమి?దానిని వివరించు చున్నాఁడు. అగ్ని యొక్క ప్రకాశమునకు కారణములైన కాష్ఠాది పదార్థముల అకృతి భేదము నిమిత్తముగా

ఆయాకాష్ఠములందు ప్రకాశించుచున్న అగ్ని వెడల్పు, నిడివి, వర్తులత్వము ఈ రీతిగా ఆకృతి గుణములతో చేరినదై భిన్న భిన్నముగా కన్పించునట్లు ప్రకృతి కార్యములైన పక్షి మృగ మనుష్య దేవాది శరీర భేదములు కారణములుగా ఆయాశరీరములందు వసించుచున్న ఆత్మ భిన్నుడైనట్లుగా కనుగొనబడును. దీని కుపాధి భేదమే కారణము. వస్తు భేదము కాదు.

44.తస్మాత్=అందుచేత, పురుషః=పురుషుడు, సద సదాత్మికాం=కార్యకారణ రూపముగా పరిణమించి యుండునదియు, దుర్విభావ్యాం=ఈ విధముగా నుండు నదియని నిశ్చయించి చెప్పుటకు వీలులేనిదియు, దైవీం=ఈశ్వరునకు సంబంధించినదియునైన, స్వ ప్రకృతిం=తన యొక్క అజ్ఞానమును, పరాభావ్య =అతిక్రమించి, స్వరూపేణ=స్వరూప భూతుడై, అవతిష్ఠతే=ఉండును.

తాత్పర్యము : ప్రకృతి, పురుషుడు -- వీరిరువురును ఒకరిని విడిచి ఒకరు ఉండరు. అందుచేత ముక్తి ఎట్లొర్పడును?ఈ ప్రశ్నకింతకుముందే ఉత్తరము చెప్పినాడు. దానిని మరల అనువాద మొనర్చి విషయము నుపసంహరించు చున్నాడు. ఇంతకుముందు చెప్పిన వైరాగ్య భక్తి జ్ఞానము లనెడు సాధన సంపత్తిలో భగవద్భక్తుడు దేవమను ష్యాది శరీరములకు కారణ భూతమైనదియు జీవాత్మకు మోహమును కల్గించునదియు, అచింత్యమైన మాహాత్మ్యముతో కూడినదైన ఈశ్వరమాయను సర్వేశ్వరుని మాయతో నతిక్రమించి బ్రహ్మ స్వరూపుడై పోవును. మరల వానికి సంసార మేర్పడదు. "తస్య తావదేవచిరం యావన్నవిమోక్ష్యేథ సంపత్స్యతే". వైరాగ్య భక్తిజ్ఞాన సంపన్నుడైన యోగియొక్క ప్రారబ్ధము నశించు వఱకును శరీరము నిలిచియే యుండును. తరువాత విదేహ కైవల్యమని పిలువబడుచున్న ముక్తిని వాడు పొందును. స్వస్వరూపముతో నుండునని సారము.

విజయధ్వజ వ్యాఖ్య

1.విరక్తుడై భగవంతుని యందు భక్తిగలవానికి శ్రీహరి యొక్క ఉపాసనతో నేర్పడెడు అపరోక్ష జ్ఞానముతో స్వరూపావిర్భావ రూపమైన మోక్షము ఏర్పడు నని చెప్పినట్లైనది ఇప్పుడు అట్టి జ్ఞానమునకు సాధనమైన అష్టాంగ యోగ ప్రకారము చెప్పుడు నని కపిల రూపుడైన శ్రీహరి ప్రతిజ్ఞచేయుచున్నాడు. నృపాత్మజే. యేన=ఏ విధిచేత, ఏవ=ఏ ప్రకారముచే, ప్రపన్నో=శ్రీహరిని శరణుజొచ్చిన, మనుః=మనస్సు, నత్పథం యాతి=పర బ్రహ్మ మార్గమును పొందును. తస్య=అట్టి, సబీజస్య= విష్ణు సహితమైన (విష్ణుదేవతాక మైనట్టి) యోగస్య=అష్టాంగ యోగము యొక్క, లక్షణం=లక్షణమును, వక్ష్యే=చెప్పబోవుదును.

"సబీజో వైష్ణవో యోగో నిర్బీష్ట్వ న్య దైవతః,
బీజం విష్ణుర్ని జగతః శాఖాద్యా అన్యదేవతాః."

అనెడు ప్రమాణానుసారము పై చెప్పినట్లే అర్థ మొనర్చ వలెను. సత్పథం అనెడు విశేషణము కూడ ఈ యర్థమునే తెలియజేయుచున్నది.

2.యోగము జ్ఞానమునకు సాధనము. దానికి సాధన మేది? అనఁగా చెప్పుచున్నాఁడు. ఇక్కడి నుండి ఆరంభించి ఆఱవశ్లోకము నందువచ్చు సమాధానం తథాత్మనఃⅱ అనువఱకు యోగసాధనము లని తెలియవలెను. శక్త్యా=శక్త్యనుసారము, స్వధర్మాచరణం, విధర్మాత్=ధర్మమువలె కనపడెడు శాస్త్ర నిషిద్ధమైనట్టి, ఐదురీతులైన ధర్మములను, నివర్తనం=వదలుటయు, దైవాల్లబ్ధేన=అదృష్టప్రేరకుఁడైన శ్రీహరి అనుగ్రహమున నిచ్చినంత మాత్రముతోనే, సంతోషఃⅲ=తృప్తుఁడైయుండుట, ఆత్మవిచ్చరణార్చనం=బ్రహ్మజ్ఞానుల పాదసేవ యొనర్చుట,(పైన చెప్పిన ఐదుధర్మములు ఈ క్రిందివి. దేశవిశేషము, కాల విశేషము, కాయికము, వాచికము,మానసికము).

3.గ్రామ్య ధర్మ నివృత్తిఃⅳ=శబ్దాది విషయములను సేవించుట యందు అనాసక్తుఁడుగా ఉండుట, (2) ప్రవృత్తి ధర్మము లొనర్చుకుడుట, తథా= అట్లే, మోక్షధర్మరతిఃⅴ=మోక్షకారణమైన నివృత్తి ధర్మమందే ఆసక్తిగలియుండుట, శశ్వత్=ఎప్పుడును, మితమేధ్యాదనం=శాస్త్రీయముగా శ్రీహరికి సమర్పించిన ఆహారమును మితముగా సేవించుట, వివిక్తక్షేత్రసేవనం=శ్రీహరి యొక్క సన్నిధానముతో కూడిన క్షేత్రములను సేవించుట (ఆహారమున కర్ధభాగము, వాయుసంచారమున కొక్కభాగము, నీటికొక్క భాగము. ఇది అహారసేవనములో నియమము.)

4. అహింసా=శాస్త్రనిషిద్ధమైన హింస నొనర్పకుండుట, సత్యం=జగత్తు మిథ్య యనువాదము నాశ్రయింప కుండుట, భూతములకు హితమైన మాటనే ఆడుట, అస్తేయం=యజమాని ఆజ్ఞలేక లవమైన తీసికొనకుండుట, యావదర్థ పరిగ్రహఃⅵ=యజమాని ఆజ్ఞలేక లవమైనతీసికొనకుండుట, యావదర్థ పరిగ్రహఃⅶ =శరీర పోషణమునకు తగినంతగనే పదార్థములను స్వీకరించుట, బ్రహ్మ చర్యం=ఎనిమిది విధములైన సుఖములనుండి దూరముగా నుండుట, తప= తపస్సు, ఉపవాసాదులు(2)తత్త్వముల నాలోచించుట, శౌచం=బాహ్యాభ్యంతరము లందు శుచిగా ఉండుట, స్వాధ్యాయఃⅷ=బ్రహ్మయజ్ఞము (శాస్త్రాధ్యయనము) పురుషార్చనం=శ్రీహరిని వేదమునందును, తంత్రములందును చెప్పిన మార్గము లతో పూజించుట. స్త్రీనిగాని పురుషుని గాని (1) ప్రేమించుట, (2) కీర్తించుట, (3) క్రీడించుట, (4) చూచుట, (5) రహస్యముగా మాటలాడుట, (6) సంకేత స్థల మందుచేరుట, (7) తీర్మానించుట, (8) ఇరువురును కలిసికొనుట-వీనికి మైథున ధర్మములని పేరు. దీనికి భిన్నమైనది బ్రహ్మచర్యము).

5. మౌనం=శ్రీహరికి సంబంధించిన విచారము తప్ప వేఱెద్దియు మాటలాడ కుండుట, సదా+ఆసనజయ స్థైర్యం=పద్మాసనము మొదలైన ఆసనము లందు కూర్చొను శ్రమము కల్గునట్లుగావానిని స్వాధీనములో నుంచుకొని యుండుట. వైష్ణవ సిద్ధాంతమునుండి చలింపకుండుట, ఎట్టి కష్టమునందును ధైర్యము వదల కుండుట, శనైఃⅸ=మెల్లగా, ప్రాణానాంజయఃⅹ=ప్రాణాయామముతో వాయువును జయించుట (వాయువు యొక్క అనుగ్రహము సంపాదించుట)

ఇంద్రియాణం=విషయములను, శబ్దాత్=శబ్దాది విషయముల నుండి మరల్చి, మనసా=మనస్సు చేత, హృది=హృదయమందున్న శ్రీహరివైపునకు, ప్రత్యాహారః =స్థాపించుట.

6. స్వధిష్ఠ్యానాం=శ్రీహరి పాదాది స్థానములను, ఏకదేశే=ఒక్కొక్క అవయవమందును, మనసా=మనస్సు చేత, ప్రాణధారణం=దాని వ్యాపారమును స్థిరముగా నుంచుట, వైకుంఠ లీలాభిధ్యానం=శ్రీహరి యొక్క క్రీడ లనిపించు కొనెడు సృష్టి స్థితి సంహారాది కార్యములను గూర్చి నిరంతర మాలోచించుకొనుట, తథా=అట్లే, ఆత్మనః=మనస్సు యొక్క, సమాధానం=ప్రయత్నములేకయే శ్రీహరి యందు నిమగ్నమై యుండుట.

7.ఏతైః=పైన చెప్పిన స్వధర్మాచరణాదులైనవానితోను, అన్యైశ్చ=ఇంకను అనేకములైన, పథిభిః=మార్గములతో, దుష్టం=దుర్విషయ సేవనముచే దుష్టమైన, అసత్పథం=అందుచేతనే దుర్మార్గములందు ప్రవర్తించెడు, మనః అతంద్రితః =ఏమాత్రము కాలహరణము లేక, జితప్రాణాః సన్=ఇంద్రియములను, జయించి, శనకైః=మెల్లగా, బుద్ధ్యా=బుద్ధిచేత, యుంజీత=శ్రీహరిధ్యానమందు నిలుపవలెను.

8. యోగాభ్యాస మొనర్చెడు రీతిని చెప్పుచున్నాడు. శుచౌ=పరిశుద్ధమైన, దేశే=ప్రదేశమందు, ఆసనం=హెచ్చుగానున్నదియు, ఎత్తును తగ్గును లేక సమానముగా నున్నట్టి పీఠమును ప్రతిష్ఠాప్య=స్థిరముగా నుండునట్లు స్థాపించి, విజితాసనః=ఆసనజయమును పొందిన యోగి, తస్మిన్=ఆ పీఠమందు, స్వస్తికే=స్వస్తికము మొదలైన, ఆసీనః=ఆసనములందు కూర్చొన్నవాడై, ఋజుకాయః=సరిగా నిట్రుగా నిలుపఁబడిన దేహము కలవాడై, యోగమును, సమభ్యసేత్=అభ్యసింపవలెను.

9.చిత్తం=మనస్సు, అచంచలం=స్థిరముగా, యథా= ఎట్లు, స్థిరం=నిలువ కలదో, తథా=ఆ రీతి, ప్రాణస్య=శ్వాస వాయువు యొక్క, మార్గం=మార్గమును, పూరక=వాయువును లోపలికి తీసికొనుట, కుంభక=లోపలికి తీసికొన్న వాయువును కొంతసేపటి నిలిపికొనుట, రేచకైః=వాయువును బయటికి వదలుట, వా=అట్లు కానిచో, ప్రతికూలేన=విపరీతమైన రేచక కుంభక పూరకములచేత, శోధయేత్=పరిశుద్ధ మొనర్ప వలెను.

10.ప్రాణాయామము యొక్క ఫలమును చెప్పుచున్నాడు. యథా=ఎట్లు వాయువు అగ్ని వీనిచేత, ధ్మాతం=శుద్ధముగా నొనర్పఁబడిన లోహధాతువు, మలం=తన యందున్న కశ్మలమును, త్యజతి=వదలు చున్నదో, తథా=అట్లు, జితశ్వాసస్య=ప్రాణాయామముతో శ్వాసమును వశపఱచుకొన్న, యోగినః=యోగి యొక్క, మనః=మనస్సు, అచిరాత్=స్వల్పకాలమునుండి, విరజం=రజోగుణ రహితముగా, స్యాత్=అగును.

11.ప్రాణాయామములచేత, దోషాన్=రాగాదిదోషములను ధారణాభిః =ధారణములతో, కిల్బిషాన్=జన్మాంతరమందు గడించిన పాపములను,

ప్రత్యాహారముచేత, సంసర్గాత్=దుర్జనులసహవాసముచే నేర్పడిన పాపమును ధ్యానముతో, అనీశ్వరాన్=అణిమాద్యైశ్వర్యములకు విరుద్ధమైన, గుణాన్=ప్రాకృతములైన సత్త్వాది గుణములను, దహేత్=దహింపవలెను.

12.మనస్సు దోషరహితమైన తరువాత ఒనర్పవలసిన కార్యమును చెప్పుచున్నాడు. యదా=ఎప్పుడు, మనః=యోగి యొక్క మనస్సు, విరజం=శుద్ధమైనదై, యోగేన=ఏకాగ్రతతో, సుసమాహితం=స్థిరమైన సమాధి యుక్తమై(భవతి=అగుచున్నదో) తదా, స్వనాసాగ్రావలోకనస్సన్=తననాసిక యొక్క కొనయందు నిక్షేపించిన దృష్టి కలవాడై, భగవతః=శ్రీహరియొక్క, కాష్ఠాం=విముక్తిని, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

13.....18.యావత్=ఎంతవఱకు, మనః, న చ్యవతే=శ్రీహరి మూర్తిధ్యానము నుండి చలితము కాదో, తావత్=అంతకాలమును, ప్రసన్న వదనాంభోజం=ప్రసాదయుక్తమైన ముఖకమలము గలిగినట్టి, పద్మగార్భారుణేక్షణం=పద్మము యొక్క లోపలిభాగమువలె ఎఱ్ఱనైన కన్నులు గలట్టియు, నీలోత్పలదళశ్యామం=నలకలువ రేకువలె, నీలమైన శరీరము కల్గినట్టియు, శంఖచక్రగదలను ధరించినట్టియు లసత్పంకజ కింజల్కపీతకౌశేయవాససం=చక్కగా వికసించిన కమలము యొక్క పరాగమువలె పచ్చనైన పట్టుపీతాంబరమును ధరించినట్టియు, శ్రీవత్సవక్షసం=శ్రీవత్సమనెడు పుట్టుమచ్చను వక్షఃస్థలమందు కలినట్టియు, భ్రాజత్కౌస్తుభముక్తకంధరం=ప్రకాశమానమైన కౌస్తుభరత్నముచేత కూడిన కంఠము గలట్టియు, మత్తద్విరేఫకలయా=మదించిన తుమ్మెదలచేత ఆకులముగా ఉన్నట్టి, వనమాలయా=వనమాలచేత,పరీతం=కూడినట్టియు, పరార్ధ్యహారవల య కిరీటాంగద నూపురం=అమూల్యములైన హారములు, కటకములు, కిరీటములు, బాహుపురులు, నూపురములు-వీనిచేత కూడినట్టియు, కాంచీగుణోల్లసచ్ఛ్రోణిం=నడుము పట్టయొక్క కాంతిచేత ప్రకాశించు నితంబ ప్రదేశము గలట్టియు, హృదయాంభోజ విష్టరం=భక్తుల హృదయ కమలమే పీఠముగా ఉన్నట్టియు, శాంతం=శాంతమైనట్టియు, దర్శనీయతమం=అత్యంత సుందరమైనట్టియు, మనోనయనవర్ధనం=మనస్సు కన్నులు వానికానందము కల్గించునట్టియు,అపీచ్యదర్శనం=పదునారేండ్ల ప్రాయము కలవానివలె కన్పించెడు, శశ్వత్=ఎప్పుడును, సర్వలోక నమస్కృతం=సమస్తజనులచేత నమస్కారము పొందునట్టియు, కైశోరే వయసి=కిశోరావస్థయందు, సంతం=ఉన్నట్టి భక్తాను గ్రహాకాతరం=భక్తుల ననుగ్రహింప వలెననెడు ఆతురతో కూడినట్టియు. కీర్త్యన్యతీర్థ యశసం=అందరిచేతను కీర్తింపతగిన పరిశుద్ధమైన కీర్తిగలట్టియు, పుణ్యశ్లోక యశస్కరం=పవిత్రకీర్తిగలవారైన బ్రహ్మాదిదేవతలకు సృష్ట్యాది కార్యముల నుండి కీర్తిని సంపాదించిపెట్టెడు, సమగ్రాంగం=సమస్తావయవములతో కూడిన, దేవం=శ్రీహరి మూర్తిని, ధ్యాయేత్=ధ్యానింపవలెను. ఇట్లు వర్ణించుటచేత 'కాష్ఠాం' అనుదానికి అనేకార్థములుండుట వలన ఇచ్చట వివక్షిత మైనది సమస్తగుణములతో నుత్కృష్టమైన శ్రీహరి యొక్క స్వరూప మని తెలిపినట్లైనది.

19.శుద్ధభావేన=ఇతర విషయముల నాలోచించుటచేత అపరిశుద్ధము కాని, చేతసా=మనస్సుతో, స్థితం=హృదయమందున్న, వ్రజంతం=జీవన పాతుడై, పంచప్రాణయుక్తుడై పోవుచున్న వానిగానో, ఆసీనం=సమాధి యందున్న వానిగనో, శయానం=నిద్రించుచున్న వానిగానో, గుహాశయం=హృదయగుహ యందున్న, వా=అథవా, ప్రేక్షణీయేహితం=చూచుటకు తగినచేష్టగల వానినిగా, ధ్యాయేత్.

20. ఇట్లు శ్రీహరి యొక్క సర్వావయవముల ధ్యానము చెప్పి దాని నొనర్చుటకు సౌధ్యము కానిచో ఒక్కొక్క అవయవమును ధ్యానించెడు రీతిని తెల్పుచున్నాడు. మునిః=మనన శీలుడైనవాడు, తస్మిన్=శ్రీహరి యందు, లబ్ధపదం=సమస్తములైన అవయవములందును ఆస్పదత్వమును పొందిన, సర్వావయవ సంస్థితం=సమస్త అవయవములను వ్యాపించికొని యున్న, చిత్తం=తనమనస్సును, విలక్ష్య=చూచి, సమస్తేంద్రియములను స్మరించుటకు అశక్తుడైనచో, భగవతః=పరమాత్మయొక్క, ఏకత్ర అంగే=పాదములు మొదలు కొని శిరస్సువరకు ప్రత్యేక అవయవములందు, సంయుజ్యాత్=భక్తితో మనస్సును చేర్చవలెను(అనగా ధ్యానింపవలెను) సర్వం స్మర్తు మశక్తస్సన్ ఏకాంగం చింతయే ద్బుధః "అని ప్రమాణము.

21. పై శ్లోకమందు వేరు వేరు అవయవములందు ఆసక్తమైన మనస్సును, ఏకత్ర=అనగా ఐక్యభావనతో ధ్యాన మొనర్పవలెనని అర్థము చెప్పవలెనేకాని అశక్తుడైనవాడు ఒక్కొక్క యవయవమునే ధ్యాన మొనర్పవలె నని చెప్పలేదుకదా!అని ఆశంకించినచో ఈ పైన ఒక్కొక్క అవయవమును గూర్చి చెప్పి నందువలన పై చెప్పిన అర్థమే సరియైనదని తెలియవలెను. ఇట్లే అర్థమొనర్చి కొనవలెనని శ్రీహరి యొక్క ఒక్కొక్క ఇంద్రియమును విశేషణ విశిష్టముగా చెప్పుచున్నాడు. వజ్రాంకుశ ధ్వజసరోరుహలాంఛనాఢ్యం=వజ్రరేఖ, అంకుశరేఖ, ధ్వజరేఖ, పద్మరేఖ=ఈ చిహ్నములతో కూడి యున్నట్టియు, ఉత్తుంగ=ఎత్తైనట్టియు రక్త=ఎఱ్ఱనైనట్టియు, విలసత్=ప్రకాశించు చున్నట్టియు, నఖ=గోరులు అనెడు చక్రవాళ=చంద్రమండలముయొక్క, జ్యోత్స్నాభిః=వెన్నెలల చేత, ఆహత=నాశ మొనర్పఁబడిన, మహత్=అభ్యాస మొనర్చు మహా యోగుల యొక్క, హృదయాంధకారం=చీఁకటి గల్గినట్టి, భగవతః=శ్రీమహావిష్ణువు యొక్క, చరణారవిందం=పాదమనెడు కమలమును, సంచింత యేత్=ధ్యానింపవలెను.

22.యత్=శ్రీహరి యొక్క పాదముల యొక్క, శౌచ=కడగుట చేత, నిస్సృత=బయలు దేరినట్టి, సరిత్ప్రవరోదకేన=నదుల యందు శ్రేష్ఠమైన గంగ యొక్క నీటి చేత, తీర్థేన=పావన మగుటతో, మూర్ధ్ని=తలపైని, అధిధృతేన=జటాసమూహమందునిలిపికొని ధరించుట చేత, శివః=రుద్రుడు, శివః=ఎక్కువైన పుణ్యమున కర్హుడై అభూత్=అయ్యెనో, అంతేకాక ఏది, ధ్యాతుః=ధ్యానించువాని, మనః=మనస్సునందున్న, శమలశైల=పాపములనెడు పర్వతము పైకి, నిసృష్టవజ్రం=నాశమునకై ప్రయుక్తమైన వజ్రాయుధమువలె నున్నదో అట్టి శ్రీహరి పాదములను, చిరం=చాలకాలము, ధ్యాయేత్=ధ్యానింప వలెను.

23. సుపర్ణభుజయోః అధి=గరుడ దేవుని యొక్క స్కంధమునైన, శోభమానే=ప్రకాశించు చున్నట్టియు, ఓజోనిధీ=బలమునకు నిధులతో సమానమైనట్టియు, అతసికాకుసుమప్రభాసౌ=పుష్పించినట్టి అవిసెవృక్షము యొక్క పూలవంటి ప్రకాశముగలిన, భగవతః=భగవంతుని యొక్క, ఊరూ=రెండు కాడలను, ధ్యాయేత్ =ధ్యానింపవలెను. హే అంబ!=ఓ తల్లి! వ్యాలంబి పీతవరవాససి=పాదాగ్రముల వరకును వ్యాపించి యున్న పచ్చని వర్ణముకల శ్రేష్ఠమైన వస్త్రము నందు, వర్తమాన కాంచీ కలాప పరిరంభ=ప్రకాశించుచున్నట్టి ఏడువరుసలు కలనడుము పట్టిక యనెడు సొమ్ముచేత చుట్టఁబడిన నితంబ బింబమును, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

24. యత్ర=ఏ, గంభీరమైన నాభీ మండలమునందు, ఆత్మయోని ధిషణాఖిల లోకపద్మం=బ్రహ్మదేవుని యొక్క గృహమును పోలినది. పదునాల్గు లోకముల యొక్క స్వరూపమైన పద్మము, వ్యూఢం=ఉత్పన్నమయ్యెనో అట్టి, భువనకోశ గుహోదరస్థం=(1) పదునాల్గులోకముల యొక్క గృహమైన బ్రహ్మాండము లను లోపల నెలకొల్పికొని యున్న ఉదరమందున్నంట (2)బ్రహ్మాండమును గ్రసించుట యందు గుహవలె నున్న ఉదరమందు (3) బ్రహ్మాండము లోపలనున్న నీటియందు రమించుచు ఉన్నట్టి భగవతః=శ్రీహరి యొక్క, నాభిహ్రదం=మడుగు వలె విస్తారము లోతైనట్టి బొడ్డును, ధ్యాయేత్=ధ్యానింపవలెను.'ఆత్మయోని ధిషణాఖిలలోకపద్మం' అను విశేషణమునకు తగినట్లుగా'నాభిహ్రదం'అని పొందు పఱిచినాఁడు. పైఁగా నాభీమండలము లోతుగానుండుట సౌందర్య ద్యోతకము'హరిన్మణివృషః'ఇంద్రనీల మణియొక్క కాంతిని ఆకర్షించుకొన్నట్టున్న అముష్య=నారాయణ మూర్తియొక్క, వితతహార మరీచి గౌరం=విస్తారమైన హారము యొక్క కిరణములచేత, తెల్లగా నున్నట్టి, స్తనయోర్వ్యయం=స్తనముల యొక్క జంటను, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

25. పుంసాం=స్మరణ మొనర్చెడు పురుషుల యొక్క, మనోనయన నిర్వృతిం=మనస్సునకును కన్నులకును ఆనందమును, అనుధానం= కల్గించునట్టియు, మహావిభూతేః=లక్ష్మీదేవికి, అధివాసం=నివాస స్థలమైన, అఖిలలోక నమస్కృతస్య=సమస్తజనులచేతను నమస్కారములందునట్టి, ఋషభస్య= సర్వోత్తముఁడైన నారాయణుని యొక్క, వక్షః=వక్షః స్థలమును మనస్సునందు, కుర్యాత్=ధ్యానింపవలెను. కౌస్తుభమణేః=కౌస్తుభ మనెడు రత్నమునకు, అధిభూషణార్థం=అధికముగా అలంకారముగా నుండుటయే ప్రయోజనముగాఁ గలిన, కంఠం=కంఠదేశమును, మనసి కుర్యాత్=ధ్యానింప వలెను. 'అఖిలలోక నమస్కృతస్య' అనుటచేత వృషభస్య అను దానిని సమర్థించు చున్నాఁడు.

26. మందర గిరేః=మందర పర్వతము యొక్క, పరివర్తనేన=సముద్రమందు చుట్టును త్రిప్పుటచేత, నిర్నిక్తబాహువలయాన్=శోభించుచుండెడు బాహు పురులుగల, అదిలోకపాలాన్=ఇంద్రాదులైన లోకపాలురచేత, ఆశయింపఁబడు శ్రీహరి యొక్క, బాహూంశ్చ=బాహువులను, అసహ్యతేజసః=శత్రువులకు ఓర్చు

కొనుట కశక్యమైన తేజస్సు గల్గిన, దశశతారంచ=వేయి అంచులుగల చక్రాయుధమును, తత్కరసరోరుహరాజహంసం=శ్రీహరి యొక్క చేయి అనెడు కమలమందు ప్రకాశించుచున్న రాజహంసతో సమానమైన, శంఖం చ=పాంచ జన్య మనెడు శంఖమును, సంచింతయేత్=భక్తితో ధ్యాన మొనర్పవలెను.

27. అరాతిభటశోణిత కర్దమేన=శత్రువుల యొక్క రక్తమనెడు బురదచేత, దిగ్ధాం=సంపూర్ణముగా కూడియున్న, భగవతః దయితాం=భగవంతునకు ప్రీత్యాస్పదమైన, కౌమోదకీం=కౌమోదకి యనెడు గదను, అన్యకంఠే=ఆతని కంఠమం దుండెడు, మధు వ్రతవరూధగిరా=తుమ్మెదల యొక్క ఝుంకార శబ్దముతో, ఉపఘుష్టాం=సశబ్దమైనట్టి, మాలాం=వనమాలను, చైత్యస్య=చిత్తాభిమాని యైన(బ్రహ్మదేవుని యొక్క, తత్త్వం=స్వరూపమైన, అమలం=పరిశుద్ధమైన, మణిం చ=కౌస్తుభరత్నమును, స్మరేత్=ధ్యానింపవలెను. చిత్తమున కభిమాని దేవత యగుటచేత బ్రహ్మదేవుడు అతని యందు నియామకుడై యుండుట వలన శ్రీహరియు చైత్యుఁడని పిలువఁ బడుదురు. ఆ బ్రహ్మదేవుఁడు శ్రీహరి కంఠమందు కౌస్తుభ రత్నముగా ప్రకాశించుచున్నాఁడు. ప్రమాణము-

"బ్రహ్మా చిత్తాభిమానేన చైత్యస్తన్నియమా దరిః,
స చ బ్రహ్మా హరేః కంఠే కౌస్తుభత్వేన భాసతే."

28. యత్=ఏది, విస్ఫురన్మకర కుండల వల్గితేన, విద్యోతితామల కపోలం=కొదిగా కదలాడుచున్న మకర కుండలముల నర్తనముతో ప్రకాశమానములై నిర్మలములైనట్టి రెండు కపోలములు గల్గినట్టియు, ఉదారనాసం=ఉన్నతమైన నాసికతో కూడినదో, అత్=అట్టి, ఇహ=జగత్తునందు, భృత్యానుకంపితధియా=భక్తులను అనుగ్రహింపవలెననెడు కనికరముతో గూడిన మనస్సుచేత, గృహీతమూర్తేః= వ్యక్తముగా కన్పించెడు ఆకారావిశేషమును గ్రహించిన, భగవతః=పరమాత్ముని యొక్క, వదనారవిందం=ముఖకమలమును, సంచింతయేత్=భక్తితో ధ్యానింపవలెను. శ్రీహరి దేహసంబంధము చేత అలంకారముల కలంకారత్వ మేర్పడుచున్నదేగాని వానితో పరమాత్ముని దేహమునకు శోభ పెచ్చుట లేదనియే అభిప్రాయము.

29. యత్=ఏ పరమాత్ముని ముఖము, శ్రీనికేతం=సకలమంగళములకును నివాసభూమియో, అళిభిః=తుమ్మెదలచేత, పరిసేవ్యమానం=సేవింపఁబడుచున్నదో, అనఁగా తుమ్మెదలు ముఖసౌరభ్యమునం దాసక్తి గలవై చుట్టును మూగి యున్నవని అర్థము. స్వయా=స్వరూపభూతమైన, భూత్యా=కాంతిచేత, సేవితం=కూడియున్నదో, కుటిలకుంతల బృందజుష్టం=వక్రములైనకేశములతో చేరి యున్నదో, మానద్వయాశ్రయం=రెండు చేపల యొక్క మధ్యమందు స్పష్టముగా నుండుట అనఁగా కన్నులు చేపలవలె మొదట విశాలమై కొనల యందు సన్నగా ఉన్నవన్నమాట. అట్టిచేపల సౌందర్యమును, అధిక్షిపత్=ధిక్కరించెడు కాంతికల్గిన, అబ్జనేత్రం=కమలములవలె నున్న కన్నులతో కూడియున్నదో, ఉల్లసద్భ్రూ=తఱచుగానున్న రెప్పలచేతకూడుకొన్నదో, మఱియు,

మనోమయం=ధ్యాన మొనర్చెడు మనుష్యుని యొక్క సంకల్ప స్వరూపమైనదో ఆ వాసనామూర్తి యందుండెడు, తద్భిన్నమై తేజోమయమైన శ్రీహరి యొక్క మూర్తిని, తత్=అట్టి శ్రీహరియొక్క ముఖకమలమును, అతంద్రితః=సోమరితనము లేక నిరంతరమును, ధ్యాయేత్=ధ్యానింపవలెను.'స్వయా'అని భూతికి విశేషణము వేసిన దానివలన శ్రీహరి స్వరూపభూతమైన భూతిస్వరూపము కానట్టి భూతి అని రెండురీతులుగా విభాగించి యున్నాడు. 'శ్రీ'అనెడు శబ్దమునకు ముఖ్యవాచ్యము పరమాత్ముని యొక్క స్వరూప భూతమైన కాంతి విశేషము. లక్ష్మి అన్నది శ్రీహరిని ఆశ్రయించికొన్న కాంణముచేత శ్రీ అని పిలువఁబడు చున్నది.

'సాక్షాత్ శ్రీస్తు హరే రూపం ఇందిరాత్తు తదాశ్రయాత్' అని ప్రమాణము.

30. గుహాయాం=హృదయ గుహయందు నివసించెడు, తస్య=ఆ పరమేశ్వరుని యొక్క, అధికకృపయా=ఇతరులచే నసాధ్యములైన కార్యములను సాధించుట యందు సమర్థమైన దయచేత, అతిఘోర తాపత్రయోపశమనాయ=అత్యంత భయంకరములైన త్రితాపములను సంపూర్ణముగా పోగొట్టుటకు, అక్ష్ణోః=కన్నులనుండి, నిసృష్టం=బయటికి వచ్చిన, స్నిగ్ధస్మితాను గుణితం=సుందరమైన చిరునగవు చేత కూడినట్టియు, విపుల ప్రసాదం=అతియమైన ప్రసన్నత కల్గిన, అవలోకం=చూపును, వితతభావనయా=ఎక్కువ భక్తిచేత, చిరం=బహుకాలము, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

31. అవనతాఖిలలోకతీవ్రశోకాశ్ర సాగర విశోషణం=నమస్కార మొనర్చెడు సమస్తము యొక్క దుఃఖనిమిత్తముగా నేర్పడిన కన్నీటి సముద్రమును సమగ్రముగా నశింపజేయునట్టియు, అత్యుదారం=ఎక్కువగా అనుగ్రహమును తోపింపజేసెడు, హారేః హాసం=మందస్మితమును, ధ్యాయేత్=ధ్యానింపవలెను. మనస్సుచే మనువు పుత్రియైన దేవహూతి నిజమాయయా=తన ఇచ్ఛచేత, మకరధ్వజస్య=మన్మథునకును, సమ్మోహనాయ=మోహమును గల్గించుటకు, రచితం=నిర్మితమైన, అన్యభ్రూమండలం=ఆ పరమాత్ముని భ్రూమండలమును, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

32.ఈ రీతిగా ఒక్కొక్క అవయవమునే ధ్యానించుటయందు మనస్సును పరినిష్ఠముగా చేసికొన్న ఉపాసకుఁడు సమస్త అవయవములతో కూడిన శ్రీహరి మూర్తిని ధ్యానింపవలసిన రీతిని చెప్పుచున్నాఁడు. రహసి=ఏకాంత మందు, స్వహృత్కమలకోశే=తన యొక్క హృదయ గుహ యందు, అవసితస్య=నిశ్చయముగా ప్రతిష్ఠితుఁడైన, విష్ణోః=శ్రీహరి యొక్క, బహుళాధరోష్ఠభాసారుణాయిత తనుద్విజ కుందపంక్తి=అధరోష్ఠము యొక్క ఎఱ్ఱనైన కాంతులచేత ఎఱ్ఱబారిన కుంద పుష్పముల యొక్క మొగల వలె ఉండెడి పండ్లు కలిగిన, ధ్యానాయనం=ఒక్కొక్క అవయవమునకు సంబంధించిన ధ్యానమునకే అస్పదమైన యున్న, వపుః=మూర్తిని సమగ్రముగా, ధ్యాయేత్=ధ్యానింపవలెను. ఆర్ద్ర

యా=స్నేహముతో కూడిన, భక్త్యా=మాహాత్మ్యజ్ఞాన పూర్వకమైన భక్తిచేత, అర్పితమనాఃశ్రీహరి యందే నెలకొన్న మనస్సు కల వాడై అ పరమేశ్వరుని మూర్తినే, దిదృక్షే=చూడనిచ్చింపవలెను. పృథక్=దాని కంటెభిన్నమైన పదార్థమును ముక్తిదాతయని, న దిదృక్షేత్= చూడ నిచ్చగింపఁగూడదు.

33. పైన చెప్పినట్లుగా ధ్యాన మొనర్చువానికి కలిగెడు ఫలమును చెప్పుచున్నాడు. ఏవం=పైన చెప్పినట్లుగా, భగవతి=సర్వోత్తముడైన, హరౌ=శ్రీహరి యందు, ప్రతిలబ్ధ=పొందిన, భావఃమనోభావము కలిగిన యోగి, భక్తిచేత, ద్రవత్=శ్రీహరి యందు స్నేహపూరితమైనదే, హృదయఃసన్=మనస్సు కలవాడై, ఉత్పులక(ప్రమోదఃఉత్కృష్టమైన రోమాంచము ఆనందము ఈ రెండును కలవాడై, ఔత్కంఠ్య బాష్పకలయా=శ్రీహరిని పొందవలెననెడు తీవ్రమైన ఆసక్తితో కూడిన కన్నీటి బిందువులచేత, ముహుఃపై పైన, అభ్యమానఃకూడినటి, యత్=ఏ, చిత్తబడిశం=మనస్సనెడు కొక్కిని లక్ష్యముపై, క్షిప్పియుండని తచ్చిఅపి=అ మనస్సును కూడ, శనకైఃమెల్ల మెల్లఁగా, తన వశమగుటచేత, వియుంక్తే=విశేషముగా చేర్చును. ధ్యానానంతరము ఏ ప్రయాసములేక సమాధి లీనుం డగునని అర్థము.

34. ప్రాకృతమైన అంతఃకరణము నష్టమై శ్రీహరిని వదలి మఱియొక్క వస్తువు ముక్తిప్రదమైనదని స్మరింపక నిరాయాసముగా సమాధిస్థుడై శ్రీహరిని ధ్యానించి నందులకు కలుగు ఫలములు చెప్పుచున్నాడు. యథా=ఎట్లు, అర్చిఃదీపము యొక్క జ్వాల, నూనె వత్తులు ముగిసిపోయిన తరువాత, సహసా=ఉన్నదున్నట్టుగనే, నిర్వాణం=నాశమును, ఋచ్ఛతి=పొందుచున్నదో, తథా=అట్లు, యది=ఎప్పుడు, విరక్తం=స్వరూపభూతమైన జీవచైతన్యమందు, వ్యాప్తమైనట్టిదై (చిదానందాత్మక మైన దేహమే తన దనెడు అభిమానముతో కూడినదై) మనఃమనస్సు, నిర్విషయంసత్=శబ్దాది విషయములను దూర మొనర్చి, ముక్తాశయం=నిత్య ముక్తుడైన శ్రీహరిని విషయ భూతముగా నొనర్చు కొనునో, తదా=అప్పుడు, నిర్వాణం=చిదేహాభిమాన ఫలమైస్థూల సూక్ష్మదేహముల అభిమానమును వదలినటిదై, ఋచ్ఛతి=ఏర్పడును. అత్ర=ఈ యవస్థయందు పురుషఃఉపాసకుడైన జీవుడు, ప్రతినివృత్త గుణ ప్రవాహఃసంసార ధర్మము పోయిన వాడై, ఆత్మానం=శ్రీహరిని, ఏకం=సర్వోత్తముడైన వాడని, అవ్యవధానం=తనకును శ్రీహరికిని మధ్య మాయారూపమైన గోడ లేకుండునట్లు సాక్షాత్తుగా, అన్వీక్షతే=చేతి యందున్న ఉసిరికను చూచునట్టుగా అపరోక్షముగా వీక్షించును. బింబము మొదలైనవి దేని దేనిని చూచునో దానినంతయు చూచునని భావము. అనఁగా శ్రీహరి యొక్క అపరోక్షమే సమాధికి ఫలమని చెప్పినట్లైనది.'నివృత్త గుణ ప్రవాహఃʼ అనుటచే అపరోక్షమునకు ప్రతిబంధకమైన సంసారము కూడ పోయినదని చెప్పుచున్నాడు. లేక యదా=ఎప్పుడు, మనఃబాహ్యమైన మనస్సు (అనఁగా జడ రూపమైనది) నిర్వాణమృచ్ఛతి=దీపము యొక్క జ్వాలవలె తొందరగా నాశము నొందునో, తదా=అప్పుడు, స్వచిత్తం=తన యొక్క స్వరూపాంతఃకరణమును, స్తిమిత తైలపాత్రయందుండు తైలము మనుష్యులు లేనప్పుడు తన ప్రకాశ మనెడు

ఆనందమునెట్లు పొందునో అట్లు, నిర్వాణం=పరమానందము నొందును. అత్ర=ప్రకాశమానముగా నున్న దీపములలె అంతఃకరణము విజృంభించినపుడు ప్రమిద మొదలైన పదార్థములవలె, ఏకం=ప్రధానము అవ్యవధానం=స్వరూపాచ్ఛాయిక యనెడు మాయనుండి వ్యవధానములేనిదై, ఆత్మానం=తన స్వరూపమును మరియు తనకు ప్రియమైన శ్రీహరిని, అముం=సృష్టిమొదలైన లక్షణముల చేత కూడినదానినిగా, ఈక్షతే=చూచును.

తాత్పర్యము : సమాధి యొక్క ఫలమై మనస్సు ప్రాప్తవిషయములను దూర మొనర్చుకొని నిత్యముక్తుడైన శ్రీహరినే విషయీకరించుకొనును. స్వరూపభూతమైన చిదాత్మక దేహమే తనది యని భావించికొని ఈ స్థూల దేహాభిమానము సంపూర్ణముగా వదలి వేయును. దీపజ్వాలతైలమువత్తులు అయిపోయినపుడు తనకు తానే ఉపశమించునట్లు ఈ స్థూల మనస్సు స్థూల సూక్ష్మదేహము లందలి అభిమానమును విడిచి నిర్విషయమగును. అప్పుడు శ్రీహరి యొక్క అవరోక్షమునకు ప్రతి బంధకమైయున్న సంసారము కూడ నాశన మగును. ఇట్లు జీవన్ముక్తుడైన అపరోక్షజ్ఞాని బాహ్యమనస్సు నివృత్త మగుట చేత సచ్చిదానంద స్వరూపమును తెలిసికొన్న వాడై నిరోష జ్ఞానానంద స్వరూపుడైన శ్రీహరికి తా నధీనుడని తెలిసికొని అతని యొక్క సచ్చిదానంద స్వరూపము చూచును. లౌకిక సుఖదుఃఖములకు బాహ్యాంతఃకరణము కారణము. అది లేనిదానివలన అభిమానశూన్యుడయ్యు కారణమైన దేహాభిమానమే లేనపుడు వానికి లౌకిక సుఖదుఃఖములే ఉండవు కదా! శ్రీహరి అపరోక్షముతో నిరంతరమును ఆనందమందు మునిగి యున్న యోగికి తన కడపటి దేహమందు కూడ అభిమాన ముండదు.

35. పై రెండు శ్లోకములతో జీవన్ముక్తిని అవస్థను చెప్పుచున్నాడు. సః అపి=ఈ జీవన్ముక్తుడు కూడ, ఏతయా=ఈ, చరమయా=సంసారము యొక్క కడపట నుండెడు, మనసః నివృత్యా=బాహ్య మనస్సు నాశము వలన, సుఖ దుఃఖబాహ్యా=లౌకిక సుఖదుఃఖములు లేనట్టి, తస్మిన్=అంతకు ముం ద జ్ఞానముచే నావృతమై యిప్పుడు బ్రహ్మజ్ఞానముతో ప్రకాశమునకు వచ్చిన తన యొక్క, మహిమ్ని=స్వరూప జ్ఞానానంద స్వరూపమైన మహిమ యందు, అవసితః సన్=నిర్ణీషయు, జ్ఞానానంద స్వరూపుడు అయిన తాను శ్రీహరి కధీనుడైనాడని నిశ్చయమును పొంది, ఉపలబ్ధపరాత్మకాష్ఠః=పరమాత్ముని సచ్చిదానందరూపమును వీక్షించినవాడై, దుఃఖయోః=సుఖదుఃఖములకు, కర్తరి=కారణమైన, బాహ్యాంతః కరణము, అసతి=నాశమొందగా, స్వాత్మని=తన యందు, దుఃఖయోః=సుఖదుఃఖములకు, హేతుత్వం=కారణమైన అభిమానమును, న విధత్తే=పొందుట లేదు. దుఃఖయోః అని ద్వివచనమును చెప్పుటచేత, 'దు' అనగా దుఃఖమనియు, 'ఖ' అనుటచే సుఖమనియు కనుక ఈ పదముచేత సుఖ దుఃఖములు రెండింటినీ గ్రహింపవలెను. ప్రమాణము.

"దుర్దుఃఖ మితి విజ్ఞేయం ఖం సుఖం చ తయోర్యతః,
ప్రదాతా పరమో విష్ణుః తస్మాత్ దుఃఖదనామవాన్"

అనెడు ప్రమాణము ఈ అర్థమును స్పష్టపఱచు చున్నది. 'చరమయా అనుట చేత ప్రతి దినమును నిద్రయందు అంతఃకరణనివృత్తి యున్నదికదా!మఱి దుఃఖాభిమానము లేదనుటకు ఇదెట్లు కారణము? అనెడు ఆశంకకు సమాధాన మిచ్చినట్లైనది. సంసారము యొక్క కొనయందు ఏర్పడిన ఈ మనోవృత్తి దుఃఖాది జనకములైన అభావమునకు కారణ మగుచున్నది.

36. అపరోక్ష జ్ఞాని సచ్చిదానందాత్మకమైన శ్రీహరి యొక్క దర్శన మనెడు అమృత సముద్రమందు మునిగి యుండును. అందుచేత దేహషోషణ మొదలైన వాని యందు వాని ప్రయత్న ముండదని చెప్పుచున్నాఁడు. - సిద్ధాఃశ్రీహరి అపరోక్షమును పొంది, ఆనందమగ్నుఁడైన జీవన్ముక్తుఁడు, మదిరామ దాంధఃమధుపాన మత్తుఁడైన వాఁడు, యథా, పరివృతంచుటుకొని యున్న, వాసఃబట్టను, దైవాత్తన ప్రయత్నము లేకనే అదృష్టవశముగా ఉపేతంతన దేహము తోనేవచ్చుటను, అథతన ప్రయత్నము లేకయే, అపేతంతన దేహమందు లేని దాని యట్టును, నపశ్యతితెలియుటలేదో, తథాఅట్లు, యతఃఏదేహమునుండి, స్వరూపంతన యొక్క స్వరూపమును, శ్రీహరి స్వరూపమును, అధ్యగమత్తెలిసికొన్నాఁడో, తంఆ సాక్షాత్కారమునకు కారణమైన, చరమందేహంకడపటి దేహమును, సితంప్రేరణచేత ఉన్నటి దానిగానో, వాఅథవా, ఉతితంతన ప్రేరణ లేకయే జారిపోవుటను, నతు విపశ్యతిఇది తన దేహ మనెడు అభిమానముతో చూచుట లేదు అయినను సెంకాయ చిప్పలోని చిప్పను వదలిన యెండుకొబ్బరి వలె దేహము, జీవుఁడు భిన్న లగుటచేత తనస్వామి యని శ్రీహరినే చూచును. దీనిచేత శ్రీహరి యొక్క సాక్షాత్కారమునకు కారణ మని చెప్పుటకూడ వివరించినట్లైనది.

37. ఈ రీతిగా శ్రీహరి నపరోక్షించికొన్న ధ్యాని యొక్క దేహము అపరోక్షమైనంతనే తొలఁగి పోవునా? లేక కొంతకాల ముండునా? అని సంశయము రాఁగా ప్రారబ్ధకర్మము నశించు వఱకును దేహముండునని చెప్పుచున్నాఁడు. దైవవశగఃఅదృష్టనియామకుఁడైన శ్రీహరి ఇచ్ఛచేత నేర్పడిన, దేహోఽపిచరమదేహము కూడ, యావత్ఎంతవఱకు, స్వారంభకందేహము నకు కారణమైన, కర్మప్రారబ్ధకర్మము, భవతిఉండునో, తావత్అంతవఱకు, సాసుఃఇంద్రియములతో కూడినదై, ప్రతి సమీక్షత ఏవతా నూడి పోవుటకు కాలమును నిరీక్షించుచునే యుండును. ప్రారబ్ధము నాశమైనంతనే పడిపోవును. ఖలుఇది శాస్త్రసిద్ధము అయినను, అధి రూఢ సమాధి యోగఃశ్రీహరి యొక్క అపరోక్షసిద్ధిని వడసిన, సఃసిద్ధపురుషుఁడు, స్వాప్నం స్వప్నమునం దేర్పడిన వాసనా దేహమును, ప్రతిబుద్ధవత్హెచ్చరిక కల్గిన తరువాత, తన దని తెలిసికొని రక్షణకు ప్రయత్నింపక ఉండునట్లు, సప్రపంచంఇంద్రియములతో కూడిన, తంఆ దేహమును, పునఃమరల నే భజతేతనదని తెలిసికొని తద్రక్షణ యందు ప్రయత్నించుట లేదు.

38. దేహమునే అందరును నేనని భావించుచుందురు కదా! అటిచో దానియందు నిరభిమాన మనఁగా మరణము తప్ప వేరు గాదని దేహోత్మ వాదుల మతమును ఖండించుచున్నాఁడు. యథాఎట్లు, పుత్రాచ్చతనవాఁడని తెలిసికొన్న కుమారుని నుండియు, విత్తాచ్చదబ్బునుండియు, మర్త్యః

=మరణవిషయమైన దేహము, పృథక్=వేఱుగా ప్రతీయతే=తోఁచునో, తథా, పురుషః=జీవుఁడు, ఆత్మత్వేన అభిమతాత్=తానే అని తెలిసికొన్న, దేహాదేః అపి=దేహాదుల కన్నను, పృథక్=వేఱుగా, ప్రతీయతే= అనుభవమునకు విషయీభూతుఁడుగా ఉండును. 'అపి'అనుటతో దేహాత్మవాదము నింద్యమని సూచించినట్లైనది.

39, 40. ఇప్పుడు జీవపరమాత్మలు భిన్నులే యని చెప్పుచున్నాఁడు యథా=ఎట్లు, ఆత్మత్వేన అభిమతాత్=అగ్నియే యని తోఁచుచున్న, ఉల్ముకాత్=కాష్ఠము నుండియు, విస్ఫులింగాత్=అగ్నికణమునుండియు, స్వసంభవాత్=సులభముగా పుట్టెడు,ధూమాత్ వా అపి=పొగ నుండియు, దాహకః=కాల్చుశక్తిగల, అగ్నిఃపృథక్=అగ్ని వేఱని, మతః=అందరునొప్పుకొందురో, తథా=అట్లె, పంచ భూతములు, పది ఇంద్రియములు, మనస్సువీని నుండియు, ప్రధానాత్=ప్రకృతి నుండియు, జీవసంజ్ఞితాత్=జీవుఁడని తెలియఁబడు సంసారము నుండియు, ద్రష్టా=సర్వజ్ఞుఁడైన, బ్రహ్మసమ్మితః=గుణపరిపూర్ణుఁడగుటచేత బ్రహ్మయని పిలువఁబడెడు, ఆత్మా=పరమాత్ముఁడైన, భగవాన్=శ్రీహరి, పృథక్=భిన్నుఁడనియే, మథుఃజ్ఞానుల సిద్ధాంతము. అనఁగా జడజీవులకు భేద మున్నట్లుగానే జీవ పరమాత్మలకును భేదము కలదని చెప్పినట్లైనది.

41.భిన్నులైన జీవులం దుండెడు శ్రీహరి ఉపాసనాక్రమమును చెప్పుచున్నాఁడు. సర్వభూతేషు=సమస్తజీవులందును వస్తువులందును, ఆత్మానం=అంతర్యామిగా శ్రీహరిని, ఈక్షేత=చూడవలెను. చ=మఱియు, సర్వభూతాని=సమస్త జీవులను, ఆత్మని=శ్రీహరినే ఆశ్రయించిన వారినిగా, ఈక్షేత=తెలియవలెను. అనన్యభావేన=అంతర్యామి రూపములందు పరస్పర భేదములేదని, ఈక్షేత=తెలియవలెను. చ=మఱియు, సర్వభూతేషు=సమస్త జీవులందును, తదాత్మతాం=శ్రీహరియే అధానాదికర్తయని, ఈక్షేత=తెలియవలెను. అభేదమని చెప్పక అనన్యమని చెప్పుట అంతర్యామి రూపములందు భేదచింతన అనర్థకారియని తెల్పుటకు. శ్రీవారి నిత్యతృప్తుఁడగుట చేత తనకొఱకై ఆధాన కర్తకాదని జీవులకొఱకై అట్లొనర్చునని తెలియవలెను. దీనితో జీవులు అనుగ్రాహ్యులని శ్రీహరి అనుగ్రాహకుఁడని వారిరువురి యందున్న భేదము పారమార్థికమని తెల్పిన ట్లైనది.

42. అధిష్ఠానములందు వ్యత్యాసమున్నను అధిష్ఠాతయైన శ్రీహరి యందు ఏ వ్యత్యాసములేదని ఈ విషయమును ఉదాహరణతో సమర్థించుచున్నాఁడు. యథా ఏకం జ్యోతిః=ఒకడే అగ్నియనెడు ప్రకాశమైన వస్తువు, స్వయోనిషు=తనకు కారణమైన కాష్ఠముల యందు, యోనీ నాం=కారణములైన కాష్ఠములయొక్క, గుణ వైషమ్యాత్=గుణములైన స్వరూప భేదములచేత, నానాం=అనేక రీతులుగా, ప్రతీయతే=తోఁచునో, తథా=అట్లు, ప్రకృతౌ=ప్రకృతి కార్యమైన జగత్తునందు, స్థితః=ఉన్న, ఆత్మా=శ్రీహరియు, నానా ప్రతీయతే=రూపవైలక్షణ్యము కలవాఁడుగా తోఁచును. ఒక్కొక్కచోట గొప్ప సామర్థ్యము నభివ్యక్తము చేయును. కొన్ని చోట్ల అల్పసామర్థ్యము నభివ్యక్తము చేయును. కానీ అతడొకడే. వాని రూపములకు వ్యత్యాసము లేదు.

43. విచార మొనర్చి నిశ్చితమైన అర్థమును చెప్పుచున్నాడు. తస్మాత్= శ్రీహరియే అన్నిటికంటె భిన్నుడుగా నుండుటచేత, స్వ ప్రకృతిం=తన కధీనమైన జడ ప్రకృతిని, దైవీం=కార్యరూపముగా ప్రకాశించుచున్న ఆ జడ ప్రకృతి కభిమాని దేవియైన, ఇమాం దేవీం=ఈ చితకృతిని, సదాసదాత్మికాం= కార్యకారణములందు వ్యాపించి యున్న దానిని, దుర్విభావ్యాం=బ్రహ్మాదులచేతను తెలిసికొన శక్యమైన దానిని, పరాభావ్య=అతిక్రమించి, స్వరూపేణ=సమము, అధికములేనట్టి, సర్వదోషదూరమైన సర్వగుణపరిపూర్ణమైన, అన్ని కాలములందు ఒక్కటిగనేయున్న, సర్వోత్తమ స్వరూపుడుగా, అవతిష్ఠతే=ఉండును. ఇందుకు ప్రమాణము-

"సర్వభూతస్థ మీశేశం జేతారం ప్రకృతే రపి,
అవిశేషం సదైవైకం చింతయన్ ప్రవిముచ్యతే."

44. సింహావలోకన న్యాయముతో ఉపాసకుడిట్లే చేయవలెనని చెప్పు చున్నాడు. వేరు వస్తువుండెడు దేశమందును, వేరు వస్తువుండెడు కాల మందును ఉండెడు వస్తువునకు అన్వయ మని పేరు. ఇతర వస్తువు లేని దేశమందును, కాల మందును లేని దానికి వ్యతిరేక మని పేరు. ఈ రెండు రీతుల చేతను సిద్ధుడైనవాడు సాక్షాత్తుగా అన్నిటిని చూచు వాడును, ఆత్మా=సమస్త మందును, వ్యాపించి సర్వుల మంచిచెడ్డలకు కారణభూతుడైన శ్రీహరియే, వ్యభిచారిణఃఅనిత్యమైన, అస్య=ఈ ప్రపంచము యొక్క, వైతథ్యం= ప్రయోజనము లేని తనమును, వ్యభిచారంచ=అంత్యతను, స్వప్నాంతే=నిద్ర యొక్కొనయందు అనఁగా బ్రహ్మముహూర్తమందు లేచి అనుచింతయేత్=మనన మొనర్ప వలెను. ఇది శ్రీహరి ప్రసన్నతకు సాధనమని తెలియవలెను. "నహి ద్రష్టుః దృష్టేః విపరిలోపో విద్యతే" అనెడు శ్రుతి కూడ శ్రీహరి సర్వ సాక్షియే అని చెప్పుచున్నది.

ఇతి శ్రీమద్భాగవతే తృతీయ స్కంధే సుధాలహరివ్యాఖ్యాయాం అష్టా వింశో ధ్యాయః సమాప్తః.

అధ్యాయము - 28

కం. ధీనిధు లే యోగ వి
ధానంబునఁ జేసి మనము తగ విమలంబై
మానిత మగు మత్పదముం
బూనుదు రా యోగ ధర్ములు నెఱిఁగింతున్. 911

వ. అది యెట్టనిన శక్తి కొలఁది స్వధర్మాచరణంబును, శాస్త్రాచారంబుల వినిషిదకర్మంబులు మానుటయును, దైవికంబైవచ్చిన యర్థంబువలన సంతోషించుటయును, మహాభాగవతపాదార విందార్చనంబును, గ్రామ్య ధర్మనివృత్తియును, మోక్ష ధర్మంబుల యందు రతియును, మితంబై శుద్ధంబైన యాహార సేవయును, విజనంబై నిర్బాధకంబైన స్థానంబున నుండుటయు, హింసారాహిత్యంబును, సత్యంబు, నస్తేయంబుఁ, దన

కెంత యర్థం బుపయోగించు నంత యర్థంబు స్వీకరించుటయు, బ్రహ్మచర్యంబును, దపశ్శౌచంబులును, స్వాధ్యాయ పఠనంబును, బరమ పురుషుండైన సర్వేశ్వరుని యర్చనంబును, మౌనంబును, ఆసన జయంబునం జేసి స్థైర్యంబును, ప్రాణవాయు స్వవశీకరణంబును, నింద్రియనిగ్రహరూపంబైన ప్రత్యాహారంబును (మనంబుచే నింద్రియంబుల విషయంబుల వలన మఱలించి హృదయమందు నిలుపుటయును) దేహగతంబైన మూలాధారాది స్థానంబులలో నొక్క స్థానంబునందు హృదయగతంఁ బైన మనస్సుతోడంగూడ ప్రాణధారణం బును వైకుంఠుండైన సర్వేశ్వరుండు ప్రవర్తించిన దివ్యలీలా చరిత్ర ధ్యానంబును, (మనసైకాగ్రీకరణంబును) పరమాత్మయగు పద్మనాభు సమానాకారత యను సమాధానంబును, నివియునుంగాక తక్కిన వ్రత దానాదులంజేసి మనోదుష్టంబైన యసన్మార్గంబును బరిహరించి, జితప్రాణుండై మెలన యొజించి, శుచియైన దేశంబునం బ్రతిష్ఠించి, విజితాసనుండై యభ్యస్త కుశాజిన చేలోత్తరాసనంబైన యాసనంబు నేసి, ఋజుకాయుండై ప్రాణమార్గంబును గుంభక రేచక పూరకంబులం గోశ శోధనంబుచేసి కుంభక పూరకంబుల చేతం బ్రతికూలంబుగావించి, చంచలంబైన చిత్తంబు సుస్థిరంబు గావించి తీవ్రంబైన యమంబునం బ్రతప్తంబై విగత సమస్త దోషంబగు చామీకరణంబు కరణి విరజంబు చేసి, జితమారుతుండగు యోగికిం గ్రమ్మఱం బ్రాణాయామంబులను పావకునిచేత వాతపైత్తశ్లేష్మంబులను దోషంబుల భస్మీకరణంబుచేసి, ధారణంబులచేతఁ గిల్బిషంబులును, బ్రత్యాహారంబుచేత సంసర్గంబు లను దహనంబుచేసి, ధ్యానంబు చేత రాగంబుల, సత్త్వాది గుణంబు లను నివారించి, స్వనాసాగ్రావలోక నంబు చేయుచు. 912

సీ. దర దరవింద సుందర పత్ర రుచిరాక్షు
సలలిత శ్రీవత్సకలిత వక్షు
నీలనీరద నీల నీలోత్పలశ్యాము
నళికులాకుల మాలికాభిరాముఁ
గౌస్తుభ కలిత ముక్తాహారయుత కంఠు
యోగిమానస పంకజోపకంఠు .
సతత ప్రసన్న సస్మిత వదనాంభోజ
దినకరకోటి సందీప్త తేజు

తే. సలలితానర్ఘ్య రత్న కుండల కిరీట
హార కంకణ కటక కేయూర ముద్రి
కా తులాకోటి భూషు భక్త ప్రపోషఁ
గింకిణీయుత మేఖలా కీర్ణ జఘను. 913

వ. మఱియును. 914

సీ. కంజాత కింజల్క పుంజ రంజిత పీత
కౌశేయవాసు జగన్నివాసు
శత్రు భీకర చక్ర శంఖ గదా పద్మ
విహిత చతుర్బాహు విగతమోహు
నుత భక్తలోక మనోనేత్ర వర్షి
లాలిత సద్గుణా లంకరిష్ణు
వరకుమారక వయఃపరిపాకు సుశ్లోకు
సుందరాకారు యశోవిహారు

తే. సకల లోక నమస్కృత చరణ కమలు
భక్తలోక పరిగ్రహ ప్రకట శీలు
దర్శనీయ మనోరథదాయిఁ గీర్త
నీయ తీర్థ యశో మహనీయమూర్తి. 915

వ. వెండియు. 916

కం. అనుపమగుణ సంపూరుని
ననఘుని సుస్థితుని గతుని వాసీను శయా
నుని భక్తహృద్విహాశయ
నుని సర్వేశ్వరు ననంతు నుత్తమచరితున్. 917

మ. విమలంబై పరిశుద్ధమై తగు మనోవిజ్ఞాన తత్త్వ ప్రభో
ధమతి న్నిల్చి తదీయ మూర్తి విభవ ధ్యానంబు గావించి చి
త్తము సర్వాంగ విమర్శన క్రియలకున్ దార్కొల్పి ప్రత్యంగమున్
సుమహాధ్యానము సేయఁగా వలయుఁ బో శుద్ధాంతరంగంబునన్. 918

వ. అది యెట్టి దనిన. 919

సీ. హల కులిశాంకుశ జలజ ధ్వజ చ్ఛత్ర
లాలిత లక్షణ లక్షితములు
సలలిత నఖచంద్ర చంద్రికా నిర్ధూత
భక్తమానస తమఃపటలములును
సురుచిరాంగుష్ఠ నిష్ప్యూత గంగాతీర్థ
మండిత హరజటా మండలములు
నంచిత ధ్యానపరాయణ జన భూరి
కలుష పర్వత దీప్త కులిశములును.

తే. దాసలోక మనోరథ దాయకములు
చారు యోగి మనః పద్మ షట్పదంబు
లనఘఁ దనరిన హరి చరణాబ్జములను
నిరుపమ ధ్యానమున మది నిలుప వలయు. 920

చ. కమలజు మాతయై సురనికాయ సమంచిత సేవ్యమానయై
కమలదళాభనేత్రములు గల్గి హృదీశ్వర భక్తినొప్పు న
క్కమల నిజాంకపీఠమునఁ గైకొని యొత్తు పరేశు జాను యు
గ్మము హృదయారవిందమున మక్కునఁ జేర్చి భజింపఁగాఁదగున్. 921

ఉ. చారు విహంగ వల్లభు భుజంబుల మీఁద విరాజమాన సు
శ్రీరుచి నుల్లసిల్లి యతసీ కుసుమద్యుతిఁ జాల నొప్పు పం
కేరుహనాభునూరువు లకిల్బిషభక్తి భజించి మానసాం
భోరుహమందు నిల్పఁదగుఁ బో మునికోటికి నంగనామణీ! 922

క. పరిలంబిత మృదుపీతాం
బర కాంచీగుణ నినాద భరితం బగు న
ప్పురుషోత్తముని నితంబముఁ
దరుణీ! భజియింప వలయుఁ దద్దయుఁ బ్రీతిన్. 923

క. విను భువనాధారత్వం
బునఁ దగి విధిజనన హేతు భూతం బగు న
వ్వనజాతముచేఁ గడు మిం
చిన హరి నాభీ సరస్సుఁ జింతింపఁ దగున్. 924

తే. దివ్య మరకత రత్న సందీప్త లలిత
కుచములను మౌక్తి కావళి రుచులఁ దనరి
యిందిరాదేవి సదనమై యెసక మెసఁగు
వక్ష మాత్మలఁ దలపోయవలయుఁ జుమ్ము. 925

మ. నిరతంబున్ భజియించు సజ్జనమనోనేత్రాభి రామైక సు
స్థిర దివ్యప్రభ గల్గు కౌస్తుభరుచి శ్లిష్టంబునై యొప్పు నా
వీరయోగీశ్వర వంద్యమానుఁ డగు నర్వస్వామి లక్ష్మీశ కం
ధర మాత్మన్ గదియించి తద్గుణ గణధ్యానంబు సేయం దగున్. 926

క. ఘనమందరగిరి పరివ
ర్తన నికషోజ్జ్వలిత కనకరత్నాంగదముల్
దనరార లోకపాలకు
లను గల్గిన బాహుశాఖలను దలఁపఁ దగున్. 927

వ. మఱియు విమత జనాసహ్యంబులైన సహస్రారంబులం గలుగు సుదర్శనంబును, సరసిజోదర కరసరోరుహం బందు రాజహంసరు చిరంబైన శంఖంబును, నరాతిభట శోణితకర్దమ లిప్తాంగంబై భగవ త్ప్రీతికారిణి యగు కౌమోదకియును, బంధుర సుగంధ గంధాను బంధమంద గంధవ హోహాయమాన పుష్పంధయ ఝంకారనినద విరాజిత వైజయంతీ వనమాలికయును, జీవతత్త్వంబైన కౌస్తుభమణి యును, బ్రత్యేకంబ ధ్యానంబు సేయందగు. వెండియు భక్త సంరక్షణార బంగీకరించు దివ్యమంగళ విగ్రహంబున కనురూపంబైన నాసంబును, మకరకుండల రుచి నిచయ మండిత ముకురోపమాన నిర్మల గండ మండలంబును, సత్‌శ్రీనివాసంబులైన లోచన పంకజంబులును (గలిగి) లాలితభ్రూలతాజుష్టంబును, మధుక రోపమాన చికుర విరాజితంబును నైన ముఖకమలంబును ధ్యానంబు గావింప వలయు. 928

కం. గురు ఘోర రూపకంబై
జరిగెడు తాపత్రయోప శమనార్థము శ్రీ
హరి చేత విసృష్టములగు
కరుణా లోకములఁ దలఁ పఁగా దగు బుద్ధిన్. 929

కం. ఘనరుచి గల మందస్మిత
మున కనుగుణ మగు ప్రసాదమును జిత్తములో
నునిచియు ధ్యానము సేయం
జను యోగిజనాళి కెపుడు సౌజన్యనిధీ! 930

తే. పూని నతశిరు లైనట్టి భూజనముల
శోకబాష్పాంబుజలధి సంశోషకంబు
నత్యుదారత మము హరిహాస మెపుడు
దలఁపఁగ వలయు నాత్మలోఁ దవిలి వినుము. 931

సీ. మునులకు మకరకేతననకు మోహనం
బైన స్వకీయ మాయావిలాస
మున రచితంబైన భూమండలంబును
ముని మన కుహర సమ్మోదమానుఁ
డగు నీశ్వరుని మందహాసంబు నవపల్ల
వాధరకాంతిచే నరుణ మైన
మొల్ల మొగలకాంతి నులసం బౌడెడు
దంతపంక్తియు మదిఁ దలఁప వలయు.

తే. వెలయు నీరీతి నన్నియు వేఱువేఱ
సంచిత ధ్యాన నిర్మల స్థానములుగ
మనములోఁ గనుమని చెప్పి మఱియుఁ బలికె
దేవహూతికిఁ గపిలుండు దేటపడఁగ. 932

సీ. ఈ ప్రకారమున సర్వేశ్వరు నందును
బ్రతిలబ్ధ భావసంపన్నుఁ డగుచుఁ
జిరతర సద్భక్తిచేఁ బ్రవృద్ధంబైన
యతిమోదమునఁ బులకిత శరీరుఁ
డగుచు మహోత్కంఠ నానందబాష్పముల్
జడిగొనఁ బరితోషజలధిఁ గ్రుంకి
భగవత్స్వరూపమై భవగుణగ్రాహక
మగుచు మత్సంబంధ మనుకరించి

తే. సుమహిత ధ్యానమునఁ బరంజ్యోతి యందు
మనము జాల నియోజించి మహిమఁ దనరు
మోక్షపద మాత్మలోన నపేక్ష సేయు
ననఘు వర్తనుఁడైన మహాత్ముఁ డెపుడు. 933

వ. అది గావున ముక్తి నపేక్షించి మహాత్ముం డగువాని చిత్తంబు
విముక్తంబైన భగద్వ్యతిరిక్తాశ్రయంబు గలిగి విషయాంతర శూన్యంబై
విరక్తిం బొందుటంజేసి పురుషుండు శరీర భావంబుల నన్య భావంబగు
నిర్వాణపదంబు సూక్ష్మంబగు తేజంబు తనకంటె నధికంబగు తేజంబు
తోడి సమానాకారం బగు చందంబున నిచ్చయించువెండియు. 934

సీ. పురుషుఁడు చరమమై భువి నన్యవిషయ ని
వృత్తమై తగ నివర్తించు చిత్త
వృత్త్యాదులును గల్గి వెలయంగ నాత్మీయ
మగు మహిమ సునిష్ఠుఁడై లభించు
సుఖదుఃఖముల మనస్సునఁ దలంపక యహం
కార ధర్మంబులుగాఁ దలంచి
యనయంబు సాక్షాత్కృతాత్మ తత్త్వము గల్గు
నతఁడు జీవన్ముక్తుడండ్రు ధీరు

తే. లతఁడు నే చందమున నుండు ననిన వినుము
తన శరీరంబు నిలుచుటయును జరించు
టయును గూర్చుండుటయు నిడెమియు నెఱుంగ
కర్థి వర్తించు విను తల్లి! యతఁడు మఱియు. 935

వ. మదిరాపానంబునంజేసి మత్తుండగువాఁడు దనకుఁ బరిధానంబగు
నంబరంబు మఱచి వర్తించు చందంబున దనశరీరంబు దైవాధీనంబున
నశ్వరంబని తలంచి యాత్మ తత్త్వనిష్ఠుండై యుపేక్షించు
అదియునుంగాక సమాధి యోగంబునం జేసి సాక్షాత్కృతాత్మ తత్త్వంబు
గలవాఁడై స్వాప్నిక శరీరంబు చందంబున యావత్కర్మ ఫలానుభవ
పర్యంతంబు పుత్రదార సమేతంబగు ప్రపంచంబు ననుభవించి యట
మీఁదఁ బుత్రదారాది సంబంధంబువలనం బాసి వర్తించు. 936

సీ. సుతదార మిత్రానుజుల కంటె మర్త్యుండు
భిన్నుఁడై వర్తించుచున్నరీతి
విస్ఫులింగోల్ముక విపుల ధూమములచే
హవ్యవాహనుఁడు వేఱైన రీతి
వలనొప్ప దేహంబు వలన నా జీవాత్మ
పరికింప భిన్న రూపమున నుండుఁ
దవిలి భూతేంద్రి యాంతఃకరణంబుల
భాసిల్లుచున్న యా ప్రకృతి రూప

తే. బ్రహ్మమున కాత్మ దాఁబుట్టగ్భవ మగుచు
ద్రష్టయగు బ్రహ్మ సంజ్ఞచేఁ దనరుచుండు
నఖిలభూత ప్రపంచంబులందుఁ దన్నుఁ
దవిలి తన యందు నఖిల భూతములఁ గనుచు. 937

వ. వెండియు. 938

సీ. వరుస ననన్య భావంబులఁ జేసి భూ
తావళి యందుఁ దదాత్మకత్వ
మునఁ జూచు నాత్మీయ ఘనతరోపాదాన
ములయందుఁ దవిలి యిమ్ముల వెలుంగు
నిర్ధ దివ్యజ్యోతి యేక మయ్యును బహు
భావంబులను దోఁచు ప్రకృతిగతుఁడు
నగుచున్న యాత్మయుఁ బొగడొందు దేవ తి
ర్య జ్మనుష్యస్థావరాది వివిధ

తే. యోనులను భిన్న భావంబు నొందుటయును
జాలఁ గల్గు నిజగుణ వైషమ్యమునను
భిన్నుఁడై వేల్పుఁ గావునఁ బేర్చి యదియ
దేహసంబంధి యగుచు వర్తించుచుండు. 939

కం. భావింప సదసదాత్మక
మై వెలయుచు దుర్విభావ్య మగుచు స్వకీయం
బై వర్తింపుచుఁ బ్రకృతిని
భావమునఁ దిరస్కరించు భవ్యస్ఫూర్తిన్. 940

ఇది శ్రీ పోతనామాత్య విరచితంబైన ఆంధ్రభాగవతమున ఇరువది యెనిమిదవ అధ్యాయము.

911. ధీనిధులు=బుద్ధిమంతులు, ఏ యోగ విధానంబునన్ చేసి=ఏ యోగ పద్ధతి నాశ్రయించుట చేత, విమలంబై=పరిశుద్ధమైనదై, మానితము=గౌరవింపఁబడినది,

912. స్వధర్మాచరణము=తన వర్ణాశ్రమాను గుణమైన ధర్మములు నిర్వర్తించుట, వినిషిద్ధ కర్మములు=నిషేధింపఁబడిన పనులు, దైవికంబై=స్వక్రమమునకు అనుగుణముగా, గ్రామ్యధర్మ నివృత్తి=అనాగరికములైన, పనుల నుండి మరలుట, రతి=ఆసక్తి, విజనంబు=జనుల అలికిడి లేనిది, నిర్బాధకము=ఇతర ఉపద్రవములు లేనిది, అస్తేయము=అవంచన, శౌచము=శరీర శుద్ధి మొదలైనవి. స్వాధ్యాయము=వేదము, ఆసనజయము=ఒకటి ఆసనము నలవాటు చేసికొని దానిని స్థిరీకరించు కొనుట, ప్రాణధారణ=వాయువును నిలుపుట, సమానాకారత=అన్నీజీవుల యందును అంతర్యామి రూపముతో సమానముగా నుండుట, జితప్రాణులు=వాయువును నిర్జించిన వారు, కుశ=దర్భాసనము, అజిన=మృగచర్మము, చేల=పరిశుద్ధ వస్త్రము, కోశ శోధనము=దేహములోనున్న అన్నగతాది కోశములను శుభ్రపఱచుకొనుట, ప్రతికూలము=విరుద్ధము, యమము=నియమము, చామీకరము=బంగారు, విరజము=రజోగుణ సంపర్కము లేనిది, ధారణ=ధ్యానము, ప్రత్యాహారము=ఇంద్రియ స్వాధీనత,

తాత్పర్యము : దేవహూతీ! ఏ యోగ మార్గము ననుసరించుట చేత బుద్ధి మంతులైన వారు మనస్సును పరిశుద్ధము చేసికొని సర్వలోక

నమస్కృతమైన నాస్థానమును పొందుదురో చెప్పుచున్నాను వినుము. సాధకుడైన వాడు శక్తికొలఁది వర్ణాశ్రమానుకూలమైన స్వధర్మమును నిర్వర్తింప వలెను. శాస్త్రము లందేవేవి పరిత్యజింప వలసిన కార్యములని చెప్పఁబడి యున్నవో వాని నన్నిటిని త్యజించుట అవశ్యకము. వాని వాని ప్రారబ్ధము ననుసరించి ధనలాభము చేకూరును. దానితో తృప్తి పడియుండుట మంచిది. దురాశాపూరితుఁడై ఎండమావులలో నీరు వెదకుట నిషిద్ధము. భాగవతు లనఁగా భగవద్భక్తులు. వారు నిరపేక్షులు. వారి పాద పరిచర్య భగవత్పరిచర్యకంటెను గొప్పదిగా తలపోయవలెను. జీవసంస్కారమునకు క్రిందికిదించివేయు అనాగరక కాయిక వాచిక వ్యవహారముల నుండి దూరము కావలెను. మోక్షధర్మమునందు ఆసక్తుఁడై యుండవలెను. లోక మోక్షధర్మములకు వైరుధ్య మేర్పడినపుడు మోక్షధర్మమునే అను సరింపవలెను. హిత మితమైన యాహారము సాధకుని కావశ్యకము. వాఁడెప్పుడును విజనమైన స్థానము నందుండ వలెను. ప్రారంభ దశలయందు ఇతరములైన అననుకూలములు కల ప్రదేశము లందుండరాదు. సర్ప వృశ్చికాద్యుపద్రవములు సాధనకు భంగము కలిగించును. సాధ్యమైనంత వఱకు అహింసను పాటించుట మంచిది. సత్యవచనుఁడు కావలెను. వంచనా పూరిత ప్రవృత్తి అనర్థకారి. తన కెంత యావశ్యకమో ధన మంతే స్వీకరింపవలెను కాంచన వ్యామోహము, కామినీ వ్యామోహమున కన్న తక్కువదికాదు. బ్రహ్మచర్యమును పాటింపవలెను. తపస్సు ననుసరింపవలెను. దైహిక మానసిక శౌచములు సాధకున కావశ్యకములు. వేదము నర్థపూరముగా పఠింపవలెను. సర్వేశ్వరుని అర్చనాదులందు మనస్సు లగింపఁజేయవలెను. మౌన మావశ్యకము. సాధనాసమయము లందు తనకను కూలమైన ఆసనమందే కూర్చుండి అభ్యాసవశముచేత దానిని స్వాయత్తీకరించ వలెను. దానితో సాధనమున స్థైర్య మేర్పడును. ప్రాణవాయువును వశీకరించుట అవశ్యకము. ఇంద్రియ నిగ్రహమునకే ప్రత్యాహార మనిపేరు. ఇంద్రియముల నుండి మనస్సును అభ్యాస విశేషముతో మరలించుకొనవలెను. మనస్సును హృదయమందు నిలుపుట సాధకున కావశ్యకము. దేహమందు మూలాధారాదులైన ఆరు చక్రములుండును. ఏదేని ఒకదాని యందు ప్రాణధారణ చేయవలెను. ఆ చేయుట మనస్సుతో హృదయముతో కూడినదై ఉండవలెను. నిరంతరము వైకుంఠుని సృష్ట్యాది లీలా విలాసములను మనన మొనర్పవలెను. ఇంద్రియముల నుండి మనస్సును మరలించుటకు ఇది యొక పద్ధతి. ఏ యుపాయముచేత నైన మనశ్చాంచల్యము నరికట్టి సాధకుఁ డేకాగ్ర మొనర్ప వలెను. సర్వజీవుల యందును అంతర్యామిగా పరమేశ్వరుఁడున్నాఁడని. భావించికొని ప్రతి ప్రాణిని సానుభూతితో చూడవలెను. ఇంతమాత్రమే కాదు. అనేకమైన వ్రతనియమాదులతో సహజముగా దుష్టమైన మనస్సును అసన్మార్గముల నుండి త్రిప్పి కొనవలెను. వాయువును స్వాధీన పఱచుకొన్న వాఁడై మెల్ల మెల్లఁగా దానిని దేహమం దేదేని ఒక స్థానమున నిలిపికొని ఆసనస్థైర్యము కేలవాఁడుగా ఉండవలెను. సాధకుఁ డేదేని ఒక పీఠమును ఉపయోగించుట మంచిది. దర్భాసనము కావచ్చును. మృగచర్మము సత్త్వగుణము నభివృద్ధి యొనర్చును.

శుద్ధ వస్త్రమైనను పీఠముగా వేసికొనవచ్చును. సాధనా సమయమందు ఋజుకాయుఁడై యుండవలెను. ప్రాణాయామముతో అన్నాది కోశములు పరిశుద్ధ మగును. పూరక మనఁగా నాసికా ద్వారమున వాయువును లోపలికి పీల్చుకొనుట. కుంభకమన కొంతసేపట్లే నిలిపికొనుట. రేచకమన వాయువును బయటికి వదలుట. ఒక్కొక్క సారి ఈ వరుసకు ప్రతికూలముగ కూడ నభ్యసింపవచ్చును. ప్రాణాయామముతో చిత్తచాంచల్య మడఁగును. లోహము అగ్ని తప్తమైనప్పుడు వాయ్వగ్ని సంయోగముచే తన యందలి మలములను పోఁగొట్టు కొనునట్లు ప్రాణాయామముచే మనో మలములు మాసిపోవును. వాత పిత్త శ్లేష్మములే శరీర మలములు. ధారణతో పూర్వతివిషయములను భస్మీకరణ మొనర్పవలెను. ప్రత్యాహారము చేత విషయ సంసర్గమును దహింపవలెను. ఇతర గుణములను జయించుటకు సత్త్వగుణము సాధనము. అదిగూడ బాధకమే. దాని సంసర్గమును కూడ క్రమముగా వదలించి కొనవలెను. ఇట్టి యోగి నాసాగ్రావ లోకన మొనర్చుకొనుచు ధ్యాన మొనర్చుకొనవలెను. ధ్యానములో పూర్తిగా కన్నులు మూసి కొన్నచో లయమను దోషము ప్రాప్తించును. ఏకాగ్రతకు నాసికావలోకనము మంచిది.

913. భగవత్స్వరూపము సకలావయవ పరిపూర్ణముగా ధ్యానములో నిల్పికొనవలసిన పద్ధతిని చెప్పుచున్నాఁడు. దళత్=అప్పుడే వికసించిన, అరవింద=పద్మము యొక్క, సుందర పత్ర=అందములైన రేకులవలె, రుచి రాక్షున్=ప్రకాశించుచున్న కన్నులు కలిగినట్టియు, సలలిత=అందమైన, శ్రీవత్స లలిత వక్షన్=శ్రీవత్స మనెడు మచ్చచేత ప్రకాశించు వక్షస్సు కలిగినట్టియు, నీలనీరద=నల్లనైన వర్షాకాలము నందలి మేఘము, నీలోత్పలశ్యామున్=నల్లని కలువవంటి దేహచ్ఛాయ కలట్టియు, అళికుల=తుమ్మెదల గుంపుచేత, ఆకుల=మూగినట్టి, మాలికాభిరామున్= వనమాలచేత ప్రకాశించునట్టి, కౌస్తుభాకలిత=కౌస్తుభమనెడు రత్నముచేత కూడిన, ముక్తాహార=ముత్యాలహారముచేత, యుత కంఠున్=కూడిన కంఠము గలట్టియు, యోగి=యోగుల యొక్క, మానస పంకజ=మనః పద్మమునకు, ఉపకంఠున్=సమీపమునం దున్నట్టియు, సతత ప్రసన్న=నిరంతరము ప్రసన్నమైన, సస్మిత=చిరునవ్వుతో కూడిన, పదనాం భోజ=ముఖ పద్మముచేత, దినకర కోటి=కోటి సూర్యులుగా, దీప్త=ప్రకాశింప జేయఁబడిన, తేజన్=తేజస్సుగలట్టియు, నలలిత=అందమైన, అనర్ఘ=గొప్ప వెలగల, రత్నకుండల=మణికుండలములును. కంకణ=చేతికడియములు, కటక=ఆభరణ విశేషము, కేయూర=బాహుపురులు, ముద్రికా=ఉంగరములు, తులాకోటి=పాదవలయములు, కింకిణీయుత=గజ్జెలతో కూడిన, మేఖలా=మొల త్రాడుచేత, ఆకీర=చుట్టఁబడిన, జఘనున్=నితంబబింబము గలట్టియు శ్రీహరిని ధ్యానింప వలెనని అన్వయము.

తాత్పర్యము : స్వామికన్నులు అప్పుడే వికసించిన తామరల యొక్క సుందరమైన రేకులవంటివి, శ్రీవత్సమనెడు మచ్చ వక్షస్సున కలంకారముగా నున్నది. ఆయన శరీరము వర్షాకాలమేఘము వలెను, నీల ఉత్పలము వలెను, శ్యామలమైనది. కాళ్ళవరకు వ్రేలాడుచున్న వనమాల. దాని

సుగంధముతో తుమ్మెద లాకర్షింపఁబడి నిరంతరము ధ్వనిచేయుచుండును. కౌస్తుభ మనెడు రత్నము కలది. ఆ రత్నము ఆయన కంఠ సమీపమందు, దానితో పెనగొన్న ముక్తాహారము. ఆ స్వామి మహాయోగుల మనస్సులనెడు పద్మముల కెప్పుడును సమీపమందున్న వాఁడు. ముఖమునందు నిరంతరము చిరునవ్వు. అది భక్తవాత్సల్యముతో కూడినది. ఆ వదనకాంతి కోటిసూర్యుల తేజో విశేషము నతిక్రమించియుండును. శరీరమందు రత్న కుండలములు. రత్నకాంతులతో దిక్కుల నావరించుకొను కిరీటము, హారములు, కంకణములు, అంగదములు, ఉంగరములు, పాదములందు రత్నజటిలములైన వలయములు, మొలగజ్జెలతో కూడిన మొలత్రాడు. దానితో నాతని నితంబ బింబము దర్శనీయము. ఇట్టి వానినిగా స్వామిని ధ్యానింపవలెను.

915. కంజాత=పద్మము యొక్క, కింజల్క=కేసరముల యొక్క, పుంజ=గుంపువలె, రంజిత=ప్రకాశించుచున్న, పీతకౌశేయ వాసు=పచ్చని పట్టు వస్త్రముగలటియు, జగన్ని వాసు=సమస్త లోకములకు నివానస్థాన మైనటియు, శత్రుభీకర=శత్రువుల ధైర్యములను తొలచునటి, విహిత చతుర్బాహు=కూడిన నాలుభుజముల వానిని, భక్తలోక=భక్తసమూహము యొక్క, మనోనేత్ర=మనస్సనెడు కంటిని, వర్ధిష్ణు=హరాతి రేకముతో వృద్ధిపొందించునటి , లాలిత=లోకములచే గౌరవింపఁబడు, సద్గుణాలంకరిష్ణు=సద్గుణముల చేత కూడినటియు, వరకుమారకవయఃపరిపాకున్=ఎప్పుడును కౌమారదశయం దున్నటియు, సుశోకున్= కీర్తింపఁ దగిన కీర్తిగలటియు, సుందరాకారున్=సుందరమైన ఆకారము గలటియు, యశోవిహారున్=ఉత్తమమైన కీర్తితో విహరించు నటియు, భక్తలోక=భక్తులను, పరిగ్రహ=గ్రహించెడు, ప్రకటశీలున్=ఉత్తమమైన శీలము గలటియు, దర్శనీయ= చూడఁదగిన, మనోరథదాయి=మనోరథముల నొసఁగువాఁడు. కీర్తనీయ=కీర్తింపఁ దగిన,తీర్థ=పరమ పవిత్రమైన, యశోమహనీయ మూర్తి=యశస్సుతో గొప్పవాఁడు,

తాత్పర్యము : ఆ సర్వావయవధ్యాన స్వరూపమునే ఇంకను విస్తరించి చెప్పుచున్నాఁడు. స్వామి పట్టు వస్త్రమును ధరించిన వాఁడు. అది పద్మ కింజల్కములవలె రమణీయమైనది. పీతమైన కాంతిగలది. సమస్త జగత్తుల కాధారమైనవాఁడు. ఆయన ఆయుధములు శంఖచక్ర గదా పద్మములు. ఇవి వాసుదేవుని ఆయుధములు. అందుచే నారాయణ మూర్తి స్వరూపమును వివరించినట్లైనది. నాలుగు చేతులతో నాలుగు ఆయుధములు. స్వామి భక్తుల యొక్క మనస్సనెడు నేత్రమును వికసింపఁ జేయువాఁడు. ఆయనను ధ్యానించు కొలఁది ధ్యాన మభివృద్ధి చెందునని భావము. లేక మనస్సునకును కన్నులకును ఆనందోద్రేకము కలిగించు వాఁడని అర్థమునైన అనుసంధించు కొనవచ్చును. సమస్త సద్గుణముల కాధార భూతుఁడు. స్వామి నిత్యశ్రేకోరకమైన వయస్సు గలవానినిగా భావించు కొనవలెను. పరమ సుందరమైన ఆకారమును ధ్యానింపవలెను. సమస్తలోకములకు వందనీయములైన పాదములా యనవి. భక్తులను అనుగ్రహించుట యందు నిత్యాజాగరూకుఁడైన వాఁడు. కోరిన కోర్కెలను కల్పవృక్షమువలె నొసఁగువాఁడు. ఆయనకీర్తి పరమ పవిత్రమైనది. అంతమాత్రమే కాదు! పరమ సుందరమైనది. అట్టికీర్తియే ఆయన పరివేషము.

917.అనుపమ=సాటిలేని, గుణసంపూర్ణుని=గుణములతో సంపూర్ణుడైన వానిని, అనఘునిన్=పాపములేని వానిని, సుస్థితునిన్=నిశ్చలముగా నుండువానిని, గతునిన్=పోవుచున్న వానిగనో, ఆసీనున్=కూర్చున్న వానిగనో, శయానునిన్=పవ్వళించిన వానినిగనో, భక్త=భక్తుల యొక్క, హృదుహా=మనస్సనెడు గుహయందు, శయనునిన్=శయనించిన వానిగనో, ఉత్తమ చరితున్=గొప్ప చరిత్ర కలవానిని,

తాత్పర్యము : స్వామిని మనస్సున నిల్పికొను పద్ధతినే వివరించుచున్నాడు. అతడు హేయగుణ విహీనుడు. కళ్యాణ గుణశోభితుడు. పాపలేశ మాయన నంటనేరదు. ఆ మూర్తిని మనస్సునందు సాధకుడు కూర్చుని యున్నవానినిగా ధ్యానింప వచ్చును. లేక పాఱాడుచున్న వానినిగా భావింప వచ్చును. విశ్రాంతికై పడుకొన్న వానినిగా భావింపవచ్చును. తనహృదయ మనెడు గుహయందు విశ్రమించు వానిగా తలపోయవచ్చును. ఏదో ఒక స్వరూపమును సుస్థిరముగా భావించుట అలవాటు చేసికొనవలెను. ధ్యానమందు చిత్త విక్షేప ముండరాదు. మనస్సు సర్వదా ఆ మూర్తియందే లగించిపోవలెను. దీనికే ధ్యానమనిపేరు. ఈ ధ్యానపరిపాకమే సమాధి. సమాధి స్థితిలో మనస్సు, కేవలమూర్తి యందే లగ్నమై చాంచల్యమును బాసి యుండును. సమాధిస్థితి నుండి వెలికి వచ్చిన తరువాత మరల వానిని ఇంద్రియము లాక్రమించి కొననేరవు. వివేకము వాని ప్రధానాంగమై యుండును. నిరంతరమును ఇంద్రియముల యనిత్యత వాని జ్ఞాననేత్రము నెదుట భాసించు చుండును. అట్టివాడు మరల వానియందు తగుల్కొన నేరడు.

918. విమలంబై=దోషహీనమై, పరిశుద్ధమై=స్వచ్ఛమై, మనోభిజ్ఞాన తత్త్వ ప్రబోధ మతిన్=మనసు తెలిసి కొనఁదగిన తత్త్వజ్ఞానమందు జాగరూకమైన బుద్ధితో, తదీయ=శ్రీహరికి సంబంధించిన, మూర్తి వైభవధ్యానంబు=సర్వాంగ సుందరమైన జ్ఞానము యొక్క వైభవమును గూర్చిధ్యానించి, చిత్తము=మనస్సును, సర్వాంగవిమర్శన క్రియలకున్=ప్రతి అవయవము యొక్క సౌందర్య విశేషములను గుర్తించుటకు, తార్కొల్పి=సమీపింపజేసి, ప్రత్యంగమున్=శ్రీహరి యొక్క ప్రతి అంగమును, శుద్ధాంత రంగంబునన్=పరిశుద్ధమైన అంతఃకరణముతో, సుమహాధ్యానము సేయఁగావలయున్=విక్షేపములు లేని విధముగా ధ్యాన మొనర్పవలెను.

తాత్పర్యము : స్వామి యొక్క స్వరూపము రజోగుణ లేశమును లేనిది. భక్తవాత్సల్య రూపమైన కేవల సత్త్వగుణముతో ప్రకాశించునది. ఆ మూర్తి తాను పరిశుద్ధ మగుటయే కాక తన్ను భావించు భక్తులను కూడ పరిశుద్ధులుగా నొనర్చు శక్తికలది. ఆ మూర్తిని మనస్సున నిల్పికొనవలెను. మనస్సు తెలిసికొన వలసిన విజ్ఞానములో భగవత్తత్త్వమే ప్రధానమైనది. ఆ భగవత్తత్త్వము నెఱుంగుట యందు మనస్సు నిత్యజాగృతముగా నుండవలెను. సర్వాంగసుందరమైన పరమేశ్వరుని యొక్క మూర్తి విశేషము ధ్యానింపవలెను. ఆ ధ్యానమందు ఏ అంగమును మఱచిపోరాదు. ప్రతి అంగమును సర్వసుందరముగా నుండునట్లు భావింపవలెను. ప్రత్యంగమును సర్వోత్తమమై

యుండునట్టుమూర్తిని కల్పించుకొనవలెను. ప్రత్యంగమును వేఱు వేఱు గా భావింపవలెను. ధ్యానమందు విక్షేప ముండరాదు. అనఁగా భగవంతునికి సంబంధింపని భావము యొక్క తాకిడికి విక్షేపమని పేరు. అనేక జన్మ సంస్కారములతో అనేక భావములు సాధకుని మనస్సు నడఁగించుచుండును. వాని నదుపులో పెటికొనుట అరవిందయోగి చెప్పిన మార్గములు రెండు (1) వాని యెడల నుదాసీనుఁడై ఆకాశమందు పోయెడు మేఘములను రాగద్వేష రహితుఁడై మానవుఁడు చూచునట్లు సాక్షిభూతుఁడై చూచుట. (2) ఏయే భావము మనస్సులో తోఁచిన అదే యదియే భగవంతుని స్వరూపమని గమనించుట. ఈ రూపముగా సాధన చేసినపుడు కాలక్రమమున మనస్సునందు చెలరేగు విరుద్ధ భావములు నశించును. ఒకానొక గుఱుతు పరువెత్తి పరువెత్తి అలసి క్రింద పడిపోవును. రెండవ మార్గము కంటెను మొదటి మార్గము సుఖకరమైనది. దీనితో అసంగ తత్త్వ మేలవా టగును.

920. హల=నాగలి, కులిశ=వజ్రము, అంకుశ=ఏనుఁగును నడపెడు అంకుశము, జలజ=పద్మము, ధ్వజ=ధ్వజము, ఛత్ర=గొడుగు ఇట్టి లాలిత=గమనింపఁదగిన, లక్షణ=చిహ్నములచేత లక్షితము=గుర్తింపఁబడినది. సలలిత=సుందరములైన, నఖ=గోళ్ళలనెడు, చంద్ర=చంద్రుని యొక్క, చంద్రికా=వెన్నెల చేత, నిర్ధూత=తొలఁగింపఁబడిన, భక్తమానస=భక్తుల యొక్క మనస్సులందలి, తమఃపటలములను=చీకటి యొక్క గుంపు గలది, సురుచిర=ఎక్కువ కాంతితో కూడిన, అంగుష్ఠ=బొటన వ్రేలినుండి, నిష్క్రాంత=వెడఁజల్లఁబడిన, గంగాతీర్థ=భాగీరథీ తీర్థముల చేత, మండిత=ప్రకాశించుచున్న, హర=పరమేశ్వరుని యొక్క, జటామండలములు=జటల యొక్క గుంపులు గలవి, అంచిత=అనుషింపఁబడెడు, ధ్యాన=ధ్యానమందలి, పరాయణ=తీవ్రాసక్తి గల, జన=జనుల యొక్క, భూరి=పెద్దవైన, కలుష పర్వత=పాపములనెడు పర్వతములకు, దీప్త=ప్రకాశించుచున్న, కులిశములన్=వజ్రాయుధముతో సమానమైనవి. దాసలోక=భక్తుల యొక్క, మనోరథ=ఇచ్ఛలను, దాయకములు=ఇచ్చునట్టివి. చారు=వైరాగ్య సుందరములైన, యోగి=యోగుల యొక్క, మనః పద్మ=మనస్సులనెడు పద్మములకు, షట్పదంబులు=తుమ్మెదలు, అనఁగన్=అనునట్లుగా, తనరిన=ఒప్పుచున్న, హరించరణాబ్జములను=శ్రీమన్నారాయణ మూర్తి చరణములనెడు పద్మములను, నిరుపమ ధ్యానమునన్=సాటిలేని ధ్యానముచేత, మదిన్ నిలుపన్ వలయున్=మనస్సునందు నిలిపికొనవలెను.

తాత్పర్యము : పైనున్న పద్యము వఱకును స్వామి యొక్క సర్వాంగములు ధ్యానించెడు పద్ధతిని వివరించినాఁడు. ఇప్పుడు ప్రత్యేకావయవమును మనస్సున నిల్పికొనెడు ప్రకారమును వివరించు చున్నాఁడు. ఉత్తమ పాతల వర్ణనము పాదములనుండి ఆరంభింపవలెను. ఇది కావ్యపద్ధతి. సర్వోత్కృష్టమైన శ్రీమన్నారాయణ మూర్తిని గూర్చి ఇంకేమి చెప్పవలెను? మహాపురుషుల పాదములందు శుభంకరము లైన రేఖలుండును. అవి సాముద్రిక శాస్త్ర ప్రసిద్ధములు. స్వామి యొక్క ఎఱ్ఱనైన పాదములందు సమస్త శుభచిహ్నములున్నవి. వాఁగేటి యొక్క గుర్తుకంటే వజ్రాయుధ చిహ్న మొక్కటి. అంకుశపు

గీత యొక్కటి. పద్మరేఖ మఱియొకటి. ధ్వజచిహ్న మింకొకటి. ఛత్రలక్షణము వేఱొకటి, ఇవన్నియు మహాపురుషుల పాదములందుండెడు శుభచిహ్నములు. వీనియందొక్కొక్కటే యున్నపుడే వాఁడు తక్కిన మానవులకంటె గొప్పవాఁడుగా నున్నపుడు మఱియన్నియు ఒక్కచోట చేరినపుడు చెప్పవలసినదే మున్నది? ఆయన పాదనఖములు చంద్రమండలమువలె ప్రకాశించు చున్నవి. చూడ వర్తులములై తెల్లగా నున్నవి. కేవలము తెలుపుకాదు. అతి మృదువైన గౌరవర్ణమని తాత్పర్యము. రక్తము వానియందు ప్రతిఫలించి ధవళ రక్తవర్ణములు శబలితములై యున్నవి. చంద్ర చంద్రికలు కూడ నట్టివే. వ్యాసుఁడు "లోకానందేన చంద్రేణ మాహేంద్రీ దిగలంకృతా" అన్నాఁడు. అనఁగా చంద్రుఁడు లోకమనోహరుఁడు. పరమానందకరుఁడు. స్వామి గోళ్ళుకూడ నట్టివే. అవి నేత్రములకును మనస్సునకును మహానంద దాయకములు. చంద్ర చంద్రికలు బాహ్యములైన చీకటులను పోఁగొట్టును, స్వామినఖములు సాధకుని అంతస్తమ మును పోకార్చును. కనుక నవి వెన్నెలల గుణములు కలవై వెన్నెలల కన్న విలక్షణము లైనవి. అంతస్తాపమును పోకార్చు సామర్థ్యము చంద్రజ్యోత్స్నలకు లేదుకదా! కనుక నుపమానము కంటెను స్వామినఖములు విలక్షణములై యున్నవి. దానితో నిచ్చట ప్రతీపాలంకార ధ్వని. అంగుష్ఠమునుండి గంగా తీర్థము వెలసినది. స్వామి త్రివిక్రమావతారమున జరిగిన కథ ఇది . త్రివిక్రముని పాదములను బ్రహ్మదేవుడు కమండుల జలముతో ప్రోక్షించెను. అనఁగా స్వామి పాదమునకు తిరుమంజన మొనర్చినాఁడని యర్థము. ఆపాద తీర్థమును పరమశివుఁడు జటామండలమునఁ జల్లించుకొన్నాఁడు. అందుకే ఆతఁడమంగళ స్వరూపుఁడైనను "శివ శ్శివోనుభూత్" అని వ్యాసుఁడే యన్నాఁడు. ఇట్టి భక్తుఁడు గనుకనే శివుఁడు వైష్ణవులలో నగ్రేసరుఁడు. "వైష్ణవానాం యథాశివః" అని వ్యాసుఁడే పలికెను. నాల్గవ చరణమున మఱియొక్క రూపకము. ధ్యానాసక్తులగు మనుష్యుల పాపము లనెడు పర్వతములను భేదించెడు వజ్రాయుధము. జన్మ జన్మాంతర కృతము లైన పాపములు పర్వతములు గాక మరేమి? వజ్రాయుధ మెట్టుక్షణమాత్రమున పర్వతములను భేదించునో అట్లేస్వామి యొక్క పాదాబ్జముల ధ్యానమాత్రము చేతనే దుస్తరములైన కలుష పర్వతములను భేదించునని భావము. ఈ పద్యము యొక్క మొదటి చరణములో స్వామిపాదముల యొక్క మహాలక్షములను చెప్పినాఁడు. అనఁగా వస్తు నిర్దేశమని భావము. రెండవ దానిలో జ్ఞానప్రదాయిత్వము నభివర్ణించి నాఁడు. మూడవ దానిలో భాగవతులకు స్వామి పాదములందు విపరీతమైన రతిని వర్ణించినాఁడు. నాల్గవ దానిలో నఖరముల యొక్క పరాక్రమమును, సూచించినాఁడు. స్వామి స్వరూపమునకును, అతని అవతారములకును, అతని అవయవములకును, భేదము లేదని మధ్వ సిద్ధాంతము. అందుకే ఆయన హరివాయు స్తుతిలో ప్రథమ శ్లోకములను శ్రీ నారసింహుల యొక్క నఖవర్ణనాత్మకములుగా చెప్పెను.

వైష్ణవ సిద్ధాంతములో విభవావతారములకును, క్షీరోదశాయి యైన పరమ పురుషునకును భేదము లేదు. ఈ విషయమందు మధ్వాచార్యులు ఇంకను

కొంతముందుకు పోయిరి. అనేక భక్తులకు పాదములపై ననే విపరీతమైన అనురాగము. కొందరు తక్కిన స్వరూపము నంతయు మఱచి కేవల పాదములనే మనస్సున నిలిపి కొని యుపాసించుట కలదు. స్వామి యొక్క పాద సౌకుమార్యమును అందరికంటె గోపిక లతి సున్నితముగా భావించి రేమోయని అనుకొనవలసి వచ్చును. కఠినములైన మా కుచములపై నీ పాదములు నిక్షేపించి కొన్నపుడు అవి కందిపోవా యని వారు విలపించిరి. ఆ పాదములు భక్తులు కోరెడు కోర్కెలను సమగ్రముగా తీర్చునవి. రక్షించున వన్నమాట. రక్షణ యనఁగా అనిష్టనివారణ పూర్వకముగా ఇష్టమును సంపాదించి పెట్టుట. ఈ యభిప్రాయమునే" వినత వివిధ భూత వ్రాత రక్షిక దీక్షే" అనేడు రామాను జులశ్లోకమును వ్యాఖ్యానించుచు శ్రుత ప్రకాశికా వ్యాఖ్యయందు తద్వాఖ్యాతయు వ్యాఖ్యానించెను. యోగుల మనః పద్మములకు స్వామి పాదముల షట్పదముల వంటివి. అనఁగా పరమభక్తుల మనస్సునందు స్వామి పాదములే తామైవలచి ఆవేశించునని భావము. పద్మములు తుమ్మెదలను రమ్మని పిలుచుటలేదు. కాని తుమ్మెదలే పద్మముల గంధముచే నాకృష్టములై వాని మీఁదనే వ్రాలుచున్నవి. అట్లే స్వామికూడ మహా యోగుల యొక్క మనస్సులతో నాకరింపఁబడిన వాఁడై అతఁడే స్వయముగా వారి మనః పద్మములందు ఆవేశించును. అతని పాదములు కూడనంతే. భక్తుఁడొనర్చు ధ్యానము నిరుపమముగా నుండవలెను. అనఁగా తీవ్రమై సమాధి స్థితికి దగ్గరయని అర్థము."సాచస్మృతి దర్శన సమానాకారా"అని భగవద్రామానుజులు శ్రీ భాష్యమందు పలికిరి. స్వామి దర్శన మంత తీవ్రముగా ధ్యానముండ వలెనని భావము.

921. కమలజు మాతయై=బ్రహ్మదేవుని తల్లియై, సురనికాయ=దేవతా సమూహముచేత, సమంచిత=ఎక్కువ వైభవముతో, సేవ్యమానయై= సేవింపఁ బడునదై, కమల దళ=తామర రేకులతో, ఆభ=సమానములైన, నేత్రములు కలి=కన్నులు కలదై, హృదీశ్వరభక్తిన్=ప్రభువునందలి తీవ్రమైన భక్తిచేత కూడుకొన్న, అక్కమల=ఆ లక్ష్మీదేవి, నిజ+అంకపీఠమునన్=తన తొడలపైన, కైకొని=స్వీకరించినదై, ఒత్తు=పిసికెడు, ప రేశుజాను యుగ్మమున్=భగవంతుని యొక్క మోగాళ్ళను, హృద యారవిందమునన్=మనస్సు నందు, మక్కువన్ చేర్చి=ఆసక్తితో నిడికొని, భజింపఁగాన్ తగున్=భావింపవలెను.

తాత్పర్యము : బ్రహ్మదేవునికి తల్లియై-ఈమాట యోపచారికము బ్రహ్మదేవుని లక్ష్మీదేవి కనలేదు. అతఁడు స్వామి సంకల్పము చేత స్వామినాభి పద్మమందు జన్మించిన వాఁడు. అయినను శ్రీహరి భార్యయగుట చేత ఆమె బ్రహ్మదేవుని కన్నట్లుగనే చెప్పినాఁడు. దేవతలందరు ఆమె దయకు లోఁబడినవారే. ఆమె పురుష కార స్వరూపము. భక్తులను సంరక్షించి తీరవలెనని శ్రీమహా విష్ణువును పలుమా రామె ప్రేరేపణ సేయును. భగవంతుని పరోక్షమందు భక్తుని యందలి దయతో నమె భగవదున్ముఖునిగా నొనర్చును. లక్ష్మీదేవి పరమ కారుణ్యస్వరూపయని వైష్ణవ సిద్ధాంతము. అట్లే భగవంతుని గూడ భక్తుల యందు వాత్సల్యము కల్గియుండ వలెనని పలుమా రామె ప్రేరేచును.

ఉపదేశముతో నాతఁడు వినినప్పుడు తన సౌందర్యముతో నాతని లోఁగొని భక్తుల కధీనునిగా నొనర్చును. రామావతారమందు సీత భర్తృవియోగము మూఁడుసా ర్లనుభవించెను, మొట్టమొదటి వియోగము రావణుఁ డెత్తుక పోయినపుడు. అప్పుడామె రావణానురునిచేత చెరపెట్టఁబడిన అనేక దేవతా స్త్రీలను విడిపించుటకును, రావణునకు త్వరగా వైకుంఠ ప్రాప్తి కలించు టకును లంకకు వెళ్ళినది. ఇది రామునితో నామె పొందిన మొదటి వియోగము. రెండవది కుశలవుల జన్మమునకు ముందు లోకాపవాదమునకు వెఱచినట్లు నటించిన స్వామి ఆమెను వదలును. అపుడు పురుషకారమునకు కావలసిన అస్వాతంత్ర్యమును వెలువఱుచుటకై ఆమె స్వామి వియోగము నందినది. ప్రాణత్యాగ మొనర్చుకొనుట కామెకు స్వాతంత్ర్యము లేదు. రఘు కులమునకు శ్రీరామ చంద్రునకును అపకీర్తి కలుగునని ఆమెభయము. కుశలవుల జన్మకు ముందే ప్రాణహత్య యొనర్చుకొనిన వంశము నిలిచి పోవునని వెఱపు. పుత్ర జన్మానంతరము ప్రాణములు వదలుద మనుకొన్నచో రామున కపకీర్తి కలుగునని భావము. మూఁడవ సారి వియోగము భూగర్భమందామె ప్రవేశించి నపుడు. అమె ఎందుకు భూగర్భమునకు పోయినది? అనన్యార్హత్వమును సూచించుటకు. నేను నీదానను తప్ప పరులకు చెందిన దానను కాను. నీకు పనికి రానప్పుడు నే నవతారమునే చాలించెద ననుభావముతో ఆమె భూవివరమును జొచ్చినది. పురుష కారమునకుఁగావలసిన ఈ మూఁడు గుణములే కృపా విశేషము. అస్వాతంత్ర్యము, అనన్యార్హత్వము ఈ మూఁడును లక్ష్మీదేవి యందు సమృద్ధముగా నున్నవి. పై మాటలన్నియు వైష్ణవ సిద్ధాంతములే. అందుకే సమస్తదేవతలును ఆమె పురుషకారము వరించిరో. ఆమెకు దాస్య మొనర్చుచుందురు. ఇన్ని భావములను మనస్సునందుంచుకొనియే యామునా చార్యుల వారు తమ చతుశ్లోకిలో "బ్రహ్మాంద్రాది సురవ్రజ స్సదయితః త్వద్దాసదాసీ జనః" అన్నాఁడు. మూఁడవ మాటతో లక్ష్మీదేవియొక్క సౌందర్య విశేషమును చెప్పుచున్నాఁడు. కన్నులను మాత్రమే చెప్పుట తక్కినవి సుందరములు కాదని కాదు. ఉపలక్షణముగా చెప్పినాఁడు. అనఁగా తక్కిన అంగము లన్నియు ఆ కన్నుల అందమున కెట్టుండవలెనో అట్లే యున్నవని భావము. అందుకే వాల్మీకి రామాయణములో రాముని గూర్చి "సమస్యమ విభక్తాంగఁ" అన్నాఁడు. సర్వాంగములును వాని వాని అందములతో వాని వాని స్థానమును మీఱక యున్నవని భావము. ఏ అంగమును వేఱొకదానియందు దురాక్రమణ మొనర్పలేదు. వాల్మీకి శిష్యుఁడైన కాళిదాసు కూడ పార్వతీదేవిని వర్ణించుచు' బభూవతస్యాశ్చతురస్రశోభి' అన్నాఁడు. అనఁగా నాలుగు వైపులను సమముగా నందమొప్పినదని భావము. అట్టి ఆ లక్ష్మీదేవి స్వామి యొక్క జానువును తొడపైనఁ జేర్చికొని ఆతనికి బాధకలుగ కుండునట్లుగా తిన్నగా నొత్తుచున్నది. సాధకుఁడా లక్ష్మీదేవి వలె తాను స్వామి యొక్క జానువులను తిన్నగా నొత్తుచున్నట్లు భావించు కొనవలెనని ఆరము. ఈ సందర్భమున మధురభక్తి ఎక్కడో మృదువుగా ధ్వనించు చున్నది.

922. అతసీ కుసుమద్యుతిన్-అతసీ=అవిసె యొక్క, కుసుమ=పూల యొక్క, ద్యుతిన్=కాంతిచేత, పంకేరుహ నాభుఁడు=పద్మము నాభియందు

కలవాఁడు, అకిల్బిష భక్తిన్=వంచన లేని భక్తితో, మానసాంభోరుహ మందున్=మనస్సనెడు పద్మమందు, అంగనామణీ=స్త్రీలలో గొప్పదానా!

923.పరిలంబిత=వ్రేలాడుచున్న, మృదు=శుద్ధమైన, పీతాంబర=పచ్చని పట్టుచేతను, కాంచీగుణ=మేఖల యొక్క, నినాద=శబ్దముచే, భరితము=నిండినది, అప్పురుషోత్తముని నితంబము=ఆ శ్రీమహావిష్ణువు యొక్క నితంబమును, తద్దయున్ ప్రీతిన్=ఎక్కువ ప్రీతిచేత, భజియింప వలయున్=ధ్యానింప వలెను.

924. భువనాధారత్వంబునన్=సమస్త భువనముల కాధార మగుటచేత, విధి జనన హేతుభూతంబు=బ్రహ్మదేవుని జన్మకు కారణ భూతమైనట్టి, అవ్వనజాతముచేన్=ఆ పద్మముచేత, నాభీ సరస్సునన్=సరస్సువలె లోతైన బొడ్డును.

925. దివ్య=గొప్పవైన, మరకతరత్న=మరకత మణులవలె, సందీప్త ప్రకాశించుచున్న, లలిత కుచములను=అందములైన కుచములచేతను, మౌక్తికావళి=ముత్యముల యొక్క గుంపు యొక్క, రుచులన్=కాంతులచేత, ఇందిరాదేవి సదనమై=లక్ష్మికి నివాసస్థానమై, ఎసక మెసఁగు=గొప్పశోభను సంతరించుకొన్న, వక్షము=ఎద,

926. సజ్జన=సత్పురుషుల యొక్క, మనోనేత్ర=జ్ఞాననేత్రమునకు, అభిరామ=అందమైన, ఏక=అనన్యా దృశమైన, సుస్థిర దివ్యప్రభా=స్థిరమైనకాంతి విశేషమును కలినటి, కౌస్తుభరుచి శిష్టంబునై=కౌస్తుభకాంతిచేత ఆవేష్టింపఁబడినదై, వరయోగీశ్వర వంద్యమానుండు=మహాయోగీశ్వరులచేత సేవింపఁబడునట్టి, సర్వస్వామి=సకలమునకు యజమానుఁడైన, లక్ష్మీశ కంధరము=శ్రీ మహావిష్ణువు కంఠమును, ఆత్మన్ గదియించి=మనస్సున ధ్యానించి, తదుణ గణధ్యాసంబు=ఆ లక్ష్మీశ్వరుని యొక్క అనేక గుణములను, ధ్యానము చేయవలెను.

927. ఘన=ఎత్తైన, మందరగిరి=మందర పర్వతము యొక్క, పరివర్తన=తిరుగుట చేత, నికష=రాపిడులతో, ఉజ్జ్వలిత=ఇంకను ప్రకాశమానము లైన, లోకపాలకులను కలిన=లోకపాలకులని భావించుటకు తగిన, బాహుశాఖలను=బాహువులను, తలపఁదగున్=ధ్యానింప వలెను.

తాత్పర్యము : వేదాత్మకుఁడైన గరుడుని భుజస్కంధము లపై స్వామి విరాజిల్లుచుండును. భగవంతుని అన్ని అవతారములలోను వైనతేయునకు సంబంధము కలదు. అందుచే నాతనిని"పెరియతిరువడి" అని అందురు. రామావతారమందుఁగూడ యుద్ధకాండలో గరుడుని ప్రవేశమున్నది. తక్కిన యవతారములతో సంబధము లేక కేవలము రామావతారముతో మాత్రమే సంబంధము కలిగియుండుట చేత హనుమంతుని "శిరియతిరువడి" అందురు. ఇది వైష్ణవ సిద్ధాంతము . మాధ్వమతస్థులు హరి సర్వోత్తముఁడని వాయువు జీవోత్తముఁడని అందురు. హనుమంతుఁడు జీవోత్తముఁడగుటచేత సమస్త లోకములకును గురువగుటకు అర్హుఁడు. వారి సిద్ధాంతములో వాయువు భవిష్యద్బ్రహ్మ. సమస్త వేదముల కత ఢధినాథుడని వైష్ణవ సిద్ధాంతము.

గరుడవ్యూహము వేదాత్మకమైనది. అట్టి గరుడని మూపుపై శ్రీమహావిష్ణువు నిరంతరముండును. గరుడుఁడు విష్ణువు వాహనముగా నంగీకరించుటకు ఏర్పడిన కథ భారతములో వినుచున్నాము. వాలఖిల్యాది మహామునులు యజ్ఞము కొఱకై యిధ్మములను మోసికొని వచ్చుచుండఁగా ఇంద్రుని సృష్టించు తలంపుతో తమశక్తులు ధారవోసిరి. వైనతేయుని సృష్టించినారు. పరిహసించిన వారిలో కశ్యపుఁడు కూడ ఉన్నాఁడు. అప్పుడు వినతాగర్భమున గరుడుఁడుద్భవించినాఁడు. ఆతఁడింద్ర పదవికై పోటీ చేసెను. దేవత లాతని జయింపలేక పోయిరి . శ్రీమహావిష్ణు వాతని పక్షీంద్రత్వము నిచ్చినాఁడు. ఆతఁడు స్వామి వాహకత్వమున కంగీకరించినాఁడు. గరుడుని జన్మము తద్విలాసము వీనికి సంబంధించిన కథలు భారతములో వినవచ్చును. ఆనాటినుండి గరుడుఁడు విష్ణువునకు వాహనము. ఆ గరుడ వాహనమపై వేంచేసిన స్వామిని మనిస్సునందు భావింపవలెనను చున్నాఁడు. ఆతని శరీరము నల్ల అవిసె పూవువంటిది. అవిసెలో రెండు జాతు లున్నవి. ఒకదాని పూలు తెల్లనివి. వేఱొకదాని పూలు నల్లనివి. తెల్లవి సెపూలను నవ్వులతో పోల్చుటయు, నల్లవిసెలను శ్రీమహావిష్ణుతో పోల్చుటయు కవిసమయము. ఆ స్వామి పంకేరుహ నాభుఁడు. ఆతని బొడ్డునుండియే లోక సాంకేతికమైన పద్మ మేర్పడినది. దానియందు బ్రహ్మదేవుఁడుద్భవించినాఁడు అవి మూఁడుగా పదునాలుగా చీలినవి. అవియే లోకత్రయ, చతుర్దశ లోకములకు సంకేతము. 'పంకేరుహము' ఈ శబ్దమలుక్క మాసము. ఇక్కడ నకిల్పిష భక్తి యనఁగావంచన లేని భక్తి యని తాత్పర్యము. అనఁగా త్రికరణ శుద్ధితో కూడినది. స్వామి పాపములనైన సహించునుగాని వంచనలను సహించఁడు. ఈ రీతిగా ప్రకాశించుచున్న ఆయన యూరువులను మనస్సున నిల్పికొని భావింప వలె ననుచున్నాఁడు. స్వామి ధరించినది పట్టు పీతాంబరము. ఆయన ధరించిన పట్టు పచ్చని రంగు కలది. దానిపైన మేఖల. ఆ మేఖలకు అలంకరించిన గంటలు. అవి నానారత్నఘటితములై యున్నవి. పైగా మృదు మధురముగా ధ్వనించు చుండెను. స్వామి నితంబము శబ్దించుచున్న మేఖలతో ద్విగుణీకృతమైన యందమును వహించు చున్నది. ఇచ్చటి పురుషోత్తమ శబ్దము పరమ సారకమైనది." అధాతో ధర్మజిజ్ఞాసా" అను సూత్రమును వ్యాఖ్యానించుచు భగవద్రామానుజులు బ్రహ్మశబ్దమునకు అఖిల కల్యాణ గుణాకరుఁడైన పురుషోత్తముఁడే వాచ్యుఁడని చెప్పెను. తక్కినవా రందరిది కౌపచారికము. భగవచ్ఛబ్దము రామానుజులు ఇతరుల యం దౌపచారిక మని శ్రీభాష్యమును వాదించినాఁడు.

వల్లభ సంప్రదాయములో కృష్ణ పరమాత్ముఁడొక్కఁడే పురుషుఁడు. తక్కిన వారందరును స్త్రీలే. వ్యావహారిక ప్రపంచమున పురుషులైనను వారు స్త్రీలే. దీనికి కారణములు రెండు. ప్రకృతికి లోఁబడి యుండుట, పర తంత్రులై యుండుట- ఈ రెండును స్త్రీలక్షణములు. అందుచేత ప్రపంచ మంతయును స్త్రీమయముగా వల్లభాచార్యుఁడు తేల్చివేసినాఁడు. అట్టి స్వామి యొక్కనితంబ ప్రదేశమును పరమ ప్రీతితో ధ్యానింపవలెనని కపిలుఁడను చున్నాఁడు. నాభీసరస్సును వర్ణించు చున్నాఁడు. స్వామి నాభీసరస్సు మహాగంభీర

మైనది. భువనాత్మకమైన పద్మమున కాధారమైనది. ఇక్కడ భువన శబ్దము శేషము. లోకములు జలమని రెండర్థములు. ఒకర్థమునందు షష్ఠీసమాసము. భువనములకు లోకములకు ఆధార భూతమైనదని భావము. రెండవ అర్థమందు బహువ్రీహి. భువనము ఆధారముగా గలది. క్షీరోదశాయి నాభీ సరస్సునం దుద్భవించినది. ఈ యర్థమును తోపింపఁ జేయుటకే నాభిని సరస్సుతో పోల్చినాఁడు. ఇఁక రమారమణుని స్తన యుగమును చెప్పుచున్నాఁడు. అవి రెండును మరకత మణుల యొక్క కాంతితో ప్రకాశించుచున్నవి. ఆ రెంటిపైన ముత్యాల సరాలు. వాని తెలని కాంతులు. లక్ష్మీదేవి స్వామి యొక్క వక్షఃస్థలమందు నిరంతరము వసించి యుండును. ఆతని వక్షఃస్థలసంబంధ మేమెకు నిత్యమైన దగుటచే లక్ష్మీ దేవికి వ్యూహలక్ష్మియని మఱియొక పేరు. తరువాత నాతని కంఠమును వర్ణించుచున్నాఁడు. ఆతని కంఠము కౌస్తుభమనెడు రత్నము యొక్క కాంతితోఁ గూడుకొన్నది. ఆ కాంతి ఎప్పటికినీ చెరగిపోవనిది. నిత్యమైనదన్నమాట. తన్ను భజియించు యోగులకు జ్ఞాన ప్రాప్తినొనగూర్చునది. మనోనేత్రమనఁగా జ్ఞానము. లేక సత్పురుషుల మనస్సునకును నేత్రములకును ఆనందము కలించునది అనునర్థము చెప్పవచ్చును. ఆ స్వామిని సందర్శించు యోగ్యత మహాయోగీశ్వరులకే. ఆయన సర్వలోకములకును స్వామి. లక్ష్మి కధికారి యైనవాఁడు. వైష్ణవ సిద్ధాంతములో లక్ష్మీనారాయణులఁ కభేదము. వారిరువురు సమస్త జగముల కాధారభూతులు. ఈ వైష్ణవులలోనే మఱియొక సంప్రదాయమునకు చెందినవారు లక్ష్మీదేవికే ఎక్కువగా పట్టుముగట్టిరి. అట్టి ఆ స్వామి కంధరమును భావించుచు ఆతని లోక కళ్యాణ కరములైన గుణములను భావింపవలెనని తాత్పర్యము. స్వామికళ్యాణ గుణము లనంతములు. లక్ష్మీదేవి గుణములు కూడ అనంతములు. మాధ్వ సిద్ధాంతములో లక్ష్మీదేవి కూడ జీవియే. ఆమెకోటి గుణముల కధికారిణి. శ్రీమహా విష్ణు వనంత గుణముల కధికారి. వారికి తారతమ్య మది. ఇచ్చట స్వామి యొక్క గుణములను ధ్యానింప వలెనని ఇంకను కంధరము యొక్క సౌందర్యాది గుణముల నైనను భావింప వలెనని అరము చేసికొనవచ్చును. ఆపైని క్షీరసాగరము కథను చెప్పుచున్నాఁడు. క్షీరసముద్రమును మథించినపుడు మందరర పర్వతమును కవ్వము చేసికొన్నారు. దానిని మథించుచుండిరి. తోకవైపు పట్టుకొన్నది దేవతలు. తలవైపు రాక్షసులు. ఆ మందర పర్వతము తిరుగునపుడు అది పరమేశ్వరుని బాహుపురులను మాటిమాటికి రాచుకొనుచున్నది. బాహు పురులనే కాక తక్కిన సొమ్ములను రాచుకొనుచున్నది. ఆ రాచుకొనుట సొమ్ముల కొరపిడిపెట్టినట్లగుచున్నది. దానితో నాభూషణములు మఱింతగా ప్రకాశించుచున్నవి. అయన బాహువులు లావై పొడవుగా ఉన్నవి. అందుకే వానిని వృక్షశాఖలతో పోల్చినాఁడు పోతన. అట్టి శ్రీమహావిష్ణువు యొక్క భుజములను ధ్యానింప వలెనని తాత్పర్యము.

928. విమత జన అసహ్యాంబులు=శత్రువులకు సహింపరాని తేజో విశేషము గల్గినవి, సహస్రారంబులు=అనేకములైన కొనలు. ఆ చక్రాయుధము యొక్క కొనలు తేజోవిశేషము చేతను, సంఖ్యా విశేషము చేతను శత్రువులకు

ఓర్చుకొనుటకు అసహ్యములై యున్నవని భావము. సరసిజోదర=శ్రీమహావిష్ణువు యొక్క, కరసరోరుహమందు=హస్తాబ్జమందు, రాజహంస రుచిరంబు=రాజహంసవలె ప్రకాశించుచున్నది. స్వామి యొక్క హస్తమును పద్మమునకు పోల్చినాఁడు. అందుచేత శంఖమును రాజహంసముగా చెప్పవలసి వచ్చినది. రాజహంస తెల్లఁగా నుండును. శంఖము కూడనట్టిదే. పైఁగా తెలుపు వర్ణము సత్త్వగుణమునకును, జ్ఞానమునకును సంకేతము. శంఖము జ్ఞాన ప్రదమైనది. ధ్రువునకు శ్రీహరి సాక్షాత్కరించినాఁడు. ధ్రువుఁడు చాలా చిన్న వాఁడగుటచేత స్వామిని గూర్చి ఏమనుటకును అనభిజ్ఞుఁడయుండినాఁడు. ఆ సర్వేశ్వరుఁడు తన శంఖముతో వానిని దాఁకెనట. వెంటనే జ్ఞానోదయమై స్వామిని స్తుతించుటకు మొదలు పెట్టినాఁడు. అరాతిభట=శత్రువుల యొక్క, శోణిత కర్దమ=రక్తముయొక్క బురదచేత, లిప్త=పూయఁబడిన, అంగంబై=ఆకారము గలదై అనఁగా యుద్ధములలో శత్రువులను చంపుటచేత, వారి రక్తము కొమోదకికి ఎక్కువగా చుట్టుకొన్నది. అది బురదగా నున్నది. భగవత్ప్రీతి కారిణీం=భగవంతునకు ప్రీతిని కలిగించునది. అనఁగా యుద్ధములందు గొప్ప పరాక్రమమును కనపఱచి విష్ణువున కెక్కువ ప్రీతి కలిగించినదని భావము. ఆ తరువాత వైజయంతిని వర్ణించు చున్నాఁడు. బంధుర=నిండిన, సుగంధగంధ=సువాసన గల్గిన గంధము యొక్క, అనుబంధ=సంబంధము గల్గిన, మంద గంధవహ=మందముగా ప్రసరించు వాయువుచేత, ఆహూయమాన=పిలువఁబడుచున్న, పుష్పంధయ=తుమ్మెదల యొక్క, ఝంకారనినద=ఝంకార శబ్దములచేత, విరాజిత=ప్రకాశించుచున్న, వైజయంతీ వనమాలిక=పాదముల వఱకు వ్రేలాడెడు వైజయంతి హారము. ఆ వనమాలిక సుగంధము అనన్యముగా నున్నది. మెలగా వీచుగాలులు ఆ సుగంధముచే నావరింపఁబడి దానిని దిక్కులకుఁగొనే పోవుచున్నవి. ఆ సుగంధమును ఆస్వాదించి తుమ్మెదలు పరువెత్తికొని వచ్చుచున్నవి. అవి సుగంధము నాస్వాదించి తుమ్మెదలు పరువెత్తికొని వచ్చుచున్నవి. అవి సుగంధము నాస్వాదించుటయే కాక ఝంకారములు గూడ నొనర్చుచున్నవి. ఆయన యొక్క కౌస్తుభమణి జీవతత్త్వమునకు సంకేతము. వీని నన్నిటినీ వేఱు వేఱుగా ధ్యానింప వలెనను చున్నాఁడు కవి. భక్త సంరక్షణార్థము=భక్తులను రక్షించుట కొఱకు, అంగీకృతంబు=సమ్మతింపఁబడినట్టి, అనురూపంబు=తగినది, మకరకుండల=మకరాకార కుండలముల యొక్క, రుచినిచయ=కాంతి సమూహములచేత, మండిత=ప్రకాశించుచున్న, ముకురోపమాన=అద్దముతో సమానమైన, నిర్మల గండ మండలంబు=స్వచ్ఛమైన కపోలముల జంట, శ్రీనివాసంబులు= కాంతితో గూడినవి, భ్రూలతాజుష్టము=భ్రూలతలతో కూడినది, మధు కరోపమాన=తుమ్మెదల వంటి, చికుర విరాజితము=వెండ్రుకలతో కూడినది. స్వామి సగుణుడు. నిరుణుడు కూడ. ఆయన భక్తులను రక్షించుట కొఱకే దివ్యమంగళ విగ్రహమునంగీకరించును. ఆ మంగళవిగ్రహమునకు తగినట్టి నాసిక. మకరాకారములైన కుండలములతో ప్రకాశించుచున్న అద్దముల వంటి కపోలములు. దివ్యకాంతుల కాకరములైన నేత్రములు. జంపుగాను, ధనుస్సును బోలిన కనుబొమ్మలు.

తుమ్మెదలవలె నల్లగానున్న కేశములు. వానితో ఁ గూడిన ముఖకమలము. ఈ యంగముల నన్నిటిని వేఱు వేఱుగా నకల్మషమైన చిత్తముతో ధ్యానింప వలెనని చెప్పినాఁడు.

929. గురు=ఎక్కువైన, ఘోర రూపకంబై=ఘోరమైన స్వరూపము గలదై, తాపత్రయ=త్రితాపముల, ఉపశమనార్థము=తగ్గించుట కొఱకు, శ్రీహరి చేతన్=పరమేశ్వరుని నుండి, నిసృష్టములు=వదలఁబడినవి, కరుణాలోకములన్=కరుణచేత కూడిన చూపులను, బుద్ధిన్ తలంపఁగా తగున్=బుద్ధియందు భావింప నగును.

తాత్పర్యము : తాపత్రయములు మనుష్యుని పీడించుచుండును. ఆధి దైవతములు, అధి భౌతికములు, ఆధ్యాత్మికము లని మూఁడు విధములు. సంసారమనునది వీనిచేత వ్యాప్తమైనది. ఆధి దైవత తాపములు మనస్సు నెపుడు అంటి యుండును. అవి పూర్తిగా నశించుటకు శ్రీమహా విష్ణువు యొక్క కరుణతో కూడిన చూపులు ఆశ్రయమై యుండును. సంసారమందలి దుఃఖములు పోఁగొట్టుట కొనర్చెడు క్రియలు వ్యక్తిపైనున్న భారమును భుజములపై కెత్తుకొనుట వంటిది. ఆ ప్రతిక్రియచే మఱికొన్ని కష్టము లేర్పడును. కనుక ఆత్యంతికములైన కష్టములు భగవత్కటాక్షవీక్షణములచే తొలఁగుచున్నవి. అట్టి ఆ కరుణా కటాక్షములను మనస్సునందు భావింపవలెనని తాత్పర్యము.

930. సౌజన్యనిధీ=సుజనత్వము కల్గిన ఓ దేవహూతీ! ఘనరుచిగల=ఎక్కువ కాంతిచే నొప్పుచున్నట్టి, మందస్మితమునకున్=చిరునవ్వునకు, అనుగుణము=తగినట్టిది, అగుప్రసాదమును=అయినట్టి శ్రీహరిదయా విశేషమును చిత్తములోనునిచియున్=మనస్సునందు నిలిపికొని, యోగి జనాళికిన్=ఎపుడున్=మహా యోగులైనవారి సమూహమునకు, ధ్యానము సేయన్ చనన్=నిరంతరము ధ్యానింప వలెను.

తాత్పర్యము : స్వామి యొక్క మధురాధరమునుండి మందస్మిత మెప్పుడును బయలుదేరు చుండును. మందస్మిత మనఁగా చిరునవ్వు. నవ్వు ననేకరీతులుగా అలంకార శాస్త్రము వివరించుచున్నది. మందస్మితము మహాపురుషుని చిత్తైన్నత్యమునకు గుర్తింపు. శ్రీహరియొక్క మందహాసములో ఎప్పుడును ప్రసాద గుణము వెల్లివిరియు చుండును. ప్రసాద మనగా భుక్తి అభిముఖ్య మన్నమాట. వీని మేనస్సులో హరిని సేవింతమని తలఁపు తోఁచిన వెంటనే శ్రీహరి యొక్క దృష్టి ఇతని కభిముఖముగా నగును. ఆ దృష్టితో పాటు మందహాసము. మందహాసములోని వాత్సల్యము. ఆ హృదయ ప్రసాదమును మనస్సులో నించికొని యోగు లెప్పుడును ధ్యానించు చుందురు. హరి యొక్క దయా విశేషమును భావించు టెట్టు? అది యొక పదార్థము కాదు కదా? నిజమే! భక్తాభి ముఖములగు నాతని కథలను గూర్చి ధ్యానింపవలె నన్నమాట. గజేంద్రో పాఖ్యానము, కుచేలో పాఖ్యానము మొదలైనవి. ఆ కథలను మననము చేసినపుడు ఆతని కరుణావిశేషము చిరునవ్వుతో భావించు కొనుటకు వీలగును.

931.నతశిరులు=వంచిన తలలు కలవారు. భూజనములు=భూమియందలి జనులు, శోకబాష్ప=దుఃఖ బాష్పములనెడు, అంబు=నీటితో కూడిన, జలధి=సముద్రమును, సంశోషకంబు=ఎండింప చేయునది. అతి+ఉదార తమము=సద్గుణములను ప్రదర్శించుటలో గొప్పత్యాగము కల్గినట్టి, హరిహాసము=శ్రీ మహావిష్ణువు యొక్కనవ్వును, తవిలి=ఏకాగ్రమైన బుద్ధి కలవాఁడై, ఆత్మలోన్ తలపఁగవలయున్=మనస్సులో భావించుకొనవలెను.

తాత్పర్యము : తన్ను తలచి ఎవ్వఁడొక్కమారు తలను వంచునో వాని దుఃఖ బాష్పములతో నిండియున్న సముద్రమును ఎండింపఁ జేయునది శ్రీహరి యొక్కనవ్వు. దానిని పూర్ణముగా అభిముఖమైన మనస్సులో భావింపవలెనని తాత్పర్యము. 'నతశిరు లనుటలో కాయికమైన భక్తిని చెప్పుచున్నాఁడు. మానసిక వాచిక భక్తులు దానివెంటనే యున్నవి. ఈ మూటి కైకర్యతలేని భక్తి నిరుపయోగము. కనుక నిచ్చట కాయిక భక్తిని చెప్పుటతో తక్కిన రెంటినికూడ చేర్చుకొనవలెను. కాయిక భక్తి అనేక విధములు. వాని భేదములు నారదభక్తి సూత్రములలో వచ్చును. పూజాదులందను రాగము కూడ కాయిక భక్తియే. పూజయను నపుడు పుష్పములు, ఫలములు సాకారులగు వారి నర్చించుటకు కావలసినవి. ఓక్కొక్కన వాసనా ద్రవ్యములు, శ్రీహరి కర్పించుట కేర్పరుపవలసిన నైవేద్యములు, అర్ఘ్యపాద్యాదులకు స్వచ్ఛజలము-వీనిని సంపాదించుట కొనర్చెడు ప్రయత్నములు ఇవన్నియు కాయిక భక్తిలోనే చేరును. కేవల కాయిక భక్తితోనే తరించిన మహాత్ములెందరో కలరు. కాయిక భక్తిలో ముఖ్యముగా సహకరింప వలసినది మనస్సు. చేష్టయనునది యుండనే ఉన్నది. పూలు మొదలైనవి సంపాదించుటలో కూడ భగవన్నామోచ్చారణ మను స్మృతముగా నుండవలెను. గర్భమార్జనిరంతరము మననసేయు చుండుటకూడ ఒక భక్తి యని వివరించినాఁడు. పారాయణాదులు దీనిక్రిందికే వచ్చును. భావపూరిత మనస్సుతో కథలను మనన మొనర్చవలెను. పై జెప్పిన వానిలోనేదేని మారము ననుసరించి పరమాత్ము నుపాసించెడు మనస్వికి శ్రీహరి రక్షణ సమకూడితీరును. ప్రపంచమంతయు దుఃఖమయమే యని ఒక సిద్ధాంతము. స్త్రీగాని పురుషుఁడు గాని దుఃఖార్తుఁడు జీవితములో కావలసినదే. జీవితములో దుఃఖమెందుకు వచ్చును? మానవునిలో నేర్పడెడు సుఖదుఃఖములకు ప్రాక్తన కర్మయే కారణ మనియు జ్ఞాను లందరు వివరించిన యర్థము. కర్మ నంగీకరించినపుడు దాని గర్భమందే భూత భావి జన్మ లున్నవి. ఆత్యంతికమైన క్షేమము భగవద్భక్తితోఁగాని సిద్ధింపదు. జీవునిపై నెప్పుడు స్వామి కవ్యాజవాత్సల్యము. అందుచే నాతని హాసమెప్పుడును అత్యుదారమై యుండును. ఈ గుణము లన్నిటిని మనన మొనర్చుకొనుచు శ్రీహరి హాసము మనన మొనర్చుకొనవలెనని తాత్పర్యము.

932. మకరకేతనునకున్=మన్మథునకును, మోహనంబు=మోహింప చేయునది. స్వకీయ=తనయొక్క, మాయా విలాసమునన్=మాయ యొక్క అనేక విభ్రమములచేత, రచితంబైన భ్రూమండలంబునున్=ఏర్పరుపఁబడిన

కనుబొమ్మల జంటను, ముని=మునుల యొక్క, మనః కుహర=మనస్సులనెడు గుహలను, సమ్మోదమానుఁడు=సంతోషింప చేయునట్టివాఁడు. నవపల్లవ=నూత్నములైన చిగురుటాకుల యొక్క, అధరకాంతిచేన్=మెరుపువంటి ఎఱుపు గలిగి పెదవుల కాంతిచేత, అరుణమైన ఎఱవారిన, మొల్ల మొగ్గలకాంతిన్ =మల్లెమొగ్గల కాంతిని, ఉల్లసంబొడెడు=అధిక్షేపించెడు, దంత పంక్తియున్= దంతములఁ సమూహమును, మదిన్ తలపవలయున్ =మదిలోఁదలంపవలెను. ఈ రీతిన్=ఇట్లుగా, వేఱువేఱున్=భిన్నభిన్నములుగా, సంచిత=సంపాదించి కొనఁబడిన, ధ్యాన=ధ్యానము యొక్క, నిర్మల స్థానములుగన్=నిర్మలములైన ఆధారములుగా, మనములోన్=మనస్సు నందు కనుము, అనిచెప్పి=వీక్షింపుమని పలికి, తేటపడఁగన్=స్పష్టముగా.

తాత్పర్యము : పరమేశ్వరుని మాయావిలాసములు అసామాన్యమైనవి. మకర కేతనుఁడనఁగా మన్మథుడు. అతని ధ్వజము మొసలి. వాఁడును ప్రపంచముల మోహింప చేయును. సమస్తములైన ఇంద్రియముల పైనవాని కధికారము. మనస్సుపైనకూడ. మనస్సునం దద్భూతమైన మకరకేతనునిశక్తి ఇంద్రియములను తత్తత్కార్యములకు ప్రేరేచును. అవియన్నియు వైషయిక వ్యాపారములందు ప్రవృత్తము లగును. మోక్షమును కోరుకొనినంతవరకు మన్మథుని సామ్రాజ్యమేయని భారతము శాంతిపర్వములో చెప్పఁబడినది. శ్రీహరి యొక్కమాయా విలాసము మదనుని గూడ మోహింపచేయును. మన్మథుని మనస్సును గూడ వంచించి వైషయిక వ్యాపారములందు ప్రవర్తింపఁ జేయుశక్తి గలదని భావము. మునుల యొక్క మనస్సు వైరాగ్య చిహ్నిత మైనది. భగవంతుని మాయ వీని నాక్రమించు విధము మకరకేతనుని సామాజ్యమున కన్నునుచిన్నది. వారి కగు పించుమూర్తి వైరాగ్య సుందరముగా నుండును. వారు విషయ విరక్తులై సాక్షిభూతులుగా నిల్చి శ్రీమహావిష్ణువు మాయా విశేషమును గమనించుచుందురు. ఈ రీతిగా ఇరుతెఱఁగుల వాడికలది స్వామి యొక్క మాయా విశేషము. అతని భ్రూమండలమే మాయచేత నిర్మిత మనుచున్నాఁడు. ఆ భ్రూమండల చాలనములో అనేక విధములైన మోహనగుణములున్నవి. పరమర్షులకుఁగావలసిన వైరాగ్య భాసితములైన సౌందర్యమును అవిచూపును. మన్మథుని గూడ రెచ్చగొట్టు విషయ సుఖ ప్రరోచన మవి యొనర్చును. సర్వేశ్వరుని మాయావిలాసమునకు ప్రతిబింబమే అతని భ్రూమండల మను చున్నాఁడు. స్వామి యొక్క మందహాసము ముల మనస్సు లనెడు గుహలకు ఆనందము కలించునది. మనస్సులను గుహతో పోల్చుట గాంభీర్య ప్రదర్శనము. అల్పములైన దృశ్యములతో కదలింపఁబడెడు అల్పములైన మనస్సులు గల వారు మహర్షులు కారు. వారి హృదయములు మహా గంభీరములు. వారొకక్కపుడు తపస్సునుండి చ్యుతులై విషయములకు లోఁబడి నను వారి అనుభవము మహోన్నతమైనది; ఉదారమైనది. అటి మహర్షులు గంభీరమైన మనస్సులకుఁగూడ పరమానందమును గూర్చునది పరమేశ్వరుని మందహాసము. ఆచిరునవ్వు ఒక్కొక్క విప్రుషమైనను-అది బ్రహ్మానందపు ముద్ద. అంతయు ఆనందమే. ఆనంద సమ్మిశ్రితమైన

మరియొక్క పదార్థముకాదు. మహానందమే. స్వామి పెదవు లెఱ్ఱనైనవి. ఆఎఱుపు వసంత కాలములో నపుడే పొటమరించిన చిగురుటాకుల వంటి ఎఱుపు. ఆతని దంతములు మల్లెమొగ్గలవలె సన్న నివైయుండును. పెదవుల యొక్క కాంతి దంతములపై ప్రతిఫలించును. సహజధవళములైన దంతములు వానితెలుపును పూర్తిగా వదలవు. కాని పెదవుల యొక్కకాంతి వానిపైనొక్క తెరవలె కప్పును. అవి తెలుపు ఎఱుపుల సమ్మిశ్రణములై అందమును గూర్చును. ఈ రీతిగా స్వామియొక్క భిన్నభిన్నములైన అంగములను భిన్న భిన్నముగా భావింపవలెను. ఒక్కొక్క యంగమును మనస్సున నిలిపికొని సాధనచేయవలెను. ఆ అంగము పూర్తిగా మనస్సున నిలుచు వఱకు మఱియొక్క అవయవమునకు పోరాదు. ఇదియే సబీజయోగము. అనఁగా స్వామిని సగుణ స్వరూపునిగా మనస్సులో భావించుట.

933. ప్రతిలబ్ధ భావసంపన్నుఁడు, ప్రతిలబ్ధ=పూర్తిగా పొందఁబడిన, భావ=భావముచేత, సంపన్నుఁడు=కూడిన వాఁడు, చిరతర=చాలకాలము సాధింపఁబడిన, ప్రవృద్ధంబు=ఎక్కువగా వృద్ధిని పొందినది, అతి మోదమునన్=ఆనందాతిశయము చేత, పులకింత శరీరులు=పులకలతో నిండిన శరీరము కలవారు, మహోత్కంఠన్=ఎక్కువ ఆసక్తితో, జడిగొనన్=వానజడి వలెపట్టుకొనఁగా, పరితోష జలధిన్=ఆనందోద్రేకమనెడు సముద్రమందు, క్రుంకి=మునిఁగిన వాఁడై, భగవత్స్వరూపమై=భగవంతునితో సమానమైన శక్త్యాదికములు కలిగినదై, భవగుణ గ్రాహకము=అప్పటి కప్పు డేర్పడెడు కొత్త గుణములలో కూడినది, మత్సంబంధము=నాయొక్క సంసర్గమును, అనుకరించి=భావించి, సుమహిత ధ్యానమునన్=గొప్పధ్యానముచేత, పరంజ్యోతి యందున్=జ్యోతిస్స్వరూపమైన పరమాత్మయందు, నియోగించి=సంబద్ధముగా చేసినవాఁడై, ఆత్మలోనన్=మనస్సునందు, మోక్షపదమున్=మోక్షమును, అపేక్షసేయున్=కోరుకొనును. అనఘ వర్తనుఁడు=పాపములేని ప్రవృత్తి గలవాఁడు,

తాత్పర్యము : ఈ రీతిగా సాకారుఁడైన పరమాత్మయందు యోగి తీవ్రమైన భావము కలవాఁడై యుండును. ఇట్టి సద్భక్తిని మహాయోగి చాలకాలము సాధించును. సమాధి స్థితిలో ఆ పరమేశ్వరుని భావము హృదయమందు భాసించినపుడు గొప్పదైన ఆనంద మేర్పడును. శరీర మంతయు పులకలు నిండికొనును. స్వామి ఆకారము క్షణక్షణమునకును నూత్న నూత్నముగా కనపడునది. అందుచే పలుమారు చూడవలెనని ఆశ, చూచు కొలఁది నానందము. ఆనంద బాష్పములు కన్నులనుండి కాఱిపోవుచుండును. సంతోష మనెడు సముద్రమున వాఁడు మునుకలువేయును. వానియప్పటి స్థితి భగవత్స్వరూపముతో అద్వైతమే యగుచున్నది. స్వామి యనెడు మత్స్యమును గ్రహించుటకు వానిచిత్తము బడిశమువలె నుండును. తీవ్రభావనతో వాని మనస్సు శక్తిమై పోవును. తానే పరంజ్యోతి యనెడు భావము వాని మనస్సున తీవ్రముగా నెలకొనును. అపుడు వాని చిత్తమందు మోక్షమను నొక్క పదార్థము మాత్రమే మెలఁగుచుండును. పుణ్యపాపములతో వానికి సంబంధముండదు. నిరంతర సమాధి స్థితియే వానిజీవనమై యుండును.

934. అదిగావునన్=అందుచేత, ముక్తిన్ అపేక్షించి=ముక్తిని కోరుచున్న వాఁడై, మహాత్ముండగు వానిచిత్తంబు=ఎక్కువ గొప్పతనము కల్గిన వాని యొక్క మనస్సు,విముక్తంబైన=వదలఁబడిన, భగవత్+వ్యతిరిక్త+ఆశ్రయంబు= భగవంతుని కన్నను భిన్నమైనట్టి ఆధారము కల్గినదై, విషయాంతర శూన్యంబై-విషయాంతర=అన్య విషయములచేత, శూన్యంబై=రిక్తమై, విరక్తిన్ పొందుటంజేసి=వైరాగ్యము పొందుటవలన, పురుషుండు=సాధకుఁడైన వాఁడు, శరీర భావంబులన్=శరీరమునకు సంబంధించిన భావములచేత, అనన్యభావము= ఇతరమగు స్వభావము లేనట్టిది, అయినట్టి నిర్వాణ పదంబున్=అయినట్టి మోక్షమును, సూక్ష్మంబగు తేజంబు=సూక్ష్మమైనట్టి అగ్నివిశేషము, తనకంటె నధికంబగు తేజం బుతోడి=తనకంటె గొప్పదైన తేజముతో, సమానాకారము= సమానమైన ఆకారము కల్గినది, చందంబునన్=వలె, ఇచ్ఛయించున్=కోరును.

తాత్పర్యము : జీవన్ముక్తుని విధమును చెప్పచున్నాఁడు. వాని దృష్టియంతయు లోకముతోడి సంబంధము వదలిన విముక్త స్థితియై ఉండును. వానీ మనస్సు భగవంతుని విషయమును దప్ప ఇతర విషయమందు ప్రవర్తింపనే ప్రవర్తింపదు. లౌకికములైన విషయము లన్నియు వానినుండి తమకు తాముగా వదలి పోయియుండును. మొదలు వీని ప్రయత్నము చేతనే అవి వానికి లోఁబడి యుండును. సర్వకాల సర్వావస్థలయందును వివేకము వానిని నీడవలె అంటియుండుటచేత భగవద్వ్యతి రిక్తములగు భావములు ఎంతగా ప్రయత్నించినను-(అనఁగా ఎంత బలముగలవై యున్నను) వానిని లోఁబఱుచు కొనలేవు. వాని మనస్సు విషయాంతర శూన్యమై స్వచ్ఛమైన సత్త్వగుణముతో కూడినదై శరదాకాశమువలె ఉండును.సత్త్వగుణమునందు కూడ వానికి మమతలేదు. రజస్తమస్సుల నణచుటకు వాఁడు సత్త్వగుణము నాశ్రయించి నాఁడంతే. అందుచేత నిరంతరము వాని శరీరమనస్సులు రెండును గుణాతీతమైన స్థితియందే ఉండును. నిర్వాణ పదము వాని శరీరములోనే ఉండును. సర్వేశ్వరుఁడు పెద్ద తేజస్సు. జీవన్ముక్తుఁడు పరిమాణములో చిన్నతేజస్సు. కాని రెండును తేజస్సులే. రెంటికిని దాహకశక్తి ఒక్కటే. రెండింటితేజస్సు గూడ నొక్కటే. దీనినే శంకరులు చాల అపురూపమైన స్థితిలో చెప్పినాఁడు. ఆయన అన్నాడు. స్వామీ! నీకును నాకును అద్వైతము స్థిరమైనను నేను నీయొక్క అంశమునే గాని నీవే నేను కాలేదు. నేను నీవాఁడను. నీవు మాము కీనుఁడవు కాదు. తరంగము సముద్రమునకు సంబంధించినది. రెంటి యందున్నది జలము. కాని తరంగము సముద్రమునకు సంబంధించినది. సముద్రము తరంగమునకు సంబంధించినది కాదు."సాముద్రోహి తరంగఃక్వచన సముద్రో న తారంగఃక."

935. పురుషుఁడు=సిద్ధుఁడైన వాఁడు, చరమమై=కడపటిదై, అన్యవిషయ నివృత్తమై=తక్కిన అన్యవిషయముల నుండి నివృత్తమైన ప్రవృత్తి గలదై, నివర్తించు=సంపూర్ణ వైరాగ్యమును ధరించియున్న, చిత్తవృత్త్యాదులను గల్గి=చిత్తము యొక్క వ్యాపారములు కల్గినదై, వెలయంగన్=ప్రకాశింపఁగ,

ఆత్మీయమగు మహిమన్=యోగసిద్ధితో తనకు లభ్యమైన మహిమయందు, సునిష్ఠుఁడై=స్థిరమైన స్థితిగలవాఁడై, లభించు సుఖదుఃఖములన్=పూర్వజన్మము లకు సంబంధించిన కర్మల కనుగుణముగా వచ్చెడు సుఖదుఃఖములచేత, మనస్సునన్ దలంపక=చలింపని చిత్తవృత్తి గలవాఁడై, అహంకార ధర్మంబులు గాన్=అహంకారము చేత నేర్పడెడు సంక్షోభములుగా, తలంచి=స్పష్టముగా నిర్ణయించు కొన్నవాఁడై, అనయంబు=సర్వకాలసర్వావస్థలందు, సాక్షాత్కృత ఆత్మీ తత్త్వము=సాక్షాత్కరింపఁజేసిన కొన్నట్టి ఆత్మ భావము కలవాఁడై యుండును. ఇట్టివానినే ధీరులైనవారు జీవన్ముక్తుఁడంఁడ్రు=జీవన్ముక్తుడని పిలుతురు. అతఁడు=ఆ జీవన్ముక్తుడు, ఏచందంబునన్ ఉండున్=ఏ పద్ధతిలో ఉండును, అనిన్=అనఁగా, వినుము=చెప్పుచున్నాను ఆలకింపుము. తన శరీరంబు=తనదేహము, ఇకేమియు, ఎఱుంగక=ఏ వ్యాపారమును గమనింపని వాఁడై, అర్థిన్ వర్తించున్=నిత్యానంద పూరితుఁడై యుండును.

తాత్పర్యము : జీవన్ముక్తుని లక్షణములనే ఇంకను వివరించుచున్నాఁడు. సమాధిస్థితి యందు నిష్ఠాతుఁడైన వానికి అదియే చరమ జన్మము వానిచిత్తము సమస్తములైన విషయముల నుండి నివృత్తమై యుండును. వైరాగ్యమే వాని సహజస్థితి. వాని చిత్తమందు చోటు చేసికొను విషయ మేదియు నుండదు. మనస్సును నివర్తించు కొనుటలో వాని ప్రయత్నమేమియు నాస్థితిలో నక్కరలేదు. సమస్త చిత్తవృత్తులును వానితో సహకరించును. అవియే విషయములను దూరముగా చేయును. అష్టసిద్ధులు మొదలగు నవన్నియు వాని కనుసన్నలలో మెలఁగుచుండును. అయిను వాఁడు దేనిని కూడ వినియోగింపఁడు. వాని కవి యున్నట్టి స్ఫూర్తియే ఉండదు. ఈ స్థితిలో కూడ సుఖదుఃఖములు వానిని వదలవు. తక్కిన అన్ని ప్రారబ్ధములు తొలఁగినను మూల ప్రారబ్ధము మాత్రము దేనిచేతను పోదు. దాని కనుభవ మొక్కటే మార్గము. తక్కిన ప్రారబ్ధములు తపస్సుచే నశించును. కానిమూల ప్రారబ్ధమునకు సంబంధించిన సుఖదుఃఖములు వెన్నాడుచునే యుండును. అయాచితముగా యాదృచ్ఛికముగా లభించెడు సుఖమునకు సుఖప్రారబ్ధమని పేరు. అట్టే దుఃఖ ప్రారబ్ధము కూడ. ఇవి లభించినపుడు నిద్దుఱైనవాఁడు ఎట్టుండును? నిమ్మళముగా అనుభవించును. కాని ఇవి యన్నియు అహంకారము యొక్క ధర్మములని వారెఱుగుదురు. అందుచేత సుఖదుఃఖాదులకు వాఁడు పరుఁడై ఎవ్వఁడో దేనినో అనుభవించు చున్నట్లుగా వాఁడు తా ననుభవించును. నిరంతరమును ఆత్మతత్త్వము వానికి సాక్షాత్కరించి యుండును. అనఁగా వాఁడే ఆత్మతత్త్వమై యుండునన్న మాట. ఆత్మతత్త్వము వానికి భాసించు నన్నచో భేదవృత్తి ఉన్నట్లే. అందుకే ఆత్మతత్త్వమే వాఁడై యుండుననుచున్నాఁడు. అట్టివాని ప్రవృత్తి ఎట్టుండును? వానిశరీరము నిలుచుట వాఁడెఱుఁగఁడు. కూర్చుండుటయుఁ గూడ నెఱుఁగఁడు. చరించుట గూడ వానికి బాహ్యవిషయమే. శరీరమునే వాఁడు భావింపనపుడు శరీర ధర్మముల నెట్లు భావించును? మఱి వానిస్థితి ఎట్టిది? ఎట్టిదని ఏమి చెప్పవచ్చును? ఒకటే ఆనందమయము.

936. మదిరా పానంబునంజేసి=ఎక్కువగా మత్తు పదార్థములను సేవించిన దానివలన, మత్తుండగు వాఁడు=మత్తును చెందినవాఁడు, పరిధానము=దేహమున కప్పుకొన్నది, అంబరంబు=వస్త్రము, మఱచి వర్తించుచందంబునన్=జ్ఞాపకము లేక ప్రవర్తించునట్లు, తనశరీరంబు=క్షీణించెడు స్వభావము కలిన తనదేహము, దైవాధీనంబునన్=పూర్తిగా దైవమునకును కర్మకును లోఁబడిన దగుటవలన, నశ్వరంబని తలంచి=నశించి పోవునదని గుర్తించి, ఆత్మతత్త్వనిష్ఠుండై=ఆత్మ తత్త్వమందే మగ్నమైన మనస్సు గలవాఁడై, ఉపేక్షించున్=శరీరము ఏ మాత్రము గుర్తింపక యుండును. సమాధి యోగంబునంజేసి=సమాధిని పూర్తిగా సాధించు కొన్నదాని వలన, సాక్షాత్కృతాత్మ తత్త్వంబుగలవాఁడై=సాక్షాత్కరింపఁజేసికొని అనుభవింపఁబడుచున్న ఆత్మస్వరూపము గలవాఁడై, స్వాప్నిక శరీరంబు చందంబునన్=స్వప్నమునందు ప్రాప్తించిన శరీరమునవలె, యావత్కర్మ ఫల=ఎంతవఱకును ప్రారబ్ధకర్మ మనుభవింప వలసి యున్నదో, అనుభవ పర్యంతంబు=అది పూర్తిగా అనుభవించి క్షయమై పోవువఱకు, పత్నీదార సమేతంబు=పుత్రులతోను, భార్యతోను గూడిన, ప్రపంచంబు ననుభవించిన=సంసార మనెడు ప్రపంచము ననుభవించిన వాఁడై, అటమీఁదన్=దాని తరువాత, పుత్ర దారాది సంబంధంబు వలనన్ పాసి=భార్యా పుత్రాదుల సంబంధము నుండి విడివడినవాఁడై, వర్తించున్=ప్రవర్తించును.

తాత్పర్యము : మదిరాపానముతోవాఁడు ఒడలు మఱచియుండును. వాని కే దిక్కునకు పోవుచున్నది తెలియదు. ఎచ్చటికిఁ బోవు చున్నది తెలియదు. గమ్యములేక ఊరకే పోవుచుండును కట్టిన పుట్టము ఉండినది, ఊడినదియుఁ గూడ వాఁడెఱుఁగఁడు. సమాధి సిద్ధుఁడైన జ్ఞానికూడ నంతే. వాని శరీరము కార్యము నెరవేర్చుటలో ఒకగురిలేదు. ప్రవర్తింపనే వలయునని నియమము గూడలేదు. దైవ మెట్టీడ్చుకొని పోవుచుండిన అట్లు పోవును. ఈ శరీరము ప్రారబ్ధను గుణముగా ప్రాప్తించినదని వాఁడెఱుఁగును నశ్వరమనియు నెఱుఁగును. అందుచేత దానిపై సమాధి నిష్ఠుఁడైన వాఁడు రాగాభిమానములు లభించుకొనఁడు. శరీరమందలి ఉపేక్షయే వాని స్వభావమై యుండును. ఆహార విహారాదుల యందుఁగూడ వాఁడంతే. వానిచే ఆహార మెవ్వరో తినిపించుచున్న ట్లుండును. "కర్మ ఏవ శరీరం పుష్ణాతి" అని ఆది శంకరులన్నట్లు ప్రారబ్ధమే శరీరము నడపించుచున్న దని వానికిఁ తెలియును. మనుష్యుఁడొక స్వప్నమును చూచును. ఆ స్వప్న దర్శనమందు వాని కొక శరీరము ప్రాప్తించును. తాను చూచుచు స్వప్నమందు తానే పరువెత్తుచుండును. స్వప్నజనితమైన దేహము. దేహమున కొక్కచోట దెబ్బతగిలిన దనుకొందము. వాని నిజ శరీరమున గాయముండదు కదా! జ్ఞాని విషయము కూడనంతే. శరీరమునకు సుఖదుఃఖాదులు ప్రారబ్ధను గుణముగా నేర్పడినను స్వప్న శరీరమున కేర్పడినట్లే వాఁడు చూచును. ప్రారబ్ధానుభవ మున్నంత వరకును శరీరముండునను జ్ఞానమును వానికి శరీరమై యుండును. అదెన్నఁడు తరుగునో శరీరమప్పుడే గతించునన్న సత్యము గూడ వాఁడెఱుంగును. ఎఱిఁగినవాఁడే

సుతదారాది రూప సంసారము నిర్వికల్పజ్ఞానము కలవాఁడై వాఁడనుభవించును. తత్సంబంధము కల్గిన ప్రారబ్ధము నశించినంతనే వానియం దు దాసీనుఁడై వెడలిపోవును. సంసారమందు వర్తించుచున్నపుడు నిజముగా దాని యం దాసక్తుని వలెనే గన్పించును. కాని వాని ఆసక్తి అనాసక్తియను సరస్సు నం దుద్భవించిన పద్మమే. వాని యాసక్తికి అనాసక్తి మూలబలముగా నుండును. కార్యము లన్నియు ఆసక్తుని వలెనే ఒనర్చును. అట్టి మహాయోగిని గుర్తించుట చాల కష్టము.

937. సుతదార మిత్ర అనుజుల కంటెన్=పుత్రులు భార్యమిత్రులు, తమ్ములు వీనికంటె, మర్త్యుండు=మనుష్యుఁడు, భిన్నుడై వర్తించుచున్నరీతిన్= శరీరమును ధరించి తాను వేఱుగా ఉన్నరీతిని, విస్ఫులింగ=మిణుగురులు, ఉల్కుక=వరిపొట్టు వీనినుండి బయలు దేరెడు, విపుల ధూమములచేన్ =ఎక్కువైనపొగలనుండి, హవ్యవాహనుఁడు=అగ్నిదేవుఁడు, వేఱైన రీతిన్= భిన్నముగా నుండెడునట్లు జీవాత్మ=క్షేత్రజ్ఞుఁడైన జీవుఁడు, వలనొప్పన్=శాస్త్ర సిద్ధాంతము ననుసరించి, పరికింపన్=చక్కగా నర్థము చేసికొన్నచో, భిన్నరూపమునన్ ఉండున్=వేరైన స్వరూపముతో ఉండును. భూతేంద్రియ అంతఃకరణంబులన్=పంచభూతములు, దశేంద్రియములు, మనస్సు, మనస్సు యొక్క బుద్ధ్యాది వృత్తులు వీని సమావేశమైన శరీరము ప్రకృతి రూపమైనది, ఈ ప్రకృతి రూపమైన శరీరమునుండి ఆత్మభిన్నముగా నుండును. వాఁడు ద్రష్ట. వానికే బ్రహ్మమని పేరు. ఆద్రష్ట స్వరూపమును పొందిన యోగి సమస్త భూతము లందును తన స్వరూపమునే చూచును. అన్నిటియందు ఆత్మస్వరూపమే విలోకించును. అన్నిభూతములను తనయందే చూచును. అనఁగా సమస్త భూతములందున్న ఆత్మ ఒక్కటె కనుక ఆ ఆత్మస్వరూపుఁడు తానే కనుక సమస్త భూతములందు తన్నును, తనయందు సమస్త భూతములను విలోకించును.

తాత్పర్యము : భార్య, పిల్లలు, మిత్రులు, తమ్ములు మొదలైన వారిపై పురుషున కభి మాన ముండును. ఈ యభిమానము తాను అను దానియొక్క పిల్ల. తాను అనుదానిని బట్టి తనది అన్న దేర్పడును. వారిని మనస్ఫూర్తిగా ప్రేమించును. ఇంత ఘనిష్ఠమైన సంబంధమున్నను తాను వారు కానేరఁడు. తన శరీరము వారి శరీరముల కంటె భిన్నమై యున్నది. కనుక అట్లే అగ్నినుండి ధూమ మేర్పడు చున్నది. కాలిన వరిపొట్టు నుండి ధూమమేర్పడు చున్నది. కాని ఆధూమమే యగ్నికాదు. అది ఈ రెంటికంటె భిన్నము. జీవాత్మకూడనంతే. దానికి శరీర మనునది తొడుగు. కార్యజ్ఞుఁడైన వాఁడు శరీరమందే జీవాత్మ తత్త్వమును అభ్యాస మొనర్చుకొనును. శరీరమునే జీవ స్వరూపముగా భావించును. సూక్ష్మముగా పరికించినచో ఈ రెంటికిని సంబంధమే లేదు. పంచభూతములు, పది ఇంద్రియములు, మనస్సు, దాని బుద్ధ్యాది

భేదములు -- వీనితో నేర్పడినది శరీరము. వీని నన్నిటినీ తయారు చేసినది ప్రకృతియే. ప్రకృతి కంటె జీవాత్మ భిన్నమైనది. వాఁడు ద్రష్ట. ద్రష్టయైనను వాఁడు మాయావశుఁడై సుఖదుఃఖాదుల ననుభవించుచుండును. సమాధి నిష్ఠితుఁడైన జీవాత్మకు ఈ స్థితిలేదు. వాఁడాత్మ తాదాత్మ్యము నొంది యుండును. అప్పుడు వాఁడు ద్రష్ట. ఆ స్థితిలో సమస్త భూతములందున్నది. ఆత్మ స్వరూపమే గనుక తానాత్మ స్వరూపుఁడే గనుక తాను సమస్త భూతములను తనయందు చూచుకొనును. అట్లే సమస్త భూతములందును తన్ను చూచుకొనుచుండును.

939. అనన్యభావంబులఁజేసి=సమస్త భూతములను తనకంటె వేఱుగా చూడక పోవుటచేత, భూతావళి యందున్=సకల ప్రాణులందును, తదాత్మకత్వ మును జూచున్=తాను వానిలోపలనున్న ఆత్మస్వరూపుఁడై చూచును. ఆత్మీయ ఘనతర ఉపాదానముల యందున్=శరీర ముపాదానము. అన్నిజీవాత్మల కదియట్లే ప్రాప్తించినది. ఇద్ధ దివ్యజ్యోతి=ఎక్కువగా వెలుఁగుచున్న ప్రకాశము, ఏకమయ్యును=ఒకటేయయ్యును, బహుభావంబులనుదోఁచు=భిన్నభిన్నములుగా కన్పడును. ప్రకృతి గతుఁడు=ప్రకృతి ధర్మములకు లోఁబడినవాఁడు. దేవ+తిర్యక్+ మనుష్య+స్థావరాది వివిధ యోనులు=దేవతలు, జంతువుల, మనుష్యులు, వృక్షాదులు మొదలైన భిన్న యోనులందు భిన్నరీతులుగా కన్పడుచుండును. నిజగుణ వైషమ్యమునను=ఉపాదాన కారణమైన శరీరాదుల భిన్నభావము వలన గుణములు కూడ భిన్న భిన్నములుగా భాసించును. కనుక ఈ సమస్తమును, దేహ సంబంధియగుచున్=దేహముతోడి సంబంధము కలిగినదిగానే ఏర్పడును.

తాత్పర్యము : సమస్త భూతములందున్న ఆత్మయొక్కటే. కానీ శరీరములందు అది వివిధములైన నామరూపముల నందును. అగ్ని యొక్కటేయైనను అది ఆశ్రయించియున్న కాష్ఠాదుల ఆకారమును బట్టి ఋజువక్రములుగా కన్పించునట్లు ఆత్మయే అవిద్యకు లోఁబడుట వలన దేవతలు, పశువులు, మనుష్యులు, స్థావరములు మొదలైన యోనులందు ఆ శరీరముల ననుసరించి భిన్న భిన్న గుణములకు లోఁబడిన వాఁడై యుండును. ఇవన్నియు దేహ సంబంధముతో నేర్పడినవి. సదసదాత్మకమై నెగడు నాత్మ అనిర్వచనీయమైన స్థితిగలది. దాని పద్ధతి నూహించుటయే కష్టము. ప్రకృతి గుణముల నది తిరస్కరించినపుడు స్వస్వరూపములతో భాసించును. ప్రకృతి కధీనమైనపుడు జీవుఁడనిపించుకొని వివిధములైన సుఖదుఃఖములను అనుభవించును.

ఇది శ్రీపోతనామాత్య విరచిత ఆంధ్రమహాభాగవతమున 'సుధాలహరి' వ్యాఖ్యయందు ఇరువది ఎనిమిదవ అధ్యాయము.

ఏకోనత్రింశోఽధ్యాయః

దేవహూతి రువాచ

లక్షణం మహదాదీనాం ప్రకృతేః పురుషస్య చ,
స్వరూపం లక్ష్యతేఽమీషాం యేన తత్పారమార్థికమ్. 1

యథా సాంఖ్యేషు కథితం యన్మూలం తత్త్వచక్షతే,
భక్తి యోగస్య మే మార్గం బ్రూహి విస్తరతః ప్రభో! 2

విరాగో యేన పురుషో భగవన్ సర్వతో భవేత్,
ఆచక్ష్వ జీవలోకస్య వివిధా మమ సంసృతీః. 3

కాలస్యేశ్వర రూపస్య పరేషాం చ పరస్య మే,
స్వరూపం వద కుర్వంతి యద్ధేతోః కుశలం జనాః. 4

లోకస్య మిథ్యాభిమతే రచక్షుష
శ్చిర ప్రసుప్తస్య తమస్య నాశ్రయే,
శ్రాంతస్య కర్మ స్వనుబద్ధయా ధియా
త్వ మావి రాసీః కిల యోగభాస్కరః. 5

శ్రీమైత్రేయ ఉవాచ

ఇతి మాతు ర్వచ శ్శ్లక్ష్ణం ప్రతినంద్య మహామనిః,
ఆబభాషే కురుశ్రేష్ఠ! ప్రీత స్తాం కరుణార్దితః. 6

భక్తియోగో బహువిధో మార్గై ర్భామిని భావ్యతే,
స్వభావగుణమార్గేణ పుంసాం భావో విభిద్యతే. 7

అభిసంధాయ యద్ధింసాం దంభం మాత్సర్య మేవ చ,
సంరంభీ భిన్నవదృ గ్భావం మయి కుర్యాత్స తామసః 8

విషయా నభిసంధాయ యశ ఐశ్వర్య మేవ చ,
ఆర్చాదా వర్చయే ద్యో మాం పృథగ్భావ స్సరాజసః. 9

కర్మనిర్హార ముద్దిశ్య పరస్మి న్వాతదర్పణమ్,
యజే ద్యష్టవ్య మితి వా పృథగ్భావ స్స సాత్త్వికః. 10

మదుణశ్రుతి మాత్రేణ మయి సర్వగుణాశ్రయే,
మనోగతి రవిచ్ఛిన్నా యథా గంగాంభసోఽంబుధౌ. 11

లక్షణం భక్తియోగస్య నిర్గుణస్య హ్యుదాహృతమ్,
అహైతుక్య వ్యవహితా యా భక్తిః పురుషోత్తమే. 12

సాలోక్య సార్ష్టి సామీప్య సారూప్యైకత్వ మిత్యుత,
దీయమానం న గృహ్ణంతి జనా మత్సేవనం వినా. 13

స ఏవ భక్తియోగాఖ్య ఆత్యంతిక ఉదాహృతః,
యేనాతివ్రజ్య త్రిగుణా న్మద్భావాయోప పద్యతే. 14

నిషేవితానిమిత్తేన స్వధర్మేణ మహీయసా,
క్రియాయోగేన శస్తేన నాతిహింస్రేణ నిత్యశః. 15

మద్ధిష్ణ్య దర్శన స్పర్శ పూజాస్తుత్యభి వందనైః,
భూతేషు మద్భావనయా సత్త్వేనాఽ సంగమేన చ. 16

మహతాం బహుమానేన దీనానా మనుకంపయా,
మైత్ర్యా చైవాత్మతుల్యేషు యమేన నియమే నచ. 17

ఆధ్యాత్మికానుశ్రవణా న్నామసంకీర్తనేన చ,
ఆర్జవే నార్యసంగేన నిరహంక్రియయా తథా. 18

మద్ధర్మిణో గుణై రేతైః పరిసంశుద్ధ ఆశయః,
పురుషస్యాఽంజ సాభ్యేతి శ్రుతమాత్ర గుణం హి మామ్. 19

యథా వాతరథో ఘ్రాణ మావృణ్క్తే గంధ ఆశయాత్,
ఏవం యోగరతం చేత ఆత్మాన మవికారి యత్. 20

అహం సర్వేషు భూతేషు భూతాత్మాఽ వస్థిత స్సదా,
త మవజ్ఞాయ మాం మర్త్యః కురుతేఽర్చావిడంబనమ్. 21

యో మాం సర్వేషు భూతేషు సంత మాత్మాన మీశ్వరమ్,
హిత్వాఽర్చాం భజతే మౌఢ్యా ద్భస్మన్యేవ జుహోతి సః. 22

ద్విషతః పరకాయే మాం మానినో భిన్నదర్శినః,
భూతేషు బద్ధవైరస్య న మనశ్శాంతి మృచ్ఛతి. 23

అహ ముచ్చావచైర్ద్రవ్యైః క్రియయోత్పన్న యాఽ నఘే,
నైవ తుష్యేఽర్చితోఽర్చాయాం భూతగ్రామావమానినః. 24

అర్చాదా వర్చయే త్తావ దీశ్వరం మాం స్వకర్మకృత్,
యావ న్నవేద స్వహృది సర్వభూతే ష్వవస్థితమ్. 25

ఆత్మన శ్చ పరస్యాపి యః కరోత్యంతరోదరమ్,
తస్య భిన్నదృశో మృత్యు ర్విదధే భయ ముల్బణమ్. 26

అథ మాం సర్వభూతేషు భూతాత్మానం కృతాలయమ్,
అర్హయే ద్దాన మానాభ్యాం మైత్ర్యాఽభిన్నేన చక్షుషా. 27

జీవా శ్శ్రేష్ఠా హ్య జీవానాం తతః ప్రాణభృత శ్శుభే,
తత స్సచిత్తాః ప్రవరా స్తత శ్చేంద్రియవృత్తయః. 28

తత్రాపి స్పర్శవేదిభ్యః ప్రవరా రసవేదినః,
తేభ్యో గంధవిద శ్రేష్ఠా స్తత శ్శబ్దవిదో వరాః. 29

రూప భేదవిధ స్తత్ర తత శ్చో భయతోదతః,
తేషాం బహుపదా శ్రేష్ఠా శ్చతుష్పాదాస్తతో ద్విపాత్. 30
తతో వర్ణాశ్చ చత్వార స్తేషాం బ్రాహ్మణ ఉత్తమః,
బ్రాహ్మణో ష్వపి వేదజ్ఞో హ్యర్థజ్ఞో హ్యధిక స్తతః. 31
అర్థజ్ఞా త్సంశయచ్ఛేత్తా తత శ్శ్రేయాన్ స్వ కర్మకృత్,
ముక్తసంగ స్తతో భూయా న్న దోగ్ధా ధర్మ మాత్మనః. 32
తస్మా న్మయ్యర్పితాశేష క్రియార్థాత్మా నిరంతరః,
మయ్యర్పితాత్మనః పుంసో మయి సన్న్యస్తకర్మణః. 33
న పశ్యామి పరం భూత మకర్తు స్సమదర్శనాత్,
మనసైతాని భూతాని ప్రణమే దృహమానయన్. 34
ఈశ్వరో జీవకలయా ప్రవిష్టో భగవానితి,
భక్తియోగశ్చ యోగశ్చ మయా మానవ్య దీరితః. 35
యయో రేకతరేణైవ పురుషః పురుషం వ్రజేత్,
ఏత ద్భగవతో రూపం బ్రహ్మణః పరమాత్మనః. 36
పరం ప్రధానం పురుషం దైవం కర్మ విచేష్టితమ్,
రూపభేదాస్పదం దివ్యం కాల ఇత్యభిధీయతే. 37
భూతానాం మహదాదీనాం యతో భిన్న దృశాం భయమ్,
యోఽంతః ప్రవిశ్య భూతాని భూతై రత్త్యఖిలాశయః. 38
సవిష్ణ్వాఖ్యోఽధి యజ్ఞోసౌకాలః కలయతాం ప్రభుః,
న చాస్య కశ్చి ద్ధయితో న ద్వేష్యో న చ బాంధవః. 39
ఆవిశ త్యప్రమత్తోఽసౌ ప్రమత్తం జన మంతకృత్,
యద్భయా ద్వాతి వాతోఽయం సూర్య స్తపతి యద్భయాత్. 40
యద్భయా ద్వర్షతే దేవో భగణో భాతి యద్భయాత్,
యద్భనస్పతయో భీతా లతా శ్చౌషధిభి స్సహ. 41
స్వే స్వే కాలేఽభిగృహ్ణంతి పుష్పాణి చ ఫలాని చ,
స్రవంతి సరితో భీతా నోత్సర్పత్యుదధి ర్భయాత్. 42
అగ్ని రింధే సహగిరి ర్భూ ర్న మజ్జతి యద్భయాత్,
నభో దదాతి శ్వసతాం మార్గం యన్ని యమా దధః. 43
లోకం స్వదేహం తనుతే మహాన్ సప్తభి రావృతమ్
గుణాభిమాని నో దేవా స్సర్గాది ష్వస్య యద్భయాత్,
వర్తంతేకనుయుగం యేషాం వశ ఏత చ్చరాచరమ్. 44
సోనంతో నంతకరః కాలోనాది రాదికృ దవ్యయః,
జనం జనేన జనయ న్మారయ న్మృత్యునా ఽంతకమ్. 45

ఇతి శ్రీమద్భాగవతే, తృతీయ స్కంధే ఏకోనత్రింశోధ్యాయః.

1,2. మహదాదీనాం=మహాదాదుల యొక్కయు, ప్రకృతేః=ప్రకృతి యొక్కయు, పురుషస్య చ=పురుషుని యొక్కయు, లక్షణం=అసాధారణమైన గుణమును, సాంఖ్యేషు=సాంఖ్యశాస్త్రమందు, యథాకథితం=ఏ రీతిగా చెప్పబడి యున్నదో, యేన=ఏ లక్షణముచేత, అమీషాం=వాని యొక్క, పారమార్థికం=పరమార్థమైన, స్వరూపం=ఆకృతి, లక్ష్యతే=తెలియబడుచున్నదో (తత్=అది, త్వయా=నీచేత, కథితం=చెప్పబడినది) తత్=దానికి, యన్మూలం=దేనిని కారణమని, ప్రచక్షతే=చెప్పుదురో, భక్తి యోగస్య=ఆ భక్తి యోగము యొక్క, మార్గం=సంప్రదాయమును, ప్రభో=ఓ ఈశ్వరుడా! మే=నన్ను గూర్చి, విస్తరశః=విస్తరించి, బ్రూహి=చెప్పుము.

తాత్పర్యము : అవతారిక : ఈ అధ్యాయమందు తల్లి యొక్క ప్రశ్నకుత్తరముగా భక్తి యోగము యొక్క మార్గమును, కాలప్రభావమును - వీనిని గూర్చి కపిలాచార్యుడు తెల్పబోవుచున్నాడు - ఓ ప్రభువా! మహత్తత్త్వము, అహంకార తత్త్వము మొదలైన ప్రకృతి కార్యముల యొక్కయు, ప్రకృతి యొక్కయు, పురుషుని యొక్కయు లక్షణమును సాంఖ్యశాస్త్రము నందు వర్ణింపబడిన విధముగా నీశ్రీపాదములు నా కెఱిగించినవి. అందుచేత మహదాదుల యొక్క సరియైన స్వరూపమును తెలిసికొనుటకు సాధ్యపడుచున్నది. ఇట్లు వీనివీని స్వభావములను ప్రకృతికంటె భిన్నముగా చేసి తెలిసికొనుటచేత పరమేశ్వరునియందు ప్రగాఢమైన భక్తి జనించునని తెలిపితివి. దయచేసి ఆ భక్తి యోగము యొక్క మార్గమును ఇంకను విస్తృతముగా నా కెఱిగించవలెనని ప్రార్థించుచున్నాను.

3. భగవాన్!=ఓ భగవత్స్వరూపుడైన, కపిలా, యేన=దేని చేత, పురుషః=పురుషుడు, సర్వతః=సకలమునుండి, విరాగః=రాగరహితుడైన వాడుగా, భవేత్=అగునో, జీవలోకస్య=జీవులయొక్క, వివిధాః=అనేక రీతులుగానున్న, సంసృతీః=సంసారము యొక్క గతులను, మమ=నాకు, ఆచక్ష్వ=తెలియజెప్పుము.

తాత్పర్యము : ఓ సర్వజ్ఞుడవైన కపిలాచార్యా!ప్రాణుల కేర్పడెడు బహు విధములైన సంసారగతులను గూర్చిగూడ నీవు నా కెఱిగింపవలెను. ఆ మార్గములను తెలిసికొన్న దానిచేత పురుషుడు ఇహమునందును, పరమునందును, గల భోగములందు విరక్తుడై వర్తింప వీలుండును గదా!

4. పరేషాం=బ్రహ్మాదిదేవతల కంటెను, పరస్య=ప్రధానపురుషుడుగను, ఈశ్వర రూపస్య=సమస్తమును సమర్థవంతముగా నడిపించెడు స్వరూపము గలవాడైన, తే కాలస్య=నీ స్వరూపమైన కాలము యొక్క, స్వరూపం=స్వరూప స్వభావములను, ఆచక్ష్వ=సెలవిమ్ము; బత=ఈ సెలవిచ్చుట మహాభాగ్యముగదా! యద్దేతోః=ఏ కారణముగా, జనాః=జనులు, కుశలం=పుణ్యమును, కుర్వంతి=చేయు చున్నారో.

తాత్పర్యము : స్వామీ! సర్వమును సమర్థముగా నడపించు శక్తిగల నీ శ్రీపాదముల యొక్క స్వరూపభూతమైనదే కాలము. ఆ కాలము యొక్క

వైభవమును కూడ నా యందు దయయుంచి సెలవీయవలెను. కాలము మహా సమర్థవంతఁమైనది. అది ప్రతిపదార్థమును క్షణ క్షణమును మార్చు చుండును. క్రమముగా దానిని నశింపఁజేయు ఇట్టి అప్రతిబంధకమైన శక్తిగలది కాలము. అది అపరిచ్ఛిన్నము. అందుచేతనే అది భగవంతుని యొక్క స్వరూపమై యుండును. అ కాల స్వరూపమునకు భయపడియే జనులు పుణ్యకార్యము లొనర్చుచున్నారు. సమస్త లోకములును కాలక్రమమున నశించునవే అనెడు జ్ఞాన మేర్పడుట వలననే పురుషున కీ లోకమందును పరలోకసుఖములందుఁ గల యభినివేశము నశించుచున్నది. అపుడు తీవ్రమైన వైరాగ్య మేర్పడును. కనుక కాలస్వరూప విజ్ఞానము వైరాగ్య కారణము. అందుకే కాలవైభవ మెఱుక పఱచవలెనని నిన్ను ప్రార్థించుచున్నాను.

5. మిథ్యాభిమతేః=మిథ్యాభూతములైన శరీరాదులందు అభిమానముతో కూడియు, అచక్షుషఃతత్త్వమును తెలియకుండియు, అనాశ్రయే=ఆశ్రయరహితమై యున్న, తమసి=అంధకారమందు చిరం ప్రసుప్తస్య=బహుకాలము నిద్రావశుఁడై యుండియు, కర్మసు=కర్మములందు, అనుబద్ధయా=అనుబంధముతో కూడిన, బుద్ధ్యా=బుద్ధిచేత, శ్రాంతస్య=అలసి పోయి యున్న, లోకస్య=లోకముపాలిక, యోగభాస్కరఃయోగముల ప్రకాశింపఁజేయు సూర్య స్వరూఁడవైన, త్వం=నీ యొక్క శ్రీపాదములు, అవిరాసీఃకిల=జన్మించినవి కదా!

తాత్పర్యము : తెలిసికొనఁదగిన విషయములను గూర్చి దేవహూతి ప్రశ్నించినది. ఆ ప్రశ్నములకు సమాధాన మిచ్చుటకు భగవంతుఁడైన కపిలాచార్యుని ప్రసాదీకరించుకొనుచున్నది. ఓ భగవాన్! శరీరాదులు క్షణభంగురములైన మిథ్యాభూతములు. వీనియం దభిమాన ముంచుకొని జీవుఁడు పరమార్థమును గూర్చి తెలిసికొన ప్రయత్నింపఁడు. అందుచేత రక్షాశూన్యమైన సంసారమునఁ జిక్కినవాఁడు బహుకాలము మునుఁగుచు తేలుచు నానావస్థలు పడుచున్నాఁడు. రక్షాశూన్యమైన సంసారమందుండి భగవంతుని దయను సంపాదించుటకు పనికి వచ్చెడు సాధనముల ననుష్ఠింపక పోవుటచేత గట్టులేని సంసారములో వాఁడు చిక్కి పరితపించు చుండును. అట్టివాని ఉపయోగార్థమై నీవు జ్ఞాన యోగము, భక్తి యోగము, అష్టాంగయోగము మొదలైన వానిని నెఱుక పఱచితివి. యోగ భాస్కరుఁడవైన నీ యవతారము చిరంతనమైన అంధకారమున చిక్కి కృశించి యున్న జీవులయుద్ధారమునకే. ఈ జీవుల యొక్క మహాభాగ్య మది.

6. మాతుఃతల్లి యొక్క, శ్లక్ష్ణం=ఆనందకర మైనట్టి, ఇతివాచఃఈ రీతిగా పల్కఁబడిన వాక్యమును, ప్రతినంద్య=అభినందించినవాఁడై, కురుశ్రేష్ఠ!=ఓ విదురుఁడా! ప్రీతఃసంతృప్తిని చెందిన వాఁడై, కరుణార్దితఃకరుణచేత ద్రవించిన మనస్సు కలవాఁడై, మహామునిఃమునులలో నగ్రగణ్యుఁడైన కపిలాచార్యుఁడు, తాం=ఆ దేవహూతిని గూర్చి, తాబభాషేఃఇట్లు పలికెను.

తాత్పర్యము : మైత్రేయుఁడనుచున్నాఁడు - ఓ కురుకుల శ్రేష్ఠుఁడవైన విదురుఁడా! దేవహూతి వచనములు చాల మృదువులుగా నున్నవి. ఆ వాక్యములతో కపిలుఁడు మహాప్రీతుఁడయ్యెను. దయతో నాతని హృదయ మంతయు కరఁగి పోయినది. తాను ఆ వాక్యములకు ప్రమోదించిన వాఁడై ఈ రీతిగా బదులిచ్చినాఁడు.

7. భామిని!=ఓ తన్వీ! భక్తియోగఃభక్తి యోగము, మాత్రైఃప్రకార భేదముల కారణముగా, బహువిధఃఅనేక విధములతో కూడినదిగా, భవ్యతే=భావింపఁబడుచున్నది. స్వభావ గుణమాత్రేణ=స్వభావమునకు కారణములైన సత్త్వాది గుణభేదములచేత, పుంసాం=పురుషులయొక్క, భావఃసంకల్పము, విభిద్యతేభిన్నభిన్నముగా నుండుచున్నది.

తాత్పర్యము : భగవంతుఁడైన కపిలాచార్యుఁడను చున్నాఁడు-ఓ తల్లీ! భక్తియోగము ఈశ్వర ప్రేమరూప మైనది. వాని యావిష్కారము లనేకములు. అందుచేత భక్తి యోగము కూడ అనేక విధములుగా గణింపఁబడుచున్నది. భిన్న భిన్న జనుల కుండెడు సత్త్వాది గుణభేదములతో వారి వారి స్వభావములు భిన్నము లగుచున్నవి. గుణ విశేషములచేత సాధకుల మార్గములు గొప్పతనమును, నీచత్వమును పొందుచున్నవి. అవి వారివారి సంకల్పములకు సంబంధించినవి.

8. హింసాం=పరపీడ, దంభం=వంచన, మాత్సర్యంవా=పరోత్కర్షను సహింపని గుణము - వీనిని, అభిసంధాయ=సంకల్పించినవాఁడై, సంరంభీక్రోధ గుణముచే కూడిన వాఁడై, యఃఎవఁడు, భిన్నదృక్ భావం=భేదదృష్టిచేత కూడిన సంకల్పమును, మయి=నా యందు ఆరోపించి, కుర్యాత్=చేయునో, సఃవాఁడు, తామసఃతమోగుణ ప్రధానుఁడు.

తాత్పర్యము : ఇతరులకు బాధలు కల్గింప వలెననియో, తాను గొప్పవాఁడ నని ఇతరులు గ్రహింపవలెననియో, ఎవరైనను వేరు వానిని భక్తుఁడని అన్నపుడు ఆ మార్గమందు వాని కంటె తాను గొప్పవాఁడనని అన్పించు కొనవలెననియో - ఇట్టి సంకల్పము గలవాఁడై - క్రోధము, వంచన, మాత్సర్యము - ఈ భావములతో ప్రేరేపింపఁబడినవాఁడై సర్వత్ర భేద దృష్టిగలవాఁడై ఎవ్వఁడు నాయందు భక్తిని కన్పఱచుటకు యత్నించునో వాఁడు తామసిక భక్తుఁడు. ఎందుకనఁగా వాని సర్వకార్యములందు తమోగుణమే ప్రతిభాసించు చున్నది. వానిభక్తి కూడ తామసికమే వానికిని, ఇతరులకును అపకారమునే కల్గించుచున్నది. అట్టిభక్తి సర్వదా పరిత్యాజ్యము.

9. యశఃకీర్తిని గాని, ఐశ్వర్యం ఏవ చ=ఆ ఐశ్వర్యమును గాని, విషయాన్ వా=భోగపదార్థములనుగాని, అభిసంధాయ=సంకల్పించు కొన్నవాఁడై, పృథగ్భావఃభేదభావముతో కూడినవాఁడై, యఃఎవ్వఁడు, మాం=నన్ను,

అర్చాదౌ=ప్రతిమాదు లందు, అర్చయేత్=పూజించు చున్నాడో, సః=అట్టివాడు, రాజసః=రజోగుణ ప్రధానమైన వాడు.

తాత్పర్యము : ప్రక్చందనాది భోగములనో, సత్కీర్తినో, ధనాదులైన ఐశ్వర్యమునో సంకల్పించి భేద భావముతో కూడినవాడై ఎవడు భక్తిని సాధించునో వాడు రాజసుడు. వాడు సూర్యుడు అగ్ని మొదలైన వాని యందు నా స్వరూపమును తలచి పూజించును. అవినా యంశభూతములే కనుక వాడు సర్వదా రజోగుణ పూరితుడు. వాని భక్తికి రాజసభక్తి యని పేరు. ఇది గూడ బంధకారణమైనదే.

10. కర్మ నిర్హారం=కర్మక్షయమునో, పరస్మిన్=పరమేశ్వరుని యందు, తదర్పణం వా=ఆ కార్యము యొక్క అర్పణమునో, యష్టవ్యం ఇతివా=చేసి తీరవలెననెడు శాస్త్ర ప్రయుక్తమైన విధివాక్యమునకు వశీభూతుడుగనో, ఉద్దిశ్య=సంకల్పించి, పృథగ్భావః=భేదదృష్టితో కూడినవాడై, యజేత్=యజించునో, సః=వాడు, సాత్త్వికః=సత్త్వగుణ ప్రధానుడైనవాడు.

తాత్పర్యము : పాపము క్షయించుటకై వాడు భక్తిని నెఱపును. ఇది యొక్క పద్ధతి. సమస్త కర్మములను భగవదర్పణ మొనర్పవలెనను దృష్టితో వాడు కార్యము లొనర్చును. ఇది మఱి యొక్క పద్ధతి. ఈశ్వరుడు. సర్వేశ్వరుడు కనుక వానిని పూజించుట అవశ్యమని ఒక్కడు సాధించును. ఇది యొకమార్గము. ఈ కార్యమును వేదము విధించినది మనుష్యుడు శాస్త్రవిధేయుడై నడచికొనవలెను. అందుచేత శాస్త్రము యొక్క ఆజ్ఞను పాలించుటకై నే నిది యొనర్చుచున్నానని ఒకడు పూజాదికముల నిర్వర్తించును. ఇది యొక మార్గము. దీనికి కూడ భిన్నదృష్టి యున్నది. అది సత్త్వ గుణప్రధాన మైనది. ఇది సాత్త్వికభక్తి యనిపించుకొన్నది. అందుచేత నిది స్వీకార్య మైనదే.

11, 12. మద్గుణ శ్రుతి మాత్రేణ=నా గుణములయొక్క శ్రవణ మాత్రము చేతనే, సర్వాగుహాశయే=సర్వుల యొక్క హృదయ గుహయందు శయనించుచున్న మయి=నా యందు, గంగాంభసః=గంగా జలము యొక్క, గతిః=ప్రవాహము, అంబుధౌ యథా=సముద్రమందనెడు నట్లు, అవిచ్ఛిన్నా=విచ్ఛిన్నత లేనట్టి, మనోగతిః=మనస్సు యొక్క వ్యాపారము, నిర్గుణస్య=గుణముల నతిక్రమించి యున్న, భక్తి యోగస్య=భక్తి యోగముయొక్క, లక్షణం=స్వరూప మని, ఉదాహృతం హి=ఉదాహరింపబడినది కదా! దీనియందు సంశయములేదు. అహైతుకీ=సంకల్పముతో కూడ నిదియు, అవ్యవహితా=భేదభావన లేనిదియు నైన, పురుషోత్తమే=ఈశ్వరుని యందలి, భక్తిః=పరమప్రేమ.

తాత్పర్యము : నాయొక్క భక్తవాత్సల్యాది గుణములను విన్న వెంటనే సర్వత్ర భేదము లేక వసించుచున్న నా యందు గంగాప్రవాహము

సముద్రమునందువలె అవిచ్ఛిన్నమైన, నిరంతరము నైన మనోగతి ఏర్పడుట దేని వలన కలుగునో అది గుణత్రయముల నతిక్రమించి యున్న భక్తి యోగమని చెప్పబడును. పురుషోత్తముడైన నాయందు పరమప్రేమ లక్షణరూపమైన ఆ భక్తి నన్నుదప్ప మరే ఫలమును కాంక్షించునదికాదు. జీవాత్మ పరమాత్ముడనెడు భేద దృష్టి కూడ దానిలో నుండదు. సర్వప్రాణుల యందును, అచేతనముల యందును వర్తించుచున్న పరమాత్మయే తనయందును వర్తించుచున్నాడని అభేద దర్శనము నిమిత్తముగా నేర్పడెడు పరమోత్కృష్టమైన భక్తి యొక్క లక్షణమే. దాని యందు నానాత్వము లేదు. ఒకే విధముగా నుండును. గుణ త్రయాత్మకమైన భక్తి స్వరూపము ఇంతకుముందు వివరించితిమి కదా! అది యనేక రూప భేదములతో కూడినది అందుచేతనే ఇది అత్యుత్తమమైన భక్తి మార్గము. మోక్షముతో సమాన మైనది.

13. దీయమానం =నా చేత నీయబడుచున్న దానిని, నగృహ్ణంతి = గ్రహింపరు. జనాఃజనులు, మత్సేవనం వినా=నా యొక్క సేవను తప్ప.

తాత్పర్యము : ప్రతి ఫలాపేక్ష ఇసుమంతయు లేని ఆ భక్తి యోగ స్వరూపమునే ఇంకను విశదముగా చెప్పుచున్నాడు. గుణత్రయముల యొక్క ప్రేరణనుండి విడివడిన ఆ భక్తి యోగమును సాధించుజనులు సాలోక్య ముక్తినిగోరరు. సారూప్యముక్తి నాకాంక్షింపరు. పైన చెప్పిన రీతిగా ముక్తి ఐదు విధములు. వానిలో దేనిపైని కూడ వాని మనస్సుండదు. నాకు వారి యందుగల ప్రీతి విశేషముతో నేను ఇచ్చుటకు సిద్ధముగా నున్నాను, మీరు గ్రహింపుడని నేను అర్థించినను వారు వానిని స్వీకరింపరు. వారి మనస్సులనిండ నా సేవాభావము మాత్రమే పదిలముగా నుండును. భగవంతుడు వసించెడు లోకమైన వైకుంఠమందు తనకు కూడ వాసము లభించుటలో సాలోక్యముక్తి. భగవంతున కున్న ఐశ్వర్యము వంటిది తనకును ప్రాప్తమై ఉండుట సార్ష్టిముక్తి భగవంతుని సమీపమున వసించుటకు సమీప్య ముక్తియని పేరు. భగవంతునితో సమానమైన రూపము తనకుఁ గూడ నేర్పడిన దానిని సారూప్యముక్తి యందురు. భిన్నతను వదలి భగవంతునిలో సర్వాత్మనా ఐక్య మగుటయే సాయుజ్యముక్తి. ఈ ఐదు విధములైన ముక్తులలో దేనిని భగవంతుడు అనుగ్రహించుటకు సిద్ధముగా ఉన్నను వీడు గ్రహింపడు. వాడు గుణాతీతుడైనవాడు. వాఁడనుసరించెడు భక్తి నిర్గుణ మైనది. శరీర పతనానంతరము వానికి సాయుజ్యముక్తియే నిర్దిష్టమై యుండును. ఏకత్వమే సాయుజ్య మని ముందే చెప్పితిమి.

15, 16, 17, 18, 19, 20. అనిమిత్తేన=సంకల్పముతో కూడ కుండ నుండు నదియు, నిషేవితా=అనుష్ఠింపబడుచున్నదియు. మహీయసా=శ్లాఘింపతగినదియు నైన, స్వధర్మేణ=స్వవర్ణాశ్రమోచితమైన ధర్మము చేతను, శస్తేన=పొగడదగి నదియైనట్టియు, నాతిహింస్రేణ=అత్యంతము హింసతో కూడనిదియు నైన,

క్రియా యాగేన=క్రియారూపమైన యోగము చేతను, మద్విష్ణ్వదర్శన స్పర్శన పూజా స్తుత్యభి వందనైః=నేను ప్రతిష్ఠింపఁబడిన ఆలయములకు పోయి నా అర్చావతారము వీక్షించుటయు, ఆ అర్చావతారము స్పృశించి ఒక మహానందము నొందుటయు, విగ్రహస్వరూపముగా నున్న నన్ను గాని, లేక నాస్వరూపములైన సూర్య అగ్న్యాదుల యందుగాని నన్నుద్దేశించి పూజించుటగాని నిరంతరము నన్ను స్తుతించుటయు, వినయప్రవ్యాముగా నమస్కరించుటయు, వీనిచేతను, భూతేషు=సమస్త భూతములందును, అసంగమేన=నా యందు తప్ప మఱి ఏ పదార్థమునందును ఇచ్ఛలేక పోవుటచేతను, సత్త్వేన=నిరంతరము నాకభిముఖముగనే ప్రసరించుచున్న మనోవృత్తి చేతను, మహతాం=గొప్పవారి యందు కన్పఱచుచున్న బహుమానేన=వినయ పూర్వకమైన సేవాద్యాచరణచేతను, దీనానాం=దుఃఖితులైన వారి యందు ప్రదర్శింపఁబడెడు, అనుకంపేన=కరుణా విశేషము చేతను ఆత్మతుల్యేషు=తనతో సమానమైనవారి యందు మైత్ర్యాచ=కన పరుపఁబడెడు మైత్రీబంధముచేతను, యమేన=బాహ్యమైన శరీరాది నియమముల చేతను నియమేన=జపాదుల చేతను, ఆధ్యాత్మికాను శ్రవణాత్=ఆధ్యాత్మికములైన గ్రంథములను నిరంతరము వినుచుండుట చేతను, మే=నాయొక్క, నామ సంకీర్తనేచ=నామములను రాగయుక్తముగా సంకీర్తన మొనర్చుట వలనను, ఆర్జవేన=పరమార్థాచరణము చేతను, ఆర్యసంగేన=మహాత్ములతోడి సంసర్గము చేతను, నిరహంక్రియయా=దేహాదులందు ఆత్మాభిమానము వదలుట చేతను, మద్ధర్మిణఃనా ప్రీతి కొఱకై కర్మమొనర్చునట్టి పురుషస్య=పురుషుని యొక్క, ఏతైః గుణైఃఈ గుణములచేత, పరిసంశుద్ధఃసర్వాత్మనా పరిశుద్ధమైనటి, ఆశయఃమనస్సు, శ్రుతమాత్రగుణం=శ్రవణ మొనర్పఁబడిన గుణముతో కూడిన, మాం=నన్ను, అంజసా=అతిశీఘ్రముగా, అభ్యేతి=పొందును, వాతరథఃవాయు వనెడు రథముతో కూడిన, గంధఃవాసన, ఆశయాత్=తన యొక్క స్థానమునుండి, ఘ్రాణం=ఘ్రాణేంద్రియమును, యథా ఆవృణుతేఏ రీతిగా ఆవరించునో, ఏవం=ఆ ప్రకారము, యోగరతం=యోగమునందే రమించు చున్నదియు, అవికారి=ఏ మాత్రము వికారములేనిదియునైన, యచ్చేతఃఎవని యొక్క మనస్సు, ఆత్మానం=ఆత్మస్వరూపమును, ఆవృంక్తే=ప్రాపించుచున్నది.

తాత్పర్యము : సాయుజ్యముక్తి, యోగ్యమైన ఆ పరమభక్తి ఏ రీతిగా సిద్ధించుచున్నది అను విషయమునే వివరించుచున్నాఁడు. ఈ ఆరు పద్యములతో చెప్పఁబడినది భక్తి సాధనముల యొక్క వ్యక్తీకరణమే. వారి వారి వర్ణాశ్రమముల ననుసరించి ధర్మము లొనర్పవలెను. వాని యందు ఫలాభిసంధి ఏ మాత్రమును కూడదు. ఈశ్వర ప్రీతిని జనింపఁజేసెడు ఆ ధర్మాచారము చాలగొప్పది యని మనస్సులో విశ్వసించి యొనర్పవలెను. ఆ యాచరణ మందు హింసా లేశము కూడ నుండరాదు. సాధ్యమైనంత వరకు తగ్గించుట మంచిది. నా యర్చావతారములు వసించునట్టి దేవాలయములకు క్రమము తప్పక పోవలెను. వానిని స్పృశించి అలౌకికానందముతో సమానమైన హర్షాతిరేకమును పొందవలెను.

నా విగ్రహములందును నామూర్త్యంతరములైన సూర్యుడు అగ్ని మొదలైన వాని యందును నా యవస్థానమును భావించి పూజింప వలెను. నన్ను పూజింప వలెను. వినయ ప్రహ్వముగా నమస్కరింపవలెను. సమస్త భూతములందు అంతర్యామిగా నున్నది నేనే. ఈ విషయము నెప్పుడును మరచిపోరాదు. వానికి తానొనర్చునేవ పరమాత్ముని సేవయే అని భావింపవలెను. స్వధర్మాచరణమందు పరిస్థితులననుసరించి ధైర్యము గోల్పోకుండుట మంచిది. నాయందుఁ దప్ప తక్కినవాని యందు అనాసక్తియే ఉండవలెను. తనకన్న గొప్పవారిని నిరంతరము బహుమానింపవలెను. దుఃఖితుల యందు దయను జూపవలెను. సమానులందు మైత్రీభావమును వహింపవలెను. పరద్రవ్యముల నభిలషింపరాదు. నియమ పూర్వకముగా నొనర్చెడు జపాదులవదలరాదు. ఆత్మస్వరూపమును వివరించెడు అధ్యాత్మిక గ్రంథముల నిరంతరము వినవలెను. నారూపగుణము లను వెలువఱచెడు నామములను నిరంతరము భావింపవలెను. ఇతరులకు తాను బోధింపవలెనను దురాశ యుండరాదు. ఇది యహంకారమును పెంచును. ఈ దౌర్బల్యమును విడచి తాను నిరంతరము యోగాసక్తుడై యుండవలెను. శరీరాభిమానమును ఉపేక్షించుట మంచిది. పై చెప్పిన గుణములను క్రమక్రమముగా నభివృద్ధి పఱచికొనుచు నా ప్రసాదమును దప్ప మఱి ఏ ఫలమును కోరక కర్మానుష్ఠాన మొనర్చు పురుషుని చేతస్సు క్రమముగా పరిశుద్ధ మగును. అ మనస్సు మద్గుణ శ్రవణ మాత్రము చేతనే నన్ను ప్రాపించును. పుష్పాదులందున్న సౌరభ్యము వాయువనెడు రథమునెక్కి ప్రాణుల ఘ్రాణేంద్రియమును ప్రాపించునట్లు యోగపరిశుద్ధమైనదగుటచేత చాంచల్యాది దోషరహితమైన వాని మనస్సు ప్రయత్న మేమియు లేకయే పరమాత్మయైన నాతో నిరంతరము చేరియేఉండును.

21. భూతాత్మా=సర్వభూతముల యొక్క ఆత్మగా నుండునట్లు అహం=నేను, సర్వేషు భూతేషు=సమస్త భూతములందును, సదా=నిరంతరమును, అవస్థితఃవసించువాఁడనుగా నున్నాను. తాం మాం=అట్టి నన్ను, అవజ్ఞయా=తెలియక, మర్త్యఃమనుష్యుడు, అర్చావిడంబనం=దైవమును పూజించుట యనెడు నటనను, కురుతే=చేయుచున్నాఁడు.

తాత్పర్యము : పరమార్థమును పొందించుటకు సమర్థమైన నిర్గుణ భక్తిని, దాని అంశమును వివరించిన తరువాత తమసాది గుణములతో కూడిన భక్తి నిష్ఠను ఆరు శ్లోకములలో నిందించు చున్నాఁడు -. సమస్త భూతముల యందును ఆత్మ స్వరూపుఁడనుగా వెలుఁగు చున్నది నేనే. ఇందులో చరాచర భేదము లేదు. ఈ సర్వాత్ముఁడుగా ఉన్న నన్ను దేహమందా త్మాభిమానమున్నవాఁడు గమనింపలేఁడు. వాఁడు భిన్నదృష్టితోనే వర్తించును. ప్రతిమాదులందు నన్ను పూజించుటతో వాఁడు తృప్తిపడును. ఇట్టివాని పూజయంతయు వ్యర్థమే.

22. సర్వేషు భూతేషు=సమస్త భూతములందును, ఆత్మానం = ఆత్మస్వరూపుఁడుగాను, ఈశ్వరం=ప్రేరకుఁడుగాను, సంతం=వసించెడునట్టి, మాం=నన్ను, హిత్వా=ఉపేక్షించి, అర్చాం=ప్రతిమను, యః=ఎవ్వఁడు, భజతే=పూజాదులతో భజించుచున్నాఁడో, సః=వాఁడు మౌఢ్యాత్=మూర్ఖత్వము కారణముగా, భస్మనిఏవ=భస్మమునందే, జుహోతి=హోమించు చున్నాఁడు.

తాత్పర్యము : సకల భూతములందును ప్రత్యగాత్మ స్వరూపుఁడు గను, అంతర్యామిగను వసించుచున్న నన్ను - ఆ రీతిగా తెలిసికొనక నా ప్రతిమను అర్చనాదులతో సేవించువాఁడు భస్మాదులందు హోమించు వానితో సమానుఁడు. హోమద్రవ్యములను ఆయా దేవతలకు, అందఁజేయు అగ్నిదేవు నుపేక్షించి భస్మమునందు హోమించు వాఁడు దైవప్రసాదమును పొందలేఁడు గదా! అట్టివాని ప్రయాస మంతయు వ్యర్థమే. అట్లే నా సర్వాత్మ భావమును గ్రహించని వాఁడు నా ప్రతిమ కొనర్చు పూజకూడ నా ప్రసాదము నందలేదు.

23. భిన్న దర్శినః=భేదదృష్టి కల్గువాఁడు, మానినః=దేహమం దభిమానముతో కూడినవాఁడు, పరకాయే=ఇతరుల శరీరమందు ఉన్న, మాంద్విషతః=నన్ను ద్వేషించుచున్న వాఁడునైన, తస్య=వాని యొక్క, మనః =మనస్సు, శాంతిం న బుచ్ఛతి=శాంతిని పొందలేదు.

తాత్పర్యము : నిష్ఫలమని ఎందుకన్నాఁడో దానిని వివరించు చున్నాఁడు. ఈశ్వరుఁడనైన నన్ను పూజించుటకు ఫలము ఆనందాను భవస్వరూపమైన సుఖప్రాప్తియే కదా! దానిచేత మనస్సు నందు శాంతి ఏర్పడవలెను. స్వశరీరమందు ఆత్మాభిమానము ఎక్కువగా నున్న పురుషుఁడు సర్వత్ర సమరూపుఁడుగా నున్న నన్ను గమనింపలేఁడు వాఁడు ప్రాణులను తన కన్న వేఱుగా చూచును. వారి యందు వాఁడు చూపెడు ద్వేషము నా యందు వాఁడు చేయు ద్రోహముగనే పరిణమించును. దేహాభిమానము కొల్లగానున్న వానికి సమభావన ఏర్పడుటకు వీలులేదు. వాఁడు పరశరీరము లందున్న నన్నే ద్వేషించును. అందుచే వాని మనస్సు శాంతిని పొందలేదు. "అశాంతస్య కుతః సుఖమ్" శాంతి లేని వానికి సుఖమెచ్చటి నుండి వచ్చును? అందుచేత వాఁడొనర్చెడు ప్రతిమా పూజ నిష్ఫలమని భావము.

24. అనఘే=దోష రహితురాలా! ఉచ్చావచైః=నానావిధములైన, ద్రవ్యైః =ద్రవ్యములచేత, ఉత్పన్నయా=సంపాదింపఁబడిన, క్రియయా=సామగ్రితో, అర్చాయాం=నా యొక్క ప్రతిమ యందు, అర్చితః=పూజింపఁబడిన, అహం=నేను, భూతగ్రామావమానినః=భూతసముదాయమును ద్వేషించు చుండెడి వానిపైన, నైవతుష్యేత్ ఏవ=ఎప్పటికినీ తృప్తి పడను.

తాత్పర్యము : పరిశుద్ధురాలైన ఓ దేవహూతీ! ప్రాణులను హింసించి సంపాదింపఁబడిన అనేక విధములైన ద్రవ్యములలో నన్నొక్కఁడు పూజించును.

నా ప్రతిమ కేవేవియో ఉపచారములు చేయును. కానీ నేనువాని పూజలతో తృప్తిచెందను. వాఁడు భూత గ్రామములను ద్వేషించువాఁడు.

25. యావత్=ఎంతకాలము వరకును, సర్వభూతేషు =సమస్తభూతము లందును, అవస్థితం=వసించుచున్నట్టి, ఈశ్వరమాం=ఈశ్వర స్వరూపుఁడనైన నన్ను,స్వహృది=తన యొక్క మనస్సు నందు, న వేద=గమనించినవాఁడు కాలేదో, తావత్=అంతవరకును, స్వకర్మకృత్=తనకు విహితమైన కర్మ లొనర్చెడు వాఁడై, అర్చాదౌ=ప్రతిమాదులందు నన్ను, అర్చయేత్=పూజింపవలెను.

తాత్పర్యము : భక్తి యోగమునకు అంగముగా చెప్పఁబడిన ప్రతిమా పూజ ఈ శ్లోక మందు నిందింపఁబడినదని తలఁపరాదు. భూత ద్రోహాది నింద్యకర్మము లొనరించుచున్న భేదదృష్టి కలిగి వారి యొక్క అర్చనమే నిందింపఁబడుచున్నది. అంతేగాని స్వవర్ణాశ్రమాచార ప్రాప్తమైన పూజను నిందించుట లేదు. దానికి కూడ ఈ శ్లోక మం దొక్క అవధిని చెప్పుచున్నాఁడు. సర్వభూతములందు వసించి యుండెడు సర్వేశ్వరుఁడను నేనే. అట్టి నన్ను స్వహృదయము నందు ఎవ్వఁడు చూచు కొనుచున్నాఁడో వాఁడు ధన్యుఁడు. తన యందలి ఆత్మ స్వరూపమునే తమ యందు వీక్షించువారు పరమధర్ములు. ఆ జ్ఞాన మేర్పడు వఱకును స్వస్వవిహితమైన ప్రతిమా పూజను మానవుఁడు తప్పక ఒనర్పవలెను. జ్ఞానోదయానంతరము కర్మను వదలివేయ వచ్చును. వర్ణాశ్రమ విహితము లైన సమస్త కర్మలకును ఫలము చిత్తశుద్ధియే. పరిశుద్ధమైన మనస్సునకు స్వరూపజ్ఞాన మేర్పడును. తదనంతరము కర్మ కలాపమును వర్జించినను బాధ లేదని తాత్పర్యము.

26.ఆత్మనఃఆత్మకును, పరస్యాపి=ఇతరునకును, అంతరా=మధ్యమందు, ఉదరం=ఉదరమును, యఃకరోతి=ఎవ్వఁడొనర్చు చున్నాఁడో, భిన్నదృశః =భిన్న దర్శనముతో కూడిన, తస్య=వానికి, మృత్యుఃఅహం=మృత్యుస్వరూపియైన నేను, ఉల్బణం భయం=దుస్సహమైనట్టి భయమును, విదధే=జనింపఁజేయు చున్నాఁడు.

తాత్పర్యము : భేద దర్శనమున్న వానికి జన్మమరణాది రూపములతో ప్రకాశించుచున్న సంసార భయము తీరదని ఉపదేశించు చున్నాఁడు - తన యందు వసించుచున్న జీవుఁడును, సర్వత్ర వసించుచున్న పరమాత్ముఁడును ఒకటే. ఈ నిశ్చయ జ్ఞాన మేర్పడక తన శరీరము వేఱు, ఇతరుల శరీరము వేఱు అను భిన్న భావముతో శరీరమం దాత్మ భావము నారోపించుకొని భేదదృష్టితో కూడి యున్న వానికి మృత్యు స్వరూపుఁడనైన నేను జన్మ మరణరూపమైన దుస్సహ భయమును కల్పించు చున్నాను.

"మృత్యోస్య మృత్యు మాప్నోతి యైహ నానేవ పశ్యతి"

ఏక స్వరూపమై యున్న పరమాత్మ తత్త్వము తెలియక ఎవఁడు అనేకము లనెడు భావముతో కూడియుండునో వాఁడు మరణానంతరము

జన్మము, జన్మానంతరము మరణము పొందిన వాఁడై సంసారసాగరమున మునుఁగుటయు, లేచుటయు నిరంతర మొనర్చుచుండును.

"య ఉదర మంతరం కురుతే అత తస్య భయం భవతి"

భిన్న దృష్టి యున్నవానికి మృత్యుభయము తప్పక ఉండునని పై శ్రుతి వాక్యముయొక్క సారము.

27. అథ=అందుచేత, సర్వభూతేషు=సమస్త భూతములందును, కృతాలయం=నివసించువాఁడను, భూతాత్మానం=ప్రాణులయొక్క అంతర్యామిగా నుండుచున్న, మాం=నన్ను, అభిన్నేన చక్షుషా=అభేద దర్శనముతోపాటు, దానమానాభ్యాం=దానమానములతో, మైత్ర్యా=మిత్ర భావముతోను, అర్చయేత్=పూజింపవలెను.

తాత్పర్యము : అందుచేత సకల భూతములందును ఆత్మ స్వరూపుడుగను, అంతర్యామిగను, వసించుచున్న నన్ను ప్రతిజీవుని యందొక్కటిగాచేసి దానము, బహుమానము, మైత్రి మొదలైన భావములచేతను కర్మలచేతను పూజింపవలెను. తన కన్న గొప్పవారిని సన్మానింపవలెను. సముల యందు మైత్రిని నెఱపవలెను. తగ్గులోనున్న వారికి సహాయ మొనరింపవలెను. ఈ ప్రవృత్తులతో ఎల్లరి యందును సమానముగా వర్తించున్న నాకు సత్యమైన పూజ ఏర్పడును.

28. అజీవానాం=అచేతనములకంటె, జీవాఃనచేతనములు, శ్రేష్ఠాః =శ్రేష్ఠములైనవి; తతఃవానికంటెను, ప్రాణభృతఃశ్వాసోచ్ఛ్వాసములున్న జంతువులు గొప్పవి. తతఃవానికంటెను, సచిత్తాఃజ్ఞానమున్నవి గొప్పవి. తతఃవానికంటెను, ఇంద్రియవృత్తయఃఇంద్రియవృత్తులు కల్గినవి. ప్రవరాఃశ్రేష్ఠములు.

తాత్పర్యము : సన్మానాదులను జీవుల యందు తారతమ్యము ననుసరించి యొనర్పవలెనను విషయమును ఇచ్చటినుండి ఆరుశ్లోకములలో చెప్పుచున్నాఁడు. దేవహూతి! మనుష్య లొనర్చెడు కర్మలచేత వారి కనేకరీతులైన కర్మలు ప్రాప్తించుచున్నవి. అనఁగా జీవుఁడనేక దేహములను పొందునని యర్థము. వీనిలో మృత్పాషాణాదు లచేతనము లనిపించుకొనును. అనఁగా వానిలో జీవుఁడు చాల అవ్యక్త స్వరూపుఁడై యుండునన్న మాట. వానికంటెను చేతనములైన స్థావరములు శ్రేష్ఠములు. శ్వాసోచ్ఛ్వాసాదులున్న జంగమములు వృక్షముల కంటెను శ్రేష్ఠములు. జ్ఞానము కల్గిన జీవములు వాని కంటెను గొప్పవి. ఇంద్రియముల సహాయముతో రూపరసాది విషయములను గ్రహించెడు జీవు లంత కంటె నుచ్చకోటిలో చేరినవి.

29. తత్రాపి=అందునను, స్పర్శవేదిభ్యఃస్పర్శజ్ఞానము కల్గినవాని కంటెను, రసవేదినఃరసజ్ఞానము కల్గినవి, ప్రవరాఃశ్రేష్ఠములు, తేభ్యఃవాని కంటెను, గంధవిదఃగంధజ్ఞానము కలవి, శ్రేష్ఠాఃఉచ్చకోటికి చేరినవి. తతఃవాని కంటెను, శబ్దవిదఃశబ్ద జ్ఞానము కల్గినవి, వరాఃశ్రేష్ఠములు.

తాత్పర్యము : పైజెప్పిన వాని కంటెను స్పర్శజ్ఞానముకల్గిన జంతువు లుత్తమములు. వానికంటె రసజ్ఞానము కల్గినవి, వాని కంటెను గంధజ్ఞాన మున్నవి ఉత్తమములు. వాని కంటెను శబ్దజ్ఞానము కలవి శ్రేష్ఠములు.

30. తత్ర=అందునను, రూపభేదవిదః=రూపభేదములను గమనించునవి ఉత్తమములు. తతశ్చ=వాని కంటెను, ఉభయతోదతః=రెండు వరుసలు పండ్లున్నవి ఉత్తమములు. తేషాం=వాని కంటెను, బహూపదాః=అనేక పాదములు గలవి, శ్రేష్ఠాః=శ్రేష్ఠములు. తతః=వాని కంటెను, చతుష్పాదాః=నాల్గుపాదములవి, తతః=వాని కంటెను, ద్విపాత్=రెండు పాదములు గలవి ఉత్తమములు.

తాత్పర్యము : రూపభేద జ్ఞానము కల్గిన ప్రాణులు శబ్దము గ్రహించెడు వాని కంటె శ్రేష్ఠములు. రెండు వరుసలు పండ్లు కలవి పండ్లులేని కాకాదుల కంటె శ్రేష్ఠములు. కాళ్ళుకల్గిన జంతువులు అవిలేని వాని కంటె నుత్తమములు. అనేక పాదములున్నవాని కంటెను చతుష్పాత్తులు పై తరగతి - వాని కంటెను రెండు పాదములున్న మనుష్యులు శ్రేష్ఠులు.

31. తతః=వారికంటెను, చత్వారః వర్ణాః=నాల్గువర్ణములు, తేషాం=వారి కంటెను, బ్రాహ్మణః ఉత్తమః=బ్రాహ్మణుడుత్తముడు. బ్రాహ్మణేష్వపి=వారి యందును, వేదజ్ఞః=వేదము లెఱిగినవాడు, తతః=వానికంటెను, అర్థజ్ఞః =అర్థమును తెలిసినవాడు, అధికః=గొప్పవాడు.

తాత్పర్యము : మనుష్యులలో బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు. తక్కిన వర్ణములు వాని కన్నను క్రిందివే. వారిలోను వేదజ్ఞుడైనవాడు గొప్ప వానికన్న వేదార్థము లెఱిగినవాడు మిన్న.

32. అర్థజ్ఞాత్=అర్థవేది యైనవాని కంటెను, సంశయచ్ఛేత్తా=సంశయమును దీర్పసమర్థుడైనే వాడు, తతః=వాని కంటెను, శ్రేయాన్=శ్రేష్ఠుడు, స్వకర్మకృత్= స్వధర్మము నను సరించెడు తతః భూయాన్=వానికంటెగొప్పవాడు, ముక్తసంగః =సంగము నుండి విడివిడిన వాడు, తతః భూయాన్=వాని కంటె శ్రేష్ఠుడు. ఆత్మనః ధర్మం=తన యొక్క ధర్మమును, అదోగ్ధా=ఫలమాసింపక చేయువాడు.

తాత్పర్యము : పూర్వా పరములు విచారించి అన్యోన్య విరోధములు లేక సంశయముల నివారించువాడు అర్థజ్ఞుని కంటె శ్రేష్ఠుడు. స్వధర్మాచరణ మొనర్చువాడు వాని కంటె నుత్తముడు. ఒకదాని యందును దురభిమానము లేక ధర్మమునసరించువాడు వానికంటె శ్రేష్ఠుడు. ఎందుకనగా వాడు స్వధర్మమును నిష్కామముగా నిర్వహించుచున్నాడు.

33, 34. మయి=నాయందు, అర్పితాశేష క్రియార్థాత్మా=సమర్పింపబడిన సకల వ్యాపారములతోను, దేహాది సంఘాతముతో కూడి యున్న వాడును, నిరంతరః=ఆ భావమందు విఘ్నము లేనివాడును, మయి=నాయందు,

అర్పితాత్మనః=సమర్పింపఁబడిన మనస్సుతో కూడియు, మయి=నాయందు, సన్న్యస్తకర్మణఃచక్కగా సమర్పింపఁబడిన కర్మములతో కూడియు, అకర్తుః =తానుకర్తననెడు అభిమానము లేనివాడు. సమదర్శనాత్=సర్వత్రసమముగా వ్యాపించియున్న సత్యవస్తువును విలోకించువాఁడునైన, పుంసఃపురుషుని కంటెను, పరంభూతం=ఉత్కృష్టమైన ప్రాణిని, న పశ్యామి=నేను చూచుటలేదు.

తాత్పర్యము : నా యందు సమర్పింపఁబడిన సమస్త కర్మములు గలవాఁడును, దేహాది సంఘాతముతో కూడిన వాఁడును, నిష్కామ కర్మనాచరించు వాని కంటెను శ్రేష్ఠుడు. ఎందుకనఁగా వాఁడు నాతో నిరంతరము చేరి యుండుటకు యోగ్యుఁడగును. వాఁడు తన యొక్క ఆత్మలను కర్మలను సర్వాత్మ భావముతో నా యం దెప్పుడో సమర్పించినాఁడు. వాఁడు సమదర్శనుఁడు. వాని కంటె నుత్కృష్టుఁడు లేఁడు.

35. ఈశ్వరఃభగవాన్=సర్వనియంతమైన జ్ఞాన స్వరూపుఁడు జీవకలయాజీవరూపుఁడై, ప్రవిష్టఃఇతి=ప్రవేశించి యున్నాఁడన్న ధ్యానముతో, ఏతానిభూతాని=కనిపించుచున్న చరాచరభూతములను, మనసాబహుమానయేత్ =మనస్సుతో బహుమానించును. ప్రణమేత్=నమస్కరించును.

తాత్పర్యము : ఈశ్వరుఁడు జీవరూపుఁడై సమస్తభూతములందును ప్రవేశించి యున్నాఁడు. ఇట్టి దృఢవిశ్వాసముతో వాఁడు సకలభూతములను మనసా గౌరవించును. నమస్కరించును. ఇదియే సరియైన భక్తి సాధన.

36. మానవి=మనుపుత్రి! భక్తి, యోగశ్చ=భక్తి యోగము, యోగశ్చ= యోగమును, మయా ఉదీరితఃనాచేత చెప్పఁబడినది. యయోఃఏకతరేణైవ= వీనిలో నొక్కదానిచేతనే, పురుషఃముముక్షువైనవాఁడు, పురుషం వ్రజేత్=పురుషుని పొందును.

తాత్పర్యము : మానవి! సాంఖ్యభక్తి యోగమును నీకు వివరించి చెప్పితిని. ఈ రెంటిలో దేని నాశ్రయించినను ముముక్షువైన వాఁడు తప్పక పరమ పురుషుని పొంది తీరును.

37, 38, 39. పరం=మహత్తత్త్వముగను, ప్రధానం=ప్రకృతిగను, పురుషం =ప్రకృతిని ప్రవర్తింపఁజేయువానిగాను, దైవం=దేవతా వరముగాను, కర్మ విచేష్టితం=కర్మముల యందలి బహు విధ వ్యాపారములతో కూడిన ఇంద్రియ వరముగాను, రూపభేదాస్పదం=రూపములయొక్క మార్పునకు కారణ మయ్యి, దివ్యం=అద్భుత ప్రభావముతోకూడిన, బ్రహ్మణఃబ్రహ్మమయ్యిను. పరమాత్మనః =పరమాత్మగాను ఉన్న, భగవతఃభగవంతుని యొక్క, ఏత ద్రూపం=ఈ స్వరూపము, కాలఃఇతి=కాల మనియు, అభిధీయతేచెప్పఁబడుచున్నది. యతఃదేని నుండి, మహదాదీనాం భూతానాంమహత్తత్త్వాది భూతములను, భిన్నదృశాంఈశ్వరునికంటె భిన్నముగా దర్శించు వారికి, భయంభయమేర్పడు చున్నది.

తాత్పర్యము : ఈ కాలస్వరూపుఁడైన ఈశ్వరుఁడు అసంగుడు, వానికి ప్రియులు లేరు. అప్రియులు లేరు. బంధువులులేరు. నిరంతర జాగరూకుఁడైన ఈ దేవుఁడు నిరంతర విషయాసక్తులైన సర్వజనులను వశీకరించుకొని వారి అవసానము నేర్పుచు చున్నాఁడు. సర్వమునందును ఆత్మస్వరూపమును వీక్షించెడు జ్ఞానికి మరణము లేదని దీని సారము.

40. అయంవాతఃఈ గాలి, యద్భయాత్=ఎవని నుండి ప్రాప్తించెడు భయము కారణముగా, వాతి=వీచుచున్నదో, సూర్యఃసూర్యుఁడు, తపతి=ఎండ నొసఁగు చున్నాఁడో, దేవఃపర్జన్యుఁడు, వర్షతే=వర్షించు చున్నాఁడో, భగణఃనక్షత్రసమూహము, భాతి=ప్రకాశించుచున్నదో.

తాత్పర్యము : కాలస్వరూపుఁడైన ఈశ్వరుని యాజ్ఞను దలఁచి భయపడి వాయ్వాదులు వారి వారికి ఈశ్వరుఁడు నిశ్చయించిన కార్యమును నిర్వహించు చున్నవి. దేవతల స్థితియే ఇట్లున్నపుడు ఇఁక తక్కినవా రెవ్వరు పరమేశ్వరుని యాజ్ఞ నతిక్రమించుటకు శక్తిగల వారు కారని వివరించు చున్నాఁడు. కాల స్వరూపుఁడైన ఈశ్వరుని నుండి భయపడుచు వాయువు కాలానుసారముగా సర్వత్ర ప్రసరించుచున్నది. సూర్యుఁడు కాలానురూపముగా తపించుచున్నాఁడు అందుకు ఈశ్వరుని భయమే కారణము. వర్షాధిపతియైన ఇంద్రుఁడు కూడ వర్షించు చున్నది. కాలభయము వలననే నక్షత్రములు ప్రకాశించు చున్నది కూడ అందువలననే. లోక యాత్రను నిర్వహించు చుండెడి దేవతలు కూడ కాలాధీనులే. ఇఁక తక్కిన వారి మాటచెప్ప నేమున్నది?

"భీషాఽస్మాత్వాతఃపవతే భీషోదేతి సూర్యఃభీషా దగ్నిశ్చేంద్రశ్చ మృత్యు ర్ధావతి పంచమఃఃః

చున్నది. పర్వత వనాదులతో పాటు భూమి లోనికి క్రుంగిపోక అట్లే నిలచియున్నది.

43. యన్నియమాత్=కాలస్వరూపుఁడైన ఏ ఈశ్వరుఁడు నియమించిన నియమముచేత, అధఃన భఃఈ ఆకాశము, శ్వసతాం=నిశ్వసించుచున్న వారికి - అనఁగా ప్రాణులకు, మారం=స్థలమును, దదాతి=ఇచ్చుచున్నది. మహాన్=మహత్తత్త్వము, స్వదేహం=తన రూపమును, సప్తభిః ఆవృతం=ఏడు పదార్థములచేత ఆచ్ఛాదింపఁబడినదై, లోకం తనుతే=లోక స్వరూప మగుచున్నది.

తాత్పర్యము : కాలము యొక్క కల్పన ననుసరించియే ఈ ఆకాశము ప్రాణిజాతమునకు నివసింప నవకాశ మొసఁగు చున్నది. మహత్తత్త్వము, పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, అహంకారము అను వీనిచే చుట్టఁబడిన లోకముగా తనశరీరమును పరిణమింపఁజేసి కొనుచున్నది.

44. గుణాభిమానినః దేవాఃగుణముల నభిమానించు చున్నదేవతలు, అస్య=ఈ లోకము యొక్క, సర్గాదిషు=సృష్టి మొదలైన వాని యందు, అనుయుగం=కల్పపర్యంతము, వర్తంతే=ప్రవర్తించు చున్నది. ఏతత్ చరాచరం=ఈ చరాచరములతో కూడిన లోకము, యేషాం=ఎవరి యొక్క, వశే=అధీన మందున్నదో.

తాత్పర్యము : సత్త్వాది గుణముల కభిమానులైన విష్ణువు మొదలైన దేవతలు ఈ లోకము యొక్క సృష్టిస్థితి సంహారము లందు కల్పాంతము వరకును నిలిచి, కర్తవ్యములు నెరవేర్చుట కాలభయము నిమిత్తముగనే. ఈ లోకమంతయు ఆ దేవతల కధీనమైనది. వారు కూడ కాలమునకు భయపడుదురు. కాలము విష్ణు స్వరూప మనికదా చెప్పితిమి. అప్పుడు విష్ణువునకు కూడ భయమున్నదని కదా అర్థము. అపు డాతని కంటె మిన్న కదా! ఇది అసంగతమని శంకింపవలదు. విష్ణుస్వరూపుఁడైన భగవంతుఁ డేర్పాటుచేసిన నిశ్చయమే కాలస్వరూపము. తనచే నిశ్చయింపఁబడిన దానిని భగవంతుఁడే అతిక్రమించినచో తక్కిన వారుకూడ అతిక్రమింప ప్రారంభింతురు. అందుచేత తానేర్పఱచిన నియమమును కాలమునుండి భయపడిన వానివలె నటించుచు అతఁడనుసరించును. ఒకరోజు తాను ఒనర్చిన నియమమును తానే అతిక్రమింపనేరఁడు కదా!

45. అనంతఃఅపరిచ్ఛిన్నుఁడును, అంతకరఃఅంతము కల్గునట్లొనర్చువాఁడును, అనాదిఃఆది అంతలేని వాఁడును, ఆదికృత్=ఆదిని జన్మింపఁజేయువాఁడును, అవ్యయఃవికారరహితుఁడును నైన, సఃకాలఃఆ కాలము, జనం=జనమును, జనేన=జనుల నుండి, జనయన్=జన్మింపఁజేయుచున్నవాఁడై, అంతకం=నాశకుఁడైన చోరాదులను, మృత్యునా=మృత్యువుచేత, మారయన్=నశింపఁ జేయువాఁడును అయి ఉన్నాఁడు.

తాత్పర్యము : కాలమాహాత్మ్యమును వివరించిన తరువాత కాల నిమిత్తముగా నేర్పడెడు కార్యమును వివరించుచు విషయము నుపసంహరించు

చున్నాఁడు. ఈ కాలము తల్లిదండ్రు లనెడు జనులను ఉపకరణములుగాఁ జేసికొని పుత్రాదులకు జన్మమును ప్రసాదించుచున్నది. అందుచేత ఆది ఏర్పఱచునదిగా నున్నది. తస్కరుఁడు, వ్యాఘ్రములు మొదలైన లోకోపద్రవ కారులను మృత్యు స్వరూపములుగా నేర్పరచి జనులను నశింపఁజేయుచున్నది. ఆద్యంతములను అపక్షయాది వికారములను ఇతరులకు కల్గించుచున్నది. తనకు ఈ వికారము లేవియును లేవు. ఆట్టికాల మీశ్వరస్వరూపమే.

విజయధ్వజ వ్యాఖ్య

1, 2. అపరోక్షజ్ఞానముచే మోక్షము కలుగుననియు, ఆ అపరోక్షజ్ఞానము అష్టాంగయోగ యుక్తమైన యోగము వలన అభివృద్ధమైన శ్రీహరి ఉపాసన చేతఏర్పడినదని ఇంతకు ముందు చెప్పినట్లైనది. ఇప్పుడు భక్తి యోగము నందలి తారతమ్యమును చెప్పుచున్నాఁడు. దానిని ప్రారంభించుట కనుకూలముగా నుండునట్లు దేవహూతి సామాన్యముగా నెఱింగి యున్నను విశేషముగా మహత్తత్త్వాదుల లక్షణమును తెలియవలెనను కోర్కెతో ప్రశ్నించుచున్నది- ప్రభోః=ఓ స్వామీ! మహదాదీనాం=మహత్తత్త్వము మొదలైన వాని యొక్కయు (వానికభిమానులైన దేవతల యొక్కయు) ప్రకృతేః=జడ ప్రకృతి యొక్కయు (దాని కభిమానియైన చిత్ ప్రకృతి యొక్కయు) పురుషస్యచ= పురుషార్థ ప్రదుఁడైన శ్రీహరి యొక్కయు, అమీషాం=వీరి యొక్క, పారమార్థికం స్వరూపం=యథార్థమైన స్వరూపము, యేన=ఏ లక్షణముచేత, లక్ష్యతే=తెలియఁబడుచున్నదో, ప్రాజ్ఞాఃజ్ఞానులు, తత్=ఆలక్షణమును, యన్మూలం=ఏ సాంఖ్య శాస్త్ర ప్రతిపాదితమని, ప్రచక్షతే=చెప్పుదురో, యథా=ఎట్లు, సాంఖ్యేషు ఉక్తం= సాంఖ్యశాస్త్రమందు చెప్పఁబడినదో, తథా=అట్లు, కథితం=చెప్పఁబడిన లక్షణ జ్ఞానము పురుషార్థమున కుపయోగించుచున్నదో యథావత్తుగా సాంఖ్యమందు చెప్పినట్టుగానే చెప్పియున్న, తత్‌లక్షణం=ఆ లక్షణమును అనఁగా భక్తి యోగము యొక్క, మార్గం=ప్రకారమును, విస్తరశఃవిస్తారముగా, మే=స్త్రీనగుట చేత మంద బుద్ధియైన నాకు, బ్రూహి=ఉపదేశింపుము. "యన్మూలం" అని చెప్పుటచేత సాంఖ్యశాస్త్రమందు చెప్పబడిన దానినే చెప్పవలెఁగాని ఇతర శాస్త్రములందు చెప్పఁబడిన విషయమును చెప్పరాదని నియమించినట్లైనది "విస్తరశః" అనుటచేత ముందుగనే ఈ విషయమును కొంత తెలిపియున్నను విస్తృతముగా ఉపదేశింపవలెనని ప్రార్థించినట్లైనది.

తాత్పర్యము : ఓ కపిలమునీ! ప్రాజ్ఞులైనవారు సాంఖ్య శాస్త్రమందు మహత్తత్త్వాదులు వాని కభిమానులైన దేవతలు జడప్రకృతి తదభిమానియైన చిత్ప్రకృతి సర్వపురుషార్థప్రదుఁడైన శ్రీహరి - వీని లక్షణములను వివరించిరని చెప్పుదురు. ఈ జ్ఞానము పురుషార్థమున కుపయుక్తమైనది. ఇదే భక్తి యోగము యొక్క ప్రకార మనిపించుకొనును. దీనిని సామాన్యముగా ఇంతకు ముందే

వివరించి యున్నారు. ఇపుడు మంద బుద్ధినైన నా కర్థమగునట్లు విస్తృతముగా వివరింపవలెను.

3. భక్తియోగము యొక్క ప్రకార మొక్కటే చాలదు. వైరాగ్యము లేనిచో ఆ భక్తి స్థిరముగా నుండదు. కనుక నుపాసకుఁడు విరక్తుఁడు గూడనై ఉండవలెను. అందుచేత వైరాగ్యము యొక్క స్వరూపమును గూడ వివరింపవలెనని ప్రశ్నించుచున్నది - భగవన్! ఓ స్వామీ! పురుషఃఉపాసకుఁడు, సర్వతఃశ్రీహరి తప్ప తక్కిన అన్ని ప్రాపంచిక విషయములందును, విరాగఃఆసక్తిలేని వాఁడుగా, భవేత్కావలెను. ఇతిఅని, యేన=ఏ కారణముచేత వ్యాకృచ్ఛితివో, అతఃఆ కారణము వలన, జీవకస్య=జీవుల యొక్క వివిధాఃగర్భావాసము మొదలైన వివిధరీతులుగా నున్న, కర్మ సంసృతీఃకర్మాను గుణముగా ప్రాప్తించెడు సాంసారిక దుఃఖములను, ఆచక్ష్వవివరింపుము. లేక, యేన=ఏ కర్మానుగుణముగా వచ్చిన సాంసారికాను భవముల యొక్క జ్ఞానముతో నుపాసకుఁడు వైరాగ్యము కలవాఁడగునో అట్టిజ్ఞానము యొక్క వ్యుత్పత్తిని కూడతెలుపవలెనని యైనను అన్వయింపవచ్చును.

4. అవతారిక : కాలస్వరూపము యొక్క జ్ఞానము పురుషార్థమున కుపయుక్తమైనది. అందుచేత దాని విషయమును కూడ ప్రశ్నించు చున్నది. జనాఃజనులు, యద్దేతోఃకాలస్వరూపియైన ఏ హరి యొక్క భయము కారణముగా, కుశలంశ్రేయస్సును సంపాదించి పెట్టెడు కార్యమును, కుర్వంతిచేయుచుందురో, తస్యఅట్టి, పరేషాంచఉత్తములనిపించుకొన్న, లక్ష్మీబ్రహ్మాదుల కంటెను, పరస్యఉత్తముఁడైన, తేనీకు సంబంధించిన, ఈశ్వర రూపస్యఐశ్వర్యమూర్తియైన, కాలస్యకాలమని పిలువఁబడెడు, విభూతి రూపము యొక్క, స్వరూపంస్వరూపమునుగూడ, ఆచక్ష్వదయచేసి తెలుపుము. బత! ఈ విషయము లన్నియు నద్భుతమైనవి కదా? నేను జడ మతినగుట చేత నాపాలి కివి యన్నియు అగ్రాహ్యము లైన విషయములు. కానీ నీ యనుగ్రహ బలము చేత తెలిసికొన వీలుపడుచున్నదని చెప్పినది.

5. ఋషులనో దేవతలనో ఎవరినో ఒక్కరిని ఈ విషయమును ప్రశ్నింప కూడదా? నన్నే ఎందుకు ప్రశ్నించుచున్నావు? అని ఆశంకించు కొని వారికి ఈ ప్రశ్నమున కుత్తరమిచ్చు సామర్థ్యము లేక పోవుటయు, జ్ఞానప్రదానము కొఱకే లోకమందు నీ వవతరించుట చేతను, నిన్నే ప్రశ్నించుచున్నాను, ఈ ప్రశ్నల కుత్తర మిచ్చుటకు నీవే సమర్థుడవు అను నభిప్రాయముతో, నడుగు చున్నది. అనాశ్రయేఅపారమైనట్టి, తమసిఅవిద్యయనెడు అంధకారమందు, చిరంఅనాదికాలము నుండియు, ప్రసుప్తస్యనిద్రించుచున్నట్టియు, అందుచేతనే మిథ్యాభిమతేఃబోధించువారులేక పదార్థములను వేఱొక్క రీతిగా తెలిసి కొన్నట్టియు తత్పలముగా, అచక్రుషఃజ్ఞాన రహితుఁడై నట్టియు, అందువల్లనే కర్మసుపుణ్యపాపము లనిపించుకొనెడు ప్రవృత్తి రూపకర్మలందు, అనువిద్ధయా=

ఆసక్తమైన, ధియా=బుద్ధిచేత, శ్రాంతస్య=సంసారమందు దొరకి బడలి యున్నట్టి, లోకస్య=శ్రీహరి నపరోక్షీకరించుకొనుటకు యోగ్యతకల ముక్తి యోగ్యులైన జీవులకు పాతమును కలిగించు కొనుటకు, యోగభాస్కరః=జ్ఞానయోగమునకు సూర్యుఁడవైన, త్వం=నీవు, అవిరాసీఃకిల=అవిర్భవించితివి కదా! ఈ విషయము లోక వేదములందు చెప్పినదే. ఇతరులకు నీవంటి సామర్థ్యము లేనిదాని వలన ఇది సంభావితమునై ఉన్నది. ఈ మాటలతో అవతార ప్రయోజమును కూడ చెప్పినట్లైనది "చిరంప్రసుప్తస్య" అనుటచేత అచక్రుషః అనగా కన్నులులేని వాఁడని అర్థము కాదని చెప్పినట్లైనది. నిద్రించిన దాని ఫలమే మిథ్యాభిమానము, దాని ఫలమే సంసారశ్రమ యని చెప్పినట్లైనది.

6. తల్లియొక్క మాటవిని కపిలరూపియైన భగవానుఁడు ఏమి ఉత్తర మిచ్చెనను ప్రశ్నకు సమాధానము కురుశ్రేష్ఠ=ఓయి విదురా! ఇతి=ఈ విధముగా, మాతుఃతల్లియొక్క, శ్లక్ష్ణంవచఃహితకరమైన మాటను, మహామునిఃకపిల రూపియైన పరమాత్మ, ప్రతినంద్య=ప్రశంసించి,కరుణార్దితస్సన్=దయను పొందిన వాఁడై, ప్రీతస్సన్=సంతుష్టినందినవాఁడై, తాం=తల్లినిగూర్చి, అబభాషే=ఉత్తర మిచ్చెను. తల్లి కుత్తరమిచ్చుటలో ప్రధానహేతువు దయయే అని తెల్పినట్లైనది.

7. ముక్తి సాధనములందు భక్తి యోగము ప్రధానమైనందుచేత దాని ప్రకారము ఇచ్చుట మొదలు చెప్పుచున్నాఁడు. హేభామిని! ఓ సౌందర్యాది గుణములచేత కూడినదానా! తల్లీ! భక్తియోగము, మార్గైఃశాస్త్రమార్గములచేత, బహువిధఃఅనేక ప్రకారములు కలది యని భావ్యతే=చెప్పఁబడుచున్నది. పుంసాం=జీవులయొక్క, భావఃభక్తియు, స్వభావగుణ మార్గేణ=వారి వారి తామస రాజస సాత్త్విక స్వభావముల ననుసరించి, విభిద్యతే=భిన్న భిన్నములుగా ఉండును.

8. ఆ ప్రకారాంతరములనే పై శ్లోకములతో చెప్పు చున్నాఁడు - యఃఎవఁడు, హింసాం=ఇతరుల కుపద్రవమును, దంభం=దాంభికతనమును, తాను గొప్ప ధర్మిష్ఠుఁడనని తెలిసికొను భావముతో నన్న మాట) చ=ఇతను, మాత్సర్యంఏవ=పరోత్కర్షను సహింపకుండుటను, అభిసంధాయ=మనస్సునందుంచుకొన్నవాఁడై, సంరంభి=శ్రీహరి యందును, అతని భక్తులందును, గూఢమైన ద్వేషమునుంచు కొన్నవాఁడును లేక భిన్నదృక్=పదార్థములను, యథావస్థితముగా తెలియక అన్యథా అర్థముచేసికొన్నవాఁడుగనూ (మిథ్యాజ్ఞాని యన్న మాట) మయి=నాయందు, భావం=భక్తిని, కుర్యాత్=నెఱపునో (చేయుచున్న వానివలె కన్పించునో) సఃవాఁడు, తామసఃతామస భక్తుఁడనిపించుకొనును.

9. యఃఎవఁడు, విషయాన్=శబ్దము, స్పర్శము మొదలైన విషయములను, యశఃదిక్కుదిక్కులందు ప్రసరించెడి కీర్తిని, చ=మఱియు, ఐశ్వర్యంఏవ =ఛత్రచామరాదులైన రాజభోగములను, అభిసంధాయ=మనస్సునందు సంకల్పించుకొన్నవాఁడై, అర్చాదౌ=ప్రతిమ మొదలగు వానియందు, మాం=నన్ను,

అర్చయేత్=పూజించునో, పృథగ్భావః=ప్రతిమ మొదలగు వాని యందలి నారూపములకు భేదము కలదని భావించునట్టి, సః=ఆభక్తుఁడు, రాజసః =రజోగుణ ప్రధానమైన చిత్తవృత్తి కలవాఁడని తెలియవలెను.

10. యః=ఎవఁడు, కర్మనిర్హారం=పాపపుణ్యముల యొక్క పరిహారమును, వా=ఇంకను, పరస్మిన్=సర్వోత్తముఁడైన నాయందు, తదర్పణం=ఆ కర్మముల సమర్పణమును, ఉద్దిశ్య=ఉద్దేశముగా నుంచు కొన్నవాఁడై, మాం=నన్ను, యజేత్=పూజించునో, వా=అట్లుగాక, యష్టవ్యం=శాస్త్రవిహితమైనందు చేత ఈ పూజ నాకుకర్తవ్యము, ఇతి యజేత్=ప్రతిమాదులందును ఇతర స్థలములందును నన్ను పూజించునో, అపృథగ్భావః=నా రూపములందు భేదము గమనింపనట్టి, సః=ఆభక్తుఁడు, సాత్త్వికః=ముక్తి యోగ్యుఁడైన వాఁడు రాజస భక్తుఁడు శ్రీహరి యొక్క రూపములందు భేదమున్నదని తెలియును. సాత్త్విక భక్తుఁడు అట్లు భావింపఁడు. పరమాత్ముని అన్ని రూపములు ఒక్కటిగా తలంచును. ఇరుతెగలైన ఈ భక్తులకున్న ప్రధానభేదమిదే. ప్రతి మాదుల నర్చించుట అజ్ఞులైన రాజసభక్తులకు పరోక్షానుభవము లేనట్టియు లేక అపరోక్షజ్ఞానులును ఐన సాత్త్వికులకును సమానమే. కాని అపరోక్షము లేనట్టి సాత్త్వికులకు అది విహితమైన కర్మ. అపరోక్షజ్ఞానము కలవారు ప్రతిమార్చన మొనర్చినచో దానినుండి వారికి ఆనందాభివృద్ధి అగును. అది ఒనర్పకున్నచో వారికి పాపము రాదు. దీనికి ప్రమాణము--

"అజ్ఞోఽర్చయేదేవార్చాయా మన్యథా దోషవాన్ భవేత్,
జ్ఞస్త్వర్చయన్ సుగుణవా నన్యథా దోషవాన్ న తు."

11. నిర్గుణ భక్తియొక్క లక్షణమును చెప్పుచున్నాఁడు - యథా=ఎట్లు, అంబుధౌ=సముద్రమందు, గంగాంభసః=గంగాజలము యొక్క, గతిః=ప్రవాహము, అవిచ్ఛిన్నా=విచ్ఛిత్తికలదు కాదో, తథా=అట్లు, మద్గుణ శ్రుతిమాత్రేణ=నాకు సంబంధించిన గుణముల యొక్క శ్రవణ మాత్రము చేతనే, యస్య=ఎవనికి, సర్వగుణాశ్రయే=సర్వగుణ స్వరూపియైనట్టి, మయి=నాయందు, మనోగతిః =మనస్సు యొక్క వ్యాపారము (అనఘా ధ్యానము) అవిచ్ఛిన్నా=నిరంతరముగా నుండును. తేన=వానిచేత, క్రియమాణస్య=చేయఁబడుచున్నట్టి, నిర్గుణస్య= సామాన్య మైన సాత్త్విక భక్తికంటె నుత్తమమైన భక్తి యోగము యొక్క, లక్షణం=లక్షణము, ఉదాహృతంహి=చెప్పఁబడినది కదా! నిరంతరమైన సాత్త్విక భక్తియే నిర్గుణ భక్తియని తాత్పర్యము.

12, 13, 14.అత్యంతికమైన ఏకాంత భక్తియొక్క లక్షణమును చెప్పుచున్నాఁడు - పురుషోత్తమే=శ్రీహరియందొనర్చునట్టి, యా=ఏ భక్తిః =మాహాత్మ్యజ్ఞానముతో కూడిన నిరతిశయమైన స్నేహము, అహైతుకీ=ఏ నిమిత్తమునుకూడ ఆశ్రయించినదిగా నుండదో, మరియు అవ్యవహితా=విషయేచ్ఛ మొదలైన వానిచేత వ్యవహితమైనట్టిదిగా ఉండదో, సా=అది అత్యంతికభక్తి యనిపించుకొనును. జనాఃఈ విధమైన భక్తిని సాధించెడు బ్రహ్మాది చేతనులు,

మచ్చేవనం వినా=నాయొక్క సేవను వదలి, దీయమానం=భక్తి యొక్క ఫలముగా నే నను(గహించునట్టి సాలోక్య, సార్ష్టి (సమానమైన ఐశ్వర్యము) సామీప్య, సారూప్య, సాయుజ్యాది భేదములతో కూడిన మోక్షమును, న గృహ్ణంతి=మనస్సుతో ఁ గూడనపేక్షింపరు. సఏవ=ఇదే అత్యంతిక భక్తి స్వరూప మని, ఉదాహృతః=చెప్పఁబడినది, యేన=ఈ విధమైన భక్తిచేత, త్రిగుణాన్= ప్రాకృతము లైన లింగశరీరము, ఇంద్రియములు మొదలైనవానిని, అతి వ్రజ్య=అతి(క్రమించి (అనఁగా పోఁగొట్టు కొన్నవారై, మద్భావాయ=స్వరూప భూతమైన చిదానంద దేహముతో నాయందుండుట యనెడు అత్యున్నతస్థితి కొఱకై, ఉపపద్యతే=యోగ్యుఁడైన వాఁడుగా నగును.

15. ఇటువంటి భక్తి ఏర్పడుటకు సాధనమేది యనఁగా చెప్పుచున్నాఁడు - అనిమిత్తేన=ఏ నిమిత్తము కూడ లేనట్టి, (అనఁగా నిష్కామమైనట్టి) నిషే వితేన=ఉత్కృష్టమైన భక్తిచే నొనర్పఁబడినట్టి దానిచేతనే, మహీయసా=శ్రేష్ఠమైనట్టి, స్వధర్మేణ తమతమ వర్ణాశ్రమ ధర్మము చేతను, శక్తిన=శక్తికి తగినట్టి, క్రియాయోగేన భగవత్పూజారూపమైన జ్ఞానోపాయము చేతను, లేక కర్మయోగము చేతను, నిత్యశః=ప్రతిదినము, నాతిహింస్రేణ=ప్రాణిహింసలేనట్టి క్రియాయోగము చేతను, ఇచ్చట నుండి ప్రతిశ్లోకమునకును పండెండ్రివ శ్లోకముతో నన్వయము.

16. మద్దిష్ణ్యదర్శన స్పర్శ పూజాస్తు త్యభివందనైః=నాకు సంబంధించిన ప్రతిమలను దర్శించుట, స్పృశించుట, పూజ యొనర్చుట, స్తోత్రమొనర్చుట, నమస్కరించుట- వీనిచేతను, భూతేషు=జనుల యందును, మద్భావనయా =అంతర్యామిగా నేను వసించుచున్నానని తెలియుటచేతను, (అనఁగా నారీతిగా ఉపాసన యొనర్పవలెనని భావము) సత్యేన=సజ్జనులకు హితమైన మాటచేతను, చ=ఇంకను, అసంగమేన=దుర్జనుల సహవాసము వదలుట చేతను.

17. మహతాం=తనకంటె ఉత్తములైన వారియందు, బహుమానేన =అర్చించుట చేతను, హీనానాం=తనకంటె తక్కువ వారియందు, అనుకంపయా =దయచేతను, ఆతృతుల్యేషు=తనతో సమానమైన వారి యందు, మైత్ర్యాచ=స్నేహ భావముచేతను (అనఁగా ఉపకారాదుల చేతను వారిని రక్షించు నభి(ప్రాయము తోను,) యమేన=అహింసాదులైన నియమములతోను, చ=మఱియు, నియమేన= శౌచము, సంతోషము మొదలైన నియమముల చేతను.

18. అధ్యాత్మికాను శ్రవణాత్=వేదాంత శాస్త్ర శ్రవణముతోను, చ=మఱియు, మే=నాకు సంబంధించిన, నామ సంకీర్తనేన=భక్తి పూర్వకమైన నామస్మరణము చేతను, ఆరవేన=నిష్కపటమైన బుద్ధితోను, ఆర్యసంగేన=జ్ఞానులతోడి సహవాసముతోను, సః=అట్లి, నిరహంక్రియయా=దేహము మొదలైన వానియందు, అహంకార మమకారములు లేకుండుట చేతను.

19. అపి=మఱియు, మద్ధర్మిణాః=ఊర్ధ్వపుండ్రధారణము, ముద్రా ధారణము మొదలైన వానిచేతను, ఏతైః=వీని చేతను, పురుషస్య=ఉపాసకుఁడైన జీవుని యొక్క, ఆశయః=అంతఃకరణము, యర్హి=ఎప్పుడు, పరిశుద్ధః=సర్వరీతుల

చేతను నిర్మలమైన దగుచున్నదో, తర్ది=అప్పుడు, అంజసా=కాల విలంబములేక, శ్రుతమాత్రగుణం=దోషలేశముకూడ లేక, ఎవ్వరి గుణగణములను మాత్రమే - ఇందులో అట్టి, అంజసా=ముఖ్యతత్త్వమైన, మాం=నన్ను, అభ్యేతి=పొందును. హి="గుణాః శ్రుతాః సవిరుద్ధాశ్చసదేవే" అను ప్రమాణము చేత సిద్ధమైనది. అనఁగా స్వధర్మాదుల యొక్క అనుష్ఠానఫలము అంతఃకరణశుద్ధి. అది శ్రీహరిని పొందుటకు మార్గమని తెలపినట్లైనది.

20. శుద్ధమైన మనస్సుకలవానికి శ్రీహరి యందు హృదయము ప్రసన్న మయ్యెడు ప్రకారమును చెప్పుచున్నాఁడు - యథా=ఎట్లు, ఆశయాత్=పుష్పము నుండి బయలుదేరి, వాతరథః=గాలియే రథముగాఁ గలిగిన, గంధఃవాసన, ఘ్రాణం=ఘ్రాణేంద్రియమును, ఆవృంక్తే =ఆవరించుకొనునో (వశీకరించు కొనునో) ఏవం=ఇట్లు, యోగరతం=పైన చెప్పిన సాధనాదిని యోగముచేత శ్రీహరి యందాసక్తుఁడై, యత్=ఏది, అవికారి=వికారము లేనిదో, తత్=ఆ, చేతః =ఉపాసకుని యొక్క మనస్సు, ఆత్మానం=శ్రీహరిని, ఆవృంక్తే=ప్రసాదాభిముఖుఁడుగా చేసికొనును. దీనిచేత నిర్గుణ భక్తి యోగమును పొందినవాఁడు అత్యంతికభక్తి యోగమును పొంది శ్రీహరిని అపరోక్షీకరించు కొనునని చెప్పినట్లైనది.

21. ఈ విధమైన భక్తి యోగులు శ్రీహరి నెచ్చట ధ్యానింపవలెనో దాని కుత్తర మిచ్చుచున్నాఁడు - భూతాత్మా=జీవులకు కర్మ ఫలాదుల నొసఁగుట చేత స్వామియైన, అహం=నేను, సర్వేషు భూతేషు=సమస్త జీవుల యందును, సదా=నిరంతరమును, అవస్థితఃఅంతర్యామిగా నుండుచున్నాను. అనఁగా సర్వజీవుల యందును అంతర్యామిగా నున్న వానినిగా నన్ను ధ్యానింప వలెనని అభిప్రాయము. ఈ రీతిగా అన్ని జీవుల యందును అంతర్యామిగా ఉన్నట్టి, తం మాం=ఆ నన్ను, అవజ్ఞయ=తెలిసి కొనక (తిరస్కరించి) మర్త్యాఃతామసరాజసికభక్తుడు, అర్చావిడంబనం=ప్రతిమ యందు పూజా రూపమైన విడంబనను, కురుతే=చేయుచుందురు. అందుచేతనే వీరు రాజసులు తామసులు అని పిలువఁబడుదురు. దీనిచేత రాజసులు తామసులు సాత్త్వికుల కంటె అధము లని ఒక్క మాటతోనే చెప్పినట్లైది.

22. పైన చెప్పిన విషయమునే స్పష్టపఱచు చున్నాఁడు - ఈశ్వరం=పర్వశ్రేష్ఠనియామకుఁడైనట్టి, ఆత్మానం=సర్వులకు స్వామియైన, మాం=నన్ను, సర్వేషు భూతేషు=సమస్త జీవులందును, సంతం=వసించుచున్నట్టి నన్ను, హిత్వా=వదలివేసి, యఃఏ రాజసిక భక్తుఁడు మౌఢ్యాత్=అవివేకముతో కూడినవాఁడై, అర్చాంభజతే=ప్రతిమాదులను పూజించుచున్నాఁడో, సఃఅట్టివాఁడు, భస్మన్యేవ=బూడిద యందే, జుహోతి=హోమించు వాఁడుగా అగును. బూడిద యందని చెప్పుట చేత హోమముయొక్క ఫలములేకున్నను మంత్రోచ్చారణఫలము వీనికి దొరకుట చేత వీఁడు తామసభక్తుని కంటె కొంచెము ఉత్తముఁడని చెప్పినట్లైనది.

22

23. తామసునకు కొంచెము కూడ ఫలము దొరకదని చెప్పుచున్నాఁడు - పరకాయే=ఉత్తములదేహమందున్నట్టి, మాం=నన్ను, ద్విషతఃద్వేషించుచున్నట్టియు, భిన్నదర్శినఃపదార్థములను యథా వత్తుగా తెలియక అన్యథా భావించు చున్నట్టియు, భూతేషు=నా భక్తులైన వైష్ణవుల యందు, బద్ధవైరస్య=ఎప్పుడును ద్వేషమును సాధించు, మానినఃతానే స్వతంత్రుఁడని అభిమానము గల తామసుని యొక్క, మనఃమనస్సు, శాంతిం=నా యందు నిష్ఠను, న ఋచ్ఛతి=పొందుట లేదు.

24. నా ప్రీతికి కారణము కాకుండుట చేత తామస భక్తులొనర్చెడు ప్రతిమా పూజకూడ విడంబనయే కాని సత్యము కాదనుచున్నాఁడు హే అనఘే=ఓ పాపరహితురాలా! ఉచ్చావచైఃఉచ్చములు నీచములైన, ద్రవ్యైఃపదార్థములతోకూడి, ఉత్పన్నయా=ఉండుచున్నట్టి, క్రియయా=మానసికమో కాయికమునైన వ్యాపారముచేత, అర్చాయాం=ప్రతిమ యందు, అర్చితఃపూజితుఁడనైన, అహం=నేను, భూతగ్రామవ మానినఃజీవసమూహమునందు అంతర్యామిగా వసించుచున్న నన్ను తిరస్కరించెడు స్వభావముకల ఈ తామసిక భక్తుని విషయమందు, న ఏవ తుష్యేఃనేను తృప్తుఁడను కాను.

25. అట్లైనచో ప్రతిమాదులందు పూజను విధించు శాస్త్రము వ్యర్థమైనట్లే కదా! అనుటకు సమాధానము:- యావత్=ఎంత వఱకు, స్వహృదిహతన హృదయమందు అంతర్యామిగా నున్న నేనే, సర్వభూతేషు= అన్ని జీవులందును, అవస్థితంఅంతర్యామిగా నుండునట్టి, ఈశ్వరం=సర్వనియామకుఁడనైన, మాం=నన్ను, న వేద=తెలిసికొనఁడో, తావత్=అంతవఱకును స్వకర్మకృత్=తన వర్ణాశ్రమములకు నిషిద్ధమైన దానిని వలె విహితమైన కర్మనే చేయుచున్నవాఁడై, అర్చాదౌ=ప్రతిమ మొదలైన వానియందు, అర్చయేత్=పూజింపవలెను. సర్వభూతాంతర్యామి యందు భేదజ్ఞానము అనర్థము కలిగించునని చెప్పనట్లైనది.

26. అంతర్యామి రూపములను భిన్నములుగా తెలియుటే ముందు చెప్పిన భిన్నదర్శన మను దానికి అరమని చెప్పుచున్నాఁడు - యఃఎవఁడు. ఆత్మనఃతనహృదయమందుండెడు నట్టియు, పరస్య అపిఇతరుల దేహమందు వసించెడి పరమాత్మను, అంతరోదరం=భేదముతో కూడిన పరమాత్మగా, కరోతిచేయునో, స్వాభావికముగా అభిన్నములైన ఈ రూపములను భిన్నములని భావించునో తస్యఅట్టి, భిన్నదృశఃపరమాత్ముని రూపములకు భేదమును భావించువానికి, మృత్యుఃసంసారమనెడు దురన్నమును చంపెడు శ్రీనరసింహ రూపి, ఉల్బణం భయం=నిత్యదుఃఖరూపమైన, అంధం తమస్సును, విదధేఇచ్చును. 'ఉదరంబ్రహ్మ' అనెడు శ్రుతి ననుసరించి ఉదర మనఁగా పరమాత్ముఁడని అర్థము.

27. చెప్పిన విషయమును ముగించుచు సర్వాంతర్యామియైన పరమాత్మను పూజించు ప్రకారమును చెప్పుచున్నాఁడు - అథ=అంతర్యామి రూపములు

పరస్పరము భిన్నములని తెలియుట అనర్థకారి యగుటచేత, సర్వేషు భూతేషు= ఎల్లజీవులందును, కృతాలయం=వసించుచుండెడు శ్రీహరి యొక్క అంతర్యామి రూపములను, భూతాత్మానం=సమస్త జీవులకు నియామకుఁడైన, మాం=నన్నును, అభిన్నేనచక్షుషా=భేదము లేదనెడు జ్ఞానముచేత, దానమానాభ్యాం=ద్రవ్యముల నొసఁగుట, మర్యాద నిచ్చుట - ఈ కార్యముల చేతను, మైత్ర్యా=నా కంటెను, ఇతఁడేనాకు ఉత్తముఁడైన స్నేహితుఁడనెడు భావనచేతను, అర్హయేత్= పూజింప వలెను. అన్నిటి యందు అంతర్యామినే ఎక్కువగా పూజింపవలెనని తాత్పర్యము.

28. శ్రీహరి యొక్క అంతర్యామి రూపములు కొన్నింటిలో హెచ్చుగా నుండును. కొన్నిటిలో తక్కువగా సన్నిధానయుక్తముగా నుండును. జీవులలోని తారతమ్యమునకిదేకారణము. ఈ తారతమ్య జ్ఞానము పురుషార్థమునకు కారణమని చెప్పుచున్నవాఁడై తారతమ్యమును నిరూపించుచున్నాఁడు - సంసారావస్థయందు వ్యత్యాసముగా నున్నను ముక్తావస్థ యందు జీవులు తమ తమ స్వరూపముతో నుందురు. వారి స్వరూపము వృక్షములు పశువులు ఇత్యాది రూపములతో నుండును. ఈ రూపము నపేక్షించి తారతమ్యము చెప్పుచున్నాఁడు - శుభే=మంగకరురాలైన మనుపుత్రీ! హ్యజీవానాం=ముక్తులైన చలనము లేని స్థావర జీవులకంటెను, జీవాఃచలించెడు జంగమ జీవులు, శ్రేష్ఠాఃఉత్తములు. వీరియందు కూడ విశేష ముండునని శ్రేష్ఠపదముతో సూచించుచున్నాఁడు హి=ఈశ్వరుని శక్తికూడ అచింత్య మైనది. తతఃజంగమ జీవుల కంటె, ప్రాణభృతఃఅతిశయముగా ప్రాణవంతులైన జీవులు శ్రేష్ఠులు, తతఃసచిత్తాఃమనోవ్యాపారము కలజీవులు, ప్రవరాఃఉత్తములు, హి=ఇంకను, తతఃఆ మనోయుక్తులకంటె,ఇంద్రియవృత్తయఃకన్ను మొదలైన ఇంద్రియముల వ్యాపారము కల జీవులు, ప్రవరాఃశ్రేష్ఠాఃజీవులు స్వరూపమందే పశు వృక్షాది భేదముతో నుందు రనుటకు ఈ క్రింది ప్రమాణవాక్యము లున్నవి.

"పశువృక్షాది భేదేన జీవా ఏవ స్వతఃస్థితాఃసంసృతౌ వ్యత్యయ స్తేషాం ముక్తౌ తత్తత్స్వరూపతఃతత్ర స్థావరముక్తేభ్యోవరా జంగమ ముక్తకాఃతేభ్యో మానుష ముక్తాశ్చ విప్రాముక్తా స్తతోఽధికాఃతతోపదేశమాత్రేణ ముక్తేభ్యో వేదవాదినఃఅర్హజా ఋషయు స్తేభ్యో దేవతా స్సంశయచ్ఛిదఃపూర్ణధర్మా స్తతస్త్వింద్రో నిస్సంగో గరుడ స్తతఃభక్తిపూర్ణో హరే ర్బ్రహ్మా తస్మాన్నాన్యోఽధిక స్తతఃముక్తా వా సంసృతౌ వాపి సమ్యగేషు హి తే గుణాఃశ.

జీవులు పశువృక్షాది స్వరూపములతో నుందురు. సంసార మందు వారికి వేరు వేరు భౌతిక దేహము లుండవచ్చును. కాని వారు ముక్తియందు తమ తమ స్వరూపములతోనే ఉందురు. ముక్తులైనస్థావరముల కంటె జంగమము లుత్తమములు. జంగమములందు మనుష్యులు శ్రేష్ఠులు వారిలో

బ్రాహ్మణు లుత్తములు. వారి యందును కేవల ముపదేశ మొనర్చి ముక్తులైన వారికంటె వేదాధ్యయన సంపన్నులు శ్రేష్ఠులు. వారికంటెను దాని యర్థము తెలిసిన ఋషిజీవు లుత్తములు. వారికంటె సంశయములు పరిహరించెడు దేవతాజీవు లుత్తములు. వీరందరు కూడ పూర్ణధర్ములని పిలువఁబడుదురు. వీరిలో ఇంద్రపదవి నుండి ముక్తులైన జీవు లుత్తములు. వారికంటెను నిస్సంగులని పించుకొన్న గరుడశేషపదవుల నుండి ముక్తులైన జీవు లుత్తములు. వారికంటె శ్రీహరి యందు పరిపూర్ణ భక్తికల్గి బ్రహ్మపదవినుండి ముక్తులైన జీవు లుత్తములు. వీరి కంటె ఉత్తములైన జీవులు లేరు. ముక్తి యందు కాని సంసారమందు కాని వీరే ఉత్తములు. వీరియందు భక్తి మొదలైన భాగవత గుణములు పూర్ణములుగా నుండును.

29. తత్రాపి=ఇంద్రియ వ్యాపారములు కల్గిన వాని కంటెను, స్పర్శవేదిభ్యః =స్పర్శను తెలిసికొనెడు జీవు లుత్తములు. వాని కంటెను, రసవేదినఃప్రవరాఃమాధుర్యాది రసములను తెలికొనెడి వారు శ్రేష్ఠులు. తేభ్యః గంధవిదఃశ్రేష్ఠాఃవారికంటె గంధము గుర్తింపఁ గల జీవులు శ్రేష్ఠులు. తతఃశబ్ద విదఃపరాఃవాని కంటె శబ్దమును వినెడు జీవు లుత్తములు.

30. శబ్దమును వినెడు జీవులకంటెను, రూపభేదవిదఃరూపభేదములు తెలిసికొనెడు జీవులు (శ్రేష్ఠాఃశ్రేష్ఠులు) తతశ్చవారి కంటెను, ఉభయతోదతఃైనను క్రిందను పండ్లు కల్గిన జీవులు శ్రేష్ఠులు. తేషాంవారియందును, బహుపదాఃఅనేక పాదములుకల జీవులు, శ్రేష్ఠాఃశ్రేష్ఠులు తతఃవారికంటెను, చతుష్పాదాఃనాలుగుపాదములు కల గోవు మొదలైన రూపములకల జీవు లుత్తములు, తతఃవారి కంటెను, ద్విపాత్రెండు పాదములుకల మనుష్య జీవులు (వర్ణహీనులు) శ్రేష్ఠాఃఉత్తములు.

31. తతఃమనుష్య జీవులకంటెను, చత్వారఃవర్ణాశ్చనాలువర్ణములు, శ్రేష్ఠాఃశ్రేష్ఠములు, తేషాంవారిలో, బ్రాహ్మణఃబ్రాహ్మణుఁడు, ఉత్తమఃశ్రేష్ఠుఁడు, బ్రాహ్మణేష్వపిబ్రాహ్మణులలోను, వేదజ్ఞఃవేదము తెలిసినవాఁడు శ్రేష్ఠుఁడు, తతఃఅతనికంటె అర్థజ్ఞఃవేదార్థము తెలిసినవాఁడు, అధికఃశ్రేష్ఠుఁడు.

32. అర్థజ్ఞాత్వేదార్థమును తెలిసికొన్న ఋషిజీవులు కంటెను సంశయచ్ఛేత్తాసంశయములను పరిహరించెడు దేవతాజీవు లుత్తములు తతఃవారికంటెను, స్వకర్మకృత్స్వతంత్రుఁడైన శ్రీహరి ప్రీతి కొఱకే త్రిలోకీ లక్షణరూపమైన ధర్మము ననువర్తించెడు ఇంద్రజీవులు, శ్రేయాన్ఉత్తములు, తతఃఇంద్రజీవులకంటెను, ఆత్మనఃధర్మంనదోగ్ధాశ్రీహరి యొక్క ప్రసాదమును తప్ప వేఱు కర్మ ఫలము నపేక్షింప కుండునట్టియు, అందుచేతనే ముక్తసంగఃనిస్సంగు లనిపించుకొన్న, గరుడ శేష జీవులు, భూయాన్ఉత్తములు. ఈ శ్లోకమందు ప్రతియొక్క చోటను జాత్యేక వచన మని తెలియవలెను.

33. తస్మాత్ఆ గరుడశేష జీవులకంటెను, మయినాయందు, అర్పితాశేష క్రియార్థాత్మరతిఃసమర్పింపఁబడిన సమస్త కార్యములును వాని

ప్రయోజనములును కలట్టియు, శ్రీహరి యందే మనస్సు యొక్క రతిగలినట్టి, నరః=భక్తి యందు స్వల్పమును తక్కువ తనము లేని పూర్ణ భక్తులైన బ్రహ్మజీవులు, భూయాన్=ఉత్తములు. క్రింద చెప్పినట్లు బ్రహ్మజీవుల కంటెను ఉత్తమ జీవు లున్నారా? అను ప్రశ్నకు లేదని చెప్పుచున్నాడు. అకర్తుః= శ్రీహరినే జనకుడుగా పొంది యున్న, సమదర్శనాత్=నిర్దోషబ్రహ్మజ్ఞానియైనట్టి, (2) శాస్త్రములందు సమీచీన జ్ఞానము కల్గిన, మయి=నా యందు, అర్పితాత్మనః =మనస్సునే సమర్పించి యున్నట్టియు, మయి=నా యందు, సంన్యస్త కర్మణః =సమస్త కర్మలను సమర్పించినట్టి, పుంసః=పురుషనామకుడైన బ్రహ్మదేవుని కంటెను, పరం=సముడైన లేక ఉత్తములైన, భూతం=ముక్తావస్థయందైనను, సంసారావస్థ యందైన నున్న జీవులను, న పశ్యామి=చూడలేను. బ్రహ్మయే సర్వోత్కృష్టమైన జీవియని యర్థము.

34. ఈ రీతిగా తారతమ్యమును తెలిసికొన్నవాడు ఏమిచేయవలెనన్నగా చెప్పుచున్నాడు. ఈ శ్లోకమందు జీవకలయా అనుశబ్దమును రెండు సార్లు ఆవృత్తి చేసికొనవలెను. జీవకలయాసహ=జీవకలతో పాటు, ఏతాని=స్థావరములు మొదలుకొని, బ్రహ్మపర్యంతమైన, భూతాని=ముక్తియోగ్యులైన జీవులను, భగవాన్= శ్రీహరి, ఏషు=ఈ జీవులందు, జీవకలయా=తనజీవుడనిపించుకొనెడు అనిరుద్ధుడనెడు అంశతో, ప్రవిష్టః=ఈ జీవులకు ఆశ్రయుడై ప్రవేశించును. ఇతి=అని, తం=ఆ శ్రీహరిని ప్రణమే=భక్తితో నమస్కరింపవలెను. యోగ్యాధికారికి ఈ యుపాసన కూడ శాస్త్రాంతరమందు చెప్పబడినదని తెలియవలెను.

35. మానవి!=ఓ దేవహూతిదేవి! మయా=నాచేత, భక్తి యోగశ్చ=భక్తి యోగము, యోగశ్చ=జ్ఞానయోగము, చకారముచేత ప్రతిమాపూజ మొదలైన కర్మయోగము, ఉదీరితః=చెప్పబడినది, యయోః=ఏ యీజ్ఞాన భక్తి యోగములను, ఏకతరేణైవ=ఒకటైన జ్ఞాన యోగముచేతనే, పురుషః=ఉపాసకుడైన జీవుడు, పురుషం=సర్వార్థప్రదుడైన శ్రీహరిని, ప్రజేత్=పొందును. 'యయోః ' అని చెప్పుటచేత జ్ఞాన భక్తి యోగములే పురుషార్థసాధనములని నిర్ధారించినట్లైనది. వానియందును 'ఏకేన' అనక 'ఏకతరేణ' అనుటచేత ఒకటున్నచోట మఱియొక్కటి ఉండనే యుండునని తాత్పర్యము. ధూమాగ్నుల ఎలె ఒక దానిని విడచి మఱియొక్కటి ఉండదని తెలిపినట్లైనది. ఇట్లు చెప్పుటచేత ఒక దానిచేతనే కార్యసిద్ధియగునపుడు రెండవ దానిని చెప్పవలసిన అవసరములేదు కదా! అను ప్రశ్న కుత్తర మిచ్చినట్లైనది.

36. భక్తియోగమును చెప్పిన తరువాత దేవహూతి ప్రశ్న కనుగుణముగా జీవుని సంసారదుఃఖములను చెప్పవలసి యుండెను. అయినను పెద్దవిషయమైన దానిని వదలి 'సూచీకటాహ' న్యాయముగా స్వల్పమైన కాలస్వరూపమును చెప్పుచున్నాడు. బ్రహ్మణఃగుణ పూర్ణుడైనట్టి, పరమాత్మనఃసర్వాంతర్యామి యైనట్టియు, భగవతఃసమగ్రైశ్వర్యవంతుడైన శ్రీహరి యొక్క, యత్=ఏ, ప్రధానాత్=చిత్తకృతియనిపించుకొన్న లక్ష్మి కంటెను (ప్రకృతికంటెను) పురుషాత్=బ్రహ్మదేవుని కంటెను, పరం=ఉత్తమమైన, దైవం=సర్వదైవోత్తమమైన,

రూపం=రూపము, యత్‌చ=ఏది, కర్మవిచేష్టితం=సమస్త కర్మలకు నిమిత్తమైన విశిష్ట చేష్టకలదియో.

37. యత్‌చ=ఏది, రూపభేదాస్పదం=అనేక రూపభేదములకును, బ్రహ్మాండాది పదార్థభేదములకును ఆశ్రయముగా నున్నదో, దివ్యం=ప్రాకృతము కానిదియో, యతః=దేనిచేత, భిన్నదృశాం=అపూర్ణజ్ఞానులైన, మహదాదీనాం =మహత్తత్త్వాదులకు, అభిమానులైన, భూతానాం=బ్రహ్మాదిచేతనులకు, భయం భవతి=భయ మేర్పడుచున్నదో, తత్=ఆ వస్తువే, కాల ఇత్యభిధీయతే= కాలమని చెప్పబడును.

"భిన్నమల్పంవిజానీయాత్ అభిన్నం పూర్ణమిష్యతే" అనెడు ప్రమాణము చేత అల్పమతులని అర్థము. బ్రహ్మాదులు కూడ శ్రీహరి దృష్టిలో అల్పమతులేకదా!

38. పూర్వాపరముల కళలులేని క్షణము కొందరు కాలమందురు. ఇచ్చట చెప్పనది అదికాదనుచున్నాడు - యః=ఎవ్వడు, భూతానాం=జీవుల యొక్క, అంతః=లోపల, ప్రవిశ్య=ప్రవేశించి, భూతైః=జీవులచేత, భూతాని=జీవులను, అత్తి =సంహరించునో, యశ్చ=ఎవడు అఖిలాశ్రయః=అందరకును ఆధారభూతుడై యుండునో, యశ్చ=ఎవడు కలయతాం=సంహార మొనర్చెడు రుద్రులకు, ప్రభుః=సంహారకుడో, సః విష్ణ్వాఖ్యః=ఆ విష్ణువని చెప్పబడెడు, కాలః=కాలము, ధియా=సాక్షిజ్ఞానముచేత, జ్ఞేయః=తెలిసికొనవలెను. విష్ణువని చెప్పుటచేత యమాదులు కాదని యర్థము.

39. చేతన మగుటచేత చేతనులకు చెప్పిన యర్థములే ఈ కాలనామకుని యందుకూడ ఉండునని చెప్పుచున్నాడు - అస్య=ఈ కాలమనిపించు కొనెడు శ్రీహరికి, కశ్చిత్=ఎవ్వడును, నదయితః=వాని యోగ్యతను మీరి, ప్రీతి పాత్రుడు లేడు, నద్వేషః=వాని యోగ్యతను మీరి ద్వేష్యుడు లేడు. బాంధవః చన=హితకారియైన బంధువును లేడు, అప్రమత్తః=ఎప్పుడును పెచ్చరికగా నుండెడు. అంతకృత్=సర్వసంహార కర్తయైన, అసౌ=ఈకాల మనిపించు కొనెడు విష్ణువు, ప్రమత్తం=ఆయుస్సు ముగియుచున్నదని తెలియక పెచ్చరిక తప్పియున్న, జనం=ప్రాణులకు, ఆవిశతి=సమయమునకు సరిగావచ్చి సంహరించును.

"యథా యోగ్యాతిరేకేణ న ద్వేష్యశ్చ ప్రియో హరేః"

అనెడు ప్రమాణముతో పై చెప్పిన అర్థము సరియగును.

40. తక్కిన వారందరును అతని ఆజ్ఞను బట్టియే కార్యము లొనర్చుటచేత విష్ణువే తప్ప వే రెవ్వరును కాదను అభిప్రాయముతో చెప్పుచున్నాడు - ఎవని భయముచేత గాలి వీచునో, ఎవని భయముచేత సూర్యుడు తాప మొసగునో, ఎవని వెఱపుతో ఇంద్రుడు వాన కురియునో, ఎవని వెఱపుచేత నక్షత్ర సమూహము ప్రకాశించుచున్నదో.

41. యద్భీతాఃఎవని నుండి భయపడి, వనస్పతయఃవృక్షములు, ఓషధిస్సహఓషధులతోపాటు, లతాఃతీగెలు, స్వేస్వేకాలేతమ తమ కాలమందు, పూలను కాయలను అభిగృహ్ణంతి= ధరించుచున్నవో.

42. యతఃభీతాఃఎవని నుండి భయపడి, సరితఃనదులు, స్రవంతిపాఱుచున్నవో, ఉదధిఃసముద్రము, న ఉత్సర్పతిఒడ్డును మీరి ప్రవర్తించుట లేదో ఎవని భయముచేత, అగ్నిఃఅగ్ని, ఇంధేప్రజ్వలించు చున్నదో, సహగిరిఃపర్వతములతోపాటు, భూఃభూమి, జలే న మజ్జతినీటి యందు మునుఁగుటలేదో.

43. అధఃనభఃఆకాశము, యన్నియమాత్ఎవని ఆజ్ఞచేత, శ్వసతాంప్రాణులకు, మార్గంఅవకాశమును, దదాతిఇచ్చుచున్నదో, సప్తభిఃతత్త్వములు మొదలైన వానిచేత, ఆవృతఃఆవరింపఁబడియున్న, మహాన్మహత్తత్త్వమున కభిమానియైన బ్రహ్మదేవుఁడు, లోకస్యజీవులకు, దేహంభౌతిక దేహమును తనుతేసృష్టించుచున్నాఁడో.

44. ఎవని భయముచేత, గుణాభిమానినఃప్రాకృత గుణముల కధీనులై అహంకారాది తత్త్వముల కభిమానులైన రుద్రాదులు, ఏషాం వశేఎవని యధీన మందు, ఏతత్ చరాచరంఈ జంగమ స్థావర రూపమైన ప్రపంచమున్నదో అట్టి, దేవాఃరుద్రాది దేవతలు, అస్యఈ జగత్తుయొక్క, సర్గాదిషుసృష్టిమొదలైన కార్యములందు, అనుయుగంప్రతికల్ప మందును, వర్తంతేవర్తించుచున్నారో.

45. సఃఆకాలఃకాల నామకుఁడైన విష్ణువు, అనంతఃఅంతములేనివాఁడు, అంత కరఃఎల్లరకు అంతమొనర్చువాఁడు, అనాదిఃప్రారంభములేనివాఁడు, ఆదికృత్అందరికినీ సృష్టిని ఇచ్చువాఁడు, అవ్యయఃఏవిధమైన నాశములేక కావలసిన దొసఁగువాఁడు, జనేనతన సన్నిధానయుక్తులైన బ్రహ్మ మొదలగు వారిచేత, జనంప్రాణులను, జనయన్సృష్టించువాఁడై, ఆత్మనఃతనకధీనులైన, మృత్యునారుద్రుఁడు, దుర్గాదేవి మొదలైన వారిచేత ప్రాణులను, మారయన్సంహరింపచేయుచున్నవాఁడై, ఆస్తేఉండును. ఇంతటి మహామహిమో పేతుఁడైన శ్రీహరియందు సమస్త ముముక్షుజీవులును అర్పింపఁబడిన బుద్ధి కలవాఁరగుట ఆవశ్యకము. కాలశబ్దము యొక్క అర్థమునే ఈ విశేషణములతో తెలిపినాఁడు. శ్రీహరి జ్ఞానస్వరూపియగుటచేత భౌతిక పదార్థములవలె అంతము కలవాఁడు కాడు. కాల మనఁగా భేదకమని అర్థము కూడ ఉండుటచేత సర్వులకును అంతము కల్గించువాఁడు. మరణించినది జన్మించియే కావలెను. అందుచేత జన్మనిచ్చువాఁడు. 'కల' ధాతువునకు కామధేనువనెడు అర్థముండుట చేత అవ్యయుఁడనికూడ దాని యర్థమే. యాచకులు వచ్చిరని దాగి కొనఁడన్న మాట.రాజు వలె ఆజ్ఞామాత్రముతో జననమరణములను కల్గించునని యర్థము.

ఇతి శ్రీ మహాభాగవతే, తృతీయ స్కంధే, సుధాలహరి వ్యాఖ్యాయాం ఏకోనవింశోఽధ్యాయఃసమాప్తఃః.

అధ్యాయము - 29

ఎ. ఈ యాత్మ నిజస్వరూపంబునం జేసి వర్తించునని కపిలుండెఱింగించిన విని దేవహూతి వెండియు నిట్లనియె. మహాత్మా! మహదాది భూతంబులకుం బ్రకృతి పురుషులకుం గల్గిన పరస్పర లక్షణంబులను, దదీయ స్వరూపంబు నెఱింగించితివి. ఇంక నీ ప్రకారంబున సాంఖ్యంబునందు నిరూపింపంబడునట్టి ప్రకారంబును, భక్తియోగ మాహాత్మ్యంబును, బురుషుండు భక్తి యోగంబునంజేసి సర్వలోక విరక్తుండగు నట్టి యోగంబును, ప్రాణిలోకంబునకు సంసారం బనేక విధంబై యుండుంగావునం బరాపరుండవై కాలస్వరూపివైన నీ స్వరూపంబును, నేనీవలని భయంబునంజేసి జనులు పుణ్య కర్మంబులు సేయుదు (రవ్విధంబును), మిథ్యాభూతంబైన దేహంబునందు నాత్మాభి మానంబు సేయుచు మూఢుండై కర్మంబులందు నాసక్తంబైన బుద్ధింజేసి విభ్రాంతుం డగుచు సంసార స్వరూపంబగు మహాంధకారంబునందుఁ జిరకాల ప్రసుప్తుండైన జనునిఁ బ్రబోధించు కొఱకు యోగ భాస్కరుండవై యావిర్భవించిన పుణ్యాత్ముండవు గావున నాకు నన్నియుందెలియ సవిస్తరంబుగా నానతిమ్మనిన దేవహూతికిఁ గపిలుం డిట్లనియె. 941

కపిలుండు దేవహూతికి భక్తియోగము తెలియఁ జేయుట

కం. నలినాయతాక్షి! వినుము జన
ముల ఫలసంకల్ప భేదమునఁ జేసి మదిం
గల భక్తి యోగ మహిమం
బలవడఁగ ననేక విధము లనఁదగు నవియున్. 942

వ. వివరించెద. తామస రాజస సాత్త్విక భేదంబులం ద్రివిధంబైయుండు. అందుఁ దామస భక్తి ప్రకారం బెట్టిదనిన. 943

తే. సతత హింసాతి దంభ మాత్సర్య రూప
తమములను జేయచును భేదదర్శి యగుచుఁ
బరఁగ సాయందుఁ గావించు భక్తి దలఁప
దామసం బనఁ దగు వాఁడు తామసుండు. 944

కం. ఘనవిషయ ప్రావీణ్యము
లను సుమహైశ్వర్య యశములకుఁ బూజార్యు
ర్తుని నను నర్చి భజించుట
చను రాజసయోగ మనఁగ సౌజన్యనిధీ! 945

చ. అనుపమ పాపకర్మ పరిహారముకై భజనీయుఁడైన శో
భన చరితుం డితం డనుచు భావమునం దలపోసి భక్తిచే

ననితర యోగ్యతన్ భగవదర్పణ బుద్ధి నొనర్చి కర్మముల్
జనహితకారియై నెగడ సాత్త్విక యోగ మనంగఁ జొప్పడున్. 946

చ. మనుసుత! మద్గుణ శ్రవణ మాత్ర లభించిన యట్టి భక్తిచే
ననఘుఁడ సర్వశోభన గుణాశ్రయుఁడన్ బరమేశ్వరుండనై
తనరిన నన్నుఁ జెందిన యుదాత్త మనోగతు లవ్యయంబులై
వననిధిగామి యైన సురవాహినిఁ బోలి ఫలించు నిమ్ములన్. 947

కం. హేయగుణ రహితుఁ డనఁగల
నాయందలి భక్తి లక్షణముఁ దెలిపితి నన్
బాయక నిర్హేతుకముగ
జేయు మదీయ వ్రతైక చిరతర భక్తిన్. 948

వ. నిష్కాములైన మదీయ భక్తులకు నట్టి భక్తియోగంబు సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యంబులకు సాధనంబు గావున మహాత్ములగువారు తమ మనోరథ ఫలదాయకంబులైనను మదీయ సేవా విరహితంబు లైన యితర కర్మంబుల నాచరింప నొల్లరు. దీని నాత్యంతిక భక్తియోగంబని చెప్పుదురు. సత్త్వ రజస్తమో గుణహీనుండైన జనుండు మత్సమానా కారతం బొందు నని చెప్పి మఱియు నిట్లనియె. 949

సీ. నిత్యనైమిత్తిక నిజ ధర్మమున గురు
శ్రద్ధా గరిష్ఠతఁ జతుర పాంచ
రాత్రోక్త హరి సమారాధన క్రియలను
నిష్కామనంబున నెఱి మదీయ
విగ్రహ దర్శన వినుతి పూజా వంద
న ధ్యాన సంశ్రవణములఁ గర్మ
సంగి గాకుండుట సజ్జన ప్రకరాభి
మానంబు నొందుట హీనులందుఁ

తే. జాల ననుకంప సేయుట సముల యందు
మైత్రి నెఱపుట యను నియమక్రియాది
యైన యోగంబుచేత నాధ్యాత్మికాధి
భౌతికాదులఁ దెలియుట పలుకుటయును. 950

వ. మఱియును. 951

కం. హరిమంగళ గుణకీర్తన
పరుఁడై తగ నార్జనమున భగవత్పరులన్
గర మనురక్తి భజించుట
నిరహంకారమున నుంట నిశ్చలుఁ డగుటన్. 952

క. ఇవి మొదలుగాఁగఁ గలుగు భ
గవదు ద్దేశాభి ధర్మ కలితుండై వీ
ని వలనఁ బరిశుద్ధ గతిం
దవిలిన మదిఁ గలుగుఁ బుణ్య తముఁడెయ్యెడలన్. 953

తే. గురుత రానేక కల్యాణ గుణ విశిష్టుఁ
డనఁగ నొప్పిన ననుఁ బొందు నండఁగొనక
పవన వశమునఁ బువ్వుల పరిమళంబు
ఘ్రాణమున నావరించిన కరణి మెఱసి. 954

చ. అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనం దనర్చు నీ
శు నను నవజ్ఞ సేసి మనుజుం డొగి మత్తతి మార్చనావిడం
బనమున మూఢుఁడై యుచిత భక్తిని నన్ను భజింపఁడేని య
మ్మనుజుఁడు భస్మకుండమున మానక వేల్చిన యట్టివాఁడగున్. 955

సీ. అబ్జాక్షి! నిఖిల భూతాంతరాత్ముఁడ నైన
నాయందు భూత గణంబునందు
నతిభేద దృష్టి మాయావులై సతతంబు
పాయక వైరాను బంధనిరతు
లగువారి మనములఁ దగులదు శాంతి యె
న్నటికైన నేను నాకుటిల జనుల
మానక యెపుడు సామాన్యాధిక ద్రవ్య
సమితిచే మత్పదార్చన మొనర్ప

తే. నర్హి నాచిత్తమున ముదం బందకుందు
ననుచు నెఱిఁగించి మఱియు నిట్లనియెఁ గరుణఁ
గలిత సద్గుణ జటిలుఁడక్కపిలుఁడెలమి
దల్లితోడ గుణవతీమతల్లితోడ. 956

సీ. తరళాక్షి! వినుమచేతన దేహములకంటెఁ
జేతన దేహముల్ శ్రేష్ఠ మందుఁ
బ్రాణవంతంబులై స్పర్శనజ్ఞానంబు
గలుగు చైతన్య వృక్షములకంటె
ఘనరస జ్ఞాన సంకలిత చేతను లుత్త
ములు రసజ్ఞానంబు గలుగు వాని
కంటె గంధ జ్ఞాన కలిత భృంగంబులు
గడు శ్రేష్ఠములు వాని కంటె శబ్ద

తే. వేదు లగుదురు శ్రేష్ఠులు వెలయు శబ్ద
విదుల కంటెను మఱి రూపవేదులైన

వాయసాదులు శ్రేష్ఠముల్ వానికంటె
వరుస బహు పాడి లుత్తముల్ వారికంటె. 957

కం. తలఁపఁ జతుష్పదు లధికులు
బలకొని మఱి వారికంటెఁ బాదద్వయముం
గల మనుజు లలఘుతము లి
మ్ముల వారల యందు వర్ణములు నాల్గరయన్. 958

వ. అందు 959

నీ. తలఁప బ్రాహ్మణు లుత్తములు వారికంటెను
వేద వేత్తలు, వేదవిదుల కంటె
విలసిత వేదార్థ విదులు వారలకంటె
సమధిక శాస్త్ర సంశయము మాన్పు
మిమాంసకులు, మఱి మిమాంసకుల కంటె
నిజ ధర్మ విజ్ఞాన నిపుణు లరయ
వారికంటెను సంగవర్జిత చిత్తులు,
దగ వారికంటె సద్ధర్మ పరులు

తే. ధార్మికుల కంటె నుత్తమోత్తముఁడు వినుము
మత్సమర్పిత సకల కర్మ స్వభావ
మహిమములు గల్గి యితర కర్మములు విడిచి
సమత వర్తించు నే పుణ్యతముఁడు ఘనుఁడు. 960

వ. అట్టివాని 961

కం. కని సకల భూతగణములు
మనమున నానంద జలధిమగ్నము లగుచున్
ఘన బహుమాన పురస్సర
మనయముఁ బాటిల్ల వినుతు లర్థిం జేయన్. 962

వ. అంత నీశ్వరుండు జీవస్వరూపాను ప్రవిష్టుండై యుండు. అట్టి భగవంతుం జూచి భక్తియోగంబున నైన యోగంబున నైనం బురుషుండు పరమాత్మంబొందు. ప్రకృతి పురుషాత్మకంబును దద్వ్యతి రిక్తంబును నైన దైవంబునై కర్మ విచేష్టితం బగుచు నుండు. అదియ భగవద్రూపంబు ఇట్టి భగవద్రూపంబు రూపభేదాస్పదం బగుచు నద్భుత ప్రభావంబు గల కాలం బనియుఁ జెప్పంబడు. అట్టి కాలంబు మహదాది తత్త్వంబులకును, దత్తత్త్వాభిమాను లగు జీవులకును భయావహం బగుటం జేసి సకల భూతంబులకు నాశ్రయం బగుచు, నంతర్గతంబై భూతంబుల చేత భూతంబుల గ్రసింపుచు, యజ్ఞ ఫలప్రదాత గావున వశీకృత భూతుండై ప్రభుత్వంబు భజియించి విష్ణుండు ప్రకాశింపుచుండు. అతనికి మిత్రుండును, శత్రుండును, బంధుండును లేఁడు. అట్టి విష్ణుండు సకల జనంబులయం దావేశించి యప్రమత్తుండై ప్రమత్తులైన

జనంబులకు సంహారకుండై యుండు. అతని వలని భయంబునం జేసి వాయువు వీచు. సూర్యుండు తపియించు. ఇంద్రుండు వర్షించు. నక్షత్ర గణంబు వెలుంగు, చంద్రుండు ప్రకాశించు. తత్తత్కాలంబుల వృక్ష లతాదు లోషధులతోడం గూడి పుష్ప ఫల భరితంబులగు. సరిత్తులు ప్రవహించు. సముద్రంబులు మేరలు దప్పకయుండు. అగ్ని ప్రజ్వలించు. భూమిగిరులతో ఁగూడ బరువునఁ గ్రుంగ వెఱచు. ఆకాశంబు సకల జనంబులకు నవకాశం బిచ్చు. మహత్తత్త్వంబు జగత్తునకు నంకుర స్వరూపంబు గావున సప్తావరణావృతంబగు లోకంబను స్వదేహంబు విస్తరింపంజేయు. గుణాభి మానులగు బ్రహ్మాదులు సర్వేశ్వరుని చేత జగత్సర్గంబునందు నియోగింపంబడి ప్రతిదినంబు నయ్యాయి సర్గంబు చేయ నప్రమత్తులై యుండుదురు. పితాదులు పుత్రోత్పత్తి ఁ జేయుదురు. కాలుండు మృత్యుసహాయుండై మారకుండై యుండు. చరాత్మకంబగు సకల ప్రపంచంబు భగవదధీనం బయి యుండు అని చెప్పి కపిలుండు వెండియు నిట్లనియె. 963

ఇది పోతనామాత్య విరచితంబైన తృతీయస్కంధమున ఇరువది తొమ్మిదవ అధ్యాయము.

941. ఈ యాత్మ నిజ స్వరూపంబునం జేసి వర్తించున్=ఆత్మదాని సహజ స్వరూపముతో నుండును, వెండియున్=మరల, మహదాది భూతముల కున్=మహత్తత్త్వము మొదలైన భూతములకు, ఈ ప్రకారంబునన్=ఈ రీతిగా, సాంఖ్యంబునందున్=సాంఖ్య శాస్త్రమునందు, పురుషుండు=జీవుఁడు, భక్తి యోగంబునంజేసి=భక్తియోగమునాశ్రయించుట చేత, సర్వలోక విరక్తుఁడు= ఇహమునందును, పరమునందును ఉన్న సుఖ భోగములందు ఆశలేని వాఁడు, మిథ్యా భూతము=అసత్యమైనది, ఆత్మాభిమానంబు=దేహమే ఆత్మయని అభిమానించుట, విభ్రాంతుండు=అన్యథా జ్ఞానము కలవాఁడు, మహత్+ అంధకారంబు=గొప్పచీఁకటి, "అజ్+మహతః సమానాధి కరణే" వ్యాకరణమునందు సమానాధి కరణ మనఁగా ఏక విభక్తికత్వము. ఇతర శాస్త్రములందు భిన్నార్థములుగల పదములకు ఏకాన్వయిత్వము సమానాధి కరణము. కనుక సామానాధి కరణ్యముగల సమాసము కర్మధారయము. కర్మధారయ మందని సూత్రార్థము. కర్మధారయ సమాసమందు మహచ్ఛబ్దములోని 'త్' అనుదానికి ఆకారము వచ్చును. మహా అని తరువాత సవర్ణదీర్ఘసంధి. చిరకాల ప్రసుప్తుఁడు= చాలకాలము నిద్ర యందున్న వాఁడు అనఁగా అజ్ఞానములో నున్నవాఁడని యర్థము. ప్రబోధించు కొఱకున్=జ్ఞానావిష్టుని చేయుట కొఱకై, యోగ భాస్కరుండవై=యోగ విద్యను ప్రకాశింపజేయుటకు సూర్యునితో సమానుఁడవై, ఆవిర్భవించిన=జన్మించినట్టి, అన్నియున్=సమస్తతత్త్వ స్వరూపములు, జ్ఞాన భక్తియోగములు, సవిస్తరంబుగాన్=సంశయము లేకుండ, విపులముగా ఆనతిమ్ము=తెలియ పఱచుము.

తాత్పర్యము : జ్ఞానప్రాప్తితో మోక్షము గల్గును. అజ్ఞానము అష్టాంగ యుక్తమైన యోగముచే నేర్పడినను, ఆ యోగముచే నభివృద్ధమైన శ్రీహరి యొక్క ఉపాసనతో జ్ఞానోదయ మగుననియు ఇంతకుముందు చెప్పఁబడినది. ఇప్పుడు భక్తియోగమునందలి తారతమ్యమును వివరించుచున్నాఁడు. ఆ విషయమును ఆరంభించుటకు అనుకూలముగా దేవహూతియే తనకంతకు ముందు చెప్పఁబడుట చేత సామాన్య జ్ఞానమున్నదని మహత్తత్త్వాదుల లక్షణము విశదముగా తెలియుటకై ప్రశ్నించు చున్నది. కపిల మహర్షి!సాంఖ్య శాస్త్రమందు మహదాది భూతముల యొక్క సహజ స్వరూపములు చెప్పఁబడిన వని పెద్దలందురు. అట్లేప్రకృతి పురుషులకు గల భేదమును, వానిలక్షణమును సాంఖ్యశాస్త్రము వివరించునని విజ్ఞుల మాట. ఈ రెంటి నింతకుముందే నీవు సంగ్రహముగా వివరించితివి. వాని విషయము లింకను స్పష్టముగా చెప్పవలెను. భక్తియోగమాహాత్మ్యమును కూడ సాకల్యముగా వివరింపవలెను. భక్తియోగ సాహాయ్యముచేత ఇహపరములందున్న సుఖములను జీవుఁడు అనాసక్తుఁడగునని తెలియుచున్నది. దాని కష్టాంగ యుక్తమైన యోగము కారణమన్నారు. దానిని కూడ స్పష్టపఱుపుము. జీవునకు లభించు సంసారమును అనేక రీతులుగా ఉండును. దాని తెఱఁగులు కూడ వివరింపుము. కాలస్వరూపివి కూడ నీవె అని అందురు. దాని లక్షణమును కూడచెప్పుము నీ నుండి గల్గిన భయముచేత జనులు పుణ్యకార్యము లొనర్తురు. ఆ విధ మేదియో వివరింపుము. స్వామీ! జీవునికి మిథ్యాభూతమైన శరీరమందు అభిమానము సహజము. అనఁగా జడభూతమైన దేహమందు నేనను విభ్యాప్రత్యయము. ఈ రీతిగా దేహమునందు స్వాత్మ బుద్ధినారోపించు కొన్నవాఁడై మానవుఁడు కర్మము లొనర్చును. ఆ కర్మములను నిష్కామముగా గాక ఆసక్త బుద్ధితో నొనర్చును. దానిచేత నేర్పడెడు పుణ్యపాపములు; వాని యనుభవమునకై సంసారము. ఈ రీతిగా జీవుఁడు అభిమాన వశముతో దిగ్భ్రాంతుఁడై సంసారమనెడు గొప్ప చీఁకటియందు చిరకాలముగా బాధపడుచుండును. అట్టి జనునకు యోగమార్గ ముపదేశించి వానిని తరింపఁజేయుటకై అవతార మెత్తితివి. కనుక నీవు యోగభాస్కరుఁడవు. పైని నేనడిగిన యర్థము లన్నియు సవిస్తరముగా నానతిమ్ము. తల్లి యడిగిన ఈ ప్రశ్నకు కపిలుఁడు సమాధాన మిచ్చున్నాఁడు.

942,943. నళిన+ఆయత+అక్షి=పద్మములవలె విశాలములైన కన్నులు కలదానా! సమాసము యొక్క సహజార్థ మిట్లున్నను ఇచట స్త్రీ పర్యాయముగనే ఆ శబ్దము వాడఁబడినది. కావ్య భాషలో నిట్టి ప్రయోగములు సహజములు. సందర్భమును బట్టి వాని సార్థక్యమును ఊహించుకొనవలెను. సందర్భమున కదుకనిచోట స్త్రీపర్యాయముగా మాత్రమే అర్థమును గ్రహింపవలెను. ఫలసంకల్ప భేదమునఁజేసి=ఫలముల యొక్కయు సంకల్పముల యొక్కయు భేదము

ననుసరించి, అలవడఁగన్=అనుసరించఁగా, అనేక విధములు అనఁదగున్=అనేకరీతులుగా ఉండునని చెప్పవలసి యున్నది. తామస సాత్త్విక రాజస భేదంబులన్=తమోగుణము, రజస్సు, సత్త్వగుణము వీనిచేత ప్రేరేపింపఁబడినవి, తామస రాజస సాత్త్వికములు. తామసభక్తి=తమోగుణము చేత ప్రేరేపింపఁబడిన భక్తి,

తాత్పర్యము: దేవహూతి!జనములు సామాన్యముగా మూఁడురీతులు, తమోగుణ మెక్కువగా ఉన్నవారు, రజోగుణ మధికమైన వారు, సత్త్వగుణమెక్కువైన వారు. ఇది సామాన్యమైన వింగడి. మరి దీనిలో అవాంతర భేదము లున్నవి. వానిని గూర్చి ఇచ్చట చెప్పుటలేదు. స్థూలముగా చెప్పుచున్నాను. ఈ మూఁడు గుణములు కలవారు భిన్న భిన్న ప్రకారములతో భక్తి యోగము నుపాసింతురు. ఆ భక్తి నాశ్రయించుటలో వారి సంకల్పము భిన్న భిన్నముగా నుండును. దానికి తగినట్లుగా ఫలముకూడ నేర్పడును. ఈ సంకల్ప ఫలభేదములతో భక్తియోగము నానావిధములై యుండును. స్థూలముగా తామస, రాజస, సాత్త్విక భేదములతో నుండును. అందు తమోగుణము చేత ప్రేరేపింపఁబడినవాని యొక్క భక్తి ప్రకారమును వివరించుచున్నాను. వినుము.

944. సతత=నిరంతరమును, హింసా=ప్రాణిహింసయు, అతిదంభ =ఎక్కువడంబమును, మాత్సర్య=మాత్సర్యమును, రూప=ఈ స్వరూపములైన తమములను=అజ్ఞానముతో కూడిన పనులను, భేదదర్శి యగుచున్=భిన్నదృష్టి కల్గినవాఁడై, నాయందుఁగావించు భక్తి=నా విషయమున నెఱపెడు భక్తి, తామసంబనఁదగున్=తమోగుణము చేత ప్రేరేపింపఁబడినదని చెప్పవలెను. వాఁడు తామసుండు=అట్టివాఁడు తమోగుణ భూయిష్ఠమైన చిత్తవృత్తి గలవాఁడు.

తాత్పర్యము : తామసిక భక్తి స్వరూపమును చెప్పుచున్నాఁడు. దేవహూతి!తమోగుణముచేత ప్రేరేపింపఁబడిన భక్తి కలవాఁడు తామసుఁడు. వీనిసంకల్పములోనే భిన్నత యుండును. దానికి తగినట్లుగానే వానికేర్పడు ఫలము కూడ. వీని భక్తిలో పరహింస ప్రధానమగును. పరహింసయే కాక స్వాత్మహింసకూడ హింస క్రిందికే వచ్చును. అనఁగా పలురీతులతో శరీరమును క్షోభింప చేయును. పరహింస యనఁగా భూతములను హింసించి తదాత్మకమైన భక్తిచేత పరమాత్ముని సంతోషింపఁజేయు వ్యర్థప్రయత్నము. దంభ మనఁగా నిచట నహంకారము. అహంకారముతో మానవుఁడనేక విధములైన అకృత్యము లొనర్చును. వానినే భగవద్భక్తి యనుకొనుట మఱియొక యజ్ఞానము. మాత్సర్య మనఁగా తనకంటె గొప్ప వారియందు కనపఱచెడు ద్వేషము. వారి యతిశయమును గౌరవింపకుండుట లేక గొప్పతనముతో తాను పోటీపడుట. ఇవి యన్నియు కూడ తమోగుణమునకు చెందినవే. వీటి కన్నిటికి మూలము

భేదదర్శనము. తాను వేఱు, వాఁడు వేఱు అనుకొనెడు భావము. సర్వుల యందును అంతర్యామిగా నున్నవాఁడు ఒక్కఁడే అనెడు జ్ఞానమును మఱచి వీఁడు ఇతరుల యందు రాగద్వేషములను పెంపొందించుకొనును. ఇవన్నియు తనభక్తిలో భావములుగా నెంచును.

945. ఘనవిషయ ప్రావీణ్యములను=ఎక్కువగా విషయ సుఖములను అనుభవింపవలె ననెడు ఆశచేతను, సుమహైశ్వర్య యశములకున్=గొప్ప ప్రాభవము, కీర్తి-- వీనికొఱకును, పూజాద్యర్హుని=పూజాదులకు తగినట్టి, ననున్=నన్ను, అర్థిన్=ఆశతో, భజించుట=సేవించుట, సౌజన్యనిధీ=సుజనత్వమున కాధార భూతురాలా! రాజసయోగము అనఁగన్=రజోగుణ పూరితమైన భక్తియని, చనున్=నిర్ణయింప వచ్చును.

తాత్పర్యము : లోకమందు ఎన్నియో విధములైన సుఖము లున్నవి. ఇట్లే పరలోకమందును లెక్కకు రానన్ని భోగములు కలవు. రజోగుణ పూరితుఁడైన మనుష్యునకు వీనియందును వానియందును ఆశజనించుట సహజము. ఆశారాహిత్య మెంతవఱ కనఁగా తృణాది బ్రహ్మ పర్యంతము. బ్రహ్మ పదవి కావలెనని కోరు కొనుటకూడ ఆశయొక్క కక్ష్యలో చేరినదే. భారతము శాంతి పర్వమందు భీష్ముఁడు మోక్షాశకూడ కామనలోదే యనుచున్నాఁడు-కనుక వివిధములైన ఈ విషయ సుఖములను కోరికొని వాని ననుభవించుటకై-వానిని తనకు వశీకరించు కొనుటకై పరమాత్ముని యందు నెఱపు భక్తి రాజసిక మైనది. సుమహైశ్వర్యము-ఇచ్చట ఐశ్వర్యమనఁగా వైభవము. అది అధికార కృతమైనది-యశ మనఁగా కీర్తి. నిరంతరమును పలువుర చేత తాను కీర్తింపఁ బడవలెనను ఆశ. యోగ్యత కలవారి కందరకును కీర్తిరాదు. కీర్తి కలవా రందరును యోగ్యతా పరులు కారు. పుణ్యఫలములను బట్టి కీర్తి లభించుటయు రాకపోవుటయు నేర్పడును. యశస్సు లభించుటకుఁ గావలసిన పుణ్యములు వేఱు. అవి లేనప్పుడు యోగ్యత ఉన్నను కీర్తిరాదు. అందుకే "పుణ్యైర్యశోలభ్యతే" అనిరి. రాజసిక భక్తులు మహత్తరమైన కీర్తిని తామందుటకై పరమాత్మ నుపాసింతురు. ఇట్టి భక్తికి రాజసయోగమని పేరు. వీని దృష్టి ఎప్పుడును పదార్థముల పైన నుండును. అనేక విధములైన పదార్థములను సంపాదించి భగవంతుని తృప్తిపఱచుటకై యత్నించును. ఇవి యన్నియు పరమాత్ముని సంకల్పములో బుద్బుద ప్రాయములని వాఁడెఱఁగఁడు. ఎఱిఁగినను గమనింపఁడు. కృష్ణుఁడు రాయబారమునకు వచ్చినపుడు దుర్యోధనుఁడీ ప్రక్రియనే యవలంబించినాఁడు. అనేక విధములన వైభవములతో వాఁడు కృష్ణుని తనవైపున కాకర్షించుకొనఁజూచినాఁడు. కానీ పరమాత్ముఁడు వాని నన్నిటినీ నిరాకరించి సామాన్యుఁడైన విదురుని ఇంటికే పోయినాఁడు.

946. అనుపమ=సాటిలేని, అనఁగా ఎక్కువైన యన్నమాట. పాపకర్మ= పాపకర్మముల యొక్క, పరిహారముకై=ఉపశాంతి కొఱకై, భజనీయుఁడు=భజింప

తగినవాఁడు. ఐన, శోభన చరితుండు=మంగళములను కలిగించెడు చరిత్ర కలవాఁడు, ఇతండనుచున్=శ్రీహరియని, భావమునన్ తలపోసి=మదియందు విచారించి, అనితర యోగ్యతన్=ఇతరులకు పొందుటకు సాధ్యముకాని యోగ్యతచేత, భగవత్+అర్పణ బుద్ధిన్=భగవంతున కర్పించెడు బుద్ధితో, జనహిత కారియై=సమస్త ప్రాణులకును హితమును కలిగించెడు, జీవితము కలవాఁడై, నెగడన్=ఒప్పగా,సాత్త్విక యోగమనంగన్=సత్త్వగుణము చేత కూడిన భక్తియోగమని, చొప్పడున్=వెలయును. పరిహారముకై అనుచోట నుగాగము రాలేదు. రావలసియుండెను. కాని మహాకవుల ప్రయోగముల నిట్టివి కోకొల్లలు.

తాత్పర్యము: సాత్త్విక భక్తుని లక్షణములను చెప్పుచున్నాఁడు. మానవుఁడు పాపము లొనర్చును. వాని పరిహార మెట్లు తొలఁగును? ప్రాయశ్చిత్తములతో తొలఁగును. తాత్కాలికముగా తొలఁగినను మరల వానినే వాఁడు చేయు చుండుట చేత మరల పాపము సంక్రాంత మగును. అందుచేత ఒక పాత్రను మాటిమాటికి కల్లుపోయుచు కడుగుచు నుండుట వంటివి-వాని ప్రవృత్తులు. వానికి చిత్త శాంతి ఏర్పడదు. సర్వపాపములకును పరిహారము భగవద్గుణాను సంధాన మొక్కటే. అందుచేత సాత్త్వికుఁడైన వాఁడు భగవత్పాదభజనమునకు దొరకొనును. భగవద్గుణములు భజించుకొలఁదియు ఆసక్తిని పెంచునవి. ఈ నిర్ణయము సాత్వికుఁడైన వానికి దృఢముగా నుండును. వాఁడొనర్చు సమస్త కర్మములు భగవ దర్పితముగా ఉండును. పుణ్యపాపములతో వానికి సంబంధములేక సర్వమును కృష్ణార్పణమని వాఁడు వర్తించును. సర్వప్రాణులందున్న అంతర్యామి స్వరూపుఁడొక్కఁడేయను దృఢ నిశ్చయము వాని కుండును. అందుచేత వాఁడు తనతో సమానమైన వానితో మైత్రి నెఱపును తనకంటె నుత్తములైన వారిని గౌరవించును. తక్కువ స్థితిలో నున్న వారికి ఉపకారము లొనర్చి వారి మనస్సునకు శాంతి కల్పించును. ఈ యన్ని కార్యములను వాఁడు సేవాబుద్ధితోనే ఒనర్చును. వీనియందు అహంకారలేశమంటినను వానికార్యము కలుషితమై పోవును.

947.మద్గుణ శ్రవణమాత్రన్=నా యొక్క గుణములను వినుట చేతనే, సర్వశోభన గుణాశ్రయుఁడన్=అందరకును మేలు కలుగఁజేసెడు హేయములు కాని గుణములకు ఆశ్రయుఁడ నైనట్టి, ఉదాత్తమనో గతులు=గొప్పవైనట్టి మనస్సు యొక్క పద్ధతులు, వననిధి గామి=సముద్రమును గూర్చి పోయెడునట్టి, సురవాహినిన్ పోలి=గంగానదివలె,

948.హేయగుణరహితుఁడు=నిందింపఁదగిన గుణములు లేనివాఁడు, నాయందలి భక్తి లక్షణమున్=నన్ను గూర్చి యొనర్చెడునట్టి భక్తి యొక్క స్వభావమును, నన్‌పాయక=నాసంగము ఒక్క నిమిసము నైనను వదలక, మదీయవ్రత+ఏక=నన్ను గూర్చిన వ్రతములనే ముఖ్యముగా గలినట్టి, చిరతర భక్తిన్=చాలకాలము సేవించెడు భక్తిని, నిర్హేతుకముగన్=ఏకారణమును ఆశ్రయించని దానినిగా, చేయున్=చేయును.

తాత్పర్యము: ఓ మనుపుత్రి! సర్వులచేత గౌరవింపఁదగిన వియు, సృష్టికంతకు మంగళముల కల్గించు నాగుణములు వినుట మాత్రము చేతనే ఎవని మనస్సు నాయందు లగ్నమై యుండునో వాఁడు ఉత్తమ భక్తుఁడు. అట్టివాని మనస్సు బహు జన్మోపార్జితమైన సంస్కారముచే ఉత్తమముగా ఉండవలెను. వానికి భక్తితెచ్చి పెట్టుకొన్నది గాక స్వభావసిద్ధమై ఉండును. గంగానదికి సముద్రుని గూర్చి పాఱుట ఎట్లు స్వభావమో అట్లే వాని యొక్క మనస్సు నాయందే ప్రవర్తించుట స్వభావ సిద్ధమై ఉండును. అట్టిదానికే నాయందలి భక్తి యనిపేరు. నాయందలి భక్తిని నెఱపుటకు మన్ముఖోల్లాసము తప్ప వేఱు కారణ మేదియు నుండరాదు. వాని మనస్సు నన్ను వదలి ఇతర విషయములందు క్షణకాలమైనను ప్రవర్తింప రాదు. నన్ను సంతోషింపఁ జేయుటే వాని భక్తికి ప్రధానకారణమై యుండవలెను. ఇట్టి భక్తిని బహుకాలము సాధింపవలెను. అనేక జన్మసంచితమైన సంస్కారబలముతో నిరంతరము నాయందు ధారావాహికముగా ప్రసరించు భక్తియే నన్ను లోఁగొనుది. ఇతరము లన్ని విడంబనా మాత్రములు.

949.నిష్కాములు=ఏ కోర్కెయు లేనివారు, తమ మనోరథ ఫలదాయ కంబులు=తమయొక్క కోర్కెలకు తగినట్లుగా ఫలము నిచ్చునవి. అత్యంతిక భక్తియోగము=తీవ్రమైన భక్తియోగము, మత్సమానాకారతన్=నాతో సమానమైన స్వరూపమున.

తాత్పర్యము: నిష్కామముగా భక్తిని సాధించు వారికి సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యము లనెడు ముక్తి ప్రకారములు సిద్ధింపఁగలవు. కాని నాభక్తులగువారు వీని నేవియు ఆశింపరు. కేవలము మదీయ సేవయందే వారిమనస్సు సదా లగ్నమై యుండును. వారు భక్తియోగము దప్ప ఇతరములైన ఏకర్మలను ఒనర్చుట కంగీకరింపరు. కేవలము నన్నుఁదప్ప భిన్నమైన ఏ దేవతను ఉపాసింపరు. నిరంతరము నాయందే వారు ప్రాణములు పెట్టికొని యుందురు. ఇట్టిదానికే ఆత్యంతిక భక్తి యనిపేరు. ముఁడు గుణములనుండి విడివడిన మనుష్యుఁడు నాతో సమానమైన ఆకారమును పొందును.

950,51,52,53,54,నిత్య నైమిత్తిక నిజధర్మములన్=నిత్యములు, నైమిత్తికములు నైన తన వర్ణాశ్రమములకు తగినట్టి ధర్మముల నాశ్రయించుట చేత, గురుశ్రద్ధాగరిష్ఠతన్=మార్గమును చూపిన గురువునందు శ్రద్ధము గలిగి యుండుట చేతను, చతుర, పాంచరాత్రోక్త=పాంచ రాత్రములనెడు ఆగమము లందు ప్రసిద్ధమైన పద్ధతిలో, హరిసమారాధన క్రియలను=హరిని గూర్చి యొనర్చెడు పూజ మొదలైన వాని చేతను, నిష్కామనంబునన్=ఏకోర్కెను లేకుండుట చేతను, మదీయ=నాయొక్క, విగ్రహ దర్శన=మూర్తులను దర్శించుట, వినుతి=స్తుతించుట, పూజ=పూజించుట, వందన=నమస్కరించుట, ధ్యాన=ధ్యానము, సంశ్రవణములన్=నాకథలను గూర్చి వినుట- వీనిచేత, కర్మ

సంగికాకుండుట=ఫలాకాంక్షతో కర్మముల నొనర్పకుండుట, సజ్జన ప్రకర+అభిమానంబు నొందుట=సత్పురుషుల గుంపునందు అభిమానమును పెంచుకొనుట, నియమక్రియాదియైన యోగంబుచేతన్=అష్టాంగములతో కూడిన యోగముచేత, ఆధ్యాత్మిక ఆధి భౌతికాదులన్=త్రివిధ తాపములను గూర్చి, తెలియుట+పలుకుటయున్=తెలిసి స్పష్టముగా వచించుట చేతను, హరి మంగళ గుణకీర్తన పరుఁడై=హరికి సంబంధించిన మంగళకరములైన గుణములను కీర్తించుట యందు ఆసక్తి గలవాఁడై, అర్జనమునన్, భగవత్పరులన్ =భగవంతుని యందాసక్తి కలవారిని, కరమను రక్తిన్=ఎక్కువ అనురాగముతో , భజించుట=సేవించుట, నిరహంకారమునన్ ఉంట=అహంకార రహితుఁడై మెలఁగుట, నిశ్చలుఁడగుటన్=భక్తి మార్గమున నిశ్చలుఁడైయుండుట, భగవత్-ఉద్దేశ+అభిధర్మ కలితుండై=భగవంతుఁడే ఉద్దేశముగాఁగలిగిన గొప్ప ఉద్దేశములతో కూడిన వాఁడై, వీనివలనన్=ఈ కర్మములచేత, పరిశుద్ధగతిన్ తవిలిన మదిన్=పరిశుద్ధమైన మార్గమందు మెలఁగెడు బుద్ధితో, పుణ్యాత్ముఁడు=సర్వుల కంటె పుణ్యమైనవాఁడు, గురుతర=గొప్పవైన, అనేక=బహుళములైన, కళ్యాణ గుణవిశిష్టుఁడ=కళ్యాణ గుణములతో కూడిన వాఁడు, అండగొనక=ఆలస్యము లేక, పవన వశమునన్=వాయువు యొక్క గతిచేత, పరిమళంబు=సుగంధము, ఘ్రాణమునన్=ముక్కునందు.

తాత్పర్యము: ధర్మములు వర్ణము ననుసరించి మారును. వర్ణమునందును ఆశ్రయము ననుసరించి మారును. ఈ ధర్మములు రెండు రీతులు. నిత్యములు= అనఁగా దినమును తప్పక ఆచరింప వలసినవి. నైమిత్తికములు=నిర్ణీత దినములందు మాత్రమే ఒనర్ప దగినవి. భక్తుఁడైన వాఁడు ఈ నిత్యనైమిత్తిక కర్మలను భగవదుల్లాసమునకై ఒనర్చుచుండవలెను. తనకు త్రోవచూపిన గురువునందు ఏకాగ్రమైన భక్తికలవాఁడు కావలెను. పాంచరాత్రము లనెడు ఆగమములున్నవి. ఇవి హరిప్రోక్తములు. వానియందు శ్రీమహా విష్ణువును పూజింపఁదగిన పద్ధతు లున్నవి. వాని ననుసరించి భక్తుఁడైన వాఁడు పరమేశ్వరుని పూజింపవలెను. నాముఖోల్లాసము దప్పవాని కితరమునం దాకాంక్ష యుండరాదు. భగవంతునకు సంబంధించిన విగ్రహములకు అర్చావతారము లనిపేరు. అవి కొన్ని స్వయముగనే నెలకొన్నవైయుండును. కొన్నిటిని మహర్షులు మొదలైన వారు ప్రతిష్ఠించి యుందురు. ఆ విగ్రహము ఏ రీతితో చేయఁబడినది అని విత్కరించుట మహాపాపమని ఆగమములు చెప్పినవి. శ్రీమన్నారాయణని అంశ శాస్త్ర ప్రకారము ప్రతిష్ఠింపఁబడిన అర్చావతారములందు సన్నిహితమై ఉండును. భక్తుఁడైనవాఁడు అట్టి అర్చావతారములను దర్శింపవలెను. శాస్త్ర విధి విహితముగా పూజింపవలెను. స్తోత్ర మొనర్పవలెను. ధ్యానింపవలెను. భగవంతుని గుణగణములను నిరంతరము శ్రవణ మొనర్పవలెను. ఈ కార్యములందు తప్ప ఇతరములందు.

వాని మనస్సు తగుల్కొన రాదు. ఇవి పుణ్యకార్యములనీ అవి పాపకార్యములని-వాని కే కర్మతోను సంబంధముండ రాదు. భగవత్సేవయే వాని ఏకైక లక్ష్యము. సర్వభూతములందును వాడు వసించుచున్న అంతర్యామి స్వరూపమునే చూచును. సత్పురుషులందు వాడు అభిమానమును కన్పఱచును. తనకంటె హీనులందు దయ కన్పఱచును. అవసరములందు ఉపయోగపడును. సములయందు మైత్రి నెఱపును. అష్టాంగ యోగము ననుసరించి అధ్యాత్మికాది తాపత్రయములను గూర్చి తాను స్పష్టముగా తెలిసికొని ఇతరులకు తెలియఁజేయును. వానికే మాత్రమ అహంకార ముండదు. నిరంతరము భగవంతుని పరిశుద్ధ గుణములను గూర్చి వాడు యోచించును-భక్తియందు వంచన యుండరాదు. వంచనా లేశమున్నను అది భక్తిగానట్లే. భగవంతుని యందే మనస్సు గలవారికి భాగవతు లనిపేరు. నిరంతరమును వీడు భాగవతులతోఁగూడి మెలఁగుచు వారి సేవ యొనర్పవలెను. ఇట్టి కర్మలతో వాని మనస్సు పరిశుద్ధ మగును. శుద్ధమైన సత్త్వ గుణమున కాశ్రయమై యుండును. ఇట్టివాడు పుణ్యతముఁడు. ఆలస్యము లేక భగవత్సాక్షాత్కార మొందును. హాయిగా వీచుచుండెడి గాలి పరిమళమును తనయందు చేర్చికొని మనుజుల ఘ్రాణములను జేర్చును. వీని తీవ్రమైన భక్తి అట్లుభగవంతుని యందు వీనిని లయింపఁజేయును.

955. అనిశమున్=సర్వకాలములందును, సర్వభూత=సమస్తప్రాణుల యొక్క, హృదయాంబుజ=మనః కమలములందు, వర్తి=వసించువాడు, ఈశున్=సమస్తమను నియమించు నట్టివానిని, అవజ్ఞసేసి=అవమానము చేసి, మత్+ప్రతిమా+అర్చనావిడంబ నమునన్=నాకు సంబంధించిన, విగ్రహములను పూజించుట యనెడు వేడుక చేత, ఉచిత భక్తినిన్=తగినట్టి భక్తిచేత, వ్రేల్చిన అట్టివాఁడగున్=హోమము చేసినవారితో సమానము.

తాత్పర్యము : దేవహూతి!నేను సర్వప్రాణుల హృదయములందు వసింతును. సర్వప్రాణులును నాయందుందురు. నేను వాని యందున్నాను. అందుకే నాకు వాసుదేవుఁడని పేరు మూర్ఖుడైన వాడు సర్వ ప్రాణుల నవమానించు మూలమున నన్నే అవమానించు చున్నాఁడు. కాని వాడు భిన్నదృష్టికలవాఁడై నా ప్రతిమ నర్చించును. ఆ అర్చన కేవల విడంబనగానే పరిణమించును. వానిభక్తి ఉచితమార్గమున ప్రవర్తించుట లేదు. అ భక్తిలో ఋజుత్వము సున్న. వాఁడొనర్చు ప్రతిమార్చనము నా కందదు. వాని అర్చన కేవలము భస్మమందు హోమించినట్లు. భస్మమందు హోమించినపుడు ఆ హోమము అగ్ని ముఖమున హోమించినట్లుగా దేవతల కందదు. కానీ మంత్రోచ్చారణ ఫలముండును. అనఁగా అట్టి పూజచేత వాని కల్పాల్ప సంస్కారము మాత్రమే లభించునని తాత్పర్యము.

956. ఉద్భాక్షి=ఓ దేవహూతి! నిఖిలభూత+అంతరాత్మ ఁడ నైన నాయందున్=సమస్త భూతములందును అంతర్యామిగా ఉన్న నాయందును, భూతగణంబు నందున్=ప్రాణి సమూహమునందు, అతిభేద దృష్టిన్=ఎక్కువ భిన్నమైన దృష్టి కలవారై, మాయావులై=కాపట్యముతో కూడిన జీవితము కలవారై, సతతంబు=నిరంతరము, వైర+అనుబంధ నిరతులు=వైరముతోడి సంబంధము కలవారు, శాంతి=శమము, కుటిల జనులు=మోసగాండ్రు, సామాన్య+అధిక ద్రవ్య సమితిచేన్=సామాన్య మైనట్టి, అధికమైన ద్రవ్యముల గుంపుచేత, మత్పదార్చన మొనర్చన్=నాపాదములకు పూజసేయఁగా, ముదంబంద కుందున్=సంతోషమును చెందుకుందును. కలిత సద్గుణ జటిలుఁడు=ఉత్తమములైన గుణములచే కూడుకొన్నట్టి సన్యాస భావముతో నున్న ఆ కపిల మహర్షి, గుణవతీ మతల్లితోడన్=సద్గుణ వతులలో శ్రేష్ఠురాలైన ఆమెచేత,

తాత్పర్యము: దేవహూతి! సమస్త భూతముల హృదయము లందును నే నున్నానని నీకు చాలసార్లు చెప్పిన విషయమే. డాంబికుఁడైన భక్తుఁడు భూతగణముల నవమానించును. ఆ అవమానించుటకు వాని భేదదృష్టియే కారణము. నిరంతరము వాఁడు వేఱు, వీఁడు వేఱు అనియే తలంచును. తిర్యక్కుల యందుఁ గూడ వాఁడు తరతమ భావము లెంచును. స్థావరములందు కూడ నేనున్నానను భావము వానికి మరపు దశలోనుండును. ఈ అనర్థము లన్నింటికి వానిభేద దృష్టియే. కారణము. నేను మాత్రము సమస్త భూతములందును సమానముగానే వర్తించు చుందును. భేదదర్శనముతో వాఁడొనర్చు భూతావమానము వానియందు వసించు నన్నే చెందును. వాఁడు జీవితమందు కూడ మాయావిగా నుండును. అల్పకారణములతో వాఁడు భూతములతో ద్వేషము సాధించును. ఆ ద్వేషభావము వానిని నిరంతరము కాల్చుచునే ఉండును. ఇట్టివానికి శాంతి ఎక్కడి నుండి లభించును? జీవితమును వాఁడిట్లీడ్చుచు నాకరుణకై అర్థించును. వానిది కుటిల భక్తి నా బాహ్యపూజకై వాఁడేవివియో పదార్థములు సంపాదించును. నలుగురు చూచునట్లుగా డంబముతో ఆయా పదార్థములతో నన్ను పూజించును. చూడవచ్చిన వారికి ఆ పదార్థముల గొప్పను తెలిపి ఇవి ఇక్కడి వక్కడివని స్తుతించు చుండును. అనఁగా వీఁడెంత భక్తుఁడని పొరపాటు పడవలెనని భావము. కాని వాని భక్తి ఇతరుల మెప్పునకై ఒనర్చునదని నాకు తెలియును: అ భక్తి యందు కౌటిల్యమే ప్రధానముగా ఉండును. సర్వేశ్వరుఁడనైన నాకును దుర్లభములైన పదార్థములను వాఁడెట్లు సంపాదింపఁగలఁడు? అవియన్నియు నాసృష్టిలోనివి కదా? భక్తుఁడైనవాఁడు తృప్తిగా నొసఁగు పూవుతో నేను సంతోషింతును. మంచినీరు నైవేద్యము పెట్టినను పరమ సంతోషము. అందుచేత వాని భక్తి నా కెప్పుడును దూరముగానే యుండును. పరమ సద్గుణములతో కూడిన కపిలుఁడు సద్గుణములతో కూడిన స్త్రీలలో ఉత్తమురాలైన తల్లితో ఇట్లుగా వచించెను.

957.తరళాక్షి=ఇదిగూడ ఇక్కడ స్త్రీవాచకమే. అచేతన దెహముల కంటెన్=చైతన్యము అత్యంత సూక్ష్మముగా నున్న దేహములకంటె, చేతన దేహముల్ శ్రేష్ఠము=చేతనముల దేహములు శ్రేష్ఠములు, అందున్=వానిలో, ప్రాణవంతంబులై=చైతన్యము కల్గినవై, స్పర్శన జ్ఞానంబు గలుగు=స్పర్శ జ్ఞానమున్నట్టి, చైతన్య వృక్షముల కంటెన్=చైతన్యము కల్గినచెట్ల కంటెను, ఘనరస జ్ఞాన సంకలిత చేతనులు=రసము నెఱిగెడు జ్ఞానముకల చైతన్యవంతులు, ఉత్తములు=శ్రేష్ఠులు, రసజ్ఞానంబు కలుగువాని కంటెన్=రసమును తెలిసెడు జ్ఞానము కలిగిన వానికంటెను. గంధ జ్ఞాన కలిత భృంగంబులు=గంధము నెఱిగెడు జ్ఞానము కలిగిన చేతనములు కడుశ్రేష్ఠములు=మిక్కిలి శ్రేష్ఠమైనవి, వానికంటెన్, శబ్ద వేదులగు అహుల్=శబ్దము నెఱిగెడు జ్ఞానము కలసర్పములు, శబ్దవిదుల కంటెను=శబ్దమును తెలిసెడు జ్ఞానము గలవాని కంటె, రూప వేదులైన వాయసాదులు శ్రేష్ఠముల్=రూపమును తెలిసెడు కాకులు శ్రేష్ఠము, బహుపాదులు=ఎక్కువ పాదములు కలవారు.

తాత్పర్యము : దేవహూతి!శ్రీహరి అంతర్యామి రూపములు ఎచ్చట పెచ్చుగానుండునో అవి శ్రేష్ఠములు. వానికంటె తక్కువగా నున్నవి అవరములు. కనుక చేతనములయందు తరతమ భావము లున్నవి. అచేతనము లైన దేహములకంటెను చైతన్యము కల్గిన దేహములు శ్రేష్ఠములు. అనగా చైతన్యము కల్గిన ప్రాణు లన్నమాట. వానికంటెను అతిశయమైన చైష్ణవంతమైన ప్రాణులు ఉత్తమములు. వానికి స్పర్శజ్ఞాన ముండదు. ఈ కోటిలో చేరినవే వృక్షములు. వృక్షములకు స్పర్శ జ్ఞాన ముండునని అర్థము. వానికంటెను రసమును తెలిసికొనెడు చేతనుడుత్తముడు. వానికంటె గంధ జ్ఞానము కల ప్రాణులు శ్రేష్ఠములు. వానికంటెను శబ్దము నెఱిగెడి జ్ఞానముకల పాములు మొదలైనవి ఉత్తమములు శబ్దవిదులైన సర్పములకంటె రూపజ్ఞానముగల కాకి మొదలైనవి ఉత్తమములు. వానికంటె బహుపాదములుకల జంతువులు శ్రేష్ఠములు.

958.చతుష్పదులు=నాల్గుపాదము లున్నవి. వానికంటెన్, పాద ద్వయము కల మనుజులు=రెండు పాదముల మనుజులు, అలఘుతములు=శ్రేష్ఠులు, వర్ణములు=జాతులు,

తాత్పర్యము : అనేక పాదములు కల జంతువుల కంటెను పాద చతుష్టయము కల్గిన జంతువులు శ్రేష్ఠులు. వానికంటెను రెండు పాదములు కల మానవు లుత్తములు. వారిలో నాల్గు వర్ణములు శ్రేష్ఠములు.

960. వేదవేత్తలు=వేదమును తెలిసినవారు, వేదవిదులు=వేదము లెఱిగినవారు, విలసిత=ప్రకాశించుచున్న, వేదార్థ విదులు=వేదము యొక్క అర్థమును తెలిసినవారు, సమధిక=గొప్పవైన, శాస్త్ర సంశయమున్=శాస్త్రమం దేర్పడిన సందేహమును, మీమాంసకులు=వేదార్థమును తెలిసినవారు, నిజధర్మ

విజ్ఞాన నిపుణులు=తమ ధర్మమునకు సంబంధించిన విజ్ఞానము కలవారు, సంగవర్జిత చిత్తులు=సంగ=ఐహికార్థముల సంబంధముల నుండి, వర్జిత=విడివడిన, చిత్తులు=మనస్సు కలవారు, సద్ధర్మపరులు-సత్+ధర్మపరులు=స్వధర్మము నాచరించువారు, ధార్మికుల కంటెన్=ధర్మము నాచరించు వారి కంటెను, ఉత్తమ+ఉత్తముఁడు=ఉత్తములలో గొప్పవాఁడు, మత్+సమర్పిత=నా యందు సమర్పింపఁబడిన, సకల కర్మ స్వభావ మహిమములు=సమస్త కర్మల యొక్క స్వభావములు, వాని నాచరించుటచే నేర్పడెడు గొప్పతనములు, ఇతర కర్మములు విడిచి భగవంతుని ముఖ్యోద్దేశమునకు పనికిరాని తక్కిన కార్యములు వదలి, సమతన్=అన్నిటి యందు సమాన బుద్ధితో, అప్పుణ్య తముఁడు=ఆ పరమ పుణ్యస్వరూపి యైనవాఁడు, ఘనుఁడు=గొప్పవాఁడు.

తాత్పర్యము : నాల్గువర్ణములలో బ్రాహ్మణుఁడు శ్రేష్ఠుఁడు. వారిలోఁ గూడ వేదాధ్యయన మొనర్చినవా రుత్తములు. వారికంటె వేదముల అర్థమెఱిఁగినవారు గొప్పవారు. వారికంటె వేదార్థములలో కలిగెడు సందేహములను పోఁగొట్టు మీమాంసా శాస్త్రమధ్యయనము చేసినవారు గొప్పవారు. మీమాంసా శాస్త్రము వేదార్థమును, వివరించుట కొఱకే ఏర్పడినది. మీమాంసకుల కన్నను తామాచరింప వలసిన ధర్మమేదని తెలిసికొని దానిని చక్కగా నాచరించు వారు. శ్రేష్ఠులు వారికంటెఁగూడ ఐహికసుఖము లందును, ధనదార పుత్త్రులందును సంగమును వదలి నిష్కాములై ఉండువా రుత్తములు. వారిలోఁగూడ తమధర్మము నాచరించువారు గొప్పవారు. వారికంటె నుత్తమోత్తముఁడు మఱియొక్కఁడున్నాఁడు. తాను ఒనర్చు కర్మలు నాకర్పించువాఁడు. ఆ కర్మానుష్ఠానము చేత కల్గెడు అణిమాది సిద్ధులను కూడ వదలి వాని నన్నిటిని నాకే సమర్పించు వాఁడు అట్టివాఁడు భగవత్ప్రీతిని తప్ప వేఱు దానిని కోరఁడు. భగవత్ప్రీతికి పనికి వచ్చెడు కర్మలనన్నిటిని వాఁడు పేక్షించును. సర్వభూతములందు సమభావముతో వర్తించును. ఇట్టివాఁడు పుణ్యతముఁడు.

962. అనంద జలధి మగ్నము లగుచున్=ఆనంద మనెడు సముద్ర మందు మునిఁగిన, ఘన=గొప్పదైన, బహుమాన పురస్సరము=గౌరవము ముందుగాఁ గలుగునట్లుగా, వినుతులు=స్తోత్రములు, అర్థిన్=ఎక్కువ సంతోషముతో,

తాత్పర్యము : సకల కర్మములను నాప్రీతికై ఒనర్చెడు పరమ భక్తుని చూచి సమస్త భూతములును ఆనంద మనెడు సముద్రమందు మున్కలు వేయునవగును. అట్టి వానిని చూచి ప్రాణు లన్నియు గౌరవించును. సమస్త భూతములును వానిని స్తుతించుట యందే ఆశగలవై యుండును.

963. జీవస్వరూప అను ప్రవిష్టుండై=వాని యొక్క జీవునియందు ప్రవేశించిన వాడై , పరమాత్మన్ పొందున్=హృదయాంత స్థితుడైన భగవంతుని చేరును. ప్రకృతి పురుషాత్మకంబును=ప్రకృతి పురుషుడు రెండును తానే అయ్యి, తద్వ్యతిరిక్తంబు=ఆ రెండిటికంటె వేరైనదియు, కర్మ విచేష్టితంబగుచు నుండున్=కర్మల యొక్క వ్యాపారమ లన్నియు పొగుచుండును. అదియ=అదియే, రూపభేద+ఆస్పదంబు=రూప భేదములతో కూడినది, తత్+తత్త్వాభిమానులు=ఆ తత్త్వములయం దభిమానము కల్గినవారు, భయ+అవహంబు=భయమును కల్గించునది, అంతర్గతంబై=లోపలనున్నవై, భూతంబులచేత=ప్రాణులచేత, భూతంబులన్=ఇతర ప్రాణులను, గ్రసించుచున్=భక్షించుచు, యజ్ఞ ఫల ప్రదాత=సమస్త కార్యములకు ఫలమును కల్గించువాడు, వశీకృత భూతుండై=వశమొనరించు కొన్న సమస్త ప్రాణులు కలవాడై, ప్రభుత్వంబు భజియించి=వానివైన అధికారము కల్గి, బంధుండును= బంధువును, ఆవేశించి=ప్రవేశించిన వాడై, అ ప్రమత్తుండై=నిరంతర జాగరూకుడై, ప్రమత్తులైన జనంబులకున్=తత్త్వమును తెలియక అజ్ఞానులై చరించుచుం డెడి మనుష్యులకు, సంహారకుండై యుండున్=చంపువాడుగా నుండును. భయంబునన్ చేసి=వెఱపువలన, వర్షించున్=వానకురియును, నక్షత్రగణంబు=నక్షత్రముల సమూహము. ఓషధులతో డన్ కూడి=ఓషధులతో చేరినవై, సరిత్తులు=నదులు, ప్రజ్వలించున్=ప్రకాశించును. క్రుంగు=క్రిందికిపోవు, మహత్తత్త్వము=మహత్తనెడు పేరుగల్గిన తత్త్వము, అంకుర స్వరూపంబు= మొలకవంటిది, సప్త+ఆవరణ+ఆవృతంబు=ఏడు కప్పులచేత కూడనట్టి, గుణాభిమానులు=సత్త్వరజ స్తమస్సు లనెడు మూడు గుణములందు అభిమానము కలవారు, జగత్+సర్గంబునందున్=జగత్తు యొక్క సృష్టియందు, నియోగింపంబడి=ఏర్పాటుచేయఁబడిన వారై, ప్రతిదినంబు=క్షణ క్షణము, సర్గంబు=సృష్టిని, కాలుండు=యమధర్మరాజు, చర + అచరాత్మకము =తిరుగునట్టియు, తిరుగ నట్టియు భూతములచేత కూడిన, భగవత్+అధీనంబయి యుండున్ =పరమాత్మునకు లోఁబడినదిగా ఉండును.

తాత్పర్యము: ఈశ్వరుడనువాడు జీవుని యొక్క స్వరూపమందు చేరినవాడై ఉండును. అనఁగా జీవుని యందే ఈశ్వరాంశ ఉన్నదని యర్థము. సాధకుడైన పురుషుడు భక్తియోగముతో కాని అష్టాంగయుతమైన యోగముతో కాని పరమాత్మను సాధించి కొనుటకు శక్తుడగును. ప్రకృతియు పురుషుడు కూడ పరమాత్ముడే. ఈ రెంటికి వ్యతిరిక్తమైన తత్త్వముకూడ అతడే. ఆతనిచేత నియోగింపఁబడియే సమస్త వ్యాపారములు సాగును. ఆ రీతిగా సమస్తమును నియమించునదే భగవద్రూపము. ఇట్టి భగవద్రూపము శీతోష్ణములు

మొదలైన రూపభేదములకును , బ్రహ్మాండాది పదార్థభేదములకు ను ఆశ్రయమై, అద్భుత ప్రభావము కల కాలమని చెప్పఁబడును. ఈ కాలము మహత్తత్త్వాదుల కభిమానులైన బ్రహ్మాది జీవులకు కూడ భయమును కలిగించునదిగా ఉండును. ఇది జీవుల యొక్క లోపల ప్రవేశించి బయటఁగూడ తన ప్రభుత్వమును నెఱపుచుండును. దీనినుండి తప్పించుకొన్న ప్రాణి ఒక్కటియు లేదు. అఖిలాశ్రయమైన కాలము జీవులచేత జీవులను సంహరించు చుండును. సర్వభూతములను తాను జీర్ణ మొనర్చుచుండును. సమస్త యజ్ఞ ఫల ప్రదాతయైన శ్రీమహావిష్ణువు స్వరూపమే కాలము. కాలస్వరూపుఁడైన ఈతని ప్రభావమునకు సమస్తము లోఁబడినదే. ఆతనికి శత్రువు లేఁడు. మిత్రుఁడు లేఁడు. బంధువు సున్న. మానవుఁడు ఐహికా పేక్షతో సత్యమును మఱచిన వాఁడై ప్రమత్తుఁడై ఉండును. కాల స్వరూపుఁడైన శ్రీహరి నిత్యజాగృతుఁడు. ఆతఁడు ప్రమత్తులైన మానవులను అప్రమత్తుఁడై యుండి సంహరించును. అతనివలని భయము వలననే వాయువు వీచుచున్నది. సూర్యుఁడు సమస్త లోకములను తపింప చేయుచున్నాఁడు. సమయము దప్పక ఇంద్రుఁడు వర్షించును. నక్షత్ర గణములు, చంద్రుఁడు ప్రకాశించుటకు కారణ మాతని భయమే. వృక్షములు, ఓషధులు కాలక్రమమును దప్పక పుష్ప ఫలాదు లొసఁగుటకు హేతు వాతని భయమే. ఆతని భయముతో నదులు ప్రవహించును. సముద్రము తనమేరలు తప్పక ఉండును. అగ్నిమండును. భూమి పర్వతాదుల బరువుతో క్రుంగకుండ ఉండును. ప్రాణులు నివసించుట కాకాశ మవకాశ మొసఁగును. సమస్త జగత్తునుండి విశ్వము విస్తరించుచున్నది. సమస్త జగత్సృష్టి కది అంకురము. సప్తావరణముల చేత కూడిన సమస్త బ్రహ్మాండము మహత్తత్త్వము చేతనే విస్తరించును. త్రిగుణాభి మానులైన బ్రహ్మాది దేవతలు ఈశ్వరునిచేత సృష్టియందు వినియోగింపఁబడుచున్నారు. వారు పరమాత్ముని భయముననే సృష్ట్యాదుల నియమము దప్పరు. పితరులు పుత్రోత్పత్తి నొనర్తురు. యమధర్మరాజు మృత్యువు సహాయముతో సంహరించును. చరాచరాత్మక ప్రపంచము భగవంతుని ఆజ్ఞ కధీనమై యున్నది. చేతనములు అచేతనములు భగవంతుని నుండి ఏర్పడెడు వెఱపుచేత తమతమ స్థానములందు నిర్దిష్టమై యున్నవి. తత్త్వాభి మానులైన దేవతలు ప్రకృత్త్వభి మానినియైన లక్ష్మీదేవి అందరు నాతని కధీనులే. అందుచేత జీవుఁడును ఈ తత్త్వమెఱిఁగి కాలవిషయమందు జాగరూకుఁడై పరమాత్మను నిత్యము సంధాన మొనర్చి కొనుచుండవలెను.

ఇది పోతనామాత్య విరచిత ఆంధ్ర భాగవతమున తృతీయస్కంధమున ఇరువదితొమ్మిదవ అధ్యాయము సుధాలహరి వ్యాఖ్య సంపూర్ణము.

త్రింశోఽధ్యాయః

శ్రీకపిల ఉవాచ

శ్లో. తస్యై తస్య జనో నూనం నాయం వేదోరువిక్రమమ్,
కాల్యమానోఽపి బలినా వాయో రివ ఘనావళిః. 1

యం య మర్థ ముపాదత్తే దుఃఖేన సుఖహేతవే,
తం తం ధునోతి భగవాన్ పుమాన్ శోచతి యత్కృతే. 2

యదధ్రువస్య దేహస్య సానుబంధస్య దుర్మతిః,
ధ్రువాణి మన్యతే మోహా ద్గృహక్షేత్రవసూని చ. 3

జంతుర్వై భవ ఏతస్మిన్ యాం యాం యోని మనువ్రజేత్,
తస్యాం తస్యాం న లభతే నిర్వృతిం న విరజ్యతే. 4

నరక స్థోఽపి దేహం వై న పుమాం స్త్యక్తు మిచ్ఛతి,
నారక్యాం నిర్వృతౌ సత్యాం దేవమాయా విమోహితః. 5

ఆత్మజాయా సుతాగార పశుద్రవిణ బంధుషు,
నిరూఢమూల హృదయ మాత్మానం బహుమన్యతే. 6

దందహ్యమాన సర్వాంగ ఏషా ముద్వహనాదినా,
కరో త్యవిరతం మూఢో దురితాని దురాశయః. 7

ఆక్రిప్తాత్మేంద్రియ స్త్రీణా మసతీనాం చ మాయయా,
రహో రచితయాఽఽలాపైః శిశూనాం కలభాషిణామ్. 8

గృహేషు కూటధర్మేషు దుఃఖతంత్రే ష్వతంద్రితః,
కుర్వన్ దుఃఖప్రతీకారం సుఖవ న్మన్యతే గృహీ. 9

అర్థై రాపాదితై ర్యుష్మా హింసయేత స్తతశ్చ తాన్,
పుష్ణాతి యేషాం పోషేణ శపభుగ్యాత్య ధ స్స్వయమ్. 10

వార్తాయాం లుప్యమానాయా మారబ్ధాయాం పునః పునః,
లోభాభిభూతో నిస్సత్త్వః పరార్థే కురుతే స్పృహామ్. 11

కుటుంబ భరణాకల్యో మందభాగ్యో వృథోద్యమః,
క్రియావిహీనః కృపణో ధ్యాయన్ శ్వసితి మూఢధీః. 12

ఏవం స్వభరణాకల్యం తత్కళత్రాదయ స్తథా,
నాద్రియంతే యథా పూర్వం కేనాశా ఇవ గోజరమ్. 13

తత్రాప్యజాత నిర్వేదో బ్రియమాణ స్స్వయం భృతైః,
జరయోపాత్తవైరూప్యో మరణాభిముఖో గృహే. 14

ఆస్తేఽవమత్యో పన్యస్తం గృహపాల ఇవాఽఽహరన్,
ఆమయా వ్యప్రదీప్తాగ్ని రల్పాహారోఽల్పచేష్టితః. 15

వాయునోత్క్రామతో త్తారః కఫ సంరుద్ధనాడికః,
కాసశ్వాపకృతాయాసః కంఠే ఘుర ఘురాయతే. 16

శయానః పరిశోచద్భిః పరివీత స్స్వబంధుభిః,
వాచ్యమానోఽపి న బ్రూతే కాలపాశవశం గతః. 17

ఏవం కుటుంబ భరణ వ్యాపృతాత్మాఽజితేంద్రియః,
మ్రియతే రుదతాం స్వానా మురువేదనయాఽ స్తధీః. 18

యమదూతా తదా ప్రాప్తౌ భీమౌ సరభసేక్షణౌ,
స దృష్ట్వా త్రస్తహృదయః శకృ న్మూత్రం విముంచతి. 19

యాతనాదేహ మావృత్య పాశై ర్బద్ధ్వా గళే బలాత్,
నయతో దీర్ఘ మధ్వానం దండ్యం రాజభటా యథా. 20

తయో ర్ని ర్భిన్న హృదయ స్తర్జనై ర్యాతవేపధుః,
పథి శ్వభి ర్భక్ష్యమాణ ఆర్తోఽఘం స్వ మనుస్మరన్. 21

క్షుత్ట్రి ట్పరీతోఽర్కద ఽవానలానిలై స్సంతప్యమానః పథి తప్తవాలుకే,
కృచ్ఛ్రేణ పృష్ఠే కశయా చ తాడిత శ్చల త్యశక్తోఽపి నిరాశ్రమోదకే. 22

తత్ర తత్ర పతన్ శ్రాంతో మూర్ఛితః పున రుత్థితః,
పథా పాపీయసా నీత స్తమసా యమసాదనమ్. 23

యోజనానాం సహస్రాణి నవతిం నవ చాధ్వనః,
త్రిభి ర్ముహూర్తై ర్యాభ్యాం వా నీతః ప్రాప్నోతి యాతనామ్. 24

ఆదీపనం స్వగాత్రాణాం వేష్టయిత్వోల్ముకాదిభిః,
ఆత్మమాంసాదనం క్వాపి స్వకృత్తం పరతోఽపి వా. 25

జీవత శ్చాంత్రాభ్యుద్ధార శ్శ్వగృధ్రై ర్యమసాదనే,
సర్పవృశ్చిక దంశాద్యై ర్దశద్భి శ్చాత్మవైశసమ్. 26

కృంతనం చావయవశో గజాదిభ్యోఽభిదాపనమ్,
పాతనం గిరిశృంగేభ్యో రోధనం చాంబుగర్తయోః. 27

యస్తామిస్రాంధతామిస్ర రౌరవాద్యాశ్చ యాతనాః,
భుజ్జ్యో నరో వా నారీ వా మిథ స్సంగేన నిర్మితాః, 28

అత్రైవ నరక స్స్వర్గ ఇతి మాతః ప్రచక్షతే,
యా యాతనా వై నారక్య స్తా ఇహాప్యులక్షితాః. 29

ఏవం కుటుంబ భరణ ఉదరంభర ఏవ వా,
విసృజ్యేహాభయం ప్రేత్య భుంక్తే తత్ఫల మీదృశమ్. 30

ఏకః ప్రపద్యతేఽధ్వానం హిత్వేహ స్వకళేబరమ్,
కుశలేతర పాథేయో భూతద్రోహేణ యద్భృతమ్. 31

దైవేనాసాదితం తస్య నిరయే శమలం పుమాన్,
భుఙ్క్తే కుటుంబ పోషస్య హృత్తవిత్త ఇవాఽతురః. 32

కేవలేన హ్యధర్మేణ కుటుంబ భరణోత్సుకః,
యాతి జీవోఽంధతామిస్రం చరమం తమసః పదమ్. 33

అధస్తా న్నరలోకస్య యావతీ ర్యాతనా స్తుతాః,
క్రమశ స్సమనుక్రమ్య పున రత్రావ్రజే చ్ఛుచిః. 34

ఇతి శ్రీమద్భాగవతే తృతీయ స్కంధే త్రింశోధ్యాయః

1. బలినా=బలవంతుఁడైన, కాలేన=కాలముచేత, కాల్యమానః అపి=చలింప చేయుచున్న వాఁడైనను, అయం జనః=ఈ మనుజుఁడు, ఘనావలిః=మేఘ సమూహము, వాయోః ఇవ=వాయువునకు సంబంధించినట్టి, శక్తినివలె, ఏతస్యతస్య=ఈ కాలపురుషుని యొక్క ఉరువిక్రమం=మహాపరాక్రమమును, న వేద నూనం=తెలియలేదు; ఇది నిశ్చయము.

తాత్పర్యము : కాలస్వరూపమును గూర్చియు, తత్ప్రభావమును గూర్చి పూర్వాధ్యాయమున కొంత చెప్పఁబడినది. ఈ రాబోవు మూఁడధ్యాయముల లోను జీవుల కేర్పడెడు బహువిధములైన గతిభేదములను (అవస్థాభేదములను) వివరించుచున్నాఁడు- కాలస్వరూపుఁడు మహాబలవంతుఁడు. ఆతని శక్తినెవ్వరు అరికట్టలేరు. ఆతఁడనేక రీతులుగా ప్రాణివర్గములను చలింప జేయుచున్నాఁడు. ఇంతజరుగుచున్నను ఈ మనుష్యుఁడు కాలపురుషుని మహాప్రభావమును గ్రహింపనేరఁడు. తన్ను బలవంతముగా అక్క డిక్కడికి త్రిప్పు వాయువు శక్తిని మేఘ మూహింపలేదుకదా! అట్లే వివేక శూన్యమైన స్వరూపము కాలగతిని గమనింపకయే యుండును. అనంతమైన విషయాసక్తితో జీవితమును నాశ మొనర్చుకొనుచుండును.

2.పుమాన్=పురుషుఁడు, సుఖహేతవే=తాను సుఖింపవలెననెడు ఆశతో, దుఃఖేన=అతికష్టముతో, యం యం అర్థం=ఏ యే సాధనమును, ఉపాదత్తే=ఆర్జియించు చున్నాఁడో, భగవాన్=కాలస్వరూపుఁడైన పరమ పురుషుఁడు, తంతం=దాని దానిని, ధునోతి=నశింపఁజేయును. యత్కృతే=దేనినిగూర్చి, పుమాన్ శోచతి=పురుషుఁడు దుఃఖము ననుభవించుచున్నాఁడు.

తాత్పర్యము : అడ్డగింపరాని కాలము శక్తిని అనుభవరూపముగా తెలుపుచున్నాఁడు. ఈ లోకమందు సుఖ మనుభవింపవలెనను యత్నముతో పురుషుఁడు అనేక సాధనము లనుభవించుచున్నాఁడు. ధన ధాన్యపుత్ర

కళత్రాదులను సంతోషింపఁజేయుటకు కావలసిన ద్రవ్యమునకై అతి క్లేశము ననుభవించుచున్నాఁడు. కాని కాలపురుషుఁడు ఆయా సాధనములను నశింపఁ జేయును. వీని వెంటనే దార పుత్రాదులను కూడ నశింపఁ జేయును. అప్పుడు మానవుఁడు తన ప్రయత్నములు సాగి రాకపోవుట చేతను, తనవా రనుకున్నవారు తన కనుల యెదుటనే నశించుట చేతను ఎంతో మానసిక వేదనఁ ననుభవించుచున్నాఁడు.

3. దుర్మతిఃవివేకహీనుఁడైన మనుష్యుఁడు, అధ్రువస్య= శాశ్వతము కానట్టిదియు, సానుబంధస్య=అనుబంధముతో కూడినదియునైన, దేహస్య=దేహము నకు సంబంధించినట్టి, గృహక్షేత్రవసూనిచ=గృహములు, క్షేత్రములు, ధనములు మొదలైన వానిని, మోహాత్=అవివేకము నిమిత్తముగా, ధ్రువాణిఃశాశ్వతము లైనవని. మన్యతే=తలఁచుచున్నాఁడు.

తాత్పర్యము: జన్మాంతర కృతమైన పాపకర్మము ఫలముగా సంప్రాప్తమైన విషయ వాసన కారణముగా నిత్యానిత్యవస్తువివేకము లేని బుద్ధితో కూడిన పురుషుఁడు అల్పకాలములోనే నశించెడు స్వభావము కలిగి భార్యాపుత్ర బంధుజనములతో కూడినదియునైన శరీరము సంబంధముగా నున్న ఇండ్లు, పొలములు, తక్కినధనములు. మొదలైన వానిని శాశ్వతములుగా తలఁచుచున్నాఁడు. ఈ దీనికి మోహమే కారణము. మోహపరవశుఁడైన మానవుఁడు ఇవి నశించినపుడు విపరీతమైన మనోవేదన నందు చున్నాఁడు.

4. జంతుఃజీవుఁడు, ఏతస్మిన్ భవేఃఈ సంసారమందు, యాం యాం యోనిం=ఏ ఏ యోనిని, అనువ్రజేత్=కొంచెమైనను విడుమరలేక ప్రాపించు చున్నాఁడో, తస్యాం తస్యాం=ఆయాదాని యందు, సఃఆ జీవుఁడు, నిర్వృతిం= సుఖమును, లభతేఃపొందుచున్నాఁడు.

తాత్పర్యము: తన వస్తువుల యొక్క వినాశము ననుభవించిన తరువాత మరల ఆ వస్తువులను సంపాదించుట కిచ్చించుటయు, దానికై దృఢముగా ప్రయత్నించుటయు జరుగకుండ పోవచ్చునుగదా? అని శంకింపవలదు. మానవుఁడు మరల మరల వానికొఱకే వేటాడు చున్నాఁడని చెప్పుచున్నాఁడు. జీవుఁడీ సంసార చక్రమందు క్రిందుమీదులుగా నిరంతరమును చుట్టుచునే ఉండును. ఒక్కసారి దేవతా జన్మ, మఱి యొక్కసారి మనుష్య జన్మ, ఇంకొక్కసారి మృగజన్మ, వేఱొకసారి పక్ష్యాదుల యోనులందు జన్మించును. ఏయే యోనులందు శరీరమును ధరించునో ఆయాపరమందే వానికి సుఖమగుపించుచుండును. మోహవశముగా తాను సుఖించుచున్నట్లే భావించును. వాఁడాయా శరీరమును పోషించుటకు రక్షించుకొనుటకు నిరంతరమును శ్రమించుచునే ఉండును. శ్రమించుటయే కాని విరమించుట వాఁడెఱుఁగఁడు. దీని కాయా జన్మలందు వానికి లభించు సుఖలేశమే కారణము.

5. నరకస్థః అపి=నరక మందున్న వాడైనను, పుమాన్=పురుషుడు, నారక్యాం=నరక సంబంధమైన జీవిత మందును, నిర్వృతౌ=సుఖమును, సత్యాం= ఏర్పడి యుండగా, దేహం=దేహమును, త్యక్తుం=వదలుటకు, దేవమాయా విమోహితః=దేవమాయచేత విమోహింపచేయబడినవాడై, న ఇచ్ఛతి=కోరడు.

తాత్పర్యము: దేవాది యోనులందు కొంత సుఖాధిక్య ముండును. అందుచేత ఆ జన్మలందుండువాడు విరక్తుడు కావచ్చును కదా! కాని నరకాదులందున్నవాడు విరక్తుడు కావచ్చును కదా! అనుశంకను పరిహరించుటకై చెప్పుచున్నాడు. దేవహూతి! పశుపక్ష్యాదుల జన్మ లుండును. అంతకంటె తక్కువైన క్రిమికీటకాదుల జన్మలుండును. ఈ జన్మలు హీనమైనవి కదా! కాని ఆ యాప్రాణులకు ఆయాయోనులందే ఆవశ్యకమైన సుఖము లభించు చుండును. ఆ యా జీవిలకు తగిన పరిస్థితులలో- ఆయాజీవులకు తగినవిధముగా సుఖాభాసము జరుగుచుండును. అందుచేత అవికూడ శరీరమును వదలుటకు ఇష్టపడుటలేదు. నరకమందు వసించు వారికి కూడ అచటనే ఏదో ఒక సుఖమున్నట్లు భాసించుచుండును. అట్లెందుకగుచున్నది? ఈశ్వరుని మాయా ప్రభావము. ఆ మాయా ప్రభావము చేత ప్రతి ఒక్కడును మోహితుడగు చున్నాడు.

6. ఆత్మా=శరీరము, జాయా=భార్య, సుతః=కుమారుడు, అగారం=గృహము, పశు=వాహనములు, ద్రవిణం=ధనము, బంధుషు=బంధువులు మొదలైన వారి యందు, నిరూఢమూల హృదయః=వేఱూని పాదుకొని యున్న మనస్సుతో కూడినవాడై, ఆత్మానం=తన్నుగూర్చి, బహుమన్యతే=గొప్పగా తలచుకొనువాడగును.

తాత్పర్యము : శాస్త్రాధి కారమున్న మనుష్య జన్మను పొందినవారి యవస్థను తెలుపు చున్నాడు-తన దేహము, భార్య, పుత్రాదులు, భవనము, హర్మ్యాదులు ధనధాన్యాదులు, బంధువులు -- ఈ రీతిగా దేహమునకు సంబంధించిన బంధము లనేకములు ఈ యీ పదార్థము లందు మానవుని యొక్క మనస్సు కాంక్షాశయ్యపై పండుకొని పొరలు చుండును. తాను సుఖించుటకు కావలసిన సాధనము లున్నను తనకేమి తక్కువ? తన జన్మను గూర్చి తానే పొగడుకొనుచుండును. భాగ్యమున తనకొక్క కొఱతయులేదని అభిమానపడి విజృంభించు చుండును.

7. మూఢః=మాయామోహితుడై, దురాశయః=దుర్భరమైన మనస్సుతో కూడినవాడై, ఏషాః వీరియొక్క, ఉద్వహనాదినా=భరణాదిచింతచేత, దందహ్యమాన సర్వాంగః=దహింపబడుచున్న సర్వాంగములతో కూడినవాడై, అవి రతం=ఏ మాత్రము విశ్రాంతి లేక, దురితాని=పాపములను, కరోతి= చేయుచున్నాడు.

తాత్పర్యము : దారిద్ర్యాదులచేత దుఃఖితుడైనచో విరక్తి ఏర్పడుటకు అవకాశమున్నది గదా! అని శంకింపకు. స్వదేహము, స్వభార్య, స్వపుత్రుడు తనబంధువులు వీరిని పోషించుటకై నిరంతరము మానవుడు పలవరించును.

మార్గము దొరకక పోవుటచేత విపరీత మైన మనోవ్యథను అనుభవించు చుండును. ఆ మనోవ్యథతో వాని శరీరము దహింపఁబడు చున్నట్లుండును. కాని విరమింపఁడు, వాఁడేమి చేయును? కామాది వృత్తులతో వాని మనస్సు నిండియున్నది. ఈశ్వరుని మాయాశక్తి వానిని సంపూర్తిగా వశీకరించి యున్నది. అందుచేత వాఁడు దేహము, కుటుంబమును పోషించుకొనుటకై ఒక్కనిమిషము తీరిక లేక దురితము లొనర్చుచుండును. ఇట్టి కార్యముల చేత మరల నీసంసారమందే అధికముగా తగులుకొని దుఃఖముల ననుభవింపవలసి వచ్చునను విషయమును వాఁడు తలపనే తలపఁడు. అదే మాయా విలాసము.

8,9. అసతీనాం=సాధారణముగా కుటిలవర్తనముకల్గిన, స్త్రీణాం=స్త్రీల యొక్క, రహోరచితయా=ఏకాంతమందు కావింపఁబడుచున్న, మాయయా = సంభోగాది స్వరూపమాయ చేతను, కలభాషిణాం=అవ్యక్తముగా భాషించుచున్నట్టి, శిశూనాం=శిశువుల యొక్క, ఆలాపైఃసంభాషణముల చేతను, ఆక్షిప్తాత్మేంద్రియైః =ఆకర్షింపఁబడిన అంతఃకరణము, ఇంద్రియములు వీనిచేత కూడిన వాఁడై, కూటధర్మైఃకపట వృత్తులతో కూడినదియు, దుఃఖతంత్రైఃదుఃఖమే ప్రధానముగా కల్గినదియునైన, గ్రహైఃగృహములందు, అతంద్రితఃసోమరి తనము లేక నిరంతరము పరిశ్రమించు చున్నవాఁడై, దుఃఖప్రతీకారం= సంభవించెడు దుఃఖములకు ప్రతీకారమును, కుర్వన్=అనుష్ఠించుచున్నవాఁడై, గృహీ=గృహస్థు, సుఖవత్ మన్యతే=ఈ క్రియాకలాప మంతయు సుఖముగనే భావించు చుండును.

తాత్పర్యము : అవిశ్రామముగా పాపము లొనర్చినను, ఐహిక సుఖము కూడ వానికి లభింపదని చెప్పుచున్నాఁడు. చాల మందికి భర్తలయందు విశ్వాసముండదు. అనేకుల వృత్తి కుటిల మైనదే. కాని వా రేకాంతములో మనోహరస్మిత రత్యాదిస్వరూపమైన మాయయందు ప్రవేశింపచేయుదురు. అవ్యక్తముగా సంభాషించుచున్న శిశువులతో అంతఃకరణము ఇంద్రియములు వశీకరింపఁబడుచున్నవి. ఆత్మాభిమానము పెచ్చు పెరిగి పోవును. తన్నుపరులు కీర్తింపవలెనను దురాశ. ఆ చాపల్యముతో వాఁడు అనేక కపట ప్రవృత్తుల నవలంబించును. కాని ఈ వ్యాపారములో వానికి తృప్తి లేదు. వానికి సమయమే మిగులదు. ఇంతయైనను సంసారమందు దుఃఖానుభవమే ఉండును. సుఖాభాసము కూడ కరవై పోవును. ఒక్కొక్కసారి ఇంతయైనను వాఁడు విరమింపఁడు. తన కేర్పడెడు దుఃఖములను నివర్తింపఁజేయుటకై అనేక కపటమార్గములు త్రొక్కును. ఈ రీతిగా గృహస్థునకు దక్కునది అభిమాన మొక్కటే. తాను సుఖించు చున్నానని అడుగడుగునవాఁడు భ్రమించు చుండును. సత్యముగా విచారించినచో వానికి సుఖలేశము కూడ లేదు.

10. ఇతఃతతఃఇచ్చటను, అచ్చటను ఎచ్చట చూచినను, గుర్వ్యాగొప్పది యైన, హింసయాపరోపద్రవ ప్రవృత్తిచేత, ఆపాదితైఃసంపాదింపఁబడినట్టి,

అరై ఃధనములచేత, తాన్=తనవారనుకొన్న భార్యాపుత్ర బంధువులను, పుష్ణాతి=పోషించును. యేషాం=పోషణ=ఎవరిని పోషించుటచేత, శేషభుక్=వారు విడచిన ఉచ్ఛిష్టమును భుజించువాఁడై, స్వయం=తనకు తానే, అధఃయాతి=ఇంకను అధోగమనమును చెందుచున్నాఁడు.

తాత్పర్యము : దుఃఖానుభవము ఈ లోకమందు కాదు పరలోకమందు కూడ నింతే యనుచున్నాఁడు. ఎట్లైనను-ఏ ప్రవృత్తితో నైనను ధనము కీర్తి మొదలైనవి సంపాదించియే తీరవలెను. ఇదియే నిరంతర చింత. దీనిచేత వాఁడు శాస్త్రోల్లంఘన మొనర్చును. పరోపద్రవ రూపమైన హింసా ప్రవృత్తి నవలంబించును. ఆ మార్గమున సంపాదింపఁబడిన ధనములతో భార్యాపుత్ర బంధ్వాదులను పోషించును."వీఁడు దానశీలుఁడు. వీఁడుదారుఁడు" ఇత్యాది వాక్యములను వినవలెనను మోహముతో వారందరినీ పోషించును. బ్రహ్మాండముగా వారు అనుభవించిన ఉచ్ఛిష్టమును తా ననుభవించును. ఈ రీతిగా చేయఁబడిన పాపముల ఫలముగా మరణానంతరము నరకాదులు ప్రాప్తించును. ఈ బాధల ననుభవింపవలసినది తానొకఁడే. ఎవరికోసము తానింతవఱకు ఆ కర్మము లనుభవించెనో వారావేదనలో సహభాగులుకారు. వా రెవ్వరును తనకు సహాయ మొనర్పరు. సహాయపడెడి యోగ్యత కూడ లేదు వారికి.

11.పునఃపునఃమాటి మాటికి, ఆరబ్ధాయాం=ఆరంభింపఁబడినట్టి వార్తాయాం=వ్యాపారమందు, లుప్యమానాయాం=ఫలములేనట్టిదైపోఁగా, లోభాభిభూతఃదురాశకుఁ లోబడినవాఁడై, నిస్సత్త్వఃశక్తిలేనివాఁడై, పరార్థే=ఇతరుల యొక్క ధనమందు, స్పృహాం=ఆశను, కురుతే=చేయును.

తాత్పర్యము : యౌవనావస్థ, దాని యందు జరిగెడు వ్యాపార కలాపములు వీనిని వివరించినాఁడు, ఇపుడు వార్ధక్యము, అప్పటి వ్యాపారవైఫల్యము-మొదలగు వానిని వివరించుచున్నాఁడు. ఈ రీతిగా యౌవన కాలమం దారంభించిన వ్యాపారము లన్నియు (ప్రవృత్తులన్నమాట) క్రమక్రమముగా నిష్ఫలము చెందుటయు, శరీరశక్తి క్షీణించుటయు జరుగును. శక్తితగ్గుకొలఁది దురాశ ఎక్కు వగును. అప్పుడు వాఁడితరుల ధనమందు స్పృహ యొనర్చును.

12. కుటుంబ భరణా కల్యఃకుటుంబఃకుటుంబము యొక్క, భరణఃపోషించుట యందు, అకల్యఃఅసమర్థుఁడు, పృథోద్యమఃఒనర్చిన పరిశ్రమ లన్నియు వ్యర్థమైన వాఁడును, మందభాగ్యఃఅదృష్ట హీనుఁడును, శ్రియావిహీనఃధనమును - దానితో పాటు కాంతియును తగ్గినవాఁడై, కృపణఃదీనుఁడై, మూఢధీఃకుటుంబమును పోషింపలేని వాఁడగుటచేత బుద్ధి సరిగా పనిచేయని వాఁడై, ధ్యాయన్=మనస్సునందే వివిధములైన మనోరథముల నూహించు చున్నవాఁడై, శ్వసితి=దీర్ఘముగా నిశ్వసించుచుండును.

తాత్పర్యము : కుటుంబమును పోషించుట బరువైపోవును. శరీరమందు శక్తి క్షీణించును. ఏ ప్రయత్నము ఒనర్చినను ధనము కూడివచ్చుట లేదు. దురదృష్టము వెంటతగులుకొని వచ్చును. ధనము తగ్గుట చేత-శరీరమునందలి శోభ తగ్గును. ముఖమునందు దైన్యమొక్కటే భాసించుచుండును. అయినను వానికి సంసారమందు విరక్తి ఏర్పడుట లేదు. ఎట్లైనను నాకును నాకుటుంబము నకును అభివృద్ధి గలుగు మార్గము ఏర్పడుగాక యని-నిరంతర మా విషయమునే చింతించు చుండును. ఆ చింతతో దీర్ఘదీర్ఘముగా నిశ్వసించు చుండును.

13. ఏవం=ఈ ప్రకారము, స్వభరణాకల్యం=తనరక్షణ మందును కుటుంబ రక్షణమందును శక్తిలేక నలుగుచున్న వానిని, తత్కళత్రాదయః=వాని యొక్క ఆలుబిడ్డలు మొదలైనవారు, కీనాశాః=దుష్ట బుద్ధికలిగిన కర్కశుడు. గోజరం ఇవ=యౌవనము చెదిరి సేద్యమునకు పనికిరాని ఎద్దునువలె, యథాపూర్వం= ఇంతకు మందు అక్కరతో విచారించుచున్నట్లుగా, న ఆద్రియంతే=వాని నాదరించుటలేదు.

తాత్పర్యము : దీర్ఘ నిశ్వాసములతో ప్రొద్దుపుచ్చుచున్న వీడు తన్ను తాను రక్షించుకొనుట యందును అశక్తుడగును. ఇక భారాపుత్రాదులను ఏమి విచారింపగలడు? ధనసంపాదనమునకు మార్గములు తోచుటలేదు. అందుచేత భార్యాపుత్రాదులకు వీని యందు ఆదరము కొఱవడును. ఒక ఎద్దు ముసలి దగును. అది ఇంతకు ముందటి వలె కృష్యాదులకు పనికి వచ్చుటలేదు. దుష్టులైన కర్షకులు దాని నింతకు ముందు ఎంతో అక్కరతో ఆదరించిరి.

ఇపుడా అక్కరతీరినది. అది కృషికి పనికి వచ్చుట లేదు. అందుకే సరిగా నాదరించుటలేదు. వీనిగతిగూడనట్లే.

14,15,16. తత్రాపి=ఆ యవస్థ యందు తానున్నను, అజాతనిర్వేదః =విషయములందు విరక్తి ఏర్పడనట్టివాడై, భృత్యైః=ఇంతకు ముందు తనచేత పోషింపబడిన వారితో, స్వయం బ్రియమాణః=తాను భరింపబడుచున్న వాడై, జరయా=ముసలి తనముతో, ఉపాత్తవైరూప్యః=సంప్రాప్తించిన వికార స్వరూపము కలవాడై, మరణాభిముఖః=మరణమును ఎదురు చూచుచున్నవాడై, అవమత్యా=తన్ను కుటుంబ సభ్యు లవమానించుటచేత, ఉపన్యస్తం=తన సమీపమునకు తేబడి పెట్టబడుచున్న, గృహే=గృహమునందు, గృహపాల ఇవ=ఇంటికి కావలి యున్నకుక్కవలె, ఆహరన్=వారు పెట్టినదానిని తినుచున్న వాడై, ఆమయాభిః=రోగములచేత బాధపడుచున్న వాడును, ఆప్రదీప్తాగ్నిః =వయస్సుచేత జఠరాగ్ని యొక్క బలము తగ్గుటచే జీర్ణించుకొను శక్తిలేని వాడును, అందుచేత, అల్పాహారః=అల్పమైన ఆహారమును గ్రహించు చున్నవాడును, కఫసంరుద్ధ నాడికః-కఫ=కఫముచేత, సంరుద్ధ=చుట్టబడిన,

నాడికః=నాడీమండలము కలవాఁడును, కాసశ్వాస కృతాయాసః- కాస=దగ్గుచేతను, శ్వాస=దీర్ఘములైన ఊర్పులచేతను, కృత=చేయఁబడిన, ఆయాసః=దేహాయాసము గలవాఁడై, ఉత్క్రామతా వాయునా=గడ్డకు ఊర్ధ్వముఖముగా సంచరించుచున్న వాయువుచేత, ఉత్తారః=బయటికి వచ్చుచున్న గ్రుడ్లుకలవాఁడై, కంఠే=కంఠమందు, ఘుర ఘురాయతే=ఘుర ఘురమను శబ్దములచేత కూడినవాఁడై.

తాత్పర్యము : ఆ పరిస్థితియందు కూడ వానికి విషయనివృత్తి ఏర్పడుట లేదు. ఇంతకుముందు తానాకుటుంబము భరించెను. కాని వారి కిప్పుడా కృతజ్ఞత లేదు. వీఁడా స్వయముగా నడువలేడు. వారికి తోఁచిన-తోఁచినంత ఆహారము వీని సమీపమునకే వారు తెచ్చి వేయుదురు. ముసలితనముతో శారీరకమైన వాని సౌందర్యము చెడిపోవును. ఎప్పుడు తనకు మరణ మేర్పడునో అని ఎదురుచూచును. ఇంటివారు తన్ను అవమానింతురు. తన ఎదుటనే అవజ్ఞతతో మాటాడుదురు. అయినను వాఁడింటి కుక్కవలె కావలికాయును. ఇది చాలక పైని క్రమ్ముకొన్న రోగములు. తిన్న యాహారము నరగించుకొను శక్తిలేదు. జఠరాగ్ని మందగించును. ఏ కొద్దిగనో భుజించును. ఆహారము తక్కు వగుట చేత కాళ్ళు సేతులు ముందటివలె పనిచేయవు. శ్వాసము లూర్ధ్వములై పోవుచుండును. ఊర్ధ్వము లగుట చేత కనులలో గ్రుడ్లు బయటికి వచ్చును. నాడుల యందు కఫము పేరుకొనును. దగ్గు, దీర్ఘములైన నిట్టూర్పులు-- వీనితో ఆయాస మెక్కువగును. కంఠము చుట్టు కఫము చొచ్చుకొని ఉండును. అందుచే ఉచ్ఛ్వాసనిశ్వాసముల యందు గురుగురు మని శబ్దము.

17.పరిశోచద్భిఃతమ్ముఁవీడువదలి పెట్టిపోవుచున్నాఁడను చింతచేత దుఃఖించు చున్నట్టి, స్వబంధుభిఃతన యొక్క బంధువులచేత, పరిహీతఃపరివేష్టింపఁబడినవాఁడై,శయానఃశయనించినవాఁడై, వాచ్యమానఃఅపి=వారిచేత పల్కరింపఁబడు చున్న వాఁడై నప్పటికి, కాలపాశ వశంగతఃమృత్యుపాశమున కధీనమైన వాఁడై, న బ్రూతే=వారి మాటలకు బదులివ్వలేఁడు!

తాత్పర్యము : ఈ రీతిగా శయనించి ఉన్నవాని చుట్టును బంధువులు చేరుదురు. వార్ధకమందులేని ప్రేమవానిపై ఏర్పడును. శాశ్వతముగ పోఁబోవ నున్నాఁడు కదా! వారేమోమో పలుకరింతురు. ప్రశ్నలు వేయుదురు. కాని వీఁడు పలికెడు పరిస్థితిలో లేఁడు. కాలము పాశములు వేసి ఈడ్చు చుండును. వాఁడు వెఱ్ఱిగా తన బంధువులవైపు చూచును.

18.ఏవం=ఈ రీతిగా, కుటుంబభరణేకుటుంబమును భరించుట యందు, వ్యాపృతాత్మా=లగ్నమైన మనుస్సుకలవాఁడై, అజితేంద్రియఃజయింపఁబడని ఇంద్రియములు కలవాఁడై, స్వానాంరుదతాం=తనకై బంధువు లేడ్చు చుండఁగా, ఉరువేదనయా=ఎక్కువ వేదనచేత, అస్తధీఃబుద్ధి శక్తినశించినవాఁడై, మ్రియతే=మరణించుచున్నాఁడు.

తాత్పర్యము : యౌవనమందును, వార్ధక్యమందును వాఁడనుభవించిన క్లేశములను వర్ణించిన పిదప మరణ సమయమందున్న దుఃఖమును వివరించు

చున్నాడు. ఈ రీతిగా వాడు భార్యాపుత్రాదులకు వశుడై నిరంతరమును వారిని సంరక్షించుటయే చింతగాకల వాడగును. జీవితమంతయు వ్యర్థ మొనర్చుకొనును. ఇంద్రియములకు వాఁడధీనుడై నిరంతరము భౌతిక లాభములకు ప్రయత్నించు చుండును. కాలమంతయు గడచిపోయినది. మరణ కాలము సమీపించినది. అంతయు చీకటి. బంధువులు చుట్టును చేరి ఏడ్చుచున్నారు. అప్పటికిని వానికి తనకు కటుంబమును గూర్చినచింత. నా యనంతరము వీరెట్లు జీవింతురని వేదన. అది మరణ కాలమం దింకను తీవ్రముగా వేధించును. చుట్టును గూర్చొన్న బంధువులు ఏవేవో ప్రలాపించు చుందురు. కానివాని మార్గము వేరైనది. బుద్ధి పెడ త్రోవపట్టినది. వా రేమనుచున్నది వానికి అర్థమగుటలేదు. బదులు చెప్పుటకు తోచుటలేదు. కడకు మరణించెను.

19. సరభ సేక్షణౌ=క్రోధము చేత నిండిన కన్నులు కలవారును, భీమౌ=భయంకరమైన ఆకృతిగల వారును, యమదూతౌ=యమ కింకరులిరువురు, తదా ప్రాపుఁ=అప్పుడు వచ్చిన వారగు చుండఁగా, దృష్ట్వా=వారిని చూచి, త్రస్త హృదయఃభయపడినటి మనస్సు గల్గినవాడై, శకృన్మూత్రం=మల మూత్రములను, విముంచతి=వీడలును.

తాత్పర్యము : అపుడు యమదూతలు సాక్షాత్కరింతురు. వారిద్దరు వచ్చి సమీపమున నిలుతురు. వారికన్నులు క్రోధముచే నిండి యుండును. అగ్నిని వెళ్ళ గ్రక్కుచున్నట్లవి భయంకరములై ఉండును వారి స్వరూపములు భయము గొల్పునట్లుగా ఉండును. వారిని చూచుట తోడనే దేహ భయముచెంది మలమూత్రములను విసర్జించును. మరణ సమయమందు విచారశక్తి నశించి అజ్ఞానము కలిసి కొనునుకదా! అపుడు వానిని భయము ఎట్లావరించునని శంకింపవలసిన పనిలేదు. స్థూలశరీరమునకు సంబంధించిన స్మృతినశించి పోవచ్చును. కాని అతీవాహిక మని పిలువఁబడెడు సూక్ష్మశరీరమందు అధివసించు చున్నజీవుఁడు యమదూతలను చూచుటయు భయపడుటయు జరుగును. నిద్రయందు స్థూలశరీరభావన లేకున్నను స్వప్నమందు వ్యాఘ్రాది దుష్ట జంతువులను జూచి భయపడుచుండు అనుభవము ప్రతి ఒక్కరికున్నదే కదా! అందుచేత జీవి యమదూతలను చూచి నపుడు భయపడెనని చెప్పుటలో అసంగత మేమియు లేదు.

20.యాతనాదేహే=యాతనా శరీరమందు, ఆవృత్య=నిరోధింప బడినవాడై, పాశైఃబంధనములచేత, గళే=కంఠమందు, బలాత్బద్ధ్వా=బలాత్కారముగ బంధించి, దండ్యం=దండనకు తగిన వానిని, రాజభటాఃయథా=రాజభటుల వలె, దీర్ఘం అధ్వానం=దీర్ఘమైన మార్గమును గూర్చి, నయతఃయమభటులు తీసికొని పోదురు.

తాత్పర్యము : యమభటులు జీవుని యాతనాశరీరమందు బంధింతురు. వారిచేతులందున్న బంధనములతో బలత్కారముగా కంఠమందు బంధింతురు. లోకములో అపరాధిని రాజపురుషులు బంధించి నట్లుగా ఈడ్చుకొని పోదురు. వాడు పోవలసిన దూరము కూడ ఎక్కువగానే ఉండును.

21. తయోఃఆ ఇద్దరి నుండి ఏర్పడెడు, తర్జనైఃభర్త్సనములచేత, నిర్భిన్న హృదయఃభేదింపఁబడుచున్న హృదయముకలవాఁడై, జాతవేపధుఃఏర్పడినట్టి వణకు గలవాఁడై, పథిఃమార్గమందు, శ్వభిఃకుక్కలచేత, భక్ష్యమాణఃతినఁబడుచున్న వాఁడునై, ఆర్తఃదుఃఖించుచున్నవాఁడై, స్వంఅఘం తానొనర్చుకొన్న పాపమును, అనుస్మరన్క్రమముగా జ్ఞాపకమునకు తెచ్చుకొను చున్నవాఁడై.

తాత్పర్యము : యమదూతలు జీవుని తీసికొని పోవునపుడు భయంకరముగా వీనినిగూర్చి మాటాడుచు పోవుదురు. వానిని వినుటతో వీని సర్వాంగములందు వణ కేర్పడును. హృదయము పగిలిపోవునంతపని అగును. మార్గమున పోవునపుడు కుక్కలు వెంటఁబడి పీకు చుండును. ఆవేదన భరింపరాని దగును ఈ సంకటములకు కారణములైన తన పాపములను గాఢముగా తలపోసికొను చుండును.

22. క్షుత్పరీతఃఆకలిదప్పులతో బాధింపఁబడుచున్నను, అర్కదవానలానిలైఃసూర్యుఁడు, అడవి కంటుకొన్న నిప్పు, గాలి, మొదలైన వీనిచేతను, తప్తవాలుకేతపింపఁబడిన ఇసుక స్థలములతో కూడిన, పథిమార్గమందు, సంతప్యమానఃఎక్కువగా బాధింపఁబడుచున్న వాఁడును, కశయాచెలకోలచేత, పృష్ఠేవెనుక భాగమందు, తాడితఃకొట్టఁబడుచున్న వాఁడునై, అశక్తఃఅపి శక్తిలేని వాఁడైనను, కృచ్ఛ్రేణకష్టముతో, నిరాశ్రమోదకేఆశయించుటకు తగిన స్థలమును నీరును లేనట్టి, పథిమార్గమందు, చలతిసంచరించును.

తాత్పర్యము : యమదూతలు తన్నుఁగొనిపోవుచుండెడి మార్గమును వర్ణించు చున్నాఁడు. ఆ మార్గమందు జీవుని ఆకలి దప్పులు విపరీతముగా బాధించు చుండును. దావానలము సూర్యతాపము చాలనందుకుగాను వీనిచేత ఎక్కువ తపింపఁబడిన ఇసుక ప్రదేశము. వానిలో విశ్రమించుటకు చోటు ఉండదు. ఒక్కచుక్క నీరు దొరకదు. నడచుటకు శక్తిలేకుండును. చేతగాక నిలిచి నపుడు యమదూతలు కరుణాహీనులై తన్నుచుందురు. ఇన్ని బాధలతో ప్రయాణము సాగదు.

23. తత్ర తత్రఅచ్చట, పతన్పడుచున్న వాఁడును, శ్రాంతఃఅలసినవాఁడు, మూర్ఛితఃఅలత ఎక్కువై మూర్ఛిల్లువాఁడును, పునఃఉత్థితఃమరల అతికష్టముతో లేచుచున్న వాఁడును, తమసాఃఅంధకారము నిండికొన్న, పాపీయసాఃపాపులకు యోగ్యమైన, పథామార్గమందు, యమసాదనంయముని యొక్క సన్నిధిని , నీతఃపొందింపఁబడును.

తాత్పర్యము : దుఃఖాధిక్యముతో అచ్చటచ్చట పడిపోవుచుండును. శరీరమునం దలత(శరీరమనఁగా సూక్ష్మశరీరము). ఆ అలతతో నేర్పడుమూర్ఛ. మరల మూర్ఛనుండి చాల సేపటికి తేరుకొనును. చుట్టును క్రమ్ముకొన్న అంధకారము. జీవితమందు మహాపాప మొనర్చిన వారు ఈ మార్గము వెంట యమధర్మరాజు సన్నిధానమునకు తీసికొని పోవఁబడుదురు.

24. అధ్వనఃమార్గము యొక్క, యోజనానాం సహస్రాణి నవతింనవ ఏవ చ= తొంభై తొమ్మిదివేల యోజనములు కల, త్రిభిఃవా ద్వాభ్యాం వా

ముహూర్తైఃమూఁడు రెండు ముహూర్తముల సమయములో, నీతఃతీసికొని పోఁబడినేవాఁడై, యాతనాఃకఠినములైన యాతనలను, ప్రాప్నోతిపొందును.

తాత్పర్యము : ఈ రీతిగా రెండు మూఁడు ముహూర్తముల లోపలనే తొంభై తొమ్మిది వేల యోజనముల దూరమును తీసికొని పోవుదురు. అక్కడ ఈ జీవుఁడు యముని యొక్క స్థానమందు నానావిధములైన యాతనముల ననుభవించును. భూలోకము నుండి యమలోకమునకు తొంభై తొమ్మిదివేల యోజనముల దూరము సూచించి నైనది.

25. ఉల్ముకాదిభిఃముండ్ల చెట్లు మొదలైన వానిచేత, వేష్టయిత్వా=చుట్టఁబడినట్టి, స్వగాత్రాణాం=తన శరీర అవయవముల యొక్క, ఆదీపనం=ఎక్కువబాధయో, క్వాపి=అచ్చటచ్చట, స్వకృత్తంవా పరతఃవా ఆత్మమాంసం=తనచేతనో, ఇతరులచేతనో ఖండింపఁబడిన మాంసము యొక్క, ఆదనం=తినుటను.

తాత్పర్యము : నరక లోకమందు అనుభవించెడు కఠినదుఃఖముల యొక్క స్వరూపము సంక్షేపముగా వివరించు చున్నాఁడు. తన శరీరావయవము లను ముండ్ల చెట్లు పూర్తిగా చుట్టుకొని యుండును. తన శరీరమందలి మాంసమును తానే తినెడు పరిస్థితి ఏర్పడును లేక ఇతరులు తిందురు.

26. యమ సాదనే= యమపురమందు, జీవతఃజీవించి యున్నట్టి, శ్వగృధ్రైఃకుక్కలు గ్రద్దలు వీనిచేత, ఆంత్రాభ్యుద్ధారఃనరములను పీకుటయు, దశద్భిఃకఱచుచున్న, సర్పవృశ్చిక దంశాద్యైఃపాములు తేళ్ళు వీనివలన, ఆత్మవైశసం=శరీరక్లేశమును.

తాత్పర్యము: యమలోకమందు జీవుని శరీరమును కుక్కలు పీకును. గ్రద్దలు పొడుచును. సర్పవృశ్చికాదులు కఱచును.

27. అవయవశఃఅంగముల నొక్కటొక్కటిగా, కృంతనం=చీల్చుట, గజాదిభ్యఃఏనులు మొదలైన వానిచేత, భిదాపనం=వేరు చేయుట, గిరిశృంగేభ్యఃపర్వతశిఖరములు నుండి, పాతనం=పడత్రోయుట, అంబుగర్తయోఃజలముల యందు రంధ్రముల యందు, రోధనం=నిల్పియుంచుట.

తాత్పర్యము : శరీరము నందలి అంగములను ఒక్కొక్కటిగా కోతురు. గజాదులతో త్రొక్కింతురు. గిరిశృంగముల నుండి క్రిందికి త్రోయుదురు. నీటిలో పెద్దరంధ్రములలో ముంతురు.

28. తామిస్రాఃఎక్కువ చీకటిలో ఉండినవి. అంధతామిస్రాఃమితిలేని చీకటి గలవి, రౌరవాద్యాఃరౌరవాదులు అయిన, యాఃయాతనాఃయాతనము లను, నరఃవా నారీ వాఃపురుషుఁడు గానీ, స్త్రీగానీ, భుంక్తేఃఅనుభవింతురు. తాఃఆ యాతనలు మిథఃసంగేన=పరస్పర మిళితములై, నిర్మితాఃనిర్మింపఁబడినవి.

తాత్పర్యము : కొన్ని తామిస్రములు, కొన్ని అంధతామిస్రములు రౌరవములు, వీనిని జీవుఁడు పరస్పర మిళితముగా అనుభవించును.

29. మాతః=తల్లి! అత్ర ఏవ=ఇహలోకమందే నరకః స్వర్గః ఇతి=స్వర్గ నరకములనెడు నవి ఉన్నవని, ప్రచక్షతే=కొందరు తలతురు. నారక్యాః=నరకము నందున్న, యాతనాః=యాతనలు, యాః=ఏవి కలవో, తాః=అవి, ఇహాపి=ఈ లోకమందును, ఉపలక్షితాః=కన్పడు చుండును.

తాత్పర్యము : ఓ తల్లీ! ఈ విధమైన నరకలోకములను కష్టావస్థలను అసంభావ్యములను శంకించుటకు వీలులేదు. ఎందుకనగా ఈ లోకమందును నారక్యములైన మహాసంకటావస్థను క్రిమికీటాదు లనుభవించు చున్నవి. ప్రత్యక్షముగనే చూచుచున్నాము.

30. ఏవం=ఈ రీతిగా, కుటుంబం=కుటుంబమును, బిభ్రాణః వా=భరించు చున్న వాడుగనో, ఉదరంభర ఏవవా=తనకడుపును మాత్రమే నింపుకొను వాడుగానో అయిన మనుష్యుడు, ఉభయం=ఈ రెంటినీ, ఇహావిసృజ్య=ఇక్కడనే వదలి, ప్రేత్య=మరణించిన వాడై, తత్ఫలం=తన ప్రవర్తనా ఫలమును, ఈదృశం=ఈ ప్రకారముగా, భుంక్తే=అనుభవించును.

తాత్పర్యము: ఒకడు కుటుంబపోషణమునకై యాతన పడును. మఱి యొక్కడు కుటుంబము లేకున్నను తనపొట్టను నింపుకొనుటకు బాధపడును. వీనికొఱకై ఇరువురు ఎన్నో అక్రమముల నొనర్తురు. వారిరెంటి నిచ్చటనే వదలి మరణించి తమ ప్రవర్తనా ఫలముగా దుఃఖముల ననుభవింతురు.

31. భూత ద్రోహేణ=ఇతరులను హింసించునట్టి ప్రవృత్తిచేత, యత్కృతం=ఏది భరింపఁబడినదో, ఇదం స్వకళేబరం=ఈ శరీరమును, హిత్వా=ఇచ్చటనే వదలి, కుశలేతరపాథేయః=పాపమనెడు అనుభోగ్య వస్తువుతో కూడిన మార్గము కలవాడై, ఏకః=ఒక్కడే, అధ్వానం=నరకమును, ప్రపద్యతే=పొందును.

తాత్పర్యము: ఈ రీతిగా మనుష్యుడు శరీరమును పోషించుకొనుటకై ఎందరికో ద్రోహ మొనర్చును. వాఁడాశరీరము నిచ్చటనే వదలును. పాపములను చలిఁది యన్నపుమూటవలెఁ గట్టుకొనును. ప్రయాణము చేయును.

32.కుటుంబ పోషస్య తస్య=కుటుంబమును భరించిన ఆ జీవునకు, దైవేన=ఈశ్వరునిచేత, ఆసాదితం=ప్రాపింపఁబడినట్టి, శమలం=దుఃఖమును, నిరయే=నరకమందు, హృతవిత్తస్య=అపహరింపఁబడిన ధనము చేతకూడిన, ఆతురః ఇవ=దుఃఖితునివలె, భుంక్తే= అనుభవించును.

తాత్పర్యము: ఈ రీతిగా కుటుంబమునకును తన కొఱకునువాఁడు ఎన్నెన్నియో పను లొనర్చును. వీనికి తగిన పాపఫలము లన్నియు వానికొఱకై కాచుకొని యుండును. వీఁడీశ్వరున కధీనుడు కదా!మరణించిన తరువాత అవి యన్నియు వానిపై కవిసి కొనును. ధనమును పోఁగొట్టుకొన్నవాఁడు క్లేశపడునట్లు వాని ననుభవింపక తప్పదు.

33. కేవలేన అధర్మేణ హి=సంపూర్ణమైన అధర్మముతోనే, కుటుం భరణోత్సుకః=కుటుంబమును పోషించుటకు ఉద్యుక్తుఁడైన, జీవః=జీవుఁడు, తమసః=నరకము యొక్క, చరమం పదం=అవసాన స్థానమును, అంధతామిస్రం= అంధతామిస్రమును, యాతి=పొందును.

తాత్పర్యము : కేవలము అధర్మము ననుసరించియే కుటుంబమును భరించినవాఁడు అత్యుత్సాహముతో నిచ్చట అధర్మమును వరించును. వాఁడు మరణించిన తరువాత అంధతామిస్రమును పొంది తీరును.

34. నరలోకస్య అధస్తాత్=మనుష్యలోకమునకు క్రింద, యావతీః యాతనాదయఃఎన్ని యాతన లున్నవో అన్నిటిని, క్రమశఃక్రమముగా, సమను క్రమ్య=అనుభవించిన పిదప, శుచిఃపాపఫలములను పోఁగొట్టి కొన్న వాఁడై, పునఃమరల, అత్రఈ మనుష్య లోకమును గూర్చి, ఆవ్రజతే=తిరిగి వచ్చును.

తాత్పర్యము : మనుష్య జన్మము సిద్ధించుటకు కావలసిన అర్హతను సంపాదించుకొనువఱకును జీవుఁడు కుక్క, పంది మొదలైన క్షుద్ర శరీరములందు జన్మింప వలసి ఉండును. అయాజన్మలందు దుఃఖమును అనుభవించిన పిదప వానికి మఱల మనుష్యజన్మ ఏర్పడును.

విజయధ్వజ వ్యాఖ్య

1. భక్తికి సాధనమైన వైరాగ్య మేర్పడునట్లు అనేక రీతులుగా ఉన్న కర్మాను గుణములైన దుఃఖములను గూర్చి చెప్పుమని దేవహూతి ప్రశ్నించెను. ఆమె ప్రశ్నకు ఈ అధ్యాయమమందు సమాధాన మిచ్చుచున్నాఁడు-జీవునకు సంసారమూలకారణమైన దేది యని వివరించుచున్నాఁడు-అయంజనఃఈ జీవుఁడు, బలినాఅజేయమైన కాలరూపిచేత, కాల్యమానఃఅపి= ఓడింపఁబడుచున్నను, (మృత్యువు యొక్క సమీపమునకు తఱుమఁబడుచున్నను) ఘనావలిః =తఱుమఁబడుచున్న మేఘముల యొక్క వరుస, వాయోఃఇవ=వాయువు యొక్క పరాక్రమమును తెలియలేనట్లుగా, తస్యసృష్ట స్థితిలయములకు కర్తయైన, ఏతస్యకాలరూపి యొక్క, ఉరువిక్రమం= అతిశయమైన పరాక్రమమును, న వేద=తెలిసికొనలేఁడు. వాయు వనఁగా ఇచ్చట తదభిమానియైన దేవతయని గ్రహించవలెను. లేక తఱుమఁబడుట యందు మాత్రమే ఈ దృష్టాంతమని అర్థమొనర్చికొనవలెను. దీనిచేత శ్రీహరిని గూర్చి జీవునకున్న అజ్ఞానమే సంసారమునకు మూలకారణమని చెప్పినట్లైనది.

2. శ్రీహరి యొక్క అతిశయమైన పరాక్రమమును గూర్చియే చెప్పుచున్నాఁడు-పుమాన్=పురుషుఁడు(అనఁగా జీవుఁడు) సుఖ హేతవే=సుఖము కలుగవలెనను కొని, దుఃఖేన=అతికష్టముతో, యం యం అర్థం=ఏ యే సుఖ సాధనమును, ఉపాదత్తే=సంపాదించునో తం తం=దాని ధ్యానిని, భగవాన్= సమస్తైశ్వర్య సంపన్నుఁడైన శ్రీహరి, ధునోతి=నాశ మొందించుచున్నాఁడు. అపుడు జీవుఁడు యత్కృతేఏ సుఖ సాధనములకై, శోచతి=తప్పిపోయినవేయని దుఃఖించునో.

3,4. జీవునకు ఇదిగూడ ఒకగొప్ప అజ్ఞానమని తెల్పుచున్నాఁడు-యత్=ఏ కారణముచేత, పుమాన్=జీవుఁడు, సానుబంధస్య=ఇంద్రియాదులతో కూడినట్టియు,అధ్రువస్య=అనిత్యమైనదియునైన, దేహస్య=దేవమనుష్యాదులైన ప్రాప్తదేహము యొక్క భోగమునకు సాధనములైన, గృహక్షేత్ర వసునిచఇండ్లు, భూమి, ధనము మొదలైనవానిని, మోహాత్=అజ్ఞానముచేత, ధ్రువాణి

=శాశ్వతములైనవని, మన్యతే=తెలియుచున్నాడో, తత్=ఆ కారణముచేత, సః=ఆ జీవుడు, దుర్మతిః=దుష్టమైనజ్ఞానము కలవాడు, గృహాదులు అనిత్యములని తెలిసి యున్నను వాని నుండి విరక్తుడుకాక యుండునదే వాని యజ్ఞనాతి శయమని తెల్పుచున్నాడు-యః=ఏ జంతుః, జీవుడు, ఏతస్మిన్‌భవే=ఈ సంసార మందు, యాం యాం= ఏ యే యోనిం=జాతికిచెందిన దేహమును, అనుప్రవేశేత్=పొందు చున్నాడో, సః=ఆ జీవుడు, తస్యాంతస్యాం= ఆయాదేహమందు, నిర్వృతిం=సమాధానమును (సుఖమును) లభతే=పొందు చున్నాడు. న విరజ్యతే=విరక్తుడగుటలేదు. వై=ఇది యనుభవసిద్ధమైన విషయము.

5. ఈ విషయమందు కైముత్యన్యాయమును చెప్పుచున్నాడు దేవమాయా విమోహితః=దైవేచ్ఛచేత మోహమును చెందినట్టి, పుమాన్=జీవుడు, నరకస్థః అపి=నరకమందున్నను, నారక్యాం=నరకమునకు సంబంధించినట్టి(దేహమునందు కూడ) నిర్వృతౌ సత్యాం=సమాధాన మేర్పడి యుండగా, దేహం=నరకమునుండి వచ్చిన దేహమును, త్యక్తుం=వదలుటకు, న ఇచ్ఛతి=సమ్మతింపడు. వై=ఇది యనుభవసిద్ధము. దేవమానుష దేహములందు ఉన్నవాడు ఎట్టు వానిని వదలుట కిష్టపడును? 'దైవమాయ' అనుటచేత ఈ విధమైన దేహాభిమాన మేర్పడుటకు భగవదిచ్ఛయే కారణమని చెప్పినట్లైనది.

6. వైరాగ్య మేర్పడని దానికి వాని యందలి రాగము తీవ్రముగా ఉండుటయే కారణ మనుచున్నాడు-ఆత్మ జాయాసుతాగార పశుద్రవిణ బంధుషు-ఆత్మ=తనకు సంబంధించిన, జాయా=భార్య, సుత=పుత్రుడు, అగార=గృహము, పశు=పశువులు, ద్రవిణ=ధనము, బంధుషు=బంధువు లనెడు వీరియందు, నిరూఢమూల హృదయః=నేను నావి యను భావము స్థిరముగా నున్న మనస్సు కలవాడై, ఆత్మానం=తను (అనగా తన దేహమును) బహుమన్యతే=ఎక్కువ అభిమానముతో చూచుకొనుచున్నాడు.

7. నేను నాది యనెడు అభిమానము యొక్క ఫలమును చెప్పుచున్నాడు-ఏషాం=దేహము దానికి సంబంధించిన భార్య మొదలగు వాని యొక్క, ఉద్వహ నాదినా=రక్షణాదులైన కార్యములచేత, దందహ్యమాన సర్వాంగ స్సన్=దహింపబడుచున్న సమస్తములైన అవయవములు కలవాడై, దురాశయః =దురభిమానముచేత నిండిన మనస్సు కలవాడై దానిచేతనే, మూఢః =కింకర్తవ్యతా విమూఢుడైన, పుమాన్=జీవుడు, అవిరతం=నిరంతరమును, దురితాని=పాపములను, కరోతి=ఒనరించు చున్నాడు.

8,9. కొన్ని సమయములందు తన కిష్టమైన ధనముదొరకక పోవుటచేత మనోవ్యథ ఏర్పడును గదా! అపుడు ఈ సంసార మనిత్య మని తెలిసినవాడై దానియందు విరక్తినంద వచ్చును కదా!దానికి సమాధాన మిచ్చుచున్నాడు-అసతీనాం=త్రికరణములకు పొందులేక నిరంతరమును లౌకిక విషయములనే ఆలోచించు చుండెడి, స్త్రీణాం=స్త్రీల యొక్క, మాయయా=మోహక శక్తిచేత, రహోరచిత సల్లాపైః=ఏకాంతమందు ఒనర్చెడు సంభాషణాదులచేతను, శిశూనాం=శిశువుల యొక్క, కలభాషణైః=అవ్యక్త మధురములైన మాటలచేతను, ఆక్షిప్తాత్మేంద్రియస్సన్=వారి యందే ఆసక్తమైన మనస్సును, ఇంద్రియములు

కలవాడై, గృహే=గృహస్థుడు, కూటధర్మేషు=వంచనయే ధర్మముగా గలటి, (2) ధర్మాభాసములు కలిగినట్టి, దుఃఖతంత్రేషు=దుఃఖమునకు సాధనమే లైనట్టి, గృహేషు=గృహములందు, అతంద్రితః=అలసతలేనివాడై, దుఃఖప్రతీకారం=దుఃఖములకు ప్రతీకారమును, కుర్వన్=చేయుచున్నవాడై, ఆ దుఃఖ ప్రతీకారమునే సుఖమని, మన్యతే=తెలియు చున్నాడు. కనుక నిరంతరమును సంసారమును సుఖమనియే భావించుట వలన ఎడు విరక్తుడగుట కవకాశము లేదని చెప్పినట్లైనది.

10. మనుస్మృతియందు వృద్ధులైన తల్లిదండ్రులు, పతివ్రతయైన స్త్రీ, ప్రౌఢవయస్కులుగాని పుత్రులు వీరిని నూరారులైన అకార్యములతో నైనను రక్షించియే తీరవలెను. అప్యకార్యశతం కృత్వా దేహాన్‌ధారాంశ్చ రక్షయేత్" అని మనుస్మృతి. అందుచేత ఎట్లైనను కుటుంబరక్షణ విహితమైన ధర్మమేకదా! విరక్తుడై కుటుంబమును రక్షింపకుండుట దోషములలోనే చేరుచున్నది. వైరాగ్యము లేకుండుట భూషణమేకదా! అని ఆశంకించి శాస్త్ర విహితములు కాని హింసాదు లొనర్చుట కవకాశమిచ్చుట చేత సంసారము మహాపాషమని దానినుండి సిద్ధించున దధఃపతనమే యని చెప్పుచున్నాడు. చ=ఇంకను, ఇతస్తతఃఅచటిచ్చట, గుర్వ్యాఃఅతిశయమైనట్టి, హింసయా=పరహింసచేత, ఆపాదితైఃసంపాదింపఁబడినట్టి, అర్థైఃద్రవ్యములతో, తాన్=కుటుంబమునకు చేరిన వానిని, పుష్ణతి=పోషించుచున్నాడు. యేషాం=కుటుంబమునకు సంబంధించి ఈ జనుల యొక్క, పోషణ=ధర్మశాస్త్రము యొక్క మాటను విపరీతముగా అర్థ మొనర్చికొని హింసాపూర్వకముగా ధనమును సంపాదించి రక్షించుచుండుట చేత, శేషభుక్=కుటుంబము వారు తినగా మిగిలినదానిని తిని తృప్తిపడుచున్న ఈ జీవుడు , స్వయం=తాను, అధఃనరకలోకమునకు, యాతి=పోవుచున్నాడు.

"వృద్ధౌచ మాతా పితరౌ సాధ్వీ భార్యా సుత శ్శిశుః,
అప్యకార్యశతం కృత్వా భర్తవ్యా మను రబ్రవీత్.

అనెడు మనుస్మృతి వాక్యమందు అకార్యశత మనగా బ్రాహ్మణాదులసేవ మొదలైన నూరారు తన వ్యక్తిత్వమునకు తగినవని అర్థము. మహావిపత్తు కలినపుడు సేవాది కార్యము లొనర్చ వచ్చునని స్మృతి చెప్పుటచేత వాని నొనర్చినకూడ దోషము లేదని భావము. హింసాదులతో జీవించుటతో పాప్తియగుటయు, నరకపతనము తప్పదు.

11. ఎక్కువ వానలు లేక అనావృష్టి, రోగములు, పశుసంపద పనికిరాని దగుట లేక క్షీణించుట ఈ మొదలైన కారణములచేత జీవనము దుస్సాధ్య మైనప్పుడు తస్కరవృత్తి యైనను అవలంబింప వచ్చునని స్మృతియే చెప్పు చున్నది. దానినే నిందించుచున్నాడు-పునఃపునఃమరల మరల, ఆరబ్ధాయాం=అప్పుమొదలైన మార్గముల ద్వారా తెచ్చినట్టి, వార్తాయాం=వ్యవసాయము, పశుపాలన, వ్యాపారము మొదలైన జీవనోపాయములు, లుప్యమానాయాం=నాశమును చెందిన వగుచుండగా, లోభాభిభూతఃఇతరుల ధనమును తీసికొన వలెనని దురాశచేత తిరస్కరణీయమైన స్వభావము కలవాడై, దానిచేతనే,

నిస్సత్త్వుఁ=సత్త్వగుణరహితుఁడై (2) బలహీనుఁడై, పరారే=దొంగతనముతో ఇతరుల పదార్థములను అపహరించుటకు, స్పృహం=ఆశను, కురుతే=చేయు చున్నాఁడు.

12. ఇంకను వయస్సు చెల్లఁగా ఇతరుల పదార్థములను దొంగిలించుటకు కూడ శక్తి లేనివాఁడై కుటుంబ రక్షణమందు సర్వదా శక్తిలేని వాఁడగును. అట్టి అసమర్థుని కడపటి అవస్థను చెప్పుచున్నాఁడు-మందభాగ్యుఁ=అదృష్టహీనుఁడైనట్టి దానిచేతనే, కుటుంబ భరణాకల్పుఁ=కుటుంబ రక్షణయంద సమర్థుఁడైన, కృపణుఁ=దైన్యమును పొందిన మనుష్యుఁడు, శ్రియా=సంపద నుండి (2)దేహకాంతి నుండి, విహీనుఁ స్సన్=రహితుఁడై, మూఢధీఁ=ఏమి చేయవలెనని విషయము తెలియని వాఁడై, ధ్యాయన్=తానింతకుముందొనర్చిన కార్యములను ధ్యానించుచు, శ్వసితి=నిట్టూర్పును వదలుచున్నాఁడు.

13. ఏవం=ఈ రీతిగా, స్వభరణా కల్పం=తమ్ము రక్షించుటకసమర్థులైన జీవుని, తత్కలత్రాదయుఁ=వాని భార్యమొదలైన వారు, తదా=అప్పుడు, కీనాశుఁ =కర్కశుఁడు, గోజరంఇవ=దున్నుటకసమర్థమైన ముదిసిన ఎద్దున నాదరముతో చూచునట్లు, యథాపూర్వం=అంతకు ముందు వలె, నాద్రియంతే=ఆదరించుట లేదు.

14.తన భార్యాపుత్రాదుల అనాదరమును చూచి వైరాగ్యయుక్తుఁడై మోక్షము కొఱకై ప్రయత్నింపవచ్చు కదా!దానికి కూడ నవకాశములేదను చున్నాఁడు-తత్రాపి=అట్టి అనాదరావస్థయందుకూడ, అజాతనిర్వేదుఁ=వైరాగ్యముతో తానుగడపిన స్థితికి పశ్చాత్తాప మొందనివాఁడై, స్వయంభృత్తైఁ=తానేకూడిన భార్యాపుత్రులచేత, భ్రియమాణుఁ=దేహరక్షణము నొందిన వాఁడై, జరయా=ముసలి తనముచేత, ఉపాత్త వైరూప్యుఁ=దేహసౌందర్యము తొలఁగి వికార స్వరూపము గలవాఁడై, మరణాభిముఖుఁ=చావును ప్రతీక్షించువాఁడై, గృహే=ఇంటి యందు, అపత్యాద్యైఁ=పుత్రులు మొదలగు వారిచేత, అవమత్యా=తిరస్కారపూర్వకముగా, దత్తం=ఈవ్వఁబడిన ఆహారమునే, ఆహరన్=తినుచున్నవాఁడై, గృహపాల ఇవ=కుక్కవలె, ఆస్తే=ఉండు చున్నాఁడు.

15,16,17. మరణ కాలము సమీపించినను వైరాగ్యమేర్పడదనుచున్నాఁడు-ఆమయేన=రోగాదులచేత, అప్రదీప్తాగ్నిఁ=జీర్ణశక్తి లేనివాఁడై, అల్పాహారుఁ =అత్యల్పమైన అహారమునే గ్రహించు చున్న వాఁడై, అల్పచేష్టితుఁ=అల్పముగనే కదలుట మొదలైన పనుల నొనర్చువాఁడై కాలక్రమముగా, ఉత్క్రమితా= దేహమును వదలి వేయుటకు సిద్ధమగుచున్న, వాయునా=ప్రాణవాయువుచేత, ఉత్క్రామితోత్తర కఫసందుదనాసికుఁ=బయటికి వచ్చుచున్నశ్లేష్మమునుండి మూసికొని పోయిన ముక్కు గలవాఁడై, యస్య=చావఁబోవుచున్న ఏ మనుష్యుని యొక్క, కాసశ్వాసకృతాయాసుఁ=కఫము, ఊర్పు, దగు మొదలైన వానిచేత అత్యంతక్లేశము ననుభవించునట్టి, కంఠుఁ=కంఠము, ఘుర ఘురాయతే=గురుగురు శబ్దమును మాత్రమే, చేయుచున్నదో, సుఁ=వాఁడు, కాలపాశవశంగతుఁ=మృత్యుపాశమునకు చిక్కి శ్రమచెందుచున్న వాఁడై, శయానుఁ=పండుకొనియే ఉన్నవాఁడై, పరిశోచద్భిఁ =చుట్టునుచేరి దుఃఖించుచున్న, స్వబంధుభిఁ=తన బంధువులచేత, పరివీతుఁ

=చుట్టుకొనఁబడినవాఁడై, వాచ్యమానోఽపి=మాటలాడింపఁబడుచున్న వాఁడైనను, న బ్రూతే=బదులు పల్కుటలేదు. ఇంతటి అవ్యవస్థలందుకూడ వైరాగ్య మేర్పడదు. ఇట్లు జీవులందు శ్రీహరియే తాపము గూర్చుచున్నాఁడు. వాని మహిమ మనస్సునకును వాక్కునకును అందనిది.

18.కట్ట కడపటి అవస్థను చెప్పుచున్నాఁడు-ఏవం=పైన చెప్పినట్లు, కుటుంబభరణే=కుటుంబపోషణ మందు, వ్యాపృతాత్మా=నిమగ్నమైన మనస్సు గల, అజితేంద్రియః=ఇంద్రియములను జయింపలేని మనుష్యుఁడు, ఉరువేదనయా =మరణసంకటము చేత, అస్తధీ:=బుద్ధియొక్క, వ్యాపారము లేనివాఁడై, స్వానాం= దేహానుబంధులైన తనబంధువులు, రుదతాంసతాం=ఏడ్చుచున్నవారగు చుండఁగా, మ్రియతే=మరణము చెందును.

19. చావఁబోవువాని యొక్క మొదటి లక్షణమును చెప్పుచున్నాఁడు. తదా=మరణ సమయమందు, ప్రాప్తో=వచ్చినట్టి, సరభ సేక్షణా=కోపముచేత కూడిన కన్నులు గలట్టియు, భీమా=భయంకర రూపముగల, యమదూతా=మృత్యు భటులను, సః=చావఁబోవుమనుష్యుఁడు, దృష్ట్వా=చూచి, త్రస్తహృదయః సన్=భయ పడిన మనస్సు కలవాఁడై, శకృన్మూత్రం=మలమూత్రములను, విముంచతి= వదలును.

20.యాతనాదేహే=నరకదుఃఖము ననుభవించుటకు యోగ్యమైన మఱి యొక్క భౌతిక శరీరమందు, ఆవృత్య=జీవుని ప్రవేశింపఁజేసి, గళే=కంఠమునందు, పాశై: బధ్వా=పగములతో కట్టి, యథా=ఎట్లు, రాజభటాః దండ్యం=రాజభటులు అపరాధిని పిలుచుకొని పోదురో, తథాబలాత్=అట్లే వాని కిష్టము లేకున్నను బలాత్కారముగా, దీర్ఘం అధ్వానం=బహు దూరముగా నున్న యమ పట్టణ మార్గమును, సః=ఆ మృతుఁడు, నీయతే=తీసికొనిపోఁబడును.

21.తయోః=ఆ యమభటుల, తర్జనైః=బెదరింపులచేత, నిర్భన్న హృదయస్సన్=భేదింపఁబడిన ఎదకలవాఁడై, జాతవేపథుః=వణకుచున్న వాఁడై, శ్వభిః=కుక్కలచేత, భక్ష్యమాణః=కఱువఁబడుచున్న వాఁడై, ఆర్తః స్వం అఘం=దీనుఁడై తాను చేసిన పాపములు, అనుస్మరన్=స్మరించి కొనుచు, పథి నీయతే=మార్గమందు తీసికొని పోఁబడును.

22.నరకమునకు పోవుచున్నవాని యవస్థను తెల్పుచున్నాఁడు-అర్కద వానలానిలైః=సూర్యుఁడు, దావానలము, గాలి-- వీనిచేత, సంతప్య మానః =సంతప్తుఁడగుచు, క్రుత్పిపాసరీతః=ఆకలి దప్పులచేత పీడితుఁడై, కృచ్ఛ్రేణ= ఎక్కువ కష్టముతో, పృష్ఠేసతి=ఆకలి దప్పులగు చున్నవనఁగా, కశయా=కొరడా లతో, తాడితశ్చ=కొట్టఁబడినవాఁడై, తప్తవాలుకే=ఎండచేత తప్తమైన ఇసుకప్రదేశంలో, నిరాశమోదకే=నీరులేనట్టి, పథి=మార్గమందు, కృచ్ఛ్రేణ=ఎక్కువ కష్టముతో, అశక్తః అపి=అసమర్థుఁడై యున్నను, చలతి=పయనించు చున్నాఁడు.

23.శ్రాంతః= అలసినవాఁడై, తత్ర తత్ర =అచ్చటచ్చట, మూర్ఛితః =ప్రజ్ఞతప్పినవాఁడై, పతన్=పడుచు, పునః=మరల ఉత్థితః=లేచు చున్నవాఁడై, తమసా=చీకటితో నిండినట్టియు, పాపీయసా=దుఃఖబహుళమైనట్టి, పథా=మారము

చేత, తథా=అ రీతిగా, యమసాదనం=నరకమునకు, నీతః=తీసికొని పోఁబడుచున్నాఁడు.

24.అధ్వనః=మార్గము యొక్క, యోజనానాం=యోజనముల యొక్క, నవతిః నవచ=తొంబైతొమ్మిది, సహస్రాణి=వేలకుగల మార్గమును, త్రిభిః =మూఁడైన, ముహూర్తైః=ముహూర్తములలో(మూఁడు ముక్కాలు గడియ ఒక్కముహూర్తము) లేక ద్వాభ్యాం ముహూర్తాభ్యాం= రెండు ముహూర్తములందు, వా=లేక, పదిదినములలోనో, పక్షం=పక్షములోనో, మాసములోనో, నీతః=తీసికొని పోఁబడినవాఁడై, యాతనాం ప్రాప్నోతి=నరకము నందును.

"త్రిభి ర్ముహూర్తైః ద్వాభ్యాం వా దినై ర్దశభి ర్వేవ వా,
పక్షాన్మాసేన వా యాతి యమలోక మితో మృతః " అని ప్రమాణము.

25,26,27. వాఁడు వాఁడొనర్చిన పాపముల కనుగుణముగా నేర్పడెడు నరక యాతనలను చెప్పుచున్నాఁడు-యమసాదనే=నరకమందు, వేష్టయిత్వా= నూనెలో అద్దిన బట్టలచేత చుట్టి, స్వగాత్రాణాం=వాని వాని దేహమును, ఉల్ముకాదిభిఃకొరవినిండి ఏర్పడెడు జ్వాలచెత, ఆదీపనం=కాలునట్టుచేయుట, క్వాపి=ఇంకొకచోట, స్వకృతం=తనచే నొనర్పఁబడిన, వా=లేక, పరతఃఅపి కృత్తం=ఇతరులచే నొనర్పఁబడిన, ఆత్మమాంసాదనం=తన యొక్క మాంసమును తినుటయు, శ్వగృధ్రైఃచ=కుక్క, గ్రద్ద మొదలగు వానిచేత, జీవతఃఅ=బ్రతికి యున్న తనయొక్క శరీరము నుండి అంత్రాభ్యుత్థారఃనరములను గడ్డకు పీకుటయు, ఆత్మవైశసం=తమ కొనర్చిన హింసను, స్మరద్భిఃస్మరించుచు, నేఁడు తీర్చికొనుటకై కాచియున్న, సర్పవృశ్చిక దంశాద్యైఃపాము తేలు ఇతర విషజంతువులచేత, అవయవశఃచూరుచూరుగా దేహమును, కృంతన్కత్తరించు టయు, గజాదిభ్యఃఏనుఁగు మొదలైన వానిచేత, అభిధాపనం=తరుముకొనఁ బడుటయు, గిరిశృంగేభ్యఃపర్వత శిఖరములనుండి, పాతనం=క్రిందికి త్రోయుటయు, బంధగర్తయోఃసరిపెనలతో పటివేసి, మలమూత్రము లున్న చోట పడవేసి, రోధనం=అచ్చటనే ఉంచుటయు, మొదలైన యాతనలను అనుభవించునని అన్వయము.

28.యాతనము లనేకము లగుటచే సంక్షేపించి చెప్పుచున్నాఁడు- నరఃవా నారీ వా=పురుషుఁడైనను స్త్రీ యైనను, మిథఃపరస్పరము, సంగేన=వైషయికాసక్తితో, యాఃఏ, నిర్మితాఃపాపఫలముగా దైవము చే సృష్టింపఁబడిన నరకము లున్నవో, తాఃవానిని, భుంక్తే=అనుభవించును.

29. ఇవి చాల దూరమందులేవు సమీపమందే ఉన్నవనుచున్నాఁడు- మాతఃతల్లి!నరకఃస్వరఃఇతి అత్రైవస్వరము నరకము ఇవి ఇక్కడికి చాల సమీపమందే ఉన్నవి, ఇతి=అని, ప్రచక్షతే=తెలిసిన వారందురు. నారక్యఃనరకమం దనుభవించెడు, యా యాతనాఃఏ యాతనలు కలవో, తాఃఅవి, ఇహోఽపిఈ లోకమందును, ఉపలక్షితాఃఅపరాధులను రాజులు మొదలైన వారు శిక్షించుట యందును కానఁబడు చున్నవి.'వై' అనుటచేత అపరాధులైన స్వర్గవాసు లందును కూడ ఈ విధమైన శిక్ష కనపడునని సూచించినాఁడు.

30.ఎట్టి పాపులు ఈ నరకము ననుభవింతురు అన్నచో చెప్పుచున్నాఁడు. ఏవం=ఇట్లుగా, కుటుంబం=కుటుంబమునే, బిభ్రాణఃతానే రక్షించు చున్నానని తెలిసి రక్షించెడు వాఁడును, వా=లేక ఉదరంభరః ఏవ=తనకడుపును మాత్రమే నింపుకొనుట యందు ఆసక్తి కలవాఁడును, ప్రేత్య=మరణించి, ఉభయం=తన కుటుంబమును కడుపును, ఇహ=ఇచ్చటనే విసృజ్య=వదలి, ఈదృశం=పైనచెప్పిన యాతనారూపమైన తత్ఫలం=కుటుంబ భరణము ఉదర భరణము మొదలగు వాని ఫలమును. భుంక్తే=అనుభవించుచున్నాఁడు.

31.ఎవఁడు పాప మొనర్చునో వాఁడక్కడే నరక మార్గమున నడచు చున్నాఁడు. వాని ఫల మితరు లనుభవించరని చెప్పుచున్నాఁడు. భూత(ద్రోహేణ =ఇతరులను వంచించి (ప్రాణి ద్రోహ మొనర్చి), యత్=ఏ దేహము, భృతం= పోషితమైనదో, తత్=ఆ, స్వకళేబరం=తన భౌతిక దేహమును, ఇహ=ఇచ్చటే, హిత్వా=వదలి, కుశలేతర పాథేయఃపాపమనెడు దారి బత్తెము కలవాఁడై, ఏకఃపాప మొనర్చినవాఁడే, అధ్వానం=నరక మార్గమును, ప్రపద్యతే=పొందును.

32. దేహమును వదలినక్కేపాపమును కూడ ఇచ్చటే వదలుచున్నాఁడా అన్నచో లేదని చెప్పుచున్నాఁడు-తస్యఆ రీతియైన కుటుంబ పోషణకు ఫలముగా, దైవేన=పుణ్యపాపములకు నియామకుఁడైన శ్రీహరిచేత, ఆపాదితం= పొందింపఁబడిన, శమలం=పాపమును, పుమాన్=జీవుఁడు, హృతవిత్తఃడబ్బు పోఁగొట్టుకొన్నవాఁడు, ఆతురఃరోగియైనవాఁడు, ఇవ=దైవమునుండి వచ్చిన దుఃఖమును అనుభవించువానివలె, నరకేనరక మందు, భుంక్తే=దానినే అనుభవించును. దైవాధీన మగుట చేత ఈ పాపమును వదలి పోవుటకు వానిచేత సాధ్యము కాదని అర్థము.

33. తామిస్రాదులైన నరకములను చెప్పితివి కదా! వానిలో తామిస్రము, అంధతామిస్రము వీని నెవ్వరు పొందెదరు? ఏ పద్ధతులతో నది సిద్ధించును? దానిని చెప్పుచున్నాఁడు-యఃఎవఁడు, జీవఃస్వరూపముతోనే, దైత్య= స్వభావము కలవాఁడై, కేవలేన=భక్తి సంబంధమే లేనట్టి ఒకటి అయిన, అధర్మేణ=శ్రీహరి తద్భక్తులు వీరి ద్వేషరూపమైన పాపకార్యముతో కుటుంబమును రక్షించుటందే ఆసక్తి గలవాఁడుగా నుండునో, సఃవాఁడు, తామసఃచీకటికి, పదం=ముఖ్య స్థానమైన, చరమం=కొనదైన, (అనఁగా మరల తిరిగి వచ్చుటకు సాధ్యము కాని) అంధతామిస్రం=అంధతమస్సును, యాతిపొందును. హి=దీనినుండి పునరుత్థానము లేదు (2) ఈ దుఃఖానుభవమందు కూడ తారతమ్య మున్నది.

"తామిస్రశ్చాంధ తామిస్రో ద్వౌ నిత్యౌ సంప్రకీర్తితౌ" అని ప్రమాణము.

34. తక్కిన నరకములనుండి వెన్కకు తిరిగి వచ్చుటయు కలదని చెప్పుచున్నాఁడు-నరలోకస్యభూలోకము యొక్క, అధస్తాత్=క్రింద, యావతీఃఎన్ని, యాతనాఃనరకములు, సంతి=కలవో, తాఃవానిని, క్రమశఃక్రమముగా, అనుక్రమ్యఅనుభవించి, శుచిఃపాపఫలము ననుభవించుటచేత శుద్ధుఁడై, పునఃమరల, అత్రఈ భూలోకమందు, స్వం=తన యొక్క కర్మాను గుణమైన యోనిని, ఆవ్రజేత్=పొందును. పునఃమరల, శుచిఃచేత్=శుద్ధుఁడైనచో,

స్వర్గమునందును. అశుచి యైనచో నరకము నందును. ఈ యర్థమును 'తు' అనుటచేత సూచించినాఁడు.

"పున ర్జరిద్రః పునరేవ పాపీ" అనెడు సూక్తి ఈ యర్థమును బలపఱచుచున్నది.

ఇది శ్రీభాగవతమున తృతీయ స్కంధమున సుధాలహరి వ్యాఖ్యానమందు ముప్పదియవ యధ్యాయము.

అధ్యాయము - 30

కం. నెఱి నిట్టి నిఖిలలోకే
శ్వరుని పరాక్రమముఁ దెలియ సామర్థ్యం బె
వ్వారికిని గలుగదు మేఘము
గరువలి విక్రమముఁ దెలియఁగా లేని గతిన్. 964

కం. మగువా! వినుఁ సుఖ హేతుక
మగు నర్థము దొరకమికి మహాదుఃఖమునం
దగులుదు రిది యంతయు నా
భగవంతుని యాజ్ఞఁ జేసి ప్రాణులు మఱియున్. 965

సీ. పూని యనిత్యంబులైన గృహక్షేత్ర
పశు ధన సుత వధూ బాంధవాది
వివిధవస్తువులను ధ్రువముగా మది నమ్మి
వఱలు దుర్మతి యగువాఁడు జంతు
సంఘాత మగు దేహసంబంధమున నిల్చి
యర్థి నెయ్యే యోనులందుఁ జొరఁగ
ననుగమించును వానియందు విరక్తుండు
గాక యుండును నరకస్థుఁడైన

తే. దేహి యాత్మీయ దేహంబుఁ దివిరి వదల
లేక తన కది పరమ సౌఖ్యాకరంబు
గాఁగ వర్తించు నదియునుఁ గాక యతఁడు
దేవమాయా విమోహిత భావుఁ డగుచు. 966

కం. ఘనముగఁ బుత్ర వధూ పశు
ధన గృహరక్షణము నందుఁ దత్తత్ప్రియలన్
మనమునఁ దలపోయుచు దిన
దినమున్ దందహ్యమాన దేహుం డగుచున్. 967

కం. అతి మూఢ హృదయుఁడగుచు దు
రితకర్మారంభమునఁ జరింపుచుఁ దరుణీ
కృత గోప్య భాషణములను
సుత కల సంభాషణములఁ జొక్కుచు మఱియున్. 968

కం. వినుఁ మింద్రియ పరవశుఁడై
మునుకొని తత్కూట ధర్మములు గల దుఃఖం
బనయము సుఖరూపంబుగ
మనమునఁ దలపోసి తదభిమానుం డగుచున్. 969

కం. సతతముఁ దమతమ సంపా
దిత మగు నర్థములచేత ధృతిబరులకుఁ గు
త్సితమతి హింసలు సేయుచు
నతిమూఢ మనస్కు లగుచు నాత్మజనములన్. 970

తే. పూని రక్షింపుచును వారి భుక్త శేష
మనుభవింపుచు నంత జీవనము పోక
గడఁతతో నపుడు పరార్థకాముఁడగుచు
సత్త్వ మెడలి కుటుంబపోషణమునందు. 971

సీ. బలిమి చాలక మందభాగ్యుఁడై కుమతియై
పూని యప్పుడు క్రియాహీనుఁడగుచుఁ
దవిలి వృథాప్రయత్నంబులు సేయుచు
మూఢుఁడై కార్పణ్యమునఁ జరించు
నట్టి యకించనుఁడగు వానిఁ జూచి త
ద్దార సుతాదు లాత్మలను వీఁడు
గడు నశక్తుఁడు ప్రోవఁగాఁ జాలఁడితఁడని
నెగ్గింతురర్థిఁ గృషీవలుండు

తే. బడుగు ముసలెద్దు రోసిన పగిది నంత
నతఁడు నే వెంటలను సుఖం బందలేక
తాను పోషించు జనులు దన్ దనరఁ బ్రోవ
బ్రతుకు ముదిమియు మిక్కిలి బాధపఱుప. 972

కం. వెడరూపు దాల్చి బాంధవు
లడలఁగ నిర్యాణమునకు నభిముఖుఁడై యిల్
వెడలఁగఁ జాలక శునకము
వడువునఁ గుడుచుచును మేను వడవడ వణఁకన్. 973

సీ. అతిరోగపీడితుండై మందమగు జఠ
రాగ్నిచే మిగుల నల్పాశి యగుచు
మెఱసి వాయువుచేత మీఁదికి నెగసిన
కన్నులు, కఫమునఁ గప్ప బడిన
నాళంబులును, గంఠనాళంబునను ఘుర
ఘుర మను శబ్దంబు దొరయ బంధు
జనుల మధ్యంబున శయనించు బహు విధ
ములఁ దన్నుఁ బిలువంగఁ బలుక లేక

తే. చటులతర కాలపాశపశంగతాత్ముఁ
డగుచు బిడ్డలఁ బెండ్లాము నరసి ప్రోచు
చింత వికలములైన హృషీకములును
గలిగి విజ్ఞానమునఁ బాసి కష్టుఁడగుచు. 974

వ. అంత మరణా వస్థం బొందు సమయంబున నతి భయంకరాకారులును, సరభసేక్షణులును నగు యమదూత లిద్దఱు దనముందఱ నిలిచినం జూచి, త్రస్త హృదయుండై శక్ర మ్మోత్రంబులు విడుచుచు, యమపాశంబు లచే గళంబున బద్ధుండై శరీరంబువలన నిర్గమించి, యాతనాశరీరంబు నవలంబించి, బలాత్కారంబున దీరంబై దుర్గమంబగు మారంబును బొంది రాజభటులచే నీయమానుం డగుచు దండంబున కభిముఖుండై చను నపరాధిచందంబునఁ జనుచుండి. 975

చ. అనయము మూర్ఛనొందు శునకావళిచేతను భక్ష్యమాణుఁడై
యమపమ కాలకింకర భయంకర తర్జన గర్జనంబులన్
మనము గలంగ దేహము సమస్తము కంపము నొందఁగాఁ బురా
తనభవ పాపకర్మ సముదాయముఁ జిత్తములోఁ దలంపుచున్. 976

సీ. అనుపమ క్రుత్ప్రుష్ణ లంతర్వ్యథలఁ జేయ
ఝుంఝూనీల జ్వాల జ్వలన చండ
భాను ప్రదీప్తి తప్తంబైన వాలుకా
మారానుగత తప్యమాన గాత్రుఁ
డై వీపు కశలచే నడువంగ వికలాంగుఁ
డగుచు మారమునందు నచట నచటఁ
జాల మూర్ఛిల్లి యాశ్రయశూన్య మగు నీళ్ళ
మునుఁగుచు లేచుచు మొనసి పాప

తే. రూప మైన తమముచే నిరూఢుఁడగుచు
వెలయఁ దొంబది తొమ్మిది వేల యోజ
నముల దూరంబు గల యమనగరమునకుఁ
బూని యమభటుల్ గొంపోవఁ బోవు నంత. 977

వ. ఇట్లు మహాపాపాత్ముండైనవాఁడు ముహూర్తత్రయ కాలంబునను సామాన్య దోషియగు వాఁడు ద్విముహూర్తంబులను నేఁగి యాతనం బొందు. అందు. 978

కం. పట్టుదురు కొఱవులను వడిఁ
బెట్టుదు రసిపత్రికలను బెనుమంటలయం
దొట్టుదురు నొడలు నలియఁగ
మట్టుదు రప్పాపచిత్తు మత్తుం బెలుచన్. 979

ఉ. ముంతురు తప్తతోయముల మొత్తుదు రుగ్ర గదాసిధారలన్
ద్రెంతురు పొట్ట ప్రేవులు వధింతురు మీఁద నిభేంద్రపంక్తి మొ

ప్పింతురు ఘోర భంగిఁ గఱపింతురు పాములచేత బిట్టు ద్రొ
బ్బింతురు మీఁద గుండ్లు తినిపింతురు దేహము గోసి కండలన్. 980

వ. మఱియుఁ గుటుంబ పోషణంబునఁ గుక్షింభరుం డగుచు నధర్మపరుండై భూతద్రోహంబున నతిపాపుండై నిరయంబునం బొంది నిజధనంబు గోలుపడి మొఱవెట్టు నాపన్ను ని చందంబునఁ బరస్పరసంబంధంబునఁ గల్పింపం బడిన తమిస్రాంధ తామిస్ర రౌరవాదులగు నరకంబులం బడి, తీవ్రంబులైన బహు యాతనల ననుభవించి క్షీణపాపుండై పునర్నరత్వంబునుం బొందు అని చెప్పి వెండియు నిట్లనియె. 981

ఇది శ్రీపోతనామాత్య విరచితమైన ఆంధ్ర భాగవతమున తృతీయ స్కంధమున ముప్పదియవ అధ్యాయము.

964. కరువలి విక్రమమున్=గాలి యొక్క పరాక్రమము, దొరక మికిన్=దొరకకపోవుటకు, సుఖ హేతుకమగు అర్థము=సుఖమునకు కారణ భూతమైన ధనము లేక పదార్థము.

966. ధ్రువముగాన్=నిజమైనవిగా, అనుగమించును=వెంటపడి పోవును, దేవమాయా=దైవమునకు సంబంధించిన మాయచేత, విమోహిత=మోహము నొందింపఁబడిన, భావుఁడు భావము కలవాఁడు, తత్తత్క్రియలన్=ఆయా పనులందు, దందహ్యమాన దేహుండు=దహింపఁబడుచున్న దేహము కలవాఁడు. దురిత కర్మారంభమునన్=పాపముచే కూడిన కర్మములను చేయుట యందు, తరుణీకృత=స్త్రీలచే చేయఁబడిన, గోప్య=రహస్యమైన, భాషణములన్=సంవాదములచేతను, సుత=సంతానము యొక్క, కలసంభాషణములన్=అవ్యక్త మధురములైన మాటలచేత, సొక్కుచున్=ఆత్మజ్ఞానమును మఱచిన వాఁడగుచు, ఇంద్రియ పరవశుఁడై=ఇంద్రియములకు లోఁబడిన వాఁడై కూటధర్మములు=వంచనతో కూడిన ధర్మములు, అనయము=నిరంతరము, సుఖరూపంబుగన్=సుఖమనుకొనుచున్న వాఁడై, తదభిమానుండు=వాని యందు అభిమానము కలవాఁడు, సతతమున్=నిరంతరము, తమతమ=తమ తమకు సంబంధించిన, సంపాదిత మగు=సంపాదింపఁబడి నట్టివైన, అర్థములచేతన్=ధనములచేత, ధృతిన్ =పాప శంక ఏమాత్రమును లేనివాఁడై, పరులకున్=ఇతరులకు, కుత్సితమతిన్ =వంచనచే కూడిన బుద్ధిచేత, అతిమూఢ మనస్కులు=ఎక్కువ మూర్ఖత్వముతో కూడిన బుద్ధికలవారు. ఆత్మజనములన్=తన బంధువులను.

తాత్పర్యము : దేవహూతి!అఖిలేశ్వరుని పరాక్రమము విచిత్రమైనది. వాని ప్రవృత్తి గూడ అర్థముచేసికొనుట కసాధ్యమైనది. మానవున కాత్మశక్తి ఎంత ఉన్నను దైవము నతిక్రమించుటకు సాధ్యముకాదు. దుఃఖమునుండి తప్పించు కొనుటకై వాఁడొనర్చుప్రయత్నము లన్నియు కృతఘ్నుఁడు దొనర్చిన ఉపకారములవలె వ్యర్థము లగును. మేఘము గాలిచేత త్రోసికొని పోఁబడుచున్నది. ఎంత ప్రయత్నమొనర్చినను మేఘము వాత్యాసమూహము యొక్క

బలము నత్రికమించఁ జాలదు. మేఘము గాలి తాకిడి నుండి తప్పించుకొనుట కెంత గింజుకొన్నను అది గింజుకొనుటే అగును కాని తప్పించుకొనుట సాధ్యము కాదు. ఐహిక సుఖములకు అర్థము ముఖ్యము. ఒకవేళ అర్థమునకే లోఁబడినవి మఱికొన్ని యున్నను వాని సుఖప్రాప్తికి ఆ పదార్థములు ముఖ్యములు. సాధారణముగా నైహికము లన్నియు ధనమునకు లోఁబడినవే. వీడనుకొన్నప్పు డంతయు సుఖహేతుక మగు నర్థము ప్రాప్తింపదు. వీఁడనుకొన్న పదార్థముకూడ ప్రాప్తింపదు. అప్పుడు వాఁడు మహా దుఃఖము నందును. అది భగవదాజ్ఞ యగుటచేత ఆ దుఃఖము నుండి తప్పించు కొనుటకు సాధ్యము కాదు. అది కేవలము మనుష్యులకు మాత్రమే సంబంధించిన నియతి కాదు. ఇతర ప్రాణుల యందుకూడ ఈ పద్ధతి ఇట్లే కొనసాగును. వాని కాహారాదికములు ఇతరములైన అవసరములు సమయమునకు లభింపవు. అప్పుడవి మహావ్యథ నందును. నోరు లేక పోవుటచేత ఇతరుల కవి తమ దుఃఖము నెఱుక పరుపలేవు. మానవునకు నోరున్నది. పది మందితో చెప్పుకొనును. వారు కూడ నేమి సేయుదురు? ఓ దార్ఢ్యను ప్రయత్నింతురు. వారుకూడ ఇట్టి దుఃఖముల కనేకములకు లోఁబడినవారే. మానవుని అజ్ఞాన మెక్కు డున్నదనఁగా ఇతరులకు కల్గు అనుభవములు చూచుచునే ఉండును. తన గతియు ఇట్టిదే యని వాఁడెఱుగఁడు.

గృహములు, క్షేత్రములు, ధనములు, భార్యలు, బాంధవులు, సుతులు- వీరందరు అనిత్యమే. వీరంద రనిత్యములను విషయము దినదినమున కనుభవమునకు వచ్చుచునే ఉండును. ఇంత అయినను వాఁడవి నిత్యములుగనే ఎంచు చుండును. ఇతరుని గృహాదు లనిత్యములు కావచ్చును గాని తనకు సంబంధించిన గృహాదులు నిత్యము లనియే భావించును. భావించి సుఖాభిలాష దినదినమున కెక్కువ కాఁగా దానిని తీర్చుకొనుట కొఱకై వివిధ పదార్థములను సేకరించుటకు తహతహలాడు చుండును. ఇటివాఁడు కనుకనే వాఁడు దుర్మతి. అనఁగా దుష్టమైన మతిగలవాఁడని యర్థము కాదు. బుద్ధిని సరిగా వెచ్చించి సన్నివేశమునర్థము చేసి కొననివాఁడని యర్థము. ఈ విమోహముతోఁ గలు ఫలమేమి? మరల మరల జన్మప్రాప్తి. మానవ జన్మమే వచ్చునని ఎవ్వరు చెప్పెదరు? అనేకములు ప్రాణు లున్నవి. వాని యం దేజన్మము తన కేర్పడునో కాని ఏ జన్మము వచ్చినను అది యదియే వానికి పరమసుఖా కరముగా ఉండును. ఈ జీవుఁడెన్ని జన్మలందును వాని వాని యందు విరక్తుఁడు గాక ఆ యాశరీరములనే నిత్యము లని నమ్మి వాని వాని యం దభినివేశముతో బ్రతుకును. నరకమునందున్న జీవికూడ తన శరీరమును వదలను సమ్మతింపఁడు. అన్ని బాధలున్నను వాని కాశరీరమే రమ్యముగా దోచును. ఆ దుఃఖములే అనుభవనీయములుగా కన్పించును. దీనికి కారణమేమి? బలవత్తరమైన దేవమాయ. ఆ మాయచే వాఁడు సంపూర్ణముగా మోహితుఁడగు చున్నాఁడు. పుత్రులు, భార్య, ధనములు, పశువులు మొదలైన వాని యం దత్యంతాసక్తి కలవాఁడై వానిని సర్వథా రక్షించు కొనుటకు బ్రహ్మాండమైన ప్రయత్న మొనర్చును. పై చెప్పిన వారిలో ఎవ్వ రెవ్వరికి ఏ యే ఆపద కలుగునో అని నిరంతరము జాగరూకుఁడై రక్షించుటకు తహ తహ లాడును.

వారికి కొంచెము బాధ కల్గించినచో వీని దేహము నిప్పులలో పొరలించిన ట్లుండును. ఈ రీతిగా పరమమూర్ఖుడై యజమాని నిరంతర పరిశ్రమతో శాంతిలేని వాడుగా ఉండును. ఈ వృత్తి మానవుని యందేకాదు ఇతర ప్రాణులందుకూడ అంతే. ఈ కుటుంబమును పోషించుటకై వాడనంతములైన దురితము లొనర్చును. వీని కన్నిటికి దొరకు కూలి ఏది? భార్యలతోడి నర్మభాషణము. సంతానము యొక్క అవ్యక్త మధురభాషణము. ఇవి విన్నపుడు ఆనందముతో నొడలు మఱచి పోవును. ఇంద్రియములు వానిని పరవశునిగా నొనర్చును. ప్రతి ఇంద్రియమున కధీనుడైనవాడై అది ఈడ్చికొని పోయిన మార్గమున వాడు చరించును. సంసారమున ఉన్నవన్నియు వంచనాధర్మములే. వానినే వాడు గొప్పగా తలంచును. అవి ధర్మాభాసములని వాడు ఎఱుంగడు. సంసారమం దున్నది దుఃఖమే యని వానికి తెలియదు. వానినే వాడు సుఖరూపములుగా భావించును. సంసారమున దుఃఖములుప్రాప్తించు కొలది వాడు దానియందే విపరీతమైన అభిమానమును పెంచుకొనును. వంచనలతోనే ధన మార్జించును. అ ట్లార్జించిన ధనముతోనే మఱల ఇతరులకు హింస యొనర్చును. వీని యన్నిటికి కారణము కుటుంబ మని సర్వాత్మనా తనవిగా భావించును.

971....975. భుక్త శేషము=వా రనుభవింపగా మిగిలినది, జీవనముపోక =జీవనముయొక్క గడపులలో, కడకడతోన్=సాహసముతో, పరారకాములు= ఇతరులకు సంపాదించి పెట్టుటలో సమర్థులు, సత్త్వము ఎడలి=శరీరమందు శక్తి తగినదై, బలిమి=బలము, మందభాగ్యుడు=అదృష్టహీనుడు, క్రియాహీనుడు =పనులు చేయలేనివాడు, కార్పణ్యమునన్=దీనత్వముతో, అకించనుడు =శక్తిలేనివాడు, సెగ్గించున్=తప్పులు పట్టును. ఏ వెంటలను=ఏ ప్రయత్నము లతో కూడ, ముదిమి=ముసలి తనము, వెడరూపు=చెడిపోయిన రూపము, అడలగాన్=దుఃఖింపగా, నిర్వాణమునకున్=చావునకు, అల్పాశి=తక్కువగా తినువాడు, చటులతర=భయంకరమైన, కాలపాశ=యముని పాశములకు, వశంగతాత్ముడు=లోబడిన శరీరము కలవాడు, హృషీకములు=ఇంద్రియములు సరభస ఈక్షణులు=భయంకరమైన చూపులు గలవారు, త్రస్తమనస్కుడు= భయపడు మనస్కులవాడు, నిర్గమించు=వదలు, నీయమానుడు=తీసికొని పోబడువాడు.

తాత్పర్యము: ఈ రీతిగా కుటుంబము తన దనుకొని వాడు వారిని రక్షించుట యందే నిరంతరము ప్రయత్నము కలవాడై ఉండును. వారు అనుభవింపగా వదలిన భుక్తశేషమునే తినును. అనగా ఎంగిలి అన్నమాట. ఇంకను జీవితము సాగుచునే ఉండుమ. వారికై సంపాదించుటకు నానాయాతనల నందును. క్రమముగా శరీర బలము తగ్గును. కుటుంబము పోషించుటకు శక్తి చాలదు. ధనములు సన్న గిల్లినవి. దురదృష్టము పైకొన్నది బుద్ధి సరిగా పనిచేయుట లేదు శరీరము పనిచేయుటకు నిరాకరించును. కానీ ఊరకుండడు. వ్యర్థముగా ప్రయత్నములు చేసి అవిసొగిరాక దీనుడగును. ఉన్నదానిని నిలబెట్టుకొనవలెనని లోభము నాశ్రయించును. వీడిన తమ్ము

పోషింపఁ జాలఁడని భార్యాపుత్రాదులకు తెలిసివచ్చి వాఁడు భారమైనాఁడని వానిపై ఏవేవో దోషారోపణము లొనర్తురు. ఎద్దు ముసలిదై సేద్యపు పనులకు పనికిరానపుడు సరిగా పోషింపని కృషీవలుని వలె కుటుంబము సరిగాచూడదు. కాని ఏమి చేయును? వీఁడెంత ప్రయత్నించినను సుఖము వానికి ప్రాప్తమగుట లేదు. తన బ్రతు కితరుల పైన ఆధార పడినది. సరిగా చాలుట లేదు. చాలని దానికి ముసలి తనము. వార్ధకముతో శరీరము మారిపోవును. వాని రూపము వానికే వికార మనిపించును. మృత్యువు సంజ్ఞచేసి పిలుచును. బంధువులకు వానిని పోషించుటకు బరువగును. ఇంటినుండి పోలేఁడు. కుక్క వలె కావలి కాచును. ముసలి తనముతో శరీరము వడఁకును. రోగములు పై కొనును. జీర్ణశక్తి తగ్గును అందువలన అరిగించు కొనఁజాలక కొద్దిగా తినును. వాతముతో కన్నులు పైకెగసి ఉబ్బుకొనును. కఫము నాళము లన్నిటిని కప్పి వేయును. కంఠమునందు గుర గుర మను శబ్దము. చావు సమీపించినది. చుట్టును బంధువులు కూచున్నారు. వారేమేమో పలుకరింతురు. బదు లిచ్చుటకు మనసు లేదు. శరీరమునకు శక్తి లేదు. యమభటులు పాశములతో నీడ్చుచున్నారు. అప్పుడు గూడవానికి తన యనంతరము సంసార మెట్లు బ్రతుకునని చింతయే. ఈ చింతతో అవయవములు స్వాధీనము తప్పును. విజ్ఞానము తన్నువదలి పోలేదు. యమభటులు ముందుకు వచ్చినారు. వారి ఆకారములు మహా భయంకరములు. చూపు లగి కురియు చున్నవి. వారు ముందు నిలిచి భయంకరముగా తనవైపు చూచుచున్నారు. ఇక మీఁద తన్ను వారేమి సేయుదురో యనిభయము. ఈ భయములో వాఁడు మలమూత్రములు వదలును. యమపాశము కంఠమున పడి శరీరము వదలి పోయి యాతనా శరీరము ప్రాప్తించినది. వారు బలాత్కారముగా తన్ను ఈడ్చికొనుపోవుచున్నారు. దూరమెంతో ఉన్నది. రాజభటులచే ఈడ్వఁబడు అపరాధివలె మానవుఁడు ఈడ్చికొని పోఁబడుచున్నాఁడు.

976... 81.శునక + ఆ వళిచేతను=కుక్కల సమూహముచేత, భక్ష్యమానుఁడై =తినఁబడుచున్నవాఁడై, కాలకింకర=యమ భటులచేత, భయంకరములైన, తర్జన=బెదిరింపులు, గర్జన=గర్జనములు వీనిచేత, పురాతనభవ=తానింతకుముం దొనర్చిన, పాపకర్మసముదాయము=పాపకార్యముల గుంపును, అనుపమ=ఎక్కు వైన, క్షుత్పిపాసలు=ఆకలి దప్పులు, అంతర్వ్యథలన్=లోపలిబాధలను, ధూం ధూనిల=ఎక్కువగాలి, జ్వాలజ్వాలన=మండుచున్న అగ్నులు, చండభాను=భయం కరమైన సూర్యుని యొక్క, ప్రదీప్తి=ఎండచే, తప్తంబు=కాల్చఁబడినది, వాలుకామార్గాను గత తప్యమాన గాత్రుఁడు=ఇసుకనేల వెంట ఈడ్చి కొనిపోఁ బడుచు ఎండచే బాధపడుచున్న శరీరము గలవాఁడు, అడుపంగన్=కొట్టగా, వికల+అంగుఁడు=వికారము లందుచున్న శరీరము గలవాఁడు, ఆశ్రయశూన్యము =ఆశ్రయించుటకు చోటులేనిది, పాపరూపమైన తమముచేన్=పాపమనెడు చీకటిచేత, నిరూఢుఁడు=అక్రమింపఁబడిన వాఁడు. యాతన=దుఃఖము, అసిపత్రికలు=చురకత్తులు, ఇభేంద్రపంక్తి=ఏనుఁగుల గుంపు, కుక్షింభరుఁడు=

తన కడుపునే పోషించు చున్నవాఁడు. అధర్మపరుఁడు=అధర్మము నొనర్చువాఁడు, క్షీణపాపుఁడు=పోఁగొట్టుకన్న పాపములు కలవాఁడు.

తాత్పర్యము: మారమున పోవుచున్నపుడు కుక్కలు వెంటఁబడితరుమును. అవి తన యాతనా శరీరములోని మాంసఖండములను పీకును. దానితో బాధ యధికమై మూర్ఛనొందును. మాటి మాటికిని యమకింకరులు బెదరింతురు. గరింతురు. వాని మనస్సు భయముతో చీకాకు పడును. శరీరము వడవడ వడఁకును. తానొర్చిన పాపములు కనిపించును. ఆకలి దప్పులు పెల్లుగా కల్పించును. వాని వ్యథ యొర్చుకొనుట కసాధ్యమై యుండును. ఇసుకనేలలో ప్రయాణము. అప్పు డప్పుడు వీచు భయంకరమైన గాలులు. ఎచ్చట చూచినను అగ్నులు. భయంకరముగా ఎండను గురిపించు సూర్యుఁడు. వీనితో ఆ ఇసుక ప్రదేశము కణ కణ మండుచుండును. ఆ నేలలో ఈడ్చు కొని పోవునపుడు ఆ ఇసుకతో శరీరము భగ్నమగును. యమభటులు కొరడాలతో బాధింతురు. అ దెబ్బలకు వాని దేహము చుట్టుకొని పోవును. వాఁడు మూర్ఛిల్లును. ఎక్కడ విశ్రాంతి తీసికొంద మన్నను వీలులేదు. త్రాగుటకు నీరు లేదు. మాటిమాటికి మూర్ఛ నొందును. తన పాపమనెడు చీకటి ఆక్రమించి యుండును. వాఁడు పోవలసిన మారము తొంబది మ్మిది వేల యోజనములు. అంత దూరము ఇన్నికష్టములతోనే వాఁడు నడచును. మహాపాపాత్ముఁడైన వానిని ముహూర్త్రత్రయము ఈ మార్గములో నడిపింతురు. సామాన్య పాపి రెండు మూర్త్రములలో ఈ మారము దాటిపోవును. యమ పురమునకు పోయిన పిదప వాని బాధలు వర్ణనాతీతములు. అక్కడ కొఱవులతో పట్టుకొందురు. మెడల పైన ఖడ్గముతో నరకుదురు. మంటల లోనికి త్రోతురు. ఒడలు నలినలి యగునట్లు వేడినీళ్ళలో ముంతురు. గదలతో కత్తులతో పొట్టపేవులు గడ్డకు వచ్చునట్లు మొత్తుదురు. నరకుదురు. వాని దేహముపై ఏనుఁగులను నడపింతురు. పాములచే కరపింతురు. గుండ్రు ద్రొబ్బింతురు. దేహము కోసి, ఆ కండలనే తినిపింతురు. ఈ విధముగా కుటుంబ పోషణమే పరమార్థమని నమ్మి నానా పాపము లొనర్చిన మనుష్యుఁడు నిరయము నందును తన పొట్టను మాత్రమే పోషించుట యందు జాగరూకుఁడైన వాఁడు-- ఆ పోషణకై పాపము లొనర్చిన వాఁడు చెప్పరాని బాధల ననుభవించును. నిజధనమును పోఁగొట్టుకొన్న వాఁడెట్టి భయంకరముగా నేడ్చును. అచట తామిస్రము, అంధతామిస్రము, రౌరవము అను పేరులు గల నరకము లున్నవి వానిని వెంట వెంటనే వీఁడనుభవించును. ఈ అనుభవము లన్నియు వాఁడొనర్చిన పాపములకు ప్రతి క్రియలు. ఇట్లు మహాదుఃఖము నందినవాఁడు తన యొనర్చిన పాపములకు ప్రతిఫలము ననుభవించి వాఁడు మరల మానవ జన్మమునకు వచ్చును.

ఇది పోతనామాత్య ప్రణీతమైన ఆంధ్రభాగవతమున తృతీయ స్కంధమున ముప్పదవ అధ్యాయము. సుధాలహరి వ్యాఖ్య సమాప్తము.

ఏక త్రింశో ధ్యాయః

శ్రీభగవానువాచ

కర్మణా దైవనేత్రేణ జంతు రేహోపపత్తయే,
స్త్రియాః ప్రవిష్ట ఉదరం పుంసో రేతః కణాశ్రయః. 1

కలిలం త్వేకరాత్రేణ పంచరాత్రేణ బుద్బుదమ్,
దశాహేన చ కర్కంధుః పేశ్యండం వా తతః పరమ్. 2

మాసేన తు శిరో ద్వాభ్యాం బాహ్వంఘ్ర్యాద్యంగ విగ్రహమ్,
నఖరోమాస్థి చర్మాణి లింగచ్ఛిద్రోద్భవ స్త్రిభిః. 3

చతుర్భి ర్ధాతవ స్సప్త పంచభిః క్షుత్తృడుద్భవః,
షడ్భిర్ జరాయుణావీతః కుక్షేభ్రామ్యతి దక్షిణే. 4

సప్తమే జన్మకర్మాణి గతాని స్మరతే ఋషిః,
జగత్యాం నిజదేహస్య మాయయా బంధ మాత్మనః. 5

మాతు ర్జగ్ధన్న పానాద్యై రేధద్ధాతు రసంమతే,
శేతే విణ్మూత్రయో ర్గర్తే స జంతు ర్జంతుసంభవే. 6

క్రిమిభిః క్షత సర్వాంగ స్సౌకుమార్యా తతిక్షణమ్,
మూర్ఛా మాప్నో త్యురుక్లేశ స్తత్తత్యైః క్షుధితై ర్ముహుః. 7

కటుతీక్ష్ణోష్ణలవణ క్షారామ్లాదిభి రుల్బణైః,
మాతృభుక్తై రుపస్పృష్ట స్సర్వాంగోత్థిత వేదనః. 8

ఉత్వేన సంవృత స్తస్మిన్నాంత్రైశ్చ బహిరావృతః,
ఆస్తే కృత్వా శిరః కుక్షౌ భుగ్న పృష్ఠ శిరోధరః
అకల్యస్స్వాంగ చేష్టాయాం శకుంత ఇవ పంజరే. 9

తత్ర లబ్ధస్మృతి రైవా త్కర్మ జన్మశతోద్భవమ్,
స్మరన్ దీర్ఘ మనుచ్ఛ్వాసం శర్మ కిన్నామ విందతే. 10

ఆరభ్య సప్తమా న్మాసా ల్లబ్ధబోధో ఽ తివేపితః,
నైకత్రాస్తే సూతివాతై ర్విష్ఠాభూ రివ సోదరః. 11

నాథమాన ఋషి ర్భీత స్సప్తవధ్రిః కృతాంజలిః,
సంస్తౌతి తం విక్లబయా వాచా యేనోదరేఽర్పితః. 12

జీవ ఉవాచ

తస్యోపపన్న మవితుం జగదిచ్ఛయా ఽఽత్త
నానాతనో ర్భువి చలచ్చరణారవిందమ్,
సో ఽహం వ్రజామి శరణం హ్యకుతోభయం మే
యేనేదృశీ గతి రదర్శ్యసతో ఽనురూపా. 13

య స్త్వత్ర బద్ధ ఇవ కర్మభి రావృతాత్మ
భూతేంద్రియాశయమయీ మవలంబ్య మాయామ్,
ఆస్తే విశుద్ధ మవికార మఖండబోధ
మాతప్యమాన హృదయేఽవసితం నమామి. 14

యః పంచభూత రచితే రహిత శ్శరీరే
ఛన్నో యథేంద్రియ గుణార్థ చిదాత్మ కోఽహమ్,
తేనాఽవికుంఠమహిమాన మృషిం త మేనం
వందే పరం ప్రకృతిపూరుషయోః పుమాంసమ్. 15

యన్మాయ యోరుగుణ కర్మనిబంధనేఽస్మిన్
సాంసారికే పథి చరం స్తదభిశ్రమేణ,
నష్ట స్మృతిః పున రయం ప్రవృణీత లోకం
యుక్త్యా కయా మహదనుగ్రహ మంతరేణ. 16

జ్ఞానం యదేత దదధా త్కతమ స్సదేవ
సైకాలికం స్థిరచరే ష్వనువర్తితాంశః,
తం జీవకర్మ పదవీ మనువర్తమానా
స్తాపత్రయోపశమనాయ వయం భజేమ. 17

దేహ్యన్య దేహవివరే జఠరాగ్నినాఽ సృ
గ్విణ్మూత్రకూపపతితో భృశతప్తదేహః,
ఇచ్ఛన్నితో వివసితుం గణయన్ స్వమాసాన్
నిర్వాస్యతే కృపణధీ ర్భగవన్ కదాను. 18

యేనేదృశీం గతి మసౌ దశమాస్య ఈశ
సంగ్రాహితః పురుదయేన భవాదృశేన,
స్వేనైవ తుష్యతు కృతేన సదీననాథః
కో నామ తత్ప్రతివినాంజలి మస్య కుర్యాత్. 19

పశ్యత్యయం ధిషణయాననుసప్తవృద్ధి
శ్శారీరకే దమశరీర్యపర స్సదేహే,
యత్పుష్పయా సత మహం పురుషం పురాణం
హ్యో బహి ర్భవతి చైత్యమివ ప్రతీతమ్. 20

సోఽహం వసన్నపి విభో! బహుదుఃఖవాసం
గర్భా న్నవిర్గమిషే బహిరంధకూపే,
యత్రోపయాత ముపసర్పతి దేవమాయా
మిథ్యామతి ర్యదనుసంసృతిచక్ర మేతత్. 21

తస్మాదహం విగత విక్లబ ఉద్ధరిష్య
ఆత్మాన మాశు తమస స్సుహృదాత్మనైవ,
భూయో యథా వ్యసన మేత దనేకరంధ్రం
మామేఽ భవిష్య దుపసాదిత విష్ణుపాదః. 22

శ్రీకపిల ఉవాచ

ఏవం కృతమతిం గర్భే దశమాస్యం సపద్యుషిమ్,
సద్యఃక్షిపత్య వాచీనం ప్రసూత్యై సూతిమారుతః. 23

తేనాఽ స్పష్ట స్పహసా కృత్వాఽవాక్శిర ఆతురః,
వినిష్క్రమతి కృచ్ఛ్రేణ నిరుచ్ఛ్వాసో హతస్మృతిః. 24

పతితో భువ్య సృగ్విగో విష్ఠాభూరివ చేష్టతే,
రోరూయతే గతే జ్ఞానే విపరీతాం మతిం గతః. 25

పరచ్ఛందం న విదుషా పుష్యమాణో జనేన సః,
అనభిప్రేత మాపన్నః ప్రత్యాఖ్యాతు మనీశ్వరః. 26

శాయితోఽశుచిపర్యంకే జంతు స్వేదజ దూషితే,
నేశః కండూయనేఽంగానా మాసనోత్థానచేష్టనే. 27

తుదంత్యామత్వచం దంశా మత్కుణా మశకాదయః,
రుదంతం విగత జ్ఞానం క్రిమయః క్రిమికం యథా. 28

ఇత్యేవం శైశవం భుక్త్వా దుఃఖం పౌగండ మేవ చ,
అలబ్ధభీప్సితోఽజ్ఞానా దిద్ధమన్యు శ్శుచార్పితః. 29

సహ దేహేన మానేన వర్ధమానేన మన్యునా,
కరోతి విగ్రహం కామీ కామిష్వంతాయ చాత్మనః. 30

భూతైః పంచభి రారబ్ధే దేహే దేహ్యా బుధోఽసకృత్,
అహం మమేత్య సద్గ్రాహః కరోతి కుమతి ర్మతిమ్. 31

తదర్థం కురుతే కర్మ యద్బద్ధో యాతి సంసృతిమ్,
యోఽనుయాతి దదత్క్లేశ మవిద్యాకర్మబంధనః. 32

యద్యసద్భిః పథిహృతశ్శిశ్నోదర కృతోద్యమైః
అక్షితో రమతే జంతు స్తమోవిశతి పూర్వవత్. 33

సత్యం శౌచం దయా మౌనం బుద్ధి ర్హ్రీ శ్శ్రీర్యశః క్షమా,
శమో దమో భగశ్చేతి యత్సంగా ద్యాతి సంక్షయమ్. 34

తే ష్వశాంతేషు మూఢేషు ఖండితాత్మ స్వఽసాధుషు,
సంగం న కుర్యా చ్ఛోచ్యేషు యోషిత్క్రీడామృగేషు చ. 35

న తథాఽస్య భవే న్మోహో బంధశ్చాన్య ప్రసంగతః,
యోషిత్సంగా ద్యథా పుంసో యథా తత్సంగిసంగతః. 36

ప్రజాపతి స్స్వాం దుహితరం దృష్ట్వా తద్రూపధర్షితః,
రోహిద్భూతా యోఽన్వధావ ద్భృశ్యరూపీ గతత్రపః. 37

తత్స్పష్ట సృష్ట సృష్టేషు కోన్వఖండితధీః పుమాన్,
ఋషిం నారాయణ మృతే యోషి న్మయ్యేహ మాయయా. 38

బలం మే పశ్య మాయాయా స్త్రీమయ్యా జయినో దిశామ్,
యా కరోతి పదాక్రాంతాన్ భ్రూవిజృంభేణ కేవలమ్. 39

సంగం న కుర్యా త్ప్రమదాసు జాతు
యోగస్య పారం పర మారురుక్షుః,
మత్సేవయా ప్రతి లబ్ధాత్మలాభో
వదంతి యా నిర యద్వార మస్య. 40

యోఽపయాతి శనై ర్మాయాయోషి ద్దేవవినిర్మితా,
తా మీక్షేతాత్మనో మృత్యుం తృణైైః కూప మివాఽఽవృతమ్. 41

యాం మన్యతే పతిం మోహా న్మన్మాయా మృషభాయతీమ్,
స్త్రీత్వం స్త్రీ సంగతః ప్రాప్తో విత్తా పత్యగృహ ప్రదమ్. 42

త మాత్మనో విజానీయా ద్వీత్తాపత్యగృహాత్మకమ్,
దైవోపసాదితం మృత్యుం మృగయో ర్గాయనం యథా. 43

దేహేన జీవభూతేన లోకా లోక మనువ్రజన్,
భుంజాన ఏవ కర్మాణి కరోత్యవిరతం పుమాన్. 44

జీవో హ్యస్యానుగో దేహో భూతేంద్రియమనోమయః,
తన్నిరోధస్తు మరణ మావిర్భావస్తు సంభవః. 45

ద్రవ్యోపలబ్ధిస్థానస్య ద్రవ్యేక్షాయోగ్యతా యథా,
తత్పంచత్వ మహం మానా దుత్పత్తిర్ద్రవ్య దర్శనమ్. 46

యథాక్ష్ణో ర్ద్రవ్యావయవ దర్శనా యోగ్యతా యథా,
తథైవ చక్షుషో ద్రష్టుర్ద్రష్టతా యోగ్యతాఽనయోః. 47

పుంసో యథేహేంద్రియాణి విందంతి స్వగతం పదమ్,
సుఖదుఃఖం నాన్యగతం తథైకాంశాః పృథక్కళాః. 48

ఆత్మాహి కేవల జ్ఞానమర్థోదేహాద్యసజ్జడమ్,
సుఖదుఃఖాదయో భావా న దేహస్య న చాత్మనః. 49

తస్మా న్నకార్య స్సంత్రాసో న కార్పణ్యం న సంభ్రమః,
బుద్ధ్వా జీవగతిం ధీరో ముక్తసంగ శ్చరే దిహ. 50

సమ్యగ్దర్శన యా బుద్ధ్యా యోగవైరాగ్య యుక్తయా.
మాయా విరచితే లోకే చరే న్యస్య కళేబరమ్. 51

ఇతి శ్రీ మద్భాగవతే తృతీయస్కంధే ఏకత్రింశోఽధ్యాయః

1.దైవనేత్రేణ=దైవముచేత ప్రవర్తింప చేయఁబడుచున్న, కర్మణా=కర్మముచేత, జంతుఃప్రాణి, దేహోపపత్తయే=దేహము యొక్క ప్రాప్తికొఱకై, పుంసఃపురుషుని యొక్క, రేతః కణాశ్రయఃవీర్యబిందువు నాశ్రయించినవాఁడై, స్త్రీయఃస్త్రీ యొక్క, ఉదరంగర్భమును, ప్రవిష్టఃప్రవేశించినవాఁడగును.

తాత్పర్యము: మరణము తరువాత నేర్పడెడు నరకస్థితి ఈ రెంటిని చెప్పిన తరువాత గర్భప్రాప్తి, జననము మొదలైన క్లేశములను కపిల మహర్షి వరింపఁబోవుచున్నాఁడు- మరణానంతరము జీవుఁడు కర్మానుసారముగా నేర్పడెడు దుఃఖమునో, సుఖమునో, నరకమందో, స్వర్గమందో దైవనిర్ణయము ననుసరించి అనుభవించును ఆ యనుభవము తరువాత మరల వీనికి మనుష్య శరీర మనుగ్రహించుటకై భగవంతుఁడు దయావిశేషమును వహించును. అప్పుడా జీవుఁడు శరీర సంప్రాప్తి కొఱకై మొదలు పురుషుని రేతస్సునందు చేరి దాని మూలమున స్త్రీ యొక్క గర్భవాసమున ప్రవేశించును.

2. ఏకరాత్రేణ=ఒక రాత్రి తరువాత, కలిలం=రక్తముతో కూడినది యగును, పంచరాత్రేణ=ఐదు దినముల తరువాత, బుద్బుదం=వృత్తాకారమును పొందును. దశాహేన=పది దినముల తరువాత, కర్కంధుః=రేగుకాయ ప్రమాణము వహించును. తతః పరం=అటు తరువాత, పేశి=మాంస పిండాకృతి యగును. అండం వా=గ్రుడ్డంత పరిమాణము కలదిగనో అగును.

తాత్పర్యము: పురుషుని రేతస్సుతో పాటు స్త్రీయొక్క గర్భాలయమును ప్రాపించి ఈ జీవుని వాసస్థానమైన రేతస్సు గర్భ పాత్రయందు ఒక దినములో రక్తముతో చేరును. దీనినప్పుడు కలిల మని పిలుతురు. ఐదు దినముల తరువాత రక్త సమ్మిశ్రితమైన ఈ రేతస్సు వృత్తాకారముగా పరిణమించును. దానికి బుద్బుద మని నామము. పది దినముల తరువాత రేగుకాయ అంతటి పరిమాణమును చెందును. అప్పుడది కొద్దిగా కఠినముగా మారును. తరువాత ఒక మాసమునకు మాంసపిండముగా ఉండును. దీనికి పేశిఅని పేరు. పక్షిజాతియందో మఱియొక దాని యందో ప్రవేశించి ఈ రేతోబిందువు కొన్నిదినములకు గ్రుడ్డుగా మారును.

3. మాసేనతు=ఒక్కనెలకు, శిరః=శిరస్సేర్పడును, ద్వాభ్యాం=రెండు నెలలకు, బాహ్వాం ప్రూద్యంగ విగ్రహ=బాహువులు, అంఘ్రులు మొదలైన అవయవముల విభాగము కలుగును. త్రిభిఃమూఁడు నెలలకు, నఖ రోమాస్థి చర్మాణి=నఖములు, రోమములు, ఎముకలు, తోలు ఇవి కలుగును లింగచ్ఛిద్రోద్భవః=లింగ ద్వారము యొక్క ఉత్పత్తి కూడ కలుగును.

తాత్పర్యము: ఒక నెల గడచిన తరువాత శిర మేర్పడును. రెండు మాసముల అనంతరము హస్తములు, కాళ్ళు మొదలైన అవయవములు రూపుకట్టును. మూఁడు మాసములకు నఖములు, రోమములు, ఎముకలు, తోళ్ళు, లింగద్వారము- అనున వన్నియు కలుగును.

4. చతుర్భిఃనాల్గు మాసములకు, సప్తధాతవఃమాంసాదులైన సప్తధాతువు లేర్పడును. పంచభిఃఐదు మాసములకు, క్షుత్తృడుద్భవఃఆకలిదప్పి మొదలగునవి కలుగును. షడ్భిఃఆరు మాసములకు, జరాయుణాజరాయువని పిలువఁబడెడు, ఒకానొక ప్రేగు యొక్క పాశముచేత, వీతఃచుట్టఁబడినవాఁడై,

దక్షిణేకుక్షౌ=గర్భముయొక్క కుడి భాగమందు, భ్రామ్యతి=చుట్టుకొని తిరుగు చుండును.

తాత్పర్యము: నాల్గుమాసములు గడచిన పిమ్మట మాంసము మొదలైన సప్తధాతువు లేర్పడును. ఐదు మాసములకు ఆకలి దప్పుల ఉత్పత్తి. ఇక్కడి నుండి ప్రాణిధర్మములు మొదలైనట్లే. ఆరవ మాసమందు జరాయువని పిలువబడెడు చాలమృదువైన ఒక రకమైన తోలుచేత చుట్టఁబడినవాఁడై ఉండును. అప్పుడు గర్భగతుఁడైన శరీరి తల్లి యొక్క కడుపునందు కుడి భాగమందు చలించుచుండును. ఆడుపిల్లయైన తల్లి గర్భమున ఎడమవైపున చలించునందురు.

5. గర్భస్థ శిశువునకు ఏడవమాసమందు జ్ఞాన ముత్పత్తి యగునని చెప్పుచున్నాఁడు.

సప్తమే=ఏడవ మాసమందు, ఋషిః=జ్ఞానమును పొందిన ఆ గర్భస్థుఁడు, జగత్యాం=జన్మభూమియందు, ఆత్మనః=తన యొక్క, యానిగతాని=ఏ గడచి పోయిన, జన్మ కర్మాణి= పుట్టుక, దానియం దొనర్చిన కర్మలు గలవో, తాని =వానిని, దేవస్య= శ్రీహరియొక్క, మాయయా=ఇచ్ఛచేత నేర్పడిన, బంధం=తన సంసారమును, స్మరతే=స్మరించు కొనును.

6. మాతుః=తల్లి యొక్క, జగ్ధాన్న పాన్యాద్యైః=భక్షింపఁబడినట్టి అన్నపానాదుల రసముచేత, ఏధద్ధాతుః= పుష్టిచెందిన ధాతువులతో కూడిన, సః జంతుః=ఆ ప్రాణి, జంతు సంభవే=క్రిమి మొదలైన జంతువుల ఉత్పత్తి స్థానమందును, విణ్మూత్రయోః గర్తే=మల మూత్రములకు స్థానమైనట్టియు, అసమ్మతే=అసమ్మతమైన స్థానమందు, శేతే=పండుకొని యుండును.

తాత్పర్యము : తల్లి భక్షించెడు అన్నపానాదుల యొక్క వ్యాప్తి నిమిత్తముగా ఈ గర్భగతమైన శరీరమందు మాంసాది సప్తధాతువులు అభివృద్ధిని ప్రాపించును. క్రిమి కీటాదులకు ఉద్భవ స్థానమును, మలమూత్రాదులైన అశుద్ధవస్తువులు చేరియున్నదియు, వసించుట కసమ్మతియు, అశుచియు అయినస్థానమందు ఈ శరీరధారి శయనించును. ఆహారమందు వాసస్థానమును రెండుకూడ ఆ జీవునకు ఇష్టము లేనివిగానే ఉండును.

7. తత్రత్యైః=అచ్చోట వసించు చున్నట్టియు,క్షుధితైః=ఆకలిచే కూడియున్నవియు నైన, కృమిభిః=పురుగులచేత, కృతసర్వాంగః=కొఱకఁబడి గాయములు చేయఁబడిన శరీరము గలవాఁడును. సౌకుమార్యాత్=మార్దవము నిమిత్తముగా, ఉరుక్లేశం=ఎక్కువ దుఃఖముచేత కూడినవాఁడై, ప్రతిక్షణం=క్షణ క్షణమును, మూర్ఛాం=మూర్ఛను, ఆప్నోతి=పొందును.

తాత్పర్యము: మలమూత్రములకు తావైన ఆ చోటియందు శరీరధారి ఉండునంటిని. అచ్చటనే పురుగులు గూడ నుండును. వానికాకలి. దానితో

ఈ జీవి యొక్క శరీరము నవి మాటి మాటికిని కొరకుచుండును. దానిచేత కలుగు నొప్పి. ఈ క్లేశములు సహింపలేక శరీరధారియైన జీవుఁడు మాటి మాటికిని మూర్ఛనందు చుండును.

8. మాతృభుక్తైఃతల్లిచేత భుజింపఁబడినట్టి, కటుతీక్ష్ణోష్ణ లవణక్షా ద్యాదిరాఃచేదు, కారము, ఉష్ణము, ఉప్పు, రూక్షత, పులుపు మొదలైన రసముల యొక్కయు, ఉల్బణైఃఅసహ్యములైన ఇతర పదార్థముల చేతను, ఉపస్పృష్టఃస్పృశింపఁబడినవాఁడై, సర్వాంగో త్థితవేదనఃశరీరమందంతయు ఉద్భవించిన వేదనతో కూడిన వాఁడయ్యె.

తాత్పర్యము : కొన్నిరూక్షములైన పదార్థములు. కొన్ని ఉప్పు కొన్నిపులుసు. ఈ షడ్రుచులతో నేర్పడిన యవాంతరము లైన రుచులు. ఇట్టి పదార్థముల నన్నిటినీ తల్లి తినుచునే ఉండును. వాని రసములు ఆ శిశువు శరీరమునకు తగులు చుండును. ఆ స్పర్శతో ఆ శిశువు శరీరమందు భరింపరాని వేదన ఏర్పడును.

9. ఉల్బేన=జరాయువుచేత, సంవృతఃచుట్టఁబడినవాఁడై, ఆంత్రైఃనరములచేత, బహిఃశరీరముపై భాగమున, ఆవృతఃచుట్టఁబడిన వాఁడై, భుగ్న పృష్ఠశిరో ధరఃసంకుచీకరించుకొనఁబడిన పృష్ఠము, తలకలిగిన వాఁడై, తస్మిన్ కుక్షౌఆ ఉదరమందు, శిరఃశిరస్సును, కృత్వాఉంచికొని, అస్తేవసించును.

తాత్పర్యము: జరాయువు శరీరమంతయు ఆవరించుకొని ఉండును. చాలనందుకు కుక్షి యందలి సూక్ష్మనరములు వాని శరీరము పై భాగమున చుట్టుకొని ఉండును. స్వేచ్ఛగా పరుండుటకు వీలులేదు. వాఁడు తలయును పృష్ఠమును ముడుచుకొని ఇరుకుగా పండుకొనును. కుక్షియందలి కొద్ది ఎడమలో సర్దుకొని ఉండును.

10. పంజరేపంజరమందు, శకుంత ఇవపక్షివలె, స్వాంగచేష్టాయాంచలన వలనాదులందు, అకల్యఃఅసమర్థుఁడై, జన్మశతోద్భవంఅనేక జన్మములందు తనచే కావింపఁబడిన, కర్మకర్మమును, దైవాత్ఈశ్వరేచ్ఛ వలన, లబ్ధస్మృతిఃపొందఁబడినట్టి స్మృతి గలవాఁడై, దీర్ఘం అనుచ్ఛ్వాసంశ్వాసమును విడువక తదేక దీక్షగా, స్మరన్స్మరించు చున్నవాఁడై, కిందామ శర్మఏ సుఖమును, విందతేపొందఁగలఁడు.

తాత్పర్యము: వాని స్థితి చిన్న పంజరమందు బంధింపఁబడిన పక్షివలె ఉండును. ఆ గర్భపాత్రమందువాఁడు కదలలేఁడు, మెదలలేఁడు. ఈ స్థితిలో వానికి పూర్వజన్మలందు తానొనర్చిన అనేక రీతుల కర్మముల జ్ఞాపకమునకు వచ్చుచుండును. ఇవి అన్నియు ఇట్టికర్మములుం చేతనే గర్భవాసమేర్పడునని ఈశ్వరుఁడు తెచ్చి నిలిపినవాఁడు. తదే కాగ్రముగా వాని నన్నిటిని చూచును. ఆసానమందు వాని కూపిరాడుటకు కూడ సరిగాఁ లేదు. ఈ స్థితిలో జీవుఁడేమి సుఖము ననుభవించును. కనుక గర్భవాసము మహాఘోర మైనది.

11. సప్తమాన్మా సాత్ ఆరభ=ఏడవనెల మొదలుకొని, లబ్ధ బోధః అపి=లభించిన బోధతో కూడిన వాడైనను, విష్ఠాభూః=మలమునందు జన్మించినట్టి, సోదరః ఇవ=ఉదరముచేత కూడుకొన్న వానివలె, సూచి వాతైః=ప్రసూతి వాయువులచేత, అతివేపితః=చలింప చేయబడిన వాడై, నఏకత్ర ఆస్తే=ఒకచోట నిలుకడగా నుండడు.

తాత్పర్యము : ఏడవ నెలకు వానికి సంపూర్ణ బోధమేర్పడును. బోధము లేకున్న నితిలో ఈ కష్టములు అర్థమయ్యెడివి కావు. కాని ఈశ్వరేచ్ఛ ఆ రీతిగా లేదు. ఏడవనెల మొదలుకొని వానికి జ్ఞానమేర్పడును. ఈ సంకటాను భవమునకు కారణమైన అనేక జన్మకర్మలన్నియు జ్ఞాపకమునకు వచ్చును. వానికి ఫలముగా నీ శిక్ష, ఇచ్చటనుండి విడివడుటకు వానికి శక్తిలేదు. ఆ ఉదరమందే వాడు మలమందు జన్మించిన క్రిమివలె సూతికావాతముచేత చలింప చేయబడిన వాడై అటునిటు కదలాడు చుండును. ఒక స్థానమం దుండుటకు వీలులేదు. మలమందు క్రిమి చలించుట వలె వాడుకూడ నాగర్భపాత్రమందు చలించు చుండును.

12. నాధమానః=ఎక్కువగా తపించు చున్నవాడును, ఋషిః=దేహ మందు ఆత్మభావము కలవాడును, భీతః=భయపడిన వాడును, సప్తవధిః=ఏడు పొరలచేత బంధింపబడిన వాడును, కృతాంజలిః=అంజలి బంధముతో కూడినవాడునై, యేన=ఏ పరమాత్ముని చేత, ఉదరే=గర్భమందు, అర్పితః =ప్రవేశింప చేయబడెనో, తం=ఆ ఈశ్వరుని గూర్చి, విక్లబయా=గద్గదమైనట్టి, వాచా=వాక్కుచేత, సంస్తౌతి=స్తోత్ర మొనర్చును.

తాత్పర్యము : జీవి ఈ గర్భకుహర మందున్న వాడై విపరీతముగా తపించును. ఈ శరీరమందు నే ననెడు భావము జనించును. మాంసాదులైన ఏడుధాతువుల చేత బంధింపబడుటతో విపరీతమైన భయము జనించును. తన్ను ఈ గర్భ పాత్రయందు ప్రవేశింపజేసి ఈ విధముగా శిక్షించుచున్న పరమేశ్వరుని యొక్క కారుణ్యమునకై అంజలి బంధముతో గద్గదమైన వాక్కుతో ఇట్లు స్తుతించును.

13. ఉపపన్నం=శరణమును ప్రాపించినట్టి, జగత్=లోకమును, అవితుం= రక్షించుటకొఱకై, ఇచ్ఛయా=స్వీకరింపబడిన నానావిధములైన శరీరములతో కూడిన, తస్య=ఆ సర్వేశ్వరుని యొక్క , భువి=భూమియందు, చలత్=చలించు చున్నట్టి, చరణార విందం=అరవిందమున పోలియున్న చరణమును, సః అహం=ఆ నేను, శరణం వ్రజామి=శరణుజొచ్చెదను. మే=నాకు, అకుతో భయం=సమస్త భయమును నశింపచేయునట్టియు, అసతః=అసత్తుగా నున్న, మే=నాకు, అనురూపా=సదృశమైన, ఈదృశీగతిః=ఈవిధమైనస్థానము, యేన=ఎవని చేత, అదర్శి=కనిపింప చేసినదో,

తాత్పర్యము : జీవి ఇట్లనుచున్నాడు-నే నసత్కర్మముల నెన్నిటినో అనుష్ఠించితిని. వానికి సదృశమైన ఈ గర్భవాసము నాకు ప్రాప్తించినది.

ఇట్టి గర్భవాసమును ప్రాప్తింపఁజేసిన సర్వేశ్వరుని యొక్క చరణారవిందము నేను శరణుఁజొచ్చుచున్నాను. నా సమస్త భయములను దీర్చి నన్ను రక్షింపఁగలిన కారుణ్యమును, శక్తియు ఆ పాదములకు మాత్రమే కలదు. తన్ను శరణుఁజొచ్చినవారిని రక్షించు ప్రవృత్తికల కరుణతోడ కూడిన మూర్తియైన ఆ భగవంతుఁడు స్వేచ్ఛతో నానావిధములైన స్వరూపములను స్వీకరించి ఈ భూమిపై సంచరించును. జీవానుగ్రహమునకై ఆతఁడు స్వయముగా గర్భవాసాది దుఃఖముల ననుభవించును. అట్టి దయాశాలియైన పరమాత్ముని శ్రీపాదములకు నమస్కారము.

14. భూతేంద్రియాశయ మయీ=భూతములు, ఇంద్రియములు, అంతఃకరణము-ఈ రూపములతో ఉన్నట్టి , మాయాం=ఈశ్వర శక్తిని, అవలంబ్య=ఆశ్రయించి, బధ్ధః ఇవ=బధ్ధునివలె, కర్మభిః=కర్మలచేత, ఆవృతాత్మా=మఱపింపఁజేయఁబడిన ఆత్మతో కూడినట్టి, యః=ఎవ్వఁడు, అత్ర=ఇచ్చట, ఆస్తే=ఉన్నాఁడో, విశుధ్ధం=పరిశుధ్ధుఁడును, అవికారం=వికార రహితుఁడును, అఖండబోధం=పరిపూర్ణ జ్ఞాన స్వరూపుఁడును, ఆతప్యమాన హృదయే=ఎక్కువగా తపించుచున్న హృదయమందు, అవసితం=ప్రకాశించు చున్నవాఁడును అయిన, తం=ఆ ఈశ్వరుని గూర్చి, నమామి=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము : జీవుఁడు ఈశ్వరుఁడు - వీరియందున్న భేదమును సూచించుచునమస్కరించు చున్నాఁడు. తల్లియొక్క ఉదరమందున్న దేహమునాశ్రయించి యున్న జీవస్వరూపి యైన నేను ఎక్కువగా పరితపించుచున్న నాహృదయాంతర్భాగమందు ప్రకాశించుచున్న ఈశ్వరుని గూర్చి నమస్కరించుచున్నాను. పంచభూతములు, ఇంద్రియములు, అంతఃకరణము ఇవి మాయకైన ఉపకరణములు. మాయయే వీని స్వరూపముగా పరిణమించును. వీనియొక్క విలాసముతోనే పుణ్యపాప కర్మలేర్పడు చున్నవి. వాని ఫలముగా సుఖదుఃఖములు కలుగుచుండును. వీనిచేత నాసహజ స్వరూపమును మఱచిన వాఁడనై ఉన్నాను. భగవంతుని యొక్క మాయాసంబంధము చేతను, దానితో నేర్పడెడు దేహసంబంధము చేతను, దాని కేర్పడెడు బాల్య యౌవన వార్ధక్యాది వికారములచేతను, ఆత్మస్వరూపమును మఱచి ఉన్నాఁడను. వాస్తవమునకు నేను పరిశుధ్ధుఁడను. పరి పూర్ణస్వరూపుఁడను. అందుచేత తన యొక్క అంశమైన నన్నుఈ బంధమునుండి తప్పింప శక్తిగల్గిన పరమాత్ముని శ్రీపాదములను గూర్చి నమస్కరించు చున్నాను.

15.యః=ఎవ్వఁడు, పంచభూత రచితే=పంచభూతముల చేత నిర్మింపఁబడినట్టి, శరీరే=దేహమునందు, సితః అపి=వసించుచున్న వాఁడైనను, ఇంద్రియ గుణార్థ చిదాత్మకః=ఇంద్రియములు, గుణములు, శబ్దాది విషయములు, చైతన్యము-ఈస్వరూపములతో కూడిన, అహం=నేను, యథేచ్ఛన్నృ=మఱచిన వాఁడనువలె ఉన్నాను. కాని నచ్ఛన్నృ=మఱచిన వాఁడను కాను. రహితః =వేఱుగా ఒనర్చియున్న, తేన=దానిచేత, అవికుంఠ మహిమానం=మఱచుటకు సాధ్యముకాని మహిమతో కూడియు, ఋషిం=స్వరూపము సాక్షాత్కరించికొనియు,

ప్రకృతి పూరుషయోఃప్రకృతి పురుషుల నుండి, పరం=వేఱుగానున్నట్టి, పుమాంసం=పురుషుని గూర్చి, వందే=నమస్కరించు చున్నాను.

తాత్పర్యము : ఇంద్రియములు, సత్త్వాది గుణములు, శబ్దాది విషయములు, చైతన్యము వీని యొక్క సంఘాతమే దేహము. ఈ శరీరమును నాదియని అభిమానించు చున్న నేను స్వరూప బోధములేని వాడుగా నైనాను. ఈశ్వరుడు పంచభూతాత్మకమైన శరీరమందు స్వేచ్ఛగా నివసించు చున్నాడు. కానీ ఆతని కా శరీరమం దభిమానము లేదు. కనుకనే ఆతడు నిత్యములైన తన జ్ఞాన ఆనందములను మహిమను ఎప్పుడుకూడ వదలుకొనడు-ఆతడు ప్రకృతి పురుషులను తమ తమ వ్యాపారములందు ప్రవర్తింప చేయును. వారు మాత్రము స్వతంత్రులుగా ఉందురు. ఈ ప్రకారముగా నున్న పరమ పురుషుడైన పరమాత్మునకు నేను నమస్కారములను చెల్లించుచున్నాను.

16. యన్మాయయా=ఎవని యొక్క మాయచేత, ఉరుగుణ కర్మ నిబంధనే =గొప్పవైన సత్త్వాది గుణములతో నేర్పడెడు కర్మములనెడు నిబంధనములతో కూడిన, అస్మిన్ సాంసారికే పథి=ఈ సంసారమార్గమందు, చరన్=సంచరించు చున్న వాడును, తదభిశ్రమేణ=దాని యందున్నీ పరిశ్రమచేత, నష్టస్మృతిః =స్వరూపమును మఱచి యున్నట్టి, అయం=వీడు, మహదనుగ్రహం అంతరేణ=గొప్పవాడైన భగవంతుని యొక్క అనుగ్రహముతో తప్ప, కయాయుక్త్యా=ఏ యుక్తిచేత, లోకం=స్వరూప బోధమును, ప్రవృణీత=పొందగల వాడగును.

తాత్పర్యము: జీవుడెందువలన భగవంతుని భజింపవలెను. స్వరూపావ బోధమునకై ప్రయత్నించిన చాలునుకదా! అనెడు శంకను పరిహరించుచు భజనమే శ్రేష్ఠమైనది. కేవల జ్ఞానసంపాదనకై ప్రయత్నించుట వ్యర్థమని చెప్పుచున్నాడు-భగవంతుని శక్తికే మాయయని పేరు. ఆమెచేయు విలాసములే సత్త్వాది గుణములు. వానిచేతనే పుణ్య పాపము లేర్పడును. వీని ననుసరించియే సుఖదుఃఖములు. ఈ సుఖదుఃఖానుభూతి కొఱకే శరీర ప్రాప్తి. ఒక శరీరమైన వెనుక మఱి యొక్క శరీరము. ఈ శరీరమును గ్రహించుట, వదలుట జరుగుచునే యుండును- ఇదియే సంసారము. దీని యందు తగుల్కొని శరీర సంరక్షణ కుచితములైన మార్గముల నెన్నిటినో మానవుడనుసరించును. స్వస్వరూపమును మఱచిపోవు. వ్యక్తి విషయము నింతే. సమష్టియైన లోకమున నింతే. ఈ సంసార బంధమునుండి తప్పించు కొనుటకు పరమేశ్వరుని కృపయే కారణము, మార్గము. మరి ఏ ఉపాయమును ఆశ్రయించినను ఆత్మావబోధము కలుగదు. అందుచేత ఓ భగవంతుడా! నీ పాదపద్మములను శరణుం జొచ్చుచున్నాను.

17. స్థిరచరేషు=స్థావర జంగమము లందు, అనువర్తితాంశః= అనువర్తించుచున్న అంశతో కూడిన, కతమః దేవః=ఏ పరమాత్ముడు, త్రైకాలికం=త్రికాలములకు సంబంధించియున్న, యత్ ఏతత్ జ్ఞానం=ఏ యీ జ్ఞానమును, అదధాత్=అదాన మొనర్చెనో, తం=వానిని, జీవకర్మపదవీం= జీవుని బంధించిన కర్మ మార్గమును, అనువర్తమానాఃఅనుసరించి

వర్ణించుచున్న, వయం=మేము, తాపత్రయోప శమనాయ=తాపత్రయముల ఉపశమనము కొఱకై, భజేమ=భజించు చున్నాము.

తాత్పర్యము : భగవంతుని యనుగ్రహముచేత మాత్రమే జ్ఞానప్రాప్తి ఏర్పడును. ఈ స్వానుభవమును ప్రదర్శించుచు భగవంతుని స్మరించుచున్నాడు. అతీతములైన జన్మములు ఇప్పుడున్న అవస్థానము ఇఁకపై నేర్పడఁబోయెడు జన్మల అవస్థలు -- వీనికి సంబంధించిన జ్ఞానము నా కిప్పు డేర్పడినది. నిత్య ప్రకాశ స్వరూపుఁడైన భగవంతుని అనుగ్రహము చేతనే ఇప్పుడు వీనికి సంబంధించిన జ్ఞానము నాకుఁగల్గినది. జీవాత్ముఁడైన నన్ను ఈ రీతిగా శరీరమునందు యోజింప చేయుట సుఖదుఃఖాద్యవస్థల ననుభవింప చేయుట ఇది యంతయు భగవంతుని కరుణా విశేషమే. ఈ బంధము నుండి మమ్ము తప్పింప చేయుటకు-జీవాత్మలమైన మేము నిత్యజ్ఞానానందస్వరూపమైన ఆ పరమాత్ముని సర్వాత్మ భావముతో భజించు చున్నాము. స్థావరముల యందును జంగమములందును-సకల శరీరముల యందును అంతర్యామిగా ప్రకాశించుచున్న ఆ దైవమునకే ఈ బంధమునుండి మమ్ము వదలింపఁజేయగల శక్తి కలదు. మేము కర్మబంధమునకు చిక్కిన వార మగుటచే అస్వతంత్రులము. ఆ భగవంతుఁడొక్కఁడే స్వతంత్రుఁడు.

18. అన్యదేహావిపరే=అన్యశరీరమునకు సంబంధించిన ఒక ద్వారమందు, అసృక్ విణ్మూత్ర కూప పతితః=రక్తము, మలము, మూత్రము వీనితో నిండిన సంకుచిత ప్రదేశమందు పడినవాఁడనై, జఠరాగ్నినా=కడుపునందున్న అగ్నిచేత, భృశతప్త దేహః=ఎక్కువగా తపింపఁబడిన దేహము కల వాఁడనై ఉన్నట్టి, దేహీ=జీవుఁడు, ఇతఃవివసితుం=దీనినుండి బయట పడుటకు, ఇచ్ఛన్=కోరుచున్న వాఁడై, స్వమాసాన్=తనకు సంబంధించిన నెలలను, గణయన్=లెక్కించు చున్న వాఁడై, కృపణధీఃకృపణధీఃకృపణధీఃక

అంజలిం వినా=నమస్కారము తప్ప, ప్రతి=ప్రత్యుప కారము, అస్య=ఇతనికి, కః నామ=దేనిని, కుర్యాత్=చేయఁదగును.

తాత్పర్యము : స్వామీ! గర్భమందున్న నాకు నాజన్మ కర్మలగూర్చిన జ్ఞానము-ఆత్మ భావముతో కలిగెడు భావమును కలిగినది. పదిమాసముల వయస్సుకల నాకిట్టి జ్ఞానమును ప్రసాదించుట నీ దయా విశేషమే కదా! దుఃఖితులను సదా రక్షించెడు నీవు నా కిప్పుడేర్పఱచిన ఇంతమాత్ర ప్రవృత్తి చేతనే తృప్తి పడెదవుగాక! గొప్ప జ్ఞానమును నాకేర్పఱచితివి కదా! దీనికి ప్రత్యుపకారము నే నేమి యొనర్పఁగలను. ఒక అంజలి బంధము దప్ప మఱి దేనిని సమర్పింప లేనుకదా! నే నస్వతంత్రుఁడను. స్వామీ ! నన్ను రక్షింపుము.

20. అపరః=అన్యుఁడైన, అయం సప్తవధ్రిః=ఈ జీవుఁడు, స్వదేహే=తన శరీరమందు, ధిషణయా=బుద్ధిశక్తిచేత, శారీరకే=శరీర సంబంధులను, పశ్యతి=చూచును. అహం=నేనందున, యత్ప్రుష్టయా=ఎవనిచేత కల్పింపఁబడిన, ధిషణయా=బుద్ధిచేత, దమ శరీర=దమాదులతో కూడిన వాఁడనై, ఆసాం=ఏర్పడితిని, బహిఃకృ=బయటను, హృదిచ=హృదయ మందును, చైత్యం ఇవ=అహంకారాస్పదమైన ఈ దేహమందు వలెనే, ప్రతీతం=ప్రత్యక్షమై యున్న, పురాణం పురుషం=సనాతనుఁడైన పరమ పురుషుని, పశ్యే=చూడఁగలను.

తాత్పర్యము: మనుష్య దేహ స్థితముగా నున్న, చైతన్యమునకును ఇతర శరీరము లందలి చైతన్యమునకుఁ గల భేదమును సృష్టికరించుచు భగవంతుని స్తుతించున్నాఁడు-సప్తధాతువుల సముదాయమైన పశ్వాదుల శరీరమందు అధివసించెడు జీవాత్మ శరీర సంభవములుగా నున్న సుఖదుఃఖములను మాత్రమే బుద్ధి వృత్తితో నర్థ మొనర్చికొనును. కాని మనుష్య జీవి అట్టివాఁడు కాఁడు. ఈ మనుష్య దేహమందు వసించుట కధికారమేర్పడుటచేత క్షేమ శమదమాదిగుణములచే కూడియుండుటకు సాధ్యమగును. నీ దయా విశేషముచే నేర్పడిన బుద్ధివృత్తితో అహంకారాస్పదమైన ఈ స్థూల శరీరము అంతరాత్ముఁడవై నిరంతరము వెలుచున్న నిన్ను దర్శించునట్టి ఇతర శరీరములందు కూడ నిన్ను దర్శించు భాగ్యమేర్పడినది. ఈ శక్తి మనుష్య శరీరమందున్న జీవాత్మకు మాత్రమే లభించును.

21. విభో!=సర్వ సమర్థుఁడా, బహు దుఃఖవాసం=అనేక దుఃఖములతో కూడిన వాసమును, వసన్నపి=వసించుచున్న వాఁడనైన, అహం=ఆ నేను, గర్భాత్=గర్భము యొక్క, అంధకూపే బహిఃకృ=వివేక శూన్యమైన బయటికి, న నిర్గిమిషే=పోవుట కపేక్షించుట లేదు, యత్ర=ఎచ్చటికి, ఉపయాతం=పొందిన వానిని, దేవమాయా=నీకు సంబంధించిన మాయాశక్తి, మిథ్యామతిః =మిథ్యాభూత శరీరమం దభిమానమును, యదను=దేని వెనువెంటనే, ఏతత్ సంసృతి చక్రం=జనన మరణము లనెడు ఈ సంసార చక్రమును, ఉపసర్పతి=వెంటనంటి నచ్చుచున్నదో,

తాత్పర్యము: దుర్భరమైన గర్భావాసము నుండి బయటికి రావలెనని భగవంతుని జీవుడు ప్రార్థించినాడు. అయినను గర్భవాసము నుండి బయటికి వచ్చినచో ఇప్పుడున్న జ్ఞానము నశించును. దానిచేత మరల సంసార చక్రము తగుల్కొనును. ఈ పరిణామము నాలోచించి భయపడిన జీవుడు మరల భగవంతుని ప్రార్థించు చున్నాడు-భక్తుల సమస్త మనోరథములను సాధించి పెట్టుటకు సమర్థమైన శక్తిగలిన పరమాత్మా! ఈ గర్భకోశము నందు వసించుట మహా దుఃఖకరమైన విషయమే. కానీ ఇచ్చటి నుండి నేను గడ్డకు వచ్చిన, ఇపుడు నాకున్న వివేకము సర్వథా నశించి పోవును. మరల అంధకారమైన బహిర్లోకము. వివేక నాశమునకు భయపడిన నేను ఈ గర్భావాసము నుండి బయట పడవలెనని ఆశించుట లేదు. ఎందుకనగా ఇచ్చటి నుండి నేను బయటికి వచ్చిన వెంటనే నీ యొక్క మోహక శక్తి నన్నాక్రమించును. అపుడు క్షణ భంగురమైన శరీరమందు నే ననెడు భావ మేర్పడును. దానితో పుణ్యపాపాత్మకమైన కర్మానుబంధము కలును. మరల యథాప్రకార మీ జన్మవాసమే సిద్ధించును. జన్మమరణములు నా వెనువెంటనే న న్నంటివచ్చును.

22. తస్మాత్=అందుచేత, భూయఃమరల, అనేక రంధ్రం=అనేక యోనులందు ప్రవేశముతో కూడిన, వ్యసనం=ఈ విధమైన దుఃఖము, మే=నాకు, యథా మాభవిష్యత్=మరల నెట్లేర్పడకుండునో ఆ రీతిగా, సుహృదాఃనిజమైన బంధువైనట్టి, ఆత్మనా ఏవ=నాబుద్ధి యొక్క సహాయముతోనే, ఉపసాదిత విష్ణుపాదఃప్రాపించినట్టి నీయొక్క శ్రీపాదము కలవాడనై, ఆత్మానం=ఆత్మను (అనగా నిన్ను) తమసఃఅంధకారము నుండి, విగత విక్లబఃదుఃఖరహితుడనై, ఆశు=శీఘ్రముగా, ఉద్ధరిష్యే=ఉద్ధరించికొందును.

తాత్పర్యము : ఈ గర్భావాసము నుండి నేను బయటికి వచ్చినచో మరల నాకు ననేక గర్భావాసములు సిద్ధించును. మరల ఆ దుఃఖములు అనుభవించుటకు నా కిష్టములేదు. కనుక నే నిచ్చటనే ఉందును. ఇచ్చటనే ఉండి చలించని మనస్సుతో నీ యందే నిరంతరము వినివేశితమైన బుద్ధిగ లవాడనై పోదును. ఇపుడు బుద్ధి నామాట బుద్ధిగా వినుచున్నది. బయటికి వచ్చినచో దానిపై అదుపు నాకు తప్పిపోవును. అందుచేత ఇచ్చటనే ఉండి దృఢమైన ధ్యానశక్తితో నిన్ను సాక్షాత్కరింప చేసికొందును. అజ్ఞానరూపమగు అంధకారము నుండి విడివడెదను.

23.ఏవం=ఈ రీతిగా, గర్భే = గర్భమందు, కృతమతిఃనిశ్చయించికొన్న బుద్ధిగలవాడై, దశమస్యఃపది మాసములు తీరినవాడై, స్తువన్=పరమాత్మను స్తుతించు చున్నవాడై, ఋషిఃఅధీ తానాగత జ్ఞానములతో కూడిన వాడుగా, భవతి=అగును, సద్యఃఅప్పుడే, సూతిమారుతఃప్రసవ హేతువైన వాయువు, ప్రసూత్యైప్రసవింప జేయుటకై, అవాచీనం=తల క్రిందుగానుండు నట్లుగా, క్షిపతిత్రోసి వేయుచున్నది.

తాత్పర్యము: గర్భము నందలి జీవుడు ఈ ప్రకారము నిశ్చయించు కొన్నవాడై తన్ను బయటికి త్రోయవద్దని పరమాత్మను ప్రార్థించుచున్నాడు-

వాఁడప్పుడు ఋషి. వానికి త్రికాల జ్ఞానముండును. గర్భావాసమందు పదినెలలు గడచినవి. ఇఁక పై నుండుటకు వీలులేదు. సూతికావాతము వానిని పైకిఁ ద్రోయుచుండును. వాఁడు శిరస్సు క్రిందికి వైచి గర్భకోశము నుండి బయటికి వచ్చును.

24. తేన=ఆ వాయువుచేత, అవాక్శిరః కృత్వా=తలక్రిందికి వేసికొన్నవాఁడై, (అనఁగా తల్లక్రిందుగా ఉన్నవాఁడై) సహసా=హఠాత్తుగా, అపసృష్టః=బయటికి ద్రోయఁబడినవాఁడై, ఆతురః=దుఃఖముతో కూడినవాఁడై, నిరుచ్ఛ్వాసః=కొంతసేపు ఊపిరాడని వాఁడై, హతస్మృతిః=గర్భావాస మందున్న తెకాలిక స్మృతి నశించిన వాఁడై, కృచ్ఛ్రేణ=అతి కష్టముతో, వినిష్క్రామతిఁ=గడ్డకు వచ్చును.

తాత్పర్యము: ఆ సూతికావాతము శిశువును వానిస్థానము నుండి హఠాత్తుగా చలింపచేయును. అపుడు వానిశిరస్సు తలక్రిందుగా నగును. ఆ జీవుఁడేమి చేయుటకు సాధ్యము కానివాఁడై ఉండును. ఊపిరి ఆడుటలేదు. మోహము కవిసికొనుచున్నది. గర్భావాస మందున్న తనకున్న తెకాలిక జ్ఞానము లేశమును లేదు. అతికష్టముతో వాఁడు గర్భమునుండి బయటికి వచ్చును. ఈ జన్మదుఃఖము మహాకష్టమైనది.

25. అసృగ్విగ్దఃరక్త దిగ్ధాంగుఁడై, భువి=భూమి యందు, పతితఃపడినవాఁడై, విష్టాభోరివ=క్రిమియో అనునట్లుగా, చేష్టతే=అటునిటు పొరలును, జ్ఞానం=గర్భావాసమందున్న జ్ఞానము, గతేపోయినది కాఁగా, విపరీతాం గతిం=విపరీతమైన అవస్థను, గతఃప్రాపింప చేయఁబడినవాఁడై, రోరూయతే =గట్టిగా నేడ్చుచున్నాఁడు.

తాత్పర్యము : తల్లి యొక్క గర్భావాసము నుండి రక్తము బయటికి వచ్చును. దానితో ఆ నేల కళంకితమైనది. ఆ జీవుడా చోటిలో పడును. పడినవాఁడు పురుగువలె కొట్టుకొనుచుండును. చేతులు కాళ్ళు కదిలించును. గర్భావాసమందున్న ఆత్మజ్ఞానము నశించినది. అంధకారతుల్యమైన అజ్ఞానమున ప్రవేశించిన వాఁడై దిక్కు తోచక గట్టిగా నేడ్చును.

26. పరచ్ఛందం=ఇతరుల అభిప్రాయమును, నవిదుషాంతెలిసికొన లేనట్టి, జనేన=జనులచేత, పుష్యమాణఃపోషింపఁబడుచున్న, సఃఆ శిశువు, అనభీప్రేతం=ఇష్టము లేని పరిస్థితిని, ఆపన్నఃపొందింప చేయఁబడినవాఁడై, ప్రత్యాఖ్యాతుం=నిరాకరించుటకు, అనీశ్వరఃశక్తి లేనివాఁడై (ఉండును)

తాత్పర్యము : అ శిశువున కేమి కావలెనో ఇతరు లెఱుఁగరు. వాని మనస్సునందున్న అభిప్రాయ మేమో వారికి తెలియదు. అందుచేత వాని మనస్సులో నొక్కటి ఉన్నచో వీరు మఱియొక ఉపచారము నొనరింతురు. వానితో వానికి కల్గును. బాధ అయినను వారి ఉపచారములను తిరస్కరించు శక్తి వానికి లేదు.

27. జంతుఃజంతువు వంటి వాఁడైన ఆ శిశువు, స్వేదజదూషితేక్రిమికీటాదులచే బాధింపఁబడినదై, అశుచి పర్యంకేఅశుద్ధమైన పొత్తిగుడ్డల యందు, శాయితఃపండుకొనఁ బెట్టఁబడినవాఁడై, అంగానాంఅవయవముల

యొక్క, కండూయనే=బరికికొనుట మొదలగు వానియందు, ఆసనోత్థాన చేష్టనే=కూర్చుండుట, లేచుట మొదలగు వ్యవహారములందు, నేశః=అసమర్థుడై, రోరూయ్యతే=విలపించుచున్నాడు.

తాత్పర్యము : వాడప్పుడు జంతుసమానుడు. ఆ పొత్తి గుడ్డలలో దుర్వాసన. పేలు మొదలైనవి పీడించు చుండును. వానితో శరీరమునకు బాధ. మలమూత్రములతో అపరిశుద్ధమైన పొత్తిగుడ్డల పడుక. కూర్చుండుటకు శక్తిలేదు. నిలుచుటకు శక్తిలేదు. చలించుటకు శక్తిలేదు. తన వేదనను చెప్పుటకు నోరులేదు.

28. అమత్వచం=కోమలమైన శరీరముతో కూడియు, రుదతం=ఏడ్చు చున్నట్టియు, విగతజ్ఞానం=నశించిన జ్ఞానముతో కూడినవాడైన ఆ శిశువును, క్రిమికం=స్థూలమైన క్రిమిని, క్రిమయః యథా=సూక్ష్ములైన పురుగులవలె, తుదంతి=బాధించు చుండును.

తాత్పర్యము:వాని శరీరము చాలమృదువైనది. చిన్న చిన్న పురుగులు మొదలైనవి వానిని చుట్టుకొని, పెదపురుగులు చిన్న పురుగులవలె బాధించును. అవేదన నంతయు వాడు సహింపవలసినదే. కానీ ఆ బాధ పోగొట్టుకొనుటకు వాడసమర్థుడు. తెలియజేయుటకు అసమర్థుడు. ఊరకే రోదించును.

29,30. ఇత్థేవం=ఈ రీతిగా, శైశవం=శిశుత్వమునకు సంబంధించిన, దుఃఖం=దుఃఖమును, పౌగండం ఏవ=యుక్తవయస్సునకు ముందున్న శిశుత్వ అంతిమ భాగమైన పౌగండ మనెడు వయస్సును, భుక్త్వా=అనుభవించి, అజ్ఞానాత్=అజ్ఞానము వలన, సహదేహేన=దేహముతో కూడిన వాడై, శుచా =దుఃఖముచేత, అర్పితః=చుట్టుకొనబడిన వాడై, ఆత్మనః=తన యొక్క, వర్ధమానేన మన్యునా=దిన దినమునకు పెరుగుచున్న కోపముచేత, అంతాయ= వానియొక్క స్వరూప నాశనమునకై, కామి=కామముతో కూడినవాడై, కామిషు= తన వలెనే కోర్కెలతో బాధపడుచున్న వారియందు, విగ్రహం=కలహమును, కరోతి=చేయుచున్నాడు.

తాత్పర్యము : అయిదేండ్ల వరకును శైశవముండును. ఆపై పదునారు వర్షముల వరకు పౌగండ మందురు. దాని తర్వాత యౌవనము. ముందు చెప్పబడినట్లు వాడు శైశవ మందును, పౌగండమందును అనేక దుఃఖము లనుభవించును. తరువాత యౌవనమున ప్రవేశించును. దేహాభిమానము విపరీతముగా పెరిగినది. అజ్ఞానముతో నది దినదినము వర్ధిల్లుటయే గాని తరుగుట లేదు. యౌవనమందు విపరీతమైన వ్యామోహము. తన సుఖమున కనేక సాధనములు కావలెను. అవి లభింపని దానితో విపరీతముగా క్రోధము కల్గును. తనకు కావలసిన సుఖసాధనములనే ఇతరులు కూడ కోరికొని వానికొఱకై ప్రయత్నింతురు. వారిపై విడాగ్రహించును. వారి ప్రయత్నములను వ్యర్థము చేయజూచును. దానితో నేర్పడెడు కలహము. ఈ కలహములన్నియు వీని ఆత్మనాశనమున కేర్పడినవి.

31. పచభిః భూతైః=పృథివ్యాది పంచభూతములచేత, ఆరబ్ధేదేహే= నిర్మితమైన దేహమందు, అహం మమ ఇతి=నేను నాదని, అసద్గ్రహః=

అసత్యమైన అభిమానముతో కూడిన, కుమతిః=కుత్సితమైన బుద్ధిగలవాఁడై, అబుధఃఅజ్ఞానియైన, దేహీ=జీవుఁడు, మతింకరోతి=స్థిరత్వ బుద్ధి నేర్పఱచు చున్నాఁడు.

తాత్పర్యము: పంచ భూతాత్మకమైనది శరీరము. దానియందు వీఁడు అహంబుద్ధి పెంచుకొనును. అహం బుద్ధితో పాటు 'మమ' అనునది పెంచుకొనును. నావారను గుంపు చేరును. ఈ రీతిగా మానవుఁడు నిత్యమైన జ్ఞానము పోఁగొట్టుకొని కుమతిని పొందును. గర్భావాసమందు ఋషియైన జీవుఁడు బయటికి వచ్చిన తోడనే అజ్ఞానులలో ప్రముఖుఁడగుచున్నాఁడు.

32. అవిద్యా కర్మబంధనఃఅజ్ఞాన నిమిత్తముగా నేర్పడిన కర్మబంధముతో కూడిన, యఃఎవరు, క్లేశం=దుఃఖమును, దదత్=ఇచ్చుచున్నదై తదర్థం=ఆ దేహము కొఱకై, కర్మకురుతే=కార్యమొనర్చు చున్నాఁడో, యద్భర్తాఃఏ కర్మబంధముచేత కట్టివేయఁబడిన వాఁడెవ్వఁడో, సంసృతిం=సంసారమును, అనుయాతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము : ఈ శరీరము అనేక బాధలతో కూడి, జన్మము, మరణము, జర, వ్యాధి ఈ రీతులుగా అనేక దుఃఖములు దీని నాశ్రయించి ఉండును. కాని జీవున కింకను దీనిని పోషించుకొనుట యందే. విపరీతమైన ఆకాంక్ష. దాని కొఱకై అజ్ఞానముతో పుణ్య పాపకార్యము లొనర్చును, మరల యథా ప్రకారముగా బంధమున చిక్కుచున్నాఁడు. ముక్తుఁడు కావలసిన జీవి సంసారమునే అభివృద్ధి చేయుచున్నాఁడు. జన్మ మరణములకు కారణమైన ఈ శరీరమున బంధ మనెడు అభిమానముతో నానా యోనుల జన్మము సృష్టించు కొనుచున్నాఁడు. దానితో అనేక దుఃఖములకు ప్రాతిపదిక వేసికొను చున్నాఁడు.

33.పునఃమరల, శిశ్నోదర కృతోద్యమైఃగ్రామ్య సుఖములు, కడుపు మొదలైన వానికొఱకు ప్రయత్నము లొనర్చెడు, అసద్భిఃఅసత్పురుషుల యొక్క, పథిమార్గమందు, ఆసితస్సన్ఉన్న వాఁడై, యది రమతేగ్రామ్య సుఖములందు రమించు చున్నచో, పూర్వవత్మునుపటి వలెనే, తమఃనరకమును, విశతిపొందుచున్నాఁడు.

తాత్పర్యము : సామాన్యులది జంతు సమానమైన ప్రవృత్తి. వారెపుడును గ్రామ్య సుఖములందును, ఉదర పోషణమునందును నిమగ్నులై దాని కావశ్యకములైన ప్రయత్నము లొనర్తురు. అటి అసజ్జనుల సంసర్గ మొనర్చి వారి సంప్రదాయమునే అనుసరించుచు సంతోషించినచో మరల ఈ జీవాత్మకు యాతనా శరీరముతో నరకమందు ప్రవేశించి కఠిన దుఃఖముల ననుభవించుట తప్పదు.

34,35,36. సత్యం=పరమార్థ భాషణమును, శౌచం=శుద్ధి, దయా=కారుణ్యము, మౌనం=వాక్కును వశములో నుంచుకొనుట, బుద్ధిఃవిచారశక్తి, శ్రీఃఐశ్వర్యము, హ్రీఃసిగ్గు, యశఃకీర్తి, క్షమా=సహనశక్తి, శమఃఅంతరింద్రియ

నిగ్రహము, దమః=బాహ్యేంద్రియ నిగ్రహము, భగః=భగవద్భక్తి, ఇతి=అనెడు ఈ గుణములు, యత్సంగాత్=ఎవరి యొక్క సహవాసముతో, సంక్షయం యాతి=నశించునో, పుంసః=పురుషునకు, యోషిత్సంగాత్యథా=స్త్రీ సంగ మెటు వంటిదో, తథా=ఆ విధముగా, బంధః మోహశ్చ=బంధమోహములు, అస్యభవే=ఎవని కుండునో, తత్సంగి సంగతః=వానితో చేరునటి వానితో చేరుటయు, యథా=ఎట్టిదో, తథా=అట్లే, అన్య ప్రసంగతః=ఇతరులతో చేరుటతో, నభవేత్=ఏర్పడదు. అశాంతేషు=శాంతిలేని వారును, మూఢేషు=మూర్ఖులును, ఖండి తాత్మసు=ఆత్మజ్ఞానములేని వారును, అసాధుషు=అ సత్పురుషులును అనెడు, తేషు=వీరితో, సంగం=చెలిమిని, న కుర్యాత్=చేయరాదు.

తాత్పర్యము: ధర్మ భూషణ రూపమే సత్యము. బాహ్యాభ్యంతరము లైన ఇంద్రియముల నదుపులో పెట్టుకొనుట శౌచము; అన్య దుఃఖములను సహింకుండుట దయ. అనవసరముగా మాటాడ కుండుట మౌనము. స్వీకార్యము లేవో, స్వీకరింపదగిన వేవో వేర్పఱచుకొనెడు విచార శక్తి బుద్ధి. కుత్సిత ప్రవృత్తులను గూర్చిన లజ్జ, ధనము, శోభ-ఈ రూపములతో సాక్షాత్కరించు చున్నటు వంటి సంపదయీను సత్కీర్తి, ఇతరుల అపరాధములను క్షమించు స్వభావమైన ఓర్పు, మనోనిగ్రహము, ఇంద్రియనిగ్రహము, సౌభాగ్యాదికములైన ధర్మములు. ఈ సర్వగుణములును కామక్రోధములతో క్రుంగితములైన మనస్సులు గలవారును, విషయ సుఖములకై నిరంతరము ప్రయత్నించెడు వారును-అయిన మనుష్యులతో చేరిన నశించి పోవును. స్త్రీల నర్మసంభాషణాదులతో ఆకర్షింపఁబడిన చిత్త వృత్తితో ధర్మాదులు నశించి పోవునట్లు, అసత్పురుషుల సహవాసముతో ధర్మము నశించును. అందుచే వారితో చేర తగదు. జీవాత్మకు ఇతరుల విషయములతోడి సంగము మోహము నేర్పఱచును. బంధము నేర్పఱచును. కాని స్త్రీ జనసంగుఁడగువానితో సంబంధ మేర్పఱచు కొన్నపుడు అవివేకమును బంధమును అధికమగును. ఇంతటి అపకారము మరేదియు చేయలేదు. కనుక విషయములు స్త్రీలు- వీరితోడి సంగతి ఏ మాత్రమును చేయకూడనివి.

37. ప్రజాపతిః=బ్రహ్మదేవుఁడు, స్వాందుహితరం=తనయొక్క తనూజను, దృష్ట్వా=చూచి,తద్రూప ధర్షితః=ఆమె శరీర సౌందర్యముచే మోహింపఁ బడినవాఁడై, రోహిత్ భూతాం=ఆడుజింకగా పరిణమించిన, తాం=ఆమెను, సః=ఆ బ్రహ్మదేవుఁడు, ఋశ్యరూపీ=మగజింక రూపమును ధరించినవాఁడై, గతత్రపఃసిగ్గును వదలినవాఁడై, అన్వధావత్=వెంటపడి పరువెత్తెను.

తాత్పర్యము: స్త్రీ సంగముతో నేర్పడెడు మోహము అణచికొనుట అసామాన్యమైన పని. బ్రహ్మదేవుఁడే తన కొమార్తె అయిన సరస్వతీదేవిని చూచి మోహితుఁడై నాఁడు. అపు డామె ఆఁడుజింక రూపము ధరించి పరువెత్త నారంభించెను. బ్రహ్మదేవుఁడు తాను మగజింకయై వెంటపడినాఁడు తానా పని యెనర్చుచున్నందుకు సిగ్గుచెందలేదు.

38. తత్సృష్ట సృష్టేషు=అతనిచేత సృష్టింపఁబడినవారితో సృష్టింపఁబడినవారి యందు, నారాయణం ఋషింఋతే=నారాయణమూర్తి తప్ప, కః పుమాన్=ఏ

మనుష్యుడు, ఇహ=ఈ లోకమందు, యోషిన్మయ్యా మాయయా=స్త్రీ రూపమైన మాయచేత, నష్టధీః=బుద్ధిశక్తి లోపించిన వాడు కాడు.

తాత్పర్యము : సత్య మిట్లుండగా బ్రహ్మదేవుని చేత సృష్టింపబడిన మరీచ్యాది ప్రజాపతుల యొక్క, సృష్టివర్ధనకు లోబడినట్టి ఏ పురుషుల బుద్ధిశక్తి స్త్రీరూపమైన మాయనుండి శోధింపబడదు? మాయను జయించినట్టి మహాపురుషుడు శ్రీమన్నారాయణమూర్తి ఒక్కడే.

39. స్త్రీమయ్యాః=స్త్రీరూపమున్న, మేమాయాయాః=నామాయ యొక్క, బలం=శక్తిని, పశ్య=చూడుము. యా=ఏ ఈమె, దిశాంజయినః=దిక్కులను, జయించిన మహా పరాక్రమవంతులను, భ్రూవిజృంభేణ కేవలం=కనుబొమ్మల యొక్క విజృంభణ మాత్రము చేతనే, పదాక్రాంతాన్ కరోతి=పాదములకు నమస్కరించిన వారుగా చేయుచున్నది.

తాత్పర్యము: నా మాయాశక్తి ఎట్టిదో చూడుము. దిగంతములను జయించిన మహాపురుషు లెందరో కలరు. కాని వారి పరాక్రమ మేమగు చున్నది? స్త్రీ యొక్క కనుబొమ్మల చలనమునకు దాస్య మొనర్చుచున్నది.

40.మత్సేవయా=సజ్జనుల యొక్క సంసర్గము చేత, ప్రతిలబ్ధాత్మా లాభః=సంపాదింపబడిన ఆత్మలాభముతో కూడిన వాడును, యోగస్య=యోగము యొక్క, పరం పారం=అవతలిగట్టును, ఆరురుక్షుః=పొందవలెనని ఇచ్ఛకలవాడు, ప్రమదాసు=స్త్రీలయందు, జాతు=ఎప్పటికిని, సంగం=సహవాసమును, న కుర్యాత్=చేయరాదు. యాః=ఎవరిని, అస్య=వీనియొక్క, నిరయద్వారం=నరక ద్వారముగా, వదంతి=పెద్దలందరును చెప్పుచున్నారో,

తాత్పర్యము: అందుచేత భాగ్యవశాత్తు సత్సంగము సిద్ధించినవాడగును. యోగవిద్య యందు కృతార్థుడు కావలెనని కోరుచున్న వాడు స్త్రీలతోడ సహవాస మొనర్పరాదు. స్త్రీ సాధకునకు తెరువబడిన నరక ద్వారమని పెద్ద లనుచున్నారు.

41. దేవ నిర్మితా=ఈశ్వరునిచే నిర్మింపబడినట్టి, యామాయా= ఏమాయ, యోషిత్= స్త్రీరూపమో, శనైః=మెల్లగా, ఉపయాతి=సమీపించునో, తాం=ఆమెను, తృణైః=గడ్డిచేత, ఆవృతం=మూసిపెట్టబడినట్టి, కూపంఇవ=బావిని వలె, ఆత్మనః =తనకు, మృత్యుం=నాశస్థానమునుగా, ఈక్షేత=చూడబడును.

తాత్పర్యము: ఈశ్వరుడు నిర్మించిన మాయారూపమే స్త్రీ. ఆమె అనేక రీతులుగా సమీపించును. పరిచర్యాది రూపముగా దగరించును. ఆమె విషయమున జాగ్రత్తగా నుండవలెను. గడ్డిచేత కప్పబడిన కూపమును వలె చూడవలెను. ఏ మాత్ర మామెకు లొంగినను తన వినాశమును సాధకుడు తెచ్చికొన్న ట్లే.

42.43. మోహాత్=పరమార్థజ్ఞానము లేనిదాని వలన, బుధభాయతీం=పురుష రూపమందున్నట్టి, యాం మాయాం=నాయొక్క ఏ మాయను, విత్తాపత్యగృహ ప్రదం=ధనము, సంతానము, గృహము మొదలైన వానిని సంపాదించి పెట్టునట్టి, పతిం మన్యతే=భర్తయని భావించుచున్నది, దైవోపసాదితం=ప్రారబ్ధము

బలముచేత సమీపమును పొందింపఁబడినదియు, విత్తాపత్యగృహాత్మకం=ధనము, సంతానము, గృహము అనెడు రూపముతోనున్న, తాం=మాయను, మృగయో =జింకకు, గాయనం యథా=గానమువలె, ఆత్మనః=ఆత్మయొక్క, మృత్యుం=నాశ స్థానముగా, విజ్ఞానీయాత్=తెలియవలెను. స్త్రీసంగతః=స్త్రీ సంగము నిమిత్తముగా, స్త్రీత్వం=స్త్రీభావమును, ప్రాప్తః=పొందింపఁబడిన వాఁడైనాఁడు.

తాత్పర్యము : మోక్షమును ఆకాంక్షించు మనుష్యుఁడు స్త్రీ ప్రసక్తిని మానుకొనవలెనని చెప్పఁబడినది. అట్లే మోక్షేచ్ఛగల స్త్రీగూడ పురుషప్రసక్తిని మానుకొనవలెనని ఈ రెండు శ్లోకములతో చెప్పుచున్నాఁడు. పురుష స్వరూపముతో నున్నది కూడ మాయయే. వాఁడు మోహము కారణముగా ధనము సంతానము గృహము మొదలైన సుఖసాధనములను సంపాదించెడు భర్తరూపముగా వర్తించుచున్నాఁడు. వాఁడు పురుషుఁడైనను నామాయ యొక్క వికాసమే. అట్టి వానిని స్త్రీ తన యొక్క భర్తయను కొనుచున్నది. వాఁడు ప్రారబ్ధ గుణముగా స్త్రీని చేరును. ఆ చేరుట స్త్రీకి మృత్యువును సంపాదించి పెట్టుటకే. సుఖప్రాప్తిని సంపాదించి పెట్టువాఁడుగా కన్పడుచున్నాఁడు. మృగములను పట్టుకొని బంధించి వానితో జీవించు వేటగాని వంటివాఁడే ఈ పురుషుఁడు కూడ. వాఁడు మృగములను పట్టుటకై గానము ఏర్పాటుచేయును. వానిచేత నాకృష్టమై జింక తనకు నాశమును కలిగించెడు వ్యాధుని స్నేహితుఁడుగా భావించి సమీపించును. దాని పరిణామ మే మగును? అది బంధములో ఇరికికొనును. ఈ స్త్రీగూడ పురుషునిచేత సంసారములోని కీడ్వఁబడుచున్నది. వానిచేత మోహితయై వానిని భర్తగా నెంచుచున్నది. ఇదంతయు మాయా విలాసము. పూర్వ జన్మమందు ఒకానొక పురుషుఁడు స్త్రీకాముకుఁడై జీవించును. దానికి ఫలముగనే వానికి ఈ జన్మమందు స్త్రీరూప మేర్పడినది. పురుషజన్మకూడ అంతే. వాఁడు పూర్వజన్మమున స్త్రీగానుండి అధికమైన కామము నపేక్షించిన దాని ఫలమే పురుష జన్మ. ఈ రీతిగా సంసారపరతి కవకాశమే లేకపోవును. మాటి మాటికినీ జనన మరణము లేర్పడుచుండును. వానితో పాటు తత్ఫలములైన దుఃఖములు. అందుచేత స్త్రీపురుషులు పరస్పరము సుఖకారకులు కాదు; దుఃఖకారకులే.

44. జీవభూతేన=జీవోపాధియైన, దేహేన=శరీరముతోఁ గూడ, పుమాన్= జీవుఁడు, లోకాత్లోకం=ఒకలోకమునుండి మఱియొక లోకమునకు, అనువ్రజన్= పోవుచున్న వాఁడై, భుంజానః=సుఖ దుఃఖములను భవించుచున్నవాఁడై, అవిరతం=నిరంతరము, కర్మాణి కరోత్యేవ=కర్మములను చేయుచునే ఉండును.

తాత్పర్యము : ఈ స్థూలశరీరము నశించినచో జీవున కుపాధిగానున్న లింగశరీరము నశించుట లేదు. ఆత్మ జ్ఞానముతో మాత్రమే అది నశించును. సుకృత దుష్కృతముల ఫలభూతములైన సుఖదుఃఖముల ననుభవించువాఁడై జీవుఁడు తన కుపాధియైన లింగశరీరముతో ఈ లోకము నుండి పరలోకమునకు పోవుటయు, అచ్చటినుండి శరీరాంతరమును స్వీకరించి మరల నీ లోకమున కేతెంచుటయు జరుగున్నది. ఈ గమనాగమనములకు కారణము కర్మములే. ఇదే జీవునకు బంధావస్థ,

45. భూతేంద్రియ మనోమయః=సూక్ష్మభూతములు, సూక్ష్మేంద్రియములు మనస్సునెడు రూపముతోనున్న, జీవః=జీవుడు, జీవః దేహాః=జీవోపాధియైన దేహమును, అస్య=జీవునకు, అనుగః=తోడుగా వచ్చుచున్నాఁడు. తన్నిరోధః =దాని యొక్క వినాశము, అస్య=జీవుని యొక్క, మరణం=నాశనమే, అవిర్భావః తు=మరల నేర్పడుట, సంభవః=జననము.

తాత్పర్యము : నిత్యుఁడైన జీవుని జనన మరణావస్థలను చెప్పుచున్నాఁడు. సూక్ష్మభూతములు, సూక్ష్మేంద్రియములు, మనస్సు వీనిఁ సమ్మేళనమే మనస్సు. ఇది జీవునిఁ వెంటనే ఉండును. దీనియొక్క నివాసస్థానమే స్థూలభూత, స్థూలేంద్రియ సంగమైన స్థూలేంద్రియము, స్థూలదేహము నశించినపుడు లింగశరీరము కార్యక్షమముకాదు. జీవునకు కర్మము లొనర్చుట కు పాధియైన లింగదేహము దాని కాస్పదమైన స్థూలదేహము రెండును కూడ ఉండవలెను. కాలక్రమమున స్థూలదేహము నశించినపుడు లింగదేహమునకు ప్రవృత్తి ఉండదు. అది తటస్థముగాఁ ఉండును. దానినే మరణమందురు. లింగస్థూల శరీరముల సంయోగమే జన్మ. లింగదేహమునుండి విడివడుటయే ముక్తి. జీవుఁడు నిత్యుఁడు. లింగదేహము జీవోపాధి. అది స్థూలదేహముతో చేరినపుడు కర్మము లొనర్చుటకు శక్తికలది అగును. అది జన్మ. స్థూలదేహ వినాశము మరణము. స్వరూపజ్ఞాన మేర్పడినపుడు అనాదియైన లింగశరీరము నశించును. అదియే ముక్తి.

46. ద్రవ్యోపలబ్ధిస్థానస్య= ద్రవ్యము యొక్క ప్రాప్తికి స్థానమైనటియు, ద్రవ్యేక్షాయోగ్యతా యథా=ద్రవ్యములను పొందుటకు అయోగ్యత, యథా= ఎట్లు ఏర్పడునో, తత్=అది, పంచత్వం=నాశము, అహం మానాత్=అభిమాన నిమిత్తముగా, యథా ద్రవ్యదర్శనం=ద్రవ్యముల దర్శనమెప్పుడేర్పడునో, తదా ఉత్పత్తిః=అప్పుడే ఉద్భవము.

తాత్పర్యము : జీవాత్మకు పంచభూత వికారములైన లౌకిక పదార్థములను చూచుట, అనుభవించుట, సుఖము సిద్ధించుట కుపకరించునటి స్థానమైన స్థూల శరీరము;దానికి యోగ్యత లేకుండుట-ఇదే స్థూలశరీరమ్ యొక్క వినాశము. దీనినే జీవనాశముగా సామాన్యులు భావింతురు. ఆ శరీరముయొక్క ఉద్భవము, తన్నిమిత్తముగా నేర్పడెడు ద్రవ్యదర్శనము జీవాత్మఁ కున్నపుడు అది జీవుని యొక్క ఉద్భవ మందురు. స్థూలశరీరము యొక్క ఉత్పత్తి విపత్తులు జీవుని ఉత్పత్తి విపత్తులుగా భావించి జీవుఁడు మోహమునకు లోఁబడును. ఈ మోహమే బంధ కారణము. దీనినే దేహాభిమానమందురు. శరీరము తనకంటె భిన్నము. తానందున్న సాక్షిస్వరూపుఁడు. ఇదియే శుద్ధమైన బోధము. ఈ జ్ఞాన మేర్పడినపుడు జీవాత్మ ముక్తుఁడగును.

47.అక్ష్ణోః=కన్నులకు, యదా=ఎప్పుడు, ద్రవ్యావయవ దర్శనాయోగ్యతా =ద్రవ్యము యొక్క అవయవములను దర్శించెడు యోగ్యత ఏర్పడదో, తదాఏవ=అప్పుడే, చక్షుషః=కంటికినీ, ద్రష్టుః=ద్రష్టకును, అనయోః=వీరిరువురికినీ, అయోగ్యతా=యోగ్యత లేకుండుట,

తాత్పర్యము: జీవాత్మ యథార్థ అవినాశిత్వము బోధించుటకై ఉదాహరణము నిచ్చుచున్నాడు. నేత్రాదులైన ఇంద్రియములకు వానికి విషయములైన రూపాదులను చూచెడు సామర్థ్యము ఎప్పుడు లేకపోవునో అప్పుడే ఇంద్రియములు నశించినట్లే. ఈ రీతిగా సర్వేంద్రియములు వాని కా స్పదమైన స్థూలదేహములు నశించినపుడు జీవోపాధియైన సూక్ష్మ దేహమందుండి శబ్దస్పర్శాది సుఖములను అనుభవించుటకు ద్రష్టయైన జీవునకు అయోగ్యత ఏర్పడదు. దానినే జీవనాశమని సామాన్యులు భ్రమింతురు. వాస్తవమునకు జీవుడు నశింపలేదు. వాడు నిత్యుడే. నేను చెవిటి వాడను, నేను కుంటి వాడను. ఈ రీతిగా శరీరము నభిమానించిన జీవుడు తద్వినాశమందు తన వినాశమైనట్లే భావించుకొనును. కానీ నిజమునకు వాడు ద్రష్ట. స్థూలదేహము నశించినపుడు నశింపకుండని జీవాత్మ అభిమాన నిమిత్తముగా తానే నశించినట్లు భావించున్నాడు. ఇదే దేహాభిమానము యొక్కయు, జీవనాశము యొక్కయు స్వరూపము.

48. తస్మాత్=అందువలన, సంత్రాసః=భయము, న కార్యః=పొందరాదు. కార్పణ్యం=దైన్యము, సంభ్రమః=పరిభ్రమణము, న కర్తవ్యం=పొందరాదు, జీవగతిం =యథార్థ తత్త్వమును, బుధ్వా=తెలిసికొను, ధీరః=ధైర్యయుక్తుడై, ముక్తసంగః =సంసారము వదలినవాడై, ఇహ=ఈ సంసారమందు, చరేత్=చరింపవలెను.

తాత్పర్యము: పైన చెప్పినట్లుగా జీవునకు నాశము లేదు. స్థూల శరీరమునకు నాశము. శస్త్రాదులతో గాని మఱిదేనితో గాని జీవుడు నశింపడు. ఈ విషయ బోధము కలిగి ధీరుడై ఉండవలెను. మరణమునకు భయము చెందరాదు. సుఖదుఃఖములు ప్రారబ్ధవశములు. అందుచే దైన్యము నొందరాదు. ధనపుత్రాదులు నశించునపైన దానివలన వాని విషయమున సంభ్రమముండ రాదు. దేహాదులయందభిమాన రహితుడై ప్రారబ్ధ వినాశము వఱకును ఈ సంసారమందు చరింపవలెను. జీవునియొక్క అచ్ఛేద్యాది గుణములు మనన మొనర్చికొనవలెను.

49. యోగవైరాగ్య యుక్తయా=యోగ వైరాగ్యములతో కూడినదైన, సమ్యక్ దర్శనయా=యథార్థ జ్ఞానముచే కూడిన, బుధ్యా=బుద్ధితో, మాయావిరచితే=మాయా నిర్మితమైన, లోకే=లోకమందు, కళేబరం=శరీరమును, న్యస్య=ఉంచి, చరేత్= చరింపవలెను.

తాత్పర్యము: ప్రకృతితో నేర్పడిన పంచభూతముల యొక్క పరస్పర సమ్మేళనమే శరీరము. దీనివంటివే తక్కిన శరీరములును. వాని సంఘాతమైన లోకమును ఇట్టిదే. కనుక లోకము ప్రకృతి యొక్క పరిణామమే యని తత్త్వజ్ఞులు నిశ్చయించి ఉందురు. ఈ సత్యము బుద్ధికి అరుగవలెను. అది ఏర్పడుటకు లోకమునందలి నశించెడు వస్తువు లన్నియు, నశింపని పరమార్థ చైతన్య మేదియో అదేనను నిశ్చయజ్ఞాన మెప్పుడును ఉండవలెను. దీనికే సమ్యగ్దర్శనమని పేరు. దీనితో నశ్వరములైన ధనాదులందును శబ్దాదులందును ఆసక్తి లేకపోవును. దానికి వైరాగ్యమని పేరు. ఈ ప్రకారమైన బుద్ధియొక్క నిరంతర విచారము నాశరహితమైన ఆత్మయందు విశ్రమించును. దీనినే

యోగ మందురు. ఏతాదృశ గుణయుక్త మైన బుద్ధితో ఈ శరీరము ప్రకృతి పరిణామమే యని నిశ్చయము నిరంతరము కలిగి ఉండవలెను. దానిపై సక్తి నుజగింపవలెను. ప్రారబ్ధ భోగమునకై శరీర మేర్పడినది. అది యుండునంత వరకు శరీర ముండవలెను. ఈ దృష్టితో శరీరము నశించువఱకు సంసారమందు చరింపవలెను.

విజయధ్వజ వ్యాఖ్య

1. సంసార మహోర మని తెలియుటయే వైరాగ్యము. దాని కొఱకై ఈ అధ్యాయమందు గర్భవాసము మొదలైన దుఃఖముల అనుభవములను ప్రతిపాదించుచున్నాఁడు. దీని నెఱిఁగి విరక్తుఁడై బ్రహ్మ జ్ఞానమునకు ప్రయత్నింప వలెను. బ్రహ్మజ్ఞానము పరమాత్మయం దొనరు భక్తికే సాధ్యమగును. జంతుః =నరక మందు కర్మఫలము ననుభవించి వర్షము మూలముగా భూలోకమునకు వచ్చి మఱియొక్క జీవుని కర్మఫలముగా నేర్పడిన గోధుమలు మొదలైన ధాన్యదేహమందు చేరికొని జన్మించిన జీవుఁడు, దైవ తంత్రేణ=అదృష్ట నియామకుఁడైన శ్రీహరి కధీన మైనట్టి, కర్మణా=తనయొక్క పుణ్యము లేక పాపరూపమైన కర్మచేత, దేహోపపత్తయే=దానికనుగుణమైన శరీరమును పొందుటకై, పుంసః=పురుషుని యొక్క, రేతః కణాశ్రయః=రేతస్సు యొక్క బిందువు నాశ్రయించి, స్త్రియః ఉదరం=ఋతుకాలమందు యోని మూలముగా స్త్రీగర్భకోశమును, ప్రవిష్టః భవతి=ప్రవేశించినవాఁడగును. కణ మనఁగా నిమీలిత మగుట అని అర్థము చెప్పవలసి ఉండుటచే ఉత్పాదన శక్తిలోన అణఁగి యున్న రేతస్సు నందు అని అర్థము.

2. స్త్రీ యొక్క ఉదరమును ప్రవేశించిన రేతస్సు కాలక్రమముగా శరీరాకారమును పొందెడి రీతిని చెప్పుచున్నాఁడు. తు=శోణితముతో చేరిన ఆ రేతః కణము, ఏకరాత్రేణ=ఒక్కరాత్రియందు, కలిలం=గంజివలె గట్టిదిగా నగును. పంచరాత్రేణ=ఐదు రాత్రులలో, బుద్బుదం=చిన్న గుండువలె నగును. దశాహేన తు=పదిరాత్రులలో, కర్కంధుః=కొద్దిగా గట్టియైన పిండముగా నగును. తతః పరం=అనంతరము, పేశీ=మనుష్యుఁడు మొదలైన శరీరమందువలె మాంసపు ముద్ద అగును. వా=అటుగాక పక్షిమొదలైన వాని శరీరమందలి, అండం=గ్రుడ్డుగను, భవతి=అగును. 'వా' అని వికల్పమును చెప్పుటచేత"

"నానా విధా గర్భవృద్ధిః కర్మభేధా ద్భవిష్యతి,
అతో నానావిధం గ్రంథేః గర్భ సంస్థాన ముచ్యతే."

అనుప్రమాణముతో వారి వారి కర్మకు తగినట్లుగా గర్భవృద్ధి అనేక రీతులుగా ఉండునని చెప్పినట్లైనది.

3. మాసేనతు=ఒక్కనెలలో, శిరః=తలయు, ద్వాభ్యాం=రెండునెలలలో, బాహ్వాం ఘ్రాద్యంగ విగ్రహం=బాహువులు, పాదములు మొదలైన అవయవములతో కూడిన దేహాకారమును త్రిభిః=మూడు నెలలలో, నఖ=గోళ్ళు, రోమ=రోమములు, అస్థి=ఎముకలు, చర్మ=చర్మము,లింగ=స్త్రీ పురుష భేదమును తోపించు, చిహ్నము, ఛిద్రోద్భవః=ఇంద్రియస్థానములైన రంధ్రముల ఉత్పత్తియు, భవతి=అగును.

4. చతుర్భిః=నాల్గునెలలలో, సప్తధాతవః=అస్థులు, రక్తము, మేదస్సు, మజ్జ, మాంసము, రేతస్సు అనెడు ఏడు ధాతువులను, పంచభిః=ఐదునెలలలో, క్షుత్తృడుద్భవః=ఆకలిదప్పుల ఉత్పత్తియు, భవతి=అగును షడ్భిః=ఆరుమాసములలో, జంతుః=జన్మించెడు దేహయుక్తుడైన జీవి, జరాయుణా=మాంసమునకు సంబంధించిన పొరచేత, ఆదితః సన్=చుట్టబడినవాడై, దక్షిణే=కుడివైపు, కుక్షౌ=పొట్టయందు, భ్రామ్యతి=సంచరించును.

5. గర్భస్థ శిశువునకు ఏడవమాసమందు జ్ఞానముత్పత్తియగునని చెప్పుచున్నాడు. - సప్తమే=ఏడవ మాసమందు, ఋషిః=జ్ఞానమును పొందిన ఆ గర్భస్థుడు, జగత్యాం=కర్మభూమియందు, ఆత్మనః=తనయొక్క, యానిగతాని=ఏ గడచిపోయిన, జన్మకర్మాణి=పుట్టుక, దానియందొనరించిన కర్మలు కలవో, తాని=వానిని, దేవస్య=శ్రీహరి యొక్క, మాయయా=ఇచ్ఛచేత ఏర్పడిన, బంధం=తన సంసారమును, స్మరతే=స్మరించుకొనును. 'స్మరతే' అను ఆత్మనే పదమును వాడుటచేతను సంధి యొనర్పక ఉండుటచేతను కొన్ని వేళల స్మరణ ఏర్పడుటయు, కొన్ని వేళల నొప్పియొక్క అతిశయముతో మఱచిపోవుటయు కలుగునని విశేషణము సూచించినట్లైనది.

6. గర్భమందు ఆ శిశువు దేహమును పెంచికొనెడు ప్రకారమును చెప్పుచున్నాడు. ధాతుర సమ్మతః=రోగి, మరియు ఇతరులు ఇచ్చెడు ఆహారము చేతనే పెరిగెడు రీతితో నభివృద్ధి పొందుచున్న ఈ గర్భస్థుడైన శిశువు, మాతుః=తల్లియొక్క, జగ్ధాన్న పానాద్యైః=తిన్న ఆహారము నీరు వీనిచేత, ఏధతి=వృద్ధినందును. సజంతుః=క్రిములతో చేరి ఉన్న ఈ శిశువు, జంతుసంభవే=క్రిముల ఉత్పత్తి స్థానమైన, విణ్మూత్రయోః=మల మూత్రముల యొక్క, గర్తే=గుహ యనిపించుకొన్న ఆ గర్భము యొక్క దేహమందు, ఆస్తే=ఉండును. తల్లి తిన్న ఆహారాది రసములు గర్భస్థుడైన శిశువునకు 'ఆప్యాయని' అనెడు నాడీమూలకముగా చేరునని తెలియవలెను. ఇది నాభిమూలమునుండి మొదలై మాంసము యొక్క పొరను, ఉల్బమును భేదించుకొని కమలనాళమువలె ముఖము యొక్క ద్వారమందున్న పెదవులను తాకి యుండును. "సజంతుః" అనుటచేత క్రిమియుక్తమైన గర్భవాసము నరక వాసమేయని సూచించి-

"అత్రైవనరక స్స్పర్గ:" పోయిన అధ్యాయమున చెప్పిన విషయమును వివరించినాఁడు. 'జంతుసంభవే' అనుట చేత ఈ క్రిముల కంతము లేదని భయపరంపర యొక్క విషయమును సూచించినాఁడు.

7. ఇపుడు గర్భశిశువు దుఃఖము ననుభవించు ప్రకారమును చెప్పుచున్నాడు. తత్రత్త్రై:=ఆగర్భమందున్న, క్షుధితైఃఆకలిగొన్న, కృమిభిఃక్రిములచేత, ముహుఃపైపైన, క్షతకండ్వంగఃగాయమును నవను పొందిన అవయవములుగల, సఃఆ గర్భస్థ శిశువు, సౌకుమార్యాత్తన కోమలత్వముతో, ఉరుక్లేశస్సన్ఎక్కువ నొప్పిని పొంది, ప్రతిక్షణంక్షణ క్షణమునకును, మూర్ఛాంమూర్ఛను, ఆప్నోతిపొందును.

8,9. మాతృభుక్తైఃతల్లిచేత భుజింపఁబడిన, ఉల్బణైఃఎక్కువైన, కటుకారము, తీక్ష్ణసాసువులు, (ఆవాలు) మొదలైన దాహక పదార్థములు, ఉష్ణదేహమం దుష్ణమును' పెచ్చించెడు శొంఠి మొదలైనవి, లవణఉప్పు, క్షార=సున్న మెక్కువగా నున్న పదార్థములు, ఆమ్లమామిడి మొదలైన పుల్లని పదార్థములు-ఈ మొదలైన రసములచే, ఉపస్పృష్టస్సన్దేహమందు తాప మొందినవాఁడై, దీనిచేత సర్వాంగోత్థితవేదనఃతన సర్వావయవములందును నొప్పిని పొంది, ఉల్బేన=గర్భకోశముచేత, సంవృతఃచుట్టఁబడినవాఁడై, బహిఃదానికిని బయటి, అంతఃచతల్లియొక్క దేహనాడులచేత, ఆవృతఃఆవరింపఁ బడి, భుగ్న పృష్ఠశిరోధరఃవంచఁబడిన పృష్ఠభాగము మెడకలవాఁడై, కుక్షితన పొట్టపైన, శిరఃతలక్రిందుగా తలనుంచుకొన్నవాఁడై, తస్మిన్ఆ తల్లి యొక్క గర్భమందు, ఆస్తేఉండును. మార్కండేయ పురాణమందు తండ్రి కొడుకుల సంభాషణలో ఈ రీతిగా వివరించి ఉన్నాఁడు.

నాడీ చాప్యాయనీనామ నాభ్యాం తస్య నిబధ్యతే,
స్త్రీణాం తథాంత్రసుషిరే సా నిబద్ధాథ జాయతే.
క్రమంతే భుక్త పీతాని స్త్రీణాం గర్భోదరే తథా,
తైరాప్యాయత దేహో ఽసౌ జంతుర్వృద్ధి ముపైతి వై.
నారికేళఫలం యద్వత్ సకోశం వృద్ధి మృచ్ఛతి,
తద్వత్తయాత్యసౌ వృద్ధిం సకోశోధోముఖస్థితఃఽ.
ఏవం వృద్ధిం క్రమాద్యాతి జంతుఃస్త్రీ గర్భసంస్థితఃఽ,
తలేతు జానుపార్శ్వాభ్యాం కరయోర్న్యస్య వర్తతే.
అంగష్ఠే చోపరిన్యస్య జాన్వోరగ్రే తథాంగుళీఃఽ
జానుపృష్ఠే తథా నేత్రే జానుమధ్య చ నాసికామ్.
స్థిచోచ పార్శ్వద్వంద్వస్థౌ బాహూ జంఘూ బహిస్థితౌ.

కొంకాయ పైనున్న ముత్తెపు పాటు లోపల పెరిగి పెద్దదై నట్లు జరాయువు లోపల గర్భమందు శిశువు పెరుగును. ఇత్యాది విషయములు దీనిచే సిద్ధమగును.

10. పంజరే=పంజరమందు, శకుంతః ఇవ=రెక్కలు మొలవని లేక కొంతమాత్రమే మొలచిన పక్షివలె, స్వాంగచేష్టాయాం=తన అవయవములను కదలించుటందు, అకల్పఃసమర్థుఁడుఁ గాని, జంతుఃజీవి, తత్ర=ఆగర్భమందు, దైవాత్=ఉత్తమజీవుఁడైనచో దైవానుగ్రహముచేత, లబ్ధస్మృతిఃగడచిన అనేక జన్మములం దొనర్చిన, కర్మ=పుణ్య పాపకర్మములను, స్మరన్=స్మరించుచున్నవాఁడై, దీర్ఘం=దీర్ఘమైన, అనుచ్ఛ్వాసం=నిట్టూర్పు, కుర్వన్=విడచుచు, గర్భే=ఆ గర్భమందు, కింనామవిందతే=దేనిని పొందఁగలఁడు? తన కర్మ కనుగుణముగా ఆయాగర్భమందు జన్మించి ఆయాజాతికి తగిన పేరును పొందునని అర్థము.

11. స్మరణ ఏర్పడుటచేత గర్భవాసము యొక్క అసారతను తెలిసిన దేహి దానినుండి బయటికి వచ్చు ప్రయత్నము నొనర్చునని చెప్పుచున్నాఁడు. - సప్తమాత్ మాసాత్=ఏడవ నెలనుండి, ఆరభ్య=ప్రారంభించి, లబ్ధబోధఃఅపి=జ్ఞానమును పొందియున్నను, సూతివాతైఃగర్భగతమైన గాలిచేత (ప్రసూతిమారుతముతో) వేపితఃసన్=వణకింపఁబడినవాడై, సోదరఃతనకు ముందేమి యగునో అని సంశయముతో కూడినవాడై, విష్ఠాభూరివ=క్రిమివలెనే, ఏకత్ర=ఒకచోట, న ఆస్తే=ఉండుటలేదు.

12. గర్భమునుండి గడ్డకు వచ్చుటలో తన ప్రయత్నము ప్రయోజనకారికాదు. శ్రీహరి ప్రసాదమే ప్రయోజక మనెడు అభిప్రాయముతో శ్రీహరిని స్తోత్ర మొనర్చునను విషయమును చెప్పుచున్నాఁడు - భీతఃభయముగొన్నట్టియు, సప్తవర్ధిఃఏడు ఇంద్రియములతో కూడినట్టి, ఋషిఃజ్ఞానియైన ఆ దేహి, కృతాంజలిఃసన్=మనస్సుతోనే చేతులు మొగిడ్చి నాథమానఃమరల ఇట్టి గర్భవాసము ఏర్పడఁగూడదని వేడుకొను చున్నవాడై, యేన=ఏ శ్రీహరిచేత, ఉదరే=తల్లియొక్క గర్భమందు, అర్పితఃచేర్పఁబడిన వాఁడయ్యెనో, తం=ఆ శ్రీహరిని, విక్లబయా=ఆలకించునట్టివారి మనస్సును కరగించెడు, వాచా=వాక్కుచేత, సంస్తౌతి=స్తోత్రమొనర్చును. ఇచ్చట 'ఋషి' అని చెప్పుటచేత గర్భస్థులైన దేవతలకు, ఉత్తములకును, ఋషులకును, తత్త్వజ్ఞాన మేర్పడుననియు తక్కిన వారికి బహు జన్మస్మృతి కల్గునని చెప్పి ప్రమాణము సూచించుచున్నాఁడు.

తత్త్వజ్ఞానం తు దేవానాం గర్భస్థానాం భవిష్యతి,
ఉత్తమానాం ఋషీణాం వాఽప్యన్యేషాం బహుజన్మగమ్.

సాక్షి, మనస్సు, మఱియు ఐదు ఇంద్రియములు ఇట్లుగా ఏడింద్రియములని తెలియవలెను.

13. ఇచ్చట నొనర్చెడు స్తోత్రము శ్రీహరియందు అనుభవ సిద్ధములైన గుణముల చేతనా? లేక వేదమంత్రములందు చెప్పఁబడిన గుణములచేతనా? ఈ రెండు పక్షములును సరిగావు. జీవున కేర్పడిన జ్ఞానము తన నూరారు

జన్మములకు సంబంధించినదే. ఇతరమైనదికాదు. కనుక జీవుఁడు ఈ యవస్థలో గుణగణములని చెప్పి స్తోత్ర మొనర్పలేఁడు. కనుక ఇది సరియైన స్తోత్రము కాదని శంకించినచో శ్రీహరి యొక్క శక్తి అచింత్యమహిమతో కూడియుండుటచేత ఈ స్థితియందును జీవునకు - యోగుఁడైన వానికి - తత్త్వజ్ఞానమేర్పడును అనెడు అభిప్రాయముతో ఉచిత గుణములతో స్తోత్ర మొనర్చెనని చెప్పుచున్నాఁడు. సం అహం=శ్రీహరిచేత స్మృతిని పొందిన ఈ నేను, యేన=ఏ శ్రీహరిచేత, అసతః=అశుభకార్యము లొనర్చి, అశుచియైన, మే=నాకు, అనురూపా=కర్మకనుగుణమైన, ఈ దృశీగతిః=ఈ గర్భవాసరూపమైన ఫలము, అదర్శి=నిర్దిష్టమైనదో, తస్య=అట్టి ఉపపన్నం=శరణము పొందిన, జగత్=జగత్తును, అవితుం=కాపాడునట్టి, ఇచ్ఛయా=భక్తులను అను గ్రహించెడు ఇచ్ఛతో, భువి=భూమిపైన, ఆత్తనానాతనోః=రామకృష్ణాది లీలా విశిష్టములైన అవతారములను పొందిన శ్రీహరియొక్క, అకుతోభయం=ఏ భయములేని, లసచ్చరణారవిందం=ప్రకాశమానమైన పాదకమలమును, శరణం=రక్షకముగా, వ్రజామి=పొందెదను.

"అభయం ప్రతిష్ఠాం విందతే" "యుక్తాహ్యస్య హరయః శతా దశఇత్యాది శ్రుతుల వలన ఈ గుణములు సిద్ధమైనవి.

14. యః=ఏ శ్రీహరి, భూతేంద్రియాశయమయీ=పంచభూతములు, చెవి మొదలైన పది ఇంద్రియములు, మనస్సు, ఈ రీతిగా పరిణామమును పొందిన, మాయాం=ప్రకృతిని, అవలంబ్య=ప్రవర్తకుఁడై చేరి, కర్మభిః=పుణ్యపాప కర్మలచే, అవృతాత్మా=సక్తుఁడైన వాఁడై, వానియందు ఆసక్తిగల మనస్సు కలవాఁడై, బద్ధ ఇవ=కర్మబద్ధుఁడైన జీవునివలె, అత్ర=ఈ శరీరమందు, తు=జీవునికంటెను విలక్షణుఁడై, ఆస్తే=ఉండునో, తం=అట్టి, విశుద్ధం=కర్మ సంబంధము లేనటియు, అవికారం=ఉన్నాఁడు. పుట్టినాఁడు ఇత్యాది వికారములు లేనటి, అఖండ బోధం=పరిచ్ఛిన్నముకాని జ్ఞానస్వరూపియైన, ఆతప్యమాన హృదయే=నాయొక్క ఈ తాపత్రయ తప్తహృదయమందు, అవసితం=దుఃఖములచేత తప్తుఁడుకాఁడని నిశ్చయింపఁబడిన శ్రీహరిని గూర్చి, నమామి=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము : పాంచభౌతికమైన శరీరము మనస్సు మొదలైన ఏకాదశేంద్రియములతో కూడి కర్మబద్ధుఁడైన జీవుఁడు ఈ శరీరమందు అభిమానము కలవాఁడగును. వానితో నీవు కూడ ప్రకృతివికారమైన ఈ దేహమం దుందువు. కానీ నీవు బద్ధుఁడవు కావు. జనన మరణాది వికారములు నీకులేవు. అపరిచ్ఛిన్నుఁడైన జ్ఞానస్వరూపివై ఈ దేహమందు ప్రవర్తకుఁడవై నీ వున్నావు. తాపత్రయతప్తుఁడైన జీవుని యొక్క హృదయమందు నిర్దుఃఖియైన నీ వున్నావని ప్రమాణము ఘోషించుచున్నది. అట్టి నీకు నమస్కారము.

15. జీవునకు పరమాత్మకును గల వైలక్షణ్యమునే వివరించుచున్నాఁడు; - అత్మక్షః=పరమాత్ముని ప్రతిబింబమైన, ఇంద్రియగుణార్థవిత్=కన్ను మొదలైన

ఇంద్రియముల సత్త్వరజస్తమస్సులనెడు గుణములు శబ్దాది గుణములు వీనిని ఉపభోగ్యములైన విషయములని తలచుచున్న, అహం=నేను (అనఁగా జీవుఁడు) యథా=ఎట్లు పంచభూతరచితే=పృథివి మొదలైన ఐదు భూతములచేత నిర్మింపఁబడెనట్టి, శరీరే=దేహమందు, ఛన్నః=బాహ్యేంద్రియములకు కనపడనట్లు, వసామి=వసించుచున్నాను. తథా=అట్లే, గుణావిత్=ఇంద్రియములు గుణములు శబ్దాది విషయములు వీనియొక్క తత్త్వములు తెలిసిన, తం=ఆ, అవికుంఠ మహిమానం=కుంఠితముకాని మహిమలుకల, ఋషిం=సర్వజ్ఞుని, ప్రకృతి పురుషయోఃలక్ష్మీ, బ్రహ్మదేవుఁడు మొదలగు వారి కంటె, పరం ఉత్తముఁడైన,ఏనం=ఈ నాకనులకు కనపడునట్టి, పుమాంసం=పురుషుఁడైన శ్రీహరిని, వందే=నమస్కరింతును.

"త్వ మగ్నే ప్రథమో అంగిరా ఋషిః" అనెడు శ్రుతియందు, "అక్షర మంబరాంత ధృతేః" అనెడు సూత్రమందు ఈ గుణగణములే చెప్పఁబడినవి.

16. వానిని గూర్చి వర్ణించుటకూడ వానియొక్క ప్రేరణచేతనే అని స్పష్టపఱుచుచున్నాఁడు - యన్మాయయా=ఏ శ్రీహరి ఇచ్ఛచేత అతని కధీనమైన ప్రకృతిచేత, ఉరుగుణ కర్మనిబంధనే=సామాన్యులచేత జయింపరాని, సత్త్వాదిగుణములు మఱియు కర్మాదులచేత అతిశయమైన బంధనముకల, అస్మిన్=ఈ, సాంసారికే పథి=సంసారమనెడు మార్గమందు, చరన్=సంచరించుచు, పునఃమరల మరల, తదభిశ్రమేణ=తాపత్రయముల పరితాపముచేత, నష్టస్మృతిః=శ్రీహరి యొక్క జ్ఞానమును పోఁ గొట్టుకొని యున్న, అయంలోకఃఈ ముముక్షుజీవుఁడు, మదనుగ్రహం=సర్వోత్తముఁడైన శ్రీహరి అనుగ్రహమును, అంతరేణ=వదలి, కయా యుక్త్యా=ఏ ఉపాయము చేత, తం=ఆ శ్రీహరిని, ప్రవృణీత=తన స్వామి యని తెలిసికొని శరణుఁ జొచ్చునో, పరమాత్మను శరణుఁ జొచ్చెడు బుద్ధికూడ వాని యనుగ్రహము చేతనే ఏర్పడు చున్నదని భావము.

తాత్పర్యము : స్వామీ! జీవుఁడు నీకు ప్రతిబింబమైనవాఁడు ఇంద్రియములను, ప్రకృతికి సంబంధించిన సత్త్వాది గుణములను, శబ్దాదులను తన కుపభోగ్యములని తెలిసికొన్నవాఁడు ఈ పాంచభౌతిక దేహమందు బాహ్యమైన చక్షుస్సునకు కానరాక వసించుచున్నవాఁ డు. అట్లే ఓ పరమాత్మా! నీవు కూడ దీనియందే నివసించుచున్నావు. కాని ఇంద్రియములు ప్రకృతి శబ్దాదులు వీని తత్త్వములని తెలిసినవాఁ డవు నీవు. మూఢుఁడుగా నున్నను దేనితో సంబంధములేనివాఁడుగా నున్నావు. నీచేత ప్రేరితుఁడైనపుడే జీవుఁడు నీ మహిమ నెఱిఁగి నిన్ను స్తుతించుచున్నాఁ డు. నీ మహిమ ఎక్కడకాని కుంఠితముకాదు. నీవు సర్వజ్ఞుఁడవు. లక్ష్మీ బ్రహ్మాదులకంటె నుత్తముఁడవు. ఉత్తముఁ డైన జీవునకు గర్భమందు నీవు దర్శన మొసఁగెదవు. నీ ఇచ్ఛచేతనే నీ కధీనమైన ప్రకృతిలో - గుణకర్మములతో బద్ధుఁడై జీవుఁడీ సంసార మార్గమందు సంచరించును. పైపైన కలిసికొనుచున్న తాపత్రయములకు లోఁబడినవాఁడై ముముక్షుజీవికూడ నిన్ను మఱచి పోవును. నీ యనుగ్రహము

లేనిదే మఱి ఏ యుపాయముచేఁ గాని శరణు పొందలేఁడు. నిన్ను శరణుఁ జొచ్చెడు బుద్ధిని ప్రేరేపించెడి వాఁడవు కూడ నీవే.

17. భగవంతుని అనుగ్రహము చేతనే వానికి సంబంధించిన జ్ఞానము కూడ నేర్పడునని చెప్పుచున్నాఁడు - స్థిరచరేమ=స్థావరములు జంగమములైన పదార్థములందు, అనువర్తితాంశ=అంతర్యామియై అనేక రూపములతో నున్నట్టియు, అయినను, కతమః=అత్యంత సుఖస్వరూపియైన, సః="భూమ" అని ప్రసిద్ధుఁడైన, దేవః=శ్రీహరి, ఏతత్=ఈ, తైకాలికం=గడచి పోయిన జన్మలయొక్క, జ్ఞానం=జ్ఞానమును, అదధాత్=మాకు దయచేసినాఁడు. ఇతియత్ అతః=అనెడు ఈ కారణము చేతనే మాకత్యంత ప్రియుఁడవైన, తంత్వా=ఆ నిన్ను, జీవకర్మపదవీం=జీవు లొనర్చిన కర్మ కనుగుణమైన స్థానము (అనఁగా సంసారము) అను వర్తమానాః=అనుసరించుచున్న, వయం=జీవులైన మేము, తాపత్రయోపశమనాయ=తాపత్రయములను పోఁగొట్టుకొనుటకు, భజేమ=సేవింతుము.

"జీవకర్మ" అని చెప్పుటచేత గర్భస్థుఁడైన, జీవునకును శ్రీహరికినీ అభేదము కాదు భేదమే కలదని చెప్పినట్లైనది.

తాత్పర్యము : నిన్ను శరణుఁ జొచ్చెడు బుద్ధినికూడ దయచేసి దానిని ప్రేరేచువాఁడవు నీవే. స్థావరజంగమములైన పదార్థములందు నీ వంతర్యామివై అనేక రూపములతో నున్నావు. ఏ సితి యందును నీవు సుఖ స్వరూపివే. పరిపూర్ణుడవే. ఉత్తమ జీవునకు గతించిపోయిన జన్మల యొక్క జ్ఞాపకమొసగుఁవాఁడవు నీవే. నీవే అత్యంత ప్రియుఁడవు. కర్మానుసారముగా సంసారము ననుభవించెడు జీవుల మైన మేము మా దుఃఖశమనమునకై నిన్నే సేవించుచున్నాము.

18. ఇప్పుడు గర్భమునుండి తాను తొందరగ బయటపడవలెనని అభిప్రాయము విజ్ఞాపించుచున్నాఁడని చెప్పుచున్నాఁడు. - భగవన్! =స్వామి! అన్యదేహావిదరే=తల్లియొక్క దేహభాగమైన ఉదరమందు, అసృక్ విణ్మూత్ర కూపపతితౌ=రక్తము, మలము, మూత్రము వీనిచేత నిండిన కూపమున పడినట్టియు, జఠరాగ్నినా=తల్లి ఉదరగతమైన అగ్నిచేత, భృశతప్తదేహః =అత్యంత సంతాప మందిన దేహము కలిగినట్టియు, ఇతః=ఈ తల్లి దేహమునుండి, వివసితుం=బయటపడుటకు, ఇచ్ఛన్=ఇష్టపడువాఁడై, స్వమాసాన్=ఎన్ని నెలలు గడచినవి? ఇంకెన్ని గడువవలెనని? గణయన్= లెక్కించుచు, కృపణధీఃదైన్యము కలవాఁడైన, అయందేహీ=ఈ జీవుఁడు, భవతా=నీ నుండి, కదాను=ఎప్పుడు, నిర్వాస్యతే=బయటపడవేయఁబోవు చున్నాఁడు? తొందరగా బయటపడ వేయవలెనని ప్రార్థించుచున్నాఁడు.

19. ప్రత్యుపకార మొనర్పలేని సర్వాతిశయమైన ఇట్టి జ్ఞాన మొసఁగిన శ్రీహరి అన్నిటి కంటెను ప్రియతముఁడనెడు అభిప్రాయమును చెప్పుచున్నాఁడు - హే ఈశ! నియామకుఁడవైన ఓ స్వామి! అసౌ=ఈ, దశమాస్యఃపదిమాసములు గర్భమునందుండవలసిన, అహం=నేను, పురుదయేన=దయాపూర్ణుఁడైనట్టి,

యేన=ఏ, భవాదృశేన=నీవంటి పురుషుని చేత (శ్రీహరివైన నీచేత) ఈదృశీం=భగవద్విషయక మైనట్టి, మతిం=జ్ఞానమును, సంగ్రాహితః=అనుగ్రహింపఁ బడితినో, దీననాథుఁ=దీన రక్షకుఁ డవైన సః భవాన్=ఆ నీవు, స్వేనకృతేన ఏవ=ఈ ఉపకారముచేతనే, తుష్యతు=సంతోషపడువాఁడవగు దువుగాక. అస్య=ఈ శ్రీహరికి, తత్తతి=వాఁడొనర్చిన ఉపకారమునకు ప్రత్యుపకారమును, కోనామ=ఎవ్వఁడు, అంజలిం వినా=చేతులను జోడించుట తప్ప, కుర్యాత్=చేయగలఁడు. అంజలిని జోడించుటయే ప్రతియొక్క జీవి యొనర్చెడు ఉపకారమని అర్థము. దీనిని దప్ప మఱియొక్క ఉపకార మెవ్వరును చేయలేరు. అట్టు చేయవలెనన్న నీ వంటి మనుష్యుఁ డే చేయవలెను. దీనినే "భవాదృశః" అనేడు పదముచేత సూచించినాఁడు.

"న ఋతే త్వత్ క్రియతే" అను శ్రుతి ఈ యర్థమునే తెలుపుచున్నది.

20. శ్రీహరి అనుగ్రహించిన జ్ఞానమునకు ఫలమును చెప్పుచున్నాఁడు. సప్తవధ్రిః=ఏడు జ్ఞానేంద్రియములుకల, అయం=ఈ జీవుఁడు, అశరీరవత్=ప్రాకృత శరీరములేని శ్రీహరి తెలిసికొన్నట్లు, అస్య=ఈశ్రీహరి కధీనమైన, దేహే=జడదేహమందు, శారీరభేదం=జీవునకు భేదమును, జడములకు భేదమును, యదత్తయా=ఏ శ్రీహరి అనుగ్రహించినట్టి, ధిషణయా=జ్ఞానముచేత, పశ్యతి=తెలియుచున్నాఁడో, నను=ఈ జ్ఞానము దృఢమును ప్రమాణానుసారమును అయిఉన్నదో అట్టి, పురాణం పురుషం=పురాణ పురుషుఁ డైన శ్రీహరిని, సః అహం=వాని నుండి జ్ఞానము పొందిన నేను, చైత్యం ఇవ=చిత్తమున కభిమానియైన బ్రహ్మదేవునిని వీక్షించునట్లు, హృది=హృదయమందును, బహిశ్చ=బయటను, ప్రతీతం=జ్ఞానమునకు విషయమైనవానినిగా, పశ్యేత్=చూచెదను. "శృతం మే అశ్వినాహవం సప్తవధ్రించ ముంచతం" అనేడు శ్రుతి కూడ ఈ విషయమునే చెప్పుచున్నది. శ్రీహరి దృష్టాంతముగా ఇచ్చినందువలన జ్ఞానము నిర్మలమని తెలిపినట్లైనది. ఇట్టి జ్ఞానము గర్భమందు దేవతాదులకు ఏర్పడునని "తత్త్వజ్ఞానం తు దేవానాం"అని ఇంతకుముందే నిరూపింపఁబడినది.

తాత్పర్యము: తల్లియొక్క ఉదరము రక్తమల మూత్రములతో కూడినది. దానియందు నివసించేడు గర్భగతుఁడైన జీవి తల్లియొక్క జఠరాగ్నిచేత బంధింపఁ బడుచున్నదేహము కలవాఁడై ఎప్పు డెప్పుడు బయట పడుదునని మాసములు లెక్కించుచుండును. నీవే వానిని బయట పడవేయవలెను. సర్వ నియామకుఁడైన దేవా! పదిమాసముల కాలము గర్భమందు నివసించ వలసిన జీవికి జ్ఞానము ననుగ్రహించినావు. దీనరక్షకుఁ డవైన నీకు ప్రత్యుపకార మొనర్చెడు శక్తి వీ జీవునకు లేదు. నీ వొనర్చిన కార్యముతో నీవే తృప్తిపడవలెను జీవులైన మేము నీ కొనర్చెడు ఉపకార మే మనఁగా భక్తితో నిన్ను గూర్చి కరములు ముకుళించుటయే. ప్రాకృత శరీర రహితుఁడ వైన నీవు తెలిసికొన్నట్లుగనే ఈ యీడు జ్ఞానేంద్రియములతో కూడిన జీవుఁడు కూడ ఈ జడదేహమున కధీన మనియు, దేహమునకును జీవునకును, ఒక జీవికినీ మరియొక్క జీవికినీ, ఒక జడమునకును, మఱియొక జడమునకును వాని

నుండి నీకును భేదమున్నదనీ నీ వనుగ్రహించిన జ్ఞానము చేతనే తెలిసి కొనుచున్నాను. ఈ జ్ఞానము పరమప్రమాణమైనదనీ జీవునకు తెలియజేయుటయే కాక ఆ జ్ఞానము దృఢముగా ఉండునట్లు నీవే అనుగ్రహించుచున్నావు, ఇట్లు అనుగ్రహించి నిన్ను హృదయము యొక్క బయటను లోపలను చిత్తాభిమానియైన బ్రహ్మదేవుని చూచునట్లు చూచుచున్నాడు. అట్లు వీక్షింపఁగలవాఁడే ఉత్తమజీవి.

21. ఈ జ్ఞానము కేవలము ఇప్పటి విషయమందే కాదు జన్మాంతర విషయమందు కూడ వచ్చినదేయని చెప్పుచున్నాఁడు- హే విభో!=ఓ స్వామీ! బహుదుఃఖవాసం=అత్యంత దుఃఖమయమైన ఈ గర్భవాసమును, వసన్నపి=అనుభవించుచున్నను, సోఽహం=ఈ విషయమైన జ్ఞానమును పొందిన నేను, యత్ర=ఏ, అంధకూపే=అజ్ఞానమనెడు బావియందు, ఉపయాతం=పడినట్టి, మాం=నన్ను, దేవమాయా మిథ్యామతిః=శ్రీహరి ఇచ్ఛచేత ఏర్పడిన దేహమందు నేను నాది యనెడు ఇచ్ఛాజ్ఞానము, యత్అను=ఈ మిథ్యాజ్ఞానఫలముగా, ఏతత్=ఈ సంసృతి చక్రము, భవతి=ఏర్పడునో అట్టి మిథ్యాజ్ఞానము, ఉపసర్పతి=వ్యాపించునో, అ ప్రదేశమైనట్టి, గర్భతో బహిఃకు=ఈ గర్భమునుండి బయటి విషయ ప్రపంచమునకు, న నిరిగమిషే=పోవుట కిష్టపడుటలేదు. మిథ్యాజ్ఞానము యొక్క ఫలమును చెప్పుటచేత గర్భవాసము నుండి బయటకు వచ్చుటకు అపేక్షింపని దెందుకో ఆ కారణము కూడ చెప్పినట్లైనది.

తాత్పర్యము : స్వామీ! ఇంతటి దుఃఖపూర్ణమైన గర్భమున వసించుచున్నను నీ నుండి జ్ఞానమును పొందిన నేను ఈ గర్భమునుండి బయటఁ బడుట కిష్టపడుటలేదు. బయట ప్రపంచము అజ్ఞానముతో చేరిన ఒక అంధకారబంధురమైన బావి. దీనియందు నేను పడినవెంటనే నీ ఇచ్ఛనేత మిథ్యాజ్ఞానము నన్నావరించుకొనును. ఈ దేహమందు నేను నాదని మమత జన్మించును. దాని ఫలముగా చక్రము తిరుగుచునే పోవును. అందుచేత జ్ఞానియైన నేను ఈ గర్భమందే ఉండుటకు కోరుచున్నాను.

22. ఏమి తీర్మానమైనదో చెప్పుచున్నాఁడు - తస్మాత్=గర్భమునుండి బయట పడినచో సంసార చక్రము తగుల్కొనుట చేత, ఉపసాదిత విష్ణుపాదః=శ్రీహరి పాదమునే శరణు పొందినట్టి, అహం=నేను, సుహృత్=అనిమిత్త స్నేహితుఁడైన, ఆత్మనా ఏవ=శ్రీహరి చేతనే - అనఁగా వారి యనుగ్రహము చేతనే, విగతవిక్లబః సన్=దుఃఖములేని వాఁడనై, మే=నాకు, భూయః=మరల, అనేక రంధ్రం=అనేకానర్థములకు కారణమైన, ఏతత్=ఈ, వ్యసనం=దుఃఖం, యథా=ఎట్లు, మా అభవిష్యత్=ఏర్పడదో, తథా=అట్లు, తమసః=నరకమునుండి, ఆత్మానం=నన్ను, ఆశు=శీఘ్రముగా, ఉద్ధరిష్యే=ఉద్ధరించి కొందును. ఈ ఉద్ధరించి కొనుట యందు ముఖ్యమైన బలము శ్రీహరియే అని ఉపసాదిత విష్ణుపాదః "అనుదానితో చెప్పినట్లైనది - దీని చేత శ్రీహరి పాదమును శరణుజొచ్చిన వారికి ఆత్మోద్ధారమందు ఎక్కువ శ్రమ ఉండదని సూచింపఁబడినది.

23. శ్రీహరి యొక్క మహిమ వర్ణించుట కసాధ్యమైనదని సూచించుచున్న వాఁడై గర్భమందున్న దేహి జన్మించెడు ప్రకారమును చెప్పుచున్నాఁడు - ఏవం=పైకి చెప్పినట్లు, కృతమతిః=జ్ఞానమును పొందినవాఁడై, ఆస్తే=గర్భ మందుండును. దశమాస్యం=పదినెలల యొక్క, స పది ఋషిం=ఋషులయొక్క కులమందు పుట్టెడి జీవి తత్క్షణమే జ్ఞానమును పొందెడు వాఁడగుటచే వెంటనే త్రికాలజ్ఞానియైన, తం=ఆ దేహిని, సూతిమారుతః=ప్రసవమునకు కారణమైన సూతికా వాయువు, ప్రసూత్యై=తల్లిగర్భమునుండి బయటికి వచ్చుటకు, సద్యఃక్షణకాలము, అవాచీనం=ఆ దేహిని తలక్రిందుగా, క్షిపతి=తిరుగఁ జేయును.

24. తేన = (1)ఆ వాయువుచేత (2) ఇంతకు ముందు సంసారాను భవమునకు కారణమైన దేహాభిమానముచేత, ఉపస్పృష్టః=కూడినవాఁడై, సహసా=క్షణకాలమందే, శిరః అవాక్కృత్వా=తలను క్రిందుగా వంచఁ బడినవాఁడై, ఆతురః=దుఃఖియైన దేహియు, మాతస్కృతిః=జన్మాంతర స్మరణ తొలఁగినవాఁడై, నిరుచ్ఛ్వాసః=ఊపిరాడుట కవకాశములేనివాఁడై, కృచ్ఛ్రేణ=గొప్ప ప్రయాసముతో, వినిష్క్రమతి=గర్భమునుండి బయటికి వచ్చును. తలను వంచికొని అని చెప్పుటచేత ముందు శ్లోకములో చెప్పఁబడిన "అవాచీన' అనుదాని కర్థము స్పష్టముగా వివరించినట్లైనది. ఇట్లు చెప్పుటచేత కాళ్ళముందుగా పెట్టి జన్మించెడు జన్మలు తక్కువ వనియు, శిరః పతనమే సామాన్యముగా ఏర్పడుననియు చెప్పినవాఁడయ్యెను.

25. భువి=భూమిపైన, అసృక్మూత్రే=రక్తమూత్రములందు, పతితః =పడినవాఁడై, విష్ఠాభూః ఇవ=క్రిమివలెనే, చేష్టతే=పడియుండును. విపరీతాం= గర్భమందుండిన స్థితికి విరుద్ధమైన, మతిం=మనుష్యవాసనను, గతః=పొందిన వాఁడై, గత జ్ఞానః=తనకుండిన జ్ఞానమును పోఁ గొట్టుకొన్న వాఁడై, రోరూయతి= అతిశయముగా ఏడ్చును.

26. పరచ్ఛంధం=శిశువుయొక్క అభిప్రాయమును, నవిదుషా=తెలియనట్టి, జనేన=తల్లి మొదలైన వారిచేత పుష్యమాణాఃపోషింపఁ బడుచున్న, సః=ఆ శిశువు, అనభిప్రేతం=తన కనవసరమైన దానిని, అపన్నః=పొందినవాఁడై, ప్రత్యాఖ్యాతుం=ఇది నాకు వలదని నిరాకరించుటకు, అనీశ్వరః=అసమర్థుఁడుగా, భవతి=అగును.

27. అంగానాం=అవయవముల యొక్క, కండూయనే=నవయైనచోటి యందు బరికి కొనుటకును, ఆసనోత్థాన చేష్టనే=కూర్చొనుట, లేచుట, మఱియు వంగుట మొదలైన అవయవ చేష్టలందు, నేశః=సమర్థుఁ డు కాని, జంతుః =జన్మించిన ఈ జీవి, స్వేదజదూషితే=చెమటతో పుట్టెడునట్టి పేలు మొదలైన క్రిములచేత, దుష్టమై యున్నట్టి, అశుచి పర్యంకే=మల మూత్రముల సంబంధముచేత అశుద్ధమైన ఊయల మొదలగువానియందు, శాయితః=పండు కొనపెట్టఁబడినవాఁడుగా, భవతి=అగును.

28. మశకాఃదోమలు, మత్కుణాదయఃనల్లులు మొదలైన, దంశాః =వాడియైన కొమ్ములు మొదలైనవికల క్రిములు, ఆమత్వ్యచం=చాల కోమలమైన చర్మము కలిగినట్టియు, రుదంతం=ఏడ్చుచున్నట్టియు, విగతజ్ఞానం=నొప్పితో

ప్రజతప్పిన, ఏనం=ఆ శిశువును, క్రిమయఃపురుగులు, కృమికంయథా=తాము కఱచుటకు పనికి వచ్చెడు పదార్థమును ఎట్లు కఱచినొప్పించునో, తథా=అట్లు, తుదంతి=కఱచి నొప్పించును.

29. సతు=కర్మానుగుణముగా దేహమును పొందినట్టి ఆజీవుఁడు, ఏవం=పైన చెప్పినట్లుగా దుఃఖమయమైన, శైశవం=బాల్యమును, దుఃఖం=దుఃఖకరమైన కౌమారావస్థను, చ=మఱియు, పౌగండమేవ=పది సంవత్సరములు గల బాల్యమును, భుక్త్వా=అనుభవించి, అలబ్ధభీప్సితఃతనకు కావలసిన దానిని పొందక, అజ్ఞానాత్=తన ఇష్టమునకు అడ్డము వచ్చిన వా రెవరిని తెలియక యుద్ధమునందు కోపము పెచ్చినవాఁ డై, శుచా=దుఃఖముతో కూడినవాఁ డై, అర్పితఃదాని నుండి గడ్డకు వచ్చుటకు శక్తిలేనివాఁ డై, భవతి=ఉండును.

30.దేహేన మానేన సఃదేహాభిమానముతో పాటు, వర్తమానేన=అభివృద్ధి చెందుచున్నట్టి, మన్యునా=కోపముచేత, కామి=విషయాసక్తుఁడైన, ఈ జీవి, ఆత్మనఃతన యొక్క, అంతాయ=దేహనాశనమునకై, కామిషు=విషయాసక్తులైన వారితో, విగ్రహం=కలహమును, కరోతి=చేయుచున్నాఁడు.

31.దేహాభిమానము ఎక్కువయ్యెడి పద్ధతిని వివరించుచున్నాఁడు-అబుధఃజ్ఞానములేని వాఁడును, కుమతిఃదుష్టబుద్ధి కలవాఁడును నైన, దేహీ=జీవుఁడు, పంచభిఃఅయిదైన, భూత్తైఃభూతములచేత, ఆరబ్ధేఏర్పడినట్టి, దేహే=శరీరమందు, అహం మమ ఇతి అసద్గ్రాహఃనేను నాది యనెడు దురాగ్రహముతో కూడిన, మతిం=బుద్ధిని, అసకృత్=పలుసారులు, కరోతి=కల్పించుకొనును.

32. అసౌ=ఈ జీవి, యద్బద్ధఃఏ కర్మచేత బద్ధుఁడై, సంసృతిం=సంసారమును, యాతి=పొందునో, మర్త్యజన్మని=మనుష్యజన్మయందు, యేన=ఏ కర్మచేత, బద్ధఃబంధింపఁ బడినవాఁ డై, యత్=ఏ, తమఃనరకమును, విశతి=ప్రవేశించునో, తత్=అట్టి, కర్మ=పుణ్యకర్మపాపకర్ములను, తదర్థం=ఆ నేను నా దనెడు దురాగ్రహము అభివృద్ధిపొందుటకై, కురుతే=ఒనరించును.

దీనినే స్పష్టపఱచు చున్నాఁడు. యేన=ఏ కర్మచేత, ఈ దృశం=నరకము మొదలైన, క్లేశం=దుఃఖమును, అవిద్య మఱియు కర్మము వీనిచేత సంసార బంధమును, యాతి=పొందునో, అట్టి కర్మనొనర్చుచున్న వాఁ డని యర్థము.

33.మనుష్యుఁడుగా జన్మించుట పరమ పురుషార్థమునకు కారణముకదా! అట్టిచో దీని నిందించుట తగునా యను సంశయమునకు సమాధానము - జంతుఃకర్మాను గుణముగా మనుష్యుఁ డై జన్మించిన జీవుఁడు, పథిఃతన సాధనకు మార్గమైన మనుష్య జన్మమందు, పునఃమరల, శిశ్నోదరకృతోద్యమైఃతన గుహ్యేంద్రియము, ఉదరము వీనిని తృప్తిపఱచెడు కార్యములందే ప్రయత్నమొనర్చికొనెడి, అసద్ధిస్సహఃఅసురస్వభావముకల మనుష్యులతో ఆశ్రితఃచేరికొన్నవాఁ డై, రమతేయది=క్రీడించుచున్నచోనో, పూర్వవత్=ఇంతకు ముందటివలెనే, తమఃనరకమును, విశతి=ప్రవేశించును.

34. ముక్తిసాధనములైన సత్యము మొదలైన గుణము లున్నపుడు పైన చెప్పిన అసత్సహవాసము తమస్సునకెట్లు కారణమగును? అనుశంకకు సమాధానము - సత్యం=సత్పురుషులకు హితకరమైన మాట, శౌచం=శారీరక మానసిక శుద్ధత, దయా=విష్ణుభక్తుల యందలిదయ, మౌనం=అయోగ్యులతో చేరి ఎక్కువగా మాటలాడకుండుట, బుద్ధిః=పురుషార్థవిషయకమైన బుద్ధియు, శ్రీః=భగవద్భక్తి సంపత్తియు, హ్రీః=శ్రీహరికి ప్రియములైన విశదకర్మ లొనర్చు టందు లజ్జయు, యశః=భగవద్భక్తి పరాయణులనెడు కీర్తియు, క్షమా=విష్ణుభక్తుల అపరాధముల క్షమించెడు స్వభావము, శమః=నిగ్రహము (శ్రీహరియందు మనోనిశ్చయము) దమ=ఇంద్రియ నిగ్రహము, భగః=ఎక్కువ ఐశ్వర్యమును, యత్సంగాత్=ఏ దుర్మార్గుల సహవాసము చేత, సంక్షయం=సంపూర్ణనాశమును, యాతి=పొందునో.

35. తేషు=అట్టి, అశాంతేషు=శ్రీహరియందు, దృఢమైన నిష్ఠమొదలైన గుణములు లేనట్టి, మూఢేషు=వివేక జ్ఞానశూన్యులైన, ఖండితాత్మస్వసాధుషు=పరిచ్ఛిన్నుఁడైన ఆత్మయనిపించుకొన్న జీవుఁడే, దేహమందున్నాఁడను నిశ్చయ జ్ఞానముతో నుండునట్టియు, చ=ఇంకను, యోషిత్ (క్రీడామృగేషు=స్త్రీల చేతి ఆటవస్తువులై ఉండునట్టి, శోచ్యేషు=దుఃఖమయమైన తమస్సులకు యోగ్యమైన వారితో, సంగం=సహవాసమును, న కుర్యాత్=చేయరాదు. అట్టి వారి సహవాసముతో సమస్త సద్గుణములు నాశమగునని అభిప్రాయము.

36. మోహకారణమైన స్త్రీల సహవాసము పరమ దుఃఖకరమైనదని చెప్పుచున్నాఁడు- యథా=ఎట్లు యోషిత్సంగాత్=స్త్రీల యొక్క, సహవాసముచేతను, మఱియు, యథా=ఎట్లు, తత్సంగి సంగతః=ఆ స్త్రీలయొక్క సహవాసమందే కాలము గడపునట్టి వారి సంగతి చేతను, పుంసాం=పురుషులకు బంధము, మోహము ఏర్పడునో, తథా=అట్లు, అస్యాం=ఈ జీవునకు, అన్యప్రసంగత=పేఱు పామరజనుల సహవాసముచేత మోహమును, బంధమును, న భవేత్=ఏర్పడదు.

37. ఈ విషయమందు కైముత్యనాయమును చెప్పుచున్నాఁడు - ప్రజాపతిః =బ్రహ్మదేవుఁడు, దుహితరం=తన బిడ్డను, దృష్ట్వా=చూచి, తద్రూప ధర్షితః =ఆమె యొక్క సౌందర్యము చేత వికారమును పొందిన మనస్సు కలవాఁడై, సః=ఆ బ్రహ్మదేవుఁడు, హతత్రపః=సిగ్గులేని వాఁడై, ఋశ్యరూపే=మృగా కారముతో, రోహిద్భూతాం=ఆఁడు జింకగానున్న, తాం=ఆమెను, అన్వధావత్= అనుసరింఛి వరువెత్తెను, "దుహితరం" అని చెప్పుటచేత స్త్రీ లత్యంత మోహమును కలిగింతురని సూచించినాఁడు. బ్రహ్మదేవుఁడిట్లు ప్రవర్తించె నని చెప్పుట ఆజ్ఞానులను మోహము నందించుటకు. "న కర్హిచిన్మే మనసో మృషాగతిః" అని చెప్పుట చేత బ్రహ్మ దేవుని మనస్సెప్పుడును అధర్మమందు ప్రవర్తింపదు. పెద్దల యొక్క స్థితియే ఈ రీతిగా ఉన్నపుడు ఇఁక తక్కిన వారి గతి ఏమని చెప్పుట యేని తెలియవలెను అని దీని తాత్పర్యము.

38. ఇహ=ఈ లోకమందు, తత్ సృష్ట సృష్టేషు=బ్రహ్మదేవుఁ డు ఒనర్చిన, సృష్టులైన స్వయంభువు మొదలైన వారిచేత సృష్టింపఁ బడిన ప్రియవ్రత

రాజు మొదలైన వారి యందు (2) బ్రహ్మదేవునిచేఁ సృష్టింపఁబడిన మరీచ్యాదుల చేత సృష్టింపఁ బడిన కశ్యపుఁడు మొదలైన వారినుండి సృష్టింపఁబడిన ఉత్తముఁడు మొదలైనవారి యందు, యోషిన్మయ్యా=స్త్రీ ప్రధానముగా నున్న ఆత్మమాయయా=నాయొక్క మోహక శక్తిచేత, ఋషిం=త్రికాలజ్ఞానియైన నారాయణుని, బుతే=వదలి, అఖండితధీఃఁ=బుద్ధి కలగిపోనట్టి, పుమాన్=పురుషుఁడు, కోను=ఎవ్వఁడుండును? ఎవ్వఁడు ఉండఁడని భావము. వికారమును పొందనట్టి పురుషుఁడు శ్రీహరి ఒక్కఁడే అని "నారాయణం ఋషిది" అని చెప్పినట్లైనది.

39. వేఱొక్కఁడు దాని నెందుకు జయించి ఉండఁడు? అను దానికి ఉత్తరము, యా=ఏ నాయధీనమైన మోహక శక్తి, కేవలం=కేవలము, భ్రూవిజృంభేణ=కనుబొమ్మల విజృంభణము చేతనే, దిశాం=దిక్కులనే, జయినః=జయించిన రాజులు మొదలైన వారిని పదాక్రాంతాన్=తన కధీనులుగా, కరోతి=ఒనర్చునో, తస్యాఃఁ=అంతటి, స్త్రీమయ్యాఃఁ=స్త్రీయే ప్రధానముగాఁ గల, మే మాయాయాఃఁ=నా కధీనమైన మోహకశక్తి యొక్క, బలం=బలమును, పశ్య=చూడుము. దానిని జయించిన వారు నేను దప్ప మఱెవ్వరు లేరని భావము.

40. దీనిచేత సిద్ధమైన విషయమును చెప్పుచున్నాఁడు. య అస్య=కాముకుఁడైన వీనికి, యాం=ఏ దుష్టస్త్రీని, నిరయద్వారం=నరకమునకు వాకిలని, వదంతి=చెప్పుదురో, తాసు=అట్టి, ప్రమదాసు=తత్త్వములను మఱచిపోవుటకు కారణమైన (2) యథార్థజ్ఞానమును నాశమొనర్చుటకు సాధనమైన, (3) గొప్ప మదమునకు కారణభూతలైన స్త్రీలయందు, జాతు=ఎప్పుడును, (వినోదము కూడదని భావము, యోగస్య=నా యం దొనర్చెడు భక్తి యోగము యొక్క, పరం పారం=తన యోగ్యత కనుసారమైన యోగ్యతను, ఆరురుక్షుఃఁ=పొందుట కపేక్షించెడు వాఁడు, మత్సేవయా=నా విషయమును తెలుపునట్టి, వేదాంతాది శాస్త్రముల శ్రవణముచేత, ప్రతిలబ్ధాత్మ లాభఃఁ=విషయములను త్యజించి స్వరూపానందమును సంపాదించినట్టియు, దాని నుండి పరితుష్టుఁడైన భక్తుఁడు, సంగం=అనురాగ రూపమైన ఆసక్తిని, న కుర్యాత్=చేయరాదు. "ఆత్మభావఃఁ=అనెడు పాఠమందు పరమాత్మ యందు భక్తిని సంపాదించిన వాఁడని యర్థము. సర్వథా స్త్రీలయందు అనురాగముంచరాదని తాత్పర్యము. 35వ శ్లోకమందు చెప్పిన "అశాంతా మూఢా" మొదలైన విశేషణములను స్త్రీలకు కూడ చేర్చుకొనవలెను. ఈ అభిప్రాయమును సూచించుట కొఱకు "ప్రమదాసు" అనుపదము ప్రయోగింపఁ బడినది. అందుచేత సజ్జనులందలి స్నేహమెట్లు నిషిద్ధముకాదో అట్లే జ్ఞాన సాధనకు కారణభూతలై, యోగ్యలై, పతివ్రతలైన భార్యలందు అనురాగము కూడ నిషిద్ధము కాదని తెల్పినట్లైనది. దీనికి ప్రమాణము-

సత్సంసు చ తథా స్త్రీషు న సంగో దోష మావహేత్,
యథా యోగ్యగుణాయైవ దోషకృద్దుష్ట జంతుషు.

దుష్ట స్త్రీలు సర్వథా జయింపతగినవారు. అగ్ని సమీపమందలి నేయి కరుగునట్లు స్త్రీ సంసరముతో పురుషుని మనస్సు వికారము నందును. ద్రాక్షారసము మొదలైనవి త్రాగినది మదమును కలుగఁజేయవు. కాని ఈ స్త్రీయను మద్యము చూచినవెంటనే మదమును కలిగించును. అందుచేత వీరిని చూడను కూడ చూడ రాదని భావము.

41. మరల నదే విషయమును వివరించుచున్నాఁడు - యా=ఏ దేవనిర్మితా=శ్రీహరిచేత సృష్టింపఁబడిన, యోషిత్=స్త్రీ అనెడు, మాయా=మాయా శక్తి, ఉప యాతి=భార్యగా సమీపించునో, తాం=ఆమెను, ముముక్షుః =ముక్తియోగ్యఁ డైన జీవుఁ డు, ఆత్మనఃతనకు, మృత్యుం=మృత్యువని, ఈక్షేత=చూడవలెను. తృణైఃగడ్డి మొదలగువానిచేత, అవృతం=కూడిన, కూపం ఇవ=బావివలె, ఈక్షేత.

42. పతిఃభర్త, యాం=దేనిని, మోహాత్=మోహమునుండి, స్త్రీ సంగతఃశబ్దాదులందు ఆసక్తికారణముగా, స్త్రీత్వం=స్త్రీ స్వభావమును, ప్రాప్తాం=పొంది నట్టి, అయినను ఋషభాయతి=రతి కాలమందు పురుష ధర్మము తన యందారోపించుకొని పురుషాయితము నొనర్చెడి మన్మాయాం=నా కధీనమైన మోహకశక్తిని, విత్తాపత్యగృహప్రదాం=ధనమును, సంతానమును, ఇల్లు మొదలగువానిని ఇచ్చుదానిగా, మన్యతే=భావించునో, వీనిని తన మృత్యువుగా తెలియవలెనని భావము.

43. ఇట్లే హరిభక్త్యాదిగుణయుక్తమైన భార్యయు ఇట్టి గుణములు లేని భర్తను మృత్యువుగనే ఎంచవలెనని చెప్పుచున్నాఁడు-పత్నీ అపిహరి భక్త్యాదిగుణములచే కూడిన స్త్రీకూడ, విత్తాపత్యగృహాత్మకంగృహాదులకు మాత్రమే స్వామియైన, తంగుణహీనుఁ డైన పురుషుని, మృగయోఃవేటకాని యొక్క, గాయనంసంగీతము, యథాఎట్లు మృగము యొక్క బంధనమునకు కారణ మగునో, తథా దైవోపసాదితంఅదృష్టనియామకుఁ డైన శ్రీహరిచే ప్రాప్తినొందింపఁబడిన, ఆత్మనఃమృత్యుంనరక కారణమైన వస్తువని, విజానీయాత్తెలియవలెను. పైన చెప్పిన సజ్జనుల స్నేహము గుణకారి యనెడు ప్రమాణమును ఇచ్చట కూడ గ్రహింపవలెను.

44. జ్ఞానము లేక కర్మము క్షయింపదు. కర్మపరంపరకు కారణ మగునని చెప్పుచున్నాఁడు. జీవభూతేనజీవుని కర్మఫలముగా సంప్రాప్తించిన, దేహేన=దేహముచేత, లోకాత్దేహము నుండి, లోకంమఱియొక్క, దేహమును, సంచరన్పొందుచు, పుమాన్, భుంజాన ఏవకర్మఫలమును అనుభవించు చున్నపుడే, కర్మాణిరాఁ బోవు దేహములకు కారణభూతమైన కర్మలను, అవిరతంఎప్పుడును, కరోతిచేయుచున్నాఁ డు. తనకు యోగ్యురాలైన భార్య లభింపకుండుటకు కర్మయే కారణ మని చెప్పుచున్నాఁడు.

45. జీవలక్షణమును వివరించుచున్నాఁ డు - భూతేంద్రియమనోమయఃపంచభూతములు, ఇంద్రియములు, మనస్సు - ఇవికల్గిన, దేహఃదేహము, యస్యఎవనికి, అనుగఃఅనుసరించి వచ్చుచుండునో, సఃవాఁ డు, జీవఃఁ

=జీవుఁడు. "పుట్టెను, చచ్చెను" అను వ్యవహార విషయమే జీవుఁడు దీనిచేత జీవు లనిత్యులనీ శంకింపరాదు. దేహవియోగమే మరణము. సంయోగమే జన్మ. జీవుని స్వరూపము నాశ మగుటలేదు. అట్టెనచో మోక్షయోగ్యుఁడు ఇత్యాది వాక్యములు వ్యర్థము కావలసివచ్చుననెడి అభిప్రాయముతో చెప్పుచున్నాఁడు - అస్య=జీవునకు, తన్నిరోధః=దేహనాశమే, మరణం=చావని పించుకొనును. ఆవిర్భావస్తు=దేహసంయోగమే, సంభవః=జననము. తు=ఇది కర్మానుగుణముగా వివిధముగా నుండును.

46. చెప్పిన విషయమునే స్పష్టపఱచుచున్నాఁడు - ద్రవ్యోపలబ్ధి స్థానస్య=పంచభూతములను తెలిసికొనెడు స్థానమైన శరీరమునకు, యథా, ద్రవ్యేక్షా యోగ్యతా=ఘటాది పదార్థములను తెలిసికొనెడు యోగ్యత లేకుండునో, తదా=అప్పుడు, తత్=పదార్థములను తెలిసికొన కుండుట, పంచత్వం, అహం మానాత్=నేనే దేహమనెడు అభిమానముతో, ద్రవ్యదర్శనం=పదార్థములను తెలియుటయే, ఉత్పత్తిః=జన్మ.

47. దీని కుదాహరణమును చెప్పుచున్నాఁడు - యథా=ఎట్లు, అక్ష్ణోః =కన్నులకు, ద్రవ్యావయవదర్శనా యోగ్యతా=బలుపు మొదలైన రూపములను తెలిసికొనుటయం దసామర్థ్యము (కామెరలు మొదలైన దోషముచేత) యదా=ఎప్పుడు ఏర్పడునో, తదైవ=అప్పుడే, చక్షుషః=కంటియొక్క, సాయముతో, ద్రష్టుః=చూచెడు జీవునకు ద్రష్టృత్వం=చూచెడు వాఁడను వ్యవహారము, న=లేక పోవును, అనయోః యోగ్యతా=సామర్థ్యం, యదా=ఎప్పుడు ఉండునో, తదైవ=అప్పుడే జీవునకు, ద్రష్టృత్వం=చూచువాఁడను వ్యవహారమేర్పడును.

48. ఇచ్చట చెప్పిన సంసారియైన జీవుఁ డు చేతనుఁ డగుటచేత వాఁ డు బ్రహ్మమే దప్ప వేఱుకాదు. సంసారమునందు వాఁ డు బ్రహ్మమే. ముక్తుఁ డగువాఁడు కూడ వాఁడే యని అద్వైతు లందురు కదా! దాని కుత్తరము చెప్పుచున్నాఁడు. పుంసః=దేహియొక్క, ఇంద్రియాణి=కన్ను మొదలైన ఇంద్రియములు, యథా=ఎట్లు, పదం స్వగతం=తమ తమ విషయములైన రూపాదులను తన్నిమిత్తమైన సుఖములను దుఃఖములను, విందంతి=ఎఱుఁగునో, అన్యగతం=వేఱు ఇంద్రియము విషయముగాని, వేఱు ఇంద్రియము సుఖదుఃఖములను గాని, న విందంతి=తెలియలేదో అనఁగా కన్ను చేయుపని చెవి చేయలేదు, చెవికార్యము కన్ను నిర్వహింపలేదు కదా! అందుచేత ఎట్టు పరస్పరము భిన్నములో, తథా=అట్లే, ఈశాంశాః=పరబ్రహ్మ యొక్క భిన్నాంశలైన జీవులు, సంసారము ననుభవింతురు. పృథక్కలాః=పరస్పర భిన్నులు, మఱియు శ్రీహరికంటె భిన్నులు, "య స్సర్వజ్ఞః" అనెడు శ్రుతి ఈ విషయమందు ప్రమాణము.

49. అట్టెనచో జీవుఁ డెప్పుడును సంసారబంధమందే ఉండవలసి వచ్చును. దానినుండి ముక్తుఁ డగుట లేకపోవును. ఈ దుఃఖమును పోఁ గొట్టు కొనుటకు సాధనమే లేకపోవును కదా అనుటకు ప్రమాణము - దేహాద్యసంగినః=దేహాభిమాన శూన్యుఁడైన, ఆత్మనః=జీవునకు, జ్ఞానం=శ్రీహరి ఒకఁడే వానియందు భేదము లేదనెడు జ్ఞానము, అర్థః=పురుషార్థము, దేహాభిమానరహితుఁ డైన జీవునకు

సుఖదుఃఖాది జ్ఞానము ఎట్లెర్పడును? ఆ ప్రకారమును చెప్పుచున్నాఁడు. ఆత్మనఃసుఖ దుఃఖాది స్వరూపుఁడైన జీవునకు, సుఖ దుఃఖాదయోభావాః = బయట సుఖ దుఃఖాది భావములు, న సంతి=ఉండవు, దేహస్య=అచేతనమైన దేహమునకు, న సంతి=ఉండవని, చ=వేఱుగా చెప్పనేల? దేహాభిమాన శూన్యుఁడని చెప్పుట చేత ఈ జ్ఞానమే సంసారనివృత్తికి సాధనమని చెప్పినట్లైనది. పురుషార్థ మనుటచేత శ్రీహరికి సంబంధించిన జ్ఞానము సంసారదుఃఖనివర్తకమని చెప్పినాఁడు.

"బలమానంద ఓజస్య" ఇత్యాది శ్రుతుల చేత సుఖాదుఁలాత్మ స్వరూపమని సిద్ధము.

50. ఏ కారణముచేత దేహమునకు గాని జీవునకు గాని బయటి సుఖదుఃఖాది భావములు లేవో అవి కేవల దేహాభిమానరూపమైన అజ్ఞానముచేత నేర్పడినవో, తస్మాత్=ఆ కారణముతో, సంత్రాసఃభయము, న కార్యఃపడవలసినదికాదు. కార్పణ్యం=దైన్యము, న కార్యం, సంభ్రమఃఆతురతయు న కార్యఃం.

51. జీవన్ముక్తు లీలోకములో నెట్లుందురు? దానిని చెప్పుచున్నాఁడు - యస్య=ఏ దేహాద్యభిమాన రహితుఁడైన జీవుని యొక్క (అపరోక్షజ్ఞాని యొక్క,) కళేబరం=ప్రారబ్ధకర్మానుగుణముగా వచ్చిన దేహము, మాయా విరచితే=శ్రీహరి ఇచ్ఛచేత నిర్మితమైన, లోకే=కర్మభూమియందు, చరేత్=ఉండునో, సఃఆ, ముక్తసంగఃశ్రీహరికంటె భిన్నమైన లౌకిక విషయములందు ఆసక్తి లేని, ధీరఃగంభీరుఁడైన జ్ఞానియైన జీవుఁడు, సమ్యగ్దర్శనయా=సమీచీనమైన జ్ఞానమునకు, యోగవైరాగ్యయుక్తయా=భక్తియోగము వైరాగ్యము వీనిచేత కూడిన, బుద్ధ్యా=బుద్ధిచేత, జీవగతిం=జీవులు పొందెడి స్వర్గనరకాదులను, జీవుల కాశ్రయుఁడైన శ్రీహరిని, బుధ్వా=తెలిసికొని, వానినె నిరంతరము సేవించుచు, చరేత్=చరింపవలెను.

ఇతి శ్రీమద్భాగవతే తృతీయస్కంధే సుధాలహరి వ్యాఖ్యాయాం
ఏకత్రింశోఽధ్యాయఃసమాప్తఃం.

అధ్యాయము - 31

కపిలుండు దేవహూతికిఁ బిండోత్పత్తి క్రమము తెలుపుట

సీ. కైకొని మఱి పూర్వ కర్మానుగుణమున
శశ్వత్తకాశకుం డీశ్వరుండు
ఘటకుండు గావునఁ గ్రమ్మఱి జీవుండు
దేహసంబంధంబుఁ దివిరి తాల్చి
దొరఁ కొని పురుషరేతో బిందుసంబంధి
యై వధూ గర్భంబునందుఁ జొచ్చి
కైకొని యొక రాత్రిఁ గలిలంబు పంచరా
త్రముల బుద్బుదమును దశమ దివస

తే. మందు గర్భంధువై యుండు నంత మీఁ దఁ
బేశి యగు నంతమీఁదటఁ బేర్చియండ
కల్పమగు నొక్కనెల మస్తకమును మాస
యమళ మైనను గరచరణములఁ బొడము. 982

వ. మఱియు మాసత్రయంబున నఖరోమాస్థి చర్మంబులు లింగచ్ఛిద్రంబులును గలిగి, నాలవ మాసంబున సప్తధాతువులు, పంచమ మాసంబున క్షుత్తృష్ణలు గలిగీ, షష్ఠమాసంబున మావిచేత బొదువంబడి, తల్లి క్షుక్షిని దక్షిణ భాగంబునం దిరుగుచు, మాతృభుక్తాన్న పానంబుల వలనఁ దృప్తిం బొందుచు, సమస్త ధాతువులును గలిగి జంతు సంకీర్ణంబగు విణ్మూత్ర గర్తంబందుఁ దిరుగుచు, గ్రిమి భక్షిత శరీరుండై మూర్ఛలం బొందుచుఁ, దల్లి భక్షించిన కటుతిక్తోష్ణలవణ క్షారామ్లాద్యుల్బణంబులైన రసంబుల చేతఁ బరితప్తాంగుం డగుచు, జరాయువున గప్పంబడి, బహిఃప్రదేశంబునందు నాంత్రంబుల చేత బద్ధుండై, కుక్షియందు శిరంబు మొపికొని భుగ్నంబైన పృష్ఠగ్రీవోదరుండై, స్వాంగ చలనంబు నందు నసమర్థుం డగుచుఁ, బంజరంబులందు బద్ధశకుంతంబు చందంబున నుండి, దైవకృతంబైన జ్ఞానంబునం బూర్వ జన్మదుష్కర్మ శతంబులం దలంపుచు, దీర్ఘోచ్ఛ్వాసంబు సేయుచు నే సుఖంబును బొందక వర్తించు అంత నేడవ మాసంబున లబ్ధజ్ఞానుండై చేష్టలు గలిగి, విష్ణుమి సోదరుండై యొక దిక్కున నుండక సంచరింపుచుఁ, బ్రభూతి మారుతంబులచేత నతివేపితుం డగుచు, యాచమానుండును దేహాత్మ దర్శియుఁ బున ర్గర్భవాసంబునకు భీతుఁడు నగుచు బంధన భూతంబులగు సప్తధాతువులచే బద్ధుండై, కృతాంజలి పుటుండును దీనవదనుండునై, జీవుండు దా నెవ్వానిచే నుదరంబున వసియింప నియమింపం బడె నట్టి సర్వేశ్వరు నిట్లని స్తుతియించు. 983

గర్భస్థుం డగు జీవుండు భగవంతుని స్తుతించుట

కం. అనయమును భువన రక్షణ
మునకై స్వేచ్ఛానురూపమునఁ బుట్టెడి వి
ష్ణుని భయ విరహిత మగు పద
పేనజయుగం బర్థిఁ గొల్తు వారని భక్తిన్. 984

వ. అదియునుంగాక పంచభూత విరహితుం డయ్యుం బంచభూత విరచితం బైన శరీరంబు నందుఁ గప్పంబడి, యింద్రియగుణార్థ చిదాభాస జ్ఞానుండ నైన నేను. 985

నీ. ఎవ్వఁ డు నిఖిల భూతేంద్రియ మయమగు
మాయావలంబన మహిత కర్మ
బద్ధుఁ డై వర్తించు పగిది దందహ్య మా
నం బగు జీవచిత్తంబునందు

నవికారమై శుద్ధమై యఖండ జ్ఞాన
మున నుండు వానికి ముఖ్య చరితు
నకు నకుంఠిత శౌర్యునకుఁ బరంజ్యోతికి
సర్వజ్ఞునకుఁ గృపాశాంత మతికిఁ

తే. గడఁ గియుఁ బ్రకృతి పురుషుల కంటెఁ బరముఁ
డైన వానికి మ్రొక్కెద నస్మదీయ
దుర్భరోదగ్ర భీకర గర్భనరక
వేదనలు మాన్చి శాంతిఁ గావించు కొఱకు. 986

సీ. నావుడు సుతునకు దేవహూ తిట్లను
మహితాత్మ! ఎవ్వని మాయచేత
ఘనమోహులై గుణకర్మ నిమిత్త సాం
సారిక మారసంచారములను
ధృతిచెడి యెలసి యీ దిక్కు నెఱుంగక
హరిపద ధ్యానంబు నాత్మ మఱచి
యుండు వారలకు నే యుక్తియు న మ్మహా
పురుషు ననుగ్రహబుద్ధి లేక.

తే. తదుణ ధ్యాన తన్మూర్తి దర్శనములు
గోచరించుట యెట్లు! నాకును బ్రబోధ
కలితముగ నానతిమ్మన్నఁ గపిలుఁ డనియె
నంబతోడను సుగుణకదంబతోడ. 987

వ. అట్టి ఈశ్వరుండు కాలత్రయంబునందును జంగమ స్థావరాంతర్యామి యగుటం జేసి జీవకర్మ మార్గంబులం బ్రవర్తించువారు తాపత్రయ నివారణంబు కొఱకు భజియింతు రని చెప్పి మఱియు నిట్లనియె. 988

కం. జనయిత్రి! గర్భమందును,
ఘనక్రిమి విణ్మూత్ర రక్తగర్తము లోనన్
మునుఁగుచు జఠరాగ్నిని దిన
దినమును సంతప్యమానదేహుం డగుచున్. 989

ఆ. దీనవదను డగుచు దేహి యీ దేహంబు
వలన నిరమింపఁ దలఁ చి చనిన
నెలల నెన్నో కొనుచు నెలకొని గర్భంబు
వలన వెడలఁ ద్రోయువారు గలరె? 990

వ. అని తలంపుచు దీన రక్షకుండైన పుండరీకాక్షుండు దన్ను గర్భన రకంబు వలన విముక్తునిం జేయ న మ్మహాత్మునికిఁ బ్రత్యుపకారంబు సేయలేమికి నంజలి మాత్రంబు సేయం దగు నట్టి జీవుండనైన నేను శమ దమాది యుక్తంబైన శరీరంబునందు విజ్ఞాన దీపాంకురంబునం బురాణపురుషు నిరీక్షింతు. అని మఱియు నిట్లనియె. 991

సీ. నెలకొని బహుదుఃఖములకు నాలయ మైన
యీ గర్భ నరకము నేను వెడలఁ
జాల బహిఃప్రదేశమునకు వచ్చిన
ననుపమ దేవమాయా విమోహి
తాత్ముండనై ఘోర మగునట్టి సంసార
చక్రమందును బరిశ్రమణ శీలి
నై యుండ వలయుఁ దా నదిగాక గర్భంబు
నందుండు శోకంబు నపనయించి

తే. యాత్మ కనయంబు సారథియైన యట్టి
రుచిర విజ్ఞానమునఁ దమోరూపమైన
భూరి సంసార సాగరోత్తారణంబు
చేసి యీ యాత్మ నరసి రక్షించు కొందు. 992

వ. మఱియును. 993

చ. భరమగుచున్న దుర్వ్యసన భాజనమై ఘనదుఃఖమూలమై
యరయఁ గఁ బెక్కుతూట్లు గలదై క్రిమి సంభవమైన యట్టి దు
స్తర బహుగర్భ వాసముల సంగతి మాన్పుటకై భజించెదన్
సరసిజనాభ భూరిభవ సాగర తారక పాదపద్మముల్. 994

కం. అని కృతనిశ్చయుఁ డై యే
చిన విమల జ్ఞాని యగుచు జీవుఁ డు గర్భం
బున వెడల నొల్లకుండన్
జనియెడు నవమాసములును జననీ! యంతన్. 995

వ. దశమ మాసంబున వాని నధోముఖుం గావించిన నుచ్ఛ్వాస నిశ్శ్వా
సంబులు లేక ఘనదుఃఖ భాజనుండును, విగత జ్ఞానుండును, రక్త
దిగ్ధాంగుండునై (విష్ఠా క్రిమింబోలి నేలంబడి యేడ్చుచు జ్ఞానహీనుండై
జడుంబోలె నుండి యంత నిజభావానభిజ్ఞులగు) నిత్తెరులవలన
వృద్ధింబొందుచు నభిమతార్థంబులం జెప్పనేరక యేనేక కీట సంకులంబైన
పర్యంకంబునందు శయానుండై యవయవంబులు కండూయ మానంబులైన
గోత నేరక యాసనోత్తాన గమనంబుల నశక్తుండై తన శరీర చర్మంబు
మశక మత్కుణ మక్షికాదులు వొడువఁ గ్రిములచే వ్యధంబడు
క్రిమికుం బోలి, దోయ మానుండై రోదనంబు సేయుచు, విగత
జ్ఞానుండై యుండుచు, శైశవంబునం దత్తృతీయాను భవంబుగావించి,
పౌగండ వయస్సునఁ దదనురూపంబు లగు నధ్యయనాది దుఃఖంబు
లనుభవించి, తదనంతరంబ యౌవనంబు ప్రాప్తం బైన నభిమతార్థ
ఫల ప్రాప్తికి సాహస పూర్వంబు లగు వృథా గ్రహంబులు సేయుచు
పంచమహాభూతారబ్ధం బగు దేహం బందుఁ బెక్కుమాఱు లహంకార
మమకారంబులు సేయుచుఁ దదర్థంబులైన కర్మంబు లాచరింపుచు,
సంసార బద్ధుం డగుచు, దుష్పురుష సంగమంబున శిశ్నోదర

పరాయణుండై వర్తింపుచు (నజ్ఞానంబునం జేసి వర్తిష్యమాణ రోషుం డగుచుఁ, దత్ఫలంబు లగు దుఃఖంబు లనుభవింపుచుఁ, గాముకుండై నిజ నాశనంబునకు హేతువు లగు కర్మంబులం బ్రవర్తింపుచుండు) మఱియును. 996

సి. జనయిత్రి! సత్యంబు శౌచంబు దయయును
ధృతియు మౌనంబు బుద్ధియును సిగ్గు
క్షమయును యశమును శమదమ భగములు
మొదలుగాఁ గల గుణంబులు నశించు
జనుల కసత్సంగమున నని యెఱిఁగించి
వెండియు నిట్లను వినుము మూఢ
హృదయులు శాంతి వీహీనులు దేహాత్మ
బుద్ధులు నంగనానమోహపాశ

తే. బద్ధకేళి మృగంబుల పగిదిఁ దగిలి
పరవశ స్వాంతముల శోచ్యభావు లైన
వారి సంగతి విడువంగ వలయు నందు
నంగనా సంగమము దోష మండ్రు గాన. 997

వ. దీని కొక్కయితి హాసంబు గలదు. తొల్లి యొక్కనాఁడు ప్రజాపతి తన కూఁతురైన భారతి మృగీరూపధారిణియై యుండంజూచి తదీయరూపరేఖా విలాసంబులకు నోటువడి వివశీకృతాంత రంగుండును, విగత(త్రపుండునునై (మృగరూపంబునొంది తదనుధావనంబు పాయంబని తలంపక ప్రవర్తించెం గావున) నంగనాసంగమంబు వలవదు. అస్మదీయ నాభీకమల సంజాత చతుర్ముఖ నిర్మిత మరీచ్యాద్యుద్భూత కశ్యపాది కల్పిత దేవమనుష్యాదు లందు మాయాబలంబునం గామినీ జనమధ్యం బున విఖండిత మనస్కుండు గాకుండుటకుఁబుండరీ కాక్షుండైన నారాయణ ఋషికిం దక్క నన్యులకు నెవ్వరికిని ధీర దని వెండియు నిట్లనియె. 998

తే. రూఢి నా మాయ కామినీరూపమునను
బురుషులకు నెల్ల మోహంబుఁ బొందఁ జేయుఁ
గానఁ బురుషులు సతుల సంగంబు మాని
యోగవృత్తిఁ జరింపుచు నుండవలయు. 999

కం. ధీరతతో మత్పద సర
సీరుహ సేవానురక్తిఁ జెందిన వారల్
నారీసంగము నిరయ
ద్వారముగా మనము లందుఁ దలఁ పుదు రెందున్. 1000

కం. హరిమాయా విరచితమై
తరుణీ రూపంబుఁ దాల్చి ధరఁ బర్విన బం
ధుర తృణపరివృత కూపము
కరణి నదియు మృత్యు రూపకం బగు మఱియున్. 1001

చ. ధనపశుపుత్ర మిత్ర వనితాగృహ కారణభూత మైన యీ
తనువున నున్న జీవుఁడు పదంపడి యెట్టి శరీర మెత్తిన
న్ననుగతమైన కర్మఫల మందక పోవఁగ రాదు మిన్ను ప్రాఁ
కిన భువిఁ దూఱినన్ దిశల కేగిన నెచ్చటనైన దాఁ గినన్. 1002

వ. అట్టి పురుషరూపంబు నొందిన జీవుండు నిరంతర స్త్రీ సంగంబుచే విత్తాపత్య గృహాది ప్రదం బగు స్త్రీత్వంబు నొందు. ఈ క్రమంబున నంగనారూపుం డగు జీవుండు మన్మాయచేఁ బురుష రూపంబు నొంది, ధనాది ప్రదుండగు భర్తను నాత్మ బంధకారణం బగు మృత్యువునుగ నెఱుంగ వలయు. మఱియు జీవోపాధి భూతంబగు లింగదేహంబుచే స్వావాస భూతలోకంబున నుండి, లోకాంతరంబు నొందుచుం, బ్రారబ్ధ కర్మ ఫలంబు ననుభవింపుచు, మఱలఁ గర్మాదులం దాసక్తుం డగుచు, మృగయుండు గాననంబున ననుకూల సుఖ ప్రదుం డైనను మృగంబునకు మృత్యు వగుచందంబున జీవుండు భూతేంద్రియ మనోమయంబైన దేహంబు గలిగి యుండు. అట్టి దేహనిరోధంబె మరణంబు. ఆవిర్భావంబె జన్మంబు. కాన సకల వస్తు విషయ జ్ఞానంబు గలుగుటకు జీవునకు సాధనంబు చక్షురింద్రియంబ. ద్రష్ట దర్శనీయ యోగ్యతా ప్రకారంబున జీవునకు జన్మమరణంబులు లేవు. కావున భయకార్పణ్యంబులు విడిచి, సంభ్రమంబు మాని, జీవ ప్రకారంబు జ్ఞానంబునం దెలిసి, ధీరుండై ముక్తసంగుం డగుచు యోగ వైరాగ్య యుక్తంబైన సమ్యగ్ జ్ఞానంబున మాయా విరచితం బైన లోకంబున దేహాదులం దాసక్తి మాని, వర్తింప వలయు. అని చెప్పి వెండియు నిటనియె. 1003

ఇది పోతనామాత్య విరచితంబైన ఆంధ్ర మహాభాగవతమున
తృతీయస్కంధమున ముప్పది యొకటవ అధ్యాయము.

982. పూర్వకర్మాను గుణమునన్=పూర్వకర్మకు తగినట్లుగా, శశ్వత్ కాశకుండు=ఎక్కువగా కలిగెడు ప్రకాశము కలవాఁడు, ఘటకుండు=సంబంధ మును కలిగించెడు వాఁడు, దొరకొని=ప్రయత్నించి, యమళము=రెండు, జత.

తాత్పర్యము : పూర్వజన్మమందు తా నొనర్చిన కర్మ ననుసరించి జీవికి దేహము ప్రాప్తించును. ఆ శరీర సంయోగము కలిగించు వా డీశ్వరుఁడే. ఆ యీశ్వరుని ఆజ్ఞాను సారముగా జీవుఁ డు దేహమును ధరించును. వాఁడు పురుషుని రేతో బిందువునందు చేరును. దాని ద్వారా స్త్రీ గర్భమందుఁ జొచ్చును ఒక రాత్రిలో ఆ జీవుఁ డు గంజివలె నగును. ఐదు దినముల తర్వాత బుద్బుదమువలె మారును. పది దినములకు కొంత గట్టిపడును. ఆ తరువాత పేశి అనిపించుకొనును. పిదప గ్రుడ్డంత యగును. ఒక్క నెలకు శిర మేర్పడును. రెండు నెలలైనపుడు కాళ్ళు చేతు లేర్పడును.

983. మాసత్రయంబునన్=మూఁడు మాసములకు, నఖరోమాస్థి చర్మంబులు =గోళ్ళు, రోమములు, ఎముకలు, చర్మము, లింగచ్ఛిద్రంబు=మర్మావయవములు,

సప్తధాతువులు=ఏడు ధాతువులు, క్లుత్పృష్ణలు= ఆకలిదప్పులు, మావి=బిడ్డను గప్పెడు ఒక విధమైన చర్మము, విణ్మూత్ర గర్తంబు=మల మూత్రముల పల్లము, క్రిమి భక్షిత శరీరుండై=పురుగుల చేఁతిఁ బడిన శరీరము గలవాఁడై, ఉల్బణంబులైన రసంబులు=ఎక్కువ ఘాటైన ఆహార పదార్థములు, జరాయువు =శిశువును చుట్టుకొనెడు మాంసపు బంధము, ఆంత్రములు=నరములు, భుగ్నంబైన =వంగినట్టి, పృష్ఠ గ్రీవోదరుండై=వీపుభాగము,కంఠము, కడుపు కలవాఁడై, స్వాంగచలనంబునన్=తన శరీరపు కదలిక యందు, శకుంతము=పక్షి, ఉచ్ఛ్వాసంబు=నిట్టూర్పు, లబ్ధ జ్ఞానుండై=పొందఁబడిన జ్ఞానము కలవాఁడు, విట్టిమిసోదరుండై=క్రిములచేతను, మలముచేతను కూడుకొన్న గర్భములో నున్నవాఁడై, వేపితుఁడు=వణకింపఁ జేయఁ బడినవాఁ డు, యాచమానుఁడు= యాచించు చున్నవాఁ డు, దేహాత్మ దర్శి=దేహమునకంటె ఆత్మభిన్నమైనదను జ్ఞానము కలవాఁడై, బంధన భూతంబులు=బంధంబులుగా నైనవి. కృతాంజలి పుటుండు=నమస్కరించుచున్నవాఁడు.

తాత్పర్యము : మూఁడు నెలలకు గోళ్ళేర్పడును, రోమములు కలుగును. అస్థిచర్మములు కలుగును. మర్మావయవము లేర్పడును. నాలవ మాసమందు మాంసమజ్జాదులగు సప్తధాతువులు కలుగును. అయిదవ మాసమున ఆకలిదప్పు లేర్పడును. ఆరవ మాసమందు వాని చుట్టు మావి తిన్నగా కప్పుకొనును. పురుష శిశువైనచో తల్లి యొక్క కుడుపునందు కుడివైపున తిరుగును. స్త్రీయైనచో ఎడమవైపున తిరుగును. తల్లిచేత తినఁబడిన ఆహారములే వాని కాహారము లగును. అనఁగా వాని రసము వాఁడు సేవించునన్నమాట. సప్తధాతువులు దినదినము వృద్ధి పొందును. తల్లి కడుపులో పురువులు. చాలని దానికి మలమూత్రములు. చిన్న గుహవంటి ఆ గర్భములో తిరుగును. నడుమ నడుమ కఱచెడు పురుగులు. ఆ బాధను తట్టుకొనలేక వాఁడు మూర్ఛిల్లును. తల్లి అనేకరుచులతో కూడిన ఆహారము తినును. కొన్ని కారము. కొన్ని తీపి. కొన్ని లవణము. కొన్ని చేదు. కొన్ని పులుపు. ఈ రసములు వాని శక్తికి తట్టుకొన రానివై ఉండును. ఆ రసములతో శరీరమంతయు మంట. జరాయువు వానిని పట్టుకొనును. పై భాగమునందు తల్లియొక్క నరములు - సూక్ష్ములై - చుట్టుకొని ఉండును. తలను కడుపులోనికి జొనిపి వంచుకొని ఉన్నాఁ డు. వీపు వంచుకొన్నాఁ డు. కడుపు సంకుచిత మైనది. శరీరమా చిన్న ప్రదేశ మందే ఉండవలెను. అటునిటు దేహమును కదల్చుటకు వీలులేదు వాని స్థితి పంజరమున బంధింపఁబడిన పక్షివలె నున్నది. అపుడు వానికి భగవంతుని దయచేతఁ గడచిన జన్మ లన్నియు గుర్తు వచ్చును. ఆ జన్మలలో తాను చేసిన దుష్కృత్యము లన్నియు జ్ఞాపకము వచ్చును. వానిని తలఁచికొని గట్టిగా నిట్టూర్చును. ఆ గర్భవాసమందు సుఖలేశమును

లేదు. ఇంతలో ఏడవ మాసము ప్రవేశించును. వాఁడా కలిదప్పు లెఱుఁగును. విడిపోవని పూర్వజన్మజ్ఞానము. కఱచుచున్న పురుగులు. మలమూత్రముల దుర్వాసన. ప్రసూతి మారుతములు వాని శరీరమును వడకించు చుండును. దేహ మాత్మకంటె భిన్నమను జ్ఞానము వాని కేర్పడినది. అయ్యో! మరల గర్భవాసమున బడినానుఁ బయటికి పోయిన మరల నెట్టి జీవితము గడపునో! ఆ జీవితముతో నేర్పడెడు భీతి. సప్తధాతువులు బంధకములై చుట్టుకొన్నవి. వానికి దిక్కుతోఁచదు. పరమాత్మకు నమస్కరించు చుండును. ముఖమునిండ దైన్యము. అపుడు వాఁడు తా నెవ్వరిచే గర్భమున బంధింపఁబడెనో ఆ పరమాత్మను తలఁచుకొని ఇట్లు స్తుతించును.

984.భువన రక్షణమునకై=ప్రపంచమును రక్షించుటకొఱకై, స్వేచ్ఛాను రూపమునన్=తన ఇచ్ఛకు తగినట్లుగా, భయ విరహితము=భయములేనిది, పదవనజయుగంబు=పాద పద్మముల యొక్క జంట. వారని భక్తిన్=ఎడపడని భక్తిచేత, పంచభూత విరహితుండయ్యున్=పంచభూతములచేత సంబంధము లేని వాఁడైనను, పంచభూత విరచితంబు=పృథి వ్యాదులతో కల్పింపఁబడినది. ఇంద్రియ=ఇంద్రియములు, గుణ=త్రిగుణములు, అర్థ=వీని వలన నేర్పడెడు ప్రయోజనములు, చిదాభాస=జ్ఞానము యొక్క ప్రకాశము వీనిచేత కూడిన, జ్ఞానుండు=జ్ఞానము కలవాఁడు.

తాత్పర్యము : పరమాత్మ ప్రపంచమును రక్షించుటకై అనేకావతారము లెత్తును. అపుడు వాఁడు గ్రహించు దేహములు వాని ఇచ్ఛచేత గ్రహింపఁబడినవే. అతని పాదములు భయవిరహితములు అనగా వానికి భయమే ఉండదు. ఆ పాదముల నెవ్వఁడు కొలుచునో వాఁడు భయ విరహితుఁడగు చున్నాఁడు. అనఁగా తన్ను కొలుచు వారిని భయమునుండి రక్షించునన్నమాట! అట్టి పరమేశ్వరుని పాదపద్మములను ఎడపడని భక్తిచేత సేవింతు ననుచున్నాఁడు. ఆ జీవుఁడు పంచభూతములతోనే సంబంధము లేనివాడు. కానీ పృథివ్యాదిభూతములచే నిర్మింపఁబడిన శరీరమందు బంధింపఁబడియున్నవాఁడు. గర్భమందున్నపుడు పరమాత్మ అనుగ్రహము చేత ఇంద్రియములు త్రిగుణములు వానిచే నేర్పడెడు ప్రయోజనములు స్వచ్ఛమైన జ్ఞానము వీనిని గూర్చిన నిర్ణయము కలవాఁడు. అట్టి జీవుఁడు పరమాత్మ నిట్లని ప్రార్థించుచున్నాఁడు.

986. నిఖిల భూతేంద్రియమయము=సమస్తములైన పంచ భూతములు ఇంద్రియములు వీనితో నేర్పడినది. మాయావలంబన=మాయానాశ్రయించి కొనియున్న, మహిత కర్మబద్ధుఁడై=గొప్ప కర్మలచేత బంధింపఁబడినవాఁడై, వర్తించు పగిదిన్=వర్తించునట్లుగా, దందహ్యమానము=ఎక్కువగా దహింపఁ

బడునది. జీవచిత్తంబునందున్=జీవునియొక్క మనస్సునందు, అవికారమై=వికార రహితమై, అఖండ జ్ఞానమునన్=సంపూర్ణ జ్ఞానముతో, ముఖ్యచరితునకున్= భక్తులచే భజనీయులైన చరిత్రలు గలిగి వానికి, అకుంఠిత శౌర్యునకున్= ఎదురులేని పరాక్రమము కలవానికి, పరంజ్యోతి=ఎప్పుడును జ్ఞాన స్వరూపుఁడుగా వెలుచున్నవాఁ డు. అస్మదీయ=నాయొక్క, దుర్భర=భరించుట కసాధ్యమైన, భీకర=భయమును కలిగించునట్టి, గర్భనరక వేదనలు=గర్భమునందలి నరకముతో సమానమైన తాపములు.

తాత్పర్యము : జీవుఁ డు కూడ పరమాత్ముడే. కానీ వాఁ డు భగవదిచ్ఛచేత మాయకు లోఁ బడినవాఁ డు. దేహేంద్రియాభి మానములు కలిగి పంచ భూతములు ఇంద్రియములు వీనిచేత కూడిన శరీరమందు బంధింపఁబడును. సుఖదుఃఖము లనుభవించుటనెడు మాయకు లోఁబడినవాఁడై తానొనర్చెడు పుణ్యపాపములచేత నానాజన్మలు ధరించుచు దుఃఖించును. వానితో దందహ్య మానుఁడగును. అట్టి జీవుని మనస్సునందు స్వామి అంతర్యామిగా ప్రకాశించుచునే ఉన్నాఁ డు. అంతర్యామియైన ఆ దైవము వికారశూన్యుఁ డు. శుద్ధజ్ఞాన స్వరూపుఁ డు. వానికున్న జ్ఞానము సంపూర్ణమైనది. వాని చరిత్రలు భక్తులకు భజనీయము. స్వామి పరాక్రమమున కడ్డు లేదు. వాఁడు అవినాశి. నిరంతరమును జ్ఞానస్వరూపుఁడై నివాత జ్యోతివలె ప్రకాశించు చుండును. వానికి తెలియనిది ఏదియును లేదు. దయ శాంతి అనెడు గుణములకు వాని బుద్ధియే ఆధారము, నామరూపములచేత కూడిన ప్రకృతి గుణములకు వాఁడతీతుఁడు. ఈ గర్భవేదన భరింపరానిదిగా ఉన్నది. దీనినుండి బయట పడుటకు శక్తిలేదు. వీనిని దప్పించి నాకు శాంతి ననుగ్రహించుట కొఱకు ఆ పరమాత్మకు నమస్కరించు చున్నాను.

987. నావుడు=అనఁ గా, ఎవ్వని మాయచేతన్=ఏ పురుషుని మాయవలన, ఘనమోహులై=ఎక్కువ మోహము కలవారై, గుణ కర్మనిమిత్త=గుణములచేతను, కర్మల చేతను ప్రేరేపింపఁ బడిన వారై, సాంసారిక మార్గసంచారములను=అనేక సంసారములందు సంచరించుచు, ధృతిచెడి=ధైర్యము నశించి, ఎలసి, ఏ దిక్కును, ఎఱుంగక=మార్గముతోఁ చక, ఏ యుక్తియున్=ఏ మార్గమును, తద్గుణధ్యాన=ఆ పరమ పురుషుని గుణధ్యానములు, తన్మూర్తి దర్శనములు=వాని మూర్తిని దర్శించుట, గోచరించుట ఎట్లు=ప్రాప్తమగు విధమేది? ప్రబోధ కలితముగన్=నాకు జ్ఞాన మేర్పడునట్లుగా, సుగుణకదంబతోడన్-సద్గుణముల గుంపుగల దానితో,

తాత్పర్యము : అపుడు దేవహూతి కపిలునితో నన్నది - స్వామీ! పరమేశ్వరుని మాయచేత బంధింపఁ బడిన వాఁ డై జీవుఁ డు తప్పింపని మోహమునకు వశుఁ డై పోవును. గుణములు వానిని తగుల్కొనును వాని ప్రేరణచేత నొనర్చెడు పుణ్య పాపరూపములైన కర్మలు ఆ కర్మ ఫలములైన

అనేక జన్మలు. వానితో నేర్పడెడు సంసారములు. ఈ సంసారములందు మానవుఁడు అవశుఁడై సంచరించుచుండును. వానికి దిక్కుతోఁచదు. హరిపదధ్యానము మఱచిపోయి ఉండును. వాని కే యుపాయమును తోఁచదు - ఆ యుపాయము తోఁచుటకు ముఖ్యమైన కారణము పరమాత్ముని యొక్క అనుగ్రహమే. ఆ యనుగ్రహము లేక తద్గుణధ్యాన మేర్పడదు. తన్మూర్తులను దర్శింపవలెనను జ్ఞానోదయము కూడ కలుగదు. మఱి ఆ జీవునకు గతిఏమి? నాకు స్పష్టముగా తెలియనట్లు వచింపుము. అపుడు కపిలుఁడిట్లనుచున్నాఁడు.

988. కాలత్రయంబునందును=కాలములందును, జంగమ స్థావర అంతర్యామి=సంచరించెడు జీవులు, సంచరించు సామర్థ్యము లేక ఒకచోటనే ఉన్నజీవులు వీని యందంతయు అంతర్యామియై శ్రీహరియే ఉండును. జీవుఁడు తాను సృష్టించుకొన్న కర్మముల మార్గమునకు లోఁబడి ప్రవర్తించుచుండును. అట్టివాఁడు తాపత్రయములు నివారించు కొనుటకు ఆ పరమాత్మను భజించును. వానికి భజించు జ్ఞానము కూడ పరమాత్ముని యనుగ్రహముచేతనే లభింపవలెను.

989.....995. జనయిత్రి=ఓ తల్లి! ఘనక్రిమి=ఎక్కువైన పురుగులు, విణ్మూత్ర=మలమూత్రములు, రక్త=రక్తము -- వీనిచేతకూడిన, గర్తములోనన్=బొఱియవంటి దానిలో, జఠరాగ్నినిన్=ఆకలిచేత, సంతప్యమాన దేహుండు=తపింప జేయఁబడుచున్న దేహము కలవాఁడు, నిర్గమింపన్ దలఁచి=బయటపడఁదలచినవాఁడై, ఎన్ని కొనుచున్=లెక్కించుచు, దీనరక్షకుఁడు=దీనులను రక్షించువాఁడు, విముక్తినిన్ జేయన్=విడివడిన వానినిచేయఁగా, ప్రతి+ఉపకారము=బదులుగా మేలు, నిరీక్షించెదన్=చూచెదను - అనుపమ=సాటిలేని, దేవమాయ=దేవమాయచేత, విమోహితాత్ముండనై=మోహింపఁచేయఁబడిన బుద్ధి కలవాఁడనై, పరిభ్రమణ శీలుఁడు=తిరుగుచుండు వాఁడు, అపనయించి=పోఁగొట్టి, తమోరూపమైన=చీకటిని పోలిన, భూరి=ఎక్కువైన, సంసార సాగర+ఉత్తారణంబు=సంసార సాగరమును దాటుట, భరమగుచున్న=సహించుటకు భారమైన, దుర్వ్యసన భాజనమై=గొప్పవ్యసనమునకు ఆధార భూతమైనదై, ఘనదుఃఖ మూలమై=ఎక్కువ దుఃఖముతో కూడినదై, తూట్లుగలదై=రంధ్రములు గలదై, కృతనిశ్చయుఁడై=నిశ్చయించికొన్నవాఁడై, విమలజ్ఞాని=గొప్పజ్ఞానము కలవాఁడు, ఒల్లకుండన్=ఇష్టములేక, నవమాసములు=తొమ్మిదినెలలు.

తాత్పర్యము : తల్లీ! గర్భములో జీవుఁడు పొందెడు వేదనలు వర్ణింప తరముకాదు. పురుగులు వానిచుట్టును పారాడుచుండును. మలమూత్రముల దుర్వాసన. చాలని దానికి చుట్టునున్న రక్తము. జఠరాగ్ని ఎక్కువగా

పీడించుచుండును. దానిచేత వానిదేహ మంతయు సొమ్మసిల్లినట్లుండును. వాని ముఖమునందు క్రమ్మికొన్న దైన్యము. కాని ఏమిచేయును? ఆ గర్భగహ్వారమునుండి బయటికి రాలేఁడు. ఎన్నినెలలు గడచినవని ఎంచుకొనుచుండును. నన్నీ గర్భమునుండి బయటకు త్రోయువారెవ్వరైన ఉన్నారా అని వెదకును? ఎవ్వరున్నారు?అని దీన రక్షకుఁడైన పుండరీకాక్షుఁడే చేయవలెను. అతఁ డా పనిచేయఁ గల్గినందులకు తాను చేయు ప్రత్యుపకార మేమి? ఒక్క నమస్కారమే. తన మనస్సులో వాఁడను కొనును. "నేను భగవంతునకే ప్రత్యుపకారము చేయలేను. ఈ గర్భమందు నా శరీరము శమదమాది సంపన్నమై ఉన్నది. నాకు పరమాత్ముని అనుగ్రహముచేత విజ్ఞానము సిద్ధించినది. ఈ విజ్ఞాన మనెడు దీపము సహాయముతో ఆ పుండరీకాక్షుని దర్శింతును" వాఁడు మఱియు నిట్లనుకొనును. "స్వామీ! ఈ గర్భము బహుదుఃఖములకు కారణమైనది. ఇది ఒక్క నరకవేదనకే సరి. నేను ఈ గర్భమునుండి బయట పడుటకు నాకు శక్తిలేదు. ఒకవేళ గర్భమునుండి బయటికి వచ్చినను మరల నీ దేవమాయ నన్నాక్రమించును. దానిచే నామనస్సు స్వాధీనము తప్పి ఎన్నియో పుణ్యపాపము లొనర్చును. అనుక్రమముగా పలుజన్మ లెత్తుచుండును. ఇఁక మీఁద నేను విమోహితుఁడనై ఉందును. నా మనస్సును విజ్ఞాన మనెడు సారథియే నడుపుఁగాక. విజ్ఞాన సాహాయ్యముతో సంసారమందు బ్రదికి ఈ జనన మరణము లనెడు సముద్రమును దాఁటుటకు ప్రయత్నింతును. స్వామీ! ఈ గర్భదుఃఖము భరింపరా కున్నది. ఈ వ్యసనమునకు తాళలేను. అనేక రంధ్రములతో కూడిన ఈ గర్భమున వసించుటకు నేఁన వశుఁడనై ఉన్నాను. ఈ బహు గర్భవాసములు నేను సృష్టించుకొన్నవే. పరమపురుషా! ఈ గర్భవాసముల సంగతిని నాకు తప్పించుటకై నీకు నమస్కరించుచున్నాను. నీ యనుగ్రహము నాపై వర్షించుగాక! సంసార తారకములైన నీపాద పద్మములే నాకు శరణ్యము" ఈ రీతిగా జీవుఁడు వాపోవుచుండును. వాఁ డు గర్భములో నున్నంతవరకు గొప్ప విజ్ఞాని. గర్భవాసము బహుదుఃఖ భాజనము. బయటికి పోయినచో నేమగును. మరల దేవమాయ ఆక్రమించునేమో! ఈ భావనలు ఉండవేమో. ఈ వికల్పములతో వాఁ డు తడపడును. ఇంతలో నవమాసములు గడచును.

996....998. అధోముఖుఁ డు=తల్లక్రిందులుగా నున్నవాఁ డు, ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు=గాలిపీల్చుట వదలుటలు, దుఃఖభాజనుండు=దుఃఖములకు పాత్రమైన వాఁడు, రక్తదిగ్ధాంగుండు=రక్తముచేత కూడుకొన్న శరీరము కలవాఁడు, విష్ఠాస్థ క్రిమిన్ పోలి=మలమందున్న పురుగువలె, అభిమతార్థంబులు=తనకు కావలసిన పదార్థములు, శయానుండు=పవ్వళించినవాఁ డు, కండూయమానములు =నవగలవి, ఆసన, ఉత్తాన గమనములు=కూర్చుండుట, లేచుట, పోవుట

మొ॥ క్రియలు, మశక=దోమలు, మత్కుణ=నల్లులు, మక్షికాదులు=ఈగలు మొదలైనవి. క్రిమినింబోలి=చిన్న పురుగువలె, అధ్యయనాది దుఃఖములు=వేదము చదువుట మొ॥ దుఃఖములు. తదర్థములు=అశరీరమునకై ఏర్పడినవి. దుష్పురుష సంగమంబు=చెడ్డవారి సహవాసము, వర్ధిష్యమాణ=వృద్ధిపొందుచున్న, రోషండు= రోషము గలవాఁడు, అసత్సంగంబున=దుష్టులతోడి సహవాసముతో, దోహాత్మ బుద్ధులు=దేహమే ఆత్మయను కొనువారు, పరవశ స్వాంతములన్=లోఁబడిన మనస్సులచేత, శోచ్యభావులు=తిరస్కరింపఁ దగిన భావములు కలవారు, మృగీరూపధారిణి=ఆఁడుజింకగా నున్నది, ఓటువడి=లోఁబడి, విగతత్రపుఁడు= సిగ్గులేనివాఁడు, అనుధావనము = వెంటనంటి పరువెత్తుట.

తాత్పర్యము : ఇంతలో పదియవ మాస మేతెంచును. అపుడు వాఁడు అధోముఖుఁడగును. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసము లాడుట కష్టమగును. ఆ దుఃఖ మొకటి తగుల్కొనును. తనకు ఇంతవఱకును ప్రాప్తించిన జ్ఞానము మాయమై పోవును. శరీరమున కంటుకొన్న రక్తము. మలమునందలి క్రిమివలెనే వాఁడు సూతిమారుతములచేత త్రోయఁ బడినవాఁ డై గడ్డకు వచ్చును. వచ్చిన వెంటనే రోదన మారంభమగును. వాఁ డొక మూఢునివలె ఉండును. ఇతరులు వానిని పెంతురు. తనకుఁగావలసిన పదార్థములు వారితో చెప్పలేఁడు. నోరులేదు. వారు ఊయలలో పండఁబెట్టెదరు. దాని నిండ మలమూత్రముల కంపు. శరీరమున నవలెత్తుకొనును. గోకికొనుటకు సాధ్యముకాదు. కూర్చొనలేఁడు, లేవ లేఁడు, పారాడ లేఁడు తన శరీరమును నల్లులు, ఈగలు, దోమలు మొ॥ పెరుకుచుండును. పెద్ద పురుగుల చేత భక్షింపఁబడెడు చిన్న పురుగువలె వాఁడగును. అన్నిటికినీ వానికి తోఁచునది ఒక్కరోదనమే. అది ఎవ్వరికినీ అర్థము కాదు. ఈ రీతిగా చిన్నతనమునందు దానికి తగిన దుఃఖములు అనుభవించును. ఇంతలో పౌగండవయసు ప్రాప్తించును. ఆ వయసులో అధ్యయనాది దుఃఖములు. ఆ తరువాత యౌవనము. ఆ యౌవనములో వాని కనేక పదార్థములు గావలసి వచ్చును. వానిని సంపాదించుటకు వ్యర్థ ప్రయత్నములు చేయును. పాంచభౌతిక శరీరమందు వాని కహంకార మమకారములు ఉవ్వెత్తుగా పెరుగును. ఆ శరీరమును పోషించుటకై అనేక కర్మ లొనర్చును. దుష్పురుషుల తోడ సహవాసము చేయును. శిశ్నోదర పరాయణుండై ఉండును. తాను చేయు ప్రయత్నములు ఫలింపవు. ఫలింపనప్పుడు రోష మేర్పడును. కర్మలతో ప్రాప్తించెడు దుష్పరిణామము. వాఁడు కాముకుఁడై నిజనాశమునకు కావలసిన సమస్త కార్యము లొనర్చును. ఓ తల్లి! సత్యము, శౌచము, ధైర్యము, దయ, మొ॥ సమస్త గుణములు నశించును. ఈదుష్టలములును అసజ్జనుల సహవాసమున నేర్పడునవే. కనుక వాఁడు దుష్టుల సంగతిని వదలవలెను. వారు మూఢ హృదయులు. శాంతి

లేనివారు. దేహమే ఆత్మయనెడు బుద్ధి గలవారు. స్త్రీల చేతికి చిక్కివారు స్త్రీలాడించెడు మృగములవలె నుందురు. వారి బుద్ధికి స్వాతంత్ర్యముండదు. అంతమాత్రమేకాదు. అంగనాసంగము బహుదోషములకు కారణము. దీనికొక్క కథగలదు చెప్పెదను వినుము - ప్రజాపతి యొక్క కూతురు భారతీదేవి ఒకప్పుడు ఆడు జింకయై తిరుగుచున్నది. ఆమె యొక్క రూపరేఖా విలాసములకు ప్రజాపతి మనస్సు లోఁబడినది. ఆతఁడు సిగ్గులేక ఆమె వెంటపడినాఁడు మగజింకరూపము ధరించి అతఁడు భారతీదేవి వెంటపడెను. కనుక అంగనాసంగము బహుదుష్టము. బ్రహ్మదేవుఁడు నా నాభి కమలమందు జన్మించెను. అతఁడు మరీచ్యాదులను సృష్టించినాఁడు. వారికి కశ్యపాదులుద్భవించిరి. వారే దేవమనుష్యాదులను సృష్టించినారు. కనుక స్త్రీసంగమముతో బుద్ధిచెడని వాఁడెవ్వఁడును లేఁడు. ఒక్కనారాయణ మూర్తికి మాత్రమే అది సాధ్యమైనది. అని మఱియు కపిలుఁడిట్లన్నాఁడు.

999...1000.సతుల సంగంబున్=స్త్రీలతోడి సహవాసము, యోగవృత్తిన్=యోగమార్గముతో, మత్పద నరసీరుహ=నాపాద పద్మముల యొక్క, సేవాను రక్తిన్=సేవయందలి ప్రేమతో, నిరయద్వారము=మృత్యువు యొక్క ద్వారము,

1001.....1003. హరిమాయా విరచితమై=హరియొక్క మాయచేత సృష్టింపఁబడినదై, ధరన్=ప్రపంచమందు, పర్విన=వ్యాపించిన, కూపము కరణిన్=బావివలె, పదపడి=తరువాత, అంగనా రూపుండు=స్త్రీ రూపమును పొందినట్టి, మన్మాయచేన్=నామాయచేత, జీవోపాధి భూతము=జీవుఁడు నివసించుట కాధారమైనది. మృగయుండు=వేటగాఁడు, నిరోధము=వినాశము. ద్రష్ట=చూచెడివాఁడు. దర్శనీయ=చూడఁబడుదాని. యోగ్యతా ప్రకారమునన్=యోగ్యతవలె, ముక్తసంగుండు=సంగమును వదలినవాడు. సమ్యక్ జ్ఞానము=పరిపూర్ణజ్ఞానము.

తాత్పర్యము : నామాయ స్త్రీ రూపముతో పురుషులందరికినీ మోహమును కలిగించును. అందుచేత పురుషులు స్త్రీలతోడి సహవాసమును వదలవలెను. యోగవృత్తితో చరించు చుండవలెను. నిరంతరము నాపాదపద్మములను సేవించుటందే ఆసక్తిగల మనుష్యుఁడు స్త్రీలను నరకమునకు ద్వారములుగా నుంతురు. హరిమాయ స్త్రీరూపముగా ప్రపంచమున సంచరించుచుండును. ఆమె గడ్డిచే కప్పఁబడిన బావివంటిది. ఆశ్రయించిన మనుష్యునకు మృత్యువు కలుగఁ జేయును. ఈ శరీరము, ధనము, పశువులు, మిత్రులు, పుత్రులు, స్త్రీలు, - వీనికి కారణమైనది. వీనిని సంపాదించుటకు జీవుఁడే ఎన్నియో దుష్కర్మము లొనర్చును. వీఁడేశరీర మెత్తినను దానిఫలము ననుభవించి

తీరవలసినదే. దానిని తప్పించుకొనుటకు వీలులేదు. భూమిలో దూరినను దిక్కులపట్టి పరువెత్తినను, మఱి ఎచ్చోట దాగినను కర్మఫలము వాని ననుసరించియే వచ్చును. దానిని తప్పించుకొనుటకు వీలులేదు. పురుష రూపమునందిన జీవుఁడు నిరంతర స్త్రీ సాంగత్యముచేత స్త్రీత్వమునే పొందును అట్లే అంగనారూపమెత్తిన జీవుఁడు మరల నామాయచేతనే పురుష రూపమెత్తినవాఁడగును. మరల ధనాదులు సంపాదించి తనవారిని పోషించును. కనుక స్త్రీ కూడ ధనాది ప్రదుఁడైన భర్తను ఆత్మబంధ కారణమైన మృత్యువుగనే తెలియవలెను. జీవునకు వాని లింగదేహము దానితో వాఁడు తనకావాస భూతమైన భూలోకమునుండి ఇతర లోకములను చేరును. అక్కడగూడ తనుచేసిన కర్మలకు ఫల మనుభవించును. మరల కొంత ప్రారబ్ధ కర్మముతో భూలోకమునకు వచ్చి మరల మాయావశుఁడగును. కార్యాదులందాసక్తుఁడగును. వేటగాఁడు జింకలను బట్టికొనుటకు మనోహరమైన గానమేర్పాటు చేయునపుడు పంచభూతములు, ఇంద్రియములు, మనస్సు వీనిచేతఁ గూడిన శరీరము జీవునకు మృత్యు స్వరూపము, దానిపై నేర్పడిన యభిమానము వీనిని నానాకర్మము లొనర్చునట్లు చేయును. జీవుఁడు నిత్యుఁడు వానికి మరణ మనఁగా స్థూలశరీరము పోవుటయే. జన్మ మనఁగా స్థూలశరీర మేర్పడుటయే. సకల వస్తు విషయ జ్ఞానము కలుగుటకు జీవునకు సాధనభూతము చక్షువే. ఆ ఇంద్రియముతో వాఁడు చూచుచున్నాఁడు. కన్ను లేనపుడు కాలులేనపుడు తాను గ్రుడ్డివాఁడనుకొనును. కుంటివాఁడనుకొనును. ఇవి అన్నియు శరీర ధర్మములే. వీనిని జీవుఁడు తనయం దారోపించు కొనును. కాని వాస్తవమునకు వాఁడట్టివాఁడు కాఁడు. అందుచేత జీవుఁడు భయదైన్యములను వదలి జీవుఁడిట్టివాఁడని తన జ్ఞాన మార్గముతో తెలిసికొని ముక్తసంగుఁడై వర్తింపవలెను. వైరాగ్యయుక్తమైన యోగము ననుష్ఠింపవలెను. సంపూర్ణమైన జ్ఞానముతో ఈ ప్రపంచ మంతయు మాయావిరచిత మని గ్రహింపవలెను. స్థూలశరీరమం దాసక్తిని వదలుకొనుట మంచిది. అదియే ఏకైక మార్గము అని చెప్పి మఱియు కపిలుఁ డిట్లన్నాఁడు.

ఇది పోతనామాత్య విరచితమైన ఆంధ్రభాగవతమున
తృతీయస్కంధమున సుధాలహరి వ్యాఖ్యయందు
ముప్పది ఒకటవ అధ్యాయము.

ద్వాత్రింశోఽధ్యాయః

శ్రీభగవానువాచ

శ్లో॥ అథ యో గృహమేధీయాన్ ధర్మా నేవావసన్ గృహే,
కామ చమర్ధం స్వకాన్ ధర్మాన్ దోగ్ధి భూయః పిపర్తి తాన్ 1

స చాపి భగవద్ధర్మా త్కామమూఢః పరాఙ్ముఖః
యజతే క్రతుభి ర్దేవాన్ పితౄంశ్చ శ్రద్ధయాన్వితః 2

తచ్ఛ్రద్ధయా క్రాంతమతిః పితృదేవవ్రతః పుమాన్,
గత్వా చాంద్రమసం లోకం సోమపాః పునరేష్యతి 3

యదా చాహీంద్రశయ్యాయాం శేతేఽనంతాసనో హరిః,
తదా లోకాలయం యాంతి త ఏతే గృహమేధినామ్. 4

యే స్వధర్మా న్నదుహ్యంతి ధీరాః కామార్థ హేతవే,
నిస్సంగా న్యస్తకర్మాణః ప్రశాంతా శ్శుద్ధచేతసః. 5

నివృత్తిధర్మనిరతా నిర్మమా నిరహంక్రియాః,
స్వధర్మాఖ్యేన సత్త్వేన పరిశుద్ధేన చేతసా. 6

సూర్యద్వారేమ తే యాంతి పురుషం విశ్వతోముఖమ్,
పరాపరేశం ప్రకృతి మస్యోత్పత్త్యంత భావనమ్. 7

ద్విపరార్థావసానో యః ప్రళయో బ్రహ్మణ స్తతే,
తావ దధ్యాసతే లోకం పరస్య పరిచింతకాః. 8

క్ష్మాంభోనలా ననిలవియన ఇంద్రియార్థ
భూతాధిభిః పరివృతం ప్రతి సంజిఘృక్షుః,
అవ్యాకృతం విశతి యర్హి గుణత్రయాత్మా
కాలం పరాఖ్య మనుభూయ పరస్స్వయంభూః. 9

ఏవం పరేత్య భగవంత మనుప్రవిష్టా
యో యోగినో జితమరున్మనసో విరాగాః,
తేనైవ సాక మమృతం పురుషం పురాణం
బ్రహ్మప్రధాన ముపయాంతి గతాభిమానాః. 10

అథ తం సర్వభూతానాం హృత్పద్మేషు కృతాలయమ్
శ్రుతానుభావం శరణం భజ భావేన భామిని. 11

ఆద్యః స్థిరచరాణాం యో వేదగర్భ స్సహర్షిభిః,
యోగేశ్వరైః కుమారాద్యై స్సిద్ధై ర్యోగ ప్రవర్తకైః. 12

భేదదృష్ట్యాఽభిమానేన నిస్సంగేనాపి కర్మణా,
కర్తృత్వా త్సగుణం బ్రహ్మ పురుషం పురుషో వ్రజేత్. 13

చ. ధనపశుపుత్ర మిత్ర వనితాగృహ కారణభూత మైన యీ
తనువున నున్న జీవుఁడు పదంపడి యెట్టి శరీర మెత్తిన
న్నను గతమైన కర్మఫల మందక పోవఁగ రాదు మిన్ను ప్రా
కిన భువిఁ దూఱినన్ దిశల కేగిన నెచ్చటనైన దాఁ గినన్. 1002

వ. అట్టి పురుషరూపంబు నొందిన జీవుండు నిరంతర స్త్రీ సంగంబుచే
వి త్తాపత్య గృహాది ప్రదం బగు స్త్రీత్వంబు నొందు. ఈ క్రమంబున
నంగనారూపుం డగు జీవుండు మన్మాయచేఁ బురుష రూపంబు
నొంది, ధనాది ప్రదుండగు భర్తను నాత్మ బంధకారణం బగు
మృత్యువునుగ నెఱుంగ వలయు. మఱియు జీవోపాధి భూతంబగు
లింగదేహంబుచే స్వావాస భూతలోకంబున నుండి, లోకాంతరంబు
నొందుచుం, బ్రారబ్ధ కర్మ ఫలంబు ననుభవింపుచు, మఱిఁ గర్మాదులం
దాసక్తుం డగుచు, మృగయుండు గాననంబున ననుకూల సుఖ ప్రదుం
డైనను మృగంబునకు మృత్యు వగుచందంబున జీవుండు భూతేంద్రియ
మనోమయంబైన దేహంబు గలిగి యుండు. అట్టి దేహనిరోధంబె
మరణంబు. ఆవిర్భావంబె జన్మంబు. కాన సకల వస్తు విషయ
జ్ఞానంబు గలుగుటకు జీవునకు సాధనంబు చక్షురింద్రియంబ. ద్రష్ట
దర్శనీయ యోగ్యతా ప్రకారంబున జీవునకు జన్మమరణంబులు లేవు.
కావున భయకార్పణ్యంబులు విడిచి, సంభ్రమంబు మాని, జీవ ప్రకారంబు
జ్ఞానంబునం దెలిసి, ధీరుండై ముక్తసంగుం డగుచు యోగ వైరాగ్య
యుక్తంబైన సమ్యగ్ జ్ఞానంబున మాయా విరచితం బైన లోకంబున
దేహాదులం దాసక్తి మాని, వర్తింప వలయు. అని చెప్పి వెండియు
నిట్లనియె. 1003

ఇది పోతనామాత్య విరచితంబైన ఆంధ్ర మహాభాగవతమున
తృతీయస్కంధమున ముప్పది యొకటవ అధ్యాయము.

982. పూర్వకర్మాను గుణమునన్=పూర్వకర్మకు తగినట్లుగా, శశ్వత్ కాశకుండు=ఎక్కువగా కలిగెడు ప్రకాశము కలవాఁడు, ఘటకుండు=సంబంధ ముకు కలిగించెడు వాఁడు, దొరకొని=ప్రయత్నించి, యమళము=రెండు, జత.

తాత్పర్యము : పూర్వజన్మమందు తా నొనర్చిన కర్మ ననుసరించి జీవికి దేహము ప్రాప్తించును. ఆ శరీర సంయోగము కలిగించు వా డీశ్వరుడే. ఆ యీశ్వరుని ఆజ్ఞాను సారముగా జీవుఁ డు దేహమును ధరించును. వాఁడు పురుషుని రేతో బిందువునందు చేరును. దాని ద్వారా స్త్రీ గర్భమందుఁ జొచ్చును ఒక రాత్రిలో ఆ జీవుఁ డు గంజివలె నగును. ఐదు దినముల తర్వాత బుద్బుదమువలె మారును. పది దినములకు కొంత గట్టిపడును. ఆ తరువాత పేశి అనిపించుకొనును. పిదప గ్రుడ్డంత యగునో. ఒక్క నెలకు శిర మేర్పడును. రెండు నెలలైనపుడు కాళ్ళు చేతు లేర్పడును.

983. మాసత్రయంబునన్=మూఁడు మాసములకు, నఖరోమాస్థి చర్మంబులు =గోళ్ళు, రోమములు, ఎముకలు, చర్మము, లింగచ్ఛిద్రంబు=మర్మావయవములు,

సప్తధాతువులు=ఏడు ధాతువులు, క్షుత్తృష్ణలు=ఆకలిదప్పులు, మావి=బిడ్డను గప్పెడు ఒక విధమైన చర్మము, విణ్మూత్ర గర్తంబు=మల మూత్రముల పల్లము, క్రిమి భక్షిత శరీరుండై=పురుగుల చేఁతిఁ బడిన శరీరము గలవాఁడై, ఉల్బణంబులైన రసంబులు=ఎక్కువ ఘాటైన ఆహార పదార్థములు, జరాయువు =శిశువును చుట్టుకొనెడు మాంసపు బంధము, ఆంత్రములు=నరములు, భుగ్నంబైన =వంగినట్టి, పృష్ఠ గ్రీవోదరుండై=వీపుభాగము,కంఠము, కడుపు కలవాఁడై, స్వాంగచలనంబునన్=తన శరీరపు కదలిక యందు, శకుంతము=పక్షి, ఉచ్ఛ్వాసంబు=నిట్టూర్పు, లబ్ధ జ్ఞానుండై=పొందఁబడిన జ్ఞానము కలవాఁడు, విట్టిమిసోదరుండై=క్రిములచేతను, మలముచేతను కూడుకొన్న గర్భములో నున్నవాఁడై, వేపితుఁడు=వణకింపఁ జేయఁ బడినవాఁ డు, యాచమానుఁడు= యాచించు చున్నవాఁ డు, దేహాత్మ దర్శి=దేహమునకంటె ఆత్మభిన్నమైనదను జ్ఞానము కలవాఁడై, బంధన భూతంబులు=బంధంబులుగా నైనవి. కృతాంజలి పుటుండు=నమస్కరించుచున్నవాఁడు.

తాత్పర్యము : మూఁడు నెలలకు గోళ్ళేర్పడును, రోమములు కలుగును. అస్థిచర్మములు కలుగును. మర్మావయవము లేర్పడును. నాల్గవ మాసమందు మాంసమజ్జాదులగు సప్తధాతువులు కలుగును. అయిదవ మాసమున ఆకలిదప్పు లేర్పడును. ఆరవ మాసమందు వాని చుట్టు మావి తిన్నగా కప్పుకొనును. పురుష శిశువైనచో తల్లి యొక్క కడుపునందు కుడివైపున తిరుగను. స్త్రీయైనచో ఎడమవైపున తిరుగును. తల్లిచేత తినఁబడిన ఆహారములే వాని కాహారము లగును. అనఁగా వాని రసము వాఁడు సేవించునన్నమాట. సప్తధాతువులు దినదినము వృద్ధి పొందును. తల్లి కడుపులో పురువులు. చాలని దానికి మలమూత్రములు. చిన్న గుహవంటి ఆ గర్భములో తిరుగును. నడుమ నడుమ కఱచెడు పురుగులు. ఆ బాధను తట్టుకొనలేక వాఁడు మూర్ఛిల్లును. తల్లి అనేకరుచులతో కూడిన ఆహారము తినును. కొన్ని కారము. కొన్ని తీపి. కొన్ని లవణము. కొన్ని చేదు. కొన్ని పులుపు. ఈ రసములు వాని శక్తికి తట్టుకొన రానివై ఉండును. ఆ రసములతో శరీరమంతయు మంట. జరాయువు వానిని పట్టుకొనును. పై భాగమునందు తల్లియొక్క నరములు - సూక్ష్ములై - చుట్టుకొని ఉండును. తలను కడుపులోనికి జొనిపి వంచుకొని ఉన్నాఁ డు. వీపు వంచుకొన్నాఁ డు. కడుపు సంకుచిత మైనది. శరీరమా చిన్న ప్రదేశ మందే ఉండవలెను. అటునిటు దేహమును కదల్చుటకు వీలులేదు వాని స్థితి పంజరమున బంధింపఁబడిన పక్షివలె నున్నది. అప్పుడు వానికి భగవంతుని దయచేతఁ గడచిన జన్మ లన్నియు గుర్తు వచ్చును. ఆ జన్మలలో తాను చేసిన దుష్కృత్యము లన్నియు జ్ఞాపకము వచ్చును. వానిని తలఁచికొని గట్టిగా నిట్టూర్చును. ఆ గర్భవాసమందు సుఖలేశమును

లేదు. ఇంతలో ఏడవ మాసము ప్రవేశించును. వాఁడా కలిదప్పు లెఱుఁగును. విడిపోవని పూర్వజన్మజ్ఞానము. కఱచుచున్న పురుగులు. మలమూత్రముల దుర్వాసన. ప్రసూతి మారుతములు వాని శరీరమును వడకించు చుండును. దేహ మాత్మకంటె భిన్నమను జ్ఞానము వాని కేర్పడినది. అయ్యో! మరల గర్భవాసమున బడినానుఁ బయటికి పోయిన మరల నెట్టి జీవితము గడపునో! ఆ జీవితముతో నేర్పడెడు భీతి. సప్తధాతువులు బంధకములై చుట్టుకొన్నవి. వానికి దిక్కుతోఁ చదు. పరమాత్మకు నమస్కరించు చుండును. ముఖమునిండ దైన్యము. అపుడు వాఁడు తా నెవ్వరిచే గర్భమున బంధింపఁ బడెనో ఆ పరమాత్మను తలఁచుకొని ఇట్లు స్తుతించును.

984.భువన రక్షణమునకై=ప్రపంచమును రక్షించుటకొఱకై, స్వేచ్ఛను రూపమునన్=తన ఇచ్ఛకు తగినట్లుగా, భయ విరహితము=భయములేనిది, పదవనజయుగంబు=పాద పద్మముల యొక్క జంట. వారని భక్తిన్=ఎడపడని భక్తిచేత, పంచభూత విరహితుండయ్యున్=పంచభూతములచేత సంబంధము లేని వాఁడైనను, పంచభూత విరచితంబు=పృథి వ్యాదులతో కల్పింపఁబడినది. ఇంద్రియ=ఇంద్రియములు, గుణ=త్రిగుణములు, అర్థ=వీని వలన నేర్పడెడు ప్రయోజనములు, చిదాభాస=జ్ఞానము యొక్క ప్రకాశము వీనిచేత కూడిన, జ్ఞానుండు=జ్ఞానము కలవాఁడు.

తాత్పర్యము : పరమాత్మ ప్రపంచమును రక్షించుటకై అనేకావతారము లెత్తును. అపుడు వాఁడు గ్రహించు దేహములు వాని ఇచ్ఛచేత గ్రహింపఁ బడినవే. అతని పాదములు భయవిరహితములు అనగా వానికి భయమే ఉండదు. ఆ పాదముల నెవ్వఁడు కొలుచునో వాఁడు భయ విరహితుఁడగు చున్నాఁడు. అనఁగా తన్ను కొలుచు వారిని భయమునుండి రక్షించునన్నమాట! అట్టి పరమేశ్వరుని పాదపద్మములను ఎడపడని భక్తిచేత సేవింతు ననుచున్నాఁడు. ఆ జీవుఁడు పంచభూతములతోనే సంబంధము లేనివాడు. కానీ పృథివ్యాదిభూతములచే నిర్మింపఁ బడిన శరీరమందు బంధింపఁబడియున్నవాఁడు. గర్భమందున్నపుడు పరమాత్మ అనుగ్రహము చేత ఇంద్రియములు త్రిగుణములు వానిచే నేర్పడెడు ప్రయోజనములు స్వచ్ఛమైన జ్ఞానము వీనిని గూర్చిన నిర్ణయము కలవాఁడు. అట్టి జీవుఁడు పరమాత్మ నిట్లని ప్రార్థించుచున్నాఁడు.

986. నిఖిల భూతేంద్రియమయము=సమస్తములైన పంచ భూతములు ఇంద్రియములు వీనితో నేర్పడినది. మాయావలంబన=మాయానాశ్రయించి కొనియున్న, మహిత కర్మబద్ధుఁడై=గొప్ప కర్మలచేత బంధింపఁ బడినవాఁడై, వర్తించు పగిదిన్=వర్తించునట్లుగా, దందహ్యమానము=ఎక్కువగా దహింపఁ

బడునది. జీవచిత్తంబునందున్=జీవునియొక్క మనస్సునందు, అవికారమై=వికార రహితమై, అఖండ జ్ఞానమునన్=సంపూర్ణ జ్ఞానముతో, ముఖ్యచరితునకున్= భక్తులచే భజనీయులైన చరిత్రలు గలిగిన వానికి, అకుంఠిత శౌర్యునకున్= ఎదురులేని పరాక్రమము కలవానికి, పరంజ్యోతి=ఎప్పుడును జ్ఞాన స్వరూపుడుగా వెలుచున్నవాడు. అస్మదీయ=నాయొక్క, దుర్భర=భరించుట కసాధ్యమైన, భీకర=భయమును కలిగించునట్టి, గర్భనరక వేదనలు=గర్భమునందలి నరకముతో సమానమైన తాపములు.

తాత్పర్యము : జీవుడు కూడ పరమాత్ముడే. కానీ వాడు భగవదిచ్ఛచేత మాయకు లోబడినవాడు. దేహేంద్రియాభి మానములు కలిగి పంచ భూతములు ఇంద్రియములు వీనిచేత కూడిన శరీరమందు బంధింపబడును. సుఖదుఃఖము లనుభవించుటనెడు మాయకు లోబడినవాడై తానొనర్చెడు పుణ్యపాపములచేత నానాజన్మలు ధరించుచు దుఃఖించును. వానితో దందహ్య మానుడగును. అట్టి జీవుని మనస్సునందు స్వామి ఆంతర్యామిగా ప్రకాశించు చునే ఉన్నాడు. అంతర్యామియైన ఆ దైవము వికారశూన్యుడు. శుద్ధజ్ఞాన స్వరూపుడు. వానికున్న జ్ఞానము సంపూర్ణమైనది. వాని చరిత్రలు భక్తులకు భజనీయము. స్వామి పరాక్రమమున కడ్డు లేదు. వాడు అవినాశి. నిరంతరమును జ్ఞానస్వరూపుడై నివాత జ్యోతివలె ప్రకాశించు చుండును. వానికి తెలియనిది ఏదియును లేదు. దయ శాంతి అనెడు గుణములకు వాని బుద్ధియే ఆధారము, నామరూపములచేత కూడిన ప్రకృతి గుణములకు వాడతీతుడు. ఈ గర్భవేదన భరింపరానిదిగా ఉన్నది. దీనినుండి బయట పడుటకు శక్తిలేదు. వీనిని దప్పించి నాకు శాంతి ననుగ్రహించుట కొఱకు ఆ పరమాత్మకు నమస్కరించు చున్నాను.

987. నావుడు=అనగా, ఎవ్వని మాయచేతన్=ఏ పురుషుని మాయవలన, ఘనమోహులై=ఎక్కువ మోహము కలవారై, గుణ కర్మనిమిత్త=గుణములచేతను, కర్మల చేతను ప్రేరేపింపబడిన వారై, సాంసారిక మార్గసంచారములను=అనేక సంసారములందు సంచరించుచు, ధృతిచెడి=ధైర్యము నశించి, ఎలసి, ఏ దిక్కును, ఎఱుంగక=మార్గముతోచక, ఏ యుక్తియున్=ఏ మార్గమును, తద్గుణధ్యాన=ఆ పరమ పురుషుని గుణధ్యానములు, తన్మూర్తి దర్శనములు=వాని మూర్తిని దర్శించుట, గోచరించుట ఎట్లు=ప్రాప్తమగు విధమేది? ప్రబోధ కలితముగన్=నాకు జ్ఞాన మేర్పడునట్లుగా, సుగుణకదంబతోడన్-సద్గుణముల గుంపుగల దానితో,

తాత్పర్యము : అపుడు దేవహూతి కపిలునితో నన్నది - స్వామీ! పరమేశ్వరుని మాయచేత బంధింపబడిన వాడై జీవుడు తప్పింపని మోహమునకు వశుడై పోవును. గుణములు వానిని తగుల్కొనును వాని ప్రేరణచేత నొనర్చెడు పుణ్య పాపరూపములైన కర్మలు ఆ కర్మ ఫలములైన

అనేక జన్మలు. వానితో నేర్పడెడు సంసారములు. ఈ సంసారములందు మానవుఁడు అవశుఁడై సంచరించుచుండును. వానికి దిక్కుతోఁచదు. హరిపదధ్యానము మఱచిపోయి ఉండును. వాని కే యుపాయమును తోఁచదు - ఆ యుపాయము తోఁచుటకు ముఖ్యమైన కారణము పరమాత్ముని యొక్క అనుగ్రహమే. ఆ యనుగ్రహము లేక తద్గుణధ్యాన మేర్పడదు. తన్మార్తులను దర్శింపవలెనను జ్ఞానోదయము కూడ కలుగదు. మఱి ఆ జీవునకు గతిఏమి? నాకు స్పష్టముగా తెలియనట్లు వచింపుము. అపుడు కపిలుఁ డిట్లనుచున్నాఁడు.

988. కాలత్రయంబునందును=కాలములందును, జంగమ స్థావర అంతర్యామి=సంచరించెడు జీవులు, సంచరించు సామర్థ్యము లేక ఒకచోటనే ఉన్నజీవులు వీని యందంతయు అంతర్యామియై శ్రీహరియే ఉండును. జీవుఁడు తాను సృష్టించుకొన్న కర్మముల మార్గమునకు లోఁబడి ప్రవర్తించుచుండును. అట్టివాఁడు తాపత్రయములు నివారించు కొనుటకు ఆ పరమాత్మను భజించును. వానికి భజించు జ్ఞానము కూడ పరమాత్ముని యనుగ్రహముచేతనే లభింపవలెను.

989.....995. జనయిత్రి=ఓ తల్లి! ఘనక్రిమి=ఎక్కువైన పురుగులు, విణ్మూత్ర=మలమూత్రములు, రక్త=రక్తము -- వీనిచేతకూడిన, గర్తములోనన్=బొఱియవంటి దానిలో, జఠరాగ్నినిన్=ఆకలిచేత, సంతప్యమాన దేహుండు=తపింప జేయఁబడుచున్న దేహము కలవాఁడు, నిర్గమింపన్ దలఁచి=బయటపడఁదలచినవాఁడై, ఎన్ని కొనుచున్=లెక్కించుచు, దీనరక్షకుఁడు=దీనులను రక్షించువాఁడు, విముక్తినిన్ జేయన్=విడివడిన వానినిచేయఁగా, ప్రతి+ఉపకారము=బదులుగా మేలు, నిరీక్షించెదన్=చూచెదను - అనుపమ=సాటిలేని, దేవమాయ=దేవమాయచేత, విమోహితాత్ముండనై=మోహింపచేయఁబడిన బుద్ధి కలవాఁడనై, పరిభ్రమణ శీలుఁడు=తిరుగుచుండు వాఁడు, అపనయించి=పోఁగొట్టి, తమోరూపమైన=చీకటిని పోలిన, భూరి=ఎక్కువైన, సంసార సాగర+ఉత్తారణంబు=సంసార సాగరమును దాటుట, భరమగుచున్న=సహించుటకు భారమైన, దుర్వ్యసన భాజనమై=గొప్పవ్యసనమునకు ఆధార భూతమైనదై, ఘనదుఃఖ మూలమై=ఎక్కువ దుఃఖముతో కూడినదై, తూట్లుగలదై=రంధ్రములు గలదై, కృతనిశ్చయుఁడై=నిశ్చయించికొన్నవాఁడై, విమలజ్ఞాని=గొప్పజ్ఞానము కలవాఁడు, ఒల్లకుండన్=ఇష్టములేక, నవమాసములు=తొమ్మిదినెలలు.

తాత్పర్యము : తల్లీ! గర్భములో జీవుఁడు పొందెడు వేదనలు వర్ణింప తరముకాదు. పురుగులు వానిచుట్టును పారాడుచుండును. మలమూత్రముల దుర్వాసన. చాలని దానికి చుట్టునున్న రక్తము. జఠరాగ్ని ఎక్కువగా

పీడించుచుండును. దానిచేత వానిదేహ మంతయు సొమ్మసిల్లినట్లుండును. వాని ముఖమునందు క్రమ్మికొన్న దైన్యము. కాని ఏమిచేయును? ఆ గర్భగహ్వారమునుండి బయటికి రాలేఁడు. ఎన్నినెలలు గడచినవని ఎంచుకొను చుండును. నన్నీ గర్భమునుండి బయటకు త్రోయువారెవ్వరైన ఉన్నారా అని వెదకును? ఎవ్వరున్నారు?అని దీన రక్షకుఁడైన పుండరీకాక్షుఁడే చేయవలెను. అతఁ డా పనిచేయఁ గల్గినందులకు తాను చేయు ప్రత్యుపకార మేమి? ఒక్క నమస్కారమే. తన మనస్సులో వాఁడను కొనును. "నేను భగవంతునకే ప్రత్యుపకారము చేయలేను. ఈ గర్భమందు నా శరీరము శమదమాది సంపన్నమై ఉన్నది. నాకు పరమాత్ముని అనుగ్రహముచేత విజ్ఞానము సిద్ధించినది. ఈ విజ్ఞాన మనెడు దీపము సహాయముతో ఆ పుండరీకాక్షుని దర్శింతును" వాఁడు మఱియు నిట్లనుకొనును. "స్వామీ! ఈ గర్భము బహుదుఃఖములకు కారణమైనది. ఇది ఒక్క నరకవేదనకే సరి. నేను ఈ గర్భమునుండి బయట పడుటకు నాకు శక్తిలేదు. ఒకవేళ గర్భమునుండి బయటికి వచ్చినను మరల నీ దేవమాయ నన్నాక్రమించును. దానిచే నామనస్సు స్వాధీనము తప్పి ఎన్నియో పుణ్యపాపము లొనర్చును. అనుక్రమముగా పలుజన్మ లెత్తుచుండును. ఇఁక మీఁద నేను వివేహితుఁడనై ఉందును. నా మనస్సును విజ్ఞాన మనెడు సారథియే నడుపుఁగాక. విజ్ఞాన సాహాయ్యముతో సంసారమందు బ్రదికి ఈ జనన మరణము లనెడు సముద్రమును దాఁటుటకు ప్రయత్నింతును. స్వామీ! ఈ గర్భదుఃఖము భరింపరా కున్నది. ఈ వ్యసనమునకు తాళలేను. అనేక రంధ్రములతో కూడిన ఈ గర్భమున వసించుటకు నేఁన వశుఁడనై ఉన్నాను. ఈ బహు గర్భవాసములు నేను సృష్టించుకొన్నవే. పరమపురుషా! ఈ గర్భవాసముల సంగతిని నాకు తప్పించుటకై నీకు నమస్కరించుచున్నాను. నీ యనుగ్రహము నాపై వర్షించుగాక! సంసార తారకములైన నీపాద పద్మములే నాకు శరణ్యము" ఈ రీతిగా జీవుఁడు వాపోవుచుండును. వాఁ డు గర్భములో నున్నంతవరకు గొప్ప విజ్ఞాని. గర్భవాసము బహుదుఃఖ భాజనము. బయటికి పోయినచో నేమగును. మరల దేవమాయ ఆక్రమించునేమో! ఈ భావనలు ఉండవేమో. ఈ వికల్పములతో వాఁ డు తడపడును. ఇంతలో నవమాసములు గడచును.

996....998. అధోముఖుఁ డు=తల్లక్రిందులుగా నున్నవాఁ డు, ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు=గాలిపీల్చుట వదలుటలు, దుఃఖభాజనుండు=దుఃఖములకు పాత్రమైన వాఁడు, రక్తదిగ్ధాంగుండు=రక్తముచేత కూడుకొన్న శరీరము కలవాఁడు, విష్ఠాస్థ క్రిమిన్ పోలి=మలమందున్న పురుగువలె, అభిమతార్థంబులు=తనకు కావలసిన పదార్థములు, శయానుండు=పవ్వళించినవాఁ డు, కండూయమానములు =నవగలవి, ఆసన, ఉత్థాన గమనములు=కూర్చుండుట, లేచుట, పోవుట

మొ॥ క్రియలు, మశక=దోమలు, మత్కుణ=నల్లులు, మక్షికాదులు=ఈగలు మొదలైనవి. క్రిమినింబోలి=చిన్న పురుగువలె, అధ్యయనాది దుఃఖములు=వేదము చదువుట మొ॥ దుఃఖములు. తదర్థములు=అశరీరమునకై ఏర్పడినవి. దుష్పురుష సంగమంబు=చెడ్డవారి సహవాసము, వర్ధిష్యమాణ=వృద్ధిపొందుచున్న, రోషుండు=రోషము గలవాఁడు, అసత్సంగంబున=దుష్టులతోడి సహవాసముతో, దోహాత్మ బుద్ధులు=దేహమే ఆత్మయను కొనువారు, పరవశ స్వాంతములన్=లోఁబడిన మనస్సులచేత, శోచ్యభావులు=తిరస్కరింపఁ దగిన భావములు కలవారు, మృగీరూపధారిణి=ఆఁడుజింకగా నున్నది, ఓటువడి=లోఁబడి, విగతత్రపుఁడు=సిగ్గులేనివాఁడు, అనుధావనము = వెంటనంటి పరువెత్తుట.

తాత్పర్యము : ఇంతలో పదియవ మాస మేతెంచును. అపుడు వాఁడు అధోముఖుఁడగును. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసము లాడుట కష్టమగును. ఆ దుఃఖ మొకటి తగుల్కొనును. తనకు ఇంతవఱకును ప్రాప్తించిన జ్ఞానము మాయమై పోవును. శరీరమున కంటుకొన్న రక్తము. మలమునందలి క్రిమివలెనే వాఁడు సూతిమారుతములచేత త్రోయఁ బడినవాఁ డై గడ్డకు వచ్చును. వచ్చిన వెంటనే రోదన మారంభమగును. వాఁ డొక మూఢునివలె ఉండును. ఇతరులు వానిని పెంతురు. తనకుఁగావలసిన పదార్థములు వారితో చెప్పలేఁడు. నోరులేదు. వారు ఊయలలో పండఁబెట్టెదరు. దాని నిండ మలమూత్రముల కంపు. శరీరమున నవలెత్తుకొనును. గోకికొనుటకు సాధ్యముకాదు. కూర్చొనలేఁడు, లేవ లేఁడు, పారాడ లేఁడు తన శరీరమును నల్లులు, ఈగలు, దోమలు మొ॥ పెరుకుచుండును. పెద్ద పురుగుల చేత భక్షింపఁబడెడు చిన్న పురుగువలె వాఁడగును. అన్నిటికినీ వానికి తోఁచునది ఒక్కరోదనమే. అది ఎవ్వరికినీ అర్థము కాదు. ఈ రీతిగా చిన్నతనమునందు దానికి తగిన దుఃఖములు అనుభవించును. ఇంతలో పొగండవయసు ప్రాప్తించును. ఆ వయసులో అధ్యయనాది దుఃఖములు. ఆ తరువాత యౌవనము. ఆ యౌవనములో వాని కనేక పదార్థములు గావలసి వచ్చును. వానిని సంపాదించుటకు వ్యర్థ ప్రయత్నములు చేయును. పాంచభౌతిక శరీరమందు వాని కహంకార మమకారములు ఉవ్వెత్తుగా పెరుగును. ఆ శరీరమును పోషించుటకై అనేక కర్మ లొనర్చును. దుష్పురుషుల తోడ సహవాసము చేయును. శిశ్నోదర పరాయణుండై ఉండును. తాను చేయు ప్రయత్నములు ఫలింపవు. ఫలింపనప్పుడు రోష మేర్పడును. కర్మలతో ప్రాప్తించెడు దుష్పరిణామము. వాఁడు కాముకుఁడై నిజనాశమునకు కావలసిన సమస్త కార్యము లొనర్చును. ఓ తల్లి! సత్యము, శౌచము, ధైర్యము, దయ, మొ॥ సమస్త గుణములు నశించును. ఈదుష్టులములును అసజ్జనుల సహవాసమున నేర్పడునవే. కనుక వాఁడు దుష్టుల సంగతిని వదలవలెను. వారు మూఢ హృదయులు. శాంతి

లేనివారు. దేహమే ఆత్మయనెడు బుద్ధి గలవారు. స్త్రీల చేతికి చిక్కువారు స్త్రీలాడించెడు మృగములవలె నుందురు. వారి బుద్ధికి స్వాతంత్ర్యముండదు. అంతమాత్రమేకాదు. అంగనాసంగము బహుదోషములకు కారణము. దీనికొక్క కథగలదు చెప్పెదను వినుము - ప్రజాపతి యొక్క కూతురు భారతీదేవి ఒకప్పుడు ఆడు జింకయై తిరుగుచున్నది. ఆమె యొక్క రూపరేఖా విలాసములకు ప్రజాపతి మనస్సు లోఁబడినది. అతఁడు సిగ్గులేక ఆమె వెంటపడినాఁడు మగజింకరూపము ధరించి అతఁడు భారతీదేవి వెంటపడెను. కనుక అంగనాసంగము బహుదుష్టము. బ్రహ్మదేవుఁడు నా నాభి కమలమందు జన్మించెను. అతఁడు మరీచ్యాదులను సృష్టించినాఁడు. వారికి కశ్యపాదులుద్భవించిరి. వారే దేవమనుష్యాదులను సృష్టించినారు. కనుక స్త్రీసంగమముతో బుద్ధిచెడని వాఁడెవ్వఁడును లేఁడు. ఒక్కనారాయణ మూర్తికి మాత్రమే అది సాధ్యమైనది. అని మఱియు కపిలుఁడిట్లన్నాఁడు.

999...1000.సతుల సంగంబున్=స్త్రీలతోడి సహవాసము, యోగవృత్తిన్=యోగమార్గముతో, మత్పద నరసీరుహ=నాపాద పద్మముల యొక్క, సేవాను రక్తిన్=సేవయందలి ప్రేమతో, నిరయద్వారము=మృత్యువు యొక్క ద్వారము,

1001.....1003. హరిమాయా విరచితమై=హరియొక్క మాయచేత సృష్టింపఁబడినదై, ధరన్=ప్రపంచమందు, పర్విన=వ్యాపించిన, కూపము కరణిన్=బావివలె, పదపడి=తరువాత, అంగనా రూపుండు=స్త్రీ రూపమును పొందినట్టి, మన్మాయచేన్=నామాయచేత, జీవోపాధి భూతము=జీవుఁడు నివసించుట కాధారమైనది. మృగయుండు=వేటగాఁడు, నిరోధము=వినాశము. ద్రష్ట=చూచెడివాఁడు. దర్శనీయ=చూడఁబడుదాని. యోగ్యతా ప్రకారమునన్=యోగ్యతవలె, ముక్తసంగుండు=సంగమును వదలినవాడు. సమ్యక్ జ్ఞానము=పరిపూర్ణజ్ఞానము.

తాత్పర్యము : నామాయ స్త్రీ రూపముతో పురుషులందరికినీ మోహమును కలిగించును. అందుచేత పురుషులు స్త్రీలతోడి సహవాసమును వదలవలెను. యోగవృత్తితో చరించు చుండవలెను. నిరంతరము నాపాదపద్మములను సేవించుటందే ఆసక్తిగల మనుష్యుఁడు స్త్రీలను నరకమునకు ద్వారములుగా నుంతురు. హరిమాయ స్త్రీరూపముగా ప్రపంచమున సంచరించుచుండును. ఆమె గడ్డిచే కప్పఁబడిన బావివంటిది. ఆశ్రయించిన మనుష్యునకు మృత్యువు కలుగఁ జేయును. ఈ శరీరము, ధనము, పశువులు, మిత్రులు, పుత్రులు, స్త్రీలు, - వీనికి కారణమైనది. వీనిని సంపాదించుటకు జీవుఁడే ఎన్నియో దుష్కర్మము లొనర్చును. వీఁడేశరీర మెత్తినను దానిఫలము ననుభవించి

తీరవలసినదే. దానిని తప్పించుకొనుటకు వీలులేదు. భూమిలో దూరినను దిక్కులపట్టి పరువెత్తినను, మఱి ఎచ్చోట దాగినను కర్మఫలము వాని ననుసరించియే వచ్చును. దానిని తప్పించుకొనుటకు వీలులేదు. పురుష రూపమునందిన జీవుఁడు నిరంతర స్త్రీ సాంగత్యముచేత స్త్రీత్వమునే పొందును అట్లే అంగనారూపమెత్తిన జీవుఁడు మరల నామాయచేతనే పురుష రూపమెత్తినవాఁడగును. మరల ధనాదులు సంపాదించి తనవారిని పోషించును. కనుక స్త్రీ కూడ ధనాది ప్రదుఁడైన భర్తను ఆత్మబంధ కారణమైన మృత్యువుగనే తెలియవలెను. జీవునకు వాని లింగదేహము దానితో వాఁడు తనకావాస భూతమైన భూలోకమునుండి ఇతర లోకములను చేరును. అక్కడగూడ తనుచేసిన కర్మలకు ఫల మనుభవించును. మరల కొంత ప్రారబ్ధ కర్మముతో భూలోకమునకు వచ్చి మరల మాయావశుఁడగును. కార్యాదులందాసక్తుఁడగును. వేటగాఁడు జింకలను బట్టికొనుటకు మనోహరమైన గానమేర్పాటు చేయునపుడు పంచభూతములు, ఇంద్రియములు, మనస్సు వీనిచేతఁ గూడిన శరీరము జీవునకు మృత్యు స్వరూపము, దానిపై నేర్పడిన యభిమానము వీనిని నానాకర్మము లొనర్చునట్లు చేయును. జీవుఁడు నిత్యుఁడు వానికి మరణ మనఁగా స్థూలశరీరము పోవుటయే. జన్మ మనఁగా స్థూలశరీర మేర్పడుటయే. సకల వస్తు విషయ జ్ఞానము కలుగుటకు జీవునకు సాధనభూతము చక్షువే. ఆ ఇంద్రియముతో వాఁడు చూచుచున్నాఁడు. కన్ను లేనపుడు కాలుఁనపుడు తాను గ్రుడ్డివాఁడనుకొనును. కుంటివాఁడనుకొనును. ఇవి అన్నియు శరీర ధర్మములే. వీనిని జీవుఁడు తనయం దారోపించు కొనును. కాని వాస్తవమునకు వాఁడట్టివాఁడు కాఁడు. అందుచేత జీవుఁడు భయదైన్యములను వదలి జీవుఁడిట్టివాఁడని తన జ్ఞాన మార్గముతో తెలిసికొని ముక్తసంగుఁడై వర్తింపవలెను. వైరాగ్యయుక్తమైన యోగము ననుష్ఠింపవలెను. సంపూర్ణమైన జ్ఞానముతో ఈ ప్రపంచ మంతయు మాయావిరచిత మని గ్రహింపవలెను. స్థూలశరీరమం దాసక్తిని వదలుకొనుట మంచిది. అదియే ఏకైక మార్గము అని చెప్పి మఱియు కపిలుఁ డిట్లన్నాఁడు.

ఇది పోతనామాత్య విరచితమైన ఆంధ్రభాగవతమున
తృతీయస్కంధమున సుధాలహరి వ్యాఖ్యయందు
ముప్పది ఒకటవ అధ్యాయము.

ద్వాత్రింశోఽధ్యాయః

శ్రీభగవానువాచ

శ్లో॥ అథ యో గృహమేధీయాన్ ధర్మా నేవావసన్ గృహే,
కామ చమర్ధం స్వకాన్ ధర్మాన్ దోగ్ధి భూయః పిపర్తి తాన్ 1

స చాపి భగవద్ధర్మా త్కామమూఢః పరాఙ్ముఖః
యజతే క్రతుభి ర్దేవాన్ పితౄంశ్చ శ్రద్ధయాన్వితః 2

తచ్ఛ్రద్ధయా క్రాంతమతిః పితృదేవవ్రతః పుమాన్,
గత్వా చాంద్రమసం లోకం సోమపాః పునరేష్యతి 3

యదా చాహీంద్రశయ్యాయాం శేతేఽనంతాసనో హరిః,
తదా లోకాలయం యాంతి త ఏతే గృహమేధినామ్. 4

యే స్వధర్మా న్నదుహ్యంతి ధీరాః కామార్థ హేతవే,
నిస్సంగా న్యస్తకర్మాణః ప్రశాంతా శ్శుద్ధచేతసః. 5

నివృత్తిధర్మనిరతా నిర్మమా నిరహంక్రియాః,
స్వధర్మాఖ్యేన సత్త్వేన పరిశుద్ధేన చేతసా. 6

సూర్యద్వారేమ తే యాంతి పురుషం విశ్వతోముఖమ్,
పరాపరేశం ప్రకృతి మస్యోత్పత్త్యంత భావనమ్. 7

ద్విపరార్ధావసానో యః ప్రళయో బ్రహ్మణ స్తతే,
తావ దధ్యాసతే లోకం పరస్య పరిచింతకాః. 8

క్ష్మాం భోనలా ననిలవియన ఇంద్రియార్థ
భూతాధిభిః పరివృతం ప్రతి సంజిఘృక్షుః,
అవ్యాకృతం విశతి యర్హి గుణత్రయాత్మా
కాలం పరాఖ్య మనుభూయ పరస్స్వయంభూః. 9

ఏవం పరేత్య భగవంత మనుప్రవిష్టా
యో యోగినో జితమరున్మనసో విరాగాః,
తేనైవ సాక మమృతం పురుషం పురాణం
బ్రహ్మప్రధాన ముపయాంతి గతాభిమానాః. 10

అథ తం సర్వభూతానాం హృత్పద్మేషు కృతాలయమ్
శ్రుతానుభావం శరణం భజ భావేన భామిని. 11

ఆద్యః స్థిరచరాణాం యో వేదగర్భ స్సహర్షిభిః,
యోగేశ్వరైః కుమారాద్యై స్సిద్ధై ర్యోగ ప్రవర్తకైః. 12

భేదదృష్ట్యాఽభిమానేన నిస్సంగేనాపి కర్మణా,
కర్తృత్వా త్సగుణం బ్రహ్మ పురుషం పురుషో వ్రజేత్. 13

స సంసృత్య పునఃకాలే కాలే నేశ్వరమూర్తినా,
జాతే గుణవ్యతికరే యథాపూర్వం ప్రజాయతే. 14

ఐశ్వర్యం పారమేష్ఠ్యం చ తేపి ధర్మవినిర్మితమ్,
నిషేవ్య పునరాయాతి గుణవ్యతికరే సతి. 15

యేత్వి హోఽసక్తమనసఃకర్మసు శ్రద్ధయాన్వితాఃకుర్వంత్యపత్రిషిద్ధాని నిత్యాన్యపి చ కృత్స్నశఃకుర్వంత్యపత్రిషిద్ధాని నిత్యాన్యపి చ కృత్స్నశః. 16

రజసాకుంఠమనసఃకామాత్మానోఽజితేంద్రియాఃపిత్రా న్యజంత్యనుదినం గృహేష్వభిరతాశయ

ఏత ద్వై శ్రద్ధయా భక్త్యా యోగాభ్యాసేన నిత్యశః.
సమాహితాత్మా నిస్సంగో విరక్తః పరిపశ్యతి. 30

ఇత్యేతత్కథితం గుర్వి జ్ఞానం తద్బ్రహ్మ దర్శనమ్,
యేనావ బుధ్యతే తత్త్వం ప్రకృతేః పురుషస్య చ. 31

జ్ఞానయోగశ్చ మన్నిష్ఠో నైర్గుణ్యో భక్తిలక్షణః,
ద్వయోరప్యేక ఏవార్థో భగవచ్ఛబ్ద లక్షణః. 32

యథేంద్రియైః పృథగ్భావై రర్థో బహుగుణాశ్రయః,
ఏకోనానే యతే తద్వద్ భగవాన్ శాస్త్రవర్త్మభిః. 33

క్రియయా క్రతుభిర్వానై స్తప స్స్వాధ్యాయ మర్పనైః,
ఆత్మేంద్రియ జయేనాపి సన్న్యా సేనచ కర్మణామ్. 34

యోగేన వివిధాంగేన భక్తియోగేన చైవ హి,
ధర్మైణో భయచిహ్నేన యః ప్రవృత్తి నివృత్తిమాన్. 35

ఆత్మ తత్త్వావబోధేన వైరాగ్యేణ దృఢేన చ,
ఈయతే భగవానేభి స్సగుణో నిర్గుణః స్వదృక్. 36

ప్రావోచం భక్తి యోగస్య స్వరూపం తే చతుర్విధమ్,
కాలస్య చావ్యక్తగతే ర్యోంత ర్భవతి జంతుషు. 37

జీవస్య సంసృతీ ర్భహ్వీ ర విద్యాకర్మనిర్మితాః,
యాస్వంబ ప్రవిశ న్నాత్మా న వేద గతి మాత్మనః. 38

నైతత్ఖలాయోపదిశే న్నావినీతాయ కర్హిచిత్,
న స్తబ్ధాయ న భిన్నాయ నైవ ధర్మధ్వజాయ చ. 39

న లోలుపాయోపదిశే న్న గృహారూఢచేతసే,
నాఽభక్తాయచమే జాతు న మద్భక్తిద్విషా మపి. 40

శ్రద్ధానాయ భక్తాయ వినీతాయా నసూయవే,
భూతేషు కృతమైత్రాయ శుశ్రూషాభిరతాయ చ. 41

బహిర్జాత విరాగాయ శాంతచిత్తాయ ధీమతే,
నిర్మత్సరాయ శుచయే యస్యాహం ప్రేయసాం ప్రియః. 42

య ఇదం శృణు యాదంబ! శ్రద్ధయా పురుష స్సకృత్,
యో వాభిధత్తే మచ్చిత్త స్సహ్యేతి పదవీం చ మే. 43

ఇతి శ్రీమద్భాగవతే తృతీయస్కంధే ద్వాత్రింశోఽధ్యాయః.

1. అథ=అనంతరము, గృహే=గృహమందు, ఆవసన్=నివసించు చున్నవాడై, గృహమేధీయాన్=గృహస్థాశ్రమమున కుచితములైన, ధర్మాన్ ఏవ=ధర్మములనే అనుసరించుచున్న వాఁడై, కామం=కామమును, అర్థం=ధనమును, ధర్మాన్చ=ధర్మములను గూడ, దోగ్ధి=పిదుకుచున్నాఁడు. భూయఃఇంకను, తాన్=వానిని, పిపర్తి=అనుష్ఠించుచున్నాఁడు.

తాత్పర్యము :32వ అధ్యాయమందు గృహస్థాశ్రమ మం దుండి పుణ్యకర్మము లొనర్చుచున్న వారి స్వర్గాది లోక ప్రాప్తిని చెప్పుచున్నాఁడు. కర్మములను అనుష్ఠించెడి వారి సంకల్పములే ఫలభేదములను జనింపఁజేయుచున్నవి. ఫలకాంక్షతో నొనర్చెడు కర్మములు సకామము లనిపించుకొనును. ఈశ్వర ప్రీత్యర్థమై ఒనర్చెడు కర్మములు నిష్కామములు. వానిలో సకామ కర్మల యొక్క గతిని వివరించు చున్నాఁడు. భార్యా స్వీకార మొనర్చి గృహములం దుండి సంసార మొనర్చుచున్నవారికి వేదము కర్మలు విధించుచున్నది. ఆ కర్మములనే ఒనర్చుచున్న పురుషుఁడు భోగసాధనములను, ధనములను ధర్మములను కర్మ ఫలములుగా ననుభవించుచున్నాఁడు. ఆ పైనికూడ వానినే యనుష్ఠించును. ఆ ఫలములనే అనుభవించును. ఇట్లే గృహస్థుఁడు కూడ గృహోచితములైన కర్మల ననుష్ఠించును. ధర్మము, అర్థము, కామము అనెడు పురుషార్థముల ననుభవించును. మరల వానినే యావర్తించును. ఈ యర్థమును బోధపఱచుటకై దోగ్ధి అని వాడినాఁడు.

2. కామమూఢఃకామముచేత వివేక శూన్యుఁడును, భగవద్ధర్మాత్భగవ ద్ధర్మమునుండి, పరాఙ్ముఖఃవిముఖుఁ డును అయి ఉన్న, సఃచ అపిపాఁడుకూడ, శ్రద్ధయా అన్వితఃశ్రద్ధతో కూడినవాఁడై, క్రతుభిఃయాగాదులచే, దేవాన్దేవతలను, పిత్ర్యాన్చపితరులను యజతేఆరాధించును.

తాత్పర్యము : విషయభోగముల యందలి యాసక్తి చేత మానవుని విచారశక్తి కుంటుపడును. అందుచే ఈశ్వరారాధనకు అభిముఖముగా వాని మనస్సుకు ప్రవర్తించదు. కనుక వాఁ డు దేవతలు, పితృ దేవతలును తనకు కావలసిన సుఖము లందింతు రని నమ్ముకొనును. అందుచే యాగాదులతో దేవతలను తృప్తి పఱచును. శ్రాద్ధాదులతో పితృదేవతలను సంతోష పెట్టును.

3. తత్శ్రద్ధయా క్రాంతమతిఃవాని యందలి విశ్వాసముతో కూడిన బుద్ధి కలవాఁడై, పితృదేవవ్రతఃపితరుల యందును దేవతల యందును వ్రతము పట్టినవాఁడై, పుమాన్పురుషుఁ డు, చాంద్రమసంలోకంచంద్రునకు సంబంధించిన లోకమును, గత్వాపొంది, సోమపాఃసోమము త్రాగిన వాఁడై, పునఃఏష్యతిమరల నీ లోకమునకు వచ్చుచున్నాఁడు.

తాత్పర్యము : దేవతల యందును పితరుల యందును పూర్ణమైన విశ్వాసము కలిగి యుండుటచేత వాని నారాధించుట యందే వ్యగ్రుఁడై

యుండును. అట్లున్న ఆ పురుషులు మరణానంతరము చంద్రలోకమును పొంది అచ్చట అమృత పానము మొదలైన దేవభోగముల ననుభవించి మరల మర్త్య లోకమునకు వత్తురు. "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" పుణ్యక్షయ మైనపుడు మరల పురుషుఁడు భూలోకమున కేతెంచునని శ్రుతి చెప్పుచున్నది. దానిని పురాణము కూడ అనువదించుచున్నది.

4. అనంతాసనఃఅదిశేషుఁడే ఆసనమయిన, హరిఃవిష్ణువు, అహీంద్రశయ్యాయాంఆదిశేషుఁడనెడు శయ్యయందు, యదా శేతేఎప్పుడు విశ్రమించుచున్నాఁడో, తదాఅప్పుడు, గృహమేధినాంగృహస్థాశ్రమమందుండెడు వారికి సంబంధించిన, ఏతేలోకాఃఈ లోకములు, లయం యాంతినాశనము పొందును.

తాత్పర్యము : భగవంతుఁడు శ్రీహరి లోకరక్షణాధికారి. అతఁడు ఎప్పుడు ఆదిశేషుఁడనెడు శయ్యయందు యోగనిద్రాలీనుఁడగునో అప్పుడు గృహస్థులకు సంబంధించి (అనఁగా వారిని పొందుట కర్హమైన, భూతాది లోకములు నశించును.

5.6.7. ధీరాఃబుద్ధిశాలురును, నిస్సంగాఃవిషయముల యందు ఆసక్తి లేనివారును, న్యస్తకర్మాణఃహరికి సమర్పింపఁ బడిన కర్మలు గలవారును, ప్రశాంతాఃమనస్సు నదుపులో నుంచుకొన్న వారును, శుద్ధచేతసఃకామాది దోషములు లేని మనస్సుతో కూడిన వారును, నివృత్తి ధర్మనిరతాఃనివృత్తి మార్గమందు తాత్పర్యము కలవారును, నిర్మమాఃదేనియందభిమానము లేనివారును, నిరహంక్రియాఃనే నను నభిమానము లేని వారును అయిన, యేఃఎవరు, స్వధర్మాన్తమ ధర్మములను, కామార్హ హేతవేకామమును సాధించుటకొఱకై, న దుహ్యంతిఅనుష్ఠింపరో, స్వధర్మాఖ్యేనస్వధర్మ మనెడు నామధేయముతో కూడిన, సత్త్వేనసత్త్వగుణముతో, పరిశుద్ధేనఎక్కువ నిర్మలమైయున్న, చేతసాఅంతఃకరణము నిమిత్తముగా, సూర్యద్వారేణసూర్యమార్గము ద్వారా, తేవారు, అస్యఈ లోకము యొక్క, ఉత్పత్యంత భావనంఉత్పత్తికిని, నాశనమునకును, సితికిని నాశమైన, పరాపరేశంఉత్కృష్టములైనవి, నికృష్టములైన సమస్తమునకు, ప్రకృతినియంతలైనటియు, ప్రకృతికిం అధినాయకుఁడైనటి, విశ్వతో ముఖంసమస్తము నందు వ్యాపించియున్నట్టి, పురుషంఈశ్వరుని, యాంతిపొందుదురు.

తాత్పర్యము : ఈ మూఁడు శ్లోకములతో భగవద్ధర్మము ననుసరించిన వారి యొక్కయు, వారి కేర్పడెడు ఫలముల యొక్కయు స్వరూపును తెల్పుచున్నాఁడు. ఇంద్రియములను వశములో నుంచుకొని బుద్ధి శక్తి నుపయోగించుకొని బ్రదుకు వారికి ధీరులని పేరు. వారు కర్మలొనర్తురు. వారనుష్ఠించు కర్మములు విషయ సుఖలాభమునకై కాదు. విషయ సుఖములందు వారి కిచ్ఛ యే ఉండదు. మరి వారి కర్మానుష్ఠానమునకు ఫలమేమి? భగవత్ప్రీతి. అట్టివారు తమ సమస్తకర్మములను భగవంతునం దర్పింతురు. చంచలమైన మనస్సును స్థిరముగా నిల్పికొని ఉపాసింతురు. చిత్త చాంచల్యము

నివారించుట కుపయోగపడెడు భగవత్కథాదులతో కాలము గడపెదరు. నివృత్తి మార్గమందు నిష్ఠితు లగుదురు. ధనధాన్యాదులందు ఇవి నావి యను భావమే వారి కుండనే ఉండదు. దేహేంద్రియాదులందు నే నను భావము సున్న. స్వధర్మానుష్ఠాన రూపమైన నిష్కామ కర్మ ననుసరించు చుందురు. దానితో వారి చిత్తము పరిశుద్ధమగును. సత్త్వగుణ పూర్ణ మగును. వారు సూర్యమండలమును భేదించుకొని పోదురు. దీని కర్చిరాది మార్గమనిపేరు. లోకముల సృష్టిస్థితి సంహారముల ప్రధాన కారణభూతము, ప్రకృతినియంతయు, సర్వమునందు వ్యాపించువాఁడును నైన పరమాత్మనే చేరెదరు.

8. పరస్య=పరునియొక్క, పరిచింతకాఃపరమేశ్వర భావన కలవారు కలిన, యే=ఎవరు కలరో, తే=వారు, ద్విపరార్ధావసానేన=ద్విపరార్ధావసానమందు, బ్రహ్మణఃతు=బ్రహ్మదేవునకు సంబంధించిన, ప్రళయఃయఃప్రళయమన్న దేదికలదో, తావత్=అంత వరకును, లోకం=బ్రహ్మలోకమును, అధ్యాసతే=అధిష్ఠించి యుందురు.

తాత్పర్యము : ప్రసంగవశముగా ప్రాప్తించిన బ్రహ్మోపాసన యొక్క ఫలమును చెప్పుచున్నాఁడు- ఎవరు బ్రహ్మదేవుని సర్వేశ్వర భావముతో నుపాసింతురో వారు బ్రహ్మదేవుని ప్రళయకాలము వరకును - బ్రహ్మకు సంబంధించిన లోకమందు నివసింతురు. రెండు పరార్ధముల యొక్క కాలము బ్రహ్మదేవుని యాయుస్సు, తన ఆయుష్కాలానంతరము బ్రహ్మదేవుఁడు భగవంతుని యందు లయించును. దీనికే బ్రహ్మప్రళయ మని పేరు బ్రహ్మ దేవు నుపాసించుచు బ్రదికిన జీవుఁడు తమ తమ యుపాధులతో పాటు బ్రహ్మసత్యలోకమందు పరమసుఖము లనుభవించుచుండును. బ్రహ్మ ప్రళయము వఱకు అచ్చట ఉండును.

9. యర్హి=ఏ కాలమందు, గుణత్రయాత్మా=గుణత్రయ రూపమైన లోకమును అభిమానించి నట్టివాఁడు, పరఃఉత్కృష్టుఁడును ఐన, స్వయంభూఃబ్రహ్మదేవుఁడు, క్ష్మాంభోనలానిల వియన్మన ఇంద్రియార్థ భూతాదిభిఃభూమి, జలము, వహ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, ఇంద్రియములు, శబ్దాదులైన విషయములు - వీనిచేత, పరివృతం=చుట్టుకొనఁబడి యుండునట్టి దానిని, ప్రతిసంజిఘృక్షుఃప్రతి సంహరించుట కిచ్ఛించిన వాఁడై, పరార్ధ్యం కాలం=పరమావధియైన కాలమును, అనుభూయ=అనుభవించిన పిదప, అవ్యాహృతం=నిర్వికార స్వరూపమును, విశతి=ప్రవేశించుచున్నాఁడు.

తాత్పర్యము : ద్విపరార్ధకాలస్వరూపమును బ్రహ్మదేవుని లయమును లక్షణ పూర్వకముగా వివరించుచున్నాఁడు. గుణ త్రయాత్మకమైన ప్రపంచమే తన యొక్క శరీరమని భావించి తదభిమానముతో కూడియున్న పరమచైతన్యమునకే బ్రహ్మదేవుఁడని పేరు. ఆ దేవుని యొక్క పరమావధియైన కాలమునకు ద్విపరార్ధకాల మని పేరు. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, ఇంద్రియములు, ఇంద్రియ విషయములైన శబ్దాదులు అహంకారము అనెడు వీనితో చేరిన బ్రహ్మాండ రూపమైన స్వశరీరమును

సంహరించుటకు ఇచ్చించినవాఁడై ఇంద్రాది దేవతలకంటె ఉత్కృష్టుఁడైన బ్రహ్మ దేవుఁడు సర్వవికార శూన్యమై ప్రకాశించెడు ఆవ్యాహృతమని పిలువఁబడుచున్న పరమేశ్వరుని యందు ఏ కాలమందు ప్రాపించునో, పరమేశ్వరుని యందు తన చేతనము లయింపచేయునో ఆ కాలమునకు బ్రహ్మ ప్రళయ మని పేరు. బ్రహ్మ దేవున కా ఇచ్చ ఏర్పడుట సృష్ట్యారంభమునుండి ద్విపరార్ధకాలము ముగిసిన తరువాత. అందుచే ఇంతవరకును బ్రహ్మదేవుని పూర్ణాయుస్సని తలంతురు.

10.ఏవం=ఈ ప్రకారము, పరేత్య=మరణానంతరము, భగవంతం=భగవంతుఁడైన బ్రహ్మదేవుని, అనుప్రవిష్టాః=అనుప్రవేశించిన వారును, జితమరున్మనసః=జయింపఁబడిన ప్రాణమనస్సులు కలవారును, విరాగాః=ఆగ్రహము లేనివారును, విగతాభిమానాః=అభిమానము నశించిన వారును అయిన, యే యోగినః=ఏ యోగులు కలరో, తేఅపి=వారును, తేన సాకం ఏవ=ఆ బ్రహ్మతోపాటు, అమృతం=ఆనంద స్వరూపుఁడు, పురాణం=సనాతనుఁడును, బ్రహ్మ=వ్యాపకుఁడును, ప్రధానం=ముఖ్యుఁడును అయిన, పురుషం=పురుషుని, ఉపయాంతి=పొందుచున్నారు.

తాత్పర్యము : బ్రహ్మదేవునితోపాటు బ్రహ్మోపాసకులైన యోగులును ముక్తిని పొందుచున్నారను విషయమును వివరించుచున్నాఁడు. బ్రహ్మదేవుని పరమేశ్వరభావనతో నుపాసించుచు జీవిత కాలమును గడపి భౌతికమునుపేక్షించినవారు తమ యుపాసనతో ప్రాప్య స్థానమైన బ్రహ్మలోకమును ప్రాపింతురు. అచ్చటనున్న సుఖముల యందు ఆగ్రహమును, ఆ స్వరూపమునం దభిమానమును వీడిన యోగులు ప్రాణజయముతో మనస్సును జయించి ఉందురు. అందుచేత ఆ స్థానమందును ఆ భోగముల యందును వారి కాశ యుండదు. వారు బ్రహ్మదేవునితో పాటు పరమపురుషార్థులైన వారును, ఆనంద స్వరూపుఁడును నిత్యుఁడును అయిన పరమాత్మనే పొందుదురు. వారు మరల సంసారమును పొందరు.

11. అథ=అందుచేత, భామిని=పరిశుద్ధురాలైన దేవహూతీ! సర్వభూతానాం=సమస్తభూతములయొక్క, హృదయ పద్మేషు=హృదయ పద్మములందు, కృతాలయం=నివసించుచున్నట్టియు, శ్రుతానుభావం=శ్రుతమైన అనుభావముతో కూడిన వాఁడును అయిన, తం=ఆ పరమ పురుషుని, భావేన=పరమ ప్రేమతో, శరణం భజ=శరణు పొందుము.

తాత్పర్యము : బ్రహ్మదేవుని సర్వేశ్వర భావముతో నువాసించు పురుషుఁడు అతనితో పాటు భగవంతుని పొందును. భగవంతునే నేరుగా భజించువాఁడు భౌతిక శరీర త్యాగానంతరము భగవంతునే చేరును. అందుచే పరిశుద్ధురాలైన ఓ తల్లి! సకలభూతముల హృదయస్థలమందు ఏ మాత్రమును భేదము లేక నిరంతరము వసించుచున్న ఆ పరమేశ్వరుని పరమ ప్రేమలక్షణమైన భక్తితో శరణుపొందుము. భగవంతుని మాహాత్మ్య మెట్టిదో నానుండి విన్నావు. దానిని నిరంతరము మనన మొనర్చికొనుము. భక్తవత్సలుఁడైన యా పరమాత్మను

నిరంతరమును స్నేహించి నీవు పొందవలసిన పరమ ప్రాప్యరూపముగా నాశ్రయింపుము.

12. 13. 14. స్థిరచరాణాం=స్థిరములును, చరములునైన భూతములకు, ఆద్యః=ఆదిభూతుఁడును, వేదగర్భః=వేదమును గర్భమందు నిలిపికొన్న వాఁడును, యః=ఎవ్వఁడు, నిస్సంగేన=సంగతి రహితమై యున్న, కర్మణా అపి=కర్మముచేత కూడిన వాఁడును, కర్తృత్వాత్=కర్తృత్వము కారణముగా భేదదృష్ట్యా=భేద భావనతో కూడిన, అభిమానేన=అభిమానముతో, యోగేశ్వరైః=యోగేశ్వరులు, యోగప్రవర్తకైః=యోగమును ప్రవర్తింపచేసెడి వారును, సిద్ధైః=సిద్ధపురుషులును అయిన, కుమారాద్యైః=సనత్కుమారాదులతో కూడ, సగణం=ఉత్కృష్టగుణములు కలవాఁడుగా, పురుషర్షభం=పురుషోత్తముని, బ్రహ్మ=సర్వవ్యాపకుఁడునైన, పురుషం=భగవంతుని, సంసృత్య=ప్రాపించి, పునః కాలే=మరల విహిత కాలమందు, ఈశ్వర మూర్తినా=సర్వేశ్వర స్వరూపమైన కాలేన=కాలముచేత, గుణవ్యతికరే= గుణముల యొక్క సమ్మేళనము, జాతేసతి=ఏర్పడిన దగుచుండఁగా, యథా పూర్వం=ముందటి వలెనే, ప్రజాయతే=జన్మించును.

తాత్పర్యము : సర్వమును భగవంతుఁడే అనుభావమును వహింపక భగవద్భిన్నమైన భావ మేర్పడి యుండుటచేత బ్రహ్మాదులు కూడ మరల జన్మింతురు. ఇఁక తక్కిన వారిని గూర్చి చెప్పవలసిన దేమున్న దని సూచించి సర్వాత్మభావముతో భజింపవలెనని ఉపదేశించుచున్నాఁడు. స్థిరములును, చరములునైన సమస్త భూతజాలములకు మొట్టమొదటనున్న బ్రహ్మదేవుఁడు కూడ అభిమాన వశముగా సంబంధించిన భేదభావముతో మరల బ్రహ్మదేవుని రూపముతో జన్మించును. వేదము ఆ బ్రహ్మదేవుని యొక్క హృదయమును చేరి ఏర్పడెను. వేదగర్భుఁడగుటచేత ఆతనిని జ్ఞానస్వరూపుఁడనియే చెప్పవలసి యున్నది. సనకాదులు మహా యోగీశ్వరులు. యోగమార్గమును ప్రపంచమున వ్యాపింపఁ జేసినవారు. వీరు ఆత్మస్వరూపులే. మఱికొందరు ఋషులు. వీరందరును బ్రహ్మ నుండి సంభూతి నందినవారే. సృష్టి వ్యాపారము నుండి ఏదో ఫలము సిద్ధింపవలెనని సంకల్పము వహింపకయే లోకములన సృష్టించుచున్నారు. కాని నేను కర్తనను భావము వారికున్నది. ఈ యభిమానము చేతనే పరమేశ్వరు నందు లయించినను మరల బ్రహ్మదేవుఁడు వీరే బ్రహ్మగా గ్రహించుచున్నాఁడు. ఈ స్థితి ఎప్పుడెర్పడును? కాలము పరమేశ్వరుని స్వరూపమేనా? ఈ కాలమందు ప్రకృతి సమస్తలోకమును అణచి పెట్టును. ఒకా నొకప్పుడు ప్రకృతి యందు గుణసామ్యక్షోభ మేర్పడును. అప్పుడు సర్వజీవ స్థానభూతుఁడైన బ్రహ్మదేవుఁడు భగవంతుని నుండి భిన్నుడైన వాఁడుగా నవతరించును. సర్వజీవ శరీరాత్మకమైన బ్రహ్మాండమును తన శరీరమందు, సృష్టి యందలి కర్తృత్వము తనదే యని అభిమానించుటయే ఆతని పునరావిర్భావమునకు కారణము.

15. తేఅపి=వారును, ధర్మవినిర్మితం=ధర్మమునుండి నిర్మింపఁబడినదియు, పారమేష్ఠ్యం=పరమేష్ఠికి సంబంధించినదియునైన, ఐశ్వర్యం=ఐశ్వర్యమును,

నిషేవ్య=అనుభవించి, గుణవ్యతికరేసతి=గుణసామ్యమున్నను భంగము వాటిల్లినపుడు, పునః ఆయాతి=మరల వచ్చుచున్నారు.

తాత్పర్యము : బ్రహ్మ లోకమును ప్రాపించిన పూజ్యులైన జీవులుకూడ వారిధర్మానుష్ఠానమునకు ఫలమైనదియు బ్రహ్మలోక మందున్నదియు నైన సుఖసమృద్ధి ననుభవించిన తరువాత గుణ సమ్మోహనము నిమిత్తముగా ప్రకృతియందు జన్మించి క్షోభతో సృష్టి ఆరబ్ధమైనపుడు మరల మనుష్యలోకమున కేతెంతురు.

16. ఇహ=ఈలోకమందు, ఆసక్తమనసఃగొప్ప అభిమానమున్న మనస్సుతో కూడినవారు, కర్మసుకర్మలయందు, శ్రద్ధయా అన్వితాఃశ్రద్ధతోకూడిన వారునైన, యే=ఎవరు కలరో, వారు, అప్రతిషిద్ధానినిషేధింపఁబడనివైన, నిత్యాని అపి=నిత్యములైన కర్మలను, కృత్స్నశఃపూర్తిగా, కుర్వంతి=చేయుచున్నారో.

తాత్పర్యము : ఈ లోకసుఖభోగములందు ఎక్కువ ఆసక్తిగల ఏ జీవులు ఆయాభోగాలను పొందించుకొనుటకై ఏర్పడినవియు, వేదముచే అనుషిద్ధములునైన కామ్యకర్మములను - సంధ్యావందనాదులైన నిత్యకర్మలను ఎక్కువ శ్రద్ధతో ననుసరించుచున్నారు.

17. రజసా=రజోగుణముచేత, కుంఠమనసఃవిక్షిప్తమైన మనస్సుతో కూడిన వారును, కామాత్మానఃకాంక్షాసహితమైన మనస్సుకలవారును, అజితేంద్రియాఃజయింపఁబడని ఇంద్రియములు కలవారును, గృహేషుగృహములందు, అవిరతాశయాఃఅభిముఖ్యముతో రమించుచున్నవారును అయిన, యే=ఎవ్వరు, అనుదినం=ప్రతిదినమును, పిత్ర్యాన్=పితృదేవతలను, యజంతి = యజించుచున్నారో.

తాత్పర్యము : మఱి కొంద రుందురు. వారి జీవితములలో రజో గుణము చోటు చేసికొని యుండును. నిరంతరము కోరికలతో వారి మనస్సు చంచలము. ఒకటి నిర్ధించినచో వేఱొక్కదానిపై మనస్సు పోవుచుండును. వారింద్రియములపై అధికారము లేనివారు. గార్హస్థ్యములైన సుఖములందు ఆనందించెడు చిత్తవృత్తి కలవారు. వారు నిరంతరమును పితృదేవతలను తృప్తి పఱచుటందే నిమగ్నులై ఉందురు. శ్రాద్ధాదికములు బహుశ్రద్ధతో ఒనర్చుదురు.

18. 19. 20. త్రైవర్గికాఃమూఁడు పురుషార్థములనే ముఖ్యమని భావించు చున్నవారై, కథనీయోరువిక్రమస్యగానము చేయుటకు యోగ్యమైన మహా పరాక్రమాది గుణములచే కూడినదియు, హరిమేధసఃసంసార దుఃఖములను తీర్చెడు మేధస్సు కల్గినదైన, మధుద్విషఃశ్రీహరి యొక్క, కథాయాఁకథ యందు, విముఖఃవిముఖులై, యే=ఎవ్వరుందురో, వారు, అచ్యుత కథా సుధాం= భగవంతుని కథలనెడు అమృతమును, హిత్వా=వదలి విడ్చుజఃఅమేధ్యమును భక్షించెడు ప్రాణులు, పురీషం ఇవ=అమేధ్యమును వలె,

అసద్గాథాఃఅపరిశుద్ధములైన కథలను, యే శృణ్వంతి=ఎవరు వినుచున్నారో, తే=వారు, దైవేన=ప్రారబ్ధకర్మముచేత, విహతాఃనూనం=బాధితులు. ఇది నిజము. తే=వారు, దక్షిణేనపథా=దక్షిణమైన మార్గముచేత, అర్యమ్ణఃఅర్యముని యొక్క, పితృలోకం=పితరుల యొక్క లోకమును, వ్రజంతి=పొందుచున్నారు. శ్మశానాంత క్రియాఃశ్మశానము వఱకున్న కార్యకలాపములను, కృతాఃశ్రద్ధగలిగిన వారై, ప్రజాం అను ప్రజాయ, తే=ప్రజల ననుసరించి మరల జన్మింతురు.

తాత్పర్యము : కొంద రుందురు. వారి దృష్టిలో నెప్పుడు మూడైన పురుషార్థములే పనిచేయుచుండును. భక్తుల సంసారక్లేశములను నిశ్శేషముగా సంహరించుచున్న కరుణా నిధియు, కీర్తించుట కర్హములైన అనంత అసాధారణ కర్మములను భక్తసంరక్షణార్థమై ఏర్పఱచుచున్న వాఁడును అయిన శ్రీహరికి సంబంధించిన కథలయందు వారి కాసక్తి యుండదు. వారు నాశరహితమైన భగవంతుని యమృత సమాన కథ యందు ఉపేక్షగలవారై యుందురు. వరాహాదులు స్వాదువైన అన్నమును వదలి మలములను స్వీకరించుట మాత్రముతోనే తృప్తము లైనట్లు అసత్కథలయందే అట్టివారి మనస్సులగ్నమై ఉండును. వారిని ప్రారబ్ధకర్మ ఫలము సంపూర్ణముగా స్వాధీనపఱుచుకొనును. వారు ప్రారబ్ధకర్మ దఱ్ఱులు. ఎందుకనఁగా వారు సంసారమందు విరక్తినొంది యుండలేరు. అట్టి జీవులు దక్షిణ మార్గము ననుకరించు వారై పితృదేవతల కధినాథుఁడైన అర్యముఁ డున్న లోకమును ప్రాపింతురు. మరల నీలోకమున జన్మింతురు. గర్భాధానము మొదలుకొని మరణాంతమువఱకున్న సమస్త కర్మలను ఫలకాంక్షతో నిర్వహింతురు. మరణింతురు. మరల జన్మింతురు. ఈ రీతిగా సంసార చక్రభ్రమణము తప్పవారి కన్యము గతి లేదు.

21. సతి=ఓ దేవహూతి! క్షీణసుకృతాఃక్షీణించియున్న సుకృతముతో కూడిన, తే=వారు, సద్యఃవెంటనే, దేవైఃదేవతలచేత, విభ్రంసితోదయాఃభ్రంశింపచేయఁబడిన, ఉదయముకలవారై, వివశాఃఅస్వతంత్రులై, తతఃఆలోకమునుండి, ఇమంలోకం ప్రతిఈలోకమును, పునఃపతంతిమరల పొందుచున్నారు.

తాత్పర్యము : ఓ దేవహూతి! కాలక్రమమున పితృలోకనివాస పుణ్యము వారికి తీరును. కారణ మేమనఁగా అక్కడి భోగములను వారనుభవింతురు. అపుడాలోకమున కధిపతులైన దేవతలు క్షీణించిన పుణ్యముకల ఈ జీవులను ఆ లోకమునుండి మరల క్రిందికి త్రోయుదురు. అస్వతంత్రజీవులు ఈ లోకమున మరల జీవింతురు. ఒక జన్మమందు పుత్రికలుగా సుతులుగా జన్మించి యుండవచ్చును. అవతలి జన్మమందు మరల వారికే తల్లి తండ్రులై పుట్టవచ్చును. ఈ విషయము కనపఱచుటకై "ప్రజామను ప్రజాయంతే" అన్నాఁడు.

22. తస్మాత్=అందుచేత, త్వం=నీవు, భజనీయపదాంబుజం= సేవింప నర్హములైన పాదపద్మములు కల, పరమేష్ఠినం=సర్వేశ్వరుని, తద్గుణాశ్రయయా= వాని గుణముల నాశ్రయించి ఏర్పడినట్టి, భక్త్యా పరమ ప్రేమ రూపమైన భక్తిచేత, సర్వభావేన=సర్వాత్మభావముతో, భజస్వ=భజింపుము.

తాత్పర్యము : కనుక దేవహూతీ! నీవు భజించుటకర్హమైన పాదపద్మములు కల్గినట్టి పరమేశ్వరుని నిరంతరము సేవింపుము. అతని యొక్క భక్తవాత్సల్యాదులైన కళ్యాణ గుణముల గూర్చియే నిరంతరము ధ్యానింపుము. క్రమముగా వానికి నీయందు పరమ ప్రేమ జన్మించును. ఆ ప్రేమ లక్షణము స్థిరపడుటకే భక్తియనిపేరు. సర్వాత్మ యైన వాఁడు భగవంతుఁడే యను జ్ఞానము స్థిరముగా నిల్పికొనుము. దానికే అనన్య భక్తియని నామధేయము.

23. వాసుదేవే=సర్వాంతర్వర్తియైన, భగవతి=భగవంతుని యందు, ప్రయోజితః=కావలసినట్లుగా ఉపయోగింపఁ బడిన, భక్తియోగః=భక్తియోగము, బ్రహ్మదర్శనం=బ్రహ్మదర్శనముతో కూడిన, యత్జ్ఞానం=ఏ జ్ఞానము కలదో, దానిని, వైరాగ్యం=విరక్తియని, ఆశు జనయతి=శీఘ్రముగా జనింపచేయును (వాసు=సర్వుల యొక్క హృదయ గుహలయందు వసించి యుండెడినట్టి, దేవన్ దేవః=స్వయముగా ప్రకాశించెడివాఁడు. సర్వాంతర్యామి యని తాత్పర్యము)

తాత్పర్యము : జ్ఞానముచే గదా మోక్షము సిద్ధించును. భక్తి మాత్రముతో మోక్షమెట్లొర్పడునని శంకింపవలదు. సర్వభూతముల యందును అంతర్యామిగా నున్న భగవానుని గూర్చియున్న పరమ ప్రేణ లక్షణమైన భక్తి క్రమముగా దృఢమైనపుడు తుచ్ఛములైన విషయసుఖములందు విరక్తి తనకు తానై ఏర్పడును. అదికారణముగా బ్రహ్మ సాక్షాత్కారమునకు హేతువైన ఆత్మ స్వరూపబోధము సంభవించును. వైరాగ్యమును జ్ఞానమును జనింపచేయుటకు సమర్థమైన భక్తి ఏర్పడిన మోక్షము కలుగునని చెప్పుటకు సందియములేదు. ఉపాధియైన భక్తిరాగాది దోషములు నశించినపుడు పరమానందము అనుభవము లోనికి వచ్చును. దానికే బ్రహ్మదర్శనమని పేరు.

24.25. అస్యచిత్తం=వీనియొక్క మనస్సు, సమేమ అర్థేమ=తుల్యములైన అర్థములందు, ఇంద్రియవృత్తిభిః=ఇంద్రియముల యొక్క వ్యాపారములతో, ప్రియం అప్రియం వైషమ్యం=ప్రియం, అప్రియ మనెడు విషయ భావములను, యథా న గృహ్ణాతి=ఎపుడు గ్రహింపదో, సః=వాఁడు, తదావేవ=ఆ క్షణమందే, ఆత్మనా=మనస్సుచేత, నిస్సంగం=సంగ రహితముగను, సమదర్శనం=సమమైన దర్శనముతో కూడియు, హేయోపాదేయరహితం=ఇది ఉపేక్షింపతగినది, ఇది గ్రహింపతగినది అనువైషమ్యభావము లేనిదియ, ఆరూఢం=సర్వోత్తమమునైన, ఆత్మానం పదం=ఆత్మగానున్న స్థానమును, ఈక్షతే=కనుగొనుచున్నాఁడు.

తాత్పర్యము : ఆత్మసాక్షాత్కార సమర్థమైన జ్ఞానము ఎప్పుడు ఏర్పడును? అది ఏర్పడినదని గ్రహించుటెట్లు? ఆ విషయము నుపదేశించుచున్నాఁడు. శబ్దాదులైన యర్థములతో జీవున కెప్పుడును సంబంధముండనే యున్నది. ఇంద్రియము లెప్పుడును పదార్థ సంసర్గము కలవియేకదా. ఆ సంసర్గమున్నపుడు మనస్సు ఈ శబ్దము నాకు ప్రియము. ఈ స్పర్శము సుఖకరమైనది. ఇది యప్రియమైన దని ఈ రీతిగా నున్న వైషమ్య భావము లేర్పఱచును. జ్ఞానియైనవాఁడు ఈ వైషమ్యమున కతీతుఁడై యుండును. మనస్సు చంచలత్వమను దోషము నుండి విడివడ శుద్ధమైన చిత్తము ఆత్మస్వరూపమును గమనించును. ఆ చిత్తమునందు ఆత్మస్వరూప మనుభవమునకు వచ్చును. అప్పుడు ఆత్మ శబ్దాది విషయములతో చేరక సర్వమునందును సమముగా నున్నట్టియు, సర్వ ప్రకాశకము నైన స్థితిలో నుండును. దానికొక దానిపైన మమత లేదు. వేఱు దానిపై ద్వేషము లేదు. అది సర్వాతీతమై ఉండును. బ్రహ్మానందస్థితి యట్టిదే. ఈ జ్ఞానమునకే ఆత్మసాక్షాత్కారమని పేరు.

26. జ్ఞానమాత్రం=జ్ఞానస్వరూపమైయున్న, పరంబ్రహ్మ=సర్వోపరిష్టమైన బ్రహ్మము, పరమాత్మా=పరమాత్మ స్వరూపము, ఈశ్వరః=ఈశ్వరుఁడు, పుమాన్=పురుషుఁడు, భగవాన్=భగవంతుఁడనెడు పేరులచేత, ఏకః ఏవ=ఒక్కఁడే, దృశ్యాదిభిః=దృశ్యము మొదలైన, వృథగ్భావైఃభిన్న భావములతో, ఈయతే=కానఁబడును.

తాత్పర్యము : సర్వభూతముల యందును సమస్వరూపుఁడై యుండునని తెల్పిన విషయమును వివరించి ఉపదేశించుచున్నాఁడు- దానమనెడు స్వరూపముతో కూడిన పరమార్థవస్తు వొక్కటే. అది దృశ్యము, ద్రష్ట, దర్శనము, వీని కుపయోగ పడుచున్న నేత్రాదులైన ఇంద్రియములనెడు రూపములతో అనేకముగా గమనింపఁబడుచున్నది. ఏకమైన పరమార్థవస్తువునే ఉపనిషత్తులు బ్రహ్మమను చున్నవి. యోగశాస్త్రములు పరమాత్మ, ఈశ్వరుఁడని పిలుచుచున్నవి. సాంఖ్యము పురుషుఁడను చున్నది. భక్తి శాస్త్రము భగవంతుఁడని వాకొనుచున్నది. ఇన్ని భిన్న శబ్దములతో పిలిచినను ఆ తత్త్వమొక్కటే.

27. కృత్స్నశఃఅన్నిటియందును, అసంగఃయత్=నిస్సంగుఁడై యుండుట అనుట ఏదికలతో, సమగ్రేణ యోగేణసమస్తమైన యోగమునుండి, ఏతావాన్ ఏవఅంతయే, అభిమతఃఅర్థఃఅభీష్టమైన ప్రయోజనము, యోగినఃయోగికి, యుజ్యతేసిద్ధించును. హిఈ విషయము సుప్రసిద్ధము.

తాత్పర్యము : నానారూపములతో కనిపించుచున్నది సర్వము ఒక్క పరబ్రహ్మపదార్థమే అయినచో అది నిత్యసిద్ధమైయున్నదేకదా! దానిని పొందుటకై యొనర్చెడు సాధనములైన యోగములు మఱిదేనికి? అనెడు శంకను పరిహరించుచున్నాఁడు. బ్రహ్మప్రాప్తికి ఉపాయములుగా చెప్పఁబడెడు. జ్ఞాన యోగము, కర్మ యోగము, భక్తి యోగము, అష్టాంగ యోగము అని ఈ

రీతిగా ఉన్న సకల యోగములు ఒకటే ప్రయోజనమును సాధించుటకై ఏర్పడియున్నవి. వీని నాశ్రయించెడు భిన్న భిన్నులైన యోగులు సాధించెడు ప్రయోజన మొక్కటే. సర్వమునందును అనాసక్తి ఏఱ్ఱడుట. దానిని సాధించినచో ఇఁ కపై సాధింపవలసిన దొక్కటియును లేదు. సమస్తము బ్రహ్మపదార్థముగనే భాసించుచున్నపుడు ఒకదానియందు ప్రియాభిమానము, వేఱొకదాని యందప్రియాభిమానము ఇది లేకపోవును. అట్టి వాని కొక్కటి ప్రియముకాదు. మఱియొక్కటప్రియముకాదు. ఈ స్థితి ఏర్పడినచో యోగమునుండి ప్రయోజనము సిద్ధించినట్లే. నిత్యసిద్ధమై యున్న బ్రహ్మ సాక్షాత్కారమును నిరోధించుచున్నది. విషయాసక్తి యనెడు మనోదోషము. దానిని నిరోధించుట కున్న ఉపాయమునే యోగమందురు. అంతేగాని యోగము బ్రహ్మమును సిద్ధింపఁ జేయదు. ఆ స్థితిలో తానే బ్రహ్మమని యున్నపుడు ఇక దానిని ప్రాపింపఁ జేయునది ఏదుండును? ఆ స్వరూపము మాయింపఁ జేయు నావరణము విషయాసక్తియే. అది అంతఃకరణము యొక్క వికృత రూపము. దానిని నిరోధించుటయే యోగ ప్రయోజనము. ఆసక్తి నిరోధము యోగముచేత సిద్ధించిన దగుచుండఁగా మేఘముల యావరణము తొలఁగినపుడు సూర్యుఁడు స్పష్టముగా ప్రకాశించునట్లు బ్రహ్మ స్వయముగా ప్రకాశించునని తాత్పర్యము.

28. పరాచీనైఃబహిర్ముఖములైన, ఇంద్రియైఃఇంద్రియములచేత, భ్రాంత్యా=ఏర్పడిన భ్రాంతియైన, శబ్దాదిధర్మిణాఁ=శబ్దాదిధర్మములతో కూడిన, అర్థరూపేణ=అర్థస్వరూపమై, నిర్గుణం=గుణాతీతము, ఏకం=ఏకమునైన, జ్ఞానం=జ్ఞానమని, అవభాతి=ప్రకాశించును.

తాత్పర్యము : సర్వము బ్రహ్మ స్వరూపమే కదా! అట్టిచో విషయాసక్తి ఎందుకై నిరోధింపవలెను? విషయాసక్తిగల మనస్సు, విషయము రెండును బ్రహ్మపదార్థములేకదా! అప్పుడు నిరోధప్రయత్నము నిష్ఫలమేకదా! ఇది శంకాస్పదము. దానికి సమాధాన మిట్లోకము - నేత్రాదులైన ఇంద్రియములతో కూడ వానికి ముందే ప్రసరించుచున్న మనోవృత్తి హృదయాంతర్వర్తియు సత్త్వాదులైన గుణములకంటె అతీతమైన జ్ఞానమును సర్వాత్మగా సర్వస్వరూపముగా జీవుఁడు తెలిసికొనుటలేదు. శబ్దాదులైన ధర్మములతో కూడిన ఆకాశాది పంచభూతములే కనిపించుచున్న సర్వమును ఒకటే జ్ఞానస్వరూపమని తెలియుటలేదు. శబ్దాది విషయము వాని కాశ్రయమైన పంచభూతములు వాని సమ్మేళనముతో నేఱ్ఱడిన ఇంద్రియములు జ్ఞానముకంటె భిన్నములైన పదార్థములని తప్పుగా తెలిసికొనుచున్నాఁడు. అపుడు దేవుఁడు, మనుష్యుఁడు, మృగములు, పక్షులు ఇవన్నియు భిన్న భిన్నములని తోఁచును. ఆ శరీరముల యందు నేనని, నాదియని అభిమానము పోవును. ఈ యభిమానము కారణముగా జీవాత్మకు బంధనము సిద్ధించును. అందుచేత ఆ భేద భావము నడ్డగించుటకు యత్నమును మోక్షేచ్ఛగల మానవుఁడు చేసి తీరవలెను.

పంచభూతాత్మకమైన దేహము, లోకము ఇవి యన్నియు ఒకటియైన జ్ఞాన స్వరూపము యొక్క వివర్తములే అనెడు స్వానుభవములే బ్రహ్మ సాక్షాత్కార మనిపించుకొనును. మనోవృత్తి ఇంద్రియములతో పాటు బాహ్యపదార్థములను జ్ఞాన భిన్నములని తప్పుగా గ్రహించుచున్నది. దానిని నిరోధించుటకే యోగాభ్యాస మొనర్చినపుడు ఆ భ్రమ నశించును. స్వాత్మానుభూతి ఏర్పడును. కనుక ముముక్షువులు భ్రాంతినివృత్తికై యోగాదులు సాధింపవలెను.

29. మహాన్=మహత్తత్త్వము, అహంరూపః=అహంకార తత్త్వమును, త్రివృత్=త్రిగుణ స్వరూపము, పంచవిధః=ఐదు రూపములతో నున్నదియు, ఏకాదశ విధశ్చ=పదునొకండుగా నున్నదియు - ఈ సర్వమును, స్వరాట్=స్వయం ప్రకాశమైనది. యతః=ఏది కారణముగా, అండం జగత్=అండరూపమైన లోకము, తస్య వపుః=దాని శరీరమో.

తాత్పర్యము : ఒక్కటేయైన పరమార్థ స్వరూపమే సర్వపదార్థ స్వరూపముగా భాసించుచున్న విధమును ఉదాహరించి చెప్పుచున్నాడు. - అన్యాపేక్షలేక సర్వవేళలయందును ప్రకాశ స్వరూప మయ్యును ఇతరములను ప్రకాశింపజేయునదియు - సమష్టి స్వరూపమును అయిన పరమేశ్వరుడే "స్వరాట్టు" నిపించుకొనును. ఏకమై ఆ పరతత్త్వము మొదలు మహత్తత్త్వమైనది. పిదప అహంకార తత్త్వమైనది. తరువాత త్రిగుణముల సమష్టిరూపమైనది. ఆకాశాది పంచభూతములైన జ్ఞానకర్మేంద్రియములు పదియుగానైనవి మనస్సైనది. ఈ రీతిగా పదునొకండై లోకమందు కన్పించుచున్నది. ఈ కనపడుచున్న సర్వము నందును వ్యాపించి యుండుటవలన పరమేశ్వరుడు సమష్టి స్వరూపుడు. అట్లే వ్యష్టి స్వరూపుడు కూడ. ఈ రెండును పరబ్రహ్మయొక్క స్వరూపములే.

30. శ్రద్ధయా=శ్రద్ధచేతను, భక్త్యా=భక్తిచేతను, నిత్యశః యోగాభ్యాసేన=నిరంతరమైన యోగాభ్యాసము చేతను, విరక్త్యా=వైరాగ్యముచేతను, సమాహితాత్మా=మనస్సు నధీనములో నుంచు కొన్నవాడును, నిస్సంగః=విషయాసక్తివదలినవాడునై, ఏతత్=ఇది, పరిపశ్యతి వై=స్పష్టముగా చూచుచున్నాడు. ఇది నిజము.

తాత్పర్యము : సర్వపదార్థములుగా కనిపించుచున్నది పరమార్థతత్త్వమైన బ్రహ్మమైనపుడు భేదభావనకు కారణమే లేదు. దానికి విరుద్ధముగా ఒక్కొక్కటియు భిన్నభిన్నమైనదను భ్రాంతి ఎవరికుండునో వారికా భ్రాంతిని తొలగజేయుటకు పరిశ్రమ మావశ్యకము. శాస్త్రవాక్యమందు విశ్వాసము, సర్వేశ్వరునందు పరమ ప్రేమ లక్షణమైన భక్తి, యమ నియమాదులుగా నున్న అష్టాంగములతో కూడిన యోగముల నిరంతరాభ్యాసము, విషయమున దోషస్థానములు అను నిశ్చయముతో గూడిన విరక్తి, ఈ సాధనముల యొక్క

సహాయముతో ఇంద్రియములు, వానితోపాటు చలించుచున్న మనస్సు వీని నడ్డగింపవలెను. విషయాసక్తిని నిశ్శేషముగా వదలవలెను. అపుడు సర్వాత్మకమై ప్రకాశించునది బ్రహ్మ మొక్కటే అనెడు సత్యము అనుభవములోనికి వచ్చును.

31. గుర్వి!=ఓ పూజ్యురాలా! బ్రహ్మదర్శనం=బ్రహ్మముయొక్క దర్శనము నకు కారణముగానున్న, తత్ ఏతత్ జ్ఞానం=ఈజ్ఞానము, ఇతికథితం=ఈ ప్రకారముగా నుపదేశింపఁ బడినది, యేన=దేనిచేత, ప్రకృతేః=ప్రకృతియొక్కయు, పురుషస్య చ=పురుషుని యొక్కయు, తత్త్వం=స్వరూపము, అవబుధ్యతే= క్రమముగా తెలియఁబడుచున్నదో.

తాత్పర్యము : ఈ విషయమును ఇంతకుముందే ఎనిమిది అధ్యాయములతో చెప్పఁ బడిన సాంఖ్య యోగము యొక్క ప్రయోజనముగా సంగ్రహించి చూపుచున్నాఁడు. ఓ పూజ్యురాలైన తల్లి! బ్రహ్మ సాక్షాత్కారమునకు కారణమైయున్నది, ఉపనిషత్తులందు ప్రతిపాదించిన దానికంటె భిన్నముగా నుండునట్టిదియునైన జ్ఞాన ప్రకారము ఈ రీతిగా నాచే బోధింపఁ బడినది. దీనిని చక్కగా అనుభవములోనికి తెచ్చుకొన్నపుడు ప్రకృతి పురుషుల స్వభావ మెట్టిదను విషయము క్రమక్రమముగా అనుభవములోనికి వచ్చును.

32. నైర్గుణ్యాః=నిర్గుణ విషయముగను, మన్నిష్ఠాః=నాయందు పర్యవసించు నదిగా, జ్ఞానయోగాః=జ్ఞానయోగము, భక్తి లక్షణాః యోగశ్చ=భక్తియోగమును, ద్వయోః+అపి=రెంటికినీ, భగవచ్ఛబ్ద లక్షణాః=భగవంతుని గూర్చి తెలుపుట అనెడు, అర్థాః=ప్రయోజనము, ఏక ఏవ=ఒక్కటే.

తాత్పర్యము : జ్ఞానయోగము భక్తి యోగమనెడు ఈ రెండు యోగముల ఫల మొక్కటే. ఒకటి మఱియొక్క దానికంటె ఉత్కృష్టమనియు అపకృష్టమనియు శంకించుటకు వీలులేదు. నాయందు పర్యవసించుటతో కూడిన నిర్గుణ జ్ఞాన యోగమును నాయందలి పరమ ప్రేమతో కూడిన భక్తియోగమును నా స్వరూపము సాధకునికి బోధించెడు నట్టి ఒక్కటే ఫలము గల రెండు మార్గములు మాత్రమే. వానిలో ఉచ్చనీచ భేదములు లేవు--

"ఏక మప్యాస్థితస్సమ్యక్ ఉభయో ర్విందతే ఫలమ్,
యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే."

సాంఖ్య మనియు యోగమనింయు చెప్పఁ బడుచున్న రెండు మార్గములలో దేని ననుసరించినను లభించెడు స్థాన మొక్కటేయని గీతావచనము. రుచి భేదము ననుసరించి ఎవరికి దేని యందిష్టమున్నదో దాని ననుసరింపవచ్చును. ఒకే స్థానము చెందెడు రెండు మార్గములని మాత్రమే చెప్పవచ్చును. రుచిభేదము ననుసరించి సాధకుఁ డెన్నికొనును. ఇరువురును ఒక్కటే స్థానమును చేరికొందురు.

33. బహుగుణాశ్రయాః=అనేక గుణముల కాశ్రయమై ఉన్న ఏకః అర్థః =ఒకటే పదార్థము, పృథక్ ద్వారైః=వేరు వేరు మార్గములతో కూడిన, ఇంద్రియైః

=ఇంద్రియములచేత, నానాయథాఈయతే=నానారీతులుగా గ్రహింపఁ బడుట ఏ రీతియో తద్వత్=అట్లే, ఏకః భగవాన్=ఒకఁడే అయిన భగవంతుఁ డు, శాస్త్ర వర్త్మభిః=శాస్త్రమార్గములతో, నానీ ఈయతే=అనేకరీతులుగా నిర్ణయింపఁ బడును.

తాత్పర్యము : ప్రాప్యస్థాన మొక్కటే అయినప్పుడు మార్గభేదము లెందుకు? దానికి సమాధానము, రూపము, రసము, గంధము, స్పర్శము అనెడు బహుగుణముల కాశ్రయములైనవి పదార్థములు. వానిని ఒక్కొక్క ఇంద్రియము ఒక్కొక్కరీతిగా గ్రహించుచుండును.. తీపిగల చక్కెరనే తీసి కొందము. నేత్రేంద్రియము దానిని చక్కెరగా తెలిసికొనుచున్నది. తెల్లనిదని గ్రహించుచున్నది. నాసికేంద్రియము సుగంధమున్నది, దుర్గంధమున్నదని తెలిసి కొనుచున్నది. త్వగింద్రియము మృదువుగా నున్నది కఠినముగా నున్నదని ఎఱుఁగుచున్నది. రసనేంద్రియము తీయగా నున్నది చేదుగా ఉన్నదని గ్రహించుచున్నది. ఈ రీతిగా ఇంద్రియములు ఒకే పదార్థమును భిన్నభిన్నముగా గ్రహించుచున్నవి. అట్లే ఒకఁడై యున్న భగవంతుని శాస్త్రము లనేక రీతులుగా బోధించుచున్నవి. జ్ఞానియైనవాఁ డు భగవంతుని గుణాతీతునిగా ఎఱుంగును. భక్తులు అనంత కళ్యాణ గుణాశ్రయునిగా గ్రహింతురు. ఈ రెండు వాదములును సత్యములే.

34. 35. 36. క్రతుభిః=యాగములచేతను, క్రియయా=పూర్తమనెడు కర్మచేతను, దానైఃదానములచేతను, తపస్వాధ్యాయ మర్శనైఃతపస్సు, వేదాధ్యయనము - వాని అర్థవిచారము వీనిచేతను, ఆత్మేంద్రియజయేన=మనస్సు ఇంద్రియములు వీని జయముచేతను, కర్మణాం=కర్మములయొక్క, సంన్యాసేన=సమర్పణము చేతను, వివిధాంగేన=అనేక అంగములతో కూడిన, యోగేన=యోగము చేతను, భక్తి యోగేనచ ఏవహి=భక్తి యోగము చేతను, యః ప్రవృత్తినివృత్తిమాన్ = ప్రవృత్తినివృత్తులు అణఁగియున్నదేది కలదో అట్టి, ఉభయచిహ్నేన ధర్మేణ=రెండు విధములైన లక్షణములతో కూడిన ధర్మముచేతను, ఆత్మతత్త్వావబోధేన=ఆత్మయొక్క తత్త్వమును తెలియుట చేతను, దృఢేన వైరాగ్యేణచ=దృఢమైన వైరాగ్యము చేత, ఏభిఃవీనిచేత, సగుణఃగుణపూర్ణుఁడు, నిర్గుణఃగుణాతీతుఁడు, స్వదృక్=స్వయముగా ప్రకాశించెడు వాఁడౌనైన, భగవాన్=ఈశ్వరుఁ డు, ఈయతే=పొందఁ బడుచున్నాఁ డు.

తాత్పర్యము : భగవత్ప్రాప్తికై శాస్త్రములు ఉపదేశించిన మార్గములను వివరించుచున్నాఁ డు. జనుల యుపయోగమునకై బావులు త్రవ్వించుట, చెరువులు కట్టించుట మొదలైన వానికి పూర్తములని పేరు. వీని చేతను యోగప్రక్రియలనేకములు; తన్నిర్వహణము చేతను, తులాపూరుషాది దానముల చేతను, కృచ్ఛ్ర చాంద్రాయణాద్యనుష్ఠాన రూప తపస్సు చేతను, వేదాధ్యయనము తదర్థవిచారము వీనిచేతను, అంతఃకరణమును జయించుట శమము. ఇంద్రియములను జయించుట దమము -- ఈ రెంటిచేతను వర్ణాశ్రమోచితములై

అనుష్ఠింపఁ బడుచున్న సమస్త కర్మములు భగవంతున కర్పించుట చేతను, యమ నియమాది బహు భేదములతో కూడిన యోగానుష్ఠానము చేతను, పరమ ప్రేమ లక్షణమైన భక్తి చేతను, విషయముల యం దాసక్తిగలదని సూచించెడు సకామకర్మానుష్ఠానముల చేతను విషయాసక్తి నిశ్శేషముగా నశించినదని సూచించెడు నిష్కామకర్మానుష్ఠానము చేతను, ప్రవృత్తినివృత్తి భేదములతో ఆత్మతత్త్వము నరయుటచేతను వైరాగ్యముచేతను, - ఈ యుపాయములతో పరమాత్ముఁ నెఱుఁగ దగును. వారు వారు వారి వారి యధికారము ననుసరించి ఏదో ఒక మార్గము ననుసరించినను - వానిద్వారా సకల కళ్యాణ గుణ పరిపూర్ణుఁడును సమస్త గుణముల నతిక్రమించిన వాఁడును, స్వయం ప్రకాశకుఁ డును, కేవలుఁ డైన, భగవంతుని పొందవచ్చు. సకామకర్మచేత పొందఁ బడెడు స్వర్గాదులుకూడ భగవద్రూపము లగుటచేత స్వర్గకాముఁ డైన వాఁడు బహుజన్మల తరువాత పరమాత్మనే పొందును.

37. భక్తి యోగస్య=భక్తియోగము యొక్కయు, చతుర్విధం=నాల్గు తెఱఁగులైన, స్వరూపం=స్వరూపమును, యః=ఎవ్వఁ డు, జంతుషు=జంతువులందు, అంతర్భావతి=లోనుండి సంచరించునో, అవ్యక్తగతేః=అస్పష్టమైన చేష్టతోకూడిన, కాలస్యచ=కాలము యొక్కయు, స్వరూపం=స్వరూపమును, తే=నీకు, ప్రావోచం= ఉపదేశించితిని.

తాత్పర్యము : సకామ నిష్కామ సగుణ నిర్గుణ భేదముతో నున్న నాల్గువిధములైన భగవత్స్వరూపములు, సకల చరాచరముల యొక్క అంతర్బాగములలో ప్రవేశించి అస్పష్టమైన చేష్టతోకూడిన కాలము యొక్కయు స్వరూపమును ఇంతవరకు స్పష్టముగా వివరించి యున్నాను.

38. అంబ!=పూజ్యురాలా! యాసు=దేనియందు, ప్రవిశన్నాత్మా=ప్రవేశించి యున్న ఆత్మ స్వరూపమును, ఆత్మనః గతిం=దానియొక్క గతిని గూర్చియు, నవేద=తెలియఁ డో, అవిద్యాకర్మనిర్మితాః=అభిమానము నిమిత్తముగా నేర్పడిన కర్మములతో నిర్మింపఁ బడిన, జీవస్య=జీవునకు, బహ్వీఃగతి భేదములను గూర్చియు, ప్రావోచం=మీకు తెలిపితిని.

తాత్పర్యము : అజ్ఞానము నిమిత్తముగా దేహేంద్రియ భ్రాంతి జనించును. తదభిమాన పూర్వకముగా జీవుఁ డు కర్మలు చేయును. తత్ఫలముగా వాఁడు బహువిధములైన స్వర్గనరకాది లోకముల ననుభవించును. వాని యం దేర్పడెడు సుఖదుఃఖములు - వీని నన్నిటినీ గూర్చి నీ కింతకు ముందే స్పష్టముగా తెలిపితిని. ఆ లోకములందు దేవమనుష్యాది భావములను అభిమానించుచున్న జీవాత్మ తన పరమార్థమైన సచ్చిదానంద భావమున తెలిసికొన లేక నేను సుఖిని, నేను దుఃఖి ననెడు భావముచేత జన్మమరణాది రూపబంధమైన దుఃఖమును అనుభవించును.

39.40. ఏతత్=దీనిని, ఖలాయ=దుష్టుఁ డెవ్వఁ డో వానికిని, అవినీతాయ =వినయము లేనివానికి, స్తబ్ధాయ=గర్విష్ఠునకును, ధర్మధ్వజాయ= ధర్మానుష్ఠాన మును నటించువానికినీ, లోలుపాయ = అత్యంత విషయాసక్తిగల వానికినీ, గృహారూఢచేతసే=గృహముల యం దాసక్తమైన బుద్ధి గలవానికి, మే అభక్తాయ=నాక భక్తుఁ డైన వానికిని, మద్భక్తద్విషామపి=నాభక్తులను ద్వేషించువారలకును, న ఉపదిశేత్=చెప్పనే రాదు.

తాత్పర్యము : ఈ సాంఖ్యశాస్త్రము వినుట కధికారు లెవ్వరో చెప్పుచున్నాఁడు - ఇది సర్వశాస్త్రముల సారము. దీనిని గ్రహించుట కధికారులుకాని వారలకు చెప్పినచో వాని యందీబోధ సరిగా వర్తింపదు. అందుచే అట్టివారి కుపదేశించుట వ్యర్థమని సారము. పర ద్రోహములతోనే జీవన మొనర్చువాఁడు, గురునమస్కారమొనర్చవలెనని భావము లేనివాఁ డు. నాతో సమానమైన జ్ఞాని లేఁడనుకొనువాఁడు, భేదభావన కలవాఁడు, ఇతరులను వంచించుటకైధర్మము ననుష్ఠించువానివలె మెలఁ గువాఁడు, విషయ భోగములయం దత్యాసక్తి గలవాఁడు, స్త్రీధన గృహాదులను నిరంతరము చింతించుచున్నవాఁ డు, భగవంతునందు పరమ ప్రేమలక్షణమైన భక్తిలేనివాఁడు, భగవద్భక్తులను ద్వేషించువాఁ డు -- వీరందఱు ఈ శాస్త్రము వినుట కనర్హులని భావము.

41.42. పైని చెప్పిన తొమ్మిది విధములైన దోషములు కలవారు అధికారులు కారని చెప్పిన తరువాత క్రింద కనపఱచెడు పదునొకండు గుణములు కలవారే ఉపదేశమున కర్హులని చెపుచున్నాఁ డు. చెప్పిన విషయము నమ్మెడి స్వరూపముతో కూడిన శ్రద్ధయు, ఉపదేష్టయందు భక్తియు, వినయమును, పరగుణములందు దోషత్వ మారోపించెడు అసూయ లేకుండుటయు, భూతములందు మిత్రభావమును, వినెడు విషయమందు ప్రీతియు, బాహ్య విషయ విరక్తియు, ఆత్మబోధయును, సావధానమైన మనస్సును, పరోత్కర్షయందు సంతోషమును, సదాచార నిష్ఠారూపమైన శుద్ధియు, అన్నిటికీ మించి పరమాత్ముని యందు దృఢమైన ప్రేమకలవాఁడు ఈ ఉపదేశమున కర్హుఁ డు.

43. యః పురుషః=ఏ పురుషుఁ డు, శ్రద్ధయా=శ్రద్ధతో కూడినవాఁ డై, ఇదం=దీనిని సకృత్=ఒకసారి యైనను, శృణుయాత్=వినునో, యః వా=ఎవ్వఁడు, మచ్చిత్తఃనాయందు నివేశింపఁ బడిన చిత్తము కలవాఁ డై, సకృత=ఒకసారి యైనను, అభిధత్తే=వచించునో, సః చ=వాఁ డు, మే పదవీం=నాయొక్క స్థానమును ఏతిహి=పొందును; నిశ్చయము.

తాత్పర్యము : తల్లీ! ఎవఁ డు మనస్సు నాయందర్పించునో, శ్రద్ధాసక్తుఁ డై దీని నొక్కసారి యైనవినునో, మనః పూర్వకముగా వచించునో వాఁ డు నా స్థానమును పొందును. ఇది నిశ్చయము.

విజయధ్వజ వ్యాఖ్య

1. అర్చిరాది మార్గమే పునరావృత్తి లేని మోక్షమునకు సాధనము. అది శ్రీహరియం దనుష్ఠించెడు భక్తి చేతనే కాంచును. ఈ విషయమునే ఈ అధ్యాయమందు చెప్పుచున్నాఁడు. మొదలు ధూమాది మార్గము దానినుండి పునరావృత్తి యుక్తమైన స్వర్గము కర్మలకు కర్మ ఫలముగా చిక్కును. ఇది శ్రీహరియందె ఒనర్చెడు అల్ప భక్తియుక్తునకు మాత్రమే సాధ్యము. ద్వేషించువానికి చిక్కదు. కనుక దీనికైనను భక్తియే ముక్తిసాధనమని వివరించుచున్నాఁడు. అథ=ఇఁకమీఁద, ప్రవృత్తి కర్మయొనర్చెడు వానికి కలుగు ఫలము తెల్పఁబడుచున్నది. యః=ఎవఁడు, గృహేష్ఠితః సన్=ఇంటియందున్న వాఁడై, గృహమేధీయాన్=గృహస్థునకు దెల్పఁ బడిన, ధర్మాన్ ఏవ=దేవపూజా పితృశ్రాద్ధి ధర్మమును మాత్రమే, ఆవసన్=ఒనరించుచున్నవాఁడై, తత్ఫలం=దానికి ఫలముగా, ధర్మార్థ కామములను, దోగ్ధి=పిదుకుచున్నాఁడో (పొందుచున్నాఁడో) భూయఃమరల, తాన్ ఏవ=ఏ ధర్మములనే, పిపర్తి=పుత్రుఁడు మొదలైన వారి కుపదేశించి కాపాడుకొనుచు వచ్చుచున్నాడు. అంతే కాక తానుకూడ నియమము తప్పక ఆచరించు చున్నాఁడు.

2. కామమూఢః చ=విషయసుఖములందే ఆసక్తుఁడగుట చేత, భగవద్ధర్మాన్=అనిష్ట నివృత్తి, సుఖప్రాప్తి వీనికి సాధనమైన భగవద్భక్తి నుండి, పరాఙ్ముఖఃఅపి=దూరమందున్న వాఁడైనను,, సఃఆ గృహస్థుఁడు, శ్రద్ధయా=శ్రద్ధచేత, అన్వితఃకూడినవాఁడై, క్రతుభిఃయజ్ఞములచేత, దేవాన్=దేవతలను, యజతే=పూజించును. పితౄంశ్చ=శ్రాద్ధాదులతో పితృదేవతలను, యజతే.

3. ఈ రీతియైన పూజాఫలమును చెప్పుచున్నాఁడు - తత్ర్శద్ధయా=దేవపితృ పూజాదులను ఒనర్పవలెననెడు శ్రద్ధచేత, ఆక్రాంత మతిఃకూడినబుద్ధిగల, పితృ దేవతఃపితరులకును దేవతలకును సంతోషమును కలిగించునట్టి వ్రతములు గల, పుమాన్=పురుషుఁడు, చాంద్రమసంలోకం=ధూమాది మార్గముతో చంద్రుని అధికారమునకు లోఁబడిన స్వర్గము యొక్క ఒక భాగమును, గత్వా=చేరి, సోమపాఃయజ్ఞాదులందు సోమరసమును పాన మొనర్చి న ఈ జీవి, పునఃమరల, ఏష్యతి=(1) భగవద్భక్తి రహితుఁడు పాపఫలము ననుభవించుటకై నరకమున కేగును. (2) భగవంతునందు స్వల్ప భక్తికలవాఁడై స్వర్గాద్యపేక్షతో కర్మ మొనర్చివాఁడు స్వర్గమందు పుణ్యఫలము ననుభవించి మిగిలిన పుణ్యమునకు ఫలముగా భూలోకమునకు వచ్చును. ఈ యభిప్రాయమునే -

ఈషద్భక్తోభగవతి సుకర్మా స్వర్గ మేష్యతి,
అభక్తో నిరయం యాతి సుకర్మాపి న సంశయఃʺ

అను ప్రమాణము స్థిరీకరించుచున్నది. దీని ననుసరించి శ్లోకమందు చెప్పఁ బడిన భగవద్భక్తి, పరాఙ్ముఖఃఅనుశబ్దమునకు సంపూర్ణముగా భగవద్భక్తి రహితుఁడు, స్వల్పభగవద్భక్తితో కూడిన వాఁడని రెండర్థములు చెప్పవలెను.

స్వల్పమైన భక్తికలవారని కూడ. ప్రచురమైన భక్తిలేకపోవుట చేత పరాఙ్ముఖుఁ అనియే చెప్పఁ బడెనని తెలియవలెను.

4. ప్రవృత్తి ధర్మములకు ఫలముగా సిద్ధించెడు స్వర్గాదు లనిత్యములు. కనుక వానియందు శ్రద్ధ నిడరాదను నభిప్రాయముతో ఆ లోకములు నాశ మయ్యెడు కాలమును చెప్పుచున్నాఁ డు. యదా=ఎప్పుడు, అనంతాసనఃఁ =అనంతాసనమందుండెడు (శేషునిపై కూర్చొని యుండెడు) హరిఃఁ=శ్రీహరి, అపీఁద్రశయ్యాయాం=శేషుఁ డనెడు శయ్యపైన, శేతే=పవళించునో, తదా=అప్పుడు, గృహమేధినాం=పైనచెప్పిన ప్రవృత్తి కర్మము ననుసరించెడు గృహస్థుల యొక్క, తే ఏతే లోకాఃఁ=ఆ స్వర్గాది లోకములు, లయం=నాశమును, యాంతి=పొందుచున్నవి.

5,6,7. నివృత్తి ధర్మములను, వాని మార్గములను, వా రొనర్చెడు వస్తువును, దానిని పొందుటకై చేయవలసిన సాధనములు సంక్షేపముగా చెప్పుచున్నాఁ డు - యే=ఎట్టి, ధీరాఃఁ=జ్ఞానులు, నిస్సంగాఃఁ=విషయాసక్తిరహితులై, శుద్ధచేతసఃఁ=నిర్మలమైన మనస్సు కలవారై, ప్రశాంతఃఁ=ఎక్కువగా శ్రీహరియందే నిష్ఠమైన మనస్సు కలవారై, న్యస్తకర్మాణఃఁ=తామొనర్చెడు కర్మలను, శ్రీహరికే అర్పించు చున్నవారై, స్వధర్మం=తమతమ వర్ణాశ్రమోచితమైన ధర్మాచరణమును, కామార్థహేతవే=కామము అర్థము వీనికొఱకే, న దుహ్యంతి=ఉపయోగించి కొనుటలేదో, నిర్మమాఃఁ=మమకారము లేనట్టియు, నిరహంక్రియాఃఁ=నేనే స్వతంత్ర కర్తననెడు అభిమానము లేనట్టి, తే=ఆ, నివృత్తి ధర్మనిరతాఃఁ=నివృత్తి ధర్మాచరణమందే మగ్నులైన ముముక్షు జీవులు, స్వధర్మాఖ్యేన=తమస్వరూప భూతమైన (2) తమ ధర్మమైన, సత్త్వేన=సత్త్వగుణము వలన, (2) భగవద్భక్తి వలన, శుద్ధేన=పరిశుద్ధమైన, చేతసా=మనస్సుచేత, సూర్యద్వారేణ=అర్చిరాది మార్గమువలన, పురుషం=మానవుఁ డనెడు పురుషుని, యాంతి=పొందెదరు. పురుషేణ=వానినుండి, ప్రతీకాలంబనుఁ డు, ఆ ప్రతీకాలంబనుఁ డు, విశ్వతోముఖం=సర్వజ్ఞుఁ డైనట్టియు, పరావరేశం=ముక్తాముక్త ప్రపంచమునకు నియామకుఁడైనట్టి, ప్రకృతించ=మూల కారణమైన, అస్య=ఈ జగత్తు యొక్క, స్థిత్యంత భావనం=సృష్టి సంహారములకు కారణమైన బ్రహ్మను యాంతిఃఁ పొందుచున్నారు. మానవ పురుషుని నుండి విష్ణువును పొందుదురని తెలిపినట్లైనది. ఇచ్చట "ప్రతీకాలంబనుఁ డు అప్రతీకాలంబనుఁడు" ఇరుతెఱఁగులుగా నున్న భక్తులను, శ్రీహరిని పొందినను, మానవుఁడనెడు పురుషుని చేత చతుర్ముఖ బ్రహ్మదేవుని పొందినవాఁ డై అతని సమీపమందే నివసించుచుందురని భావము.

8. ఎంతవఱకు ఈ జ్ఞానులు సత్యలోకమందు వసింతురు అనుటను చెప్పుచున్నాఁడు- ద్విపరార్ధావసానేన=బ్రహ్మదేవుని ఆయుస్సైన కాలము యొక్క రెండర్ధములును గడచిన తరువాత, యఃఁ=ఏ, బ్రహ్మణఃఁ=చతుర్ముఖ బ్రహ్మ

యొక్క, ప్రళయః=మహా ప్రళయము, భవతి=ఏర్పడునో, తావత్=అంతవఱకును, తే తు=ఆ జ్ఞానులు, పరస్య=శ్రీహరినే, పరిచింతకాఃధ్యాన మొనర్చు చున్నవారై, లోకేసత్యలోకమందు, అధ్యాసతే=ముక్తులవలె నుందురు.

9. బ్రహ్మ ప్రళయమున నేర్పడెడు ముక్తి ఎట్టిదో తెల్పుచున్నాఁడు - గుణత్రయాత్మా=సృష్టికొఱకై సత్త్వరజస్తమస్సు లను గుణములను స్వీకరించిన పరఃసమస్త జీవులంకఁటె ఉత్తముఁ డైన, స్వయంభూఃచతుర్ముఖ బ్రహ్మ, పరం=రెండర్ధ భాగములతో కూడిన పరమనెడు, స్వంకాలం=తనయధికార కాలమును, అనుభూయ=అనుభవించి, ప్రతిసంజిఘృక్షుఃతను సృష్టించినట్టి లోకములను సంహరింపవలెననెడు ఇచ్ఛతో కూడినవాఁ డై, క్ష్మాంభోనలానిల వియన్మన ఇంద్రియార్థ భూతాదిభిఃభూమి, నీరు, వహ్ని, గాలి, ఆకాశములనెడు పంచభూతములకు సంబంధించిన దేవతలతోను మనస్సున కభిమానులైన దేవతలతోను, ఇంద్రియాభిమానులైన దేవతలతోను, శబ్దాద్యర్థములకు అభిమాను లైన దేవతలతోను, భూతాది అనిపించుకొనెడు అహంకార తత్త్వమునకు అభిమానులైన దేవతలతోను (తమ తమ బింబములను ప్రవేశించుట మూలముగా గరుడ మార్గము, శేషమార్గము వీనిద్వారా బ్రహ్మదేవునిలో ప్రవేశించిన వారితో కూడి) పరివృతఃకూడినవాఁ డై, అవ్యాకృతం=లక్ష్మీ తత్త్వమును, తన్మూలకముగా శ్రీహరిని, (అవ్యక్త తత్త్వ మూలకముగా) శ్రీహరిని, యర్హి=ఎప్పుడు, విశతి=ప్రవేశింతురో,

10. తర్హి=అప్పుడు, పరేత్య=యోగమార్గములతో తమ తమ దేహములను వదలి, ఏవం=ముందు చెప్పినట్లు, దేవయానము ద్వారా పయనించి, భగవంతం=బ్రహ్మదేవుని, శ్రీహరినీ, అనుప్రవిష్టాఃక్రమముగా ప్రవేశించిన, జితమరున్మనసఃవాయువును మనస్సును వారియనుగ్రహముచేతనే జయించి నట్టివారు, దానిచేతనే, విరాగాఃవిషయాభిలాషలేని, యే యోగినఃఏ జ్ఞానులు కలరో, తే=వారు, (తమ తమ బింబములద్వారా బ్రహ్మదేవుని ప్రవేశించినవారు) తేన సాకం ఏవఆ బ్రహ్మ దేవునితోపాటు, అగతాభిమానాస్సంతఃమేము జీవులనెడు అభిమానము వదలిన వారై, అమృతం=నిత్యముక్తులు, పురుషం=పూర్ణ షడ్గుణుఁడు, పురాణం=పురాతనుఁడు అయిన, ప్రధానం బ్రహ్మ=సర్వోత్తముఁ డైన శ్రీహరిని, ఉపయాంతి=లింగశరీరత్యాగ పూర్వకముగా చేరెదరు. లింగశరీరము భంగ మగుటయే అ కాలమందు కలిగెడు మోక్షమని తాత్పర్యము.

11. 12. ఆ ముక్తి స్వరూపమునే విడమఱచి చెప్పుచున్నాఁడు- స్థిరచరాణాం=స్థావరజంగమ శరీరములు గలిగిన జీవులందు, ఆద్యఃమొదటివాఁడైన (అనగా ఉత్తముఁ డైన, యఃఏ వేదగర్భఃబ్రహ్మదేవుఁ డు కలఁ డో, సఃఅతఁ డు , స ఋషిభిఃమనుష్యులలో ఉత్తములు మొదలుకొని, గరుడ శేషపర్యంతమున్న జ్ఞానులతో పాటు, సిద్ధైఃసాధన సామగ్రితో కూడిన, యోగేశ్వరైఃయోగవిభూతిని పొందిన, కుమారాద్యైఃసనత్కుమారుఁ డు మొదలైన,

యోగప్రవర్తకైః సహ=యోగాచార్యులతో పాటు, లేక సిద్ధైః=సాధనను ముగించికొన్న జ్ఞానులతోపాటు,

13. భేదదృష్ట్యా=జీవేశ్వరాది విషయకరమైన పంచ విధమైన భేదజ్ఞానముచేత, అభిమానేన=పూర్వాజ్ఞానము చేత, నిస్సంగేన=ఫలా పేక్షలేని, కర్మణా అపి=అపరోక్ష జ్ఞానానంతర మొనర్చిన కర్మచేతను, కర్తృత్వాత్=జగత్తుయొక్క సృష్టి మొదలైన కార్యముల నొనర్చుటచేత, సగుణం=జ్ఞానైశ్వర్యాది అనంత గుణములతో కూడిన, బ్రహ్మ=స్వాభావికముగా గుణపూర్ణుడైన పురుషం=భక్తులయందలి కనికరముచేత పురుషాకారమును పొందిన, పురుషర్షభం=క్షరాక్షర పురుషులకంటెను ఉత్తముడగుటచేత, పురుషోత్తముడైన శ్రీహరిని, సంగతః భవతి=ముందటి శ్లోకమందు 'సంగత్యా' అని చెప్పుట చేత ఇచ్చుట ఆపదమునధ్యాహార మొనర్చికొనవలెను. ప్రవేశింతురు. భేదజ్ఞానము శుక్తి రజతజ్ఞానమువలె భ్రమాత్మకమైనది కాదు. ఈ విషయమునే 'అభిమానేన' అనుశబ్దముతో తెలిపినట్లైనది. పూర్ణజ్ఞాన మనగా ముక్తికి తగినంత జ్ఞానమని అర్థము. అనగా వారి వారి యోగ్యతకు తగినట్లు పూర్ణమైన జ్ఞానమని తాత్పర్యము. బ్రహ్మ అనుటచేత అవిద్య కనుగుణుడు కాడనియు- అనగా మాయావాదులు చెప్పునట్టి శబల బ్రహ్మ కాడని తెల్పినట్లైనది.

"అథకస్మాదుచ్యతే బ్రహ్మేతి బృహంతోహ్యస్మిన్ గుణాః" అనెడు శ్రుతికూడ స్వాభావికముగనే గుణపూర్ణుడని తెల్పుచున్నది. పురుషుడనుటచేత ఆకాశమువలె నిరాకారుడు కాడని తెల్పునట్లైనది. దీనిచేత 'గుణపూర్ణుడనుచేట సత్యము మొదలైన ప్రకృతి గుణములను చెప్పరాదనియు సమగ్ర ఐశ్వర్యాది గుణములనే చెప్పవలెననియు సూచించినట్లైనది. పురుషోత్తముడనుట చేత శబల బ్రహ్మ కాడని స్పష్టపఱచినాడు, "ప్రవిష్టులైరి" అనుటచేత సాయుజ్యాది ముక్తులను పొందుదు రని స్పష్ట పఱచినటులైనది.

తాత్పర్యము : ప్రవృత్తి కర్మను ఒనర్చిన వానికగు ఫలమును చెప్పుచున్నాడు. వినుమనుచున్నాడు - ఇంటియందే ఉండి దేవపూజ పితృశ్రాద్ధమూ మొదలైన కర్మల నొనర్చుచు దానికి ఫలముగా ధర్మార్థ కామములను పొందువాడే తన సంతతి నంతటికి కూడ వానిని నుపదేశ మొనర్చి, ఆ రీతిగా వారు ప్రవర్తించునట్లొనర్చి విషయసుఖములందే అసక్తులై శ్రద్ధతో దేవతలను పితరులను పూజించు వారికి పితృదేవ ప్రతుడని పేరు. వీనికి మోక్షమునకు కారణమైన భగవద్భక్తి యుండదు. వీరిలో కొద్దిగా భగవంతుని యందు భక్తిగలవారనియు, ఆ భక్తియే లేని వారనియు రెండు రకములు గలరు. కొద్దిగా భక్తియుండి యజ్ఞయాగాది కర్మల నొనర్చువారు. వారి కోర్కెకు తగినట్లే కొలదికాలము స్వర్గ సుఖము ననుభవించుటకై ధూమాది మార్గముతో చంద్రుని యధికారమునకు లోబడిన స్వర్గ ప్రదేశమును చేరెదరు.

అచ్చట పుణ్యఫలము ననుభవింతురు. తక్కిన అల్పపుణ్యము ననుభవించుటకై మరల భూలోకమున కేతెంతురు. భగవద్భక్తియే లేనివారు. కొద్దికాలము స్వర్గము యొక్క ఏక దేశమందుండి తరువాత పాపఫలము ననుభవించుటకై నరకమును బొందెదరు. ఈ రీతిగా ప్రవృత్తి కర్మ నిరతులైన గృహస్థులు పొందెడు స్వర్గాది లోకములు శాశ్వతమైనవి కావు. శేషుఁడే ఆసనముగా గల్గిన శ్రీహరి శేషశాయియై పడుకొన్నపుడు (అనఁగా దినప్రళయమందు) ఈ లోకములు నాశమగును. కానీ నివృత్తి కర్మనిరతులైన భగవద్భక్తుల రీతి వేఱు. వీరు జ్ఞానులు. విషయాసక్తిలేనివారు. నిర్మలమైన మనస్సుకలవారు. శ్రీహరియందే సమర్పింపఁబడిన మనస్సులవారు. వారొనర్చు సమస్త కర్మలను భగవంతునకే సమర్పింతురు. ధర్మార్థకామములకై కర్మ ప్రవృత్తి ననుసరించెడు యోచనయే వారికి ఉండదు. నేను నాదియనెడు స్వాతంత్ర్యాభి మానములు వా రనుసరించెడు మార్గమే నివృత్తిమార్గము. ఈ ముక్తి యోగ్యులైన జీవులు సత్త్వస్వరూపులు. వీరిధర్మమే భగవద్భక్తి. ఈ రీతిగా శుద్ధాంతఃకరణము కల్గిన వీరు అర్చిరాది మార్గముద్వారా "మానవ" పురుషుని పొంది అచ్చటినుండి శ్రీహరిని ప్రాపింతురు. ఆ శ్రీహరి సర్వేశ్వరుఁ డు ముక్తాముక్త ప్రపంచ నియామకుఁ డు. సర్వజ్ఞుఁ డు. అంతేకాక ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి సంహారములకు కారణభూతుఁ డు. ప్రతీకము ననుసరించి యుపాసన ఒనర్చు వారికి "ప్రతీకాలంబనులని" పేరు. అది కాని వారు అప్రతీకాలంబనులు. రెండు రీతులుగా గల ఈ భక్తులు శ్రీహరినిర చేరుటకు ముందు చతుర్ముఖ బ్రహ్మను చేరి ద్విపరార్ధకాలము కొనయందు బ్రహ్మప్రళయమగునంతవరకును సత్యలోకమందు శ్రీహరినే ధ్యానించుచు వసింతురు.

బ్రహ్మదేవుని యధికార కాలమునకు పరకాలమనిపేరు. దీనికి రెండర్ధములు. అందుచేత ద్విపరార్ధకాల మనియు నామాంతరము. అపుడు జీవోత్తముఁడైన బ్రహ్మదేవుఁడు సత్త్వరజస్తమోగుణములను స్వీకరించినవాఁ డై సృష్టిమొదలైన కార్యములందు ఆసక్తుఁడై యుండును. ఈ ద్విపరార్ధము యొక్క కొనయందు బ్రహ్మదేవుఁ డు శ్రీహరి ఇచ్ఛానుసారముగా తాను సృష్టించిన జగత్తును సంహరింప ఇచ్ఛించును. అపుడు పంచభూతాభిమానులు ఇంద్రియాభిమానులు మనోభిమానులు శబ్దాద్యర్థాభిమానులు అహంకార తత్త్వాభిమానులు అయిన దేవతలు తమతమ బింబములో ప్రవేశించి "గరుడమార్గము" "శేషమార్గము" అను రెండు త్రోవల మూలమున బ్రహ్మదేవుని యందు ప్రవేశింతురు. తత్త్వములు తమ తమ కారణములయందు లయమునందును) ఈ రీతిగా తనయందు ప్రవేశించిన దేవతలతోపాటు బ్రహ్మ లక్ష్మియందు ప్రవేశించి తన్మూలకముగా శ్రీహరిని పొందును. ఈ రీతిగా శ్రీహరిని చేరిన యోగులందరు వాయువును, మనస్సుకును జయించి వైరాగ్య మందిన వారై బ్రహ్మ పర్యంతమైన ఈ జీవులందరు తాము శ్రీహరియందు ప్రవేశించినను మేము జీవుల మను అభిమానమును వదలి యుండుటలేదు. వారి లింగశరీరములు మాత్రమే పోయి ఉండును. శ్రీహరి

నిత్యముక్తుఁడు. పూర్ణగుణములు కలవాఁడు: పురాతనుఁడు. సర్వోత్తముఁడు. అందుచేతనే జీవులందరికి ఆశ్రయభూతుఁడు. అతఁడు ఇతరులందు ప్రవేశింపవలసిన ఆవశ్యకత లేదు. స్థావర జంగమ జీవులందు ఉత్తముఁడైన బ్రహ్మదేవుఁడు ముక్తియోగ్యులై మనుష్యోత్తములైన వారు మొదలుకొని శేషగరుడ పర్యంతముకల సాధనపూర్ణులైన జ్ఞానులతోపాటు - సనత్కుమారాదులైన యోగీశ్వరుల సంగతితో పాటు శ్రీహరిని ప్రవేశించి సాయుజ్యము మొదలైన మోక్షముల నందుదురు. ఈ రీతిగా శ్రీహరిని చేరవలెనన్నచో వారు పంచభేదముల నెఱిఁగి యుండవలెను. వానిలో మొదటది జీవేశ భేదము (2) జీవ జీవభేదము. తరువాతిది జీవజడభేదము. (4) జడేశభేదము (5) జడ జడభేదము. ఈ అయిదు విధములైన ప్రమాణాత్మక భేదజ్ఞానమును వారెఱిఁగి యుండవలెను. తమతమ యోగ్యతకు తగినట్లుగా పూర్ణజ్ఞానమును పొందినవారు వారు. నిష్కామ కర్మాచరణమును కూడ అందినవారు. శ్రీహరి స్వయముగా కర్త. అందుచేత సగుణుఁడు. స్వాభావికముగా గుణపూర్ణుఁడు, సచ్చిదానంద స్వరూపుఁడు. క్షరాక్షర పురుషులకంటె నుత్తముఁడు. అందుచేత జీవులకు సాయుజ్యాది మోక్షముల నందించుటకు సమర్థుఁడై యుండును.

13. ఈ రీతిగా సాయుజ్యమును పొందిన బ్రహ్మాది జీవసముదాయము సృష్టికాలమందు కూడ శ్రీహరియొక్క దేహమందే ఉండునా? లేక బయటికి వచ్చునా? ఈ ప్రశ్నలకు సమాధానము- సః=సాయుజ్యము మొదలైన మోక్షమును పొందిన బ్రహ్మదులైన జీవులు, (2) బ్రహ్మదేవుఁడు, సంగత్యా=ప్రళయకాలమందు శ్రీహరిలో ప్రవేశించి, పునఃమరల, కాలేన=కాలాంతర్యామియైన, ఈశ్వరమూర్తినా= శ్రీహరినుండి, గుణవ్యతికరే=త్రిగుణవైషమ్య మనెడు, కాలే=సృష్టికాలము, జాతేసతి=ప్రాప్తించినదగు చుండఁగా, అగుణవ్యతికరే=ప్రాప్తగుణ సముదాయ రహితమైనట్టియు, - బయటనున్న శ్వేతద్వీప మనెడు శ్రీహరియొక్క స్థానమందు, యథాపూర్వం=సంసారావస్థయందెట్లు పరస్పరము అత్యంతభిన్నులు, తారతమ్య విశిష్టులునై, ఉందురో అట్లే, ప్రజాయతే=వ్యక్తమైన ఆనందము కలవారై ఉందురు. అనఁగా శ్రీహరి దేహమునుండి బయటికి వచ్చి విహరించుచుందురని భావము. దీనికి -

"బ్రహ్మా దేవైః పరివృతః ప్రళయే పరమేశ్వరమ్,
ప్రవిశ్య సర్గే తు పునః శ్వేతద్వీపే ప్రమోదతే."

14. ముక్తులకు ప్రతి సృష్టియందును శ్రీహరినుండి బయటికి వచ్చుటయు ప్రతిలయ కాలమందును శ్రీహరిలో ప్రవేశమును నిత్యమని చెప్పుచున్నాఁడు- తే=ముక్తులు, అపి=శ్రీహరిచేత సంభావితులైన వారు, గుణవ్యతికరేసతి= సృష్టికాలమువచ్చినపుడు, శ్రీహరినుండి బయటికి వచ్చి శ్వేతద్వీపమందు, యత్=ఏ, పారమేష్యం=సర్వోత్తముఁడైన శ్రీహరియొక్క అనుగ్రహముతో ప్రాప్తమైన, ధర్మవినిర్మితం=జ్ఞానము ధర్మకర్మములు వీనికి ఫలమైన, ఐశ్వర్యం=ఏ అణిమాదిభోగ సమూహము కలదో, తత్=దానిని, నిషేవ్య=అనుభవించి,

పునఃమరల, గుణవ్యతికరే అసతి=ప్రళయమేర్పడి నప్పుడు, ఆయాతి=స్వోత్తమ ప్రవేశ క్రమముగా శ్రీహరియందు ప్రవేశింతురు. ఈ రీతిగా ముక్తులకు సృష్టియందు నిర్మమనను ప్రళయకాలమందు ప్రవేశమును, స్వరూపానందాను భవమును బహువిధమైన అప్రాకృత విషయభోగమును ఏర్పడునని తెలియవలెను. దీనికి ప్రమాణము -

"జ్ఞాన ధర్మ ఫలాం స్తత్ర భోగాన్ భుక్త్వా లయే పునః
నారాయణం సమావిశ్య జ్ఞానవ్యక్తం నిజం సుఖమ్.
భుంజతే త్వేవ మేవైషాం కాలే సంసర్గ నిర్మమా,
నిత్యో నిత్యసుఖం చైవ సృష్టా భోగా స్తథోత్తమాః.
గుణవ్యతికరాభావేఽ ప్యుచ్చ నీచాది పూర్వవత్,
విష్ణోశ్చైవ విముక్తానాం న కదాచన గచ్ఛతి."

"సర్వే ఽస్మై దేవా బలిమావహంతి" అనెడు శ్రుతికూడ ఈ యర్థమునే దెలుపును. బ్రహ్మదేవుఁడు లక్ష్మీపతి కొక్కనికంటె మాత్రమే తక్కువ వాఁడు. తక్కిన వారందరు వారి వారి పూర్వయోగ్యత ననుసరించి ఇతరులకు కూడ తక్కువవారై యుందురు.

"యథాపూర్వం హరే స్సర్వగుణైర్నీచాత్మతా సదా,
బ్రహ్మణశ్చ తథాన్యేషాం అన్యేషాం చ యథాపదమ్"

15. శ్రీహరియొక్క అనుగ్రహముతో పురుషులకు పరమానంద మేర్పడుఁగాక. స్త్రీయైన నాకది ఎట్లెర్పడును? అని ఆశతోఁచి వారి వారి యోగ్యతకు తగినట్లుగా సేవలు ఒనర్చినచో సర్వులకు విముక్తి దొరకునని విషయము నుపసంహరించు టకై శ్రీహరి సేవా ప్రకారము తెల్పుచున్నాఁడు -అథ=భగవంతు నుపాసించివారికి, నిత్యానందరూపమైన మోక్షము దొరకుట చేత దానిని పొందుటకై హే భామిని!=మంగళ కరురాలైన ఓ తల్లి! శ్రుతానుభావం=వేదాధి ప్రతిపాదితమైన మహిమలు గలట్టియు, సర్వభూతానాం=సమస్త ప్రాణుల యొక్క, హృత్పద్మేషు= హృదయ కమలములందు, కృతాలయం=వసించుచున్నట్టి శ్రీహరిని, భావేన=శ్రీహరి నా స్వామి, నేనతని కింకరుఁడను (సేవకురాలు) అనెడు భావనచేత కూడిన భక్తితో, శరణం=రక్షకునిగా, వ్రజ=పొందుము. హృత్పద్మ స్థితుఁడని చెప్పుట చేత "అంగుష్ఠమాత్రః పురుషః మధ్య ఆత్మని తిష్ఠతి" అనెడు శ్రుతియందు చెప్పిన భగవద్రూపమును శరణుపొందుమని వచించినట్లైనది. శ్రుతానుభావం" అనుటచేత బ్రహ్మాదులకు ముక్తి ప్రదుఁడు, వేదప్రతిపాదితుఁడైన నారాయణుని శరణు పొందుమని తెల్పినట్లైనది. తల్లిని మంగళకరురాలని సంబోధించుట శ్రీహరియందు భక్తి కలదగుట వలననే అని తెలియవలెను.

16. ఇట్లు ముక్తిస్వరూపమును దెలిపి దానికి యోగ్యులు కాని వారెవ్వరో తెల్పుచున్నాఁడు- ఇహ=మనుష్యులలో, యేతు=ఎవ్వరు, ఆసక్తమనసఃస్వారా లందే ఆసక్తిగల మనస్సుకలవారో, కర్మసు=యజ్ఞాది కర్మలందే, శ్రద్ధయా=శ్రద్ధతో,

అన్వితాఃకూడినవారో, అందుచేత అప్రతిషిద్ధాని="అగ్నీ షోమీయం పరు మాలభేద" అను మొదలైన సంధ్యావందనాది కర్మలను (స్వర్గాది ప్రాప్తి కొఱకై, కృత్స్నశఃఈ ఏమాత్రమును లోపములేక, కుర్వంతి=ఆచరించుచున్నారో,

17. ఇంకను ఎవ్వరు రజసాఃరజోగుణముతో, కుంఠమనసఃఉపరతమైన మనస్సుకలవారై, అందుచేతనే, కామాత్మానఃవిషయ లోలుపతా స్వభావముతో కూడినవారై, అందుచేతనే, అజితేంద్రియాఃఇంద్రియములను జయింపనేరని వారై, ఆ కారణముచేత, గృహేషుఇండ్లు మొదలైన వానియందు, అభిరతాశయాఃఆసక్తమైన మనస్సు కలవారై, అనుదినంనిరంతరమును, పితౄలాన్పితృదేవత లను, యజంతిపూజింతురో అనఁ గా శ్రీహరికి సమర్పింపక యజ్ఞయాగాదు లొనర్చుచుందురో.

తాత్పర్యము : ఇట్లు సాయుజ్యము మొదలైన మోక్షమును పొందిన బ్రహ్మాది జీవులు, శ్రీహరి గుణవైషమ్య రూపమైన సృష్టికి అభిముఖులై యున్నపుడు - అతని ఉదరమునుండి బయటికి వచ్చి అప్రాకృతములైన శ్వేతద్వీపము మొదలైనట్టి శ్రీహరి స్థానములందు ఆనంద పూర్ణముగా విహరించుచుందురు. అపుడు కూడ ఇంతకు ముందు సంసార మందున్నట్లే పరస్పర భిన్నులుగానే ఆ జీవు లుందురు. తారతమ్య విశిష్టతయఁ గూడనుండదు. శ్రీహరికి సంబంధించిన లోకములందు శ్రీహరిచే అనుగృహీతులైన వీరు - తమసాధనలకు ఫలముగా అణిమాద్యష్ట సిద్ధిరూపములైన భోగసమూహముల ననుభవింతురు. ఆ తరువాత ప్రళయ మేర్పడినపుడు స్వోత్తములందు ప్రవేశించుట మూలముగా శ్రీహరియొక్క యుదరమందు ప్రవేశింతురు. ఈ రీతిగా శ్రీహరి యొక్క ఉదర ప్రవేశము, మరల బయటికి వచ్చుట ప్రతి ప్రళయము, ప్రతి సృష్టికాలమందును ముక్తులకు కూడ నేర్పడుచునే వచ్చును. ఇట్లు శ్రీహరిని ఉపాసించుటచేత నిత్యానందానుభవరూపమైన మోక్షము దొరకును. కనుక మంగళకరురాలా! నీవును శ్రీహరిని నాస్వామి యాతఁ డు, నే నతని దాసిని అనెడు భావయుక్తమైన భక్తితో శరణు పొందుము. వాని మహిమలు సర్వవేదాది శాస్త్రములచేత ప్రతిపాదితములు. అతఁ డు సమస్త ప్రాణుల హృత్కమలములందు నివాసమై యుండును. ఆ బింబరూపమునే భక్తితో నుపాసింతుము. మనుష్యులలో కొందరు స్వర్గాదులందు కల యపేక్షతో యజ్ఞాది కార్యములందు శ్రద్ధాయుక్తులై ఉందురు. విహితములైన యాగాదులను నిత్యకర్మములైన సంధ్యావందనాదులను - స్వర్గప్రాప్తికొఱకై కొంచెముకూడ కొఱంత లేక నిర్వహింతురు. వీరి మనస్సుకు రజోగుణ పూర్ణమై యుండును. విషయలోలుపులై ఉందురు. అజితేంద్రియులు ఐహిక సుఖాసక్తి కలవారు. ఇతరుల నెప్పుడును పూజింతురు.

18. తేఁఆ, హరి మేధసఃమనోహరమైన ప్రజ్ఞకలట్టియు, కథనీయొరు విక్రమస్యఁఎక్కువగా పొగడఁ దగినట్టి పరాక్రమము కల్గినట్టియు, మధుద్విషఃమధువను రాక్షసుని జంపిన శ్రీహరి యొక్క, కథాయాంకథయందు, విముఖాఃఆసక్తిలేని, పురుషాఃజీవులు (దేహులు) త్రైవర్గికాఃధర్మార్థకామములకు మాత్రమే

అర్హులు. మోక్షమునకు కారు. హరికి సంబంధించిన విచారమందు విముఖులై ఉండుటయే దీనికి కారణ మని ఈ విశేషణములతో తెల్పియున్నాఁడు.

19. భగవంతుని యందు భక్తి లేనంత వఱకును చిక్కునట్టి ఫలములను చెప్పుచున్నాఁడు - యేతు=ఎవ్వరు, అచ్యుత కథా సుధాం=అమృతము వలెనున్న శ్రీహరి కథను(ఇదియే నిజమైన అమృతమని భావము) హిత్వా=వదలి, అసద్గాథాఃకావ్యనాటకాదులైన అమంగళకర కథలను, శృణ్వంతి=వినుచున్నారో, తే=వారు, దైవేన=అదృష్టనియామకుఁడైన శ్రీహరిచేత విహతాఃశరీరవియోగము నంది (మరణించి) విడ్చుజఃఅమేధ్యమును తినెడు పంది, కుక్క మొదలైనవి, పురీషమివతమ కాహారమై మలిన పదార్థము తినునట్లు, పురీషం=అమేధ్యమువలె అసహ్యకరమైన నరకమును. యాంతి=పొందెదరు, నూనం=నిశ్చయము. శ్రీహరియందు భక్తిలేనివారు ధర్మకార్యములను శ్రద్ధతో ఒనర్చినను నరకమునే పొందెదరు. శ్రీహరి నితరులతో సమమైన వానినిగాని అతనికంటే మఱియొకని నుత్తమునిగాను వచించువారు, హరిభక్తులను ద్వేషించువారుకూడ భగవంతు నందు భక్తిలేనివారు. దీనికి ప్రమాణము-

యే తు తద్భక్తి వర్జితాఃఅన్యసామాన్య వేత్తారఃతదన్యోత్తమ వేదినఃతద్భక్త నిందకాశ్చైవ యాంత్యేవ నిరయం ధ్రువమ్అపి ధర్మైకనిలయాఃనాత్రకార్యావిచారణాఃఃః

స్వర్గాది లోకసంచార యోగ్యులు మధ్యమ మనుష్యులనియు (నిత్య సంసారులు) "శ్రీహరియందు ద్వేషము బూనియున్న అసుర స్వభావులు తమోయోగ్యులని చెప్పినవైనది. ఈ క్రింది ప్రమాణము నీ విషయము స్పష్ట పఱచును.

అత్యల్పభక్తా విష్ణౌ చ సదా శ్రాద్ధాదికారిణఃు,
పితృలోకం సమావిశ్య స్వసంతావే పునఃు పునఃు.

ముక్తియోగ్యాస్తు దేవాద్యాఃు మానుషా యజ్ఞభాగినఃు,
మనుష్యభేదాఃు శ్రాద్ధాది కృతో విద్వేషిణో హరౌ.

ఈ శోకములందు కొందఱు "విముఖఃు హరిమేధసఃు" అనుట మొదలుకొని 19వ శ్లోకము వరకు పూర్తిగా తమోయోగ్యులైన జీవులను వర్ణించినట్లుగా అర్థము చెప్పుటయు కలదు.

22. శ్రీహరిని గుణపూర్ణుఁడని యుపాసించుటయే మోక్షమునకు సాధనము. నిరుణోపాసనము కాదని విషయము నుపసంహరించు చున్నాఁడు - తస్మాత్= శ్రీహరి యందు భక్తి నొనర్ప కున్నచో మోక్షము దొరకదు. అందుచేత త్వం= ముముక్షువైన నీవు, భజనీయ పదాంబుజం=సేవించుట కర్హమైన పాదకమలములు కలిన, పరమేష్ఠినం=సర్వోత్తముఁ డైన శ్రీహరిని, తద్ధుణాశ్రయయా=శ్రీహరి లక్ష్మీ బ్రహ్మాదులకంటె సర్వవిలక్షణుఁడు, నాకు స్వామియైన వాఁడు వాఁడే అనెడు శ్రీహరి గుణయుక్తమైన భక్త్యా=భక్తియోగము చేత, సర్వభావేన= పరమాత్ముఁడు సర్వులయందును కలఁడు అనెడు భావనతో (2) వారి వారికి యోగ్యమైన గుణపూర్ణభక్తితో, భజస్వ=సేవింపుము.

23. శ్రీహరి భజనతో నేర్పడెడు ఫలమేది? దానికుత్తరము- భగవతి=సమ గైశ్వర్య వంతుఁడైన, వాసుదేవే=శ్రీహరియందు, ప్రయోజితఃు=చెల్లింపఁబడిన భక్తియోగము, వైరాగ్యం=వైరాగ్యము, బ్రహ్మదర్శనం=బ్రహ్మసాక్షాత్కారమునకు కారణమైన, యత్=ఏ, జ్ఞానం=జ్ఞానము కలదో, తత్=అట్టి సమీచీన జ్ఞానము, జనయతి=కల్గింతురు. ఇచ్చట వైరాగ్యము భక్తికంటెను ముందే యున్నను భక్తి వైరాగ్యమును కలించునని చెప్పుటలో దోషమేమియును లేదు. మొదలేయున్న వైరాగ్యమును ఇంకను దృఢపఱచవలెనని భావము.

24. వైరాగ్యాదులైన సాధన సంపత్తికల ఉపాసకునకు అపరోక్షజ్ఞాన మేర్పడెడు సమయమును చెప్పుచున్నాఁడు- యదా=ఎప్పుడు, అస్య=ఈ యుపాసకుని యొక్క, చిత్తం=మనస్సు, సమేషు=బంధకములుగా నుండుటలో సమానమైనట్టి, అరేషు=శబ్దాది విషయములందు, ఇయం=ఇదినాకు ప్రియమైనది, ఉత=లేక, అప్రియం=ప్రియముకానిది, ఇతి=అనెడు, ఇంద్రియ వృత్తిభిఃు=ఇంద్రియ వ్యాపారములచేత, వైషమ్యం=వ్యత్యాసమును, న విగృహ్ణాతి అపి=గ్రహించుట లేదో, ఏమనఁ గా శబ్దాదులన్నియు బంధకములగుటచేత అప్రియములే. అన్నిటికంటెను శ్రీహరి ఒకఁ డే ప్రియతముఁ డని గ్రహించునో.

25. సఃు=ఉపాసకుఁ డు, తదా ఏవ=బాహ్యమనస్సును, తన శక్తిని పోఁగొట్టుకొన్న కాలమందు, ఆత్మనా=స్వరూపభూతమైన, చిన్మనస్సు నుండి,

నిస్సంగం=సంగరహితుఁ డైనట్టియు, సమదర్శనం=యథార్థ జ్ఞానము కలిగినట్టియు, హేయోపాదేయ రహితం=ఎప్పుడును నిర్దోష జ్ఞానరూపుఁ డగుటచేత ఇది వదల దగినది, ఇది ఉపాదేయమైనది అనెడు భాగములు లేనట్టియు, దానిచేతనే, ఆరూఢపదం=సర్వోత్తమ స్థానమం దుండెడు, ఆత్మానం=తన బింబరూపియైన పరమాత్మను, ఈక్షతే=సాక్షాత్కరించి కొనును. ఇచ్చట "నిస్సగం" మొదలైన విశేషణములచేత ఆత్మానం అనఁగా సంసారియైన జీవుఁడు కాదని తెలిపియున్నాఁడు.

"అసంగోహ్యయం పురుషః"
"నిర్దోషం హి సమం బ్రహ్మ"
ఇత్యాది స్మృతి శ్రుతులందు ఈ గుణగణము లుక్తము లైనవి.

26. ఆ యాశబ్దములచేత సిద్ధములైన పేరులు గలవాఁడును, వీఁడును వేఱుఁ కాదని తెల్పుచున్నాఁడు- ఏకః=ఒక్కఁడే అయిన శ్రీహరి, దృశ్యాదిభిః =ఇది దర్శనమునకు విషయము, ఇది స్పర్శనమునకు విషయము అను మొదలైన గతి ఘటాది జడములు, ఇంకను మూర్తవస్తువులయందుండెడు ధర్మములకంటెను, పృథగ్భావైః=వేఱైన శబ్ద ప్రవృత్తి నిమిత్తములైన ధర్మముల నుండి, జ్ఞానం=జ్ఞానము ప్రమాణముగా గలవాఁడగుటచేత, జ్ఞానమాత్రుఁ డనియు, పరం బ్రహ్మ=బ్రహ్మసూత్రతత్త్వములయందు ఉత్తముఁడగుటచేత పరమాత్ముఁడనియు, ఈశ్వరః=నియమన మొనర్చెడు శక్తిగలవాఁ డగుటచేత పురుషుఁడనియు, భగవాన్=సమగ్రైశ్వర్యము మొదలైన గుణసంపన్నుఁడగుటచేత భగవంతుఁ డనియు, ఈడ్యతే=పిలువఁ బడును. ఇచ్చట ముఖ్యతత్త్వమును జ్ఞానమాత్రమని బౌద్ధులు పరబ్రహ్మయని వేదాంతులు, పరమాత్మయని యోగులు, ఈశ్వరుఁ డని వైశేషికులు, పాశుపతులూ, పురుషుఁడని సాంఖ్యులు, భగవంతుఁ డని, పౌరాణికులు పిలుతురు. ఈ యన్ని శబ్దములును శ్రీహరిని ముఖ్యతత్త్వ మని తెలియపఱచునని చెప్పఁ బడినది.

27. చెప్పిన విషయమును ముగింపఁ బోవువాఁడై అంతరంగ భక్తియోగము నకు మక్తియే ఫలమనుచున్నాఁడు- ఇహ=ఈఉపాసకునందు, యోగినః=భక్తి యోగసిద్ధునకు, సమగ్రేణ=అష్టాంగ యుక్తమైన, యోగేన=భక్తియోగముచేత, అభిమతః=సాధ్యమని అంగీకృతమైన, అర్థః=ప్రయోజనము. అనఁగా పురుషార్థము, కృత్స్నశః=సంపూర్ణముగా, అసంగః తు=లింగశరీర సంబంధ రహితమగుననునది, ఇతియత్=అనుటేది కలదో, ఏతావానేన=ఇంతేఅని, యుజ్యతే=యుక్తమైనది. హి=ఇది యనుభవసిద్ధము.

28. ఇపుడు శ్రీహరి ఎత్తిన మత్స్యాద్యవతారములు అప్రాకృత దేహముతో కూడినవని తెలియవలెను. ప్రాకృతదేహయుక్తములని గ్రహించినచో అంధం తమస్సేర్పడునను అభిప్రాయముతో చెప్పుచున్నాఁడు - ఏకం=సర్వోత్తమమును (2) స్వగత భేద రహితమును అయిన, జ్ఞానం=సచ్చిదానందరూపమైన, బ్రహ్మ=అనేకము లనెడు సంఖ్యకు విషయములైన పూర్ణములైన మత్స్యా

ద్యవతారములను ధరించిన పరబ్రహ్మ వస్తువు, నిర్గుణం=ప్రాకృత పదార్థములచేత, గుణములచేత నిర్మితమైన ప్రాకృతదేహముకానిది, శబ్దాది ధర్మిణాం=శబ్దము స్పర్శము మొదలైన విషయములనే ధర్మముగాగల అజ్ఞానులకు, ప్రాచీనైః ఇంద్రియైఃబయట విషయములనే గ్రహించెడు కన్నుమొదలైన ఇంద్రియములచేత, అర్థరూపేణ=భౌతిక శరీరముకలదని, భ్రాంత్యా=మిథ్యా జ్ఞానము చేత, అవభాతి=తోచును. అవతార స్వరూపము కూడ పూర్ణమేయని "పూర్ణమదః పూర్ణమిదం" అనుశ్రుతి తెలుపుచున్నది కనుక దానికి భౌతిక దేహముకలదని (అపూర్ణమని) మిథ్యాజ్ఞానము కలవాడు అంధం తమస్సున కేగునని శ్లోకము యొక్క తాత్పర్యము. దీనికి ప్రమాణము-

మత్స్యకూర్మాది రూపం చ విష్ణోర్జ్ఞానైక మాత్రకమ్,
తన్మన్యతే భౌతికం తు యే గచ్ఛంత్యంధరం తమః.

29. భ్రాంతితో శ్రీహరి యొక్క అవతారదేహములను ప్రాకృతములని అజ్ఞులు తెలియుచున్నారు. "అను నీ విషయము స్త్రీయైననాకు గ్రహించుట కష్టముగా నున్నది. అనగా దాని నుదాహరణముచేత తెలుపుచున్నాడు. యథా=ఎట్లు, మహాన్=మహత్తత్త్వమున కభిమానియైన బ్రహ్మను, త్రివృత్=వైకారిక తైజస, తామసము లనియెడు రీతులైన, అహంకారః=అహంకార తత్త్వమున కభిమానులైన రుద్రుడు మొదలైన వారిని, పంచవిధః=ఆకాశాది పంచ భూతములకును అభిమాని అగుటచేత ఐదు విధములైన వాడును, ఏకాదశ విధఃమనస్సు మొదలైన ఏకాదశేంద్రియములకు అభిమాని అగుటచేత, పదునొకండు విధములైన వాడును అయిన, స్వరాట్=ఇంద్రుని, యతఃఏ కారణముచేత, ఇదం=ఈ, అండం=బ్రహ్మాండము నుండి ఏర్పడిన, జగత్=భౌతికమైన జగత్తు, తస్య=ఆ ఇంద్రాదులకు, వపుఃఅభిమన్యమానమైన దేహము, తత్=ఆ కారణముచేత, అజ్ఞానులు, భౌతిక శరీరము కలవాడని తెలియుచున్నారో, తథా=అట్లే, శ్రీహరినీ కూడ భౌతిక శరీరము కలవాడని తెలియుచున్నాడు. కాని ఇది శ్రీహరి విషయమందు భ్రాంతియే. అతడు దేనికినీ అభిమానికాడు. అందుచేత వానినుండి అభిమన్యమానమైన ప్రాకృత దేహముకూడ అతనికి లేదు. పైనచెప్పిన ఉదాహరణముచేత బ్రహ్మరుద్రాదులకు కూడ ప్రాకృత దేహమున్నదని స్పష్టపఱచినాడు. జ్ఞానాత్మకులైన బ్రహ్మాది చేతనులకు ప్రాకృతదేహమున్నదని గమనించినట్లే అజ్ఞానులు. శ్రీహరి నిక్కడ ప్రాకృత దేహము కలవానినిగా ఎంతురు. అది తప్పు అనెడు నభిప్రాయముతో నుదాహరణము ప్రదర్శించినాడు. ఇంద్రాదులు ప్రాకృతదేహము కలవారనుటకు ప్రమాణము.

ఏకాదశేంద్రియాత్మాచ పంచభూతాత్మక స్తథా,
సర్వాభిమానీ భగవాన్ స్వరాడింద్రః పురందరః.
ఇద మండం జగత్సర్వం శక్రదేహం విదుర్బుధాః,
తత్పతి స్త్రిగుణో రుద్రః తస్య బ్రహ్మా తతో హరిః.

30. అయినచో శ్రీహరియొక్క అవతారములను కూడ యథా వత్తుగా అప్రాకృతమైన దేహములు కలవనియే తెలియుటెట్లు? చెప్పుచున్నాఁడు - ఉపాసకుఁడైన ముముక్షువు, నిత్యశః=ఎప్పుడును, శ్రద్ధయా=శ్రద్ధచేతను, భక్త్యా=భక్తిచేతను, యోగాభ్యాసేన=యమనియమాద్యష్టాంగ యోగముల చేతను, సమాహితాత్మా=శ్రీహరియందే మనస్సు కలవాఁడై, నిస్సంగః=దుష్టజన సహవాసము లేనివాఁడై, నిశ్చితమైన సజ్జన సహవాసము కలవాఁడై, వీరక్తః =శ్రీహరికంటెను భిన్నమైన సర్వజగత్తు అసారము, అనిత్యమని తెలిసికొన్నవాఁడై, వై=అందుచేత, ఏతత్=మత్స్యాద్యవతారుఁడైన శ్రీహరిని, పరిపశ్యతి=ప్రాకృత దోషము మొదలైన దోషములు లేని అనంతగుణ పూర్ణుఁడని అపరోక్షజ్ఞానముతో తెలిసికొనుచున్నాఁడు. వై=అనుటలో ఈ మారమును వదలి ఐక్షజ్ఞానము మొదలైన దుస్సాధనములతో శ్రీహరిని యథార్థముగా అపరోక్షముగా అనుభవించుటకు సాధ్యము కాదని సూచించినాఁడు. ఈ శ్లోకములకు జ్ఞానరూపియైన కేవలుఁడైన నిర్గుణ బ్రహ్మము భ్రాంతితో జగత్పదార్థమై జగత్పదార్థముగను, పంచభూతములుగను, ఏకాదశేంద్రియములుగాను కన్పడుచున్నాఁడని అర్థ మొనర్చి జగద్భ్రాంతియుక్తమని చెప్పెడునది ప్రమాణ విరుద్ధమని, సరికాదని 28వ శ్లోకమందు చెప్పిన "మత్స్యకూర్మాది" అను ప్రమాణము చేత తెలిసికొనవలసినది. ఇందుకే శ్రీమధ్వాచార్యులు భాగవత తాత్పర్య నిర్ణయమందు ఈ ప్రమాణము నుదాహరించినారు.

తాత్పర్యము : శ్రీ హరియందు భక్తి నెఱపనిది మోక్షము సిద్ధింపదు. వీరు స్వర్గాదులందు దృష్టికలవారూ దర్మిష్ఠులవలె కనపడినను అత్యుత్తమ జ్ఞానియు, పఠనీయ పరాక్రముఁడూ దైత్యసూదనుఁడు అయిన శ్రీహరి కథా శ్రవణ మననాదులందు వీరి కాసక్తి ఉండదు. ఇటి జనులు మోక్షమునకనర్హులు. ఈ రీతిగా శ్రీహరియొక్క అమృతమయమైన కథలు వదలి, మోక్షసాధనము కాని కావ్యనాటక కథలందే ఆసక్తులైన వీరు హరియొక్క ఇచ్ఛతో దేహావసాన మందు పంది, కుక్క మొదలైనవి ఆమేధ్యమునే తినునట్లు అసహ్యమైన నరకమునే పొందెదరు. శ్రీహరి భక్తులు కాని వా రాచరించు ధర్మము ధర్మముకాదు. వీరు తమోయోగ్యులు. భగవంతునందు కొద్దిపాటి భక్తి కలిగి ధర్మకార్యము లొనర్చువారు. మరణానంతరము దక్షిణాయన మార్గముతో అర్యముఁడనెడు పితృదేవతల కధిపతియైన యముని లోకమును పొందెదరు. అచ్చట చాల కాలముండక మరల తమసంతానముల గర్భములందు జన్మింతురు. షోడశ సంస్కారము లొనర్చి కొని ధర్మ కార్యము లొనర్చి ఆ పుణ్య ఫలముగా స్వర్గమందు కొంతకాలముండి మరల క్షీణపుణ్యము కలవారై దేవతలచేత స్వర్గమునుండి బయటికి నూకఁబడినవారై మరల మనుష్యలోకము నందే జన్మింతురు. ఇట్లు స్వర్గము భూమి నరకమును వీని యందుచుట్టుచునే ఉందురు. లింగ శరీర నాశానంతరము సుఖదుఃఖ మిశ్రమైనట్టి సాంతానికమునెడు లోకము నందెదరు. తల్లి! ఈ రీతిగా ముక్తియోగ్యులు, తమోయోగ్యులు, నిత్యసంసారులని జీవులు ముత్తెఱఁగులుగా ఉందురు. కనుక తల్లి! ముక్తి యోగ్యురాలైన నీవు సర్వసౌమ్యుఁడు, సర్వోత్తముడైన శ్రీహరినే - లక్ష్మీబ్రహ్మాదుల

కంటె ఉత్తముఁ డైన శ్రీహరినే - నా స్వామియనెడు గుణపూర్ణతాజ్ఞాన యుక్తము, సర్వవ్యాపకుఁ డనెడు భావనతో స్వయోగ్యతకు ఉచితమైన భక్తితో సేవించుము. శ్రీహరియందు నెఱపెడు భక్తితో వైరాగ్యము, బ్రహ్మ సాక్షాత్కారము నకు కారణమైన సమీచీనజ్ఞాన మేర్పడును. ఉపాసకుని మనస్సు బంధకములైన శబ్దాది విషయములందు ప్రీయము అప్రియమనెడు విభాగము చేయక సమస్త విషయములు అప్రియములే అని తెలిసికొని శ్రీహరియే ప్రియతముఁ డని తెలిసికొన్నపుడు ఆబాహ్య మనస్సుకు శక్తికుందినదని అర్థము. అపుడు స్వరూప భూతమైన చిన్మనస్సుతో ఉపాసకుఁడు సంగరహితుఁడు, యథార్థజ్ఞాని, నిరోషి, సదా సర్వోత్తముఁ డైన బింబరూపియైన శ్రీహరిని సాక్షాత్కరించి కొనును. భగవంతుఁడొక్కఁడే దృశ్యము, స్పృశ్యము అని జడపదార్థములను గూర్చి చెప్పెడు ధర్మములకంటె భిన్నములైన శబ్ద ప్రవృత్తి నివృత్తి రూపములచేత అతనినే వేరు వేరు పేరులతో పిలుతుము.

జ్ఞానమే ప్రమాణముగా ఉండుటచేత జ్ఞానమాత్రుఁ డతఁ డు. బ్రహ్మ సూత్ర తత్త్వములతో ఉత్తముఁ డగుటతో పరబ్రహ్మ, జీవులకంటె నుత్తము డగుటచేత పరమాత్ముఁడు. నియమన శక్తియుక్తుఁ డగుటలో నీశ్వరుఁడు. అకుంఠితమైన పుంశక్తి కలవా డగుటతో పురుషుఁడు. సమగ్రైశ్వర్య వంతుఁ డగుటచే భగవంతుఁడు. ఈ రీతిగా నుపాసించెడు ఉపాసకుని భక్తి యోగము సిద్ధి పొందినపుడు వానియొక్క ఆ సమగ్ర భక్తి సంపూర్ణ లింగభంగ మేర్పడుటయే అంగీకృతమైన ప్రయోజనము. సర్వోత్తముఁడు స్వగత భేదరహితుఁ డైన శ్రీహరి మత్స్యాది రూపములతో అనేఖ సంఖ్యలు కలవాఁ డుగా కనిపించును. ఈ యవతారములు కూడ జ్ఞానరూపములే అయి అప్రాకృత దేహ యుక్తమైనను విషయాసక్తులై అజ్ఞులు తమ ఇంద్రియములతో ఈ యవతారములను భౌతిక శరీరయుక్తములని భ్రాంతితో తెలియుదురు. అట్లు తెలియుట అంధంతమస్సునకు కారణము. మహత్తత్త్వాభిమానియైన చతుర్ముఖ బ్రహ్మ, ముగ్ధమలైన అహంకార తత్త్వాభి మానియైన రుద్రుఁ డు, పంచభూతాభిమాని, ఏకాదశేంద్రియాభి మానియైన ఇంద్రుఁ డు వారి వారి జ్ఞానమయమైన చిద్దేహముతో పాటు ఈ బ్రహ్మాండమునుండి ఏర్పడిన భౌతిక దేహము కలవారని తెలియునట్లే అజ్ఞానులు శ్రీహరి యవతారములు కూడ భౌతిక దేహము లని భావింతురు. బ్రహ్మాదుల విషయమున యుక్తమైనను శ్రీహరి విషయములో భ్రాంతియే. దేనికిని అభిమాని కాని పరమేశ్వరునకు ప్రాకృత దేహ మెక్కడనుండి వచ్చును? ఎవరైనను దినమును శ్రద్ధాభక్తులతో యోగాభ్యాస మొనర్చి శ్రీహరియందే మనస్సుంచి దుర్జన సంగమును వదలి సజ్జనుల చెలిమి పాటించి వైరాగ్యయుక్తులై ఉందురో వారికి ఈ యవతారరూపములు ప్రాకృత దేహరూప దోషరహితము లని అనంతగుణ పరిపూర్ణబ్రహ్మరూపము లని అనుభవమునకు వచ్చును. దీనికి విరుద్ధమైన సాధన సంపత్తి కలవారికి ఎప్పటికినీ యథార్థ జ్ఞాన మేర్పడదు.

32. జ్ఞానానుష్ఠాన మవశ్య మని తెల్పుటకై ఏది లేకున్నచో మోక్ష సామ్రాజ్యము లభింపదో అట్టి సాధనమును చెప్పుచున్నాఁ డు - మన్నిష్ఠః

=నాయందే ఆసక్తి కల్గినట్టి, నైర్గుణ్యః=ఏకాంతమైన, భక్తి లక్షణఃభక్తియనెడు, యోగః=సాధనము, జ్ఞానంచ=జ్ఞానయోగమును ఉన్నవో, ద్వయోరపి=ఈ రెంటికినీ, భగవచ్ఛబ్ద లక్షణఃభగవంతుఁ డనెడు పదముచేత వాచ్యుఁడై, అనంతగుణైశ్వర్యముచేత పూర్ణుఁడైన శ్రీహరి, ఏక ఏవ=ఒక్కఁడే, అర్థః =విషయభూతుఁడు. ముక్తిఁ కవశ్యసాధనములైన భక్తిజ్ఞానములను నే నుపదేశించి యున్నానని అర్థము. భక్తియోగమని చెప్పక భక్తిలక్షణ యోగఃఅని చెప్పుటచేత జ్ఞానభక్తులు లేనిది మోక్షప్రాప్తి లేదని, ఈ రెంటిలో ఏవి యున్నను తక్కినవి యుండనే యుండు ననియు, అందుచేతనే ఒక్కదానితో ముక్తి యగునని చెప్పినపుడు మఱి యొక్కటి సాధనమని తెలియవలెనని సూచించినట్లైనది. ఈ విషయమునే ఈ ప్రమాణ వాక్యము స్పష్టపఱచున్నది.

జ్ఞానభక్తీ వినా నైవ ముక్తిఃకస్యాపి విద్యతే,
తయో రేకతరేణాపి విష్ణుగేనోభయం వినా.

ఏవ మప్యేతయో రేక భావేఽన్య నియతేర్ధ్రువమ్,
ఏకేనాపి భవేన్ముక్తిఃతదర్థం త్వన్యసాధనమ్.

33. ఒకటే పదార్థము అనేక గుణములకు విషయ మగునని విశదమగుట ఎక్కడ చూడఁ బడునో చెప్పుచున్నాఁడు - యథా=ఎట్లు, బహుగుణాశ్రయఃశబ్దస్పర్శము మొదలైన అనేక గుణములుగల, ఏకఃఅర్థఃఒకటే పదార్థము,పృథక్కార్యైఃవేఱు వేఱు గుణములను గ్రహించెడు, ఇంద్రియైఃచెవి మొదలైన ఇంద్రియములచేత, నానా=అనేక పదార్థములుగా, ఈయతే=కన్పడుచున్నదో, తద్వత్=అట్లే భగవాన్=ఒక్కఁడే అయినట్టియు, బహుగుణవంతుడైన, పరమాత్మఁడు శాస్త్రవర్త్మభిఃవేదాంతాది సచ్ఛాస్త్రమార్గములచేత, ఈయతే=అనందము కలవాఁడు, జ్ఞానము కలవాఁడు అనెడు మొదలైన అనంతగుణవిషయుఁడుగా తెలియఁబడుచున్నాఁడు. ఒకటే పదార్థము శబ్దాది విషయములతో కూడినపుడు చెవి శబ్దమున్నదిగాను, కన్ను వర్ణము లున్నదిగాను, త్వగింద్రియము స్పర్శమున్నదిగాను, నాల్కరసమున్నది గాను, ముక్కు వాసన యున్నది గాను, చేయి భార మున్నదిగాను, ఆ పదార్థమును వేఱు వేఱుగా గ్రహించును. అట్లే భిన్న భిన్న శాస్త్ర శబ్దములు, శ్రీహరియందుఁ గల అనంత గుణములందు ఒక్కొక్కదానినే తెలియఁ జేయుచు విషయీకరించును.

34, 35, 36. భక్తిజ్ఞానములకు విషయమైనట్టి సాధనక్రియ మొదలగు వానికి శ్రీహరియే విషయమని చెప్పుచున్నాఁడు - క్రియయా=సంధ్యావందనాది క్రియలచేతను, క్రతుభిఃయజ్ఞయాగాదులచేతను, దానైఃనిర్వ్యాజముగా శ్రద్ధతో నొనర్చు దానములచేతను, చాంద్రాయణాద్యుపవాసములు, వేదాది శాస్త్రాధ్యయనము భగవంతునియొక్క చలాచల ప్రతిమాసందర్శనము మొదలైన వానిచేతను మనస్సు కన్ను మొదలైన ఇంద్రియముల జయించుటచేతను,

కర్మణాం=విధివిహిత కర్మములయొక్క, సన్యాసేన చ=హరి సమర్పణ రూప త్యాగముచేతను, వివిధాంగేన=యమ నియమాద్యంగ సహితమైన యోగేన=యోగ భ్యాసముచేతను, భక్తియోగేనచ=భక్తి యోగముచేతను, యః=ఏ ధర్మము, ప్రవృత్తినివృత్తిమాన్=శ్రీహరియొక్క యుపాసనా ప్రవృత్తిచేతను, హింసాదుల నివృత్తితో కూడినదో అట్టి, ఉభయచిహ్నేన=ప్రవర్తక నివర్తక చిహ్నములతో కూడిన, ధర్మేణ=వర్ణాశ్రమధర్మము చేతను ఆత్మతత్త్వావబోధేన=శ్రీహరిని సరిగా తెలియుటచేతను, చ=ఇంకను, దృఢేన=అచలమైన, వైరాగ్యేణ=జగ దసారతా బుద్ధిచేతను, ఏభిః=వీని యన్నిటిచేత, సగుణః=అనంత కళ్యాణగుణ విశిష్టుఁడు, నిర్గుణః=ప్రాకృతగుణ రహితుఁడు, స్వదృక్=స్వతంత్రజ్ఞాన యుక్తుఁ డునైన, భగవానేన=శ్రీహరియే, ఈయతే=తెలియఁ బడుచున్నాఁడు.

37. ఈ రీతిగా చెప్పిన ముఖ్యప్రమేయమును ముగించుచున్నాఁడు - తే=తల్లియు భక్తురాలును అయిన నీకు భక్తియోగము యొక్క, చతుర్విధం =సాత్త్వికరాజస తామసములు నిర్గుణభక్తియను నాల్గువిధములైన, స్వరూపం= లక్షణమును, యః=ఏది, జంతుషు =ప్రాణులందు, అంతఃపురితో తెలియకయే లోపల, ధావతి=పరుగెత్తుచున్నదో అట్టి, అవ్యక్తగతేః =శ్రద్ధగా విచారింపకున్నచో వ్యక్తము కానట్టి గమనముకల, కాలస్య=కాలము యొక్క, నియామకుఁ డైన శ్రీహరియొక్క, చ=స్వరూపము గూర్చి, ప్రావోచం=సందేహమున కవకాశము లేనట్లు వివరముగా చెప్పియున్నాను.

38. యాఃఏ సంసారావస్థయందు వచ్చెడు జన్మలను, స్వయం=కర్మఫల భోక్తయైన తానొక్కఁ డే, ప్రవిశన్=పొందుచు ఆత్మా=జీవుఁడు, ఆత్మనఃతనయొక్క, గతిం=దిక్కైన శ్రీహరిని, న వేద=తెలియఁ జాలఁడో, తాఃఅట్టి, జీవస్య=జీవుని యొక్క, తావిద్యాకర్మనిర్మితాఃఅజ్ఞానము కర్మలు వీనికి ఫలముగా శ్రీహరిచేత నిర్మింపఁ బడియున్న జీవుని యొక్క, బహ్వీఃఅనేక రీతులైన, సంసృతీఃసాంసారిక గతులను, ప్రావోచం=చెప్పియున్నాను.

39. ఉపదేశము ఒనర్చిన తత్త్వజ్ఞానమునకు అధికారు లెవ్వరని తెల్పుచున్నాఁ డు - ఏతత్=ఈ తత్త్వజ్ఞానము, ఖలాయ=ఇంద్రియములను తృప్తిపఱచుటందే ఆసక్తుఁడైన దుర్జనునకు, న ఉపదిశేఉపదేశింపరాదు. అవినీతాయ=విధేయుఁడు కాని వానికి చెప్పరాదు. కర్హిచిత్ఏ కారణము చేత నైనను, స్తబ్ధాయ=గురువుల ఆజ్ఞను మీరిన వారికి చెప్పరాదు. భిన్నాయవైష్ణవ దర్శనమును వదలి వేఱు దర్శనమున ఆసక్తుఁడైన వానికి చెప్పరాదు, ధర్మధ్వజాయదాంభికుఁ డైన వానికి చెప్పరాదు.

40. లోలుపాయ=విషయాభిలాషికి చెప్పరాదు. గృహారూఢచేతసే= గృహము మొదలైన ఐహిక పదార్థములందే మమతా పూర్ణమైన మనస్సు కలవానికి చెప్పరాదు. మేనాయొక్క, అభక్తాయభక్తిలేనివానికి, జాతు=ఎప్పుడును చెప్పరాదు. మద్భక్త ద్విషామపినాభక్తులను ద్వేషించువారికి

చెప్పరాదు. 'జాతు' అనుటచేత పైనచెప్పిన దోషములు లేకున్నను విష్ణుభక్తి హీనుఁడు అనర్హుఁడని అభిప్రాయము. ప్రాసంగికముగా నైనను వాని కుపదేశింప రాదని సూచించినాఁడు. విష్ణుభక్తి అత్యావశ్యక మైనట్లే విష్ణు భక్త ద్వేష రాహిత్యము ఆవశ్యక మని చెప్పఁబడినది.

41,42. అనధికారులని ఎవ్వరికినీ చెప్పకున్నచో తత్త్వవాదమే నష్ట మగును కదా! అనఁగా అధికారులను నిర్ణయించుచున్నాఁడు - శ్రద్దావంతుఁడు, భక్తియుక్తుఁడు, వినయవంతుఁడు, గుణములందు దోషనిరూపణ చేయు బుద్ధిలేనివాఁడు, భూతములందు స్నేహబుద్ధికలవాఁడు, గురుశుశ్రూష యందాసక్తుడు, బుషిఃస్వర్గాదులందు వైరాగ్యయుక్తుఁడు శ్రీహరియందు నిక్షేపింపఁబడిన మనస్సుకలవాఁడు, మాత్సర్యరహితుఁడు శుద్ధుఁడు అయిన, యస్య=ఎవనికి, అహం=పరమాత్మఁడనైన నేను, ప్రేయసాం ప్రియఃప్రీత్యర్హులైన భార్యాపుత్రాదులకంటె ఎక్కువ ప్రియతముఁడనో అట్టివానికి దీయతే. ఈ తత్త్వజ్ఞాన ముపదేశింపవలెను.

"తదేతత్ ప్రేయః"

ఇత్యాది శ్రుతి కూడ శ్రీహరియే ప్రేష్ఠతముఁడని తెల్పుచున్నది.

43. ఫలములను గూర్చి తెలియుటచేత అధికారులకు దీనిని తెలిసికొనుటలో శీఘ్రముగా ప్రవృత్తి ఏర్పడును. అందుచేత దీనిఫలమును చెప్పుచున్నాఁడు - హేఅంబ!=హితాహితములు తెలియఁగల తల్లీ! మచ్చిత్తఃనాయందే బుద్ధిగలవాఁడు, యఃపురుషఃఏ అధికారి చేతనుఁడు, ఇదం=దీనిని, శ్రద్ధయా=శ్రద్ధతో, శృణుయాత్=వినునో, వా=లేక, యఃచ అభిధత్తే=ఎవ్వఁడు పూర్వము చెప్పిన గుణములు కలవాఁడై ఉపదేశించునో, సఃఅట్టివాడు, మే పదవీం=పునరావృత్తి రహితమైన నా స్థానమును, ఏతి హిపొందితీరును. అథవా హిఏ కారణముచేత నా స్థానమును పొందునో ఆ కారణముతో, శృణుయాత్=వినవలెను. అభిదత్తే (దద్యాత్)=ఇతరులకు చెప్పవలెను.

ఇతి శ్రీమద్భాగవతే తృతీయస్కంధే ద్వాత్రింశోధ్యాయః
సుధాలహరీ వ్యాఖ్య సమాప్తమ్.

అధ్యాయము - 32

సీ. గృహమందు వర్తించు గృహమేధులగువారు
మహిత ధర్మార్థ కామములకొఱకు
సంప్రీతు లగుచుఁ దత్సాధనానుష్ఠాన
నిరతులై వేదనిర్ణీత భూరి
భగవత్సుధర్మ తద్భక్తి పరాఙ్ముఖు
లై దేవగణముల ననుదినంబు

భజియింపుచును భక్తిఁ బైత్రుక కర్మముల్
సేయుచు నెప్పుడు శిష్టచరితు

తే. లగుచుఁ దగ దేవ పితృ సుప్రతాఢ్యు లైన
కామ్యచిత్తులు ధూమాది గతులఁ జంద్ర
లోకములఁ జెంది పుణ్యంబు లోప మైన
మరలి వత్తురు భువికి జన్మంబు నొంద.

వ. అదియునుం గాక 1005

తే. ప్రవిమ లానంత భోగితల్పంబు నందు
యోగ నిద్రాళువై హరి యున్న వేళ
నఖిలలోకంబులును విలయంబు నొందు
నట్టి సర్వేశ్వరుని గూర్చి యనఘమతులు. 1006

మ. పరికింపన్ నిజవర్ణధర్మ గరిమన్ బాటిల్లు పంకేరుహో
దర విన్యస్త సమస్త ధర్మముల శాంతస్వాంతులై సంగముం
బరివర్జించి విశుద్ధచిత్త లగుచున్ బంకేజ పత్రేక్షణే
తర ధ్యానైక నివృత్తులై సతతముదైత్యారిఁ జింతింపుచున్. 1007

సీ. మఱియు నహంకార మమకార శూన్య లై
యర్థి వర్తింపుచు నర్చిరాది
మార్గగతుండును మహనీయ చరితుండు
విశ్వతోముఖుఁ డును విమల యశుఁ డు,
జగదుద్భవ స్థాన సంహార కారణుం
డవ్యయుఁ డజుఁ డు పరాపరుండు
పురుషోత్తముఁ డు నవపుండరీకాక్షుండు
నైన సర్వేశ్వరు నందుఁ బొంది

తే. మానితాపున రావృత్తి మార్గమైన
ప్రవిమలానంద తేజో విరాజమాన
దివ్యపదమున సుఖియించు ధీరమతులు,
మరలిరా రెన్నఁటికిని జన్మముల నొంద. 1008

వ. (మఱియుఁ బరమేశ్వర దృష్టిచే హిరణ్యగర్భు నుపాసించువారు సత్యలోకంబున ద్విపరార్ధావసానంబగు ప్రళయంబుఁ దనుకఁబరుండగు చతురాననుం బరమాత్మ రూపంబున ధ్యానంబు సేయుచు నుండి) పృథి వ్యప్తేజో వాయ్వాకాశమాన సేంద్రియ (శబ్దాది) భూతాదులతోడం గూడ (లోకంబునుం) బ్రకృతి యందు లీనంబు సేయ సర్వేశ్వరుండు సకల సంహర్తయగు సమయంబున గతాభి మానంబులు గలిగి, బ్రహ్మలోకవాసులగు నాత్మలు బ్రహ్మతోడం గూడి పరమానంద రూపుండు (సర్వోత్కృష్టుండు) నగు పురాణ పురుషుం బొందుదురు. కావున నీవు సర్వభూత హృదయ పద్మనివాసుండును శ్రుతానుభావుండును,

(నిష్కళంకుండును, నిరంజనుండును, నిర్వ్యంద్వుండును నగు పురుషుని భావంబుచే) శరణంబు నొందు మని చెప్పి మఱియు నిట్లనియె. 1009

మ. సకల స్థావర జంగమ ప్రతతికిన్ జర్చింపఁ దా నాద్యుఁ డై
యకలంక శ్రుతి గర్భుఁడుంబరముఁ డు న్నెనటి యీశుండు సే
వక యోగీంద్ర కుమార సిద్ధ ముని దేవశ్రేణి యోగప్రవ
ర్తకమై తన్ను భజింపఁ జూపు సగుణ బ్రహ్మంబు లీలాగతిన్. 1010

సీ. అట్టి సర్వేశ్వరుం డాయాయి కాలంబు
లందును దద్గుణ వ్యతికరమున
జనియింపుచుండు నీ చాడ్పున ఋషి దేవ
గణములు దమతమ కర్మనిర్మి
తైశ్వర్య పారమేష్ఠ్యములందు పురుషత్వ
మును బొంది యధికారములు వహించి
వర్తించు క్రమ్మఱ వత్తురు మఱికొంద
ఱూరూఢ కర్మాను సారమైన

తే. మనములను జాలఁ గలిగి ధర్మముల యందు
శ్రద్ధతోఁ గూడి యప్రతిషిద్ధమైన
నిత్య నైమిత్తి కాచార నియతు లగుచుఁ
దగి రజోగుణ కలిత చిత్తములు గలిగి. 1011

వ. సకాములై ఇంద్రియ జయంబు లేక పితృగణంబుల నెల్లప్పుడుఁ బూజింపుచు గృహంబుల యందు వర్తించి (హరిపరాఙ్ముఖులగు) వారు త్రైవర్గిక పురుషు లని చెప్పం బడుదురు. 1012

చ. వినత గుణోత్తరుండు నురు విక్రముఁ డైన హరిం భజించి త
న్న నన లస త్కథామృతము మానఁ గఁ గ్రోలుట మాని దుష్కథల్
విని ముదమంది చుందురు వివేక విహీనత నూరఁ బంది యా
త్మను మధురాజ్య భక్ష్యములు మాని పురీషము కేగు చాడ్పునన్. 1013

చ. అలవడ ధూమ మార్గగతులై పితృలోకముఁ బొంది పుణ్యముం
బొలసిన వారు దొంటి తమ పుత్రులకుం దగఁ దాముఁ బుట్టి వి
హ్వలమతి గర్భగోళ పతనాది పరేత ధరా క్రియాంతమై
వెలసిన కర్మ మిం దనుభవింతురు గావున నీవు భామినీ 1014

క. విను సర్వభావములఁ బర
ముని ననఘు ననంతు నీశుఁ బురుషోత్తముని
న్ననయము భజియింపుము ముద
మునఁ బున రావృత్తి లేని ముక్తి లభించున్. 1015

వ. అని చెప్పి వెండియు నిట్లనియె. (భగవంతుం డగు వాసుదేవునియందుం (బ్రయుక్తంబగు భక్తి యోగంబు బ్రహ్మ సాక్షాత్కార సాధనంబు లగు వైరాగ్య జ్ఞానబులం జేయు). అట్టి భగవద్భక్తియుక్తంబైన (చిత్తం

బింద్రియ వృత్తులచే సమంబులగు) నర్థంబులందు వైషమ్యం బును, ప్రియా ప్రియంబులను లేక నిస్సంగంబు సమదర్శనంబు హేయోపాదేయ విరహితంబునై యారూఢం బైన యాత్మపదంబు నాత్మచేఁ జూచుచుండు. జ్ఞానరూపుండును, పర బ్రహ్మంబును, పరమాత్ముండును, నీశ్వరుండును నగు పరమపురుషుం డేక రూపంబు గలిగి యుండియుఁ దృశ్య ద్రష్ట కరణంబుల చేతఁ బృథగ్భావంబును బొందు చుండు. ఇదియ యోగికి (సమగ్రంబగు) యోగంబునం జేసి ప్రాప్యం బగు ఫలంబు. కావున విషయ విముఖంబులగు నింద్రియంబుల చేత జ్ఞానరూపంబు హేయగుణరహితంబునగు బ్రహ్మంబు మనోవిభ్రాంతిం జేసి (శబ్దాది ధర్మంబగు నర్థరూపంబునం దోఁ చు) అది యెట్లు లర్థాకారంబునఁ దోఁచునని యడిగితివేని యహంకారంబు గుణరూపంబునం జేసి త్రివిధంబును, భూతరూపంబునం బంచవిధంబును, నింద్రియ రూపంబున నేకాదశ విధంబునై యుండు. (జీవరూపుండగు విరాట్పురుషుండు) జీవ విగ్రహంబైన యండం బగు జగంబునం దోఁచుచుండు. దీని శ్రద్ధాయుక్తంబైన భక్తిచేత యోగాభ్యాసంబునం జేసి సమాహితమనస్కుండై నిస్సంగంబున విరక్తుండైన వాఁ డు పొడగనుచుండు. అది యంతయు బుధజన పూజనీయ చరిత్రవు గావున నీకుం జెప్పితి. సర్వయోగ సంప్రాప్యుండును, నిరుణుండును భగవంతుం డని చెప్పిన జ్ఞానయోగంబును మదీయ భక్తి యోగంబును నను రెండు నొక్కటియ. ఇంద్రియంబులు భిన్నరూపంబులు గావున నేక రూపంబైన యర్థం బనేక విధంబులగు నట్లొకం బగు బ్రహ్మం బనేకంబుగఁ దోఁ చు, మఱియు. 1016

సీ. అంబ! నారాయణుం డఖిల శాస్త్రములను
సమధికానుషిత సవన తీర
దర్శన జపతపో ఽధ్యయన యోగ క్రియా
దాన కర్మంబులఁ గా నఁ బడఁ డ
యేచిన మనము బాహ్యేంద్రియంబుల గెల్చి
సకల కర్మత్యాగ సరణి నొప్పి
తలకొని యాత్మతత్త్వ జ్ఞానమున మించి
యుడుగక వైరాగ్య యుక్తిఁ దనరి

తే. మహిత ఫల సంగరహిత ధర్మమునఁ దనరు
నట్టి పురుషుండు దలపోయ నఖిల హేయ
గుణములను బాసి కల్యాణ గుణ విశిష్టుఁ
డైన హరి నొందుఁ బరమాత్ము ననఘుఁ డగుచు. 1017

వ. అది గావున నీకుం జతుర్విధ భక్తియోగ ప్రకారంబు దేటపడ నెఱిం గించితి. అదియునుంగాక (కాలరూపయగు) మదీయ గతి జంతువుల యందు నుత్పత్తి వినాశ రూపంబుల నుండు. అవిద్యాకర్మ నిర్మితంబు లైన జీవుని గతు లనేక ప్రకారంబులై యుండు. అదియు జీవాత్మ

వాని యందుం బ్రవర్తించి (యాత్మగతి యిట్టిదని) యెఱుంగక యుండు. అని చెప్పి మఱియు నిట్లనియె. (ఇట్టి యతిరహస్యంబగు) సాంఖ్యయోగప్రకారంబు ఖలునకు, నవినీతునకు, జడునకు, దూరాచారునకు, డాంబికునకు, నింద్రియ లోలునకు, పుత్రదారాగారాద్యత్యంతాసక్త చిత్తునకు, భగవద్భక్తి హీనునకు, విష్ణుదాసుల యందు ద్వేషపడు వానికి నుపదేశింప వలవదు. శ్రద్ధాసంపన్నుండు, భక్తుండు, వినీతుండు, నసూయారహితుండు సర్వభూతమిత్రుండు, శుశ్రూషాభిరతుండు, బాహ్యార్థ జాతవిరక్తుండు, శాంత చిత్తుండు, నిర్మత్సరుండు, శుద్ధాత్ముండు, మద్భక్తుల యందు ప్రేమగలవాఁడు, నన్యకాంతా విముఖుండు, నిష్కాముండు నగు నధికారికి నుపదేశింప నర్హంబగు. ఈ యుపాఖ్యానం బేపురుషుండేని, పతివ్రత యగు నుత్తమాంగనో యేని శ్రద్ధాభక్తులు గలిగి మదర్పిత చిత్తంబున నిన్నుఁ బఠియించునట్టి పుణ్యాత్ములు మదీయ దివ్య స్వరూపంబుఁ బ్రాపింతురు. అని చెప్పెనని మైత్రేయుండు విదురునకు వేండియు నిట్లనియె. ఈ ప్రకారంబునం గర్దమదయిత యైన దేవహూతి కపిలుని వచనంబులు విని నిర్ముక్త మోహపటల యగుచు సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి తత్త్వవిషయాంకిత సాంఖ్యజ్ఞాన ప్రవర్తకం బగు స్తోత్రంబు సేయ నుపక్రమించి కపిలున కిట్లనియె. 1018

ఇది పోతనామాత్య విరచితమైన ఆంధ్రభాగవతమున తృతీయ స్కంధమున ముప్పది రెండవ యధ్యాయము.

1005. గృహమేధులగువారు=గృహస్థాశ్రమము నంగీకరించినటి వారు, మహిత=ప్రసిద్ధమైన, ధర్మార్థకామముల కొఱకున్=త్రివర్గముల కొఱకు, సంప్రీతులగుచున్=వీని యందభినివేశము కలవారై, తత్సాధన+అనుష్ఠాననిరతులై=వానికి సంబంధించిన క్రియలు, వాని యంగములు వీని నెరవేర్చుటయం దాసక్తి కలవారై, వేద=వేదములచేత, నిరీత=నిరయింపఁబడిన, భూరి=గొప్పవైన, భగవత్ప్రధర్మ=భగవంతునకు పనికి వచ్చే ధర్మ్ములు, తద్భక్తి పరాఙ్ముఖులై=ఆభక్తి వినియం దాసక్తి లేనివారై, అనుదినంబును=ప్రతిదినమును, దేవ గణములన్=దేవతా సమూహములను, భజియింపుచును=సేవించుచు, పైతృక కర్మముల్=పితరులకు సంబంధించిన కార్యములను, శిష్టచరితులు=సజ్జన సమ్మతమైన చరితకలవారు, దేవపితృ సువ్రతాఢ్యులు=దేవతలను, పితరులను సంతృప్తి పఱచెడి వ్రతము లొనర్చెడి వారు, కామ్యచిత్తులు=కోరికలకు లోఁబడిన వారు, ధూమాదిగతులన్=ధూమమార్గముతో, పుణ్యంబు లోపమైనన్=పుణ్యములు క్షీణింపఁగా, జన్మంబున్ ఒందనీ=జన్మమును పొందుట కొఱకు భువికిన్ మరలి వత్తురు=మరల భూలోకమున కేతెంతురు.

తాత్పర్యము : కొందరు గృహస్థాశ్రమమునం దాసక్తికలవారై ఉందురు. వారి మనస్సును లోగొన్నవి త్రివర్గములు. వానిని సాధించుకొన్నచో వారికి సంతృప్తి ఏర్పడును. నిరంతరమునీ ఆ కోరికలను తీర్చెడి దేవతల యందే వా రాసక్తులై ఉందురు. వారికి ప్రీతి కల్గించెడు క్రియల యందును, తదంగముల యనుష్ఠాన మందును వారికి తీవ్రమైన యభినివేశము. భగవంతునకు సంబంధించిన ధర్మములు కూడ వేదచోదితములే. పూర్వభాగమందు త్రివర్గములను సాధించు కొనెడు కర్మమార్గములు వేదములచే ప్రతిపాదితములు.

ఉత్తరార్ధమున భగవద్ధర్మములు చెప్పఁ బడినవి. భగవద్భాగవత ధర్మములకును - ఇతర ధర్మములకును ఒక్కొక్కసారి పొత్తు కుదురదు. అపుడు భక్తులైన వారు. ముఖ్యముగా భగవద్ధర్మమునే యనుసరింతురు. వారా ధర్మముల నాశయించుటకు ముఖ్యముగా భక్తి ప్రచోదకమై ఉండును. గృహస్థులైన వారికి భక్తి యందు ప్రీతి తక్కువ. కనుక వారాధర్మముల ననుసరింపరు. తమ కోర్కెలు తీర్చెడు దేవతల పైననే వారి మనస్సులు. వారిని క్రమముగా - అనుదినమును వా రుపాసించుదురు. పితరులను సంతోషపెట్టుటకు కావలసిన జాగ్రత్తలన్నియు తీసికొందురు. పితృదేవతలను సంతృప్తిపఱచుటయే వారి ప్రధాన గమ్యమై ఉండును. ఏ క్రియ నొనర్చినను వారు ఫలాభికాంక్షతోనే చేయుదురు. ఇటి వారు మరణానంతరము చంద్రలోకమును, చెంది, అచ్చట నుండి స్వర్గాది లోకముల కేగెదరు. తామొనర్చిన పుణ్యములకు ఫల మచ్చట ననుభవించి మరల భూలోకమున కేతెంతురు. ఈ రీతిగా జన్మమరణములతో వారు తిరుగుచుందురు.

1006. ప్రవిమల=పరిశుద్ధమైన, అనంత=అనంతుఁడను పేరుగల ఆదిశేషుఁడనెడు, భోగి=సర్పము యొక్క తల్పంబు నందున్=పడుకపైనన్, హరి=శ్రీమహావిష్ణువు, యోగనిద్రాళువైయున్న వేళన్=యోగనిద్ర ననుభవించు వాఁడై యున్నపుడు, అఖిలలోకంబులును=సమస్త ప్రపంచములును, విలయంబు నొందున్=విలీనమైపోవును. అనఘమతులు=పాపములేని మనస్సులుకలవారు,

1007 పరికింపన్=చర్చింపఁ గా, నిజభక్తియుక్తిన్=తా మను సరించు భక్తి యందే ఏకాగ్రతకలవారై, పాటిల్లు=ఏర్పడిన, పంకేరుహోదర=శ్రీమహావిష్ణువు నందు, విన్యస్త=ఉంచఁ బడిన, సమస్తధర్మములన్=సకలమైన ధర్మములతో, శాంతస్వాంతులై=శాంతమైన మనస్సు కలవారై, సంగమున్ పరివర్తించి=దేనితోను సంబంధ ముంచికొనక, విశుద్ధ చిత్తు లగుచున్=పరిశుద్ధమైన మనస్సు కలవారై, పంకేజపత్ర=తామరేకులవంటి, ఈక్షణ=కన్నులు కల, ఇతర=శ్రీ మహావిష్ణువునకు సంబంధింపని, ధర్మ+ఏకనివృత్తులై=ధర్మములనుండి వేరైన మనస్సులు కలవారై, సతతమున్=నిరంతరమును, దైత్యారిన్ చింతింపుచున్=భగవంతుని చింతనచేయుచు.

1008. అహంకార మమకార శూన్యులై=అహంకారము, మమకారము వర్జించిన వారై, అర్చిరాది మార్గతుండున్=అర్చిరాది మార్గములచేత పొంద తగిన వాఁడు, మహానీయచరితుండు=గొప్పదైన చరిత్ర కలవాఁడు విశ్వతో ముఖుఁడు=అనంతములైన ముఖములు కలవాఁడు, విమల యశుఁడు=పరిశుద్ధమైన కీర్తి తోడివాఁడు, జగత్+ఉద్భవ స్థానసంహార కారణుండు=సమస్త ప్రపంచముల పుట్టుక, స్థితి, వినాశము - వీనికి కారణమైన వాఁడు, అవ్యయుఁడు=నాశము లేనివాఁడు, అజుఁడు=పుట్టుక లేనివాఁడు, పరాపరుండు=ఉత్తములైన దేవతల కన్న ఉత్తముఁడు, నవీ పుండరీకాక్షుండు=అప్పుడే వికసించిన తామరలతో సమానమైన కన్నులు కలవాఁడు, ఐన సర్వేశ్వరు నందున్ పొంది=అయినటి శ్రీ మహావిష్ణువును ప్రాపించిన వారై, మానిత=శ్లాఘ్యమైన, అపునరావృత్తి మార్గమైన=మరల జన్మమునకు వచ్చెడు మార్గము కానిది, అయిన, ప్రవిమల=పరిశుద్ధమైన, ఆనందతేజుఁ=ఆనందము చేత ఏర్పడిన తేజస్సుతో, విరాజమాన=ప్రకాశించెడు, దివ్యపదమునన్=శాశ్వతమైన వైకుంఠము

నందు, సుఖియించు ధీరమతులు=సంతోషపడెడు ఉన్నతమైన చిత్తము కలవాఁడు, ఎన్నఁ టికినిన్+జన్మములన్+ఒందన్ మరలిరారు=ఎప్పటికిఁగూడ జన్మల నొందుటకు భూలోకమునకు దిగిరారు.

తాత్పర్యము: శ్రీ మహావిష్ణువు శేషశయ్య పైని యోగనిద్ర నందుచుండును. దాని 'కనంతశయ్య' అని పేరు. ఆది శేషుఁడు సర్పాకారము శయ్యగా మారి పరమాత్మను సేవించుచుండును. మృదువైన ఆ శయ్య పైన శ్రీహరి నిద్ర వహించి యుండును. అది యోగనిద్ర. ఆ సమయము నందు సమస్తలోకములును జీవిక వహించును. ఆ పరమాత్ముని యందు బీజరూపములై లయించి ఉండును. విశుద్ధమైన చిత్తములు కలవారు మాత్రమే ఆ సర్వేశ్వరుని సేవించుట కధికారులు. వారు వర్ణాశ్రమధర్మముల ననుసరింపరు. కాని వారి యా ధర్మాచరణమునకు పరమ ప్రేరకమైనది భక్తియే. సమస్త ధర్మఫలములను వారు శ్రీమహావిష్ణువు నందే సమర్పింతురు. వారి పరమశాంతులు. ఆ శ్రీమన్నారాయణుని తప్ప వారి మనస్సు ఏ యితరమందును లయింపదు. వారి హృదయములు పరమ నిర్మలములు. భగవద్భాగవతులకు సంబంధించిన ధర్మముల యందే వారి మనస్సులు లగ్నమగును. ఇతర ధర్మములు ఎంత గొప్పవైనను - ఎంతసుఖకరము లైనను వానిని వారు విసర్జింతురు. నిరంతర మా పరమేశ్వరుని చింతించుటయే వారి పని. వారి కహంకార ముండదు. అహంకార మనఁగా నే ననెడు భావము. అది లేనప్పుడు నాది యను భావము కూడ ఉండదు. సంగమునకు మమకారము ముఖ్యకారణము. నేనను భావము విసర్జించిన భక్తుల హృదయములో నాదను భావముండుట కవకాశము లేదు - వారు భక్తిప్రభావముతో చంద్రలోకము నుండి యర్చిరాది మార్గగతులై సూర్యమండలము భేదించికొని పోదురు. శ్రీ మహావిష్ణువు సర్వోన్నతమైన చరిత్ర కలవాఁడు. అతఁడు విశ్వతోముఖుఁడు. సమస్తమును గమనించెడి వాఁడు. సమస్త మందంతరతుఁడై వాఁడుండు వాఁడు.పరమేశ్వరుని కీర్తి పరమ పరిశుద్ధమైనది జగత్తుల పుట్టుక, స్థానము, వినాశము వాని నుండే ఏర్పడినది. ఆతనికి వినాశము కుందేటి కొమ్ము. పుట్టుకయు నంతే. సమస్త దేవత లాతని యంగములు మాత్రమే. వారి యందంతరతుఁడై ఉండి ఆయా పనులయందు నడిపించు ప్రధాన శక్తి యతఁడే. వాడే పురుషోత్తముఁడు. ఆ ప్రణయైక సింధునకు తామరలతో సమానమైన నిత్యసుందరమైన కన్నులు కలవు. అట్టి శ్రీహరినే వారు సేవింతురు అర్చిరాది మార్గము అపునరావృత్తి మార్గము, అచ్చట ఆనందము తప్ప వేఱు పదార్థము లేదు. ఆ ఆనందముతో నేర్పడెడి తేజము వైకుంఠము నందే వ్యాపించి యుండును. ఆ లోకమునకు చెందిన వారిని కూడ ఆ య్యానంద తేజ మాక్రమించును. అనిర్వచనీయమైన ఆనందము వా రనుభవించుదురు. అట్టి మార్గమును పొందిన స్థిరమతులు మరల ప్రపంచమునకు రారు.

1009. పరమేశ్వర దృష్టిచేన్=పరమేశ్వరుని యొక్క సంకల్పము చేతనే, హిరణ్యగర్భునుపాసించువారు=హిరణ్యగర్భుని ఉపాసన మొనర్చువారు, ద్విపరార్ధావసానంబు=రెండర్ధభాగములు గడచినప్పు డేర్పడెడు, ప్రళయంబు దనుకన్=ప్రళయము వఱకును, చతురాననున్=బ్రహ్మదేవుని, పరమాత్మ రూపంబు నన్=పరమాత్ము డనెడు రూపము చేత, ధ్యానంబు సేయుచు నుండి=ధ్యాన

మొనర్చుచున్నవారై, పృథివ్యప్ తేజో వాయ్వాకాశమాన సేంద్రియ భూతాదులతో డన్‌కూడ=భూమి, తేజస్సు, వాయువు, ఆకాశము, మనస్సు, ఇంద్రియములు శబాది భూతములు వీనితో పాటు,ప్రకృతి యందు లీనంబుసేయన్=మూల ప్రకృతి యందు లీన మొనర్పఁ గా, సర్వేశ్వరుండు=శ్రీహరి, సంహర్త=నశింపఁ జేయువాఁడు, గతాభిమానంబులు కలిగి=అభి మానములు వదలిపోయి, బ్రహ్మ లోకవాసులగు ఆత్మలు=బ్రహ్మలోకమున నివసించు వారు, పరమానంద రూపుండు=ఆనందమే స్వరూపముగా గలవాఁడు, సర్వోత్కృష్టుండు=అందఱి కంటె గొప్పవాఁడు, పురాణ పురుషుఁడు=సనాతనుఁడు, సర్వభూతహృదయ పద్మనివాసుఁడు=సమస్తములై జీవుల యొక్క హృదయము లనెడు పద్మము లందు నివసించువాడు, శ్రుత+అనుభావుండు=సంకీర్తన చేయబడిన మాహాత్మ్యము కలవాఁడు, నిష్కళంకుండు=కళంకము లేని వాఁడు, నిరంజనుండు=ఏ లోపము లేనివాఁడు, నిర్వ్యుండు=వానికన్నను భిన్నమైన పదార్థము లేని వాఁడు, భావంబుచేన్=భక్తి భావముతో, శరణంబు నొందుము=శరణమును చెందుము.

తాత్పర్యము : కొందరు హిరణ్యగర్భు నుపాసింతురు అతఁడు సత్యలోక మందుండును. ద్విపరార్ధావసానమాతని జీవితము. అపుడు మహాప్రళయ మేర్పడును. మహా ప్రళయమందు బ్రహ్మదేవుఁడు సర్వేశ్వరునితో లీన మగును. అతనితో పాటు వారు కూడ పరమేశ్వరునిలో లీనమయ్యెదరు. అంతవరకు వారు బ్రహ్మదేవుని పరమాత్మగా గొలుచుచుందురు. వారట్లు గొలుచుటయే పరమేశ్వరుని దృష్టి చేతనే. మహాప్రళయమందు పృథివ్యాదులు మూల ప్రకృతియం దంతర్భూతమై యుండును. మానసము శబాది భూతములు కూడ అందులోనే లీన మగును. ఆ మహా ప్రకృతియు సకల సంహర్తయైన పరమాత్మునిలో లీనమై పోవును. ఆ సమయమున పరమాత్మునిలో లీనమైన జీవులకు అభిమానముండును. ఈ రీతిగా బ్రహ్మలోకనివాసులైన ఆత్మలు బ్రహ్మతో గూడియే పురాణ పురుషునందు లీనమగును. అతడు పరమానంద స్వరూపుఁడు. సర్వోత్కృష్టఁడు. అమ్మా! నీవు సర్వభూత హృదయ పద్మ నివాసుఁడైన పరమాత్ముని శరణుఁ బొందుము. వాఁడు సర్వలోకములతో నుపాసితమైన మహిమ గలవాఁడు- కళంక లేశము లేనివాఁడు దేని తోడను సంబంధము లేని వాఁడు. వాని కన్న భిన్నమైన పదార్థము ప్రపంచమునలేదు. అట్టి పరమ పురుషుని సర్వభావముతో శరణు పొందిన వారు ధన్యులు.

1010. సకల స్థావరజంగమ ప్రతతికిన్=స్థావరములు జంగమములు అయిన సమస్త పదార్థ జాతములకు, చర్చింపన్=ఊహింపగా తాను అద్యుఁడై= మొదటి వాఁడై, అకళంక(శ్రుతి గర్భుఁడు=కళంకము లేనట్టియ (వికల్ప జ్ఞానముల కవకాశము లేనట్టియు) శ్రుతి గర్భుఁడు=శ్రుతులచేత ప్రతిపాదింపఁ బడిన వాఁడు, పరముఁడునై ఐనట్టి ఈశుండు=సర్వోన్నతుఁడైన భగవంతుఁడు, సేవక=సేవకుఁడైన, యోగీంద్ర=యోగీంద్రుఁడైన, కుమార=సనందనాదులైన కుమారులను, సిద్ధ=ఇతర సిద్ధులను, దేవ శ్రేణి=దేవతాసమూహమును, యోగప్రవర్తకమై=యోగమార్గమును ప్రపంచమునకు చూపునదై, తన్ను భజింపన్= తన్ను సేవింపఁగా, సగుణ బ్రహ్మంబు=తన యొక్క సగుణ స్వరూపము, లీలాగతిన్= విలాసముగా, చూపున్=చూపించును.

తాత్పర్యము: స్థావరములు కొన్ని; జంగమములైన జీవులుకొన్ని, స్థావరములైనవి కూడ జీవులే. ఈ జీవులందరును పరమేశ్వరుని చేతనే సృజింపఁ బడుదురు. అందరకు నాద్య స్వరూపుఁడు వాఁడే. వేదములు వికల్ప జ్ఞానమున కవకాశము లేనివి. అట్టివేదముల చేత ప్రతిపాదింపఁ బడెడు. స్వరూపము కలవాఁడు పరమాత్ముఁడే. ఆతఁడు సర్వోత్తముఁడు. సమస్త జీవులను నియమించువాఁడు ఆతఁడే. ఆతని సేవకులే యోగీంద్రులైన సనత్కుమారాదులు -ఇతర సిద్ధులు, తక్కినమూఁడు భిన్నులైన దేవతలు. వీరందరును యోగ మార్గ ప్రవర్తకులై యా మహాపురుషుని సేవింపు చుందురు. అట్టి యా పరమ యోగులను కరుణించి భగవంతుఁడు తన సగుణ స్వరూపము వారికి తోపించును. అట్లు చూపించుటలో నాతనికి వేరు ప్రయత్న మవసరము లేదు. కేవల లీలాగతితోనే నాతఁడా స్వరూప దర్శనమును వారికి దయసేయును.

1011. ఆయాయికాలంబులందును=ఆయాసమయము లందు, తదుణ వ్యతికరమునన్=ఆయాగుణముల సంబంధము చేత, జనియింపుచుండున్=అవతారము లెత్తుచుండును. ఈ చాడ్పునన్=ఈ రీతిగా, ఋషి దేవగణములు=ఋషులు, దేవతలు వీరి యొక్క గుంపు, తమతమ=తాము తామొనర్చుకొన్న, కర్మనిర్మిత=కర్మలచే నేర్పడిన, ఐశ్వర్య పారమేష్ట్యము లందున్=ఐశ్వర్యములు, పరమేష్ఠిత్వములు మొదలైన వానిని, పురుషత్వమును పొంది=తమతమ స్వరూపిమి లేర్పఱచి కొన్నవారై, అధికారములు వహించి=ప్రత్యేకములైన అధికారములు కలవారై, క్రమ్మఱన్ వత్తురు=మరల నీలోకముల కేతెంతురు. ఆ రూఢకర్మాను సారము=తా మొనర్చిన పక్వకాలమున కర్మము ననుసరించి, ధర్మముల యందున్=ధర్మములందు, అప్రతిషిద్ధము=నిషేధింపఁ బడినది, నిత్యనైమిత్తికాచార నియతులు=నిత్యములు నైమిత్తికములైన పనులచే నియమింపఁ బడినవారు. రజోగుణ కలిత చిత్తములు=రజోగుణముచే కూడుకొన్న మనసులు.

తాత్పర్యము: ఈ రీతిగా సర్వ సేవ్యఁడైన భగవంతుఁడు ఆయా కాలములందు త్రిగుణముల వ్యతికరముల చేత ప్రపంచమందు విభవాద్భవ తారములను ధరించి వచ్చును. ఇట్లే ఋషులు, దేవసమూహములు కూడ తమ తమ కర్మల యొక్క ఫలముగా తదుచితములైన స్థానములను పొందెదరు. ఆయాస్థానములకు తగిన వైభవము లనుభవింతురో. తదుచి తములైన రూపరేఖాదులను ధరింతురు ఆయాకర్మఫలము లనుభవింప బడఁగనే మరల భూలోకమున కేతెంతురు. ఇతరులు కొంద రున్నారు. వారి మనస్సు లెప్పుడును. కర్మ మార్గమందే ప్రవర్తించుచుండును. ధర్మములను నిర్వహించుటలో వారి మనసు జాగరూకమై ఉండును.అప్రతిషిద్ధమైన నిత్యనైమిత్తికాచారములను పట్టుదలతో నెరవేర్చు చుందురు. వారికో ఫలములం దాసక్తిలేదు. దీనికి ప్రచోదకమైన రజోగుణము వారి స్వభావము.

1012. సకాములై=కోరిక చేత కూడుకొన్నవారై, ఇంద్రియ జయంబు లేక=ఇంద్రియములను వాని వాని విషయముల పైకిపోకుండ నరికట్టెడు నధికారము లేక, గృహంబుల యందు వర్తించి=గృహస్థాశ్రమము స్వీకరించి దానియం దభినివేశము కలవారై, హరిపరాఙ్ముఖులగువారు=సమస్తములైన

కోరికలను వదలి పెట్టి హరి యందే ఆసక్తమైన చిత్తము లేనివారు, తెవరికపురుషులు=ధర్మార్థకామములం దాసక్తి కల్గి వానిని సాధించుకొనుట యందే తీవ్రమైన అభినివేశము కలవారు.

తాత్పర్యము : కోరికలందు ఆసక్తమైన మనస్సు కలవారు కొందరుందురు. విషయముల నుండి ఇంద్రియములు మరల్చు కొనని, హరియందే ఆసక్తమైన చిత్తము పెంపొందించుకొను ఇచ్ఛ వారి కుండదు. వారు నిరంతరమును పితృదైవతములను పూజించుట యందే ఆసక్తులై ఉందురు. గృహస్థాశ్రమమే వారి పరమధ్యేయము. హరి దప్ప ఇతరములు దేనిని కూడ భావింపనట్టి చిత్తవృత్తి వారి కుండదు. వారు ధర్మార్థకామములందే ఆసక్తమైన మనస్సు కలవారు. తెవరిక పురుషులను నది వారికి సార్థకమైన నామధేయము.

1013. వినుత గుణ + ఉత్తరుండు=పొగడఁ బడినట్టి అనేక సద్గుణముల చేత శ్రేష్ఠుఁడైన వాఁడును, ఉరువిక్రముఁడు=ఎవ్వరి చేతను దాటశక్యము కాని పరాక్రమము కలవాఁడు అయిన శ్రీహరిని నిరంతరము భజించుచు, తన్మనస్=ఆ హరిని గూర్చియే నిరంతరము భావించు కొనుచు, లసత్కథామృతమున్=జగత్ప్రసిద్ధములైన వారి కథ లనెడు అమృతమును, మానుగన్=చక్కగా, క్రొలుటమాని=హొనము చేయుట వదలి, వివేక విహీనతన్=వివేకజ్ఞానమును వదలిపెట్టి, దుష్కథల్‌విని=ఐహికములకు సంబంధించిన కథలు వినుచు, ముదము అందుచుందురు=సంతోషమును పొందుచుందురు. ఆత్మను=మనస్సు నందు, ఊరబంది=గ్రామసూకరము, మధుర ఆజ్యభక్ష్యములు మాని=మధురమైన నేతితో చేసిన పిండివంటలు వదలి, పురీషముకేగు చాడ్పునన్=మలిన పదార్థమునకు పోవునట్లుగా, పురీషమునకున్ అని ఉండవలెను. ఇట్టిచోట్లనకారలోప ప్రయోగములు మహాకవులలో అనేకములున్నవి.

తాత్పర్యము: శ్రీహరి సమస్త కళ్యాణ గుణస్వరూపుఁడు. అతని గుణములను పరమయోగులైన సనకాదులు తక్కిన మునులు భక్తులును నిరంతరము గాన మొనర్చు చుందురు. అతని పరాక్రమమునెవ్వరును దాటలేరు. పరమ భక్తులైన వారు ఆతని లీలా విశేషములనే నిరంతరము మనన మొనర్చుకొందురు. అతనికి సంబంధించిన కథలే నిరంతరము విందురు. ఆ కథలు వారి కమృతము వంటివి. వాని సేవనముతో ఆకలి దప్పులు కూడ వారికిఁ దోచవు. మఱికొంద రున్నారు. వారి వివేకము సరిగా పని చేయదు. ఐహికములైన సుఖములను గూర్చిన కథలే వారు వినుచు మనస్సులందు సంతోషపడుచుందురు. వారు ఊరపందుల వంటివారు. అవి మధురములగు నేతితో చేసిన భక్ష్యము లున్నను వాని నుదాసీనించి మలిన పదార్థములున్న యెడకే పోవును గదా!

1014. అలవడన్=వారి స్వభావమునకు తగినట్లుగా, ధూమ మార్గతులై=ధూమమార్గమందు ప్రవేశించిన వారై, పితృలోకమున్ పొంది=పితృలోకమును చేరుదురు, వారు పుణ్యమున్ పొలసినవారు=ఇహలోకమందు కొంత పుణ్యము చేసికొన్నవారు. ఆ పుణ్యశేషము గడచిన తరువాత మరల ఇహలోకము కేతెంతురు. తమ కింతకు ముందు పుత్రులుగా జన్మించిన వారి గర్భమందే మరల తాము పుట్టెదరు. విహ్వలమతిన్=ఏమి చేయుటకు నుతోచని బుద్ధి

గలవారై, గర్భగోళ=తల్లి యొక్క గర్భమందు, పతన+ఆది=పడుటయను కర్మము మొదలుగా, పరేతధరా=శ్మశానభూమి యొక్క, క్రియాంతమై=క్రియ అంతముగా కలదై, వెలసిన కర్మము=ఏర్పడుచున్న కర్మఫలమును, ఇందున్=ఇహలోకమందు, అనుభవింతురు. కావునన్=అనుభవించు వాఁరగుటచేత, భూమినీ!=ఓతల్లి!

తాత్పర్యము : ధూమ మార్గమున ప్రయాణించు వారు పితృలోకమును చేరెదరు. ఇహలోకమందు వారు కొంత పుణ్యము సంపాదించుకొన్నారు. ఆ పుణ్యక్షయ మేర్పడు వఱకు వారు అందుందురు. మరల వారు భూమి కేతెంతురు. ఏతెంచినప్పుడు వారి జన్మ లెక్కడ? మరల తాము పుట్టిన వంశములందే పుట్టెదరు. తమకు కొడుకులైన వారి గర్భము లందే కుమారులై జన్మింతురు. వారి ప్రారబ్ధము వారి మనస్సులను పెనవేసికొని ఉండును. ఇది యేవారి జీవితములను నడిపించును. తల్లి గర్భమున పడుట మొదలుకొని శ్మశానము చేరు వరకును వారి నా ప్రారబ్ధము తన ఇష్టము వచ్చినట్లు ఈడ్చికొని పోవును. వారు దాని యాజ్ఞలంఘింపలేరు. పుణ్యపాపములను అట్టే. సుఖదుఃఖములను మరల అనుభవింతురు. మరల యథా ప్రకారము పితృలోకగతి. మరల జన్మ. వారిస్థితి ఇట్లే చక్రాకారముగ తిరుగుచుండును.

1015. సర్వభావములన్=సమస్తములైన భావములచేత, పరమునిన్=సర్వోత్తముఁడైనట్టియు, అనఘున్=పాపరహితుఁడైనట్టి, అనంతున్=అంతము లేని వాఁడైనట్టియు, ఈశున్=సర్వమును నియమించునట్టియు, పురుషోత్తమునిన్=సమస్త పురుషులం దుత్తముఁడైన ఆ భగవంతుని, ముదమునన్=పరమానురాగముతో, అనయము=సర్వకాల సర్వావస్థల యందును, భజియింపుము=సేవింపుము పునరావృత్తి లేని ముక్తి=మరల సంసారమునకు వచ్చుట యనెడు దుఃఖము లేని ముక్తి, లభించున్=ఏర్పడును.

తాత్పర్యము : తల్లీ! సమస్త భావములతో భగవంతుని సేవింపుము. వాచికముగా నాతని సత్కీర్తిని పొగడుము. కాయికముగా నాతని సేవ యొనర్పుము పూజాదులలో పాల్గొనుము మానసికముగా నాతని ధ్యానింపుము. ఈ మూటిలో నేది కొరవడినను ఆ యుపాసన సర్వాంగ శోభితము కానట్టే. ఆ భగవంతుఁడు సర్వోత్కృష్టుఁడు. పాపలేశ మంటని వాఁడు. కనుక నీ వాతని భజించునపుడు పాపలేశమునకు దూరముగా ఉండవలెను. వాఁడనంతుఁడు. కనుక నీ భక్తి కూడ అనంతమై ఉండవలెను. వైకుంఠప్రాప్తి జరిగిన పిదపను పరమాత్ముని సేవయే నీ పరమధ్యేయముగా ఉండవలెను. వాఁడన్నిటిని నియమించువాఁడు. వానిని శరణుఁ జొచ్చినపుడు నిన్నే కొఱతయు అంటదు. పురుషోత్తముఁడు వాఁడు. వాని నెదుర్పగలవాఁడు. లేఁడు. ఒక్కక్షణము వృథా యొనర్చినను అది వ్యర్థమైనట్టే. పరమాత్ముని భజనము,సేవనము నియమవిహితమని కాక, ప్రేమతో నొనర్చుము ప్రేమలేని పూజాదులు వ్యర్థములు. పరమేశ్వరుని సేవకు ప్రధానప్రచోదకము భక్తి. అనఁగా పరమోత్కృష్టమైన ప్రేమ. ఆ ప్రేమఉన్నపుడు. ఆతనికై పడు శ్రమ అంతయు సంతోషకారణముగానే ఉండును. ఇట్టు సేవించుటవలననే సంసారబంధము లేని ముక్తి లభించును. అది నీ సహజ గుణమై పోవును.

1016. వెండియున్=మఱియు, ప్రయుక్తంబు=ప్రయోగింపఁబడినది, బ్రహ్మసాక్షాత్కార సాధనంబులు=ఈబ్రహ్మానుభూతికి కారణములైనవి, వైరాగ్య జ్ఞానంబులన్=వైరాగ్యము జ్ఞానము అనెడు రెంటిని, భగవద్భక్తి యుక్తము=భగవంతుని యందలి భక్తిచే కూడినది, చిత్తంబు=మనస్సు, ఇంద్రియవృత్తుల చేన్=ఇంద్రియముల యొక్క వ్యాపారముల చేత, సమంబులగు అర్థంబులు=సమానములైన విషయములందు, వైషమ్యంబును=విరోధభావమును, ప్రియాప్రియంబులను లేక=ప్రియము అప్రియమనెడు భావమును వదలి, నిస్సంగంబు=దేనియందు సంబంధము లేనిది, సమదర్శనంబు=సమానముగా చూచుటకలది, హేయ+ఉపాదేయవిరహితంబు=గ్రహింపఁదగినది, ద్వేషింపఁదగినది అను భావములు లేనిది, ఆరూఢము=తనహృదయమందు ప్రసిద్ధముగా తోచుచున్నది, ఆత్మపదంబును=బ్రహ్మస్వరూపమును, జ్ఞానరూపుండును=జ్ఞానమే స్వరూపముగా కలవాఁడు, పరబ్రహ్మంబును=ఉత్తమమైన బ్రహ్మస్వరూపుఁడు, పరమాత్ముండును=సర్వభూతముల యందును అంతర్యామియై ఉండి వానికి మహాప్రియమైనవాఁడు, ఈశ్వరుండు=సకలమును నియమించువాఁడు అగు పరమపురుషుండు=అగు.భగవంతుఁడు, ఏకరూపంబు కలిగి యుండియున్=ఒకటే రూపము కలవాఁడై ఉండియు దృశ్యము=చూడఁబడునది. ద్రష్ట=చూచువాఁడు, కరణము=చూచునది, అనుట చేత, పృథగ్భావము=భిన్నమైన భావము, ఇదియ=ఇదియే యోగికిన్ సమగ్రంబగు, యోగంబునన్ చేసి=అన్ని యంశముల చేత కూడుకొన్న యోగసాధనతో, ప్రాప్యంబగు ఫలంబు=పొందతగినట్టి ఫలము, కావునన్=అందుచేత, విషయ విముఖంబులు=విషయము లందాసక్తి లేనివి. జ్ఞానరూపంబు=జ్ఞానస్వరూపము, హేయగుణరహితంబు=నీచములైన గుణములు లేనిది, మనోవిభ్రాంతిన్ చేసి=మనస్సున నేర్పడెడు భ్రమకారణముగా, శబ్దాది ధర్మంబగు అరూపంబునన్=శబ్దము మొదలైన ధర్మములు గల అర్థ స్వరూపముగా తోచున్=కనపడును - అర్థాకారంబునన్=అర్థము యొక్క స్వరూపముగా, అహంకారంబు గుణరూపంబునన్ చేసి=గుణము యొక్క స్వరూపముతో, త్రివిధంబును=మూడు విధములైనది, భూత రూపంబునన్=పంచభూతముల యొక్క స్వరూపము చేత, పంచవిధంబును=అయిదు రీతులుగా ఉన్నదియు, ఇంద్రియ రూపంబునన్=ఇంద్రియముల స్వరూపముతో ఏకాదశ విధంబును=పదునొకండు రీతులుగా నున్నదియు, జీవరూపుండగు విరాట్పురుషుండు=జీవరూపముతో నున్న విరాట్పురుషుఁడని పిలిపించుకొనెడి పరబ్రహ్మ, జీవవిగ్రహంబైన=జీవునకు స్వరూప మైనట్టి, అండంబు=గోళాకారముగ నున్నది, జగంబునన్ తోచుచుండున్=లోకము నందు సాక్షాత్కరించుచుండును. దీనిన్=ఈ జీవస్వరూపముతో నున్న విరాట్పురుషుని, శ్రద్ధాయుక్తంబైన భక్తి చేతన్=శ్రద్ధతో కూడుకొన్న భక్తి వలన, యోగాభ్యాసంబునన్ చేసి=క్రమాభ్యాసముతో యోగమును సాధించుట వలన, సమాహితమనస్కుండై=నిత్యజాగరూకంబైన మనస్సును పొందినవాఁడై, నిస్సంగంబునన్=దేనియందు సంబంధము లేని వాఁడు, విరక్తుండై=వైరాగ్యముతో కూడిన వాఁడై, పొడగను చుండున్=సాక్షాత్కరించు కొనుచుండును. బుధజన=జ్ఞానుల చేత, పూజనీయ=పూజింపతగిన, చరిత్రవు=చరిత్రకలదానవు. సర్వయోగ=సమస్త యోగముల చేత, సంప్రాప్యుఁడు=పొందతగినవాఁడు, నిర్గుణుండు=గుణముల యొక్క

సంబంధము లేని వాఁడు, భగవంతుండు=భగవంతుఁడైనవాఁడు, అని చెప్పిన జ్ఞానయోగంబును మదీయ భక్తి యోగంబును=నాకు సంబంధించిన భక్తి యోగంబును, ఇంద్రియంబులు భిన్నరూపంబులు=వివిధములైన స్వరూపములతో భాసించునవి, ఏక రూపంబైన అర్థంబు=ఒకఁ డే అయిన విషయములు, అనేక విధంబు లగునట్లు=అనేక రీతులుగా ప్రత్యక్షమగునట్లు, బ్రహ్మంబు అనేకంబుగన్ తోఁచున్=బ్రహ్మస్వరూప మనేక రీతులుగా భాసించును.

తాత్పర్యము: మఱియును కపిలుఁడిట్లు చెప్ప నారంభించినాఁడు =అమ్మా! భగవంతునకు వాసుదేవుఁడని మఱియొక పేరు. భగ మనఁగా నారు గుణములు- వీని నింతకు ముందు పలు సార్లు వివరించితిని- వాసు దేవుఁడను పేరునకు సమస్తమందు వ్యాపించిన వాఁడని యర్థము. ఇట్టి పరమాత్మయందు ప్రయోగింపఁబడిన ప్రేమ స్వరూపమైన భక్తి యోగము, వైరాగ్యమైన జ్ఞానమును కలిగించును. వైరాగ్య మనఁగా భగవంతుని యందుఁ దప్ప తక్కిన వాని యందు విముఖి భావము. ఇది ముష్కరముగా నుండదా? జ్ఞాన పూర్వకమై ఉండవలెను. వివేకముతో వింగడించుకొని విషయములను బాధకముగా నిర్ణయించి వానితోడి సాంగత్యమును క్రమక్రమముగా వదలు కొనవలెను. ఈ రీతి లభించిన వైరాగ్య జ్ఞానములు బ్రహ్మసాక్షాత్కారమునకు కారణము లగును. అపుడు చిత్తము ఇంద్రియములను బలవంతముగా లొంగ తీసికొనుటకు ప్రయత్నింపదు. రాగ ద్వేషములు లేక అన్నిటిని ఊరక చూచుచు వానితో సంబంధము విసర్జించి నిత్యజాగృతముగా ఉండును. అట్టి చిత్తమునకు అప్రియమైన విషయము లేదు. ప్రియమైన విషయము కూడ లేదు. కాని వానితో సంగమా మనస్సున కంటదు. అన్నిటి యందును దాని ప్రవృత్తి సమదర్శనమై ఉండును. విషయముల నసహ్యించు కొని వదలి పెట్టుట ఉత్తమ జ్ఞానమునకు సూచకము కాదు. పరమోన్నతమైన మనస్సునకు ఒక యర్థము నందు ద్వేష బుద్ధి ఉండదు. ఇంకొక దాని యందు ఇది ఉపాదేయమను ప్రేమ ఉండదు. ఆ చిత్తము నిత్య జాగృతమై ఉండును. ఆత్మను ఆత్మచేత భావించుచుండును. సతత సమాధి నిష్ఠమైన అద్వైతానుభూతితో నుండునని తాత్పర్యము. జ్ఞానస్వరూపముగా పరమాత్ముఁడు భాసించు చుండును. సగుణోపాసన యందు వాఁడే ఈశ్వరుఁడు, పరమ పురుషుఁడు. భక్తియోగము ననుసరించు పరమాత్ముఁడు. ఈ పదములన్నియు నొక పదార్థమునే చెప్పును. దర్శనము వాఁడే. చూచుచున్న ద్రష్టయు నతఁడే. చూచుటయు వాఁడే. జ్ఞానదృష్టితో నీ మూఁడు నొక్కటియే కాని సాధకుని యొక్క భిన్నభావముతో ఈ మూఁడును విభిన్నములు కాదనిపించును. సర్వాంగపూరితమైన యోగసాధనతో మహాయోగికి మూఁడు నొక్కటిగనే భాసించును. ఇదియే యోగమునకు ప్రధానమైన ఫలము. అందుచే విషయ విముఖములైన ఇంద్రియములతో బ్రహ్మమును సాక్షాత్కరించు కొనవలెను. అది జ్ఞానరూపము. విషయ సాంకర్యముతో నేర్పడెడు హేయ గుణముల కందు తావు లేదు. కాని మనస్సు తన విభ్రాంతితో భిన్నతలు కల్పించు కొనిపోవును. శబ్దాది రూపములైన విషయములు పరబ్రహ్మ కంటె భిన్నములని

భావించును. బ్రహ్మస్వరూపము అరాకారముగా తోఁచునప్పుడు ఇది అహంకారము యొక్క క్రీడయే. అహంకార వేషరూపము లనేకములు. గుణములతో నదిముత్తెఱఁగు లగును. భూతస్వరూపముతో నది పంచరీతు లగును. పృథివ్యాదు లన్నమాట. ఇంద్రియ రూపముతో నది ఏకాదశ విధము లగును. జ్ఞానేంద్రియములు కర్మేంద్రియములు పది మనస్సొక్కటి. సముదిత జీవత్పురుషులే విరాట్పురుషుఁడు. ఆ విరాట్పురుషునకు ఈ జగత్తే శరీరము. ఈ రీతిగా నెవ్వనికి భాసించునో శ్రద్ధాయుక్తుఁడై భక్తి యోగము సాధించిన వానికి యొడగొనును. వాని మనస్సు నిత్య జాగృతమై ఉండును. వాఁడు నిస్పృహుఁడు. జ్ఞానమందు తప్ప వేఱు దానియం దభినివేశము లేనివాఁడు. అమ్మా! గొప్పదానవు కనుక ఈ రహస్యమంతయు విప్పి చెప్పినాను. భక్తి జ్ఞాన యోగములు జీవసంస్కారమును బట్టి వచ్చుచుండును. సర్వయోగముల చేత పొందఁదగిన ఆత్మస్వరూపుఁడు నీరుణుఁడు. ఇది జ్ఞాన యోగము యొక్క నిర్వచనము. భక్తి యోగము యొక్క స్వరూపము వేఱు; అభ్యాసము వేరు. సాధనా గతిదగ్గఱ భిన్నముగా తోచినను పర్యవసానమున ఈ రెండు యోగములు ఒక్కటే. ఇంద్రియములు భిన్నభిన్నరూపములు. కన్ను రూపమునే చూచును. ముక్కు వాసననే చూచును. నాలుక రుచియే యెఱుంగును. కనుక ఒక్కటియే యైన అర్థము భిన్నములైన ఇంద్రియముల చేత భిన్నరూపములుగా గ్రహించఁబడును. అట్లు ఒక్కటి యైన పరబ్రహ్మము సాధనావశముగా భిన్నభిన్నముగా కాన్పించు చుండును. కాని పదార్థ మొక్కటే.

1017. అంబ!=ఓ తల్లీ! నారాయణుండు=నార+ఆయనుండు=నారము లనఁగా జలములు; వానిపైన శయనించు వాఁడని అరము లేక నారము లనఁగా జీవులు. వాని యందంతర్యామి స్వరూపముగా ఉండి తిలకించుచుండు వాఁడని తాత్పర్యము. అఖిలశాస్త్రములను=సమస్తములైన శాస్త్రములందును, సమధిక=చక్కగా, అనుషిత=అనుష్ఠింపఁబడిన, సవన=యజమును, తీరదర్శన=తీర్థయాత్రలు, జపతపఃజపమునీ, తపస్సును, అధ్వయన=వేదాధ్యయనము, యోగ=యోగమునెడు, క్రియా=క్రియ, దాన కర్మంబులు=దానములు కర్మ యోగములు- వీనిచేత, కానబడఁడు=దర్శన మీయఁడు, ఏచినమనము=విజృంభించిన మనస్సు, బాహ్యేంద్రియంబులన్=బాహ్యములైన ఇంద్రియములను, గెలిచి=జయించి, సకల కర్మత్యాగసరణిన్=సమస్తములైన కర్మములను త్యజించుట యనెడు మార్గము నందు, ఒప్పి=మెలఁగుచు, తలకొని=ప్రయత్నించి, ఆత్మతత్త్వజ్ఞానమునన్=ఆత్మతత్త్వము ననుభవించెడి జ్ఞానము చేత, మించి=నిత్యజాగరూకుఁడై, ఉడుగక=ఉపేక్షవహింపక, వైరాగ్యయుక్తిన్=సతత విరక్తి భావముతో, తనరి= ప్రవర్తించుచు, మహిత=శ్రేష్ఠమైన, ఫలసంగరహిత=ఫలముల తోడి సంబంధము లేని, ధర్మమునన్=ధర్మముతో, తనరునటి పురుషుండు=ఒప్పెడు మనుజుఁడు, అఖిల హేయ గుణములను పాసి= సమస్త నిరసింపఁదగిన గుణముల నుండి, విడివడిన వాఁడై కళ్యాణగుణవిశిష్టుఁడు=సమస్తములైన కళ్యాణ గుణములతో కూడినవాఁడు, ఐన హరిన్= అయినో శ్రీమహా విష్ణువును, పరమాత్మున్=పరమాత్ముఁడనిపించుకొను వానిని, అనఘుఁడగుచున్=పాపలేశము లేనివాఁడగుచు, ఒందున్=పొందును.

తాత్పర్యము : నారము లనఁగా జలములు. వాని పైన శయనించువాఁడు. నారము లని జీవులకును పేరు. అట్టి జీవుల యందంతర్యామి స్వరూపముగా ఉండి సమస్తమును గమనించు చుండు వాఁడు నారాయణుఁడు. ఈ నారాయణుఁడు సర్వోత్కృష్టమైన దైవముగా చెప్పుచున్నాఁడు. ఇట్లే శివుఁడని శైవాగమములు, గణపతి యని గాణాపత్యములు. అంబయని శాక్తములు. వాని వాని సమయము ననుసరించి ఆ యా దేవతలకు సర్వోత్కృష్టత్వము నాపాదించును. నారాయణ, వాసుదేవ, ప్రద్యుమ్న అనిరుద్ధములని వ్యూహములు. వీనిలో నారాయణ స్వరూపమే సర్వోత్కృష్టము. అందులకే దానికి మూలమింతకు ముందే ఈ నారాయణుని పొందుటకు మార్గములను చెప్పుచున్నాఁడు- సమస్త శాస్త్రముల నధ్యయన మొనర్చినను నారాయణుని పొందశక్యము కాదు. చక్కగా యాగములు కూడ ననుష్ఠించిన నతని పొందలేరు - తీర్థ యాత్రలతో చిక్కఁడు. జపముల కాతఁడు దూరము. తపస్సులకు లభింపఁడు. అధ్యయనము కూడ నంతే. యోగ క్రియలతో నాతని గను టశక్యము. దానములతో, కర్మమార్గములతో సాధింప రాదు. మఱి యాతని పొందుటకు మార్గమేది? "కానబడఁడా?" అనుచోట నున్న అకార మవధారణార్థకము. సాధ్యమే కాదని సిద్ధాంత పక్షము నవలంబించి చెప్పుచున్నాఁడు. ఆ భగవంతుని పొందు మార్గములలో మొదట మనోవిజయమును సాధించు కొనవలెను. కర్మజ్ఞానేంద్రియములను అదుపులో నుంపవలెను. సర్వమున కధికారి మనస్సే. దాని సాహాయ్యము లేని ఇంద్రియములు దేని యందును ప్రవర్తింపనేరవు. మనస్సే ఇంద్రియాకారమై పరిణమించునను నంత ప్రాధాన్యము దాని కున్నది. కర్మత్యాగము రెండు రీతులు. ఏకర్మమును చేయకుండు టొకటి. ఏ కర్మములు చేయకుండుటన నెట్లు? ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు మొదలైనవి జరుగుచునే యుండును గదా! తద్భిన్నములని దీని కరము. శరీరావసానమునకు నియతములై కార్యములు జరుగ వలసినదే. జ్ఞానియైన వాఁడు సర్వ కార్యములను పరిత్యజించి మితతమముగా శరీర నిర్వాహక కార్యము లొనర్చుచు ప్రపంచము నం దంటని వాఁడై యుండుట రెండవ పద్ధతి. సకల కర్మము లొనర్చుచున్నను వాని ఫలములం దుదాసీనుఁడై ఉండుట లేక యా కర్మఫలములను భగవంతునందు సమర్పించుట అను ఈ రెండు మార్గము లందును సాధకుఁడు నిత్యజాగరూకుఁడుగా ఉండవలెను. జ్ఞానియైన వాఁడు ఆత్మకన్న తాను భిన్నుఁడ నను విషయమునే మఱచి నిరంతర మాత్మ స్వరూపుఁడగనే ఉండును. ఇది జ్ఞాన పద్ధతి. అద్వైత మార్గమని పేరు. వానికి సర్వము నాత్మ మయముగానే గోచరించును. మఱియొకటి భక్తిమార్గము. వాఁడు సర్వమునం దాత్మస్వరూపమును కాక సాకారుఁడైన భగవంతుని దర్శించు చుండును. కృష్ణభక్తునకు సర్వము కృష్ణమయమై గోచరించును. ఈ యనుభూతి జరిగిన తరువాత వాఁడు సతత జాగరూకుఁడై ఉండవలెను. ఇంద్రియములు వంచనా పరములు. ఎట్లో ఒకరీతి కనుగప్పి మరల వానిని తమ పరిధిలోని కీడ్చుకొనును. తొండరడిప్పొడి యాళ్వార్ మొదలైన మహాభక్తులు ఇట్టి కష్టముల ననుభవించిన వారే. నిరంతరమును సంగరహితుఁడుగా ఉండవలెను. ఫలసంగతిని కూడ మానవలెను. ఇదియే వారి ధర్మముగా

ఉండవలెను. సాక్షాత్కార మున్నదను కొని విశ్వంఖలముగా ప్రవర్తించు వాఁడు మరల మొదలు పెట్టిన చోటికే వచ్చును. కనుక హేయములైన గుణములతో వాని కెప్పుడును సంబంధ ముండనే రాదు. పరమాత్మ నిఖిల హేయ ప్రత్యనీక కళ్యాణ గుణవిశిష్టుఁడు. అట్టి హరిని పొందుటకు వీఁడును అటు వంటి వాఁడు కావలెను. అట్టి వానికి పాప లేశమే ఉండదు. పుణ్యా పాపములు రెండును బంధకము లేయని శ్రీ భాష్య మనుచున్నది. పాపము నరకాది హేయ పదముల నుంచును. పుణ్యము స్వర్గాదుల నుంచును. ముక్తిని గోరు వానికి ఈ రెండును బాధకములే. వాని ధ్యేయము స్వర్గాదులు కాదుకదా! పుణ్యపాపములు రెండును జన్మకారణములే. పాపము దుఃఖప్రారబ్ధము నొసఁగును. పుణ్యము సుఖప్రారబ్ధమునకు దారి తీయును. కనుక ఇచ్చట అనఘుఁడను శబ్దమునకు పుణ్యపాపములు రెండును లేని వాఁడని అర్థము చెప్పుకొనవలెను. కర్మ లొనర్చుచున్నపుడు వాని ఫలములైన పుణ్యపాపములు సంక్రమించును కదా! నిజమే. అందుకే వాని ఫలము లం దుదాసీనుఁడుగా ఉండవలెనని చెప్పినది. హరియే పరమాత్మ. పరమాత్మ యనఁగా జీవున కత్యంత ప్రియమైన వాఁడు. వాఁడే ఆత్మస్వరూపుఁడు వానిని జీవుఁడెక్కువగా ప్రేమించును. ఎందుకనఁగా వాఁడు తానే కనుక. దాని ననుసరించియే సమస్త మంటుకొని యుండును. దీనినే "ఆత్మనఃకామాయ సర్వం ప్రియం భవతి" అని ఉపనిషత్తులో నున్నది. పరమాత్ముఁడను మాట కూడ భక్తి సంప్రదాయమునకు సంబంధించినదే. జ్ఞాన మార్గములో సర్వము నాత్మ స్వరూపమే యని అచట ప్రేమించు వాఁడును లేఁడు. ప్రేమించునదియు లేదు. సర్వమం దుదాసీన భావమే ఉండును.

1018. అదిగావునన్=సిద్ధాంత మిట్టుండుట చేత, నీకున్=నీకు, చతుర్విధ భక్తి యోగ ప్రకారంబు=నాలువిధములైన భక్తి యోగస్వరూపమును, తేటపడన్=స్పష్టపడునట్లు, ఎఱిఁగించితిన్=వివరించినాను. అదియునుం గాక=అంతమాత్రమే కాక, కాలరూపయగు=కాలరూపమైనటి, మదీయగతి=నాయొక్క పద్ధతి, జంతువుల యందున్=ప్రాణుల యందు, ఉత్పత్తి వినాశ రూపంబుల నుండున్=ఉత్పత్తియు వినాశమనెడు రూపముల చేత, అవిద్యాకర్మ నిర్మితంబులు=అజ్ఞానము చేత నొనర్పునట్టి కర్మలచే నేర్పరుపఁబడిన, జీవుని గతులు=జీవుని యొక్క ప్రకారములు, అనేక ప్రకారంబులై యుండున్=అనేక రీతులుగా మండును. జీవాత్మ=ఆత్మస్వరూపమున కంటె తాను భిన్నుఁడని భావించి కొన్న జీవ స్వరూపుఁడని భావించు కొన్నవాఁడు, వానియందున్ ప్రవర్తించి=ఆ కర్మల యందు ప్రవర్తించినవాఁడై, ఆత్మగతి=ఆత్మస్వరూపము, ఇట్టిది=ఈ ప్రకార మైనదని, ఎఱుంగక యుండున్=అని తెలిసికొనలేక వర్తించు చుండును. మఱియు నిట్టనియెన్=తరువాత నీ ప్రకార మనుచున్నాఁడు. ఇట్టి అతి రహస్యమగు=ఈ రీతిగా పరమరహస్యమైన సాంఖ్యయోగ ప్రకారంబు=ఇరువది నాలుతత్త్వములతో కూడిన సాంఖ్యయోగపద్ధతి, ఖలునకున్=పాపాత్మునకు, అవినీతునకున్=వినయము లేని వానికి, జడునకున్=మూఢునకు, దురాచారున కున్=దుష్టమైన ఆచారము గల వానికి, డాంబికునకున్=జంభముతో వర్తించు

వానికి, ఇంద్రియలోలునకున్=ఇంద్రియ సుఖము లందాసక్తి గలవానికి, పుత్ర+దార+అగార+ఆది+అత్యంతాసక్తచిత్తునకున్=పుత్రులు భార్యలు ఇండ్లు మొదలైన వాని యందు ఎక్కువ ఆసక్తి గల మనసున్న వానికి, భగవద్భక్తి హీనునకున్=భగవద్భక్తి లేని వానికి, విష్ణుదాసుల యందు ద్వేషపడువానికిన్=విష్ణుభక్తులయందు ద్వేషము మనస్సునం దుంచుకొని సాధించెడి వానికిని, ఉపదేశింపన్‌వలదు=ఎప్పుడును ఉపదేశమొయరాదు, శ్రద్ధాపన్నుండు=శ్రద్ధతో కూడిన వాఁడును, వినీతుండు=వినయముకలవాఁడును అసూయారహితుండు=అసూయ లేనివాఁడు, సర్వభూతమిత్రుండు=సమస్త భూతములందును మైత్రిని సాధించు వాఁడు, శుశ్రూషా+అభిరతుండు=శుశ్రూషయం దాసక్తి గలవాఁడు, బాహ్యార్థ జాతవిరక్తుండు=బాహ్యములైన పదార్థ జాతములందు వైరాగ్య మేర్పడిన వాఁడు, శాంత చిత్తుండు, నిర్మత్సరుండు=అసూయలేని వాఁడు, మద్భక్తుల యందున్=నాభక్తులందు, అన్యకాంతా విముఖుండు=పరస్త్రీల యందు విముఖమైన బుద్ధి కలవాఁడు. నిష్కాముండు=కోరిక లేనివాఁడు. అగునధికారికిన్=అయినట్టి అధికారికి, ఉపదేశింపన్=ఉపదేశించుటకు, అర్హంబగున్=తగినట్టిది. ఈ యుపాఖ్యానంబు=ఈ కథ, ఏ పురుషుండేని=ఎవఁడైనను, పతివ్రతయగు ఉత్తమాంగన యేని=పతివ్రతయై సద్గుణములు గల స్త్రీ యైనను, శ్రద్ధాభక్తులు కలిగి=శ్రద్ధయును భక్తియును గలదై, మత్+అర్పిత చిత్తంబునన్=నాయందు సమర్పింపఁబడిన బుద్ధిచేత, వినున్, పఠియించున్=విన్నను చదివినను, మదీయదివ్యస్వరూపంబున్=నాయొక్క దివ్య స్వరూపమును, ప్రాపింతురు=పొందెదరు. కర్దమదయిత=కర్దముని యొక్క భార్య, నిర్ముక్త మోహపటల=విడువఁ బడిన మోహము యొక్క సమూహము కలది, సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి=సర్వావయవములును భూమిపైన పొందునట్లు నమస్కరించి, తత్త్వవిషయాంకిత=తత్త్వవిషయములచేత కూడు కొన్న, సాంఖ్యజ్ఞాన ప్రవర్తకము=సాంఖ్యజ్ఞానమును కలిగించునది, ఉపక్రమించి=ప్రారంభించి, కపిలునకున్ ఇట్లనియెన్=కపిలునితో నిట్లు పలికెను.

తాత్పర్యము: కపిల మహర్షి యనుచున్నాఁడు. తల్లీ! నీకు నాలు విధములైన భక్తియోగ పద్ధతి నిరూపించి చెప్పినాను. నాలువిధములైన భక్తి యోగమెట్టిది? నిర్గుణమైన భక్తియోగము మొదటిది. నిర్గుణోపాసన జ్ఞానప్రధానమే అయినను భక్తియోగము నుండి పూర్తిగా విడివడినది కాదు. నారద భక్తి సూత్రము లందు ఈ సిద్ధాంతము స్పష్టముగా ప్రతి పాదింపఁబడినది. ఇఁత త్రిగుణములు సత్త్వరజస్తమోగుణములు. ఈ గుణభేదములను బట్టి వానియు పాసనా భేద మేర్పడుచున్నది. ఈ యుపాసనలోని భేదములను భగవద్గీతలోని గుణత్రయ విభాగయోగములో కృష్ణపరమాత్మ సమగ్రముగా చర్చించి యున్నాఁడు. పరిశుద్ధములై పవిత్రములైన వస్తువుల సమర్పణ మందే సాత్త్వికును ప్రీతి యుండును. రజోగుణ విశిష్టుఁడు దంభమును గొలుచును. అనేక పదార్థ జాతములను వెదకి వెదకి కొని తెచ్చి పరమాత్మకు సమర్పింపఁ

జేయును. ఇది భగవన్ముఖోల్లాసమునకు కాదు. దంభమునకే తామసమను పద్ధతి ఈ రెంటి కన్న భిన్నమై ఉండును. ఘంటాకర్ణుఁడు మొదలైన వారు తామసిక భక్తులు. కాలము భగవంతుని యొక్క శక్తి విశేషము. అది జీవులయందు ఉత్పత్తి వినాశరూపములతో ప్రవర్తించు చుండును. అవిద్య యనఁగా అజ్ఞానము. దీనికి వేదాంతపరిభాషలో అవిద్యయని పేరు. దానిచేత ప్రేరితుఁడై జీవుఁడు అహంకార విశిష్టుఁడై ఫలమునం దభిలాష కలిగి కార్యము లొనర్చు చుండును. ఆ కార్యములకు ఫలముగా జీవుఁడనేకములైన గతులనందును. జీవాత్మ మోహావిష్టుఁడై పరమాత్మ కంటె తాను భిన్నుఁడని అనుకొనును. ఇది క్రిందికి క్రుంగుటలో మొదటి మెట్టు. అట్టి వాని కాత్మ తత్త్వము నిజముగా వ్యక్తము కాదు. ఓతల్లీ! ఇది యతిరహస్యమైన సాంఖ్య యోగప్రకారము. దీని నెవ్వరి కుపదేశింపరాదో కపిల మహర్షి చెప్పుచున్నాఁడు. దుర్మార్గునకు చెప్పరాదు. వినయము లేని వాఁ డిందుకు బాహ్యుఁ డు. అర్థమొనర్చికొనలేని మందబుద్ధియును, సక్రమమైన ప్రవర్తన లేని దురాచారుఁడు, జంభము కలవాఁడు, ఇంద్రియముల వెంట పోవువాఁ డు, లాలసుఁడు. ఇల్లు, భార్య, సంతానము మొదలగు వాని యందు తీవ్రముగా ప్రాణముంచి కొన్నవాఁడు ఈ బోధ కనర్హుఁడే. భగవద్భక్తి లేనివానికి చెప్పరాదు. భాగవతు లను ద్వేషించు వానికి ఎట్టి పరిస్థితిలోను ఉపదేశింప రాదు. ఇఁక నధికారులను చెప్పుచున్నాఁడు. తెలిసికొనవలెనను శ్రద్ధ గలవాఁడు ఉత్తముఁడు. వినయము ఉండవలెను. అసూయ కలవాఁడు పనికిరాఁడు. సమస్త భూతములందు మైత్రీభావము కలవాఁడు అధికారి. శుశ్రూష యం దాసక్తికలవాఁ డు చెప్పతగినవాఁడు. ప్రబల వైరాగ్యము కలవాఁడు పాత్రుఁడే. అనుద్వేగకరమైన మనస్సుండవలెను. నిర్మత్సరుఁడు, ప్రవిత్రమైన మనస్సు కలవాఁడు, భక్తుల యందు ప్రేమ కలవాఁడు, దురాశ లేనివాఁడు -- ఇట్టి వాఁడు అధికారి. మరల కపిలుఁడిట్లన్నాఁడు. అమ్మా! ఈ కథను ఉత్తమ పురుషుఁడెవ్వఁడు చదువునో వాఁడు నాపదము ప్రాపించును. పతివ్రతయైన స్త్రీ కూడ ఈ యుపాఖ్యానము చదువవచ్చును. వినవచ్చును. దీనిని చదువుటకు శ్రద్ధాభక్తులు ఉత్తమములైన ఉపకరణములు. ఈ రీతిగా మైత్రేయుఁడు విదురునకు చెప్పినాఁడు. ఆతఁడు ఓయి విదురా! కర్దముని భార్య దేవహూతి కపిలుని ఉపదేశము సాంతముగా విన్నది. ఆమె మోహము పూర్తిగా వదలిపోయినది. ఆమె సాష్టాంగ దండప్రణామ మొనర్చెను. తత్త్వవిషయక ప్రవర్తకమైన సాంఖ్య యోగ ప్రవర్తక స్తోత్రము నిట్లు చేయ నారంభించినది.

ఇది శ్రీమదాంధ్ర భాగవతమున పోతన రచితమున
తృతీయ స్కంధమున ముప్పది రెండవ అధ్యాయము.
సుధాలహరి వ్యాఖ్య సంపూర్ణము.

త్రయస్త్రింశోఽధ్యాయః

శ్రీ మైత్రేయ ఉవాచ

శ్లో. ఏవం నిశమ్య కపిలస్య వచో జనిత్రీ
సా కర్దమస్య దయితా కిల దేవహూతిః,
విస్రస్తమోహపటలా త మభిప్రణమ్య
తుష్టావ తత్త్వ విషయాంకిత సిద్ధిభూమిమ్. 1

అథాప్యఞ్జోఽంతే సలిలే శయానం
భూతేంద్రియార్థాత్మమయం వపు స్తే,
గుణప్రవాహం సదశేషబీజం
దధ్యౌ స్వయం యజ్జఠరాబ్జజాతః. 2

స ఏవ విశ్వం భగవాన్ విధత్తే
గుణప్రవాహేణ విభక్తవీర్యః,
సర్గాద్యనీహోఽవితథాభిసంధి
రాత్మేశ్వరోఽతర్క్య సహస్రశక్తిః. 3

స త్వం భృతో మే జఠరేణ నాథ
కథన్ను యస్యోదర ఏత దాసీత్,
విశ్వం యుగాంతే వటపత్ర ఏక
శ్శేతేస్మ మాయాశిశు రంఘ్రిపానః. 4

త్వం దేహతంత్రః ప్రశమాయ పాప్మనాం
నిదేశ భాజాం చ విభో! విభూతయే,
యథావతారా స్తవ సూకరాదయ
స్తథాకయ మధ్యాత్మ పదోపలబ్ధయే. 5

యన్నామధేయ శ్రవణాను కీర్తనా
ద్యతస్తతోణాద్యత్స్మరణా దపి క్వచిత్,
శ్వాదోపి సద్యః సవనాయ కల్పతే
కుతః పున స్తే భగవన్ను దర్శనాత్. 6

అహో! బత! శ్వపచోఽతో గరీయాన్
యజ్జిహ్వాగ్రే వర్తతే నామ తుభ్యమ్,
తేపు స్తప స్తే జుహువు స్సస్ను రార్యా
బ్రహ్మా నూచు ర్నామ గృణంతి యే తే. 7

తం త్వాఽద్యాహం బ్రహ్మపరం పుమాంసం
ప్రత్యక్స్రోత స్యాత్మని భావితవ్యమ్
స్వతేజసా ధ్వస్తగుణప్రవాహం
వందే విష్ణుం కపిలం వేదగర్భమ్. 8

శ్రీమైత్రేయ ఉవాచ

ఈడితో భగవా నేవం కపిలాఖ్యః పరః పుమాన్,
వాచావిక్లబయేత్యాహ మాతరం మాతృవత్సలః. 9

శ్రీభగవాన్ కపిల ఉవాచ

మార్గణాఽనేన మాత స్తే సుపేవ్యే ణోదితేన మే,
ఆస్థితేన పరాం కాష్ఠా మచిరా దవరోత్స్యసి. 10

శ్రద్దత్తైతన్మతం మహ్యం జుష్టం యద్బ్రహ్మవాదిభిః,
యేన మా మభయం యాయా మృత్యు మృచ్ఛంత్యతద్విదః. 11

శ్రీ మైత్రేయ ఉవాచ

ఇతి ప్రదిశ్య భగవా నుశతీ మాత్మనో గతిమ్,
స్వమాత్రా బ్రహ్మవాదిన్యా కపిలోఽనుమతో యయౌ. 12

సా చాపి తనయోక్తేన యోగాదేశేన యోగయుక్,
తస్మిన్నాశ్రమ ఆవీడే సరస్వత్యా స్సమాహితా. 13

అభీక్ష్ణావగాహకపిశాన్ జటిలాన్ కుటిలాలకాన్,
ఆత్మానం చోగ్రతపసా బిభ్రతీ చీరిణం కృశమ్. 14

ప్రజాపతేః కర్దమస్య తపోయోగ విజృంభితమ్,
స్వగార్హస్థ్య మనౌపమ్యం ప్రార్థ్యం వైమానికై రపి. 15

పయః ఫేననిభా శ్శయ్యా దాంతా రుక్మపరిచ్ఛదాః,
ఆసనాని చ హైమాని సుస్పర్శాస్తరణాని చ. 16

స్వచ్ఛస్ఫటిక కుడ్యేషు మహామరక తేషు చ,
రత్నదీపార్చిషా భాంతి లలనారత్నసంయుతాః. 17

గృహోద్యానం కుసుమితైః రమ్యం బహ్వమరద్రుమైః,
కూజద్విహంగ మిథునం గాయన్మత్తమధువ్రతమ్. 18

యత్ర ప్రవిష్ట మాత్మానం విబుధానుచరా జగుః,
వాప్యా ముత్పల గంధిన్యాం కర్దమేనోపలాలితమ్. 19

హిత్వా తదీప్సిత తమ మప్యాఖండల యోపితామ్,
కించి చ్చకార వదనం పుత్రవిశ్లేషణాతురా. 20

వనం ప్రవ్రజితే పత్యా హ్యపత్యవిరహాతురా,
జ్ఞాతతత్త్వాఽప్యభూఽన్నష్టవత్సా గౌరివ వత్సలా. 21

తమేవ ధ్యాయతీ దేవ మపత్యం కపిలం హరిమ్,
బభూవా చిరతో వత్స నిస్స్పృహా తాదృశే గృహే. 22

ధ్యాయతీ భగవద్రూపం యదాహ ధ్యాన గోచరమ్,
సుతం ప్రసన్న వదనం సమస్త వ్యస్త చింతయా. 23

భక్తి ప్రవాహ యోగేన వైరాగ్యేణ బలీయసా,
యుక్తానుష్ఠానజాతేన జ్ఞానేన బ్రహ్మ హేతునా. 24

విశుద్ధేన తదాఽఽత్మాన మాత్మనా విశ్వతోముఖమ్,
స్వానుభూత్యా తిరోభూత మాయాగుణ విశేషణమ్. 25

బ్రహ్మణ్యవస్థితమతి ర్భగవత్యాత్మ సంశయే,
నివృత్త జీవాపత్తి త్వా ద్వీతక్లేశాప్త నిర్వృతిః. 26

నిత్యారూఢసమాధిత్వా త్పరావృత్త గుణభ్రమా,
న సస్మార తదా త్మానం స్వప్నదృష్ట మివోత్థితః. 27

తదేహఃపరతః పోష్యోఽప్యకృశాచ్ఛ్రద్ధసంభవాత్,
బభౌ మలై వరచ్ఛన్న స్సధూమ ఇవ పావకః. 28

స్వాంగం తపోయోగ మయం ముక్త కేశం గతాంబరమ్,
దైవగుప్తం న బుబుధే వాసుదేవే ప్రవిష్టధీః. 29

ఏవం సా కపిలోక్తేన మార్దేణాచిరతః పరమ్,
ఆత్మానం బ్రహ్మనిర్వాణం భగవంత మవాప హ. 30

తద్వీరాసీ త్పుణ్యతమం క్షేత్రం త్రైలోక్యవిశ్రుతమ్,
నామ్నా సిద్ధపదం యత్ర సా సంసిద్ధి ముపేయుషీ. 31

తస్యా స్తద్యోగ విధుత మర్త్యం మర్త్య మభూత్సరిత్,
స్రోతసాం ప్రవరా సౌమ్య సిద్ధిదా సిద్ధసేవితా. 32

కపిలోఽపి మహాయోగీ భగవాన్ పితు రాశ్రమాత్,
మాతరం సమనుజ్ఞాప్య ప్రాగుదీచీం దిశం యయౌ. 33

సిద్ధచారణగంధర్వై ర్మునిభి శ్చాప్సరోగణైః,
స్తూయమాన స్సముద్రేణ దత్తార్హణ నికేతనః. 34

ఆస్తే యోగం సమాస్థాయ సాంఖ్యాచార్యై రభిష్టుతః,
త్రయాణా మపి లోకానా ముపశాంత్యై సమాహితః. 35

ఏత న్నిగదితం తాత! యత్పృష్టోఽహం తవానఘ!
కపిలస్య చ సంవాదో దేవహూతేశ్చ పావనః. 36

య ఇద మనుశృణోతి యోఽభిధత్తే
కపిలమునే ర్మత మాత్మయోగగుహ్యమ్,
భగవతి కృతధీ స్సువర్ణకేతా
వుపలభతే భగవత్పదారవిందమ్. 37

ఇతి శ్రీమద్భాగవతే మహా పురాణే అష్టాదశసహస్రికాయం,
సంహితాయాం పారమ

హంస్యాం శ్రీవైయాసిక్యాం శ్రీహయ గ్రీవ బ్రహ్మ విద్యాయాం,
తృతీయస్కంధే, కపిలోపాఖ్యానం నామ త్రయస్త్రింశోధ్యాయః సమాప్తః.

1. కర్దమస్య=కర్దమ మహర్షి యొక్క, దయితా=ప్రియపత్నియు, కపిలస్యజనిత్రీ=కపిలమహర్షికి తల్లియు అయిన, సా దేవహూతిః=ఆ దేవహూతి, ఏవం వచః నిశమ్య=ఈ రీతిగానున్న వాక్కును విన్నదై, విస్రస్తమోహపటలా-విస్రస్త=నశించినట్టి, మోహపటలా=మోహమనెడు ఆవరణతో కూడినదై, తత్త్వవిషయాంకితసిద్ధభూమిం=తత్త్వముల యొక్క విషయములను తెలిసినట్టి వారి కాశ్రయ స్థానమైన, తం=ఆ కపిల మహర్షిని గూర్చి, అభిప్రణమ్య=సాష్టాంగముగ నమస్కరించి, తుష్టావ=స్తోత్ర మొనర్చినది.

తాత్పర్యము: కపిలాచార్యుని ఉపదేశముతో దేవహూతికి జ్ఞానము భక్తివైరాగ్యములు వీని యొక్క రహస్యము స్పష్టముగా అర్థమైనది. బోధకుఁడు కపిలాచార్యుఁడుటచే శ్రవణమాత్రము చేతనే అమె విముక్తురాలయినది. ఆమె కంతకు ముందేర్పడి యున్న సంస్కారవిశేషము కూడ నట్టిది. ఈ విషయము నీ యధ్యాయములో మైత్రేయుఁడు విదురునకు చెప్పుచున్నాఁడు. ఓయి విదురా! ఈశ్వరుఁడు గురువు, వీరిరువురి యొక్క ప్రసాదమున్నపుడు మాత్రమే శ్రవణాదులు ఫలప్రదము లగుచున్నవి. ఇచ్చట కపిల మహర్షియే గురువు. ఆతఁడే సర్వేశ్వరుఁడు కూడ. అందుచే నామెకు ఉపదేశమాత్రముననే సిద్ధి ఏర్పడెను. అప్పు డామె ఇట్లు కపిలుని స్తుతించెనని మైత్రేయుఁ డను చున్నాఁడు. దేవహూతి యోగీశ్వరుఁడైన కర్దముని ప్రియపత్ని. భగవంతుఁడైన కపిలాచార్యుని తల్లి, ఆమె కపిలుని ఉపదేశముతో దేహాత్మ భావనారూపమైన యజ్ఞానము నుండి విడివడినది. ప్రకృతి పురుషుఁడు ఈశ్వరుఁడు ఈ మూఁడు పదార్థముల తత్త్వమును చక్కగా నెఱిఁగిన పరమజ్ఞానుల కాశ్రయభూతుఁడైన వాఁడు కపిల మహర్షి గురువైన వాఁడు. ఆమె ఆతనికి నమస్కరించి ఇట్లు స్తుతించుచున్నది.

2. యజ్జఠరాబ్జజాతః=ఎవని జఠరము నుండి ఏర్పడిన తామరనుండి జన్మించిన, అజఃఅపీ=బ్రహ్మకూడ, అంతస్సలిలే=జల మధ్యమందు, శయానం=శయనించి ఉన్నట్టియు, సత్+అశేషబీజం=సర్వప్రపంచమునకు ఆదికారణ మైనట్టియు, గుణప్రవాహం=గుణముల యొక్క ఉద్భవముతో కూడినదియు, భూతేంద్రియాత్మమయం=భూతములు, ఇంద్రియములు, అర్థములు, ఆత్మలు-అనెడు వీని యొక్క స్వరూపముతో ఉన్నదియు నైన, తే వపుఃషీ=నీశరీరమును, దధ్యౌ=ధ్యానించెదను.

తాత్పర్యము: ఈ శ్లోకము మొదలు కొని ఏడు శ్లోకములు దేవహూతి యొనర్చు చున్నస్తోత్ర రూపము. పరమాత్ముని స్వరూపము వీక్షించుటకు బ్రహ్మదేవునకును సాధ్యము కాలేదు. అట్టి స్వరూపము దేవహూతి కాంచ గలిగినది. దానితో తనకేర్పడిన హర్షాతిరేకము నామె ప్రదర్శించుచున్నది - ఓ భగవంతుఁడా! సమస్త లోకమును వీలయ మందు చున్నపుడు సర్వేశ్వరుఁడ వైన నీవు కారణ జలములందు శయించితివి. కొంతకాలమట్లే గడచినది. అపుడు నీ నాభినుండి తామర ఉద్భవించినది. దాని నుండి బ్రహ్మోత్పత్తి. ఆతఁడు కారణ జలములందు శయించినట్టియు సకల లోకములకు పరమకారణము. సత్త్వాదిగుణముల సామ్యావస్థ యందున్న ప్రకృతి కాశ్రయుఁ

డగును. పంచభూతములు, జ్ఞానకర్మేంద్రియములు శబ్దాదులైన సూక్ష్మభూతములు జీవాత్మ వీని కన్నిటికినీ ఆధారభూతమయినను నీస్వరూపమును ధ్యానించి నాఁడు. అనఁగా బ్రహ్మదేవుఁడు కూడ సాక్షాత్తుగా నీ స్వరూపమును దర్శింప నేరఁడయ్యెనని భావము.

3. గుణప్రవాహణ=గుణముల యొక్క ప్రవాహము నుండి, విభక్త వీర్యఃవిభాగింపఁబడిన వీర్యముతో కూడిన వాఁడును, అవితథాభిసంధిఃవ్యర్థము కానట్టి- అనఁగా సఫలమైన సంకల్పము తోడ కూడిన వాఁడును, ఆత్మేశ్వరఃజీవాత్మలన్నిటికీ ఈశ్వరుఁడును, అతర్క్యసహస్ర శక్తిఃఊహించుటకుఁ గూడ నశక్యమైన అనేక శక్తులతో కూడినవాఁడు. అనీహఃనిష్ప్రయుఁడు అయిన, సఃభగవా నేవఁ డైన భగవంతుఁడవైన నీవే, విశ్వస్యలోకము యొక్క, సర్గాదిసృష్ట్యాదియైన వాఁడవుగా నుండి, విధత్తేసమస్త కార్యము లొనరించుచున్నావు.

తాత్పర్యము : సమస్త భూతముల కాదిభూతుఁడు అన్నదానికి కారణము చూపించుచున్నాఁడు - ఎవని యొక్క ఉదరమందు, యుగాంతములో లోకములు లయించి ఉండునో, ఆ ఎఱుంగరాని పోకడ కల నీవే ఈ కన్పించు చుండెడి సమస్తము సృష్టించి రక్షించి లయింపఁ జేయు పరమేశ్వరస్వరూపుఁడవు. సత్త్వాదిగుణముల ప్రవాహ నిమిత్తముగా సృష్టించుటకును, సంహరించుటకును కారణమైన శక్తిని నీవు వేఱు వేఱుగా విభజించి భరించి యున్నావు. నీ సంకల్పమాత్రము చేతనే సమస్తమును నడపింపఁజేతువు. అంతేకాదు. నీవే కార్యము లొనర్చుట లేదు. జీవాత్మలకు కర్మాను సరణముగా నేర్పడెడు భోగములను కల్పించి అనుగ్రహించుటకు కావలసిన సృష్ట్యాది వ్యాపారమందు నీ యొక్క సంకల్పము ప్రవేశించు చున్నది. ఊహించుటకు కూడ నశక్యమైన అనంత శక్తి ఓస్వామీ! నీ యందున్నది.

4. యుగాంతే=యుగావసాన మందు, ఏతద్విశ్వం=ఈ లోకమును, యస్యఉదరే=ఎవని యొక్క ఉదరమందు, ఆసీత్=ఉండెనో, అట్టి మాయాశిశుఃమాయాశిశుమూర్తియు, అంఘ్రిపానఃపాదాంగుష్ఠము యొక్క నఖమునుపానమొనర్చుచున్నవాఁడును, ఏకఃఒంటిగా, వటపత్రేమఱ్ఱియాకు పైన, శేతే స్మశయించుట ఒనర్చునో, నాథ!ఓ ఈశ్వరుఁడా! సఃత్వంఆ నీవు, మే జఠరేణనాయొక్క గర్భమందు, కథంభృతఃఎట్లుగా భరింపఁబడితివి.

తాత్పర్యము : స్వామీ! యుగాంతమందు ఈ సమస్త లోకములు ఎవ్వని జఠరమందు అడఁగి ఉండునో అట్టి నీవు నీమాయా విలాసముతో నొక శిశురూపమును ధరించి, బాలకుల యొక్క స్వభావము ప్రకాశించెడు విధముగా పాదాంగుష్ఠమును పానమొనర్చుచు వటపత్రమందు శయించితివి కదా! ఈ రీతిగా అవేద్యప్రకారుఁడవైన నీవు నా యుద మందు కేవలశిశువుగా ఎట్లు శయించితివి? నీ యొక్కొక్క చేష్టయు కూడ వర్ణించుట కెవ్వరికిని సాధ్యమగును?నీ మహిమ యగమ్యగోచరము.

5. పాప్మనాం=పాపుల యొక్క ప్రశమాయ=వినాశనము కొఱకు, నిదేశభాజాం=నీ యాజ్ఞ ననుసరించి ప్రవర్తించు వారియొక్క, విభూతయే

చ=అభివృద్ధికొఱకును, త్వం=నీవు, దేహతంత్రః=స్వయముగా దేహమును ధరించుచున్నావు. సూకరాదయః=సూకరము మొదలైన, తవ అవతారాః= నీయొక్క అవతారములు, యథా=ఎట్లో! తథా ఆయం అపి=ఆ ప్రకారముగనే ఇతఁడు కూడ, ఆత్మపథోపలబ్ధయే=ఆత్మమార్గమును తెలుపుటకొఱకే, ఉపయోగించునదిగా ఉన్నది.

తాత్పర్యము : స్వామీ! నేను నిన్ను గర్భము నందు ధరించు టసాధ్యము. నీవు అవసర మేర్పడినపుడు స్వేచ్ఛగనే శరీరమును ధరించి ప్రపంచమునకు వత్తువు. నీ శరీరము చిదానంద రూపమైనది. నీ వప్పు డప్పుడు ఈ లోకమునకు పాపులను శిక్షించుటకై వత్తువు. నీ ఆజ్ఞారూపమైన వేద మార్గ మనుసరించి వర్తించు సజ్జనుల రక్షణము నీ అవతారమునకు ముఖ్యొక కారణము. నీరాకతో వారిక్షేమ మభివృద్ధి యగును. ఈ రెండు కార్యములకే నీవు సూకరాద్యవతారములను గ్రహించితివి. అట్లే ఆత్మ స్వరూపజ్ఞానమునకై ఉపకరించెడు జ్ఞానమును బోధించుటకై ఈ యవతారమును స్వీకరించితివి. స్వంతత్రుఁడవైన నీవు నీసంకల్పము చేతనే నాజఠరమం దవతరించినావు.

6. యన్నామధేయ శ్రవణాను కీర్తనాత్=ఎవని నామధేయము వినుట తన్మాహాత్మ్యము కీర్తించుట వీనివలనను యత్ప్రహ్వణాత్=ఎవని యొక్క నమస్కారము వలనను, క్వచిదపి=ఎప్పుడైనను, యత్స్మరణాత్=ఎవనిని గూర్చి స్మరించుట చేతను, శ్వాదః అపి=చండాలుడు కూడ, సద్యఃఁ=అపుడే, సవనాయ= పూజార్హమై, కల్పతే=యోగ్యుఁడగునో, భగవాన్=ఓ భగవంతుఁడైన వాఁడా! తే దర్శనాత్=నీయొక్క దర్శనము కారణముగ, కుతః పునఃఁ= మఱి చెప్పవలసిన దేమున్నది?

తాత్పర్యము: ఓ భగవంతుఁడా! ఎప్పుడైనను ఒకసారి నీనామధేయము కీర్తించినచో నదియే మహాయోగ్యతకు కారణ మగుచున్నది. నీ కీర్తనయు అంతే - నిన్ను గూర్చి మననము సేయుటయు నట్టిదే. నిన్ను తలపోసి నమస్కరించుట కూడ మహాభాగ్య కారణ మగును. మనసా స్మరించుట సర్వాతిశయహేతువు. వీనిలో ఒక్కదానినైన ననుసరించు చండాలుఁడైనను తత్క్షణమే పూజార్హుఁడుగా అగును. అట్లుండగా ఆనందస్వరూపమైన నిన్ను సాక్షాత్తుగా దర్శించిన నాభాగ్యమెంతని చెప్పవలెను నాజన్మ కృతార్థమైన దనుట కింకేమి హేతువు కావలెను? నాభక్తి తన పరమోత్కృష్టమైన శక్తిని ప్రదర్శించుకొన్నది.

7. యజిహ్వాగ్రే=ఎవని యొక్కజిహ్వాగ్రమందు, తుభ్యంనామ=పరమ పవిత్రమైన నీనామము, వర్తతే=వర్తించుచున్నదో, శ్వపఃచ=వాఁడుచండాలుఁడైనను, అతః=నిన్ను స్మరించుటయను కారణము చేతనే, గరీయాన్=పూజ్యుఁడుగా అగుచున్నాఁడు. తే=అట్టిచండాలాదులు, తపః తేపుఃఁ=ఉత్కృష్టమైన తపస్సును సాధించిన వారే అగుదురు. జహ్నువుఃఁ=హోమము చేసినవా రగుదురు. సస్నుఃఁ =ఉత్కృష్టమైన స్నానమును నేరవేర్చినవారు, బ్రహ్మ=వేదమును, అనూచుఃఁ =అనుదినమును పఠించినవారగుదురు. యే=ఎవ్వరు, తే నామ=పరమపవిత్రమైన

నీనామము గృణంతి=ఉచ్చరించుచున్నారో, తే ఆర్యాః=వారు పరమ శ్రేష్ఠులైన వారును.

తాత్పర్యము: హే భగవన్! నీ పాదపద్మములను భజింపక యుండు బ్రాహ్మణుల కంటెను నీనామమును నిరంతరము కీర్తించుచుండెడి చండాలురు పరమపూజ్యులు. ఎందు కనఁగా నాతఁడు నామసంకీర్తన రూపమైన జపయజ్ఞము నిరంతర మొనర్చుచున్నాఁడు. సమస్త యజ్ఞముల కంటె జపయజ్ఞము శ్రేష్ఠమైనది. ఎవ్వఁడు నిరంతరము నీ నామ జప మొనర్చునో వాఁడే ఆర్యుఁడని పిలువఁబడుటకు తగిన వాఁడు. సమస్తతపము లొనర్చిన ఫలము వానికి సిద్ధించును. తీరయాత్ర లొనర్చిన పుణ్యము వానికి కరతలామలకము. హోమసిద్ధములైన ఫలములు వాని కయత్న సిద్ధములు. వాఁడు సమస్త వేదములు చదివినవాఁడు. చదివించిన వాఁడు. వాఁడు పూర్వజన్మలం దొనర్చిన మహా పుణ్యముల ఫలముగా వానికి నామ సంకీర్తన రూపమైన జపయజ్ఞఫలము సిద్ధించినది. ఇట్టి మహా మహిమోపేతమైన నీకీర్తి వరించుటకు నాకేమి సౌధ్యమగును? ఈ యభిప్రాయమునే "యజ్ఞానాం జప యజ్ఞోఽస్మి" అనెడు గీతా వచనము బోధించుచున్నది.

8. స్వతేజసా=నీ యొక్క స్వరూప శోభతో, ధ్వస్తగుణప్రవాహం=ధ్వంస మొనర్చఁబడిన గుణప్రవాహముతో కూడిన వాఁడును, ప్రత్యక్ స్రోతసి= విషయముల నుండి తిరోగమనము నందిన, ఆత్మని=మనస్సునందు, భావితవ్యం= చింతించుట కర్హుఁడును, వేదగర్భం=గర్భమందున్న వేదములతో కూడిన వాఁడును, కపిలం=కపిల సంజ్ఞను వహించి యున్నవాఁడును, విష్ణుం=సర్వత్ర వ్యాపించియున్న వాఁడును పరం పుమాంసం=పరమపురుషుఁడనై యున్న, తం త్వాం బ్రహ్మ=ఆ స్వరూపమైన బ్రహ్మమును, అహం వందే=నేను స్తోత్రము చేయుచున్నాను.

తాత్పర్యము : స్వామీ! విషయము నుండి విముఖమైన మనస్సుతో ధ్యానింప తగిన వాఁడవు నీవు. స్వప్రకాశముతో గుణప్రవాహము నుండి ఏర్పడిన సంసారమును నిశ్శేషముగా నశింపచేయు వాఁడవు నీవు. భక్తులకు మోక్షదానము చేయు పరమేశ్వరుఁడవు. పరమ జ్ఞానస్వరూపమునీవు. సాంఖ్యశాస్త్రము నందు పరమపురుషుఁడని చెప్పఁబడువాఁడవు నీవు. పురాణవాఙ్మయమునందు మహావిష్ణువని పేర్కొనఁబడు వాఁడవు నీవే ఈ యవతారమందు కపిల నామధేయము వహించితివి. అనన్య భక్త సంరక్షకుఁడవునైన నీ పాదపద్మములకు నమస్కారము.

9. ఏవం ఈడితః= ఈ రీతిగా స్తుతింపఁబడిన, కపిలాఖ్యః= కపిలుఁడను పేరుతో నున్న, పరః పుమాన్ భగవాన్= పరమపురుషుఁడైన భగవంతుఁడు, మాతృవత్సలః= మాత యందలి వాత్సల్యభావముతో కూడినవాఁడై, అవికల యా వాచా=గంభీర భావముతో కూడిన వాక్కుతో, మాతరం= తల్లితో, ఇతి ఆహ=ఇట్లనెను.

తాత్పర్యము : కపిలుఁడను నామధేయము ధరించిన పరమపురుషుఁడైన భగవంతుఁడు ఈ రీతిగా దేవహూతి చేత స్తుతింపఁ బడిన వాఁడై మాతృవాత్సల్యము ప్రదర్శించు వాఁడై తల్లితో గంభీర స్వరముతో ఇట్లనెను.

10. మాతః=ఓతల్లి! సుఖేవ్యేణ=నీ చేత సుఖకరముగా సేవింపఁబడుటకు యోగ్యమైనదియు, మే ఉదితేన=నాచేత చెప్పఁబడినదియు, ఆస్థితేన= పూర్వా చార్యులచే చక్కగా ననుష్ఠింపఁబడినదిగా ఉన్న, అనేనమార్గేణ=ఈ మార్గము చేత, అచిరాత్=అతిశీఘ్రకాలమందే, పరాంకాష్ఠాం= పరమపదవీని, అవరోత్స్యసి =నీవు పొందెదవు.

తాత్పర్యము: ఓ తల్లీ! ప్రయాసము లేకుండ అనుసరించుటకు సాధ్య మైనదియు, నాచేత నుపదేశింపఁబడినది, పూర్వాచార్యులచేత అనుష్ఠింప బడినదైన ఈ మార్గము చేత నీవు అతిశీఘ్రకాలములోనే పరమపదమును పొందెదవు.

11. బ్రహ్మవాదిభిః=బ్రహ్మమును గూర్చి ఉపదేశించు వారిచేత, జుష్టం= సేవింపఁబడినది, యత్=ఏది కలదో, మహ్యం ఏతత్ మతం=నాచేత నుపదేశింపఁబడిన ఈ సంప్రదాయమును, శ్రద్ధత్స్వ=శ్రద్ధతో ననుష్ఠింపుము. యేన-అనుష్ఠింపఁబడిన ఏమార్గము చేత, అభయం మాం=సంసారాతీతుఁడైన నన్ను యాయాఃనీవు పొందెదవు, అతద్విదుఃదీనిని తెలియనట్టివారు, మృత్యుం=మృత్యువును, ఋచ్ఛంతి=పొందెదరు.

తాత్పర్యము : తల్లీ! నే నుపదేశించిన ఈ మార్గమును విశ్వాస పూర్వకముగా ననుష్ఠింపుము. నేను మీకు వచించినది క్రొత్తదేమికాదు. ఇంతకు ముందు కూడ బ్రహ్మోపదేశ మొనర్చిన ఆచార్యులు ఈ మార్గము ననుసరించియే శిష్యుల కుపదేశించిరి. నీవీ మతము ననుసరించినచో జన్మాది వికారములకు బాహ్యుఁడనుగా నున్న నన్ను ప్రాపింతువు. ఈ సంప్రదాయము నెఱుఁగని వారు మరల సంసారమార్గమునకే వచ్చి చేరెదరు.

12. పరిశుద్ధురాలైన దేవహూతికి, ఆత్మనః గతిం=ఆత్మయొక్క తత్త్వమును గూర్చి, ఇతి ప్రదిశ్యఈ ప్రకారముగా ఉపదేశించిన వాఁడై, బ్రహ్మవాదిన్యాం= బ్రహ్మతత్త్వమును సంపూర్ణముగా నాకళించు కొన్న, స్వమాత్రాతన యొక్క తల్లి చేత, అనుమతఃసమ్మతి నొందినవాఁడై, కపిలఃకపిలమహర్షి, యయౌ= ఆమెను విడిచి వెళ్ళెను.

తాత్పర్యము : మైత్రేయఁడన్నాఁడు - ఆత్మ స్వరూపము నందుటకు విశుద్ధమార్గమైన తత్త్వము నీ రీతిగా తల్లియైన దేవహూతి కుపదేశించిన కపిలుఁడు బ్రహ్మజ్ఞురాలైన తల్లి యనుమతిని గైకొన్నవాఁడై ఆమెను వదలి వెళ్ళిపోయెను.

13. సాచఅపి=ఆ దేవహూతియును, తనయోక్తేన=పుత్రుఁడైన కపిలునిచే నిర్వచింపఁబడిన, యోగాదేశేన=యోగమార్గము వలన, సమాహితా=చింతను వదలిపెట్టినదై, సరస్వత్యాఃసరస్వతీనదికి, ఆపీడే=అలంకారభూతముగా ఉన్న, తస్మిన్ ఆశ్రమేఆయాశ్రమమందు, యోగయుక్=యోగమందు తన మతమును యోజించు కొన్నదై, (ఆసీత్=ఉండెను)

తాత్పర్యము: పుత్రునిచేత ఉపదేశింపఁబడిన ఆ యోగమార్గము నాశ్రయించి మనస్సును స్వాధీనమునకు తెచ్చుకొన్న ఆ దేవహూతి సరస్వతీ నది కలంకార భూతమైన బిందుసరస్సను పేరు గల్గిన ఆ యాశ్రమమున యోగయుక్తురాలై వసించుచున్నది.

14. అభీక్ష్ణావగాహ కపిశాన్=నిరంతర స్నానములచే పసుపుపచ్చనిరంగుతో కూడినవియు, జటిలాన్=జడలు గట్టుకొని యున్నట్టియు, కుటిలాలకాన్=కుటిలముగా గానున్న వెండ్రుకలతో కూడినదియు, చీరిణం=చిరిగిన గుడ్డతో కూడినదియు, ఉగ్రతపసా=కఠినమైన తపస్సుచేత, కృశం=కృశించినదియునైన, ఆత్మానం=శరీరమును, బిభ్రతీ=ధరించినదై (ఆసీత్=ఉండెను.)

తాత్పర్యము: మూఁడు పూటలా స్నానము. ఆ స్నాననిమిత్తముగా ఆమె కేశములు పసుపు ఎఱుపు కలిగిన వర్ణముతో నొప్పెను. తలయంతయు జడలు గట్టినది, సంస్కారము లేక ధూసరితమై యా కేశపాశము జడలుగట్టుకొని యుండెను. ఉగ్రతపోనిమిత్తముగా శరీరము శుష్కించి పోయినది. ఆమెకు దేహదృష్టియే లేదు. ఆమెవెంట దేహము పారాడు నట్లుండెను.

15. కర్దమ స్యప్రజాపతేఃకర్దమ ప్రజాపతియొక్క, తపోయోగవిజృంభితం=తపస్సు చేతను, యోగముచేతను అధిక ప్రకాశము నందినదియు, అనౌపమ్యం=తనతోసాయైనది మఱి యొక్కటి లేనిదియు, వైమానికైఃఅపి=విమానములతో సంచరించెడు దేవతల చేతను, ప్రార్థ్యం=ప్రార్థింపఁబడుటకు యోగ్యమైన, సవగార్హస్థ్యం=తనయొక్క సొంత ఇంటి యందే ఆమె ఉన్నది.

తాత్పర్యము : దేవహూతి యొక్క వాసస్థానము అసాధారణ మహిమతో కూడినది. దాని సౌందర్యము చెప్పనలవి కాకుండెను. అచ్చటే కర్దమప్రజాపతి తప మొనర్చినది. అతఁడు యోగసిద్ధిఁబడసిన దచ్చోటనే. ఆ తపో వైభవముచే సకల సమృద్ధు లచట అమరియుండెను. దీనితో సమానమైనది వేఱొక్కటుండదని చెప్పుటకు సాధ్యముగాని వైభవముతో కూడినది. దానిమనో హరత్వము చెప్పనలవి కాదు. అచ్చటి నివాసములు మహా భోగవంతులైన వైమానికులు కూడ నాకాంక్షించు చుందురు.

16. పయఃఫేననిభాఃఅచ్చటి తల్పములు మహాపరిశుద్ధములు. పాలనురుగు వలె స్వచ్ఛముగా నుండునవి. ఫేనము వలె మహా మృదువు. శయ్యాఃఅట్టి వా శయ్యలు. దాంతాఃఏనుఁగు దంతముల చేత నిర్మితములు రుక్మపరిచ్ఛదాఃస్వర్ణాలంకారములతో కూడినవి. సుస్పర్శాస్తరణాని=సుఖస్పర్శములైన పైని పఱచుకొనువస్త్రములు కలవి. హైమాని=స్వర్ణనిర్మితములైనవి. ఆసనాని చ=ఆసనములు.

తాత్పర్యము: ఆ గృహమునందలి శయ్యలు పాలవంటివి. ఫేనమువలె మృదుస్పర్శకలవి. శుభ్రములైన వర్ణములు కలవి. ఏనుఁగుల కొమ్ములచేత నిర్మింపఁబడినవా మంచములు. వాని స్వర్ణాలంకారములు. కూర్చెనెడు పీఠములు కూడ స్వర్ణమయములే. ఆ శయ్యలపై పఱచెడు గుడ్డలు మృదుస్పర్శములై మనోహరములై ఉండెను.

17. స్వచ్ఛస్ఫటిక కుడ్యేషు=నిర్మలములై చంద్రకాంత శిలలచే నిర్మింపఁబడిన గోడలు, రత్నప్రదీపాఃరత్ననిర్మితములై అరిపోని దీపములు. లలనారత్న సంయుతాఃస్త్రీ రత్నములతో కూడినవై, భాంతి=ప్రకాశించు చుండెను.

తాత్పర్యము : ఆ గోడలు చంద్రకాంతశిలలతో నిర్మింపఁబడినవి. అవి మహాస్వచ్ఛములై నీడగుపించు చుండెను. రత్నములే దీపములుగా నుండెడివి. అవి ఎప్పుడును ఆరిపోవు. వాని కాంతులు గోడలలో ప్రతిఫలించు చుండెను. కను సన్నల ననుసరించి పను లొనర్చు రత్నాలంకారయుతలైన దాసీజనము ఆ గృహమం దుండిరి.

18. కుసుమితైఃబహుపుష్పములతో కూడియున్న, బహ్వమరద్రుమైఃఅనేక దేవవృక్షములతో, రమ్యం=మనోహర మయ్యు, కూజద్విహంగ మిథునం=ధ్వనించుచున్న పులుఁగుల జంటలతో కూడినదియు, గాయన్మత్తమధువ్రతం=ఝుంకార మొనర్చు తుమ్మెదల గుంపులతో కూడిన గృహోద్యానం=గృహోద్యానము ఇంటియం దుండెను.

తాత్పర్యము : ఆ ఇంటి గృహోద్యానము సర్వలక్షణశోభితము. స్వర్గలోకమునకు సంబంధించిన వృక్షములే ఆ యుద్యానమం దుండెను. అవి నిత్య కుసుమితములై ఉండెడివి. పక్షుల జంటలు జంటలై నిరంతరము తిరుగు చుండెడివి. ఎచ్చట జూచినను ఝంకరించున్న తుమ్మెదలరొదలు తంబురల షడ్జశృతిని తోపింపఁజేయుచుండెను.

19. ఉత్పలగంధిన్యాం=తామరపుష్పముల సువాసనతో కూడిన, యత్ర వాప్యాం=ఏగృహమునకు సంబంధించిన తటాకము నందు, ప్రవిష్టం=ప్రవేశించి నటియు, కరమేన=కరమమహరి చేత, ఉపలాలితం=సమీపమునకు తీసికొనఁబడి లాలింపఁబడినదియునై, ఆత్మానం=శరీరమును, విబుధానుచరాఃదేవ వర్గము నందున్నవారే, జగుఃగానము చేసిరో.

తాత్పర్యము : ఆ యాశ్రమం దొకతటాక మున్నది. దాని నిండ తామరలు. దిక్కులకు వ్యాపించి యున్నవాని సువాసనలు. కర్దమప్రజాపతి యా తటాకములో స్నాన మొనర్చునపుడు దేవహూతి శరీరమును దగ్గరకు తీసికొని లాలించుచుండెను. వారి యనుభూతి గంధర్వాదులు కూడ వర్ణించుచుండిరి.

20. ఆఖండల యోషితామపి=ఇంద్రుని యొక్క యంతఃపురమునకు కూడ, ఈప్సిత తమం=ఎక్కువగా కోరతగిన పదతిలో నున్న, తత్=ఆ ఆశ్రమమును, హిత్వా=ఉపేక్షించినదై, పుత్రవిశేషణాతురా=పుత్రుని యొక్క ఎడబాటుచే దుఃఖించుచున్న హృదయము గలదై, వదనం=ముఖమును, కించిత్ చకార=కొద్దిగా చేసికొన్నది, చిన్న బుచ్చుకొన్నది.

తాత్పర్యము : ఆ యాశ్రమ సౌభాగ్యమును ఇంద్రుని అంతఃపురము కూడ కాంక్షించుచుండినది. ఆ యాశ్రమ సౌందర్యము ఇంద్రునియంతఃపురమును కూడ ఆకర్షించునదిగా ఉండెను. కాని ఆ దేవహూతి ఆయాశ్రమ మందలి అభిమానమును మొదలంటకోసికొన్నది. ఆ సౌందర్యము లేవియు ఆమె నాకర్షించుట లేదు. ఆమె మనస్సు యోగారూఢమైనది. కాని పుత్రవిశ్లేషదుఃఖ

ఖము నామె పూర్తిగా మఱచి పోలేకుండెను. ఆ విరహ దుఃఖ మామెను కొద్దిగా బాధించుచునే ఉండెను.

21. పత్యా=భర్తయైన కర్దముఁడు, వనంవ్రజితే=వనమును గూర్చి వెళ్ళిపోయిన యవసరమందు, అపత్యవిరహాతురా=సంతానవిరహము చేత దుఃఖితయైన ఆమె, జాతతత్త్వాఅపి=తత్త్వము నెఱిఁగినదైనప్పటికినీ, నష్టవత్సా=దూడ కంటికి కనపడకపోగా వత్సలా గౌః ఇవ=స్నేహయుక్తయైన ఆవువలె, అభూత్=అయినది.

తాత్పర్యము : దేహాభిమానము తత్త్వజ్ఞానులను గూడ వేధించును. దీనిని సంపూర్ణముగా విసర్జించుట ఎవ్వరికిని సౌధ్యము కాదనుచున్నాఁడు -భర్తయైన కర్దమ ప్రజాపతి సన్యసించివెడలి పోయినాఁడు. దేవహూతి పుత్రుఁడైన కపిలాచార్యునంటి పెట్టుకొని ఉండెను. ఇపుడు కుమారుఁడు కూడ వదలి పెట్టిపోయినాఁడు. ఇప్పుడామె కుమారుని బోధలతో ఆత్మదర్శనక్షమురాలైనది. ఆత్మనిత్యము. దానితోడ సంయోగవియోగము లెప్పుడు నుండును. ఈ విషయమామెకు చక్కగా తెలిసియుండెను. ఎంతఎఱిఁగినను ఆమె కపిలుఁడు వదలిపోయినపుడు దూడను పోఁగొట్టుకొన్న గోవువలె విలపించినది. ఇష్టజన వియోగము చాల 'దుఃఖకరమైనది కదా!

22. వత్స! ఓయి విదురా! అపత్యం=పుత్రుఁడైన, తంకపిలం హరిం=ఆ కపిల మూర్తియైన విష్ణువునే, ధ్యాయతీ=నిరంతరమును ధ్యానించుచున్నదై, అచిరతః=శీఘ్రకాలమందే, తాదృశే గృహే=అట్టి సమస్త వైభవములతో కూడిన గృహమందు నిస్స్పృహా=ఏ మాత్రమును ఆకాంక్షలేనిదై, బభూవ=అయినది.

తాత్పర్యము : ఓయి విదురా! శ్రీహరియే ఆమెకు పుత్రరూపుఁడుగా అవతరించెను. కపిలాచార్యుఁడను పేరు గల ఆ విష్ణువునే దేవహూతి నిరంతరము మనస్సున నిలిపి కొన్నది. సర్వసౌందర్యములతో కూడిన ఆమె గృహమామె నే మాత్రమును ఆకరింపకుండెను.

23. సుతః=పుత్రుఁడు, ధ్యానగోచరం=ధ్యానమునకు ఆశ్రయభూతుఁడై, యత్ ప్రసన్న వదనం భగవద్రూపం=ఏ ప్రసన్న ముఖముతో కూడిన భగవద్రూపమును వరించి, ఆహ=పలికెనో, సమస్త వ్యష్ట చింతయా=సమష్టి స్వరూపముగను, వ్యష్టి స్వరూపముగను, ధ్యాయతీ=ఆ భగవంతుని గూర్చియే ఆలోచించునదై ఉండెను.

తాత్పర్యము : కపిల మహర్షి పరమ పురుషుని గూర్చి ధ్యానించు విషయమును బోధించుచుండెను. ఆ భగవంతుఁడు ప్రసన్నమైన ముఖము కలవాఁడు. ఇంకను అనేక సుగుణములు కలవాఁడు. కపిలోపదిష్టమైన ఆ భగవద్రూపమును సమష్టిగా వ్యష్టిగా ధ్యానించు చుండెను. ఈ రీతిగా నాధ్యానయోగమున పరినిష్ఠితురా లైనది. పాదముల నుండి శిరస్సు వరకు ఏకాకారముగా ధ్యానించుట సమష్టిచింత. ఒక్కొక్క యంగమును ప్రత్యేకముగా ధ్యానించుట వ్యష్టిచింత. ఈ రెండు విధములుగా ధ్యానించుటతో ధ్యానము పరినిష్ఠిత మగును.

24, 25, 26, 27. భక్తి ప్రవాహ యోగేన=భక్తి యనెడు ప్రవాహ సంబంధము చేతను. బలీయసా=అత్యంత శక్తితో కూడిన, వైరాగ్యేణ=విషయ విరక్తితోను, యుక్తానుష్ఠానజాతేన=సముచితమైన దినచర్యతో కూడిన, బ్రహ్మ హేతునా=బ్రహ్మ

సాక్షాత్కార సాధనమైన, జ్ఞానేన=జ్ఞానము చేతను, విశుద్ధేన=పరిశుద్ధమైన, ఆత్మనా=మనస్సుతో కూడిన, స్వానుభూత్యా= సాక్షాత్కారము తోడను, వీర్యతో ముఖం=సర్వవ్యాపక మైనటియు, తిరోభూతమాయాగుణవిశేషణం=ఉన్నవి కాదని అనుభవమునకు వచ్చిన, మాయాగుణవిశేషముతో కూడినదియు, ఆత్మసంశ్రయే= దేహాదులకు ఆశ్రయమైన, భగవతి బ్రహ్మణి=ఐశ్వర్య పూర్ణమైన బ్రహ్మమునందు, అవస్థితమతిః=నిలుకడగొన్న బుద్ధివృత్తితోను, నివృత్త జీవాపత్తి త్వాత్= జీవభావము, వీత నివృత్తమైన దాని వలన, క్లేశాప్తనిర్వృతిః=క్లేశములు నశించి సుఖప్రాప్తియును, నిత్యారూఢ సమాధి త్వాత్=నాశరహితమైన ఆత్మ యందు సుస్థిరతకు హేతువై, పరావృత్త గుణభ్రమా=గుణవైషమ్యము నిమిత్తముగా నున్నదాని వలె కనిపించెడు నానాత్వము నశించి, ఉత్తితః=మోహము నుండి విడివడిన పురుషుడు, స్వప్నదృష్టం ఇవ=స్వప్నమందు చూచిన పదార్థమును వలె, ఆత్మానం=శరీరమును, న సస్మార=ఆమె స్మరించిన దేదియు లేదు.

తాత్పర్యము : ఆమె ప్రవృత్తియందు తీవ్రమైన భక్తి యోగముండెను. విషయ వైరాగ్య మామె స్వభావమై పోయెను. జప పూజాదికములు నియతములై నడచుచుండెను. నియబద్ధములైన ఆహారాదు లుండెడివి. వీని యన్నిటితో బ్రహ్మసాక్షాత్కారమునకు కారణమైన జ్ఞానము కడుంగడు వికసించెను. పరిశుద్ధమైన బుద్ధి వృత్తియందు ఆత్మానందములు ప్రతిఫలించెడివి. తత్వలమగా మాయాగుణముతో నేర్పడెడు ఈ ప్రపంచ మున్నది యను భ్రాంతి రూపమైన జ్ఞానము తొలగిపోయెను. దేహేంద్రియ అహంకారాదుల యొక్క లవము కూడ నామెకు లేకపోయెను. ఆమె జ్ఞానమాత్రముగా ఉండెను. ఆత్మాశ్రయుడైన భగవంతునందు ఆమె మనస్సు స్థిరముగా నెలకొన్నది. దేవహూతి జీవభావ మెన్నడో తొలగి పోయినది. రాగాదుల యొక్క సంబంధముతో నేర్పడెడు క్లేశాదులు మాటమాత్రముగా నైన లేక నశించి పోయెను. ఆనందమే ఆమె స్వరూపమైనది. ఆమె సమాధి కెప్పుడును విఘ్ను మేర్పడలేదు. ప్రపంచము తనకన్న భిన్నముగా నామెకు తోచుట లేదు. త్రిగుణముల యొక్క ఆభాస మెట్టిదో ఎఱుగదు. నిద్రమేల్కొని యున్నవాడు స్వప్నమందు చూచిన పదార్థజాతమును భ్రాంతి యని భావించును. ఆమె స్వదేహ భ్రాంతి ఎన్నడో వదలి పోయినది. దేహభావము బొత్తిగా లేదు. మాయారూపమైన నిద్రయందు తనకన్న భిన్నముగా భాసించెడు సమస్తమును జ్ఞానోదయమందు స్వప్నపదార్థమువలె మిథ్యాభూతమని తెలిసికొన్న దామె. జీవభావము బొత్తుగా లేదు. పరమాత్మ స్వరూపమే ఉండెను.

28. పరతః పోష్యః అపి=ఇతరులచేత పోషింపబడుచున్నను, అధ్యసంభవాత్=అధికులేనందువలనను, అకృశః=కృశమైనది కాదని, మేఖల అవచ్ఛన్నః=మాలిన్యము చేత కూడినదియు అయిన, తదేహః=ఆ దేవహూతి శరీరము, సధూమః పావక ఇవ=ధూమముచేత కూడుకొన్న అగ్నివలె, బభౌ= ప్రకాశించెను.

తాత్పర్యము : కర్దమ ప్రజాపతిచేత నియమింపబడిన దాసీలు ఆదేవ హూతి శరీరమును రక్షించుచుండిరి. అల్పాహారములతో పోషించుచుండిరి.

కాని ఆమె మనస్సు నిరంతరమును ఆనంద ప్రచురమై ఉండుటతో కృశత్వమును పొందకయే యున్నది. అభ్యంగము మొదలైన శరీరశోధన వ్యాపారములు లేకుండెను. కాని ఆమె శరీరము ధూమా వృతమైన అగ్నివలె మెఱయుచునే ఉండెను. దేహమున కంటుకొన్న మలినము మొదలైనవి ఆమె శరీర జ్యోతిస్సు నేమాత్ర మడ్డగించుటలేదు. అంతర్జ్యోతి సహాయముతో నా యంగములు తళ తళ మెఱయుచునే యున్నవి.

29. తపోయోగమయం=తపస్సు యోగము ఈ రెంటి స్వరూపముగా పరిణమించి యున్నది, ముక్తకేశం=విరబారిన తలముడితో కూడినదియు, గతాంబరం=గుడ్డతోడి సంబంధము లేనిదియునై, దైవగుప్తం=ప్రారబ్ధముచే రక్షింపఁ బడుచున్నదైన, స్వాంగం=తన శరీరమును, వాసుదేవేప్రవిష్టధీః= వాసుదేవుని యందే సమర్పించిన బుద్ధివృత్తితో కూడినదై, న బుబుధే= దేవహూతి తన శరీరమును తెలియలేదు.

తాత్పర్యము : తపస్సు యోగము ఈ రెంటిలో ఆమె జీవన మంతయు నిండి యుండెను. వెండ్రుకల కభ్యంగనము లేదు. శరీరమునకు వస్త్రాచ్ఛాదనములు లేవు - ఆమె శరీరము ప్రారబ్ధమాత్రము చేతనే రక్షింపఁ బడుచుండెను. మనస్సున కధిష్ఠానమై ఉండి భగవంతుఁడైన శ్రీ వాసుదేవుని యందే మనస్సు నిశ్శేషముగా ప్రసరించి యున్నది. శరీరమును అను సంధించుటకు కావలసిన ధృతియే నిశ్శేషముగా తొలఁగిపోయినది.

30. ఏవం=ఈ ప్రకారము, కపిలోక్తేన=కపిలమహర్షిచేత చెప్పఁ బడిన మార్గేణ=మార్గము నాశ్రయించి, సా=ఆమె, అచిరతః=ఎక్కువ కాలము గడువక ముందే, పరం ఆత్మానం=పరమాత్మ స్వరూపుఁడును భగవంతం= ఐశ్వర్య పరిపూర్ణుఁడు అయిన, నిర్వాణం బ్రహ్మ=సుఖరూపమైన బ్రహ్మమును, ఆవాపహ=పొందినది.

తాత్పర్యము:ఈ రీతిగా కపిలభగవంతుఁడు ఉపదేశించిన భక్తిమార్గము ననుసరించి దేవహూతి చాలకాలము గడవక ముండే జ్ఞానానంద స్వరూప మగు ఆత్మను పొందెను. బ్రహ్మము అయిన భగవంతునిఁ ప్రాపించెను.

31. వీర=ఓయి విదురా! సా=ఆమె, యత్ర=ఎ ఆశ్రమమందు, సంసిద్ధిం ఉపేయుషీ=పరమసిద్ధిని పొందినదో, తత్=ఆ స్థానమును, త్రైలోక్యవిశ్రుతం= మూఁడు లోకములందును ఖ్యాతి వహించినదై, సిద్ధపదం=సిద్ధపదమనెడు పేరుగల, పుణ్యతమం క్షేత్రం ఆసీత్=గొప్ప పుణ్యక్షేత్రముగా అయినది.

తాత్పర్యము: అంతర్విరోధులను జయించి నిత్యశాంతమైన జీవితమును గడపుచున్న ఓ విదురా! ముక్తిని పొందించుటకు ఉపకరించెడు విధముగా బుద్ధివృత్తి నాత్మయందు నిలుకడగా నిలిపి కొనుటయే వీరలక్షణము. అట్టి గుణము కలవాఁడు వీరుఁడు. అందుచే విదురుని వీరుఁడా యని సంబోధించు చున్నాఁడు. దేవహూతి ఏ స్థానమందు తపస్సుబట్టి బ్రహ్మసాయుజ్యము సందినదో ఆ యాశ్రమమున కప్పుడు సిద్ధపద మనెడు పేరు మూఁడు లోకముల యందు వ్యాప్తమై యుండినది. దేవహూతి తపస్సు చేత ఆ క్షేత్రము యొక్క కీర్తి ముల్లోకములకు వ్యాపించినది.

32. యోగ విధుతమార్త్యం=యోగము చేత నశింపచేయఁ బడిన మనుష్యధర్మముతో కూడినట్టి, తస్యాః=దేవహూతి యొక్క తత్మర్త్యం=ఆ

దేహమును, సౌమ్య=ఓ పరిశుద్ధమైన బుద్ధిగల విదురా! సిద్ధ సేవితా=సిద్ధుల చేత సేవింపఁబడినదియు, సిద్ధిదా=సిద్ధినేర్పుఱచునదియునైన, స్రోతసాంప్రవరా ఆభూత్=సరిత్సమూహములలో ఉత్కృష్టమైన నదిగా ప్రసిద్ధికి వచ్చినది.

తాత్పర్యము: యోగముచేత నశింపచేయఁబడిన నిశ్శేషధాతు మలముల చేత ఁగూడినది, అత్యంతపరిశుద్ధముగా మారిన ఆ దేవహూతి యొక్క శరీరము నదులలో శ్రేష్ఠమైనది. అనఁగా నామె దివ్యశరీరము నదిగా మారె నన్నమాట. ఆ నదీతీరము లందు తపస్సానర్చెడు సిద్ధులకు పరమ సిద్ధి నొసంగెడు క్షేత్ర మయ్యెను. అనాటి నుండి మహర్షు లందరు క్షేత్రమునే గుమి గూడి సాధన మొనర్చు కొనుచుందురు. ఆత్మానందానుభవముతో ఆమె శరీరమునకు నాశము లేక పోయెను. ఆమె అమృత తత్త్వము నందెను. అందుకే నామె అమృత పర్యాయమైన జలాకృతిని వరించి నదియైనది. అగుటయే కాదు; నాటి నుండి సమస్తలోకమును పవిత్ర మొనర్చుచున్నది.

33. మహాయోగీ=యోగులలో సర్వప్రథముఁడగు, భగవాన్=భగవంతుఁడు నైన, కపిలఃఅపి=కపిల మహర్షియు, మాతరం=తల్లియైన దేవహూతిని, సమనుజ్ఞాప్య=సమ్మతింపఁజేసి యామెసెలవును గైకొన్నవాఁడై పితుఃఆశ్రమాత్=తండ్రియైన కర్దమని ఆశ్రమము నుండి, ప్రాగుదీచీందిశం=ఈశాన్య భూములను గూర్చి, యయౌ=వెడలిపోయెను.

తాత్పర్యము: కపిలుఁడు మహాయోగి; భగవంతుఁడు; సాంఖ్యయోగ ప్రవర్తకుఁడు. అతఁడు తల్లిని సమాధాన పఱచి ఆమె నుండి సెలవు గైకొన్నాఁడు. ఆతఁడు తండ్రియైన కర్దముని ఆశ్రమము నుండి బయలుదేరెను. అతఁడు ప్రాగుదీచియైన దిక్కును గూర్తి వెడలి పోయినాఁడు.

34. సిద్ధచారణ గంధర్వైఃసిద్ధులు చారణులు గంధర్వులు మొదలగు వారి చేతను, మునిభిఃమునుల చేతను అప్సరోగణైశ్చఅప్సరస్సమూహము చేతను, స్తూయమానఃస్తుతింపఁబడుచున్నవాఁడును, సముద్రేణసముద్రము చేత, దత్తార్హణాని కేతనఃదత్తఇవ్వఁబడిన, అర్హణఅర్ఘ్యాది పూజనము, నికేతనఃవాసస్థానము గలవాఁడై.

తాత్పర్యము : సిద్ధులాతని ప్రశంసించు చుండిరి. చారణులాతని శ్లాఘించుచుండిరి. గంధర్వులు కొనియాడుచుందిరి అప్సరసలు, మునులు తలలు వంచి నమస్కరించుచుండిరి. ఆ దిక్కున ఉన్న సముద్రము అర్ఘ్యపాద్యాదులతో నమస్కరించెను. వాసస్థానము కూడ సమర్పించెను.

35. సాంఖ్యాచార్యైఃసాంఖ్యశాస్త్ర పండితుల చేత, అభిష్టుతఃబహుమాన పూర్వకముగా స్తుతింపఁబడుచున్నవాఁడై, యోగం సమాస్థాయసంపూర్ణముగా యోగము ననుసరించివాఁడై, త్రయాణాం లోకానా మపిమూఁడు లోకముల యొక్కయు, ఉపశాంత్యైఉపశమనము కొఱకు, సమాహితఃఆస్తేసమాధితో కూడి యున్నవాఁడు.

తాత్పర్యము : కపిలుఁడు సంఖ్యమునకు ప్రథమాచార్యుఁడు. అతని చేత సాంఖ్యశాస్త్ర ముపదేశముగొన్న ఆచార్యు లంద రతనిని స్తుతించుచుండిరి.

ఆ పద్ధతి ననుసరించిన ఆచార్యులు సంపూర్తిగా నాత్మ సుఖము ననుభవించు చుండిరి. ఆ సాంఖ్య పద్ధతి ములోకములందున్న జీవులకును ఉపశాంతి రూపమైన ముక్తిని ముమ్మరముగా నొసఁగుటకు యోగ్యమైనది. కపిల మహర్షి ములోకముల యొక్క ఆత్మక్షేమము కొఱకు నిరంతరము సమాధి స్థితుఁడయ్యెను. జగత్తులను రక్షించుచున్నాఁడు.

36. అనఘ!= పాపనిర్ముక్తుఁడవైన విదురా! తాత!=ఓ వత్సా! మైత్రేయుఁడు తన నా కన్న చిన్నవాఁడగుటచే విదురుని తాత! యని సంబోధించుచున్నాఁడు. కపిలస్య దేవహూత్యాశ్చ=భగవంతుఁడైన కపిలునకు పరమ పవిత్రురాలైన దేవహూతికిని పరస్పరము ఏర్పడినటి, పావనః సంవాదః=పరిశుద్ధమైన ఈ సంవాదము, అహం యత్పృష్టః=నేను నీచేత అట్లుగా అడుగఁబడితినో, ఏతత్= ఆ సంవాద ప్రకారము, తవ నిగదితం=నిన్ను గూర్చి చెప్పఁబడినది.

తాత్పర్యము : పాపఁనుఁడవై పరమ పవిత్రుఁడవైన విదురా! కపిల దేవహూతి సంవాదమును గూర్చి నీవు నన్ను ప్రశ్నించితివి. ఈ సంవాదము పరమ పవిత్రమైనది. ఈ సంవాద ఫలమే సాంఖ్యశాస్త్రము. నీయాకాంక్షను గుర్తించి నీకు వారి పరస్పర సంవాదము నుపదేశించితిని.

37. కపిలమునేః=కపిల మహాముని యొక్క, ఆత్మయోగ గుహ్యంమతం= ఆత్మను తెలిసికొనుటకు ఉపకరించెడు యోగములతో పరమ రహస్యమైన అభిప్రాయమును. యః=అనుశృణోతి=ఎవఁడు నిరంతరము వినుచున్నాఁడో, యః అబిధత్తే=ఎవఁడు ఉచ్చరించుచున్నాడో, సః=వాఁడు, సుపర్ణకేతా భగవతి= గరుడ వాహనుఁడైన భగవంతు నందు, కృతధీః=సంలగ్నమైన బుద్ధివృత్తి గలవాఁడై, భగవత్పదార విందం=భగవంతుని పాదారవిందమును, ఉపలభతే =ప్రాపించును.

తాత్పర్యము : ఓయి విదురా! ఆత్మస్వరూపము ననుభవింపఁజేయటలో నెన్నియో మార్గము లున్నవి. ఇది వానిలో పరమశ్రేష్ఠమైనది. పరమ రహస్యమైనది. కపిలదేవహూతి సంవాద సారాంశము సాంఖ్యము. ఈ సాంఖ్యయోగ స్వరూపము నెవ్వఁడు అనుదినము కీర్తించుచున్నాఁడో, ఇతరులకు వివరించి చెప్పుచున్నాఁడో, వాఁడు పరమ పుణ్యుఁడు. వాని చిత్తము గరుడ వాహనుఁడైన భగవంతు నందు సుస్థిరముగా నెలకొనును. మరణానంతరము వాఁడు భగవంతుని పాదాబ్జమును పొందుచున్నాఁడు.

విజయధ్వజ వ్యాఖ్య

కపిలరూపియైన నారాయణమూర్తి యుపదేశించు తత్త్వజ్ఞానము దేవహూతికి సిద్ధించినది. ఈ విషయము ఆమె యొనర్చిన స్తోత్రము చేతనే తెలియ వచ్చుచున్నదను విషయమును ఈ యధ్యాయమందు ప్రతిపాదించుచున్నాఁడు.

1. సా=అంతకు ముందు కర్దముని యొక్క సేవచేత కృశీభూత శరీరము కలదై, అతనికి ప్రీతికరముగా వర్తించి, కర్దమస్య=కర్దమ ప్రజాపతికి, దయితా= ప్రీత్యాస్పదయైన భార్యయైన దేవహూతి, జనిత్రీకిల=కపిలరూపియైన నారాయణ

మూర్తి తల్లి అని ప్రసిద్ధురాలైనది. ఏవం=గడచిన యధ్యాయములందు చెప్పఁబడినట్లుగా, కపిలస్య=కపిలరూపియైన శ్రీహరి యొక్క, వచః=ఉపదేశమును, నిశమ్య=విని, విస్రస్తమోహపటలాసతి=అజ్ఞానమనెడు అంధకారమును పోఁగొట్టి కొన్నదై, తత్త్వవిషయ=భగవత్తత్త్వ విషయమందున్న అజ్ఞానమును పోఁగొట్టి కొన్నదై, అంకిత సిద్ధభూమిం=సమస్తయోగసిద్ధులకును ఆశ్రయుఁడైన, తత్త్వ విషయాఖిల సిద్ధభూమిం=విష్ణువిషయకమైన జ్ఞాన మున్నవారు అనేకులు అయిన బ్రహ్మ మొదలైన సిద్ధపురుషులందరకును ఆశ్రయమైన, తం=ఆ కపిల దేవుని గూర్చి, అభిప్రణమ్య=భక్తితో సాష్టాంగ నమస్కార మొనర్చి, తుష్టావ= సాక్షాత్ శ్రీహరియే నీవని తెలుపుచున్నదై స్తోత్ర మొనర్చినట్టి,

తాత్పర్యము: మైత్రేయుఁడనుచున్నాఁడు - విదురా! తనశుశ్రూషచేత కర్దమ ప్రజాపతిని మెప్పించి ఆతని ప్రీతిని సంపాదించినది, కపిలరూపియైన శ్రీహరికి తలియనిపించుకొన్న దేవహూతి ఆ కపిలుని ఉపదేశమును, అవ ధానముతో వీన్నది, విని తనయజ్ఞానాంధకారమును పోఁగొట్టుకొన్నది. ఆమెకు శ్రీహరి విషయమందున్న యజ్ఞానము సంపూర్తిగా నశించినది. తత్త్వజ్ఞానులైన బ్రహ్మాదులైన సిద్ధపురుషులకు ఆశ్రయభూతుఁడైన కపిలునకు తాను తల్లి నను అభిమానమును వదలి ఆమె భక్తితో కపిల మహర్షికి సాష్టాంగ నమస్కార మొనర్చినది.

2. భగవత్తత్త్వవిషయ మందు దేవహూతి యజ్ఞానము లేనిదని ముందు సూచించి యున్నాఁడు. పైన వచ్చు స్తోత్రము చేత దానిని స్పష్టపఱచు చున్నాఁడు - అథ=ఇది ఇక్కడ మంగళ వాచకము, తే=ఓ భగవంతుఁడా నీ యొక్క, జఠరాబ్జజాతః=ఉదరము నందలి నాభికమలము నుండి జనించిన బ్రహ్మదేవుఁడు,స్వయం=తాను, అప్యయాంతే=ప్రళయము యొక్క కడపట. యత్=ఏ, అప్యయాంతేసలిలే=ప్రళయోదకము యొక్క మధ్యమందు, శయానం= పండియున్నట్టి, భూతేంద్రియములు, శబ్దాదులైన విషయములు మనస్సు వీనికంటెను, - అథ=దీనికి కారణభూతమైన ప్రధానముకంటెను అధికమైన, గుణప్రవాహం=సృష్టికాలమందు సత్త్వాది గుణములను ప్రవృత్తము లగునట్లుగా చేయునది (2) జ్ఞానము ఆనందము మొదలైన గుణముల యొక్క ప్రవాహము కలిన, సత్=సత్యమైన, అశేషబీజం=సమస్త జగద్వ్యంజకమైన, వపుః=శరీరము, దధ్యౌ=ధ్యానమొనర్చెను. సఏవ=అని పైకి అన్వయము.

తాత్పర్యము : దేవహూతి చేతులను జోడించి ఇట్లనుచున్నది - స్వామీ! సమస్త జగత్తునకు మంగళమగుఁగాక. ప్రళయాంతమందు నీ నాభికమలము నుండి సృష్టింపఁబడిన చతుర్ముఖ బ్రహ్మ ఆ ప్రళయోదక మందు శయించి యున్న నీ రూపమును ధ్యానమొనర్చెను. పంచభూతములు ఇంద్రియములు వాని విషయములు మనస్సు నీకుపాదాన కారణమైన ప్రకృతిని నియమించునది లక్ష్మీదేవి. ఆమెకు కూడ ప్రధానమైన వాఁడవునీవే. సృష్టికాలమందు సత్త్వాది గుణములను ప్రవర్తింప చేయువాఁడవు నీవే. సంతతముగా జ్ఞానాదిగుణ పూర్ణుఁడైన వాఁడవునీవే. ఆ నీ యొక్క చిదానం దాత్మక దేహము సత్యమైనది. మాయికముకాదు 'శయాన'అనుట చేత

క్రియావిష్టుఁడని అరము నిష్ఠియముగా ఉండలేదని తాత్పర్యము. ప్రధానమున కంటెను అధికుఁడని చెప్పుట చేత ప్రకృత్యభిమానురాలైన లక్ష్మీదేవి కంటె ఉత్తముఁడని సిద్ధించుచున్నది. అట్టిచో సర్వచేతనుల కంటె ఉత్తముఁడని చెప్పవలసి యున్నది. హరిసర్వోత్తమత్వము దీనిచేత సిద్ధించినది. క్రియావిశిష్టుఁడనుటతో నిరుణుఁడు కాఁడని సృష్టపఱుపఁబడినది. గుణప్రవర్తకుఁడనుటచే స్వతంత్రుఁడనీ భావము. సతు=అనుటతో "సదేవ సొమ్య ఇదమగ్ర ఆసీత్" అనెడు శ్రుతిలో చెప్పఁబడిన బ్రహ్మమే కాని శబల బ్రహ్మకాఁడని స్పష్ట పరుపఁబడినది.శబల బ్రహ్మయనఁగా అవిద్యతో కూడుకొన్న చతుర్ముఖ బ్రహ్మ. 'అశేషబీజం' అనుటతో ఇదే జగత్కార్యమని సూచింపఁ బడినది "మయం ప్రధాన ముదిష్టం" అనెడు వచనముతో మయమనఁగా ప్రధానమని అరము "త్వం ప్రధానమయో దేవ ప్రధానాదధికోయతః " అనెడు ప్రమాణము కూడ ఈ అరమునే సృష్టపఱుచుచున్నది.

3. జగద్వ్యాంజకత్వమును సృష్టపఱుచు ఆ దేహాభిన్నుఁడవే నీవని స్పష్టపఱుచుచున్నది - సవిత=పైన చెప్పిన దేహము కంటె కొంచెము కూడ భిన్నము కాని (అటువంటి దేహము కలిగినట్టియు) గుణప్రవాహేషు= గుణములతో సృష్టిపరంపరకు విషయులైన బ్రహ్మాదులందు విభక్తవీర్య= బ్రహ్మాది రూపముల చేత, రాజస, సాత్త్విక తామస గుణప్రవర్తకుఁడనెడు భేదముతో విభక్తమైన మాహాత్మ్యము గలినట్టియు, అనీహః=ఆయాస రహితుఁ డును, అవి తథాభిసంధిః=సత్యసంకల్పుఁడైన, ఆత్మేశ్వరః=తనకు తానే నియామకుఁడైన, సమస్త జీవులకును నియామకుఁడైన, ఆతర్క్య సహస్రశక్తిః =ఊహించుటకు కూడ సాధ్యము కాని అనంతమైన సామర్థ్యముతో కూడుకొన్న, భవాన్=నీవు, విశ్వస్య=జగత్తు యొక్క, సరాది=సృష్టి, స్థిత్యాది ఎనిమిది గుణములను, విధత్తే=ఏన్యూనతయు లేక వివరించుచున్నాఁడు.

తాత్పర్యము: స్వామీ! నీవు సమస్త జగత్తును సృష్టించి దానికి నిమిత్తకారణముగా ఉన్నావు. ఈ దేహమునకును నీకు ను స్వల్పభేదము కూడలేదు. సృష్టింపఁబడిన బ్రహ్మాదిచేతను లందు ప్రవర్తక రూపములతో నీవే ఉన్నావాఁడవై నీ సామర్థ్యమును విభక్త మొనర్చికొని యున్నావు. సత్యసంకల్పుఁడవైన నీకు సృష్ట్యాది కార్యములు ఆయాసమును కలిగించునవి కావు. ఈ యనంత సామర్థ్యము నెవ్వరు కూడ ఊహింపఁ జాలరు. వటపత్రశాయికై యున్న నీవే జగత్తునకు సంబంధించిన సృష్ట్యాదులైన ఎనిమిది కార్యములను న్యూనాతి రేకములు లేక ఒనర్చుచున్నావు. "ఏవ" అనుట చేత వటపత్రశాయి జగత్కర్తయైన విష్ణువునకు భేదము లేదని చెప్పనొప్పునది "గుణప్రవాహేషు" అనుటతో సృష్ట్యాదులను క్రమముగా ఒనర్చు వాఁడనీ తాత్పర్యము "అనీహః" అనుట చేత కార్య మొనర్చుట యందు సామాన్య మానవుల వలె ఆయాసపడువాఁడు కాఁడని తాత్పర్యము. దీనికి సత్యసంకల్పుఁడై యుండుటయే కారణము. స్వతంత్రుఁడనుట చేత అంతటి మహిమోపేతుఁడు వేరొక్కఁడు లేఁడని తెలియుచున్నది. అనంతశక్తుఁ డనుట చేత ఉన్నవాఁడొక్కఁడైనను విచిత్ర శక్తి యుక్తుఁడగుటతో ఈశ్వరుఁ డనుట యుక్తమనియు సిద్ధించుచున్నది.

"విచిత్రశక్తిః పురుషః పురాణః" అనెడు శ్రుతి కూడ దీనినే తెలుపును.

4. శ్రీహరి అచింత్యానంత శక్తి యుక్తుఁడను అనుమాన ప్రమాణముతో తెలుపుచున్నాఁడు - హేనాథ!=ఓ స్వామీ! యస్యతే=ఏనీ యొక్క, ఉదరే=కడుపు నందు, ఏతద్విశ్వం=ఈ సమస్తప్రపంచమును, ఆసీత్=ఉండినదో, అంతేకాక, యుగాంతే=ప్రళయము నందు, మాయాశిశుః=నీయొక్క, ఇచ్ఛచేతనే చిన్నబిడ్డవై, అంఘ్రిపానఃసన్=కాళ్ళ యొక్క బొటన వేలిని ముఖమునం దుంచుకొన్నవాఁడవై, ఏకః=ఒకఁడవే, వటపత్రే=మఱి ఆకుపైన, శేతే=పవ్వళించి యున్నావో, సః త్వం=ఆ నీవు, మే అల్పురాలైన నాయొక్క, జఠరేణ=కడుపు తో, కథంను భృతః స్మ ఎట్లు ధరింపఁబడియున్నావు? ఇది ఆశ్చర్యము.

సాసువు గింజ యొక్క కాలభాగమును కూడ ఎత్తికొనలేనిదానను. కారణ మేమనఁగా జీవుఁడు అణుస్వరూపుఁడు. కనుక అట్టి నేను త్రిలోక్యధారివైన నిన్ను ఎత్తుకొని ఉన్నట్లుగా ఒనర్చి నాఁడవో దాని చేతనే అంచిత్యానంత శక్తి యుక్తుఁడవని తెలియు చున్నది. ఇదియే అనుమాన ప్రమాణమన్నమాట.

తాత్పర్యము : స్వామీ! ప్రళయకాలమందు ఈ సమస్త ప్రపంచమును నీయుదర మందు ఇముడ్చుకొని నీ ఇచ్ఛచే శిశురూపుఁడవై పాదాంగుష్ఠమును నోటనుంచుకొని చీకుచు ఒంటిగా వట పత్రమందు పవ్వళించి యుంటివి. సమస్త జగత్తు నుదరమం దుంచు కొన్న నిన్ను నా సన్నని జఠరము ధరింపఁగలదా! కానీ ధరించినది. ఇదియే ప్రబలమైన ఆశ్చర్యము. ఇది కూడ నీ యచింత్యాద్భుతశక్తికి ఒక్క నిదర్శనమే కదా!

5. కపిలుఁడు శ్రీహరి వీరిరువు రొక్కరేయని తెలిపి ఇప్పుడు కపిలావతారము యొక్క ప్రయోజనమును తెల్పుచున్నది. విభో!=సమస్తము నందును వ్యాపించి యున్న సర్వశక్తుఁడవైన వాఁడా! త్వం=నీవు, దేహతంత్రః=దేహముతోనే ప్రకాశించుచున్నవాఁడవు అనఁగా సచ్చిదానందాత్మకమైన దేహముతోనే ప్రకాశితుఁడవై అవతరించినాఁడని భావము. నీవు జీవులవలె ప్రాప్తదేహము కలవాఁడవు కావు. తవ=నీయొక్క, సూకరాదయః=వరాహము మొదలైన, అవతారాః=అవతారములు, యథా=ఎట్లు, పాప్మనాం= హిరణ్యాక్షుఁడు మొదలైన దైత్యుల యొక్క, ప్రశమాయ=నాశనమునకును, చ=ఇంకను, నిదేశభాజాం=ఆజ్ఞను వర్తులైన బ్రహ్మాది దేవతల యొక్క, విభూతయే=ఉన్నతికిని, కృతాస్యుః=చేయఁబడినవో తథా=అట్లే, అయం అపి=ఈ కపిలావతారము కూడ, ఆత్మపథోపలబ్ధయే=నష్టమైపోయిన శ్రీ హరి విషయకమైన జ్ఞానమార్గము యొక్క పునఃప్రకాశనమునకై, త్వయా కృతః=నీచేత ధరింపఁబడినదీ.

తాత్పర్యము : సర్వత్ర వ్యాపించి యున్న నీవు నాదేహము నాధారముగా చేసికొని ప్రకాశమైతివి, చిదానందాత్మకమైన నీ దేహమునకు నాభౌతిక దేహ మెప్పుడు కారణము కానేరదు. నీవు వరాహాద్యవతారము లెత్తి హిరణ్యాక్షుఁడు మొదలైన దైత్యులను సంహరించితివి. నీయాజ్ఞనువర్తించు దేవతలకు అభ్యుదయము కల్గించితివి. అట్లే ఈ కపిలా తారము ధరించి కాలక్రమముగా నష్టమైపోయిన నీ జ్ఞానమార్గమున ప్రకాశమైపోతివి. సజ్జనుల రక్షించితివి.

6. స్త్రీలైనను నీకు సంబంధించిన జ్ఞాన మున్నందున మేము నీ దర్శనాదులతో కృతార్థుల మయ్యేదము "ఈ విషయమును కైముత్య న్యాయముతో చెప్పుచున్నాఁడు - భగవన్! సర్వేశ్వర్య వంతుఁడవైన స్వామీ! శ్వాదుఃఅపి=శునకాదులను భుజించెడు చండాలురు కూడ, క్వచిత్=ఎప్పుడైనను, యత్=ఏ నీయొక్క, నామధేయ=పేరు యొక్క, శ్రవణ=వినుట, అనుకీర్తనాత్=పాడుట, వీనిచేత- యత్తహ్వాణాత్=ఏనీ యందు భక్తి యొనరుట చేతను, యత్స్మరణాదపి=ఏనిస్మరణ చేతను, సద్యఃవెంటనే, సవనాయ=సోమలతను దంచుటకును, అనఁగా యాగ మొనర్చుటకును, కల్పతే, సమర్థుఁడగుచున్నాఁడు. తే=నీయొక్క, దర్శనము చేతను, వీక్షణము చేతను, కుతఃపునఃతప్పక అగునని భావము - అట్లే నేను కూడ నీదర్శనముచే కృతార్థ నైతినని తాత్పర్యము.

7. విష్ణుభక్తి లేకున్నచో సోమయాజి యైనను లాభము లేదని చెప్పుచున్నాఁడు. -యజిహ్వాగ్రే=ఏ చండాలుని నాల్కకొనలో, తుభ్యం=నీయొక్క, నామ=పేరు, వర్తతే=ఎప్పుడు నుండునో, సఃఅట్టివిష్ణుభక్తుఁడైన, శ్వపఃచ=చండాలుఁడు, అతఃపైన చెప్పిన విష్ణుభక్తిలేనట్టి సోమయాజి కంటెను, గరీయాన్=ఉత్తముఁడైన వాఁడు. అహోబత!=శ్రీహరి యొక్క నామమాహాత్మ్యము ఆశ్చర్యకరమైనది. యే=ఎవరు, తే=నీయొక్క, నామ=పేరును, గృణంతి=నిరంతరము స్మరించుచున్నారో, తే=వారు, తపఃతపస్సును, తేపుఃఒనర్చిన వారు. దేవతల నుద్దేశించి, జుహువుఃహోమ మొనర్చిన వారు. బ్రహ్మ=వేదమును, అనూచుఃఅధ్యయన మొనర్చినవారు, పూర్వశ్లోకమందు సామాన్య సోమయాజులను గూర్చి ప్రస్తావించినారు. వారు ఒకరు. విష్ణుభక్తులైన సోమయాజులొకరు. అది లేనివారు ఒకరు. విష్ణు భక్తిలేని సోమయాజుల కంటెను ఆ భక్తిగల చండాలురు ఉత్తములని చెప్పి విష్ణుభక్తి యొక్క సర్వాతిశాయియై సామర్థ్యమును తెల్పినాఁడు. చండాల యొనిఁ తామస యోని. ఆ జన్మనెత్తిన వానికి విష్ణుభక్తి ఎట్లు సిద్ధించును?" బహూనాం జన్మనా మంతే కృష్ణే భక్తిఃప్రజాయతే" అనెడు శాస్త్ర వచనముతో బహుజన్మార్జిత పుణ్యము చేతనే విష్ణుభక్తి ఏర్పడుచున్నది. ఈ ప్రశ్నకుత్తరముగానే ఉత్తరార్థశ్లోకము పాగినది. ఎవ్వఁడు ఎప్పుడును విడువక నామస్మరణ మొనర్చుచుండునో వాఁడు పూర్వజన్మలందు తపస్సు మొదలైన వొనర్చి శుద్ధాంతఃకరణుఁడు గనే ఉండి ఉండును. కాకున్నచో ఇది సాధ్య మయ్యెడిది కాదు. ఏదో ప్రారబ్ధ వశముగా చండాలుండై జన్మించి నను వాఁడు యోగ్యుఁడైన జీవియే అని అర్థము. వర్తమాన క్రియా పదమును వాడుట చేత నిరంతరమును నామస్మరణ మొనర్పవలెనని సూచించి నాఁడు తుభ్యం అనుత చతుర్థవిభక్తి. ఈ చతుర్థీ ప్రయోగముతో "నారాయణాయ నమఃనమః" అనునది సర్వోత్కృష్టమైన మంత్రమనీ తెలిపినట్లైనది.

8. అవతార రూపములకు మూల రూపమునకును వ్యత్యాసము లేదని నీవు చెప్పిన విషయము నేను చక్కగా తెలిసికొన్నానని తెలుపుచు దేవహూతి తన స్తోత్రమును ముగించుచున్నది - అహం=నీ ఉపదేశముతో జ్ఞానము పొంది శరీరాభిమానము త్యజించిన నేను, తం=జ్ఞానమేకం (33వ అధ్యాయము

28వ శ్లోకము) అను మొదలైన వాక్యములతో ప్రతిపాదింపఁబడిన బ్రహ్మ=పరిపూర్ణగుణఁడైన, పరం పుమాంసం=సర్వోత్తముఁడైనట్టియు, ప్రత్యక్ప్రేతసి=విషయములందాసక్తిని వర్జించి ప్రత్యాగాత్మ స్వరూపుఁడైన, శ్రీహరిని గూర్చి నదీ ప్రవాహము వలె పొంగుచు పోవుచున్న ఆత్మని=మనస్సునందు, సంవిభావ్యం=ప్రత్యక్షముగా చూచుటకు యోగ్యుఁడైన లేక చక్షువు మొదలైన ఇంద్రియములతో శ్రీహరి హృదయమందు చేరెడు అని అయినను అర్థము. స్వతేజసా=స్వరూప మనిపించు కొన్న, సచ్చిదానందాత్మకమైన సామర్థ్యముతో, ధ్వస్తగుణ ప్రవాహం=ఎప్పుడును సంసారము యొక్క సంబంధము పోఁగొట్టి కొన్న (నిత్యముక్తుఁడైన) విష్ణుం=సర్వజగత్తునందు వ్యాపించి యున్న బలము, ఆనంద స్వరూపము అయిన శ్రీమన్నారాయణుని యొక్క అవతారమైన, కపిలం=సుఖానుభవ స్వరూపుఁడును, సర్వమును తన యధీన మందుంచుకొని తద్గతమైన ఆనందమును గ్రహించు వాఁడును అయిన కపిలుఁడని పిలువఁబడుచున్న, వేదగర్భం="షకారో బలమేష హ్యానందమాదత్తే" మొదలైన వేదములచేత తెలిసికొనఁబడునట్టి వాఁడును, (2) వేదము యొక్క తాత్పర్యార్థమైన వాఁడు, వేదములను ఉదరమందు ధరించిన వాఁడు (4) తన గుణములను గూర్చి తెల్పుట చేత తన కతి ప్రియము లగుటచే వేదము లందు ప్రవేశించి యున్నవాఁడు (5) వేదములను విస్తరించి రక్షించు వాఁడును అయిన, త్వాం=నిన్ను, అద్ధా=దేహముచే నొనర్చు సాష్టాంగ నమస్కార పూర్వకముగా, వందే=స్తోత్ర మొనర్చి నమస్కరింతును. ఇచ్చట "బ్రహ్మ" మొదలైన అనేకములైన శ్రీహరి యొక్క నామములను గ్రహించుట చేత ఇంకను వేరు వేరు శ్రీహరి నామము లేవి కలవో ఆ సర్వనామములచేతను విశిష్టఁడైన కపిలుని గూర్చి నమస్కరించుచున్నానని తెలిపి శ్రీహరికి కపిలునకు ఏ వ్యత్యాసమును లేదని చెప్పియున్నది. "అద్ధ" అనుట చేత కేవల వాచకమైన వందనమునే కాక కాయికమైన నమస్కారమును కూడ ఒనర్తునని తెలిపి యున్నది. ఇట్లు చెప్పుటతో" నేను నీకు తలినగుట చేత పూజ్యురాలను "అను నభిమానము కూడ లేశమును లేదని చెప్పినట్లైనది. "బ్రహ్మ" అని చెప్పుటతో శ్రీహరి యప్రాప్తుఁడు, కపిలముని ప్రాప్తుఁడు. వీరిరువురకును ఐక్యమెట్లు? అను శంకను కూడ పోఁగొట్టినటు లైనది "పరంపుమాంసం" అ టతో బ్రహ్మపదమునకును వేరైన ఏయర్థమును పొసఁగదు. "గుణపూర్ణుడైన వాఁడు" అనియే అర్థము చేయవలెనని నిర్ణయింపఁ బడినది.

"ఆతోస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః" అనెడు గీతా వాక్యము నిచ్చట అను సంధించు కొనవలెను ఈ విషయమందు జ్ఞానుల ప్రత్యక్షము కూడ ప్రమాణమని తెల్పుటకే ఆత్మని సంవిభావ్యం అనో చెప్పఁ బడినది. వారి యపరోక్షమునకు సచ్చిదానంద మూర్తియే విషయమైనవాఁడని" స్వతేజసా" ఇత్యాది విశేషణములతో స్పష్టపఱచి నటులైనది. "విష్ణుం కపిలం" అనుటతో ఈ రెండు పదములకును అర్థమొక్కటే యని వీవరించి కపిలుఁ డు నారాయణ మూర్తియే అని నిర్ధరించినాడు. "వేదగర్భం" అనుటతో ఈ విషయమందు వేదము ప్రమాణమనియు, వేదములు నిత్యము లగుటకు

శ్రీహరి వేదగర్భుఁడనుటయే ముఖ్యప్రమాణ మనియు తెల్పిన స్థైనది.

తాత్పర్యము స్వామీ! నాకు మీ ఉపదేశఫలముగా దేహాభిమానము పోయినది. నిన్ను గుణపరిపూర్ణునిగా తెలిసికొన్నాను. సర్వోత్తముఁడని యవగతమైనది. విషయాసక్తిని వర్జించి నీయందే సంతతము మనసు నిలిపికొని ధ్యానించు వారికి మాత్రమే ప్రత్యక్ష మగుదు వనియు గ్రహించినాను. నీ సామర్థ్యము చేతనే నిత్యముక్తురా లగుటకు సాధ్య మనియు తెలిసికొన్నాను. అంతటను వ్యాపించిన వాఁడై, చిదానంద స్వరూపుఁడై, విష్ణుమూర్తియైన నారాయణుఁడే కపిల స్వరూపుఁడవైన నీవు. నిన్నిట్టుగా వేదములు తెల్పుచున్నవి. సమస్త వేదములకును తాత్పర్యమైన వాఁడవు నీవే. వేదములు నీవు ధరించి యున్న గుణగణములను గూర్చి పాడుచున్నవి. అందుచేత నీ కవి అతిప్రియములు. కనుక వాని యందు నీవు ప్రవేశించియున్నావు. వానిని విస్తరించి కాపాడు వాఁ డవు కూడ నీవే. ఇదిగో నీకు నమస్కారము" అని దేవహూతి కపిల మహర్షిని స్తుతించి నమస్కార మొనర్చినది.

9. ఈ స్తోత్రముతో దేవహూతికి కపిలమహర్షి ప్రసాద మేర్పడినది. అందుచే ఆమె ఒనర్చిన స్తోత్రము సత్యస్వరూపమైనది. కనుక దీనిని పఠించు వారికి కూడ శ్రీహరి యనుగ్రహమేర్పడఁ గలదు. ఈ స్తోత్రముతో కపిలుని ప్రసాదము సంభవించిన దనుటకు ఏమైనను గుర్తులున్నవా అని ఆశంకించి శ్రీహరి యామెతో నన్నమాటలు ఆతని ప్రసాదవిశేషము లభించిన దనుటకు గుర్తులని చెప్పుచున్నాఁడు - ఏవం=ఇట్లు, ఈడితః=స్తుతింపఁబడిన కపిలుఁ డనెడు పురుషోత్తముఁడైన శ్రీహరియు తల్లియందు వాత్సల్యము కలవాఁడై, అవిక్లబయా=దైన్యము లేనట్టి, వాచా=మాటతో, ఇతి=ముందు చెప్పఁ బోవునట్టుగా, ఆహ=పలికెను. దైన్యరహితమైన మాటయే శ్రీహరి ప్రసాదము తెలిపెడు చిహ్నమని ఇతి అనుటతో సూచింపఁ బడినది.

10. ప్రసాద విశేషమును సృష్టపఱచు చున్నాఁడు. హే=అమాతః=ఓ తల్లీ! మే=నాచేత, ఉదితేన=చెప్పఁ బడినట్టి, సుషేవ్యేణ=ముక్తి యోగ్యులైన వారితో, చక్కగా ననుసరింపఁ దగినట్టి, ఆత్మనా=నీచేత అనుష్ఠింపఁబడిన, అనేన మార్గేణ=ఈ దారితో, (ఈ ఉపాసనతో) అచిరాత్=విలంబము లేక, పరాం=నీ యొక్క యోగ్యతకు తగిన పూరమైన, కాయికాం=స్వరూపమునకు సంబంధించిన ఆనందాతిశయమును, అవరోత్స్యసి=నిత్యమై అనంతమునకు అభివ్యక్తమగు నట్టుగా చేసి కొందువు "అచిరాత్" అనుట చేత తల్లియందు కపిల రూపియైన శ్రీహరికి ఎక్కువైన ప్రసాద మేర్పడినదని తెల్పినట్లైనది.

11. నేను దీనిని ఏదో ప్రొద్దుపోవుటకు చెప్పిన మాటగా గ్రహింపకుము - తల్లియైన నీకు నే నొసఁ గు ఉపదేశముగనే తెల్పినాను. అందుచేత నీవు దీనిని వినుము. ఆస్తిక్యబుద్ధి కలదానవు కమ్మని తెల్పుచున్నాఁ డు - యత్=ఏ యీ తత్త్వజ్ఞానము, బ్రహ్మవాదిభిః=వైదికులచేత, జుష్టం=అనుసరింపఁబడినదో, అంతేకాక, యేన=ఏ యీ తత్త్వజ్ఞానము చేత, అభయం=సర్వభయరహితుఁడైన, మాం=నన్ను యాః=ఉపాసకుఁడు పొందుచున్నాఁడో, ఏతత్=దీనికి మధ్యం=నా యొక్క, మతం=మతమును, శ్రద్ధత్స్వ=ప్రమాణమని నమ్ముదానివిగా ఉండుము.

మవ్యాం=నన్నుద్దేశించి అనుష్ఠాన మొనర్చుదానివిగా అయినను కమ్మని అర్థము. "అతద్విదః"=ఇది నా మత మని తెలియని వారు, మృత్యుం=సంసారమును, ఋచ్ఛంతి=పొందెదరు. (2) అతద్విదుఃఈ నామతమునకు విరుద్ధమైన జీవ పరబ్రహ్మ లొకటే యని ఐక్యమతము నెఱిఁగి దానినే ప్రమాణమని ఉపాసించు వారు, మృత్యుం=నిత్యమరణ రూపమైన అంధంతమస్సును, ఋచ్ఛంతి= పొందెదరు.

వైదికులచేత సేవింపఁబడినదని చెప్పుటచేత ఇది తంత్రజ్ఞానము (అనఁగా పాశుపతాద్యాగమజ్ఞానము) కాదని చెప్పఁబడినది. అభయమును పొందుచున్నావు అనుటచే శ్రీహరి ప్రాప్తికి కారణము కాన వైదికమతమే ప్రయోజనమని యే చెప్పఁబడినది - అభయుఁడైన నన్ను పొందు మనుట చేత నీవు చెప్పిన "కపిలుఁడే సాక్షాత్ పరబ్రహ్మ"అనుమాట కూడ సత్యమే యని ఎఱుఁగఁబడినది.

మృత్యు మృచ్ఛంతి "నేను చెప్పిన మార్గము కంటె భిన్నమైన ఉపాసన అనర్థకారి యని స్పష్టపఱిచినాఁడు.

తాత్పర్యము : ఓయి! విదురా! పరమపురుషుఁడైన కపిల రూపుఁడైన శ్రీహరి తల్లి యొనర్చిన స్తుతి చేత తృప్తినందినవాఁడై భక్తురాలైన ఆ తల్లి యందు వాత్సల్య యుక్తుఁడైనాఁడు. ఆమె ననుగ్రహించుచు వైకల్య రహితమైన వాక్కులతో ఇట్లన్నాఁడు - అమ్మా! నేను చెప్పిన ఈ మార్గము ముక్తి యోగ్యులై భక్తి పూరితులగు వారిచేత సేవింపతగినది. ఈ మార్గమును నీవు కూడ అనుష్ఠింపుము. శీఘ్రకాలముననే నీ యోగ్యతకు తగినట్లు పూర్ణమైన నీ స్వరూపానందాతిశయము అభివ్యక్త మగును. అది నిత్యముగా ఉండును. నే నుపదేశించిన ఈ మతము తాంత్రికమైనదని భ్రాంతి చెందకుము. వైదికు లనుష్ఠించెడు వేదమతమే ఇది. ఇట్లు పాసించు వాఁడు సర్వభయరహితుఁడై, అభయ ప్రదాన మొనర్చెడు నన్ను పొందును. ఈ నాయుపదేశము సర్వప్రామాణికమైన దని నమ్ముము. ఇట్లు నమ్మక ఉపాసించువాయ సంసారమందే స్థిరముగా నుందురు. ఏతద్విరుద్ధమైన ఐక్యమతము ప్రామాణికముగాఁ దెలిసి ఉపాసించువారు అంధం తమస్సునెడు నిత్యమృత్యురూపమైన నరకము నందెదరు:

12. దేవోత్తముఁడైన శ్రీహరి దేవతాజాతికి చెందినవాఁడ గుటవలన "దేవతలకు మనుష్యులు బహుకాలము వసించుట ధర్మము కాదని తెలియుట వలన ఆపై ఏమి యొనర్చెనని తెలుపుచున్నాఁడు - కపిల రూపియైన భగవంతుఁడు ఇతి=శ్రీహరి యొక్క అత్యుత్తమ ప్రసాదమునకు కారణమైన పైన చెప్పఁబడిన ఉశతీం=మోక్షము మొదలైన సమస్తాభీష్టముల నొసఁగునట్టి, ఆత్మనఃపరమాత్మకు సంబంధించిన, గతిం=జ్ఞానమును, ప్రదర్శ్య=తల్లియైన దేవహూతికి ఉపదేశమార్గముగా చూపించి లేక తల్లికి నమ్మకమును కలిగించుటకై ప్రాసంగికముగా తన స్వరూపస్థితిని తోపించి బ్రహ్మవాదిన్యాం=బ్రహ్మజ్ఞానియైన, స్వమాత్రాం=తన తల్లియైన దేవహూతి చేత, అనుమతఃసమ్మతిని గొన్నవాఁడై. యయౌ=ఆశ్రమమును వదలి వెళ్ళెను! బ్రహ్మవాదిన్యా" అనుట

చేత తన కపేక్షితమైన జ్ఞాన ముపదేశించిన గురువు గనుక - తనకు కొడుకై జన్మించి ప్రేమాస్పదుఁడును అయిన కపిలునకు అనుమతి యొసఁగిన దేవహూతి దయలేని మనస్సు కలదికదా అను ఆశంక కుత్తరమిచ్చినట్లైనది. బ్రహ్మజ్ఞాని. కపిలుని యొక్క విరహము అపరిహార్యమని ఆమెకు తెలియును. కాని సర్వవ్యాపియైన కపిలుఁడు తనయందే ఉన్నాఁడు. ఈ విషయము కూడ ఆమెకు విదితమే. అందుచేతనే కపిల మహర్షి పోవుటకు సమ్మతించెను.

13. అయినను ఆమెకు ఎక్కువ దుఃఖము కాలేదని సూచించుచున్నాఁడు. సాచ=ఆ దేవహూతియు ఇరువదియవ శోకమైన "కించిచ్చకారవదనం" అనుటతో దీని కన్వయము. సరస్వతీ నదీతీరమందున్న ఆ ఆశ్రమ మందు, ఆసీనా=ఉండుట చేత, సమాహితా=సమాధాన యుక్తమైన, తన యోక్తేన=కుమారుఁడుపదేశించిన, యోగాదేశేన=జ్ఞానమనెడు ఉపదేశము కారణముగా, యోగయుక్=ఏర్పడిన సమాధానమునకు ఫలముగా యోగయుక్తురా లైనది.

తాత్పర్యము : విదురా! కపిలుఁడు తల్లి కుపదేశించిన ఈ పరమాత్మ జ్ఞానము శ్రీహరి యొక్క అత్యుత్తమమైన ప్రసాదమునకు కారణభూతమైనది. మోక్షము మొదలైన సమస్తాభీష్టములను దయచేయునది. దీనిని తల్లి కుపదేశించిన కపిలుఁడు ఆమెకు తన యందు నమ్మకమునకై తన శరీరస్థితిని కూడ తోపింపఁజేసెను. బ్రహ్మవాదినియైన ఆమె నుండి అనుమతిని పొంది ఆతఁడు ఆశ్రమము వదలినాఁడు బ్రహ్మజ్ఞానియైన దేవహూతి కపిలుని విరహము అపరిహార్యమని తెలిసికొన్నది అంతర్యామిగా ఆతఁడు తన యందే ఉన్నాఁడని ఆమె ఎఱిఁగినది. అందుకే ఆమె యనుమతి నొసఁగినది. దేవహూతి సరస్వతీ నదీతరమందున్న ఆయాశ్రమమున నివసించినది. పుత్రుఁడుగా జన్మించిన కపిలరూపియైన శ్రీహరి ఉపదేశించిన జ్ఞానోపాయ ఫలముగా దేవహూతి మనస్సు సమాధానముతో కూడినది.

14. ముందు చెప్పినట్లు అంతశ్శుద్ధియేకాక బాహ్యశుద్ధికూడ ఉండిన దనుచున్నాఁడు - అభీక్ష్ణావగాహ కపిశాన్=నిత్యము స్నానమొనర్చుటచే ఎఱుపు మఱియు పసుపురంగు కలిగి యున్న దీనినుండి తీసి మొదలైన కాలము లందు మాత్రమే స్నాన మొనర్పవలెను ముత్తెదువలు అనుభావము వదలి ఉండినదని భావము జటిలాన్=జడలు కట్టిన, కుటిలాలకాన్=వక్రములైన ముంగురులను, చీరిణం=మలినములై చినిగిన గుడ్డతో కూడిన, ఉగ్రతపసా=కఠినమైన తపస్సు చేత, కృశం=కృశించిన ఆత్మానం=శరీరమును, బిభ్రతీ=ధరించినది.

15, 16, 17, 18, 19, 20. కర్దమ ప్రజాపతియొక్క, తపోయోగ విజృంభితం=తపస్సుతో, యోగనిద్ధిచేత అతిశయముగా నిర్మితమైన, అనౌపమ్యం=పోలికలేని, మైమానికైః అపి=దేవతలచేతనే, ప్రార్థం=అపేక్షితమైన, యత్ర=ఏగృహాస్థస్థితియందు, దాంతాః=ఏనుఁగుల దంతముతో నిర్మింపఁబడినట్టియు రుక్మపరిచ్ఛదాః=బంగారు అలంకారము లున్నట్టియు పయః ఫేననిభాః=పాలు, ఫేనమువలె తెల్లగా మృదువుగా ప్రకాశించునట్టి, శయ్యాః=పడుకలు, సుస్పర్శాస్తరణాని=సుఖముగా నుండునట్లు మెత్తని పై గుడ్డలు కలిగిన, హైమాని=బంగారు, ఆసనానిచ=ఆసనములు, (సంతి=ఉన్నవో) స్వచ్ఛస్ఫటిక కుడ్యేషు=నిర్మలమైన

స్ఫటిక శిలలతో కూడిన గోడలపైన, చ=మఱియు, మహామరకతేషు=ఇంద్ర నీలముల గోడలందు లలనారత్నసంయుతాఃతయారు చేయఁ బడిన స్త్రీ రత్నముల చేతులందు కూడినట్టియు. రత్నదీపార్చిషా=రత్నములనెడు దీపముల జ్వాలను, భాంతి=ప్రకాశింపచేయునదియు, కుసుమితైఃపుష్పితములైన, బహ్వీమర ద్రుమైఃఅనేకములైన మందారాది బహువృక్షముల చేత, రమ్యం=మనోహరమైనది, కూజద్విహంగ మిథునం=కూయుచున్న మగ పక్షులు కలినట్టియు, గాయన్మత్త మధువ్రతం=ఝంకరించుచున్న మదించు తుమ్మెదల తోకూడిన, గృహోద్యానం= ఇంటి యొక్క ఉపవనము, భాతి=ప్రకాశించుచున్నదో, యత్ర=ఏ ఉద్యానమందు, ఉత్పలగంధిన్యాం=నల్లకలువల గంధముతో కూడిన, వాప్యాం=సరస్సు నందు, ప్రవిష్టం=ప్రవేశించిన కర్దమని చేత, ఉపలాలితం=కర్దమని గూడి లాలనలు పడసిన, ఆత్మానం=తనను (దేవహూతిని) విబుధానుచరాఃగంధర్వులు, జగుఃగాన మొనర్చిరో అట్టిగృహోద్యాన మెక్కడ ప్రకాశించుచున్నదో, ఆఖండల యోషితామపి=ఇంద్రుని అంతఃపురమునకు కూడ, ఈ ప్రిత తమం=అత్యంత మపేక్షితమైన, తత్=ములోకములయందు ప్రసిద్ధమైన, స్వగారస్యం=తన గృహస్థభావమును, హిత్వా=గడ్డిపోచవలెవదలి, దుఃఖింపని దేవహూతి, పుత్ర విశేషణాతురా=పుత్రవిశేషణముతో ఆతురురాలై, కించిత్=కొంచెముగా (కళా విహీనముగా) వదనం చకార=ముఖమును చేసికొన్నది-అపి=ఇదిలోకమునందు సంభావితమే. ఆమె యొక్క గృహస్థత దేవతల చేత అపేక్షితమైన దనుటకు దాని యొక్క అనౌపమ్యమే కారణము. అట్టి నిస్సమానతకు కర్దముని తపస్సు హేతువు. అట్టి సమృద్ధమైన గృహమును కూడ త్యాగ మొనర్చుటకు దుఃఖము కారణము కాదు. మరి ఆమె వైరాగ్యమే కారణము. కపిలుని విరహముతో బాధపడుటకు ఆమె కాతని యందున్న భావనయే కారణము.

21. మగని ఎడబాటుతో ఏర్పడిన దుఃఖము కంటెను కుమారుని విరహమే దుస్సహ మైనదని పై చెప్పిన విషయమునే వివరించుచున్నాఁడు. వత్సలా!=వాత్సల్యపూర్ణురాలైన దేవహూతి! జాతతత్త్వా అపి=తత్త్వజ్ఞానియైనను, పత్యౌ=పతియైన కర్దముఁడు, వనం=అరణ్యమును, ప్రవ్రజితే సతి=పొందినవాఁడగుచుండఁగా, అపత్యవిరహాతురా=పుత్రుని విరహముచేత, దుఃఖపడుచున్నదై, నష్టవత్యాఃదూడను పోఁగొట్టుకొన్న, గౌరివ=పశువువలె, అభూత్=దుఃఖితురాలైనది.

22. అట్లైనచో పుత్రవిరహముతో కలిగిన దుఃఖము తపోభంగమునకు కారణమైనదా వివరించుచున్నాఁడు-తం=తనకు ఆ రీతిగా తత్త్వజ్ఞానము నుపదేశించిన అపత్యం=కుమారుఁడైన, కపిలం= కపిలమహర్షిని, దేవం=క్రీడాది గుణవిశిష్టుఁడైన; హరింఏవ=శ్రీహరిగనే, ధ్యాయతీ=ధ్యానించు చున్నదై, లేక ఇంపవ=కపిలునే ధ్యానించుచున్నదై, తాదృశే గృహే=అంతటి సంపత్తుతో సమృద్ధమైన ఇంటి యందు, విరతోత్సాహా=ఉత్సాహము లేనిదై, నిస్పృహా=నిరాశతో కూడినదై, బభూవ=ఉండెను. కపిలునే ధ్యానించుచు తక్కిన విషయముల ధ్యానమును వదలిన దని చెప్పుట చేత "ఏవ" కారముతో సూచితమైన కపిలభిన్నమైన వస్తువు లేదని చెప్పినట్లైనది.

23. పుత్రవియోగముతో భ్రాంతమైన మనస్సు కల దేవహూతి పుత్రుఁడుపదేశించినది వేఱు. తా నుపాసించునది వేఱు అన్నచెనదా? దానికి బదులు చెప్పుచున్నాఁడు- యత్=ఏ భగవద్రూపం=శ్రీహరి రూపమును, ధ్యానగోచరం=ధ్యానమునకు విషయముగా, అహం=చెప్పెయుండెనో, తత్పిం=అట్టి, ప్రసన్నవదనం=ప్రసన్నమైన ముఖముకల, సుతుం=పుత్రుఁడైన కపిలుని, సమస్త వ్యస్తి చింతయా=సంపూర్ణ స్వరూపమును ధ్యానించుట చేత, ఒక్కొక్క అవయవమునే ధ్యానించుట చేత ధ్యాయతీ=ధ్యానమొనర్చు నదిగా, బభూవ=అయ్యెను.

24, 25. ఆ ఉపాసనా ఫలమును చెప్పుచున్నాఁడు. సా=ఆ దేవహూతి, భక్తి ప్రవాహ యోగేన=శ్రీహరియే సర్వోత్తముఁడని జ్ఞానముతో కూడిన నిరతిశయ ప్రేమ అనెడు భక్తి యొక్క సంతత ప్రవాహరూపమైన ఉత్తమోపాయమైన, బలీయసా=స్వర్గము మొదలైనవి పురుషార్థములని చెప్పెడు శాస్త్రార్థముల శ్రవణము చేత మోహము గొన్న బుద్ధి లేకుండు నని అత్యంతము బలము గలి నట్టి, వైరాగ్యేణ=జగత్తు యొక్క అసారతా జ్ఞానముతో, యుక్తానుష్ఠానముతో, జాతేన= విహితమైన అఖండ ధ్యానము తో నేర్పడిన, బ్రహ్మవేదినా=పరబ్రహ్మ ప్రసాదమునకు కారణమైన, విశుద్ధేన=నిర్మలమైన, అనఁగా జీవబ్రహ్మలు ఒకటే ననీ, లేక ఒకటి యేనో ఏమో అనెడు సంశయము నుండి విడివడిన, దోషహీనమైనట్టి, జానేన=జ్ఞానముతో, తదా=అప్పుడు, ఆత్మనా=స్వరూప మనస్సుతో, ఆత్మానం=తనబింబ స్వరూపమైన, విశ్వతఃముఖం=సర్వజ్ఞఁడైనటియు, స్వానుభూత్యా=స్వాభావికమైన తన అనుభవము చేత తిరోభూతమైన మాయాగుణవిశేషణం=పోఁగొట్టఁబడిన ప్రాప్తగుణములైన సత్త్వాది గుణములచే నేర్పడిన దేహ బంధరూపమైన విశేషణము కలిన అనఁగా స్వాభావికముగా ప్రాకృత సంబంధరహితుఁడైన, హరిం దదర్శ=శ్రీహరి నపరోక్షీకరించు కొన్నది "బ్రహ్మవేదినా" అని మఱియొక్క పాఠమున్నది. అపుడు బ్రహ్మ వశీకరణా యుధమైన అని మఱియొక అర్థము "జ్ఞానేన" అనుటకు విశేషణము.

26, 27. అపరోక్షజ్ఞానమైన తరువాత ఆ పొందినసితిని చెప్పుచున్నాఁడు -ఆ దేవహూతి యదా=ఎప్పుడు శ్రీహరిని చూచినదో, తదా=అప్పుడు, ఆత్మసంశయే=తన్నుతానే ఆశ్రయించి యున్న, భగవతి=ఐశ్వర్యాది గుణపూర్ణుడైన, బ్రహ్మణి=కాలదేశములు, ఇంకను గుణములు వీనిచేత వ్యాపింపఁబడిన శ్రీహరి యందు, అవసితమతిః=స్థిరమైన ఏకాగ్రమనస్సు కలదై, నివృత్త జీవాపత్తిత్వాత్=లింగశరీరాభిమానము (తత్తయుక్తమైన అభిమానము) ఇది లేకపోవుట చేత, వీతక్లేశ =దుఃఖము లేనిదై, అప్తనిర్వృతిః=పరమానందమును పొందినదై, నిత్యారూఢ సమాధి త్వాత్=నిరంతరమును శ్రీహరియందే ఉంచిన మనస్సు కల దగుటచేత, పరావృత్తగుణభ్రమా=శబ్దాది దుఃఖ జనక విషయము లందు సుఖజనకము లనెడు భ్రాంతి లేనటిదై, ఉత్థితః=స్వప్నము నుండి పైచ్చరికగొన్నవాఁడు స్వప్నదృష్టం ఇవ=స్వప్నమందు చూచిన దానిని తలఁచి కొనక యుండునట్లు, ఆత్మానం=తనదేహమును, నసస్మార=స్మరింపలేదు. స్వప్నోత్థితుఁడైన వానికి జీవత్వ నివృత్తి (అనఁగా జీవోపాధి భావము) కాలేదు కనుక పై చెప్పిన నివృత్తజీవభావత్వమునకు ఈ ఉదాహరణము

యుక్తము కాదు కదా? అని శంక. కాని సమస్తజీవులకును ముక్తి యగునంత వఱకును జీవోపాధులు ఉండనే ఉండును. కాని అవి నిష్ఫలము లైనపుడు లేవనియే చెప్పవలెను కదా? అట్లు ఇచ్చటను నిష్ఫలము లగుట చేత జీవోపాధి, శూన్యురాలైన ప్రతివ్యక్తి దీనిని తెలుపుటకే ఈ ఉదాహరణము. జీవునకు స్వరూపోపాధి, జీవోపాధి యని ఉపాధులు రెండు తెఱఁగులు. స్వరూపోపాధి ముక్తావస్థ యందు కూడ ఉండనే ఉండును. బాహ్యోపాధు లనఁగా లింగశరీర కామికర్మాదులు. ఇవి నిష్ఫలము లైనపుడు లేవనియే చెప్పవచ్చును కదా! ఇది జీవన్ముక్తావస్థ. ముక్తిలో నిది సంపూర్ణముగా పోవును. ఇది ముక్తావస్థ. ఈ రెంటిని "నివృత్త జీవభావత్వాత్" అనుట చేత గ్రహింపవలసి ఉండును "జీవోపాధి ప్రభృతయః ఆముక్తే స్సర్వదేహినామ్, నియమాత్యంత్యభావస్తు నిష్ఫలత్వా దుదీర్యతే." అనెడు ప్రమాణము ఈ యర్థమును సృష్టపఱచుచున్నది. స్వప్నోత్థితుని ఉదాహరణము ఈ స్మృత్యర్థ ముని సూచించుటకు వాడఁబడిన దనియు తెలియవలెను.

28. అపరోక్ష జ్ఞానము ఏర్పడిన తరువాతనే ఈ యవస్థ కలినదని చెప్పుచున్నాఁడో- యస్యే=ఏ దేహము యొక్క, పోషః=పోషణ, ఆపగతిః=లేక యుండినదో, అపి=అయినను, యఃచ=ఏ దేహము, ఆద్యసంభవాత్=శరీరకృశతకు కారణమైన మనోదుఃఖము లేకపోవుట చేత, అకృశః=కృశమైనది కాలేదో, "అకృతశ్చ" అనెడు పాఠమందు విహితమైన స్నానాదులు లేనట్టి (2) ప్రారబ్ధ కర్మ ముగియనట్టి అని అర్థము. సఃఅట్టి, తదేహఃఆ దేవహూతి దేహము, మలైఃముఱికి మొదలైన వానిచేత, ఆవచ్ఛిన్నఃసన్=కప్పఁబడినదై, సధూమఃపొగతో కూడిన, పావకఃఇవఅగ్నివలె, బభౌ=ప్రకాశించెను.

తాత్పర్యము : ఈ రీతిగా దేవహూతి దుఃఖాక్రాంత యయ్యును శ్రీహరి యొక్క యుపాసనను వదల లేదు. తనకు తత్త్వోపదేశ మొనర్చిన కపిలమహర్షినే శ్రీహరియని ధ్యానించుచు గృహసుఖములందు ఆశ లేని దైనది. భగవంతుని ఉపదేశము ననుసరించి శ్రీహరి యొక్క స్వరూపుఁడైన - పుత్రరూపియైన కపిలునే మనస్సునందు ధ్యానించు చుండెను. ఒక్కొక్కసారి యాతని సమగ్రరూపమును ధ్యానించుచుండెను. ఈ రీతిగా శ్రీహరియే సర్వోత్తముఁడనెడు ధ్యానముతో కూడియున్న దేవహూతి భక్తి ప్రవాహమువలె నిరంతరము పాఱఁ దొడఁగెను. స్వరాదిసుఖములు పురుషారములు కావని ఆమె ఎఱుంగును. జగత్తే అసారమను భావము దేవహూతి హృదయమందు బలీయమై నెలకొన్నది. శాస్త్రార్థనిశ్చయము గొప్పగా నుండుట చేత జీవబ్రహ్మ లొక్కటే యనుభ్రాంతి ఆమెకు లేదు. ఒక్కటేనా? యను సందేహము కూడ లేదు. ఇట్టి శ్రీహరి విషయకమైన శుద్ధజ్ఞానము అఖండ జ్ఞాన మామె కేర్పడినది. ఇట్టిజ్ఞానమే పరమాత్ముని ప్రసాదమునకు కారణభూతమైనది. భగవంతుఁ డామెకు ప్రసన్నుఁడై తన చిదానందరూపము నామెకు చూపెను. దేవహూతి తన స్వరూపమనస్సుతో బింబరూపియైన శ్రీహరిని దర్శించినది: సర్వజ్ఞుఁడు, స్వాభావికముగా స్వానుభవముతో ప్రకృతి గుణ రహితుఁడు అయిన శ్రీహరి అపరోక్షమున కన్నను ఉత్తమమైన వేరు పురుషారము లేదు. బింబా పరోక్షము నందిన దేవహూతి జీవన్ముక్తావస్థ యం దుండెను. తనకు తానే ఆశ్రయము, సర్వజ్ఞపరిపూర్ణుఁ డు కాలదేశాది గుణము లందు వ్యాపించిన వాఁడైన

శ్రీహరి యందు ఆమె మనస్సు ఏకాగ్రమై స్థిరమై ఉండెను. లింగశరీరమున్నను తత్తయుక్తమైన శరీరాభిమానము పోవుచున్నదాని వలన బాహ్యమైన జీవోపాధి దేవహూతి కుండలేదు. శరీరాభిమానమే లేనపుడు దుఃఖ మెచ్చట నుండి వచ్చును? ఆమె పరమానంద మగ్నురాలై ఉండెను. నిరంతరము శ్రీహరినే ధ్యానించు దేవహూతికి శబ్దాది సుఖకరము లనెడు భ్రాంతి సంపూర్ణముగా నాశ మయ్యెను. స్వల్పమందు మేల్కొన్నవాఁడు నశ్వరములైన స్వల్పపదార్థముల నపేక్షించినట్లు తనదేహాపేక్షను వదలి భౌతిక దేహమును లెక్కగొనక యున్నది. ఆమెదేహమున్ ఏవిధమైన పోషణ లేకున్నను కృశింప లేదు. మనోవ్యథ కవకాశము లేనప్పుడు శరీరము కృశింపదు. ధూళితో కూడిన ఆమె దేహము పొగచేత కూడిన అగ్నివలె లోలోన ప్రకాశించుచున్నది.

29. ఆమెకు శరీరాభిమానము వదలినది. అందుచేత మనోదుఃఖము లేదని ఊహించవచ్చు నను చున్నాఁడు- వాసుదేవ ప్రవిష్టధీఃవాసుదేవునియందే ప్రవేశించినటి మనస్సు కలిన, సా=ఆ దేవహూతి, తపోయోగమయం=తపస్సనెడు సాధన చేత పూర్ణమైనటి, ముక్తకేశం=విడివడిన వెండ్రుకలు కలదియు, గతాంబరం=వస్త్రము కూడ లేనటిదియు, దేవగుప్తం=శ్రీహరి చేతనే రక్షింపఁ బడుచున్న, స్వాంగం=తన దేహమును, న బుబుధే=అభిమాన పూర్వకముగా తెలియలేదు.

పోషణ లేకున్నచో దేహమెట్లు మిగిలినది అనుటకు సమాధానమిది. "దైవగుప్తము" అనుట. భగవంతుని చేత రక్షిత మనుటకు కారణము "వాసుదేవ ప్రవిష్టధీఃఁ" అనునది.

30. వినుటకు సుఖకరముగా ఉన్నను ఈ దేవహూతి కథా ప్రసంగము ముగియు మొప్పుడు అనెడు ఆజ్ఞజనుల ఆశంకను పరిహరించువాఁడై ప్రారబకర్మముగిసిన యనంతరము ఆ దేహము కూడ వినాశమైనదని చెప్పుచు దేవహూతి శ్రీనారాయణ మూర్తిని పొందినదని తేల్చి వేయుచున్నాఁడు. - ఏవం=ఇట్లు, ప్రారబ్ధ కర్మనశించిన తరువాత దేహము వినాశము నందగా, సా=ఆ దేవహూతి, కపిలోక్తేన=కపిలమహర్షి ఉపదేశించిన, మార్గేణ=పద్ధతితో ధ్యాన మొనర్చి, అచిరతః=అంతటను వ్యాపించి యున్న, ఆత్మానం=సర్వస్వామి యైన, నిర్వాణం=ప్రకృతి యైనను ప్రాకృతమైనను, శరీరము, లేనట్టి, సుఖశరీరేణ=భగవంతం=నిరవధికైశ్వర్య శాలి యైన, పరం=సర్వోత్తముఁడైన, బ్రహ్మ=గుణ పూర్ణుడైన నారాయణుని, అవాప=పొందినది.

ఇక మీఁద ముక్తిని పొందునని భావము. ఆ దానితో దేవహూతి వృత్తాంతము ముగిసినది.

31. ఆ క్షేత్రము ఇంతకు ముందు శుకనామకుఁడైన శ్రీహరి యొక్క అశ్రుబిందువు రాలుటచేత బిందు సరస్సనిపిలువ బడుచుండెను. ఇపుడు దేవహూతి తపస్సిద్ధికి కారణ మగుట చేత సిద్ధపదమని వేఱొక పేరు పొందినదని చెప్పుచున్నాఁడు వీర=ఓ వీర! యత్ర=ఏ క్షేత్రమందు, సా=ఆ దేవహూతి, సంసిద్ధిం=భగవద పరోక్షమును, ఉపేయుషీ=పొందినదో, తత్=ఆ, పుణ్యతమం=అత్యంతపవిత్రమైన, నామ=పేరుచేత, సిద్ధపదం=సిద్ధ పదము

లేక 'మాతృగయ' అనెడు క్షేత్రం=పుణ్యభూమియై, త్రైలోక్య విశ్రుతం=ముల్లోకములందు ప్రసిద్ధముగా, ఆసీత్=అయినది.

32. దేవహూతి వర్ణించిన శరీరము శునకాదుల పాలై ఉన్నచో జనులకు హితరమైన క్షేత్రమని ప్రశంసించుట వ్యర్థమై ఉండెడిది. అందుచేత ఆ దేహ మేమైనదో తెల్పుచున్నాఁడు - సౌమ్య=ఓయి విదురా! యోగవిధుతం=యోగాభ్యాసముచేత వదలఁబడిన, తస్యాఃఆ దేవహూతియొక్క మర్త్యం=ఆ మరణ ధర్మము గల శరీరము, ఆశు=వెంటనే, సిద్ధసేవితా=సిద్ధులైన వారిచేత స్నానాదులయం దుపయోగింపఁబడిన, సిద్ధదఃతపస్సిద్ధి నందించెడు, స్రోతసాం ప్రవరా=సర్వోత్తమమైనట్టి, సరిత్=కపిలానది యను పేరుతో, అభూత్=లోకప్రసిద్ధమైనది.

"మాతస్త్వం కపిల స్యాద్య కపిలా నామత శ్శ్రువే,
మమాపి దేహ సార్థక్య మంతతః కురు భావిని."

అనెడు కపిలా మాహాత్మ్యమందలి వచన మనుసరించి పెద్దలు దేవహూతియే కపిలానదియను పేరు గల దైన దని అందురు.

33. ఇంతకు ముందు కపిల మహర్షి పోయినాఁడని చెప్పఁబడినదే కాని ఎచ్చటి కనుట చెప్పఁబడలేదు. ఇపుడు దానిని తెలియపఱచుచున్నాఁడు మహాయోగి=పూర్ణజ్ఞాని భగవంతుఁడునైన కపిలుఁడు కూడ, పితుఃతండ్రియైన కర్దమని ఆశ్రమము నుండి, మాతరం=తల్లియైన దేవహూతిని, సమనుజ్ఞాప్య=ఒప్పించి, ప్రాగుదీచీందిశం=ఈశ్వర రక్షితమైన ఈశాన్య దిక్కునకు యయౌ=పోయెను.

34, 35. సిద్ధులు చారణులు గంధర్వులు ఋషులు అప్సరస్సమూహము వీరిచేత, స్తూయమానఃపొగడఁబడుచున్న వాఁడై, సముద్రేణ=సముద్ర రాజైన వరుణుని చేత, దత్తార్ణనికేతనఃపూజ, నివాసస్థానమును పొందినవాఁడై, సాంఖ్యాచార్యైఃయథార్థజ్ఞాన ముపదేశించు సనకాదీ యోగీశ్వరులచేత, (2) బ్రహ్మాది దేవతల చేత, అభిష్టుతఃస్తోత్ర మొనర్పఁబడినవాఁడై, ముల్లోకముల, ఉపశాంత్యైమంగళము కొఱకై, యోగం=ధ్యాన రూపమైన ప్రాణాయామ రూపమైనయోగమును, సమాస్థాయపొంది, సమాహితఃఏకాగ్ర చిత్తముతో, ఆస్తే=ఉన్నాఁడు. మూఁడు లోకముల కల్యాణము శ్రీహరి యోగమునకు ఫలము. స్వప్రయోజనమునకై కపిలముని యోగస్థితుఁడు కాలే దని చెప్పనక్కరనది. మైత్రేయుఁడు విదురుని సంబోధించుచు అతని ప్రశ్నకు ఉత్తరమును ముగించుచున్నాఁడు. తాత=ఓవత్స! అనఘ=అశ్రద మొదలైన దోషములు లేని విదురా!. త్వయా=నీ చేత, అహం=నేను, యత్=ఏ కపిల దేవహూతి సంవాదము, పృష్టఃఅడుగఁబడితిమో, తదేతత్=ఆ సంవాదరూపమైన విచారము, నిగదితం=నాచే చెప్పఁ బడినది. కపిల దేవహూతులకు జరిగిన, సంవాదఃసంభాషణ, పావనఃపవిత్రమైనది, చదేవహూతికి మాత్రమే కాదు ఇతర ముముక్షు జీవులకును సిద్ధికి కారణ మైనది.

37. శ్రోతలు వక్తలు మొదలైన వారికి ఈ కథ యందు వ్యగ్రత ఏర్పడుటకు గాను శ్రవణాదులతో కల్గెడు ఫలమును చెప్పుచున్నాఁడు -

సువర్ణకేతౌ=గరుడ ధ్వజుఁడైన, భగవతి=శ్రీహరి యందు, కృతధీఃమనస్సు నుంచిన, యఃఏ అధికారియైన చేతనుఁడు, ఆత్మ యోగ గుహ్యం=పరమాత్మను పొందెడు సాధనములైన జ్ఞానోపాయములందు పరమ రహస్యమని పించుకొన్న, ఇదం=ఈ పైన చెప్పిన కపిలమునేఃకపిలరూపమైన శ్రీహరి యొక్క మతం=అభిప్రాయమైన తత్త్వజ్ఞానమును, అనుశృణోతి=నిత్యమును జాగరూకతతో మనన పూర్వకముగా వినుచున్నవాఁడో, యఃఎవఁడు, అభిధత్తే=అత్యంతనిష్ఠతో, ఉపదేశములెలె చెప్పుచున్నవాఁడో, తా నుపదేశించెడు పద్ధతి సరిగా అభ్యాస మొనర్చుచున్నవాఁడో, సఃచ=వక్తయు, శ్రోతయు=ఇరువురును, భగవత్పదారవిందం=శ్రీహరిపాదకమలమును, ఉపలభతే=అపరోక్షీకరించు కొనుచున్నారు. శ్రీహరి కూడ ఆతని యందు పరమాను గ్రహమును చూపించుచు తన్ను వానికి సాక్షాత్కరింపఁజేయుచున్నాఁడు.

ఇతి శ్రీమద్భాగవత తృతీయ స్కంధే సుధాలహరీ
వ్యాఖ్యాయాం చతుస్త్రింశో ధ్యాయః.

అధ్యాయము - 33

సీ. అనయంబు వినుమింద్రియారమనోమయం
బును భూత చయమీయంబును సమస్త
భూరి జగద్బీజ భూతంబును గుణ ప్ర
వాహ కారణమును వలను మెఱయు
నారాయణాఖిల్య నాఁ గల భవదీయ
దివ్యమంగళమూర్తిఁ దేజరిల్లు
చారు భవదర్చ సంజాతుఁడగునట్లి
కపిలగర్భుండు సాక్షాత్కరింప 1018

తే. లేక మనములఁ గనియె ననేక శక్తి
వరములు గల సుగుణ ప్రవాహ రూప
మంది విశ్వంబు దాల్చి సహస్ర శక్తి
కలితుఁడై సర్వకార్యముల్ గలుగఁ జేయు. 1019

వ. 1020

తే. అతుల భూరి యుగాంతంబునందుఁ గపట
శిశువవై యొంటిఁ గుక్షి నిక్షిప్త నిఖిల
భువన నివహుం డవై మహాంభోధి నడుమఁ
జూరు వటపత్ర తల్ప సంస్థాయి వగుచు. 1021

తే. లీల నాత్మీయ పాదాంగుళీ వినిర
ర్తామృతము గ్రోలినటి మహాత్మ! నీవు
గణఁగి నా పూర్వభాగ్యంబుకతన నిపుడు
పూని నా గర్భమున నేఁడు పుట్టితయ్య! 1022

వ. అట్టి పరమాత్ముండ వైన నీవు. 1023

సీ. వరుస విగ్రహ పారవశ్యంబునను జేసి
రఘురామ కృష్ణ వరాహ నార

సింహాది మూర్తి లంచిత లీల ధరియించి
దుష్టనిగ్రహమును శిష్టపాల
నమును గావింపుచు నయమున సదర్మ
నిరత చిత్తులకు వరింపఁదగిన
చతురాత్మ తత్త్వ విజాన ప్రదుండవై
వర్తింతు నభో! భవ నృహత్త్వ

తే. మజున కైనను వాక్కువ్వ నలవిగాదు
నిగమజాతంబు లైన వరింప లేవ
యెఱిఁగి సంస్తుతి సేయ నే నెంతదాన?
వినుత! గుణశీలమాటలు వేయునేల? 1024

వ. అదియునుం గాక 1025

క. ధీమహిత! భవ న్మంగళ
నామస్మరణాను కీర్తనము గల హీనుల్
శ్రీమంతు లగుదు రగ్గి
ష్టోమాది కృదాళి కంటె శుద్ధులు దలఁ పన్ 1026

వ. అదియునుం గాక 1027

క. నీ నామస్తుతి శ్వపచుం
డైనను జిహ్వాగ్రమందు నను సంధింపన్
వానికి సరి భూసురుఁడున్
గానేరఁడు చిత్ర మది జగంబుల నరయన్. 1028

ఉ. ఈ విధ మాత్మలం దెలిసి యెప్పుడు సజ్జన సంఘముల్ జగ
త్పావనమైన నీగుణకథామృత మాత్మలఁ గ్రోలి సర్వ తీ
రావళిఁ గ్రుంకినట్టి ఫల మందుదు రంచు సమస్త వేదముల్
వేవిరిఁ బల్కుఁ గావునను వారలు ధన్యులు మాన్యు లుత్తముల్. 1029

వ. అది గావునఁ బరబ్రహ్మంబవు, పరమ పురుషుండవు, ప్రత్యగ్జ్యో
విభావ్యుండవు, సమస్తజన పాపనివారక స్వయంప్రకాశుండవు,
వేదగర్భుండవు, శ్రీమహావిష్ణుండవు నగు నీకు వందనంబు లాచరించెద.
అని స్తుతియించినఁ బరమపురుషుండు మాతృవత్సలుండు నగు కపిలుండు
కరుణారస సాంద్ర హృదయ కమలుండై జనని కిట్లనియె. 1030

తే. తవిలి సుఖరూపమున మోక్షదాయకంబు
నైన యీ యోగమార్గ మే నంబ! నీకు
నెఱుఁగ వివరించి చెప్పితి నిది దృఢంబు
గాఁగ భక్తి ననుష్ఠింపు కమలనయన! 1031

క. జీవన్ముక్తి లభించుం
గావున నేమఱక తలఁపుఁ గైకొని దీనిన్
వావిరి నొలని వారికిఁ
దావల మగు మృత్యుభయము దవ్వగు సుఖమున్. 1032

క. అని యిట్లు దేవహూతికి
మన మలరఁగఁగపిలుఁ డాత్మ మార్గము నెల్లన్

వినిపించి చనియె నని విదు
రునకున్ మైత్రేయ మునివరుం డెఱిఁగించెన్. 1033

వ. అట్లు కపిలుం డేగిన పిదప దేవహూతియుం బుత్రుండు చెప్పిన యోగ మార్గంబున విజ్ఞానంబు గలిగి యుండియుం బెనిమిటియైన కరమునిం దీనయుండైన కపిలునిం బాసి, నష్టవత్సయగు చందంబునఁ దల్లడిల్లుచు, గపిల మహాముని దలంపుచుం గడుఁ దపస్సామర్థ్య జనితంబైన యట్టి 1034

ఉ. మానిత సౌరభ ప్రసవ మంజుల పక్వఫల ప్రవాళ భా
రానత చూతపోత విటపాగ్ర నికేతన రాజకీర స
మ్మానితరానులాప పరిమండిత కర్దమ తాపసాశ్రమో
ద్యాన వనప్రదేశ కమలాకర తీర నికుంజ పుంజముల్. 1035

వ. వెండియు 1036

సీ. అంచిత స్ఫటికమయ స్తంభ దీప్తిచేఁ
గొమరారు మరకత కుడ్యములను
సజ్జాతి వజ్రాల సజ్జాలక రుచుల
భాసిల్లు నీల సోపానములను
దీపించు చంద్రకాంతోపల వేదుల
విద్రుమ గేహళీ విలసితముల
హాటకరత్న కవాటశోభితముల
నలరిన సౌధశాలాంగణముల

తే. వరపయఃఫేన పటల పాండుర కరీంద్ర
దంత నిర్మిత ఖట్వాతిధవళ పట్ట
రచిత శయ్యాళులను జతురంతయోన
కనక పీఠాది వసు సంఘముల నెల 1037

వ. మఱియు వికచ కమల కుముద సౌగంధిక బంధుర సుగంధాను బంధి గంధవహ శోభితంబు, నరవింద నిష్యంద కందళిత మరంద రస పాన మదవ దిందిందిర సందోహ ఝంకార సంకులంబునై చెలువారు బావులు గలిగి, పురందర సుందరీ నందితం బైన కర్దమాశ్రమంబు పరిత్యజించి (కుటిలంబులైన కుంతలంబులు జటిలంబుగా ధరియించి) సరస్వతీ బిందు సరోవరంబులం ద్రిషవణ స్నానంబు గావింపుచు నుగ్రతపోభారంబునం గృశీభూత శరీరయై నిజ కుమారుండును, బ్రసన్న వదనుండును, గపిల నామధేయుండును నగు నారాయణుని (సమస్త వ్యస్తచింతలచే) ధ్యానంబు సేయుచుఁ బ్రవాహరూపంబైన భక్తి యోగంబున నధిక వైరాగ్యంబు న యుక్తానుష్ఠాన జాతంబు బ్రహ్మాత్వాపాదకంబు నగు జ్ఞానంబును విశుద్ధమనంబునుం గలిగి 1038

సీ. అనయంబు నాత్మనాయకుఁడును విశ్వతో
ముఖుఁడనంతుఁడు పరముఁడు నజుండు

చతురుండు నిజపరిజ్ఞాన దీపాంకుర
మహిమ నిరస్త సమస్త భూరి
మాయాంధకారు డమేయుఁ డీశ్వరుఁడగు
నా పరబ్రహ్మంబునం దవిరత
బద్ధతత్త్వజ్ఞాన పరత చే నిర్ముక్త
జీవభావమున విశిష్టయోగ

తే. భవ్య సంప్రాప్త నిర్మల బ్రహ్మ భావ
ములను గలిగి సమాధిచే నెలమిఁ దనరు
నపునరావృత్త మగు త్రిగుణ ప్రధాన
తత్త్వముల నొప్పి సంతతాచార నియతి. 1039

తే. కలలఁ దోచిన వస్తు సంఘముల మేలు
కని కనుంగొనఁగా లేని మనుజ పోల్కి
బొలఁతి దనయాత్మ మఱచి యిమ్ముల సధూమ
మైన పావకు గతి నుండె నంతలోన. 1040

క. గురు యోగశక్తి చే నం
బరతలమున కెగసి సత్కృపామయుఁడగు నా
పర వాసుదేవు చరణాం
బురుహయు గన్వస్త చిత్తము గలది యగుచున్. 1041

వ. ఇట్లు కపిలోక్తమార్గంబున దేవహూతి శ్రీహరి యందుఁ గలసె. అయ్యోగనారత్నంబు మోక్షంబునకుం జనిన క్షేత్రంబు సిద్ధిప్రదంబను పేరం బరఁగి ప్రసిద్ధి వహించె. అంత నక్కడఁ గపిలుండు దలిచేత ననుజ్ఞాతుండై సిద్ధచారణ గంధర్వాప్సరో ముని నివహ సంస్తూయ మానుం డగుచు సముద్రుని చేత దత్తార్హణ పూజానికేతనంబులు వడసి, సాంఖ్యాచార్యాభిష్టు తంబగు యోగంబు నవలంబించి (లోకత్రయ) శాంతి కొఱకు సమాహితుండై (స్వపితృశ్రమంబు విడిచి) యుదగ్భాగంబునకుం జనియె. అని మైత్రేయ మహాముని విదురున కిటనియె. (తండ్రి! ఈ యుపాఖ్యానంబు నాకు గోచరించిన రీతి నీకుం జెప్పితి. ఇది కపిల దేవహూతి సంవాదం బత్యంత పావనంబు కపిల ప్రణీతంబు నైన యోగంబు, దీనిం బరమభక్తి యుక్తుండై యెవ్వఁడు పఠించు నెవ్వఁడు వినునట్టి పుణ్యాత్ముండు విగత పాపుండై గరుడ ధ్వజుండైన పుండరీకాక్షుని శ్రీచరణారవిందంబులం బొందు నని మైత్రేయుండు విదురున కెఱిగించె. అని సూతుండు శౌనకాది మహా మునులకు నీ కథా వృత్తాంతంబు చెప్పిన విని ప్రహృష్ట హృదయులై, మునికులోత్తమా! భవద్వాక్సారం బగు భగవత్కథామృతంబు గ్రోలుచుండ మా మనంబులు తనివోవవు. ఇంకను దరువాతి వృత్తాంతంబులు మాకు విశదంబులుగ వినిపింప నీవ యర్హుండ వని యడుగుటయు). 1042

చ. జనక సుతా మనో విమల సారస కోమల చంచరీక! చం
దన శరదిందు కుంద హర తార మరాళ పటీర చంద్రికా

వినుత యశోవిశాల! రఘువీర! దర త్రిత పద్మపత్ర లో
చన! నిటలాంబక ప్రకట చాపవిఖండన! వంశ మండనా! 1043
తరల. పరమ పావన! విశ్వభావన! బాంధవ ప్రకరావనా!
శరధి శోషణ! సత్యభాషణ! సత్కృపామయ భూషణా!
దురిత తారణ! సృష్టికారణ! దుష్టలోక విదారణా!
ధరణిపాలన! ధర్మశీలన! దైత్యమర్దన ఖేలనా! 1044
మాలిని.దివిజ గణశరణ్యా! దీపితానంతపుణ్యా!
ప్రవిమల గుణజాలా! భక్తిలోకానుపాలా!
భవతిమిరదినేశా! భాను కోటి ప్రకాశా!
కువలయ హితకారీ! ఘోర దైత్య ప్రహారీ! 1045

గద్య. ఇది శ్రీపరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసన మంత్రి పుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన శ్రీ మహాభాగవతంబను మహా పురాణంబునందు విదురనీతియు, విదురుని తీర్థాగమనంబును, నుద్ధవసందర్శనంబును, గౌరవ, యాదవ కృష్ణాది నిర్యాణంబును, గంగా ద్వారంబున విదురుండు మైత్రేయునిం గనుటయు, విదుర మైత్రేయ సంవాదంబును, జగదుత్పత్తి లక్షణంబును, మహాదుల సంభవ ప్రకారంబును, మహాదులు నారాయణు నభినందించుటయు, విరాడ్వి గ్రహప్రకారంబును, శ్రీమహాభాగవత భక్తి కారణంబగు పద్మసంభవు జన్మ ప్రకారంబును, బ్రహ్మ తపంబును, బరమేష్ఠికిఁబుండరీకాక్షుండు ప్రత్యక్షం బగుటయు, బ్రహ్మకృతంబైన విష్ణుస్తోత్రంబును, గమల సంభవుని మానస సరంబును, బరమాణువుల పుట్టువును, భూర్భువస్సువరాదిలోక విస్తారంబును, గాల దివస మాస వత్సరాది నిరూపణంబును, నాయుఃపరిమాణంబును, జతుర్యుగ పరిమాణంబును, బద్మసంభవు సృష్టిభేదనంబును, సనకాదుల జన్మంబును, స్వాయంభువ మనువు జన్మంబును, శ్రీహరి వరాహావతారంబును, భూభరణంబును, సూకరాకారుండైన హరిని విధాత స్తుతియించుటయు దితికశ్యపసంవాదంబును, గశ్యపుండు రుద్రునిం బ్రశంసించుటయుఁ గశ్యపు వలన దితి గర్భంబు ధరియించుటయుఁ, దత్ భావంబునకు వెఱచి దేవతలు బ్రహ్మసన్నిధికిం జని దితి గర్భంబు విన్నపించుటయు, సనకాదులు వైకుంఠంబునకు నరుగుటయు, అందు జయ విజయుల కలిగి శపించుటయు, శ్రీహరి దర్శనంబును, బ్రాహ్మణ ప్రశంసయు, సనకాదులు హరిని నుతించుటయు, హిరణ్య కశిపుహిరణ్యాక్షుల జన్మ ప్రకారంబును, హిరణ్యాక్షుని దిగ్విజయంబును, సవనవరాహ హిరణ్యాక్షుల యుద్ధంబును, బ్రహ్మస్తవంబును, హిరణ్యాక్షవధయు, నమరగణంబులు శ్రీహరి నభినందించుటయు, హరి వరాహావతార విసర్జనంబు సేయుటయు. దేవ తిర్యఙ్మను స్వాయంభువ సంభవంబును, గరమ మహామౌని తపంబునకు సంతసించి శ్రీహరి ప్రత్యక్షం బగుటయుఁ, గరముండు స్వాయంభువ మనుపుత్రియైన దేవహూతిం బరిణయం బగుటయు, దేవహూతి పరిచర్యలకు సంతసించి, కరముండు నిజయోగకల్పితంబగు విమానంబునందు నిలిచి, సహస్రదాసీ పరివృతయైన దేవహూతిం గూడి, భారతాది వరంబులు గలయఁ గ్రుమ్మరుటయు, దేవహూతి కరముని వలనఁ గన్యకానవకంబునుఁ గపిలునిం గనుటయు, దక్కన్యకా వివాహంబులును, గరమతపో యాత్రయుఁ, గపిల దేవహూతి సంవాదంబును, శబ్దాది పంచతన్మాత్రల జన్మప్రకారంబును, బ్రహ్మాండోత్పత్తియు, విరాట్పురుష

కర్మేంద్రియ పరమాత్మ ప్రకారంబును, బ్రకృతి పురుష వివేకంబును, నారాయణుని సర్వాంగస్తోత్రంబును, సాంఖ్యయోగంబును, భక్తియోగంబును, జీవునకైన గర్భసంభవ ప్రకారంబును, చంద్ర సూర్యమారంబునఁ బిత్రమారంబున, దేవహూతి నిర్యాణంబును. గపిల మహాముని తపంబునకుం జనుటయు నను కథలు గల తృతీయస్కంధము సంపూర్ణము. 1046

1018 ఇంద్రియారమనోమయంబును=ఇంద్రియములు వానికి సంబంధించిన అరములు, మనస్సు వీనిచేత కూడిన, భూతచయమయంబును - భూత=పంచభూతముల యొక్క, చయ=సమూహము యొక్కమయము, సమస్త=సమస్త, భూరి=గొప్పవైన, జగత్=జగత్తులకు, బీజభూతంబును=ఆది కారణమైనది, గుణప్రవాహ కారణమును=సత్త్వర జస్తమోగుణములు వాని యొక్క కార్యములు, వీనికి కారణమై యున్నది. అట్టి స్వరూపమేది? నారాయణ+అభిఖ్యన్=నారయణుఁడనెడు పేరు చేత, నాఁగల=ఒప్పుచున్నట్టి, భవదీయ=నీకు సంబందించిన, దివ్య=అప్రాకృతమైనటియు, మంగళమూర్తి=సమస్తమైన కళ్యాణగుణములను కలుగఁజేయు, తేజరిల్లున్=ప్రకాశించునది (ఆ తేజస్సు నీ స్వరూపమేయని భావము) చారు=మనోహరమైన, భవత్=నీయొక్క, గర్భ=గర్భము నుండి, సంజాతుఁడు=పుటినట్టి, కమల గర్భుండు=కమల మందు జన్మించినవాఁడు, నారాయణుని యొక్క నాభిప్రదేశము నుండి కమలము జన్మించినది. ఆ కమలము నుండి బ్రహ్మపుట్టినాఁడు. అందుచేత తనకు కమల గర్భుఁడని పేరు, సాక్షాత్కరింపన్=ప్రత్యక్షమొనర్చుకొనుటకు, మనమునన్ కనియెన్=మనస్సుతోనే సాక్షాత్కారింపఁజేసినికొన్నాఁడు. అనేక శక్తి వరములు కలన్=అనేకములైన శక్తుల యొక్క సమూహము కలుగగా, సగుణ ప్రవాహ రూపము అంది=అత్యుష్టములైన గుణప్రవాహముల చేత ఏర్పడెడు రూపములను పొందెడి వాఁడవు, విశ్వంబున్ దాల్చి=సమస్తప్రపంచమును ధరించి, సహస్రశక్తి కలితుఁడై=అనేకములైన శక్తులతో కూడుకొన్నవాఁడై, సర్వకార్యముల్=సమస్తకార్యములను, కెలుగన్ చేయున్=కావించుచుండును.

తాత్పర్యము : దేవహూతి సాంఖ్యదర్శనోపదేశము చేత నాత్మ సాక్షాత్కారమును పొందినదై (ఆత్మసాక్షాత్కారమునకు కావలసిన సమస్త యోగ్యతలు కలదై) కపిల భగవంతు నిటని స్తుతించుచున్నది. స్వామి! నారాయణుఁడను పేరు గఁ ఒకానొక శక్తి విరాజిల్లుచున్నది. అదియే సమస్తములైన ఇంద్రియములు వాని యొక్క అరములు మనస్సు పంచభూతముల స్వరూపము దీని స్వరూపమే అయి ఉన్నది. వీని నన్నిటిని నియమించెడి స్వరూపమిదియే. ఆ నారాయణుని స్వరూపమే సమస్త జగత్తులకు ఆదికారణము. త్రిగుణముల యొక్క స్వరూపమయ్యి త్రిగుణముల నియమించునదియు అదియే. దాని యొక్క ప్రేరణ చేతనే త్రిగుణములు నిరంతర ప్రవాహములై ప్రవహించుచుండును. అనఁగా గుణముల యం దంతర్యామియై ఉండి వానిని ప్రేరేచువాఁడు నారాయణ మూర్తియే అని తాత్పర్యము. ఆ నారాయణ స్వరూపము యొక్క దివ్యమంగళస్వరూపమే నీవు. నీకును నారాయణ మూర్తికిని భేదము లేదని భావము నిన్ను సాక్షాత్కరింపఁ జేసికొనుట చాల యసాధ్యమైన పని. నీనాభియం దొకకమలము పుట్టినది. దాని యందుండి నీ సంకల్పముచేతనే బ్రహ్మ జనించినాఁడ. అందుచే నాతనికి కమలగర్భుఁడని పేరు. అతఁడు

నీ స్వరూపమును సాక్షాత్కారింపజేసికొన యత్నించినాఁడు. కన్నుల యెదుట నీవు కనపడవైతివి - ధ్యాన మాత్ర సహాయుఁడై మనస్సుతో మాత్రమే నిన్ను పొడగనఁ గలిగినాఁడు. నిన్ను పరివేష్టించినవి అనేక శక్తులు - త్రిగుణప్రవాహ స్వరూపము నీవే. సమస్త విశ్వమునకు ధారకుఁడవునీవే. అనేకములైన శక్తులతో కూడి నీవు సమస్తకార్యములను కలుగఁ జేయుచున్నావు.

1019, 1020, 1021. అతుల=సాటిలేని, భూరి=గొప్పదైన, యుగాంతంబు నందున్= మహాయుగము కడపట, కపటశిశువవై=ఏదేనీ ఒక నెపముతో నారోపించు కొన్ను శిశుస్వభావము కలవాఁడవు, ఒంటిన్=ఒంటిగా, కుక్షి=కడుపునందు, నిక్షిప్త=ఉంచుకొనఁ బడిన, నిఖిల=సమస్తమైన, భువన నివహుండవై=ప్రపంచముల సమూహము కలవాఁడవై, మహా+అంభోధినడుమున్= గొప్ప సముద్రము యొక్క మధ్యమున, చారు=అందమైన, వటపత్ర= మఱియాకునెడు, తల్ప=పడుకపైన, సంసాయివి=ఒప్పుచున్న వాఁడవగుచున్, నాలు యుగములు వరుసగా గడచిన ఒక్కి మహాయుగము, ఆమహాయుగము నందీ ప్రళయము ప్రాప్తించును. అది అతులమైనది. అనఁగా అది భగవదిచ్ఛచే నేర్పడినదగుట చేత దాని నివారించుటకే ప్రయత్నమును పనికి రాదనుట. అయ్యది. భూరి అనఁగా ఒకచోట నుండి మఱియొక్క ఎడ లేకుండునది కాదు. మధ్యమలోకమే కాక సమస్త లోకముల యందును ఆది వ్యాపించును. ఎక్కడ చూచిన నొక్కటే జలమయము. అట్టి మహాప్రళయమందు నారాయణ మూర్తి శిశుభావము నారోపించుకొనును. ఆ శిశుభావమాతని పైన నెవ్వరిచేతను ఆరోపింపఁ బడినది కాదు. స్వసంకల్పము చేత ఆరోపించుకొన్నాఁడు. శిశుభావము మనస్సున కాదు మూర్తిలో. అతఁడొక్కఁ డే జాగృతుఁడు. తక్కిన ఏ పదార్థమును లేదు. సమస్త భువనము లెచ్చటకి పోవును? ఆతని కడుపుననే బీజభూతములై ఉండును. ప్రశయాంతమున మరల నవి ఆతని సంకల్పము చేతనే గడ్డకువచ్చును. అంభస్+ధి=నీటిని ధరించినది. సంస్కృత వ్యాకరణము ననుసరించి అంభోధి రూపమేర్పడినది. మఱియాకునే తల్పముగా చేసి పరుండినాఁడు. ఆ మఱియాకు చాల సుందరముగా ఉన్నది- భగవంతుఁడు తనకాధారముగా నేర్పఱిచుకొన్న పదారము సర్వసుందరముగా నేల నుండదు? "సంసాయి" సితి గలవాఁడనే రూఢ్యర్థము. కాని యిచ్చట సందర్భమ ననుసరించి" స్థితి మాత్ర మర్థముకాదు. పరుండి నిద్రను నటించువాఁడని తాత్పర్యము.

1022 లీలన్=లీలగా, ఆత్మీయ=తనయొక్క (సందర్భముననుసరించి నీ యొక్క అని తాత్పర్యము) పాద+అంగుళ్=పాదము యొక్క వ్రేళ్ళు, వానినుండి, వినిరత=బయలు దేరిన, అమృతమున్=అమృతమును, క్రోలినట్టి మహత్మ=పానము చేయుచున్న గొప్పవాఁడవైన స్వామీ, నీవు కణఁగి=ప్రయత్నించి, నాపూర్వ భాగ్యంబుకతనన్=నేను పూర్వజన్మల ఒనర్చిన మహాపుణ్యమున, ఇపుడు=ఈ యవసరమున, పూని=ప్రయత్నించి నాగర్భముననన్=నాయొక్క ఉదరమందు, నేఁడు పుట్టితయ్య=ఈనాఁడు జన్మించితివి.

తాత్పర్యము: స్వామీ! నీవు ఆద్యంతములు లేని వాఁడవు. ఏ వికారములు లేని వాఁడవు మఱి శిశుభావ మెట్లెర్పడినది? నీ సంకల్పము చేతనే వచ్చినది. ఎందుకు? అది నీ లీలయే. సృష్టిస్థితి సంహారములు కూడ నీకు లీలామాత్రములే.

నిన్నెవ్వఁడు నియమించువాఁడు లేఁడు. నీవు స్వయముగా నారోపణచేసిన శిశుత్వము నందిన వాఁడవై బొటన వ్రేలిని నోటిలో ఉంచి చీకుచు వట పత్రమందు యోగనిద్రా సమాసీనుని వలె వర్తింతువు. ఇచ్చట నంగుళీశబ్దము బహువచనము కాదు. అంగుష్ఠమాత్ర పర్యవసానము. ఆ యంగుష్ఠము నుండి వినిరతమగు చున్నది అమృత పూరమే. అనఁగా బొటన వ్రేలిని చీకీచున్నపుడు ఆతని లాలారసముతో పరివ్యాప్తమైన అంగుష్ఠము అమృతరసమును ప్రవహింపఁ జేయునది వలె నుండునన్నమాట. అట్టి సర్వోస్వతంత్రుఁడవైన నీవు నాగర్భ మందు జనించునటొనర్చెదవు. అప్రాకృత స్వరూపుఁడవైన నీవు ప్రాకృత గర్భమందు జనించుట హాస్యగనిది. కేవలము నన్ను గ్రహించుట కొఱకే నీవు, ప్రాప్తమైన నా గర్భమున జనించినట్లు తోపింపఁ జేసినావు. ఇదినాయందు నీవు చూపిన ప్రసాదము. దీనికి కారణము అనేక జన్మలందు నే నొనర్చిన పుణ్యము. ఎందరో యుండఁగా నాగర్భమునే నీవు జన్మకారణముగా ఎంచు కొంటివి. కడగి ప్రయత్నించి, నాగర్భమున సంభవించినావు. అనేకులు నీకృపకు పాత్రులైన వారుండఁగా నన్నే ఎన్నుకొనుట ఎందుకు? నాపూర్వ జన్మకృతములైన పుణ్యములే కాక నీకు నాయం దుద్భవించిన అవ్యాజకరుణయే ముఖ్యమైన కారణము.

1024. విశ్వమునే ధరించుట నీశక్తి యొక్క మూలముగనే సాక్షాత్తుగా కాదు- విగ్రహ గౌరవశ్యంబునను జేసి=ఆకారము నందలి మాధుర్యమునకు వలచియో యన్నట్లుగా, రఘురామ=శ్రీరాముని, కృష్ణవరాహ నారసింహాది మూర్తులు=అనేకమైన విభవావతారములను, అంచిత లీలన్=తగినట్లుగా ధరించి=స్వీకరించిన వాఁడవై, దుష్టనిగ్రహమును=దుష్టుల కార్యముల నరికట్టు టయు, శిష్టపాలనమును=సత్పురుషుల పాలనమును, కావింపుచున్=చేయుచు, నయమునకున్=తగినట్లుగా, సదర్మ=మంచి ధర్మముల యందు, నిరతచిత్తులకున్=ఆసక్తమైన చిత్తములు కలవారికి, వరింపతగిన=వరించుటకు తగినట్టి, చతుర=చాతుర్యముతో కూడిన, ఆత్మతత్త్వ=నీ స్వరూపమును గూర్చిన, విజ్ఞాన=గొప్ప జ్ఞానము యొక్క ప్రదుండవై=ఏర్పఱచువాఁడవై, అనఘ=పాపము లేని వాఁడా! భవన్మహత్త్వము=నీయొక్క గొప్పతనము, అజునకైనను=బ్రహ్మదేవుని కైనను, వాక్రువ్వన్=వర్ణించుటకు, అలవికాదు=సాధ్యమైనది కాదు, నిగమజాతంబు లైనన్=వేదములు సమూహమైనను, వరింపలేవ=వర్ణించుటకు శక్తి కలవి కావు. ఇందలి అకార మవధారణార్థము. ఎఱిఁగి సంస్తుతింపనేయన్=జ్ఞానపూర్వకముగా నిన్ను స్తుతించుటకు, నే నెంత దానన్=నేనే మాత్రపు లెక్కలోని దానను, వినుత గుణశీల=అందరి చేతను పొగడఁబడిన సద్గుణములే శీలముగా గలవాఁడా? మాటలు వేయునేల=అనేకములైన వాక్య విన్యాసము లెందుకు?

పరమేశ్వరుఁడు త్రిపాద్విభూతియందు వెలుఁగు చుండును. ఆతఁడు ఉభయ విభూతినాయకుఁడు. వైకుంఠమందున్నది నిత్యవిభూతి. అప్పుడప్పుడు జగత్తున కేతెంచునది లీలా విభూతి నిత్యవిభూతి యందున్న పరమాత్ముఁడు, లీలాభూతిలో నున్న మానవులనుదరించుట దయాలేశ మంకురించినది. అపుఁడాతఁడు వేదముల శాస్త్రముల నీద్భవింపజేసెను. వానితో ప్రయోజనము కలుగ లేదు. ఆ జ్ఞానము, అన్యథాజ్ఞానము ఇత్యాద్యనేక వికల్పములతో మానవులు నశింతురో. అపుడు మానవుల సహాయార్థమైన నిత్యముక్తులు

మొదలైన వారిని తన యాదేశమును ప్రపంచమున చాటుటకై భగవంతుడు ఉద్భవింప జేసెను. దాని చేత ఎక్కువ ఫలము కలుగనప్పుడు స్వామి విభవావ తారము స్వీకరించి వేంచేయును. అతని కప్పు డప్పుడు మూర్తిని ధరించి భూమికి వచ్చుట ఒక లీల. విగ్రహము నందాస్తి కలవాని వలె అని ఇచ్చట ఉత్తేక్షించుచున్నాఁడు. రఘురామ... నృసింహాది మూర్తులు. ఇచ్చట క్రమము విశేక్షింపఁబడలేదు. వరాహావతారము రామకృష్ణావతారముల కంటె ముందే జరిగినది వరాహావతారము తరువాత నారసింహావతారము. రఘురాముఁడనఁగా రఘువంశమందు పుట్టిన రాముఁడు. రాములది సూర్యవంశము. మఱి సూర్యవంశమం దని చెప్పవలెను కదా! రఘుమహారాజు పేరెత్తనేమిటికి? రఘువు సూర్యవంశమున పుట్టిన రాజులలో చాల గొప్పవాఁడు. దిలీపుఁడు, భగీరథుఁడు మొదలైన వారి కంటె గొప్పవాఁడా? గొప్పవాఁడని యే లోకమున ప్రసిద్ధి. జీవితములో నాతఁడాశ్చర్యకరమైన పనులేవియు చేయలేదు. కానక్రమము తప్పక చతురాశ్రమములను పాటించెను. అనఁగా మానవుఁడు చతురాశ్రమములను చక్కగా పాలించుటయే సర్వోత్తమమైనదని హృదయము. పైన నాలవ తరములో వరాహ నారసింహములు ఆవేశావతారములు. అంచిత లీలన్= ఒప్పునట్లుగా అని ఒక అర్థము. పూజింపఁబడునట్లుగా అని అర్థాంతరము, అతఁడు ధరించెడు సమస్తావతారములును లోకపూజ్యములే యని భావము. భగవంతుఁడు ప్రపంచమున ఒనర్చెడు ప్రధాన కార్యములు దుష్టనిగ్రహము, శిష్టరక్షణము. శిష్టులనఁగా నెవ్వరు? సదర్మనిరత చిత్తులు, ధర్మమనఁగానేది? వేదముల చేత విధింపఁబడినది. అవియే ధర్మములు. వేదముల చేత చెప్పఁబడనివి బౌద్ధాది ధర్మములు. ఆపాత మధురములైనను అనువర్తింప తగినవి కావని తాత్పర్యము.

ఆధర్మప్రవృత్తికి బాధకులగు వారు దుష్టులు. ఆత్మతత్త్వ విజ్ఞానము గ్రహించుటలో తక్కిన గుణములతో పాటు చాతుర్యము కూడ నుండవలెను. ప్రపంచమునకు జ్ఞాన ప్రదాన మొనర్చు ఓ స్వామి! నీ లీలలను వర్ణించుటకు ఆదికవియైన బ్రహ్మదేవుఁడు కూడ శక్తుఁడు కాఁడు. నీచేతనే ప్రవర్తింప చేయఁబడిన వేదములు కూడ నీ యొక్క గుణలేశమునే వర్ణించుచున్నవి. ఇట్టి మీ మాహాత్మ్యము నెఱిఁగి వర్ణించుటకు చాలదు. ఎందరో నీగుణ శీలములను వర్ణించిరి. అవి యన్నియో నపర్యాప్తముగనే ఉన్నవి. మఱి నా బోటిదానికి వర్ణించుటకు శక్తి ఎట్లు వచ్చును?

1028 శ్వపచుండైనను=కుక్క మాంసము తినెడు వాఁడైనను, నీ నామస్తుతిం =నీ నామమునకు సంబంధించిన స్తోత్రమును, జిహ్వా+అగ్రమందున్=నాలుక యొక్క కొనయందు, అను సంధింపన్= నిరంతరము జపింపఁగా, వానికిన్= వానితో, భూసురుఁడున్=బ్రహ్మణుఁడును, సరిగా నేరఁడు=సమానమైన వాఁడు కాలేఁడు. ఇది విషయము, ఆరయన్=విచారింపగా, జగంబులన్=జగములలో, చిత్రము=విచిత్రమైనది.

తాత్పర్యము:చాతుర్వర్ణ్యము నెలకొన్న సమాజములో శూద్రుఁడు నాలవ జాతి. అన్ని వరముల కంటెను కట్టకడపటి వరము శ్వపచునిది. కుక్క మాంసమును వండుకొని తినువాఁడట. అందుకే వాని కంత్యజుఁడని పేరు. భూసురుఁడు అనఁగా బ్రాహ్మణుఁడు. కాలుచేతులు దాల్చి భూమి యందు

తిరుగాఁడు దేవత యని అరము. ఇట్టి భూసురునితో అంత్యజుఁడైన వాఁడెప్పుడు సమానుఁడు కానేరఁడు. అదొ సామాన్యమైన ధర్మము. ఇచ్చట విశిష్టధర్మమును చెప్పుచున్నాఁడు స్వామీ! ఎవని జిహ్వాగ్రమందు నిరంతరము నీ నామము తారాడుచుండునో వానికి సరి సమానుఁడు పురుషుఁడు లేఁడని అరము. భూసురుఁడనఁగా వేదచోదితములైన క్రియాకలాపములు నిర్వహించుచు జీవించువాఁడు. మఱి యంత్యజుఁడు వేదచోదిత క్రియా కలాపములు నిర్వహింపకానేరఁడు. వానికి వేదాధికారమే లేదుకదా! మఱి భూసురుని కన్న వాఁడు గొప్పవాఁడెటులగును వేదముల చేత చెప్పఁబడిన అన్ని క్రియాకలాపములు అనుపించుట కంటెను నిరంతర నామ భజనము శ్రేష్ఠమైనదని ఈ పద్యమునకు తాత్పర్యము. జన్మ ప్రారబ్ధము ననుసరించి ఏర్పడినమట ధార్మికమైన సిద్ధాంతము. మఱి పూర్వజన్మకర్మలు అనుభవముచే గాని పోవని సిద్ధాంతము. మఱి వాఁడు భూసురుఁడెటగుచున్నాఁడు? నామజప యజ్ఞము సర్వప్రారబ్ధములను క్షీణింపచేయునని తాత్పర్యము. కేవలము క్షీణింప చేయుటయే కాదు భూసురుని కన్న ఎక్కు పుణ్యవిశేషము సంపాదించి పెట్టి ఆ యంత్యజునకు భూసురున కన్న ఉత్తమసితి కల్పించునని తాత్పర్యము.

1029 ఈ విధము=ఈ పదతిలోనున్న నియమమును, ఆత్మలన్ తెలిసి=మనస్సులం దరము చేసి కొన్నివాఁడై, ఎప్పుడున్=ఏ కాలము నందును, సజనసంఘములో=సత్పురుషులయొక్క సమూహములు జగత్పావనమైన=జగత్తులో అన్ని క్రియలకన్న పవిత్రమైనటి, నీగుణ కథామృతము=నీయొక్క కల్యాణగుణములకు సంబంధించిన కీర్తనయనెడు సుధారసమును, ఆత్మలన్ క్రోలి=మనస్సులతో నిరంతరము త్రావి, సర్వతీరావళిన్=సమస్త తీరముల యందును, క్రుంకినటి ఫలము=స్నానము చేసిన సత్ఫలము, అందుదురు+అంచున్=పొందెదరనీ, సమస్తవేదములు=నాలువేదములను, వావిరిన్=క్రమముగా, పల్కుకావునను=ప్రశంసించును కనుక, వారలు=అటిసజన సంఘములు, ధన్యులు=జీవితసార్థక్యము నందిన వారు, ఉత్తములో=జగత్తునందు శ్రేష్ఠులు. అందుచేతనే-మాన్యులు=అందరిచేతను గౌరవింపఁదగినవారు.

తాత్పర్యము: భగవంతుఁడా! సత్పురుషుల సంఘమునకు ఈ రహస్యము తెలియును. అందుచే వారు జగత్తులో అన్ని క్రియలకంటెను పవిత్రమైనది, జగత్తునే పావన మొనర్చునదియు నైన నీ కళ్యాణగుణముల కీర్తన యనెడు అమృతమును కుత్తుక బంటిగాఁ గ్రోలెదరు. వారు తీర్థయాత్ర లొనర్చ బనిలేదు. ఒక్కొక్కక్షేత్రమున స్నాన మొనర్చినపుడు కొంతకొంత పుణ్య మేర్పడును. అటి పుణ్యము కుప్పగా సంతరించి కొన్నపుడు మరు జన్మ ముత్తమమైనదిగా నేర్పడును. కాని నామజపము, నామకీర్తనము సర్వోత్కృష్టఫలము నొసఁగును. అందుచే నిరంతరము నామ భజన మొనర్చువానికి సర్వతీర్థము లందుఁ గ్రుంకిన ఫల మేర్పడును. ఇది వట్టి ప్రశంసావచనము కాదు. సమస్తవేదములు మాటిమాటికి చెప్పుచున్న రహస్యము. అందుచేతనే సత్పురుషులైన వారు నిరంతరము నామభజనమొనర్చుచుందురు. వారి జీవితమే ధన్యమైనది. వారు సమస్తమానవులందును శ్రేష్ఠులు. అందుచేతనే వారు అందరి చేతను గౌరవింప తగిన వారు.

1031. అదిగావునన్=ఈ పరమసత్యముండుటచేత, పరబ్రహ్మంబవు=ఉత్తమ బ్రహ్మస్వరూపుఁడవు, పరమ పురుషుండవు=పురుషోత్తముఁడవు ప్రత్యగ్+

మనస్+విభావ్యుండవు=జ్ఞానమును పొందిన మనస్సుచేత భావింపఁబడుట కర్హుడవు,సమస్తజన=సర్వజనుల యొక్క, పాపవిదారక=పాపమును పోఁగొట్టు స్వయంప్రకాశుండవు=స్వయముగ ప్రకాశించువాఁడవు. వేదగర్భుండవు= వేదములను గర్భమందు కలవాఁడవు. శ్రీమహావిష్ణుండవు=సర్వత్ర వ్యాపించిన వాఁడవు అయిన నీకు, వందనంబులు ఆచరించెదన్=నమస్కార మొనర్చు చున్నాను, అని స్తుతియించినన్= పరమ పురుషుండు, మాతృవత్సలుండు= తల్లియైన దేవహూతి యందుగొప్పప్రసాద విశేషము కలవాఁడు, కరుణారస= దయారసము చేత, సాంద్ర=తడిసినట్టి, హృదయకమలుండై=మనస్సనెడు పద్మము కలవాఁడై, ఇట్లనియెన్.

తాత్పర్యము: స్వామీ! పైన చెప్పిన విషయము పరమ సిద్ధాంతము. నీవే పరబ్రహ్మవు. చతుర్ముఖ బ్రహ్మవు కాక అతనికినిగూడ కారణమైన బ్రహ్మస్వరూపుఁడవని భావము. బ్రహ్మయనఁగా సర్వోత్తముఁడైన వాఁడు. "బృంహణాత్ బ్రహ్మ" అని వ్యుత్పత్తి. పరమపురుషుండని సగుణస్వరూప మతమున చెప్పుచున్నమాట ఇది. బ్రహ్మాభిన్నములైన పదార్థములు చేతనము లనియు, వ్యావహారికముగా స్త్రీపురుషభేదముతో వెలిఁగించుచున్నను అందరు స్త్రీలే. ఎందుచేతనఁగా? అందరును ప్రకృతికి లోఁబడిన వారే గనుక. స్త్రీత్వధర్మ మస్వాతంత్ర్యము గనుక ప్రకృతికి లోఁ బడిన అన్ని చేతనములును స్త్రీత్వభావమునే పొంది యున్నవి - ఇది వల్లభాచార్య సిద్ధాంతము. లేక శ్రేష్ఠుఁడైన పురుషుఁడ వనియు అర్థము కావచ్చును షడ్గుణైశ్వర్య యుక్తుఁడగుటచే సర్వపురుషు లందును శ్రేష్ఠుఁడు. పురుషోత్తముఁడనియే ఇతని పేరు. యోగికారము పురుషోత్తము లనేకు లున్నీను రూఢ్యర్థమున శ్రీమన్నారాయణ మూర్తి యొకఁడే పురుషోత్తముఁడని - భగవద్రామానుజుల శ్రీభాష్యమున సిద్ధాంతము. జ్ఞాన ప్రధానమైన మనస్సుచేత భావించుట కర్హుడైన వాఁడు. స్వామి భక్తి లేని జ్ఞానమును, జ్ఞానము లేని భక్తియు రెండు నేనరములే యని అనుభవజ్ఞులైన పెద్దలమాట. కానీ ప్రాధాన్యము ననుసరించి జ్ఞానభక్తియోగములని పిలువఁబడెడి. సమస్త జనుల యొక్క పాపమును తొలఁగించెడి ప్రకాశము కలవాఁడు. శ్రీమహావిష్ణువు. ఆతని ప్రకాశ మెప్పుడును సాపేక్షితము కాదు. స్వతంత్రము. ఆతని ప్రకాశము వలననే సూర్యచంద్రులు సైతము ప్రకాశవంతు లగుచున్నారు. కాని భగవంతుని ప్రకాశమునకు వేఱొక వస్తువు సంబంధ మక్కరలేదు. అది స్వయముగనే వెలుఁగుచుండును. ఆతఁడు వేదగర్భుఁడు. అనఁగా ప్రళయ కాలమున వేదముల గర్భమున ఉంచి సృష్టికాలమున వానిని బ్రహ్మ కుపదేశించు వాఁడని భావము. లేక వేదముల యొక్క గర్భమందున్న వాఁడనియు అర్థాంతరము. సమస్త వేదములును శ్రీహరినే ప్రశంసించు చున్నవి. అన్ని వేదములకును లక్ష్య మొక్కఁ డే. ఆతఁడే శ్రీమహావిష్ణువు. సర్వము నందును వ్యాపించు వాఁడు కనుకనే విష్ణువని సారక నామము. అట్టి నీకు సాష్టాంగ దండప్రణామ మొనరించెదననో దేవహూతి యన్నది. అప్పు డా పరమ పురుషునకు కరుణ పొంగిపొరలినది. ఆ స్వామి యామెతో నిట్లన్నాఁడు-

1032. అంబ=తల్లి! కమలనయన=పద్మముల వంటి నేత్రములు కలదానా! తవిలి=నీయందు దృఢమైన మనస్సు కలవాఁడనై, సుఖరూపమునన్=ఏ మాత్రమును ప్రయాసము లేక మోక్షదాయకంబు=మోక్షము నిచ్చునదైన, ఈ

యోగమార్గము=అయిన నీసాంఖ్యయోగమనెడు సిద్ధాంతము, నీకున్ ఎఱుఁగన్=స్పష్టముగా అర్థమగునట్లు వివరించి చెప్పి తిని, భక్తిన్=భక్తితో, ఇది=ఈ యోగమార్గము, దృఢంబు కాఁగన్=నిరంతరమైన నిష్ఠతో, ఇతర చాపల్యముల మానీ=అనుష్ఠింపు=అనుష్ఠాన మొనర్పుము. పై పద్యమందు కమలనయన! అను సంబోధన మున్నది. కావ్యభాషలోనిది సందర్భము ననుసరించి అర్థము చెప్పుకొన తగును. శృంగార విషయము లందు కమలముల వంటి కన్నులు కలదనియే అర్థము. ఇతర సందర్భములలో సామాన్యముగా స్తోత్రధ్యేతకమే కాని మరియొకటి కాదు. అంబ! అని ఇచట వేఱొక విశేషము. ఈ రెంటికిని కలిపి తల్లి అనియే అర్థము చెప్పుకొందము. కపిలుఁడనుచున్నాఁడు. అమ్మా! నేను నీ కుపదేశించిన యోగమార్గము సాంఖ్యము. ఇది చాల సుఖరూపమైనది. సాధన కాలమందు పెక్కుబాధలకు చోటివ్వనిది. దీనిని స్పష్టముగునట్లు నీకు వివరించి చెప్పినాను. నే నిచ్చిన యుపదేశము నీకు స్పష్టముగా అర్థమైనదనే తోఁచుచున్నది. ఈ యోగమార్గము బహుళమైనది. ఈ మార్గమునకు పదము పెట్టునది భక్తియే. దీనిని వదలిన ఏ మార్గము కూడ నిరంధ్ర కుసుమమై పోవును. దీనికన్న అది మంచిది, దాని కన్న ఇది మంచిదని అవ్యవసిత చిత్తులగు వారు వలుపోకలు పోవుచు దేనిని కూడ సక్రమముగా, సాంతముగా సాధింపలేక చెడిపోవుదురు. కనుక నీ హృదయమున దీని యనుష్ఠానమున వికల్ప మెన్నడును రా నివ్వకుము.

1033. జీవన్ముక్తి లభించున్=జీవించి యుండగనే ముక్తులైన వారి స్థితి ఏర్పడును. కావునన్=అందుచే, ఏమఱక=ఏమాత్రము అజాగ్రత్త చూపక, తలఁపున్ గైకొని=నీ సమస్తమనస్సును దాని యందు నిక్షేపించి, దీనిన్=ఈ మార్గమును, వావిరిన్=క్రమముగా, ఒలని వారికిన్=అనుష్ఠింపని వారికి, మృత్యుభయము=మృత్యువుచే ఏర్పడు వెఱపు, తావలమగున్=వాసస్థానమగును; సుఖమున్ దవ్వగున్=సుఖము కూడ దూరమైపోవును.

తాత్పర్యము : తల్లీ! ఈ మార్గము ననుష్ఠించు వారికి జీవన్ముక్తి ఏర్పడును. అందుచే ఈ మార్గసాధనమందు నిరంతరము జాగ్రత్త కలిగి యుండవలెను. శుద్ధమైన మనస్సును ఆ యోగమందు కేంద్రీకరించి నిరంతరము సాధన మొనర్పవలెను. సాధనమందు సోమరి తనము పనికి రాదు. అట్టి క్రమ విహీనమైన సాధన కూడ ఫల ప్రదము కానేరదు. ఈ మార్గమో ననుష్ఠించు వారికి సర్వసుఖము లేర్పడును. అట్టు కానివారికి మృత్యుభయము నిరంతరము సమీపమందే ఉండును. సుఖము కూడ వారికి లేదు. జీవన్ముక్తి యనఁగా ఏమి? జీవించి యుండఁగనే మాయతో సర్వసంబంధములు తొలఁగి ముక్తికి యోగ్యుఁడై జీవించుట. దీనిని సాధించిన వారికి మృత్యుభయము సమీపమం దుండును. ఈ యోగము సాధించిన వారికి మృత్యు వుండదా? ఉండ దనియే అర్థము. అనఁగా వారు శరీరమును వదలరా! భౌతికమైన దేహమును వదలుటే వదలకుండుట అను నది మృత్యువు కాదు. అందరును భౌతిక దేహమును వదల వలసినదే. యోగికి సూలదేహసంబంధము బొత్తిగా ఉండదు. కనుక (దానికి సంబంధించిన జ్ఞానమే) అది యున్నను లేనట్టే. సామాన్యునకు సూలదేహమం దభినివేశముండెడు. పైగా వారికి మృత్యువే మరుజన్మమునకు కారణ మగును. యోగి కదే కడపటి జన్మ. సామాన్యులకు మృత్యు వన్నచో భయము. దీనికి సూలదేహ భ్రాంతియే కారణము. పైగా

వాఁడు సాభిమానముతో నొనర్చిన పుణ్యపాపములు ఎట్టి జన్మకు కారణ మగునో యని వేదన. యోగికి దేహాభిమాన ముండదు. వాఁడొనర్చు కర్మ లభిమాన శూన్యము లగుటచే పుణ్యపాపముల ప్రసక్తియే లేదు. భౌతిక సుఖములు సూలదేహసుఖములని భ్రమించును. యోగినిరంతరానందమును భౌతిక సుఖమును మోక్షానందము యొక్క పరమాల్పములైన రేఖలు. వానిని సర్వోత్కృష్టము లైనవని భ్రమించినచో జీవికి పతనము తప్పదు. కనుక అల్పములైన సుఖములు సుఖభ్రాంతులే కాని నిక్కమైన సుఖములు కావు. ఆ దృష్టితోనే ఇచ్చట సుఖములు దవ్వగు నని చెప్పుచున్నాఁడు.

1034. మనము అలరఁగన్=మనస్సునకు సంతోషము కలుగునట్లుగా, ఆత్మమార్గము ఎల్లన్=ఆత్మను అనుభవము లోనికి తెచ్చుకొనెడి పద్ధతిని.

తాత్పర్యము: ఈ రీతిగా కపిల మహర్షి దేవహూతి మనస్సు సంతోష పడునట్లు ఆత్మ మార్గ ముపదేశించి కపిలుఁడు వెడలి పోయెనని మైత్రేయుఁడు విదురునకు చెప్పెను.

1035. యోగమార్గంబునన్=సాంఖ్యయోగ మార్గము చేత, విజ్ఞానంబు కలిగియుండియున్= ఆత్మస్వరూపము అనుభవము లోనికి తెచ్చుకొని, పెనిమిటి=భర్త, నష్టవత్స= దూడను పోగొట్టుకొన్నట్టి, చందంబునన్= విధముగ, తలడిల్లుచున్= ఎక్కువ బాధపడుచు తపస్+సామర్థ్య+జనితంబు= కపిల మహాముని తపస్సుచేత సంపాదింపఁబడినది.

తాత్పర్యము : కపిలుఁడు తపస్సున కేగిన పిదప దేవహూతికి తనయుని ఎడబాటు దుఃఖకారణమే అయ్యెను. ఆమెకు పుత్రుఁడుపదేశించిన సాంఖ్యమార్గము చేత ఆత్మసాక్షాత్కార స్థితి ఏర్పడెను. కాని ఆమెకు రెండు ఎడబాటు ఒకేసారి కలిగెను. పెనిమిటి కర్దముఁడు తపస్సున కేగుట, ఆ వెంటనే కపిల మహర్షి తపస్సున కేగుట. ఈ రెండు దుఃఖముల నరికట్టుటకు ఆమెకు కలిన విజ్ఞాన విజృంభణము శక్తికలది కాకపోయినది. ఆమె దూడను పోగొట్టుకొన్న ఆవు వలెనే దుఃఖించెను. ఆమె ఆశ్రమము కపిల మహర్షి తపస్సామర్థ్యముతో అన్ని అనుకూలములు కల్గి యుండినది. ఆ యనుకూలములనే వివరించుచున్నాఁడు.

1036. మానిత=గొప్పవైన, సౌరభ=వాసనలు గల, ప్రసవ=పూవులు, మంజుల=మనోజ్ఞములైన, పక్వ=పండిన, ఫల=ఫలములు, ప్రవాళ=చివుళ్ళు వీని యొక్క, భార=బరువుచేత ,ఆనత=వంగిన, చూతపోత=గున్నమామిడుల విటప+అగ్ర=కొమ్మల యొక్క కొనలు, నికేతన=వానసానములుగా గల, రాజకీర= రాచిలుకల యొక్క, సమ్మానితరాగాలాప=ఆదరింపఁదగిన రాగా లాపనలచేత, పరిమండిత=మిక్కిలి యొప్పుచున్న, కర్దమ తాపస ఆశ్రమోద్యాన=కర్దముని యొక్క ఆశ్రమమునకు చెందిన ఉద్యానములందలి, వనప్రదేశ=చిట్టడవులలో, కమలాకర తీర=సరస్సుల గట్టులందలి, నికుంజపుంజముల్=పొదరిండ్ల యొక్క గుంపులు,

తాత్పర్యము : ఈ పద్యమంతయు నొక్కటే సమాసము. పోతన్న గారి సమాసము తీఁగె సాగినట్లుగా మధురమైయుండును. తరువాతి కవులు ఇది

సమాస సౌభాగ్యమని రచనలలో అనుకరించుటకు ప్రయత్నించిరి - కర్దమాశ్రమము నందలి సౌభాగ్యవిశేషములను చెప్పుచున్నాఁడు. ఆనందింపఁగిన మంచివాసనల తోడి పూలు. కంటికి మనోహరములై పక్వములై యున్న ఫలములు. హృదయము నాకర్షించుచుగురుటాకులు. వినిభారముతో మామిడి చెట్లు వంగి యున్నవి. అది గున్నమామిడి. ఆ చెట్లు యొక్క శాఖలపై రాజకీరములు గూళ్ళుకట్టుకొనియున్నవి. అవి మాటికినీ రాగలాపము లొనర్చుచున్నవి. ఆ ధ్వనులు మనస్సున కానందము కల్గించునవి. ఆ యాశ్రమ మెన్న నొక పెద్ద యుద్యానవనము. దానికి చేరినవే చిట్టడవులు. ఆ యుద్యానవనములో స్వచ్ఛములైన జలములతో కూడిన సరస్సులు, ఆ సరస్సులలో కమలములు విచ్చిసువాసనలఁ బఱపుచుండును. ఆ సరస్సుల గట్టులలో మనోహరము లైన పొదరిండ్లు. ఆ పొదరిండ్లలో తుమ్మెదలు. ఇవి యన్నియు కర్దముని తపోయోగముతో సంప్రాప్తించినవే.

1037. అంచిత=ప్రకాశించుచున్న, స్ఫటికమయస్తంభదీప్తిచేన్=స్ఫటికములతో నిర్మించిన స్తంభముల యొక్క కాంతిచేత, కొమరారు=అందముల నెగఁబోయు చున్న, మరకత కుడ్యములు=మరకతమణులచేత నిర్మించిన గోడలు, సత్+జాతి+ వజ్రాల=మంచి జాతులకు చెందిన వజ్రముల, సత్+జాలకములు=చూడ నింపైన గవాక్షములయొక్క రుచులన్, భాసిల్లు=కాంతులచేప్రకాశించుచున్న, చంద్రకాంత+ఉపల+వేదులన్=చంద్రకాంతశిలానిర్మితము లైన అరుగులు, విద్రుమగేహళీవిల సితము=పగడములచే నిర్మించిన గడపమ్రాను, వానియొక్క కాంతులు, హాటక రత్నకవాటశోభితములన్=బంగారు, రత్నములు వీనిచే నిర్మింపబడిన తలుపులచే ప్రకాశించువానిని, ఇచట శోభితము లనగా శోభనములనియే అర్థము. బాలార్థము నందు కప్రత్యయము. అలరిన=ఒప్పు చున్న, సౌధములు+శాలలు=అంగణములు; శాలలనగా పెద్దపెద్దగదులు. అంగణములు= ఇండ్లముందటి ప్రదేశములు వర= శ్రేష్ఠమైన, పయః=పాలు, ఫేనపటల=నురుగు యొక్క గుంపు, పాండుర=తెల్లమైన, కరీంద్రదంత= ఏనుఁగుల దంతములచేత, నిర్మిత=నిర్మింపఁబడిన, ఖట్వ=మంచములు, వాని పైనున్న అతిధవళపట్ట=మిగుల తెల్లని పై భాగములందు, రచిత= నిర్మింపఁబడిన, శయ్యాళులు=శయ్యలు, చతురంత యాన=పల్లకులు, కనకపీఠ =బంగారు పీటలు, ఆది, మొదలైన, వస్తు సంఘములు=వస్తుసమూహములు.

తాత్పర్యము: ఆ గోడలు మరకతములు చెక్కినవి. ఆ గోడల చెంగటనున్న స్తంభములు స్ఫటికముల చేత నిర్మింపఁబడినవి. మరకతములందు స్ఫటికము లును, స్ఫటికములలో మరకతములు ప్రతిబింబించి. క్రొత్తకాంతి విశేషమును చేకూర్చుచుండెను. ఇంద్రనీలమణులచేత నిర్మింపఁబడిన మెట్లు, జాతి రత్నములతో చేయఁబడిన కిటికీలు. చంద్రకాంతమణులు చెక్కిన అరుగులు. పగడములతో తయారుచేయఁబడిన కడపమానులు. బంగారు వాకిళ్ళు. వానికి రత్నములు చెక్కఁబడి యుండెను. ఆ సౌధములు విశాలములు. వానిలో గొప్పగొప్ప కొలువు కూటములు. ఆ సౌధముల ముందు అనర్ఘములైన అంగణములు. ఆ ఆశ్రమమందలి మంచము లన్నియు పాలవలె ఫేనపుంజము

వలె తెల్లనైన ఏనుగు దంతములచే తయారు చేయఁబడినవి. వానిపైన పరువఁబడిన శయ్యలు. ఎచ్చట జూచిన కంటికింపైన పల్లకులు. బంగారు మయమైన పీటలు. ఇట్టి వస్తు సముదాయములు అసంఖ్యాకములు.

1038. వికచ=వికసించిన, కమల, కుముద=కలువలు, సౌగంధిక=కమల విశేషములు, సుగంధ=వీనియొక్క వాసనతో, అను బంధి=కూడిన, గంధవహ=వాయువుచేత, శోభితంబు=ప్రకాశించునది, అరవింద=కమలముల నుండి, నిష్యంద=జారుచున్న, కందళిత=ఎక్కువైన, మరందరసపాన=తేనెను త్రాగుట చేత, మదవత్=మదించిన, ఇందిందిరసందోహ=తుమ్మెదల గుంపు యొక్క, ఝుంకార సంకులంబు=ఝుంకారములతో నిండినది, చెలువు+అరు=ప్రకాశించునది, పురందర సుందరీ=ఇంద్రుని అంతఃపురముచేత, నందిత=ఆనందింపఁబడునట్టి, కర్దమ ఆశ్రమంబు, పరిత్యజించి=వదలి, కుటింబులు=వంకరలు కలది, జటిలంబులుగా=ఎక్కువగా, సరస్వతీ బిందు సరోవరంబులన్=సరస్వతీ నదియందును, బిందు సరస్సు నందు, త్రిషవణ స్నాన మాచరించుచున్=ముప్పూటల స్నానము చేయుచు, ఉగ్ర తపస్+ భారంబునన్=గొప్పతపస్సు చెత, కృశీభూత=బక్కచిక్కిన, శరీరమె=దేహము కలదై ప్రసన్న వదనుండను=ప్రసన్నమైన ముఖము కలవాఁడు, సమస్త వ్యస్తచింతనలచేన్=సమస్తముగను, విడివిడిగాను, ఒనర్చెడు చింతనలచేత, ప్రవాహరూపంబైన భక్తి యోగంబునన్=నిరంతరమైన భక్తిచేతను, యుక్త+అనుష్ఠానజాతంబు=తగిన అనుష్ఠానముతో ఏర్పడినది. బ్రహ్మత్వ+ ఆపాదకంబు=పరబ్రహ్మ ప్రాప్తి నందించునది. విశుద్ధమనంబును=స్వచ్ఛమైన మనస్సును.

తాత్పర్యము : ఆశ్రమ సంపత్తినే వివరించుచున్నాఁడు - ఆ యాశ్రమము నందలి కమలములు నిరంతరమును వికసించి యుండును. కుముదములు కూడ నట్టివే. వానికి కర్దముని తపశ్శక్తిచే కాలనియమము లేదు. బ్రహ్మాండముగా వేయిరేకులతో నొప్పారు సౌగంధికములు. వీని నుండి ప్రసరించెడు సుగంధములు. ఆ సుగంధముల సంపర్కముతో గాలులు గంధవహనామము సంతరించు కొనుచుండెను. వాని నుండి దొరలు మకరందములను తుమ్మెదలు త్రాపుచున్నవి. ఆ మరందపానముతో నవి మత్తెక్కినవి. వాని ఝుంకారము ధారావాహికముగా నుండెను. ఇట్టి సంపదలు గలిగి బావులు. ఆ ఆశ్రమ సౌభాగ్యము దేవేంద్రుని అంతఃపురము గూడ ఆకాంక్షింప తగినదిగా ఉండెను. ఆమె అట్టి సుసమృద్ధమైన ఆశ్రమమును వదలెను. దండిగా వెండ్రుకలు పెరిగి కుటిలములై సౌందర్యమునే పోషించుచుండెను. సరస్వతీ నది, బిందు సరస్సు, ఈ రెంటి యందు ముప్పూటలు స్నాన మొనర్చుచుండెను. ఆమె ఉగ్రమైన తపస్సు పటినది. ఆ తపస్సుతో శరీరము కృశీభూతమై ఉండెను. నిరంతరము ఆమె ప్రసన్నమైన వదనము గలిన చూపుతో కపిలమహామునినే ధ్యానించుచుండెను. ఆతఁడే నారాయణమూర్తి, కపిలునకు నారాయణునకు భేదము లేదు. ఒక్కొక్కసారి ఆమె కపిలమహార్తి సంపూర్ణరూపము ధ్యానించును. మరి యొకసారి ఒక్కొక్క ఆవయవమునే వ్యస్తముగా ధ్యానించును. ఆమె భక్తి యోగము ప్రవాహరూపమై ఉండెను. దానికి ప్రోద్బలకము అధికమైన వైరాగ్యము. భక్తియొక్క ఉద్దేకము చేత ఆమెకు తెలియకయే తీవ్రవైరాగ్యము మనస్సు నావరించినది. అనుష్ఠాన మెప్పుడును ఆమె వదలినది లేదు. ఆమెజ్ఞానము బ్రహ్మానుభూతిని

కలిగించుటకు శక్తమై ఉండెను. అట్టి జ్ఞాన మేర్పడుట కామె విశుద్ధమైన మనస్సే కారణము.

1039. ఆత్మనాయకుఁడును=ఆత్మకధినేతయును, విశ్వతోముఖుఁడు=అన్నిటియందు వ్యాపించిన వాఁడు, నిజపరిజ్ఞాన=తనయొక్క జ్ఞానాధిక్య మనెడు, దీపాంకురమహిమన్=దీపమనెడు అంకురము శక్తితో, నిరస్త=దూరము చేయఁబడిన, సమస్త=సమస్తమైన, భూరి=ఎక్కువగా ఉన్న, మాయాంధకారుఁడు=మాయయనెడు చీఁకటి కలవాఁడు, అమేయుఁడు=ఇంతయని కొలఁది చెప్పుటకు సాధ్యము కానివాఁడు, ఈశ్వరుఁడు=సమస్త ప్రకృతిని నియమించువాఁడు, అవిరత=నిరంతరము, బద=పెర్పడిన, తత్త్వజ్ఞాన పరతచేన్=తత్త్వజ్ఞానమందే ఆసక్తమైన బుదితో, నిర్ముక్త జీవభావమునన్=వదలి పెట్టఁబడిన జీవభావము చేత, విశిష్ట=ప్రత్యేకమైన, యోగ=యోగము చేత, భవ్య=గొప్పగా, సంప్రాప్త=ప్రాప్తించినో నిర్మలమైన బ్రహ్మభావము, సమాధిచేన్=సమాధి చేత, అపునరావృత్తము=మరల జన్మము లేనట్టి, త్రిగుణ ప్రధానతత్త్వములన్=త్రిగుణములు, ప్రకృతి -- వీని తత్త్వముల చేత, ఒప్పి, సంతతాచారనియతిన్=నిరంతరము అనుసరింపఁబడిన ఆచారముతో.

తాత్పర్యము: కపిలునకును నారాయణునకును భేదము లేదని ముందే చెప్పితిని. ఆతఁడే సమస్తమునకును ప్రేరకుఁడైన వాఁడు. అందుచేత ఆత్మనాయకుఁడు. 'విశ్వతోముఖుఁడు అనఁగా సర్వమునందు వ్యాపించువాఁడు. సమస్తమును చూచుచుండెడి వాఁడు. ఆతనితో సమానమైన దైవము లేఁడు. జన్మాది వికారములు లేనివాఁడాయన. అసాధారణమైన చాతుర్యము కలవాఁడు ఆయన తన జ్ఞానశక్తి యనెడు దీపప్రకాశముతో పోఁగొట్టఁబడిన అంధకారముగలవాఁడు. ఇంతమాత్రమే కాదు. తన్నుగూర్చి తెలిసికొనెడు వారి కేర్పడు జ్ఞానము కూడ మాయ యనెడు నంధకారమును పోఁగొట్టుశక్తికలదిగా ఉండును. ఆతని మహిమ నిస్సీమమైనది. ఇంతటి దంతటి దని చెప్పి దాని మితి నిర్ణయించుటకు సాధ్యము కాదు. ఈశ్వరుఁడు సమస్తము నిర్ణయించువాఁడో. పరబ్రహ్మ. ఆతని యందే, జ్ఞానస్వరూపుఁడైన ఆతనియందే ఆమె బుది నిబద్ధమై ఉన్నది. సమస్తములైన తత్త్వములును వ్యర్థములని, ఆతఁడే సర్వాధికుఁడనియు ఆమెకు జ్ఞానము కల్గిన ది. ఇట్టు నిరంతరమును భావించుటచేత ఆమెలో జీవభావము తొలఁగిపోయినది. తా ననుసరించుచున్న సాంఖ్యయోగము ఫలముగా బ్రహ్మభావము దేవహూతి కేర్పడినది. నిరంతర సమాధి ఆమె స్వభావమై పోయెను. త్రిగుణములు, ప్రకృతి -వీనిచే నేర్పడెడు తత్త్వములు వీని స్వభావ మామెకు స్పష్టముగా అర్థమై యుండెను. ఆమె కేర్పడిన జ్ఞానము అపునరావృత్తి కారణము. ఇంతకును దేవహూతి పరిశుద్ధమైన ఆచారమును వదలలేదు. ఆ యాచారముతో నామెకు జ్ఞానము నిత్యదీప్తమై యుండినది.

1040. మేలుకని= నిద్రలేచి, కనుంగొనఁగాన్ లేని=చూడలేనట్టి, మనుజు పోల్కిన్=మనుష్యుని వలె, పొలఁతి=స్త్రీ, తన ఆత్మన్ మఱచి= తనమేనస్సును విస్మరించినదై, సధూమము=పొగచేకూడిన, పావకు గతిన్=అగ్నివలె, ఉండెన్=ఉండినది.

1041. గురుయోగ శక్తిచేన్=గొప్పదైన యోగశక్తి చేత, అంబర తలమునకున్=ఆకాశమునకు, సత్ప్రపామయుఁడు=దయతో కూడినవాఁడు, (మయట్ ప్రత్యయము ప్రాచుర్యార్థకము) ఆ పరవాసుదేవు=ఆ వాసుదేవుని యొక్క చరణాంబురుహయుగ=పాదపద్మముల జంటయందు, న్యస్త చిత్తము కలది= ఉంపఁబడిన మనస్సుకలది.

తాత్పర్యము: కలలో కనపడిన వస్తువులను మేల్కొన్నపుడు కన లేని రీతిగా ఆ దేవహూతి తన మనస్సునే మఱచినది. ఆమె శరీరము తగిన సంస్కారములు లేక పొగకూరినట్టుండెను. కాని యోగశక్తిచేత సంపాదింపఁబడిన తేజస్సు ఆమె శరీరమం దుండనే ఉన్నది. ఈ రీతిగా దేవహూతి కృపాపరుఁడైన ఆ కపిలుని దయావిశేషముతో నిరంతరమును పరవాసుదేవుని చరణములందే ఉంపఁబడిన మనస్సుకలదై, శరీరమును వదలి ఆతని యందు లీనమై పోయినది.

1042. కపిల+ఉక్తమార్గమునన్=కపిలునిచే చెప్పఁబడిన మార్గముతో, అంగనా రత్నంబు=స్త్రీలలో శ్రేష్ఠురాలు, అనుజ్ఞాతుండై=సమ్మతింపఁబడినవాఁడై, గంధర్వ+అప్సరన్+ముని నివహ సంస్తూయమానుఁడు=పొగడఁ బడుచున్నవాఁడు, అర్హణ=పూజ, అభిష్టుతము=పొఁగడఁ బడినది సమాహితుండై=నిత్యజాగృతుండై, ఉపాఖ్యానము=కథ, పావనంబు=శ్రేష్ఠము, విగతపాపుఁడు=పాపమునుండి విడివడిన వాఁడు, గరుడ ధ్వజుఁడు=గరుడుఁడే ధ్వజముగా కలవాఁడు, ప్రహృష్ట హృదయుఁడు=సంతోషింపబడిన మనస్సు కలవాఁడు, భవత్+వాక్పూరంబు =నీమాటల యొక్క ధారచేత కూడిన.

తాత్పర్యము : ఈ రీతిగా దేవహూతి కపిలునిచే చెప్పఁబడిన మార్గముతో శ్రీహరిని చేరినది. ఆమె మోక్షమును పొందిన ప్రదేశమునకు సిద్ధిప్రద మనిపేరు. కపిలుఁడు తల్లి అనుమతితో సిద్ధులు, చారణులు, గంధర్వులు అప్సరసలు - వీరి సమూహము చే పొగడఁబడువాఁడై సముద్రునితో నిర్వహింపఁబడిన పూజ, అర్ఘ్య పాద్యాదులు కలవాఁడై ఆతఁడు సంఖ్యాచార్యులచే చెప్పఁబడిన యోగమార్గము అవలంబించి ముల్లోకముల శాంతి కొఱకై తపస్సు చేయుటకు ఉత్తర దిక్కును గూర్చి పోయెను. ఈ రీతిగా మైత్రేయ మహాముని పల్కి విదురునితో ఇట్లన్నాఁడు-- "ఓ విదురా! కపిల దేవహూతి సంవాదము నాకు తోచినట్లు నీకు చెప్పితిని. ఇది అత్యంత పవిత్రమైనది. కపిలుఁడు ప్రచారమునకు తెచ్చిన యోగపద్ధతి ఇది. ఈ ఉపాఖ్యానము నెవ్వఁడు భక్తియుక్తుఁడై పఠించునో, వినునో వారిర్వురును ముక్తులు. శ్రీమన్నారాయణుని చరణసమీపమును చేరుదురు" అన్నాఁడు. విదుర మైత్రేయ సంవాదము ననుసరించి శుకయోగి పరీక్షిత్తునకు వివరించెను. ఆ కథనే సూతుఁడు శౌనకాదులకు చెప్పినాఁడు. వారు సంతోషించిరి. వారన్నారు. నీవు వివరించిన భగవత్కథామృతము మాకు పరమ సంతోషము కూర్చినది. మాకు తృప్తి కలుగలేదు. తర్వాత వివరించుము.

1043. సారస=పద్మమునకు సంబంధించిన, చంచరీక=తుమ్మెద వంటి వాఁడా! దరత్=అప్పుడే వికసించుచున్న, సితపద్మ=తెల్లతామరల యొక్క పత్రలోచన=రేకుల వంటి కన్నుల కలవాఁడా!

తాత్పర్యము : స్వామి! సీతాదేవి యొక్క మనస్సనెడు పద్మమునందు నిరంతరము వ్రాలెడు తుమ్మెద వంటి వాఁడవు నీవు. నీ కీర్తి చందనము శరత్కాల చంద్రుఁడు, మల్లెలు, ఈశ్వరుఁడు, రాజహంసలు మొదలగు వానివలె స్వచ్ఛమైనది. అప్పుడే వికసించిన తామరరేకుల వంటి కన్నుల కలవాఁడవు. శివధనుస్సును విఱిచిన వాఁడవు. సూర్యవంశమును పవిత్రము చేసిన వాఁడవు.

1044. బాంధవ ప్రకర వన=బంధుసమూహమును రక్షించువాఁడా! శరధి శోషణ=సముద్రము నింకించిన వాఁడా! దురిత తారణ=కష్టములు పోఁగొట్టు వాఁడా! ధర్మశీలన=ధర్మమే శీలముగా గలవాఁడా! ఖేలన=క్రీడ గలవాఁడా!

తాత్పర్యము : స్వామీ! నీవు సమస్తవిశ్వము నందు వ్యాపించిన వాఁడవు. సముద్రము నింకించిన వాఁడవు. దయయే భూషణముగా కల వాఁడవు. పాపములు పోఁగొట్టువాఁడవు. సృష్టికి కారణభూతుఁడవు. దుష్టులైన రాక్షసులను వధించుట నీకు క్రీడ.

1045 దీపిత అనంతపుణ్య=ప్రకాశింపచేయఁబడిన గొప్ప పుణ్యములు కలవాఁడా! భవతిమిరది నేశ=సంసార మనెడు చీకటికి సూర్యుని వంటివాఁడా! కువలయహితకారీ=ప్రపంచమునకు హితమొనర్చు వాఁడా! ప్రహారీ=చంపువాఁడా!

తాత్పర్యము : స్వామీ! నీవు దేవతల కాశ్రయింపతగిన వాఁడవు. అనంత పుణ్యములు కలిగించువాఁడవు. గొప్పశుద్ధములైన గుణములు కలవాఁడవు. భక్తలోకముల వెంట నుండి రక్షించు వాఁడవు. సంసార మనెడు చీఁకటికి సూర్యుఁడవు. కోటి సూర్యప్రకాశుఁడవు. జగత్తునకు హితమును కల్గించువాఁడవు. దుష్టులైన రాక్షసుల మర్దించువాఁడవు.

గద్యము. తీర్థ+ఆగమనంబు=తీర్థములనుండి తిరిగివచ్చుట, సందర్శనము=చూచుట, నిర్యాణము=శరీర త్యాగము, మహాదులు=మహత్తులు మొదలైన ప్రకృతి వికారములు, పద్మసంభవుఁడు=బ్రహ్మ, పరమేష్ఠి=బ్రహ్మ, మానస సరము=మనస్సుచే సృష్టింపఁబడినది, భూభరణము=భూమిని రక్షించుట, సూకరాకారుఁడు=వరాహ రూపముతో నున్నవాఁడు, ప్రశంసించుట=పొగడుట, వెఱచి=భయపడి, సవన వరాహము=యజ్ఞవరాహము, స్తవము=పొగడుట, పరిణయము=వివాహము, యోగకల్పితము=యోగము చేత కల్పింప ఁబడినది, విరాట్+పురుష= విరాట్పురుష, సర్వాంగ స్తోత్రము=పాదాది కేశ వర్ణనము.

ఇది పోతనామాత్య విరచితమైన ఆంధ్రభాగవతమున
తృతీయ స్కంధమున ముప్పది మూఁడవ అధ్యాయము
సుధాలహరి వ్యాఖ్య సంపూర్ణము.

T.T.D. Religious Publications Series No.755
Price : Rs.



సరస్వతీ పుత్ర, మహాకవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు అనంతపురం జిల్లా, చియ్యేడు గ్రామంలో 28-3-1914 లో జన్మించారు. వీరితండ్రి శ్రీనివాసాచార్యులు, తల్లి కొండమ్మ. పుట్టవర్తి నారాయణాచార్యులవారు కడప రామకృష్ణ హైయ్యర్ సెకండరీ స్కూలు ఉపాధ్యాయుడుగా పని చేశారు.

ఆచార్యులవారు సంస్కృతం, ఆంగ్లం, తమిళం, హిందీ, మొదలైన పద్నాలుగు భాషలను పుక్కిటబట్టిన విద్వత్తల్లజులు. ఆయన పెనుగొండ లక్ష్మి, సాక్షాత్కారం, శివతాండవం, పండరి భాగవతం, జనప్రియ రామాయణం, శ్రీనివాస ప్రబంధం మొదలైన పద్యద్విపద గేయరచనలు, మహాభారతోపన్యాసాలు, ప్రబంధనాయికలు వగైరా వచనరచనలు పదిపదులకు మించి రచించారు.

పుట్టపర్తి సాహితీ కృషినిమెచ్చి రసజ్ఞ సమాజం ఆయనకు ఎన్నో గౌరవపదవులు కట్టబెట్టింది. భారతప్రభుత్వం పద్మశ్రీ బిరుదంతో, శ్రీ వేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ పట్టాలతో గౌరవించాయి.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వ సన్మానాలతోపాటు ఆచార్యులవారు కంచికామకోటి, శృంగేరి పీఠాధిపతుల సత్కారాలు అందుకొన్నారు. ఆయనకు ఢిల్లీ, కలకత్తా, పూనా, నాగపూర్, బెంగుళూరు, మద్రాసు, తిరువనంతపురం, అలంపూర్ వంటి పట్టణాలలో ఘన సన్మానాలు జరిగాయి. ఆంధ్రదేశంలో ఆయన పొందినన్ని సత్కారాలు మరేకవి పొందలేదు.

సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులవారు వ్యాసకృత సంస్కృత భాగవతం, దానికి తెలుగు అనువాదమైన బమ్మెరపోతన భాగవతం జతకలిపి చేసిన వ్యాఖ్యాన గ్రంథమే ఈ భాగవత సుధాలహరి. వారు భాగవతంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్కంధాలకు మాత్రమే వ్యాఖ్య సంతరించారు.

Published by Sri **K.V. Ramanachary,** I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and printed at T.T.D. Press, Tirupati.